శ్రీవేదవ్యాస విరచితం

# శివమహాపురాణం

## నాలుగవభాగం

(తెలుగు అనువాదం)


అనువాదకులు మరియు సంపాదకులు

**డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ**

ఎం.ఎ.(సంస్కృతం), ఎం.ఎ.(తెలుగు), పిహెచ్.డి.

ప్రత్యేకాధికారి

పురాణ ఇతిహాస ప్రాజెక్టు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుపతి**

**2024**

**SIVA MAHAPURANAM**
**FOURTH PART**

(Telugu Translation)

Translated & Editor by
**Dr. Akella Vibhishana Sarma**
M.A.(Sanskrit), M.A.(Telugu), Ph.D

T.T.D. Religious Publications Series No.1490

© All Rights Reserved

First Print : 2024

Copies: 500

*Published by:*
**Sri J.Syamala Rao,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*Cover Design*
*Type Setting*
Office of the Special Officer, Purana Itihasa Project,
TTD,Tirupati.

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.



శ్రీపద్మావతిఅమ్మవారు



శ్రీవేంకటేశ్వరస్వామివారు



వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥

# తిరుమల తిరుపతి దేవస్థానములు

## పురాణ ఇతిహాస ప్రాజెక్టు

## పండితపరిషత్తు - సలహామండలి

### అధ్యక్షులు

**శ్రీ జె. శ్యామల రావు** గారు ఐ.ఏ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

### సభ్యులు

**శ్రీమతి ఎం.గౌతమి** గారు ఐ.ఏ.ఎస్.,

సంయుక్త కార్యనిర్వహణాధికారి,

తి.తి.దే., తిరుపతి.

**డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు**
విశ్రాంత ఆచార్యులు,
జాతీయ సంస్కృత విద్యాపీఠం – తిరుపతి.

**డా॥ శ్రీపాద సత్యనారాయణమూర్తిగారు**
విశ్రాంత ఉపకులపతి,
జాతీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

**డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంగారు**
విశ్రాంత సంచాలకులు,
ప్రభుత్వ ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీ,
హైదరాబాద్.

**డా॥ ధూళిపాళ మహదేవమణిగారు**
విశ్రాంత కళాశాలాధ్యక్షులు,
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి.

సంచాలకులు

**డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మగారు**

ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు

తిరుమల తిరుపతి దేవస్థానములు

# తిరుమల తిరుపతి దేవస్థానములు

## పురాణ ఇతిహాస ప్రాజెక్టు

# పరిష్కరణ పరిషత్తు


**డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు**
విశ్రాంత ఆచార్యులు, జాతీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

**డా॥ శ్రీపాద సత్యనారాయణమూర్తిగారు**
విశ్రాంత ఉపకులపతి,
జాతీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

**డా॥ సూరం శ్రీనివాసులుగారు**
విశ్రాంత ప్రాచ్య కళాశాలాధ్యక్షులు,
శ్రీ గోరంట్లవెంకన్న ఓరియంటల్ కళాశాల,
తిమ్మసముద్రం.

**డా॥ ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తిగారు**
విశ్రాంత డిస్ట్రిక్ట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్,
నిడదవోలు.

**డా॥ ధూళిపాళ అన్నపూర్ణగారు**
విశ్రాంత కళాశాలాధ్యాపకురాలు,
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి.

**డా॥ వేదాల వేంకట సీతారామాచార్యులుగారు**
విశ్రాంత కళాశాలాధ్యక్షులు,
ఎస్.బి.ఎస్. సంస్కృతకళాశాల, పొన్నూరు.

**శ్రీ గార్లపాటి ప్రభాకరశర్మగారు**
విశ్రాంత ప్రిన్సిపాల్, ధర్మప్రబోధ కళాశాల,
హిందూ ధర్మప్రచార పరిషత్, తి.తి.దే., తిరుపతి.

**ఆచార్య డి.వి.జి.ఎ.సోమయాజులుగారు**
విశ్రాంత సహప్రాచార్యుడు (తెలుగు)
ఎ.యమ్.ఎ.యల్.కళాశాల, అనకాపల్లి.

**డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంగారు**
విశ్రాంత సంచాలకులు,
ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీ, హైదరాబాద్.

**డా॥ ధూళిపాళ మహాదేవమణిగారు**
విశ్రాంత కళాశాలాధ్యక్షులు,
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి.

**ఆచార్య ఆర్.వెంకటరామకృష్ణశాస్త్రిగారు**
విశ్రాంత ఆచార్యులు (సంస్కృతం&తెలుగు),
హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**డా॥ కె.లక్ష్మీనారాయణగారు**
విశ్రాంత రీడర్(సంస్కృతం),
వేదసంస్కృత కళాశాల, నెల్లూరు.

**ఆచార్య జానమద్ది రామకృష్ణగారు**
విశ్రాంత వ్యాకరణాచార్యులు,
జాతీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

**డా॥ కడిమిళ్ళ వరప్రసాద్గారు**
విశ్రాంత ఆంధ్రోపాధ్యాయుడు,
టేలర్ హైస్కూల్, నరసాపురం.

**డా॥ సి.హెచ్.రమాదేవిగారు**
విశ్రాంత కళాశాల అధ్యక్షురాలు (FAC),
యస్.వి.జె.వి.సంస్కృత కళాశాల, కొవ్వూరు.

**డా॥ ఓరుగంటి సీతగారు**
విశ్రాంత సహప్రాచార్యురాలు,
ఎ.వి.ఎన్.కళాశాల, విశాఖపట్నం.

**సంచాలకులు**

**డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మగారు**
ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

# విషయానుక్రమణిక

| విషయం | | పుటసంఖ్య |
|---|---|---|


ముందుమాట ... 1

నివేదన ... 3

పురాణపురుషుడు శ్రీమన్నారాయణుడు ... 7

శివమహాపురాణం కథాసారం ... 8

**శివమహాపురాణం – శతరుద్రసంహిత**

01. శివుని పంచబ్రహ్మావతారవర్ణనం ... 1
02. శివాష్టమూర్తివర్ణనం ... 10
03. శివునియొక్క అర్ధనారీనరావతారవర్ణనం ... 13
04. ఋషభచరిత్రవర్ణనం ... 18
05. పంతొమ్మిది శివావతారములవర్ణనం ... 25
06. నందికేశావతారవర్ణనం ... 34
07. నందికేశ్వరావతారాభిషేక – వివాహములవర్ణనం ... 44
08. భైరవావతారవర్ణనం ... 54
09. భైరవావతారలీలావర్ణనం ... 65
10. నృసింహచరిత్రవర్ణనం ... 76
11. శరభావతారవర్ణనం ... 83
12. శరభావతారవర్ణనం ... 93
13. గృహపత్యవతారవర్ణనం ... 101
14. గృహపత్యావతారవర్ణనం ... 112
15. గృహపత్యవతారవర్ణనం ... 119
16. యక్షేశ్వరావతారవర్ణనం ... 130
17. శివదశావతారవర్ణనం ... 137
18. ఏకాదశవతారవర్ణనం ... 140

| | | |
|---|---|---|
| 19. దుర్వాసచరిత్రవర్ణనం | ... | 146 |
| 20. హనుమదవతారచరిత్రవర్ణనం | ... | 157 |
| 21. మహేశావతారవర్ణనం | ... | 163 |
| 22. విష్ణూపద్రవవృషావతారవర్ణనం | ... | 166 |
| 23. వృషేశ్వరుడనుశివావతారవర్ణనం | ... | 174 |
| 24. పిప్పలాదావతారవర్ణనం | ... | 180 |
| 25. పిప్పలాదావతారచరిత్రవర్ణనం | ... | 190 |
| 26. వైశ్యనాథాహ్వయశివావతారవర్ణనం | ... | 194 |
| 27. ద్విజేశ్వరావతారవర్ణనం | ... | 205 |
| 28. యతినాథ–బ్రహ్మహంస అనే శివావతారచరిత్రవర్ణనం | ... | 216 |
| 29. కృష్ణదర్శనశివావతారవర్ణనం | ... | 223 |
| 30. అవధూతేశ్వరశివావతారచరిత్రవర్ణనం | ... | 233 |
| 31. భిక్షువర్యాశివావతారచరిత్రవర్ణనం | ... | 240 |
| 32. సురేశ్వరాఖ్యశివావతారచరిత్రవర్ణనం | ... | 252 |
| 33. బ్రహ్మచారిశివావతారవర్ణనం | ... | 264 |
| 34. సునర్తకనటావతారవర్ణనం | ... | 274 |
| 35. సాధుద్విజశివావతారవర్ణనం | ... | 280 |
| 36. అశ్వత్థామావతారవర్ణనం | ... | 286 |
| 37. కిరాతావతారవర్ణనప్రసంగంలో అర్జునునకు వ్యాసోపదేశవర్ణనం | ... | 293 |
| 38. కిరాతావతారవర్ణనంలో అర్జునతపోవర్ణనం | ... | 304 |
| 39. కిరాతావతారవర్ణనంలో ముకాసురవధ | ... | 315 |
| 40. భిల్లార్జునసంవాదం | ... | 323 |
| 41. కిరాతేశ్వరుని అవతారవర్ణనం | ... | 331 |
| 42. ద్వాదశ జ్యోతిర్లింగాలఅవతారవర్ణనం | ... | 342 |

**శివమహాపురాణం - కోటిరుద్రసంహిత**


| | | |
|---|---|---|
| 01. జ్యోతిర్లింగాలు వాటి ఉపలింగాలమాహాత్మ్యవర్ణనం | ... | 351 |
| 02. శివలింగమాహాత్మ్యవర్ణనం | ... | 358 |
| 03. అనసూయ - అత్రిమునులతపోవర్ణనం | ... | 363 |
| 04. అత్రీశ్వరమాహాత్మ్యవర్ణన | ... | 369 |
| 05. నందికేశ్వరమాహాత్మ్యంలో బ్రాహ్మణిమరణవర్ణనం | ... | 379 |
| 06. బ్రాహ్మణస్త్రీస్వర్గతివర్ణనం | ... | 385 |
| 07. నందికేశ్వరశివలింగమాహాత్మ్యవర్ణనం | ... | 395 |
| 08. మహాబలమాహాత్మ్యవర్ణనం | ... | 401 |
| 09. చాండాలీసద్గతివర్ణనం | ... | 405 |
| 10. మహాబాహ్వాశివలింగమాహాత్మ్యవర్ణనం | ... | 411 |
| 11. చంద్రభాల, పశుపతినాథలింగమాహాత్మ్యవర్ణనం | ... | 419 |
| 12. లింగస్వరూపకారణవర్ణనం | ... | 423 |
| 13. వటుకోత్పత్తివర్ణనం | ... | 431 |
| 14. సోమనాథజ్యోతిర్లింగోత్పత్తివర్ణనం | ... | 443 |
| 15. మల్లికార్జునద్వితీయజ్యోతిర్లింగవర్ణనం | ... | 453 |
| 16. మహాకాలేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం | ... | 457 |
| 17. మహాకాలేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం | ... | 465 |
| 18. ఓంకారేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం | ... | 477 |
| 19. కేదారేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం | ... | 482 |
| 20. భీమేశ్వరజ్యోతిర్లింగ మాహాత్మ్యంలో భీమాసురుని ఉపద్రవవర్ణనం | ... | 486 |
| 21. భీమేశ్వరజ్యోతిర్లింగోత్పత్తిమాహాత్మ్యవర్ణనం | ... | 497 |
| 22. కాశీకి రుద్రాగమనవర్ణనం | ... | 506 |

| | | |
|---|---|---|
| 23. కాశీవిశ్వేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం | ... | 512 |
| 24. గౌతమప్రభావవర్ణనం | ... | 521 |
| 25. గౌతమవ్యవస్థావర్ణనం | ... | 526 |
| 26. త్ర్యంబకేశ్వరమాహాత్మ్యవర్ణనం | ... | 535 |
| 27. త్ర్యంబకేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం | ... | 544 |
| 28. వైద్యనాథేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం | ... | 552 |
| 29. దారుకావనరాక్షసోపద్రవవర్ణనం | ... | 564 |
| 30. నాగేశ్వరజ్యోతిర్లింగోద్భవమాహాత్మ్యవర్ణనం | ... | 572 |
| 31. రామేశ్వరమాహాత్మ్యవర్ణనం | ... | 579 |
| 32. సుదేహా–సుధర్మాచరితవర్ణనం | ... | 586 |
| 33. ఘుశ్మేశజ్యోతిర్లింగోత్పత్తిమాహాత్మ్యవర్ణనం | ... | 594 |
| 34. విష్ణువునకు సుదర్శనచక్రలాభవర్ణనం | ... | 603 |
| 35. శివసహస్రనామవర్ణనం | ... | 609 |
| 36. శివసహస్రనామస్తోత్రఫలవర్ణనం | ... | 630 |
| 37. దేవర్షినృపశైవత్వవర్ణనం | ... | 637 |
| 38. శివరాత్రివ్రతమాహాత్మ్యవర్ణనం | ... | 645 |
| 39. శివరాత్రివ్రతోద్యాపనవర్ణనం | ... | 658 |
| 40. శివరాత్రివ్రతమాహాత్మ్యవర్ణనం | ... | 662 |
| 41. ముక్తినిరూపణం | ... | 677 |
| 42. సగుణ–నిర్గుణవర్ణనం | ... | 681 |
| 43. జ్ఞాననిరూపణం | ... | 686 |
| పురాణప్రశస్తి | ... | 695 |
| అష్టాదశపురాణాల సంగ్రహపరిచయం | ... | 708 |



# ముందుమాట

నాలుగువేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు క్షుణ్ణంగా చదివినా, పురాణాలు సమగ్రంగా, అధ్యయనం చేయాలి. అప్పుడే జ్ఞానం సంపూర్ణస్థితిని పొందుతుందని శివమహాపురాణం చెబుతోంది–

**యో విద్యా చ్చతురో వేదాన్, సాంగోపనిషదో నరః ।**
**న చే త్పురాణం సంవిద్యా న్నైవ సస్యా ద్విచక్షణః ॥**

ఇలా పురాణాల గొప్పదనాన్ని చెప్పిన ఈ పురాణంలో ప్రధానంగా ధర్మాన్ని, మహావిష్ణు వైభవాన్ని చెప్పినా, శివతత్త్వ వివేచనను, శివోపాసనలను, శివలీలలను, శివమహిమను విస్తారంగా వాయుదేవుడు వివరించాడు. అందుకే ఈ పురాణానికి వాయు మహాపురాణంగా కూడా ప్రసిద్ధి వచ్చింది. సంసార సంకటాలను, గ్రహచారదోషాలను, దేహారిష్టాలను, అపమృత్యువును పారద్రోలేశక్తికల కల్పవల్లి ఈ మహాపురాణం. ఇందులో ప్రక్రియాపాదం, అనుషంగపాదం, ఉపోద్ఘాతపాదం, ఉపసంహారపాదం అని నాలుగు భాగాలున్నాయి. ఈ పురాణాన్ని ప్రాయికంగా ఏడు సంహితలుగా వర్గీకరించారు– 1.విద్యేశ్వరసంహిత 2.రుద్రసంహిత (సృష్టి, సతీ, పార్వతీ, కుమార, యుద్ధ ఖండాలు) 3.శతరుద్రసంహిత 4.కోటిరుద్రసంహిత 5.ఉమాసంహిత 6.కైలాససంహిత 7.వాయవీయసంహితలు. ఆయురారోగ్య, ఐశ్వర్య, విద్యా, భోగ, యశోభాగ్యకరమైనది, పుణ్యప్రదాయకమైనది ఈ మహాపురాణము. ఈ భాగంలో శతరుద్రసంహిత, కోటి రుద్రసంహితలను అందిస్తున్నాం. ఈ సంహితలను పఠించడం వల్ల ఆయురారోగ్య ఐశ్వర్య, విద్య, భోగ, యశోభాగ్యపుణ్యాదులు సిద్ధిస్తాయి.

భారతీయ సంప్రదాయంలో మానవుల సుఖదుఃఖాలకు వారు పూర్వజన్మలలో చేసిన కర్మలే కారణములు. ఆగామి, సంచిత, ప్రారబ్ధము అనే విభాగం ఉంది. సంచితాలను అనుభవిస్తూ వర్తమానంలో మానవుడు తన సత్ప్రవర్తన, భగవత్కటాక్షం కలిగించే కర్మలు ఆచరించడం వల్ల అభ్యుదయాన్ని పొందుతాడు. ముఖ్యంగా ఉపనిషత్తులు సత్కర్మానుష్ఠానం వల్ల మోక్షం తప్పక ప్రాప్తిస్తుందని ప్రబోధిస్తున్నాయి. ఈ పురాణం కర్మ ప్రభావం ఎంత తప్పనిసరో స్పష్టంగా చెబుతోంది–

**క్వమతా క్వపితా విద్ధి, క్వ స్వామీ క్వ కళత్రికమ్ ।**
**నకోఽపి సస్య చాస్తీహ, సర్వేపి స్వకృతం భుజః ॥**

తల్లి ఎక్కడ? తండ్రి ఎక్కడ, భర్త ఎక్కడ, భార్య ఎక్కడ? ఈ లోకంలో ఎవరూ, ఎవరికీ ఏమీకారు. కేవలం కర్మవల్ల ఒక్కటై, విడిపోతూ, తమ కర్మఫలాన్ని అనుభవిస్తున్నారు.

**హసతా క్రితయే కర్మ, రుదతా పరిభుజ్యతే ।**
**దుఃఖదాతా నకో–ప్యస్తి, సుఖదాతా న కశ్చన ॥**

కర్మమహిమ తెలియని జీవుడు నవ్వుతూ చెడు కర్మలు చేస్తాడు. ఏడుస్తూ వాటి ఫలాలను అనుభవిస్తాడు. అంతేకాని జీవుల సుఖదుఃఖాలకు ఇతరులెవ్వరూ కారణం కాదు.

**కృత కర్మక్షయో నాస్తి, కల్పకోటి శతైరపి ।**
**అవశ్యమేవ భోక్తవ్యం, కృతం కర్మ శుభాశుభమ్ ॥**

**కేవలం చాశుభం కర్మ, నరకాయ భవేదిహ ।**
**శుభం స్వర్గాయ జాయేత, ద్వాభ్యాం మానుష్యమీరితమ్ ॥**

చేసిన మంచి, చెడులవల్ల వచ్చే కర్మ, వందకోట్ల కల్పాల తరువాతైనా వెంటాడుతుంది. అనుభవించి తీరాల్సినదే. పుణ్యపాపాల మిశ్రమమే మానవ జన్మనిస్తుంది. ఇలా కర్మ విచారాన్ని చక్కగా వివరించిన శతరుద్ర, కోటిరుద్రసంహితలలో విశేషించి శివతత్త్వం కూడా సుందరంగా శోభిల్లుతోంది. కనుక, ఈ పురాణంలోని ఈ రెండు సంహితలు అధ్యయనం చేసిన వారు సత్కర్మ నిరతులై, శివపారమ్యంతో తప్పక తరిస్తారు. ఈ భాగాన్ని అనువదించిన డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ, ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టుకు, పరిష్కరణ పండితులకు, ప్రత్యేకించి ఆచార్య జానుమద్ది రామకృష్ణగార్కి హార్దిక శుభాభినందనలు. శ్రీవేంకటేశ్వరస్వామి సంపూర్ణ అనుగ్రహం వీరందరికీ తప్పక సిద్ధించాలని ఆకాంక్షిస్తూ –

సదా శ్రీవారి సేవలో

జె. శ్యామలరావు

**జె. శ్యామలరావు,** ఐ.ఏ.ఎస్.,

**కార్యనిర్వహణాధికారి,**

తిరుమల తిరుపతి దేవస్థానములు.

# నివేదన

శివుని అర్చించాలంటే తానే శివునిగా మారిపోవాలట. ఈ మాట ఇంకెవరి విషయంలోను లేదు. అంటే శివార్చన చేస్తున్నపుడు తానే శివుడైపోయినంత పారవశ్యాన్ని, తన్మయత్వాన్ని పొందాలి, పొందుతాడు భక్తుడు అని ఆ మాటకు అర్థం. అర్చిస్తేనే అంతటి స్థితి కలుగుతుందంటే ఆ స్వామి లీలలు చెప్పే, ఆ త్రినేత్రుని వైభవాన్ని వివరించే, ఆ బోళాశంకరుని భక్తరక్షణకళాతాత్పర్యాన్ని విశదీకరించే, త్రిపురాంతకుని దుష్టశిక్షణ శిష్టరక్షణ క్రియాసామర్థ్యాన్ని విపులీకరించే, మహాదేవుని మహిమావిశేషాలను వెల్లివిరయజేసే శివపురాణం మూలాన్ని అధ్యయనం చేస్తే మనసు ఎలా ఉంటుంది. అలా అధ్యయనం చేయడంవలన నాకు కలిగిన ప్రయోజనాన్ని, రసానందాన్ని, బ్రహ్మానందాన్ని సాటి తెలుగువారికందరికీ పంచేందుకు సరళమైన తెలుగులోనికి అనువాదం చేస్తే ఇంకెలా ఉంటుంది. ఆ మహాసంకల్పం నాకుగా నేను చేసికోకుండగా సాక్షాత్తు తిరుమలలో కొలువుతీరియున్న శ్రీనివాసుడే అధికారులద్వారా ఆదేశరూపంగా కర్తవ్యాన్ని అందిస్తే అపుడు కలిగే ఆనందానికి అవధులుంటాయా! పారవశ్యానికి పరిమితులుంటాయా!

విస్తారమైన శివపురాణంలో శతరుద్రసంహిత మఱియు కోటిరుద్రసంహిత అనువాదం చేసే కర్తవ్యం నాకు దక్కించాడు శ్రీనివాసుడు. ఆరంభంలో ఇంత పెద్ద భారం నేను మోయగలనా! అనుకొన్నాను. కాని కటివరదహస్తుని కరుణవలన చాల తేలికగానే అనిపించింది. జన్మనెత్తినది మొదలు ఎన్ని వేల కర్మలను ఆచరించానో కాని ఇన్నాళ్లకు సత్కర్మను ఆచరించాననిపించింది. శివునిగురించి మనకు తెలియనిదేముంటుంది అనిపించింది మొదట్లో. కాని శివపురాణం చదివాక మనకు తెలిసినది ఆవగింజలో అరవైయవ వంతుకూడ కాదనిపించింది.

ఎన్ని లీలలు, ఎన్ని మహిమలు, ఎన్ని కథలు, ఎన్ని గాథలు, ఎన్ని చమత్కారాలు, ఎన్ని సంబరాలు, ఎన్ని వైభవాలు, ఎన్ని అవతారాలు, ఎన్ని చిత్రాలు, ఎన్ని విచిత్రాలు చదివేకొద్దీ చదవాలనిపిస్తుంది. వినేకొద్దీ వినాలనిపిస్తుంది. ఆ శ్లోకాలకు తెలుగు అనువాదం చేస్తున్నపుడు ఎన్నో సందర్భాలలో మనసు మురిసిపోయే విశేషాలు కనిపించి అవన్నీ వ్రాయాలనిపించింది. కాని ఇక్కడ ఉద్దేశించినది కేవలం తాత్పర్యం మాత్రమే. వ్యాఖ్యానం కాదు అని గుర్తు చేసికొని నన్ను నేను నియంత్రించుకొన్న సన్నివేశాలెన్నో. పేరుకు పురాణమే అయినా కావ్యంలాగ కనిపించింది ఎన్నో కథలలో, ఎన్నో వర్ణనలలో.

'చేతులారంగ శివుని బూజింపఁడేని' అని పోతన ఎందుకు అన్నాడో అర్థమయింది. ఈ శివపురాణం చదువుతున్నపుడు, అనువాదం చేస్తున్నపుడు తగిలిన ఆయా లీలావిశేషాలను అవగాహన చేసికొంటూ అనుభూతిని పొందుతున్నపుడు. బోళాశంకరుడు బోళాశంకరుడు అని అనుకోవడమే కాని, శివునికి ఆ ప్రచారం ఎందుకు వచ్చిందో అర్థమయింది ఈ పురాణం చదివినపుడు. కొన్ని కొన్ని సందర్భాలలో కొన్ని కొన్ని సన్నివేశాలలో వ్యాసమహర్షి విశ్వరూపం కనిపించింది.

42అధ్యాయాల శతరుద్రసంహిత, 43అధ్యాయాల కోటిరుద్రసంహిత వెరసి 85 అధ్యాయాలలోని ప్రతిశ్లోకాన్ని తెలుగులోనికి అనువాదం చేయడమంటే అదొక మహాయజ్ఞమే. కొన్ని కొన్నిచోట్ల శైవాగమ రహస్యాలు, వాటికి సంబంధించిన పారిభాషికపదాలు తగులుతుంటాయి. నిఘంటువు ఆధారంగా శబ్దార్థం తెలిసికొని తాత్పర్య

నిర్ధారణ చేయకూడదు. అలా చేస్తే పాఠకునికి సమగ్రమైన సమాచారం ఇవ్వలేకపోయినవారమౌతాము. దేవస్థానంవారు నాకు అప్పగించిన కర్తవ్యానికి సరియైన న్యాయం చేయలేకపోయినవాడినౌతాను. అలాంటి సందర్భాలలో ఆ రంగంలో కృషి చేసిన పండితులతో చర్చించి ఒక నిర్ధారణకు రావాలి. దానికి చాల సమయం గడచిపోతుంటుంది. ఒక్కొకరోజు నూరు శ్లోకాలకు సునాయాసంగా అనువాదం జరిగిపోతుంటుంది. ఒక్కొకరోజు ఒక్క శబ్దం దగ్గర సందేహం కలిగిందంటే దాని సంగతి తేల్చుకొనేందుకు పట్టే కుస్తీలో ఒక రోజు రోజంతా గడచిపోవచ్చు.

సంస్కృతమునుండి తెలుగులోనికి అనువాదం చేస్తున్నపుడు సంస్కృతభాష నుడికారం ఒకలా ఉంటుంది. తెలుగుభాష నుడికారం ఒకలా ఉంటుంది. అందులో కొన్ని జాతీయాలుంటాయి. ఇందులో కొన్ని జాతీయాలుంటాయి. అవి చాల జాగ్రత్తగా చూసుకోవాలి. లేకపోతే మక్కికి మక్కి అనువాదం చేస్తే తెలుగుతనం పోతుంది. నాలుగు పేజీలు చదవగానే పాఠకుడు పెదవి విరిచి ప్రక్కన పెట్టేస్తాడు. చేస్తున్నది అనువాదమే అయినా తెలుగులో చేస్తున్న స్వతంత్ర రచనలా పాఠకునికి అనిపించాలి. అలాగని మూలవిధేయతకు లోపం రాకూడదు. శ్లోకంలో ఉన్నదానికంటె భావం తగ్గరాదు, పెరుగరాదు. లేని విషయాలు చెప్పరాదు. ఉన్న విషయాలు విడువరాదు. దేశకాలమాన పరిస్థితులకు సంబంధించిన, నిరభ్యంతరకరమైన పదజాలాన్నే ఉపయోగించాలి.

ఇన్ని నియమాలకు లోబడి ఈ కార్యం తుద నెగ్గించడమంటే కత్తిమీద సామే. అయినా స్వామివారి అనుగ్రహంతో దేవస్థానం యాజమాన్యంవారి వాత్సల్యంతో, కార్యనిర్వహణాధికారుల ప్రోత్సాహంతో, సౌజన్యమూర్తులైన పండితమిత్రుల ప్రోత్సాహంతో ఈ మహాయజ్ఞాన్ని పూర్తిచేసి అవభృథస్నానం చేయగలిగాను. కృతకృత్యత ఎంతవరకు సాధించానన్నది విద్వత్ పాఠకులు నిర్ణయించెదరు గాక. 'ఆపరితోషాద్ విదుషాం న సాధు మన్యే ప్రయోగవిజ్ఞానమ్'

ఈ కార్యక్రమంలో నాకు అడుగడుగునా సాయపడిన వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు, అభివాదములు.

మన్యేఽహం ధన్యమాత్మానమ్

**హసతా క్రియతే కర్మ రుదతా పరిభుజ్యతే ।**
**దుఃఖదాతా న కోఽప్యస్తి సుఖదాతా న కశ్చన ॥**

జీవుడు నవ్వుతూ కర్మలు చేసి ఏడుస్తూ వాటి ఫలాలననుభవిస్తాడు. జీవునకు సుఖాన్ని గాని, దుఃఖాన్ని గాని ఇతరులెవ్వరూ ఇవ్వరు.

**క్వ మాతా క్వ పితా విద్ధి క్వ స్వామీ క్వ కళత్రికమ్ ।**
**న కోఽపి కస్య చాస్తీహ సర్వేఽపి స్వకృతం భుజః ॥**

తల్లి ఎక్కడ? తండ్రి ఎక్కడ? భర్త ఎక్కడ? భార్య ఎక్కడ? ఈ లోకంలో ఎవరూ ఎవరికీ ఏమీ కారని తెలుసుకో, సర్వప్రాణులు తమ కర్మఫలాన్ని అనుభవించవలసి ఉంటుంది.

**మధ్యాహ్న సమయే యో వై నాతిథిం చ పరామృశేత్ ।**
**తస్యైవ సుకృతం నీత్వా స్వీయం చ దుష్కృతం పునః ॥**

మధ్యాహ్నసమయంలో విచ్చేసిన అతిథిని ఎవడైతే సత్కరించడో వాని పుణ్యాన్ని ఆ అతిథి తీసుకొని తన పాపాన్ని అప్పగించి వెడతాడు.

**శుభం భావి యదా యస్య శుభం భవతి తస్య వై ।**
**అశుభం చ యదా భావి కథం తస్య శుభం భవేత్ ॥**

ఎవని ప్రారబ్ధంలో శుభం కలుగవలసియున్నదో, వానికి నిశ్చయంగా శుభం కలుగుతుంది. ప్రారబ్ధంలో అశుభం కలుగవలసియున్న వానికి శుభమెలా కలుగుతుంది.

**కృతకర్మక్షయో నాస్తి కల్పకోటిశతైరపి ।**
**అవశ్యమేవ భోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్ ॥**
**కేవలం చాశుభం కర్మ నరకాయ భవేదిహ ।**
**శుభం స్వర్గాయ జాయేత ద్వాభ్యాం మానుష్యమీరితమ్ ॥**

చేసిన కర్మ వందకోట్ల కల్పాల తరువాతనైననూ నశించదు. మంచిగాని, చెడుగాని చేసిన కర్మయొక్క ఫలాన్ని అనుభవింపక తప్పదు. ఈ లోకంలో చేయబడే పాపకర్మ నరకాన్ని, శుభకర్మ స్వర్గాన్ని, పుణ్యపాపాల మిశ్రమం మనుష్యజన్మను ఇస్తుంది.

**ఉత్తమానాం స్వభావోఽయం పరదుఃఖసహిష్ణుతా ।**
**స్వయం దుఃఖం చ సంప్రాప్తం మన్యతేఽన్యస్య వార్యతే ॥**

ఇతరుల దుఃఖాన్ని సహించలేకపోవడం ఉత్తముల స్వభావం. వారు తమకు కలిగిన దుఃఖాన్ని సహించి ఇతరుల దుఃఖాన్ని నివారిస్తారు.

**వృక్షాశ్చ హాటకం చైవ చందనం చేక్షుకస్తథా ।**
**ఏతే భువి పరార్థే చ దక్షా ఏవం న కేచన ॥**

వృక్షాలు, బంగారం, చందనం, చెరకు అనేవి ఈ భూలోకంలో పరోపకారం కొరకు మాత్రమే ఉన్నాయి. ఇంతటి పరోపకార సామర్థ్యం ఇతరులలో లేదు.

**యాదృఙ్నరం చ సేవేత తాదృశం ఫలమశ్నుతే ।**
**మహతస్సేవయోచ్చత్వం క్షుద్రస్య క్షుద్రతాం తథా ॥**

మానవుడు ఎటువంటి వ్యక్తిని సేవిస్తాడో అటువంటి ఫలాన్ని మాత్రమే పొందుతాడు. గొప్పవారిని సేవిస్తే గొప్పదనం, నీచులను సేవిస్తే నీచత్వం ప్రాప్తిస్తుంది.

శైవవ్రతాచరణ

**ప్రత్యష్టమ్యాం ప్రయత్నేన కర్తవ్యం నక్తభోజకమ్ ।**
**కాలాష్టమ్యాం విశేషేణ హరే! త్యాజ్యం హి భోజనమ్ ॥**

ప్రతి అష్టమి రాత్రియందు మాత్రమే భోజనం చేయాలి. ఓ విష్ణూ! కాలాష్టమినాడు భోజనాన్ని తప్పనిసరిగా విడిచిపెట్టాలి.

**ఏకాదశ్యాం సితాయాం తు త్యాజ్యం విష్ణో! హి భోజనమ్ ।**
**అసితాయాం తు భోక్తవ్యం నక్తమభ్యర్చ్య మాం హరే ॥**

శుక్లపక్షంలో ఏకాదశినాడు భోజనం చేయరాదు. కృష్ణపక్షంలో ఏకాదశినాడు రాత్రియందు నన్ను ఆరాధించి భుజించాలి.

**త్రయోదశ్యాం సితాయాం తు కర్తవ్యం నిశి భోజనమ్ ।**
**అసితాయాం తు భూతాయాం తన్న కార్యం శివవ్రతైః ॥**

శుక్లపక్షంలోని త్రయోదశినాడు రాత్రిభోజనం మాత్రమే చేయాలి. శివవ్రతానుష్ఠానపరులకు కృష్ణపక్షంలో త్రయోదశినాడు రాత్రి భోజనం నిషిద్ధం.

**నిశి యత్నే కర్తవ్యం భోజనం సోమవాసరే ।**
**ఉభయోః పక్షయోర్విష్ణో! సర్వస్మిన్ శివతత్పరైః ॥**

రెండు పక్షాలలోను ప్రతి సోమవారం నాడు తప్పనిసరిగా రాత్రిమాత్రమే భుజించాలి.

ఒక బ్రాహ్మణుని ఇంటి వాకిట్లో ఒక శుభకరమైన ఆవు కట్టివేయబడింది. ఆ ఇంటి యజమాని గ్రామాంతరం వెళ్ళి రాత్రికి వచ్చాడు. వాకిట్లో ఉన్న ఆవును చూచి పాలు పితకలేదని తెలుసుకొని, భార్యతో దూడను తీసుకొని రమ్మన్నాడు. ఆ యజమాని దూడను రాటకు కట్టడానికి ప్రయత్నిస్తుండగా దూడ అతని కాలిని తొక్కింది. దానితో ఆగ్రహించిన యజమాని ఆ రాటతోనే గట్టిగా కొట్టసాగాడు. ఆవుపాలు పితికిన తరువాత కూడా దూడను వదలలేదు. ఆ దృశ్యంతో ప్రేమతో దూడకు పాలివ్వాలనుకున్న ఆవు చాలా దుఃఖించింది. అది గమనించిన ఆ దూడ తల్లితో 'ఎందుకు దుఃఖిస్తున్నావు? నీకు వచ్చిన కష్టమేమి?' అని ప్రశ్నించగా అందుకు తల్లి 'యజమాని నిన్ను కొట్టడం చూసి నాకు దుఃఖం కలిగింది' అని చెప్పగా దానికి దూడ 'మనం చేసిన కర్మలకు సరియైన ఫలాన్ని అనుభవిస్తున్నామని, మనం కర్మలకు బద్ధులమని' చెప్పసాగింది.

**డా॥ ఆకెళ్ల విభీషణశర్మ**
ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# పురాణ పురుషుడు శ్రీమన్నారాయణుడు




బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ । వైష్ణవం దక్షిణో బాహుః వాయుర్వామో మహేశితుః ॥
ఊరూ భాగవతం ప్రోక్తం నాభిః స్యాన్నారదీయకమ్ । మార్కండేయం చ దక్షాంఘ్రిః వామో హ్యాగ్నేయముచ్యతే ॥
భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మనః । బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృతః ॥
లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ । స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥
కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేధః ప్రకీర్త్యతే । మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥
ఏవమేవాభవద్విష్ణుః పురాణావయవో హరిః ।

# శివమహాపురాణం కథాసారం
## శివావతారాల సముచ్చయం - శతరుద్రసంహిత

**వందే మహానన్దమనంతలీలం మహేశ్వరం సర్వవిభుం మహాన్తమ్ ।**
**గౌరీప్రియం కార్తికవిఘ్నరాజ సముద్భవం శంకరమాదిదేవమ్ ॥**

ప్రపంచానికంతటికీ పరమేశ్వరుడే కర్త కర్మ క్రియ అని తెలియజేసేదే శ్రీ శివమహాపురాణం. ఆ స్వామి లీలలు మనోజ్ఞంగా ఇందులో మనకు కనిపిస్తాయి. అంతేకాదు బ్రహ్మాండంలో వ్యాపించిన శివలీలలు మనకు తెలియనివి ఎన్నో ఈ పురాణంలో మనకు గోచరిస్తాయి. ముఖ్యంగా శివపురాణంలో మూడవ భాగంగా చెప్పబడుతున్న ఈ శతరుద్రసంహితలో 42 అధ్యాయాలు ఉన్నాయి. శివుని పంచబ్రహ్మావతారవర్ణనంతో ఈ శతరుద్రసంహిత ప్రారంభమవుతోంది. 1వ అధ్యాయంలో 51శ్లోకాలున్నాయి. శివుని అవతారాలనుగూర్చి వర్ణించి చెప్పమని శౌనకాదులు అడిగినమీదట, పూర్వం నందీశ్వరుడు సనత్కుమారునికి చెప్పినదానినే నేను మీకు చెపుతున్నాను అని సూతమహర్షి ఆరంభిస్తాడు. శివుని మొదటి అవతారం సద్యోజాతుడు. ఆయనే బ్రహ్మకు సృష్టిరచనాజ్ఞానాన్ని ప్రసాదించాడు. 2వ అవతారం వామదేవుడు. 3వ అవతారం తత్పురుషుడు. 4వ అవతారం అఘోరుడు. 5వ అవతారం ఈశానుడు. ఏయే అవతారాలలో శివుడు చేసిన ప్రధానకృత్యములేమిటో మొదటి అధ్యాయంలో వివరింపబడింది. 2వ అధ్యాయంలో శివుని అష్టమూర్తివర్ణనం జరిగింది. అంటే ఈశ్వరునికి ఎనిమిది శరీరాలు ఉన్నాయి. అవి పంచభూతాలు, సూర్యచంద్రులు, క్షేత్రజ్ఞుడు.

**భూమ్యంభోఽగ్ని మరుద్వ్యోమక్షేత్రజ్ఞార్కనిశాకరాః ।**
**అధిష్ఠితాశ్చ శర్వాద్యైరష్టరూపైః శివస్య హి ॥**

ఈ శ్లోకంలోని మొదటి పాదాన్నే మహాకవి కాళిదాసు తన అభిజ్ఞానశాకుంతలం 'యా సృష్టిః స్రష్టురాద్యా' అంటూ ప్రార్థనాశ్లోకంలో స్రగ్ధరావృత్తంగా వ్యాకరించాడు. అయితే ఇందులో క్షేత్రజ్ఞః అని ఉన్నది. అందులో 'హెూత్రీ' అని మారింది. ఆ ఎనిమిది శరీరాలు లోకానికి ఏవిధంగా మేలు చేస్తున్నాయో ఈ అధ్యాయంలో వివరించడం జరిగింది. 3వ అధ్యాయంలో శివుని అర్ధనారీనరావతారవర్ణనం జరిగింది. బ్రహ్మ తాను చేసిన సృష్టికి కొనసాగింపు ఎలా చేయాలో అర్థంకాక శివుని ప్రార్థించాడు. అప్పుడు మహాదేవుడు అర్ధనారీశ్వరునిగా ప్రత్యక్షమై స్త్రీజాతిని సృష్టించే శక్తిని బ్రహ్మకు ప్రసాదించాడు. దానితో సృష్టికి కొనసాగింపు జరిగిందని ఈ అధ్యాయం చెపుతుంది. 4వ అధ్యాయంలో ఋషభచరిత్ర వర్ణింపబడింది. పరమేశ్వరుని అవతారమే ఋషభుడు. పరాశరుడు, గర్గుడు, భార్గవుడు, గిరీశుడు అనే నలుగురు మహాయోగులు ఆ ఋషభుని శిష్యులు. ఋషభావతారం యోగమార్గప్రవర్తకం. 5వ అధ్యాయంలో శివావతారవర్ణనం జరుగుతుంది. తన 6వ అంశతో కృష్ణుడు వాసుదేవునిగా అవతరిస్తాడని పరమేశ్వరుడు చెప్పడం ఈ అధ్యాయంలో గమనించాల్సిన అంశం.

**తదా షష్ఠేన చాంశేన కృష్ణః పురుషసత్తమః**
**వసుదేవసుతః శ్రేష్ఠో వాసుదేవో భవిష్యతి॥ (శి.పు.శ.రు.సం.5-44)**

మొత్తం ఈ అధ్యాయంలో శివావతారఉపాఖ్యానంలో శివుని 19 అవతారాలు వర్ణింపబడ్డాయి. 6వ అధ్యాయంలో నందికేశావతారవర్ణనం జరిగింది. శిలాదుడు ఇంద్రుని సూచనతో మహేశ్వరునిగూర్చి తీవ్రతపమాచరించి, తనకు అయోనిజుడు, మరణము లేనివాడునైన పుత్రుడు కావాలని పరమేశ్వరుని కోరాడు. అప్పుడు శివుడే నందీశ్వరునిగా, శిలాదుని కుమారునిగా అవతరించిన సంగతి ఈ అధ్యాయం చెబుతోంది. నీవు నా కుమారునిగా జన్మించడం చేత నేను నందితుడను (ఆనందించినవాడిని) అయ్యాను, కనుక నీకు 'నంది' అనే పేరు ప్రసిద్ధమవుతుంది అని శిలాదుడు పేర్కొన్నాడు.

**'త్వయాహం నందితో యస్మాన్నందీ నామ్నా సురేశ్వర'(శి.పు.శ.రు.సం.6-45).**

7వ అధ్యాయంలో నందికేశ్వర అవతారాభిషేకము వివాహ వర్ణనము జరిగింది. పరమేశ్వరుడు తన జటలనుండి గంగను తీసికొని నందిపై చిలకరించాడు. గంగాజలం నదిగా మారి ఐదు పాయలై ప్రవహించింది. జటోదక, త్రిస్రోత, వృషధ్వని, స్వర్ణోదక, జాంబూనది అనేవి వాటి పేర్లు.

**జటోదకా త్రిస్రోతాశ్చ వృషధ్వనిరితీవ హి ।**
**స్వర్ణోదకా జంబునదీ పంచనద్యః ప్రకీర్తితాః ॥ (శి.పు.శ.రు.సం.7-18)**

నందికేశ్వరునికి మరుత్తుల కుమార్తెయైన సుయశాదేవితో వివాహం జరిగింది. 8వ అధ్యాయంలో భైరవావతార వర్ణనం జరిగింది. భైరవుడు శంకరపరమాత్ముని పూర్ణావతారంగా చెప్పబడింది. 'భైరవః పూర్ణరూపో హి శంకరస్య మహాత్మనః' (శి.పు.శ.రు.సం.8-2) ఈ అధ్యాయంలో బ్రహ్మావిష్ణువులు నేను గొప్ప అంటే నేను గొప్ప అని పరస్పరం వాదించుకొంటారు. వేదాలను తీర్పు చెప్పమంటారు. మీ ఇద్దరూ కాదు ఈశ్వరుడు శ్రేష్ఠుడు అని చెపుతాయి వేదాలు. అపుడు వారికి కోపం వచ్చి వేదాలను దూషిస్తారు. అపుడు ప్రణవం శరీరాన్ని తాల్చి వేదాలు చెప్పినదానిని సమర్థిస్తుంది. అపుడు వారు ప్రణవాన్నికూడ తిరస్కరిస్తారు. పైగా శివదూషణకూడ చేస్తారు. అపుడు వారి నడుమ మహాతేజస్సుతో శివుడు ప్రత్యక్షమవుతాడు. బ్రహ్మ తన ఐదవ శిరస్సుతో శివదూషణ చేస్తాడు. శంకరునికి మహాక్రోధం ఏర్పడింది. ఆ క్రోధంనుండి కాలభైరవుడు సంభవిస్తాడు. అతడు శివదూషణ చేసిన బ్రహ్మ ఐదవ శిరస్సును ఖండిస్తాడు. బ్రహ్మహత్యా దోషం పోవడంకోసం బ్రహ్మకపాలంతోనే భిక్షాటన చేయమని కాలభైరవునికి చెప్పి, కాశికానగరానికి క్షేత్రపాలకునిగా నియమిస్తాడు. బ్రహ్మహత్యాదోషం కారణంగా కాశీనగరం చేరే శక్తి లేదు కనుక కాలభైరవుడు నగరం బయటనే ఉండి ప్రశాంతంగా క్షేత్రపాలనం చేయసాగాడు.

9వ అధ్యాయంలో భైరవావతారలీలావర్ణనం జరిగింది. మార్గశీర్ష బహుళాష్టమినాడు శివుడు కాలభైరవ రూపంలో అవతరించాడు. కనుక ఆ రోజున కాశీలో కాలభైరవుని సన్నిధిలో ఉపవసించి జాగరణం చేస్తే మహాపాపముల నుండి విముక్తుడై పుణ్యలోకాలను పొందుతాడని చెపుతుంది ఈ అధ్యాయం. ఎన్ని దిక్కులకు తిరిగినా వదలని బ్రహ్మహత్యాదోషం కాశీక్షేత్రానికి చేరగానే కాలభైరవుని విడిచి పాతాళంలో పడిపోయింది. అంతవరకు చేతిని విడిచిపెట్టని కపాలంకూడ క్రింద పడిపోయింది. హరుని మరో స్వరూపమైన కాలభైరవుని సేవ సకలపాపహరం, సకల దుఃఖహరముగా అభివర్ణించింది ఈ అధ్యాయం. 10వ అధ్యాయంలో నృసింహచరిత్ర చక్కగా విరాజిల్లుతోంది.

ఈ అధ్యాయంలో వీరభద్రునిఅవతారం కూడ శివుని అవతారముగానే చెప్పబడింది. హిరణ్యకశిపుని సంహరించినా గాని నరసింహుని క్రోధం చల్లారలేదు. ఆయనను శాంతింపజేయమని దేవతలందరూ శంకరుని ప్రార్థించడం ఈ అధ్యాయంలో ప్రధాన విషయం.

11వ అధ్యాయంలో విశేషం శరభావతారవర్ణనం. శివుడు వీరభద్రుని స్మరించి నరసింహుని శాంతింపజేయమని ఆదేశిస్తాడు. వీరభద్రుడు అనేకవిధాలుగా నరసింహుని సంస్తుతిస్తాడు, క్రోధాన్ని ఉపసంహరించమంటాడు. కాని నృసింహుని కోపం చల్లారలేదు. ఇరువురి నడుమ సుదీర్ఘమైన వాగ్వాదం జరిగింది. 12వ అధ్యాయంలో నృసింహుడు వీరభద్రునిపై పడతాడు. వెంటనే వీరభద్రుడు అదృశ్యమౌతాడు. ఆ ప్రదేశంలో ఒక మహాతేజస్సు ఆవిర్భవించింది. ఆ తేజస్సునుండి శరభమృగం జన్మించింది. ఆ శరభావతారంలో ఉన్న పరమేశ్వరుడు నృసింహరూపాన్ని ఒడిసి పట్టుకొని మిక్కిలి బాధించేసరికి శివుని అనేకవిధాలుగా స్తుతించి ప్రసన్నుని చేసికొని నరసింహుడు తిరిగి తన విష్ణురూపాన్ని పొందుతాడు. 13వ అధ్యాయంలో గృహపత్యవతారవర్ణనం జరిగింది. విశ్వానరుడనే బ్రాహ్మణునికి శుచిష్మతి అనే భార్య ఉంది. ఆమె శివతుల్యుడైన కుమారుని ప్రసాదింపుమని ప్రార్థిస్తుంది. విశ్వానరుడు తీవ్రమైన తపస్సు చేసి శివానుగ్రహం పొంది, శివుడినే కుమారునిగా పొంది, వానికి గృహపతి అని నామకరణము చేయుట ఈ అధ్యాయమునందలి ముఖ్యవిషయం. 14, 15వ అధ్యాయాలలో గృహపత్యవతారవర్ణనమే జరిగింది. 16వ అధ్యాయంలో యక్షేశ్వర అవతారవర్ణనం, 17వ అధ్యాయంలో శివదశావతారవర్ణనం జరిగింది. 18వ అధ్యాయంలో శివ ఏకాదశావతార వర్ణనం జరిగింది. 19వ అధ్యాయం దుర్వాసశ్చరిత్రవర్ణనం. శివుడే దుర్వాసునిగా అవతరించి చాలమంది ధర్మనిష్ఠను పరీక్షించినట్లుగా చెపుతుందీ అధ్యాయం. ఆ క్రమంలో అంబరీషోపాఖ్యానం కూడ ఇందులో కనిపిస్తుంది.

20వ అధ్యాయం హనుమదవతార చరిత్ర. శ్రీహరి మోహినీరూపాన్ని చూచి చలించిన శివుడు స్ఖలితవీర్యుడు కాగా దానిని మహర్షులు చెవిద్వారా అంజనాదేవి గర్భంలో ప్రవేశపెట్టుటచేత హనుమానుడు జన్మించాడు. బాల్యంలోనే సూర్యుని ఫలముగా భావించి సూర్యుని మ్రింగుట, దేవతల ప్రార్థనపై తిరిగి విడిచిపెట్టుట, తల్లి అయిన అంజన అనుజ్ఞమేరకు సూర్యునివద్ద విద్యలు నేర్చుట, సుగ్రీవుని చేరి, అతనికి మంత్రిగానుండి ఋష్యమూకపర్వతముపై నివసించుట, రామునితో కలయిక, వాలివధ, సీతాన్వేషణం, సముద్రలంఘనం, లంకాగమనం, సీతాదర్శనం, అంగుళీయకప్రదానం, చూడామణిస్వీకారం, అశోకవనభంజనం, లంకాదహనం, మరలివచ్చి రామునికి చూడామణిని ఇచ్చి, జరిగిన సంగతి నివేదించుట, సేతునిర్మాణం, రాముడు శివలింగప్రతిష్ఠ చేయుట, రామరావణసంగ్రామం, సంజీవనితో లక్ష్మణుని పునరుజ్జీవితుని చేయుట, రావణవధ, మహిరావణుడను రాక్షసుని చంపి హనుమంతుడు రామలక్ష్మణులను రక్షించుట, ఈ విధముగా కిష్కింధాకాండ, సుందరకాండ, యుద్ధకాండల వృత్తాంతం మొత్తం సంక్షిప్తంగా ఈ అధ్యాయంలో(20) వర్ణింపబడింది. మహిరావణుని ప్రస్తావన వాల్మీకంలో లేనిది ఇందులో కనిపిస్తుంది.

21వ అధ్యాయంలో మహేశావతార ప్రస్తావన జరిగింది. 22లో విష్ణూపద్రవ వృషావతార వర్ణనం, 23లో వృషేశ్వర సంజ్ఞక శివావతార వర్ణన, 24, 25 అధ్యాయములలో పిప్పలాదావతారవర్ణన, 26వ అధ్యాయంలో

వైశ్వనాథావతారవర్ణన, 27వ అధ్యాయంలో ద్విజేశావతారం, 28లో యతినాథ బ్రహ్మహంసావతారం, 29 కృష్ణదర్శన శివావతారం, 30లో అవధూతేశ్వర శివావతారం, 31వ అధ్యాయంలో భిక్షువర్య అవతారం, 32వ అధ్యాయంలో సురేశ్వరావతారం, 33వ అధ్యాయంలో బ్రహ్మచారి శివావతారం ప్రస్తావింపబడ్డాయి. ఇదే కపటబ్రహ్మచారిగా ప్రసిద్ధిపొందిన వృత్తాంతం. ఇక్కడ శివపార్వతుల నడుమ సంభాషణ చాల రసవంతంగా సాగింది. కాళిదాసు కుమారసంభవంలోను, శ్రీనాథుని హరవిలాసంలోను ఈ శివపురాణ మూలకథ చక్కని సన్నివేశాలుగా పండి బాగా జనాదరణ పొందాయి. వాటికి మూలం ఈ అధ్యాయమే. అయితే కావ్యాలలో చెప్పినట్లు సప్త మహర్షులు హిమవంతునివద్దకు రాయబారులుగా వెళ్లిన సన్నివేశంమాత్రం ఈ అధ్యాయంలో లేదు.

34వ అధ్యాయంలో సువర్తక నటావతారం, 35వ అధ్యాయంలో సాధుద్విజ శివావతారం, 36వ అధ్యాయంలో అశ్వత్థామావతారం వర్ణింపబడ్డాయి. బృహస్పతి అంశతో భరద్వాజునికి అయోనిజునిగా జన్మించినవాడు ద్రోణుడు. కౌరవులకు ఆచార్యుడు. కౌరవుల పక్షంలో ఆరుగురు మహారథులలో ఒకడు. ద్రోణుడు శివునికోసం తపస్సు చేసి ఆతడు ప్రత్యక్షం కాగానే నీ అంశతో సర్వాజేయుడు, మహాబలుడునైన కుమారుని ప్రసాదింపమని వేడుకొంటాడు. అలాగే అనుగ్రహిస్తాడు శివుడు. అలా ద్రోణుని పుత్రుడిగా పుట్టిన అశ్వత్థామ పెరిగి పెద్దవాడై కౌరవుల పక్షాన నిలబడి పాండవులతో యుద్ధం చేసాడు. ఉపపాండవులను(పాండవుల పుత్రులను) సంహరించాడు. అర్జునునిపై బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగించాడు. కృష్ణుని సూచనతో అర్జునుడు  శివాస్త్రాన్ని ప్రయోగించి దానిని నిలువరించాడు  ఉత్తరాగర్భంపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు అశ్వత్థామ. శివానుగ్రహంతో శ్రీకృష్ణుడు సుదర్శనచక్రాన్ని ప్రయోగించి ఉత్తర గర్భంలో ఉన్న పరీక్షిత్తును రక్షించాడు. అశ్వత్థామ చిరంజీవియై ఈనాటికీ గంగాతీరంలో ఉన్నట్లుగా ఈ అధ్యాయం అభివర్ణించింది.

**“శివావతారోఽశ్వత్థామా  మహాబలపరాక్రమః**
**త్రైలోక్యసుఖదోఽద్యాపి వర్తతే జాహ్నవీతటే॥ (శి.పు.శ.రు.సం.36-42).**

37వ అధ్యాయంలో కిరాతావతారవర్ణనలో దుర్వాసుని భోజనవృత్తాంతం, అర్జునుడు ఇంద్రకీలాద్రిపై తపస్సుచేసి, పాశుపతాస్త్రం సంపాదించడం ఇందులోని విషయాలు. 38వ అధ్యాయంలో అర్జునుని తపస్సు వర్ణింపబడింది. 39వ అధ్యాయంలో మూకాసురవధ ఉంటుంది. 40వ అధ్యాయంలో మాయాకిరాతరూపంలో ఉన్న శివునికి అర్జునునికి నడుమ జరిగిన సంవాదం ఆసక్తిదాయకంగా ఉంటుంది. 41వ అధ్యాయంలో కిరాతార్జునుల యుద్ధం వర్ణింపబడింది. చివరకు శివుడు ప్రసన్నుడై నిజరూపాన్ని చూపించడం, పాశుపతాస్త్రాన్ని ప్రసాదించుట జరిగింది.

ఈ మూడవభాగంలో చివరిదైన 42వ అధ్యాయంలో ద్వాదశజ్యోతిర్లింగవర్ణన జరిగింది.

**సౌరాష్ట్రే సోమనాథశ్చ శ్రీశైలే మల్లికార్జునః**
**ఉజ్జయిన్యాం మహాకాలః ఓంకారేచామరేశ్వరః**
**కేదారో హిమవత్పృష్ఠే డాకిన్యాం భీమశంకరః**

**వారాణస్యాంచ విశ్వేశః త్ర్యంబకో గౌతమీతటే**
**వైద్యనాథశ్చితాభూమౌ నాగేశో దారుకావనే**
**సేతుబంధే చ రామేశో ఘుశ్మేశశ్చ శివాలయే**
**అవతారద్వాదశక మేతచ్ఛంభోః పరాత్మనః**
**సర్వానందకరం పుంసాం దర్శనాత్ స్పర్శనాన్మునే॥**
**(శి.పు.శ.రు.సం.42-2,3,4,5)**

ద్వాదశలింగాలు ఎక్కడెక్కడ ఏయే పేర్లతో ఉన్నాయో వర్ణించే సుప్రసిద్ధమైన ఈ నాలుగు శ్లోకాలు ఈ అధ్యాయంలోవే. ఆ యా క్షేత్రాల మాహాత్మ్యం, అచ్చటి శివలీలలు సంక్షిప్తంగా ఇందులో చెప్పబడ్డాయి. 60శ్లోకాల నిడివి గల ఈ అధ్యాయంలో 12 జ్యోతిర్లింగాలకు సంబంధించిన సంక్షిప్త సమాచారం తెలిసికొనే అవకాశం కలుగుతుంది.

ఈవిధంగా శ్రీ శివమహాపురాణంలో మూడవదైన శతరుద్రసంహిత సనత్కుమార నందీశ్వర సంవాదరూపంగా 42 అధ్యాయాలు సాగి పరమేశ్వరుని గురించిన ఎన్నెన్నో అతిముఖ్యమైన విశేషాలు, విలాసాలు, లీలలు అభివర్ణించింది. దీనిని పఠించినవారికి శివతత్త్వ సంబంధమైన జ్ఞానం కలగడంతోబాటు, శివలీలలద్వారా రసానందాన్ని కూడా అనుభవించే అవకాశం కలుగుతుంది. పురాణం మిత్రసమ్మితం అన్న ఆలంకారిక వాక్యానికి ఉదాహరణంగా నిలుస్తుందీ పురాణం-నిజంగానే శివుని సేవించు, శ్రేయస్సును పొందు అని మన మిత్రుడు మనకు చెప్పినట్లుగానే ఉంటుంది. ఈ పురాణం చదువుతున్నంతసేపు, మన మనస్సు తెలియకుండగానే శివునివైపు ప్రయాణిస్తుంది. అటు తరువాత
ఎంత బ్రతిమిలాడినా తిరిగి రానంటుంది. ప్రతిపాఠకునికి శివోఽహం అనే భావన కలుగుతుంది.

## కోటిరుద్రసంహిత

శ్రీ శివమహాపురాణంలో నాలుగవది కోటిరుద్రసంహిత. ఇది 43 అధ్యాయాల నిడివి గల గ్రంథం. 1వ అధ్యాయంలో జ్యోతిర్లింగాల మాహాత్మ్యం, ఉపలింగాల మాహాత్మ్యం వర్ణింపబడింది. 2వ అధ్యాయంలో శివలింగ మాహాత్మ్య వర్ణన జరిగింది. 3వ అధ్యాయంలో అనసూయ అత్రిదంపతుల తపోవర్ణనం. 4వ అధ్యాయంలో అత్రీశ్వర మాహాత్మ్యం 61శ్లోకాలుగా సాగింది. అత్రిమహర్షి చిరకాలం ధ్యానంలో మునిగిపోయి తరువాత సమాధినుండి మేల్కొని తన సతీమణి అనుసూయతో దప్పికగా ఉంది అని మంచినీరు తీసుకురమ్మంటాడు. ఆమె కమండలం తీసికొని బయలుదేరింది. కాని చాలకాలంగా అక్కడ అనావృష్టి ఏర్పడిన కారణంగా ఎక్కడా జలాశయాలు లేవు. నీరు ఎక్కడినుండి తీసుకురావాలని బాధపడుతూ ఆలోచిస్తున్న సమయంలో గంగాదేవి ప్రత్యక్షమై నీవు మహాపతివ్రతవు. అందుకే నీ దర్శనంకోసం నేను వచ్చాను. నీకు ఏ వరం కావాలో కోరుకొమ్మంటే ముందు నాకు జలం కావాలి. దానితో నా భర్తకు దప్పిక తీర్చాలి అంటుంది. వెంటనే ఒక గోతిని త్రవ్వమంటుంది. అలాగే

చేస్తుంది అనసూయ. వెంటనే అది జలాశయంగా మారిపోతుంది గంగ. ఆ నీటిని తీసుకుని భర్తకు ఇస్తుంది. వాటిని గడగడ త్రాగి ఇంత మధురమైన జలం నేనెప్పుడూ త్రాగలేదు, అని సంతోషించి చుట్టుప్రక్కల గమనిస్తే వనమంతా ఎండిపోయి ఉంది. అదేమిటి వనంలోని వృక్షాలకు, ఎవరూ నీళ్లు పోయడం లేదా అన్నీ ఇలాఎండిపోయాయి ఎందుకని? అని అడిగితే అనావృష్టి సంగతి, తనకు గంగ ప్రత్యక్షమై తాత్కాలికంగా జలాశయంగా మారిన సంగతిచెప్పగా ఆ వింతను చూచేందుకు అత్రి మహర్షి స్వయంగా అనసూయను తీసికొని బయలుదేరాడు. ఆ జలాశయాన్ని చూచి ఆశ్చర్యపోయాడు. అపుడు గంగ మళ్లీ ప్రత్యక్షమయింది. అత్రి గంగామాతను అనేకవిధాలుగా ప్రస్తుతించాడు. దంపతులిద్దరూ తనివితీరా ఆ గంగలో జలకాలాడారు. గంగ సంతోషించింది. ఇక తన నివాసానికి వెళ్లిపోతానంటుంది. అపుడు అనసూయ ఆమెను అక్కడే శాశ్వతంగా ఉండిపొమ్మని ప్రార్థిస్తుంది. నీవు నీ భర్త ఒక సంవత్సరకాలం చేసిన శివార్చన ఫలితాన్ని నాకు ధారపోస్తే ఇక్కడే శాశ్వతంగా ఉండిపోతానంది. వెంటనే వారు ఆ పని చేసారు. వారి త్యాగానికి సంతసించిన పరమేశ్వరుడు అప్పుడు అక్కడ ప్రత్యక్షమయ్యాడు. ఏ వరం కావాలో కోరుకొమ్మంటే ఈ తపోవనంలో పార్వతితోను గంగతోను కలిసి శాశ్వతంగా ఉండిపొమ్మని కోరారు. అలాగే చేసాడు శివుడు. ఆయనే అత్రీశ్వరుడు అని ప్రసిద్ధి చెందాడు. ఆ మడుగులోనే గంగకూడ శాశ్వతంగా ఉండిపోయింది. శివానుగ్రహంవలన ఆ ప్రాంతమంతా అనావృష్టి అంతరించి, సువృష్టి ఏర్పడి సస్యశ్యామలంగా మారింది.

5వ అధ్యాయంలో నందికేశ్వరవర్ణనం ఉంటుంది. ఒక వృద్ధబ్రాహ్మణస్త్రీ మరణిస్తూ తన అస్థికలను గంగానదిలో కలపమని కుమారులను కోరడం, ఆమె మరణానంతరం వాటిని పట్టుకొని కుమారుడు బయలుదేరి మధ్యేమార్గంలో ఒక బ్రాహ్మణుని ఇంట బసచేయడం జరుగుతుంది. 6వ అధ్యాయంలో ఆ ఇంటి యజమాని ఆవుపాలు పితికి దూడకు పాలు వదలకపోగా దానిని కొట్టడం దానికి బాధపడిన గోవు బ్రాహ్మణునిపై కోపించి మరునాడు వాని కుమారుని కొమ్ములతో పొడిచి చంపుతానని తన దూడకు చెప్పడం అంతా వింటాడు ఆ వృద్ధబ్రాహ్మణస్త్రీ కుమారుడు. ఏమి జరుగుతుందో చూడాలనుకొంటాడు. ఆ ఆవు చెప్పినట్లే చేస్తుంది. బ్రహ్మహత్యాదోషంవలన తెల్లని యావు నల్లగా మారిపోయి అక్కడినుండి వెంటనే వెళ్లిపోతుంది. దానిని వెంబడిస్తాడు ఆ బ్రాహ్మణీకుమారుడు. అక్కడినుండి వెళ్లిపోయిన గోవు నందికేశ్వర సన్నిధానమందలి నర్మదానదిలో మునిగి తెల్లగా మారిపోతుంది. ఆశ్చర్యపోయిన ఆ బ్రాహ్మణుడు తానుకూడ ఆ నదిలో మునిగి తిరిగి కాశీకి వెళ్లబోతాడు. అపుడు ఒక బ్రాహ్మణ ముత్తైదువ వానిని పిలిచి ఎవరు నీవు, ఎక్కడికి ఎందుకు వెడుతున్నావో చెప్పమంటే తన తల్లి అస్థికలు గంగలో కలిపేందుకు కాశీకి వెడుతున్నానని చెపుతాడు. అపుడు ఆమె వైశాఖ శుద్ధ సప్తమినాడు గంగానది ఈ నర్మదలో కలుస్తుంది. ఈరోజు అదే తిథి. కనుక అక్కడే కలుపమని చెప్పగా అలాగే చేస్తాడు. వెంటనే దివ్యదేహంతో తన తల్లి దర్శనమిస్తుంది. కుమారుని ఆశీర్వదించి స్వర్గలోకానికి ప్రయాణమవుతుంది.

7వ అధ్యాయంలో నందికేశ్వర శివలింగ మాహాత్మ్య వర్ణనం జరిగింది. నందికేశ్వరునికి ఆ పేరు ఎలా వచ్చిందో, వైశాఖ శుద్ధ సప్తమినాడు గంగ నర్మదలోనికి ఎందుకు వస్తుందో ఆ వృత్తాంతం ఈ అధ్యాయంలో కనిపిస్తుంది. ఋషిక అను పేరు గల ఒక సౌందర్యవతియైన బ్రాహ్మణస్త్రీ గొప్ప గుణవతియయ్యును పూర్వజన్మ కర్మానుభవంవలన చిన్నవయసులోనే వితంతువు కావడం వైరాగ్యాన్ని పొంది తపశ్చర్యలో మునిగిపోవడం, అపుడు

ఒక రాక్షసుడు ఆమె సౌందర్యానికి ముగ్ధుడై బలాత్కరించబోవడం, అపుడు ఆమె శివా శివా అంటూ పరమేశ్వరుని ప్రార్థించడం, వెంటనే శివుడు ప్రత్యక్షమై ఆ రాక్షసుని భస్మం చేయడం, ఋషికను కావలసిన వరం కోరుకొమ్మనగా శివుని పాదాలపై నిశ్చలమైన భక్తి కావాలని కోరుకోవడంతో బాటు శంకరుని అక్కడే శాశ్వతంగా ఉండమని కోరగా నందికేశ్వరుని పేర అక్కడ పార్థివలింగంగా మారడం, గంగకూడ సంతోషించి ఈరోజున అనగా వైశాఖ శుక్ల సప్తమినాడు నేను ఇక్కడి నర్మదా నదిలో ప్రవేశించి శివుని సేవిస్తాను అని చెప్పి ఋషికనుకూడ ఏటేటా ఆ తిథినాడు అక్కడకు రమ్మనడం, ఆమె అంగీకరించడం ఈ వృత్తాంతమంతా ఆసక్తిదాయకంగా సాగుతుంది ఈ అధ్యాయంలో.

8వ అధ్యాయంలో మహాబల మాహాత్మ్యం, 9వ అధ్యాయంలో చాండాలీ సద్గతి, 10వ అధ్యాయంలో మహాబాహు శివలింగ మాహాత్మ్యం, 11వ అధ్యాయంలో పశుపతినాథలింగ మాహాత్మ్యం, 12వ అధ్యాయంలో కల్పభేదరూపంగా లింగస్వరూప కారణం, 13వ అధ్యాయంలో వటుకోత్పత్తి వృత్తాంతాలు వర్ణింపబడ్డాయి. 14 నుండి 23 వరకు కల అధ్యాయాలలో జ్యోతిర్లింగ ఉత్పత్తి మాహాత్మ్య వర్ణనం జరిగింది. 24నుండి 27వరకు కల అధ్యాయాలలో గౌతమ వృత్తాంతం, కపట గోహత్య, త్ర్యంబకేశ్వర మాహాత్మ్యము, గోదావరి నది ఆవిర్భావం ఈ గాథ మొత్తం రసవత్తరంగా సాగింది. 28వ అధ్యాయంలో వైద్యనాథేశ్వరుని ప్రస్తావన ఉంది. 29,30 అధ్యాయాలలో దారుకావనవృత్తాంతం, నాగేశ్వరజ్యోతిర్లింగావిర్భావం అనే వృత్తాంతాలు ఉన్నాయి. 31వ అధ్యాయంలో రామేశ్వర మాహాత్మ్య వర్ణన చేయబడింది. సీతాన్వేషణం చేస్తూ రాముడు లక్ష్మణునితో కలిసి కిష్కింధకు వెళ్లడం, హనుమతోను సుగ్రీవునితోను పరిచయం ఏర్పడటం, వాలిని వధించడం, హనుమ లంకకు వెళ్లి సీత జాడ తెలిసికొనడం, అపుడు రాముడు లక్ష ఎనుబదివేల కోట్ల వానర సైన్యం (పద్మైరష్టాదశాఖ్యైశ్చ) తోడురాగా దక్షిణ సముద్రతీరానికి వెళ్లడం అక్కడ శివుని ప్రార్థించగా శివుడు ప్రత్యక్షం కావడం ఏ వరం కావాలని కోరగా రావణుని జయించే శక్తిని కోరడంతోబాటుగా పరమేశ్వరుని అక్కడ స్థిరనివాసం చేయమని కోరుట, అపుడు 'రామేశ్వరుడు' అనే పేరుతో జ్యోతిర్లింగముగా ఆవిర్భవించుట ఈ అధ్యాయంలో వివరింపబడింది.

32వ అధ్యాయంలో సుదేహ సుధర్ముడు అనే దంపతుల కథద్వారా ఘుశ్మేశ్వర జ్యోతిర్లింగ మాహాత్మ్యం వివరించడం జరిగింది. ధర్మనిష్ఠులైన ఆ దంపతులకు సంతానం కలుగలేదు. ఈశ్వరేచ్ఛ ఎలా ఉంటే అలాగే జరుగుతుంది అని సుధర్ముడు నిర్లిప్తంగా ఉన్నా సుదేహ చాల దుఃఖాన్ని పొందింది. చుట్టుప్రక్కల అమ్మలక్కల దెప్పిపొడుపులు ఆమె దుఃఖాన్ని మరింత పెంచాయి. తనకు సంతానం కలిగే యోగం లేదని నిశ్చయానికి వచ్చి బలవంతంగా ఒప్పించి తన చెల్లెలు ఘుశ్మను వివాహమాడమని బలవంతం చేసింది సుదేహ. తప్పనిసరియై మరదలిని వివాహమాడాడు సుధర్ముడు. అనుకొన్నట్లుగానే ఘుశ్మకు పుత్రుడు జన్మించాడు. ఘుశ్మాసుధర్ములిద్దరూ ఆనందంగానే ఉన్నారు కాని సుదేహకుమాత్రం చెల్లెలిపై అసూయ ఏర్పడింది. ఇంతవరకు ఈ అధ్యాయంలో కథ సాగింది. 33వ అధ్యాయంలో కూడ ఇదే కథ కొనసాగింది. సుందరుడైన ఆ కుమారుడు పెరిగి పెద్దవాడయ్యాడు. తగిన కన్యనిచ్చి సుధర్ముడు వానికి వివాహం చేసాడు.

తన భర్తను, తానే స్వయంగా వివాహం చేసిన తన చెల్లెలిని, ఆమెకు జన్మించిన కుమారుని, వాని భార్యను అందరినీ ద్వేషింపసాగింది సుదేహ. ఒకనాటి రాత్రివేళ అందరూ నిద్రిస్తూండగా ఆమె ఒక కత్తిని తీసికొని ఆ కుమారుని అవయవాలన్నిటిని నరికివేసి, ఆ రాత్రిసమయంలో దగ్గలో ఉన్న సరస్సు వద్దకు వెళ్ళి అందులో పారవేసింది ఘూశ్మ నిత్యం లింగాలు విడిచిపెట్టే చోటే ఆ అవయవాలను పారవైచి తిరిగి ఇంటికి వచ్చి ఏమీ ఎరుగనట్లు నిద్రపోయింది.

తెల్లవారి చూసేసరికి శయ్యపై తన భర్త లేడు. శయ్య మొత్తం రక్తంతో తడిసిపోయి ఉంది. పెద్దయెత్తున రోదింపసాగింది కోడలు. సుదేహ ఏమీ ఎరుగనట్లు ఏడుపు నటించింది. కాని కన్నతల్లి ఘుశ్మ విషయం తెలిసినప్పటికీ తాను చేస్తున్న నిత్యపార్థివలింగ వ్రతం నుండి చలించలేదు. ఆమె భర్తకూడ వ్రతవిధి పూర్తి అయ్యేంతవరకూ నిశ్చలంగానే ఉన్నాడు. ఘుశ్మ ఎప్పటిలాగనే పూజానంతరం పార్థివలింగాలను నిమజ్జనం చేసేందుకు శివనామస్మరణ చేసికొంటూ సరస్సుకు వెళ్ళి యథావిధిగా వాటిని నీటిలో కలిపి వెనుకకు తిరిగి గట్టుమీదికి ఎక్కి మళ్ళీ నీళ్ళలోకి చూసేసరికి తన కుమారుడు సరస్సులో కనిపించాడు.

ఆ కుమారుడు మాట్లాడాడు. అమ్మా! నిజానికి నేను మరణించాను. కానీ నీ శివపూజాప్రభావంచేత తిరిగి బ్రతికాను అని ఆనందంగా పలికాడు. ఘుశ్మ అంతకు మునుపు తన కుమారుడు మరణించినాడని తెలిసినపుడు అతిగా దుఃఖించలేదు కనుక ఇపుడు బ్రతికాడని తెలిసినా అతిగా ఆనందపడిపోలేదు. సామాన్యంగానే స్పందించింది. ఆమె స్థితప్రజ్ఞతకు సంతోషించిన మహేశ్వరుడు ప్రత్యక్షమై "ఓ భక్తురాలా! నేను ప్రసన్నుడినయ్యాను. నీ కుమారుని వధించిన దుర్మార్గురాలైన సుదేహను ఇప్పుడే నా త్రిశూలంతో సంహరిస్తాను. అది కాక ఇంకా నీకు ఏ వరం కావాలో కోరుకో" అని పలికాడు. కాని సుదేహ పవిత్రాంతఃకరణముతో నమస్కరించి తన అక్కను క్షమించి విడిచిపెట్టమని కోరుకుంది.

నీకు తీవ్రమైన అపకారం చేసిన నీ అక్కను ఎలా క్షమించమంటున్నావు. మహాపాపం చేసిన సుదేహను సంహరించవలసిందే అన్నాడు శివుడు. "ఆమెను చంపాలంటే ముందు నీవామెకు కనబడతావు కదా! నిన్ను దర్శించినంతనే పాపాలన్నీ భస్మమైపోతాయి. అపకారం చేసినవారికికూడ ఎవరైతే ఉపకారం చేస్తారో వారి దర్శనమాత్రంచేతనే పాపాలు నశిస్తాయి. కనుక మా అక్కను క్షమించు. అదే నాకిచ్చే వరం" అంది ఘుశ్మ. సంతోషించిన పరమేశ్వరుడు "అలాగే నీ ఇష్టప్రకారమే ఆమెను విడిచిపెడుతున్నాను. మరొక వరం కోరుకొమ్మన్న శివుని మాటలకు సంతోషించి, లోకరక్షణార్థం నా పేరుమీద నీవు ఇక్కడ స్థిరంగా ఉండమని కోరుకుంది. అంగీకరించాడు శివుడు. "ఘుశ్మేశ్వరుడు అనే పేరుతో నేనిక్కడ స్థిరంగా జ్యోతిర్లింగ స్వరూపంతో ఉంటాను. ఈ సరస్సుకూడ శివ లింగాలకు నిలయమై ప్రశస్తిని పొందుతుంది.

సువ్రతులారా! నీ వంశంలో 101 తరాలవరకు శ్రేష్ఠులైన పుత్రులు జన్మిస్తారు. నీ వంశం ఉజ్జ్వలంగా వర్థిల్లుతుంది" అని వరమిచ్చాడు శివుడు. అటు పిమ్మట సుధర్ముడు, సుదేహ, ఘుశ్మ నిష్కల్మషమైన అంతరంగాలతో శివుని సేవిస్తూ జీవించి, పరమసుఖాన్ని పొందారు. జీవించి వచ్చిన పుత్రుని చూచి సిగ్గుపడిన సుదేహ పశ్చాత్తాపపడి

తన పాపాలు పోగొట్టుకోవడానికి వ్రతాన్ని ఆచరించింది. ఆ విధంగా జ్యోతిర్లింగమైన ఘుశ్మేశ్వర ఆవిర్భావం జరిగింది.

34వ అధ్యాయంలో రాక్షసులవల్ల బాధపడుతున్న దేవతలు విష్ణువులో మొఱపెట్టుకోవడం, సమర్థమైన ఆయుధంకోసం విష్ణువు శివుని ఆరాధించడం, వేయి నామాలతో వేయి కమలాలు సమర్పించి పూజ చేయగా శివమాయతో చివరి కమలం అదృశ్యం కావడం, అపుడు హరి తన కన్ను పెరికి శివునికి సమర్పించడం, వాని భక్తికి సంతసించిన శివుడు ప్రత్యక్షమై, శ్రీహరికి వాని నేత్రాన్ని తిరిగి సమర్పించి, సుదర్శనమనే చక్రాయుధాన్ని అనుగ్రహించడం ఈ వృత్తాంతం రమణీయంగా సాగింది. విష్ణువు స్మరించిన శివసహస్రనామాలను తెలియజేయమని శౌనకాదులు అడుగగా సూతుడు వాటిని చెప్పడం 35వ అధ్యాయంలో కనబడుతుంది. 36వ అధ్యాయంలో శివసహస్రనామ స్తోత్రఫల వర్ణనం ఉంటుంది.

37వ అధ్యాయంలో బ్రహ్మ నారదునికి చెప్పినట్లుగా దేవ దానవ మానవులలో ప్రసిద్ధులైనవారు, ముఖ్యంగా రాముడు రామవంశీయులు, కృష్ణుడుకూడ మహాశివభక్తులుగా వర్ణించడం జరిగింది. 38వ అధ్యాయంలో శివుడే స్వయముగా విష్ణువు మొదలగువారికి శివరాత్రి వ్రత ప్రాశస్త్యాన్ని వివరిస్తాడు. ఇందులో పదిరకాల శివవ్రతాలు వర్ణింపబడ్డాయి. 39వ అధ్యాయం శివరాత్రివ్రత ఉద్యాపనం వివరించింది. 40వ అధ్యాయంలో గుహుని చరిత్ర చాల ఆసక్తిదాయకంగా ఉంటుంది. మొదట్లో అతడు కేవలం బోయవాడు. మృగాలను చంపి వాటితో కుటుంబాన్ని పోషించడమే వానికి తెలిసిన విద్య. ఒక శివరాత్రినాడు పగలంతా తనకుగాని తనకుటుంబానికి గాని ఎటువంటి అహారం దొరకలేదు. తన కుటుంబ సభ్యుల బాధను చూడలేక ఎలాగైనా ఏదో ఒక మృగాన్ని వేటాడి వారి ఆకలిబాధ తీర్చాలని సాయంకాలం వేళ ఒక జలాశయం వద్దకు వెడతాడు. దాని ఒడ్డునే ఉన్న మారేడు చెట్టుపైకి ఎక్కి దప్పిక తీర్చుకొనేందుకు ఏదైనా మృగం వస్తే వేటాడుదామని ఎదురు చూస్తుంటాడు. తనకు దాహం వేస్తే త్రాగేందుకు కొంత నీటిని తీసికొని పైకి ఎక్కాడు. సరిగ్గా అదే చెట్టుక్రింద ఒక శివలింగం ఉంది.

ఆ రాత్రి మొదటి జాములో ఒక ఆడలేడి నీటిని త్రాగేందుకు ఆ జలాశయానికి వచ్చింది. దానిని చూచి సంతోషంతో వేటాడేందుకు వింటిని ఎక్కుపెట్టాడు బోయవాడు. ఆ ప్రయత్నంలో కొన్ని మారేడు ఆకులు, తనదగ్గర ఉన్న జలపాత్రనుండి కొంత జలం చెట్టు క్రిందనున్న శివలింగంపై పడ్డాయి. బోయను చూచిన లేడి కంగారుపడి ఏమి చేస్తున్నావని అడిగితే నిన్ను వేటాడి నా కుటుంబసభ్యులకు కడుపు నింపబోతున్నానని చెప్పాడు. నా యీ శరీరం నీకు నీ కుటుంబసభ్యులకు ఆహారంగా మారుతుందంటే అంతకంటె పుణ్యం మరొకటి లేదు. కాని ఒక్కమారు ఇంటికి వెళ్ళి నా పిల్లలను నా చెల్లెలు (సవతి) మరియు నా భర్తకు అప్పజెప్పి తిరిగి వస్తానంటుంది. ముందు దాని మాటలు నమ్మలేదు. కాని రకరకాల ఒట్లు పెట్టేసరికి, సరే అని వెళ్లనిచ్చాడు. అలా నిరాహారంగా మొదటి జాము గడచిపోయింది. ఈ లేడిని వెతుకుకుంటూ రెండవ లేడి బయలుదేరి అదే జలాశయంవద్దకు వచ్చింది. దానిని వేటాడేందుకు మళ్లీ వింటిని ఎక్కుపెట్టాడు కిరాతుడు. ఆ ప్రయత్నంలో మళ్లీ మరికొన్ని మారేడాకులు కొంత నీరు శివలింగంపై పడ్డాయి. వెనుకటివలెనే ఈ లేడికూడ ఆ బోయవానిని వారించి, తన పిల్లలను నా

అక్కకు భర్తకు అప్పగించి వస్తానంది. నమ్మించెందుకు తానుకూడ ఎన్నో ప్రమాణాలు చేసింది. సరే అని దానిని కూడ విడిచిపెట్టేడు. అలా నిరాహారంగా నిద్ర లేకుండా రెండవ జాముకూడ గడచిపోయింది. ఈ రెండిటినీ వెతుకుకుంటూ మగలేడి వచ్చింది. యథాప్రకారం దానిని వేటాడబోవడం, జలం, మారేడు ఆకులు శివలింగంపై పడటం, మగలేడి తన పిల్లలను భార్యలకు అప్పగించి వస్తాననడం, ఒట్లు పెట్టి నమ్మించడం, దానిని కూడ వేటగాడు విడిచిపెట్టడం జరిగింది. మూడవజాముకూడ జాగరణంతోను, ఉపవాసంతోను గడచిపోయింది.

అన్నీ తమ నివాసానికి చేరుకున్నాయి. పరస్పర సంభాషణలో జరిగినదంతా మూడు లేడులు మరియు పిల్లలకు కూడ తెలిసింది. ఆహారంగా నేను వెడతానంటే నేను వెడతానని వాదించుకొని చివరకు మూడూ బయలుదేరాయి. వాటితోబాటే పిల్లలుకూడ బయలుదేరాయి. వాటి సత్యనిష్ఠకు చాల ఆనందించాడు కిరాతుడు. వింటినుండి బాణాలను తీసి, అమ్ములపొదిలో పెట్టుకొన్నాడు. ఆ ప్రయత్నంలో మళ్లీ మరికొన్ని నీళ్లు, మారేడాకులు శివలింగంపై పడ్డాయి. వానికి జ్ఞానోదయమయింది. నోరులేని జీవాలే పరోపకారం మరియు సత్యనిష్ఠ కలిగియున్నాయి. మానవజన్మనెత్తి నేనేమి సాధించాను అని తర్కించుకొని వాటిని తిరిగి వెనుకకు వెళ్ళిపొమ్మన్నాడు. అలా నాల్గవజాముకూడ జాగరణం మరియు ఉపవాసం జరిగాయి. వెరసి శివరాత్రి ఉపవాసం, జాగరణం, జాము జాముకు శివార్చన కూడ అసంకల్పితంగా జరిగింది. వెంటనే శివుడు ప్రసన్నుడయ్యాడు. ప్రత్యక్షమయ్యాడు. 'గుహుడు' అని నామకరణం చేశాడు. శృంగిబేరపురానికి ప్రభువువౌతానని, శ్రీరామునితో మైత్రి ఏర్పడుతుందని, జీవితమంతా సుఖంగా సాగి అనంతరమందు ముక్తిని పొందగలవని వరమిస్తాడు. అక్కడే ఉన్న జింకలన్నీ శంకరుని దర్శించి ఎంతో ఆనందిస్తాయి. సత్యమునకు నిలబడినందుకు వాటికి కూడ ముక్తిని ప్రసాదించాడు శివుడు. అర్బుదపర్వతంపైనున్న ఆ ప్రాంతంలో 'వ్యాధేశ్వరుడు' అనే పేరుతో స్వయంభువుగా వెలిసాడు. ఆ స్వామిని దర్శించి అర్చించినవారికి శీఘ్రంగా భుక్తి ముక్తులను ప్రసాదిస్తాడు పరమేశ్వరుడు అని వివరించింది 40వ అధ్యాయం.

41వ అధ్యాయంలో ముక్తి నిరూపణం, 42వ అధ్యాయంలో నిర్గుణ వర్ణనం, 43వ అధ్యాయంలో జ్ఞాననిరూపణం చేయడంతో కోటిరుద్రసంహిత పూర్తి అవుతుంది.

తన్మే మనః శివసంకల్పమస్తు

ఓం శ్రీనివాస పరబ్రహ్మణే నమః

శ్రీవేదవ్యాస విరచితం

# శివమహాపురాణమ్

# చతుర్ధభాగః - నాలుగవ భాగం

## శతరుద్రసంహిత

### ప్రథమోఽధ్యాయః - మొదటి అధ్యాయం

### శివస్య పంచబ్రహ్మావతారవర్ణనమ్ - శివుని పంచబ్రహ్మావతారవర్ణనం

**వందే మహానన్దమనన్తలీలం మహేశ్వరం సర్వవిభుం మహాన్తమ్ ।**
**గౌరీప్రియం కార్తికవిఘ్నరాజసముద్భవం శంకరమాదిదేవమ్ ॥ 1 ॥**

"స ఏకో బ్రహ్మణ ఆనందః" అన్ని ఆనందములను మించినది బ్రహ్మానందము అను శ్రుతివాక్యము ననుసరించి, అవధి లేని ఆనందము గలవాడును, అనంతములైన లీలలు గలవాడును, మహేశ్వరుడును చరాచరమునంతటిని సూక్ష్మరూపమున వ్యాపించువాడును, స్థూల రూపమున గొప్ప ప్రభువై యుండువాడును, పార్వతీదేవిని పరిణయమాడినవాడును, కుమారస్వామికి, విఘ్నేశునకు తండ్రియైనవాడును, ఆదిదేవుడును, అయిన శంకరునకు నమస్కరించుచున్నాను.

**శౌనక ఉవాచ** - శౌనకమహర్షి చెప్పాడు.

**వ్యాసశిష్య! మహాభాగ! సూత! జ్ఞానదయానిధే! ।**
**వద శంభ్వవతారాంశ్చ యైరకార్షీత్సతాం శివమ్ ॥ 2 ॥**

ఓ వ్యాసశిష్యా! మహాభాగా! సూతమహర్షీ! జ్ఞానానికి, దయకూ నిధి అయినవాడా! భగవంతుడగు శంభుడు సత్పురుషులకు మేలును చేకూర్చిన అవతారాలను వర్ణించి తెలపండి.

**సూత ఉవాచ** - సూత మహాముని పలికాడు.

**మునే! శౌనక! సద్భక్త్యా దత్తచిత్తో జితేంద్రియః ।**
**అవతారాన్ శివస్యాహం వచ్మి తే మునయే శృణు ॥ 3 ॥**

ఓ శౌనకమునీ! మునివైన నీకు శివునియొక్క అవతారాలను గురించి చెప్పుతున్నాను. ఇంద్రియాలను జయించినవాడవై సావధానంగా భక్తితో విను.

**ఏతత్పృష్టః పురా నన్దీ శివమూర్తిః సతాంగతిః ।**
**సనత్కుమారేణ మునే! తమువాచ శివం స్మరన్ ॥ 4 ॥**

మునీంద్రా! సత్పురుషులకు గతి, శరణ్యుడు, శివస్వరూపుడునగు నందీశ్వరుని పూర్వం సనత్కుమారుడు ఇటులనే ప్రశ్నించాడు. అంతట నందీశ్వరుడు శివుని స్మరిస్తూ ఆయనతో ఇలా చెప్పాడు -

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**అసంఖ్యాకా హి కల్పేషు విభోః సర్వేశ్వరస్య వై ।**
**అవతారాస్తథాపీహ వచ్మ్యహం తాన్యథామతి ॥ 5 ॥**

మునీంద్రా! సర్వవ్యాపకుడు, సమస్త ఐశ్వర్యములు గల శివుని అసంఖ్యాకములైన అవతారాలు, కల్ప, కల్పాంతరములందు జరిగాయి. అయినప్పటికి ఇప్పుడు నా బుద్ధికి తోచిన కొన్నింటిని వర్ణిస్తాను.

**ఏకోనవింశకః కల్పో విజ్ఞేయః శ్వేతలోహితః ।**
**సద్యోజాతావతారస్తు ప్రథమః పరికీర్తితః ॥ 6 ॥**

పంతొమ్మిదవ కల్పము శ్వేతలోహితమనే పేరుతో ప్రసిద్ధి చెందింది. అప్పుడు శివుడు 'సద్యోజాతుడు' అనే పేరుతో అవతరించాడు. అది ఆ స్వామి మొదటి అవతారంగ చెప్పబడింది.

**తస్మింస్తత్పరమం బ్రహ్మ ధ్యాయతో బ్రహ్మణస్తథా ।**
**ఉత్పన్నస్తు శిఖాయుక్తః కుమారః శ్వేతలోహితః ॥ 7 ॥**

ఆ కల్పమునందు పరబ్రహ్మను ధ్యానిస్తున్న బ్రహ్మకు శ్వేతలోహితవర్ణముగలవాడు, శిఖను ధరించిన వాడునూ అగు కుమారుడొకడు జన్మించాడు.

**తం దృష్ట్వా పురుషం బ్రహ్మా బ్రహ్మరూపిణమీశ్వరమ్ ।**
**జ్ఞాత్వా ధ్యాత్వా స హృదయే వవందే ప్రయతాంజలిః ॥ 8 ॥**

అంతట బ్రహ్మ అతనిని హృదయమునందు ధ్యానించి 'ఈ బాలుడు బ్రహ్మరూపుడగు పరమేశ్వరుడే' యని తెలిసికొని అంజలి ఘటించి నమస్కరించారు.

**సద్యోజాతం శివం బుద్ధ్వా జహర్ష భువనేశ్వరః ।**
**ముహుర్ముహుశ్చ సద్ బుద్ధ్యా పరం తం సమచిన్తయత్ ॥ 9 ॥**

భువనేశ్వరుడగు బ్రహ్మకు ఈ సద్యోజాత కుమారుడు శివుడే యని తెలియగా, మిక్కిలి ఆనందం కలిగింది. అంతట ఆయన సద్బుద్ధితో మాటిమాటికి పరబ్రహ్మను గూర్చి ఆలోచింపసాగాడు.

**తతోఽస్య ధ్యాయతః శ్వేతాః ప్రాదుర్భూతా యశస్వినః ।**
**కుమారాః పరవిజ్ఞానపరబ్రహ్మస్వరూపిణః ॥ 10 ॥**

ఆయన ధ్యానము చేయుచుండగా శ్వేతవర్ణముగల, కీర్తిమంతులగు కుమారులు ఆవిర్భవించారు. వారు పరమోన్నత జ్ఞానసంపన్నులు. పరబ్రహ్మస్వరూపులు.

**సునందో నందన శ్చైవ విశ్వనందోపనందనౌ ।**
**శిష్యాస్తస్య మహాత్మనో యైస్తద్బ్రహ్మ సమావృతమ్ ॥ 11 ॥**

వారు సునందుడు, నందనుడు, విశ్వనందుడు, ఉపనందనుడు అనువారు. మహాత్ములైన వీరందరూ ఆ బ్రహ్మకు శిష్యులయ్యారు. వారితో ఆ బ్రహ్మలోకం నిండియున్నది.

**సద్యోజాతశ్చ వై శంభుర్దదౌ జ్ఞానం చ వేధసే ।**
**సర్గశక్తిమపి ప్రీత్యా ప్రసన్నః పరమేశ్వరః ॥ 12 ॥**

సద్యోజాతరూపమున అవతరించిన పరమేశ్వరుడగు శివుడు పరమప్రసన్నుడై బ్రహ్మకు జ్ఞానాన్ని, సృష్టిరచనా సామర్థ్యాన్ని ప్రసాదించాడు.

**ఇతి సద్యోజాతావతారః 1 –** (ఇది 'సద్యోజాతుడు' అను పేరుగల మొదటి అవతారము)

**తతో వింశతితమః కల్పో రక్తో నామ ప్రకీర్తితః ।**
**బ్రహ్మా యత్ర మహాతేజా రక్తవర్ణమధారయత్ ॥ 13 ॥**

తదనంతరం 'రక్తము' మనే పేరుతో ప్రసిద్ధి చెందిన ఇరవైయవ కల్పం వచ్చినది. ఆ కల్పమునందు బ్రహ్మ దేవుడు రక్తవర్ణశరీరాన్ని ధరించియున్నాడు.

**ధ్యాయతః పుత్రకామస్య ప్రాదుర్భూతో విధేస్సుతః ।**
**రక్తమాల్యాంబరధరో రక్తాక్షో రక్తభూషణః ॥ 14 ॥**

బ్రహ్మదేవుడు పుత్రుని కాంక్షించి ధ్యానము చేయుచున్న సమయంలో ఆ స్వామినుండి ఒక కుమారుడు పుట్టాడు. ఎర్రని రంగుగల పూలమాలను, ఎర్రని వస్త్రాలను అతడు కలిగియున్నాడు.

**స తం దృష్ట్వా మహాత్మానం కుమారం ధ్యానమాశ్రితః ।**
**వామదేవం శివం జ్ఞాత్వా ప్రణనామ కృతాంజలిః ॥ 15 ॥**

గొప్ప ఆత్మబలసంపన్నుడైన ఆ కుమారుని చూచి, బ్రహ్మ ధ్యానమార్గస్థుడయ్యాడు. ఈ వామదేవుడు శివుడని తెలుసుకొని అతనికి దోసిలొగ్గి నమస్కరించాడు.

**తతస్తస్య సుతా హ్యాసంశ్చత్వారో రక్తవాససః ।**
**విరజాశ్చ వివాహశ్చ విశోకో విశ్వభావనః ॥ 16 ॥**

ఆయనకు ఎర్రని వస్త్రాలతో సుశోభితులైన నలుగురు పుత్రులు జన్మించారు. విరజుడు, వివాహుడు, విశోకుడు, విశ్వభావనుడు అనునవి వారి పేర్లు.

**వామదేవః స వై శంభుర్దదౌ జ్ఞానం చ వేధసే ।**
**సర్గశక్తిమపి ప్రీత్యా ప్రసన్నః పరమేశ్వరః ॥ 17 ॥**

వామదేవ రూపధరుడు, పరమేశ్వరుడునగు శంభుడు పరమ ప్రసన్నుడై బ్రహ్మకు జ్ఞానాన్ని, సృష్టి రచనా శక్తిని ప్రసాదించాడు.

**ఇతి వామదేవావతారః 2 –** (ఇది 'వామదేవుడు' అను పేరుగల రెండవ అవతారం)

**ఏకవింశతితమః కల్పః పీతవాసా ఇతి స్మృతః ।**
**బ్రహ్మా యత్ర మహాభాగః పీతవాసా బభూవ హ ॥ 18 ॥**

అనంతరం 'పీతవాసము' అనే పేరుతో పిలువబడే ఇరవై ఒకటవ కల్పం వచ్చింది. ఆ కల్పంలో మహానుభావుడైన బ్రహ్మ పచ్చని వస్త్రములు ధరించి యున్నాడు.

**ధ్యాయతః పుత్రకామస్య విధేర్జాతః కుమారకః ।**
**పీతవస్త్రాదికప్రౌఢో మహాతేజా మహాభుజః ॥ 19 ॥**

పుత్రులు కావలయునను కోరికతో బ్రహ్మ ధ్యానించుచుండగా ఆయననుండి మహాతేజస్వియగు ఒక కుమారుడదయించాడు. ఆ కుమారుడు ప్రౌఢుడు, విశాలమైన భుజములు గలవాడు. ఆయన ధరించిన పీతాంబరం మిరుమిట్లు గొలుపుతోంది.

**తం దృష్ట్వా ధ్యానసంయుక్తం జ్ఞాత్వా తత్పురుషం శివమ్ ।**
**ప్రణనామ తతో బుధ్యా గాయత్రీం శాంకరీం విధిః ॥ 20 ॥**

ధ్యానమగ్నుడైన ఆ బాలకుని చూసి బ్రహ్మదేవుడు తన బుద్ధిబలంతో ఆ కుమారుని ' తత్పురుషుడు' అను డగు శివుడని తెలిసికున్నాడు. అంతట ధ్యానమగ్నచిత్తంతో శాంకరియు, గాయత్రియునగు ఆ స్వామికి నమస్కరించాడు.

**జపిత్వా తు మహాదేవీం సర్వలోకనమస్కృతామ్ ।**
**ప్రసన్నస్తు మహాదేవో ధ్యానయుక్తేన చేతసా ॥ 21 ॥**

అంతట బ్రహ్మ సమస్త లోకములచేత నమస్కరింపబడు మహాదేవియు, శాంకరియునగు గాయత్రిని జపించి, ధ్యానమగ్నచిత్తంతో నమస్కరించాడు. దీనితో మహాదేవుడు ప్రసన్నుడయ్యాడు.

**తతోఽస్య పార్శ్వతో దివ్యాః ప్రాదుర్భూతాః కుమారకాః ।**
**పీతవస్త్రా హి సకలా యోగమార్గప్రవర్తకాః ॥ 22 ॥**

అనంతరం ఆ స్వామి పార్శ్వభాగం నుండి పీత వస్త్రధారులైన దివ్య కుమారులు ఆవిర్భవించారు. వారందరు యోగమార్గప్రవర్తకులే.

**ఇతి తత్పురుషావతారః 3 –** (ఇది ' తత్పురుషుడు' అను పేరుగల మూడవ అవతారం)

**తతస్తస్మిన్గతే కల్పే పీతవర్ణే స్వయంభువః ।**
**పునరన్యః ప్రవృత్తస్తు కల్పో నామ్నా శివస్తు స ॥ 23 ॥**

తరువాత స్వయంభువు అగు బ్రహ్మ యొక్క పీతవర్ణమను కల్పం గడిచిపోయింది. మరల మరియొక కల్పం ప్రారంభమయ్యింది. దాని పేరు 'శివకల్పము'

**ఏకార్ణవే సంవృతీతే దివ్యవర్షసహస్రకే ।**
**స్రష్టుకామః ప్రజా బ్రహ్మా చింతయామాస దుఃఖితః ॥ 24 ॥**

ప్రపంచం అంతా ఒకే సముద్రంగా నీటితో నిండి ఒక వెయ్యి దివ్యవత్సరాలు గడచిపోయాయి. అంతట బ్రహ్మ ప్రజలను సృష్టించు కోరికతో దుఃఖితుడై ఆలోచింపసాగాడు.

**తతోఽపశ్యన్మహాతేజాః ప్రాదుర్భూతం కుమారకమ్ ।**
**కృష్ణవర్ణం మహావీర్యం దీప్యమానం స్వతేజసా ॥ 25 ॥**

అంతట మహాతేజస్వియగు ఒక కుమారుడు బ్రహ్మసమక్షంలో ఉద్భవించాడు. పరాక్రమవంతుడగు ఆ బాలకుని శరీరం యొక్క రంగు నల్లనిదై ఉండింది. అతడు తన తేజస్సుతో దేదీప్యమానుడై యున్నాడు.

**ధృతకృష్ణాంబరోష్ణీషం కృష్ణయజ్ఞోపవీతినమ్ ।**
**కృష్ణేన మౌళినా యుక్తం కృష్ణస్నానానులేపనమ్ ॥ 26 ॥**

అతడు నల్లని వస్త్రాలను, నల్లని తలపాగాను, నల్లని యజ్ఞోపవీతాన్ని ధరించియున్నాడు. అతని కిరీటముకూడ నల్లనిది. స్నానానంతరం చందనాది లేపనములు కడా నల్లనివై యుండెను.

**స తం దృష్ట్వా మహాత్మానమఘోరం ఘోరవిక్రమమ్ ।**
**వవందే దేవదేవేశమద్భుతం కృష్ణపింగళమ్ ॥ 27 ॥**

ఆ బ్రహ్మ భయంకరపరాక్రమం కలవాడూ, ఆశ్చర్యాన్ని కలిగించువాడూ, నలుపు పింగళవర్ణము కలవాడూ, దేవతలకు కూడా ప్రభువూ అయిన ఆ అఘోరునికి నమస్కరించాడు.

**అఘోరం తు తతో బ్రహ్మా బ్రహ్మరూపం వ్యచింతయత్ ।**
**తుష్టావ వాగ్భిరిష్టాభిర్భక్తవత్సలమవ్యయమ్ ॥ 28 ॥**

తదుపరి బ్రహ్మ అఘోరుని బ్రహ్మరూపుడని తెలుసుకొని భక్తవత్సలుడు, అవ్యయుడునైన ఆ స్వామిని తన ఇష్టవచనాల ద్వారా స్తుతింపసాగాడు

**అథాస్య పార్శ్వతః కృష్ణాః కృష్ణస్నానానులేపనాః ।**
**చత్వారస్తు మహాత్మానః సంబభూవుః కుమారకాః ॥ 29 ॥**

ఆ స్వామి పార్శ్వభాగం నుండి కృష్ణ వర్ణం గలవారు, నల్లని పరిమళగంధాన్ని పూసుకొన్నవారునగు నలుగురు కుమారులుదయించారు.

**కృష్ణః కృష్ణశిఖశ్చైవ కృష్ణాస్యః కృష్ణకంఠధృక్ ।**
**ఇతి తేఽవ్యక్తనామానః శివరూపాః సుతేజసః ॥ 30 ॥**

కృష్ణుడు, కృష్ణశిఖుడు, కృష్ణాస్యుడు, కృష్ణకంఠుడు అను పేర్లుగల వారందరును పరమ తేజస్సంపన్నులు, అవ్యక్తనాములు, శివుని వంటి రూపములు గల వారునూ అయియున్నారు.

**ఏవంభూతా మహాత్మానో బ్రహ్మణః సృష్టిహేతవే ।**
**యోగం ప్రవర్తయామాసుర్ఘోరాఖ్యం మహదద్భుతమ్ ॥ 31 ॥**

ఈ విధంగా ఆవిర్భవించి, బ్రహ్మయొక్క సృష్టి రచనకొరకు మహాద్భుతమైన 'ఘోర' అను పేరుగల యోగాన్ని ప్రవర్తింపచేశారు.

**ఇత్యఘోరావతారశ్చతుర్థః 4 –** (ఇది 'అఘోరుడు' అను పేరుగల నాల్గవ అవతారము)

**అథాన్యో బ్రహ్మణః కల్పః ప్రావర్తత మునీశ్వరాః! ।**
**విశ్వరూప ఇతి ఖ్యాతో నామతః పరమాద్భుతః ॥ 32 ॥**

ఓ మునీశ్వరులారా! అనంతరం బ్రహ్మయొక్క రెండవ కల్పం ప్రారంభమయ్యింది. అది పరమాద్భుతమైనది. అది 'విశ్వరూపము' అనే పేరుతో విఖ్యాతి చెందింది.

**బ్రహ్మణః పుత్రకామస్య ధ్యాయతో మనసా శివమ్ ।**
**ప్రాదుర్భూతా మహానాదా విశ్వరూపా సరస్వతీ ॥ 33 ॥**

బ్రహ్మ ఆ కల్పంలో పుత్ర కాంక్షతో మనస్సులోనే శివుని ధ్యానింపసాగాడు. అంతట గొప్పనాదాన్ని చేసెడి, విశ్వరూపయగు 'సరస్వతీదేవి' ఆవిర్భవించింది.

**తథావిధః స భగవానీశానః పరమేశ్వరః ।**
**శుద్ధస్ఫటికసంకాశః సర్వాభరణభూషితః ॥ 34 ॥**

ఆ విధంగా పరమేశ్వరుడు, భగవానుడునగు 'ఈశానుడు' ప్రాదుర్భవించాడు. ఆయన శుద్ధ స్ఫటిక సమానుడై ఉజ్జ్వలంగా ప్రకాశిస్తూ, సకలాభరణభూషితుడయ్యాడు.

**తం దృష్ట్వా ప్రణనామాసౌ బ్రహ్మేశానమజం విభుమ్ ।**
**సర్వగం సర్వదం సర్వం సురూపం రూపవర్జితమ్ ॥ 35 ॥**

జన్మలేనివాడు, సర్వవ్యాపియు, సర్వాంతర్యామియు, సమస్తమును ఇచ్చువాడు, సర్వస్వరూపుడు, సురూపుడు, రూపవర్జితుడునగు ఈశానుని చూచి బ్రహ్మదేవుడు నమస్కరించాడు.

**ఈశానోఽపి తథాఽఽదిశ్య సన్మార్గం బ్రహ్మణే విభుః ।**
**స శక్తిః కల్పయాంచక్రే స బాలాంశ్చతురః శుభాన్ ॥ 36 ॥**

ఈశానుడు కూడ బ్రహ్మకు 'సన్మార్గ' ఉపదేశమునొసగి, నలుగురు సౌందర్యవంతులగు కుమారులను కల్పించాడు.

**జటీ ముణ్డీ శిఖండీ చ అర్ధముణ్డశ్చ జజ్ఞిరే ।**
**యోగేనాదిశ్య సద్ధర్మం కృత్వా యోగగతిం గతాః ॥ 37 ॥**

ఆ విధంగా జన్మించినవారికి జటి, ముండి, శిఖండి, అర్ధముండ అను నామాలున్నాయి. వీరు యోగాన్నాశ్రయించి, సద్ధర్మాన్ని ఉపదేశించి యోగగతిని పొందారు.

**ఇతీశానావతారః పంచమః 5 –** (ఇది 'ఈశానుడు' అను పేరుగల ఐదవ అవతారము)

**ఏవం సంక్షేపతః ప్రోక్తః సద్యాదీనాం సముద్భవః ।**
**సనత్కుమార! సర్వజ్ఞ! లోకానాం హితకామ్యయా ॥ 38 ॥**

ఓ సనత్కుమారా! సర్వజ్ఞ! లోకాల హితాన్ని కోరి నేను సద్యోజాతాది అవతారాలు, అవి ప్రకటితములైన విధానాన్ని సంక్షేపంగా చెప్పియుంటిని.

**అథ తేషాం మహాప్రాజ్ఞ! వ్యవహారం యథాయథమ్ ।**
**త్రిలోకహితకారం హి సర్వం బ్రహ్మాండసంస్థితమ్ ॥ 39 ॥**

ఓ మహామతీ! లోకహితకరమైన వారి వ్యవహారమంతయూ, యథాతథంగా, బ్రహ్మాండంలో విరాజమానమై యున్నది.

**ఈశానః పురుషో ఘోరో వామసంజ్ఞస్తథైవ చ ।**
**బ్రహ్మసంజ్ఞో మహేశస్య మూర్తయః పంచ విశ్రుతాః ॥ 40 ॥**

మహేశ్వరునియొక్క ఈశానుడు, పురుషుడు, ఘోరుడు, వామదేవుడు, బ్రహ్మ, ఈ ఐదుగురు మూర్తులు పరమేశ్వరమూర్తులుగా ప్రసిద్ధులు.

**ఈశానః శివరూపశ్చ గరీయాన్ప్రథమః స్మృతః ।**
**భోక్తారం ప్రకృతేః సాక్షాత్ క్షేత్రజ్ఞమధితిష్ఠతి ॥ 41 ॥**

ఈశానుడు శివస్వరూపుడు. అందరిలో పెద్దవాడుగా, ప్రథముడుగా చెప్పబడతాడు. అతడు ప్రకృతికి భోక్త, క్షేత్రజ్ఞులలో నివాసముండువాడు.

**శైవస్తత్పురుషాఖ్యశ్చ స్వరూపో హి ద్వితీయకః ।**
**గుణాశ్రయాత్మకం భోగ్యం సర్వజ్ఞమధితిష్ఠతి ॥ 42 ॥**

శివుని రెండవ స్వరూపము 'తత్పురుష' నామంతో విఖ్యాతి చెందింది. ఆయన గుణములకు ఆశ్రయరూపము కలిగి అనుభవించదగిన సర్వజ్ఞుని ఆశ్రయించి ఉన్నాడు.

**ధర్మాయ స్వాంగసంయుక్తం బుద్ధితత్త్వం పినాకినః ।**
**అఘోరాఖ్యస్వరూపో యస్తిష్ఠత్యంతస్తృతీయకః ॥ 43 ॥**

'అఘోర' మను పేరుగల మూడవ స్వరూపం పినాకధారియైన శివుడు. ఆ స్వామి ధర్మంకొరకు అంగాలతో కూడిన బుద్ధితత్త్వాన్ని ప్రవర్తింపజేసి అంతరంగంలో విరాజమానుడై యుంటాడు.

**వామదేవాహ్వయో రూపశ్చతుర్థః శంకరస్య హి ।**
**అహంకృతేరధిష్ఠానో బహుకార్యకరః సదా ॥ 44 ॥**

వామదేవుడను పేరుగల శంకరుని నాల్గవ స్వరూపం అహంకారంయొక్క అధిష్ఠానం. ఆ ప్రభువు ఎల్లప్పుడు అనేక కార్యాలను చేస్తాడు.

**ఈశానాహ్వస్వరూపో హి శంకరస్యేశ్వరః సదా ।**
**శ్రోత్రస్య వచసశ్చాపి విభోర్వ్యోమ్నస్తథైవ చ ॥ 45 ॥**

శంకరుని ఈశాన సంజ్ఞక స్వరూపుడు సదా కర్ణములు, వాణి, ఆకాశానికీ, అధీశ్వరుడని బుద్ధిమంతులు చెబుతారు.

**త్వక్పాణిస్పర్శవాయూనామీశ్వరం రూపమైశ్వరమ్ ।**
**పురుషాఖ్యం విచారజ్ఞా మతిమన్తః ప్రచక్షతే ॥ 46 ॥**

చర్మం, పాణి, స్పర్శ, వాయువులకు స్వామియైన ఈశ్వర రూపమిది. బుద్ధిమంతులు, విచారజ్ఞులు, ఈ రూపమునే 'పరమపురుషుడు' అను పేరుతో కీర్తిస్తారు.

**వపుషశ్చ రసస్యాపి రూపస్యాగ్నే స్తథైవ చ ।**
**అఘోరాఖ్యమధిష్ఠానం రూపమాహుర్మనీషిణః ॥ 47 ॥**

'అఘోర' నామ రూపాన్ని శరీరం, రసం, రూపం, అగ్ని – వీటికి అధిష్ఠానంగా విద్వాంసులు చెబుతారు.

**రశనాయాశ్చ పాయోశ్చ రసస్యాపాం తథైవ చ ।**
**ఈశ్వరం వామదేవాఖ్యం స్వరూపం శాంకరం స్మృతమ్ ॥ 48 ॥**

శంకరుని యొక్క 'వామదేవ' నామక స్వరూపాన్ని రసన (జిహ్వ), పాయువు, రసము, జలములు వీటికి అధిష్ఠానంగా చెబుతారు.

**ఘ్రాణస్య చైవోపస్థస్య గంధస్య చ భువస్తథా ।**
**సద్యోజాతాహ్వయం రూపమీశ్వరం శాంకరం విదుః ॥ 49 ॥**

ప్రాణమునకు, ఉపస్థకు, గంధమునకు, పృథివికి ఈశ్వరుడగు శివుని 'సద్యోజాతము' అను పేరుగల రూపమని చెప్పబడినది.

**ఇమే స్వరూపాః శంభోర్హి వందనీయాః ప్రయత్నతః ।**
**శ్రేయోర్థిభిర్న రైర్నిత్యం శ్రేయసామేకహేతవః ॥ 50 ॥**

శ్రేయస్సును గోరు మానవులు శంకరుని ఈ రూపాలను సదా ప్రయత్నపూర్వకంగా నమస్కరించాలి. ఇవి శ్రేయస్సుయొక్క ప్రాప్తికి ప్రధాన హేతువులు.

**యః పఠే చ్ఛృణుయాద్వాపి సద్యాదీనాం సముద్భవమ్ ।**
**స భుక్త్వా సకలాన్కామాన్ ప్రయాతి పరమాం గతిమ్ ॥ 51 ॥**

ఈ సద్యోజాతాది అవతారముల ప్రాకట్యమును ఆవిర్భావాన్నిగూర్చి చదివినవారు, వినినవారు ఈ లోకమునందు సమస్త కామ్యభోగాలను అనుభవించి చివరకు పరమగతిని పొందుతారు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం శివస్య పంచబ్రహ్మావతారవర్ణనం నామ ప్రథమోఽధ్యాయః ॥ 1 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు శివుని పంచబ్రహ్మావతారవర్ణనం అనే పేరుగల మొదటి అధ్యాయం సమాప్తం.

## ద్వితీయోఽధ్యాయః - రెండవ అధ్యాయం

## శివాష్టమూర్తివర్ణనమ్ - శివాష్టమూర్తివర్ణనం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**శృణు తాత! మహేశస్యావతారాన్పరమాన్ప్రభో! ।**
**సర్వకార్యకరాన్లోకే సర్వస్య సుఖదాన్మునే! ॥ 1 ॥**

ఓ ప్రభూ! మునీంద్రా! లోకమునందలి అందరి కార్యములను నెరవేర్చునట్టినీ, సౌఖ్యమునిచ్చునట్టినియునగు మహేశ్వరుని శ్రేష్ఠమైన అవతారాలను వర్ణిస్తాను. వినుము.

**తస్య శంభోః పరేశస్య మూర్త్యష్టకమయం జగత్ ।**
**తస్మిన్ వ్యాప్య స్థితం విశ్వం సూత్రే మణిగణా ఇవ ॥ 2 ॥**

ఈ జగత్తు పరమేశ్వరుడైన శంభుని అష్టమూర్తుల స్వరూపమే. మణులు దారమునందు గ్రుచ్చినట్లు, ఈ విశ్వమంతయు, ఆ అష్టమూర్తులలో వ్యాపించి యున్నది.

**శర్వో భవస్తథా రుద్ర ఉగ్రో భీమః పశోః పతిః ।**
**ఈశానశ్చ మహాదేవో మూర్తయశ్చాష్ట విశ్రుతాః ॥ 3 ॥**

శర్వుడు, భవుడు, రుద్రుడు, ఉగ్రుడు, భీముడు, పశుపతి, ఈశానుడు, మహాదేవుడు వీరు ప్రసిద్ధులైన అష్టమూర్తులు.

**భూమ్యంభోగ్నిమరుద్వ్యోమక్షేత్రజ్ఞార్కనిశాకరాః ।**
**అధిష్ఠితాశ్చ శర్వాద్యైరష్టరూపైః శివస్య హి ॥ 4 ॥**

శివునియొక్క శర్వాది అష్టమూర్తులచేత, భూమి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం, క్షేత్రజ్ఞుడు, సూర్యుడు, చంద్రుడు అధిష్ఠించబడి ఉన్నాయి.

**ధత్తే చరాచరం విశ్వం రూపం విశ్వంభరాత్మకమ్ ।**
**శంకరస్య మహేశస్య శాస్త్రస్యైవేతి నిశ్చయః ॥ 5 ॥**

శుభాలను కలిగించే మహేశ్వరుని విశ్వంభరాత్మకరూపమే చరాచర విశ్వాన్ని ధరించియున్నది.

**సంజీవనం సమస్తస్య జగతః సలిలాత్మకమ్ ।**
**భవ ఇత్యుచ్యతే రూపం భవస్య పరమాత్మనః ॥ 6 ॥**

శివుని జలాత్మకమగు రూపము సకల జగత్తునకు జీవనాన్ని ప్రసాదిస్తుంది. ఇది 'భవ' నామంతో పిలువబడుతుంది.

**బహిరంతర్జగద్విశ్వం బిభర్తి స్పందతే స్వయమ్ ।**
**ఉగ్ర ఇత్యుచ్యతే సద్భీ రూపముగ్రస్య సత్ప్రభోః ॥ 7 ॥**

జగత్తుయొక్క బాహ్యాంతరముల యందు వ్యాపించి, స్వయంగా విశ్వాన్ని భరించి, పోషించి, స్పందింపజేయు ఉగ్రరూపధారియైన ప్రభువగు శివునియొక్క ఈ రూపాన్ని 'ఉగ్రుడు' అని అంటారు.

**సర్వావకాశదం సర్వవ్యాపకం గగనాత్మకమ్ ।**
**రూపం భీమస్య భీమాఖ్యం భూపవృందస్య భేదకమ్ ॥ 8 ॥**

సమస్తమును తనలో ఇముడ్చు కొనునట్టియు, సర్వవ్యాపియైనట్టియు మహాదేవుని ఆకాశాత్మకరూపాన్ని 'భీమ' నామంతో పిలుస్తారు. భూతసముదాయమునందలి భేదమునకు, ఆలంబనకు 'ఈ భీమమూర్తియే' ఆధారమని తెలుసుకోవాలి. అనగా ఆత్మ ఒక్కటైనను ఈ సృష్టి అనేక రూపాలలో ఉంటుందని భావం.

**సర్వాత్మనామధిష్ఠానం సర్వక్షేత్రనివాసకమ్ ।**
**రూపం పశుపతేర్జ్ఞేయం పశుపాశనికృన్తనమ్ ॥ 9 ॥**

సకల ప్రాణులకు అధిష్ఠానమైనవాడు, సమస్త క్షేత్రములందు నివసించువాడు, జీవుల భవపాశాలను ఛేదించువాడునైన ఆ దేవదేవుని 'పశుపతి' అని తలంపవలెను.

**సందీపయజ్జగత్సర్వం దివాకరసమాహ్వయమ్ ।**
**ఈశానాఖ్యం మహేశస్య రూపం దివి విసర్పతి ॥ 10 ॥**

సకల జగత్తును ప్రకాశింపజేయువాడు, సూర్యరూపుడైనవాడునైన శివుని 'ఈశానుడు' అంటారు. ఈ స్వామి దివియందు (ఆకాశమునందు) పరిభ్రమిస్తాడు.

**ఆప్యాయయతి యో విశ్వమమృతాంశుర్నిశాకరః ।**
**మహాదేవస్య తద్రూపం మహాదేవస్య చాహ్వయమ్ ॥ 11 ॥**

అమృతమయ కిరణములు గల చంద్రుడు సకల విశ్వాన్ని ఆహ్లాదపరుస్తాడు. అట్టి శివుని ఆ రూపమే 'మహాదేవుడు' అను పేరుతో పిలువబడుతోంది.

**ఆత్మా తస్యాష్టమం రూపం శివస్య పరమాత్మనః ।**
**వ్యాపికేతరమూర్తీనాం విశ్వం తస్మాచ్ఛివాత్మకమ్ ॥ 12 ॥**

'ఆత్మ' పరమాత్ముడగు శివుని అష్టమ రూపం. ఈ రూపం ఇతర మూర్తుల వ్యాప్తరూపమే. కాబట్టి సకల విశ్వము శివమయము.

**శాఖాః పుష్యంతి వృక్షస్య వృక్షమూలస్య సేచనాత్ ।**
**తద్వదస్య వపుర్విశ్వం పుష్యతే చ శివార్చనాత్ ॥ 13 ॥**

వృక్షమూలాలకు నీరు పోసినచో దాని కొమ్మలన్నియు పుష్పభరితములౌతాయి. అట్లే శివుని పూజించినచో శివస్వరూపమైన విశ్వము పరిపుష్టమౌతుంది.

**యథేహ పుత్రపౌత్రాదేః ప్రీత్యా ప్రీతో భవేత్పితా ।**
**తథా విశ్వస్య సంప్రీత్యా ప్రీతో భవతి శంకరః ॥ 14 ॥**

ఈలోకంలో పుత్ర పౌత్రాదులు సంతోషంగా నుండుట చూచి తండ్రి ఆనందించినట్లు, విశ్వము చక్కగా సంతోషంగా నుండుటను చూచి శంకరుడు ఆనందిస్తాడు.

**క్రియతే యస్య కస్యాపి దేహినో యది నిగ్రహః ।**
**అష్టమూర్తేరనిష్టం తత్కృతమేవ న సంశయః ॥ 15 ॥**

ఏ దేహధారినైనను కష్టము కలిగించినచో అష్టమూర్తియైన శివునకే నిస్సంశయంగా ఆ దుఃఖాన్ని కలిగిస్తున్నానని తలంచాలి.

**అష్టమూర్త్యాత్మనా విశ్వమధిష్ఠాయాస్థితం శివమ్ ।**
**భజస్వ సర్వభావేన రుద్రం పరమకారణమ్ ॥ 16 ॥**

సనత్కుమారా! ఆ విధంగా భగవంతుడైన శివుడు తన అష్టమూర్తుల ద్వారా సమస్త విశ్వాన్ని అధిష్ఠించి విరాజమానుడైయున్నాడు. కనుక నీవు పరమకారణమైన రుద్రుని సంపూర్ణ భక్తిభావంతో భజింపుము.

**ఇతిప్రోక్తాః స్వరూపాస్తే విధిపుత్రాష్ట విశ్రుతాః ।**
**సర్వోపకారనిరతాః సేవ్యాః శ్రేయోఽర్థిభిర్నరైః ॥ 17 ॥**

శ్రేయఃకాములైన మానవులూ సర్వోపకారనిరతులైనవారూ ఈ విధంగా చెప్పబడిన మహాదేవుని అష్టమూర్తులను ఎల్లప్పుడూ సేవించాలి.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం శివాష్టమూర్తివర్ణనం నామ ద్వితీయోఽధ్యాయః ॥ 2 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు శివాష్టమూర్తివర్ణనం అనే పేరుగల రెండవ అధ్యాయం సమాప్తం.

## తృతీయోఽధ్యాయః - మూడవ అధ్యాయం

## శివస్యార్ధనారీనరావతారవర్ణనమ్ - శివునియొక్క అర్ధనారీనరావతారవర్ణనం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు చెప్పాడు.

**శృణు తాత! మహాప్రాజ్ఞ! విధికామప్రపూరకమ్ ।**
**అర్ధనారీనరాఖ్యం హి శివరూపమనుత్తమమ్ ॥ 1 ॥**

ఓ సనత్కుమారా! నీవు ఇప్పుడు సాటిలేని శివుని అర్ధనారీనరరూపవర్ణనమును విను. మహాప్రాజ్ఞా! ఈ రూపము బ్రహ్మ కోర్కెలను కూడా తీరుస్తుంది.

**యదా సృష్టాః ప్రజాస్సర్వాః న వ్యవర్ధంత వేధసా ।**
**తదా చింతాకులోఽభూత్స తేన దుఃఖేన దుఃఖితః ॥ 2 ॥**

సృష్టి ప్రారంభమునందు సృష్టికర్తయగు బ్రహ్మ సృష్టించిన ప్రజలందరు విస్తృతంగా వ్యాపించి యుండలేదు. అప్పుడు బ్రహ్మదేవుడు ఆ దుఃఖంతో చింతిస్తున్నాడు.

**నభోవాణీ తదాఽభూద్వై సృష్టిం మిథునజాం కురు ।**
**తచ్ఛ్రుత్వా మైథునీం సృష్టిం బ్రహ్మా కర్తుమమన్యత ॥ 3 ॥**

అంతట ఆకాశవాణి ఇలా పలికింది. "బ్రహ్మదేవా! ఇప్పుడు మైథునీసృష్టిని చేయుము" (దంపతుల కలయిక వలన సంతానము కలుగుట. వారికి తిరిగి పిల్లలు. ఇట్లు సృష్టి కార్యం వృద్ధి చెందగలదు.) అను మాటను విని బ్రహ్మ మైథునీసృష్టి చేయుటకాలోచింపసాగాడు.

**నారీణాం కులమీశానాన్నిర్గతం న పురా యతః ।**
**తతో మైథునజాం సృష్టిం కర్తుం శేకే న పద్మభూః ॥ 4 ॥**

దీనికి ముందు ఇప్పటి వరకు ఈశానునినుండి స్త్రీజాతి ప్రకటితం కాలేదు. కాబట్టి బ్రహ్మ మైథునీసృష్టిని చేయుటకు సమర్థుడు కాకుండెను.

**ప్రభావేణ వినా శంభోర్న జాయేరన్నిమాః ప్రజాః ।**
**ఏవం సంచింతయన్బ్రహ్మా తపః కర్తుం ప్రచక్రమే ॥ 5 ॥**

శంభుని కృపలేకుండ మైథునీ ప్రజలను సృష్టించుట జరగద'ని బ్రహ్మ తలంచెను. ఈ విధంగా ఆలోచించిన బ్రహ్మ తపమొనరించుటకుద్యమించెను.

**శివయా పరయా శక్త్యా సంయుక్తం పరమేశ్వరమ్ ।**
**సంచింత్య హృదయే ప్రీత్యా తేపే స పరమం తపః ॥ 6 ॥**

పరాశక్తియగు పార్వతితో కలిసియున్న శివుని తలచుకుని భక్తిశ్రద్ధలతో హృదయమునందు ధ్యానము చేసి గొప్ప తపము నాచరించాడు.

**తీవ్రేణ తపసా తస్య సంయుక్తస్య స్వయంభువః ।**
**అచిరేణైవ కాలేన తుతోష స శివో ద్రుతమ్ ॥ 7 ॥**

తపోనుష్ఠానంలో లగ్నమైయున్న బ్రహ్మయొక్క తీవ్ర తపస్సుచే అచిరకాలమునకే శివుడు సంతుష్టుడయ్యాడు.

**తతః పూర్ణచిదీశస్య మూర్తిమావిశ్య కామదామ్ ।**
**అర్ధనారీనరో భూత్వా తతో బ్రహ్మాంతికం హరః ॥ 8 ॥**

అప్పుడు శంకరుడు పూర్ణ సచ్చిదానందుడై కోరికలను తీర్చు ఆకారంలో ప్రవిష్టుడయ్యాడు. అర్ధనారీనరుని రూపంలో బ్రహ్మ ఎదుట ప్రత్యక్షమయ్యాడు.

**తం దృష్ట్వా శంకరం దేవం శక్త్యా పరమయాన్వితమ్ ।**
**ప్రణమ్య దండవద్బ్రహ్మా స తుష్టావ కృతాంజలిః ॥ 9 ॥**

దేవాదిదేవుడగు శంకరుడు పరాశక్తితో కూడి వచ్చెనని బ్రహ్మ తెలిసికొన్నాడు. దండము వలె భూమి మీద పడి శంకరునికి ప్రణమిల్లి చేతులు జోడించి స్తుతింపసాగాడు.

**అథ దేవో మహాదేవో వాచా మేఘగభీరయా ।**
**సంభవాయ సుసంప్రీతో విశ్వకర్తా మహేశ్వరః ॥ 10 ॥**

విశ్వకర్తయు, దేవాదిదేవుడునగు మహాదేవుడు మిగుల ప్రసన్నుడై మేఘగంభీరమైన స్వరంతో బ్రహ్మతో ఇలా పలికాడు.

**ఈశ్వర ఉవాచ** - ఈశ్వరుడు పలికాడు.

**వత్స! వత్స! మహాభాగ! మమ పుత్ర! పితామహ! ।**
**జ్ఞాతవానస్మి సర్వం తత్తత్త్వతస్తే మనోరథమ్ ॥ 11 ॥**

మహాభాగ్యశాలీ! నా ప్రియపుత్రుడవగు పితామహా! వత్సా! నీ మనోరథములన్నియు నాకు సంపూర్ణముగా తెలిసినవి.

**ప్రజానామేవ వృద్ధ్యర్థం తపస్తప్తం త్వయాఽధునా ।**
**తపసా తేన తుష్టోఽస్మి దదామి చ తవేప్సితమ్ ॥ 12 ॥**

ప్రజాభివృద్ధిని కోరి నీవీ ఘోర తపమాచరించావు. నేను నీ తపస్సుచే ప్రసన్నుడనయ్యాను. నీ కోరికని తీర్చుతాను.

**ఇత్యుక్త్వా పరమోదారం స్వభావమధురం వచః ।**
**పృథక్చకార వపుషో భాగాద్దేవీం శివాం శివః ॥ 13 ॥**

ఇట్లు స్వభావమధురమైనట్టియు, పరమోదారమైనట్టియు వచనములను పలికి తన శరీరమునందలి అర్ధభాగమైన పార్వతీదేవిని వేరు చేశాడు.

**తాం దృష్ట్వా పరమాం శక్తిం పృథగ్భూతాం శివాగతామ్ ।**
**ప్రణిపత్య వినీతాత్మా ప్రార్థయామాస తాం విధిః ॥ 14 ॥**

శివునినుండి వేరుగా ఉన్న ఆ పరాశక్తిని చూసి బ్రహ్మ వినమ్రభావంతో ప్రణమిల్లి ఆమెనిట్లు ప్రార్థింపసాగాడు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**దేవదేవేన సృష్టోఽహమాదౌ త్వత్పతినా శివే! ।**
**ప్రజాః సర్వా నియుక్తాశ్చ శంభునా పరమాత్మనా ॥ 15 ॥**

ఓ పార్వతీ! సృష్టి ప్రారంభంలో నీభర్తయు, దేవదేవుడు, పరమాత్ముడునగు శంభుడు నన్ను సృష్టించాడు. నా ద్వారా సకల ప్రజలను ప్రకటింపజేశాడు.

**మనసా నిర్మితాః సర్వే శివే దేవాదయో మయా ।**
**న వృద్ధిముపగచ్ఛంతి సృజ్యమానాః పునః పునః ॥ 16 ॥**

ఓ శివా! అప్పుడు నేను సమస్త దేవతలను, ప్రజలను మనసుతో సృష్టించేవాడిని. కాని పదే పదే ఈ కార్యమొనర్చినను వారికి వృద్ధి కలుగలేదు.

**మిథునప్రభవామేవ కృత్వా సృష్టిమతః పరమ్ ।**
**సంవర్ధయితుమిచ్ఛామి సర్వా ఏవ మమ ప్రజాః ॥ 17 ॥**

నేను స్త్రీ పురుషుల సంగమంచేత ఉత్పన్నమగు సృష్టినిర్మాణం చేసి, తద్వారా సకల ప్రజలను వృద్ధి చేయగోరుచున్నాను.

**న నిర్గతం పురా త్వత్తో నారీణాం కులమవ్యయమ్ ।**
**తేన నారీకులం స్రష్టుం మమ శక్తిర్న విద్యతే ॥ 18 ॥**

కాని ఇప్పటి వరకు నీ ద్వారా స్త్రీ జాతి ప్రకటితం కాలేదు. స్త్రీ జాతిని సృష్టించడానికి నాకు శక్తి లేకున్నది.

**సర్వాసామేవ శక్తీనాం త్వత్తః ఖలు సముద్భవః ।**
**తస్మాత్త్వాం పరమాం శక్తిం ప్రార్థయామ్యఖిలేశ్వరీమ్ ॥ 19 ॥**

సకల శక్తులకు జన్మస్థానము నీవే. కాబట్టి అఖిల శక్తులకు పరమశక్తివగు నిన్ను నేను ప్రార్థించుచున్నాను.

**శివే! నారీకులం స్రష్టుం శక్తిం దేహి నమోఽస్తు తే ।**
**చరాచరం జగద్వృద్ధి హేతోర్మాతః! శివం ప్రియే ॥ 20 ॥**

ఓ పార్వతీ! నేను నిన్ను నమస్కరిస్తున్నాను. నారీకులాన్ని సృష్టించు శక్తిని నాకు ప్రసాదింపుము. దీనివలన నీవు చరాచర జగత్తు యొక్క ప్రాదుర్భావానికి కారణభూతురాలవు కాగలవు.

**అన్యం త్వత్తః ప్రార్థయామి వరం చ వరదేశ్వరి! ।**
**దేహి మే తం కృపాం కృత్వా జగన్మాత ర్నమోఽస్తు తే ॥ 21 ॥**

వరదేశ్వరీ! నేను నీనుండి మరియొక వరాన్ని కూడ కోరుచున్నాను. జగన్మాతా ! దయచేసి నాకావరమునిమ్ము. నేను నీ చరణములకు నమస్కరించి కోరుచున్నాను.

**చరాచరవివృద్ధ్యర్థమీశేనైకేన సర్వగే! ।**
**దక్షస్య మమ పుత్రస్య పుత్రీ భవ భవాంబికే! ॥ 22 ॥**

సర్వవ్యాపివగు జగజ్జననీ! నీవు పరమేశ్వరునితో కలిసి చరాచర జగత్తును వృద్ధి పొందించుటకు సర్వసమర్థరూపంలో ఉన్న నా పుత్రుడగు దక్షునకు పుత్రికవు కమ్ము!

**ఏవం సంయాచితా దేవీ బ్రహ్మణా పరమేశ్వరీ ।**
**తథాస్త్వితి వచః ప్రోచ్య తచ్ఛక్తిం విధయే దదౌ ॥ 23 ॥**

బ్రహ్మచేత ఇట్లు యాచింపబడిన పరమేశ్వరి దేవి 'తథాస్తు(అట్లే జరుగుగాక)' అని పలికింది. సృష్టి కార్యానికి తగు శక్తిని బ్రహ్మకు ప్రసాదించింది.

**తస్మాద్ధి సా శివా దేవీ శివశక్తిర్జగన్మయీ ।**
**శక్తిమేకాం భ్రువోర్మధ్యాత్ససర్జాత్మసమప్రభామ్ ॥ 24 ॥**

జగన్మయి, శివశక్తియునగు పార్వతీదేవి తన కనుబొమల మధ్యభాగంనుండి తనతో సమాన ప్రభావశాలియగు శక్తి నొకదానిని సృజించింది.

**తామాహ ప్రహసన్ప్రేక్ష్య శక్తిం దేవవరో హరః ।**
**కృపాసింధుర్మహేశానో లీలాకారీ భవాంబికామ్ ॥ 25 ॥**

ఆ శక్తిని చూచి దేవవరుడు, కృపాసాగరుడు, లీలాకారుడు, ఈశానుడునగు శంభుడు నవ్వుచూ జగదంబతో ఇలా పలికాడు.

**శివ ఉవాచ** - శివుడు పలికాడు.

**తపసారాధితా దేవి! బ్రహ్మణా పరమేష్ఠినా ।**
**ప్రసన్నా భవ సుప్రీత్యా కురు తస్యాఖిలేప్సితమ్ ॥ 26 ॥**

దేవీ! పరమేష్ఠియైన బ్రహ్మ తపస్సు ద్వారా నిన్ను ఆరాధించాడు. కనుక నీవిప్పుడు ఆయనయందు ప్రసన్నురాలవు కమ్ము. అతని మనోరథములనన్నిటిని నెరవేర్చుము.

**తామాజ్ఞాం పరమేశస్య శిరసా ప్రతిగృహ్యా సా ।**
**బ్రహ్మణో వచనాద్దేవీ దక్షస్య దుహితాఽభవత్ ॥ 27 ॥**

పరమేశ్వరుడైన శివాజ్ఞను తలవంచుకొని స్వీకరించింది. బ్రహ్మ కోరినవిధంగా దక్షపుత్రికయగుటకు అంగీకరించింది.

**దత్త్వైవమతులాం శక్తిం బ్రహ్మణో సా శివా మునే! ।**
**వివేశ దేహం శంభోర్హి శంభు శ్చాంతర్దధే ప్రభుః ॥ 28 ॥**

ఓమునీ! ఇట్లు భవానీదేవి బ్రహ్మకు సాటిలేని శక్తిని ప్రసాదించి శంభుని శరీరంలో ప్రవేశించింది. వెంటనే శివుడు అంతర్ధానాన్ని పొందాడు.

**తదాప్రభృతి లోకేఽస్మిన్ స్త్రియా భాగః ప్రకల్పితః ।**
**ఆనందం ప్రాప స విధిః సృష్టిర్జాతా చ మైథునీ ॥ 29 ॥**

నాటినుండి ఈ లోకంలో స్త్రీకి భాగం కల్పింపబడింది. మైథునీసృష్టి ప్రారంభింపబడింది. దీనివలన బ్రహ్మకు మహానందం కలిగింది.

**ఏతత్తే కథితం తాత! శివరూపం మహోత్తమమ్ ।**
**అర్ధనారీ నరార్ధం హి మహా మంగళదం సతామ్ ॥ 30 ॥**

ఓ సనత్కుమారా! ఇట్లు నేను శివుని మహత్తరము, అనుపమానమగు అర్ధనారీనరరూపాన్ని వర్ణించి తెలిపాను. ఇది సత్పురుషులకు మంగళప్రదము.

**ఏతదాఖ్యానమనఘం యః పఠేచ్ఛృణుయాదపి ।**
**స భుక్త్వా సకలాన్భోగాన్ప్రయాతి పరమాం గతిమ్ ॥ 31 ॥**

పవిత్రమైన ఈ గాథను ఎవరు పఠిస్తారో, ఎవరు వింటారో వారు ఈ లోకంలోని సమస్త భోగాలను అనుభవించి చివరికి పరమపదాన్ని పొందుతారు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం శివస్యార్ధనారీనరావతారవర్ణనమ్ నామ తృతీయోఽధ్యాయః ॥ 3 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు శివునియొక్క అర్ధనారీనరావతార వర్ణనం అనే పేరుగల మూడవ అధ్యాయం సమాప్తం.

## చతుర్థోఽధ్యాయః - నాల్గవ అధ్యాయం

## ఋషభచరిత్రవర్ణనమ్ - ఋషభచరిత్రవర్ణనం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు చెప్పాడు.

**సనత్కుమార! సర్వజ్ఞ! చరితం శాంకరం ముదా ।**
**రుద్రేణ కథితం ప్రీత్యా బ్రహ్మణే సుఖదం సదా ॥ 1 ॥**

ఓ సనత్కుమారా! సర్వజ్ఞా! ఒకసారి రుద్రుడు సంతోషంగా బ్రహ్మకు శంకరుని చరిత్రను సంతోషంగా వర్ణించాడు. ఆ చరిత్ర మిక్కిలి సుఖప్రదం. దానిని విను.

**శివ ఉవాచ** - శివుడు పలికాడు.

**సప్తమే చైవ వారాహే కల్పే మన్వంతరాభిధే ।**
**కల్పేశ్వరోఽథ భగవాన్ సర్వలోకప్రకాశనః ॥ 2 ॥**

బ్రహ్మదేవా! వరాహకల్పంలో ఏడవ మన్వంతరమునందు సమస్తలోకాలను ప్రకాశింపచేసే భగవానుడైన కల్పేశ్వరుడుండును.

**మనోర్వైవస్వతస్యైవ తే ప్రపుత్రో భవిష్యతి ।**
**తదా చతుర్యుగాశ్చైవ తస్మిన్మన్వంతరే విధే! ॥ 3 ॥**

ఓ బ్రహ్మదేవా! ఆ స్వామి నీకు ప్రపౌత్రుడు. అతడు వైవస్వతమనువునకు పుత్రుడు. ఆ మన్వంతరంలోని చతుర్యుగములందు, ఏదో ఒక ద్వాపరయుగంలో

**అనుగ్రహార్థం లోకానాం బ్రాహ్మణానాం హితాయ చ ।**
**ఉత్పశ్యామి విధే! బ్రహ్మన్! ద్వాపరాఖ్యయుగాన్తికే ॥ 4 ॥**

లోకాలననుగ్రహించడానికి, బ్రాహ్మణులకు మేలు చేయడానికి ఆ ద్వాపరయుగాంతంలో నేనవతరిస్తాను.

**యుగప్రవృత్త్యా చ తదా తస్మింశ్చ ప్రథమే యుగే ।**
**ద్వాపరే ప్రథమే బ్రహ్మన్! యదా వ్యాసః స్వయం ప్రభుః ॥ 5 ॥**

బ్రహ్మదేవా! యుగప్రవృత్తి కనుగుణంగా మొదటి చతుర్యుగ ప్రథమ ద్వాపరయుగంలో ప్రభువు స్వయంగా వ్యాసుడౌతాడు.

**తదాహం బ్రాహ్మణార్థాయ కలౌ తస్మిన్యుగాంతికే ।**
**భవిష్యామి శివాయుక్తః శ్వేతో నామ మహామునిః ॥ 6 ॥**

అప్పుడు కలియుగాంతంలో నేను బ్రాహ్మణహితముకొఱకు పార్వతీదేవితో గూడి 'శ్వేతుడు' అను పేరుగల మహామునిగా అవతరిస్తాను.

**హిమవచ్ఛిఖరే రమ్యే ఛాగలే పర్వతోత్తమే ।**
**తదా శిష్యాః శిఖాయుక్తా భవిష్యంతి విధే! మమ ॥ 7 ॥**

అప్పుడు అందమైన హిమాలయ 'ఛాగలము' అను పేరుగల రమణీయమైన పర్వతశ్రేష్ఠం కలదు. అక్కడ నాకు శిఖను ధరించిన నలుగురు శిష్యులుత్పన్నమౌతారు.

**శ్వేతః శ్వేతశిఖశ్చైవ శ్వేతాశ్వః శ్వేతలోహితః ।**
**చత్వారో ధ్యానయోగాత్తే గమిష్యంతి పురం మమ ॥ 8 ॥**

శ్వేతుడు, శ్వేతశిఖుడు, శ్వేతాశ్వుడు, శ్వేతలోహితుడు అను పేర్లుగల ఆ నలుగురు ధ్యానయోగాన్ని ఆశ్రయించడంవలన నా నగరానికి వెళతారు.

**తతో భక్తా భవిష్యంతి జ్ఞాత్వా మాం తత్త్వతోఽవ్యయమ్ ।**
**జన్మమృత్యుజరాహీనాః పరబ్రహ్మసమాధయః ॥ 9 ॥**

అచట వారు అవ్యయుడనగు నన్ను, నా తత్త్వాన్ని తెలిసికొని నా భక్తులౌతారు. జరామరణ రహితులౌతారు. పరబ్రహ్మసమాధియందు లీనమౌతారు.

**ద్రష్టుం శక్యో నరైర్నాహమృతే ధ్యానాత్పితామహ! ।**
**దానధర్మాదిభిర్వత్స! సాధనైః కర్మహేతుభిః ॥ 10 ॥**

వత్సా! పితామహా! ఆ సమయంలో మానవుడు ధ్యానం ద్వారా తప్ప ఇతర దానధర్మాది కర్మహేతుక సాధనాల ద్వారా నన్ను దర్శింపలేడు.

**ద్వితీయే ద్వాపరే వ్యాసః సత్యో నామ ప్రజాపతిః ।**
**యదా తదా భవిష్యామి సుతారో నామతః కలౌ ॥ 11 ॥**

రెండవ ద్వాపరయుగంలో సత్య ప్రజాపతి వ్యాసుడౌతాడు. ఆ సమయంలో కలియుగంలో నేను 'సుతారుడు' అను పేరుతో ఉత్పన్నమౌతాను.

**తత్రాపి మే భవిష్యంతి శిష్యా వేదవిదో ద్విజాః ।**
**దుందుభిః శతరూపశ్చ హృషీకః కేతుమాంస్తథా ॥ 12 ॥**

అచ్చట కూడ దుందుభి, శతరూపుడు, హృషీకుడు, కేతుమంతుడు అను పేర్లు గల వేదవిదులైన నలుగురు బ్రాహ్మణులు నాకు శిష్యులౌతారు.

**చత్వారో ధ్యానయోగాత్తే గమిష్యంతి పురం మమ ।**
**తతో ముక్తా భవిష్యంతి జ్ఞాత్వా మాం తత్త్వతోఽవ్యయమ్ ॥ 13 ॥**

వారు నలుగురు ధ్యానయోగబలంతో నా నగరాన్ని చేరుతారు. అవ్యయుడనైన నా తత్త్వాన్ని తెలిసికొని ముక్తులౌతారు.

**తృతీయే ద్వాపరే చైవ యదా వ్యాసస్తు భార్గవః ।**
**తదాప్యహం భవిష్యామి దమనస్తు పురాంతికే ॥ 14 ॥**

మూడవ ద్వాపరమందు భార్గవుడను పేరుగల వ్యాసుడుంటాడు. అప్పుడు నేను కూడ నగర సమీపంలోనే 'దమనుడు' అనే పేరుతో ఆవిర్భవిస్తాను.

**తత్రాపి చ భవిష్యంతి చత్వారో మమ పుత్రకాః ।**
**విశోకశ్చ విశేషశ్చ విపాపః పాపనాశనః ॥ 15 ॥**

అప్పుడు కూడ నాకు విశోకుడు, విశేషుడు, విపాపుడు, పాపనాశనుడను పేర్లు గల నలుగురు పుత్రులుంటారు.

**శిష్యైః సాహాయ్యం వ్యాసస్య కరిష్యే చతురానన! ।**
**నివృత్తిమార్గం సుదృఢం వర్తయిష్యే కలావిహ ॥ 16 ॥**

చతురాననా! ఆ అవతారమునందు శిష్యులను వెంటనిడుకొని వ్యాసునకు సహాయం చేస్తాను. ఆ కలియుగంలో చెదిరిపోని మోక్షమార్గాన్ని ప్రవర్తింపజేస్తాను.

**చతుర్థే ద్వాపరే చైవ యదా వ్యాసోఽంగిరాః స్మృతః ।**
**తదాప్యహం భవిష్యామి సుహోత్రో నామ నామతః ॥ 17 ॥**

నాల్గవ ద్వాపరంలో అంగిరసుడు వ్యాసుడుగా అవతరిస్తాడు. అప్పుడు నేను సుహోత్రుడనే పేరుతో అవతరిస్తాను.

**తత్రాపి మమ తే పుత్రాశ్చత్వారో యోగ సాధకాః ।**
**భవిష్యంతి మహాత్మానస్తన్నామాని బ్రువే విధే! ॥ 18 ॥**

ఆ సమయంలో యోగసాధకులు, మహాత్ములునగు నలుగురు పుత్రులు జన్మిస్తారు. బ్రహ్మదేవా! వారి పేర్లు చెబుతున్నాను.

**సుముఖో దుర్ముఖశ్చైవ దుదర్భో దురతిక్రమః ।**
**శిష్యైః సాహాయ్యం వ్యాసస్య కరిష్యేఽహం తదా విధే ॥ 19 ॥**

సుముఖుడు, దుర్ముఖుడు, దుదర్భుడు, దురతిక్రముడు – ఈ నామములుగల శిష్యులతో కూడి వ్యాసునకు ఈ అవతారంలో కూడా సహాయం చేయడానికి నేను లగ్నమౌతాను.

**పంచమే ద్వాపరే చైవ వ్యాసస్తు సవితా స్మృతః ।**
**తదా యోగీ భవిష్యామి కంకో నామ మహాతపాః ॥ 20 ॥**

ఐదవ ద్వాపరమందు సవిత వ్యాసుడనుపేరుతో పిలువబడతాడు. అప్పుడు నేను మహాతపస్వియగు కంకుడను పేరుగల యోగినౌతాను.

**తత్రాపి మమ తే పుత్రాశ్చత్వారో యోగసాధకాః ।**
**భవిష్యంతి మహాత్మానస్తన్నామాని శృణుష్వ మే ॥ 21 ॥**

అచ్చట కూడా నాకు యోగ సాధకులు, మహాత్ములునైన నలుగురు పుత్రులుంటారు. వారి పేర్లను వినుము.

**సనకః సనాతనశ్చైవ ప్రభుర్యశ్చ సనందనః ।**
**విభుః సనత్కుమారశ్చ నిర్మలో నిరహంకృతిః ॥ 22 ॥**

వారి పేర్లు – సనకుడు, సనాతనుడు, ప్రభావశాలియగు సనందనుడు, నిర్మలుడు, నిరహంకారుడు విభుడునైన సనత్కుమారుడు.

**తత్రాపి కంకనామాహం సాహాయ్యం సవితుర్విధే! ।**
**వ్యాసస్య హి కరిష్యామి నివృత్తిపథవర్ధకః ॥ 23 ॥**

బ్రహ్మదేవా! అప్పుడు కూడా కంకుడను పేరుతో – నేను సవితా నామకుడగు వ్యాసునకు సహాయకుడనౌతాను. నివృత్తిమార్గాన్ని వృద్ధిచేస్తాను.

**పరివర్తే పునః షష్ఠే ద్వాపరే లోకకారకః ।**
**కర్తా వేదవిభాగస్య మృత్యుర్వ్యాసో భవిష్యతి ॥ 24 ॥**

మరల ఆరవ ద్వాపరం ప్రారంభం కాగానే 'మృత్యువు' లోకహితకారకవ్యాసుడౌతాడు. వేదాలను విభజిస్తాడు.

**తదాప్యహం భవిష్యామి లోకాక్షిర్నామ నామతః ।**
**వ్యాసస్య సుసాహాయ్యార్థం నివృత్తిపథవర్ధనః ॥ 25 ॥**

అప్పుడు కూడ నేను వ్యాసునకు సహాయం చేయడానికి 'లోకాక్షి' అనే పేరుతో ప్రకటితమౌతాను. అప్పుడు నివృత్తిమార్గానికి ఔన్నత్యాన్ని సమకూరుస్తాను.

**తత్రాపి శిష్యాశ్చత్వారో భవిష్యంతి దృఢవ్రతాః ।**
**సుధామా విరజాశ్చైవ సంజయో విజయస్తథా ॥ 26 ॥**

అప్పుడు కూడ దృఢవ్రతులైన నా శిష్యులు నలుగురుంటారు. వారు సుధాముడు, విరజుడు, సంజయుడు, విజయుడు.

**సప్తమే పరివర్తే తు యదా వ్యాసః శతక్రతుః ।**
**తదాప్యహం భవిష్యామి జైగీషవ్యో విభుర్విధే! ॥ 27 ॥**

బ్రహ్మదేవా! ఏడవ ద్వాపర ప్రారంభమున 'శతక్రతుడు' అనే పేరుతో వ్యాసుడుంటాడు. అప్పుడు కూడ నేను 'జైగీషవ్యుడు' అనే పేరుతో అవతరిస్తాను.

**యోగం సంద్రఢయిష్యామి మహాయోగవిచక్షణః ।**
**కాశ్యాం గుహాంతరే సంస్థో దివ్యదేశే కుశాస్తరిః ॥ 28 ॥**

నేను యోగమార్గమునందు మిక్కిలి నిపుణుడనై మహాయోగవిచక్షుణుడనై కాశీపురంలోని ఒక గుహలోని దివ్యదేశంతో కుశాసనంపై కూర్చుని యోగాన్ని బలిష్ఠం చేస్తాను.

**సాహాయ్యం చ కరిష్యామి వ్యాసస్య హి శతక్రతోః ।**
**ఉద్ధరిష్యామి భక్తాంశ్చ సంసారభయతో విధే! ॥ 29 ॥**

ఓ బ్రహ్మదేవా! శతక్రతుడను పేరుగల వ్యాసునకు సహాయం కూడ చేస్తాను. భక్తులను సంసారభయంనుండి ఉద్ధరిస్తాను.

**తత్రాపి మమ చత్వారో భవిష్యంతి సుతా యుగే ।**
**సారస్వతశ్చ యోగీశో మేఘవాహః సువాహనః ॥ 30 ॥**

అప్పుడు కూడా నాకు నలుగురు కుమారులుంటారు. వారి పేర్లు – సారస్వతుడు, యోగీశుడు, మేఘవాహుడు, సువాహనుడు.

**అష్టమే పరివర్తే హి వసిష్ఠో మునిసత్తమః ।**
**కర్తా వేదవిభాగస్య వేదవ్యాసో భవిష్యతి ॥ 31 ॥**

ఎనిమిదవ ద్వాపరమునందు మునిసత్తముడైన వసిష్ఠుడు వేదాలను విభజించు వేదవ్యాసుడౌతాడు.

**తత్రాప్యహం భవిష్యామి నామతో దధివాహనః ।**
**వ్యాసస్య హి కరిష్యామి సాహాయ్యం యోగవిత్తమ! ॥ 32 ॥**

యోగవిత్తమా! ఆ యుగంలో కూడ నేను 'దధివాహనుడు' అనే పేరుతో అవతరిస్తాను. వ్యాసునకు సహాయపడతాను.

**కపిలశ్చాసురిః పంచశిఖః శాల్వలపూర్వకః ।**
**చత్వారో యోగినః పుత్రా భవిష్యంతి సమా మమ ॥ 33 ॥**

అప్పుడు కపిలుడు, ఆసురి, పంచశిఖుడు, శాల్వలుడు అను పేర్లు గల యోగులగు నలుగురు పుత్రులుదయిస్తారు. వారు నాతో సమానులుగానుంటారు.

**నవమే పరివర్తేతే తస్మిన్నేవ యుగే విధే! ।**
**భవిష్యతి మునిశ్రేష్ఠో వ్యాసః సారస్వతాహ్వయః ॥ 34 ॥**

బ్రహ్మదేవా! తొమ్మిదవ చతుర్యుగ ద్వాపరయుగంలో మునిశ్రేష్ఠుడైన 'సారస్వతుడు' అనే పేరుతో ప్రసిద్ధుడైనవాడు వ్యాసుడుగా ఉంటాడు.

**వ్యాసస్య ధ్యాయతస్తస్య నివృత్తిపథవృద్ధయే ।**
**తదాప్యహం భవిష్యామి ఋషభో నామతః స్మృతః ॥ 35 ॥**

ఆ వ్యాసుడు నివృత్తిమార్గాన్ని వృద్ధిచేయడానికి ధ్యానమగ్నుడౌతాడు. అప్పుడు నేను 'ఋషభుడు' అనే నామంతో అవతరిస్తాను.

**పరాశరశ్చ గర్గశ్చ భార్గవో గిరిశస్తథా ।**
**చత్వారస్తత్ర శిష్యా మే భవిష్యంతి సుయోగినః ॥ 36 ॥**

అంతట పరాశరుడు, గర్గుడు, భార్గవుడు, గిరిశుడు – అను పేర్లు గల మహాయోగులు నలుగురు నాకు శిష్యులౌతారు.

**తైః సాకం ద్రఢయిష్యామి యోగమార్గం ప్రజాపతే! ।**
**కరిష్యామి సాహాయ్యం వై వేదవ్యాసస్య సన్మునే! ॥ 37 ॥**

ప్రజాపతీ! వారి సహయోగంతో నేను యోగమార్గాన్ని సుదృఢం చేస్తాను. సన్మునీంద్రా! ఇట్లు నేను వ్యాసునకు సహాయపడతాను.

**తేన రూపేణ భక్తానాం బహునాం దుఃఖినాం విధే! ।**
**ఉద్ధారం భవతోఽహం వై కరిష్యామి దయాకరః ॥ 38 ॥**

బ్రహ్మదేవా! అదే రూపంతో చాలామంది దుఃఖితులైన భక్తులను అనుగ్రహించి వారిని భవసాగరంనుండి తరింపజేస్తాను.

**సోఽవతారో విధే! మే హి ఋషభాఖ్యస్సుయోగకృత్ ।**
**సారస్వతవ్యాసమనః కర్తా నానా హ్యవనకారకః ॥ 39 ॥**

నాయొక్క ఋషభనామక అవతారము యోగమార్గప్రవర్తకము, సారస్వతవ్యాసుని మనస్సు సంతోషపరచునదై, నానావిధముల రక్షించునదై యుండును.

**అవతారేణ మే యేన భద్రాయుర్నృపబాలకః ।**
**జీవితో హి మృతః క్ష్వేడదోషతో జనకోజ్ఝితః ॥ 40 ॥**

ఆ అవతారము నందు 'భద్రాయువు' అను పేరుగల రాజకుమారుడు విషదోషంతో మరణిస్తాడు. ఆ కారణంచే తండ్రి ద్వారా పరిత్యజింపబడతాడు. వానికి నేను జీవనదానాన్ని చేస్తాను.

**ప్రాప్తేఽథ షోడశే వర్షే తస్య రాజశిశోః పునః ।**
**యయౌ తద్వేశ్మ సహసా ఋషభః స మదాత్మకః ॥ 41 ॥**

అనంతరం ఆ రాజకుమారునికి పదహారు సంవత్సరముల వయస్సు రాగానే నా అంశంలోని ఋషభుడను ఋషి అతని ఇంటికి వెళ్లాడు.

**పూజితస్తేన స మునిః సద్రూపశ్చ కృపానిధిః ।**
**ఉపాదిదేశ తద్ధర్మాన్ రాజయోగాత్ప్రజాపతే! ॥ 42 ॥**

ప్రజాపతీ! అతడారాజకుమారునిచే పూజింపబడెను, సద్రూపధారి, కృపాళుడునగు మునీంద్రుడతనికి రాజధర్మాలనుపదేశించాడు.

**తతః స కవచం దివ్యం శంఖం ఖడ్గం చ భాస్వరమ్ ।**
**దదౌ తస్మై ప్రసన్నాత్మా సర్వశత్రువినాశనమ్ ॥ 43 ॥**

అంతట మునీంద్రుడు సంతుష్టచిత్తుడై అతనికి దివ్యకవచాన్ని, శంఖాన్ని, సమస్త శత్రువులను వినాశం చేసే ఒక ఖడ్గాన్ని ప్రసాదించాడు.

**తదంగభస్మనామృశ్య కృపయా దీనవత్సలః ।**
**స ద్వాదశసహస్రస్య గజానాం చ బలం దదౌ ॥ 44 ॥**

దీనవత్సలుడగు ముని అతని శరీరమునందు భస్మాన్ని అలది అతనికి పన్నెండువేల గజబలాన్ని కూడ ప్రదానం చేశాడు.

**ఇతి భద్రాయుషం సమ్యగనుశ్వాస్య సమాతృకమ్ ।**
**యయౌ స్వైరగతస్తస్యాం పూజిత స్త్వృషభః ప్రభుః ॥ 45 ॥**

ఇట్లు భద్రాయువును తల్లితో సహా చక్కగా ఊరడించాడు. వారిరువురి చేత పూజింపబడిన ఋషభముని స్వేచ్ఛానుసారియై వెళ్లినాడు.

**భద్రాయురపి రాజర్షిర్జిత్వా రిపుగణాన్విధే! ।**
**రాజ్యం చకార ధర్మేణ వివాహ్య కీర్తిమాలినీమ్ ॥ 46 ॥**

ఓ బ్రహ్మదేవా! భద్రాయువు శత్రుగణాలను జయించి 'కీర్తిమాలిని' ని వివాహమాడి ధార్మికంగా రాజ్యపాలన చేస్తాడు.

**ఇత్థం ప్రభావం ఋషభోఽవతారః శంకరస్య మే ।**
**సతాం గతిర్దీనబంధుర్నవమః కథితస్తవ ॥ 47 ॥**

శంకరుడనైన నా యొక్క ఋషభావతారం ఈ విధమైన మహిమలుగలది. సజ్జనులకు తరించుమార్గం. జనులకు బంధువు. ఈ తొమ్మిదవ అవతారంగురించి నీకు చెప్పబడింది. సద్గతిని, దీనులకు బంధువువలె హితాన్ని చేకూరుస్తుంది. ఆ వర్ణనను నేను నీకు వినిపించాను.

**ఋషభస్య చరిత్రం హి పరమం పావనం మహత్ ।**
**స్వర్గ్యం యశస్యమాయుష్యం శ్రోతవ్యం చ ప్రయత్నతః ॥ 48 ॥**

ఈ ఋషభుని చరిత్ర పరమపావనమై, మహత్తరమై, స్వర్గాన్ని, యశస్సును, ఆయుష్యాన్ని ప్రసాదిస్తుంది. కావున దీనిని ప్రయత్నపూర్వకంగానైనను వినాలి.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం ఋషభచరిత్రవర్ణనం నామ చతుర్థోఽధ్యాయః ॥ 4 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు ఋషభచరిత్రవర్ణనం అనే పేరుగల నాల్గవ అధ్యాయం సమాప్తం.

✡

## పంచమోఽధ్యాయః - ఐదవ అధ్యాయం

## ఏకోనవింశతి శివావతారవర్ణనమ్ - పంతొమ్మిది శివావతారములవర్ణనం

**శివ ఉవాచ** - శివుడు పలికాడు.

**దశమే ద్వాపరే వ్యాసస్త్రిధామా నామతో మునే! ।**
**హిమవచ్ఛిఖరే రమ్యే భృగుతుంగే నగోత్తమే ॥ 1 ॥**

బ్రహ్మదేవా! పదవ ద్వాపరయుగమునందు త్రిధాముడను పేరుగల ముని వ్యాసుడౌతాడు. ఆయన హిమాలయములందు రమణీయమైన శిఖరములతో కూడిన భృగుతుంగమను మహోన్నత పర్వతం మీద నివసిస్తాడు.

**తత్రాపి మమ పుత్రాశ్చ భృగ్వాద్యాః శ్రుతిసంమితాః ।**
**బలబంధుర్నరోమిత్రః కేతుశృంగస్తపోధనః ॥ 2 ॥**

అక్కడ కూడ వేదవిజ్ఞానముగల నా నలుగురు కుమారులుంటారు. వారు - భృగువు, బలబంధుడు, నరమిత్రుడు, తపోధనుడైన కేతుశృంగుడు అనువారు.

**ఏకాదశే ద్వాపరే తు వ్యాసశ్చ త్రివృతో యదా ।**
**గంగాద్వారే కలౌ నామ్నా తపోఽహం భవితా తదా ॥ 3 ॥**

పదకొండవ ద్వాపరమందు త్రివృతుడను వ్యాసుడుంటాడు. అప్పుడు నేను కలియుగంలో గంగాద్వారంలో "తపుడు" అను పేరుతో అవతరిస్తాను.

**లంబోదరశ్చ లంబాక్షః కేశలంబః ప్రలంబకః ।**
**తత్రాపి పుత్రాశ్చత్వారో భవిష్యంతి దృఢవ్రతాః ॥ 4 ॥**

అచట కూడ నాకు లంబోదరుడు, లంబాక్షుడు, కేశలంబడు, ప్రలంబకుడు అనెడి నలుగురు దృఢవ్రతులగు పుత్రులుంటారు.

**ద్వాదశే పరివర్తే తు శతతేజాశ్చ వేదకృత్ ।**
**తత్రాప్యహం భవిష్యామి ద్వాపరాంతే కలావిహ ॥ 5 ॥**

పన్నెండవ ద్వాపరమునందు 'శతతేజుడు' అను పేరుగల వ్యాసుడుంటాడు. అప్పుడు కూడ నేను ద్వాపరం సమాప్తమై కలియుగ ప్రారంభంలో అవతరిస్తాను.

**హేమకంచుకమాసాద్య నామ్నా హ్యత్రిః పరిప్లుతః ।**
**వ్యాసస్యైవ సహాయ్యార్థం నివృత్తిపథరోషణః ॥ 6 ॥**

హేమ కంచుకములో 'అత్రి' అను పేరుతో అవతరించి వ్యాసునికి సహకరించడానికై నివృత్తిమార్గాన్ని ప్రతిష్ఠిస్తాను.

**సర్వజ్ఞః సమబుద్ధిశ్చ సాధ్యః శర్వః సుయోగినః ।**
**తత్రేతి పుత్రాశ్చత్వారో భవిష్యంతి మహామునే! ॥ 7 ॥**

మహామునీ! అచ్చట కూడా నాకు సర్వజ్ఞుడు, సమబుద్ధి, సాధ్యుడు, శర్వుడు అను నామాలతో నలుగురు పుత్రులు ఉత్తమయోగులుంటారు.

**త్రయోదశే యుగే తస్మిన్ ధర్మో నారాయణః సదా ।**
**వ్యాసస్తదాహం భవితా బలిర్నామ మహామునిః ॥ 8 ॥**

పదమూడవ యుగంలో ధర్ముడైన నారాయణుడు వ్యాసుడుగా ఉంటాడు. అప్పుడు నేను మహాముని 'బలి' అను పేరుతో జన్మిస్తాను.

**వాలఖిల్యాశ్రమే గంధమాదనే పర్వతోత్తమే ।**
**సుధామా కాశ్యపశ్చైవ వసిష్ఠో విరజాః శుభాః ॥ 9 ॥**

నేను పర్వతశ్రేష్ఠమైన గంధమాదన పర్వతమునందలి వాలఖిల్యాశ్రమంలో జన్మిస్తాను. అక్కడ కూడ నాకు సుధాముడు, కశ్యపుడు, వసిష్ఠుడు, విరజుడను పేర్లతో శుభంకరులైన నలుగురు పుత్రులుంటారు.

**యదా వ్యాసస్తు రక్షాఖ్యః పర్యాయే తు చతుర్దశే ।**
**వంశ ఆంగిరసే తత్ర భవితాహం చ గౌతమః ॥ 10 ॥**

పదునాల్గవ చతుర్యుగద్వాపరమందు 'రక్షుడు' అను పేరుతో వ్యాసుడుంటాడు. ఆంగిరసవంశంలో గౌతముడను పేరుతో నేను అవతరిస్తాను.

**తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి కలౌ తదా ।**
**అత్రిర్వశదశ్చైవ శ్రవణోఽథ శ్రవిష్కటః ॥ 11 ॥**

అప్పటి కలియుగంలో కూడా అత్రి, వశదుడు, శ్రవణుడు, శ్రవిష్కటుడు అను పుత్రులు నాకు ఉంటారు.

**వ్యాసః పంచదశే త్రయ్యారుణిర్వై ద్వాపరే యదా ।**
**తదాహం భవితా వేదశిరా వేదశిరస్తథా ॥ 12 ॥**

పదిహేనవ ద్వాపరమందు 'త్రయ్యారుణి' అను పేరుతో వ్యాసుడుంటాడు. అప్పుడు నేను 'వేదశిరసుడు', 'వేదశిరుడను' పేరుతో అవతారాన్ని గ్రహిస్తాను.

**మహావీర్యం తదస్త్రం చ వేదశీర్షశ్చ పర్వతః ।**
**హిమవత్పృష్ఠమాసాద్య సరస్వత్యాస్తథోత్తరే ॥ 13 ॥**

అప్పుడు మహాపరాక్రమశాలియగు 'వేదశిరపర్వతమే' నా అస్త్రమౌతుంది. హిమలయ పృష్ఠభాగంలోని సరస్వతీ నదికి ఉత్తర తీరంలోని వేదశీర్షమనే పేరుగల పర్వతమే అప్పటి నా ఆశ్రమం.

**తత్రాపి మమ చత్వారో భవిష్యంతి సుతా దృఢాః ।**
**కుణిశ్చ కుణిబాహుశ్చ కుశరీరః కునేత్రకః ॥ 14 ॥**

అక్కడ కూడ నాకు కుణి, కుణిబాహువు, కుశరీరుడు, కునేత్రకుడు అను పేర్లు గల నలుగురు దృఢమైన పరాక్రమవంతులైన పుత్రులుంటారు.

**వ్యాసో యుగే షోడశే తు యదా దేవో భవిష్యతి ।**
**తదా యోగప్రదానాయ గోకర్ణో భవితాహ్యహమ్ ॥ 15 ॥**

పదహారవ ద్వాపరయుగంలో 'దేవ' అను పేరుగలవాడు వ్యాసుడై యుంటాడు. అప్పుడు నేను యోగాన్ని ప్రదానం చేయడానికి 'గోకర్ణుడు' అను పేరుతో ప్రకటితుడనౌతాను.

**తత్రైవ చ సుపుణ్యం చ గోకర్ణే నామ తద్వనమ్ ।**
**తత్రాపి యోగినః పుత్రా భవిష్యంత్యంబుసంమితాః ॥ 16 ॥**

పరమపుణ్యమయమైన గోకర్ణమను వనమునందే నా అవతారం ప్రకటితమౌతుంది. అక్కడ కూడ నీటి వలె నిర్మలురు, యోగులునైన పుత్రులుంటారు.

**కాశ్యపోఽప్యుశనాశ్చైవ చ్యవనోఽథ బృహస్పతిః ।**
**తేఽపి తేనైవ మార్గేణ గమిష్యంతి శివాలయమ్ ॥ 17 ॥**

కాశ్యపుడు, ఉశనుడు, చ్యవనుడు, బృహస్పతి అను పేర్లతో నలుగురు పుత్రులుంటారు. వారు ఆ మార్గంలోనే పయనిస్తూ శివలోకాన్ని పొందుతారు.

**పరివర్తే సప్తదశే వ్యాసో దేవకృతంజయః ।**
**గుహావాసీతి నామ్నాహం హిమవచ్ఛిఖరే శుభే ॥ 18 ॥**

పదునేడవ ద్వాపరమునందు 'దేవకృతంజయుడు' అను పేరుతో వ్యాసుడుంటాడు. అప్పుడు నేను హిమాలయములందు 'గుహావాసి' అను పేరుతో అవతారాన్ని ధరిస్తాను.

**మహాలయే మహోత్తుంగే శివక్షేత్రం హిమాలయమ్ ।**
**ఉతథ్యో వామదేవశ్చ మహాయోగో మహాబలః ॥ 19 ॥**

హిమాలయములందు మహోత్తుంగమైనట్టియు, రమణీయమైనట్టియు మహాలయపర్వతమునందు నా అవతారం ప్రకటితమౌతుంది. ఈ హిమాలయం శివక్షేత్రమని పిలువబడుతుంది. ఉతథ్యుడు, వామదేవుడు, మహాయోగుడు, మహాబలుడు అనుపేర్లతో నా కుమారులుంటారు.

**పరివర్తేఽష్టాదశే తు యదా వ్యాస ఋతంజయః ।**
**శిఖండీ నామతోఽహం తద్ధిమవచ్ఛిఖరే శుభే ॥ 20 ॥**

పదునెనిమిదవ ద్వాపరమందు 'ఋతంజయుడు' వ్యాసుడౌతాడు. శుభప్రదమైన హిమవచ్ఛిఖరంపై నేను 'శిఖండి' అను పేరుతో ప్రకటితుడనౌతాను.

**సిద్ధక్షేత్రే మహాపుణ్యే శిఖండీ నామ పర్వతః ।**
**శిఖండినో వనం వాపి యత్ర సిద్ధనిషేవితమ్ ॥ 21 ॥**

హిమాలయములందు శిఖండి యను చక్కని పర్వత శిఖరం కలదు. అది మహత్తరమైన, పుణ్యమయమైన సిద్ధక్షేత్రము.అది సిద్ధులచే సేవింపబడు వనం. నా అవతారం అక్కడ ప్రకటితమౌతుంది.

**వాచశ్రవా రుచీకశ్చ స్యావాస్యశ్చ యతీశ్వరః ।**
**ఏతే పుత్రా భవిష్యంతి తత్రాపి చ తపోధనాః ॥ 22 ॥**

వాచశ్రవుడు, రుచీకుడు, స్యావాస్యుడు, యతీశ్వరుడు అను నలుగురు పుత్రులుంటారు. వీరందరు తపోధనులు.

**ఏకోనవింశే వ్యాసస్తు భరద్వాజో మహామునిః ।**
**తదాప్యహం భవిష్యామి జటీ మాలీ చ నామతః ॥ 23 ॥**

పంతొమ్మిదవ ద్వాపరంలో వ్యాసమహాముని 'భరద్వాజుడు' అవుతాడు. అప్పుడు కూడా నేను 'జటి, మాలి' అను పేర్లతో అవతరిస్తాను.

**హిమవచ్ఛిఖరే తత్ర పుత్రా మేంఽబుధిసంహితాః ।**
**హిరణ్యనామా కౌశల్యో లోకాక్షీ ప్రధిమిస్తథా ॥ 24 ॥**

నా అవతారం హిమవచ్ఛిఖరంనందు ప్రకటితమౌతుంది. అచ్చట కూడా సాగరం వలె గంభీరులైన నలుగురు పుత్రులుంటారు. వారు హిరణ్యుడు, కౌశల్యుడు, లోకాక్షి, ప్రధిమి అనుపేర్లు కలిగియుంటారు.

**పరివర్తే వింశతితమే భవితా వ్యాస గౌతమః ।**
**తత్రాట్టహాసనామాహమట్టహాసప్రియా నరాః ॥ 25 ॥**

ఇరువదవ ద్వాపరమందు 'గౌతముడు' అను పేరుగలవాడు వ్యాసుడౌతాడు. అప్పుడు నేను 'అట్టహాసుడు' అను పేరుతో అవతరిస్తాను. ఆ యుగమునందలి మానవులందరు అట్టహాసునియందు మిగుల ప్రీతితో నుంటారు.

**తత్రైవ హిమవత్పృష్ఠే అట్టహాసో మహాగిరిః ।**
**దేవమానుషయక్షేంద్రసిద్ధచారణసేవితః ॥ 26 ॥**

హిమవత్పర్వత పృష్ఠభాగంలో అట్టహాసమహాపర్వతం. అది దేవతలచేత, మనుష్యుల చేత, యక్షులచేత, సిద్ధులచేత, చారణుల చేత సేవింపబడుతూ ఉంటుంది.

**తత్రాపి మమ తేపుత్రా భవిష్యంతి సుయోగినః ।**
**సుమంతుర్బర్బరిర్విద్వాన్ కబంధః కుశికంధరః ॥ 27 ॥**

అప్పుడు కూడ నాకు మహాయోగులైన నలుగురు కుమారులుంటారు. సుమంతుడు, బర్బరి, కబంధుడు, కుశికంధరుడను పేర్లతో వారు పిలువబడతారు.

**ఏకవింశే యుగే తస్మిన్ వ్యాసో వాచఃశ్రవా యదా ।**
**తదాహం దారుకో నామ తస్మాద్దారువనం శుభమ్ ॥ 28 ॥**

ఇరవై యొకటవ ద్వాపరయుగమందు 'వాచశ్ర్శవుడు' అను పేరుతో వ్యాసుడుంటాడు. అప్పుడు నేను 'దారుకుడు' అను పేరుతో ప్రకటితమౌతాను. కాబట్టి ఆ శుభ స్థానం 'దారువనం' అను పేరుతో వ్యవహరింపబడుతుంది.

**తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి సుయోగినః ।**
**ప్లక్షో దార్భాయణిశ్చైవ కేతుమాన్ గౌతమస్తథా ॥ 29 ॥**

అక్కడ కూడా నాకు యోగీశ్వరులైన పుత్రులుంటారు. ప్లక్షుడు, దార్భాయణి, కేతుమంతుడు, గౌతముడు అను పేర్లతో వారు వ్యవహరింపబడతారు.

**ద్వావింశే పరివర్తే తు వ్యాసః శుష్మాయణో యదా ।**
**తదాప్యహం భవిష్యామి వారాణస్యాం మహామునిః ॥ 30 ॥**

ఇరవై రెండవ ద్వాపరయుగంలో 'శుష్మాయణుడు' అను పేరుతో వ్యాసుడుంటాడు. అప్పుడు కూడ నేను వారాణసీ నగరంలో మహామునిగా అవతరిస్తాను.

**నామ్నా వై లాంగలీ భీమో యత్ర దేవాః సవాసవాః ।**
**ద్రక్ష్యంతి మా కలౌ తస్మిన్నవం చైవ హలాయుధమ్ ॥ 31 ॥**

అప్పటి నా అవతారం పేరు 'లాంగలీభీముడు' ఆ కలియుగంలో హలాయుధధారినగు నన్ను (శివుని) ఇంద్రునితో కూడి దేవతలు, వసువులు దర్శిస్తారు.

**తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి సుధార్మికాః ।**
**భల్లవీమధుపింగాశ్చ శ్వేతకేతుస్తథైవ చ ॥ 32 ॥**

అక్కడ కూడా నాకు పరమధార్మికులైన పుత్రులుంటారు. వారు భల్లవి, మధు, పింగుడు, శ్వేతకేతువు అను పేర్లు గలవారు.

**పరివర్తే త్రయోవింశే తృణబిందుర్యదా మునిః ।**
**శ్వేతో నామ తదాహం వై గిరౌ కాలంజరే శుభే ॥ 33 ॥**

ఇరవై మూడవ యుగంలో 'తృణబిందుడు' అను ముని వ్యాసుడౌతాడు. అప్పుడు నేను సుందరమైన 'కాలంజర' గిరిపై 'శ్వేతుడు' అను నామంతో ఆవిర్భవిస్తాను.

**తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి తపస్వినః ।**
**ఉశికో బృహదశ్వశ్చ దేవలః కవిరేవ చ ॥ 34 ॥**

అక్కడ కూడ నాకు తపస్సంపన్నులైన పుత్రులుంటారు. ఉశికుడు, బృహదశ్వుడు, దేవళుడు, కవి అను పేర్లతో వారు పిలువబడతారు.

**పరివర్తే చతుర్వింశే వ్యాసో యక్షో యదా విభుః ।**
**శూలీ నామ మహాయోగీ తద్యుగే నైమిషే తదా ॥ 35 ॥**

ఇరవై నాలుగవ చతుర్యుగమునందు ఐశ్వర్యశాలియైన 'యక్షుడు' వ్యాసుడౌతాడు. అదే యుగంలో నేను నైమిషక్షేత్రంలో 'శూలి' అను పేరుతో మహాయోగినై అవతరిస్తాను.

**తత్రాపి మమ తే శిష్యా భవిష్యంతి తపస్వినః ।**
**శాలిహోత్రోఽగ్నివేశశ్చ యువనాశ్వః శరద్వసుః ॥ 36 ॥**

అక్కడ కూడ తపస్వులైన నలుగురు శిష్యులుంటారు. వారు శాలిహోత్రుడు, అగ్నివేశుడు, యువనాశ్వుడు, శరద్వసుడు అను పేర్లు కలిగి యుంటారు.

**పంచవింశే యదా వ్యాసః శక్తిర్నామ్నా భవిష్యతి ।**
**తదాప్యహం మహాయోగీ దండీ ముండీశ్వరః ప్రభుః ॥ 37 ॥**

ఇరవై యైదవ ద్వాపరమందు వ్యాసుడు 'శక్తి' నామంతో ప్రసిద్ధుడౌతాడు. అప్పుడు నేను ప్రభావశాలియు, దండధారియు, మహాయోగియునై 'ముండీశ్వరుడు' అను పేరుతో ప్రకటితమౌతాను.

**తత్రాపి మమ తే శిష్యా భవిష్యంతి తపస్వినః ।**
**ఛగలః కుండకర్ణశ్చ కుంభాండశ్చ ప్రవాహకః ॥ 38 ॥**

అక్కడ కూడ తపస్సంపన్నులైన నలుగురు శిష్యులుంటారు. ఛగలుడు, కుండకర్ణుడు, కుంభాండుడు, ప్రవాహకుడు అను పేర్లతో వారు పిలువబడతారు.

**వ్యాసః పరాశరో యర్హి షడ్వింశే భవితాప్యహమ్ ।**
**పురం భద్రవటం ప్రాప్య సహిష్ణుర్నామ నామతః ॥ 39 ॥**

ఇరవై యారవ ద్వాపరంలో వ్యాసుని పేరు 'పరాశరుడు'. అప్పుడు నేను భద్రవటువను పేరుగల నగరంలో 'సహిష్ణుడు' అను పేరుతో అవతరిస్తాను.

**తత్రాపి మమ తే శిష్యా భవిష్యంతి తపస్వినః ।**
**ఉలూకో విద్యుతశ్చైవ శంబూకో హ్యాశ్వలాయనః ॥ 40 ॥**

అక్కడ కూడ నాకు తపస్వులైన నలుగురు శిష్యులుంటారు. ఉలూకుడు, విద్యుతుడు, శంబూకుడు, ఆశ్వలాయనుడు అను పేర్లతో వారు పిలువబడతారు.

**సప్తవింశే యదా వ్యాసో జాతూకర్ణ్యో భవిష్యతి ।**
**ప్రభాసతీర్థమాశ్రిత్య సోమశర్మా తదాప్యహమ్ ॥ 41 ॥**

ఇరవైయేడవ ద్వాపరమందు 'జాతూకర్ణ్య' డను వ్యాసుడుంటాడు. నేను ప్రభాసతీర్థంలో 'సోమశర్మ' పేరుతో ప్రకటితుడనౌతాను.

**తత్రాపి మమ తే శిష్యా భవిష్యంతి తపస్వినః ।**
**అక్షపాదః కుమారశ్చోలూకో వత్సస్తథైవ చ ॥ 42 ॥**

అక్కడ కూడ నాకు తపస్సంపన్నులైన నలుగురు శిష్యులుంటారు. అక్షపాదుడు, కుమారుడు, ఉలూకుడు, వత్సుడు అనునవి వారి పేర్లు.

**అష్టావింశే ద్వాపరే తు పరాశరసుతో హరిః ।**
**యదా వ్యాసో భవిష్యామి నామ్నా ద్వైపాయనః ప్రభుః ॥ 43 ॥**

ఇరవై యెనిమిదవ ద్వాపరమందు శ్రీహరి పరాశరుని పుత్రుడై ద్వైపాయనుడు అను పేరుగల వ్యాసుడుంటాడు.

**తదా షష్ఠేన చాంశేన కృష్ణః పురుషసత్తమః ।**
**వసుదేవసుతః శ్రేష్ఠో వాసుదేవో భవిష్యతి ॥ 44 ॥**

అప్పుడు పురుషోత్తముడైన శ్రీకృష్ణుడు తన ఆరవ అంశతో వసుదేవుని పుత్రశ్రేష్ఠునిగా ఉత్పన్నుడై 'వాసుదేవుడు' అని పిలువబడతాడు.

**తదాప్యహం భవిష్యామి యోగాత్మా యోగమాయయా ।**
**లోకవిస్మాపనార్థాయ బ్రహ్మచారిశరీరకః ॥ 45 ॥**

అదే సమయంలో నేను యోగాత్ముడనై కూడ, లోకములకు ఆశ్చర్యమును కలిగించు యోగమాయ ప్రభావం చేత 'బ్రహ్మచారి' శరీరాన్ని ధరించి అవతరిస్తాను.

**స్మశానే మృతముత్సృజ్య దృష్ట్వా కాయమనామయమ్ ।**
**బ్రాహ్మణానాం హితార్థాయ ప్రవిష్టో యోగమాయయా ॥ 46 ॥**

స్మశానభూమియందు మరణించిపడియున్న అవిచ్ఛిన్న (చెదరని) శరీరాన్ని జూచి, బ్రాహ్మణుల హితమును కోరి యోగమాయనాశ్రయించి నేను అందులో ప్రవేశిస్తాను.

**దివ్యాం మేరుగుహాం పుణ్యాం త్వయా సార్ధం చ విష్ణునా ।**
**భవిష్యామి తదా బ్రహ్మన్! లకులీ నామ నామతః ॥ 47 ॥**

ఓ బ్రహ్మదేవా! నీతోను, విష్ణువు తోను కలిసి పుణ్యమయమగు మేరుగిరి దివ్యగుహయందు ప్రవేశిస్తాను. అప్పుడు నా పేరు 'లకులి'

**కాయావతార ఇత్యేవం సిద్ధక్షేత్రం పరం తదా ।**
**భవిష్యతి సువిఖ్యాతం యావద్భూమిర్ధరిష్యతి ॥ 48 ॥**

ఇట్లు నా శరీరావతారం, పరమసిద్ధక్షేత్రమని పిలువబడుతుంది. ఇది యీ భూమి యున్నంతకాలము ఈ లోకంలో మిక్కిలి విఖ్యాతమౌతుంది.

**తత్రాపి మమ తే శిష్యా భవిష్యంతి తపస్వినః ।**
**కుశికశ్చైవ గర్గశ్చ మిత్రః కౌరుష్య ఏవ చ ॥ 49 ॥**

అక్కడ కూడా నాకు తపస్వులైన నలుగురు శిష్యులుంటారు. వారి పేర్లు కుశికుడు, గర్గుడు, మిత్రుడు, కౌరుష్యుడు.

**యోగినో బ్రాహ్మణా వేదపారగా ఊర్ధ్వరేతసః ।**
**ప్రాప్య మాహేశ్వరం యోగం గమిష్యంతి శివం పురమ్ ॥ 50 ॥**

వీరు యోగులు, బ్రాహ్మణులు, వేదపారగులు, ఊర్ధ్వరేతస్కులునై మాహేశ్వరయోగాన్ని పొంది శివలోకాన్ని చేరుకుంటారు.

**వైవస్వతేఽన్తరే సమ్యక్ ప్రోక్తా హి పరమాత్మనా ।**
**యోగేశ్వరావతారాశ్చ సర్వావర్తేషు సువ్రతాః! ॥ 51 ॥**

ఉత్తమ వ్రతమును పాలించు మునులారా! ఇట్లు పరమాత్ముడగు శివుడు వైవస్వతమన్వంతరమునందలి సకల చతుర్యుగములందలి యోగేశ్వరావతారములను సమగ్రంగా వర్ణించాడు.

**వ్యాసాశ్చైవాష్టవింశత్యా ద్వాపరే ద్వాపరే విభో! ।**
**యోగేశ్వరావతారశ్చ ప్రారంభే చ కలౌ కలౌ ॥ 52 ॥**

ప్రభూ! ఇరువది యెనిమిది మంది వ్యాసులు క్రమంగా, ఒక్కొక్కరు ఒక్కొక్క ద్వాపరమందునూ ఉంటారు. యోగేశ్వరావతారం ప్రతియొక కలియుగారంభంలోను సంభవిస్తుంది.

**యోగేశ్వరావతారాణాం యోగమార్గప్రవర్ధకాః ।**
**మహాశైవాశ్చ చత్వారః శిష్యాః ప్రత్యేకమవ్యయా ॥ 53 ॥**

ప్రతియొక యోగేశ్వరావతారమునందును ఆ స్వామికి నలుగురు శిష్యులునూ ఉంటారు. వారు గొప్ప శివభక్తులై యోగమార్గాన్ని వృద్ధి పొందిస్తూ ఉంటారు.

**ఏతే పాశుపతాః శిష్యా భస్మోద్ధూళితవిగ్రహాః ।**
**రుద్రాక్షమాలాభరణాస్త్రిపుండ్రాంకితమస్తకాః ॥ 54 ॥**

ఈ పశుపతిశిష్యులు భస్మోద్ధూళిత విగ్రహులై రుద్రాక్షమాలాభరణులై, లలాటములందు త్రిపుండ్రాంకితులై సుశోభితులై యుంటారు.

**శిష్యా ధర్మరతాః సర్వే వేదవేదాంగపారగాః ।**
**లింగార్చనరతా నిత్యం బాహ్యాభ్యంతరతః స్థితాః ॥ 55 ॥**

ఈ శిష్యులందరును ధర్మపరాయణులు, వేదవేదాంగపారగులు. బాహ్యాభ్యంతరములలో సదా లింగార్చనాతత్పరులై యుంటారు.

**భక్త్యా మయి చ యోగేన ధ్యాననిష్ఠా జితేంద్రియాః ।**
**సంఖ్యయా ద్వాదశాధిక్యశతం చ గణితా బుధైః ॥ 56 ॥**

వీరు నాయందు(శివుని యందు) భక్తి కలిగి, యోగపూర్వకంగా ధ్యాననిష్ఠాపరులై, జితేంద్రియులై యుంటారు. వీరి సంఖ్య నూటపండ్రెండు అని పండితులు చెబుతారు.

**ఇత్యేతద్వై మయా ప్రోక్తమవతారేషు లక్షణమ్ ।**
**మన్వాదికృష్ణపర్యంతమష్టావింశద్యుగక్రమాత్ ॥ 57 ॥**

ఇట్లు నేను ఇరవైయెనిమిది యుగములలో క్రమంగా మనువునుండి కృష్ణావతారపర్యంతము గల సకల అవతారముల లక్షణాలను వర్ణించి చెప్పాను

**తత్ర శ్రుతిసమూహానాం విధానం బ్రహ్మలక్షణమ్ ।**
**భవిష్యతి తదా కల్పే కృష్ణద్వైపాయనో యదా ॥ 58 ॥**

శ్రుతిసమూహాలు, వేదాంతపరంగా ప్రయోగింపబడునప్పుడు ఆకల్పమునందు కృష్ణద్వైపాయన వ్యాసుడుంటాడు.

**ఇత్యేవముక్త్వా బ్రహ్మాణమనుగృహ్య మహేశ్వరః ।**
**పునః సంప్రేక్ష్య దేవేశస్తత్రైవాంతరధీయత ॥ 59 ॥**

ఈ విధంగా మహేశ్వరుడు బ్రహ్మయందు దయగలవాడై యోగేశ్వరావతారములను వర్ణించి తెలిపాడు. అనంతరం ఆ దేవేశ్వరుడు వారివైపు దృష్టిని ప్రసరింపజేయుచూ అచ్చటనే అంతర్ధానుడయ్యాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం శివావతారోపాఖ్యానే ఏకోనవింశతి శివావతారవర్ణనం నామ పంచమోఽధ్యాయః ॥ 5 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు శివావతారోపాఖ్యానములో పంతొమ్మిది శివావతారములవర్ణనం అనే పేరుగల ఐదవ అధ్యాయం సమాప్తం.

## **షష్ఠోఽధ్యాయః** - ఆరవ అధ్యాయం

## **నందికేశావతారవర్ణనమ్** - నందికేశావతారవర్ణనం

**అథ నందీశ్వరావతారమాహ** - నందీశ్వరావతారమును చెప్పుతున్నాడు.

ఇప్పటి వరకు నలుబది రెండవతారములు వర్ణింపబడ్డాయి. ఇప్పుడు నందీశ్వరావతారం వర్ణింపబడుచున్నది.

**సనత్కుమార ఉవాచ** - సనత్కుమారుడు అడిగాడు.

**భవాన్ కథమనుప్రాప్తో మహాదేవాంశజఃశివమ్ ।**
**శ్రోతుమిచ్ఛామి తత్సర్వం వక్తుమర్హసి మే ప్రభో! ॥ 1 ॥**

ప్రభూ! నీవు మహాదేవుని అంశతో ఉత్పన్నుడవై తదుపరి శివుని ఎట్లు పొందితివి? ఆ వృత్తాంతమునంతటిని నేను వినగోరుచున్నాను. దానిని వర్ణించి నన్ననుగ్రహింపుడు.

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**సనత్కుమార! సర్వజ్ఞ! సావధానతయా శృణు ।**
**యథాహం చ శివం ప్రాప్తో మహాదేవాంశజో మునే! ॥ 2 ॥**

సర్వజ్ఞుడవగు సనత్కుమారా! మహాదేవుని అంశతో జన్మించి శివుని పొందిన విధమును వినిపిస్తాను. నీవు సావధానచిత్తుడవై వినుము.

**ప్రజాకామః శిలాదోఽభూదుక్తః పితృభిరాదరాత్ ।**
**తదుద్ధర్తుమనా భక్త్యా సముద్ధారమభీప్సుభిః ॥ 3 ॥**

శిలాదుడను ధర్మాత్ముడైన ఒక ముని యుండెను. తమ యొక్క ఉద్ధారమును కోరిన పితృదేవతలు ఆదరముతో శిలాదుని ప్రార్థించగా అతడు వారియందలి భక్తిచే వారినుద్ధరించగోరెను.

**అథోదృష్టిః సుధర్మాత్మా శిలాదో నామ వీర్యవాన్ ।**
**తస్యాసీన్మునికైర్వృత్తిః శివలోకే చ సోఽగమత్ ॥ 4 ॥**

అంతట ధర్మాత్ముడు, వీర్యవంతుడు నైన ఆ శిలాదుడు మునివృత్తినవలంబించి శివలోకానికి కూడ వెళ్ళాడు.

**శక్రముద్దిశ్య స మునిస్తపస్తేపే సుదుఃస్సహమ్ ।**
**నిశ్చలాత్మా శిలాదాఖ్యో బహుకాలం దృఢవ్రతః ॥ 5 ॥**

నిశ్చలాత్ముడైన ఆ శిలాదుడను ముని దృఢవ్రతుడై ఇంద్రుని గూర్చి మిక్కిలి దుస్సహమైన తపస్సు నాచరించాడు.

**తపతస్తస్య తపసా సంతుష్టోఽభూచ్ఛతక్రతుః ।**
**జగామ చ వరం దాతుం సర్వదేవప్రభుస్తదా ॥ 6 ॥**

అతని తపస్సునకు దేవతలకధిపతియగు ఇంద్రుడు సంతుష్టుడై శిలాదునకు వరమిచ్చుటకప్పుడు వెళ్ళాడు.

**శిలాదమాహ సుప్రీత్యా శక్రస్తుష్టోఽస్మి తేఽనఘ ।**
**తేన త్వం మునిశార్దూల! వరయస్వ వరానితి ॥ 7 ॥**

మిక్కిలి ప్రసన్నుడైన ఇంద్రుడు శిలాదునితో ఇలా పలికాడు. "ఓ మునిశార్దూలా! పాపరహితుడా! నీ తపస్సునకు సంతుష్టుడనయ్యాను. నీకభీష్టమైన వరమును కోరుకొమ్ము"

**తతః ప్రణమ్య దేవేశం స్తుత్వా స్తుతిభిరాదరాత్ ।**
**శిలాదో మునిశార్దూలస్తమాహ సుకృతాంజలిః ॥ 8 ॥**

అంతట శిలాదుడు దేవేశుడైన ఇంద్రునికి నమస్కరించి మిక్కిలి ఆదరముతో స్తుతించి దోసిలొగ్గి అతనితో ఇలా పలికాడు.

**శిలాద ఉవాచ** – శిలాదుడు పలికాడు.

**శతక్రతో! సురేశాన! సంతుష్టో యది మే ప్రభో! ।**
**అయోనిజం మృత్యుహీనం పుత్రమిచ్ఛామి సువ్రతమ్ ॥ 9 ॥**

"ఓ సురేశా! శతక్రతూ! ప్రభూ! నీవు సంతుష్టుడవైనచో నాకు అయోనిజుడు, మృత్యువు లేనివాడు, సువ్రతుడునైన పుత్రుని వరముగా ప్రసాదించుము"

**శక్ర ఉవాచ** – ఇంద్రుడు పలికాడు.

**పుత్రం దాస్యామి పుత్రార్థిన్యోనిజం మృత్యుసంయుతమ్ ।**
**అన్యథా తే న దాస్యామి మృత్యుహీనా న సంతి వై ॥ 10 ॥**

ఓపుత్రార్థీ! యోనిజుడు, మృత్యుసంయుతుడునైన పుత్రుని పుత్రార్థులకు ఇవ్వగలను. అట్లు కానిచో నేనీయలేను. మృత్యుహీనుడెవ్వడునుండడు.

**న దాస్యామి సుతం తేఽహం మృత్యుహీనమయోనిజమ్ ।**
**హరిర్విధిశ్చ భగవాన్కిముతాన్యే మహామునే! ॥ 11 ॥**

ఓ మహామునీ! నేను నీకు అయోనిజుడు, మృత్యుహీనుడునైన పుత్రుని ప్రసాదించలేను. హరి బ్రహ్మాదులకే అది సాధ్యం కాదు. తక్కిన వారి విషయంలో చెప్పవలసినదేమి?

**తావపి త్రిపురార్యంగసంభవౌ మరణాన్వితౌ ।**
**తయోరప్యాయుషాం మానం కథితం నిగమే పృథక్ ॥ 12 ॥**

శ్రీహరి మరియు బ్రహ్మ కూడ త్రిపురారి శరీరమునుండి సంభవించినవారే. వారు కూడ మరణాన్వితులే. వారి ఆయుః ప్రమాణము వేదములో ప్రత్యేకంగా చెప్పబడింది.

**తస్మాదయోనిజే పుత్రే మృత్యుహీనే ప్రయత్నతః ।**
**పరిత్యజాశాం విప్రేంద్ర! గృహాణాత్మక్షమం సుతమ్ ॥ 13 ॥**

ఓ విప్రేంద్రా! కావున అయోనిజుడు, మృత్యుహీనుడునైన పుత్రునికై నీ ప్రయత్నాన్ని విడిచిపెట్టు. నీకు తగిన పుత్రుని కోరుకొమ్ము.

**కింతు దేవేశ్వరో రుద్రః ప్రసీదతి మహేశ్వరః ।**
**సుదుర్లభో మృత్యుహీనస్తవ పుత్రో హ్యయోనిజః ॥ 14 ॥**

కాని మహేశ్వరుడు ప్రసన్నుడైనచో సుదుర్లభమైనట్టి మృత్యుహీనుడు, అయోనిజుడునైన పుత్రుని నీకు ప్రసాదించగలడు.

**అహం చ విష్ణుర్భగవాన్ ద్రుహిణశ్చ మహామునే! ।**
**అయోనిజం మృత్యుహీనం పుత్రం దాతుం న శక్నుమః ॥ 15 ॥**

నేనుగాని, విష్ణువుగాని, బ్రహ్మగాని అయోనిజుడు, మృత్యుహీనుడునైన పుత్రుని ప్రసాదించుటకు శక్తులము కాము.

**ఆరాధయ మహాదేవం తత్పుత్రవినికామ్యయా ।**
**సర్వేశ్వరో మహాశక్తః స తే పుత్రం ప్రదాస్యతి ॥ 16 ॥**

నీవు అటువంటి పుత్రుని కోరుచూ మహాదేవుని ఆరాధించు. మహాశక్తి సంపన్నుడు, సర్వేశ్వరుడునైన మహాదేవుడు నీకు అటువంటి పుత్రుని ప్రసాదిస్తాడు.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఏవం వ్యాహృత్య విప్రేంద్రమనుగృహ్య చ తం ఘృణీ ।**
**దేవైర్వృతః సురేశానస్స్వలోకం సమగాన్మునే ॥ 17 ॥**

ఓ మునీశ్వరా! ఇట్లు విప్రేంద్రుడైన శిలాదుని అనుగ్రహించి దేవతలతో గూడి సురేశుడైన ఇంద్రుడు తన లోకానికి వెళ్ళాడు.

**గతే తస్మింశ్చ వరదే సహస్రాక్షే శిలాశనః ।**
**ఆరాధయన్మహాదేవం తపసాఽతోషయద్భవమ్ ॥ 18 ॥**

వరదుడైన సహస్రాక్షుడు వెళ్లగానే శిలాదుడు మహాదేవుని ఆరాధించి తపస్సుతో సంతృప్తి పరచాడు.

**అథ తస్యైవమనిశన్తత్పరస్య ద్విజస్య వై ।**
**దివ్యం వర్షసహస్రం తు గతం క్షణమివాద్భుతమ్ ॥ 19 ॥**

అంతట ద్విజోత్తముడైన శిలాదుడు సదా మహేశ్వరధ్యానతత్పరుడు కాగా, వేయి దివ్యసంత్సరాలు, ఆశ్చర్యకరంగా క్షణము గడిచిన విధంగా గడిచాయి.

**వల్మీకేన వృతాంగశ్చ లక్షకీటగణైర్మునిః ।**
**వజ్రసూచీముఖైశ్చాన్యై రక్తభుగ్భిశ్చ సర్వతః ॥ 20 ॥**

ఆ మహర్షియొక్క దేహము చుట్టూ పుట్టలు పెరిగాయి. వజ్రమువలె పదునైన నోళ్లు గలిగి రక్తమును త్రాగే వివిధరకాల కీటకములు లక్షల సంఖ్యలో అతని దేహమంతటా వ్యాపించాయి.

**నిర్మాంసరుధిరత్వ గ్త్వె బిలే తస్మిన్నవస్థితః ।**
**అస్థిశేషోఽభవత్పశ్చాచ్ఛిలాదో మునిసత్తమః ॥ 21 ॥**

అతడు ఆ పుట్టలలో మాంసమును, రక్తమును, చర్మమును కూడ కోల్పోయి, తపము నాచరించుచున్నాడు. ఆ మహర్షియొక్క అస్థిపంజరము మాత్రమే మిగిలియున్నది.

**తుష్టః ప్రభుస్తదా తస్మై దర్శయామాస స్వాం తనుమ్ ।**
**దివ్యాం దివ్యగుణైర్యుక్తామలభ్యాం వామబుద్ధిభిః ॥ 22 ॥**

అపుడు శివుడు సంతసించి, అతనికి దివ్యమైనదియు, దివ్యమగు గుణములతో కూడి యున్నదియు, దుర్బుద్ధిగలవారికి లభింప శక్యము కానిదియునగు తన స్వరూపాన్ని చూపించాడు.

**దివ్యవర్షసహస్రేణ తప్యమానాయ శూలధృక్ ।**
**సర్వదేవాధిపస్తస్మై వరదోఽస్మీత్యభాషత ॥ 23 ॥**

శూలధారి, సర్వదేవాదిదేవుడునైన శివుడు వేయి దివ్యసంవత్సరములనుండి తపస్సు చేయుచున్న అతనితో వరమునిచ్చెదనని పలికెను.

**మహాసమాధిసంలీనస్సః శిలాదో మహామునిః ।**
**నాశృణోత్తద్గిరం శంభోర్భక్త్యధీనరతస్య వై ॥ 24 ॥**

భక్తులకత్యంతవశుడై యుండే శంభుని ఆ మాటను మహాసమాధిలో లీనమైయున్న శిలాదుడు వినలేదు.

**యదా స్పృష్టో మునిస్తేన కరేణ త్రిపురారిణా ।**
**తదైవ మునిశార్దూల ఉత్ససర్జ తపఃక్రమమ్ ॥ 25 ॥**

త్రిపురారియైన మహేశ్వరుడు తన హస్తముతో శిలాదమునిని ఎప్పుడు స్పృశించాడో, ఆ క్షణంలోనే తన తపోవిధిని శిలాదుడు విసర్జించాడు.

**అథోన్మీల్య మునిర్నేత్రే సోమం శంభుం విలోకయన్ ।**
**ద్రుతం ప్రణమ్య స ముదా పాదయోర్న్యపతన్మునే! ॥ 26 ॥**

ఓ మునీశ్వరా! అంతట శిలాదముని కళ్ళు తెరచి ఉమాదేవితో కూడిన శంభుని దర్శించి మిక్కిలి ఆనందంతో నమస్కరించి శంభుని పాదాలపై పడ్డాడు.

**హర్షగద్గదయా వాచా నతస్కంధః కృతాంజలిః ।**
**ప్రసన్నాత్మా శిలాదస్స తుష్టావ పరమేశ్వరమ్ ॥ 27 ॥**

శిలాదుడు ప్రసన్నాత్ముడై, అంజలించి, శిరసు వంచి, సంతోషంతో గద్గదమైన వాక్కుతో పరమేశ్వరుని స్తుతించాడు.

**తతః ప్రసన్నో భగవాన్దేవ దేవస్త్రిలోచనః ।**
**esÁÃఽ స్మీతి తం ప్రాహ శిలాదం మునిపుంగవమ్ ॥ 28 ॥**

అంతటు భగవానుడు, దేవదేవుడు, త్రిలోచనుడనైన శంభుడు ప్రసన్నుడై ‘ వరములనిచ్చుటకు వచ్చితిని’ అని శిలాదమునివర్యునకు తెలిపాడు.

**తపసాఽనేన కిం కార్యం భవతో హి మహామతే! ।**
**దదామి పుత్రం సర్వజ్ఞం సర్వశాస్త్రార్థపారగమ్ ॥ 29 ॥**

ఓ మహామతీ! ఈ తపస్సుతో పనియేమి? నీకేమి కావలయును? సర్వజ్ఞుడు, సర్వశాస్త్రార్థపారగుడైన పుత్రుని నీకు ప్రసాదించుచున్నాను.

**తతః ప్రణమ్య దేవేశం తచ్ఛ్రుత్వా చ శిలాశనః ।**
**హర్షగద్గదయా వాచోవాచ సోమవిభూషణమ్ ॥ 30 ॥**

ఆ మాటలను విని శిలాదుడు దేవేశుడైన శివునకు నమస్కరించి హర్షగద్గదవాక్కులతో చంద్రశేఖరునితో ఇలా పలికాడు.

**శిలాద ఉవాచ –** శిలాదుడు పలికాడు.

**మహేశ! యది తుష్టోఽసి యది వా వరదశ్చ మే ।**
**ఇచ్ఛామి త్వత్సమం పుత్రం మృత్యుహీనమయోనిజమ్ ॥ 31 ॥**

ఓ మహేశ్వరా! నీవు సంతుష్టుడవైనచో లేదా నీవు నాకు వరము నీయదలంచినచో మృత్యుహీనుడు, అయోనిజుడు, నీతో సమానమైన పుత్రుని కోరదలచితిని.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఏవముక్తస్తతో దేవస్త్ర్యంబకస్తేన శంకరః ।**
**ప్రత్యువాచ ప్రసన్నాత్మా శిలాదం మునిసత్తమమ్ ॥ 32 ॥**

శిలాదుడిట్లు పలుకగానే, త్ర్యంబకుడైన శంకరుడు ప్రసన్నాత్ముడై మునిసత్తముడైన శిలాదమహర్షికి ఇలా బదులిచ్చాడు.

**శివ ఉవాచ** – శివుడు పలికాడు.

**పూర్వమారాధితో విప్ర! బ్రహ్మణాహం తపోధన! ।**
**తపసా చావతారార్థం మునిభిశ్చ సురోత్తమైః ॥ 33 ॥**

ఓ తపోధనా! విప్రా! మునులు, దేవతలతో గూడిన వాడై నేను అవతారాన్ని ధరించాలనే కోరికతో పూర్వము బ్రహ్మ నన్ను ఆరాధించాడు.

**తవ పుత్రో భవిష్యామి నందీ నామ్నా త్వయోనిజః ।**
**పితా భవిష్యసి మమ పితుర్వై జగతాం మునే ॥ 34 ॥**

ఓ మునీంద్రా! నేను సకల జగత్తునకు జనకుడను. అట్టి నాకు నీవు తండ్రివగుదువు. నేను నీకు అయోనిజుడనగు పుత్రుడనౌదును. నేను 'నందీశ్వరుడు' అని పిలువబడుదును.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఏవముక్త్వా మునిం ప్రేక్ష్య ప్రణిపత్యాస్థితం ఘృణీ ।**
**సోమం తూర్ణం సమాదిశ్య తత్రైవాంతర్దధే హరః ॥ 35 ॥**

మునీంద్రా! కృపాళుడగు శంకరుడిట్లు పలికి తన పాదములకు నమస్కరించి యెదుట నిలబడియున్న శిలాదమునిని కృపాదృష్టితో చూచాడు. ఉమాసహితుడైన శంకరుడు వెంటనే, ఒక్కడే అంతర్ధానుడయ్యాడు.

**గతే తస్మిన్ మహాదేవే స శిలాదో మహామునిః ।**
**స్వమాశ్రయముపాగమ్య ఋషిభ్యోఽకథయత్తతః ॥ 36 ॥**

మహాదేవుడు అదృశ్యుడైన తరువాత శిలాదమహాముని తన ఆశ్రమానికి వెళ్ళి జరిగిన వృత్తాంతమంతయు అచటి ఋషులకు తెలిపాడు.

**కియతా చైవ కాలేన తదాసౌ జనకః స మే ।**
**యజ్ఞాఙ్గణం చకర్షాశు యజ్ఞార్థం యజ్ఞవిత్తమః ॥ 37 ॥**

కొంతకాలం గడిచిన తరువాత యజ్ఞవేత్తలలో శ్రేష్ఠుడైన నా తండ్రి యజ్ఞమొనరించుటకు యజ్ఞక్షేత్రమును సిద్ధం చేయుచున్నాడు.

**తతః క్షణాదహం శంభోస్తనుజస్తస్య చాజ్ఞయా ।**
**స జాతః పూర్వమేవాహం యుగాంతాగ్నిసమప్రభః ॥ 38 ॥**

అదే సమయంలో శంభుని ఆజ్ఞతో, ఆ యజ్ఞానికి ముందే వారి శరీరంనుండి యుగాంతాగ్నితో సమానమైన తేజస్సుతో నేను ఉత్పన్నుడనయ్యాను.

**అవర్షంస్తదా పుష్కరావర్తకాద్యా జగుః ఖేచరాః కిన్నరాః సిద్ధసాధ్యాః ।**
**శిలాదాత్మజత్వం గతే మయ్యృషీంద్రాః సమంతాచ్చ వృష్టిం వ్యధుః కౌసుమీం తే ॥ 39 ॥**

పుష్కరావర్తకాది మేఘాలు వర్షాన్ని కురిపించాయి. కిన్నరులు, ఖేచరులు, సిద్ధులు, సాధ్యులు గానాలు చేశారు. నేను జన్మించుటచే పుత్రవంతుడైన శిలాదుని ఋషీంద్రులు మిక్కిలి ప్రశంసించారు. సకలదిశలయందు ప్రసన్నత వ్యాపించింది. అంతటా పుష్పవర్షం కురిసింది.

**అథ బ్రహ్మాదయో దేవా దేవకల్పాశ్చ సర్వశః ।**
**తత్రాజగ్ముశ్చ సుప్రీత్యా హరిశ్చైవ శివోఽమ్బికా ॥ 40 ॥**

అప్పుడు బ్రహ్మాది దేవతలు, అందరు మిక్కిలి ప్రీతితో అచ్చటకు విచ్చేశారు. విష్ణువు, శివుడు మరియు పార్వతి కూడ విచ్చేశారు.

**తదోత్సవో మహానాసీన్ననృతుశ్చాప్సరోగణాః ।**
**ఆహృత్య మాం తథా లింగం తుష్టువుర్హర్షితాశ్చ తే ॥ 41 ॥**

అప్పుడు గొప్ప ఉత్సవం జరిగింది. అప్సరోగణాలు నాట్యం చేశారు. వారందరు ఆనందంతో నన్ను సాదరంగా ఆలింగనం చేసికొని స్తుతించారు.

**సుప్రశస్య శిలాదం తం స్తుత్వా చ సుస్తవైః శివౌ ।**
**సర్వే జగ్ముశ్చ ధామాని శివావప్యఖిలేశ్వరౌ ॥ 42 ॥**

పార్వతీ పరమేశ్వరులు, మరియు సమస్త దేవతలు, ఇంద్రాది ప్రభువులు శిలాదమహర్షిని ప్రశంసించి, స్తుతించి తమ తమ స్థానాలకు వెళ్ళారు.

**శిలాదోఽపి చ మాం దృష్ట్వా కాలసూర్యానలప్రభమ్ ।**
**త్ర్యక్షం చతుర్భుజం బాలం జటాముకుటధారిణమ్ ॥ 43 ॥**

శిలాదుడు కూడ ప్రళయకాలమందలి సూర్యుని వంటియు, అగ్ని సమాన ప్రభాశాలినైనట్టియు, త్రినేత్రుడనైనట్టియు, చతుర్భుజుడనైనట్టియు, జటాముకుటధారినైనట్టియు,

**త్రిశూలాద్యాయుధం దీప్తం సర్వథా రుద్రరూపిణమ్ ।**
**మహానందభరః ప్రీత్యా ప్రణమ్యం ప్రణనామ చ ॥ 44 ॥**

త్రిశూలాద్యాయుధములను ధరించినట్టియు, ప్రకాశవంతుడనైనట్టియు అన్ని విధాలా రుద్రరూపుడనైనట్టియు, బాలుడనైనట్టియు నన్ను చూచి మహదానందమగ్నుడయ్యాడు. నమస్కారయోగ్యుడనైన నాకు ప్రీతితో ప్రణామం చేస్తూ ఇలా నుడువసాగాడు.

**శిలాద ఉవాచ** – శిలాదుడు పలికాడు.

**త్వయాహం నందితో యస్మాన్నందీ నామ్నా సురేశ్వర! ।**
**తస్మాత్త్వాం దేవమానందం నమామి జగదీశ్వరమ్ ॥ 45 ॥**

దేవనాయకా! నీవు నాకు జన్మించడంవలన నేను నందితుడనయ్యాను (సంతోషించినవాడనైనాను) కాబట్టి నీకు 'నంది' అను పేరు ప్రకటితమయ్యింది. ఆనందమయమైన దేవుడవు, జగదీశ్వరుడవునగు నీకు నమస్కారము.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**మయా సహ పితా హృష్టః సుప్రణమ్య మహేశ్వరమ్ ।**
**ఉటజం స్వం జగామాశు నిధిం లబ్ధ్వేవ నిర్ధనః ॥ 46 ॥**

మునీంద్రా! తదనంతరము నిర్ధనునికి పెద్ద నిధి లభించగా ఆనందించినట్లు నన్ను పొంది నా తండ్రి మిక్కిలి ఆనందాన్ని పొంది మహేశ్వరుడనైన నాకు వందనమాచరించాడు. అనంతరం నన్ను తీసికొని తన పర్ణశాలకు చేరాడు.

**యదా గతోఽహముటజం శిలాదస్య మహామునే! ।**
**తదాహం తాదృశం రూపం త్యక్త్వా మానుష్యమాస్థితః ॥ 47 ॥**

మహామునీ! శిలాదమహాముని పర్ణశాల చేరిన వెంటనే నేను ఆ దివ్యరూపాన్ని పరిత్యజించి మానవరూపాన్ని ధరించాను.

**మానుష్యమాస్థితం దృష్ట్వా పితా మే లోకపూజితః ।**
**విలలాపాతిదుఃఖార్తః స్వజనైశ్చ సమావృతః ॥ 48 ॥**

లోకపూజితుడైన నా తండ్రి స్వజనులతో గూడి మానవరూపాన్ని పొందిన నన్ను చూచి దుఃఖార్తుడై విలపించాడు.

**జాతకర్మాదికాన్యేవ సర్వాణ్యపి చకార మే ।**
**శాలంకాయనపుత్రో వై శిలాదః పుత్రవత్సలః ॥ 49 ॥**

శాలంకాయనందనుడు, పుత్రవత్సలుడునగు శిలాదుడు నాకు జాతకర్మాది సకల సంస్కారములను చేశాడు.

**వేదానధ్యాపయామాస సాంగోపాంగానశేషతః ।**
**శాస్త్రాణ్యన్యాన్యపి తథా పంచవర్షే పితా చ మామ్ ॥ 50 ॥**

ఐదవ సంవత్సరమున తండ్రియైన శిలాదుడు సాంగోపాంగముగా సకల వేదాలను, ఇతర శాస్త్రాలనన్నింటిని నాచే అధ్యయనం చేయించాడు.

**సంపూర్ణే సప్తమే వర్షే మిత్రావరుణసంజ్ఞకౌ ।**
**మునీ తస్యాశ్రమం ప్రాప్తౌ ద్రష్టుం మాం చాజ్ఞయా విభోః ॥ 51 ॥**

ఏడవ సంవత్సరం పూర్తి కాగానే శివుని ఆజ్ఞచే మిత్రుడు, వరుణుడను పేరుగల మునులు పరమేశ్వరాజ్ఞచే నన్ను చూడడానికి తండ్రిగారి ఆశ్రమానికి విచ్చేశారు.

**సత్కృతౌ మునినా తేన సూపవిష్టౌ మహామునీ ।**
**ఊచతుశ్చ మహాత్మానౌ మాం నిరీక్ష్య ముహుర్ముహుః ॥ 52 ॥**

శిలాదమహాముని వారికి స్వాగతం పలికి సత్కరించారు. మునీశ్వరులైన వారిరువురు సుఖాసీనులై నన్ను అనేక మార్లు వీక్షించి ఇలా పలికారు.

**మిత్రావరుణావూచతుః** – మిత్రుడు, వరుణుడు పలికారు.

**తాత! నందీస్తవాల్పాయుః సర్వశాస్త్రార్థపారగః ।**
**న దృష్టమేవ చాపశ్యం హ్యాయుర్వర్షాదతః పరమ్ ॥ 53 ॥**

"మహాత్మా! శిలాదా! నీకుమారుడు నంది సకల శాస్త్రార్థపారంగతుడగు విద్వాంసుడు. కాని ఇతడు అల్పాయుష్కుడు. మేము అన్ని విధముల పరిశీలించి చూచినప్పటికి ఇతని వయస్సు ఒక సంవత్సరం కంటె ఎక్కువగా కనిపించుట లేదు"

**విప్రయోరిత్యుక్తవతోః శిలాదః పుత్రవత్సలః ।**
**తమాలింగ్య చ దుఃఖార్తో రురోదాతీవ విస్వరమ్ ॥ 54 ॥**

విప్రవరులిట్లు పలుకగా పుత్రవత్సలుడైన శిలాదుడు పుత్రుని కౌగలించుకొని దుఃఖంతో వెక్కి వెక్కి ఏడ్వసాగాడు.

**మృతవత్పతితం దృష్ట్వా పితరం చ పితామహమ్ ।**
**ప్రత్యవోచత్ప్రసన్నాత్మా స్మృత్వా శివపదాంబుజమ్ ॥ 55 ॥**

తండ్రియును, పితామహుడును (తాతయు) మరణించిన వానివలె పడియుండగా నంది వారిని చూచి, శివుని పదాంబుజములను స్మరించి ఇట్లు అడిగాడు.

**కేన త్వం తాత! దుఃఖేన వేపమానశ్చ రోదిషి ।**
**దుఃఖం తే కుత ఉత్పన్నం జ్ఞాతుమిచ్ఛామి తత్త్వతః ॥ 56 ॥**

"తండ్రీ! మీ శరీరమెందులకు వణుకుచున్నది? మీ రెందుకు రోదించుచున్నారు? మీ కెట్టి దుఃఖము సంభవించినది? నేను దీనిని వివరంగా తెలిసికొనవలెననుకొనుచున్నాను"

**పితోవాచ** – తండ్రి పలికాడు.

**తవాల్పమృత్యుదుఃఖేన దుఃఖితోఽతీవ పుత్రక! ।**
**కో మే దుఃఖం హరతు వై శరణం ప్రయామి హి ॥ 57 ॥**

పుత్రా! నీవల్పాయుష్కుడవను బాధతో మిగుల దుఃఖించుచున్నాను. నా యీ కష్టమునెవరు తొలగించెదరు? అట్టి వానిని శరణు వేడెదను.

**పుత్ర ఉవాచ** – పుత్రుడు పలికాడు.

**దేవో వా దానవో వాపి యమః కాలోఽథవాపి హి ।**
**బుధ్యేయుర్యద్యపి హ్యేతే మామన్యేఽపి జనాస్తథా ॥ 58 ॥**

తండ్రీ! దేవతలు కాని, దానవులు కాని, యముడు కాని, కాలము కాని ఇతరులు కాని, అందరూ కలిసి గాని, ఇతరులైన జనులు గాని నన్ను సంహరించే ప్రయత్నం చేయవచ్చును గాక!

**అథాపి చాల్పమృత్యుర్మే న భవిష్యతి మా తుదః ।**
**సత్యం బ్రవీమి జనక శపథం తే కరోమ్యహమ్ ॥ 59 ॥**

అయినప్పటికి నాకు అల్పకాలమునందు మృత్యువు కలుగదు. నేను మీ యెదుట ప్రమాణంచేయుచున్నాను. సత్యమునే పలుకుచున్నాను.

**పితోవాచ** – తండ్రి పలికాడు.

**కిం తపః కిం పరిజ్ఞానం కో యోగశ్చ ప్రభుశ్చ తే ।**
**యేన త్వం దారుణం దుఃఖం వంచయిష్యసి పుత్ర! మే ॥ 60 ॥**

కుమారా! నాయీ భయంకరమైన దుఃఖాన్ని దూరం చేయడానికి నీవెట్టి తపమాచరించెదవు? ఎట్టి జ్ఞానము, యోగము, యే ప్రభువు నీకు లభింపగలడు?

**పుత్ర ఉవాచ** – పుత్రుడు పలికాడు.

**న తాత! తపసా మృత్యుం వంచయిష్యే న విద్యయా ।**
**మహాదేవస్య భజనాన్మృత్యుం జేష్యామి నాన్యథా ॥ 61 ॥**

తండ్రీ! నేను తపస్సుచేత మృత్యువును తొలగింపలేను. అట్లే విద్యచేతను కూడ కాదు. మహాదేవుని భజించుట ద్వారా మృత్యువును జయింపగలను. అంతకంటే మరియొక ఉపాయమేదియు లేదు.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వాహం పితుః పాదౌ ప్రణమ్య శిరసా మునే! ।**
**ప్రదక్షిణీకృత్య చ తమగచ్ఛం వనముత్తమమ్ ॥ 62 ॥**

మునీంద్రా! ఇట్లు పలికి నేను తలవంచి తండ్రి చరణాలకు ప్రణమిల్లితిని. వారికి ప్రదక్షిణ మొనర్చి ఉత్తమమైన వనాలకు వెళ్లితిని.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం నందికేశావతారవర్ణనం నామ షష్ఠోఽధ్యాయః ॥ 6 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు నందికేశావతారవర్ణనం అనే పేరుగల ఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్తమోఽధ్యాయః – ఏడవ అధ్యాయం

## నందికేశ్వరావతారాభిషేకవివాహవర్ణనమ్ – నందికేశ్వరావతారాభిషేక వివాహములవర్ణనం

**నందికేశ్వర ఉవాచ** – నందికేశ్వరుడు పలికాడు.

**తత్ర గత్వా మునేఽహం వై స్థిత్వైకాంతస్థలే సుధీః ।**
**అతపం తప ఉగ్రం సన్మునీనామపి దుష్కరమ్ ॥ 1 ॥**

మునీంద్రా! నేను వనానికి వెళ్ళి ఏకాంత స్థలములో ఆసనముపైన కూర్చున్నాను. బుద్ధిమంతుడనై సన్మునులకు కూడా దుష్కరమైన ఉగ్రతపస్సున కుద్యుక్తుడనయ్యాను.

**హృత్పుండరీకసుషిరే ధ్యాత్వా దేవం త్ర్యంబకమ్ ।**
**త్ర్యక్షం దశభుజం శాంతం పంచవక్త్రం సదాశివమ్ ॥ 2 ॥**

నా హృదయకమలమధ్యభాగమందు మూడు నేత్రములు, పది భుజములు, ఐదు ముఖములు గలిగి శాంతి స్వరూపుడగు సదాశివుని ధ్యానించుచూ

**రుద్రజాప్యమకార్షం వై పరమధ్యానమాస్థితః ।**
**సరితశ్చోత్తరే పుణ్యే హ్యేకచిత్తః సమాహితః ॥ 3 ॥**

ఆ పవిత్రనదికి ఉత్తర తీరమునందు పుణ్య ప్రదేశంలో సమాహిత ఏకాగ్రచిత్తుడనై సుదృఢమైన ధ్యానమగ్నుడనై కూర్చుండి రుద్రమంత్రజపం సాగించాను.

**తస్మిన్జప్యేఽథ సంప్రీతః స్థితం మాం పరమేశ్వరః ।**
**తుష్టోఽబ్రవీన్మహాదేవః సోమః సోమార్ధభూషణః ॥ 4 ॥**

ఆ విధంగా రుద్రమంత్రజపసమాధిలో ఉన్న నన్ను చూచి అర్ధచంద్రభూషణుడు, పరమేశ్వరుడునగు మహాదేవుడు మిక్కిలి సంతుష్టుడై ఉమాసహితుడై అచటకు వచ్చి ప్రేమతో ఇట్లు పలికాడు.

**శివ ఉవాచ** – శివుడు పలికాడు.

**శైలాద! వరదోఽహం తే తపసాఽనేన తోషితః ।**
**సాధు తప్తం త్వయా ధీమన్ బ్రూహి యత్తే మనోగతమ్ ॥ 5 ॥**

శిలాదనందనా! నీవు మిక్కిలి ఉత్తమమైన తపమాచరించితివి. బుద్ధిమంతుడా! నీయీ తపస్సునకు సంతుష్టుడనై నీకు వరమునొసగుటకు వచ్చితిని. నీకభీష్టమగు వరమును కోరుకొనుము.

**స ఏవముక్తో దేవేన శిరసా పాదయోర్నతః ।**
**అస్తవం పరమేశానం జరాశోకవినాశనమ్ ॥ 6 ॥**

మహాదేవుడిట్లు పలుకగా నేను శివుని పాదములకు శిరసా నమస్కరించితిని. వృద్ధాప్యమును, శోకమును నశింపజేయు పరమేశ్వరుని స్తుతింపసాగాను.

**అథ మాం నందినం శంభుర్భక్త్యా పరామయా యుతమ్ ।**
**అశ్రుపూర్ణేక్షణం సమ్యక్ పాదయోః శిరసా నతమ్ ॥ 7 ॥**

పరమభక్తి సంపన్నుడనైన నన్ను (నందిని) పరమేశ్వరుడు చూడగానే, నా నేత్రాలలో అశ్రువులు జాలు వారాయి.

**ఉత్థాప్య పరమేశానః పస్పర్శ పరమార్తిహా ।**
**కరాభ్యాం సంముఖాభ్యాం తు సంగృహ్య వృషభధ్వజః ॥ 8 ॥**

పాదముల మీద పడియున్న నన్ను వృషభధ్వజుడు రెండు చేతులతో పట్టుకొని పైకి లేపి తన చేతితో శరీరమును నిమురసాగాడు.

**నిరీక్ష్య గణపాంశ్చైవ దేవీం హిమవతః సుతామ్ ।**
**ఉవాచ మాం కృపాదృష్ట్యా సమీక్ష్య జగతాం పతిః ॥ 9 ॥**

జగత్పతియైన మహాదేవుడు గణాధ్యక్షులయందును, హిమవంతుని కుమార్తెయైన పార్వతీదేవి వైపునను దృష్టి సారించి కృపాదృష్టితో నన్ను చూచుచూ, ఇట్లు చెప్పెను.

**వత్స! నందిన్! మహాప్రాజ్ఞ! మృత్యోర్భీతిః కుతస్తవ ।**
**మయైవ ప్రేషితౌ విప్రౌ మత్సమస్త్వం న సంశయః ॥ 10 ॥**

వత్సా! నందీ! మహాప్రాజ్ఞ! నీకు మృత్యుభయమెక్కడిది! నీవు నాతో సమానుడవు. దీనిలో సంశయం లేదు. ఆ యిరువురి విప్రులను నేనే పంపితిని.

**అమరో జరయా త్యక్తో ఽదుఃఖీ గణపతిః సదా ।**
**అవ్యయశ్చాక్షయశ్చేష్టః స పితా స సుహృజ్జనః ॥ 11 ॥**

నీవు అమరుడవు. అజరుడవు. దుఃఖరహితుడవు. అవ్యయుడవు. అక్షయుడవు. గణపతియునై యుండగలవు. నీ తండ్రితోను, సహృజ్జనంతోను గూడి నీవు నాకు ప్రియమైనవాడవగుదువు.

**మద్బలః పార్శ్వగో నిత్యం మమేష్టో భవితానిశమ్ ।**
**న జరా జన్మ మృత్యుర్వై మత్ప్రసాదాద్భవిష్యతి ॥ 12 ॥**

నీలో నాతో సమానమైన బలముండును. నీవు నిత్యము నా పార్శ్వ భాగంలో నుందువు. నీయందు నాకు ఎల్లప్పుడు ప్రీతియుంటుంది. నా కృపవలన జన్మ, జరా, మృత్యువుల ప్రభావమేమియు నీ మీద యుండదు.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఏవముక్త్వా శిరోమాలాం కుశేశయమయీం నిజామ్ ।**
**సమున్ముచ్య బబంధాశు మమ కంఠే కృపానిధిః ॥ 13 ॥**

కృపానిధియైన శంభుడిట్లుపలికి, కమలములతో తయారు చేయబడిన తనశిరస్సునందలి మాలను తీసి, నా మెడలో వేశాడు.

**తయాఽహం మాలయా విప్ర! శుభయా కంఠసక్తయా ।**
**త్ర్యక్షో దశభుజశ్చాసం ద్వితీయ ఇవ శంకరః ॥ 14 ॥**

ఆ మాల నా గళమున సుశోభితము కాగానే నేను మూడు నేత్రాలతో, పది భుజాలతో, రెండవ శంకరుని వలె విరాజిల్లాను.

**తత ఏవ సమాదాయ హస్తేన పరమేశ్వరః ।**
**ఉవాచ బ్రూహి కిం తే ఽద్య దదామి వరముత్తమమ్ ॥ 15 ॥**

అనంతరం పరమేశ్వరుడు తన చేతితో నన్ను దగ్గరకు తీసుకొని "నీకు నేను ఉత్తమమైన వరాన్నిస్తాను. నీకేవరం కావాలో కోరుకొనుము" – అని పలికాడు.

**తతో జటాశ్రితం వారి గృహీత్వా హారనిర్మలమ్ ।**
**ఉక్త్వా నందీ భవేతీహ విససర్జ వృషధ్వజః ॥ 16 ॥**

అనంతరం వృషధ్వజుడు తన జడలలోని గంగోదకమును స్వహస్తమున నందికేశ్వరునిపై చల్లుచూ "నంది" యనుపేరుగలవాడవై వర్ధిల్లుమని అనుగ్రహించాడు.

**తతః పంచమితా నద్యః ప్రావర్తత శుభావహాః ।**
**సుతోయాశ్చ మహావేగా దివ్యరూపా చ సుందరీ ॥ 17 ॥**

ఆ పిమ్మట చక్కని జలములు గలట్టియు, మహావేగముగా ప్రవహించునట్టియు, దివ్య రూపములతో సుందరమైనట్టియు, ఐదు నదుల రూపముగా మారిపోయింది.

**జటోదకా త్రిస్రోతాశ్చ వృషధ్వనిరితీవ హి ।**
**స్వర్ణోదకా జంబునదీ పంచనద్యః ప్రకీర్తితాః ॥ 18 ॥**

జటోదక, త్రిస్రోత, వృషధ్వని, స్వర్ణోదక, జంబూనది అను పేర్లతో ఆ ఐదు నదులు ప్రసిద్ధములైనవి.

**ఏతత్పంచనదం నామ శివపృష్ఠతమం శుభమ్ ।**
**జపేశ్వర సమీపే తు పవిత్రం పరమం మునే! ॥ 19 ॥**

మునీంద్రా! ఈ పంచనదులు శివుని పృష్ఠభూమివలె మిక్కిలి శుభప్రదములు. మహేశ్వరుని చెంత ఈ పవిత్రమగు ఈ నామములను జపించుము.

**యః పంచనదమాసాద్య స్నాత్వా జప్త్వేశ్వరేశ్వరమ్ ।**
**పూజయేచ్ఛివసాయుజ్యం ప్రయాత్యేవ న సంశయః ॥ 20 ॥**

ఈ పంచ నదులందు స్నానమొనరించి, జపమొనరించుచూ, పరమేశ్వరుడగు శివుని పూజించినవాడు శివసాయుజ్యమును పొందుతాడు. ఇది నిస్సంశయము.

**అథ శంభురువాచోమామాభిషించామి నందినమ్ ।**
**గణేంద్రం వ్యాహరిష్యామి కిం వా త్వం మన్యసేఽవ్యయే ॥ 21 ॥**

అనంతరం శంభుడుమాదేవితో "దేవీ! నేను నందీశ్వరుని గణాధ్యక్షునిగా పట్టాభిషేకం చేయగోరుచున్నాను. ఈ విషయమున నీ అభిప్రాయమును తెలుపుము" అని పలికాడు.

**ఉమోవాచ** – ఉమ పలికింది.

**దాతుమర్హసి దేవేశ! నందినే పరమేశ్వర! ।**
**మహాప్రియతమో నాథ! శైలాదిస్తనయో మమ ॥ 22 ॥**

"దేవేశా! మీరు నందీశ్వరునకు గణాధ్యక్షపదవిని ప్రసాదించవచ్చును. ఈ శిలాదనందనుడు నాకు పుత్ర సమానుడు. కావున నాకితడు మహాప్రియతముడు" అని ఉమాదేవి పలికింది.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**తతస్స శంకరః స్వీయాన్సస్మార గణపాన్వరాన్ ।**
**స్వతంత్రః పరమేశానః సర్వదో భక్తవత్సలః ॥ 23 ॥**

అంతట భక్తవత్సలుడు, స్వతంత్రుడు, పరమేశ్వరుడునైన శంకరుడు తన గణపాలకులను స్మరించాడు.

**స్మరణాదేవ రుద్రస్య సంప్రాప్తాశ్చ గణేశ్వరాః ।**
**అసంఖ్యాతా మహామోదాః శంకరాకృతయోఽఖిలాః ॥ 24 ॥**

రుద్రుడు స్మరించగానే, శంకరాకృతితో నున్న అసంఖ్యాకమైన గణపాలకులందరు మహానందంతో అచ్చటకు వచ్చారు.

**తే గణేశాశ్శివం దేవీం ప్రణమ్యాహుః శుభం వచః ।**
**తే ప్రణమ్య కరౌ బద్ధ్వా నతస్కంధా మహాబలాః ॥ 25 ॥**

ఆ గణేశ్వరులందరు చేతులు జోడించి శిరసు వంచి పార్వతీ పరమేశ్వరులకు నమస్కరించి శుభవచనాలను ఇట్లు పలికారు.

**గణేశా ఊచుః** – గణేశులు పలికారు.

**కిమర్థం  చ స్మృతా దేవ! హ్యాజ్ఞాపయ మహాప్రభో! ।**
**కింకరాన్నః సమాయాతాంస్త్రిపురార్దన! కామద! ॥ 26 ॥**

"ఓ మహాప్రభూ! మీరు మమ్ము ఎట్టి కార్యం నిర్వర్తించడానికి స్మరించారో, అట్టిదానిని ఆజ్ఞాపించండి. ఓ త్రిపురారీ! అభీష్టదాతా! ఏమి చేయడానికి మమ్ము పిలిపించారో తెలియజేయండి.

**కిం సాగరాన్ శోషయామో యమం వా సహ కింకరైః ।**
**హన్మో మృత్యుం మహామృత్యుం విశేషం వృద్ధపద్మజమ్ ॥ 27 ॥**

సముద్రాలను శోషింపజేయాలా? కింకరులతో సహా యముని సంహరించాలా? మృత్యువును, మహామృత్యువును, విశేషించి ముసలివాడైన బ్రహ్మను సంహరించాలా?

**బద్ధ్వేంద్రం సహ దేవైశ్చ విష్ణుం వా పార్ష దైః సహ ।**
**ఆనయామః సుసంకృద్ధాన్ దైత్యాన్వా దానవైః సహ ॥ 28 ॥**

దేవతలతో సహా దేవేంద్రుని గాని, పార్షదులతో గూడిన విష్ణువును గాని, మిక్కిలి క్రోధంగల దానవులతో గూడిన దైత్యులను గాని తీసుకొనిరమ్మందురా?

**కస్యాద్య వ్యసనం ఘోరం కరిష్యామస్తవాజ్ఞయా ।**
**కస్య వాద్యోత్సవో దేవ! సర్వకామసమృద్ధయే ॥ 29 ॥**

నీ ఆజ్ఞచే మేమీనాడు ఎవనికి భయంకరమైన ఆపదను కలిగించాలి? దేవా! ఎవనికి కోర్కెలనన్నింటిని ఈడేర్చుటకొఱకు సంపదలనిచ్చి ఉత్సవాన్ని కలిగించాలి?

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తేషాం గణానాం వీరవాదినామ్ ।**
**ఉవాచ తాన్స ప్రశంస్య గణేశాన్పరమేశ్వరః ॥ 30 ॥**

గణనాయకుల యీ మాటలను విని పరమేశ్వరుడు వారిని, వారి గణాలను ప్రశంసించి వారితో ఇట్లు పలికాడు.

**శివ ఉవాచ** - శివుడు పలికాడు.

**నందీశ్వరోఽయం పుత్రో మే సర్వేషామీశ్వరేశ్వరః ।**
**ప్రియో గణాగ్రణీః సర్వైః క్రియతాం వచనం మమ ॥ 31 ॥**

ఇతడు నందీశ్వరుడు. ఇతడు నాకు ప్రియపుత్రుడు. ఇతడు సకల గణనాయకులకు అధ్యక్షుడవుతాడు. మీరందరు నా ఆజ్ఞను పాలించండి.

**సర్వే ప్రీత్యాఽభిషించధ్వం మద్గణానాం గతిం పతిమ్ ।**
**అద్య ప్రభృతి యుష్మాకమయం నందీశ్వరః ప్రభుః ॥ 32 ॥**

మీరందరు కలిసి ఇతనిని ప్రీతితో గణేశ్వరేశ్వరునిగా అభిషేకించండి. నా గణములన్నింటికి గతియు, పతియు ఇతడే. నేటినుండి మీకందరకు ఈ నందీశ్వరుడే ప్రభువు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఏవముక్తాః శంకరేణ గణపాస్సర్వ ఏవ తే ।**
**ఏవమస్త్వితి సంప్రోచ్య సంభారానాహరంస్తతః ॥ 33 ॥**

మునీంద్రా! శంకరుడిట్లు చెప్పగానే గణపాలురందరూ 'ఏవమస్తు' (ఇట్లే అగును ) అని గట్టిగా పలికి, అభిషేకానికి వలసిన సామగ్రిని తీసుకురావడంలో నిమగ్నులయ్యారు.

**తతో దేవాశ్చ సేంద్రాశ్చ నారాయణముఖా స్తథా ।**
**మునయః సర్వతో లోకా ఆజగ్మర్ముదితాననాః ॥ 34 ॥**

అంతట ఇంద్రునితో సహా దేవతలు, అట్లే నారాయణుడు మున్నగు వారు, అన్ని లోకాలలోని మునులు ఆనందంతో అచ్చటకు విచ్చేశారు.

**పితామహోఽపి భగవన్నియోగాచ్ఛంకరస్య వై ।**
**చకార నందినస్సర్వమభిషేకం సమాహితః ॥ 35 ॥**

శంకరుని ఆజ్ఞవలన బ్రహ్మ కూడ నందికి పట్టాభిషేకం చేయడానికి సిద్ధమైనాడు.

**తతో విష్ణుస్తతశ్శక్రో లోకపాలాస్తథైవ చ ।**
**ఋషయస్తుష్టు వుశ్చైనం పితామహపురోగమాః ॥ 36 ॥**

బ్రహ్మను ముందిడుకొని శ్రీ మహావిష్ణువు, ఇంద్రుడు, లోకపాలకులు, ఋషులు నందీశ్వరుని స్తుతించారు.

**స్తుతిమత్సు తతస్తేషు విష్ణుః సర్వజగత్పతిః ।**
**శిరస్యంజలిమాధాయ తుష్టావ చ సమాహితః ॥ 37 ॥**

వారందరు స్తుతించుచుండగా సర్వజగత్పతియైన విష్ణువు మనస్సును లగ్నం చేసి శిరస్సుపై చేతులను జోడించి స్తుతించాడు.

**ప్రాంజలిః ప్రణతో భూత్వా జయశబ్దం చకార చ ।**
**తతో గణాధిపాస్సర్వే తతో దేవాస్తతోఽసురాః ॥ 38 ॥**

అంతట గణాధిపతులు, దేవతలు, అసురులందరు అంజలి ఘటించి నమస్కరించి 'జయజయ' ధ్వానులను చేశారు.

**ఏవం స్తుతశ్చాభిషిక్తో దేవై స్సబ్రహ్మకైస్తదా ।**
**నందీశ్వరోఽహం విప్రేంద్ర! నియోగాత్పరమేశితుః ॥ 39 ॥**

బ్రాహ్మణోత్తమా! పరమేశ్వరుని ఆజ్ఞచే బ్రహ్మతో కూడిన సమస్త దేవతలు ఈ విధంగా స్తుతించారు. అభిషిక్తుని చేశారు. కాబట్టి నేను పరమేశుని నియోగంవలన నందీశ్వరుడనైనాను.

**ఉద్వాహశ్చ కృతస్తత్ర నియోగాత్పరమేష్ఠినః ।**
**మహోత్సవయుతః ప్రీత్యా విష్ణుబ్రహ్మాదిభిర్మమ ॥ 40 ॥**

అదేవిధంగా పరమేశ్వరుని ఆదేశం వలన బ్రహ్మ, విష్ణువు మున్నగువారందరు నా వివాహ మహోత్సవాన్ని కూడా జరిపించారు.

**మరుతాం చ సుతాం దేవీం సుయశాస్తు మనోహరా ।**
**పత్నీ సా మేఽభవద్దివ్యా మనోనయననందినీ ॥ 41 ॥**

మరుత్తుల కుమార్తెయు మనోహరమైనదియునగు 'సుయశాదేవి' నాకు పత్నియైనది.

**లబ్ధం శశిప్రభం ఛత్రం తయా తత్ర విభూషితమ్ ।**
**చామరైశ్చామరాసక్తహస్తాగ్రైః స్త్రీగణైర్యుతమ్ ॥ 42 ॥**

అంతట నాకు చక్కగా అలంకరింపబడినదియు, వెన్నెల వంటి తెల్లనిదియునగు ఛత్రము బహుమతిగా లభించింది. స్త్రీగణం తమ హస్తాగ్రాలతో వింజామరలు వీచారు.

**సింహాసనం చ పరమం తయా చాధిష్ఠితం మయా ।**
**అలంకృతో మహాలక్ష్మ్యా ముకుటాద్యైస్సుభూషణైః ॥ 43 ॥**

మిక్కిలి గొప్పదైన సింహాసనమునందు నన్ను అధిష్ఠింపజేశారు. మహాలక్ష్మీదేవిచే ముకుటాది భూషణములచే అలంకరింపబడితిని.

**లబ్ధో హారశ్చ పరమో దేవ్యాః కంఠగతస్తథా ।**
**వృషేంద్రశ్చ శితో నాగస్సింహః సింహధ్వజస్తథా ॥ 44 ॥**

లక్ష్మీదేవి కంఠమునందున్న గొప్ప హారము నాకు ఈయబడింది. నాకు గొప్పవృషభము, తెల్లని ఏనుగు, సింహము, సింహధ్వజము కూడ లభించాయి.

**రథశ్చ హేమహారశ్చ చంద్రబింబసమః శుభః ।**
**అన్యాన్యపి చ వస్తూని లబ్ధాని హి మయా మునే! ॥ 45 ॥**

మునీంద్రా! చంద్రబింబసమానమైనట్టియు, శుభంకరమైనట్టియు రథము, సువర్ణహారము, అనేకములైన ఆభరణములు నాకు లభించాయి.

**ఏవం కృతవివాహోఽహం తయా పత్న్యా మహామునే! ।**
**పాదౌ వవందే శంభోశ్చ శివాయా బ్రహ్మణో హరేః ॥ 46 ॥**

మహామునీ! ఈ విధంగా 'సుయశాదేవి' తో వారు నా వివాహం జరిపించారు. శంభునకు, ఉమాదేవికి, బ్రహ్మకు, శ్రీమహావిష్ణువునకు పాదాభివందనం చేశాను.

**తథావిధం త్రిలోకేశస్సపత్నీకం చ మాం ప్రభుః ।**
**ప్రోవాచ పరయా ప్రీత్యా స శివో భక్తవత్సలః ॥ 47 ॥**

అప్పుడు త్రిలోకేశ్వరుడు, భక్తవత్సలుడు, భగవంతుడునగు శివుడు పత్నీసహితుడై నాతో ప్రేమపూర్వకంగా ఇట్లు పలికాడు.

**ఈశ్వర ఉవాచ –** ఈశ్వరుడు పలికాడు.

**శృణు సత్పుత్ర! తాతస్త్వం సుయశేయం తవ ప్రియా ।**
**దదామి తే వరం ప్రీత్యా యత్తే మనసి వాంఛితమ్ ॥ 48 ॥**

సుపుత్రా! నీవు, నీ భార్యయైన సుయశయు నా మాటలను వినండి. నీవు నాకు మిక్కిలి ప్రియమైన వాడవు. నేను స్నేహపూర్వకంగా నీవు కోరిన వరమును ప్రసాదించెదను.

**సదాహం తవ నందీశ! సంతుష్టోఽస్మి గణేశ్వర! ।**
**దేవ్యా చ సహితో వత్స! శృణు మే పరమం వచః ॥ 49 ॥**

ఓ గణేశ్వరా! నందీశా! నేను పార్వతీదేవితో సహా నీ యెడల సంతుష్టుడను. కనుక వత్సా! ఉత్తమమైన నా వచనమును వినుము.

**సదేష్టశ్చ విశిష్టశ్చ పరమైశ్వర్యసంయుతః ।**
**మహాయోగీ మహేష్వాసః స పితా స పితామహః ॥ 50 ॥**

నీవు నాకు సదా ఇష్టుడవు. విశిష్టుడవు. నీ తండ్రికిని, నీ తాతకును (పితామహునకును) కూడ ఇట్టి స్థితియే యుండును.

**అజేయస్సర్వజేతా చ సదా పూజ్యో మహాబలః ।**
**అహం యత్ర భవాంస్తత్ర యత్ర త్వం తత్ర చాప్యహమ్ ॥ 51 ॥**

కుమారా! మహాబలశాలియు, అజేయుడు, సర్వజేతయు, సదాపూజ్యుడునగు నీవు నేనెచ్చటనుందునో అక్కడనే యుందువు. నీవెక్కడుందువో నేను కూడ అక్కడనేయుందును.

**అయం చ తే పితా పుత్ర! పరమైశ్వర్యసంయుతః ।**
**భవిష్యతి గణాధ్యక్షో మమ భక్తో మహాబలః ॥ 52 ॥**

కుమారా! మహాబలశాలియు, మహదైశ్వర్యశాలియు, నా భక్తుడునగు మీ తండ్రి గణాధ్యక్షుడగును.

**పితామహోఽపి తే వత్స! తథాస్తు నియమా ఇమే ।**
**మత్సమీపం గమిష్యంతి మయా దత్తవరస్తథా ॥ 53 ॥**

వత్సా! ఈ నియమమే నీ పితామహునకును వర్తించును. చివరకు మీరందరును నా నుండి వరములను పొంది నా సాన్నిధ్యమును పొందగలరు.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**తతో దేవీ మహాభాగా నందినం వరదాఽబ్రవీత్ ।**
**వరం బ్రూహీతి మాం పుత్ర! సర్వాన్కామాన్యథేప్సితాన్ ॥ 54 ॥**

మునీంద్రా! తదనంతరం మహాభాగ్యశాలియగు ఉమాదేవి వరముల నొసగుటకు ఉత్సహితురాలై, నందినగు నాతోఇట్లు పలికింది. పుత్రా! నీవు నన్ను కూడ వరములడుగుము. నీవు కోరిన కోరికలన్నింటిని నెరవేర్చెదను.

**తచ్ఛ్రుత్వా వచనం దేవ్యాః ప్రావోచత్సాంజలిస్తదా ।**
**భక్తిర్భవతు మే దేవి! పాదయోస్తే సదా వరా ॥ 55 ॥**

అంతట ఆదేవి వచనాలను విని నేను చేతులు జోడించి ఇట్లు విన్నవించితిని. "దేవీ! నీ చరణములయందు నిరంతరము నాకు భక్తి కుదురునట్లనుగ్రహింపుము ఇదియే నేను కోరుకొను వరము".

**శ్రుత్వా మమ వచో దేవీ హ్యేవమస్త్వితి సాఽబ్రవీత్ ।**
**సుయశాం తాం చ సుప్రీత్యా నందిప్రియతమాం శివామ్ ॥ 56 ॥**

ఉమాదేవి నా వచనములను విని 'అట్లే అగు గాక!' అని పలికింది. తదుపరి ఉమాదేవి నందియొక్క పత్నియైన సుయశతో ఇట్లు పలికింది.

**దేవ్యువాచ** – దేవి పలికింది.

**వత్సే! వరం యథేష్టం హి త్రినేత్రా జన్మవర్జితా ।**
**పుత్రపౌత్రైస్తు భక్తిర్మే తథా చ భర్తురేవ హి ॥ 57 ॥**

వత్సే! నీవుకూడ నీకు కావలసిన వరములను స్వీకరింపుము. నీకునూ మూడు నేత్రములుండును. జన్మబంధమునుండి ముక్తి కలుగును. పుత్రపౌత్రులతో సంపన్నురాలవగుదువు. నాయందును, నా స్వామి యందును నీవు తరగని భక్తిని కలిగియుందువు.

**నంద్యువాచ** – నంది పలికాడు.

**తదా బ్రహ్మా చ విష్ణుశ్చ సర్వే దేవగణాశ్చ వై ।**
**తాభ్యాం వరాన్ దదుః ప్రీత్యా సుప్రసన్నాః శివాజ్ఞయా ॥ 58 ॥**

మునీంద్రా! తదనంతరం శివుని ఆజ్ఞతో బ్రహ్మ, విష్ణువు, సకల దేవ గణములును మిగుల సంతుష్టులై మాకిరువురకును వరములనొసగిరి.

**సాన్వయం మాం గృహీత్వేశస్తతస్సంబంధిబాంధవైః ।**
**ఆరుహ్యా వృషమీశానో గతో దేవ్యా నిజం గృహమ్ ॥ 59 ॥**

పరమేశ్వరుడగు శివుడు ఉమాసహితుడై వృషభవాహనారూఢుడై తన సంబంధీకులతోను, బంధువులతోను గూడి నన్ను తీసికొని తన నివాసస్థానమునకు వెళ్లెను.

**విష్ణ్వాదయస్సురాస్సర్వే ప్రశంసంతో హ్యమీ తదా ।**
**స్వధామాని యయుః ప్రీత్యా సంస్తువన్తః శివం శివమ్ ॥ 60 ॥**

విష్ణువు మున్నగు సర్వ దేవతలు మంగళకరుడగు శివుని, ఉమాదేవిని స్తుతించి సంతోషంతో తమ తమ నివాసములకు వెళ్లిపోయిరి.

**ఇతి తే కథితో వత్స! స్వావతారో మహామునే! ।**
**సదానందకరః పుంసాం శివభక్తిప్రవర్ధనః ॥ 61 ॥**

ఇట్లు నేను నీకు నా అవతారమును గూర్చి వర్ణించి తెలిపితిని. మహామునీ! ఇది మానవులకు సదా ఆనందదాయకమును, శివభక్తిని పెంపొందించునదియునగును.

**య ఇదం నందినో జన్మ వరదానం తథా మమ ।**
**అభిషేకం వివాహం చ శృణుయాచ్ఛ్రావయేత్తథా ॥ 62 ॥**

శ్రద్ధాళువులగు మానవులు, భక్తిభావచిత్తులై నందినగు నాయీ జన్మను, వరప్రాప్తిని, అభిషేకమును, వివాహవృత్తాంతమును, వినెడివారును, వినిపించెడివారును,

**పఠేద్వా పాఠయేద్వాపి శ్రద్ధావాన్భక్తిసంయుతః ।**
**ఇహ సర్వసుఖం భుక్త్వా పరత్ర లభతే గతిమ్ ॥ 63 ॥**

చదివెడువారును, చదివించువారును, ఈ లోకమునందు సకల సుఖములను అనుభవించి, చివరకు పరమగతిని పొందుదురు.

**ఇతి త్రిచత్వారింశోఽవతారః । అథ భైరవావతారమాహ ॥**

ఇంతవరకు నలుబది మూడవ అవతారం వర్ణింపబడింది. ఇపుడు భైరవావతారము వర్ణింపబడుచున్నది.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం నందికేశ్వరావతారాభిషేకవివాహవర్ణనం నామ సప్తమోఽధ్యాయః ॥ 7 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు నందికేశ్వరావతారాభిషేక వివాహములవర్ణనం అనే పేరుగల ఏడవ అధ్యాయం సమాప్తం.

## **అష్టమోఽధ్యాయః** - ఎనిమిదవ అధ్యాయం

## **భైరవావతారవర్ణనమ్** - భైరవావతారవర్ణనం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**సనత్కుమార! సర్వజ్ఞ! శృణు త్వం భైరవీం కథామ్ ।**
**యస్యాః శ్రవణమాత్రేణ శైవీ భక్తిర్దృఢా భవేత్ ॥ 1 ॥**

ఓ సనత్కుమారా! సర్వజ్ఞా! నీవు భైరవుని గాథను వినుము. ఈ గాథను విన్నచో శివభక్తి దృఢమౌతుంది.

**భైరవః పూర్ణరూపో హి శంకరస్య పరాత్మనః ।**
**మూఢాస్తం వై న జానంతి మోహితాశ్శివమాయయా ॥ 2 ॥**

భైరవుడు శంకర పరమాత్ముని పూర్ణావతారము. శివమాయామోహితులైన అజ్ఞానులు అతనిని ఎరుంగరు.

**సనత్కుమార! నో వేత్తి మహిమానం మహేశితుః ।**
**చతుర్భుజోఽపి విష్ణుర్వై చతుర్వక్త్రోఽపి వై విధిః ॥ 3 ॥**

ఓ సనత్కుమారా! చతుర్భుజుడగు విష్ణువు, చతుర్ముఖుడగు బ్రహ్మ కూడ మహేశ్వరుని మహిమను ఎరుంగరు.

**చిత్రమత్ర నకించిద్వై దుర్జ్ఞేయా ఖలు శాంభవీ ।**
**తయా సంమోహితాస్సర్వే నార్చయన్త్యపి తం పరమ్ ॥ 4 ॥**

దీనిలో విచిత్రమేమియూ లేదు. శంభుని మాయను తెలిసికొనుట అసంభవము. అందరు ఆ మాయచే సంమోహితులౌతారు. అట్లు మోహితులైన జనులు ఆ పరమేశ్వరుని అర్చించుట లేదు.

**వేద చేద్యది వాత్మానం స ఏవ పరమేశ్వరః ।**
**తదా విహన్తి తే సర్వే స్వేచ్ఛయాం న హి కేఽపి తమ్ ॥ 5 ॥**

ఆ పరమేశ్వరుడే స్వయంగా తన స్వరూపాన్ని తెలిపినచో, అప్పుడు భక్తులు ఆయనను తెలియగలరు, ఎవరైనను తమ ఇచ్ఛచే ఆ పరమేశ్వరుని తెలియజాలరు.

**సర్వగోఽపి మహేశానో నేక్ష్యతే మూఢబుద్ధిభిః ।**
**దేవవద్ బుధ్యతే లోకే యోఽతీతో మనసాం గిరామ్ ॥ 6 ॥**

మహేశ్వరుడు సర్వవ్యాపకుడైయున్నను, మూఢబుద్ధులు ఆయనను దర్శింపజాలరు, మనోవాక్కులకు అగోచరమైన ఆ పరమేశ్వరుని సామాన్యదేవతయని లోకులు భావిస్తూ ఉంటారు.

**అత్రేతిహాసం వక్ష్యేఽహం పరమర్షే! పురాతనమ్ ।**
**శృణు తం శ్రద్ధయా తాత! పరమం జ్ఞానకారణమ్ ॥ 7 ॥**

ఓ మహర్షీ! ఈ విషయంలో నేనొక ప్రాచీన గాథను చెబుతాను. వత్సా! జ్ఞానహేతువగు ఆ శ్రేష్ఠగాథను నీవు శ్రద్ధతో వినుము.

**మేరుశృంగేఽద్భుతే రమ్యే స్థితం బ్రహ్మాణమీశ్వరమ్ ।**
**జగ్ముర్దేవర్షయః సర్వే సుతత్త్వం జ్ఞాతుమిచ్ఛయా ॥ 8 ॥**

దేవతలు, ఋషులు అందరు కలిసి అద్భుతము, సుందరమునైన మేరు శిఖరమునందున్న భగవానుడగు బ్రహ్మవద్దకు ఈశ్వరతత్త్వము తెలిసికొనుటకు వెళ్లారు.

**తత్రాగత్య విధిన్నత్వా పప్రచ్ఛుస్తే మహాదరాత్ ।**
**కృతాంజలిపుటాస్సర్వే నతస్కంధా మునీశ్వరాః ॥ 9 ॥**

ఆ మహర్షులు, దేవతలు అందరు అచటకు వచ్చి బ్రహ్మకు సాష్టాంగ ప్రణామమును చేసి చేతులను జోడించి ఆదరంతో ఇట్లు అడిగారు.

**దేవర్షయ ఊచుః** – దేవర్షులు పలికారు.

**దేవదేవ! ప్రజానాథ! సృష్టికృల్లోకనాయక! ।**
**తత్త్వతో వద చాస్మభ్యం కిమేకం తత్త్వమవ్యయమ్ ॥ 10 ॥**

ఓ దేవదేవా! ప్రజానాథా! సృష్టికర్తవగు నీవే లోకములకు ప్రభుడవు. వినాశములేని ఏకైక తత్త్వమేది? ఈ విషయాన్ని మాకు యథాతథముగా చెప్పుము.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**స మాయయా మహేశస్య మోహితః పద్మసంభవః ।**
**అవిజ్ఞాయ పరం భావం సంభావం ప్రత్యువాచ హ ॥ 11 ॥**

మహేశ్వరుని మాయచే మోహితుడైన ఆ బ్రహ్మ, పరమాత్మస్వరూపాన్ని, ప్రభావాన్ని ఎరుగక ఇట్లు బదులు పలికాడు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ పలికాడు.

**హే సురా! ఋషయః! సర్వే సుమత్యా శృణుతాదరాత్ ।**
**వచ్మ్యహం పరమం తత్త్వమవ్యయం వై యథార్థతః ॥ 12 ॥**

ఓ దేవతలారా! ఋషులారా! మీరందరు మంచి మనస్సుతో ఆదరంతో వినండి. వినాశం లేని పరమతత్త్వాన్ని గూర్చి నేను యథార్థంగా చెబుతాను.

**జగద్యోనిరహం ధాతా స్వయంభూరజ ఈశ్వరః ।**
**అనాదిభాగహం బ్రహ్మ హ్యేక ఆత్మా నిరంజనః ॥ 13 ॥**

స్వయంగా ప్రకటమైనవాడను, జగత్కారకుడను, విధాతను, పుట్టుక లేనివాడను, జగత్పరిపాలకుడను, ఆది లేనివాడను, దోషములు లేనివాడను అగు నేనే పరబ్రహ్మను. నేనే పరమాత్మను.

**ప్రవర్తకో హి జగతామహమేవ నివర్తకః ।**
**సంవర్తకో మదధికో నాన్యః కశ్చిత్సురోత్తమాః! ॥ 14 ॥**

జగత్తును ప్రవర్తిల్లజేయువాడను నేనే. జగత్తునుపహసంహరించే ప్రళయకాలాగ్నిని నేనే. ఓ సురోత్తములారా! నాకంటె శ్రేష్ఠుడు మరియొకడు లేడు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**తస్యైవం వదతో ధాతుర్విష్ణుస్తత్ర స్థితో మునే! ।**
**ప్రోవాచ ప్రహసన్వాక్యం సంకృద్ధో మోహితోఽజయా ॥ 15 ॥**

ఓ మహర్షీ! బ్రహ్మ ఇట్లు పలుకుచుండగా, అచటనున్న విష్ణువు కోపించి మాయా మోహితుడై నవ్వుచూ ఒక వాక్యాన్ని పలికాడు.

**న చైతదుచితా బ్రహ్మన్! యోగయుక్తస్య మూర్ఖతా ।**
**అవిజ్ఞాయ పరం తత్త్వం వృథైతత్తే నిగద్యతే ॥ 16 ॥**

ఓ బ్రహ్మా! నీ వంటి యోగీశ్వరునకు ఇటువంటి మూర్ఖత్వము తగదు. నీవు సర్వోత్తమమైన తత్త్వమునెరుగక ఇట్లు వ్యర్థవచనాలను పలుకుచున్నావు.

**కర్తా వై సర్వలోకానాం పరమాత్మా పరః పుమాన్ ।**
**యజ్ఞో నారాయణో దేవో మాయాధీశః పరాగతిః ॥ 17 ॥**

సమస్త లోకాలను సృష్టించు పరమాత్మను, పురుషోత్తముడను నేనే. యజ్ఞస్వరూపుడనగు నారాయణుడను నేనే. మాయాశక్తిని నా ఆధీనంలో ఉంచుకొంటాను. సర్వోత్తమగతియగు పరబ్రహ్మము నేనే.

**మమాజ్ఞయా త్వయా బ్రహ్మన్! సృష్టిరేషా విధీయతే ।**
**జగతాం జీవనం నైవ మామనాదృత్య చేశ్వరమ్ ॥ 18 ॥**

ఓ బ్రహ్మా! నీవీ సృష్టిని నా ఆజ్ఞ చేతనే నిర్వహిస్తున్నావు. ఈశ్వరుడనగు నన్ను తిరస్కరించినచో ఈ జగత్తులు క్షణకాలం జీవించి యుండలేవు.

**ఏవం త్రిప్రకృతౌ మోహాత్ పరస్పరజయైషిణౌ ।**
**ప్రోచతుర్నిగమాంశ్చాత్ర ప్రమాణే సర్వథా తనౌ ॥ 19 ॥**

త్రిగుణాత్మకమైన ప్రకృతియందు మోహమును పొంది ఒకరిపై మరియొకరు విజయాన్ని పొందగోరి వారిద్దరు తమ వాదాలకు ప్రామాణ్యాన్ని సంపాదించడానికి వేదాలను ప్రమాణంగా చూపారు.

**ప్రష్టవ్యాస్తే విశేషేణ స్థితా మూర్తిధరాశ్చ తే ।**
**పప్రచ్ఛతుః ప్రమాణజ్ఞానిత్యుక్త్వా చతురోఽపి తాన్ ॥ 20 ॥**

నాల్గు వేదాలు విగ్రహరూపం దాల్చి ఎదుట నున్నాయి. వేదాలు ప్రమాణనిర్ణయసామర్థ్యం కలిగినవని పలికి వారిద్దరు వేదాలనిలా ప్రశ్నించారు.

**విధివిష్ణూ ఊచతుః** – బ్రహ్మ, విష్ణువు పలికారు.

**వేదాః ప్రమాణం సర్వత్ర ప్రతిష్ఠా పరమాపితాః ।**
**యూయం వదత విస్రబ్ధం కిమేకం తత్త్వమవ్యయమ్ ॥ 21 ॥**

అన్ని విషయాలలో వేదాలే ప్రమాణాలు. అనంతములైన వేదముల ప్రతిష్ఠ సర్వోత్కృష్టమైనది. 'ఓ వేదములారా! వినాశములేని ఏకైక తత్త్వమేది?' మీరు సత్యమును చెప్పండి.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యాకర్ణ్య తయోర్వాచం పునస్తే హి ఋగాదయః ।**
**అవదంస్తత్త్వతః సర్వే సంస్మరంతో పరం ప్రభుమ్ ॥ 22 ॥**

వారిద్దరు మాటను విని ఋగాది నాల్గువేదాలు, పరమాత్మయగు శివప్రభుని స్మరించి, యథార్థ వచనము-నిట్లు పలికినవి.

**యది మాన్యా వయం దేవౌ సృష్టిస్థితికరౌ విభూ ।**
**తదా ప్రమాణం వక్ష్యామో భవత్సందేహభేదకమ్ ॥ 23 ॥**

ఓ దేవతలారా! మీరిరువురు సృష్టిస్థితులను చేయు ప్రభువులు. మామాట మీకు అంగీకారమైనచో మీ సందేహాన్ని పోగొట్టే ప్రమాణవచనాన్ని చెప్పగలము.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**శ్రుత్యుక్తవిధిమాకర్ణ్య ప్రోచతుస్తౌ సురౌ శ్రుతీః ।**
**యుష్మదుక్తం ప్రమాణం నౌ కిం తత్త్వం సమ్యగుచ్యతామ్ ॥ 24 ॥**

వేదాలు పలికిన ఈ మాటను విని ఆ దేవతలిద్దరు వేదాలతో "మీమాట మాకు ప్రమాణము. తత్త్వమేది? చక్కగా విచారించి చెప్పుడు" అని పలికారు.

**ఋగ్వేద ఉవాచ** – ఋగ్వేదం చెప్పింది.

**యదంతస్థాని భూతాని యతస్సర్వం ప్రవర్తతే ।**
**యదాహుః పరమం తత్త్వం స రుద్రస్త్వేక ఏవ హి ॥ 25 ॥**

సర్వప్రాణులు ఎవనియందున్నవో, ఎవని నుండి సర్వజగత్తు ఉద్భవించుచున్నదో ఆ రుద్రుడు ఒక్కడే పరమ తత్త్వమని మహర్షులు చెప్పుచున్నారు.

**యజుర్వేద ఉవాచ –** యజుర్వేదం చెప్పింది.

**యో యజ్ఞైరఖిలైరీశో యోగేన చ సమిజ్యతే ।**
**యేన ప్రమాణం ఖలు నస్స ఏకః సర్వదృక్ శివః ॥ 26 ॥**

ఏ ఈశ్వరుడు సర్వయజ్ఞములచే, మరియు యోగముచే ఆరాధింపబడుచున్నాడో, ఎవనిచే మాకు ప్రామాణ్యము లభించుచున్నదో అట్టి సర్వసాక్షియగు అద్వయతత్త్వము శివుడే.

**సామవేద ఉవాచ –** సామవేదం చెప్పింది.

**యేనేదం భ్రమ్యతే విశ్వం యోగిభిర్యో విచిన్త్యతే ।**
**యద్భాసా భాసతే విశ్వం స ఏకస్త్ర్యంబకః పరః ॥ 27 ॥**

ఎవనిచే ఈ జగచ్చక్రము త్రిప్పబడుచున్నదో, ఎవనిని యోగులు ధ్యానిస్తారో, ఎవని ప్రకాశంచే జగత్తు ప్రకాశించుచున్నదో అట్టి అవ్యయపరమాత్మ ముక్కంటియే.

**అథర్వవేద ఉవాచ –** అథర్వవేదం చెప్పింది.

**యం ప్రపశ్యంతి దేవేశం భక్త్యనుగ్రహిణో జనాః ।**
**తమాహురేకం కైవల్యం శంకరం దుఃఖతః పరమ్ ॥ 28 ॥**

ఏ దేవదేవుని కృపచే భక్తులైన జనులు ఆయనను చక్కగా దర్శించుచున్నారో, ఎవడు దుఃఖానికి అతీతుడో, అట్టి అద్వయ నిర్గుణతత్త్వము శంకరుడని మహర్షులు చెప్పుచున్నారు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**శ్రుత్యుక్తమిదమాకర్ణ్యాతీవ మాయావిమోహితౌ ।**
**స్మిత్వాహతుర్విధిహరీ నిగమాంస్తాన్విచేతనౌ ॥ 29 ॥**

వేదములు చెప్పిన ఈ మాటలను విని, మాయచే అత్యధికంగా మోహితులై వివేకాన్ని కోల్పోయిన బ్రహ్మ, విష్ణువులు నవ్వి వేదాలతో ఇట్లన్నారు.

**విధిహరీ ఊచతుః –** బ్రహ్మ, విష్ణులు పలికారు.

**హే వేదాః! కిమిదం యూయం భాషన్తే గతచేతనాః ।**
**కిం జాతం వోఽద్య సర్వం హి నష్టం సువయునం పరమ్ ॥ 30 ॥**

ఓ వేదములారా! మీరు వివేకాన్ని కోల్పోయి ఇట్లు మాట్లాడుచున్నారేల? మీకీనాడు ఏమయ్యింది? మీ యొక్క చక్కని పరమాత్మజ్ఞానమంతయు నశించింది.

**కథం ప్రమథనాథోఽసౌ రమమాణో నిరంతరమ్ ।**
**దిగంబరః పీతవర్ణో శివయా ధూళిధూసరః ॥ 31 ॥**

ప్రమథగణాలకధిపతి, సర్వదా విహారశీలి, దిగంబరుడు, పచ్చని వర్ణము గలవాడు, పార్వతితో గూడి యుండువాడు, ధూళిధూసరుడు.

**విరూపవేషో జటిలో వృషగో వ్యాలభూషణః ।**
**పరం బ్రహ్మత్వమాపన్నః క్వచ తత్సంగవర్జితమ్ ॥ 32 ॥**

వికృత వేషములో నుండువాడు, జటాధారి, వృషభవాహనుడు, పాములు ఆభరణములుగా గలవాడునగు ఈ శివుడు పరబ్రహ్మమెట్లయ్యాడు? సంగవర్జితుడైన పరబ్రహ్మ ఎక్కడ? శివుడెక్కడ?

**ఇత్యుదీరితమాకర్ణ్య ప్రణవః సర్వగస్తయోః ।**
**అమూర్తో మూర్తిమాన్ ప్రీత్యా జృంభమాణ ఉవాచ తౌ ॥ 33 ॥**

వారిద్దరి యీ మాటలను విని సర్వవ్యాపకము, ఆకార విహీనమునగు ఓంకారము ప్రేమతో శరీరాన్ని స్వీకరించి వారిరువురితో బిగ్గరగా ఇట్లనెను.

**ప్రణవ ఉవాచ –** ప్రణవుడు చెప్పాడు.

**నహీశో భగవాన్ శక్త్యా హ్యాత్మనో వ్యతిరిక్తయా ।**
**కదాచిద్రమతే రుద్రో లీలారూపధరో హరః ॥ 34 ॥**

భగవంతుడు, ఈశ్వరుడు, లీలారూపములను ధరించువాడు, మరియు పాపములను హరించువాడునగు రుద్రుడు ఎప్పుడునూ తనకంటె భిన్నమైన శక్తితో విహరించుట లేదు.

**అసౌ హి పరమేశానః స్వయం జ్యోతిస్సనాతనః ।**
**ఆనందరూపా తస్యైషా శక్తిర్నాగంతుకీ శివా ॥ 35 ॥**

రుద్రుడు పరమేశ్వరుడు, స్వయంప్రకాశస్వరూపుడు మరియు సనాతనుడు. ఆయనయొక్క ఆనంద స్వరూపమే పార్వతీ దేవి. ఆమె ఆయనయొక్క శక్తియే గాని బయటనుండి వచ్చినది గాదు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యేవముక్తోఽపి తదా విధేర్విష్ణోశ్చ వై తదా ।**
**నాజ్ఞానమగమన్నాశం శ్రీకంఠస్యైవ మాయయా ॥ 36 ॥**

ఓంకార మీ విధంగా పలికినను, శివమాయాప్రభావంచే బ్రహ్మవిష్ణువుల అజ్ఞానం అప్పటికి కూడ తొలగి పోలేదు.

**ప్రాదురాసీత్తతో జ్యోతిరుభయోరంతరే మహత్ ।**
**పూరయన్నిజయా భాసా ద్యావాభూమ్యోర్యదంతరమ్ ॥ 37 ॥**

అంతట వారిరువురి మధ్య ఒక గొప్ప జ్యోతి ఉద్భవించింది. అది తన కాంతులచే భూమ్యాకాశాల మధ్య భాగాన్ని నింపివేసింది.

**జ్యోతిర్మండలమధ్యస్థో దదృశే పురుషాకృతిః ।**
**విధిక్రతుభ్యాం తత్రైవ మహాద్భుతతనుర్మునే! ॥ 38 ॥**

ఓ సనత్కుమారా! ఆ కాంతిమండలముయొక్క మధ్య భాగములో ఒక పురుషాకారాన్ని గాంచి బ్రహ్మ విష్ణువులు అత్యంత విస్మయాన్ని పొందారు.

**ప్రజజ్వాలాథ కోపేన బ్రహ్మణః పంచమం శిరః ।**
**ఆవయోరంతరే కోఽసౌ బిభృయాత్పురుషాకృతిమ్ ॥ 39 ॥**

అంతట బ్రహ్మయొక్క ఐదవ తల కోపంతో మండిపడింది. "మాయిద్దరి మధ్యలో పురుషాకృతిని దాల్చి ఆవిర్భవించిన ఈ తేజస్సు ఎవరు?"

**విధిః సంభావయేద్యావత్తావత్స త్రివిలోచనః ।**
**దృష్టః క్షణేన చ మహాపురుషో నీలలోహితః ॥ 40 ॥**

బ్రహ్మ ఊహ చేయు లోపలనే, ముక్కంటి నీలలోహితుడునైన మహాపురుషుడు క్షణంలో కానవచ్చాడు.

**త్రిశూలపాణిర్భాలాక్షో నాగోడుపవిభూషణః ।**
**హిరణ్యగర్భస్తం దృష్ట్వా విహసన్ ప్రాహ మోహితః ॥ 41 ॥**

త్రిశూలపాణి, ఫాలాక్షుడు, సర్పములు, చంద్రుడు అలంకారములుగా గలవాడునైన ఆ పురుషుని జూచి మోహితుడైయున్న బ్రహ్మ నవ్వుతూ ఇలా పలికాడు.

**నీలలోహిత! జానే త్వాం మాభైషీశ్చంద్రశేఖర! ।**
**భాలస్థలాన్మమ పురా రుద్రః ప్రాదురభూద్భవాన్ ॥ 42 ॥**

ఓయీ! నీలలోహితా! చంద్రశేఖరా! నేను నిన్ను ఎరుగుదును. భయపడకుము. పూర్వము నీవు నా లలాట-దేశం నుండి రుద్రరూపుడవై ఆవిర్భవించావు.

**రోదనాద్రుద్రనామాఽపి యోజితోఽసి మయా పురా ।**
**మామేవ శరణం యాహి పుత్ర! రక్షాం కరోమి తే ॥ 43 ॥**

నీవు రోదించుటచే నేను నీకు పూర్వము రుద్రుడను నామధేయము నిచ్చియుంటిని. నన్ను మాత్రమే శరణు పొందుము. పుత్రా! నిన్ను నేను రక్షించెదను.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**అథేశ్వరః పద్మయోనేః శ్రుత్వా గర్వవతీం గిరమ్ ।**
**చుకోపాతీవ చ తదా కుర్వన్నివ లయం మునే! ॥ 44 ॥**

ఓ మునీ! అంతట పద్మసంభవుడైన బ్రహ్మయొక్క గర్వంతో కూడిన మాటలను విని ఈశ్వరుడు మిక్కిలి కోపించెను. అప్పుడాతడు ప్రళయమును చేయునా అన్నట్లుండెను.

**స కోపతస్సముత్పాద్య పురుషం భైరవం క్వచిత్ ।**
**ప్రజ్వలంతం సుమహసా ప్రీత్యా చ పరమేశ్వరః ॥ 45 ॥**

ఆ పరమేశ్వరుడు తన కోపమునుండి భయంకరాకారుడు, గొప్ప తేజస్సుతో ప్రజ్వరిల్లువాడునగు ఒక పురుషుని ప్రేమతో సృష్టించాడు.

**ఈశ్వర ఉవాచ** – ఈశ్వరుడు పలికాడు.

**ప్రాక్చ పంకజజన్మాసౌ శాస్యస్తే కాలభైరవ! ।**
**కాలవద్రాజసే సాక్షాత్కాలరాజస్తతో భవాన్ ॥ 46 ॥**

ఓ కాలభైరవా! పద్మసంభవుడైన ఈ బ్రహ్మను నీవు ముందుగా దండింపవలెను. నీవు సాక్షాత్తు కాలునివలె ప్రకాశించుచున్నందున నీకు 'కాలరాజు' అని పేరు.

**విశ్వం భర్తుం సమర్థోఽసి భీషణాద్భైరవః స్మృతః ।**
**త్వత్తో భేష్యతి కాలోఽపి తతస్త్వం కాలభైరవః ॥ 47 ॥**

నీవు జగత్తును భరించుటకు సమర్థుడవు. నిన్ను చూచినచో భయం కలుగుతుంది. కాలంకూడ నీకు భయపడుతుంది. కావున నీకు 'కాలభైరవుడు' అని పేరు.

**ఆమర్దయిష్యతి భవాన్ రుష్టో దుష్టాత్మనో యతః ।**
**ఆమర్దక ఇతి ఖ్యాతిం తతస్సర్వత్ర యాస్యసి ॥ 48 ॥**

నీవు కోపించి దుష్టబుద్ధులను సంహరించెదవుగావున నీవు లోకములన్నిట 'ఆమర్దకుడు' అను ఖ్యాతిని పొందెదవు.

**యతః పాపాని భక్తానాం భక్షయిష్యతి తత్ క్షణాత్ ।**
**పాపభక్షణ ఇత్యేవ నవ నామ భవిష్యతి ॥ 49 ॥**

నీవు భక్తుల పాపాలను తత్క్షణమే భక్షించెదవు. కావున నీకు 'పాపభక్షణుడు' అను క్రొత్తపేరు కలుగుతుంది.

**యా మే ముక్తిపురీ కాశీ సర్వాభ్యోఽహి గరీయసీ ।**
**ఆధిపత్యంచ తస్యాస్తే కాలరాజ సదైవ హి ॥ 50 ॥**

ఓ కాలరాజా! నగరములన్నింటిలోను గొప్పది, మరియు మోక్షపురియునైన నా కాశీనగరమేది కలదో, దానిపై నీకు సదా ఆధిపత్యము గలదు.

**తత్ర యే పాతకినరాస్తేషాం శాస్తా త్వమేవ హి ।**
**శుభాశుభం చ తత్కర్మ చిత్రగుప్తో లిఖిష్యతి ॥ 51 ॥**

అక్కడనుండు పాపాత్ములను దండించువాడవు నీవే. మానవుల శుభాశుభ కర్మల జాబితాను చిత్రగుప్తుడు వ్రాయగలడు.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఏతాన్వరాన్ ప్రగృహ్యాథ తత్క్షణాత్కాలభైరవః ।**
**వామాంగులినఖాగ్రేణ చకర్త చ విధేశ్శిరః ॥ 52 ॥**

కాలభైరవుడీ వరములనన్నింటిని స్వీకరించిన తత్క్షణమే బ్రహ్మయొక్క శిరస్సును కాలభైరవుడు ఎడమ చేతి వ్రేలిగోటితో నలిపివేశాడు.

**యదంగమపరాధ్నోతి కార్యం తస్యైవ శాసనమ్ ।**
**అతో యేన కృతా నిందా తచ్ఛిన్నం పంచమం శిరః ॥ 53 ॥**

ఏ అంగము అపరాధమును చేయునో, అట్టి అంగమును నిశ్చయంగా దండించాలి. కావున ఏ శిరస్సు పరమేశ్వరుని నిందించినదో, ఆ ఐదవ శిరస్సు ఖండింపబడింది.

**అథ ఛిన్నం విధిశిరో దృష్ట్వా భీతతరో హరిః ।**
**శాతరుద్రియమంత్రైశ్చ భక్త్యా తుష్టావ శంకరమ్ ॥ 54 ॥**

బ్రహ్మయొక్క తల నరుకబడుటను గాంచి విష్ణువు మరింత భయపడి భక్తిపూర్వకంగా శతరుద్రీయ మంత్రాలతో శంకరుని స్తుతించాడు.

**భీతో హిరణ్య గర్భోఽపి జజాప శతరుద్రియమ్ ।**
**ఇత్థం తౌ గతగర్వౌ హి సంజాతౌ తత్క్షణాన్మునే! ॥ 55 ॥**

ఓ మునీ! భయపడియున్న బ్రహ్మ కూడా శతరుద్రీయమును జపించాడు. ఈ విధంగా వారిరువురు క్షణకాలంలో గర్వాన్ని విడిచిపెట్టారు.

**పరబ్రహ్మ శివః సాక్షాత్సచ్చిదానందలక్షణః ।**
**పరమాత్మా గుణాతీత ఇతి జ్ఞానమవాపతుః ॥ 56 ॥**

సాక్షాత్తుగా శివుడే సచ్చిదానందస్వరూపుడగు పరబ్రహ్మ. ఆయనయే గుణాతీతుడైన పరమాత్మ. ఈ జ్ఞానాన్ని వారిరువురు అప్పుడు పొందారు.

**సనత్కుమార! సర్వజ్ఞ! శృణు మే పరమం శుభమ్ ।**
**యావద్గర్వో భవేత్తావజ్జ్ఞానగుప్తిర్విశేషతః ॥ 57 ॥**

ఓ సనత్కుమార! నేను పలికే శుభంకరమైన శ్రేష్ఠ వచనాలను వినుము. వ్యక్తిలో గర్వమున్నంత వరకు, వారి జ్ఞానము ప్రకాశింపదు.

**త్యక్త్వా ఽభిమానం పురుషో జానాతి పరమేశ్వరమ్ ।**
**గర్విణం హంతి విశ్వేశో జాతో గర్వాపహారకః ॥ 58 ॥**

అభిమానమును వీడి భక్తితోనున్న పురుషుడు పరమేశ్వరుని తెలిసికొనగలుగుతాడు. విశ్వేశ్వరుడు గర్విని సంహరిస్తాడు. గనుకనే గర్వాపహారకుడుగ జన్మించాడు.

**అథ విష్ణువిధీ జ్ఞాత్వా విగర్వౌ పరమేశ్వరః ।**
**ప్రసన్నో ఽభూన్మహాదేవో ఽకరోత్తావభయౌ ప్రభుః ॥ 59 ॥**

అపుడు బ్రహ్మ విష్ణువులకు గర్వము తొలగినదని పరమేశ్వరుడు తెలిసికొని, ప్రసన్నుడై వారికి అభయమునిచ్చాడు.

**ఆశ్వాస్య తౌ మహాదేవః ప్రీతః ప్రణతవత్సలః ।**
**ప్రాహ స్వాం మూర్తిమపరాం భైరవం తం కపర్దినమ్ ॥ 60 ॥**

భక్తప్రియుడగు మహాదేవుడు వారినోదార్చి సంప్రీతితో తన అవతారమైనట్టియు, జటాధారియునగు భైరవునితో ఇట్లు పలికాడు.

**మహాదేవ ఉవాచ –** మహాదేవుడు పలికాడు.

**త్వయా మాన్యో విష్ణురసౌ తథా శతధృతిః స్వయమ్ ।**
**కపాలం వైధసం వాపి నీలలోహిత! ధారయ ॥ 61 ॥**

ఓ నీలలోహితా! ఈ విష్ణువును నీవు ఆదరించుము. నీవు ఈ బ్రహ్మను కూడ మన్నింపుము. ఈ బ్రహ్మ కపాలమును నీవు ధరింపుము.

**బ్రహ్మహత్యాపనోదాయ వ్రతం లోకాయ దర్శయ ।**
**చర త్వం సతతం భిక్షాం కపాలవ్రతమాశ్రితః ॥ 62 ॥**

బ్రహ్మహత్యాదోషనివారణ కొరకు నీవు కపాలవ్రతము నాశ్రయించి నిత్యము భిక్షాటనము చేసి లోకములకు ఆదర్శము కమ్ము.

**ఇత్యుక్త్వా పశ్యతస్తస్య తేజోరూపః శివో ఽబ్రవీత్ ।**
**ఉత్పాద్య చైకాం కన్యాం తు బ్రహ్మహత్యాభివిశ్రుతామ్ ॥ 63 ॥**

ఇట్లు పలికి తేజోరూపుడైన శివుడు, అతడు చూచుచుండగానే, 'బ్రహ్మహత్య' యని ప్రసిద్ధిగాంచిన ఒక కన్యను సృష్టించి ఇట్లు పలికాడు.

**యావద్వారాణసీం దివ్యాం పురీమేనాం గమిష్యతి ।**
**తావత్త్వం భీషణే కాలమనుగచ్ఛోగ్రరూపిణమ్ ॥ 64 ॥**

"ఓ భయంకరాకారముగల బ్రహ్మహత్యా! ఉగ్రరూపుడైన ఈ కాలభైరవుడు దివ్యమైన వారాణసీ నగరం చేరునంత వరకు నీవు ఆయనను అనుసరించి వెళ్లుము.

**సర్వత్ర తే ప్రవేశోఽస్తి త్యక్త్వా వారాణసీం పురీమ్ ।**
**వారాణసీం యదా గచ్ఛేత్తన్ముక్తాం భవ తత్క్షణాత్ ॥ 65 ॥**

నీకు వారాణసీ నగరమును మినహాయించి తక్కిన అన్ని ప్రదేశములందు ప్రవేశము గలదు. ఇతడు వారాణసిలో ప్రవేశించిన తత్క్షణమే నీ వితనిని విడిచి వెళ్లుము.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు

**నియోజ్య తామితి తదా బ్రహ్మహత్యాం చ తాం ప్రభుః ।**
**మహాద్భుతశ్చ స శివోఽప్యంతర్ధానమగాత్తతః ॥ 66 ॥**

మహాశ్చర్యకరుడగు శివుడు బ్రహ్మహత్యను ఈ విధంగా ఆజ్ఞాపించిన తరువాత అంతర్ధానమును పొందాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం భైరవావతారవర్ణనం నామాష్టమోఽధ్యాయః ॥ 8 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు భైరవావతారవర్ణనం అనే పేరుగల ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## నవమోఽధ్యాయః - తొమ్మిదవ అధ్యాయం

## భైరవావతారలీలావర్ణనమ్ - భైరవావతారలీలావర్ణనం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**సనత్కుమార! సర్వజ్ఞ! భైరవీమపరాం కథామ్ ।**
**శృణు ప్రీత్యా మహాదోషసంహర్త్రీం భక్తివర్ధినీమ్ ॥ 1 ॥**

ఓ సనత్కుమారా! సర్వజ్ఞా! భైరవుని మరియొక గాథను ప్రీతితో వినుము. ఇది మహాపాపాలను పోగొట్టి భక్తిని వర్ధిల్లజేస్తుంది.

**తత్సాన్నిధ్యం భైరవోఽపి కాలోఽభూత్కాలకాలనః ।**
**స దేవదేవవాక్యేన బిభ్రత్కాపాలికం వ్రతమ్ ॥ 2 ॥**

శివుని సన్నిధిలో భైరవుడు కూడా కాలాన్ని చెదరగొట్టే కాలుడైనాడు. ఆ భైరవుడు శివాజ్ఞచే కాపాలిక వ్రతాన్ని అనుష్ఠించాడు.

**కపాలపాణిర్విశ్వాత్మా చచార భువనత్రయమ్ ।**
**నాత్యాక్షీచ్చాపి తం దేవం బ్రహ్మహత్యాపి దారుణా ॥ 3 ॥**

విశ్వాత్ముడైన భైరవుడు కపాలపాణియై ముల్లోకములందు తిరిగాడు. దారుణమైన బ్రహ్మహత్య అతనిని కూడ విడిచిపెట్టలేదు.

**ప్రతితీర్థం భ్రమన్నాపి విముక్తో బ్రహ్మహత్యయా ।**
**అతః కామారిమహిమా సర్వోఽపి హ్యవగమ్యతామ్ ॥ 4 ॥**

తీర్థములన్నియు తిరుగాడిన పిదప శివుని పట్టణములో బ్రహ్మహత్య ఆయనను విడిచి పెట్టింది. దీనిని బట్టి మన్మథసంహారకుడైన శివుని మహిమని అందరు అవగతం చేసుకోవచ్చును.

**ప్రమథైః సేవ్యమానోఽపి హ్యేకదా విహరన్హరః ।**
**కాపాలికో యయౌ స్వైరీ నారాయణనికేతనమ్ ॥ 5 ॥**

శివస్వరూపుడైన భైరవుడు ప్రమథగణాలచే సేవింపబడువాడైనను ఒకనాడు యథేచ్ఛగా విహరించుచూ కపాలధారియై నారాయణుని నివాసానికి వెళ్లాడు.

**అథాయాన్తం మహాకాలం త్రినేత్రం సర్పకుండలమ్ ।**
**మహాదేవాంశసంభూతం పూర్ణాకారం చ భైరవమ్ ॥ 6 ॥**

మహాకాలుడు, త్రినేత్రుడు, సర్పకుండలుడునైన మహాదేవుని పూర్ణాంశతో జన్మించినవాడగు భైరవుడు వచ్చుచుండుటను మహావిష్ణువు చూసెను.

**పపాత దండవద్భూమౌ తం దృష్ట్వా గరుడధ్వజః ।**
**దేవాశ్చ మునయశ్చైవ దేవనార్యః సమంతతః ॥ 7 ॥**

భైరవుని చూచిన గరుడధ్వజుడైన విష్ణువు, దేవతలు, మునులు, మరియు దేవతాస్త్రీలు అన్నివైపుల నుండియు సాష్టాంగనమస్కారం గావించారు.

**అథ విష్ణుః ప్రణమ్యైనం ప్రయాతః కమలాపతిః ।**
**శిరస్యంజలిమాధాయ తుష్టావ వివిధైః స్తవైః ॥ 8 ॥**

అంతట విష్ణువు భైరవునకు ప్రణమిల్లి శిరస్సుపై అంజలి ఘటించి అనేక స్తోత్రాలతో స్తుతించాడు.

**సానందోఽథ హరిః ప్రాహ ప్రసన్నాత్మా మహామునే! ।**
**క్షీరోదమథనోద్భూతాం పద్మాం పద్మాలయాం ముదా ॥ 9 ॥**

ఓ మహామునీ! ఆనందంతో నిండి ప్రసన్నాత్ముడైన విష్ణువు క్షీరసాగరమథనమందు జన్మించినట్టియు, పద్మాసనయైనట్టియు, లక్ష్మీదేవినుద్దేశించి ఆనందంతో ఇట్లు పలికాడు.

**విష్ణురువాచ** - విష్ణువు పలికాడు.

**ప్రియే! పశ్యాబ్జనయనే! ధన్యాసి సుభగేఽనఘే! ।**
**ధన్యోఽహం దేవి! సుశ్రోణి! యత్పశ్యావో జగత్పతిమ్ ॥ 10 ॥**

ఓ ప్రియా! పద్మముల వంటి కన్నులుగలదానా! సుందరీ! పుణ్యాత్మురాలా! నీవు ధన్యురాలవు. నేను కూడ ధన్యుడను. ఎందువలననగా, మనము జగత్పతిని దర్శించుచున్నాము.

**అయం ధాతా విధాతా చ లోకానాం ప్రభురీశ్వరః ।**
**అనాదిః శరణః శాంతః పురః షడ్వింశసంమితః ॥ 11 ॥**

ఈ ఈశ్వరుడే సృష్టికర్త, కర్మఫలదాత, ముల్లోకములకు ప్రభువు, ఆదిరహితుడు, రక్షకుడు, శాంతుడు, మరియు ఇరవై ఆరు తత్త్వాలకు అధిష్ఠానము ఆయనయే. (ఇంద్రియాలు 10+స్థూలసూక్ష్మభూతాలు 10+మనోబుద్ధ్యహంకారములు 3+జీవపురుషులు 2+అదృష్టము 1=26 తత్త్వాలు).

**సర్వజ్ఞః సర్వయోగీశః సర్వభూతైకనాయకః ।**
**సర్వభూతాంతరాత్మాయం సర్వేషాం సర్వదః సదా ॥ 12 ॥**

సర్వజ్ఞుడు, సర్వయోగీశ్వరుడు, సర్వభూతైకనాయకుడు ఈయనయే. సర్వప్రాణులలో అంతరాత్మయై వెలుగొందునదియు, సర్వులకు, సర్వకాలములందు సర్వమును ఇచ్చునదియు ఈయనయే.

**యే వినిద్రా వినిశ్వాసాః శాంతా ధ్యానపరాయణాః ।**
**ధియా పశ్యంతి హృదయే సోఽయం పద్మే! సమీక్షతామ్ ॥ 13 ॥**

ఓ లక్ష్మీ! యోగులు నిద్రను జయించి శ్వాసను నిరోధించి మనస్సును ఏకాగ్రం చేసి ధ్యాననిమగ్నులై బుద్ధితో హృదయమునందు ఏ పరమేశ్వరుని దర్శిస్తారో అట్టి ఈశ్వరుడు మన ఎదుటనున్నాడు. చూడుము.

**యం విదుర్వేదతత్త్వజ్ఞా యోగినో యతమానసాః ।**
**అరూపో రూపవాన్భూత్వా సోఽయమాయాతి సర్వగః ॥ 14 ॥**

వేదముల సారము నెరింగి, నియతమానసులైన యోగులు మాత్రమే ఏ ఈశ్వరుని తెలియగల్గుదురో, అట్టి నిరాకారుడు, సాకారుడునై యుండు ఆ పరమాత్మ దేహధారియై మన ఎదుటకు వచ్చుచున్నాడు.

**అహో! విచిత్రం దేవస్య చేష్టితం పరమేష్ఠినః ।**
**యస్యాఖ్యాం బ్రువతో నిత్యం న దేహః సోఽపి దేహభృత్ ॥ 15 ॥**

దేవదేవుడైన ఈశ్వరుని చేష్టలు విచిత్రమైనవి సుమా! ఎవని నామమును కీర్తించినచో జన్మరాహిత్యము కలుగునో అట్టివాడు దేహమును ధరించియున్నాడు.

**తం దృష్ట్వా న పునర్జన్మ లభ్యతే మానవైర్భువి ।**
**సోఽయమాయాతి భగవాన్ త్ర్యంబకశ్శశిభూషణః ॥ 16 ॥**

ఈయనను దర్శించిన మానవులు మరల భూమిపై జన్మించరు. అట్టి భగవానుడు, ముక్కంటి, శశిభూషణుడు మన ఎదుటకు వచ్చుచున్నాడు.

**పుండరీకదళాయామే ధన్యే మేఽద్య విలోచనే ।**
**యద్దృశ్యతే మహాదేవో హ్యాభ్యాం లక్ష్మి! మహేశ్వరః ॥ 17 ॥**

ఓ లక్ష్మి! మన మిరువురము ఈనాడు మహాదేవుని దర్శించినాము. పద్మపత్రముల వలె విశాలమైన నా కన్నులీనాడు ధన్యమైనాయి.

**ధిగ్ధిక్పదం తు దేవానాం పరం దృష్ట్వా న శంకరమ్ ।**
**లభ్యతే యత్ర నిర్వాణం సర్వదుఃఖాంతకృత్తు యత్ ॥ 18 ॥**

పరమాత్మయగు శంకరుని దర్శనముచే సర్వదుఃఖములను నశింపజేయు మోక్షము లభిస్తుంది. అట్టి మోక్షమునీయజాలని దేవపదవులకు నిందయగు గాక.

**దేవత్వాదశుభం కించిద్దేవలోకే న విద్యతే ।**
**దృష్ట్వాపి సర్వే దేవేశం యన్ముక్తిన్న లభామహే ॥ 19 ॥**

దేవలోకములో దేవపదవిని పొందుట కంటె అధికమైన అశుభము మరియొకటి లేదు. ఎందువలననగా, మేమందరము దేవదేవుని దర్శించినను ముక్తిని పొందలేకున్నాము.

**ఏవముక్త్వా హృషీకేశః సంప్రహృష్టతనూరుహః ।**
**ప్రణిపత్య మహాదేవమిదమాహ వృషధ్వజమ్ ॥ 20 ॥**

ఇంద్రియాధిపతియైన విష్ణువు ఆనందంతో గగుర్పాటు గలవాడై ఇట్లు పలికి వృషధ్వజుడైన మహాదేవునకు ప్రణమిల్లి ఇలా పలికాడు.

**విష్ణురువాచ** - విష్ణువు చెప్పాడు.

**కిమిదం దేవదేవేన సర్వజ్ఞేన త్వయాऽవిభో! ।**
**క్రియతే జగతాం ధాత్రా సర్వపాపహరావ్యయ! ॥ 21 ॥**

హే విభూ! సర్వపాపహరా! అవ్యయా! జగత్స్రష్టవు, దేవదేవుడవు, సర్వజ్ఞుడవునగు నీవు ఏమి చేయుచున్నావు?

**క్రీడేయం తవ దేవేశ! త్రిలోచన! మహామతే! ।**
**కిం కారణం విరూపాక్ష! చేష్టితం తే స్మరార్దన ॥ 22 ॥**

ఓ దేవదేవా! ముక్కంటీ! మహామతీ! ఇది నీకు క్రీడ. ఓ విరూపాక్ష! మన్మథనాశకా! నీవిట్లు చేయుటకు కారణమేమి?

**కిమర్థం భగవన్! శంభో! భిక్షాం చరసి శక్తిప! ।**
**సంశయో మే జగన్నాథ! ఏష త్రైలోక్యరాజ్యదః ॥ 23 ॥**

హే భగవాన్! శంభో! శక్తినాథా! నీవు భిక్షాటనము చేయుటకు కారణమేమి? ఓ జగన్నాథ! త్రైలోక్యాధిపత్యమునిచ్చిన నీవు మాయీ సంశయమును తీర్చుము.

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఏవముక్తస్తతః శంభుర్విష్ణునా భైరవో హరః ।**
**ప్రత్యువాచాద్భుతోऽతిస్స విష్ణుం హి విహసన్ప్రభుః ॥ 24 ॥**

విష్ణువిట్లు పలుకగా భైరవరూపములో నున్నవాడు, పాపహరుడు, అద్భుతమైన లీలలు గలవాడునగు భైరవుడు నవ్వి విష్ణువునకు ఇట్లు బదులు పలికాడు.

**భైరవ ఉవాచ** - భైరవుడు పలికాడు.

**బ్రహ్మణస్తు శిరశ్ఛిన్నమంగుళ్యాగ్రనఖేన హ ।**
**తదఘం ప్రతిహంతుం హి చరామ్యేతద్వ్రతం శుభమ్ ॥ 25 ॥**

బ్రహ్మయొక్క శిరస్సును వ్రేలిగోటితో నలిపియుంటిని. ఆ పాపమును పోగొట్టుకొనుటకై ఈ శుభవ్రతము-నాచరించుచున్నాను.

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఏవముక్తో మహేశేన భైరవేణ రమాపతిః ।**
**స్మృత్వా కించిన్నతశిరాః పునరేవమజిజ్ఞపత్ ॥ 26 ॥**

భైరవరూపములోనున్న మహేశ్వరుడిట్లు పలుకగా, లక్ష్మీపతి ఆ సంఘటనను స్మరించి కొలదిగా తలను వంచుకొని మరల ఇట్లు విన్నవించాడు.

**విష్ణురువాచ** – విష్ణువు పలికాడు.

**యథేచ్ఛసి తథా క్రీడ సర్వవిఘ్నాపనోదక! ।**
**మాయయా మాం మహాదేవ! నాచ్ఛాదయితుమర్హసి ॥ 27 ॥**

ఓ మహాదేవా! నీకెట్లు అభీష్టమైనచో అట్లే క్రీడించుము. కాని నన్ను మీ మాయతో కప్పివేయ తగదు.

**నాభీకమలకోశాత్తు కోటిశః కమలాసనాః ।**
**కల్పే కల్పే పురా హ్యాసన్ సత్యం యోగబలాద్విభో! ॥ 28 ॥**

ఓ విభూ! నాయొక్క నాభికమలకోశమునుండి ప్రతికల్పమునందు ఎందరో బ్రహ్మలు పూర్వము యోగబలంచే పుట్టియున్నారు. ఇది సత్యము.

**త్యజ మాయామిమాం దేవ! దుస్తరామకృతాత్మభిః ।**
**బ్రహ్మాదయో మహాదేవ! మాయయా తవ మోహితాః ॥ 29 ॥**

ఓ దేవా! మనోనియంత్రణ లేనివారు దాట శక్యము కాని నీ యీ మాయను విడిచిపెట్టుము. ఓ మహాదేవా! నీ మాయచే బ్రహ్మాదులును మోహితులగుచున్నారు.

**యథావదనుగచ్ఛామి చేష్టితం తే శివాపతే! ।**
**తవైవానుగ్రహాచ్ఛంభో! సర్వేశ్వర! సతాంగతే! ॥ 30 ॥**

ఓ పార్వతీపతీ! సర్వేశ్వరా! శంభూ! సత్పురుషులకు శరణమైనవాడా! నీ అనుగ్రహంచేతనే నీ లీలలను సమగ్రంగా నేను తెలియగలుగుచున్నాను.

**సంహారకాలే సంప్రాప్తే సదేవాన్నిఖిలాన్మునీన్ ।**
**లోకాన్వర్ణాశ్రమవతో హరిష్యసి యదా హర ॥ 31 ॥**

ఓ హరా! సంహార కాలము రాగానే నీవు దేవతలతో, మహర్షులందరితో, వర్ణాశ్రమములతో కూడియున్న ఈ లోకాలను ఉపసంహరిస్తావు.

**తదా కృతే మహాదేవ! పాపం బ్రహ్మవధాదికమ్ ।**
**పారతంత్ర్యం న తే శంభో! స్వైరం క్రీడత్యతో భవాన్ ॥ 32 ॥**

నీవు బ్రహ్మశిరస్సును నరకుట అను పాపాన్ని లోకక్షేమం కొరకు మాత్రమే చేసి యుంటివి. నీకు పరాధీనత లేదు. కాబట్టి నీవు యథేచ్ఛగా క్రీడించుచున్నావు.

**అర్థీవ బ్రహ్మణో హ్యాస్థ్నాం స్రక్కంఠే తవ భాసతే ।**
**తథాద్యనుగతా శంభో! బ్రహ్మహత్యా తవానఘ! ॥ 33 ॥**

వేద విహితములగు ఆహుతులకు ప్రభువైన శంకరా! నీ కంఠములో అస్థికల మాల ప్రకాశించుచున్నది. ఓ శంభూ! పాపరహితా! నిన్ను బ్రహ్మహత్య ఈనాటికిని అనుసరించుచునే యున్నది.

**కృత్వాపి సుమహత్పాపం యస్త్వాం స్మరతి మానవః ।**
**ఆధారం జగతామీశ! తస్య పాపం విలీయతే ॥ 34 ॥**

ఓ ఈశా! మహాపాపమును చేసినప్పటికినీ మానవుడు, జగదాధారుడవైన నిన్ను స్మరించినచో ఆ పాపములు నశిస్తాయి.

**యథా తమో న తిష్ఠేత సన్నిధావంశుమాలినః ।**
**తథైవ తవ యో భక్తః పాపం తస్య వ్రజేత్ క్షయమ్ ॥ 35 ॥**

సూర్యుని సన్నిధిలో చీకటి ఏ విధంగా ఉండలేదో, అట్లే నీ భక్తుని పాపము కూడ వెంటనే వినాశమును పొందుతుంది.

**యశ్చింతయతి పుణ్యాత్మా తవ పాదాంబుజద్వయమ్ ।**
**బ్రహ్మహత్యాకృతమపి పాపం తస్య వ్రజేత్ క్షయమ్ ॥ 36 ॥**

ఏ పుణ్యాత్ముడు నీ పాదాంబుజద్వయాన్ని స్మరిస్తాడో అతని బ్రహ్మహత్యవలన కలిగిన పాపమైనను నశిస్తుంది.

**తవ నామానురక్తా వాగ్యస్య పుంసో జగత్పతే! ।**
**అప్యద్రికూటతులితం నైనస్తమనుబాధతే ॥ 37 ॥**

ఓ జగత్పతీ! ఏ పురుషుని వాక్కు నీ నామమునందు రుచిని కలిగియుండునో, పర్వత శిఖరసమానమైన ఎంత పెద్ద పాపమైనను, వానిని బాధించలేదు.

**పరమాత్మన్! పరంధామ! స్వేచ్ఛాభిధృతవిగ్రహ! ।**
**కుతూహలం తవేశేదం కృపణాధీనతేశ్వర! ॥ 38 ॥**

ఓ పరమాత్మా! పరంధామా! స్వేచ్ఛచే దేహాన్ని ధరించినవాడా! ఈశ్వరా! నీవిట్టి దైన్యానికి అధీనుడవగుట కేవలము కుతూహలముకొరకు మాత్రమే.

**అద్య ధన్యోఽస్మి దేవేశ! యన్న పశ్యంతి యోగినః ।**
**పశ్యామి తం జగన్మూర్తిం పరమేశ్వరమవ్యయమ్ ॥ 39 ॥**

ఓ దేవదేవా! పరమేశ్వరుడు, జగత్స్వరూపుడు, అవ్యయుడునగు నిన్ను యోగులు కనజాలరు. అట్టి నిన్ను దర్శించి నేను ధన్యుడనయ్యాను.

**అద్య మే పరమో లాభస్త్వద్యమే మంగళం పరమ్ ।**
**తం దృష్ట్వాఽమృతతృప్తస్య తృణం స్వర్గాపవర్గకమ్ ॥ 40 ॥**

ఈనాడు నాకు సర్వోత్కృష్టమగు లాభము, మరియు మంగళము కలిగాయి. నిన్ను దర్శించుట అనే అమృతంతో తృప్తినందిన వానికి స్వర్గము కాని, మోక్షముగాని తృణతుల్యమగును.

**ఇత్థం వదతి గోవిందే విమలా పద్మయా తయా ।**
**మనోరథవతీ నామ భిక్షాపాత్రే సమర్పితా ॥ 41 ॥**

గోవిందుడిట్లు పలుకగా ఆ లక్ష్మీదేవి భైరవుని భిక్షాపాత్రలో 'మనోరథవతి' అను స్వచ్ఛమైన మణిని సమర్పించింది.

**భిక్షాటనాయ దేవోఽపి నిరగాత్పరయా ముదా ।**
**అన్యత్రాపి మహాదేవో భైరవశ్చాత్తవిగ్రహః ॥ 42 ॥**

భైరవరూపమును దాల్చిన దేవదేవుడైన మహాదేవుడు కూడ మహానందంతో భిక్షాటన కొరకు మరియొక స్థానానికి వెళ్లాడు.

**దృష్ట్వాఽనుయాయినీం తాం తు సమాహూయ జనార్దనః ।**
**సంప్రార్థయద్బ్రహ్మహత్యాం విముంచ త్వం త్రిశూలినమ్ ॥ 43 ॥**

ఆయనను వెంటాడుచున్న బ్రహ్మహత్యను జనార్దనుడు వెనుకకు పిలిచి "నీవు త్రిశూలియైన శివుని విడిచిపెట్టుము" అని ప్రార్థించాడు.

**బ్రహ్మహత్యోవాచ –** బ్రహ్మహత్య పలికింది.

**అనేనాపి మిషేణాహం సంసేవ్యాముం వృషధ్వజమ్ ।**
**ఆత్మానం పావయిష్యామి త్వపునర్భవదర్శనమ్ ॥ 44 ॥**

నేనీ వ్యాజముతో ఈ వృషధ్వజుని చక్కగా సేవించి నన్ను పవిత్రముచేసుకొని పునర్జన్మలేని మోక్షాన్ని పొందుతాను.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**సా తత్యాజ న తత్పార్శ్వం వ్యాహృతాపి మురారిణా ।**
**తమూచేఽథ హరిం శంభుః స్మేరాస్యో భైరవో వచః ॥ 45 ॥**

మురారి చెప్పినను ఆమె అతని సమీపమునుండి తొలగిపోలేదు. అంతట భైరవుడగు శంభుడు చిరునవ్వుతో విష్ణువునుద్దేశించి ఇట్లు పలికాడు.

**భైరవ ఉవాచ –** భైరవుడు పలికాడు.

**త్వద్వాక్ప్రీయూషపానేన తృప్తోఽస్మి బహుమానద! ।**
**స్వభావోఽయం హి సాధూనాం యత్త్వం వదసి మాపతే! ॥ 46 ॥**

ఓ లక్ష్మీపతీ! నీ వాగమృతపానంచే సంతుష్టుడనయ్యాను. నీవు మాటలాడు తీరు సాధుస్వభావమైయున్నది.

**వరం వృణీష్వ గోవింద! వరదోఽస్మి తవానఘ! ।**
**అగ్రణీర్మమ భక్తానాం త్వం హరే! నిర్వికారవాన్ ॥ 47 ॥**

ఓ గోవిందా! ఓ అనఘా! ఓ హరీ! నీకు వరమునిచ్చెదను. వరమును కోరుకొనుము. వికారములు లేని నీవు నా భక్తాగ్రగణ్యుడవు.

**నో మాద్యన్తి తథా భైక్ష్యైర్భిక్షవోఽప్యతి సంస్కృతైః ।**
**యథా మానసుధాపానైర్నను భిక్షాటనజ్వరాః ॥ 48 ॥**

భిక్షాటనము చేసి అలసిన సాధువులు ఆదరపూర్వక వచనములచే ఎట్టి సంతృప్తిని పొందెదరో, అట్టి సంతృప్తిని పరమమధురమైన భక్ష్యములతో కూడిన భిక్షాన్నమీయజాలదు.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యాకర్ణ్య వచః శంభోః భైరవస్య పరాత్మనః ।**
**సుప్రసన్నతరో భూత్వా సమవోచన్మహేశ్వరమ్ ॥ 49 ॥**

భైరవస్వరూపములోనున్న పరమాత్మయగు శంభుని మాటలను విని విష్ణువు మరింత ప్రసన్నుడై మహేశ్వరునితో ఇట్లు పలికెను.

**విష్ణురువాచ** – విష్ణువు పలికాడు.

**ఏష ఏవ వరః శ్లాఘ్యో యదహం దేవతాధిపమ్ ।**
**పశ్యామి త్వాం దేవదేవ! మనోవాణీ పథాతిగమ్ ॥ 50 ॥**

ఓ దేవదేవా! దేవతలకధిపతి, మనోవాచామగోచరమైన జ్ఞానమార్గంలో నుండువాడునైన నిన్ను నేను చూడగల్గుచున్నాను. ఇదియే మిక్కిలి కొనియాడదగిన వరము.

**అదభ్రేయం సుధాదృష్టిరనయా మే మహోత్సవః ।**
**అయత్ననిధిలాభోఽయం వీక్షణం హర! తే సతామ్ ॥ 51 ॥**

ఈ నీ శ్రేష్ఠదర్శనము నాకు అమృతతుల్యము. నిన్ను చూచుటయే నాకు పెద్ద పండుగ. ఓ హరా! సత్పురుషులకు నీ దర్శనము, అయత్ననిధిలాభము వంటిది.

**అవియోగోఽస్తు మే దేవ! త్వదంఘ్రియుగళేన వై ।**
**ఏష ఏవ వరః శంభో! నాన్యం కంచిద్వృణే వరమ్ ॥ 52 ॥**

ఓ దేవా! నాకు నీ పాదపద్మములనుండి వియోగము కలుగకుండు గాక! ఓ శంభో! నేను కోరే వరమిదియే. నాకు మరియొక వరముతో పనిలేదు.

**శ్రీభైరవ ఉవాచ** – శ్రీభైరవుడు పలికాడు.

**ఏవం భవతు తే తాత! యత్త్వయోక్తం మహామతే! ।**
**సర్వేషామపి దేవానాం వరదస్త్వం భవిష్యసి ॥ 53 ॥**

ఓ వత్సా! మహామతీ! నీవు కోరిన విధముగానే సర్వము సంపన్నమగును గాక! నీవు దేవతలందరికి వరములనిచ్చువాడవు కూడా కాగలవు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**అనుగృహ్యేతి దైత్యారిం కేంద్రాద్రిభువనేచరమ్ ।**
**భేజే విముక్తనగరీం నామ్నా వారాణసీం పురీమ్ ॥ 54 ॥**

ఈ విధముగా భైరవుడు, భూమికి కేంద్రమగు మేరుపర్వతమునందుండే రాక్షసవిరోధియగు విష్ణువు ననుగ్రహించి వారాణసి అని ప్రసిద్ధిగాంచిన ముక్తిదాయకమగు నగరానికి చేరాడు.

**క్షేత్రే ప్రవిష్టమాత్రేఽథ భైరవే భీషణాకృతౌ ।**
**హాహేత్యుక్త్వా బ్రహ్మహత్యా పాతాళం చావిశత్తదా ॥ 55 ॥**

భయంకరాకారుడగు భైరవుడు ఆ కాశీక్షేత్రములో అడుగుపెట్టగానే బ్రహ్మహత్య హాహాకారాన్ని చేస్తూ పాతాళంలో ప్రవేశించింది.

**కపాలం బ్రాహ్మణః సద్యో భైరవస్య కరాంబుజాత్ ।**
**పపాత భువి తత్తీర్థమభూత్కాపాల మోచనమ్ ॥ 56 ॥**

భైరవుని కరాంబుజము నుండి బ్రహ్మయొక్క కపాలము వెంటనే కిందపడింది. ఆస్థానమే 'కపాల మోచనమ'ను తీర్థమయ్యింది.

**కపాలం బ్రహ్మణో రుద్రస్సర్వేషామేవ పశ్యతామ్ ।**
**హస్తాత్పతన్తమాలోక్య ననర్త పరయా ముదా ॥ 57 ॥**

తన చేతినుండి బ్రహ్మకపాలము నేలబడుటను గాంచి, రుద్రుడు (భైరవుడు) ఆనందంతో అందరు చూచుచుండగానే నాట్యము చేశాడు.

**విధేః కపాలం నాముంచత్కరమత్యన్తదుస్సహమ్ ।**
**పరస్య భ్రమతః క్వాపి తత్కాశ్యాం క్షణతోఽపతత్ ॥ 58 ॥**

బ్రహ్మయొక్క కపాలము ఆయన ఇతరత్రా పరిభ్రమించినంతవరకు ఆయన చేతిని విడిచిపెట్టలేదు. మిక్కిలి దుస్సహమైన ఆ కపాలము కాశీలో క్షణకాలంలో నేలబడింది.

**శూలినో బ్రహ్మణో హత్యా నాపైతి స్మ చ యా క్వచిత్ ।**
**సా కాశ్యాం క్షణతో నష్టా తస్మాత్సేవ్యా హి కాశికా ॥ 59 ॥**

ఏ బ్రహ్మహత్య శూలధారిని ఇతరత్రా ఎక్కడా విడిచిపెట్టలేదో, అట్టిది కాశీలో క్షణకాలంలో నశించింది. కాబట్టి కాశీనగరమును సర్వులు సర్వదా సేవించవలెను.

**కపాలమోచనం కాశ్యాం యః స్మరేత్తీర్థముత్తమమ్ ।**
**ఇహాన్యత్రాపి యత్పాపం క్షిప్రం తస్య ప్రణశ్యతి ॥ 60 ॥**

ఎవడైతే కాశీలో కపాలమోచనమనే ఉత్తమతీర్థమును స్మరిస్తాడో, వాడు సర్వపాపములనుండి శీఘ్రమే విముక్తుడై ఇహపర సుఖాలను పొందుతాడు.

**ఆగత్య తీర్థప్రవరే స్నానం కృత్వా విధానతః ।**
**తర్పయిత్వా పితౄన్ దేవాన్ ముచ్యతే బ్రహ్మహత్యయా ॥ 61 ॥**

మానవుడీ శ్రేష్ఠమైన తీర్థానికి వచ్చి, విధివిధానంగా స్నానమాచరించి పితృదేవతలకు తర్పణములనిచ్చినచో బ్రహ్మహత్యాపాపమునుండి విముక్తుడగును.

**కపాలమోచనం తీర్థం పురస్కృత్యా తు భైరవః ।**
**తత్రైవ తస్థౌ భక్తానాం భక్షయన్నఘసంతతిమ్ ॥ 62 ॥**

భైరవుడు కపాలమోచన తీర్థమునకెదురుగా అచటనే యుండి భక్తుల పాపసందోహములను నశింపజేసెను.

**కృష్ణాష్టమ్యాంతు మార్గస్య మాసస్య పరమేశ్వరః ।**
**ఆవిర్బభూవ సల్లీలో భైరవాత్మా సతాం ప్రియః ॥ 63 ॥**

సత్పురుషులకు ప్రియమైనవాడు, గొప్ప లీలలు కలవాడునగు పరమేశ్వరుడు మార్గశీర్షమాసములో కృష్ణపక్ష అష్టమినాడు 'భైరవరూపం' లో ఆవిర్భవించాడు.

**మార్గశీర్షాసితాష్టమ్యాం కాలభైరవసన్నిధౌ ।**
**ఉపోష్య జాగరం కుర్వన్ మహాపాపైః ప్రముచ్యతే ॥ 64 ॥**

మార్గశీర్ష కృష్ణపక్ష అష్టమినాడు కాలభైరవుని సన్నిధిలో ఉపవసించి, జాగరమును చేయు వ్యక్తి మహాపాపములనుండి విముక్తుడౌతాడు.

**అన్యత్రాపి నరో భక్త్యా తద్వ్రతం యః కరిష్యతి ।**
**స జాగరన్ మహాపాపైర్ముక్తో యాస్యతి సద్గతిమ్ ॥ 65 ॥**

ఇతర స్థలములందైనను జాగరముతో సహా ఈ వ్రతముననుష్ఠించు మానవుడు మహాపాపముల నుండి విముక్తుడై పుణ్యలోకాలను పొందుతాడు.

**అనేకజన్మనియుతైర్యత్కృతం జంతుభిస్త్వఘమ్ ।**
**తత్సర్వం విలయం యాతి కాలభైరవదర్శనాత్ ॥ 66 ॥**

కాలభైరవదర్శనమువలన అనేక జన్మలనుండి సంచితమైన పాపములనుండి జీవులు పూర్తిగా విముక్తిని పొందెదరు.

**కాలభైరవభక్తానాం పాతకాని కరోతి యః ।**
**స మూఢో దుఃఖితో భూత్వా పునర్దుర్గతిమాప్నుయాత్ ॥ 67 ॥**

కాలభైరవుని భక్తుల యెడ పాపమునాచరించు మూర్ఖుడు దుఃఖమును పొందుటయేగాక నరకమును కూడ అనుభవిస్తాడు.

**విశ్వేశ్వరేఽపి యే భక్తా నో భక్తాః కాలభైరవే ।**
**తే లభంతే మహాదుఃఖం కాశ్యాం చైవ విశేషతః ॥ 68 ॥**

విశ్వేశ్వరునియందు భక్తి యుండియు, కాలభైరవునియందు భక్తి లేనిచో, అట్టివారు కాశీలో విశేషమైన మహాదుఃఖాన్ని పొందుతారు.

**వారాణస్యాముషిత్వా యో భైరవం న భజేన్నరః ।**
**తస్య పాపాని వర్ధంతే శుక్లపక్షే యథా శశీ ॥ 69 ॥**

వారాణసియందు నివాసముండినను, ఏ మానవుడు కాలభైరవుని సేవించడో వాని పాపాలు శుక్ల పక్ష చంద్రుని వలె వృద్ధిని పొందుతాయి.

**కాలరాజం నయః కాశ్యాం ప్రతిభూతాష్టమీకుజమ్ ।**
**భజేత్తస్య క్షయం పుణ్యం కృష్ణపక్షే యథా శశీ ॥ 70 ॥**

ఎవడైతే కాశీలో కృష్ణపక్షాష్టమీ మంగళవారం నాడు కాలభైరవుని సేవించడో, వాని పుణ్యము కృష్ణపక్ష చంద్రుని వలె క్షీణించుచుండును.

**శ్రుత్వాఽఽఖ్యానమిదం పుణ్యం బ్రహ్మహత్యాపనోదకమ్ ।**
**భైరవోత్పత్తిసంజ్ఞం చ సర్వపాపైః ప్రముచ్యతే ॥ 71 ॥**

భైరవుని పుట్టుక, అతనికి బ్రహ్మహత్యనుండి విముక్తి అను పవిత్రమైన వృత్తాంతమును వినిన మానవుడు పాపములన్నింటినుండియు విముక్తిని పొందుతాడు.

**బంధనాగారసంస్థోఽపి ప్రాప్తోఽపి విపదం పరామ్ ।**
**ప్రాదుర్భావం భైరవస్య శ్రుత్వా ముచ్యేత సంకటాత్ ॥ 72 ॥**

కారాగారములో బంధింపబడినవాడుగాని, గొప్ప ఆపదను పొందినవాడుగాని భైరవావిర్భావవృత్తాంతమును వినినచో ఆ కష్టమునుండి విముక్తుడౌతాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం భైరవావతారలీలావర్ణనం నామ నవమోఽధ్యాయః ॥ 9 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు భైరవావతారలీలావర్ణనం అనే పేరుగల తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## దశమోఽధ్యాయః - పదవ అధ్యాయం

## నృసింహచరిత్రవర్ణనమ్ - నృసింహచరిత్రవర్ణనం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**విధ్వంసీ దక్షయజ్ఞస్య వీరభద్రాహ్వయః ప్రభో ।**
**అవతారశ్చ విజ్ఞేయః శివస్య పరమాత్మనః ॥ 1 ॥**

దక్షయజ్ఞమును వినాశనమొనర్చిన వీరభద్రుడను వాడు పరమాత్మయగు శివప్రభుని అవతారమే యని తెలియదగును.

**సతీచరిత్రే కథితం చరితం తస్య కృత్స్నశః ।**
**శ్రుతం త్వయాపి బహుధా నాతః ప్రోక్తం సువిస్తరాత్ ॥ 2 ॥**

అతని వృత్తాంతమంతయు సతీచరిత్రములో వర్ణింపబడినది. నీవు కూడా ఆ చరిత్రమును అనేక విధములుగా వినియున్నావు. కావున నేనిప్పుడు విస్తరముగా చెప్పుటలేదు.

**అతఃపరం మునిశ్రేష్ఠ! భవత్స్నేహాద్బ్రవీమి తత్ ।**
**శార్దూలాఖ్యావతారం చ శంకరస్య ప్రభోః శృణు ॥ 3 ॥**

ఓ మునిశ్రేష్ఠా! నీ యందలి ప్రేమచే నేనికపైన శంకరప్రభుని ప్రసిద్ధమైన శార్దూలావతారమును చెప్పెదను వినుము.

**సదాశివేన దేవానాం హితార్థం రూపమద్భుతమ్ ।**
**శారభం చ ధృతం దివ్యం జ్వలజ్జ్వాలాసమప్రభమ్ ॥ 4 ॥**

సదాశివుడు దేవతల హితమును కోరి, మండే అగ్నివలె ప్రకాశించే అద్భుతమైన దివ్యమైన శరభరూపాన్ని ధరించాడు.

**శివావతారా అమితాః సద్భక్తహితకారకాః ।**
**సంఖ్యా న శక్యతే కర్తుం తేషాం చ మునిసత్తమాః! ॥ 5 ॥**

ఓ మునిశ్రేష్ఠులారా! శివావతారములనంతములు. అవి గొప్ప భక్తిని, హితాన్ని కలిగిస్తాయి. వాటి సంఖ్యను నిర్ణయించడం సాధ్యం కాదు.

**ఆకాశస్య చ తారాణాం రేణుకానాం క్షితేస్తథా ।**
**ఆసారాణాం చ వృద్ధేన బహుకల్పైః కదాపి హి ॥ 6 ॥**

ఆకాశంలోని తారలను, భూమి యందలి ఇసుక రేణువులను, వేగమైన వాన వృద్ధునిచేత లెక్కించుట సంభవమేమో గాని,

**సంఖ్యా విశక్యతే కర్తుం సుప్రాజ్ఞైర్బహుజన్మభిః ।**
**శివావతారాణాం నైవ సత్యం జానీహి మద్వచః ॥ 7 ॥**

గొప్ప ప్రజ్ఞావంతులైనను అనేక కల్పములలో బహు జన్మలను స్వీకరించి లెక్కించిననూ, శివావతారముల సంఖ్యను నిర్ణయించుట సంభవము కాదు. నా వచనము సత్యమని యెరుంగుము.

**తథాపి చ యథాబుద్ధ్యా కథయామి కథాశ్రుతమ్ ।**
**చరిత్రం శారభం దివ్యం పరమైశ్వర్యసూచకమ్ ॥ 8 ॥**

అయినను నేను వినినంతవరకు, నా బుద్ధి శక్తిననుసరించి శరభావతారమనే దివ్యగాథను చెప్పెదను. ఈ గాథ పరమైశ్వర్యప్రదమైనది.

**జయశ్చ విజయశ్చైవ భవద్భిః శాపితౌ యదా ।**
**తదా దితిసుతౌ ద్వౌ తావభూతాం కశ్యపాన్మునే! ॥ 9 ॥**

ఓ మహర్షీ! మీరు జయవిజయులను శపించగా వారు దితి, కశ్యపులకు పుత్రులై జన్మించారు.

**హిరణ్యకశిపుశ్చాద్యో హిరణ్యాక్షోఽనుజో బలీ ।**
**దేవర్షిపార్షదౌ జాతౌ తౌ ద్వావపి దితేస్సుతౌ ॥ 10 ॥**

మొదటి వాడు హిరణ్యకశిపుడు, అతని తమ్ముడు బలశాలియైన హిరణ్యాక్షుడు. ఈ విధంగా విష్ణుసేవకులైన వారిద్దరు దైత్యులై జన్మించారు.

**పృథ్వ్యుద్ధారే విధాత్రా వై ప్రార్థితో హి పురా ప్రభుః ।**
**హిరణ్యాక్షం జఘానాసౌ విష్ణుర్వారాహరూపధృక్ ॥ 11 ॥**

పూర్వము బ్రహ్మ ప్రార్థించగా విష్ణువు వరాహరూపంలో భూమిని పైకి లేవదీసెను. ఆ సమయంలో ఆయన హిరణ్యాక్షుని సంహరించాడు.

**తం శ్రుత్వా భ్రాతరం వీరం నిహతం ప్రాణసన్నిభమ్ ।**
**చుకోప హరయేఽతీవ హిరణ్యకశిపుర్మునే! ॥ 12 ॥**

మునీ! వీరుడు, ప్రాణసమానుడైన తమ్ముడు సంహరింపబడుటచే హిరణ్యకశిపుడు విష్ణువుపై అత్యధికమైన కోపాన్ని పొందాడు.

**వర్షాణామయుతం తప్త్వా బ్రహ్మణో వరమాప సః ।**
**న కశ్చిన్మారయేన్మాం వై త్వత్సృష్టావితి తుష్టతః ॥ 13 ॥**

అతడు పదివేల సంవత్సరాలు తపమాచరించి బ్రహ్మను మెప్పించి ఈ సృష్టిలోని ఏ ప్రాణియు తనను సంహరింపకుండు గాక అను వరమును పొందాడు.

**శోణితాఖ్యపురం గత్వా దేవానాహూయ సర్వతః ।**
**త్రిలోకీం స్వవశే కృత్వా చక్రే రాజ్యమకంటకమ్ ॥ 14 ॥**

అతడు శోణితనగరానికి వెళ్లి దేవతలనందరిని జయించి ముల్లోకాలను వశమొనర్చుకొని నిష్కంటకముగా రాజ్యమునేలెను.

**దేవర్షికదనం చక్రే సర్వధర్మవిలోపకః ।**
**ద్విజపీడాకరః పాపీ హిరణ్యకశిపుర్మునే! ॥ 15 ॥**

ఓ మునీ! ధర్మములన్నింటిని నశింపజేసి బ్రాహ్మణులకు పీడకలుగజేసిన పాపియగు హిరణ్యకశిపుడు దేవతలతో ఋషులతో యుద్ధం చేశాడు.

**ప్రహ్లాదేన స్వపుత్రేణ హరిభక్తేన దైత్యరాట్ ।**
**యదా విద్వేషమకరోద్ధరిరై వ్రే విశేషతః ॥ 16 ॥**

తీవ్రమైన విష్ణుద్వేషముగల ఆ రాక్షసరాజు హరిభక్తుడు, తన పుత్రుడునైన ప్రహ్లాదునిపై విద్వేషాన్ని పెంచుకొన్నాడు.

**సభాస్తంభాత్తదా విష్ణురభూదావిర్ద్రుతం మునే! ।**
**సంధ్యాయాం క్రోధమాపన్నో నృసింహవపుషా తతః ॥ 17 ॥**

ఓ మునీ! అంతట కోపించిన విష్ణువు సంధ్యాకాలములో నృసింహరూపముతో సభలోని స్తంభం మధ్య నుండి శీఘ్రమే ఆవిర్భవించాడు.

**సర్వథా మునిశార్దూల! కరాళం నృహరేర్వపుః ।**
**ప్రజజ్వాలాతిభయదం త్రాసయన్దైత్యసత్తమాన్ ॥ 18 ॥**

మిక్కిలి భయంకరమైనది, అత్యంత క్రూరమైనదియునగు ఆ నృసింహ రూపము రాక్షసులకు భయాన్ని కలిగిస్తూ తీక్ష్ణంగా ప్రకాశించింది.

**నృసింహేన తదా దైత్యా నిహతాశ్చైవ తత్క్షణమ్ ।**
**హిరణ్యకశిపుశ్చాథ యుద్ధం చక్రే సుదారుణమ్ ॥ 19 ॥**

అంతట ఆ నృసింహుడు వెంటనే రాక్షసులను సంహరించాడు. అప్పుడు హిరణ్యకశిపుడాయనతో మిక్కిలి భయంకరమైన యుద్ధాన్ని చేశాడు.

**మహాయుద్ధం తయోరాసీన్ముహూర్తం మునిసత్తమాః! ।**
**వికరాలం చ భయదం సర్వేషాం రోమహర్షణమ్ ॥ 20 ॥**

ఓ మహర్షులారా! వారిద్దరి మధ్య కొంతకాలము మిక్కిలి క్రూరమైనది, భయదమైనది, అందరికి గగుర్పాటును కలిగించేదియగు మహాయుద్ధం జరిగింది.

**సాయం చకర్ష దేవేశో దేహల్యాం దైత్యపుంగవమ్ ।**
**వ్యోమ్ని దేవేషు పశ్యత్సు నృసింహశ్చ రమేశ్వరః ॥ 21 ॥**

ఆకాశమునందు దేవతలు చూచుచుండగా దేవదేవుడును, లక్ష్మీపతియునగు నృసింహుడు ఆ రాక్షసరాజును సాయంకాలసమయమందు సింహద్వారపు గడపవద్దకు లాగుకొని వెళ్లాడు.

**అథోత్సంగే చ తం కృత్వా నఖైస్తదుదరం ద్రుతమ్ ।**
**విదార్య మారయామాస పశ్యతాం త్రిదివౌకసామ్ ॥ 22 ॥**

అపుడాయన అతనిని తన ఒడిలో కూర్చుండబెట్టుకొని వెంటనే గోళ్లతో వాని పొట్టను చీల్చి దేవతలు చూచుచుండగా చీల్చి సంహరించాడు.

**హతే హిరణ్యకశిపౌ నృసింహేనైవ విష్ణునా ।**
**జగత్స్వాస్థ్యం తదా లేభే న వై దేవా విశేషతః ॥ 23 ॥**

నృసింహరూపుడగు విష్ణువు హిరణ్యకశిపుని సంహరించగా జగత్తు స్వస్థతను పొందింది. కాని దేవతలు విశేషసుఖమును పొందలేకపోయారు.

**దేవదుందుభయో నేదుఃప్రహ్లాదో విస్మయం గతః ।**
**లక్ష్మీశ్చ విస్మయం ప్రాప్తా రూపం దృష్ట్వాఽద్భుతం హరేః ॥ 24 ॥**

దేవదుందుభులు మ్రోగాయి. విష్ణువుయొక్క ఆ అద్భుతరూపాన్ని గాంచి ప్రహ్లాదుడు, మరియు లక్ష్మీదేవి ఆశ్చర్యచకితులయ్యారు.

**హతో యద్యపి దైత్యేంద్రస్తథాపి న పురం సుఖమ్ ।**
**యయుర్దేవా నృసింహస్య జ్వాలా సా న నివర్తితా ॥ 25 ॥**

రాక్షసరాజు సంహరింపబడినను, దేవతలు పూర్ణసుఖాన్ని పొందలేకపోయారు. ఎందువలననగా నృసింహుని క్రోధాగ్ని ఇంకనూ చల్లారలేదు.

**తయా చ వ్యాకులం జాతం సర్వం చైవ జగత్పునః ।**
**దేవాశ్చ దుఃఖమాపన్నాః కిం భవిష్యతి వా పునః ॥ 26 ॥**

మరల జగత్తంతయు దానిచే కంగారుపడజొచ్చెను. ఏమి కానున్నదోయని దేవతలు దుఃఖాన్ని పొందారు.

**ఇత్యేవం చ వదంతస్తే భయాద్ దూరముపస్థితాః ।**
**నృసింహక్రోధజజ్వాలావ్యాకులాః పద్మభూముఖాః ॥ 27 ॥**

నృసింహుని కోపమునుండి పుట్టిన జ్వాలలకు భయపడి బ్రహ్మమున్నగు వారు 'ఏమి ముప్పురానున్నదో' అని పలుకుచూ భయముతో దూరముగా తప్పుకొన్నారు.

**ప్రహ్లాదం ప్రేషయామాసుస్తచ్ఛాంత్యై నికటం హరేః ।**
**సర్వాన్మిలిత్వా ప్రహ్లాదః ప్రార్థితో గతవాంస్తదా ॥ 28 ॥**

అంతట వారందరు నృసింహుని కోపాన్ని శాంతింపజేయుటకు ప్రహ్లాదుని ప్రార్థించి నృసింహుని వద్దకు పంపగా అతడు వెళ్లాడు.

**ఉరసాఽఽలింగయామాస తం నృసింహః కృపానిధిః ।**
**హృదయం శీతలం జాతం రుద్జ్వాలా న నివర్తితా ॥ 29 ॥**

దయానిధియైన నృసింహుడు ప్రహ్లాదుని గుండెలకు హత్తుకున్నాడు. అపుడాయన హృదయం చల్లబడింది. కాని క్రోధజ్వాల చల్లారలేదు.

**తథాపి న నివృత్తా రుద్జ్వాలా నరహరేర్యదా ।**
**దుఃఖం ప్రాప్తాస్తతో దేవాః శంకరం శరణం యయుః ॥ 30 ॥**

నృసింహుని క్రోధజ్వాల నివృత్తి కాకుండుటను గాంచి దేవతలు దుఃఖితులై శంకరుని శరణు జొచ్చారు.

**తత్ర గత్వా సురాస్సర్వే బ్రహ్మాద్యా మునయస్తథా ।**
**శంకరం స్తవయామాసుర్లోకానాం సుఖహేతవే ॥ 31 ॥**

బ్రహ్మాది దేవతలు, మునులు అందరు కలిసి శంకరుని వద్దకు వెళ్లి లోకాలకు సుఖాన్ని కలిగించుట కొరకు శంకరుని ప్రార్థించారు.

**దేవా ఊచు** – దేవతలు పలికారు.

**దేవదేవ! మహాదేవ! శరణాగతవత్సల! ।**
**పాహినః శరణాపన్నాన్ సర్వాన్దేవా జగంతి చ ॥ 32 ॥**

దేవదేవా! మహాదేవా! శరణాగతవత్సల! దేవతలమందరము, మరియు జగత్తులన్నియు నిన్ను శరణు జొచ్చుచున్నవి. మమ్ములను కాపాడుము.

**నమస్తేఽస్తు నమస్తేఽస్తు నమస్తేఽస్తు సదాశివ! ।**
**పూర్వం దుఃఖం యదా జాతం తదా తే రక్షితా వయమ్ ॥ 33 ॥**

సదాశివా! నీకు అనేక నమస్కారములు. పూర్వం మాకు దుఃఖం కలిగినప్పుడు మమ్ములను నీవే రక్షించావు.

**సముద్రో మథితశ్చైవ రత్నానాం చ విభాగశః ।**
**కృతే దేవైస్తదా శంభో! గృహీతం గరళం త్వయా ॥ 34 ॥**

హే శంభో! దేవతలు రత్నాలను పొందడానికి వరుసగా సముద్రాన్ని మథించినప్పుడు విషాన్ని నీవే స్వీకరించావు.

**రక్షితాః స్మ తదా నాథ! నీలకంఠ ఇతి శ్రుతః ।**
**విషం పాస్యసి నో చేత్త్వం భస్మీభూతాస్తదాఽఖిలాః ॥ 35 ॥**

నాథా! అప్పుడు మమ్ములను ఆ విధంగా రక్షించి నీవు నీలకంఠుడని ప్రఖ్యాతిని పొందావు. నీవప్పుడు విషాన్ని త్రాగియుండనిచో సర్వులు భస్మమై యుండెడివారు.

**ప్రసిద్ధం చ యదా యస్య దుఃఖం చ జాయతే ప్రభో! ।**
**తదా త్వన్నామమాత్రేణ సర్వదుఃఖం విలీయతే ॥ 36 ॥**

ఓ ప్రభూ! ఎప్పుడు ఎవరికి ఏ దుఃఖము కలిగినా నీ నామమును స్మరించినంతమాత్రంచేతనే దుఃఖములన్నియు తొలగిపోతాయనే విషయం లోకప్రసిద్ధం.

**ఇదానీం నృహరిజ్వాలా పీడితాన్నస్సదాశివ! ।**
**తాం త్వం శమయితుం దేవ శక్తోఽసీతి సునిశ్చితమ్ ॥ 37 ॥**

ఇప్పుడు మేము నృసింహుని క్రోధజ్వాలలచే పీడితులమైయున్నాము. దానిని చల్లార్చుటకు నీవు సమర్థుడవనుట నిశ్చితం.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇతి స్తుతస్తదా దేవైశంకరో భక్తవత్సలః ।**
**ప్రత్యువాచ ప్రసన్నాత్మాఽభయం దత్వా పరప్రభుః ॥ 38 ॥**

దేవతలిట్లు ప్రార్థించగా భక్తవత్సలుడగు శంకరప్రభువు ప్రసన్నమగు మనస్సు గలవాడై గొప్ప అభయమునిచ్చి వారికిట్లు బదులు పలికాడు.

**శంకర ఉవాచ –** శంకరుడు పలికాడు.

**స్వస్థానం గచ్ఛత సురాః! సర్వే బ్రహ్మాదయోఽభయాః ।**
**శమయిష్యామి యద్దుఃఖం సర్వథా హి వ్రతం మమ ॥ 39 ॥**

బ్రహ్మాది దేవతలారా! మీరందరు నిర్భయంగా మీమీ స్థానాలకు వెళ్లండి. నేను మీ దుఃఖాన్ని శాంతింపజేస్తాను. ఆ విధంగా చేయడం నాకు దృఢవ్రతమై యున్నది.

**గతో మచ్ఛరణం యస్తు తస్య దుఃఖం క్షయం గతమ్ ।**
**మత్ప్రియః శరణాపన్నః ప్రాణేభ్యోఽపి న సంశయః ॥ 40 ॥**

ఎవరు నన్ను శరణు వేడెదరో వారి దుఃఖము నశిస్తుంది. నన్ను శరణుపొందినవాడు నాకు ప్రాణముల కంటె అధికమైన ప్రీతిపాత్రుడనుట నిస్సంశయం.

**నందీశ్వర ఉవాచ -** నందీశ్వరుడు పలికాడు.

**ఇతి శ్రుత్వా తదా దేవా హ్యానందం పరమం గతాః ।**
**యథాఽఽగతం తథా జగ్ముః స్మరన్తః శంకరం ముదా ॥ 41 ॥**

అప్పుడు దేవతలు శంభుని ఈ మాటలను విని పరమానందాన్ని పొంది భక్తిపూర్వకంగా శంకరుని స్మరిస్తూ, తమ స్థానాలకు వెళ్లారు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం శార్దూలావతారే నృసింహచరితవర్ణనం నామ దశమోఽధ్యాయః ॥ 10 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు శార్దూలావతారములోని నృసింహచరిత్రవర్ణనం అనే పేరుగల పదవ అధ్యాయం సమాప్తం.

## **ఏకాదశోఽధ్యాయః** – పదకొండవ అధ్యాయం

## **శరభావతారవర్ణనమ్** – శరభావతారవర్ణనం

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఏవమభ్యర్థితో దేవైర్మతిం చక్రే కృపాలయః ।**
**మహాతేజో నృసింహాఖ్యం సంహర్తుం పరమేశ్వరః ॥ 1 ॥**

దేవతలిట్లు ప్రార్థింపగా, దయానిధియైన పరమేశ్వరుడు నృసింహరూపములోనున్న మహాతేజస్సును శమింపజేయ నిర్ణయించాడు.

**తదూర్ధ్వం స్మృతవాన్ రుద్రో వీరభద్రం మహాబలమ్ ।**
**ఆత్మనో భైరవం రూపం ప్రాహ ప్రళయకారకమ్ ॥ 2 ॥**

అనంతరం రుద్రుడు మహాబలశాలి, తనయొక్క భయావహమగు రూపము, ప్రళయమును చేయగలవాడునగు వీరభద్రుని స్మరించాడు.

**ఆజగామ తతస్సద్యో గణానామగ్రణీర్హసన్ ।**
**సాట్టహాసైర్గణవరైరుత్పతద్భిరితస్తతః ॥ 3 ॥**

అప్పుడు వెంటనే ఆ గణాధ్యక్షుడు నవ్వుకుంటూ విచ్చేశాడు. అతని చుట్టూ అట్టహాసం చేస్తూ, ఇటునటు గెంతుచున్నట్టి.

**నృసింహరూపైరత్యుగ్రైః కోటిభిః పరివారిత ః ।**
**మాద్యద్భిరభితో వీరైర్నృత్యద్భిశ్చ ముదాన్వితైః ॥ 4 ॥**

భయంకర నృసింహరూపమును దాల్చియున్న కోట్లాది గణవీరులున్నారు. బలమదాన్వితులైన ఆ వీరులు ఆనందంతో నాట్యాన్ని చేస్తున్నారు.

**క్రీడద్భిశ్చ మహావీరైర్బ్రహ్మాద్యైః కందుకైరివ ।**
**అదృష్టపూర్వైరన్యైశ్చ వేష్టితో వీరవందితః ॥ 5 ॥**

ఆ మహావీరులు బ్రహ్మాదులను బంతి ఆట ఆడగల్గుదురు. వారింతకు ముందెన్నడు చూడని పరాక్రమమును కలిగి యున్నారు. ఆ వీరులు వీరభద్రుని చుట్టుముట్టి వందనములాచరించుచుండిరి.

**కల్పాంతజ్వలనజ్వాలో విలసల్లోచనత్రయః ।**
**అశస్త్రో హి జటాజూటీ జ్వలద్బాలేందుమండితః ॥ 6 ॥**

ప్రళయకాలాగ్నితో సమమగు తేజస్సుగలవాడు, మూడు నేత్రములతో ప్రకాశించువాడు, చేతిలో ఆయుధములు లేనివాడు, జటాజూటమును దాల్చినవాడు, ప్రకాశించే బాలచంద్రుడు అలంకారముగా గలవాడు.

**బాలేందువలయాకార తీక్ష్ణదంష్ట్రాంకురద్వయః ।**
**ఆఖండలధనుఃఖండసంనిభభ్రూలతాన్వితః ॥ 7 ॥**

చంద్రరేఖవలె వలయాకారముగానున్న తీక్ష్ణమైన రెండు కోరల అంకురములు గలవాడు, ఇంద్ర ధనుస్సుయొక్క తునకల వలె భాసించు తీగలవంటి కనుబొమ్మలు గలవాడు.

**మహా ప్రచండహుంకారబధీరీకృతదిఙ్ముఖః ।**
**నీలమేఘాంజనశ్యామో భీషణః శ్మశ్రులోఽద్భుతః ॥ 8 ॥**

మిక్కిలి ప్రచండమగు హుంకారముచే దిక్కులు చెవుడు పొందునట్లు చేయువాడు, నల్లని మేఘము వలె, కాటుక వలె శ్యామల వర్ణముగలవాడు, భయంకర అద్భుతాకారుడు, మీసములు గలవాడు.

**వాద్యఖండమఖండాభ్యాం భ్రామయంస్త్రిశిఖం ముహుః ।**
**వీరభద్రోఽపి భగవాన్వీరశక్తివిజృంభితః ॥ 9 ॥**

అఖండకాంతి గల త్రిశూలమును వాద్యవిశేషమును వలె పలుమార్లు త్రిప్పుచున్నవాడునగు వీరభద్ర భగవానుడు వీరశక్తితో విజృంభించాడు.

**స్వయం విజ్ఞాపయామాస కిమత్ర స్మృతికారణమ్ ।**
**ఆజ్ఞాపయ జగత్ స్వామిన్! ప్రసాదః క్రియతాం మయి ॥ 10 ॥**

వీరభద్రుడు స్వయంగా శివునకు ఇట్లు విన్నవించాడు. 'హే జగత్ప్రభూ! నన్ను స్మరించుటకు కారణమేమి? నన్ను అనుగ్రహించి ఆజ్ఞాపించండి.

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యాకర్ణ్య మహేశానో వీరభద్రోక్తమాదరాత్ ।**
**విలోక్య వచనం ప్రీత్యా ప్రోవాచ ఖలదండధృక్ ॥ 11 ॥**

దుష్టులను శిక్షించే మహేశ్వరుడు వీరభద్రుని ఈ పలుకులను విని అతనిని ఆదరముతో చూచి ప్రేమతో ఇట్లు పలికెను.

**శంకర ఉవాచ** - శంకరుడు పలికాడు.

**అకాలే భయముత్పన్నం దేవానామపి భైరవమ్ ।**
**జ్వలితస్య నృసింహాగ్నిః శమయైనం దురాసదమ్ ॥ 12 ॥**

కాలము కాని కాలములో దేవతలకు కూడా మహాభయం సంప్రాప్తమైనది. నృసింహుని క్రోధాగ్ని మండుచునే యున్నది. సమీపింప శక్యము కాని ఆ అగ్నిని శాంతింపజేయుము.

**సాంత్వయన్ బోధయాదౌ తం తేన కిన్నోపశామ్యతి ।**
**తతో మత్పరమం భావం భైరవం సంప్రదర్శయ ॥ 13 ॥**

ముందు అతనికి మంచి మాటలతో నచ్చజెప్పుము. అయినను అతడు శాంతించనిచో, అప్పుడు నాయొక్క పరమభయంకరమగు రూపాన్ని ప్రదర్శించుము.

**సూక్ష్మం సంహృత్య సూక్ష్మేణ స్థూలం స్థూలేన తేజసా ।**
**వక్త్రమానయ కృత్తిం చ వీరభద్ర! మమాజ్ఞయా ॥ 14 ॥**

అతని సూక్ష్మమగు పరాక్రమాన్ని సూక్ష్మతేజస్సుతోను, మరియు స్థూలమగు పరాక్రమాన్ని అదే విధమగు తేజస్సుతోను ఉపశమింపజేయుము. ఓ వీరభద్రా! నా ఆజ్ఞచే అతని తలను, చర్మమును తీసుకొని రమ్ము.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యాదిష్టో గణాధ్యక్షః ప్రశాంతం వపురాస్థితః ।**
**జగామ రంహసా తత్ర యత్రాస్తే నరకేసరీ ॥ 15 ॥**

ఈవిధముగా ఆదేశింపబడినవాడై గణాధ్యక్షుడగు వీరభద్రుడు ప్రసన్నమైన రూపాన్ని ధరించి నృసింహుడున్న చోటుకు వేగముగా చేరుకున్నాడు.

**తతస్తం బోధయామాస వీరభద్రో హరో హరిమ్ ।**
**ఉవాచ వాక్యమీశానః పితా పుత్రమివౌరసమ్ ॥ 16 ॥**

అంతట పాపహరుడు, ఈశాన స్వరూపుడగు వీరభద్రుడు ఆ నృసింహునకు, కన్న కొడుకునకు వలె నచ్చ జెప్పి, ఇట్లు పలికాడు.

**వీరభద్ర ఉవాచ –** వీరభద్రుడు పలికాడు.

**జగత్సుఖాయ భగవన్నవతీర్ణోఽసి మాధవ! ।**
**స్థిత్యర్థం త్వం ప్రయుక్తోఽసి పరేశః పరమేష్ఠినా ॥ 17 ॥**

హే భగవాన్! లక్ష్మీపతీ! నీవు జగత్తుల సుఖంకొరకు అవతరించావు. పరమేశ్వరుడు దేవదేవుడైన నిన్ను జగద్రక్షణకొరకు నియోగించాడు.

**జంతుచక్రం భగవతా ప్రచ్ఛిన్నం మత్స్యరూపిణా ।**
**పుచ్ఛేనైవ సమాబధ్య భ్రమన్నేకార్ణవే పురా ॥ 18 ॥**

భగవంతుడవగు నీవు పూర్వం ప్రళయకాలంలో సర్వము జలపూర్ణమై యుండగా మత్స్యరూపాన్ని ధరించి వివిధ ప్రాణులను, తోకతో ఒక చోటకు చేర్చి రక్షించావు.

**బిభర్షి కర్మరూపేణ వారాహేణోద్ధృతా మహీ ।**
**అనేన హరిరూపేణ హిరణ్యకశిపుర్హతః ॥ 19 ॥**

నీవు యజ్ఞవరాహరూపమును దాల్చి భూమిని పైకి లేవనెత్తితివి. ఈ నృసింహరూపంతో హిరణ్య కశిపుని సంహరించావు.

**వామనేన బలిర్బద్ధ స్త్వయా విక్రమతా పునః ।**
**త్వమేవ సర్వభూతానాం ప్రభవః ప్రభురవ్యయః ॥ 20 ॥**

నీవు వామనుడవై బలిని బంధించావు. ప్రాణులన్నింటికి ఉత్పత్తి స్థానము నీవే. అవినాశియగు జగత్ప్రభుడవు నీవే.

**యదా యదా హి లోకస్య దుఃఖం కించిత్ప్రజాయతే ।**
**తదా తదావతీర్ణస్త్వం కరిష్యసి నిరామయమ్ ॥ 21 ॥**

ఏ యే సమయాలలో జగత్తునకు ఏ కొంచెం దుఃఖం కలిగినను. ఆయాసమయాలలో నీవు అవతరించి ఆ దుఃఖహేతువును తొలగిస్తావు.

**నాధికస్త్వత్సమోఽ ప్యస్తి హరే! శివపరాయణః।**
**త్వయా వేదాశ్చ ధర్మాశ్చ శుభమార్గే ప్రతిష్ఠితాః ॥ 22 ॥**

ఓ హరీ! శివభక్తిలో నీతో సమానమైనవాడు గాని, నిన్ను మించినవాడు గాని లేడు. నీవు ధర్మాలను, వేదాలను మంగళకరమగు మార్గంలో నిలబెట్టావు.

**యదర్థమవతారోఽ యం నిహతస్య హి దానవః ।**
**హిరణ్యకశిపుశ్చైవ ప్రహ్లాదోఽ పి సురక్షితః ॥ 23 ॥**

నీవీ అవతారాన్ని ఎందులకు స్వీకరించావో, ఆ హిరణ్యకశిపుడనే రాక్షసుడు సంహరింపబడి ప్రహ్లాదుడు చక్కగా రక్షింపబడినాడు.

**అతీవ ఘోరం భగవన్! నరసింహవపుస్తవ ।**
**ఉపసంహర విశ్వాత్మన్! త్వమేవ మమ సన్నిధౌ ॥ 24 ॥**

హే భగవాన్! నీయీ నృసింహదేహము మిక్కిలి భయంకరముగా నున్నది. హే జగద్రూపా! నీవు నా సన్నిధిలో నిశ్చయంగా దీనిని ఉపసంహరించుకొనుము.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్తో వీరభద్రేణ నృసింహః శాంతయా గిరా ।**
**తతోఽ ధికం మహాఘోరం కోపం చక్రే మహామదః ॥ 25 ॥**

వీరభద్రుడు శాంతమైన వాక్కుతో నిట్లు పలుకగా మిక్కిలి గర్వించియున్న నృసింహుడు అంతకు ముందున్న దానికంటె అధికముగా మిక్కిలి భయాన్ని కలిగించు కోపాన్ని ప్రదర్శించాడు.

**ఉవాచ చ మహాఘోరం కఠినం వచనం తదా ।**
**వీరభద్రం మహావీరం దంష్ట్రాభిర్భీషయన్మునే! ॥ 26 ॥**

ఓ మునీ! అపుడు నృసింహుడు తన దంష్ట్రలతో భయాన్ని కలిగిస్తూ మిక్కిలి ఘోరము, కఠినమునైన వాక్కును మహావీరుడగు వీరభద్రుని ఉద్దేశించి పలికాడు.

**నృసింహ ఉవాచ** – నృసింహుడు పలికాడు.

**ఆగతోఽసి యతస్తత్ర గచ్ఛ త్వం మా హితం వద ।**
**ఇదానీం సంహరిష్యామి జగదేతచ్చరాచరమ్ ॥ 27 ॥**

నీవు ఎక్కడి నుండి వచ్చితివో, అక్కడికే పొమ్ము. నాకు హితాన్ని బోధించకుము. ఈ స్థావరజంగమాత్మకమగు జగత్తును ఈ క్షణంలో నశింపజేస్తాను.

**సంహర్తుర్న హి సంహారః స్వతో వా పరతోఽపి వా ।**
**శాసితం మమ సర్వత్ర శాస్తా కోఽపి న విద్యతే ॥ 28 ॥**

నన్ను నేనుగాని, ఇతరులు గాని ఉపసంహరించుట సంభవము గాదు. నా శాసనము సర్వత్రా ప్రసరించును. నన్ను ఏ విషయంలోనైనను శాసించగలవాడు లేనే లేడు.

**మత్ప్రసాదేన సకలమభయం హి ప్రవర్తతే ।**
**అహం హి సర్వశక్తీనాం ప్రవర్తకనివర్తకః ॥ 29 ॥**

నా అనుగ్రహం చేతనే సమస్తమూ భయంలేకుండగా నడుచుచున్నది. శక్తులనన్నిటిని ప్రేరేపించేవాడను, ఉపసంహరించువాడను నేనే.

**యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।**
**తత్తద్విద్ధి గణాధ్యక్ష! మమ తేజోవిజృంభితమ్ ॥ 30 ॥**

ఓ గణాధిపతీ! ఈ జగత్తులో మహిమ, శోభ, సంపద, శక్తి గల ఏ ప్రాణిగలదో అవి యన్నియూ నా తేజస్సుయొక్క విలాసమేనని ఎరుంగుము.

**దేవతా పరమార్థజ్ఞం మామేవ పరమం విదుః ।**
**మదంశాః శక్తిసంపన్నా బ్రహ్మశక్రాదయః సురాః ॥ 31 ॥**

పరమతత్త్వము నెరింగిన పరమాత్మను నేనేయని దేవతలు ఎరుగుదురు. బ్రహ్మ, ఇంద్రుడు మున్నగు దేవతలు నా అంశంనుండి జన్మించి శక్తిని పొందియున్నారు.

**మన్నాభికమలాజ్జాతః పురా బ్రహ్మా జగత్కరః ।**
**సర్వాధికః స్వతంత్రశ్చ కర్తా హర్తాఽఖిలేశ్వరః ॥ 32 ॥**

జగత్తుని సృజించే బ్రహ్మ పూర్వము నా నాభియందలి కమలమునుండి ఉద్భవించినాడు, సర్వులకంటె అధికుడు, స్వతంత్రుడు, సృష్టికర్త మరియు సంహర్తయగు సర్వేశ్వరుడు నేనే.

**ఇదం తు మత్పరం తేజః కిం పునః శ్రోతుమిచ్ఛసి ।**
**అతో మాం శరణం ప్రాప్య గచ్ఛ త్వం విగతజ్వరః ॥ 33 ॥**

ఈ అవతారము నా సర్వాధిక తేజోరూపము. ఇంకను ఏమి వినగోరుచున్నావు ? కావున నీవు నన్ను శరణు పొంది భయాదిజ్వరములను తొలగించుకొని వెళ్లుము.

**అవేహి పరమం భావమిదం భూతం గణేశ్వర! ।**
**మామకం సకలం విశ్వం సదేవాసురమానుషమ్ ॥ 34 ॥**

ఓ గణాధ్యక్షా! ఈ విధముగనున్న పరమ సత్యమునెరుంగుము. దేవతలు, రాక్షసులు, మరియు మనుష్యులతో గూడియున్న జగత్తు అంతయూ నాదే.

**కాలోఽస్మ్యహం లోకవినాశహేతుః లోకాన్సమాహర్తుమహం ప్రవృత్తః ।**
**మృత్యోర్మృత్యుం విద్ధి మాం వీరభద్ర! జీవంత్యేతే మత్ప్రసాదేన దేవాః ॥ 35 ॥**

లోకముల వినాశమునకు కారణమగు మృత్యువు నేనే. నేను లోకసంహారముకొరకు ప్రవర్తిల్లుచున్నాను. ఓ వీరభద్రా! నేను మృత్యువునకు కూడ మృత్యువునని యెరుంగుము. ఈ దేవతలు నా అనుగ్రహముచేతనే జీవించియున్నారు.

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**సాహంకారం వచః శ్రుత్వా హరేరమితవిక్రమః ।**
**విహస్యోవాచ సావజ్ఞం తతో విస్ఫురితాధరః ॥ 36 ॥**

సాటిలేని పరాక్రమముగల వీరభద్రుడు అహంకారముతో గూడియున్న నృసింహుని మాటలను విని కోపముతో వణుకుచున్న క్రింది పెదవి గలవాడై తిరస్కారముతో నవ్వి ఇట్లు పలికెను.

**వీరభద్ర ఉవాచ** - వీరభద్రుడు పలికాడు.

**కిన్న జానాసి విశ్వేశం సంహర్తారం పినాకినమ్ ।**
**అసద్వాదో వివాదశ్చ వినాశస్త్వయి కేవలః ॥ 37 ॥**

పినాకధారి, లయకర్త, విశ్వేశ్వరుడునగు శివుని యెరుంగవా? నీ యందు చెడువాదము, కలహము మరియు వినాశలక్షణములు మాత్రమే కానవచ్చుచున్నవి.

**తవాన్యోన్యావతారాణి కాని శేషాణి సాంప్రతమ్ ।**
**కృతాని యేన కేనైవ కథాశేషో భవిష్యతి ॥ 38 ॥**

నీవు స్వీకరించవలసిన అవతారములింకనూ ఇపుడు ఏమి మిగిలియున్నవి? ఎవరో ఒకరు వాటిని ధరించినచో కథ పరిసమాప్తమవుతుంది.

**దోషం తం వద యేన త్వమవస్థామీదృశీం గతః ।**
**తేన సంహారదక్షేణ దక్షిణాశేషమేష్యసి ॥ 39 ॥**

నీ విట్టి అవస్థను పొందుటకు హేతువగు దోషమేదో చెప్పుము. సంహారసమర్థుడగు ఆ ప్రభువు తలచుకొన్నచో నీకు మిగిలిన దక్షిణ ముట్టగలదు. లేదా యముని వద్దకు చేరగలవు.

**ప్రకృతిస్త్వం పుమాన్ రుద్రస్త్వయి వీర్యం సమాహితమ్ ।**
**త్వన్నాభిపంకజా జ్జాతః పంచవక్త్రః పితామహః ॥ 40 ॥**

నీవు ప్రకృతివి. శివుడు పురుషుడు. నీ యందు బీజము నిక్షిప్తమైనది. నీ నాభియందలి పద్మమునుండి అయిదు మోముల పితామహుడు జన్మించినాడు.

**జగత్త్రయీసర్జనార్థం శంకరం నీలలోహితమ్ ।**
**లలాటేఽ చిన్తయత్సోఽ యం తపస్యుగ్రే చ సంస్థితః ॥ 41 ॥**

అతడు జగత్తును సృష్టించుకొరకై ఉగ్రమగు తపస్సును చేసి నీలలోహితుడగు శంకరుని లలాట స్థానమునందు ధ్యానించినాడు.

**తల్లలాటాదభూచ్ఛంభుః సృష్ట్యర్థే తేన భూషణమ్ ।**
**అతోఽ హం దేవదేవస్య తస్య భైరవరూపిణః ॥ 42 ॥**

అపుడు శంభుడు సృష్టికొరకై అతని లలాటమునుండి జన్మించినాడు. దేవదేవుడు, భైరవరూపుడునగు ఆ శివునకు అలంకారమగు నేను శివుని గణాధ్యక్షులలో ఒకడిని.

**త్వత్సంహారే నియుక్తోఽ స్మి వినయేన బలేన చ ।**
**దేవదేవేన రుద్రేణ సకలప్రభుణా హరే! ॥ 43 ॥**

ఓ నృసింహా! నీకు శాంతముగా నచ్చజెప్పుమనియు, లేదా బలమును ప్రయోగించుమనియు దేవదేవుడు, సర్వజగత్ప్రభుడునగు రుద్రుడు నన్ను నియోగించినాడు.

**ఏకం రక్షో విదార్యైవ తచ్ఛక్తికలయా యుతః ।**
**అహంకారావలేపేన గర్జసి త్వమతన్ద్రితః ॥ 44 ॥**

ఆ శివుని శక్తిలోని లేశమును పొంది ఒకే ఒక రాక్షసుని చీల్చి చంపి శ్రమనెరుగనివాడవై అహంకారముతో గర్జించుచున్నావు.

**ఉపకారో హి సాధూనాం సుఖాయ కిల సంమతః ।**
**ఉపకారో హ్యసాధూనామపకారాయ కేవలమ్ ॥ 45 ॥**

సాధువులకుపకారము చేసినచో సుఖము కలుగుననుట నిర్వివాదము. కాని దుష్టులకు ఉపకారము చేసినచో కేవలము అపకారము మాత్రమే లభించును.

**యన్నృసింహ! మహేశానం పునర్భూతం తు మన్యసే ।**
**తర్హ్యజ్ఞానీ మహాగర్వీ వికారీ సర్వథా భవాన్ ॥ 46 ॥**

ఓ నృసింహా! మహేశ్వరుడు జన్మించినాడని నీవు తలంచినచో, నీవు సర్వవిధములుగా అజ్ఞానివి, పెద్ద గర్వము గలవాడవు మరియు మనోవికారము గలవాడవని స్పష్టమగుచున్నది.

**న త్వం స్రష్టా న సంహర్తా భర్తాపి న నృసింహక! ।**
**పరతంత్రో విమూఢాత్మా న స్వతంత్రో హి కుత్రచిత్ ॥ 47 ॥**

ఓయీ నృసింహా! నీవు సృష్టికర్తవు గాదు. లయకర్తవు గాదు. స్థితికర్తవు గాదు. నీవు అస్వతంత్రుడవు. మరియు మోహమును పొందిన బుద్ధిగలవాడవు. నీకు ఎచ్చటనైనను స్వాతంత్ర్యము లేదు.

**కులాలచక్రవచ్ఛక్త్యా ప్రేరితోఽసి పినాకినా ।**
**నానావతారకర్తా త్వం తదధీనస్సదా హరే! ॥ 48 ॥**

ఓ హరీ! కుమ్మరి చక్రమును వలె పినాకి నిన్ను తన శక్తిచే ప్రేరేపించగా, నీవనేకములగు అవతారాలను దాల్చితివి. సర్వకాలములలో నీవు ఆయనకు వశుడవై యున్నావు.

**అద్యాపి తవ నిక్షిప్తం కపాలం కూర్మరూపిణః ।**
**హరహారలతామధ్యే దగ్ధః కశ్చిన్న బధ్యతే ॥ 49 ॥**

కూర్మరూపధారివగు నీ కపాలము శివుని మెడలోని హారములో ఇప్పటికిని నిహితమైయున్నది. దహింపబడిన వానిని మరల వధించుట సంభవము కాదు.

**విస్మృతిః కిం తదంశేన దంష్ట్రోత్పాతనపీడితమ్ ।**
**వారాహవిష్ణుహస్తేఽద్య యా క్రోశన్తారకారిణా ॥ 50 ॥**

నీవు వరాహావతారమును స్వీకరించినపుడు తారకసంహారియగు కుమారస్వామి నీ కోరలను పీకి నీకు దుఃఖాన్ని కలిగించాడు. నీవా విషయాన్ని కొంతవరకు విస్మరించితివా యేమి?

**దగ్ధోఽసి పశ్య శూలాగ్రే విష్వక్సేనచ్ఛలాద్భవాన్ ।**
**దక్షయజ్ఞే శిరశ్ఛిన్నం మయా తేజఃస్వరూపిణా ॥ 51 ॥**

హే విష్ణో! నీవు అస్త్రమహిమచే అనేక నారాయణులను సృష్టించగా నేను త్రిశూలము నుండి పుట్టిన అగ్నితో దహించివేశాను. తేజస్స్వరూపుడనగు నేను దక్షయజ్ఞములో దక్షుని శిరస్సును నరికితిని.

**అద్యాపి తవ పుత్రస్య బ్రహ్మణః పంచమం శిరః ।**
**ఛిన్నం న సజ్జితం భూయో హరే! తద్విస్మృతం త్వయా ॥ 52 ॥**

ఓ హరీ! నేను నీ కుమారుడగు బ్రహ్మయొక్క ఐదవ తలను దునిమితిని. అది ఇంకనూ అతుకుకొనకుండగా అటులనే యున్నది. నీవా విషయాన్ని విస్మరించావు.

**నిర్జితస్త్వం దధీచేన సంగ్రామే సమరుద్గణః ।**
**కండూయమానే శిరసి కథం తద్విస్మృతస్త్వయా ॥ 53 ॥**

దధీచమహర్షి, దేవగణములతో కూడియున్న నిన్ను యుద్ధములో జయించాడు. నీవు తలను గోకుకొను చుంటివి. నీవా విషయముల నెట్లు మరిచితివి?

**చక్రం విక్రమతో యస్య చక్రపాణే! తవ ప్రియమ్ ।**
**కుతః ప్రాప్తం కృతం కేన త్వయా తదపి విస్మృతమ్ ॥ 54 ॥**

ఓ చక్రపాణీ! నీవు పరాక్రమించి ప్రయోగించిన చక్రము ఎచటకు పోయిందో, దానినెవరు ఏమి చేశారో, మరల నీకెలా ప్రాప్తించిందో ఆ విషయాన్ని కూడ మరచి పోయావా?

**యే మయా సకలా లోకా గృహీతాస్త్వం పయోనిధౌ ।**
**నిద్రాపరవశశ్శేషే స కథం సాత్త్వికో భవాన్ ॥ 55 ॥**

ఈ సకల లోకాల భారాన్ని నేను స్వీకరించాను. నీవు క్షీరసాగరంలో నిద్రలో మునిగియున్నావు. అట్టి నీవు సత్త్వగుణప్రధానుడవెట్లయితివి?

**త్వదాదిస్తంబపర్యంతం రుద్రశక్తివిజృంభితమ్ ।**
**శక్తిమానభితస్త్వంచ హ్యనలాత్త్వం విమోహితః ॥ 56 ॥**

నీనుండి తృణమువరకు గల జగత్తు రుద్రుని శక్తిచే విజృంభితమగుచున్నది. చుట్టూయున్న ఈ జ్వాలలతో కూడిన నీ శక్తి కూడా రుద్రునినుండియే లభించింది. కాని నీవు మిక్కిలి మోహమును పొందియున్నావు.

**తత్తేజసో హి మాహాత్మ్యం పుమాంద్రష్టున్న హి క్షమః ।**
**అస్థూలా యే ప్రపశ్యంతి తద్విష్ణోః పరమం పదమ్ ॥ 57 ॥**

ఆ తేజస్సుయొక్క మాహాత్మ్యమును మానవుడు దర్శింపజాలడు. విష్ణువుకంటె ఉత్కృష్టమైన శివుని ధామమును సూక్ష్మదృష్టి గలవారు మాత్రమే దర్శించగలరు.

**ద్యావాపృథివ్యా ఇంద్రాగ్నేర్యమస్య వరుణస్య చ ।**
**ధ్వాంతోదరే శశాంకే చ జనిత్వా పరమేశ్వరః ॥ 58 ॥**

స్వర్గలోక భూలోకాలను, ఇంద్రాగ్నియమవరుణాది దేవతలను సృష్టించి, చీకటితో నిండియున్న చంద్రుని యందు కాంతిని నింపినవాడు ఆ పరమేశ్వరుడే.

**కాలోఽసి త్వం మహాకాలః కాలకాలో మహేశ్వరః ।**
**అతస్త్వముగ్రకలయా మృత్యో ర్మృత్యుర్భవిష్యసి ॥ 59 ॥**

నీవు కాలుడవు. కాని మహేశ్వరుడు మహాకాలుడు. అంతేకాదు కాలునకు కాలుడు. కావున నీవు ఉగ్రుడైన శివుని అంశను పొంది మృత్యువునకు మృత్యువు కాగలవు.

**స్థిరోఽద్య త్వక్షరో వీరో వీరో విశ్వావకః ప్రభుః ।**
**ఉపహంతా జ్వరం భీమో మృగః పక్షీ హిరణ్మయః ॥ 60 ॥**

నీవు వీరుడవు. ఇచట స్థిరముగా నుండుము. వీరుడు, జగద్రక్షకుడు, భయంకరుడు, తేజస్స్వరూపుడునగు శివుడు మృగపక్షుల సమాహారరూపాన్ని దాల్చి నీ గర్వమునడంచగలడు.

**శాస్తా శేషస్య జగతస్త్త్వం నైవ చతుర్ముఖః ।**
**నాన్యే చ కేవలం శంభుః సర్వశాస్తా న సంశయః ॥ 61 ॥**

సమస్త జగత్తుయొక్క శాసకుడవు నీవుగాని, చతుర్ముఖ బ్రహ్మగాని కాదు. ఇతరులు కూడా కాదు. శంభుడొక్కడే సర్వశాసకుడనుటలో సందియము లేదు.

**ఇత్థం సర్వం సమాలోక్య సంహరాత్మనమాత్మనా ।**
**న వినష్టం త్వమాత్మానం కురు హే నృహరే! బుధ! ॥ 62 ॥**

ఈ విషయమునంతను నీవు పరిశీలించి నీ అంతట నీవే ఉగ్రరూపాన్ని ఉపసంహరించుము. ఓ నృసింహా! నీవు బుధుడవు. నీ వినాశమును నీవే కొని తెచ్చుకొనుట తగదు.

**నో చేదిదానీం క్రోధస్య మహాభైరవరూపిణః ।**
**వజ్రాశనిరివ స్థాణౌ త్వయి మృత్యుః పతిష్యతి ॥ 63 ॥**

నీవు ఆ విధంగా చేయనిచో, ఈ క్షణములోనే మహాభయంకరాకారుడగు శివుని క్రోధముయొక్క ప్రభావముచే చెట్టుపై పిడుగువలె నీపై మృత్యువు పడగలదు.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వా వీరభద్రోఽపి విరరామాకుతోభయః ।**
**దృష్ట్వా నృసింహాభిప్రాయం క్రోధమూర్తిః శివస్య సః ॥ 64 ॥**

శివుని క్రోధమూర్తియను వీరభద్రుడిట్లు పలికి నృసింహుని అభిప్రాయమును చూచి మిన్నకుండెను.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం శరభావతారవర్ణనం నామైకాదశోఽధ్యాయః ॥ 11 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు శరభావతారవర్ణనం అనే పేరుగల పదకొండవ అధ్యాయం సమాప్తం.

## ద్వాదశోऽధ్యాయః - పన్నెండవ అధ్యాయం

## శరభావతారవర్ణనమ్ - శరభావతారవర్ణనం

**సనత్కుమార ఉవాచ** - సనత్కుమారుడు పలికాడు.

**నందీశ్వర! మహాప్రాజ్ఞ! విజ్ఞాతం తదనంతరమ్ ।**
**మమోపరి కృపాం కృత్వా ప్రీత్యా త్వం తద్వదాధునా ॥ 1 ॥**

ఓ నందీశ్వరా! మహాప్రాజ్ఞ! తదనంతరవృత్తాంతము నీకు తెలియును, నాయందు దయతో ఆవృత్తాంతమును ఇపుడు చెప్పుము.

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్తో వీరభద్రేణ నృసింహః క్రోధవిహ్వలః ।**
**నినదన్నను వేగేన తం గ్రహీతుం ప్రచక్రమే ॥ 2 ॥**

వీరభద్రుడిట్లు పలుకగా, క్రోధవిహ్వలుడైన నృసింహుడు వెంటనే నినాదాన్ని చేస్తూ వేగముగా వీరభద్రుని పట్టుకొనుటకు ప్రయత్నించాడు.

**అత్రాంతరే మహాఘోరం ప్రత్యక్షభయకారణమ్ ।**
**గగనవ్యాపి దుర్ధర్షం శైవతేజస్సముద్భవమ్ ॥ 3 ॥**

ఇంతలో మహాఘోరము, చూడగానే భయాన్ని కలిగించేది, ఆకాశము వలె వ్యాపకమైనది, అడ్డుకొనుటకు శక్యము కానిది, శివుని తేజస్సునుండి పుట్టినదైన ఆకారము ప్రత్యక్షమయ్యింది.

**వీరభద్రస్య తద్రూపమదృశ్యం తు తతః క్షణాత్ ।**
**తద్వై హిరణ్మయం సౌమ్యం న సౌరం నాగ్నిసంభవమ్ ॥ 4 ॥**

వీరభద్రుని రూపము క్షణములో అంతర్ధానమయ్యింది. ఆ ఆకారము తేజస్సుతో నిండియున్నది. ఆ తేజస్సు అగ్ని సూర్య చంద్రుల తేజస్సుకంటె విలక్షణముగా నుండెను.

**న తడిచ్చంద్రసదృశమనౌపమ్యం మహేశ్వరమ్ ।**
**తదా తేజాంసి సర్వాణి తస్మింల్లీనాని శంకరే ॥ 5 ॥**

దానిని మెరుపుతోనైనను పోల్చుట కుదరదు. మహేశ్వరస్వరూపమగు ఆ తేజస్సునకు సాటి లేదు. అంతట సమస్తతేజములు శంకరతేజమునందు విలీనమయ్యాయి.

**న తద్వ్యోమ మహత్తేజో వ్యక్తాంతశ్చాభవత్తతః ।**
**రుద్రసాధారణం చైవ చిహ్నితం వికృతాకృతిః ॥ 6 ॥**

ఆ మహాతేజస్సును ధరించడానికి ఆకాశానికి కూడ సాధ్యము కాకుండెను. ఆ తేజస్సు వికృతమైన ఆకారాన్ని ధరించియున్నన్నూ, రుద్రునితో సమానమైన చిహ్నాలను కలిగియుండెను.

**తతస్సంహారరూపేణ సువ్యక్తం పరమేశ్వరః ।**
**పశ్యతాం సర్వదేవానాం జయశబ్దాదిమంగళైః ॥ 7 ॥**

అంతట దేవతలందరు గాంచి జయ జయ ధ్వానాలను, ఇతర మంగళధ్వనులను చేస్తూ ఉండగా పరమేశ్వరుడు సంహారరూపంతో ఆవిర్భవించాడు.

**సహస్రబాహుర్జటిలశ్చంద్రార్ధకృతశేఖరః ।**
**సమృద్ధోగ్రశరీరేణ పక్షాభ్యాం చంచునా ద్విజః ॥ 8 ॥**

వేయి బాహువులు కలది, జటలు కలది, అర్ధచంద్రకృతశేఖరము అగు ఆ ఆకారము భయంకరమైన పెద్ద శరీరంతో రెండు రెక్కలతో పక్షిముక్కు వంటి ముక్కుతో నుండెను.

**అతితీక్ష్ణో మహాదంష్ట్రో వజ్రతుల్యనఖాయుధః ।**
**కంఠేకాలో మహాబాహుశ్చతుష్పాద్వహ్నిసన్నిభః ॥ 9 ॥**

మిక్కిలి వాడియైన మహా దంష్ట్రలు కలది, వజ్రముల వంటి నఖములే ఆయుధములుగా గలది, కంఠము నందు నల్లని వర్ణములు గలది, నాల్గు పాదములు గలది, అగ్నివలె ప్రకాశించునదియునై యుండెను.

**యుగాంతోద్యతజీమూతభీమగంభీరనిస్వనః ।**
**మహాకుపితకృత్యాగ్నివ్యావృత్తనయనత్రయః ॥ 10 ॥**

ప్రళయకాలములో వర్షించుటకు సిద్ధముగా నున్న మేఘముల గర్జనల వలె భయంకరము, గంభీరమైన శబ్దము గలదియు, మిక్కిలి కోపించిన రాక్షస స్త్రీ వలె నిప్పులు క్రక్కుచున్న మూడు కన్నులను ఇటునటు త్రిప్పుచున్నది.

**స్పష్టదంష్ట్రాధరోష్ఠశ్చ హుంకారసంయుతో హరః ।**
**ఈదృగ్విధస్వరూపశ్చ హ్యుగ్ర ఆవిర్బభూవ హ ॥ 11 ॥**

దంష్ట్రలు పొడుచుకువచ్చిన క్రింది పెదవి గలది, హుంకార శబ్దమును చేయునది, భయంకరమైనదియగు ఆకారంతో శివుడు ఆవిర్భవించాడు.

**హరిస్తద్దర్శనాదేవ వినష్టబలవిక్రమః ।**
**బిభ్రద్ధామ సహస్రాంశోరధః ఖద్యోతవిభ్రమమ్ ॥ 12 ॥**

ఆ ఆకారమును చూచినంత మాత్రముచేతనే విష్ణువు తన బల పరాక్రమములను కోల్పోయెను. సూర్యమండలమును స్పృశించే ఆ రూపము సూర్యుని ప్రకాశమును వెలవెలబోవునట్లు చేసెను.

**అథ విభ్రమ్య పక్షాభ్యాం నాభిపాదాన్విదారయన్ ।**
**పాదానృబంధ పుచ్ఛేన బాహుభ్యాం బాహుమండలమ్ ॥ 13 ॥**

అప్పుడా ఆకారము నృసింహుని రెక్కలతో త్రిప్పి, పాదములను నేలపై కొట్టి, తోకతో పాదములను, బాహువులతో బాహువులను, వక్షఃస్థలమును బంధించివేసెను.

**భిందన్నురసి బాహుభ్యాం నిజగ్రాహ హరో హరిమ్ ।**
**తతో జగామ గగనం దేవైస్సహ మహర్షిభిః ॥ 14 ॥**

అప్పుడు శివుడు బాహువులతో హరివక్షఃస్థలముపై కొట్టి నృసింహుని ఒడిసిపట్టెను. కాని నృసింహుడు దేవతలతో, మునులతో సహా ఆకాశమున కెగిరెను.

**సహసైవాభయాద్విష్ణుం స హి శ్యేన ఇవోరగమ్ ।**
**ఉత్క్షిప్యోత్క్షిప్య సంగృహ్య నిపాత్య చ నిపాత్య చ ॥ 15 ॥**

అపుడు శివుడు వెంటనే విష్ణువు వెనుక వేగముగా వెళ్లి, గ్రద్ద పామును పట్టుకొనిన విధముగా పట్టుకొని అనేక పర్యాయములు పైకి ఎత్తి నేలపై పారవైచెను.

**ఉడ్డీయోడ్డీయ భగవాన్ పక్షఘాతవిమోహితమ్ ।**
**హరిం హరస్తం వృషభం వివేశానంత ఈశ్వరః ॥ 16 ॥**

అనంతుడు, ఈశ్వరుడునగు హరుడు గాలిలో ఎగురుచూ, శ్రేష్ఠుడైన ఆ హరిని లాగుకొనిపోయి, తన రెక్కలతో కొట్టి మూర్ఛిల్లునట్లు చేసి ఆకాశమును ప్రవేశించాడు.

**అనుయాంతం సురాస్సర్వే నమోవాక్యేన తుష్టువుః ।**
**ప్రణేముస్సాదరం ప్రీత్యా బ్రహ్మాద్యాశ్చ మునీశ్వరాః ॥ 17 ॥**

నృసింహుని వెంటబడిన శివుని బ్రహ్మాది దేవతలు, మునీశ్వరులు, సాదరముగా ప్రీతితో నమస్కరించి, నమకముతో స్తుతించారు.

**నీయమానః పరవశో దీనవక్త్రః కృతాంజలిః ।**
**తుష్టావ పరమేశానం హరిస్తం లలితాక్షరైః ॥ 18 ॥**

శివునిచే బలవంతముగా తీసుకొని వెళ్లబడుచున్న హరి దీనముఖుడై చేతులు జోడించి, పరమేశ్వరుని లలితాక్షరాలతో స్తోత్రం చేశారు.

**నామ్నామష్టశతేనైవ స్తుత్వా తాం మృడమేవ చ ।**
**పునశ్చ ప్రార్థయామాస నృసింహః శరభేశ్వరమ్ ॥ 19 ॥**

నృసింహుడు శరభేశ్వరుని రూపములో నున్న శివుని, అష్టోత్తర శతనామములతో స్తుతించి, మరల ఇట్లు ప్రార్థించాడు.

**యదా యదా మమాజ్ఞేయం మతిః స్యాద్గర్వదూషితా ।**
**తదా తదాఽపనేతవ్యా త్వయైవ పరమేశ్వర! ॥ 20 ॥**

ఓ పరమేశ్వరా! అజ్ఞానముతో నిండియున్న నాయీ మనస్సు ఏ ఏ సమయాలలో గర్వముచే కలుషితమగునో, ఆయా సమయాలలో నీవే ఆ గర్వాన్ని తొలగించుచుండుము.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఏవం విజ్ఞాపయన్ ప్రీత్యా శంకరం నరకేసరీ ।**
**నత్వాఽశక్తోఽభవద్విష్ణుర్జీవితాంతపరాజితః ॥ 21 ॥**

పరాజితుడై ప్రాణాంతకస్థితిలోనున్న నృసింహుడు శంకరునికి ప్రీతితో ఇట్లు విన్నవించుకొని మరల శక్తిని పొంది విష్ణురూపమును పొందాడు.

**తద్వక్త్రం శేషగాత్రాంతం కృత్వా సర్వస్వవిగ్రహమ్ ।**
**శక్తియుక్తం తదీయాంగం వీరభద్రః క్షణాత్తతః ॥ 22 ॥**

అంతట వీరభద్రుడు ఆ నృసింహుని తలను మిగిలిన దేహము నుండి క్షణకాలములో వేరుచేసి, శక్తి – మంతుడగు అతనిని నిర్వీర్యుని చేశాడు.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**అథ బ్రహ్మాదయో దేవాః శారభం రూపమాస్థితమ్ ।**
**తుష్టువుః శంకరం దేవం సర్వలోకైకశంకరమ్ ॥ 23 ॥**

సర్వలోకాలకు ఏకైక మంగళప్రదాత, శరభావతారములోనున్న వాడునగు ఆ శంకర దేవుని, బ్రహ్మాది దేవతలు స్తుతించారు.

**దేవా ఊచు** – దేవతలు పలికారు.

**బ్రహ్మవిష్ణింద్రచంద్రాదిసురాః సర్వే మహర్షయః ।**
**దితిజాద్యాః సంప్రసూతాస్త్వ త్తః సర్వే మహేశ్వర! ॥ 24 ॥**

ఓ మహేశ్వరా! బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, చంద్రుడు మున్నగు దేవతలు, మహర్షులు, రాక్షసులు మున్నగు వారందరు నీ నుండియే జన్మించారు.

**బ్రహ్మ విష్ణు మహేంద్రాంశ్చ సూర్యాద్యానసురాన్ సురాన్ ।**
**త్వం వై సృజసి పాస్యత్సి త్వమేవ సకలేశ్వరః ॥ 25 ॥**

బ్రహ్మ, విష్ణువు, మహేంద్రుడు, సూర్యుడు మొదలగు దేవతలను మరియు అసురులను నీవే సృష్టించి, పాలించి, ఉపసంహరించుచున్నావు.

**యతో హరసి సంసారం హర ఇత్యుచ్యతే బుధైః ।**
**నిగృహీతో హరిర్యస్మాద్ధర ఇత్యుచ్యతే బుధైః ॥ 26 ॥**

నీవు సంసారమును హరించెదవు గాన నీకు 'హరుడు' అని పేరు వచ్చినదని పండితులు చెప్పెదరు. నీవు హరిని నిగ్రహించినావు గాన హరుడవైనావనియు పండితులు చెప్పెదరు.

**యతో బిభర్షి సకలం విభజ్య తనుమష్టధా ।**
**అతోఽస్మాన్పాహి భగవన్! సురాదానైరభీప్సితైః ॥ 27 ॥**

ఓ భగవాన్! నీవు నీ శరీరాన్ని అష్టమూర్తులుగా విభజించి బ్రహ్మాండమునంతటిని ధరించుచున్నావు. కావున దేవతలమగు మాకు అభీష్టవరములనిచ్చి కాపాడుము.

**త్వం మహాపురుషః శంభుః సర్వేశస్సురనాయకః ।**
**నిఃస్వాత్మా నిర్వికారాత్మా పరబ్రహ్మ సతాంగతిః ॥ 28 ॥**

నీవు పురుషోత్తముడవు, మంగళస్వరూపుడవు, సర్వేశ్వరుడవు దేవదేవుడవు, స్వార్థము నెరుగనివాడవు, వికారహీనమగు స్వరూపము గలవాడవు, పరబ్రహ్మవు, సత్పురుషులకు శరణ్యుడవు.

**దీనబంధుర్దయాసింధురద్భుతోఽతిః పరాత్మదృక్ ।**
**ప్రాజ్ఞో విరాట్ విభుస్సత్యః సచ్చిదానందలక్షణః ॥ 29 ॥**

నీవు దీనబంధుడవు, దయాసముద్రుడవు, అద్భుతమగు లీలలు గలవాడవు, ధ్యానములో పరాత్మను దర్శించువాడవు. జ్ఞానస్వరూపుడవు, విరాట్ స్వరూపుడవు, సత్యస్వరూపుడవు, సచ్చిదానందస్వరూపుడవునై యున్నావు.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యాకర్ణ్య వచశ్శంభుః దేవానాం పరమేశ్వరః।**
**ఉవాచ తాన్ సురాన్ దేవమహర్షీంశ్చ పురాతనాన్ ॥ 30 ॥**

దేవతల యీ మాటలను పరమేశ్వరుడైన శంభుడు విని దేవతలను, దేవర్షులను, పురాతనులగు మహర్షులనుద్దేశించి యిట్లు పల్కెను.

**యథా జలం జలే క్షిప్తం క్షీరే క్షీరం ఘృతే ఘృతమ్ ।**
**ఏక ఏవ తథా విష్ణుః శివే లీనో న చాన్యథా ॥ 31 ॥**

జలమును జలములో, పాలను పాలలో, నేతిని నేతిలో పోసినచో అవి ఎట్లు ఏకమగునో అటులనే విష్ణువు శివునిలో లీనమై ఏకమగును. ఆ విషయములో సందేహము లేదు.

**ఏకో విష్ణుర్నృసింహాత్మా సదర్పశ్చ మహాబలః।**
**జగత్సంహారకరణే ప్రవృత్తో నరకేసరీ ॥ 32 ॥**

విష్ణువు నృసింహరూపమును ధరించి, మహాబలముచే గర్వితుడై ఒంటరిగా జగత్తును సంహరించే కార్యమునారంభింపబోయెను.

**ప్రార్థనీయో నమస్తస్మై మద్భ క్తై స్సిద్ధికారిభిః ।**
**మద్భక్తప్రవరశ్చైవ మద్భక్తవరదాయకః ॥ 33 ॥**

నృసింహునకు నమస్కారము. ఈ నృసింహుడు నిశ్చయముగా సిద్ధిని పొంది, నాభక్తులచే ప్రార్థింపబడగలడు. నా భక్తులలో శ్రేష్ఠుడగు ఈతడు నా భక్తులకు వరములనీయగలడు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఏతావదుక్త్వా భగవాన్ పక్షిరాజో మహాబలః ।**
**పశ్యతాం సర్వదేవానాం తత్రైవాంతరధీయత ॥ 34 ॥**

మహాబలశాలియగు పక్షిరూపములో నున్న ఆ భగవానుడు ఇంత మాత్రమే పలికి దేవతలందరు చూచుచుండగా అంతర్ధానమయ్యెను.

**వీరభద్రోఽపి భగవాన్ గణాధ్యక్షో మహాబలః ।**
**నృసింహకృత్తిం నిష్కృష్య సమాదాయ యయౌ గిరమ్ ॥ 35 ॥**

గణాధ్యక్షుడు, మహాబలవంతుడు నగు వీరభద్రుడు కూడ నృసింహచర్మమును తొలగించి దానిని తీసుకొని కైలాసమునకు వెళ్లెను

**నృసింహకృత్తివసనస్తదా ప్రభృతి శంకరః ।**
**తద్వక్త్రం ముండమాలాయాం నాయకత్వేన కల్పితమ్ ॥ 36 ॥**

నాటి నుండియు శంకరుడు నృసింహచర్మమును ధరించెను. నృసింహుని తలను తలలమాలికయందు ప్రముఖ స్థానములో గ్రుచ్చి ధరించెను.

**తతో దేవా నిరాతంకా కీర్తయంతః కథామిమామ్ ।**
**విస్మయోత్ఫుల్లనయనా జగ్ముః సర్వే యథాగతమ్ ॥ 37 ॥**

అంతట తొలగిన దుఃఖముగల దేవతలు ఆశ్చర్యముతో విప్పారిన నేత్రములు గలవారై అందరూ ఈ గాథను కీర్తించుచూ, వచ్చిన దారిని వెళ్లారు.

**య ఇదం పరమాఖ్యానం పుణ్యం వేదరసాన్వితమ్ ।**
**పఠతి శృణయాచ్చైవ సర్వాన్కామానవాప్నుయాత్ ॥ 38 ॥**

శ్రేష్ఠము, పుణ్యము, వేదసారముతో గూడినదియునగు ఈ వృత్తాంతమును పఠించువాడు, మరియు వినువాడు, కోర్కెలనన్నింటిని పొందును.

**ధన్యం యశస్యమాయుష్యమారోగ్యం పుష్టివర్ధనమ్ ।**
**సర్వవిఘ్నప్రశమనం సర్వవ్యాధివినాశనమ్ ॥ 39 ॥**

ఈ గాథ ధన్యతను, యశస్సును, ఆయుష్షను, ఆరోగ్యమును కలిగించి పుష్టిని వర్ధిల్లజేయును. విఘ్నములన్నింటిని పోగొట్టును. వ్యాధులన్నింటిని నశింపజేయును.

**దుఃఖప్రశమనం వాంఛాసిద్ధిదం మంగళాలయమ్ ।**
**అపమృత్యుహరం బుద్ధిప్రదం శత్రువినాశనమ్ ॥ 40 ॥**

దుఃఖమును పోగొట్టునది, అభీష్టసిద్ధిని కలిగించునది, మంగళములకు నిలయమైనది, అపమృత్యువును పోగొట్టునది, బుద్ధినిచ్చి శత్రువులను నశింపజేయునది.

**ఇదం తు శరభాకారం పరం రూపం పినాకినః ।**
**ప్రకాశనీయం భక్తేషు శంకరస్య చరేషు వై ॥ 41 ॥**

పినాకియగు శివునియొక్క శ్రేష్ఠమైన ఈ శరభావతారమును శంకరుని భక్తులలో, పూజకులలో ప్రచారము చేయాలి.

**తైరేవ పఠితవ్యం చ శ్రోతవ్యం చ శివాత్మభిః ।**
**నవధా భక్తిదం దివ్యమంతఃకరణబుద్ధిదమ్ ॥ 42 ॥**

శివస్వరూపులగు వారు మాత్రమే దీనిని పఠించాలి. ఈ దివ్యగాథ నవవిధభక్తిని కలిగించి అంతఃకరణమును శుద్ధి చేస్తుంది.

**శివోత్సవేషు సర్వేషు చతుర్దశ్యష్టమీషు చ ।**
**పఠేత్ప్రతిష్ఠాకాలే తు శివసన్నిధికారణమ్ ॥ 43 ॥**

శివోత్సవములన్నింటియందును, చతుర్దశినాడు, అష్టమినాడు, ఆలయప్రతిష్ఠచేయు కాలములో దీనిని పఠించినచో శివుని సన్నిధి లభిస్తుంది.

**చౌరవ్యాఘ్రనృసింహాత్మకృతరాజభయేషు చ ।**
**అన్యేషూత్పాతభూకంపదస్యాదిపాంసువృష్టిషు ॥ 44 ॥**

చోరులు, వ్యాఘ్రములు, దుష్టమానవులు, సింహములు మున్నగు వాటివలన భయము కలిగినప్పుడు, రాజువలన భయము కలిగినప్పుడు, భూకంపము, దొంగలు పడుట ఇత్యాది ఉత్పాతముల యందును, ధూళి వర్షము కురిసినప్పుడును.

**ఉల్కాపాతే మహావాతే వినావృష్ట్యతివృష్టిషు ।**
**పఠేద్యః ప్రయతో విద్వాన్ శివభక్తో దృఢవ్రతః ॥ 45 ॥**

ఉల్కాపాతము జరిగినప్పుడు, తుఫాను, అనావృష్టి, అతివృష్టి కలిగినప్పుడు శివభక్తుడగు విద్వాంసుడు దృఢవ్రతుడై భక్తితో పఠించాలి.

**యః పఠేచ్ఛృణుయాద్వాపి నిష్కామో వ్రతమైశ్వరమ్ ।**
**రుద్రలోకం సమాసాద్య రుద్రస్యానుచరో భవేత్ ॥ 46 ॥**

ఈ ఈశ్వర గాథను నిష్కామబుద్ధితో ఎవడు పఠించునో వాడు రుద్రలోకమును పొంది రుద్రానుచరుడౌతాడు.

**రుద్రలోకమనుప్రాప్య రుద్రేణ సహ మోదతే ।**
**తతస్సాయుజ్యమాప్నోతి శివస్య కృపయా మునే! ॥ 47 ॥**

అతడు రుద్రలోకమును పొంది రుద్రునితో కలిసి ఆనందించును. ఓ మునీ! అట్టి భక్తుడు తదనంతరం శివుని కృపచే శివసాయుజ్యమును పొందును.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం శరభావతారవర్ణనం నామ ద్వాదశోఽధ్యాయః ॥ 12 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు శరభావతారవర్ణనం అనే పేరుగల పన్నెండవ అధ్యాయం సమాప్తం.

## త్రయోదశోఽధ్యాయః - పదమూడవ అధ్యాయం

## గృహపత్యావతారవర్ణనమ్ - గృహపత్యవతారవర్ణనం

**నందీశ్వర ఉవాచ -** నందీశ్వరుడు పలికాడు.

**శృణు బ్రహ్మసుత! ప్రీత్యా చరితం శశిమౌళినః ।**
**సోఽవతీర్ణో యథా ప్రీత్యా విశ్వానరగృహే శివః ॥ 1 ॥**

ఓ బ్రహ్మసుతా! చంద్రశేఖరుని గాథను ప్రీతితో వినుము. ఆ శివుడు ప్రేమతో విశ్వానరుని గృహములో అవతరించిన గాథను వినుము.

**నామ్నా గృహపతిః సోఽభూదగ్నిలోకపతిర్మునే! ।**
**అగ్నిరూపస్తైజసశ్చ సర్వాత్మా పరమః ప్రభుః ॥ 2 ॥**

ఓమునీ! సర్వాత్ముడైన పరమ ప్రభువు తేజోమయుడై, అగ్నిస్వరూపంతో అగ్నిలోకానికి ప్రభువై గృహపతియను పేరుతో అవతరించాడు.

**నర్మదాయాస్తటే రమ్యే పురే నర్మపురే పురా ।**
**పురారిభక్తః పుణ్యాత్మా భవద్విశ్వానరో మునిః ॥ 3 ॥**

పూర్వము నర్మదానదీతీరమునందలి సుందర నర్మపురములో శివుని భక్తుడు, పుణ్యాత్ముడునగు విశ్వానరుడనే మునియుండెడివాడు.

**బ్రహ్మచర్యాశ్రమే నిష్ఠో బ్రహ్మయజ్ఞరతస్సదా ।**
**శాండిల్యగోత్రః శుచిమాన్ బ్రహ్మతేజో నిధిర్వశీ ॥ 4 ॥**

శాండిల్య గోత్రజుడు, శుచిమంతుడు, బ్రహ్మతేజోనిధి, జితేంద్రియుడునగు ఆతడు బ్రహ్మచర్యాశ్రమము-నందు నిష్ఠగలవాడై నిత్యము వేదాధ్యయనమనే యజ్ఞమునందు రతుడై యుండెను.

**విజ్ఞాతాఖిలశాస్త్రార్థస్సదాచారరతస్సదా ।**
**శైవాచారప్రవీణోఽతిలౌకికాచారవిద్వరః ॥ 5 ॥**

అతడు సకల శాస్త్రముల సారము తెలిసినవాడు, సదాచారరతుడు, శైవాచారప్రవీణుడు, లౌకికాచారముల నెరింగిన వారిలో మిక్కిలి శ్రేష్ఠుడునగువాడు.

**చిత్తే విచార్య గృహిణీ గుణాన్విశ్వానరః శుభాన్ ।**
**ఉదువాహ విధానేన స్వోచితాం కాలకన్యకామ్ ॥ 6 ॥**

ఆ విశ్వానరుడు శుభకరమగు గృహిణీధర్మములను మనస్సులో విచారణ చేసి, తనకు తగిన యుక్తవయస్సురాలగు కన్యను యథావిధిగా వివాహమాడినాడు.

**అగ్నిశుశ్రూషణరతః పంచయజ్ఞపరాయణః ।**
**షట్కర్మనిరతో నిత్యం దేవపిత్రతిథిప్రియః ॥ 7 ॥**

అతడు అగ్నిసేవయందు నిష్ఠగలవాడై, పంచయజ్ఞపరాయణుడై, షట్కర్మనిరతుడై, నిత్యము దేవతలకు, పితరులకు, అతిథులకు ప్రీతిని కలిగించుచుండెను.

**ఏవం బహుతిథే కాలే గతే తస్యాగ్రజన్మనః ।**
**భార్యా శుచిష్మతీ నామ భర్తారం ప్రాహ సువ్రతా ॥ 8 ॥**

ఆ బ్రాహ్మణుడీ విధంగా చిరకాలము జీవితము గడిపిన తరువాత అతని భార్యయైన శుచిష్మతి ఒకనాడు అతనితో ఇట్లు పలికింది.

**నాథ! భోగా మయా సర్వే భుక్తా వై త్వత్ప్రసాదతః ।**
**స్త్రీణాం సముచితా యే స్యుః త్వాం సమేత్య ముదావహాః ॥ 9 ॥**

ఓ నాథా! నీ అనుగ్రహం చే నేను భోగాలనన్నిటిని అనుభవించాను. నేను నిన్ను పొంది స్త్రీలకు యోగ్యమైన ఆనందదాయకములగు సమస్త భోగాలను అనుభవించాను.

**ఏవం మే ప్రార్థితం నాథ! చిరాయ హృది సంస్థితమ్ ।**
**గృహస్థానాం సముచితం త్వమేతద్దాతుమర్హసి ॥ 10 ॥**

ఓ నాథా! చిరకాలమునుండి నా హృదయములో ఒక కోరిక మిగిలి యున్నది. గృహస్థులకు సముచితమైన ఈ కోర్కెను నీవు తీర్పదగును.

**విశ్వానర ఉవాచ** – విశ్వానరుడు పలికాడు.

**కిమదేయం హి సుశ్రోణి! తవ ప్రియహితైషిణీ ।**
**తత్ప్రార్థయ మహాభాగే! ప్రయచ్ఛామ్యవిలంబితమ్ ॥ 11 ॥**

ఓ సుందరీ! ప్రియుని హితమును గోరు నీకు ఈయదగనిదేది కలదు? నీవు కోరుకొనుము. నేను వెనువెంటనే నీ కోర్కెను తీర్చెదను.

**మహేశితుః ప్రసాదేన మమ కించిన్న దుర్లభమ్ ।**
**ఇహాముత్ర చ కల్యాణి సర్వకల్యాణకారణః ॥ 12 ॥**

ఓ కల్యాణీ! పుణ్యకార్యములనన్నింటిని చేయు నాకు మహేశ్వరుని అనుగ్రహంచే ఇహపరలోకాలలో దుర్లభమైనదేదియులేదు.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యాకర్ణ్య వచః పత్యుస్తస్య సా పతిదేవతా ।**
**ఉవాచ హృష్యద్వదనా కరౌ బద్ధ్వా వినీతికా ॥ 13 ॥**

భర్తయొక్క మాటను విని ఆ పతివ్రత సంతోషముతో కూడిన ముఖముగలదై వినయముతో చేతులు జోడించి ఇట్లు పలికెను.

**శుచిష్మత్యువాచ –** శుచిష్మతి పలికింది.

**వరయోగ్యాస్మి చేన్నాథ! యది దేయో వరో మమ ।**
**మహేశసదృశం పుత్రం దేహి నాన్యం వరం వృణే ॥ 14 ॥**

ఓ నాథా! నేను వరమునకు పొందుటకు యోగ్యురాలనైనచో నాకు వరమునీయ దలచినచో మహేశ్వరుని బోలు పుత్రుని ఇమ్ము. మరియొక వరమును నేను కోరను.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇతి తస్యా వచః శ్రుత్వా బ్రాహ్మణస్స శుచివ్రతః ।**
**క్షణం సమాధిమాధాయ హృద్యేతత్సమచింతయత్ ॥ 15 ॥**

శుచివ్రతుడైన ఆ బ్రాహ్మణుడు ఆమెయొక్క మాటను విని క్షణకాలము మనస్సును ఏకాగ్రము చేసి హృదయములో ఇట్లు తలంచెను.

**అహో! కిం మే తయా తన్వ్యా ప్రార్థితం హ్యతిదుర్లభమ్ ।**
**మనోరథపథాద్దూరమస్తు వా స హి సర్వకృత్ ॥ 16 ॥**

అహో! ఈ సుందరి అతిదుర్లభమైన వరమును కోరినదేమి? ఈ వరము ఊహకైనను అందునది కాదు. కానిమ్ము. సర్వమును చేయువాడు ఆయనయే గదా!

**తేనైవాస్యా ముఖే స్థిత్వా వాక్స్వరూపేణ శంభునా ।**
**వ్యాహృతం కోఽన్యథా కర్తుముత్సహేత భవేదిదమ్ ॥ 17 ॥**

ఆ శంభుడు ఈమె నోటిలో వాగ్రూపముతో నుండి పలికినాడు. అట్లు కానిచో ఇట్లు పలుకు సామర్థ్యము ఎవరికి గలదు?

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇతి సంచింత్య స మునిర్విశ్వానర ఉదారధీః ।**
**తతః ప్రోవాచ తాం పత్నీమేకపత్నీవ్రతే స్థితః ॥ 18 ॥**

విశాలహృదయుడు, ఏకపత్నీవ్రతుడగు ఆ ముని ఈ విధంగా ఆలోచించి ఇట్లు పలికెను.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్థమాశ్వాస్య తాం పత్నీం జగామ తపసే మునిః ।**
**యత్ర విశ్వేశ్వరః సాక్షాత్కాశీనాథోఽధితిష్ఠతి ॥ 19 ॥**

విశ్వానర మహర్షి తన భార్యకు నచ్చజెప్పి తపస్సు కొరకు బయలుదేరాడు. ఎచ్చట విశ్వేశ్వరుడు కాశీనాథుడై స్వయముగా వెలసియున్నాడో అక్కడకు వెళ్లాడు.

**ప్రాప్య వారాణసీం తూర్ణం దృష్ట్వా తాం మణికర్ణికామ్ ।**
**తత్యాజ తాపత్రితయమపి జన్మశతార్జితమ్ ॥ 20 ॥**

వారాణసీ నగరము వెంటనే చేరి, మణికర్ణికను దర్శించి కొన్ని వందల జన్మలనుండి సంప్రాప్తమైన త్రివిధతాపములను విడిచిపెట్టెను.

**దృష్ట్వా సర్వాణి లింగాని విశ్వేశప్రముఖాని చ ।**
**స్నాత్వా సర్వేషు కుండేషు వాపీకూపసరస్సు చ ॥ 21 ॥**

విశ్వేశ్వరుడు మున్నగు శివలింగములనన్నింటిని దర్శించి సమస్తకుండములందు దిగుడు బావుల – యందు, బావులందు, సరస్సులందు స్నానమును చేసెను

**నత్వా వినాయకాన్సర్వాన్ గౌరీం శర్వాం ప్రణమ్యచ ।**
**సంపూజ్య కాలరాజం చ భైరవం పాపభక్షణమ్ ॥ 22 ॥**

వినాయకులందరికీ ప్రణమిల్లి, శివపత్నియగు గౌరీదేవికి నమస్కరించి, పాపభక్షకుడు, కాలరాజునగు భైరవుని చక్కగా పూజించెను.

**దండనాయకముఖ్యాంశ్చ గణాన్ స్తుత్వా ప్రయత్నతః ।**
**ఆదికేశవముఖ్యాంశ్చ కేశవం పరితోష్య చ ॥ 23 ॥**

దండనాయకుడు మున్నగువారిని, గణాధ్యక్షులను శ్రద్ధతో స్తుతించి, ఆదికేశవుడు మున్నగు దేవతలను, మరియు కేశవుని సంతోషపెట్టాడు.

**లోకార్కముఖసూర్యాంశ్చ ప్రణమ్య స పునః పునః ।**
**కృత్వా చ పిండదానాని సర్వతీర్థేష్వతంద్రితః ॥ 24 ॥**

లోకార్కుడు మున్నగు సూర్యులకు అనేక పర్యాయములు ప్రణమిల్లి, తీర్థములన్నిటియందు అలసట నెరుంగక పిండదానములను చేసెను.

**సహస్రభోజనాద్యైశ్చ మునీన్ విప్రాన్ప్రతర్ప్య చ ।**
**మహాపూజోపచారైశ్చ లింగాన్యభ్యర్చ్య భక్తితః ॥ 25 ॥**

వేయిమంది మునులకు, బ్రాహ్మణులకు భోజనసంతర్పణ చేసి, మహాపూజోపచారములతో భక్తి పూర్వకముగా లింగములనర్చించెను.

**అసకృచ్చింతయామాస కిం లింగం క్షిప్రసిద్ధిదమ్ ।**
**యత్ర నిశ్చలతామేతి తపస్తనయకామ్యయా ॥ 26 ॥**

ఏ లింగము శీఘ్రముగా ఫలమునిచ్చును, పుత్రుని కోరి చేయు తపస్సు ఏ లింగమునందు నిశ్చలముగా కొనసాగును.

**క్షణం విచార్య స మునిరితి విశ్వానరస్సుధీః ।**
**క్షిప్రం పుత్రప్రదం లింగం వీరేశం ప్రశశంస హ ॥ 27 ॥**

ఈ విషయమును బుద్ధిశాలియైన విశ్వానర మహర్షి క్షణకాలము ఆలోచించి, వీరేశలింగము-నారాధించినచో శీఘ్రమే పుత్రుడు కలుగునని ప్రశంసించెను.

**అసంఖ్యాతాస్సహస్రాణి సిద్ధాః సిద్ధిం గతాస్తతః ।**
**సిద్ధలింగమితి ఖ్యాతం తస్మాద్వీరేశ్వరం పరమ్ ॥ 28 ॥**

అనేక వేలమంది సిద్ధులు ఆరాధించి, సిద్ధిని పొందుటచే శ్రేష్ఠమగు ఆ వీరేశలింగమునకు సిద్ధలింగమను ఖ్యాతి కలిగింది.

**వీరేశ్వరం మహాలింగమబ్దమభ్యర్చ్య భక్తితః ।**
**ఆయుర్మనోరథం సర్వం పుత్రాదికమనేకశః ॥ 29 ॥**

వీరేశ్వరమహాలింగమును సంవత్సర కాలము భక్తితో అర్చించినచో, ఆయుర్దాయము, పుత్రప్రాప్తి ఇత్యాది మనోరథాలన్నియు సిద్ధిస్తాయి.

**అహమప్యత్ర వీరేశం సమారాధ్య త్రికాలతః ।**
**ఆశు పుత్రమవాప్స్యామి యథాభిలషితం స్త్రియా ॥ 30 ॥**

నేను కూడ ఇచ్చట మూడు కాలములయందు వీరేశుని ఆరాధించి నా భార్య కోరిన విధముగా శీఘ్రమే పుత్రుని పొందగలను.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇతి కృత్వా మతిం ధీరో విప్రో విశ్వానరః కృతీ ।**
**చంద్రకూపజలే స్నాత్వా జగ్రాహ నియమం వ్రతీ ॥ 31 ॥**

ధీరుడు, కృతార్థుడునగు విశ్వానరముని యిట్లు నిర్ణయించుకొని చంద్రకూపముయొక్క నీటిలో స్నానము చేసి వ్రతనియమమును చేపట్టెను.

**ఏకాహారోఽభవన్మాసం మాసం నక్తాశనోఽభవత్ ।**
**అయాచితాశనో మాసం మాసం త్యక్త్వాశనః పునః ॥ 32 ॥**

అతడు ఒక నెల ఒక పూట, రెండవ నెల రాత్రి మాత్రమే భోజనము చేసెను. ఒక నెల ఆయాచితముగా లభించిన ఆహారమును మాత్రమే భోజనము చేసెను. ఒక నెల ఉపవాసమును చేసెను.

**పయోవ్రతోఽభవన్మాసం మాసం మాసం శాకఫలాశనః ।**
**మాసం ముష్టితిలాహారో మాసం పానీయభోజనః ॥ 33 ॥**

ఒక నెల పాలు త్రాగి, మరి యొక నెల కూరలను, పళ్లను తిని, మరియొక నెల గుప్పెడు తిలలను మాత్రమే తిని, ఒక నెల నీరు త్రాగి తపస్సును చేసెను.

**పంచగవ్యాశనో మాసం మాసం చాంద్రాయణవ్రతీ ।**
**మాసం కుశాగ్రజలభుగ్మాసం శ్వసనభక్షణః ॥ 34 ॥**

ఒక నెల పంచగవ్యమును భుజించెను. ఒక నెల చాంద్రాయణ వ్రతమునాచరించెను. దర్భల అగ్రము నందలి జలమును మాత్రమే ఒక నెల త్రాగెను. ఒక నెల గాలిని మాత్రమే ఆహారముగా తీసుకొనెను.

**ఏవమబ్దమితం కాలం తతాప స తపోఽద్భుతమ్ ।**
**త్రికాలమర్చయద్భక్త్యా వీరేశం లింగముత్తమమ్ ॥ 35 ॥**

ఈ విధముగా అతడు ఒక సంవత్సరము అద్భుతమైన తపస్సును చేసెను. అతడు ఉత్తమమగు వీరేశలింగమును త్రికాలములయందు భక్తితో అర్చించెను

**అథ త్రయోదశే మాసి స్నాత్వా త్రిపథగాంభసి ।**
**ప్రత్యూష ఏవ వీరేశం యావదాయాతి స ద్విజః ॥ 36 ॥**

అనంతరము పదమూడవ మాసములో ఆ బ్రాహ్మణుడు తెల్లవారుజామున గంగాజలములో స్నానము చేసి వచ్చుచుండెను.

**తావద్విలోకయాంచక్రే మధ్యేలింగం తపోధనః ।**
**విభూతిభూషణం బాలమష్టవర్షాకృతిం శిశుమ్ ॥ 37 ॥**

ఇంతలో ఆ తపోనిధి లింగమధ్యభాగమునందు విభూతి అలంకారముగా గలవాడు, ఎనిమిది సంవత్సరముల వయస్సు గలవాడు,

**ఆకర్ణాయతనేత్రం చ సురక్తదశనచ్ఛదమ్।**
**చారుపింగజటామౌళిం నగ్నం ప్రహసితాననమ్ ॥ 38 ॥**

ఆకర్ణ విశాలమగు కన్నులు గలవాడు, ఎర్రని పెదవులు గలవాడు, సుందరమైన నల్లని జటలతో కూడిన శిరస్సు గలవాడు, వస్త్రములు లేనివాడు, చిరునవ్వు మోమువాడు,

**శైశవోచితనేపథ్యధారిణం చితిధారిణమ్ ।**
**పఠంతం శ్రుతిసూక్తాని హసంతం చ స్వలీలయా ॥ 39 ॥**

బాల్యమునకు తగిన ఆభరణములను ధరించినవాడు, చితాభస్మమును ధరించినవాడు, తన లీలతో నవ్వుతూ వేదసూక్తములను పఠించుచున్నవాడునగు బాలకుడు కనబడెను.

**తమాలోక్య ముదం ప్రాప్య రోమకంచుకితో మునిః ।**
**ప్రోచ్చచార హృదాలాపాన్నమోఽస్త్వితి పునఃపునః ॥ 40 ॥**

ఆ మహర్షికి ఆ బాలుని చూచుటతోడనే ఆనందముతో శరీరము గగుర్పాటును చెందెను. ఆయన తన హృదయానందమును అనేక పర్యాయములు 'నమస్కారమగు గాక' అని బిగ్గరగా పలుకుతూ ప్రకటించెను.

**అభిలాషప్రదైః పద్యైరష్టభిర్బాలరూపిణమ్ ।**
**తుష్టావ పరమానందం శంభుం విశ్వానరః కృతీ ॥ 41 ॥**

కృతార్థుడైన విశ్వానరుడు బాలరూపములోనున్న పరమానందస్వరూపుడగు శివుని భక్తిని కలిగించే ఎనిమిది పద్యములతో స్తుతించెను.

**విశ్వానర ఉవాచ –** విశ్వానరుడు పలికాడు.

**ఏకం బ్రహ్మైవాద్వితీయం సమస్తం సత్యం సత్యం నేహ నానాస్తి కించిత్**
**ఏకో రుద్రో న ద్వితీయోఽవతస్థే తస్మాదేకం త్వాం ప్రపద్యే మహేశమ్ ॥ 42 ॥**

బ్రహ్మ ఒకే పూర్ణ సత్య తత్త్వము. ఈ నానాత్వము కన్పట్టునదియేగాని సత్యము గాదు. రుద్రుడు ఒక్కడే గలడు. రెండవ తత్త్వము లేదు. కావున అద్వయుడవు, మహేశుడవునగు నిన్ను శరణుకోరుచున్నాను.

**కర్తా హర్తా త్వం హి సర్వస్య శంభో! నానారూపేష్వేకరూపోఽప్యరూపః।**
**యద్వత్ప్రత్యగ్ధర్మ ఏకోప్యనేకస్తస్మాన్నాన్యం త్వాం వినేశం ప్రపద్యే ॥ 43 ॥**

ఓ శంభో! సర్వమును సృష్టించువాడవు, లయము చేయువాడవు నీవే. వివిధ రూపములలో అఖండ శక్తి రూపములో నుండు నీకు రూపము లేదు. ప్రత్యగాత్మ స్వరూపుడవగు నీవు అద్వయుడవైనను, అనేకముగా కనిపించుచున్నావు. కావున ఈశ్వరుడవగు నిన్ను తక్క ఇతరమును శరణుపొందను.

**రజ్జౌ సర్పః శుక్తికాయాం చ రౌప్యం నైరః పూరస్తన్మృగాఖ్యే మరీచౌ ।**
**యద్వత్సద్వద్విష్వగేవ ప్రపంచో యస్మిన్ జ్ఞాతే తం ప్రపద్యే మహేశమ్ ॥ 44 ॥**

త్రాడునందు పాము, ముత్యపు చిప్పయందు వెండి, ఎండమావులయందు నీరు ఎట్లు మిథ్యయో, అటులనే నీయందు విశ్వము మిథ్యయగును. దేనిని తెలిసినచో తత్త్వతః ప్రపంచము తెలిసినట్లగునో, అట్టి మహేశుని శరణు పొందుచున్నాను.

**తోయే శైత్యం దాహకత్వం చ వహ్నౌ తాపో భానౌ శీతభానౌ ప్రసాదః ।**
**పుష్పే గంధో దుగ్ధమధ్యేఽపి సర్పిర్యత్తచ్ఛంభో! త్వం తతస్త్వాం ప్రపద్యే ॥ 45 ॥**

నీటియందలి చల్లదనము, నిప్పుయందలి వేడి, సూర్యుని యందలి తాపము, చంద్రునియందలి ఆహ్లాదకత్వము, పుష్పములందలి పరిమళము, పాలలోని వెన్న నీవే. కావున ఓ శంభో! నిన్ను నేను శరణువేడుచున్నాను.

**శబ్దం గృహ్ణాస్యశ్రవాస్త్వం హి జిఘ్రస్యఘ్రాణస్త్వం వ్యంఘ్రిరాయాసి దూరాత్ ।**
**త్ర్యక్షః పశ్యేస్త్వం రసజ్ఞోఽప్యజిహ్వః కస్త్వాం సమ్యగ్వేత్త్యతస్త్వాం ప్రపద్యే ॥ 46 ॥**

నీవు శబ్దమును వినెదవు. కాని నీకు చెవులు లేవు. నీవు ఆఘ్రాణించెదవు. కాని నీకు ముక్కులేదు. నీకు పాదములు లేకున్నను దూరమునుండి వచ్చెదవు. మూడు కన్నులు గల నీవు చూచుచున్నావు. జిహ్వ లేని నీవు రుచిని తెలియుచున్నావు. నీ స్వరూపమును పూర్ణముగా ఎవరు తెలిసికొనగలరు? కావున నిన్ను శరణు వేడుచున్నాను.

**నో వేద త్వామీశ! సాక్షాద్ధి వేదో  నో వా విష్ణుర్నో విధాతాఽఖిలస్య ।**
**నో యోగీంద్రా నేంద్రముఖ్యాశ్చ దేవా భక్తో వేద త్వామతస్త్వాం ప్రపద్యే ॥ 47 ॥**

ఓ ఈశ్వరా! వేదము సాక్షాత్తుగా నిన్ను ఎరుంగజాలదు. విష్ణువుగాని, సమస్తమును సృజించు బ్రహ్మగాని నిన్ను యెరుంగరు. యోగి శ్రేష్ఠులు, ఇంద్రాది దేవతలు నిన్ను ఎరుంగరు. కాని భక్తుడు నిన్ను తెలియగల్గును. కావున నిన్ను శరణు పొందుచున్నాను.

**నో తే గోత్రం నో సజన్మాపి నాశో నో వా రూపం నైవ శీలం న దేశః ।**
**ఇత్థం భూతోఽపీశ్వరస్త్వం త్రిలోక్యాః సర్వాన్కామాన్పూరయేస్త్వం భజే త్వామ్ ॥ 48 ॥**

నీకు గోత్రము లేదు. జన్మ నాశములు లేవు. నీకు రూపము లేదు. నీకు శీలము లేదు. దేశము లేదు. ఇట్టి వాడవైనను నీవు ముల్లోకములకు ప్రభుడవు. నేను నిన్ను సేవించుచున్నాను. నా కోర్కెలనీడేర్చుము.

**త్వత్తః సర్వం త్వం హి సర్వం స్మరారే! త్వం గౌరీశస్త్వం చ నగ్నోఽతిశాంతః ।**
**త్వం వై వృద్ధస్త్వం యువా త్వం చ బాలస్తత్త్వం యత్కిం నాన్యతస్త్వాం నతోఽహమ్ ॥ 49 ॥**

ఓ మన్మథాంతకా! సర్వము నీనుండి ఉద్భవించింది. సర్వము నీవే. నీవు దిగంబరుడవు. నీవు పరమ - శాంత స్వరూపుడవు. వృద్ధుడవు నీవే. యువకుడవు నీవే, బాలుడవు నీవే. నీచే వ్యాప్తముకాని తత్త్వమేది గలదు? నేను నీకు నమస్కరించుచున్నాను.

**నందీశ్వర ఉవాచ -** నందీశ్వరుడు పలికాడు.

**స్తుత్వేతి విప్రో నిపపాత భూమౌ  సంబద్ధపాణిర్భవతీహ యావత్ ।**
**తావత్స బాలోఽఖిలవృద్ధవృద్ధః ప్రోవాచ భూదేవమతీవ హృష్టః ॥ 50 ॥**

ఆ బ్రాహ్మణుడిట్లు స్తుతించి చేతులను కట్టుకొని సాష్టాంగ ప్రణామము నాచరించునంతలో వృద్ధులందరిలో వృద్ధుడగు ఆ బాలుడు మిక్కిలి ఆనందించి ఆ బ్రాహ్మణునితో ఇట్లు పలికెను.

**బాల ఉవాచ –** బాలుడు పలికాడు.

**విశ్వానర! మునిశ్రేష్ఠ! భూదేవాహం త్వయాద్య వై ।**
**తోషితస్సుప్రసన్నాత్మా వృణీష్వ వరముత్తమమ్ ॥ 51 ॥**

ఓ మునిశ్రేష్ఠా! విశ్వానరా! బ్రాహ్మణా! నేను నీ తపస్సునకు సంతోషించితిని నా మనస్సు మిక్కిలి ప్రసన్నమైనది. నీవు ఉత్తమమైన వరమును కోరుకొనుము.

**తత ఉత్థాయ హృష్టాత్మా మునిర్విశ్వానరః కృతీ ।**
**ప్రత్యబ్రవీన్మునిశ్రేష్ఠః శంకరం బాలరూపిణమ్ ॥ 52 ॥**

అంతట కృతార్థుడైన విశ్వానరమహర్షి ఆనందంతో నిండిన మనస్సుగలవాడై లేచి నిలబడి బాలుని రూపములో నున్న శంకరునకు ఇట్లు బదులు పలికాడు.

**విశ్వానర ఉవాచ –** విశ్వానరుడు పలికాడు.

**మహేశ్వర! కిమజ్ఞాతం సర్వజ్ఞస్య తవ ప్రభో! ।**
**సర్వాంతరాత్మా భగవాన్ శర్వస్సర్వప్రదో భవాన్ ॥ 53 ॥**

ఓ మహేశ్వరా! ప్రభూ! సర్వజ్ఞుడవగు నీకు తెలియనిదేమున్నది? నీవు సర్వుల అంతరంగములో నుండే భగవానుడవు. సర్వమునిచ్చే శర్వుడవు.

**యాచ్ఞాం ప్రతి నియుక్తం మాం కిం బ్రూషే దైన్యకారిణీమ్ ।**
**ఇతి జ్ఞాత్వా మహేశాన! యథేచ్ఛసి తథా కురు ॥ 54 ॥**

నీవు నన్ను దైన్యమును కలిగించే యాచనయందు ఏల నియోగించుచున్నావు? ఓ మహేశ్వరా ! సర్వము నీకు తెలియును. కావున నీకు తోచినట్లు చేయుము.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇతి శ్రుత్వా వచస్తస్య దేవో విశ్వానరస్య హి ।**
**శుచిశ్శుచివ్రతస్యాథ శుచి స్మిత్వాఽబ్రవీచ్ఛిశుః ॥ 55 ॥**

శుద్ధవ్రతుడగు విశ్వానరుని మాటను విని పవిత్రశిశురూపములో నున్న శివుడు చిరునవ్వుతో ఇట్లు పలికాడు.

**త్వయా శుచే! శుచిష్మత్యాం యోఽభిలాషః కృతో హృది ।**
**అచిరేణైవ కాలేన స భవిష్యత్యసంశయమ్ ॥ 56 ॥**

ఓయీ పవిత్రుడా! నీ వెట్టి పుత్రుని శుచిష్మతియందు పొందవలెనని హృదయములో కోరుకొంటివో, అట్టి పుత్రుడు శీఘ్రముగా, నిస్సంశయముగా లభించగలడు.

**తవ పుత్రత్వమేష్యామి శుచిష్మత్యాం మహామతే! ।**
**ఖ్యాతో గృహపతిర్నామ్నా శుచిస్సర్వామరప్రియః ॥ 57 ॥**

ఓ మహాత్మా! నేను శుచిష్మతి యందు నీపుత్రుడనై జన్మించి, "గృహపతి" యను పేరుతో ప్రసిద్ధిని గాంచి, పావనుడనై దేవతలందరికి ప్రియుడను కాగలను.

**అభిలాషాష్టకం పుణ్యం స్తోత్రమేతత్త్వయేరితమ్ ।**
**అబ్దత్రికాలపఠనాత్కామదం శివసన్నిధౌ ॥ 58 ॥**

నీవు పలికిన అభిలాషాష్టకమను పేరుగల పవిత్రమగు ఈ స్తోత్రమును శివుని సన్నిధిలో మూడు కాలములయందు సంవత్సరకాలము పఠించినచో కోర్కెలు ఈడేరును.

**ఏతత్‌స్తోత్రప్రపఠనం పుత్రపౌత్రధనప్రదమ్ ।**
**సర్వశాంతికరశ్చాపి సర్వాపత్తివినాశనమ్ ॥ 59 ॥**

ఈ స్తోత్రమును పఠించినచో పుత్రులు, పౌత్రులు, ధనము లభించి ఆపదలన్నియు దూరమై సంపూర్ణమగు శాంతి కలుగును.

**స్వర్గాపవర్గసంపత్తికారకం నాత్ర సంశయః ।**
**సర్వస్తోత్రసమం హ్యేతత్సర్వకామప్రదం సదా ॥ 60 ॥**

ఈ స్తోత్రము స్వర్గమోక్షములను, సంపదను, ఇచ్చుననుటలో సందేహము లేదు. సర్వదా కోర్కెలనన్నిటిని ఈడేర్చు ఈ ఒక్క స్తోత్రము ఇతర స్తోత్రములన్నింటితో సమమైనది.

**ప్రాతరుత్థాయ సుస్నాతో లింగమభ్యర్చ్య శాంభవమ్ ।**
**వర్షం జపన్నిదం స్తోత్రమపుత్రః పుత్రవాన్భవేత్ ॥ 61 ॥**

ప్రతి నిత్యము ఉదయమే నిద్ర లేచి, చక్కగా స్నానము చేసి శంభుని లింగమును పూజించి సంవత్సరకాలము ఈ స్తోత్రమును జపించినచో పుత్రుడు లేని వానికి పుత్రుడు కలుగును.

**అభిలాషాష్టకమిదం న దేయం యస్య కస్యచిత్ ।**
**గోపనీయం ప్రయత్నేన మహావంధ్యా ప్రసూతికృత్ ॥ 62 ॥**

ఈ అభిలాషాష్టకమును ఎవడు కనబడితే వానికి చెప్పరాదు. దీర్ఘకాలవంధ్యయైనను ప్రసవించునట్లు చేయగల ఈ స్తోత్రమును శ్రద్ధతో పరిరక్షించవలెను.

**స్త్రియా వా పురుషేణాపి నియమాల్లింగసన్నిధౌ ।**
**అబ్దం జప్తమిదం స్తోత్రం పుత్రదం నాత్ర సంశయః ॥ 63 ॥**

స్త్రీగాని, పురుషుడు గాని లింగసన్నిధిలో నియమపూర్వకముగా సంవత్సరకాలము ఈ స్తోత్రమును జపించినచో నిస్సంశయముగా పుత్రుడు కలుగును.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వాంతర్దధే శంభుర్బాలరూపః సతాంగతిః ।**
**సోఽపి విశ్వానరో విప్రో హృష్టాత్మా స్వగృహం యయౌ ॥ 64 ॥**

సత్పురుషులకు శరణ్యుడు, బాలరూపములో నున్నవాడునగు శంభుడు ఇట్లు పలికి అంతర్ధానమైనాడు. ఆ విశ్వానరమహర్షి కూడ ఆనందముతో నిండిన మనస్సుగలవాడై తన యింటికి చేరుకొనెను.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం గృహపత్యవతారవర్ణనం నామ త్రయోదశోఽధ్యాయః ॥ 13 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు గృహపత్యవతారవర్ణనం అనే పేరుగల పదమూడవ అధ్యాయం సమాప్తం.

## **చతుర్దశోఽధ్యాయః** - పద్నాల్గవ అధ్యాయం

## **గృహపత్యవతారవర్ణనమ్** - గృహపత్యావతారవర్ణనం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**స విప్రో గృహమాగత్య మహాహర్షసమన్వితః ।**
**ప్రియాయై కథయామాస తద్వృత్తాంతమశేషతః ॥ 1 ॥**

ఆ బ్రాహ్మణుడు మహానందముతో కూడినవాడై యింటికి వచ్చి ఆ వృత్తాంతమునంతటిని తన ప్రియురాలికి చెప్పాడు.

**తచ్ఛ్రుత్వా విప్రపత్నీ సా ముదం ప్రాప శుచిష్మతీ ।**
**అతీవ ప్రేమసంయుక్తా ప్రశశంస విధిం నిజమ్ ॥ 2 ॥**

ఆ బ్రాహ్మణుని భార్యయగు శుచిష్మతి ఆ వృత్తాంతమును విని ఆనందించింది. ఆమె మిక్కిలి ప్రేమగలదియై తన భాగ్యమును కొనియాడినది.

**అథ కాలేన తద్యోషిదంతర్వత్నీ బభూవ హ।**
**విధివద్విహితే తేన గర్భాధానాఖ్యకర్మణి ॥ 3 ॥**

తరువాత కొంత కాలమునకు యథావిధిగా గర్భాధానసంస్కారమునునుష్ఠింపగా ఆమె గర్భవతి యయ్యెను.

**తతః పుంసవనం తేన స్యందనాత్ప్రాగ్విపశ్చితా ।**
**గృహ్యోక్తవిధినా సమ్యక్ కృతం పుంస్త్వవివృద్ధయే ॥ 4 ॥**

తరువాత పూర్ణగర్భవికాసమునకు ఆ విశ్వానరుడు గృహ్యాసూత్రములో చెప్పిన విధానముతో పురుషత్వవృద్ధి కొరకై పుంసవనమును చక్కగా అనుష్ఠించాడు.

**సీమంతోఽథాష్టమే మాసే గర్భరూపసమృద్ధికృత్ ।**
**సుఖప్రసవసిద్ధ్యై చ తేనాకారి కృపావిదా ॥ 5 ॥**

ఎనిమిదవ మాసములో గర్భరూపమును సమృద్ధము చేయునది, సుఖప్రసవమును కలిగించునదియునగు సీమంతమును ఆ బ్రాహ్మణుడు జరిపించాడు.

**అథాతశ్శుభతారాసు తారాధిపవరాననః ।**
**కేంద్రే గురౌ శుభే లగ్నే సుగ్రహేషు యుగేషు చ ॥ 6 ॥**

తరువాత నక్షత్రములు శుభకరములై యుండగా, బృహస్పతి కేంద్రమునందుండగా, శుభ గ్రహయోగములందు శుభలగ్నములో చంద్రుని వంటి మోముగలవాడు,

**అరిష్టదీపనిర్వాణస్సర్వారిష్టవినాశకృత్ ।**
**తనయో నామ తస్యాం తు శుచిష్మత్యాం బభూవ హ ॥ 7 ॥**

విపత్తులను నశింపజేయువాడు, మృత్యురూపమగు అమంగళమును తొలగించువాడునగు శివుడు, శుచిష్మతికి పుత్రుడుగ ప్రకటితమయ్యాడు.

**శర్వస్సమస్తసుఖదో భూర్భువఃస్వర్నివాసినామ్ ।**
**గంధవాహనవాహాశ్చ దిగ్వధూర్ముఖవాససః ॥ 8 ॥**

భూర్భువః స్వర్లోకములలో నివసించువారికి సమస్త సుఖములనిచ్చే శర్వుడు అవతరించాడు. ఆ సమయములో సుగంధమును కలిగియున్న వాయువులు, దిక్కులు అనే యువతుల ముఖములపై వస్త్రములైనవి.

**ఇష్టగంధప్రసూనౌఘైర్వవృషుస్తే ఘనాఘనాః।**
**దేవదుందుభయో నేదుః ప్రసేదుస్సర్వతో దిశః ॥ 9 ॥**

మహా మేఘములు అభీష్టమగు సుగంధముగల పుష్పములను అధికముగా వర్షించినవి. దేవదుందుభులు మ్రోగినవి. దిక్కులన్నియు నిర్మలమైనవి.

**పరితస్సరితస్స్వచ్ఛా భూతానాం మానసైస్సహ।**
**తమోఽతామ్యత్తు నితరాం రజోఽపి విరజోఽభవత్ ॥ 10 ॥**

జలాశయములన్నియు తేటపడినవి. ప్రాణుల మనస్సులు ప్రసన్నమయ్యాయి. చీకట్లు తొలగిపోయాయి. ధూళి అణగారి దిక్కులన్నియు స్వచ్ఛమైనాయి.

**సత్త్వాస్సత్త్వసమాయుక్తాః సుధావృష్టిర్బభూవ వై।**
**కల్యాణీ సర్వథా వాణీ ప్రాణినః ప్రియవత్యభూత్ ॥ 11 ॥**

ప్రాణులు ఆనందాన్ని పొందాయి. అమృతవర్షము కురిసింది. మానవుల వాక్కు అన్ని విధములుగా మంగళకరము, ప్రియమైనదియునయ్యెను.

**రంభాముఖ్యా అప్సరసో మంగళద్రవ్యపాణయః ।**
**విద్యాధర్యశ్చ కిన్నర్యస్తథాఽమర్యస్సహస్రశః ॥ 12 ॥**

రంభాద్యప్సరసలు, విద్యాధర యువతులు, కిన్నరస్త్రీలు, వేలాది మంది దేవతా స్త్రీలు.

**గంధర్వోరగయక్షాణాం సుమాని యః శుభస్వరాః।**
**గాయంత్యో మంగళం గీతం తత్రాజగ్మురనేకశః ॥ 13 ॥**

గంధర్వనాగయక్షుల యువతులు మంగళ ద్రవ్యములను చేతబట్టి మధుర స్వరముతో, మంగళగీతములను పాడుతూ పెద్దసంఖ్యలో అచ్చటకు విచ్చేశారు.

**మారీచిరత్రిః పులహః పులస్త్యః క్రతురంగిరాః ।**
**వశిష్ఠః కాశ్యపోఽగస్త్యో విభాండో మాండవీసుతః ॥ 14 ॥**

మరీచి, అత్రి, పులహుడు, పులస్త్యుడు, క్రతువు, అంగిరస్సు, వశిష్ఠుడు, కశ్యపుడు, అగస్త్యుడు, మాండవీపుత్రుడగు విభాండుడు విచ్చేశారు.

**లోమశో రోమచరణో భరద్వాజోఽథ గౌతమః ।**
**భృగుస్తు గాలవో గర్గో జాతూకర్ణ్యః పరాశరః ॥ 15 ॥**

లోమశుడు, రోమచరణుడు, భరద్వాజుడు, గౌతముడు, భృగువు, గాలవుడు, గర్గుడు, జాతూకర్ణ్యుడు, పరాశరుడు,

**ఆపస్తంభో యాజ్ఞవల్క్యో దక్షవాల్మీకిముద్గలా ః ।**
**శాతాతపశ్చ లిఖిదశ్శిలాదః శంఖ ఉంఛభుక్ ॥ 16 ॥**

ఆపస్తంబుడు, యాజ్ఞవల్క్యుడు, దక్షుడు, వాల్మీకి, ముద్గలుడు, శాతాతపుడు, లిఖిదుడు, శిలాదుడు, ఉంఛవృత్తిచే జీవించు శంఖుడు,

**జమదగ్నిశ్చ సంవర్తో మతంగో భరతోఽంశుమాన్ ।**
**వ్యాసః కాత్యాయనః కుత్సః శౌనకస్సుత్రుతశ్శుకః ॥ 17 ॥**

జమదగ్ని, సంవర్తుడు, మతంగుడు, భరతుడు, అంశుమంతుడు, వ్యాసుడు, కాత్యాయనుడు, కుత్సుడు, శౌనకుడు, సువ్రతుడు, శుకుడు,

**ఋష్యశృంగోఽథ దుర్వాసాశ్శుచిర్నారదతుంబురూ ।**
**ఉత్తంకో వామదేవశ్చ పవనోఽసితదేవళౌ ॥ 18 ॥**

ఋష్యశృంగుడు, దుర్వాసుడు, శుచి, నారదుడు, తుంబురుడు, ఉత్తంకుడు, వామదేవుడు, పవనుడు, అసితుడు, దేవలుడు,

**సాలంకాయనహారీతౌ విశ్వామిత్రోఽథ భార్గవః ।**
**మృకండస్సహపుత్రేణ పర్వతో దారుకస్తథా ॥ 19 ॥**

సాలంకాయనుడు, హారీతుడు, విశ్వామిత్రుడు, భార్గవుడు, మృకండుడు, అతని పుత్రుడగు మార్కండేయుడు, పర్వతుడు, దారుకుడు.

**ధౌమ్యోపమన్యువత్సాద్యా మునయో మునికన్యకాః ।**
**తచ్ఛాన్త్యర్థం సమాజగ్ముర్ధన్యం విశ్వానరాశ్రమమ్ ॥ 20 ॥**

ధౌమ్యుడు, ఉపమన్యుడు, వత్సుడు మొదలగు మహర్షులు, మునికన్యలు, జన్మకాలమందు చేయబడే శాంతికొరకై విశ్వానరుని పవిత్రమగు ఆశ్రమమునకు విచ్చేశారు.

**బ్రహ్మా బృహస్పతియుతో దేవో గరుడవాహనః ।**
**నందిభృంగిసమాయుక్తో గౌర్యా సహ వృషధ్వజః ॥ 21 ॥**

బ్రహ్మ, బృహస్పతి, గరుడవాహనుడగు విష్ణుదేవుడు, నంది భృంగిలతో కూడిన పార్వతీ పరమేశ్వరులు విచ్చేశారు.

**మహేంద్రముఖ్యా గీర్వాణా నాగా పాతాళవాసినః ।**
**రత్నాన్యాదాయ బహుశస్సరిత్కా మహోబ్ధయః ॥ 22 ॥**

మహేంద్రుడు మున్నగు దేవతలు, పాతాళమునందు నివసించు నాగులు, నదులు, సముద్రములు అనేక రత్నములను తీసుకొని వచ్చారు.

**స్థావరా జంగమం రూపం ధృత్వా యాతాస్సహస్రశః ।**
**మహామహోత్సవే తస్మిన్నభూవాకాలకౌముదీ॥ 23 ॥**

పర్వతములు పురుషరూపమును ధరించి వేల సంఖ్యలో వచ్చారు. ఆ మహోత్సవమునందు కాలము కాని కాలములో వెన్నెలలు కురిసినవి.

**జాతకర్మ స్వయం తస్య కృతవాన్విధిరానతః ।**
**శ్రుతిం విచార్య తద్రూపం నామ్నా గృహపతిస్త్వయమ్ ॥ 24 ॥**

బ్రహ్మ వినయపూర్వకముగా ఆ బాలునకు జాతకర్మను స్వయంగా చేయించాడు. ఆ బాలుని రూపమును, మరియు వేదశాఖను పరిశీలించి అతనికి స్వయంగా 'గృహపతి' అని పేరు పెట్టారు.

**ఇతి నామ దదౌ తస్మై దేయమేకాదశేఽహని ।**
**నామకర్మవిధానేన తదర్థశ్రుతిముచ్చరన్ ॥ 25 ॥**

పదకొండవ రోజున వేదమంత్రములనుచ్చరిస్తూ, నామకర్మ విధానముతో ఆ పేరును పెట్టారు.

**చతుర్నిగమమంత్రోక్తైరాశీర్భిరభినంద్య చ ।**
**సమయాద్ధంసమారుహ్య సర్వేషాం చ పితామహః ॥ 26 ॥**

పితామహుడగు బ్రహ్మ నాల్గు వేదములలోని మంత్రములతో ఆశీర్వదించి, అభినందించి, హంసారూఢుడై తన లోకమునకు వెళ్ళాడు.

**కృత్వా బాలోచితాం రక్షాం లౌకికీం గతిమాశ్రితః ।**
**ఆరుహ్య యానం స్వం ధామ హరోఽపి హరిణా యయౌ ॥ 27 ॥**

లోకపు పోకడ ననుసరించి, శివ విష్ణువులు కూడ బాలునకు తగిన రక్షను చేసి తమ వాహనములపై తమ ధామములకు వెళ్లారు.

**అహో! రూపమహో! తేజస్త్వహో! సర్వాంగలక్షణమ్।**
**అహో! శుచిష్మతీభాగ్యమావిరాసీత్స్వయం హరః ॥ 28 ॥**

అహెూ! ఏమి రూపము! ఏమి తేజస్సు! అవయవములన్నియు ఎంత చక్కగా నున్నవియో!అహెూ ! శుచిష్మతి భాగ్యవంతురాలు శివుడు స్వయముగా ఆమెకు పుత్రుడై అవతరించాడు.

**అథవా కిమిదం చిత్రం శర్వభక్తజనేష్వహో !**
**స్వయమావిరభూద్రుద్రో యయో రుద్రస్తదర్చితః ॥ 29 ॥**

భక్తజనుల విషయములో ఇట్లు జరుగుటలో ఆశ్చర్యమేమున్నది? వారు రుద్రుని అర్చించినారు. కావున రుద్రుడు స్వయముగా ఆవిర్భవించినాడు.

**ఇతి స్తువన్తస్తేన్యోఽన్యం సంప్రహృష్టతనూరుహః ।**
**విశ్వానరం సమాపృచ్ఛ్య జగ్ముః సర్వే యథాగతమ్ ॥ 30 ॥**

వారందరు ఇట్లు స్తుతిస్తూ, తమలో తాము మాటలాడుకొనుచూ, గగుర్పాటుతో గూడిన దేహములు గలవారై విశ్వానరుని వద్ద సెలవు తీసుకొని వచ్చిన దారిని వెళ్ళారు.

**అతః పుత్రం సమీహంతే గృహస్థాశ్రమవాసినః ।**
**పుత్రేణ లోకాన్ జయతి శ్రుతి రేషా సనాతనీ ॥ 31 ॥**

అందువలననే గృహస్థాశ్రమములోనున్నవారు పుత్రుని కాంక్షించెదరు. పుత్రుడు పుణ్యలోకములను పొందుటలో కారణమగునని సనాతనమగు వేదము చెప్పుచున్నది.

**అపుత్రస్య గృహం శూన్యమపుత్రస్యార్జనం వృథా ।**
**అపుత్రస్య తపశ్ఛిన్నం న పవిత్రత్యపుత్రతః ॥ 32 ॥**

పుత్రుడు లేని వారి యిల్లు శూన్యముగా నుండును. వాని సంపాదన వ్యర్థము. వాని తపస్సు చెడిపోవును. పుత్రుడు లేనివానికి పవిత్రత ఉండదు.

**న పుత్రాత్పరమో లాభో న పుత్రాత్పరమం సుఖమ్ ।**
**న పుత్రాత్పరమం మిత్రం పరత్రేహ చ కుత్రచిత్ ॥ 33 ॥**

పుత్రుని కంటె గొప్ప లాభము కాని, గొప్ప సుఖము కాని లేదు. ఇహపరలోకములలో పుత్రునికంటె గొప్ప మిత్రుడు లేడు.

**నిష్క్రమోఽథ చతుర్థేఽస్య మాసి పిత్రా కృతో గృహాత్ ।**
**అన్నప్రాశనమబ్దార్థే చూడార్థే చార్థవత్కృతా ॥ 34 ॥**

తండ్రి ఆ బాలునకు నాల్గవ మాసములో ఇంటి గడపను దాటుట అను ఉత్సవమును, ఆరవ మాసములో అన్నప్రాశనమును, సంవత్సరము దాటిన తరువాత కేశవపనమును చేయించెను.

**కర్ణవేధం తతః కృత్వా శ్రవణర్‌క్షే స కర్మవిత్ ।**
**బ్రహ్మతేజోఽభివృద్ధ్యర్థం పంచమేఽబ్దే వ్రతం దదౌ ॥ 35 ॥**

కర్మవిదుడగు ఆ తండ్రి శ్రవణానక్షత్రమునాడు ఆబాలునకు చెవులను కుట్టించెను. ఐదవ యేట ఆ బాలునిచే బ్రహ్మతేజస్సును వర్ధిల్లజేయు వ్రతమును చేయించెను.

**ఉపాకర్మ తతః కృత్వా వేదానధ్యాపయత్సుధీః ।**
**అబ్దం వేదాన్స విధినాఽధ్యైష్ట సాంగపదక్రమాన్ ॥ 36 ॥**

అనంతరం ఉపాకర్మను జరిపించి, ఆ సద్బ్రాహ్మణుడు ఆ బాలునకు వేదములను చెప్పించెను. అతడు ఒక సంవత్సర కాలము వేదాంగములతో పదక్రమములతో గూడిన వేదములను యథావిధిగా అధ్యయనము చేసెను.

**విద్యాజాతం సమస్తం చ సాక్షిమాత్రం గురోర్ముఖాత్ ।**
**వినయాదిగుణానావిష్కుర్వన్ జగ్రాహ శక్తిమాన్ ॥ 37 ॥**

శక్తిమంతుడగు ఆ బాలుడు విద్యలనన్నిటిని గురుముఖమునుండి నియమరక్షణకొరకు మాత్రమే గ్రహించుటయే గాక వినయము మున్నగు సద్గుణములను కూడ ప్రకటించెను.

**తతోఽథ నవమే వర్షే పిత్రోశ్శుశ్రూషణే రతమ్ ।**
**వైశ్వానరం గృహపతిం ద్రష్టుమాయాచ్చ నారదః ॥ 38 ॥**

తరువాత తొమ్మిదవ యేట తల్లిదండ్రుల సేవలో నిమగ్నుడైయున్న విశ్వానరపుత్రుడగు గృహపతిని దర్శించుటకు నారదుడు వచ్చెను.

**విశ్వానరోటజం ప్రాప్య దేవర్షిస్తం తు కౌతుకీ ।**
**అపృచ్ఛత్కుశలం తత్ర గృహీతార్ఘాసనః క్రమాత్ ॥ 39 ॥**

కుతూహలముతో దేవర్షియగు నారదుడు విశ్వానరుని పర్ణశాలను చేరుకొని అర్ఘ్యము మున్నగువాటిని స్వీకరించి ఆసనమున కూర్చుండి కుశలప్రశ్నలనడిగెను.

**తతః సర్వంచ తద్భాగ్యం పుత్రధర్మం చ సమ్ముఖే ।**
**వైశ్వానరం సమవదత్ స్మృత్వా శివపదాంబుజమ్ ॥ 40 ॥**

ఆయన శివుని పాదపద్మములను స్మరించి విశ్వానరుని పుత్రుని ఎదుటనే ఆ బాలుని భాగ్యమును, అతడు పాటించు పుత్రధర్మమును గూర్చి సవిస్తరముగా చెప్పెను.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్తో మునినా బాలః పిత్రోరాజ్ఞామవాప్య సః ।**
**ప్రణమ్య నారదం శ్రీమాన్ భక్త్యా ప్రహ్వ ఉపావిశత్ ॥ 41 ॥**

మహర్షి ఇట్లు చెప్పగా ఆ బాలుడు తల్లిదండ్రుల ఆజ్ఞచే నారద మహర్షికి సవినయముగా భక్తితో నమస్కరించి కూర్చుండెను. అప్పుడా మహర్షి మిక్కిలి శోభిల్లే బాలునితో నిట్లనెను.

**వైశ్వానర! సమభ్యేహి మమోత్సంగే నిషీద భోః! ।**
**లక్షణాని పరీక్షేఽహం పాణిం దర్శయ దక్షిణమ్ ॥ 42 ॥**

ఓయీ విశ్వానరకుమారా! ఇటు రమ్ము. నా ఒడిలో కూర్చుండుము. నీ కుడి చేతిని చూపుము. నేను నీ లక్షణములను పరీక్షించెదను.

**తతో దృష్ట్వా తు సర్వం హి తాలుజిహ్వాది నారదః ।**
**విశ్వానరం సమవదచ్ఛివప్రేరణయా సుధీః ॥ 43 ॥**

నారదుడు బాలుని హస్తరేఖలను, నోటి లోపలి భాగములైన నాలుకను, తాలువులను అన్నింటిని చూచాడు. అంతట నారదుడు శివుని ప్రేరణను పొంది విశ్వానరునితో ఇట్లు పలికాడు.

**నారద ఉవాచ** – నారదుడు పలికాడు.

**విశ్వానర! మునే! వచ్మి శృణు పుత్రాంకమాదరాత్ ।**
**సర్వాంగస్వంకవాన్పుత్రో మహాలక్షణవానయమ్ ॥ 44 ॥**

ఓ విశ్వానర మహర్షీ! నీ పుత్రునియందు గల చిహ్నములను గురించి చెప్పెదను. ఆదరముతో వినుము. మహాలక్షణములు గల నీ పుత్రునియందు చిహ్నములు సర్వావయవములందు గలవు.

**కింతు సర్వగుణోపేతం సర్వలక్షణలక్షితమ్ ।**
**సంపూర్ణనిర్మలకలం పాలయేద్విధువద్విధిః ॥ 45 ॥**

కాని, సర్వగుణోపేతుడు, సర్వలక్షణలక్షితుడు, చంద్రుని వలె పూర్ణస్వచ్ఛ కళలు గలవాడునైన ఈ బాలుని విధాత రక్షించు గాక!

**తస్మాత్సర్వప్రయత్నేన రక్షణీయస్త్వసౌ శిశుః ।**
**గుణోఽపి దోషతాం యాతి వక్రీభూతే విధాతరి ॥ 46 ॥**

కావున నీవు ప్రయత్నములన్నింటిని చేసి ఈ శిశువును రక్షించుము. విధి వక్రించినచో గుణము కూడ దోషము కాగలదు.

**శంకేఽస్య ద్వాదశే మాసి ప్రత్యూహో విద్యుదగ్నితః ।**
**ఇత్యుక్త్వా నారదోఽగచ్ఛద్దేవలోకం యథాఽఽగతమ్ ॥ 47 ॥**

ఈ బాలునకు పన్నెండవ సంవత్సరములో విద్యుత్తు (మెరుపు) వలన, లేదా అగ్నివలన గండము గలదని నాకు శంక కలుగుచున్నది. ఇట్లు పలికి నారదుడు వచ్చిన దారిన దేవలోకమునకు వెళ్లెను.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం గృహపత్యవతారోపాఖ్యానే గృహపత్యవ- తారవర్ణనం నామ చతుర్దశోఽధ్యాయః ॥ 14 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు గృహపత్యవతారకథలో గృహపత్యవతార వర్ణనం అనే పేరుగల పద్నాల్గవ అధ్యాయం సమాప్తం.

## పంచదశోఽధ్యాయః - పదిహేనవ అధ్యాయం
## గృహపత్యవతారవర్ణనమ్ - గృహపత్యవతారవర్ణనం

**నందీశ్వర ఉవాచః** - నందీశ్వరుడు పలికాడు.

**విశ్వానరస్సపత్నీకస్తచ్ఛ్రుత్వా నారదేరితమ్ ।**
**తదేవం మన్యమానోఽభూద్వజ్రపాతం సుదారుణమ్ ॥ 1 ॥**

విశ్వానరుడు భార్యతో గూడి నారదుని పలుకులను విని, ఆ పలుకులు మిక్కిలి దారుణమగు వజ్రపు దెబ్బ వంటివని భావించాడు.

**హా! హతోఽస్మీతి వచసా హృదయం సమతాడయత్ ।**
**మూర్ఛామవాప మహతీం పుత్రశోకసమాకులః ॥ 2 ॥**

'అయ్యో! నేను హతుడనైతిని' అని పలికి అతడు గుండెలను బాదుకొన్నాడు. పుత్రశోకముచే పీడితుడై అతడు గాఢమైన మూర్ఛను పొందాడు.

**శుచిష్మత్యపి దుఃఖార్తా రురోదాతీవ దుస్సహమ్ ।**
**అతిస్వరేణ హారావైరత్యంతం వ్యాకులేంద్రియా ॥ 3 ॥**

శుచిష్మతికూడ సహింప శక్యము కాని దుఃఖముచే పీడింపబడి, మిక్కిలి వ్యాకులమైన ఇంద్రియములు గలదై బిగ్గరగా హాహారావముతో ఏడ్చెను.

**శ్రుత్వార్తనాదమితి విశ్వానరోఽపి మోహం హిత్వోత్థితః కిమితి కింత్వితి కిం కిమేతత్ ।**

**ఉచ్చైర్వదన్ గృహపతిః క్వ స మే బహిస్థః ప్రాణోఽంతరాత్మనిలయస్సకలేంద్రియేశః ॥ 4 ॥**

ఆమె యొక్క ఇట్టి ఆర్తనాదమును విని విశ్వానరుడు మోహమునుండి బయటకు వచ్చి లేచి నిలబడి "ఇట్లు జరుగుటకు కారణమేమి? నాకు బహిః ప్రాణమైనవాడు, నా అంతరాత్మలో సర్వదా ఉండువాడు, ఇంద్రియములన్నింటికి ప్రభువునగు నా గృహపతి ఎక్కడ ఉన్నాడు?" అని బిగ్గరగా పలుకజొచ్చాడు.

**తతో దృష్ట్వా స పితరౌ బహుశోకసమావృతౌ ।**
**స్మిత్వోవాచ గృహపతిస్స బాలశ్శంకరాంశజః ॥ 5 ॥**

శంకరుని అంశవలన జన్మించిన గృహపతియను ఆ బాలుడు మిక్కిలి దుఃఖముతో కూడియున్న తల్లిదండ్రులను గాంచి చిరునవ్వుతో ఇట్లన్నాడు.

**గృహపతిరువాచ** - గృహపతి పలికాడు.

**హే మాతస్తాత! కిం జాతం కారణం తద్వదాధునా ।**
**కిమర్థం రుదితోఽత్యర్థం త్రాసస్తాదృక్కుతో హి వామ్ ॥ 6 ॥**

ఓ తల్లీ! ఓ తండ్రీ! ఏమైనది? ఇప్పుడీ స్థితికి కారణమేమి? చెప్పుడు. మీరు ఏల అధికముగా దుఃఖించు చున్నారు? మీకీ భయానికి కారణమేమి?

**న మాం కృతవపుస్త్రాణం భవచ్చరణరేణుభిః ।**
**కాలః కలయితుం శక్తో వరాకీ చంచలాల్పికా ॥ 7 ॥**

మీ పాదధూళిచే రక్షణ కల్పించబడిన దేహము గల నన్ను కాలుడు స్పృశించుటకైనను సమర్థుడుకాడు, అల్ప, చంచల, తుచ్ఛ, మృత్యువు గురించి చెప్పునదేమున్నది?

**ప్రతిజ్ఞాం శృణుతాం తాతౌ! యది వాం తనయో హ్యహమ్ ।**
**కరిష్యేఽహం తథా యేన మృత్యుస్త్రస్తో భవిష్యతి ॥ 8 ॥**

తల్లిదండ్రులారా! నా ప్రతిజ్ఞను వినుడు. నేను మీ పుత్రుడ నైనచో, మృత్యువు కూడ భయపడునట్లు నేను చేయగలను.

**మృత్యుంజయం సమారాధ్య సర్వజ్ఞం సర్వదం సతామ్ ।**
**జపిష్యామి మహాకాలం సత్యం తాతౌ! వదామ్యహమ్ ॥ 9 ॥**

తల్లిదండ్రులారా! సర్వజ్ఞుడు, సత్పురుషులకు సర్వము నిచ్చువాడునగు మృత్యుంజయుని ఆరాధించి నేను మహాకాలుని జపం చేయగలను. నేను సత్యమును పలుకుతున్నాను.

**నందీశ్వర ఉవాచ -** నందీశ్వరుడు పలికాడు.

**ఇతి శ్రుత్వా వచస్తస్య జాగృతౌ ద్విజదంపతీ ।**
**అకాలామృతవర్షౌఘైర్గతతాపౌ తదోచతుః ॥ 10 ॥**

ఆ బాలుని మాటలను విని నీరసపడియున్న ఆ బ్రాహ్మణదంపతులు అకాలములో సంభవించిన అమృత వర్షధారలచే తొలగిన దుఃఖము గలవారై ఇట్లుపలికారు.

**ద్విజదంపతీ ఊచతుః -** ద్విజదంపతులు పలికారు.

**పునర్బ్రూహి పునర్బ్రూహి కీదృక్ కీదృక్ పునర్వద ।**
**కాలః కలయితుం నాలం వరాకీ చంచలాస్తి కా ॥ 11 ॥**

మరల చెప్పుము. మరల చెప్పుము. అదెట్లు? అదెట్లు? మరల చెప్పుము. కాలుడు నిన్ను నశింపజేయుటకు సమర్థుడు కాడా? తుచ్ఛము, చంచలము అయినదేది?

**ఆవయోస్తాపనాశాయ మహోపాయస్త్వయేరితః ।**
**మృత్యుంజయాఖ్యదేవస్య సమారాధనలక్షణః ॥ 12 ॥**

మా యిరువురి దుఃఖమును తొలగించుటకు నీవు గొప్ప పేరుగల ఉపాయమును చెప్పితివి. మృత్యుంజయుడను ఈశ్వరుని కొలుచుట అనునది శ్రేష్ఠమగు ఉపాయము.

**తద్వచ్ఛ శరణం శంభోర్నాతః పరతరం హి తత్ ।**
**మనోరథపథాతీతకారిణః పాపహారిణః ॥ 13 ॥**

మనకు శంభుడే శరణు. మనోరథమునకు కూడ అందని కార్యములను చేయువాడు, పాపములను హరింపజేయువాడునగు శంభునికంటె గొప్ప దైవము లేదు.

**కిం న శ్రుతం త్వయా తాత! శ్వేతకేతుం యథా పురా ।**
**పాశితం కాలపాశేన రరక్ష త్రిపురాంతకః ॥ 14 ॥**

పుత్రా! నీవు వినలేదా యేమి? పూర్వము మృత్యుపాశముచే బంధింపబడిన శ్వేతకేతువును త్రిపురాంతకుడగు శివుడు రక్షించియున్నాడు.

**శిలాదతనయం మృత్యుగ్రస్తమష్టాబ్దమాత్రకమ్ ।**
**శివో నిజజనం చక్రే నందినం విశ్వనందినమ్ ॥ 15 ॥**

ఎనిమిది సంవత్సరముల వయస్సులో మృత్యువుచే కబళింపబడుటకు సిద్ధముగానున్న శిలాదపుత్రుని శివుడు రక్షించాడు. జగత్తునకు ఆనందమునిచ్చే ఆ నంది శివుని గణములకు అధిపతిమైనాడు.

**క్షీరోదమథనోద్భూతం ప్రళయానలసన్నిభమ్ ।**
**పీత్వా హాలాహలం ఘోరమరక్షద్భువనత్రయమ్ ॥ 16 ॥**

క్షీరసముద్రమును మథించగా పుట్టిన ప్రళయకాలాగ్నిని బోలియున్న ఘోరమైన హాలాహలమను విషమును భక్షించి ఆయన ముల్లోకములను రక్షించినాడు.

**జలంధరం మహాదర్పం హృతత్రైలోక్యసంపదమ్ ।**
**రుచిరాంగుష్ఠరేఖోత్థచక్రేణ నిజఘాన యః ॥ 17 ॥**

ముల్లోకముల సంపదను హరించి మిక్కిలి గర్వించియున్న జలంధరుని శివుడు తన అందమైన అంగుష్ఠముతో చక్రమును ప్రయోగించి సంహరించాడు.

**య ఏకేషు నిపాతోత్థజ్వలనైస్త్రిపురం పురా ।**
**త్రైలోక్యైశ్వర్యసంమూఢం శోషయామాస భానునా ॥ 18 ॥**

పూర్వము ముల్లోకముల ఐశ్వర్యముతో మోహమును పొందియున్న త్రిపురాసురులను ఒకే బాణమును ప్రయోగించి దానినుండి పుట్టిన అగ్నిజ్వాలలతో దహించివేశాడు.

**కామం దృష్టినిపాతేన త్రైలోక్యవిజయోర్జితమ్ ।**
**నినాయానంగపదవీం వీక్షమాణేష్వజాదిషు ॥ 19 ॥**

ముల్లోకములను జయించి గర్వితుడైయున్న మన్మథుని శివుడు బ్రహ్మాదులు చూచుచుండగా తన కంటినుండి ఉద్భవించిన జ్వాలతో దహించి శరీరములేనివానిగా జేశాడు.

**తం బ్రహ్మాద్యేకకర్తారం మేఘవాహనమచ్యుతమ్ ।**
**ప్రయాహి పుత్ర! శరణం విశ్వరక్షామణిం శివమ్ ॥ 20 ॥**

బ్రహ్మాదులకు ఏకైక స్రష్ట, ఇంద్ర, ఉపేంద్రులకు తండ్రి, వినాశము లేనివాడు, విశ్వమును రక్షించే శ్రేష్ఠదైవమగు శివుని శరణు పొందుము.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**పిత్రోరనుజ్ఞాం ప్రాప్యేతి ప్రణమ్య చరణౌ తయోః ।**
**ప్రాదక్షిణ్యముపావృత్య బహ్వాశ్వాస్య వినిర్యయౌ ॥ 21 ॥**

ఈ విధముగా అతడు తల్లిదండ్రుల అనుమతిని పొంది వారి పాదములకు నమస్కరించి ప్రదక్షిణము చేసి వారిని చాలసేపు ఓదార్చి బయలుదేరాడు.

**సంప్రాప్య కాశీం దుష్ప్రాపాం బ్రహ్మనారాయణాదిభిః ।**
**మహాసంవర్తసంతాపహంత్రీం విశ్వేశపాలితామ్ ॥ 22 ॥**

బ్రహ్మ, విష్ణువులకైనను పొంద శక్యము కానిది, మహాప్రళయతాపమును పోగొట్టునది, విశ్వేశ్వరునిచే పాలింపబడునదియునగు కాశీనగరమును చేరుకున్నాడు.

**స్వర్ధున్యా హారయష్ట్యేవ రాజితాం కంఠభూమిషు ।**
**విచిత్రగుణశాలిన్యా హరపత్న్యా విరాజితామ్ ॥ 23 ॥**

ఆ కాశీపట్టణము కంఠప్రదేశమునందలి హారము వలె శోభిల్లు గంగానదితో కూడియున్నది. విచిత్రగుణములతో ప్రకాశించు పార్వతీదేవితో కూడియున్నది.

**తత్ర ప్రాప్య స విప్రేశః ప్రాగ్యయౌ మణికర్ణికామ్ ।**
**తత్ర స్నాత్వా విధానేన దృష్ట్వా విశ్వేశ్వరం ప్రభుమ్ ॥ 24 ॥**

ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు అటువంటి కాశీనగరమునకు చేరి ముందుగా మణికర్ణికకు వెళ్ళి అచట యథావిధిగా స్నానము చేసి విశ్వేశ్వరప్రభుని దర్శించాడు.

**సాంజలిర్నతశీర్షోఽసౌ మహానందాన్వితస్సుధీః ।**
**త్రైలోక్యప్రాణసంత్రాణకారిణం ప్రణనామ హ ॥ 25 ॥**

చేతులు జోడించి తలవంచి మహానందముతో ముల్లోకములలోని ప్రాణులను రక్షించే విశ్వేశ్వరునకు ప్రణమిల్లెను.

**ఆలోక్యాలోక్య తల్లింగం తుతోష హృదయే ముహుః ।**
**పరమానందకందాఢ్యం స్ఫుటమేతన్న సంశయః ॥ 26 ॥**

ఆ లింగముననేకపర్యాయములు దర్శించి ఆ విద్వాంసుడు హృదయములో చాలా ఆనందించెను. ఈ లింగము 'పరమానందకందాఢ్యము' అను విషయము స్పష్టమౌతున్నది. ఇందులో సంశయము లేదు.

**అహో! న మత్తో ధన్యోఽస్తి త్రైలోక్యే సచరాచరే ।**
**యదద్రాక్షిషమద్యాహం శ్రీమద్విశ్వేశ్వరం విభుమ్ ॥ 27 ॥**

స్థావర – జంగమములగు ప్రాణులతో గూడిన ఈ ముల్లోకములలో నా కంటె గొప్ప ధన్యుడు లేడు గదా! ఏలయన, నేనీనాడు శ్రీమద్విశ్వేశ్వరవిభుని దర్శించగలిగితిని.

**మమ భాగ్యోదయాయైవ నారదేన మహర్షిణా ।**
**పురాఽఽగత్య తథోక్తం యత్కృతకృత్యోఽస్మ్యహం తతః ॥ 28 ॥**

నా భాగ్యము పండుటచేతనే నారద మహర్షి మా యింటికి వచ్చి అట్లు చెప్పినాడు. అట్లు చెప్పుటవలన నేను ఇపుడు కృతార్థుడనైతిని.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యానందామృతరసైర్విధాయ స హి పారణమ్ ।**
**తతశ్శుభేఽహ్ని సంస్థాప్య లింగం సర్వహితప్రదమ్ ॥ 29 ॥**

అతడీ తీరున ఆనందమనే అమృతరసమునే ఆహారముగా స్వీకరించి తదనంతర శుభముహూర్తమునందు సర్వులకు హితమును కలిగించే లింగమును స్థాపించి,

**జగ్రాహ నియమాన్ఘోరాన్ దుష్కరానకృతాత్మభిః ।**
**అష్టోత్తరశతైః కుంభైః పూర్ణైర్గంగాంభసా శుభైః ॥ 30 ॥**

మానవులు స్వీకరింపశక్యము కాని నియమములను చేపట్టెను. మంగళకరమగు నూటయెనిమిది కుంభములతో వస్త్రపూతమైన గంగాజలమును నింపి,

**సంస్నాప్య వాససా పూతైః పూతాత్మా ప్రత్యహం శివమ్ ।**
**నీలోత్పలమయీం మాలాం సమర్పయతి సోఽన్వహమ్ ॥ 31 ॥**

ప్రతిదినము ఆ నీటితో శివునకు స్నానముచేయించి పవిత్రమగు అంతఃకరణము గలవాడై శివునకు నల్లకలువల మాలను సమర్పించెడివాడు.

**అష్టాధికసహస్రైస్తు సుమనోభిర్వినిర్మితామ్ ।**
**స పక్షే వాఽథవా మాసే కందమూలఫలాశనః ॥ 32 ॥**

మరియు వెయ్యి ఎనిమిది పుష్పములతో కట్టిన మాలను సమర్పించెడివాడు. అతడు పదిహేను రోజులకు, లేదా నెలకు ఒకసారి దుంపలను, పళ్లను తినెడివాడు.

**శీర్ణపర్ణాశనైర్ధీరః షణ్మాసం సంబభూవ సః ।**
**షణ్మాసం వాయుభక్షోఽభూత్ షణ్మాసం జలబిందుభుక్ ॥ 33 ॥**

ఆ ధీరుడు ఆరు మాసములు ఎండుటాకులను భక్షించాడు. ఆరు మాసములు గాలిని, ఆరు మాసములు నీటి బిందువులను మాత్రమే స్వీకరించాడు.

**ఏవం వర్షవయస్తస్య వ్యతిక్రాంతం మహాత్మనః ।**
**శివైకమనసో విప్రాః! తప్యమానస్య నారద! ॥ 34 ॥**

ఓ నారదా! ఓ బ్రాహ్మణులారా! ఆ మహాత్ముడిట్లు శివునియందు మనస్సును దృఢముగా నిలిపి తపస్సు చేయుచుండగా ఒక సంవత్సరము గడిచింది.

**జన్మతో ద్వాదశే వర్షే తద్వచో నారదేరితమ్ ।**
**సత్యం కరిష్యన్నివ తమభ్యగాత్కులిశాయుధః ॥ 35 ॥**

పుట్టిన నాటి నుండి పన్నెండవ సంవత్సరమునందు గండమున్నదని నారదుడు చెప్పిన వచనమును సత్యము చేయుటకొరకా యన్నట్లు వజ్రము ఆయుధముగా గల ఇంద్రుడు అతనిని సమీపించాడు.

**ఉవాచ చ వరం బ్రూహి దద్మి త్వన్మనసి స్థితమ్ ।**
**అహం శతక్రతుర్విప్ర! ప్రసన్నోఽస్మి శుభవ్రతైః ॥ 36 ॥**

ఓయీ బ్రాహ్మణా! నీ శుభకరమగు వ్రతములచే నేను ప్రసన్నుడనైతిని. నేను ఇంద్రుడను. నీ మనసులోని వరమును కోరుకొనుము ఇచ్చెదను – అని ఇంద్రుడు పలికాడు.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యాకర్ణ్య మహేంద్రస్య వాక్యం మునికుమారకః ।**
**ఉవాచ మధురం ధీరః కీర్తయన్మధురాక్షరమ్ ॥ 37 ॥**

మహేంద్రుని ఈ వాక్యమును విని ధీరుడగు ఆ మునికుమారుడు మధురవచనమును ఈ విధముగా పలికాడు.

**గృహపతిరువాచ** – గృహపతి పలికాడు.

**మఘవన్! వృత్రశత్రో! త్వాం జానే కులిశపాణినమ్ ।**
**నాహం వృణే వరం త్వత్తః శంకరో వరదోఽస్తి మే ॥ 38 ॥**

ఓ ఇంద్రా! వృత్రసంహారకా! వజ్రాయుధుడవగు నిన్ను నేను ఎరుగుదును. నేను నీనుండి వరమును కోరను. నాకు వరమునీయగలవాడు శంకరుడే.

**ఇంద్ర ఉవాచ** – ఇంద్రుడు పలికాడు.

**న మత్తః శంకరస్త్వన్యో దేవదేవోఽస్మ్యహం శిశో! ।**
**విహాయ బాలిశత్వం త్వం వరం యాచస్వ మా చిరమ్ ॥ 39 ॥**

ఓయీ బాలకా! శంకరుడు నాకంటే భిన్నముగా లేడు. నేనే దేవదేవుడను. నీవు ఈ చిన్నతనపు లక్షణమును విడనాడి శీఘ్రముగా వరమును కోరుకొనుము.

**గృహపతిరువాచ** – గృహపతి పలికాడు.

**గచ్ఛాహల్యాసన్! దుష్ట! గోత్రారే! పాకశాసన! ।**
**న ప్రార్థయే పశుపతేరన్యం దేవాంతరం స్ఫుటమ్ ॥ 40 ॥**

అహల్యాద్రోహీ! దుష్టా! పర్వతశత్రూ! దానవశిక్షకా! వెళ్లుము. నేను పశుపతిని తక్క మరియొక దైవమును వరము కోరను. ఇది స్పష్టము.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇతి తస్య వచః శ్రుత్వా క్రోధసంరక్తలోచనః ।**
**ఉద్యమ్య కులిశం ఘోరం భీషయామాస బాలకమ్ ॥ 41 ॥**

వాని యీ మాటలను విని ఇంద్రుడు కోపముతో ఎర్రని కన్నులు గలవాడై భయంకరమగు వజ్రాయుధమును పైకెత్తి ఆ బాలకుని భయపెట్టెను.

**స దృష్ట్వా బాలకో వజ్రం విద్యుజ్జ్వాలాసమాకులమ్ ।**
**స్మరన్నారదవాక్యం చ ముమూర్ఛ భయవిహ్వలః ॥ 42 ॥**

మెరుపుల మంటలతో భయమును గొల్పు ఆ వజ్రాయుధమును చూచి ఆ బాలకుడు నారదుని వాక్యమును స్మరించి భయపీడితుడై మూర్ఛనొందెను.

**అథ గౌరీపతిశ్శంభురావిరాసీత్తమోనుదః ।**
**ఉత్తిష్ఠోత్తిష్ఠ భద్రం తే స్పర్శైస్సంజీవయన్నివ ॥ 43 ॥**

అంతట తమోగుణమును పోగొట్టువాడు, గౌరీపతియునగు శంభుడు ఆవిర్భవించి 'లెమ్ము, లెమ్ము' నీకు భద్రమౌ గాక' అని పలుకుచూ, ప్రాణములు పోయుచున్నాడా అనునట్లు ఆ బాలుని అనేక పర్యాయములు స్పృశించాడు.

**ఉన్మీల్య నేత్ర కమలే సుప్తే ఇవ దినక్షయే ।**
**అపశ్యదగ్రే చోత్థాయ శంభుమర్కశతాధికమ్ ॥ 44 ॥**

రాత్రి నిద్రించి, ఉదయమే లేచినాడాయన్నట్లు ఆ బాలుడు కమలముల వంటి తన నేత్రములు తెరచి, ఎదుట వంద సూర్యులకంటె అధికముగా ప్రకాశించుచున్న శంభుని గాంచెను.

**ఫాలే లోచనమాలోక్య కంఠేకాలం వృషధ్వజమ్ ।**
**వామాంగసన్నివిష్టాద్రితనయం చంద్రశేఖరమ్ ॥ 45 ॥**

లలాటమునందు నేత్రము, కంఠమునందు నలుపు, వృషభధ్వజుడు, వామపార్శ్వమునందు పార్వతితో ప్రకాశించువాడు, చంద్రుని శిరముపై ధరించువాడు.

**కపర్దేన విరాజంతం త్రిశూలాజగవాయుధమ్ ।**
**స్ఫురత్కర్పూరగౌరాంగం పరిణద్ధగజాజినమ్ ॥ 46 ॥**

జటాజూటముతో ప్రకాశించువాడు, త్రిశూలము, ధనుస్సు ఆయుధములుగా గలవాడు, కర్పూరమువలె గౌరవర్ణముతో ప్రకాశించువాడు, గజచర్మమును వస్త్రముగా ధరించినవాడునైన అతనిని గాంచి

**పరిజ్ఞాయ మహాదేవం గురువాక్యత ఆగమాత్ ।**
**హర్షబాష్పాకులాసన్నకంఠరోమాంచకంచుకః ॥ 47 ॥**

గురువాక్యమును బట్టియు, వేదవచనములను బట్టియు మహాదేవునిగా తెలుసుకొని, ఆనందముతో కంఠము బొంగురు పోగా, కళ్ల వెంబడి నీరు గారుచుండగా శరీరమునందు రోమాంచము కలిగింది.

**క్షణంచ గిరివత్తస్థౌ చిత్రకూటత్రిపుత్రకః ।**
**యథా తథా సుసంపన్నో విస్మృత్యాత్మానమేవ చ ॥ 48 ॥**

అతడు క్షణకాలము చిత్రకూట, త్రిపుత్రక పర్వతములవలె కదలిక లేకుండగా తనను తాను మరచి నిలబడెను. అకస్మాత్తుగా ధనలాభమును పొందిన వాని వలె స్తబ్ధుడాయెను.

**న స్తోతుం న నమస్కర్తుం కించిద్విజ్ఞప్తుమేవ చ ।**
**యదా స న శశాకాలం తదా స్మిత్వాఽఽహ శంకరః ॥ 49 ॥**

అతడు స్తోత్రమును చేయుటకు గాని, నమస్కరించుటకు గాని, ఏదైనను విన్నవించుటకు గాని సమర్థుడు కాలేకపోయెను. అపుడు శంకరుడు చిరునవ్వుతో ఇట్లన్నాడు.

**ఈశ్వర ఉవాచ** - ఈశ్వరుడు పలికాడు.

**శిశో! గృహపతే! శక్రాద్వజ్రోద్యతకరాదహో ।**
**జ్ఞాతభీతోఽసి మాభైషీర్జిజ్ఞాసా తే మయా కృతా ॥ 50 ॥**

ఓయీ బాలకా! గృహపతీ! వజ్రమును చేతబట్టిన ఇంద్రుని చూచి నీవు భయపడితివి. నాకు తెలిసినది. భయపడకుము. నిన్ను నేను పరిరక్షించాను.

**మమ భక్తస్య నో శక్రో న వజ్రం చాంతకోఽపి చ ।**
**ప్రభవేదింద్రరూపేణ మయైవ త్వం విభీషితః ॥ 51 ॥**

నా భక్తునకు ఇంద్రుడు గాని, వజ్రముగాని, యముడు గాని హానిని కలిగించలేరు. నేనే ఇంద్రరూపములో వచ్చి నిన్ను భయపెట్టితిని.

**వరం దదామి తే భద్ర! త్వమగ్నిపదభాగ్భవ ।**
**సర్వేషామేవ దేవానాం వరదస్త్వం భవిష్యసి ॥ 52 ॥**

ఓయీ వత్సా! నేను నీకు వరములనిచ్చెదను. నీవు అగ్నిపదవిని పొందుము. నీవు దేవతలందరికి వరములనిచ్చువాడవు కాగలవు.

**సర్వేషామేవ భూతానాం త్వమగ్నేఽన్తశ్చరో భవ ।**
**ధర్మరాజేంద్రయోర్మధ్యే దిగీశో రాజ్యమాప్నుహి ॥ 53 ॥**

ఓ అగ్నీ! నీవు సర్వప్రాణుల లోపల సంచరించువాడవు కాగలవు. ధర్మరాజునకు, ఇంద్రునకు మధ్యలో దిక్పాలకరాజ్యమును నీవు పొందుము.

**త్వయేదం స్థాపితం లింగం తవ నామ్నా భవిష్యతి ।**
**అగ్నీశ్వర ఇతి ఖ్యాతం సర్వతేజోవిబృంహణమ్ ॥ 54 ॥**

తేజస్సులనన్నిటిని మించి వ్యాపకమైన ఈ లింగము నీచే స్థాపింపబడినదగుటచే నీ పేర అగ్నీశ్వరుడని ఖ్యాతిని గాంచగలదు.

**అగ్నీశ్వరస్య భక్తానాం న భయం విద్యుదగ్నిభిః ।**
**అగ్నిమాంద్య భయం నైవ నాకాలమరణం క్వచిత్ ॥ 55 ॥**

అగ్నీశ్వరుని భక్తులకు విద్యుత్తు, అగ్ని, అజీర్ణవ్యాధి మరియు అకాలమరణముల భయము ఏకాలము–నందైననూ ఉండబోదు.

**అగ్నీశ్వరం సమభ్యర్చ్య కాశ్యాం సర్వసమృద్ధిదమ్ ।**
**అన్యత్రాపి మృతో దైవాద్వహ్నిలోకే మహీయతే ॥ 56 ॥**

సర్వసమృద్ధులను ఇచ్చే అగ్నీశ్వరుని కాశీలో అర్చించి, విధిబలంచే ఇతరప్రదేశమునందు మరణించిననూ, అట్టి మానవుడు అగ్నిలోకములో నివసించగలడు.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వాఽఽనీయ తద్బంధూన్పిత్రోశ్చ పరిపశ్యతోః ।**
**దిక్పతిత్వేఽభిషిచ్యాగ్నిం తత్ర లింగే శివోఽవిశత్ ॥ 57 ॥**

శివుడీ విధంగా పలికి, అతని బంధువులను రప్పించి తల్లిదండ్రులు చూచుచుండగా అతనిని అగ్ని దిక్పాలక పదవియందు అభిషేకించి అచటి లింగములో ప్రవేశించెను.

**ఇత్థమగ్న్యవతారస్తే వర్ణితో మే జనార్దనః ।**
**నామ్నా గృహపతిస్తాత! శంకరస్య పరాత్మనః ॥ 58 ॥**

వత్సా! దుష్టజనులను శిక్షించే గృహపతియను పేరుగల శంకరపరమాత్మునియొక్క అగ్ని అవతారమును గూర్చి నేనీతీరున నీకు వివరించాను.

**చిత్రహోత్రపురీ రమ్యా సుఖదాఽర్చిష్మతీ వరా ।**
**జాతవేదసి యే భక్తా తే తత్ర నివసంతి వై ॥ 59 ॥**

చిత్రహోత్రమను నగరము సుందరమైనది. సుఖమునిచ్చునది. అది ప్రకాశించే శ్రేష్ఠనగరము. అగ్నిహోత్రుని భక్తులు అచట నివసిస్తారు.

**అగ్నిప్రవేశం యే కుర్యుర్దృఢసత్త్వా జితేంద్రియాః ।**
**స్త్రియో వా సత్త్వసంపన్నాస్తేఽ సర్వేఽ ప్యగ్ని తేజసః ॥ 60 ॥**

దృఢమగు అంతఃకరణము గలవారు, ఇంద్రియజయము గలవారగు పురుషులు గాని, స్త్రీలు గాని ఎవరైతే అగ్నిని ప్రవేశించెదరో వారు అందరు సత్త్వగుణము గలవారై అగ్నితో సమానమగు తేజస్సును పొందెదరు.

**అగ్నిహోత్రరతా విప్రాః స్థాపితా బ్రహ్మచారిణః ।**
**పంచాగ్నివర్తినోఽ ప్యేవమగ్నిలోకేఽ గ్నివర్చసః ॥ 61 ॥**

అగ్నిహోత్రమునందు శ్రద్ధ గల బ్రాహ్మణులు, బ్రహ్మచారులు, పంచాగ్నుల మధ్యలో తపస్సును చేయువారు అగ్నిలోకమును పొంది, అగ్నితో సమమైన తేజస్సును పొందుతారు.

**శీతే శీతాపనుత్త్యై యస్త్వేధోభారాన్ప్రయచ్ఛతి ।**
**కుర్యాదగ్నీష్టికాం వాఽ థ స వసేదగ్నిసన్నిధౌ ॥ 62 ॥**

ఎవడైతే శీతాకాలములో చలిని పోగొట్టుటకు ఇతరులకు కట్టెల మోపులను దానము చేయునో, లేదా ఎవడైతే అగ్నియందు ఇష్టిని చేయునో, అట్టివాడు అగ్నిసన్నిధిలో నివసిస్తాడు.

**అనాథస్యాగ్నిసంస్కారం యః కుర్యాచ్ఛ్రద్ధయాన్వితః ।**
**అశక్తః ప్రేరయేదన్యం సోఽ గ్నిలోకే మహీయతే ॥ 63 ॥**

ఎవడైతే శ్రద్ధతో గూడినవాడై అనాథశవమునకు అగ్నిసంస్కారమును చేయునో, స్వయముగా చేయుటకు అశక్తుడైనచో ఇతరులను ప్రోత్సహించునో అట్టివాడు అగ్నిలోకములో నివసించును.

**అగ్నిరేకో ద్విజాతీనాం నిశ్శ్రేయసకరః పరః ।**
**గురుర్దేవో వ్రతం తీర్థం సర్వమగ్నిర్వినిశ్చితమ్ ॥ 64 ॥**

బ్రాహ్మణులకు మోక్షమునిచ్చే పరదైవము, గురువు, తీర్థము అగ్నిహోత్రుడొక్కడే. విద్వాంసునకు సర్వము అగ్నియేననుటలో సందేహము లేదు.

**అపావనాని సర్వాణి వహ్నిసంసర్గతః క్షణాత్ ।**
**పావనాని భవన్త్యేవ తస్మాద్యః పావకః స్మృతః ॥ 65 ॥**

అపవిత్రవస్తువులన్నియు అగ్ని సోకినంతనే క్షణములో పవిత్రములగును. కాబట్టి అగ్నికి పావకుడను పేరువచ్చింది.

**అంతరాత్మా హ్యయం సాక్షాన్నిశ్చయో హ్యాశుశుక్షణిః ।**
**మాంసగ్రాసాన్పచేత్కుక్షౌ స్త్రీణాం నో మాంసపేశికామ్ ॥ 66 ॥**

ఈ అగ్నిదేవుడు అందరికి నిశ్చయముగా అంతరాత్మయై యున్నాడు. అగ్ని జఠరమునందుండి మాంసాది గ్రాసములనన్నిటిని పచనము చేయును. కాని ఇతడు స్త్రీల కండరములను జీర్ణము చేయలేడు.

**తైజసీ శాంభవీ మూర్తిః ప్రత్యక్షా దహనాత్మికా ।**
**కర్త్రీ హర్త్రీ పాలయిత్రీ వినైతాం కిం విలోక్యతే ॥ 67 ॥**

శంభుని తేజోమయ, దహనస్వరూప ప్రత్యక్షమూర్తియగు అగ్నిశక్తి లోకములను సృష్టించి, పాలించి, ఉ పసంహరించు చున్నది. అగ్ని లేనిచో దేనిని చూడగలము?

**చిత్రభానురయం సాక్షాన్నేత్రం త్రిభువనేశితుః ।**
**అంధే తమోమయే లోకే వినైనం కః ప్రకాశనః ॥ 68 ॥**

ఈ అగ్నిహోత్రుడు సాక్షాత్తుగా ముల్లోకములకు ప్రభువగు శివుని మూడవ కన్ను అగుచున్నాడు. చీకటిలో నిండియున్న ఈ లోకములో చీకటిని పారద్రోలి ప్రకాశమునిచ్చునది అగ్నియే గదా!

**ధూపదీపనైవేద్యపయోదధిఘృతైక్షవమ్ ।**
**ఏతద్భుక్తం నిషేవంతే సర్వే దివి దివౌకసః ॥ 69 ॥**

అగ్ని భక్షించిన ధూప దీపనైవేద్యములను, పాలు, పెరుగు, నెయ్యి, చెరుకురసము మున్నగువాటిని మాత్రమే స్వర్గములోని దేవతలందరు సేవిస్తున్నారు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం గృహపత్యవతారవర్ణనం నామ పంచ దశోఽధ్యాయః ॥ 15 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు గృహపత్యవతారవర్ణనం అనే పేరుగల పదిహేనవ అధ్యాయం సమాప్తం.

⁂

## **షోడశోఽధ్యాయః** - పదహారవ అధ్యాయం

## **యక్షేశ్వరావతారవర్ణనమ్** - యక్షేశ్వరావతారవర్ణనం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**యక్షేశ్వరావతారం చ శృణు శంభోర్మునీశ్వర! ।**
**గర్విణాం గర్వహంతారం సతాం భక్తివివర్ధనమ్ ॥ 1 ॥**

ఓ మునీశ్వరా! గర్విష్ఠుల గర్వమును అడంచునది, సత్పురుషుల భక్తిని వర్ధిల్లజేయునది యగు శంభుని యక్షేశ్వరావతారమును గూడ వినుము.

**పురా దేవాశ్చ దైత్యాశ్చ పీయూషార్థం మహాబలాః ।**
**క్షీరోదధిమమంథుస్తే సుకృతస్వార్థసంధయః ॥ 2 ॥**

పూర్వము మహాబలశాలురగు దేవదానవులు తమ తమ స్వార్థమును సంపాదించుకొనవలెననే పట్టుదలగలవారై అమృతముకొరకు క్షీరసముద్రాన్ని మథించారు.

**మథ్యమానేఽమృతే పూర్వం క్షీరాబ్ధేస్సురదానవైః ।**
**అగ్నేః సముత్థితం తస్మాద్విషం కాలానలప్రభమ్ ॥ 3 ॥**

ఈ విధంగా పూర్వం దేవదానవులు క్షీరసముద్రాన్ని అమృతంకొరకు మథించుచుండగా ఆ అగ్నినుండి కాలాగ్ని వలె దహించే విషము పుట్టింది.

**తం దృష్ట్వా నిఖిలా దేవా దైత్యాశ్చ భయవిహ్వలాః ।**
**విద్రుత్య తరసా తాత! శంభోస్తే శరణం యయుః ॥ 4 ॥**

ఓమునిశ్రేష్ఠా! దానిని చూచి దేవదానవులందరు భయంతో కంగారుపడి తొందరగా పరుగెత్తి శంభుని శరణం పొందారు.

**దృష్ట్వా తం శంకరం సర్వే సర్వదేవశిఖామణిమ్ ।**
**ప్రణమ్య తుష్టువుర్భక్త్యా సాచ్యుతా నతమస్తకాః ॥ 5 ॥**

విష్ణువుతో సహా వారందరు దేవతలందరిలో శ్రేష్ఠుడగు శంకరుని గాంచి సాష్టాంగప్రణామమాచరించి భక్తితో స్తుతించారు.

**తతః ప్రసన్నో భగవాన్ శంకరో భక్తవత్సలః ।**
**పపౌ విషం మహాఘోరం సురాసురగణార్దనమ్ ॥ 6 ॥**

అపుడు భక్తవత్సలుడగు శంకర భగవానుడు ప్రసన్నుడై దేవరాక్షసులనందరిని పీడించుచున్న మహాఘోరమగు విషమును త్రాగెను.

**పీతం తం విషమం కంఠే నిదధే విషముల్బణమ్ ।**
**రేజే తేనాతి స విభుర్నీలకంఠో బభూవ హ ॥ 7 ॥**

ఆ విషాన్ని త్రాగి, ఆ భయంకర పదార్థమును తన కంఠమునందు దాల్చి యుండెను. దానిచే ఆవిభుడు 'నీలకంఠు' డయ్యాడు.

**తతః సురాసురగణా మమన్థుః పునరేవ తమ్ ।**
**విషదాహవినిర్ముక్తాః శివానుగ్రహతోఽఖిలాః ॥ 8 ॥**

శివానుగ్రహంచే విషబాధనుండి విముక్తులై వారందరు, మరల సముద్రమును మథింపజొచ్చిరి.

**తతో బహూని రత్నాని నిస్సృతాని తతో మునే! ।**
**అమృతం చ పదార్థం హి సురదానవయోర్మునే! ॥ 9 ॥**

ఓ మునీ! తదనంతరం దానినుండి అనేక రత్నాలు బయలు వెడలినవి. దేనిని పొందడానికి దేవదానవులు శ్రమ పడుతున్నారో, ఆ అమృతము కూడ పుట్టింది.

**తత్పపుః కేవలాన్దేవా నాసురాః కృపయా హరేః ।**
**తతో బభూవ సుమహద్రత్నం తేషాం మిథోఽకదమ్ ॥ 10 ॥**

విష్ణువు కృపచే ఆ అమృతాన్ని దేవతలు మాత్రమే త్రాగారు. రాక్షసులకు అమృతము దక్కలేదు. తదనంతరం మరియొక మహద్రత్నం పుట్టింది. అది రెండు పక్షముల వారికి దుఃఖాన్ని కలిగించింది.

**ద్వంద్వయుద్ధం బభూవాథ దేవదానవయోర్మునే! ।**
**తత్ర రాహుభయాచ్చంద్రో విదుద్రావ తదర్దితః ॥ 11 ॥**

ఓ మునీ! అపుడు దేవదానవులకు ద్వంద్వయుద్ధము జరిగింది. అప్పుడు రాహువుచే పీడింపబడిన చంద్రుడు అతనికి భయపడి అచటనుండి పారిపోయాడు.

**జగామ సదనం శంభోః శరణం భయవిహ్వలః ।**
**సుప్రణమ్య చ తుష్టావ పాహి పాహీతి సంవదన్ ॥ 12 ॥**

ఆ చంద్రుడు భయముచే పీడింపబడి శంభుని గృహానికి వెళ్లి చక్కగా ప్రణమిల్లి రక్షింపుము రక్షింపుము అని పలికి శరణుజొచ్చి స్తుతించెను.

**తతస్సతామభయదః శంకరో భక్తవత్సలః ।**
**దధ్రే శిరసి చంద్రం స విభుశ్శరణమాగతమ్ ॥ 13 ॥**

అప్పుడు సత్పురుషులకు అభయమునిచ్చువాడు, భక్తవత్సలుడునగు ఆ శంకర విభుడు, శరణుజొచ్చిన చంద్రుని శిరముపై దాల్చెను.

**అథాగతస్తదా రాహుస్తుష్టావ సుప్రణమ్య తమ్ ।**
**శంకరం సకలాధీశం వాగ్భిరిష్టాభిరాదరాత్ ॥ 14 ॥**

అంతట రాహువు అచటకు వచ్చి సకలాధీశ్వరుడగు శంకరునికి నమస్కరించి, అభీష్టములగు వచనములతో సాదరముగా ఆయనను స్తుతించెను.

**శంభుస్తన్మతమాజ్ఞాయ తచ్ఛిరాంస్యచ్యుతేన హ ।**
**పురా ఛిన్నాని వై కేతుసంజ్ఞాని నిదధే గళే ॥ 15 ॥**

శంభుడు అతని అభిప్రాయము నెరింగి, పూర్వము విష్ణువుచే నరుకబడిన కేతువు అను పేరుగల అతని శిరస్సును తన మెడలో ధరించెను.

**తతో యుద్ధేఽసురాః సర్వే దేవైశ్చైవ పరాజితాః ।**
**పీత్వాఽమృతం సురాస్సర్వే జయం ప్రాపుర్మహాబలాః ॥ 16 ॥**

తరువాత యుద్ధములో రాక్షసులందరు పరాజయమును పొందారు. వారిపై విజయాన్ని సాధించిన మహాబలశాలురగు దేవతలందరు అమృతమును గ్రోలిరి. అది వారి విజయమునకు కారణమయ్యింది.

**విష్ణుప్రభృతయః సర్వే బభూవుశ్చాతిగర్వితాః ।**
**బలాని చాంకురంతోస్తశ్శివమాయావిమోహితాః ॥ 17 ॥**

అప్పుడు విష్ణువు మొదలగు దేవతలందరు శివమాయామోహితులై మిక్కిలి గర్వాన్ని పొందియున్నారు.

**తతస్స శంకరో దేవః సర్వాధీశోఽథ గర్వహా ।**
**యక్షో భూత్వా జగామాశు యత్ర దేవాః స్థితా మునే! ॥ 18 ॥**

ఓ మునీ! అపుడు సకలాధీశుడు, గర్వమును పోగొట్టువాడునగు శంకరుడు యక్షరూపమును దాల్చి దేవతలున్న స్థానానికి వెళ్లాడు.

**సర్వాన్పృష్ట్వాఽచ్యుతముఖాన్దేవాన్యక్షపతిస్స వై ।**
**మహాగర్వాఢ్యమనసా మహేశః ప్రాహ గర్వహా ॥ 19 ॥**

గర్వమును పోగొట్టే మహేశ్వరుడు యక్షేశ్వరుని రూపములో నున్నవాడై మిక్కిలి గర్వముతో నిండియున్న మనస్సు గల విష్ణువు మొదలగు దేవతలనందరిని గాంచి ఇలా పలికాడు.

**యక్షేశ్వర ఉవాచ -** యక్షేశ్వరుడు పలికాడు.

**కిమర్థం సంస్థితా యూయమత్ర సర్వే సురా మిథః ।**
**కిము కాష్ఠాఖిలం బ్రూత కారణం మేఽనుపృచ్ఛతే ॥ 20 ॥**

దేవతలారా! మీరందరు ఇచట నిలబడియుండుటకు విశేషమేమి? నేను కారణమునడుగుచున్నాను. వివరముగా చెప్పండి.

**దేవా ఊచుః** – దేవతలు పలికారు.

**అభూదత్ర మహాన్దేవరణః పరమదారుణః ।**
**అసురా నాశితాస్సర్వేఽవశిష్టా విద్రుతా గతాః ॥ 21 ॥**

ఇచ్చట మిక్కిలి భయంకరమైన దేవదానవ యుద్ధము జరిగినది. రాక్షసులందరు నశించారు. మిగిలినవారు పలాయనులైనారు.

**వయం సర్వే మహావీరా దైత్యఘ్నా బలవత్తరాః ।**
**అగ్రేఽస్మాకం కియంతస్తే దైత్యక్షుద్రబలాస్సదా ॥ 22 ॥**

మేమందరము మహా వీరులము, రాక్షసులను సంహరించిన బలశాలురము. మాముందు సర్వదా అల్ప-బలులైన ఆ రాక్షసులెంత?

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇతి శ్రుత్వా వచస్తేషాం సురాణాం గర్వగర్భితమ్ ।**
**గర్వహాఽసౌ మహాదేవో యక్షరూపో వచోఽబ్రవీత్ ॥ 23 ॥**

గర్వముతో నిండియున్న ఆ దేవతల పలుకులను విని, యక్షరూపములో నున్నవాడు, గర్వాపహారియైన మహాదేవుడిట్లు పలికాడు.

**యక్షేశ్వర ఉవాచ** – యక్షేశ్వరుడు పలికాడు.

**హే సురా! నిఖిలా యూయం మద్వచః శృణుతాదరాత్ ।**
**యథార్థం వచ్మి నాసత్యం సర్వగర్వాపహారకమ్ ॥ 24 ॥**

ఓ దేవతలారా! మీరందరు నా మాటను ఆదరముతో వినండి. అందరి గర్వమును పోగొట్టే సత్యవచనాన్ని నేను పలికెదను. అసత్యమును చెప్పను.

**గర్వమేనం న కురుత కర్తా హర్తాఽపరః ప్రభుః ।**
**విస్మృతాశ్చ మహేశానం కథయధ్వం వృథాబలాః ॥ 25 ॥**

మీరిట్లు గర్వమును పొందకుడు. సర్వమును సృష్టించి లయమును చేయు పరమప్రభువు గలడు. మహేశ్వరుని మరిచిపోయినారా? చెప్పండి. మీ బలము వ్యర్థము.

**యుష్మాకం చేత్స హి మదో జానతాం స్వబలం మహత్ ।**
**మత్స్థాపితం తృణమిదం ఛిన్త స్వాస్త్రైశ్చ తైస్సురాః! ॥ 26 ॥**

ఓదేవతలారా! మీకు గర్వమున్నచో, మీ బలమెంత గొప్పదియో తెలుసుకొనుడు. నేనిచ్చట గడ్డిపోచను ఉంచుచున్నాను. మీ మీ అస్త్రాలతో దీనిని తెంపండి.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వైకతృణం తేషాం నిచిక్షేప పురస్తతః ।**
**జహ్రే సర్వమదం యక్షరూప ఈశస్సతాంగతిః ॥ 27 ॥**

సత్పురుషులకు శరణమగు శివుడు యక్షుని రూపములో నున్నవాడై ఇట్లు పలికి ఒక గడ్డి పోచను వారి ముందు ఉంచి, వారందరి మదమును అణచాడు.

**అథ సర్వే సురా విష్ణుప్రముఖా వీరమానినః ।**
**కృత్వా స్వపౌరుషం తత్ర స్వాయుధాని విచిక్షిపుః ॥ 28 ॥**

అంతట విష్ణువు మున్నగు దేవతలందరు తాము వీరులమనే అభిమానం గలవారై, తమ పరాక్రమమును ప్రదర్శించి ఆ గడ్డిపోచపై తమ ఆయుధాలను ప్రయోగించారు.

**తత్రాసన్ విఫలాన్యాశు తాన్యస్త్రాణి దివౌకసామ్ ।**
**శివప్రభావతస్తేషాం మూఢగర్వాపహారిణః ॥ 29 ॥**

మూర్ఖుల గర్వమునడంచు శివుని ప్రభావం వలన ఆ దేవతల అస్త్రములన్నియు వెంటనే వ్యర్థమయ్యాయి.

**అథాసీత్తు నభోవాణీ దేవవిస్మయకారిణీ ।**
**యక్షోఽయం శంకరో దేవాః! సర్వగర్వాపహారకః ॥ 30 ॥**

అంతట దేవతల గర్వమును తొలగించుచూ ఆకాశవాణి ఇట్లు పలికింది. 'ఓ దేవతలారా! ఈయన అందరి గర్వమును పోగొట్టే యక్షరూపియగు శంకరుడు.

**కర్తా హర్తా తథా భర్తాఽయమేవ పరమేశ్వరః ।**
**ఏతద్బలేన బలినో జీవాః సర్వేఽన్యథా న హి ॥ 31 ॥**

ఈయనయే లోకములను సృష్టించి పాలించి, పోషించి, లయమును చేయు పరమేశ్వరుడు. శంకరుడు యక్షరూపమును దాల్చియున్నాడు. ఈయనయొక్క బలముచేతనే సర్వప్రాణులు బలమును పొందుచున్నవి. లేనిచో జీవులలో బలము లేకుండును.

**అస్య మాయాప్రభావాద్వై మోహితాః స్వప్రభుం శివమ్ ।**
**మదతో బుబుధుర్నైవాద్యాపి బోధతనుం ప్రభుమ్ ॥ 32 ॥**

ఈ శివుని మాయచే మోహితులైన మీరందరు గర్వించి, జ్ఞానస్వరూపుడగు శివుని ఇప్పటికైననూ తెలియజాలకున్నారు.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇతి శ్రుత్వా నభోవాణీం బుబుధుస్తే గతస్మయాః ।**
**యక్షేశ్వరం ప్రణేముశ్చ తుష్టువుశ్చ తమీశ్వరమ్ ॥ 33 ॥**

ఆకాశవాణి పలుకులను విని, వారు తెలివి తెచ్చుకొని, గర్వమును వీడి, యక్షేశ్వరుని రూపమునందున్న శివునకు నమస్కరించి స్తుతించారు.

**దేవా ఊచుః** – దేవతలు పలికారు.

**దేవదేవ! మహాదేవ! సర్వగర్వాపహారక! ।**
**యక్షేశ్వర! మహాలీలమాయా తేఽత్యద్భుతా ప్రభో! ॥ 34 ॥**

ఓ దేవదేవా! మహాదేవా! అందరి గర్వమును పోగొట్టువాడా! యక్షేశ్వరా! నీ లీలలు గొప్పవి. ప్రభూ! నీ మాయ అత్యద్భుతము.

**మోహితా మాయయాఽద్యాపి తవ యక్షస్వరూపిణః ।**
**సగర్వమభిభాషన్తస్త్వత్పురో హి పృథఙ్మయాః ॥ 35 ॥**

యక్షస్వరూపుడవగు నీ మాయ మమ్ములను ఈనాడు కూడ మోహింపజేయుటచే, నీ ఎదుట మేము నీ నుండి భేదబుద్ధితో నుండి సగర్వముగా మాటలాడి యున్నాము.

**ఇదానీం జ్ఞానమాయాతం తవైవ కృపయా ప్రభో! ।**
**కర్తా హర్తా చ భర్తా చ త్వమేవాన్యో న శంకర! ॥ 36 ॥**

ఓ ప్రభూ ! నీ అనుగ్రహము చేతనే మాకిప్పుడు జ్ఞానోదయమైనది. శంకరా! ఈ జగత్తుయొక్క సృష్టి స్థితి లయకర్తవు నీవు తక్క మరియొకరు కాదు.

**త్వమేవ సర్వశక్తీనాం సర్వేషాం హి ప్రవర్తకః ।**
**నివర్తకశ్చ సర్వేశః పరమాత్మాఽవ్యయోఽద్వయః ॥ 37 ॥**

సర్వశక్తులను ప్రవర్తింపజేయువాడవు, నివర్తింపజేయువాడవు నీవే. నీవే సర్వేశ్వరుడవు. పరమాత్మవు. వినాశరహితుడవు. అద్వితీయుడవు.

**యక్షేశ్వరస్వరూపేణ సర్వేషాం నో మదో హృతః ।**
**ఇతో మన్యామహే తత్తేఽనుగ్రహో హి కృపాళునా ॥ 38 ॥**

నీవు యక్షేశ్వర రూపమును దాల్చి మా అందరి గర్వమును పోగొట్టితివి. ఇది దయానిధివైన నీవు మా యందు అనుగ్రహమును చూపుటనియే భావించుచున్నాము.

**అథో స యక్షనాథోఽనుగృహ్య వై సకలాన్ సురాన్ ।**
**విబోధ్య వివిధైర్వాక్యైస్తత్రైవాంతరధీయత ॥ 39 ॥**

అంతట యక్షేశ్వరుడు దేవతలనందరిని అనుగ్రహించి, అనేక వచనములను వారికి బోధించి అచటనే అంతర్ధానమయ్యెను.

**ఇత్థం స వర్ణితః శంభోరవతారః సుఖావహః ।**
**యక్షేశ్వరాఖ్యస్సుఖదస్సతాం తుష్టోఽభయంకరః ॥ 40 ॥**

ఇట్లు సుఖావహము, సత్పురుషులకు ఆనందమును అభయమును ఇచ్చునదియగు శంభుని యక్షేశ్వరావతారము వర్ణింపబడింది.

**ఇదమాఖ్యానమమలం సర్వగర్వాపహారకమ్ ।**
**సతాం సుశాంతిదం నిత్యం భుక్తిముక్తిప్రదం నృణామ్ ॥ 41 ॥**

పవిత్రమైన యీ గాథ అందరి గర్వమును పోగొట్టి, సత్పురుషులకు శాంతిని, మానవులకు భుక్తిని, ముక్తిని ప్రసాదించును.

**య ఇదం శృణుయాద్భక్త్యా శ్రావయేద్వా సుధీః పుమాన్ ।**
**సర్వకామానవాప్నోతి తతశ్చ లభతే గతిమ్ ॥ 42 ॥**

బుద్ధిమంతుడైన ఏ పురుషుడు ఈ గాథను భక్తితో వినునో, లేదా వినిపించునో, అట్టివాడు కోర్కెలన్నింటిని పొంది, దేహత్యాగము తరువాత పుణ్యగతిని పొందును.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం యక్షేశ్వరావతారవర్ణనం నామ షోడశోఽధ్యాయః ॥ 16 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు యక్షేశ్వరావతారవర్ణనం అనే పేరుగల పదహారవ అధ్యాయం సమాప్తం.

## సప్తదశోఽధ్యాయః - పదిహేడవ అధ్యాయం

## శివదశావతారవర్ణనమ్ - శివదశావతారవర్ణనం

**శృణ్వథో గిరిశస్యాద్యావతారాన్ దశసంఖ్యకాన్ ।**
**మహాకాలముఖాన్ భక్త్యోపాసనాకాండసేవితాన్ ॥ 1 ॥**

ఉపాసనాకాండ ద్వారా సేవింపబడే మహాకాల మొదలైన దశావతారములను గూర్చి ఇప్పుడు భక్తితో వినుము.

**తత్రాద్యో హి మహాకాలో భుక్తిముక్తిప్రదస్సతామ్ ।**
**శక్తిస్తత్ర మహాకాళీ భక్తేప్సితఫలప్రదా ॥ 2 ॥**

సత్పురుషులకు భుక్తిని, ముక్తిని ప్రదానం చేసే మహాకాలావతారము వాటిలో మొదటిది. అప్పుడు శక్తి మహాకాళియై భక్తులకు ఫలములనిచ్చి కోర్కెలనీడేర్చును.

**తారనామా ద్వితీయశ్చ తారా శక్తిస్తథైవ సా ।**
**భుక్తిముక్తిప్రదౌ చోభౌ స్వసేవకసుఖప్రదౌ ॥ 3 ॥**

'తార' అను అవతారము రెండవది. దానియందలి శక్తి 'తారా' అనబడును. వీరిద్దరు తమ సేవకులకు భుక్తిని ముక్తిని, సుఖమును ఇస్తారు.

**భువనేశో హి బాలాహ్వస్తృతీయః పరికీర్తితః ।**
**భువనేశీ శివా తత్ర బాలాహ్వా సుఖదా సతామ్ ॥ 4 ॥**

'భువనేశుడు' మూడవ అవతారము. ఆ అవతారములో పార్వతి బాలభువనేశ్వరియై సత్పురుషులకు సుఖమునిచ్చును.

**శ్రీవిద్యేశః షోడశాహ్వః శ్రీవిద్యా షోడశీ శివా ।**
**చతుర్థో భక్తసుఖదో భుక్తిముక్తిఫలప్రదః ॥ 5 ॥**

భక్తులకు భుక్తిని, ముక్తిని, సుఖమును, ఫలమును ఇచ్చే షోడశశ్రీవిద్యేశుడు నాల్గవ అవతారము. దానిలో పార్వతి షోడశీ శ్రీవిద్యాదేవి యగును.

**పంచమో భైరవః ఖ్యాతః సర్వదా భక్తకామదః ।**
**భైరవీ గిరిజా తత్ర సదుపాసకకామదా ॥ 6 ॥**

సర్వకాలములలో భక్తుల కోర్కెల నీడేర్చు 'భైరవుడు' గా ప్రసిద్ధి గాంచినది అయిదవ అవతారము. దానియందు పార్వతి భైరవియై ఉపాసకుల కోర్కెలనీడేర్చును.

**ఛిన్నమస్తకనామాసౌ శివః షష్ఠః ప్రకీర్తితః ।**
**భక్తకామప్రదా చైవ గిరిజా ఛిన్నమస్తకా ॥ 7 ॥**

శివుని ఆరవ అవతారమునకు 'ఛిన్న మస్తకుడు' అని పేరు. గిరిజాదేవి ఛిన్నమస్తకయై భక్తుల కోర్కెల నీడేర్చును.

**ధూమవాన్ సప్తమశ్శంభుః సర్వకామఫలప్రదః ।**
**ధూమవతీ శివా తత్ర సదుపాసకకామదా ॥ 8 ॥**

సర్వకామనలనీడేర్చి ఫలములనిచ్చే 'ధూమవంతుడు' శివుని ఏడవ అవతారము. ఆ అవతారములో పార్వతి ధూమవతియై సత్పురుషులగు ఉపాసకుల కోర్కెలనీడేర్చును.

**శివావతారః సుఖదో హ్యష్టమో బగలాముఖః ।**
**శక్తిస్తత్ర మహానందా విఖ్యాతా బగలాముఖీ ॥ 9 ॥**

సుఖము నిచ్చు 'బగలాముఖుడు' ఎనిమిదవ శివావతారము. దానిలో శక్తి 'మహానంద', 'బగలాముఖి' అనే పేర్లతో ఖ్యాతిని పొందును.

**శివావతారో మాతఙ్గో నవమః పరికీర్తితః ।**
**మాతంగీ తత్ర శర్వాణీ సర్వకామఫలప్రదా ॥ 10 ॥**

తొమ్మిదవ శివావతారము 'మాతంగుడు' ఈ అవతారములో పార్వతి 'మాతంగి' యై సర్వకామనలనీడేర్చును.

**దశమః కమలః శంభుర్భుక్తిముక్తిఫలప్రదః ।**
**కమలా గిరిజా తత్ర స్వభక్తపరిపాలినీ ॥ 11 ॥**

భుక్తిని, ముక్తిని యిచ్చే 'కమలుడు' శంభుని పదియవ అవతారము. ఈ అవతారములో పార్వతి 'కమల'యై తన భక్తులను రక్షిస్తుంది.

**ఏతే దశమితాః శైవా అవతారాస్సుఖప్రదాః ।**
**భుక్తిముక్తిప్రదాశ్చైవ భక్తానాం సర్వదాస్సతామ్ ॥ 12 ॥**

శివుని యొక్క ఈ దశావతారములు సత్పురుషులగు భక్తులకు సుఖమును, భుక్తిని, ముక్తిని, సర్వమును ఇచ్చును.

**ఏతే దశావతారా హి శంకరస్య మహాత్మనః ।**
**నానాసుఖప్రదా నిత్యం సేవతాం నిర్వికారతః ॥ 13 ॥**

మహాత్ముడగు శంకరుని ఈ దశావతారములను వికారము లేకుండగా, నిత్యము సేవించువారికి అనేక సుఖములు ప్రాప్తిస్తాయి.

**ఏతద్దశావతారాణాం మాహాత్మ్యం వర్ణితం మునే! ।**
**సర్వకామప్రదం జ్ఞేయం తంత్రశాస్త్రాదిగర్భితమ్ ॥ 14 ॥**

ఓ మునీ! తంత్రశాస్త్రాదులందు గర్భితమైన ఈ దశావతారముల మాహాత్మ్యాన్ని వర్ణించాను. ఇది కోర్కెలనన్నింటిని ఈడేర్చునని యెరుంగవలెను.

**ఏతాసామాదిశక్తీనామద్భుతో మహిమా మునే! ।**
**సర్వకామప్రదో జ్ఞేయస్తంత్రశాస్త్రాదిగర్భితః ॥ 15 ॥**

ఓ మహర్షీ! తంత్రశాస్త్రాదులందు గర్భితమైన ఈ శక్తుల మహిమ అద్భుతము, కోర్కెలనన్నిటిని ఈడేర్చునదనియు తెలియవలెను.

**శత్రుమారణకార్యాదౌ తత్తచ్ఛక్తిః పరా మతా ।**
**ఖలదండకరీనిత్యం బ్రహ్మతేజోవివర్ధినీ ॥ 16 ॥**

శత్రుసంహారము మున్నగు వాటిలో ఆయా శక్తులు శ్రేష్ఠఫలమునిచ్చుననియు, దుష్టులను శిక్షించి, నిత్యము బ్రహ్మతేజమును వృద్ధి పొందించుననియు చెప్పబడినది.

**ఇత్యుక్తాస్తే మయా బ్రహ్మన్నవతారా మహేశితుః ।**
**సశక్తికా దశమితా మహాకాలముఖాశ్శుభాః ॥ 17 ॥**

ఓ బ్రాహ్మణా! శక్తితో కూడినవి, శుభకరమైనవియగు మహాకాలాది పది మహేశ్వరావతారములను నేను నీకు చెప్పితిని.

**శైవపర్వసు సర్వేషు యోఽధీతే భక్తితత్పరః ।**
**ఏతదాఖ్యానమమలం సోఽతిశంభుప్రియో భవేత్ ॥ 18 ॥**

శైవ పర్వదినములన్నింటియందు ఎవడైతే భక్తితత్పరుడై ఈ పవిత్రగాథను పఠించునో, వాడు శంభునకు మిక్కిలి ప్రియుడగును.

**బ్రాహ్మణో బ్రహ్మవర్చస్వీ క్షత్రియో విజయీ భవేత్ ।**
**ధనాధిపో హి వైశ్యః స్యాచ్ఛూద్రః సుఖమవాప్నుయాత్ ॥ 19 ॥**

బ్రాహ్మణుడు బ్రహ్మవర్చస్సు గలవాడగును. క్షత్రియుడు విజయమును పొందును. వైశ్యుడు ధనాఢ్యుడగును. శూద్రుడు సుఖమును పొందును.

**శాంకరా నిజధర్మస్థాః శృణ్వంతశ్చరితన్త్విదమ్ ।**
**సుఖినః స్యుర్విశేషేణ శివభక్తా భవంతు చ ॥ 20 ॥**

శివభక్తులు తమ ధర్మమును పాటిస్తూ ఈ చరితమును వినుచున్నచో విశేషసుఖమును పొందెదరు. వారు శివభక్తులై వర్ధిల్లుదురు గాక!

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం శివదశావతారవర్ణనం నామ సప్తదశోఽధ్యాయః ॥ 17 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు శివదశావతారవర్ణనం అనే పేరుగల పదిహేడవ అధ్యాయం సమాప్తం.

## అష్టాదశోఽధ్యాయః - పద్దెనిమిదవ అధ్యాయం

## ఏకాదశావతారవర్ణనమ్ - ఏకాదశవతారవర్ణనం

**నందీశ్వర ఉవాచ -** నందీశ్వరుడు పలికాడు.

**ఏకాదశావతారాన్వై శృణ్వథో శాంకరాన్వరాన్ ।**
**యాన్ శ్రుత్వా న హి బాధేత బాధా సత్యాదిసంభవా ॥ 1 ॥**

శంకరుని శ్రేష్ఠమగు పదకొండు అవతారములను వర్ణించెదను. వినుము. వీటిని వినినచో అసత్యము మున్నగు వాటివలన కలుగు పీడ తొలగిపోవును.

**పురా సర్వే సురాశ్శక్రముఖా దైత్యపరాజితాః ।**
**త్యక్త్వామరావతీం భీత్యాఽపలాయంత నిజాం పురీమ్ ॥ 2 ॥**

పూర్వము ఇంద్రాది దేవతలందరు రాక్షసులచే పరాజితులై స్వీయనగరమగు అమరావతిని విడిచి, భయముతో పారిపోయారు.

**దైత్యప్రపీడితా దేవా జగ్ముస్తే కశ్యపాన్తికమ్ ।**
**బద్ధ్వా కరాన్నతస్కన్ధాః ప్రణేముస్తం సువిహ్వలమ్ ॥ 3 ॥**

దైత్యులచే ప్రపీడితులైన దేవతలు కశ్యపుని వద్దకు వెళ్ళి, శిరము వంచి, చేతులు కట్టుకొని మిక్కిలి దుఃఖముతో నమస్కరించారు.

**సునుత్వా తం సురాస్సర్వే కృత్వా విజ్ఞప్తిమాదరాత్ ।**
**సర్వం నివేదయామాసుః స్వదుఃఖం తత్పరాజయమ్ ॥ 4 ॥**

ఆయనను దేవతలందరు చక్కగా స్తుతించి, రాక్షసుల చేతిలో తాము ఓడిపోవుట మొదలుగా గల దుఃఖములనన్నింటిని సాదరముగా విన్నవించుకొని రక్షింపుమని వేడుకొనిరి.

**తతస్స కశ్యపస్తాత! తత్పితా శివసక్తధీః ।**
**తదాకర్ణ్యామరాకం వై దుఃఖితోఽభూన్న చాధికమ్ ॥ 5 ॥**

వత్సా! అంతట దేవతలకు తండ్రి, శివునియందు లగ్నమైన బుద్ధిగలవాడునగు కశ్యపుడు దేవతల దుఃఖమును గూర్చి విని అధికముగా దుఃఖితుడు కాలేదు.

**తానాశ్వాస్య మునిస్సోఽథ ధైర్యమాధాయ శాంతధీః ।**
**కాశీం జగామ సుప్రీత్యా విశ్వేశ్వర పురీం మునే! ॥ 6 ॥**

ఓ మునీ! శాంతమగు మనస్సు గల ఆ మహర్షి వారికి ధైర్యము చెప్పి ఓదార్చెను. అంతట ఆయన మిక్కిలి ప్రీతితో విశ్వేశ్వరుని నగరమైన కాశీకి వెళ్లెను.

**గంగాంభసి తతః స్నాత్వా కృత్వా తం విధిమాదరాత్ ।**
**విశ్వేశ్వరం సమానర్చ సాంబం సర్వేశ్వరం ప్రభుమ్ ॥ 7 ॥**

గంగానదిలో స్నానమాచరించి, సర్వేశ్వరుడు, పార్వతీసనాథుడునగు విశ్వేశ్వరప్రభుని యథావిధిగా భక్తితో అర్చించెను.

**శివలింగం సుసంస్థాప్య చకార విపులం తపః ।**
**శంభుముద్దిశ్య సుప్రీత్యా దేవానాం హితకామ్యయా ॥ 8 ॥**

దేవతలకు హితమును చేయగోరి శివలింగమును చక్కగా స్థాపించి శంభునుద్దేశించి మిక్కిలి ప్రీతితో విస్తృతమైన తపస్సును చేసెను.

**మహాన్ కాలో వ్యతీయాయ తపతస్తస్య వై మునేః ।**
**శివపాదాంబుజాసక్తమనసో ధైర్యశాలినః ॥ 9 ॥**

ఆ ధైర్యశాలి శివపాదపద్మములపై మనస్సును నిలిపి తపస్సును చేయుచుండగా చాలకాలము గడిచెను.

**అథ ప్రాదురభూచ్ఛంభుర్వరం దాతుం తదర్షయే ।**
**స్వపదాసక్తమనసే దీనబంధుస్సతాంగతిః ॥ 10 ॥**

అంతట సత్పురుషులకు శరణ్యుడు, దీనబంధువునైన శంభుడు ఆ మహర్షికి వరమునిచ్చుటకొరకై ఆవిర్భవించెను. ఆ ఋషి శివుని పాదములయందు మనస్సును నిలిపియుండెను.

**వరం బ్రూహీతి చోవాచ సుప్రసన్నో మహేశ్వరః ।**
**కశ్యపం మునిశార్దూలం స్వభక్తం భక్తవత్సలః ॥ 11 ॥**

భక్తవత్సలుడగు మహేశ్వరుడు మిక్కిలి ప్రసన్నుడై తన భక్తుడగు కశ్యపమహర్షినుద్దేశించి, వరమును కోరుకొనుమని పలికెను.

**దృష్ట్వాఽథ తం మహేశానం స ప్రణమ్య కృతాంజలిః ।**
**తుష్టావ కశ్యపో హృష్టో దేవతాతః ప్రసన్నధీః ॥ 12 ॥**

అంతట దేవతలకు తండ్రియైన కశ్యపుడు ఆనందముతో ప్రసన్నమనస్కుడై మహేశ్వరునకు చేతులు జోడించి నమస్కరించి ఇట్లు స్తుతించెను.

**కశ్యప ఉవాచ –** కశ్యపుడు పలికాడు.

**దేవదేవ! మహేశాన! శరణాగతవత్సల ।**
**సర్వేశ్వరః పరాత్మా త్వం ధ్యానగమ్యోఽద్వయోఽవ్యయః ॥ 13 ॥**

దేవదేవా! మహేశ్వరా! శరణాగతవత్సలా! నీవు సర్వేశ్వరుడవు. పరమాత్మవు. ధ్యానగమ్యుడవు, అద్వయుడవు, అవ్యయుడవు.

**బలనిగ్రహకర్తా త్వం మహేశ్వర! సతాంగతిః ।**
**దీనబంధుర్దయాసింధుర్భక్తరక్షణ దక్షధీః ॥ 14 ॥**

ఓ మహేశ్వరా! సత్పురుషులకు శరణ్యుడవు, రాక్షసబలమును నిగ్రహించువాడవు నీవే. దీనబంధుడవు. దయాసముద్రుడవు. భక్తరక్షణదక్షుడవు.

**ఏతే సురాస్త్వదీయా హి త్వద్భక్తాశ్చ విశేషతః ।**
**దైత్యైః పరాజితాశ్చాద్య పాహి తాన్దుఃఖితాన్ ప్రభో! ॥ 15 ॥**

ఓ ప్రభూ! ఈ దేవతలు నీ వారు. విశేషించి నీ భక్తులు. ఈనాడు దైత్యుల చేతిలో పరాజితులై దుఃఖించుచున్నారు. వారిని రక్షింపుము.

**అసమర్థో రమేశోఽపి దుఃఖదస్తే ముహుర్ముహుః ।**
**అతః సురా మచ్ఛరణా వేదయన్తోఽసుఖం చ తత్ ॥ 16 ॥**

అసమర్థుడైన లక్ష్మీపతి కూడ నీకు పలుమార్లు దుఃఖమును కలిగించుచున్నాడు. అందువలననే దేవతలు నన్ను శరణు జొచ్చినారు. వారి దుఃఖమును నాకు విన్నవించినారు.

**తదర్థం దేవదేవేశ! దేవదుఃఖవినాశకః ।**
**తత్పూరితుం తపోనిష్ఠాం ప్రసన్నార్థం తవాసదమ్ ॥ 17 ॥**

దేవదేవా! ఈశ్వరా! నేను దేవతల దుఃఖమును నశింపజేయగోరి, నిన్ను ప్రసన్నుని చేసుకొనుటకొఱకై తపోనిష్ఠుడనైతిని.

**శరణం తే ప్రపన్నోఽస్మి సర్వథాఽహం మహేశ్వర! ।**
**కామం మే పూరయ స్వామిన్! దేవదుఃఖం వినాశయ ॥ 18 ॥**

ఓ మహేశ్వరా! నేను అన్ని విధములుగా నిన్ను శరణు జొచ్చితిని. దేవతల దుఃఖమును నశింపజేసి నా కోర్కెను తీర్చుము.

**పుత్రదుఃఖైశ్చ దేవేశ! దుఃఖితోఽహం విశేషతః ।**
**సుఖినం కురు మామీశ! సహాయస్త్వం దివౌకసామ్ ॥ 19 ॥**

ఓ దేవేశా! నేను పుత్రుల దుఃఖమును గాంచి మిక్కిలి దుఃఖించుచున్నాను. నన్ను సుఖిని చేయుము. నీవు దేవతలకు సాహాయ్యమొనరింపుము.

**భూత్వా మమ సుతో నాథ! దేవా యక్షాః పరాజితాః ।**
**దైత్యైర్మహాబలైశ్శంభో! సురానందప్రదో భవ ॥ 20 ॥**

ఓ నాథా! మహాబలశాలురగు రాక్షసుల చేతిలో దేవతలు, యక్షులు, పరాజితులైయున్నారు. నీవు నా కుమారుడవై జన్మించి దేవతలకానందమును కలిగించుము.

**సదైవాస్తు మహేశాన! సర్వలేఖసహాయకః ।**
**యథా దైత్యకృతా బాధా న బాధేత సురాన్ ప్రభో! ॥ 21 ॥**

మహేశ్వరా! ప్రభూ! రాక్షసుల పీడ దేవతలకు తొలగు విధముగా నీవు సర్వదా దేవతలకు సహాయమును చేయుచుండుము.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్తస్సు తు సర్వేశస్తథేతి ప్రోచ్య శంకరః ।**
**పశ్యతస్తస్య భగవాంస్తత్రైవాంతర్దధే హరః ॥ 22 ॥**

కశ్యపుడిట్లు పలుకగా, సర్వేశ్వరుడు, మంగళకరుడునగు హరుడు 'తథాస్తు' (అటులనే అగు గాక!) అని పలికి అతడు చూచుచుండగనే అంతర్ధానమయ్యెను.

**కశ్యపోఽపి మహాహృష్టః స్వస్థానమగమద్ద్రుతమ్ ।**
**దేవేభ్యః కథయామాస సర్వవృత్తాంతమాదరాత్ ॥ 23 ॥**

కశ్యపుడు కూడ మహానందమును పొంది, శీఘ్రముగా తన స్థానమునకు మరలివచ్చి జరిగిన వృత్తాంతమునంతటిని ఆనందముతో దేవతలకు చెప్పెను.

**తతస్స శంకరశ్శర్వస్సత్యం కర్తుం స్వకం వచః ।**
**సురభ్యాం కశ్యపాజ్జజ్ఞే ఏకాదశస్వరూపవాన్ ॥ 24 ॥**

అంతట శంకరుడు తన వచనమును సత్యమొనర్చుటకు కశ్యపునివలన సురభియందు పదకొండు రూపములలో అవతరించెను.

**మహోత్సవస్తదాసీద్వై సర్వం శివమయం త్వభూత్ ।**
**ఆసన్ హృష్టాః సురాశ్చాథ మునినా కశ్యపేన చ ॥ 25 ॥**

అంతట గొప్ప ఉత్సవము జరిగెను. సర్వము శివమయమయ్యెను. కశ్యపమహర్షివలన దేవతలందరు మహానందమును పొందిరి.

**కపాలీ పింగళో భీమో విరూపాక్షో విలోహితః ।**
**శాస్తాఽజపాదహిర్బుధ్న్యశ్శంభుశ్చండో భవస్తథా ॥ 26 ॥**

1.కపాలి, 2.పింగళుడు, 3.భీముడు, 4.విరూపాక్షుడు, 5.విలోహితుడు, 6.శాస్త,7.అజపాత్, 8.అహిర్బుధ్న్యుడు, 9.శంభువు, 10.చండుడు, 11.భవుడు.

**ఏకాదశైతే రుద్రాస్తు సురభీతనయాః స్మృతాః ।**
**దేవకార్యార్థముత్పన్నాశ్శివరూపాస్సుఖాస్పదమ్ ॥ 27 ॥**

ఈ ఏకాదశ రుద్రులకు సురభీతనయులని పేరు. వీరు దేవకార్యముకొరకు అవతరించి సుఖమునకు కారణమైనారు.

**తే రుద్రాః కాశ్యపా వీరా మహాబలపరాక్రమాః ।**
**దైత్యాఞ్జఘ్నుశ్చ సంగ్రామే దేవసాహాయ్యకారిణః ॥ 28 ॥**

కశ్యపపుత్రుడు, వీరులు, గొప్ప బలపరాక్రమములు గలవారునగు ఆ రుద్రులు యుద్ధములో దేవతలకు సహాయులై రాక్షసులను సంహరించారు.

**తద్రుద్రకృపయా దేవా దైత్యాన్ జిత్వా చ నిర్భయాః ।**
**చక్రుః స్వరాజ్యం సర్వే తే శక్రాద్యాస్స్వస్థమానసాః ॥ 29 ॥**

ఆ రుద్రుల అనుగ్రహముచే ఇంద్రాది దేవతలు దైత్యులను జయించి నిర్భయులై, స్వస్థమానసులై, తమ రాజ్యమును పరిపాలించారు.

**అద్యాపి తే మహారుద్రాస్సర్వే శివస్వరూపకాః ।**
**దేవానాం రక్షణార్థాయ విరాజంతే సదా దివి ॥ 30 ॥**

ఇప్పటికిని శివస్వరూపులైన ఆ మహారుద్రులందరు, దేవతలను రక్షించుటకొరకై సర్వదా స్వర్గమునందు విరాజిల్లుచున్నారు.

**ఐశాన్యాం పురి తే వాసం చక్రిరే భక్తవత్సలాః ।**
**విరమన్తే సదా తత్ర నానాలీలావిశారదాః ॥ 31 ॥**

భక్తవత్సలురు, నానాలీలావిశారదులునైన ఆ ఏకాదశ రుద్రులు ఈశాన్య దిక్కునందు నివసించి, సర్వదా అచ్చటనే రమిస్తారు.

**తేషామనుచరా రుద్రాః కోటిశః పరికీర్తితాః ।**
**సర్వత్ర సంస్థితాస్తత్ర త్రిలోకేష్వభిభాగశః ॥ 32 ॥**

వారి అనుచరులైన రుద్రులు కోట్ల సంఖ్యలో నున్నారు. వారు ముల్లోకములలో ఆయా భాగములందు సర్వత్రా వ్యాపించి యున్నారు.

**ఇతి తే వర్ణితాస్తాతావతారాశ్శంకరస్య వై ।**
**ఏకాదశమితా రుద్రాస్సర్వలోకసుఖావహాః ॥ 33 ॥**

వత్సా! ఈ విధముగా సర్వప్రాణులకు సుఖమును కలిగించే శంకరుని ఏకాదశ రుద్రావతారమును నీకు వర్ణించాను.

**ఇదమాఖ్యానమమలం సర్వపాపప్రణాశకమ్ ।**
**ధన్యం యశస్యమాయుష్యం సర్వకామప్రదాయకమ్ ॥ 34 ॥**

ఈ వృత్తాంతము పవిత్రమైనది. పాపములనన్నింటిని నశింపజేయునది, ధన్యమైనది. యశస్సును కలిగించునది. ఆయుర్దాయము నిచ్చునది, మరియు కోర్కెలనన్నిటిని తీర్చునది.

**య ఇదం శృణుయాత్తాత! శ్రావయేద్వై సమాహితః ।**
**ఇహ సర్వసుఖం భుక్త్వా తతో ముక్తిం లభేత సః ॥ 35 ॥**

ఓ వత్సా! ఈ గాథను ఎవడు మనస్సును లగ్నము చేసి వినునో, అట్టివాడు ఇహలోకములో సర్వసుఖము లనుభవించి, దేహత్యాగమైన పిమ్మట ముక్తిని పొందును.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం ఏకాదశావతారవర్ణనం నామాష్టాదశోఽధ్యాయః ॥ 18 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు ఏకాదశావతారవర్ణనం అనే పేరుగల పద్దెనిమిదవ అధ్యాయం సమాప్తం.

## ఏకోనవింశోఽధ్యాయః - పంతొమ్మిదవ అధ్యాయం

## దుర్వాసశ్చరిత్రవర్ణనమ్ - దుర్వాసచరిత్రవర్ణనం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**అథాన్యచ్చరితం శంభోః శృణు ప్రీత్యా మహామునే! ।**
**యథా బభూవ దుర్వాసాశ్శంకరో ధర్మహేతవే ॥ 1 ॥**

ఓ మహామునీ! ధర్మముకొఱకు శంకరుడే దుర్వాసుడై అవతరించినశంభుని మరియొక గాథను చెప్పెదను. ప్రీతితో వినుము.

**బ్రహ్మపుత్రో బభూవాతి తపస్వీ బ్రహ్మవిత్ప్రభుః ।**
**అనసూయాపతిర్ధీమాన్బ్రహ్మాజ్ఞాప్రతిపాలకః ॥ 2 ॥**

బ్రహ్మపుత్రుడు, తపస్వి, బ్రహ్మవేత్త, అనసూయ భర్త, ధీశాలి, బ్రహ్మాజ్ఞను పాలించువాడునగు అత్రి మహర్షిగలడు.

**సునిర్దేశాద్బ్రహ్మణో హి సస్త్రీకః పుత్రకామ్యయా ।**
**స త్ర్యక్షకులనామానం యయౌ చ తపసే గిరిమ్ ॥ 3 ॥**

అతడు బ్రహ్మగారి చక్కని ఆదేశమును పొంది భార్యతో గూడి, పుత్రులను బడయగోరి తపస్సును చేయుటకై, త్ర్యక్షకులమను పేరుగల పర్వతమునకు వెళ్లెను.

**ప్రాణానాయమ్య విధివన్నిర్విన్ధ్యాతటినీతటే ।**
**తపశ్చచార సుమహదద్వందోఽబ్దశతం మునిః ॥ 4 ॥**

ఆ మహర్షి నిర్వింధ్యానదీ తీరమునందు ఒంటరిగా నుండి యథావిధిగా ప్రాణాయామమును చేసి, వంద సంవత్సరములు గొప్ప తపస్సును చేసెను.

**య ఏక ఈశ్వరః కశ్చిదవికారో మహాప్రభుః ।**
**స మే పుత్రవరం దద్యాదితి నిశ్చితమానసః ॥ 5 ॥**

అద్వితీయుడు, వర్ణింప శక్యము కానివాడు, మహాప్రభుడునగు ఏ ఈశ్వరుడు గలదో, ఆ యీశ్వరుడే నాకు పుత్రునిగా పొందే వరమునీయవలెనని ఆతడు మనస్సులో నిశ్చయించుకొనెను.

**బహుకాలో వ్యతీయాయ తస్మింస్తపతి సత్తపః ।**
**ఆవిర్బభూవ తస్మాత్తు శుచిర్జ్వాలా మహీయసీ ॥ 6 ॥**

అతడు గొప్ప తపస్సును చేయుచుండగా చాల కాలము గడిచెను. అతని నుండి గొప్ప జ్వాల ఆవిర్భవించెను.

**తయా సన్నిఖిలా లోకా దగ్ధప్రాయా మునీశ్వరాః! ।**
**తథా సురర్షయః సర్వే పీడితా వాసవాదయః ॥ 7 ॥**

ఆ జ్వాలచే లోకములన్నియు దహింపబడుచుండెను. మహర్షులు, దేవర్షులు, ఇంద్రాది దేవతలు అందరు దుఃఖమును పొందిరి.

**అథ సర్వే వాసవాద్యా సురాశ్చ మునయో మునే! ।**
**బ్రహ్మస్థానం యయుశ్శీఘ్రం తజ్జ్వాలాతిప్రపీడితాః ॥ 8 ॥**

ఓ మహర్షీ! అంతట ఇంద్రాది దేవతలు మరియు మునులందరు ఆ జ్వాలచే మిక్కిలి పీడింపబడినవారై, శీఘ్రముగా బ్రహ్మలోకమునకు వెళ్లిరి.

**నత్వా నుత్వా విధిం దేవాః తత్స్వదుఃఖం న్యవేదయన్ ।**
**బ్రహ్మా సహసురైస్తాత! విష్ణులోకం యయావరమ్ ॥ 9 ॥**

మునీ! దేవతలు బ్రహ్మకు నమస్కరించి, స్తుతించి, తమ దుఃఖమును విన్నవించుకొన్నారు. వారితో కూడి బ్రహ్మ వెంటనే విష్ణులోకమునకు వెళ్లెను.

**తత్ర గత్వా రమానాథం నత్వా నుత్వా విధిస్సురైః ।**
**స్వదుఃఖం తత్సమాచఖ్యౌ విష్ణవేఽనన్తకం మునే! ॥ 10 ॥**

మునీ! బ్రహ్మ దేవతలతో కూడి లక్ష్మీపతియగు విష్ణువునకు నమస్కరించి, స్తుతించి, తమకు సంప్రాప్తమైన అనంతదుఃఖాన్ని గూర్చి చెప్పారు.

**విష్ణుశ్చ విధినా దేవై రుద్రస్థానం యయౌ ద్రుతమ్**
**హరం ప్రణమ్య తత్రేత్య తుష్టావ పరమేశ్వరమ్ ॥ 11 ॥**

విష్ణువు బ్రహ్మతో మరియు దేవతలతో గూడి శీఘ్రమే రుద్రలోకమునకు వెళ్ళి, పరమేశ్వరుడైన హరునకు నమస్కరించి స్తుతించారు.

**స్తుత్వా బహుతయా విష్ణుం స్వదుఃఖం చ న్యవేదయత్ ।**
**శర్వం జ్వాలాసముద్భూతమత్రేశ్చ తపసః పరమ్ ॥ 12 ॥**

విష్ణువు శివుని పరిపరి విధముల స్తుతించి, అత్రియొక్క తపస్సునుండి పుట్టిన జ్వాలవలన తమకు సంప్రాప్తమైన తీవ్రదుఃఖమును గురించి విన్నవించెను.

**అథ తత్ర సమేతాస్తు బ్రహ్మవిష్ణుమహేశ్వరాః ।**
**మునే! సంమంత్రయాంచక్రురన్యోన్యం జగతాం హితమ్ ॥ 13 ॥**

అప్పుడచ్చట బ్రహ్మ విష్ణు మహేశ్వరులు సమకూడి, జగత్తులకు హితమును చేయు విధమును గూర్చి ఒకరితో నొకరు సంప్రదించుకొనిరి.

**తదా బ్రహ్మాదయో దేవాస్త్రయస్తే వరదర్షభాః ।**
**జగ్ముస్తదాశ్రమం శీఘ్రం వరం దాతుం తదర్షయే ॥ 14 ॥**

అప్పుడు వరములనిచ్చుటలో శ్రేష్ఠులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురు కలిసి ఆ మహర్షికి వరము నిచ్చుటకై శీఘ్రముగా అతని ఆశ్రమానికి వెళ్లారు.

**స్వచిహ్నచిహ్నితాంస్తాం స దృష్ట్వాఽత్రిర్మునిసత్తమః ।**
**ప్రణనామ చ తుష్టావ వాగ్భిరిష్టాభిరాదరాత్ ॥ 15 ॥**

తమ తమ చిహ్నములతో కూడియున్న ఆ త్రిమూర్తులను గాంచి, అత్రిమహర్షి ప్రణమిల్లి భక్తితో అభీష్ట వచనములతో స్తుతించెను.

**తతస్స విస్మితో విప్రస్తానువాచ కృతాంజలిః ।**
**బ్రహ్మపుత్రో వినీతాత్మా బ్రహ్మవిష్ణుహరాభిధాన్ ॥ 16 ॥**

అప్పుడు బ్రహ్మపుత్రుడగు ఆ మహర్షి ఆశ్చర్యచకితుడై చేతులు జోడించి వినయముతో నిండిన మనస్సుతో బ్రహ్మవిష్ణుమహేశ్వరులనుద్దేశించి యిట్లు పలికెను.

**అత్రిరువాచ -** అత్రి పలికాడు.

**హే బ్రహ్మన్! హే హరే! రుద్ర! పూజ్యాస్త్రిజగతాం మతాః ।**
**ప్రభవశ్చేశ్వరాః సృష్టిరక్షాసంహారకారకాః ॥ 17 ॥**

ఓ బ్రహ్మా! ఓ హరీ! ఓ రుద్రా! మీరు ముగ్గురు ముల్లోకములకు పూజనీయులు. సర్వసమర్థులగు ఈశ్వరులు, సృష్టిస్థితిసంహారములను చేయువారు.

**ఏక ఏవ మయా ధ్యాత ఈశ్వరః పుత్రహేతవే ।**
**యః కశ్చిదీశ్వరః ఖ్యాతో జగతాం స్వస్త్రియా సహ ॥ 18 ॥**

నేను పుత్రుని గోరి ఈశ్వరుని ఒక్కని మాత్రమే ధ్యానించితిని. లోకములలో ఈశ్వరుడను ఖ్యాతి పార్వతీ సమేతుడగు శివునకు మాత్రమే గలదు.

**యూయం త్రయస్సురాః కస్మాదాగతా వరదర్షభాః ।**
**ఏతన్మే సంశయం ఛిత్వా తతో దత్తేప్సితం వరమ్ ॥ 19 ॥**

వరములనిచ్చుటలో శ్రేష్ఠులగు మీరు ముగ్గురు ఏల విచ్చేశారు? నా సంశయమును తొలగించి, నా అభీష్టవరమునొసంగుడు.

**ఇతి శ్రుత్వా వచస్తస్య ప్రత్యూచుస్తే సురాస్త్రయః ।**
**యా దృక్కృతస్తే సంకల్పస్తథైవాభూన్మునీశ్వర! ॥ 20 ॥**

ఓ మునీశ్వరా! అతని మాటలను విని త్రిమూర్తులు ఇట్లు సమాధానము చెప్పిరి - ఓ మహర్షీ! నీ వెట్లు సంకల్పించితివో అటులనే అయినది.

**వయం త్రయో భవేశానాస్సమానా వరదర్షభాః ।**
**అస్మదంశభవాస్తస్మాద్భవిష్యన్తి సుతాస్త్రయః ॥ 21 ॥**

వరములనిచ్చు వారిలో శ్రేష్ఠులము, సంసారమునకు ఈశ్వరులమునగు మేము ముగ్గురము ఒక్కటియే. నీకు మా అంశలచే ముగ్గురు పుత్రులు జన్మించగలరు.

**విదితా భువనే సర్వే పిత్రోః కీర్తివివర్ధనాః ।**
**ఇత్యుక్త్వాస్తే త్రయో దేవాః స్వధామాని యయుర్ముదా ॥ 22 ॥**

వారు ముగ్గురు లోకములో ఖ్యాతిని గడించి తల్లిదండ్రుల కీర్తిని వర్ధిల్ల జేయగలరు. త్రిమూర్తులిట్లు పలికి ఆనందముతో తమ ధామములకు వెళ్లిరి.

**వరం లబ్ధ్వా మునిస్సోఽథ జగామ స్వాశ్రమం ముదా ।**
**యుతోఽనసూయయా ప్రీతో బ్రహ్మానందప్రదో మునే! ॥ 23 ॥**

ఓ మునీ! ఆ మహర్షి యిట్టి వరమును పొంది బ్రహ్మానందముననుభవించెను. అతడు అనసూయతో గూడి ఆనందముతో తన ఆశ్రమమునకు వెళ్లెను.

**అథ బ్రహ్మా హరిశ్శంభురవతేరుః స్త్రియాం తతః।**
**పుత్రరూపైః ప్రసన్నాత్మ నానాలీలాప్రకాశకాః ॥ 24 ॥**

అనంతరం బ్రహ్మవిష్ణు మహేశ్వరులు ముగ్గురు ప్రసన్నాత్ములై వివిధ లీలలను ప్రకటించుచూ అత్రి అనసూయలకు పుత్రులుగ అవతరించారు.

**విధేరంశాద్విధుర్జజ్ఞేఽనసూయాయాం మునీశ్వరాత్ ।**
**ఆవిర్బభూవోదధితః క్షిప్తో దేవైస్స ఏవ హి ॥ 25 ॥**

బ్రహ్మయొక్క అంశవలన చంద్రుడు అత్రి అనసూయలకు పుత్రుడై జన్మించెను. దేవతలాతనిని సముద్రములో పారవేయగా, అనంతర కాలమున అతడు అచటనుండి మరల ఆవిర్భవించెను

**విష్ణోరంశాత్ స్త్రియాం తస్యామత్రేర్దత్తో వ్యజాయత ।**
**సంన్యాసపద్ధతిర్యేన వర్ధితా పరమా మునే! ॥ 26 ॥**

ఓమునీ! విష్ణువుయొక్క అంశవలన అత్రి అనసూయలయందు దత్తుడు జన్మించెను. ఆ దత్తుడు సంన్యాస పద్ధతిని వర్ధిల్లజేసెను.

**దుర్వాసా మునిశార్దూలః శివాంశాన్మునిసత్తమః ।**
**జజ్ఞే తస్యాం స్త్రియామత్రేర్వరధర్మప్రవర్తకః ॥ 27 ॥**

శివుని అంశవలన అత్రి అనసూయలకు దుర్వాసమహర్షి జన్మించి శ్రేష్ఠమగు ధర్మమును ప్రవర్తింపజేసెను.

**భూత్వా రుద్రశ్చ దుర్వాసా బ్రహ్మతేజో వివర్ధనః ।**
**చక్రే ధర్మపరీక్షాం చ బహూనాం స దయాపరః ॥ 28 ॥**

దయాపరుడైన రుద్రుడు దుర్వాసమహర్షి యై అవతరించి, బ్రహ్మతేజస్సును వృద్ధి పొందింపజేయువాడై, చాలమందియొక్క ధర్మనిష్ఠను పరీక్షించెను.

**సూర్యవంశే సముత్పన్నో యోఽంబరీషో నృపోఽభవత్ ।**
**తత్పరీక్షామకార్షీత్సతాం శృణు త్వం మునీశ్వర! ॥ 29 ॥**

ఓ మహర్షీ! ఆయన సూర్యవంశమునందు జన్మించిన అంబరీష మహారాజును పరీక్షించిన గాథను నీవు వినుము.

**సోఽమ్బరీషో నృపవరః సప్తద్వీపరసాపతిః ।**
**నియమం హి చకారాసావేకాదశ్యా వ్రతే దృఢమ్ ॥ 30 ॥**

రాజశ్రేష్ఠుడగు ఆ అంబరీషుడు సప్త ద్వీపములతో గూడిన ఈ భూమండలమునంతటిని పాలించెడివాడు. అతడు ఏకాదశీ వ్రతము ననుష్ఠించుటకు దృఢముగా నిశ్చయించుకొనెను.

**ఏకాదశ్యాం వ్రతం కృత్వా ద్వాదశ్యాం చైవ పారణామ్ ।**
**కరిష్యామీతి సుదృఢసంకల్పస్తు నరాధిపః ॥ 31 ॥**

ఏకాదశినాడు వ్రతమాచరించి ద్వాదశినాడు పారణమును చేసెదనని ఆ మహారాజు దృఢముగా నిర్ణయించుకొనెను.

**జ్ఞాత్వా తన్నియమం తస్య దుర్వాసా మునిసత్తమః ।**
**తదంతికం గతశ్శిష్యైర్బహుభిశ్శంకరాంశజః ॥ 32 ॥**

అతని ఆ నియమము నెరింగి, శంకరాంశసంభూతుడైన దుర్వాసమహర్షి చాల మంది శిష్యులతో గూడి అతని వద్దకు వెళ్లెను.

**పారణే ద్వాదశీం స్వల్పాం జ్ఞాత్వా యావత్స భోజనమ్ ।**
**కర్తుం వ్యవసితస్తావదాగతం స న్యమంత్రయత్ ॥ 33 ॥**

పారణమునకు ద్వాదశి తిథి అల్పకాలము మాత్రమే గలదని గ్రహించి, ఆ మహారాజు భోజనము చేయబోవునంతలో విచ్చేసిన దుర్వాసుని, అంబరీషుడు భోజనమునకు ఆహ్వానించెను.

**తతః స్నానార్థమగమద్దుర్వాసాః శిష్యసంయుతః ।**
**విలంబం కృతవాంస్తత్ర పరీక్షార్థం మునిర్బహు ॥ 34 ॥**

అంతట దుర్వాసుడు శిష్యులతో గూడి స్నానం కోసం వెళ్లెను. దుర్వాసుడు అంబరీషుని పరీక్షింపగోరి అచట చాల ఆలస్యము చేసెను.

**ధర్మవిఘ్నం తదా జ్ఞాత్వా స నృపః శాస్త్రశాసనాత్ ।**
**జలం ప్రాశ్యాస్థితస్తత్ర తదాగమనకాంక్షయా ॥ 35 ॥**

ధర్మవిఘ్నము కలుగునని తలంచిన అంబరీషుడు శాస్త్రాదేశానుసారము నీటిని త్రాగి దుర్వాసమహర్షికొరకు వేచియుండెను.

**ఏతస్మిన్నంతరే తత్ర దుర్వాసా మునిరాగతః ।**
**కృతాశనం నృపం జ్ఞాత్వా పరీక్షార్థం ధృతా కృతిః ॥ 36 ॥**

ధర్మపరీక్షకు దేహమును దాల్చిన దుర్వాసుడు ఇంతలో అచ్చటకు వచ్చి రాజు నీటిని త్రాగినాడని తెలుసుకొనెను.

**చుక్రోధాతి నృపే తస్మిన్పరీక్షార్థం వృషస్య సః ।**
**ప్రోవాచ వచనం తూగ్రం స మునిశ్శంకరాంశజః ॥ 37 ॥**

ధర్మపరీక్ష కొరకే శంకరుని అంశతో జన్మించిన ఆ మహర్షి ఆ రాజుపై చాల కోపించి క్రూరమగు పలుకులను పలికెను.

**దుర్వాసా ఉవాచ** – దుర్వాసుడు పలికాడు.

**మాం నిమంత్ర్య నృపాభోజ్య జలం పీతం త్వయాఽధమ ।**
**దర్శయామి ఫలం తస్య దుష్టదండధరో హ్యహమ్ ॥ 38 ॥**

ఓ రాజా! అధముడా! నన్ను ఆహ్వానించి, నాకు ముందుగా ఆహారమునీయకుండగా నీవు నీటిని త్రాగినావు. దాని ఫలమును నీకు చూపించెదను. దుష్టులకు శిక్షను విధించుటయే నా పని.

**ఇత్యుక్త్వా క్రోధతామ్రాక్షో నృపం దగ్ధుం సముద్యతః ।**
**సముత్తస్థౌ ద్రుతం చక్రం తత్‌స్థం రక్షార్థమైశ్వరమ్ ॥ 39 ॥**

ఇట్లు పలికి కోపముతో ఎర్రనైన కన్నులు గలవాడై ఆ మహర్షి రాజును దహించుటకు సిద్ధపడెను. వెంటనే రాజునందున్న ఈశ్వరస్వరూపమగు చక్రము రాజును రక్షించుటకొరకై సంసిద్ధమయ్యెను.

**ప్రజజ్వాలాతి తం చక్రం మునిం దగ్ధుం సుదర్శనమ్ ।**
**శివరూపం తమజ్ఞాత్వా శివమాయావిమోహితమ్ ॥ 40 ॥**

శివమాయచే విమోహితమైన ఆ సుదర్శనచక్రము ఆ దుర్వాసుడు శివస్వరూపుడని ఎరుగక ఆయనను దహించుటకై ప్రజ్వరిల్లెను.

**ఏతస్మిన్నంతరే వ్యోమవాణ్యువాచాశరీరిణీ ।**
**అంబరీషం మహాత్మానం బ్రహ్మభక్తం చ వైష్ణవమ్ ॥ 41 ॥**

ఇంతలో ఆకాశము నుండి ఆకాశవాణి వేదభక్తుడు, మహాత్ముడు, వైష్ణవుడునగు అంబరీషునితో నిట్లు పలికెను.

**వ్యోమవాణ్యువాచ** – ఆకాశవాణి పలికింది.

**సుదర్శనమిదం చక్రం హరయే శంభునార్పితమ్ ।**
**శాంతం కురు ప్రజ్వలితమద్య దుర్వాససే నృప! ॥ 42 ॥**

ఓ రాజా! ఈ సుదర్శనచక్రమును శంభుడు విష్ణువునకిచ్చినాడు. ఇప్పుడు దుర్వాసునిపై మంటలను గ్రక్కుచున్న ఈ చక్రమును శాంతింప జేయుము.

**దుర్వాసాయం శివః సాక్షాత్స చక్రం హరయేఽర్పితమ్ ।**
**ఏవం సాధారణమునిం న జానీహి నృపోత్తమ! ॥ 43 ॥**

ఓ మహారాజా! ఈ దుర్వాసుడు సాక్షాత్తు శివస్వరూపుడు. ఈయనయే చక్రమును విష్ణువునకిచ్చినాడు. ఈయన సాధారణమగు మునియని తలంపకుము.

**తవ ధర్మపరీక్షార్థమాగతోఽయం మునీశ్వరః ।**
**శరణం యాహి తస్యాశు భవిష్యత్యన్యథా లయః ॥ 44 ॥**

ఈ మహర్షి నీ ధర్మమును పరీక్షించుటకు వచ్చినాడు. వెంటనే అతనిని శరణు వేడుము. లేనిచో సర్వము వినాశనము కాగలదు.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వా చ నభోవాణీ విరరామ మునీశ్వర! ।**
**అస్తావీత్స హరాంశం తమంబరీషోఽపి చాదరాత్ ॥ 45 ॥**

ఓ మునీశ్వరా! ఆకాశవాణి ఇట్లు పలికి విరమించెను. అపుడా అంబరీషుడు శివుని అంశావతారమగు దుర్వాసమునిని స్తుతించెను.

**అంబరీష ఉవాచ** – అంబరీషుడు పలికాడు.

**యద్యస్తి దత్తమిష్టం చ స్వధర్మో వా స్వనుష్ఠితః ।**
**కులం నో విప్రదైవం చేద్ధరేరస్త్రం ప్రశామ్యతు ॥ 46 ॥**

నేను దానములను, యజ్ఞములను చేసియున్నచో, స్వధర్మమననుష్ఠించినవాడనైనచో, మా కులము బ్రాహ్మణులను దైవముగా ఆరాధించినదైనచో ఈ విష్ణువుయొక్క ఆయుధము శాంతించు గాక!

**యది నో భగవాన్ప్రీతో మద్భక్తో భక్తవత్సలః ।**
**సుదర్శనమిదం చాస్త్రం ప్రశామ్యతు విశేషతః ॥ 47 ॥**

భక్తవత్సలుడగు భగవానునకు నాయందు ప్రీతియున్నచో, నేను భక్తుడనైనచో ఈ సుదర్శనాస్త్రము శీఘ్రమే శాంతించు గాక!

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇతి స్తువతి రుద్రాగ్రే శైవం చక్రం సుదర్శనమ్ ।**
**అశామ్యత్సర్వథా జ్ఞాత్వా తం శివాంశం సులబ్ధధీః ॥ 48 ॥**

అతడు ఆ విధముగా రుద్రుని ఎదుట స్తుతించగా, సుదర్శనమనే ఆ శివచక్రము పూర్తిగా శాంతించింది. దుర్వాసుడు శివాంశసంభూతుడని యెరింగి వివేకమును పొందెను.

**అథాంబరీషస్స నృపః ప్రణనామ చ తం మునిమ్ ।**
**శివావతారం సంజ్ఞాయ స్వపరీక్షార్థమాగతమ్ ॥ 49 ॥**

ఆ అంబరీషమహారాజు అపుడాయనకు నమస్కరించెను. తనకు పరీక్షించుటకై శివుడే దుర్వాసరూపములో వచ్చియున్నాడని ఆ రాజునకు తెలిసెను.

**సుప్రసన్నో బభూవాథ స మునిః శంకరాంశజః ।**
**భుక్త్వా తస్మై వరం దత్త్వాం స్వాభీష్టం స్వాలయం యయౌ ॥ 50 ॥**

శంకరాంశజుడైన దుర్వాసమహర్షి మిక్కిలి ప్రసన్నుడై, భుజించి అతనికి వరమునిచ్చి యథేచ్ఛగా తన ఆశ్రమమునకు వెళ్లెను.

**అంబరీషపరీక్షాయాం దుర్వాసశ్చరితం మునే! ।**
**ప్రోక్తమన్యచ్చరిత్రం త్వం శృణు తస్య మునీశ్వర! ॥ 51 ॥**

ఓ మునీ! అంబరీషపరీక్ష యనే దుర్వాసవృత్తాంతమును నీవు వింటివి. ఆ మహర్షియొక్క మరియొక చరిత్రను కూడ నీవు వినుము.

**పునర్దాశరథేశ్చక్రే పరీక్షాం నియమేన వై ।**
**మునిరూపేణ కాలేన యః కృతో నియమో మునే! ॥ 52 ॥**

ఓమునీ! ఆయన శ్రీరాముని కూడ పరీక్షించెను. కాలుడు మునిరూపమును దాల్చి శ్రీరామునితో ఒక నియమమును చేసెను.

**తదైవ మునినా తేన సౌమిత్రిః ప్రేషితో హఠాత్ ।**
**తం తత్యాజ ద్రుతం రామో బంధుం పణవశాన్మునే! ॥ 53 ॥**

మునీ! అదే సమయములో ఆ మహర్షి పట్టుబట్టి లక్ష్మణుని ఆయన వద్దకు పంపెను. వెంటనే శ్రీ రాముడు శపథమును పాటించి, సోదరుడగు లక్ష్మణుని పరిత్యజించెను.

**సా కథా విహితా లోకే మునిభిర్బహుధోదితా ।**
**నాతో మే విస్తరాత్ప్రోక్తా జ్ఞాతా యత్సర్వథా బుధైః ॥ 54 ॥**

ఆ కథ లోకములో ప్రఖ్యాతముగా నున్నది. మహర్షులు దీనిని విస్తరముగా చెప్పియున్నారు. విద్వాంసులందరికి తెలిసినదగుటచే నేను వివరముగా చెప్పుట లేదు.

**నియమం సుదృఢం దృష్ట్వా సుప్రసన్నోఽభవన్మునిః ।**
**దుర్వాసాస్సుప్రసన్నాత్మా వరం తస్మై ప్రదత్తవాన్ ॥ 55 ॥**

శ్రీరాముని మిక్కిలి దృఢమైన నియమమును గాంచి, దుర్వాసమహర్షి మిక్కిలి ప్రసన్నుడై ఆయనకు వరమునిచ్చియుండెను.

**శ్రీకృష్ణనియమస్యాపి పరీక్షాం స చకార హ ।**
**తాం శృణు త్వం మునిశ్రేష్ఠ! కథయామి కథాం చ తామ్ ॥ 56 ॥**

ఓ మహర్షీ! ఆ మహర్షి శ్రీ కృష్ణుని నియమమును కూడ పరీక్షించెను. ఆ కథను చెప్పెదను వినుము.

**బ్రహ్మప్రార్థనయా విష్ణుర్వసుదేవసుతోఽభవత్ ।**
**ధరాభారావతారార్థం సాధూనాం రక్షణాయ చ ॥ 57 ॥**

భూభారమును తగ్గించి, సాధువులను రక్షించుటకొరకై, బ్రహ్మయొక్క ప్రార్థన మేరకు విష్ణువు వసుదేవుని కుమారుడై అవతరించెను.

**హత్వా దుష్టాన్మహాపాపాన్ బ్రహ్మద్రోహకరాన్ ఖలాన్ ।**
**రరక్ష నిఖిలాన్ సాధూన్బ్రాహ్మణాన్ కృష్ణనామభాక్ ॥ 58 ॥**

ఆయన కృష్ణనామంతో విఖ్యాతి గాంచి మహాపాపులు, వేదద్రోహులునైన దుష్టులను సంహరించి సాధువులను, బ్రాహ్మణులను రక్షించెను.

**బ్రహ్మభక్తిం చకారాతి స కృష్ణో వసుదేవజః ।**
**నిత్యం హి భోజయామాస సురసాన్బ్రాహ్మణాన్బహూన్ ॥ 59 ॥**

వసుదేవుని కుమారుడగు ఆ శ్రీకృష్ణుడు బ్రాహ్మణులయందు అధికమగు భక్తిని కలిగియుండెను. ఆయన నిత్యము అనేక మంది బ్రాహ్మణులకు, రుచికరములైన పదార్థములతో భోజనములిడెను.

**బ్రహ్మభక్తో విశేషేణ కృష్ణశ్చేతి పథామగాత్ ।**
**సంద్రష్టుకామస్స మునిః కృష్ణాంతికమగాన్మునే! ॥ 60 ॥**

ఓ మునీ! శ్రీ కృష్ణుడు గొప్ప బ్రాహ్మణభక్తుడని కీర్తిని గాంచెను. ఆ మహర్షి శ్రీకృష్ణుని దర్శించుటకై ఆయన వద్దకు వెళ్లెను.

**రుక్మిణీసహితం కృష్ణం సన్నం కృత్వా రథే స్వయమ్ ।**
**సంయోజ్య సంస్థితో వాహం సుప్రసన్న ఉవాహ తమ్ ॥ 61 ॥**

రుక్మిణీసమేతుడైన శ్రీ కృష్ణుడు ఆయనను స్వయముగా రథమునెక్కించి ఆ రథమునకు గుర్రములను పూన్చి సుప్రసన్నుడై తాను స్వయముగా నడిపించెను.

**మునీ రథాత్సముత్తీర్య దృష్ట్వా తాం దృఢతాం పరామ్ ।**
**తస్మై భూత్వా సుప్రసన్నో వజ్రాంగత్వవరం దదౌ ॥ 62 ॥**

ఆ మహర్షి రథమునుండి దిగి శ్రీ కృష్ణుని శ్రేష్ఠమగు దృఢవ్రతమును గాంచి మిక్కిలి ప్రసన్నమగు మనస్సు గలవాడై ఆయనకు సంపదతో బాటు వజ్రమువలె దృఢమగు దేహమును వరముగా నిచ్చెను.

**ద్యునద్యామేకదా స్నానం కుర్వన్నగ్నో బభూవ హ।**
**లజ్జితోఽభూన్మునిశ్రేష్ఠో దుర్వాసాః కౌతుకీ మునే! ॥ 63 ॥**

మహర్షీ! ఒకనాడు ఆయన గంగానదిలో స్నానము చేయుచుండగా, వస్త్రము కొట్టుకుపోయెను. అంతట ఆ దుర్వాస మహర్షి సిగ్గుపడి ఉత్కంఠతో అటునిటు చూచెను.

**తజ్జ్ఞాత్వా ద్రౌపదీ స్నానం కుర్వతీ తత్ర చాదరాత్ ।**
**తల్లజ్జాం ఛాదయామాస భిన్నస్వాంచల దానతః ॥ 64 ॥**

సమీపములో స్నానమాచరించుచున్న ద్రౌపది విషయమును గ్రహించి తన వస్త్రమును చింపి, ఆ ముక్కను ఆదరముతో ఆయనకిచ్చి పరువును కాపాడెను.

**తదాదాయ ప్రవాహేనాగతం స్వనికటం మునిః ।**
**తేనాచ్ఛాద్య స్వగుహ్యం చ తస్యై తుష్టో బభూవ సః ॥ 65 ॥**

ప్రవాహవేగముచే తన వద్దకు వచ్చిన గుడ్డముక్కను స్వీకరించి ఆ మహర్షి దానిని ధరించి ఆమెయందు మిక్కిలి ప్రసన్నుడాయెను.

**ద్రౌపద్యై చ వరం ప్రాదాత్తదంచలవివర్ధనమ్ ।**
**పాండవాన్సుఖినశ్చక్రే ద్రౌపదీ తద్వరాత్పునః ॥ 66 ॥**

ఆయన ద్రౌపదికి వస్త్రవృద్ధియను వరమునిచ్చి, ఆ వరప్రభావముచే ద్రౌపదికి మరియు పాండవులకు సుఖము కలుగునట్లు చేసెను.

**హంసడింభౌ నృపౌ కౌచిత్స్వావమానకరౌ ఖలౌ ।**
**దత్త్వా నిదేశం చ హరేర్నాశయామాస స ప్రభుః ॥ 67 ॥**

సమర్థుడగు ఆ మహర్షి విష్ణువును ఆదేశించి, రెండు హంసపిల్లల రూపములో తనను అవమానించిన దుష్టులగు ఇద్దరు రాజులను మట్టుబెట్టెను.

**బ్రహ్మతేజో విశేషేణ స్థాపయామాస భూతలే ।**
**సంన్యాసపద్ధతిం చైవ యథాశాస్త్రవిధిక్రమమ్ ॥ 68 ॥**

ఆయన తన బ్రహ్మతేజస్సుయొక్క మహిమచే భూలోకమునందు యథాశాస్త్రముగా కర్మలను చేయు క్రమమును మరియు సన్న్యాసపద్ధతిని గూడ ప్రవేశపెట్టెను.

**బహూనుద్ధారయామాస సూపదేశం విబోధ్య చ ।**
**జ్ఞానం దత్త్వా విశేషేణ బహూన్ముక్తాంశ్చకార సః ॥ 69 ॥**

ఆయన చక్కని ఉపదేశమును బోధించి, అనేకమందిని ఉద్ధరించెను. ఆయన విశేషించి అనేకమందికి జ్ఞానమునిచ్చి, వారిని ముక్తులను గావించెను.

**ఇత్థం చక్రే స దుర్వాసా విచిత్రం చరితం బహు ।**
**ధన్యం యశస్యమాయుష్యం శృణ్వతస్సర్వకామదమ్ ॥ 70 ॥**

ఈ విధముగా దుర్వాస మహర్షి అనేకములగు విచిత్ర చరితములను ప్రకటించెను. ఈ చరిత్రము పవిత్రమైనది. యశస్సును, ఆయుష్షను మాత్రమే గాక వినువారికి కోర్కెలనన్నిటిని ప్రసాదించును.

**య ఇదం శృణయాద్భక్త్యా దుర్వాసశ్చరితం ముదా ।**
**శ్రావయేద్వా పరాం యశ్చ స సుఖీహ పరత్ర చ ॥ 71 ॥**

ఈ దుర్వాసచరితమును భక్తితో, ఆనందముతో ఎవడు వినునో లేదా ఇతరులకు వినిపించునో, అతడు ఇహపరలోకములలో సుఖమును పొందును.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం దుర్వాసశ్చరిత్రవర్ణనం నామైకోనవింశో௨ధ్యాయః ॥ 19 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు దుర్వాసచరిత్రవర్ణనం అనే పేరుగల పంతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## **వింశోऽధ్యాయః** – ఇరవైయవ అధ్యాయం

## **హనుమదవతారచరిత్రవర్ణనమ్** – హనుమదవతారచరిత్రవర్ణనం

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**అతః పరం శృణు ప్రీత్యా హనుమచ్చరితం మునే! ।**
**యథా చకారాశు హరో లీలాస్తద్రూపతో వరాః ॥ 1 ॥**

ఓ మహర్షీ! ఇటు పిమ్మట హనుమచ్చరితమును ప్రీతితో వినుము. శివుడు హనుమద్రూపమును దాల్చి గొప్ప లీలలను ప్రకటించిన తీరును తెలుసుకొనుము.

**చకార సుహితం ప్రీత్యా రామస్య పరమేశ్వరః ।**
**తత్సర్వం చరితం విప్ర శృణు సర్వసుఖావహమ్ ॥ 2 ॥**

ఆ పరమేశ్వరుడు ప్రేమతో శ్రీరామునకు గొప్ప హితమును చేసెను. ఓ విప్రా! సర్వులకు సుఖమును కలిగించు ఆ వృత్తాంతమునంతను వినుము.

**ఏకస్మిన్సమయే శంభురద్భుతోऽతికరః ప్రభుః ।**
**దదర్శ మోహినీరూపం విష్ణోః స హి వసద్గుణః ॥ 3 ॥**

ఒకనొక సమయములో అద్భుతమగు లీలలను నెరపువాడు, సకల గుణాభిరాముడునగు శంకరుడు విష్ణువుయొక్క మోహినీరూపమును గాంచెను.

**చక్రే స్వం క్షుభితం శంభుః కామబాణహతో యథా ।**
**స్వం వీర్యం పాతయామాస రామకార్యార్థమీశ్వరః ॥ 4 ॥**

ఈశ్వరుడగు శంభువు తన అంతఃకరణము కాముని బాణములచే కొట్టబడినదన్నట్లుగా ఆయన రామ–కార్యార్థము తన వీర్యస్ఖలనమును చేసెను.

**తద్వీర్యం స్థాపయామాసుః పత్రే సప్తర్షయశ్చ తే ।**
**ప్రేరితా మనసా తేన రామకార్యార్థమాదరాత్ ॥ 5 ॥**

శివునిచేత హృదయమునందు ప్రేరేపింపబడినవారై రామకార్యార్థము ఆదరముతో సప్తర్షులు ఆ వీర్యమును పత్రమునందు ఉంచిరి.

**తైర్గౌతమసుతాయాం తద్వీర్యం శంభోర్మహర్షిభిః ।**
**కర్ణద్వారా తథాంజన్యాం రామకార్యార్థ మాహితమ్ ॥ 6 ॥**

ఆ మహర్షులు రామకార్యార్థము శంభుని ఆ వీర్యమును గౌతముని కుమార్తెయగు అంజనీ దేవియందు చెవి ద్వారా ప్రవేశపెట్టారు.

**తతశ్చ సమయే తస్మాద్ధనూమానితి నామభాక్ ।**
**శంభుర్జజ్ఞే కపితనుర్మహాబల పరాక్రమః ॥ 7 ॥**

తరువాత కొంతకాలమునకు ఆ వీర్యమువలన శంభువు వానరదేహము గలవాడై జన్మించాడు. మహాబలపరాక్రమములు కలిగిన ఆ వానరునకు "హనుమాన్" అనుపేరు కలిగెను.

**హనూమాన్స కపీశానః శిశురేవ మహాబలః ।**
**రవిబింబం బభక్షాశు జ్ఞాత్వా లఘుఫలం ప్రగే ॥ 8 ॥**

మహాబలుడు, కపిశ్రేష్ఠుడునగు హనుమంతుడు బాలుడుగనుండగనే, సూర్యోదయకాలములో సూర్యుని ఫలముగా భావించి వేగమే, తేలికగా ఆ సూర్యబింబమును భక్షించాడు.

**దేవప్రార్థనయా తం సో౽త్యజజ్జ్ఞాత్వా మహాబలమ్ ।**
**శివావతారం చ ప్రాప వరాన్దత్తాన్ సురర్షిభిః ॥ 9 ॥**

మహాబలశాలి, శివావతారము అని యెరింగి దేవతలు ప్రార్థింపగా, అతడు సూర్యుని విడిచిపెట్టి దేవతల నుండి, ఋషులనుండి వరములను పొందెను.

**స్వజనన్యంతికం ప్రాగాదథ సో౽తిప్రహర్షితః ।**
**హనూమాన్ సర్వమాచఖ్యౌ తస్యై తద్వృత్తమాదరాత్ ॥ 10 ॥**

అపుడు హనుమంతుడు మిక్కిలి ఆ నందముతో తన తల్లివద్దకు వెళ్లి ఆ వృత్తాంతమునంతనూ, శ్రద్ధతో ఆమెకు విన్నవించెను.

**తదాజ్ఞయా గతో ధీరస్సర్వవిద్యామయత్నతః ।**
**సూర్యాత్పపాఠ స కపిర్గత్వా నిత్యం తదంతికమ్ ॥ 11 ॥**

తల్లి ఆజ్ఞను పొంది, ధీరుడగు ఆ వానరుడు ప్రతి దినము సూర్యుని వద్దకు వెళ్ళి ఆయన వద్ద విద్యలనన్నింటిని తేలికగా అభ్యసించెను.

**సూర్యాజ్ఞయా తదంశస్య సుగ్రీవస్యాంతికం యయౌ ।**
**మాతురాజ్ఞామనుప్రాప్య రుద్రాంశః కపిసత్తమః ॥ 12 ॥**

రుద్రాంశ సంభూతుడగు ఆవానరవీరుడు, తల్లి ఆజ్ఞను పొంది సూర్యాజ్ఞచే సూర్యాంశతో జన్మించిన సుగ్రీవుని వద్దకు వెళ్లెను.

**జ్యేష్ఠభ్రాత్రా వాలినా హి స్వస్త్రీభోక్త్రా తిరస్కృతః ।**
**ఋష్యమూకగిరౌ తేన న్యవసత్స హనూమతా ॥ 13 ॥**

సుగ్రీవుని అన్నయగు వాలి, తమ్ముని భార్యను అపహరించి అతనిని తరిమివేసెను. ఆ సుగ్రీవుడు హనుమంతునితో గూడి ఋష్యమూకపర్వతమునందు నివసించెను.

**తతో౽భూత్స సుకంఠస్య మంత్రీ కపివరస్సుధీః ।**
**సర్వథా సుహితం చక్రే సుగ్రీవస్య హరాంశజః ॥ 14 ॥**

బుద్ధిశాలి, శివాంశసంభూతుడునగు ఆ వానరశ్రేష్ఠుడుఅనంతరకాలమున సుగ్రీవునకు మంత్రియై ఆయనకు అన్ని విధములుగా హితమును చేకూర్చెను.

**తత్రాగతేన సభ్రాత్రా హృతభార్యేణ దుఃఖినా ।**
**కారయామాస రామేణ తస్య సఖ్యం సుఖావహమ్ ॥ 15 ॥**

భార్య అపహరింపబడగా దుఃఖిస్తూ సోదరునితో కలిసి అచటకు వచ్చిన రామునితో హనుమంతుడు సుగ్రీవునకు సఖ్యమును చేయించెను. దానివలన సుగ్రీవునకు సుఖము లభించెను.

**ఘాతయామాస రామశ్చ వాలినం కపికుంజరమ్ ।**
**భ్రాతృపత్న్యాశ్చ భోక్తారం పాపినం వీరమానినమ్ ॥ 16 ॥**

వానరవీరుడు, సోదరుని భార్యను అపహరించినవాడు, పాపి, వీరుడనను గర్వము గలవాడునగు వాలిని రాముడు సంహరించెను.

**తతో రామాజ్ఞయా తాత! హనూమాన్వానరేశ్వరః ।**
**స సీతాన్వేషణం చక్రే బహుభిర్వానరైస్సుధీః ॥ 17 ॥**

వత్సా! అంతట వానరశ్రేష్ఠుడు, బుద్ధిశాలియునగు హనుమంతుడు అనేక వానరులతో గూడి రామాజ్ఞచే సీతాన్వేషణమును ప్రారంభించెను.

**జ్ఞాత్వా లంకాగతాం సీతాం గతస్తత్ర కపీశ్వరః ।**
**ద్రుతముల్లంఘ్య సింధుం తమనిస్తీర్యం పరైః స వై ॥ 18 ॥**

లంకయందు సీత గలదని తెలుసుకొని, ఇతరులకు లంఘింపశక్యము కాని సముద్రమును హనుమంతుడు శీఘ్రముగా లంఘించి లంకను చేరెను.

**చక్రే౽ద్భుతచరిత్రం స తత్ర విక్రమసంయుతమ్ ।**
**అభిజ్ఞానం దదౌ ప్రీత్యా సీతాయై స్వప్రభోర్వరమ్ ॥ 19 ॥**

అచ్చట అతడు పరాక్రమముతో కూడిన అద్భుతచరిత్రను సృష్టించి, తన ప్రభువగు శ్రీరాముని శ్రేష్ఠమైన అంగులీయకమును గుర్తుగా సీతాదేవికి ప్రీతితోనిచ్చెను.

**సీతాశోకం జహారాశు స వీరః కపినాయకః ।**
**శ్రావయిత్వా రామవృత్తం తత్ప్రాణావనకారకమ్ ॥ 20 ॥**

ఆ కపినాయకుడు రామవృత్తాంతమును వినిపించి, సీతాదేవి ప్రాణములను కాపాడెను. ఆమె వెంటనే దుఃఖమును విడనాడెను.

**తదభిజ్ఞానమాదాయ నివృత్తో రామసన్నిధిమ్ ।**
**రావణారామమాహత్య జఘాన బహురాక్షసాన్ ॥ 21 ॥**

ఆమెనుండి గుర్తుగా చూడామణిని తీసుకొని అతడు అనేక మంది రాక్షసులను సంహరించి, రావణుని ఉద్యానవనమును ధ్వంసము చేసి, రాముని సన్నిధికి బయలుదేరాడు.

**తదైవ రావణసుతం హత్వా సబహురాక్షసమ్ ।**
**స మహోపద్రవం చక్రే మహోఽతిస్తత్ర నిర్భయః ॥ 22 ॥**

అప్పుడే రావణుని కుమారుడైన అక్షయ కుమారుని చాల మంది రాక్షసులతో సహా సంహరించి, అచట నిర్భయముగా గొప్ప లీలలను ప్రకటించి, ఆయన గొప్ప ఉపద్రవమును సృష్టించెను.

**యదా దగ్ధో రావణేనావగుంఠ్య వసనాని చ ।**
**తైలాభ్యక్తాని సుదృఢం మహాబలవతా మునే! ॥ 23 ॥**

ఓ మహర్షీ! మహాబలశాలియగు రావణుడు ఆయన తోకకు నూనెతో ముంచిన గుడ్డలను చుట్టించి నిప్పుముట్టించెను.

**ఉత్ప్లుత్యోత్ప్లుత్య చ తదా మహాదేవాంశజః కపిః ।**
**దదాహ లంకాం నిఖిలాం కృత్వా వ్యాజం తమేవ హి ॥ 24 ॥**

ఒక భవనము నుండి మరియొక భవనము పైకి దుముక జొచ్చెను. మహాదేవుని అంశవలన జన్మించిన ఆ వానరుడు అదే మిషతో లంకానగరమునంతటిని దహించెను.

**దగ్ధ్వా లంకాం వర్జయిత్వా విభీషణగృహం తతః ।**
**అపతద్వారిధౌ వీరస్తతస్స కపికుంజరః ॥ 25 ॥**

వీరుడైన ఆ కపిశ్రేష్ఠుడు విభీషణుని గృహము తక్క మిగిలిన లంకను దహించి, తరువాత సముద్రమునకు చేరెను.

**స్వపుచ్ఛం తత్ర నిర్వాప్య ప్రాప తస్య పరం తటమ్ ।**
**అఖిన్నః స యయౌ రామసన్నిధిం గిరిశాంశజః ॥ 26 ॥**

తన తోకయందలి నిప్పును సముద్రములో చల్లార్చుకొని ఆవలి తీరమునకు చేరుకొనెను. శివాంశతో జన్మించిన ఆ వీరుడు ఏ మాత్రము ఖిన్నుడు గాక, ఉత్సాహముతో రాముని సన్నిధికి చేరెను.

**అవిలంబేన సుజవో హనూమాన్ కపిసత్తమః ।**
**రామోపకంఠమాగత్య దదౌ సీతాశిరోమణిమ్ ॥ 27 ॥**

మహావేగము గలవాడగు హనుమంతుడు ఆలస్యము చేయక వెంటనే రాముని సన్నిధికి వచ్చి సీతాదేవియొక్క చూడామణిని ఇచ్చెను.

**తతస్తదాజ్ఞయా వీరస్సింధౌ సేతుమబంధయత్ ।**
**వానరైస్స సమానీయ బహూన్గిరివరాన్బలీ ॥ 28 ॥**

అంతట ఆ వీరుడు రామాజ్ఞను పొంది వానరులతో గూడి అనేక పెద్ద పర్వతములను తెచ్చి, సముద్రమునందు సేతువును నిర్మించెను.

**గత్వా తత్ర తతో రామస్తర్తుకామో యథా తతః ।**
**శివలింగం సమానర్చ ప్రతిష్ఠాప్య జయేప్సయా ॥ 29 ॥**

రాముడచ్చటకు వెళ్లి సముద్రమును దాటదలచెను. ఆయన జయమును పొందవలెనను కోరికతో అచ్చట శివలింగప్రతిష్ఠాపన జేసి చక్కగా పూజించెను.

**తద్వరాత్స జయం ప్రాప్య వరం తీర్త్వోదధిం తతః ।**
**లంకామావృత్య కపిభీ రణం చక్రే స రాక్షసైః ॥ 30 ॥**

శివునినుండి జయమును వరముగా పొంది, గొప్ప సముద్రమును దాటి వానరులతో గూడి లంకను చుట్టు ముట్టి రాక్షసులతో యుద్ధము చేసెను.

**జఘానాథాసురాన్వీరో రామసైన్యం రరక్ష సః ।**
**శక్తిక్షతం లక్ష్మణం చ సంజీవిన్యా హ్యజీవయత్ ॥ 31 ॥**

అపుడు హనుమంతుడు రాక్షసులను సంహరించి, రాముని సైన్యమును రక్షించెను. శక్తిచే కొట్టబడి నేలగూలిన లక్ష్మణుని సంజీవినితో బ్రతికింపజేసెను.

**సర్వథా సుఖినం చక్రే సరామం లక్ష్మణం హి సః ।**
**సర్వసైన్యం రరక్షాసౌ మహాదేవాత్మజః ప్రభుః ॥ 32 ॥**

మహాదేవుని పుత్రుడగు హనుమంతుడు రామలక్ష్మణులకు సర్వవిధములుగా సుఖమును కలిగించి, సైన్యమునంతటిని రక్షించెను.

**రావణం పరివారాఢ్యం నాశయామాస విశ్రమః ।**
**సుఖీ చకార దేవాన్స మహాబలగ్రహః కపిః ॥ 33 ॥**

శ్రమ నెరుంగనివాడు, మహాబలసంపన్నమగు దేహము గలవాడునగు హనుమంతుడు పెద్దపరివారంతో నున్న రావణుని నశింపజేసి దేవతలకు మోదమును గూర్చెను.

**మహిరావణసంజ్ఞం స హత్వా రామం సలక్ష్మణమ్ ।**
**తత్ స్థానాదానయామాస స్వస్థానం పరిపాల్య చ ॥ 34 ॥**

మహిరావణుడను రాక్షసుని హనుమంతుడు సంహరించి, వాని వద్ద బందీలుగా నున్న రామలక్ష్మణులను రక్షించి తీసుకొని వచ్చెను.

**రామకార్యం చకారాశు సర్వథా కపిపుంగవః ।**
**అసురాన్నమయామాస నానా లీలాం చకార చ ॥ 35 ॥**

ఆ వానరవీరుడు సర్వవిధములుగా రామకార్యమును చేయుచూ, రాక్షసులను నిర్జించి, వివిధ లీలలను ప్రకటించెను.

**స్థాపయామాస భూలోకే రామభక్తిం కపీశ్వరః ।**
**స్వయం భక్తవరో భూత్వా సీతారామసుఖప్రదః ॥ 36 ॥**

ఆ కపీశ్వరుడు తాను సీతారాములకు గొప్ప భక్తుడై వారికి సుఖమును కలిగించి, భూలోకములో రామభక్తిని సుస్థిరము చేసెను.

**లక్ష్మణప్రాణదాతా చ సర్వదేవమదాపహః ।**
**రుద్రావతారో భగవాన్ భక్తోద్ధారకరస్స వై ॥ 37 ॥**

రుద్రభగవానుడీవిధముగా అవతరించి, లక్ష్మణుని ప్రాణములను కాపాడి, దేవతల గర్వమునపహరించి ఆనందమును కలిగించి, భక్తులనుద్ధరించెను.

**హనూమాన్స మహావీరో రామకార్యకరస్సదా ।**
**రామదూతాభిధో లోకే దైత్యఘ్నో భక్తవత్సలః ॥ 38 ॥**

మహావీరుడు, సదా రామకార్యరతుడు, రాక్షససంహారి, భక్తవత్సలుడునగు హనుమంతుడు 'రామదూత' అని లోకములో ప్రఖ్యాతిని పొందెను.

**ఇతి తే కథితం తాత! హనుమచ్చరితం వరమ్ ।**
**ధన్యం యశస్యమాయుష్యం సర్వకామఫలప్రదమ్ ॥ 39 ॥**

వత్సా! ఈ విధముగా శ్రేష్ఠమైనది, ధన్యమైనది, యశస్సును, ఆయుష్షును ఇచ్చునదియు, కోర్కెలనన్నింటిని ఈడేర్చునదియునైన హనుమచ్చరిత్రను చెప్పితిని.

**య ఇదం శృణుయాద్భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।**
**స భుక్త్వేహాఖిలాన్కామానన్తే మోక్షం లభేత్పరమ్ ॥ 40 ॥**

దీనిని భక్తితో, మనస్సును లగ్నము చేసి ఎవడు వినునో, లేదా వినిపించునో, వాడు ఇహలోకములో సమస్తకామనలననుభవించి, మరణానంతరం సర్వశ్రేష్ఠమగు మోక్షమును పొందును.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం హనుమదవతారచరిత్రవర్ణనం నామ వింశోఽధ్యాయః ॥ 20 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు హనుమదవతారచరిత్రవర్ణనం అనే పేరుగల ఇరవైయవ అధ్యాయం సమాప్తం.

## **ఏకవింశోఽధ్యాయః** - ఇరవైఒకటవ అధ్యాయం

## **మహేశావతారవర్ణనమ్** - మహేశావతారవర్ణనం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**అథ ప్రీత్యా శృణు మునేఽవతారం పరమం ప్రభోః ।**
**శంకరస్యాత్మభూపుత్ర శృణ్వతాం సర్వకామదమ్ ॥ 1 ॥**

ఓ మునీ! ఇపుడు పరమ ప్రభువైన శంకరుని మరియొక అవతారాన్ని గురించి వినుము. ఇది వినువారి కోర్కెలనన్నింటిని తీరుస్తుంది.

**ఏకదా మునిశార్దూల! గిరిజాశంకరావుభౌ ।**
**విహర్తుకామౌ సంజాతౌ స్వేచ్ఛయా పరమేశ్వరౌ ॥ 2 ॥**

ఓ మునిశార్దూలా! గిరిజాశంకరులిద్దరికి ఒకానొకప్పుడు యథేచ్ఛగా విహరించాలనే కుతూహలం కలిగింది.

**భైరవం ద్వారపాలం చ కృత్వాఽభ్యంతరమాగతౌ ।**
**నానాసఖిగణైః ప్రీత్యా సేవితౌ నరశీలితౌ ॥ 3 ॥**

అనేక మంది సేవకురాండ్రచే సేవింపబడే వారిద్దరూ, లోకాచారం ప్రకారం భైరవుని ద్వారపాలకునిగా ఉంచి వారిద్దరూ లోపలకు వెళ్లారు.

**చిరం విహృత్య తత్ర ద్వౌ స్వతంత్రౌ పరమేశ్వరౌ ।**
**బభూవతుః ప్రసన్నౌ తౌ నానాలీలాకరౌ మునే! ॥ 4 ॥**

ఓ మహర్షీ! స్వతంత్రులు, పరమేశ్వరులు, నానాలీలాకరులునైన వారిరువురూ ప్రసన్నమైన మనస్సు గలవారై చిరకాలం విహరించారు.

**అథోన్మత్తాకృతిర్దేవీ స్వతంత్రా లీలయా శివా ।**
**ఆగతా ద్వారి తద్రూపా ప్రభోరాజ్ఞామవాప సా ॥ 5 ॥**

తరువాత పార్వతీదేవి అతిసుందర రూపం దాల్చి శివాజ్ఞను పొంది లీలలను ప్రకటించడంలో స్వతంత్రురాలై ద్వారం వద్దకు వచ్చింది.

**తాం దేవీం భైరవస్సోఽథ నారీదృష్ట్యా విలోక్య చ ।**
**నిషిషేధ బహిర్గంతుం తద్రూపేణ విమోహితః ॥ 6 ॥**

భైరవుడు అప్పుడా దేవిని గాంచి, ఆమె రూపంచే మోహితుడై ఆమెను సామాన్య స్త్రీగా భావించి, ఆమెను బయటకు వెళ్లకుండ అడ్డగించాడు.

**నారీదృష్ట్యా సుదృష్టా సా భైరవేణ యదా మునే! ।**
**క్రుద్ధాఽభవచ్ఛివా దేవీ తం శశాప తదాంబికా ॥ 7 ॥**

ఓ మహర్షీ! భైరవుడు ఆమెను సామాన్య స్త్రీగా భావించుటను గాంచి, జగన్మాతయైన పార్వతీదేవి మిక్కిలి కోపించి, అతనిని శపించింది.

**పార్వత్యువాచ –** పార్వతీ దేవి పలికింది.

**నారీదృష్ట్యా పశ్యసి త్వం యతో మాం పురుషాధమ! ।**
**అతో భవ ధరాయాం హి మానుషస్త్వం చ భైరవ! ॥ 8 ॥**

"ఓ పురుషాధమా! భైరవా! నీవు నన్ను స్త్రీ యనే దృష్టితో చూశావు. ఈ కారణంచే నీవు భూలోకంలో మానవుడవై జన్మించు" అని శపించింది.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్థం యదాఽభవచ్ఛప్తో భైరవశ్శివయా మునే! ।**
**హాహాకారో మహానాసీద్దుఃఖమాప స లీలయా ॥ 9 ॥**

ఓ మహర్షీ! భైరవుని పార్వతీ దేవి ఇట్లు శపించగా, పెద్ద హాహాకారాలు చెలరేగాయి. అతడు లీలచే దుఃఖాన్ని పొందాడు.

**తతశ్చ శంకరః శీఘ్రం తమాగత్య మునీశ్వర! ।**
**ఆశ్వాసయద్భైరవం హి నానాఽనునయకోవిదః ॥ 10 ॥**

ఓ మునీశ్వరా! అంతట అనేక విధాల అనునయించడంలో నిపుణుడైన శంకరుడు వెంటనే అచ్చటకు వచ్చి భైరవుని ఓదార్చాడు.

**తచ్ఛాపాద్భైరవస్సోఽథ క్షితావవతరన్మునే! ।**
**మనుష్యయోన్యాం వైతాలసంజ్ఞకశ్శంకరేచ్ఛయా ॥ 11 ॥**

ఓ మహర్షీ! శంకరేచ్ఛచేతను, పార్వతీదేవి శాపంచేతను, భైరవుడు భూలోకంలో వైతాళుడనే పేరుతో మానవుడుగా అవతరించాడు.

**తత్స్నేహతః శివః సోఽపి క్షితావవాతరద్విభుః ।**
**శివయా సహ సల్లీలో లౌకికీం గతిమాశ్రితః ॥ 12 ॥**

భైరవునియందలి ప్రేమచే శివుడు కూడ పార్వతీదేవితో గూడి భూలోకంలో అవతరించి లౌకికగతినాశ్రయించి, అనేక లీలలను ప్రకటించాడు.

**మహేశాహ్వః శివశ్చాసీచ్ఛారదా గిరిజా మునే! ।**
**సులీలాం చక్రతుః ప్రీత్యా నానా లీలా విశారదౌ ॥ 13 ॥**

ఓ మునీశ్వరా! శివుడు మహేశుడనే పేరుతోను, పార్వతి శారద అనే పేరుతోను అవతరించారు. నానాలీలావిశారదులైన వారిరువురు, ప్రీతితో చక్కటి లీలల్ని చేశారు.

**ఇతి తే కథితం తాత! మహేశచరితం వరమ్ ।**
**ధన్యం యశస్యమాయుష్యం సర్వకామఫలప్రదమ్ ॥ 14 ॥**

ఓ వత్సా! నేను నీకింతవరకు శ్రేష్ఠమూ, ధన్యమూ, యశస్యమూ, ఆయుష్యమూ, సర్వకామఫలప్రదమూనైన మహేశచరితను చెప్పియున్నాను.

**య ఇదం శృణుయాద్భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।**
**స భుక్త్వేహాఖిలాన్భోగానంతే మోక్షమవాప్నుయాత్ ॥ 15 ॥**

ఎవడైతే దీనిని భక్తితో వింటాడో, లేక ఏకాగ్రమైన మనస్సుతో వినిపిస్తాడో, వాడు ఈ లోకంలో సమస్తభోగాలను అనుభవించి, మరణించిన తరువాత మోక్షాన్ని పొందుతాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం మహేశావతారవర్ణనం నామైకవింశోఽధ్యాయః ॥ 21 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు మహేశావతారవర్ణనం అనే పేరుగల ఇరవైఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్వావింశోఽధ్యాయః - ఇరవైరెండవ అధ్యాయం
## విష్ణూపద్రవవృషావతారవర్ణనమ్ - విష్ణూపద్రవవృషావతారవర్ణనం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**శృణు బ్రహ్మసుత! ప్రాజ్ఞ! వృషేశాఖ్యం మునీశ్వర! ।**
**శివావతారం సల్లీలం హరిగర్వహరం వరమ్ ॥ 1 ॥**

ఓ బ్రహ్మపుత్రా! మునీశ్వరా! ప్రాజ్ఞా! శివుని వృషేశ్వరావతారాన్ని గూర్చి వినుము. శ్రేష్ఠమైన ఈ అవతారంలో శివుడు విష్ణువు గర్వాన్ని పోగొట్టి మంచి లీలల్ని ప్రదర్శించాడు.

**పురా దేవాసురాః సర్వే జరామృత్యుభయార్దితాః ।**
**పరస్పరం చ సంధాయ రత్నాన్యాదిత్సవోఽభవన్ ॥ 2 ॥**

పూర్వం దేవాసురులందరూ, జరామరణాల భయంచే పీడింపబడినవారై పరస్పరం సంప్రదించుకొని, రత్నాలను సంపాదించాలని నిర్ణయించారు.

**తతః సురాసురాః సర్వే క్షీరోదం సాగరోత్తమమ్ ।**
**ఉద్యతా మథితుం తం చ బభూవుర్మునినందన! ॥ 3 ॥**

ఓ మహర్షీ! తరువాత దేవాసురులందరు కలిసి సముద్రాలలో ఉత్తమమైన క్షీరసముద్రాన్ని మథించడానికి సిద్ధమయ్యారు.

**ఆసన్ శుచిస్మితాస్సర్వే కేనేదం మంథనం భవేత్ ।**
**స్వకార్యసిద్ధయే తస్య బ్రహ్మన్నితి సురాసురాః ॥ 4 ॥**

ఓ మహర్షీ! తాము కోరుకున్న శ్రేష్ఠ వస్తువులు లభించడానికి ఈ సముద్రాన్ని దేనితో మథించాలోనని దేవతలు, రాక్షసులు పరస్పర మైత్రీ భావనతో ఆలోచింపసాగారు.

**తదా నభోగతా వాణీ మేఘగంభీరనిస్వనా ।**
**ఉవాచ దేవాన్ దైత్యాంశ్చ శ్వాసయంతీశ్వరాజ్ఞయా ॥ 5 ॥**

అప్పుడు ఈశ్వరాజ్ఞచే ఆకాశవాణి మేఘగంభీరధ్వనితో దేవదానవులనందరినీ ఓదారుస్తూ ఇలా పలికింది.

**నభోవాణ్యువాచ** - ఆకాశవాణి పలికింది.

**హే దేవా అసురాశ్చైవ మంథధ్వం క్షీరసాగరమ్ ।**
**భవతాం బలబుద్ధిర్హి భవిష్యతి న సంశయః ॥ 6 ॥**

ఓ దేవతలారా! రాక్షసులారా! క్షీరసాగరాన్ని మథించండి. మీ బలం, బుద్ధి సఫలం కాగలవు. సందేహం లేదు.

**మందరం చైవ మంథానం రజ్జుం కురుత వాసుకిమ్ ।**
**మిథస్సర్వే మిళిత్వా తు మంథనం కురుతాదరాత్ ॥ 7 ॥**

మందర పర్వతాన్ని కవ్వంగా, వాసుకిని త్రాడుగా చేసి, మీరందరు పరస్పర సహకారంతో శ్రద్ధాపూర్వకంగా మథించండి.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**నభోగతాం తదా వాణీం నిశమ్యాథ సురాసురాః ।**
**ఉద్యోగం చక్రిరే సర్వే తత్కర్తుం మునిసత్తమ! ॥ 8 ॥**

ఓ మునీశ్వరా! అప్పుడు సురాసురులందరు ఆకాశవాణిని విని అందరు కలిసి మథించడానికి ప్రయత్నాలనారంభించారు.

**సుసంధాయాఖిలాస్తే వై మందరం పర్వతోత్తమమ్ ।**
**కనకాభం చ సరళం నానాశోభార్చితం యయుః ॥ 9 ॥**

వారందరూ చక్కగా నిర్ణయించుకొని బంగారం వలె ప్రకాశిస్తూ, అనేక శోభలతో అలరారేదియు, పర్వతోత్తమమైనట్టియు మందరపర్వతంవద్దకు తేలికగా చేరుకున్నారు.

**సుప్రసాద్య గిరీశం తం తదాజ్ఞప్తాః సురాసురాః ।**
**బలాదుత్పాటయామాసుర్నేతుకామాః పయోఽర్ణవమ్ ॥ 10 ॥**

సురాసురులు ఆ పర్వతరాజును ప్రసన్నం చేసుకొని, ఆయన అనుమతిని పొంది, క్షీరసముద్రంవద్దకు తీసుకొని పోవడానికి బలవంతంగా ఊడబెరికారు.

**భుజైరుత్పాట్య తే సర్వే జగ్ముః క్షీరార్ణవం మునే! ।**
**అశక్తా అభవంస్తత్ర తమానేతుం హతౌజసః ॥ 11 ॥**

ఓ మహర్షీ! వారందరు ఆ పర్వతాన్ని ఊడబెరికి, భుజాలపై క్షీరసముద్రానికి తీసికొని పోవడానికి ప్రయత్నించారు. కాని సన్నగిల్లిన బలంగల సురాసురులు ఆ పర్వతాన్ని సముద్రం వరకు తీసికొనిరాలేకపోయారు.

**తద్భుజైస్స పరిభ్రష్టః పతితో మందరో గిరిః ।**
**సహసాతి గురుస్సద్యో దేవదైత్యోపరి ధ్రువమ్ ॥ 12 ॥**

మిక్కిలి అధికమైన భారం గల ఆ మందరపర్వతం వారి భుజాల నుండి జారి దేవదానవులపై పడింది.

**ఏవం భగ్నోద్యమా భగ్నాః సంబభూవుస్సురాసురాః ।**
**చేతనాః ప్రాప్య చ తతస్తుష్టువుర్జగదీశ్వరమ్ ॥ 13 ॥**

ఈ విధంగా దేవదానవుల ఉద్యమం విఫలమయింది. వారు తెలివిని తెచ్చుకొని, జగదీశ్వరుని స్తుతించారు.

**తదిచ్ఛయోద్యతాస్సర్వే పునరుత్థాప్య తం గిరిమ్ ।**
**నిచిక్షిపుర్జలే నీత్వా క్షీరోదస్యోత్తరే తటే ॥ 14 ॥**

ఈశ్వరేచ్ఛచేత వారందరు మరల ఉద్యమించి ఆ పర్వతాన్ని మరల పైకెత్తి క్షీరసముద్రంయొక్క ఉత్తరతీరం వరకు తీసుకుని వెళ్లి నీటిలో పడవేశారు.

**తతస్సురాసురగణా రజ్జుం కృత్వా చ వాసుకిమ్ ।**
**రత్నాన్యాదాతుకామాస్తే మమంథుః క్షీరసాగరమ్ ॥ 15 ॥**

అనంతరం సురాసురగణమంతా, రత్నాలను సంపాదించాలనే కోరిక గలవారై వాసుకిని త్రాడుగా చేసి క్షీరసాగరాన్ని మథించారు.

**క్షీరోదే మథ్యమానే తు శ్రీస్స్వర్లోకమహేశ్వరీ ।**
**సముద్భూతా సముద్రాచ్చ భృగుపుత్రీ హరిప్రియా ॥ 16 ॥**

క్షీరసాగరాన్ని మథిస్తుండగా స్వర్లోకమహేశ్వరి, భృగుపుత్రి, హరిప్రియురాలైన లక్ష్మీదేవి సముద్రంనుండి పుట్టినది.

**ధన్వంతరిః శశాంకశ్చ పారిజాతో మహాద్రుమః ।**
**ఉచ్చైశ్శ్రవాశ్చ తురగో గజ ఐరావతస్తథా ॥ 17 ॥**

ధన్వంతరి, చంద్రుడు, పారిజాతవృక్షం, ఉచ్చైశ్శ్రవమనే గుర్రం, ఐరావతమనే ఏనుగు,

**సురా హరిధనుశ్శంఖో గావః కామదుఘాస్తతః ।**
**కౌస్తుభాఖ్యో మణిశ్చైవ తథా పీయూషమేవ చ ॥ 18 ॥**

కోర్కెలను వర్షించు ధేనువులు, విష్ణువుయొక్క ధనుస్సు, శంఖం, కౌస్తుభమణి, అనంతరం అమృతం కూడ క్షీరసముద్రంనుండి పుట్టాయి.

**పునశ్చ మథ్యమానే తు కాలకూటం మహావిషమ్ ।**
**యుగాంతానలభం జాతం సురాసురభయావహమ్ ॥ 19 ॥**

మరల మథిస్తూ ఉండగా ప్రళయకాలాగ్నిని బోలినట్టియు, దేవదానవులకు భయావహమైనట్టియు, కాలకూటమనే మహావిషం పుట్టింది.

**పీయూషజన్మకాలే తు బిందవో యే బహిర్గతాః ।**
**తేభ్యః కాంతాః సముద్భూతా బహ్వ్యో హ్యద్భుతదర్శనాః ॥ 20 ॥**

అమృతం పుట్టిన సమయంలో బయటపడిన బిందువులనుండి సుందరాకారులైన యువతులనేకులు జన్మించారు.

**శరత్పూర్ణేందువదనాస్తడిత్సూర్యానలప్రభాః ।**
**హారకేయూరకటకైర్దివ్యరత్నైరలంకృతాః ॥ 21 ॥**

వారు శరత్కాలమందలి పూర్ణిమనాటి చంద్రుని వంటి ముఖాలు గలవారై, మెరుపు, సూర్యుడు, అగ్నివంటి కాంతులుగలవారై, హారకేయూర కటకాదులతోను, దివ్యరత్నాలతోను అలంకరింపబడినవారై శోభిల్లుతున్నారు.

**లావణ్యామృతతోయేన తాస్సించంత్యో దిశో దశ ।**
**జగదున్మాదయంత్యేవ భ్రూభంగాయతవీక్షణాః ॥ 22 ॥**

వారు తమ లావణ్యామృతజలాలతో దశదిశలను తడుపుతూ, కనుబొమ్మల విరుపులతో కూడిన చూపులతో జగత్తునకున్మాదాన్ని కలిగిస్తున్నారు.

**కోటిశస్తాః సముత్పన్నాస్త్వమృతాత్కామనిస్సృతాః ।**
**తతోఽమృతం సముత్పన్నం జరామృత్యునివారణమ్ ॥ 23 ॥**

బయటపడిన అమృతబిందువుల నుండి వీరు కోట్ల సంఖ్యలో జన్మించారు. అనంతరం జరామరణాలను నివారించే అమృతం సముత్పన్నమయ్యింది.

**లక్ష్మీం శంఖం కౌస్తుభం చ ఖడ్గం జగ్రాహ కేశవః ।**
**జగ్రాహార్కో హయం దివ్యముచ్చైఃశ్రవసమాదరాత్ ॥ 24 ॥**

**పారిజాతం తరువరమైరావతమిభేశ్వరమ్ ।**
**శచీపతిశ్చ జగ్రాహ నిర్జరేశో మహాదరాత్ ॥ 25 ॥**

లక్ష్మిని, శంఖాన్ని, కౌస్తుభాన్ని, ఖడ్గాన్ని విష్ణువు స్వీకరించాడు. సూర్యుడు ఉచ్చైశ్శ్రవమనే దివ్యాశ్వాన్ని ఆదరంతో స్వీకరించాడు. పారిజాతమహావృక్షాన్ని, ఐరావతమనే ఏనుగును, శచీపతియు, దేవతాధిపతియునైన ఇంద్రుడు ఆదరంతో స్వీకరించాడు.

**కాలకూటం శశాంకం చ దేవత్రాణాయ శంకరః ।**
**స్వకంఠే ధృతవాన్ శంభుః స్వేచ్ఛయా భక్తవత్సలః ॥ 26 ॥**

శంకరుడు చంద్రుని స్వీకరించాడు. అంతేగాక భక్తవత్సలుడైన శంకరుడు దేవతలను రక్షించాలనే ఆకాంక్షతో కాలకూటాన్ని గ్రహించి తన కంఠంలో ధరించాడు.

**దైత్యాస్సురాఖ్యాం రమణీమీశ్వరాజ్ఞావిమోహితాః ।**
**జగృహుః సకలా వ్యాస! సర్వే ధన్వంతరిం జనాః ॥ 27 ॥**

ఓ వ్యాసా! ఈశ్వరుని మాయచే మోహితులైన రాక్షసులందరు ఆనందాన్నిచ్చే సురను స్వీకరించారు. సామాన్యజనులందరు ధన్వంతరిని స్వీకరించారు.

**జగృహుర్మునయస్సర్వే కామధేనుం మునీశ్వరాః ।**
**సామాన్యత స్త్రియస్తాశ్చ స్థితా ఆసన్విమోహితాః ॥ 28 ॥**

మునీశ్వరులందరు కామధేనువును స్వీకరించారు. మోహాన్ని కలిగించే ఆ స్త్రీలు సామాన్య రూపంలో నిలచియున్నారు.

**అమృతార్థం మహాయుద్ధం సంబభూవ జయైషిణామ్ ।**
**సురాణామసురాణాం చ మిథః సంక్షుబ్ధచేతసామ్ ॥ 29 ॥**

సురాసురులు మిక్కిలి క్షోభిల్లిన మనస్సు గలవారై ఒకరినొకరు జయించాలనే ఆకాంక్షతో, అమృతంకొరకు మహాయుద్ధం చేశారు.

**హృతం సోమం చ దైతేయైర్బలాద్దేవాన్విజిత్య చ ।**
**బలిప్రభృతిభిర్వ్యాస! యుగాంతాగ్న్యర్కసుప్రభైః ॥ 30 ॥**

ఓ వ్యాసా! కల్పాంతమందలి అగ్నివలె, మరియు సూర్యుని వలె ప్రకాశించే బలి మొదలగు రాక్షసులు తమ బలంచే దేవతలను జయించి, అమృతాన్ని లాగుకొన్నారు.

**దేవాశ్శంకరమాపన్నా విహ్వలాశ్శివమాయయా ।**
**సర్వే శక్రాదయస్తాత! దైతేయైరర్దితా బలాత్ ॥ 31 ॥**

అంతట శివమాయచే దుఃఖితులైనట్టియు, రాక్షసులచే బలంగా పీడింపబడినట్టియు, ఇంద్రాది దేవతలందరు శంకరుని శరణువేడారు.

**తతస్తదమృతం యత్నాత్ స్త్రీస్వరూపేణ మాయయా ।**
**శివాజ్ఞయా రమేశేన దైత్యేభ్యశ్చ హృతం మునే! ॥ 32 ॥**

ఓ మునీ! అప్పుడు శివాజ్ఞచే విష్ణువు తన మాయాప్రభావంచే స్త్రీ రూపాన్నిధరించి, ఆ అమృతాన్ని జాగ్రత్తగా రాక్షసులవద్ద నుండి తెచ్చాడు.

**అపాయయత్సురాంస్తాంశ్చ మోహినీస్త్రీస్వరూపధృక్ ।**
**మోహయిత్వా సురాన్సర్వాన్ హరిర్మాయావినాం వరః ॥ 33 ॥**

మాయావులలో శ్రేష్ఠుడైన విష్ణువు మోహినియనే స్త్రీ రూపాన్ని ధరించి రాక్షసులనందరినీ మోహింపజేసి, దేవతలచే అమృతాన్ని త్రాగించాడు.

**గత్వా నికటమేతస్యా ఊచిరే దైత్యపుంగవాః ।**
**పాయయస్వ సుధామేతాం మా భూద్భేదోఽత్ర పంక్తిషు ॥ 34 ॥**

దైత్యశ్రేష్ఠులు ఆమె వద్దకు వెళ్లి “ఈ అమృతాన్ని పంక్తిభేదం లేని విధంగా పంచిపెట్టు” అని పలికారు.

**ఏతదుక్త్వా దదుస్తస్మై విష్ణవే ఛలరూపిణే ।**
**తే దైత్యా దానవాః సర్వే శివమాయావిమోహితాః ॥ 35 ॥**

శివమాయా మోహితులైన దైత్యదానవులందరు ఇట్లు పలికి మాయారూపాన్ని దాల్చిన విష్ణువునకు అమృతాన్ని అప్పగించారు.

**ఏతస్మిన్నంతరే దృష్ట్వా స్త్రియో దానవపుంగవాః ।**
**అనయన్నమృతోద్భూతా యథాస్థానం యథాసుఖమ్ ॥ 36 ॥**

ఇంతలో అమృతం నుండి పుట్టిన స్త్రీలు వారికి కనబడ్డారు. వారు వారిని సంతోషంతో తమ తమ స్థానాలకు తోడ్కొని పోయారు.

**తాసాం పురాణి దివ్యాని స్వర్గాచ్ఛతగుణాన్యపి ।**
**ఘోరైర్యంత్రైస్సుగుప్తాని మయమాయాకృతాని చ ॥ 37 ॥**

**సురక్షితాని సర్వాణి కృత్వా యుద్ధాయ నిర్యయుః ।**
**అస్పృష్టవక్షసో దైత్యాః కృత్వా సమయమేవ హి ॥ 38 ॥**

**న స్పృశామః స్త్రియశ్చేమా యది దేవైర్వినిర్జితాః ।**
**ఇత్యుక్త్వా తే మహావీరా దైత్యాస్సర్వే యుయుత్సవః ॥ 39 ॥**

**సింహనాదం తతశ్చక్రుశ్శంఖాన్ దధ్ముః పృథక్ పృథక్ ।**
**పూరయన్త ఇవాకాశం తర్పయంతో బలాహకాన్ ॥ 40 ॥**

మయుని మాయచే నిర్మింపబడి, భయంకరమైన యంత్రాలచే గొప్పగా రక్షింపబడుతున్న వారి నగరాలు స్వర్గంకంటె వందరెట్లు దివ్యంగాఉన్నాయి. రాక్షసులు తమ నగరాలన్నింటికి రక్షణవ్యవస్థను చక్కగాచేసి, గుండెలను చేతులతో స్పృశించి ప్రతిజ్ఞను చేసి, యుద్ధానికి బయలుదేరారు. మేము దేవతల చేతిలో ఓడిపోయినచో ఈ స్త్రీలను స్పృశించమని పలికి మహావీరులగు రాక్షసులందరు యుద్ధోత్సాహంతో సింహనాదాన్ని చేసి, అనంతరం వేర్వేరుగా శంఖాలను పూరించారు. వారి శంఖధ్వని ఆకాశం నిండేటట్లు సర్వత్రా వ్యాపించింది. వారు స్వర్గంకొరకు మేఘాలను ప్రార్థిస్తున్నారా? అన్నట్లు ఉన్నారు.

**యుద్ధం బభూవ దేవానామసురైస్సహ భీకరమ్ ।**
**దేవాసురాఖ్యమతులం ప్రసిద్ధం భువనత్రయే ॥ 41 ॥**

దేవతలకు రాక్షసులతో భీకరసంగ్రామం జరిగింది. ఆ యుద్ధం దేవాసురసంగ్రామమనే పేరుతో ముల్లోకాలలోనూ ఖ్యాతిని పొందింది.

**జయం ప్రాపుస్సురాస్సర్వే విష్ణునా పరిరక్షితాః ।**
**దైత్యాః పలాయితాస్తత్ర హతాః సామరవిష్ణునా ॥ 42 ॥**

విష్ణువుచే పరిరక్షింపబడిన దేవతలందరు విజయాన్ని పొందారు. దేవతలతో కూడిన విష్ణువుచే కొట్టబడినవారై దైత్యులందరు పలాయనం చిత్తగించారు.

**దైత్యాః సంమోహితా దేవైర్విష్ణునా చ మహాత్మనా ।**
**హతావశిష్టాః పాతాళం వివిశుర్వివరాణి చ ॥ 43 ॥**

మహాత్ముడైన విష్ణువు, మరియు దేవతలు రాక్షసులను సమ్మోహితుల్ని చేశారు. మిగిలినవారు గుహలలో దాగారు. మరికొందరు పాతాళలోకంలో ప్రవేశించారు.

**అనువవ్రాజ తాన్విష్ణుశ్చక్రపాణిర్మహాబలః ।**
**పాతాళం పరమం గత్వా సంస్థితాన్భీతభీతవత్ ॥ 44 ॥**

పాతాళపు కోనలలోనికి పోయి మహాభయంతో దాగిన రాక్షసుల వెనుక మహాబలుడగు విష్ణువు చక్రాన్ని చేతబట్టి అనుసరించాడు.

**ఏతస్మిన్నంతరే విష్ణుర్దదర్శామృతసంభవాః ।**
**కాంతాః పూర్ణేందువదనా దివ్యలావణ్యగర్వితాః ॥ 45 ॥**

ఇంతలో పూర్ణ చంద్రుని పంచముఖాలతో, దివ్యసౌందర్యంతో, అమృతం నుండి ప్రకాశిస్తూ గర్వించియున్న యువతులను విష్ణువు చూశాడు.

**సంమోహితః కామబాణైర్లేభే తత్రైవ నిర్వృతిమ్ ।**
**తాభిశ్చ వరనారీభిః క్రీడమానో బభూవ హ ॥ 46 ॥**

అతడు మన్మథబాణాలచే సమ్మోహితుడై ఆ సుందర యువతులతో క్రీడిస్తూ, అక్కడనే ఆనందంగా నున్నాడు.

**తాభ్యః పుత్రానజనయద్విష్ణుర్వరపరాక్రమాన్ ।**
**మహీం సర్వాం కంపయతో నానాయుద్ధవిశారదాన్ ॥ 47 ॥**

విష్ణువు వారితోగూడి పరాక్రమవంతులైన పుత్రులను పొందాడు. వివిధ యుద్ధాలలో దక్షులైన, ఆ కుమారులు భూమినంతటిని వణికింపజొచ్చారు.

**తతో వై హరిపుత్రాస్తే మహాబలపరాక్రమాః ।**
**మహోపద్రవమాచేరుః స్వర్గే భువి చ దుఃఖదమ్ ॥ 48 ॥**

మహాబలపరాక్రమసంపన్నులైన హరిపుత్రులు స్వర్గంలోను, భూలోకంలోను, గొప్ప ఉపద్రవాలను కలిగించి దుఃఖాన్ని కలుగజేస్తున్నారు.

**లోకోపద్రవమాలక్ష్య నిర్జరా మునయోఽథ వై ।**
**చక్రుర్నివేదనం తేషాం బ్రహ్మణే ప్రణిపత్య చ ॥ 49 ॥**

లోకోపద్రవాన్ని చూచి దేవతలు, మునులు బ్రహ్మకు నమస్కరించి వారి గురించి విన్నవించారు.

**తచ్ఛ్రుత్వాఽఽదాయ తాన్ బ్రహ్మా యయౌ కైలాసపర్వతమ్ ।**
**తత్ర దృష్ట్వా శివం దేవైః ప్రణనామ పునః పునః ॥ 50 ॥**

వారి మాటలనువిన్న బ్రహ్మ వారిని తీసుకొని కైలాస పర్వతానికి వెళ్లి శివుని చూచి అనేకసార్లు నమస్కరించాడు.

**తుష్టావ వివిధైః స్తోత్రైర్నతస్కంధః కృతాంజలిః ।**
**జయ దేవ! మహాదేవ! సర్వస్వామిన్నితి బ్రువన్ ॥ 51 ॥**

తలవంచి, చేతులు జోడించి, 'దేవా! మహాదేవా! సర్వప్రభూ! జయమగు గాక' అని పలుకుతూ, వివిధ స్తోత్రాలతో స్తుతించాడు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**దేవదేవ! మహాదేవ! లోకాన్రక్షాఖిలాన్ప్రభో! ।**
**ఉపద్రుతాన్విష్ణుపుత్రైః పాతాళస్థై ర్వికారిభిః ॥ 52 ॥**

ఓ దేవదేవా! మహాదేవా! ప్రభూ! పాతాళమునందు నివసించి, గర్వాదిమనోవికారాలుగలవారై లోకాలన్నింటికి ఇబ్బందులను కలిగిస్తున్న విష్ణుపుత్రులనుండి లోకాలను రక్షించండి.

**నారీష్వమృతభూతాసు సంసక్తాత్మా హరిర్విభో! ।**
**పాతాళే తిష్ఠతీదానీం రమతే హి వికారవాన్ ॥ 53 ॥**

ఓ విభూ! అమృతంనుండి జన్మించిన యువతులయందు మనస్సులగ్నమైన విష్ణువు కామవికారం గలవాడై పాతాళంలో నివసిస్తూ ఆ యువతులతో రమిస్తున్నాడు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్థం బహుస్తుతః శంభుర్బ్రహ్మణా సర్షినిర్జరైః ।**
**లోకసంరక్షణార్థాయ విష్ణోరానయనాయ చ ॥ 54 ॥**

బ్రహ్మ, ఋషులు, దేవతలు లోకాలను రక్షించుమనియు, విష్ణువును వెనుకకు రప్పింపుమనియు పరిపరి విధముల శంభుని ప్రార్థించారు.

**తతస్స భగవాన్ శంభుః కృపాసింధుర్మహేశ్వరః ।**
**తదుపద్రవమాజ్ఞాయ వృషరూపో బభూవ హ ॥ 55 ॥**

అంతట దయానిధి, మహేశ్వరుడునగు శంభుడు ఆ ఉపద్రవాన్ని గుర్తించి, వృషభావతారాన్ని ధరించాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం విష్ణూపద్రవవృషావతారవర్ణనం నామ ద్వావింశోఽధ్యాయః ॥ 22 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు విష్ణూపద్రవవృషావతారవర్ణనం అనే పేరుగల ఇరవైరెండవ అధ్యాయం సమాప్తం.

# త్రయోవింశోఽధ్యాయః - ఇరవైమూడవ అధ్యాయం

## వృషేశ్వరసంజ్ఞకశివావతారవర్ణనమ్ - వృషేశ్వరుడనుశివావతారవర్ణనం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**తతో వృషభరూపేణ గర్జమానః పినాకధృక్ ।**
**ప్రవిష్టో వివరం తత్ర నినదన్ భైరవాన్నవాన్ ॥ 1 ॥**

అనంతరం పినాకధారియైన శివుడు వృషభరూపంతో భీకరంగా గర్జిస్తూ వింతవింతగ నినాదాలుచేస్తూ పాతాళ వివరంలో ప్రవేశించాడు.

**నిపేతుస్తస్య నినదైః పురాణి నగరాణి చ ।**
**ప్రకంపో హి బభూవాథ సర్వేషాం పురవాసినామ్ ॥ 2 ॥**

ఆ వృషభగర్జనలకు పురాలు నగరాలు నేల కూలాయి. పురవాసులందరు భయకంపితులయ్యారు.

**తతో వృషో హరేః పుత్రాన్ సంగ్రామోద్యతకార్ముకాన్ ।**
**శివమాయావిమూఢాత్మమహాబలపరాక్రమాన్ ॥ 3 ॥**

అంతట సంగ్రామోద్యుతులై ధనుస్సులను ధరించిన వారును, శివమాయా వ్యామోహాన్ని పొందిన మనస్సు గలవారును, మహాబలపరాక్రమవంతులునైన విష్ణుపుత్రులను ఆ వృషభం ఎదుర్కొనెను.

**హరిపుత్రాస్తతస్తేఽథ ప్రాకుప్యన్మునిసత్తమ! ।**
**ప్రదుద్రువుః ప్రగర్జ్యోచ్చైర్వీరా శ్శంకరసన్ముఖమ్ ॥ 4 ॥**

ఓ మునిశ్రేష్ఠా! అంతట ఆ విష్ణుపుత్రులు మిక్కిలి కోపించి, బిగ్గరగా గర్జించి, శంకరునకభిముఖంగా పరుగులెత్తారు.

**ఆయాతాంస్తాన్హరేః పుత్రాన్రుద్రో వృషభరూపధృక్ ।**
**ప్రాకుప్యద్విష్ణుపుత్రాంశ్చ ఖురైశ్శృంగైర్వ్యదారయత్ ॥ 5 ॥**

వృషభరూపాన్ని ధరించియున్న రుద్రుడు కోపించి తనపై దండెత్తిన విష్ణుపుత్రులను గిట్టలతోను, కొమ్ములతోను చీల్చివేశాడు.

**విదారితాంగా రుద్రేణ సర్వే హరిసుతాశ్చ తే ।**
**నష్టా ద్రుతం సన్బభూవుర్గతప్రాణా విచేతసః ॥ 6 ॥**

రుద్రునిచే చీల్చబడిన అవయవాలుగల విష్ణుపుత్రులందరు శీఘ్రంగా ప్రాణాలను కోల్పోయారు.

**హతేషు తేషు పుత్రేషు విష్ణుర్బలవతాం వరః ।**
**నిష్క్రమ్యాథ ప్రణమ్యోచ్చైర్యయౌ శీఘ్రం హరాంతికమ్ ॥ 7 ॥**

తన పుత్రులు మరణించగా విష్ణువు బయటకువచ్చి, బిగ్గరగా గర్జించి, శీఘ్రంగా శివునివద్దకు వెళ్లాడు.

**దృష్ట్వా రుద్రం ప్రవ్రజంతం హతవిష్ణుసుతం వృషమ్ ।**
**శరైస్సంతాడయామాస దివ్యైరస్త్రైశ్చ కేశవః ॥ 8 ॥**

విష్ణుపుత్రులను సంహరించి, వృషభాకారంతో ముందుకు సాగుతున్న రుద్రుని గాంచి, కేశవుడు దివ్యమైన శస్త్రాస్త్రాలతో ఆయనను కొట్టాడు.

**తతః క్రుద్ధో మహాదేవో వృషరూపీ మహాబలః ।**
**అస్త్రాణి తాని విష్ణోశ్చ జగ్రాస గిరిగోచరః ॥ 9 ॥**

మహాబలశాలి, వృషభావతారుడునైన మహాదేవుడు గొప్పకోపాన్ని పొంది, విష్ణువు ప్రయోగించిన అస్త్రాలనన్నింటిని మ్రింగివేశాడు.

**అథ కృత్వా మహాకోపం వృషాత్మా స మహేశ్వరః ।**
**వినినాద మహాఘోరం కంపయంస్త్రిజగన్మునే! ॥ 10 ॥**

ఓ మునీశ్వరా! అంతట వృషభరూపంలోనున్న మహేశుడు గొప్ప కోపంతో, ముల్లోకాలు కంపించేటట్లు అతిభయంకరమైన నాదాన్ని చేశాడు.

**తతో విష్ణుంచ తరసా ఖురైః శృంగైర్వ్యదారయత్ ।**
**విష్ణుం క్రోధాకులం మూఢమజానంతం నిజం హరిమ్ ॥ 11 ॥**

అనంతరం రుద్రుడు విష్ణువు పైకి ఎగిరి విష్ణువును గిట్టలతోను, కొమ్ములతోను చీల్చివేశాడు. మూఢుడు, క్రోధాకులుడునైన విష్ణువు తాను విష్ణువునను సంగతిని మరచిపోయాడు.

**తతస్స శిథిలాత్మాహి వ్యథితాంగో బభూవ హ ।**
**తత్ప్రహారమసహ్యాశు హరిర్మాయావిమోహితః ॥ 12 ॥**

మాయామోహితుడైన విష్ణువు అపుడు శిథిలమైన దేహం గలవాడై, రుద్రునిదెబ్బలకు తాళలేకపోయాడు.

**గతగర్వో హరిశ్చైవ విచేతా గతచేతనః ।**
**జ్ఞాతవాన్ పరమేశానం విహరన్తం వృషాత్మనా ॥ 13 ॥**

తొలగిన గర్వము, నశించిన శక్తి, అకులిత బుద్ధియు కలవాడైన విష్ణువు వృషభరూపంలో విహరిస్తున్న పరమేశ్వరుని గుర్తించాడు.

**అథ విజ్ఞాయ గౌరీశమాగతం వృషరూపతః ।**
**ప్రాహ గంభీరయా వాచా నతస్కంధః కృతాంజలిః ॥ 14 ॥**

గౌరీపతియే వృషభరూపంలో వచ్చినాడని యెరిగి, విష్ణువు తలవంచి, చేతులు జోడించి, గంభీరమైన వాక్కుతో ఇలా పలికాడు.

**హరిరువాచ** - హరి పలికాడు.

**దేవదేవ! మహాదేవ! కరుణాసాగర! ప్రభో! ।**
**మాయయా తే మహేశాన! మోహితోఽహం విమూఢధీః ॥ 15 ॥**

ఓ దేవదేవా! మహాదేవా! కరుణాసాగరా! ప్రభో! నీ మాయచే నేను మోహితుడనై వివేకాన్ని కోల్పోయాను.

**కృతం యుద్ధం త్వయేశేన స్వనాథేన మయా ప్రభో! ।**
**కృపాం కృత్వా మయి స్వామిన్! సాపరాధో హి సహ్యతామ్ ॥ 16 ॥**

ఓ ప్రభూ! నా ప్రభువైన నీతో యుద్ధం చేశాను. నాయందు దయను చూపి ఆ అపరాధాన్ని సహించండి.

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**తస్య తద్వచనం శ్రుత్వా హరేర్దీనతయా మునే! ।**
**భగవాన్ శంకరః ప్రాహ రమేశం భక్తవత్సలః ॥ 17 ॥**

ఓ మహర్షీ! విష్ణువుయొక్క దీనవచనాలను విని, భక్తవత్సలుడైన శంకరుడు లక్ష్మీపతితో ఇలా పలికాడు.

**హే విష్ణో! హే మహాబుద్ధే! కథం మాం జ్ఞాతవాన్నహి ।**
**యుద్ధం కృతం కుతస్తేఽద్య జ్ఞానం సర్వం చ విస్మృతమ్ ॥ 18 ॥**

ఓ విష్ణూ! మహాబుద్ధీ! నీవు నన్ను గుర్తుపట్టలేకపోవడం ఎట్లు సంభవమయ్యింది? నీవీనాడు నాతో యుద్ధం చేయడానికి కారణమేమిటి? నీవు జ్ఞానాన్నంతటిని విస్మరించావు.

**ఆత్మానం కిన్న జానాసి మదధీనపరాక్రమమ్ ।**
**త్వయా నాత్ర రతిః కార్యా నివర్తస్వ కుచారతః ॥ 19 ॥**

నీ పరాక్రమం నా అధీనంలో నున్నదని నీవేల గుర్తించలేదు? నీవిచట ఇంద్రియభోగాలలో మునిగివుండరాదు. ఈ దురాచారంనుండి వెనుకకు మరలు.

**కామాధీనం కథం జ్ఞానం స్త్రీషు సక్తో విహారకృత్ ।**
**నోచితం తవ దేవేశ! స్మరణం విశ్వతారణమ్ ॥ 20 ॥**

దేవదేవా! నీ జ్ఞానం కామాధీనమయ్యింది. స్త్రీలయందు ఆసక్తి కలిగి వారితో విహరించుట నీకు తగదు. నీకు జగద్రక్షణను గురించి స్మరించుటయే తగినది.

**తచ్ఛ్రుత్వా శంభువచనం విజ్ఞానప్రదమాదరాత్ ।**
**వ్రీడ్యన్ స్వమనసా విష్ణుః ప్రాహ వాచం మహేశ్వరమ్ ॥ 21 ॥**

జ్ఞానదాయకమైన శంభుని మాటలను విని, విష్ణువు తన మనస్సులో సిగ్గుపడి, మహేశ్వరుని ఉద్దేశించి ఆదరంతో ఇలా పలికాడు.

**విష్ణురువాచ** – విష్ణువు పలికాడు.

**మమాత్ర విద్యతే చక్రం తద్గృహీత్వా తదాదరాత్ ।**
**గమిష్యామి స్వలోకం తం త్వదాజ్ఞాపరిపాలకః ॥ 22 ॥**

నా చక్రం ఇచ్చట గలదు, దానిని తీసుకుని సాదరంగా నా లోకానికి వెళ్లి, నీ ఆజ్ఞను పాటిస్తాను.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**తదాకర్ణ్య మహేశానో వచనం వైష్ణవం హరః ।**
**ప్రత్యువాచ వృషాత్మా హి వృషరక్షః పునర్హరిమ్ ॥ 23 ॥**

పాపహారి, వృషభరూపుడు, ధర్మరక్షకుడునగు మహేశ్వరుడు విష్ణుని మాటలను విని ఇట్లు బదులిచ్చాడు.

**న విలంబః ప్రకర్తవ్యో గంతవ్యమిత ఆశు తే ।**
**మచ్ఛాసనాద్ధరే! లోకే చక్రమత్రైవ తిష్ఠతామ్ ॥ 24 ॥**

నీవు ఆలస్యంచేయవద్దు. ఇచటనుండి వెంటనే బయలుదేరుము. నా ఆజ్ఞచే విష్ణులోకానికి వెళ్లు. ఈ చక్రాన్ని ఇచ్చటనే ఉండనిమ్ము.

**సంతానాదిత్యసంస్థానాచ్ఛివత్వవచనాదపి ।**
**అహం ఘోరతరం తస్మాచ్చక్రమన్యద్దదామి తే ॥ 25 ॥**

ప్రళయకాలసూర్యుని కంటె, శివుని వచనం కంటె కూడా అధికమైన సంహారశక్తి గల మరియొక చక్రాన్ని నేను నీకు ఇస్తున్నాను.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఏతదుక్త్వా హరోఽలేఖీద్దివ్యం కాలానలప్రభమ్ ।**
**పరం చక్రం ప్రదీప్తం హి సర్వదుష్టవినాశనమ్ ॥ 26 ॥**

ఇట్లు పలికి శివుడు కాలాగ్ని వంటి కాంతులతో జ్వలించునదియు, దుష్టులనందరినీ సంహరించునదియునగు శ్రేష్ఠమైన దివ్యచక్రాన్ని సృష్టించాడు.

**విష్ణవే ప్రదదౌ చక్రం ఘోరార్కాయుతసుప్రభమ్ ।**
**సర్వామరమునీంద్రాణాం రక్షకాయ మహాత్మనే ॥ 27 ॥**

పదివేల ప్రళయకాల సూర్యులను పోలియున్న ఆ చక్రాన్ని మహర్షులను, దేవతలను రక్షించే మహాత్ముడైన విష్ణువునకు ఇచ్చాడు.

**లబ్ధ్వా సుదర్శనం చాన్యచ్చక్రం పరమదీప్తిమత్ ।**
**ఉవాచ విబుధాంస్తత్ర విష్ణుర్బుద్ధిమతాం వరః ॥ 28 ॥**

బుద్ధిమంతులలో శ్రేష్ఠుడైన విష్ణువు గొప్పకాంతులలీనే మరియొక సుదర్శనచక్రాన్ని పొంది, అచట నున్న దేవతలతో ఇలా అన్నాడు.

**సర్వదేవవరా యూయం మద్వాక్యం శృణుతాదరాత్ ।**
**కర్తవ్యం తత్తథా శీఘ్రం తతశ్శం వో భవిష్యతి ॥ 29 ॥**

ఓ దేవశ్రేష్ఠులారా! మీరందరు నా మాటను శ్రద్ధతో వినండి. వెంటనే నేను చెప్పినట్లు చేయండి. మీకు మంగళం కలుగుతుంది.

**దివ్యా వరాంగనాస్సంతి పాతాళే యౌవనాన్వితాః ।**
**తాభిః సార్ధం మహాక్రీడాం యః కరోతు కరోతు సః ॥ 30 ॥**

పాతాళంలో దివ్యమైన శ్రేష్ఠులైన యౌవనవతులగు సుందర స్త్రీలుగలరు. వారితో కలిసి ఎవరు క్రీడించనెంచెదరో వారు వారితో క్రీడించెదరు గాక!

**తచ్ఛ్రుత్వా కేశవాద్వాక్యం శూరాస్త్రిదశయోనయః ।**
**ప్రవేష్టుకామాః పాతాళం బభూవుర్విష్ణునా సహ ॥ 31 ॥**

విష్ణువుయొక్క పలుకులను విని శూరులైన దేవతలు విష్ణువుతో గూడి పాతాళానికి పోవాలని భావించారు.

**విచారమథ విజ్ఞాయ తం తదా భగవాన్ హరః ।**
**క్రోధాచ్ఛాపం దదౌ ఘోరం దేవయోన్యష్టకస్య చ ॥ 32 ॥**

అంతట హర భగవానుడు వారి ఆలోచనను ఎరింగి, కోపంతో ఎనిమిదిమంది దేవయోనులకు ఘోరమైన శాపాన్నిచ్చాడు.

**హర ఉవాచ –** హరుడు పలికాడు.

**వర్జయిత్వా మునిం శాంతం దానవాన్వా మదంశజమ్ ।**
**ఇదం యః ప్రవిశేత్ స్థానం తస్య స్యాన్నిధనం క్షణాత్ ॥ 33 ॥**

జితేంద్రియుడైన మునిని, రాక్షసులను, నా అంశవల్ల జన్మించిన వారిని మినహాయించి, ఎవరైననూ ఈ స్థానంలో ప్రవేశిస్తే వారు వెంటనే మృతులౌదురు గాక!

**శ్రుత్వా వాక్యమిదం ఘోరం మనుష్యహితవర్ధనమ్ ।**
**ప్రత్యాఖ్యాతాస్తు రుద్రేణ దేవాః స్వగృహమాయయుః ॥ 34 ॥**

మానవహితాన్ని వర్ధిల్లజేయు ఈ ఘోరమైన శాపాన్ని విని రుద్రునిచే తిరస్కరింపబడినవారై, దేవతలు తమ గృహాలకు వెళ్లారు.

**ఏవం స్త్రీలః పరో విష్ణుశ్శివేన ప్రతిశాసితః ।**
**స్వర్లోకమగమద్వ్యాస! స్వాస్థ్యం ప్రాప జగచ్చ తత్ ॥ 35 ॥**

ఓ వ్యాసా! స్త్రీలంపటుడగు విష్ణువు ఈ విధంగా శివునిచే శాసింపబడినవాడై, స్వర్గలోకానికి వెళ్లాడు. జగత్తునకు స్వస్థత చేకూరింది.

**వృషేశ్వరోఽపి భగవాన్ శంకరో భక్తవత్సలః ।**
**ఇత్థం కృత్వా దేవకార్యం జగామ స్వగిరీశ్వరమ్ ॥ 36 ॥**

భక్తవత్సలుడగు శంకరుడు వృషభావతారంలో ఈ విధంగా దేవకార్యాన్ని చేసి, శ్రేష్ఠమైన తన కైలాసానికి వెళ్లాడు.

**వృషేశ్వరావతారస్తు వర్ణితః శంకరస్య చ ।**
**విష్ణుమోహహరః శర్వః త్రైలోక్యసుఖకారకః ॥ 37 ॥**

విష్ణువుయొక్క మోహాన్ని పోగొట్టి, ముల్లోకాలకు సుఖాన్ని కలిగించిన మంగళకరుడగు శివుని వృషేశ్వరావతారం వర్ణింపబడింది.

**పవిత్రమిదమాఖ్యానం శత్రుబాధాహరం పరమ్ ।**
**స్వర్గ్యం యశస్యమాయుష్యం భుక్తిముక్తిప్రదం సతామ్ ॥ 38 ॥**

పవిత్రమైన ఈ వృత్తాంతం నిశ్చయంగా శత్రుబాధను పోగొట్టి, సత్పురుషులకు స్వర్గాన్ని, యశస్సుని, ఆయుష్యాన్ని, భుక్తిని, ముక్తిని ప్రసాదిస్తుంది.

**య ఇదం శృణుయాద్భక్త్యా శ్రావయేద్వై సమాహితః ।**
**స భుక్త్వా సకలాన్ కామానన్తే మోక్షమవాప్నుయాత్ ॥**
**తథా పఠతి యో హీదం పాఠయేత్సుధియో నరాన్ ॥ 39 ॥**

దీనినెవడుభక్తి శ్రద్ధలతో వింటాడో, మనస్సును లగ్నం చేసి వినిపిస్తాడో, అట్టివాడు సమస్త సుఖాలను అనుభవించి, దేహత్యాగానంతరం మోక్షాన్ని పొందుతాడు. అట్లే దీని నెవడు పఠిస్తాడో, పఠింపజేస్తాడో వాడు కూడ ఈ ఫలితాన్నే పొందుతాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం వృషేశ్వరసంజ్ఞకశివావతారవర్ణనం నామ త్రయోవింశోఽధ్యాయః ॥ 23 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు వృషేశ్వరుడనుశివావతారవర్ణనం అనే పేరుగల ఇరవైమూడవ అధ్యాయం సమాప్తం.

## **చతుర్వింశోఽధ్యాయః - ఇరవైనాల్గవ అధ్యాయం**

## **పిప్పలాదావతారవర్ణనమ్ - పిప్పలాదావతారవర్ణనం**

**నందీశ్వర ఉవాచ -** నందీశ్వరుడు పలికాడు.

**పిప్పలాదాఖ్యపరమమవతారం మహేశితుః ।**
**శృణు ప్రాజ్ఞ! మహాప్రీత్యా భక్తివర్ధనముత్తమమ్ ॥ 1 ॥**

ఓ బుద్ధిమంతుడా! పిప్పలాదుడను మహేశ్వరుని మరియొక శ్రేష్ఠమైన అవతారం గలదు. భక్తిని వర్ధిల్లజేసే ఉత్తమమైన ఆ అవతారాన్ని గూర్చి మహాప్రీతితో వినుము.

**యః పురా గదితో విప్రో దధీచిర్మునిసత్తమః ।**
**మహాశైవః సుప్రతాపీ చ్యావనిర్భృగువంశజః ॥ 2 ॥**

బ్రాహ్మణుడు, మహాశైవుడు, మంచి ప్రతాపం గలవాడు, భృగువంశజుడు, చ్యవనసుతుడునైన దధీచి మహర్షిగురించి పూర్వమే వర్ణింపబడింది.

**క్షువేణ సహ సంగ్రామే యేన విష్ణుః పరాజితః ।**
**సనిర్జరోఽథ సంశప్తో మహేశ్వరసహాయినా ॥ 3 ॥**

ఆయన యుద్ధంలో మహేశ్వరుని సహాయంతో క్షువుని, దేవతలతో గూడిన విష్ణువును జయించి, శపించాడు.

**తస్య పత్నీ మహాభాగా సువర్చా నామ నామతః ।**
**మహాపతివ్రతా సాధ్వీ యయాశప్తాదివౌకసః ॥ 4 ॥**

ఆయన భార్యపేరు సువర్చ. ఆమె పుణ్యాత్మురాలు. మహాపతివ్రత ఆమెదేవతలను శపించింది.

**తస్మాత్తస్యాం మహాదేవో ననాలీలావిశారదః ।**
**ప్రాదుర్బభూవ తేజస్వీ పిప్పలాదేతి నామతః ॥ 5 ॥**

ఆ దంపతులకు నానాలీలావిశారదుడైన మహాదేవుడు పుత్రుడై జన్మించాడు. తేజశ్శాలియగు ఆ బాలుని పేరు పిప్పలాదుడు.

**సూత ఉవాచ -** సూతమహర్షి చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య మునిశ్రేష్ఠో నందీశ్వరవచోఽద్భుతమ్ ।**
**సనత్కుమారః ప్రోవాచ నతస్కంధః కృతాంజలిః ॥ 6 ॥**

నందీశ్వరుని ఈ అద్భుత వచనాలను విని, మహర్షిశ్రేష్ఠుడైన సనత్కుమారుడు తల వంచి, చేతులు జోడించి ఇట్లు పలికాడు.

**సనత్కుమార ఉవాచ –** సనత్కుమారుడు పలికాడు.

**నందీశ్వర! మహాప్రాజ్ఞ! సాక్షాద్రుద్రస్వరూపధృక్ ।**
**ధన్యస్త్వం సద్గురుస్తాత! శ్రావితేయం కథాఽద్భుతా ॥ 7 ॥**

ఓ నందీశ్వరా! మహాప్రాజ్ఞా! నీవు సాక్షాత్తుగా రుద్రస్వరూపుడవు. నీవు ధన్యుడవు. సద్గురుడవగు నీవు అద్భుతమైన కథను వినిపించావు.

**క్షువేణ సహ సంగ్రామే శ్రుతో విష్ణుపురా జయః ।**
**బ్రహ్మణా మే పురా తాత! తచ్ఛాపశ్చ శిలాదజ ॥ 8 ॥**

క్షువునితో సహా విష్ణువు యుద్ధం చేసి పరాజయాన్ని పొందిన గాథను విన్నాను. దధీచి విష్ణువునకు శాపమిచ్చినగాథను కూడా పూర్వం బ్రహ్మ చెప్పగా విన్నాను.

**అధునా శ్రోతుమిచ్ఛామి దైవశాపం సువర్చయా ।**
**దత్తం పశ్చాత్పిప్పలాదచరితం మంగళాయనమ్ ॥ 9 ॥**

ఇప్పుడు సువర్చ, దేవతలకు శాపమిచ్చిన గాథను వినగోరుచున్నాను. అనంతరం మంగళనిధానమైన పిప్పలాదచరిత్రను వినగోరుచున్నాను.

**సూత ఉవాచ –** సూత మహర్షి చెప్పాడు.

**ఇతి శ్రుత్వాథ శైలాదిర్విధిపుత్రవచశ్శుభమ్ ।**
**ప్రత్యువాచ ప్రసన్నాత్మా స్మృత్వా శివపదాంబుజమ్ ॥ 10 ॥**

బ్రహ్మపుత్రుని ఈ శుభవచనాలను విని శిలాదపుత్రుడైన నందీశ్వరుడు ప్రసన్నమైన మనస్సుతో శివుని పాదపద్మాలను స్మరించి, ఇట్లు బదులు పలికాడు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఏకదా నిర్జరాః సర్వే వాసవాద్యా మునీశ్వర! ।**
**వృత్రాసురసహాయైశ్చ దైత్యైరాసన్ పరాజితాః ॥ 11 ॥**

ఓ మునీశ్వరా! ఒకప్పుడు వృత్రాసురుడు సహాయంగా గల రాక్షసులచే ఇంద్రాదిదేవతలందరు పరాజితులైనారు.

**స్వాని స్వాని వరాస్త్రాణి దధీచస్యాశ్రమేఽఖిలాః ।**
**నిక్షిప్య సహసా సద్యోఽభవన్దేవాః పరాజితాః ॥ 12 ॥**

పరాజితులైన దేవతలందరు తమ తమ శ్రేష్ఠమగు అస్త్రాలనన్నింటిని శీఘ్రంగా దధీచ మహర్షి ఆశ్రమంలో భద్రపరిచారు.

**తదా సర్వే సురాః సేంద్రా వధ్యమానాస్తథర్షయః ।**
**బ్రహ్మలోకగతాః శీఘ్రం ప్రోచుః స్వం వ్యసనం చ తత్ ॥ 13 ॥**

రాక్షసులచే వధింపబడుచున్న దేవతలు, మునులు ఇంద్రుని ముందిడుకొని శీఘ్రంగా బ్రహ్మలోకానికి వెళ్లి తమ దుఃఖాన్ని విన్నవించారు.

**తచ్ఛ్రుత్వా దేవవచనం బ్రహ్మా లోకపితామహః ।**
**సర్వం శశంస తత్త్వేన త్వష్టుశ్చైవ చికీర్షితమ్ ॥ 14 ॥**

దేవతల వచనాలను లోకపితామహుడైన బ్రహ్మ విని, త్వష్ట యొక్క ఆకాంక్ష స్వరూపాన్ని వివరంగా వారికి తెలిపాడు.

**భవద్వధార్థం జనితః త్వష్ట్రాయం తపసా సురాః ।**
**వృత్రో నామ మహాతేజాః సర్వదైత్యాధిపో మహాన్ ॥ 15 ॥**

త్వష్ట తపస్సు చేసి మిమ్ములను వధించడానికే ఈ రాక్షసుని సృష్టించాడు. మహాతేజశ్శాలి, సర్వరాక్షసులకు ప్రభువు, మహాత్ముడునైన ఈ వృత్రుడే ఆ రాక్షసుడు.

**అథ ప్రయత్నః క్రియతాం భవేదస్య వధో యథా ।**
**తత్రోపాయం శృణు ప్రాజ్ఞ! ధర్మహేతోర్వదామి తే ॥ 16 ॥**

కావున ఈ వృత్రుని వధించడానికి ప్రత్యేక ప్రయత్నం చేయాలి. ధర్మరక్షణకొరకు నేను నీకు వృత్రవధోపాయాన్ని చెబుతాను వినుము.

**మహామునిర్దధీచిర్యస్స తపస్వీ విజితేంద్రియః ।**
**లేభే శివం సమారాధ్య వజ్రాస్థిత్వవరం పురా ॥ 17 ॥**

తపశ్శాలి, జితేంద్రియుడునైన దధీచిమహర్షి పూర్వం శివుని ఆరాధించి వజ్రం వంటి ఎముకలను వరంగా పొందాడు.

**తస్యాస్థీన్యేవ యాచధ్వం స దాస్యతి న సంశయః ।**
**నిర్మాయ తైర్దండవజ్రం వృత్రం జహి న సంశయః ॥ 18 ॥**

దేవేంద్రా! మనం అతని ఎముకలను యాచిద్దాం. అతడు నిస్సంశయంగా ఇస్తాడు. వాటితో వజ్రదండాన్ని నిర్మించి వృత్రాసురుని సంహరించు. దీనిలో సందేహం లేదు.

**నందీశ్వర ఉవాచ -** నందీశ్వరుడు పలికాడు.

**తచ్ఛ్రుత్వా బ్రహ్మవచనం శక్రో గురుసమన్వితః ।**
**అగచ్ఛత్సామరః సద్యో దధీచ్యాశ్రమముత్తమమ్ ॥ 19 ॥**

బ్రహ్మయొక్క మాటలను బృహస్పతితో కూడిన ఇంద్రుడు విని, వెంటనే దేవతలతో సహా దధీచి మహర్షియొక్క ఆశ్రమానికి వెళ్లాడు.

**దృష్ట్వా తత్ర మునిం శక్రః సువర్చాన్వితమాదరాత్ ।**
**ననామ సాంజలిర్నమ్రః సగురుః సామరశ్చ తమ్ ॥ 20 ॥**

అచ్చట సువర్చతో కూడిన దధీచి మహర్షిని చూచి, దేవతలతో, బృహస్పతితో సహా ఇంద్రుడు వినయంతో చేతులు జోడించి నమస్కరించాడు.

**తదభిప్రాయమాజ్ఞాయ స మునిర్బుధసత్తమః ।**
**స్వపత్నీం ప్రేషయామాస సువర్చాం స్వాశ్రమాంతరమ్ ॥ 21 ॥**

జ్ఞానశ్రేష్ఠుడైన ఆ మహర్షి ఇంద్రుని అభిప్రాయాన్ని ఎరిగి తన భార్యయైన సువర్చను ఆశ్రమం లోపలికి పంపించాడు.

**తతస్స దేవరాజశ్చ సామరః స్వార్థసాధకః ।**
**అర్థశాస్త్రపరో భూత్వా మునీశం వాక్యమబ్రవీత్ ॥ 22 ॥**

స్వార్థసాధకుడు, అర్థశాస్త్రపరుడునైన ఇంద్రుడు దేవతలతో గూడి ఆ మహర్షితో ఇట్లు పలికాడు.

**శక్ర ఉవాచ –** ఇంద్రుడు పలికాడు.

**త్వష్ట్రా విప్రకృతాః సర్వే వయం దేవాస్తథర్షయః ।**
**శరణ్యం త్వాం మహాశైవం దాతారం శరణం గతాః ॥ 23 ॥**

దేవతలమైన మేము, మరియు మహర్షులు త్వష్టచే మోసగింపబడ్డాము. మహాశైవుడవు, దాతవు, శరణ్యుడవునైన నిన్ను మేము శరణు పొందాము.

**స్వాస్థీని దేహి నో విప్ర! మహావజ్రమయాని హి ।**
**అస్థ్నా తే స్వపవిం కృత్వా హనిష్యామి సురద్రుహమ్ ॥ 24 ॥**

ఓ విప్రా! మహావజ్రమయమైన మీ ఎముకలను మాకు ఇమ్ము. ఆ ఎముకలతో వజ్రాయుధాన్ని తయారుచేసి, దానితో దేవద్రోహియైన వృత్రాసురుని సంహరిస్తాను.

**ఇత్యుక్తస్తేన స మునిః పరోపకరణే రతః ।**
**ధ్యాత్వా శివం స్వనాథం హి విససర్జ కళేబరమ్ ॥ 25 ॥**

ఇంద్రుడిట్లు పలుకగా పరోపకారపరాయణుడగు దధీచి మహర్షి తన ప్రభువైన శివుని ధ్యానించి, దేహాన్ని విడిచాడు.

**బ్రహ్మలోకం గతస్సద్యః సమునిర్ధ్వస్తబంధనః ।**
**పుష్పవృష్టిరభూత్తత్ర సర్వే విస్మయమాగతాః ॥ 26 ॥**

సర్వబంధాలనుండి విముక్తుడైన ఆ మహర్షి వెంటనే బ్రహ్మలోకం చేరాడు. అచ్చట అతనిపై పుష్పవర్షం కురిసింది. అందరు ఆశ్చర్యచకితులయ్యారు.

**అథ గాం సురభిం శక్ర ఆహూయాశు హ్యలేహయత్ ।**
**అస్త్రనిర్మితయే త్వాష్టం నిదిదేశ తదస్థిభిః ॥ 27 ॥**

అంతట ఇంద్రుడు వెంటనే సురభిధేనువును పిలిపించి, దధీచి శరీరంలో నున్న మాంసాన్ని ఆస్వాదింపజేసేడు. ఆ ఎముకలతో అస్త్రాలను నిర్మించమని ఇంద్రుడు విశ్వకర్మనాదేశించాడు.

**విశ్వకర్మా తదాజ్ఞప్తః చక్లృపే ఽస్త్రాణి కృత్స్నశః ।**
**తదస్థిభిర్వజ్రమయైః సుదృఢైశ్శివవర్చసా ॥ 28 ॥**

ఇంద్రాజ్ఞననుసరించి విశ్వకర్మ, శివుని తేజస్సుచే మిక్కిలి దృఢంగా నున్న ఆ వజ్రమయమైన గట్టి ఎముకలతో పూర్ణంగా అస్త్రాలను నిర్మించాడు.

**వంశోద్భవం వజ్రం శరో బ్రహ్మశిరస్తథా ।**
**అన్యాస్థిభిర్బహూని స్వపరాణ్యస్త్రాణి నిర్మమే ॥ 29 ॥**

ఆయన వెన్నెముకతో వజ్రాయుధాన్ని, బ్రహ్మశిరమనే బాణాన్ని తయారుచేశాడు. మిగిలిన ఎముకలతో ఇతరమైన వివిధాయుధాలను నిర్మించాడు.

**తమింద్రో వజ్రముద్యమ్య వర్ధితః శివవర్చసా ।**
**వృత్రమభ్యద్రవత్క్రుద్ధో మునే! రుద్ర ఇవాంతకమ్ ॥ 30 ॥**

ఓ మునీ! శివవర్చస్సుతో వర్ధిల్లిన వజ్రాయుధాన్ని ధరించి, ఇంద్రుడు వృత్రుని వైపు పరుగెత్తాడు. అతడు యముని వెంటబడిన రుద్రుని వలెనున్నాడు.

**తతః శక్రస్సుసన్నద్ధస్తేన వజ్రేణ స ద్రుతమ్ ।**
**ఉచ్చకర్త శిరో వార్త్రం గిరిశృంగమివౌజసా ॥ 31 ॥**

యుద్ధానికి పూర్తిగా సంసిద్ధుడైన ఇంద్రుడు శీఘ్రమే వృత్రాసురుని శిరస్సును, పర్వత శిఖరాన్ని నరికినట్లుగా బలంగా నరికాడు.

**తదా సముత్సవస్తాత! బభూవ త్రిదివౌకసామ్ ।**
**తుష్టువుర్నిర్జరాశ్శక్రం పేతుః కుసుమవృష్టయః ॥ 32 ॥**

వత్సా! అంతట దేవతలు ఉత్సవాన్ని చేసుకున్నారు. ఇంద్రుని కొనియాడారు. పుష్పవర్షం కురిసింది.

**ఇతి తే కథితం తాత! ప్రసంగాచ్చరితం త్విదమ్ ।**
**పిప్పలాదావతారం మే శృణు శంభోర్మహాదరాత్ ॥ 33 ॥**

వత్సా! ఈ విధంగా నేను ప్రసంగవశంగా నీకీ గాథను చెప్పాను. ఇప్పుడు శంభుని పిప్పలాద అవతార గాథను మహాదరంగా వినుము.

**సువర్చా సా మునేః పత్నీ దధీచస్య మహాత్మనః ।**
**యయౌ స్వమాశ్రమాభ్యంతస్తదాజ్ఞప్తా పతివ్రతా ॥ 34 ॥**

మహాత్ముడైన దధీచమహర్షియొక్క పత్నియైన సువర్చ పతివ్రత గనుక భర్తయొక్క ఆజ్ఞను పాలించి తన ఆశ్రమంలోనికి వెళ్లింది.

**ఆగత్య తత్ర సా దృష్ట్వా న పతిం స్వం తపస్వినీ ।**
**గృహకార్యంచ సా కృత్వాఽఖిలం పతినిదేశతః ॥ 35 ॥**

ఆమె భర్త ఆజ్ఞను పాలించి అప్పటికే గృహకృత్యాలనన్నింటిని చేసి అచటకు తిరిగి వచ్చింది. కాని అచ్చట తన భర్త కానరాలేదు.

**ఆజగామ పునస్తత్ర పశ్యన్తీ బహ్వాశోభనమ్ ।**
**దేవాంశ్చ తాన్ మునిశ్రేష్ఠ! సువర్చా విస్మితాఽభవత్ ॥ 36 ॥**

ఆమె అచ్చటకు తిరిగి వచ్చినపుడు ఆమెకు సర్వం అమంగళకరంగా కన్పట్టింది. ఆమె అచ్చటి దేవతలను గాంచి చకితురాలయ్యింది.

**జ్ఞాత్వాచ తత్సర్వమిదం సురాణాం కృత్యం తదానీం చ చుకోప సాధ్వీ ।**
**దదౌ తదా శాపమతీవ రుష్టా తేషాం సువర్చా ఋషివర్యభార్యా ॥ 37 ॥**

క్షణంలో పతివ్రతయైన సువర్చ, దేవతలు చేసిన పనిని గురించి పూర్తిగా ఎరిగి వారిపై మిక్కిలి కోపించి శాపాన్ని ఇచ్చింది.

**సువర్చోవాచ** – సువర్చ పలికింది.

**అహో! సురా దుష్టతరాశ్చ సర్వే స్వకార్యదక్షా హ్యబుధాశ్చ లుబ్ధాః ।**
**తస్మాచ్చ సర్వే పశవో భవంతు సేంద్రాశ్చ మేఽద్య ప్రభృతీత్యువాచ ॥ 38 ॥**

అహో! దేవతలు ఎంతటి దుష్టులో గదా! వీరందరు తమ కార్యమును నెరవేర్చుకొనుటలో నేర్పరులు. లుబ్ధులు. అపండితులు. ఈ ఇంద్రాది దేవతలందరు ఈనాటి నుండి నా శాపంచే పశువులౌదురు గాక!

**ఏవం శాపం దదౌ తేషాం సురాణాం సా తపస్వినీ ।**
**సశక్రాణాం చ సర్వేషాం సువర్చా మునికామినీ ॥ 39 ॥**

తపశ్శాలిని, మునిపత్నియునగు సువర్చ ఇంద్రాది దేవతలందరినీ ఇట్లు శపించింది.

**అనుగంతుం పతేర్లోకమథైచ్ఛత్సా పతివ్రతా ।**
**చితాం చక్రే సమేధోభిః సుపవిత్రైర్మనస్వినీ ॥ 40 ॥**

అనంతరం ఆ పతివ్రత పతిననుసరించి, పతి వెళ్లిన లోకానికి వెళ్ళడానికి నిశ్చయించుకొంది, మిక్కిలి పవిత్రమగు సమిధలతో ఆమె చితిని ఏర్పాటు చేసుకున్నది.

**తతో నభోగిరా ప్రాహ సువర్చాం తాం మునిప్రియామ్ ।**
**ఆశ్వాసయంతీ గిరిశప్రేరితా సుఖదాయినీ ॥ 41 ॥**

అప్పుడు శివునిచే ప్రేరితమై ఆకాశవాణి ఆ మునిపత్నియైన సువర్చనోదార్చి, సుఖాన్ని కలిగిస్తూ ఇలా పలికింది.

**ఆకాశవాణ్యువాచ –** ఆకాశవాణి పలికింది.

**సాహసం న కురు ప్రాజ్ఞే! శృణు మే పరమం వచః ।**
**మునితేజస్త్వదుదరే తదుత్పాదయ యత్నతః ॥ 42 ॥**

ఓ బుద్ధిమంతులారా! సాహసాన్ని చేయకుము. నేను చెప్పే శ్రేష్ఠమైన వచనాలను విను. నీ గర్భంలో మునియొక్క తేజస్సు ఉంది. దానికి ప్రయత్నపూర్వకంగానైన జన్మనిమ్ము.

**తతః స్వాభీష్టాచరణం దేవి! కర్తుం త్వమర్హసి ।**
**సగర్భా న దహేద్గాత్రమితి బ్రహ్మనిదేశనమ్ ॥ 43 ॥**

ఆ తరువాత నీకు నచ్చిన విధంగా చేయవచ్చును. గర్భవతియైన స్త్రీ తన దేహాన్ని నశింపజేయరాదని వేదం నిర్దేశిస్తోంది.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వా సా నభోవాణీ విరరామ మునీశ్వర! ।**
**తాం శ్రుత్వా సా మునేః పత్నీ విస్మితాఽభూత్ క్షణం చ సా ॥ 44 ॥**

ఓమునిశ్రేష్ఠా! ఆకాశవాణి ఇట్లు పలికి విరమించింది. ఆ మాటలను విని మునిపత్ని క్షణకాలం చకితురాలయ్యింది.

**సువర్చా సా మహాసాధ్వీ పతిలోకమభీప్సతీ ।**
**ఉపవిశ్యాశ్మనా భూయః సోదరం విదదార హ ॥ 45 ॥**

పతిలోకాన్ని పొందగోరే మహాపతివ్రతయైన సువర్చ కూర్చుండి రాతితో తన గర్భాన్ని అనేకసార్లు కొట్టుకుంది.

**నిర్గతో జఠరాత్తస్యా గర్భో మునివరస్య సః ।**
**మహాదివ్యతనుర్దీప్తో భాసయంశ్చ దిశో దశ ॥ 46 ॥**

ఆమె గర్భంనుండి దధీచి మహర్షియొక్క పుత్రుడు, మహాదివ్య శరీరంతో, దశదిశలను తన తేజస్సుతో ప్రకాశింపజేస్తూ ఉదయించాడు.

**సాక్షాద్రుద్రావతారోఽసౌ దధీచవరతేజసః ।**
**ప్రాదుర్భూతః స్వయం తాత! స్వలీలాకరణే క్షమః ॥ 47 ॥**

ఓవత్సా! తన లీలలను ప్రదర్శించడంలో నిపుణుడైన రుద్రుడు స్వయంగా దధీచుని పుత్రుడై జన్మించాడు.

**తం దృష్ట్వా స్వసుతం దివ్యం స్వరూపం మునికామినీ ।**
**సువర్చాజ్ఞాయ మనసా సాక్షాద్రుద్రావతారకమ్ ॥ 48 ॥**

దివ్యరూపుడైన తన పుత్రుని గాంచి, మునిపత్నియైన సువర్చ తన మనస్సులో ఆ బాలుడు సాక్షాత్తుగా రుద్రావతారమేనని గుర్తించింది.

**ప్రహృష్టాఽభూన్మహాసాధ్వీ ప్రణమ్యాశు నునావ సా ।**
**స్వహృది స్థాపయామాస తత్స్వరూపం మునీశ్వర! ॥ 49 ॥**

ఓ మునీశ్వరా! మహాసాధ్వియైన ఆమె చాలా సంతసించి వెంటనే ప్రణమిల్లి స్తుతించింది. ఆమె ఆ రూపాన్ని తన హృదయంలో పదిలపరచుకొంది.

**సువర్చా తనయం తం చ ప్రహస్య విమలేక్షణా ।**
**జననీ ప్రాహ సుప్రీత్యా పతిలోకమభీప్సతీ ॥ 50 ॥**

నిర్మలమగు చూపులు గలదియు, పతిలోకాన్ని పొందగోరునదియు, ఆ బాలుని తల్లియునగు సువర్చ నవ్వి మిక్కిలి ప్రీతితో ఆ పుత్రుని ఉద్దేశించి ఇట్లుపలికింది.

**సువర్చోవాచ –** సువర్చ పలికింది.

**హే తాత! పరమేశాన! చిరం తిష్ఠాస్య సన్నిధౌ ।**
**అశ్వత్థస్య మహాభాగ! సర్వేషాం సుఖదో భవేః ॥ 51 ॥**

ఓ పుత్రా! పరమేశ్వరా! మహాత్మా! ఈ రావిచెట్టు సన్నిధిలో చిరకాలం ఉండి అందరికీ సుఖాన్ని కలిగించు.

**మామాజ్ఞాపయ సుప్రీత్యా పతిలోకాయ చాధునా ।**
**తత్రస్థాఽహం చ పతినా త్వాం ధ్యాయే రుద్రరూపిణమ్ ॥ 52 ॥**

ఇప్పుడు నేను నా భర్తయొక్క సన్నిధికి పయనమౌటకు అనుమతినిమ్ము. నేనచ్చట పతితో గూడి రుద్రరూపుడవైన నిన్ను ధ్యానిస్తాను.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యేవం సా బభాషేఽథ సువర్చా తనయం ప్రతి ।**
**పతిమన్వగమత్సాధ్వీ పరమేణ సమాధినా ॥ 53 ॥**

మునీశ్వరా! సువర్చ తన పుత్రునితో ఇట్లుపలికి, గొప్ప సమాధిని పొంది భర్త వద్దకు చేరుకుంది.

**ఏవం దధీచపత్నీ సా పతినా సంగతా మునే! ।**
**శివలోకం సమాసాద్య సిషేవే శంకరం ముదా ॥ 54 ॥**

ఈ విధంగా దధీచుని భార్య భర్తతో గూడి శివలోకాన్ని పొంది, ఆనందంతో శంకరుని సేవించింది.

**ఏతస్మిన్నంతరే దేవాః సేంద్రాశ్చ మునిభిస్సహ ।**
**తత్రాజగ్ముస్త్వరా తాత! ఆహూతా ఇవ హర్షితాః ॥ 55 ॥**

వత్సా! ఇంతలో ఇంద్రాది దేవతలు మహర్షులతో గూడి, ఆహూతులవలె ఆనందంతో శీఘ్రంగా అచ్చటకు వచ్చారు.

**హరిర్బ్రహ్మా చ సుప్రీత్యాఽవతీర్ణం శంకరం భువి ।**
**సువర్చాయాం దధీచేర్ద్వై యయతుస్స్వగణైస్సహ ॥ 56 ॥**

సువర్చాదధీచుల పుత్రుడై భూమియందవతరించిన శంకరుని దర్శించడానికి, హరి మరియు బ్రహ్మ తమ గణాలతో కూడి ఆనందంతో విచ్చేశారు.

**తత్ర దృష్ట్వాఽవతీర్ణం తం మునిపుత్రత్వమాగతమ్ ।**
**రుద్రం సర్వే ప్రణేముశ్చ తుష్టువుర్బద్ధపాణయః ॥ 57 ॥**

మునిపుత్రుడై అవతరించిన ఆ రుద్రుని గాంచి, వారందరు చేతులు కట్టుకొని నమస్కరించి స్తుతించారు.

**తదోత్సవో మహానాసీద్దేవానాం మునిసత్తమ! ।**
**నేదుర్దుందుభయస్తత్ర నర్తక్యో ననృతుర్ముదా ॥ 58 ॥**

ఓ మహర్షీ! అంతట అక్కడ దేవతలు మహోత్సవాన్ని చేశారు. దేవదుందుభులు మ్రోగాయి. నర్తకస్త్రీలు ఆనందంతో నాట్యాన్ని చేశారు.

**జగుర్గంధర్వపుత్రాశ్చ కిన్నరా వాద్యవాదకాః ।**
**వాదయామాసురమరాః పుష్పవృష్టిం చ చక్రిరే ॥ 59 ॥**

గంధర్వపుత్రులు, మరియు కిన్నరులు గానం చేయగా, వాద్యగాండ్రు వాద్యాలను మ్రోగించారు. దేవతలు పుష్పవృష్టిని కురిపించారు.

**పిప్పలస్య శర్వపితుర్విలసన్తం సుతం చ తమ్ ।**
**సంస్కృత్య విధివత్సర్వే విష్ణ్వాద్యాస్తుష్టువుః పునః ॥ 60 ॥**

రుద్రునకు తండ్రియైన ఆ అశ్వత్థ వృక్షానికి, ప్రకాశిస్తున్న బాలకునికి, యథావిధిగా సంస్కారాలను చేసిన తరువాత విష్ణువు మున్నగు వారందరు పలుమార్లు స్తుతించారు.

**పిప్పలాదేతి తన్నామ చక్రే బ్రహ్మా ప్రసన్నధీః ।**
**ప్రసన్నో భవ దేవేశ! ఇత్యూచే హరిణా సురైః ॥ 61 ॥**

ప్రసన్నమగు మనస్సు గల బ్రహ్మ ఆ బాలునకు 'పిప్పలాదుడు' అని నామకరణం చేశాడు. "ఓ దేవదేవా! ప్రసన్నుడవు కమ్ము" అని బ్రహ్మ, విష్ణువుతో, దేవతలతో గూడి ప్రార్థించాడు.

**ఇత్యుక్త్వా తమనుజ్ఞాయ బ్రహ్మా విష్ణుస్సురాస్తథా ।**
**స్వం స్వం ధామ యయుస్సర్వే విధాయ చ మహోత్సవమ్ ॥ 62 ॥**

బ్రహ్మ, విష్ణువు మరియు దేవతలందరు ఇట్లు పలికి ఆయన వద్ద సెలవు తీసుకొని, మహోత్సవాన్ని జరిపి తమ తమ స్థానాలకు వెళ్లారు.

**అథ రుద్రః పిప్పలాదోఽశ్వత్థమూలే మహాప్రభుః ।**
**తతాప సుచిరం కాలం లోకానాం హితకామ్యయా ॥ 63 ॥**

అంతట రుద్రావతారుడైన పిప్పలాదమహాప్రభువు రావిచెట్టు మూలంలో లోకాల హితాన్ని కోరి చాలా కాలం తపస్సు చేశాడు.

**ఇత్థం సుతపతస్తస్య పిప్పలాదస్య సమ్ముఖే ।**
**మహాకాలో వ్యతీయాయ లోకచర్యానుసారిణః ॥ 64 ॥**

ఈ విధంగా పిప్పలాదుడు గొప్ప తపస్సును చేస్తుండగా చాలాకాలం గడిచింది.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం పిప్పలాదావతారవర్ణనం నామ చతుర్వింశోఽధ్యాయః ॥ 24 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు పిప్పలాదావతారవర్ణనం అనే పేరుగల ఇరవైనాల్గవ అధ్యాయం సమాప్తం.

## పంచవింశోఽధ్యాయః - ఇరవైఐదవ అధ్యాయం

## పిప్పలాదావతారచరిత్రవర్ణనమ్ - పిప్పలాదావతారచరిత్రవర్ణనం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**అథ లోకే వ్యవస్థాయ ధర్మస్య స్థాపనేచ్ఛయా ।**
**మహాలీలాం చకారేశస్తామహో! సన్మునే! శృణు ॥ 1 ॥**

ఓ మహర్షీ! అనంతరం ఈశ్వరుడు లోకంలో నున్నవాడై ధర్మాన్ని స్థాపించదలచి గొప్ప అద్భుతమైన లీలను చేశాడు. ఆ వృత్తాంతాన్ని వినుము.

**ఏకదా పుష్పభద్రాయాం స్నాతుం గచ్ఛన్మునీశ్వరః ।**
**దదర్శ పద్మాం యువతీం శివాంశాం సుమనోహరామ్ ॥ 2 ॥**

ఒకనాడు ఆ పిప్పలాదమహర్షి పుష్పభద్రానదిలో స్నానం చేయడానికి వెళ్తూ, పార్వతీదేవి అంశంతో జన్మించిన "పద్మ"యనే సుందరయువతిని చూశాడు.

**తల్లిప్సుస్తత్పితుః స్థానమనరణ్యస్య భూపతేః ।**
**జగామ భువనాచారీ లోకతత్త్వవిచక్షణః ॥ 3 ॥**

లోక స్వభావమెరింగి, లోకాచారముననుసరించి, ఆ మహర్షి ఆమెను పొందగోరి ఆమె తండ్రియైన అనరణ్య మహారాజు వద్దకు వెళ్లాడు.

**రాజా నరాణాం తం దృష్ట్వా ప్రణమ్య చ భయాకులః ।**
**మధుపర్కాదికం దత్త్వా పూజయామాస భక్తితః ॥ 4 ॥**

రాజు ఆయనను గాంచి భయంతో కంగారుపడి, నమస్కరించి, భక్తితో మధుపర్కాదులనిచ్చి పూజించాడు.

**స్నేహాత్సర్వం గృహీత్వా స యయాచే కన్యకాం మునిః ।**
**మౌనీ బభూవ నృపతిః కించిన్నిర్వక్తుమక్షమః ॥ 5 ॥**

ఆ మహర్షి ప్రేమతో వాటినన్నింటిని స్వీకరించి, కన్యనిమ్మని కోరాడు. ఆ రాజు ఏమీ మాట్లాడే సామర్థ్యం లేనివాడైనందున మౌనంగా నిలబడ్డాడు.

**మునిః ప్రోవాచ నృపతిం కన్యాం మే దేహి భక్తితః ।**
**అన్యథా భస్మసాత్సర్వం కరిష్యేఽహం త్వయా సహ ॥ 6 ॥**

అంతట ఆ ముని ఇలా పలికాడు. 'రాజా! నాకు భక్తితో కన్యను సమర్పించు. అట్లుకానిచో నీతో సహా సర్వస్వాన్ని భస్మం చేస్తాను'.

**అథో బభూవురాచ్ఛన్నాః సర్వే రాజజనాస్తదా ।**
**తేజసా పిప్పలాదస్య దాధీచస్య మహామునేః ॥ 7 ॥**

ఓ మహర్షీ! అంతట దధీచుని పుత్రుడైన పిప్పలాదమహర్షి తేజస్సుచే రాజపరివారమంతా కప్పివేయబడ్డారు.

**అథ రాజా మహాభీతో విలప్య చ ముహుర్ముహుః ।**
**కన్యామలంకృతాం పద్మాం వృద్ధాయ మునయే దదౌ ॥ 8 ॥**

అంతట ఆ రాజు మిక్కిలి భీతిల్లి పలు పర్యాయాలు విలపించి, వృద్ధుడైన మహర్షికి తనపుత్రికయగు పద్మయనే కన్యనిచ్చి వివాహంచేశాడు.

**పద్మాం వివాహ్య స మునిః శివాంశాం భూపతేః సుతామ్ ।**
**పిప్పలాదో గృహీత్వా తాం ముదితః స్వాశ్రమం యయౌ ॥ 9 ॥**

ఆ మహర్షి పార్వతి అంశతో జన్మించిన మహారాజపుత్రికయైన పద్మను వివాహమాడి, ఆమెను తీసుకొని, ఆనందంతో తన ఆశ్రమానికి చేరుకున్నాడు.

**తత్ర గత్వా మునివరో వయసా జర్జరోధికః ।**
**ఉవాస నార్యా స తయా తపస్వీ నాతిలంపటః ॥ 10 ॥**

వయస్సుపైబడినవాడు, తపశ్శాలి, అధికమైన ఇంద్రియాసక్తి లేనివాడైన ఆ మహర్షి ఆశ్రమానికి వెళ్లి ఆమెతో కలసి జీవింపసాగాడు.

**అథోఽనరణ్యకన్యా సా సిషేవే భక్తితో మునిమ్ ।**
**కర్మణా మనసా వాచా లక్ష్మీర్నారాయణం యథా ॥ 11 ॥**

అనరణ్యుని కుమార్తెయైన ఆ పద్మ, శ్రీమన్నారాయణుని మహాలక్ష్మి సేవించిన విధంగా, ఆ మునిని మనోవాక్కాయకర్మలతో భక్తిపూర్వకంగా సేవించింది.

**ఇత్థం స పిప్పలాదో హి శివాంశో మునిసత్తమః ।**
**రేమే తయా యువత్యా చ యువా భూయ స్వలీలయా ॥ 12 ॥**

అప్పుడు శివాంశసంభూతుడైన ఆ మునిసత్తముడు తన లీలచే యువకుడుగా మారి ఆ యువతితో గూడి రమించాడు.

**దశపుత్రా మహాత్మానో బభూవుః సుతపస్వినః ।**
**మునేః పితుస్సమాః సర్వే పద్మాయాః సుఖవర్ధనాః ॥ 13 ॥**

పద్మా-పిప్పలాదులకు మహాత్ములు, గొప్ప తపశ్శాలులు, తండ్రితో సమానమైనవారునగు పదిమంది పుత్రులు కలిగారు. వారందరు తల్లిదండ్రుల సుఖాన్ని ఇనుమడింపజేశారు.

**ఏవం లీలావతారో హి శంకరస్య మహాప్రభోః ।**
**పిప్పలాదో మునివరో నానాలీలాకరః ప్రభుః ॥ 14 ॥**

ఈ విధంగా లీలగా అవతారాలను గ్రహించే శంకర ప్రభువు పిప్పలాదమహర్షిగా అవతరించి, అనేక లీలల్ని ప్రకటించాడు.

**యేన దత్తో వరః ప్రీత్యా లోకేభ్యో హి దయాళునా ।**
**దృష్ట్వా లోకే శనేః పీడాం సర్వేషామనివారిణీమ్ ॥ 15 ॥**

దయాళువైన ఆ మహర్షి లోకంలోని వారికందరికి శని పీడ అనివార్యంగా ఉండుటను గాంచి ప్రేమతో జనులకందరికి ఒక వరాన్ని ప్రసాదించాడు.

**షోడశాబ్దావధి నృణాం జన్మతో న భవేచ్చ సా ।**
**తథా చ శివభక్తానాం సత్యమేతద్ధి మే వచః ॥ 16 ॥**

పుట్టినప్పటినుండి పదునారు సంవత్సరాలు వయస్సు వచ్చేవరకు మానవులకు శని బాధ ఉండదు, ఈ నా వచనం సత్యం.

**అథానాదృత్య మద్వాక్యం కుర్యాత్పీడాం శనిః క్వచిత్ ।**
**తేషాం నృణాం తదా స స్యాద్భస్మసాన్న హి సంశయః ॥ 17 ॥**

నా యీ వచనాన్ని లెక్క చేయకుండా శని ఎక్కడైననూ మానవులకు శని పీడను కలిగించినచో, ఆ శని నిస్సందేహంగా భస్మమౌతాడు.

**ఇతి తద్భయతస్తాత! వికృతోఽపి శనైశ్చరః ।**
**తేషాం న కురుతే పీడాం కదాచిద్గ్రహసత్తమః ॥ 18 ॥**

గ్రహరాజైన శని పీడాకరుడే అయినను ఈవిధంగా పిప్పలాదునివలన భయం ఉండడం వల్ల వారికి ఎన్నడూ పీడ కలిగించడం లేదు.

**ఇతి లీలామనుష్యస్య పిప్పలాదస్య సన్మునే! ।**
**కథితం సుచరిత్రం తే సర్వకామఫలప్రదమ్ ॥ 19 ॥**

ఓ మహర్షీ! లీలచే పిప్పలాదుడై మనుష్యావతారాన్ని ధరించిన శివుని పవిత్రగాథను నీకీ తీరున వివరించాను. ఈ గాథ సర్వకామఫలప్రదమైనది.

**గాధిశ్చ కౌశికశ్చైవ పిప్పలాదో మహామునిః ।**
**శనైశ్చరకృతాం పీడాం నాశయంతి స్మృతాస్త్రయః ॥ 20 ॥**

గాధి, కౌశికుడు, మరియు పిప్పలాదమహర్షి అనే ముగ్గురిని స్మరించినట్లయితే శనివలన కలిగిన పీడ దూరమౌతుంది.

**పిప్పలాదస్య చరితం పద్మాచరితసంయుతమ్ ।**
**యః పఠేచ్ఛృణుయాద్వాపి సుభక్త్యా భువి మానవః ॥ 21 ॥**

పద్మాపిప్పలాదమహర్షుల చరిత్రను భూలోకంలో ఏ మానవుడు మంచి భక్తితో పఠిస్తే, లేక వింటే

**శనిపీడావినాశార్థమేతచ్చరితముత్తమమ్ ।**
**యః పఠేచ్ఛృణుయాద్వాపి సర్వాన్కామానవాప్నుయాత్ ॥ 22 ॥**

శని పీడానివృత్తికి ఈ చరిత్ర మిక్కిలి ఉత్తమమైనది. దీనిని చదివినవారు, వినినవారు సమస్త కోరికలను పొందుతారు.

**ధన్యో మునివరో జ్ఞానీ మహాశైవః సతాం ప్రియః ।**
**అస్య పుత్రో మహేశానః పిప్పలాదాఖ్య ఆత్మవాన్ ॥ 23 ॥**

జ్ఞాని, మహాశివభక్తుడు, సత్పురుషులకు ప్రియుడునైన దధీచమహర్షి ధన్యుడు. మహేశ్వరుడే ఆయనకు పుత్రుడై జన్మించాడు. ఆయనయే ఆత్మజ్ఞానియైన పిప్పలాదుడు.

**ఇదమాఖ్యానమనఘం స్వర్గ్యం కుగ్రహదోషహృత్ ।**
**సర్వకామప్రదం తాత! శివభక్తివివర్ధనమ్ ॥ 24 ॥**

పవిత్రమైనది, స్వర్గాన్ని ఇచ్చేది, దుష్టగ్రహదోషాలను హరించేదియునైన ఈ గాథ కోర్కెలనన్నింటిని ఈడేరుస్తుంది. వత్సా! ఈ గాథ శివభక్తిని వర్ధిల్లజేస్తుంది.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం పిప్పలాదావతారచరితవర్ణనం నామ పంచవింశోఽధ్యాయః ॥ 25 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు పిప్పలాదావతారచరిత్రవర్ణనం అనే పేరుగల ఇరవైఐదవ అధ్యాయం సమాప్తం.

## **షడ్వింశోఽధ్యాయః** – ఇరవైఆరవ అధ్యాయం

## **వైశ్యనాథాహ్వయశివావతారవర్ణనమ్** – వైశ్యనాథాహ్వయశివావతారవర్ణనం

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

> **శృణు తాత! ప్రవక్ష్యామి శివస్య పరమాత్మనః ।**
> **అవతారం పరమానందం వైశ్యనాథాహ్వయం మునే! ॥ 1 ॥**

వత్సా! మునీశ్వరా! శివపరమాత్మయొక్క పరమానందకరమైన వైశ్యనాథావతారాన్ని గూర్చి చెబుతాను విను.

> **నందిగ్రామే పురా కాచిన్మహానందేతి విశ్రుతా ।**
> **బభూవ వారవనితా శివభక్తా సుసుందరీ ॥ 2 ॥**

పూర్వం నంది గ్రామంలో మహానందయను వారవనిత యొకతి ఉండెడిది. ఆమె మహాసుందరి. అంతేగాదు గొప్పశివభక్తురాలు.

> **మహావిభవసంపన్నా సుధనాఢ్యా మహోజ్జ్వలా ।**
> **నానారత్నపరిచ్ఛిన్నశృంగారరసనిర్భరా ॥ 3 ॥**

ఆమె చాలా ధనంతో, గొప్ప వైభవంతో కూడినది. మహాద్భుతంగా ప్రకాశించేది. అనేకరకముల రత్నాభరణాలను ధరించి మూర్తీభవించిన శృంగారరసమువలె ఉండేది.

> **సర్వసంగీతవిద్యాసు నిపుణాఽతిమనోహరా ।**
> **తస్యా గేయేన హృష్యంతి రాజ్ఞ్యో రాజాన ఏవ చ ॥ 4 ॥**

ఆమె సమస్తసంగీతవిద్యలందు ప్రవీణురాలు, ఆమె గానానికి రాజులు, రాణులు కూడ మిక్కిలి ఆనందించేవారు.

> **సమానర్చ సదా సాంబం సా వేశ్యా శంకరం ముదా ।**
> **శివనామజపాసక్తా భస్మరుద్రాక్షభూషణా ॥ 5 ॥**

ఆ వేశ్య ఎప్పుడూ పార్వతీసమేతుడైన శంకరుని ఆనందంతో సేవించేది. ఆమె భస్మాన్ని, రుద్రాక్షలను ఆభరణాలుగా ధరించి శివనామజపాసక్తురాలై యుండెడిది.

> **శివం సంపూజ్య సా నిత్యం సేవంతీ జగదీశ్వరమ్ ।**
> **ననర్త పరయా భక్త్యా గాయంతీ శివసద్యశః ॥ 6 ॥**

ఆమె నిత్యమూ జగదీశ్వరుని పూజించి, సేవించి, శివుని పవిత్రకీర్తిని పరమభక్తితో గానంచేస్తూ, నాట్యం చేసేది.

> **రుద్రాక్షైర్భూషయిత్వైకం మర్కటం చైవ కుక్కుటమ్ ।**
> **కరతాలైశ్చ గీతైశ్చ సదా నర్తయతి స్మ సా ॥ 7 ॥**

ఆమె ఒక కోతిని, కోడిని రుద్రాక్షలతో అలంకరించి, చప్పట్లతోను, పాటలతోను వాటిచే ఎల్లవేళలా నాట్యం చేయిస్తూ ఉండేది.

**నృత్యమానౌ చ తౌ దృష్ట్వా శివభక్తిరతా చ సా ।**
**వేశ్యా స్మ విహసత్యుచ్చైః ప్రేమ్ణా సర్వసఖీయుతా ॥ 8 ॥**

శివభక్తిపరాయణురాలైన ఆ వేశ్య సఖురాండ్రతో గూడి, వాటి నాట్యాన్ని చూచి ప్రేమతో బిగ్గరగా నవ్వేది.

**రుద్రాక్షైః కృతకేయూరకర్ణాభరణమండనః ।**
**మర్కటః శిక్షయా తస్యాః పురో నృత్యతి బాలవత్ ॥ 9 ॥**

రుద్రాక్షలతో చేయబడిన కేయూరమూ, కర్ణాభరణమూ ఇత్యాది ఆభరణాలను దాల్చి ఆ కోతి ఆమె ఎదుట శిక్షణ పొందిన బాలునివలె నాట్యమాడేది.

**శిఖాసంబద్ధరుద్రాక్షః కుక్కుటః కపినా సహ ।**
**నిత్యం ననర్త నృత్యజ్ఞః పశ్యతాం హితమావహన్ ॥ 10 ॥**

శిఖపై కట్టబడిన రుద్రాక్ష గల కోడి కూడా కోతితో కలసి నృత్యము నెరిగిన దానివలె ప్రతిదినమూ, చూసే వారికి ఉల్లాసాన్ని కలిగిస్తూ నాట్యం చేసేది.

**ఏవం సా కుర్వతీ వేశ్యా కౌతుకం పరమాదరాత్ ।**
**శివభక్తిరతా నిత్యం మహానందభరాఽభవత్ ॥ 11 ॥**

శివభక్తిపరాయణురాలై గొప్ప ఆదరంతో ప్రతిదినము మహానందం పొందేది.

**శివభక్తిం ప్రకుర్వన్త్యా వేశ్యాయా మునిసత్తమ! ।**
**బహుకాలో వ్యతీయాయ తస్యాః పరమసౌఖ్యతః ॥ 12 ॥**

ఓమహర్షీ! శివభక్తియందు లగ్నమైన ఆ వేశ్యకు చాలా కాలం ఎంతో సుఖంగా గడిచిపోయింది.

**ఏకదా చ గృహే తస్యా వైశ్యో భూత్వా శివః స్వయమ్ ।**
**పరీక్షితుం చ తద్భావమాజగామ శుభో వ్రతీ ॥ 13 ॥**

ఒకనాడు శివుడు ఆమె భక్తిని స్వయంగా పరీక్షించదానికి, శుభకరమైన వ్రతాన్ని పాటించే ఒక వైశ్యుని రూపాన్ని ధరించి వచ్చాడు.

**త్రిపుండ్రవిలసద్భాలో రుద్రాక్షాభరణః కృతీ ।**
**శివనామజపాసక్తో జటిలః శైవవేషభృత్ ॥ 14 ॥**

ఆయన త్రిపుండ్రాలతో ప్రకాశించే లలాటం గలవాడై, రుద్రాక్షలు ఆభరణాలుగా గలవాడై, జటాజూటధారియై, శివనామజపాసక్తుడై, శివభక్తుని వేషాన్ని ధరించియున్నాడు.

**స బిభ్రద్భస్మనిచయం ప్రకోష్ఠే వరకంకణమ్ ।**
**మహారత్నపరిస్తీర్ణం రాజతే పరకౌతుకీ ॥ 15 ॥**

అతడు విభూతిని ఒంటినిండా ధరించాడు. చేతికి కంకణమున్నది. మహారత్నములతో పొదిగియున్నదా కంకణము. ఈవిధంగా అందరికీ ఆశ్చర్యం కలిగిస్తున్నాడు.

**తమాగతం సుసంపూజ్య సా వేశ్యా పరయా ముదా ।**
**స్వస్థానే సాదరం వైశ్యం సుందరీ హి న్యవేశయత్ ॥ 16 ॥**

సుందరియైన ఆ వేశ్య తన యింటికి విచ్చేసిన ఆ వైశ్యుని పరమానందంతో సాదరంగా ఆహ్వానించి, చక్కగా పూజించి కూర్చుండబెట్టింది.

**తత్ప్రకోష్ఠే వరం వీక్ష్య కంకణం సుమనోహరమ్ ।**
**తస్మిన్ జాతస్పృహా సా చ తం ప్రోవాచ సువిస్మితా ॥ 17 ॥**

అతని ముంజేతియందలి శ్రేష్ఠమైనట్టియు, మిక్కిలి మనోహరమైనట్టియు కంకణాన్ని గాంచి, ఆమె మిక్కిలి విస్మయాన్ని పొంది, దానియందుదయించిన కోరిక గలదై ఆయనతో ఇలా పలికింది.

**మహానందోవాచ –** మహానంద పలికాడు.

**మహారత్నమయశ్చాయం కంకణస్త్వత్కరే స్థితః ।**
**మనో హరతి మే సద్యో దివ్యస్త్రీభూషణోచితః ॥ 18 ॥**

నీ చేతికున్న ఈ కంకణము ఎంతో విలుగల రత్నాలు పొందిగియున్నది. ఇది ఎంతో తేజస్సుగల, అందమైన స్త్రీలు ధరించవలసినది. అందువల్ల దాన్ని చూచి నామనస్సు వెంటనే ఆరాటపడుతున్నది.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇతి తాం నవరత్నాఢ్యే సస్పృహాం కరభూషణే ।**
**వీక్ష్యోదారమతిర్వైశ్యః సస్మితం సమభాషత ॥ 19 ॥**

నవరత్నాలుపొదిగిన కంకణమునందు కోరికగల ఆమెను చూచి ఆ వైశ్యుడు, ఉదారతతో చిరునవ్వు చిందిస్తూ ఆమెతో ఇలా అన్నాడు.

**వైశ్యనాథ ఉవాచ –** వైశ్యనాథుడు పలికాడు.

**అస్మిన్ రత్నవరే దివ్యే సస్పృహం యది తే మనః ।**
**త్వమేవాధత్స్వ సుప్రీత్యా మౌల్యమస్య దదాసి కిమ్ ॥ 20 ॥**

రత్నాలు పొదిగిన ఈ దివ్యాభరణంపై నీకు కోరిక యున్నచో, నీవే దీనిని ప్రీతితో ధరించు, కాని దీనికి నీవు వెలనేమిస్తావు? అన్నాడు.

**వేశ్యోవాచ –** వేశ్య పలికింది.

**వయం హి స్వైరచారిణ్యో వేశ్యాస్తు న పతివ్రతాః ।**
**అస్మత్కులోచితో ధర్మో వ్యభిచారో న సంశయః ॥ 21 ॥**

మేము స్వేచ్ఛావిహారులమైన వేశ్యలమే గాని పతివ్రతలము గాము. వ్యభిచారము మా కులానికి అనురూపమైన ధర్మమనడంలో సందేహంలేదు.

**యద్యేతదఖిలం చిత్తం గృహ్ణాతి కరభూషణమ్ ।**
**దినత్రయమహోరాత్రం పత్నీ తవ భవామ్యహమ్ ॥ 22 ॥**

ఇది నీకు అంగీకారమై, నా మనస్సునకు నచ్చిన ఈ కంకణాన్ని నాకు ఇచ్చినచో, నేను నీకు మూడు రాత్రులు, మూడు పగళ్లు భార్యగా ఉంటాను. అని వేశ్య పలికింది.

**వైశ్య ఉవాచ –** వైశ్యుడు పలికాడు.

**తథాస్తు యది తే సత్యం వచనం వీరవల్లభే! ।**
**దదామి రత్నవలయం త్రిరాత్రం భవ మే వధూః ॥ 23 ॥**

వీరులచే ప్రేమింపబడే ఓ సుందరీ! ఆ విధంగానేయౌగాక! నీ మాట సత్యమైతే ఈ రత్నకంకణాన్ని నీకు ఇస్తాను. నీవు నాకు మూడు రాత్రులు భార్యగా ఉండు.

**ఏతస్మిన్వ్యవహారే తు ప్రమాణం శశిభాస్కరౌ ।**
**త్రివారం సత్యమిత్యుక్త్వా హృదయం మే స్పృశ ప్రియే! ॥ 24 ॥**

ప్రేయసీ! ఈ ఒప్పందానికి సూర్యచంద్రులే సాక్షులు. 'సత్యమే' అని ముమ్మారు పలుకు. అనంతరం నా హృదయాన్ని స్పృశించు.

**వేశ్యోవాచ –** వేశ్య పలికింది.

**దినత్రయమహోరాత్రం పత్నీ భూత్వా తవ ప్రభో! ।**
**సహధర్మం చరామీతి సత్యం సత్యం న సంశయః ॥ 25 ॥**

ఓ ప్రభూ! నేను మూడు రోజులు రాత్రింబవళ్లు నీకు భార్యనై, నీకు సహధర్మచారిణిని కాగలను. ఇది ముమ్మాటికీ నిజము. నిజము. సంశయం లేదు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వా హి మహానందా త్రివారం శశిభాస్కరౌ ।**
**ప్రమాణీకృత్య సుప్రీత్యా సా తద్ధృదయమస్పృశత్ ॥ 26 ॥**

మహానంద ఇట్లు పలికి సూర్యచంద్రులు సాక్షిగా మూడుసార్లు ప్రమాణంచేసి, మిక్కిలి ప్రీతితో అతని హృదయాన్ని స్పృశించింది.

**అథతస్యై స వైశ్యస్తు ప్రదత్వా రత్నకంకణమ్ ।**
**లింగం రత్నమయం తస్య హస్తే దత్త్వేదమబ్రవీత్ ॥ 27 ॥**

అప్పుడు ఆ వైశ్యుడు ఆమెకు తన రత్నకంకణాన్ని ఇచ్చి, ఒక రత్నలింగాన్ని ఆమె చేతికి ఇచ్చి ఇలా పలికాడు.

**వైశ్యనాథ ఉవాచ –** వైశ్యనాథుడు పలికాడు.

**ఇదం రత్నమయం లింగం శైవం మత్ప్రాణవల్లభమ్ ।**
**రక్షణీయం త్వయా కాన్తే! గోపనీయం ప్రయత్నతః ॥ 28 ॥**

ఓ సుందరీ! రత్నమయమైన ఈ శివలింగం నాకు ప్రాణప్రదమైనది. నీవు దీనిని శ్రద్ధగా దాచి రక్షించు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఏవమస్త్వితి సా ప్రోచ్య లింగమాదాయ రత్నజమ్ ।**
**నాట్యమండపికామధ్యే నిధాయ ప్రావిశద్గృహమ్ ॥ 29 ॥**

ఆమె 'అట్లే' అని పలికి ఆ రత్నలింగాన్ని తీసుకొని నాట్యమండపం మధ్యలో ఉంచి తాను ఇంటిలోనికి వెళ్లింది.

**సా తేన సంగతా రాత్రౌ వైశ్యేన విటధర్మిణా ।**
**సుఖం సుష్వాప పర్యంకే మృదుతల్పోపశోభితే ॥ 30 ॥**

ఆమె రాత్రియందు విటస్వభావంతో వచ్చిన ఆ వైశ్యునితో గూడి మెత్తని పరుపులతో శోభిల్లే మంచంపై సుఖంగా నిద్రించింది.

**తతో నిశీథసమయే మునే! వైశ్యపతీచ్ఛయా ।**
**అకస్మాదుత్థితా వాణీ నృత్యమండపికాంతరే ॥ 31 ॥**

ఓమహర్షీ! అంతట అర్ధరాత్రిసమయంలో ఆ వైశ్యప్రభుని సంకల్పంచే నృత్యమండపం లోపలనుండి అకస్మాత్తుగా పెద్ద శబ్దం వెలువడింది.

**మహాప్రజ్వలితో వహ్నిః సుసమీరసహాయవాన్ ।**
**నాట్యమండపికాం తాత! తామేవ సహసాऽऽవృణోత్ ॥ 32 ॥**

పెద్ద జ్వాలలతో గూడిన అగ్ని, పెద్దగాలి తోడు కాగా, ఆ నాట్యమండపమంతటా శీఘ్రంగా వ్యాపించింది.

**మండపే దహ్యమానే తు సహసోత్థాయ సంభ్రమాత్ ।**
**మర్కటం మోచయామాస సా వేశ్యా తత్ర బంధనాత్ ॥ 33 ॥**

నృత్యమండపం తగులబడుతుండగా, ఆ వేశ్య ఆశ్చర్యంతో లేచి, శీఘ్రమే అచ్చటనున్న కోతిని బంధనుండి విడిపించింది.

**స మర్కటో ముక్తబంధః కుక్కుటేన సహాముసా ।**
**భియా దూరం హి దుద్రావ విధూయాగ్నికణాన్బహూన్ ॥ 34 ॥**

బంధనుండి విడిపింపబడిన ఆ కోతి, కోడితో కలిసి మీద పడుతున్న అగ్నికణాలను దులుపుకుంటూ భయంతో దూరంగా పారిపోయింది.

**స్తంభేన సహ నిర్దగ్ధం తల్లింగం శకలీకృతమ్ ।**
**దృష్ట్వా వేశ్యా స వైశ్యశ్చ దురంతం దుఃఖమాపతుః ॥ 35 ॥**

ఆ రత్నలింగం పానువట్టంతో సహా నిప్పులలో కాలి ముక్కలయ్యింది. దానిని చూచి ఆ వైశ్యుడు, ఆ వేశ్య పట్టరాని దుఃఖాన్ని అనుభవించారు.

**దృష్ట్వా వ్యాత్మసమం లింగం దగ్ధం వైశ్యపతిస్తదా ।**
**జ్ఞాతుం తద్భావమంతఃస్థమ్మరణాయ మతిం దధే ॥ 36 ॥**

ఆత్మసమమైన లింగం దగ్ధమౌటను గాంచి ఆ వైశ్యప్రభువు ఆమె హృదయంలో నున్న భావాన్ని తెలుసుకోవడానికి, మరణించాలని నిశ్చయించుకొన్నాడు.

**నివిశ్యేతితరాం ఖేదాద్వైశ్యస్తామాహ దుఃఖితామ్ ।**
**నానాలీలో మహేశానః కౌతుకాన్నరదేహవాన్ ॥ 37 ॥**

అతిశయించిన దుఃఖంతో ఆ వైశ్యుడు కూర్చుండిపోయాడు. అనేక లీలలు గలవాడు, కుతూహలంతో మానవదేహాన్ని ధరించినవాడునైన మహేశ్వరుడు దుఃఖితురాలైన ఆ వేశ్యతో ఇలా పలికాడు.

**వైశ్యపతిరువాచ –** వైశ్యపతి పలికాడు.

**శివలింగే తు నిర్భిన్నే దగ్ధే మహత్ప్రాణవల్లభే ।**
**సత్యం వచ్మి న సందేహో నాహం జీవితుముత్సహే ॥ 38 ॥**

నాకు ప్రాణప్రియమైన శివలింగం భగ్నమయ్యింది. దగ్ధమయ్యింది. నాకు జీవించాలనే ఉత్సాహం లేదు, ఇందులో సందేహం లేదు, నేను సత్యాన్నే చెబుతున్నాను.

**చితాం కారయ మే భద్రే! స్వభృత్యైస్త్వం వరైర్లఘు ।**
**శివే మనస్సమావేశ్య ప్రవేక్ష్యామి హుతాశనమ్ ॥ 39 ॥**

ఓ పుణ్యాత్మురాలా! నీవు నీ భృత్యులలో శ్రేష్ఠమైన వారిని నియోగించి వేగంగా నాకు చితిని ఏర్పాటు చేయించు, నేను శివునియందు మనస్సు నిలిపి అగ్నిలో ప్రవేశిస్తాను.

**యది బ్రహ్మేంద్రవిష్ణ్వాద్యా వారయేయుః సమేత్య మామ్ ।**
**తథాఽప్యస్మిన్ క్షణే భద్రే! ప్రవిశామి త్యజామ్యసూన్ ॥ 40 ॥**

సుందరీ! బ్రహ్మేంద్రవిష్ణ్వాదులు కూడి వచ్చి నన్ను వారించినప్పటికీ, నేనీక్షణంలో అగ్నిలో ప్రవేశించి ప్రాణాలను విడుస్తాను.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**తమేవం దృఢనిర్బంధం సా విజ్ఞాయ సుదుఃఖితా ।**
**స్వభృత్యైః కారయామాస చితాం స్వభవనాద్బహిః ॥ 41 ॥**

ఆయన ఇట్లు గట్టిగా పట్టుపట్టగా ఆమె అతని దృఢనిశ్చయాన్ని గ్రహించి మిక్కిలి దుఃఖించి, తన భవనానికి బయట తన సేవకులచేత చితిని ఏర్పాటు చేయించింది.

**తతస్స వైశ్యశ్శివ ఏక ఏవ ప్రదక్షిణీకృత్య సమిద్ధమగ్నిమ్ ।**
**వివేశ పశ్యత్సు నరేషు ధీరః సుకౌతుకీ సంగతిభావమిచ్ఛుః ॥ 42 ॥**

ఆ వైశ్యరూపంలో ఉన్న శివుడు మిక్కిలి కుతూహలంతో పుణ్యగతిని కోరేవాడై ధైర్యంతో తాను ఒక్కడే ప్రజ్వరిల్లుతున్న ఆ అగ్నికి ప్రదక్షిణం చేసి, అనంతరం జనులు చూస్తుండగా అగ్నిలో ప్రవేశించాడు.

**దృష్ట్వా సా తద్గతిం వేశ్యా మహానందాఽతివిస్మితా ।**
**అనుతాపం చ యువతీ ప్రపేదే మునిసత్తమః ॥ 43 ॥**

మునిశ్రేష్ఠా! వేశ్యయైన మహానంద, అతని అగ్నిప్రవేశాన్ని చూచి మిక్కిలి ఆశ్చర్యాన్ని పొందింది, మహాదుఃఖాన్ని పొందింది.

**అథ సా దుఃఖితా వేశ్యా స్మృత్వా ధర్మం సునిర్మలమ్ ।**
**సర్వాన్బంధుజనాన్వీక్ష్య బభాషే కరుణం వచః ॥ 44 ॥**

అపుడా వేశ్య దుఃఖితురాలై పరమపవిత్రమైన ధర్మాన్ని స్మరించి, బంధుజనులనందరినీ చూచి కరుణతో నిండిన ఈ వచనాలను పలికింది.

**మహానందోవాచ –** మహానందపలికింది.

**రత్నకంకణమాదాయ మయా సత్యముదాహృతమ్ ।**
**దినత్రయమహం పత్నీ వైశ్యస్యాముష్య సంమతా ॥ 45 ॥**

నేను రత్నకంకణాన్ని స్వీకరించి సత్యాన్ని పలికి యున్నాను. నేను మూడు రోజులు ఈ వైశ్యునకు పత్నియగుటకు అంగీకరించాను.

**కర్మణా మత్కృతేనాయం మృతో వైశ్యః శివవ్రతీ ।**
**తస్మాదహం ప్రవేక్ష్యామి సహానేన హుతాశనమ్ ॥ 46 ॥**

నేను చేసిన పనివలన శివభక్తిపరుడైన ఈ వైశ్యుడు మరణించాడు. కాబట్టి ఇతని వెనుకనే నేను గూడ అగ్నిలో ప్రవేశిస్తాను.

**స్వధర్మచారిణీ త్యక్తమాచార్యైస్సత్యవాదిభిః ।**
**ఏవం కృతే మమ ప్రీత్యా సత్యం మయి న నశ్యతు ॥ 47 ॥**

నేను ఆ విధంగా చేసినచో, సత్యవాదులైన ఆచార్యులు నా గురించి 'ఈమె స్వధర్మాన్ని పాటించింది' అని ప్రేమతో పలుకుతారు. నాయందు సత్యం నశించకుండా ఉంటుంది.

**సత్యాశ్రయః పరో ధర్మః సత్యేన పరమా గతిః ।**
**సత్యేన స్వర్గమోక్షౌ చ సత్యే సర్వం ప్రతిష్ఠితమ్ ॥ 48 ॥**

పరమధర్మమంతయు సత్యమునాశ్రయించి యుంటుంది. సత్యంచేతనే మానవుడు పరమపదాన్ని పొందుతాడు. సత్యంచేతనే స్వర్గం, మోక్షం లభిస్తాయిసర్వమూ సత్యమునందే ప్రతిష్ఠితమైయున్నది.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇతి సా దృఢనిర్బంధా వార్యమాణాపి బంధుభిః ।**
**సత్యలోకపరా నారీ ప్రాణాంస్త్యక్తుం మనో దధే ॥ 49 ॥**

సత్యమును మాత్రమే దర్శించుటయందు నిమగ్నురాలైన ఆ యువతి ఇట్లు దృఢంగా నిశ్చయించుకొని, బంధువులు వద్దంటున్ననూ ప్రాణాలను విడిచి పెట్టడానికి నిర్ణయించుకుంది.

**సర్వస్వం ద్విజముఖ్యేభ్యో దత్త్వా ధ్యాత్వా సదాశివమ్ ।**
**తమగ్నిం త్రిఃపరిక్రమ్య ప్రవేశాభిముఖీ హ్యభూత్ ॥ 50 ॥**

ఆమె తన సర్వసంపదల్ని, ద్విజశ్రేష్ఠులకు దానం చేసి, సదాశివుని ధ్యానించి, ఆ అగ్నిని ముమ్మారు ప్రదక్షిణంచేసి, దానిలో ప్రవేశించడానికి సంసిద్ధురాలయ్యింది.

**తాం పతన్తీం సమిద్ధేఽగ్నౌ స్వపదార్పితమానసామ్ ।**
**వారయామాస విశ్వాత్మా ప్రాదుర్భూతః స వై శివః ॥ 51 ॥**

తనయందు మనస్సును లగ్నంచేసి, ప్రజ్వరిల్లే అగ్నియందు పడబోవుచున్న ఆమెను విశ్వస్వరూపుడైన శివుడు ఆవిర్భవించి నివారించాడు.

**సా తం విలోక్యాఖిలదేవదేవం త్రిలోచనం చంద్రకళావతంసమ్ ।**
**శశాంక సూర్యానలకోటిభాసం స్తబ్ధేవ భీతేవ తథైవ తస్థౌ ॥ 52 ॥**

దేవదేవుడు, ముక్కంటి, చంద్రశేఖరుడు, కోట్లాది సూర్యచంద్రాగ్నుల కాంతివాడునగు ఆ శివుని గాంచి, స్తంభించిన దానివలెనూ, భీతిల్లిన దానివలెనూ అట్లే నిలబడియుండిపోయింది.

**తాం విహ్వలాం సువిత్రస్తాం వేపమానాం జడీకృతామ్ ।**
**సమాశ్వాస్య గలద్బాష్పాం కరౌ ధృత్వా உబ్రవీద్వచః ॥ 53 ॥**

దుఃఖంతోను, భయంతోను, వణికి పోతూ స్తబ్ధురాలై నిలబడి కళ్లవెంబడి, కన్నీరు కారుస్తున్న ఆమెనోదార్చి శివుడామె చేతులను పట్టుకొని ఇలా పలికాడు.

**శివ ఉవాచ –** శివుడు పలికాడు.

**సత్యం ధర్మం చ ధైర్యం చ భక్తిం చ మయి నిశ్చలామ్ ।**
**పరీక్షితుం త్వత్సకాశం వైశ్యో భూత్వాஉహమాగతః ॥ 54 ॥**

నీ యందలి సత్యాన్ని, ధర్మాన్ని, నాపై గల నిశ్చలభక్తిని పరీక్షించాలనే ఉద్దేశ్యంతో నేను నీ వద్దకు వైశ్యుని రూపంలో వచ్చాను.

**మాయయాగ్నిం సముద్దీప్య దగ్ధం తే నాట్యమండపమ్ ।**
**దగ్ధం కృత్వా రత్నలింగం ప్రవిష్టోஉహం హుతాశనమ్ ॥ 55 ॥**

నేను మాయచే అగ్నిని ప్రజ్వరిల్లజేసి నీ నాట్యమండపాన్ని దగ్ధం చేసి రత్నలింగాన్ని దహించి, అగ్నిలో ప్రవేశించాను.

**సా త్వం సత్యమనుస్మృత్య ప్రవిష్టాஉగ్నిం మయా సహ ।**
**అతస్తే సంప్రదాస్యామి భోగాంస్త్రిదశదుర్లభాన్ ॥ 56 ॥**

అట్టి నీవు సత్యాన్ని పాటించి నా వెనుక అగ్నిలో ప్రవేశింపబోయావు. కాబట్టి నీకు దేవతలకు కూడా దుర్లభమైన భోగాలను నేను ఇస్తాను.

**యద్యదిచ్ఛసి సుశ్రోణి! తదేవ హి దదామి తే ।**
**త్వద్భక్త్యాஉహం ప్రసన్నోஉస్మి తవాదేయం న విద్యతే ॥ 57 ॥**

ఓ సుందరీ! నీ భక్తికి నేను మిక్కిలి ప్రసన్నుడనయ్యాను. నీకు ఈయరానిదేదియూలేదు. కావున దేనిని కోరితే దానిని నీకు ఇస్తాను.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇతి బ్రువతి గౌరీశే శంకరే భక్తవత్సలే ।**
**మహానందా చ సా వేశ్యా శంకరం ప్రత్యభాషత ॥ 58 ॥**

భక్తవత్సలుడు, గౌరీపతియునగు శంకరుడిట్లు పలుకగా వేశ్యయైన మహానంద శంకరునుద్దేశించి ఇట్లు బదులు పలికింది.

**వేశ్యోవాచ –** వేశ్య పలికింది.

**న మే వాంఛాస్తి భోగేషు భూమౌ స్వర్గే రసాతలే ।**
**తవ పాదాంబుజస్పర్శాదన్యత్కించిన్న కామయే ॥ 59 ॥**

నాకు భూలోక, స్వర్గలోక, పాతాళలోకాలలోని భోగాలయందు కోరికలేదు. నీ పాదపద్మాలను స్పృశించడం కంటె వేరే దేనిని నేను కోరడం లేదు.

**యే మే భృత్యాశ్చ దాస్యశ్చ యే చాన్యే మమ బాంధవాః ।**
**సర్వే త్వద్దర్శనపరాస్త్వయి సన్న్యస్తవృత్తయః ॥ 60 ॥**

నాసేవకులు, దాసీలు, ఇతర బంధువులందరూ కూడ నీయందు లగ్నమైన మనస్సు గలవారై నీ దర్శనం కొరకు తహతహలాడుతున్నారు.

**సర్వానేతాన్మయా సార్ధం నినీయాత్మపరం పదమ్ ।**
**పునర్జన్మ భయం ఘోరం విమోచయ నమోఽస్తు తే ॥ 61 ॥**

నాతో సహా వీరినందరినీ నీ పరమపదానికి తీసుకొని పోయి, ఘోరమైన పునర్జన్మ భయంనుండి విముక్తిని కలిగించు, నీకు నమస్కారము.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**తతస్స తస్యా వచనం ప్రతినంద్య మహేశ్వరః ।**
**తాః సర్వాశ్చ తయా సార్ధం నినాయ స్వం పరం పదమ్ ॥ 62 ॥**

అనంతరం మహేశ్వరుడు ఆమె పలుకులనభినందించి, ఆమెతో బాటు వారినందరినీ కూడా తన పరమపదానికి తీసుకొని పోయాడు.

**వైశ్యనాథావతారస్తే వర్ణితః పరమో మయా ।**
**మహానందాసుఖకరో భక్తానందప్రదస్సదా ॥ 63 ॥**

మహానందకు సుఖాన్ని కలిగించినదీ, భక్తులకు సదా ఆనందాన్ని ఇచ్చేదీ, మిక్కిలి శ్రేష్ఠమైనదీ అయిన వైశ్యనాథావతారాన్ని నీకు నేను వర్ణించి చెప్పాను.

**ఇదం చరిత్రం పరమం పవిత్రం సతాం చ సర్వప్రదమాశు దివ్యమ్ ।**
**శివావతారస్య విశాంపతేర్మహానందామహాసౌఖ్యకరం విచిత్రమ్ ॥ 64 ॥**

ఈ దివ్యచరిత్రం పరమపవిత్రమైనది. సత్పురుషులకు శీఘ్రంగా సర్వాన్ని ప్రసాదిస్తుంది. విచిత్రమైన ఈ వైశ్యనాథావతారం మహానందకు మహాసౌఖ్యాన్ని అనుగ్రహించింది.

**ఇదం యః శృణుయాద్భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।**
**చ్యవతే న స్వధర్మాత్స పరత్ర లభతే గతిమ్ ॥ 65 ॥**

ఎవడైతే దీనిని భక్తితో వింటాడో, మనస్సును లగ్నం చేసి వినిపిస్తాడో, వాడు తన ధర్మంనుండి పతితుడు కాడు. అంతేగాక దేహత్యాగానంతరం ఉత్తమగతిని కూడా పొందుతాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం వైశ్యనాథాహ్వయశివావతారవర్ణనం నామ షడ్వింశోఽధ్యాయః ॥ 26 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు వైశ్యనాథాహ్వయశివావతారవర్ణనం అనే పేరుగల ఇరువైఆరవ అధ్యాయం సమాప్తం.

## **సప్తవింశోఽధ్యాయః** – ఇరవైఏడవ అధ్యాయం
## **ద్విజేశనామశివావతారవర్ణనమ్** – ద్విజేశ్వరావతారవర్ణనం

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**శృణు తాత! ప్రవక్ష్యామి శివస్య పరమాత్మనః ।**
**ద్విజేశ్వరావతారం చ సశివం సుఖదం సతామ్ ॥ 1 ॥**

వత్సా! విను. పరమాత్మయగు శివుడు పార్వతితో గూడి, సత్పురుషులకు సుఖాలనిచ్చే ద్విజేశ్వరావతారాన్ని ధరించిన గాథను వివరిస్తాను.

**యః పూర్వం వర్ణితస్తాత! భద్రాయుర్నృపసత్తమః ।**
**యస్మిన్నృషభరూపేణానుగ్రహం కృతవాంచ్ఛివః ॥ 2 ॥**

వత్సా! భద్రాయుడనే నృపశ్రేష్ఠుని గూర్చి, ఆయనపై శివుడు ఋషభరూపంతో అనుగ్రహించిన వృత్తాంతాన్ని పూర్వం వర్ణించియున్నాను.

**తద్ధర్మస్య పరీక్షార్థం పునరావిర్బభూవ సః ।**
**ద్విజేశ్వరస్వరూపేణ తదేవ కథయామ్యహమ్ ॥ 3 ॥**

అతని ధర్మాన్ని పరీక్షించడానికి పరమశివుడు మరల ద్విజేశ్వర రూపంతో అవతరించాడు. ఆ వృత్తాంతాన్ని నీకు నేను చెబుతున్నాను విను.

**ఋషభస్య ప్రభావేణ శత్రూన్ జిత్వా రణే ప్రభుః ।**
**ప్రాప్తసింహాసనస్తాత! భద్రాయుః సంబభూవ హ ॥ 4 ॥**

వత్సా! భద్రాయుమహారాజు ఋషభుని ప్రభావంచే యుద్ధంలో శత్రువులను జయించి, సింహాసనాన్ని అధిష్ఠించాడు.

**చంద్రాంగదస్య తనయా సీమంతిన్యాః శుభాంగజా ।**
**పత్నీ తస్యాభవద్బ్రహ్మన్! సుసాధ్వీ కీర్తిమాలినీ ॥ 5 ॥**

ఓ బ్రహ్మన్! సీమంతినీచంద్రాంగదుల కుమార్తెయు, శుభలక్షణములు గలదియు, గొప్ప సాధ్వియునగు కీర్తిమాలిని అతనికి భార్య అయ్యింది.

**స భద్రాయుః కదాచిత్స్వప్రియయా గహనం వనమ్ ।**
**ప్రావిశత్సంవిహారార్థం వసంతసమయే మునే! ॥ 6 ॥**

ఓ మునీ! ఒకనాడు ఆ భద్రాయువు తన ప్రియురాలితో కూడి వసంతకాలంలో విహారార్థం దట్టమైన అడవిలో ప్రవేశించాడు.

**అథ తస్మిన్వనే రమ్యే విజహార స భూపతిః ।**
**శరణాగతపాలిన్యా తమాస్యప్రియయా సహ ॥ 7 ॥**

శరణుజొచ్చినవారిని రక్షించే స్వభావం గల ఆరాజు తన ప్రియురాలితో గూడి సుందరమైన ఆ వనంలో విహరించాడు.

**అథ తద్ధర్మదృఢతాం ప్రతీక్షన్పరమేశ్వరః ।**
**లీలాం చకార తత్రైవ శివయాసహశంకరః ॥ 8 ॥**

అపుడు రాజు యొక్క ధర్మదృఢత్వాన్ని చూడగోరి పరమేశ్వరుడైన శంకరుడు పార్వతీదేవితోగూడి అచటనే ఒకలీలను ప్రదర్శించాడు.

**శివా శివశ్చ భూత్వోభౌ తద్వనే ద్విజదంపతీ ।**
**వ్యాఘ్రం మాయామయం కృత్వాఽఽవిర్భూతౌ నిజలీలయా ॥ 9 ॥**

పార్వతీ పరమేశ్వరులు బ్రాహ్మణ దంపతులుగా మారి ఆ వనంలో ఆవిర్భవించారు. వారు తమ లీలచే మాయారూపమైన పెద్దపులిని సృష్టించారు.

**అథావిదూరే తస్యైవ ద్రవంతౌ భయవిహ్వలౌ ।**
**అన్వీయమానౌ వ్యాఘ్రేణ రుదంతౌ తౌ బభూవతుః ॥ 10 ॥**

వారు ఆ పులికి కొద్ది దూరంలో ఉండి దానిచే తరుమబడుచున్నవారై, భయంతో, కంగారుతో దుఃఖిస్తూ పరుగెత్తుతున్నారు.

**అథ విద్ధౌ చ తౌ తాత! భద్రాయుః స మహీపతిః ।**
**దదర్శ క్రందమానౌ హి శరణ్యః క్షత్రియర్షభః ॥ 11 ॥**

పెద్దపులి వారిని సంహరించడానికి తరుముతుండగా వారు బిగ్గరగా అరుస్తున్నారు. శరణుజొచ్చిన వారిని రక్షించే వీరక్షత్రియుడైన ఆ భద్రాయుమహారాజు వారిని చూశాడు.

**అథ తౌ మునిశార్దూలః స్వమాయాద్విజదంపతీ ।**
**భద్రాయుషం మహారాజమూచతుర్భయవిహ్వలౌ ॥ 12 ॥**

మహర్షీ! అపుడు తమ మాయచే బ్రాహ్మణ దంపతులరూపంలోనున్న వారిద్దరు భయంచే దుఃఖిస్తూ భద్రాయుమహారాజుతో ఇలా పలికారు.

**ద్విజదంపతీ ఊచతుః –** బ్రాహ్మణదంపతులు పలికారు.

**పాహి పాహి మహారాజ! నావుభౌ ధర్మవిత్తమ ।**
**ఏష ఆయాతి శార్దూలో జగ్ధుమావాం మహాప్రభో! ॥ 13 ॥**

మహారాజా! ధర్మవిత్తమా! మమ్ములనిద్దరినీ రక్షించు. ఈ పెద్దపులి మమ్ములనిద్దరినీ తిని వేయడానికి మీదకు వస్తోంది.

**ఏష హింస్రః కాలసమః సర్వప్రాణిభయంకరః ।**
**యావన్న ఖాదతి ప్రాప్య తావన్నౌ రక్ష ధర్మవిత్ ॥ 14 ॥**

యమునితో సమంగా సర్వప్రాణులకు భయాన్ని గొల్పే ఈ క్రూరమృగం మమ్ములను తినివేయముందే ధర్మవేత్తవగు నీవు వచ్చి మమ్ములనిద్దరిని రక్షించు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్థమాక్రందితం శ్రుత్వా తయోశ్చ నృపతీశ్వరః ।**
**అతిశీఘ్రం మహావీరః స యావద్ధనురాదదే ॥ 15 ॥**

వారిద్దరి ఈ ఆర్తనాదాన్ని విని, మహావీరుడైన ఆ మహారాజు మహావేగంతో ధనుస్సును తీసుకున్నాడు.

**తావదభ్యేత్య శార్దూలస్త్వరమాణోఽతిమాయికః ।**
**స తస్య ద్విజవర్యస్య మధ్యే జగ్రాహ తాం వధూమ్ ॥ 16 ॥**

కాని ఇంతలోనే మాయామయమగు ఆ పెద్దపులి వేగంగా వచ్చి, మహారాజునకు, బ్రాహ్మణోత్తమునకు మధ్యలో నున్న అతని భార్యను ఎత్తుకొని పోయింది.

**హే నాథ! నాథ! హే కాంత! హా శంభో! హా జగద్గురో! ।**
**ఇతి రోరూయమాణాం తాం వ్యాఘ్రో జగ్రాస భీషణః ॥ 17 ॥**

హేనాథా! నాథా! హే ప్రియా! హే శంభూ! హే జగద్గురూ! అని బిగ్గరగా కేకలు పెడుతూ ఏడుస్తున్న ఆమెను ఆ పెద్దపులి భక్షించింది.

**తావత్సరాజా నిశితైర్భల్లైర్వ్యాఘ్రమతాడయత్ ।**
**న స తైర్వివ్యథే కించిద్గిరీంద్ర ఇవ వృష్టిభిః ॥ 18 ॥**

అదే సమయంలో ఆ రాజు వాడిబాణాలతో పులిని కొట్టాడు. కాని వర్షధారలు పర్వతానికి వ్యథను కలిగించలేని విధంగా ఆ బాణాలు పెద్దపులిని లేశమైనా వ్యథను కలిగించలేకపోయాయి.

**స శార్దూలో మహాసత్త్వో రాజ్ఞః స్వైరకృతవ్యథః ।**
**బలాదాకృష్య తాం నారీమపాక్రమత సత్వరః ॥ 19 ॥**

మహాబలం గల ఆ పెద్దపులి, రాజుయొక్క బాణాలను లెక్క చేయక, శీఘ్రంగా ఆ యువతిని లాగుకొంటూ అక్కడనుండి వెళ్లిపోయింది.

**వ్యాఘ్రేణాపహృతాం నారీం వీక్ష్య విప్రోఽతివిస్మితః ।**
**లౌకికీం గతిమాశ్రిత్య రురోదాతి ముహుర్ముహుః ॥ 20 ॥**

పెద్దపులి తనభార్యను అపహరిస్తుండగా చూచి, ఆ బ్రాహ్మణుడు మిక్కిలి ఆశ్చర్యాన్ని పొందాడు. ఆ శివుడు లోకపు పోకడననుసరించి అనేక పర్యాయాలు బిగ్గరగా రోదించాడు.

**రుదిత్వా చిరకాలం చ స విప్రో మాయయేశ్వరః ।**
**భద్రాయుషం మహీపాలం ప్రోవాచ మదహారకః ॥ 21 ॥**

మదహారకుడైన శివుడు మాయచే బ్రాహ్మణరూపంలో నున్నవాడై చిరకాలం దుఃఖించి భద్రాయువు మహారాజుతో ఇలా పలికాడు.

**ద్విజేశ్వర ఉవాచ** - ద్విజేశ్వరుడు పలికాడు.

**రాజన్! క్వ తే మహాస్త్రాణి క్వ తే త్రాణం మహద్ధనుః ।**
**క్వ తే ద్వాదశసాహస్రమహానాగాయుతం బలమ్ ॥ 22 ॥**

ఓ రాజా! నీ మహాస్త్రాలు ఎక్కడున్నాయి? ఇతరులను రక్షించే నీ గొప్ప ధనుస్సు ఏది? పన్నెండువేల పెద్ద ఏనుగులతో సమానమైన నీ బలం ఎక్కడ?

**కిం తే ఖడ్గేన శంఖేన కిం తే మంత్రాస్త్రవిద్యయా ।**
**కిం సత్త్వేన మహాస్త్రాణాం కిం ప్రభావేణ భూయసా ॥ 23 ॥**

నీ వద్ద నున్న ఖడ్గంతో గాని, శంఖంతోగాని, మంత్రాలతో గాని, అస్త్రవిద్యతోగాని, అస్త్రాల ప్రభావంతోగాని, గొప్ప మహిమతోగాని ఏమి ప్రయోజనం?

**తత్సర్వం విఫలం జాతం యచ్చాన్యత్త్వయి తిష్ఠతి ।**
**యస్త్వం వనౌకసాం ఘాతం న నివారయితుం క్షమః ॥ 24 ॥**

అది అంతయూ వ్యర్థమయ్యింది. ఇవి గాక ఇంకా నీ వద్ద విద్యలుంటే అవి కూడా వ్యర్థమే. ఎందుకనగా నీవు వనంలో నివసించేవారిని రక్షించలేకపోయావు.

**క్షత్రస్యాయం పరో ధర్మో క్షతాచ్చ పరిరక్షణమ్ ।**
**తస్మిన్కులోచితే ధర్మే నష్టే త్వజ్జీవితేన కిమ్ ॥ 25 ॥**

ఆపదలోనున్నవారిని రక్షించడం క్షత్రియులకు శ్రేష్ఠమైన ధర్మం. కులోచితమైన ఆ ధర్మం నశించిన తరువాత నీవు జీవించి ఉపయోగమేమి?

**ఆర్తానాం శరణాప్తానాం త్రాణం కుర్వంతి పార్థివాః ।**
**ప్రాణైరర్థైశ్చ ధర్మజ్ఞాస్తద్వినా చ మృతోపమా ॥ 26 ॥**

ఆపదలోనుండి శరణు జొచ్చిన వారిని ధర్మజ్ఞులైన రాజులు తమ ప్రాణాలను, సంపదలను బలిపెట్టియైనా రక్షిస్తారు. అట్లు రక్షించనివారు మరణించినవారితో సమానమౌతారు.

**ఆర్తత్రాణవిహీనానాం జీవితాన్మరణం వరమ్ ।**
**ధనినాం దానహీనానాం గార్హస్థ్యాద్భిక్షుతా వరమ్ ॥ 27 ॥**

ఆర్తులను రక్షించలేని జీవితంకంటె మరణం శ్రేష్ఠం. ధనం ఉండియు దానం చేయని గృహస్థాశ్రమం కంటె బిచ్చమెత్తు కోవడం మేలు.

**వరం విషాశనం ప్రాజ్ఞైర్వరమగ్నిప్రవేశనమ్ ।**
**కృపణానామనాథానాం దీనానామపరక్షణాత్ ॥ 28 ॥**

దీనులను, అనాథలను రక్షించలేకపోయినచో, ప్రాజ్ఞుడైన రాజు విషాన్ని మ్రింగికాని, అగ్నిలో ప్రవేశించి గాని మరణించడం మేలు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్థం విలపితం తస్య స్వవీర్యస్య చ గర్హణమ్ ।**
**నిశమ్య నృపతిః శోకాదాత్మన్యేవమచింతయత్ ॥ 29 ॥**

ఈ విధంగా తనపరాక్రమాన్ని నిందిస్తూ ఆ బ్రాహ్మణుడు దుఃఖించడాన్ని చూచి, ఆ మాటలను విని, ఆ రాజు శోకంతో తన మనస్సులో ఇట్లు తలంచాడు.

**అహో మే పౌరుషం నష్టమద్య దేవవిపర్యయాత్ ।**
**అద్య కీర్తిశ్చ మే నష్టా పాతకం ప్రాప్తముత్కటమ్ ॥ 30 ॥**

అయ్యో! దైవం ప్రతికూలించడంచేత ఈనాడు నా పౌరుషం, కీర్తి నశించి ఘోరమైన పాపం చుట్టుకుంది.

**ధర్మః కులోచితో నష్టో మందభాగ్యస్య దుర్మతేః ।**
**నూనం మే సంపదో రాజ్యమాయుష్యం క్షయమేష్యతి ॥ 31 ॥**

దురదృష్టవంతుడను, దుర్బుద్ధినియైన నా క్షత్రియకులోచితమైన ధర్మం నశించింది. నా సంపదలు, రాజ్యం, ఆయుర్దాయం నిశ్చయంగా క్షీణించిపోతాయి.

**అద్య చైనం ద్విజన్మానం హతదారం శుచార్దితమ్ ।**
**హతశోకం కరిష్యామి దత్త్వా ప్రాణానతిప్రియాన్ ॥ 32 ॥**

ఈనాడు భార్యను పోగొట్టుకుని దుఃఖపీడితుడైయున్న ఈ బ్రాహ్మణుని నేను మిక్కిలి ప్రియమైన ప్రాణాలనిచ్చియైననూ శోకవిముక్తుని చేస్తాను.

**ఇతి నిశ్చిత్య మనసా స భద్రాయుర్నృపోత్తమః ।**
**పతిత్వా పాదయోస్తస్య బభాషే పరిసాన్త్వయన్ ॥ 33 ॥**

మనస్సులో ఈవిధంగా నిశ్చయించుకొని ఆ భద్రాయుమహారాజు ఆ బ్రాహ్మణుని పాదాలపై బడి ఓదారుస్తూ ఇలా పలికాడు.

**భద్రాయురువాచ –** భద్రాయువు పలికాడు.

**కృపాం కృత్వా మయి బ్రహ్మన్! క్షత్రబంధౌ హతౌజసి ।**
**శోకం త్యజ మహాప్రాజ్ఞ! దాస్యామ్యద్య తు వాంఛితమ్ ॥ 34 ॥**

ఓ బ్రహ్మన్! మహాజ్ఞానీ! భగ్నమైన పరాక్రమం గల, క్షత్రియాధముడనైన నాయందు దయను చూపుము. శోకాన్ని విడిచిపెట్టుము. నీవు కోరిన దానిని ఇపుడే ఇస్తాను.

**ఇదం రాజ్యమియం రాజ్ఞీ మమేదం చ కళేబరమ్ ।**
**త్వదధీనమిదం సర్వం కిం తేఽభిలషితం వరమ్ ॥ 35 ॥**

ఈ రాజ్యం, ఈ మహారాణి, ఈ దేహం, అన్ని నీ ఆధీనంలో ఉన్నాయి. నీవేమి వరాన్ని కోరుకుంటావో కోరుకో.

**బ్రాహ్మణ ఉవాచ –** బ్రాహ్మణుడు పలికాడు.

**కిమాదర్శేన చాంధస్య కిం గృహైర్భైక్ష్యజీవినః ।**
**కిం పుస్తకేన మూఢస్య నిస్త్రీకస్య ధనేన కిమ్ ॥ 36 ॥**

గ్రుడ్డివానికి అద్దంతో పనియేమి? భిక్షాటనంతో జీవించేవానికి ఇంటితో పనియేమి? మూర్ఖునికి పుస్తకంతో పనియేమి? భార్యలేని వానికి ధనంతో పనియేమి?

**అతోఽహం హతపత్నీకో భుక్తభోగో న కర్హిచిత్ ।**
**ఇమాం తవాగ్రమహిషీం కామయే దీయతామితి ॥ 37 ॥**

నా భార్య అపహరింపబడింది. నేను ఎన్నడూ భోగాలననుభవించలేదు. నేను నీ పట్టమహిషిని కోరుకుంటున్నాను. ఆమెను నాకు ఇమ్ము.

**భద్రాయురువాచ –** భద్రాయువు పలికాడు.

**దాతా రసాంతవిత్తస్య రాజ్యస్య గజవాజినామ్ ।**
**ఆత్మదేహస్య యాస్యాపి కలత్రస్య న కర్హిచిత్ ॥ 38 ॥**

నా రాజ్యాన్ని, ఏనుగులను, గుర్రాలను, నాదేహాన్ని కూడా ఇస్తాను. కాని ఎట్టి పరిస్థితులలోనూ, నాభార్యను మాత్రం ఈయను.

**పరదారోపభోగేన యత్పాపం సముపార్జితమ్ ।**
**న తత్ క్షాళయితుం శక్యం ప్రాయశ్చిత్తశతైరపి ॥ 39 ॥**

పరభార్యాసంభోగంవల్ల వచ్చే పాపాన్ని వంద ప్రాయశ్చిత్తాలైన పోగొట్టలేవు.

**బ్రాహ్మణ ఉవాచ –** బ్రాహ్మణుడు పలికాడు.

**ఆస్తాం బ్రహ్మవధం ఘోరమపి మద్యనిషేవణమ్ ।**
**తపసా విధమిష్యామి కిం పునః పారదారికమ్ ॥ 40 ॥**

ఆ విషయాన్ని అట్లా ఉండనిమ్ము. భయంకరమైన బ్రహ్మహత్యాపాపాన్ని, మద్యపానపాపాన్ని, నేను తపశ్శక్తిచే నశింపజేయగలను. అలాంటప్పుడు పరదారాభిగమనం గురించి చెప్పునదేమున్నది?

**తస్మాత్ప్రయచ్ఛ భార్యాం స్వామియాన్ కామో న మేఽపరః ।**
**అరక్షణాద్భయార్తానాం గంతాసి నిరయన్ ధ్రువమ్ ॥ 41 ॥**

కావున నీ భార్యను నాకు ఇమ్ము. నాకు మరియొక కోరిక లేదు. భయార్తులను రక్షించని నీవు నరకాన్ని పొందుట నిశ్చయం.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇతి విప్రగిరా భీతశ్చింతయామాస పార్థివః ।**
**అరక్షణాన్ మహాపాపం పత్నీదానం తతో వరమ్ ॥ 42 ॥**

బ్రాహ్మణుని యీ వచనాలకు భయపడిన మహారాజు ఈ విధంగా ఆలోచించాడు 'బ్రాహ్మణుని భార్యను రక్షించలేకపోవుట మహాపాపం. కావున భార్యను సమర్పించడమే మేలు'.

**అతః పత్నీం ద్విజాగ్ర్యాయ దత్త్వా నిర్ముక్తకిల్బిషః ।**
**సద్యో వహ్నిం ప్రవేక్ష్యామి కీర్తిశ్చ విదితా భవేత్ ॥ 43 ॥**

కావున నా భార్యను ఈ బ్రాహ్మణశ్రేష్ఠునకు సమర్పించి, నేను పాపం నుండి విముక్తిని పొంది, వెనువెంటనే అగ్నిలో ప్రవేశిస్తాను. నా కీర్తి దశదిశలందు వ్యాపిస్తుంది.

**ఇతి నిశ్చిత్య మనసా సముజ్జ్వాల్య హుతాశనమ్ ।**
**తమాహూయ ద్విజం చక్రే పత్నీదానం సహోదకమ్ ॥ 44 ॥**

మహారాజు మనస్సులో ఇట్లు నిశ్చయించుకొని, అగ్నిని ప్రజ్వరిల్ల జేసి, ఆ బ్రాహ్మణుని పిలిచి, నీటిని వదలి భార్యను సమర్పించాడు.

**స్వయం స్నాతః శుచిర్భూత్వా ప్రణమ్య విబుధేశ్వరాన్ ।**
**తమగ్నిం త్రిః పరిక్రమ్య శివం దధ్యౌ సమాహితః ॥ 45 ॥**

మహారాజు అపుడు తాను స్నానం చేసి పవిత్రుడై శ్రేష్ఠులైన విద్వాంసులకు ప్రణమిల్లి మనస్సును శివునిపై లగ్నం చేసి, అగ్నికి ముమ్మారు ప్రదక్షిణం చేశాడు.

**తమథాగ్నిం పతిష్యంతం స్వపదాసక్తచేతసమ్ ।**
**ప్రత్యషేధత విశ్వేశః ప్రాదుర్భూతో ద్విజేశ్వరః ॥ 46 ॥**

తన పాదాలయందు మనస్సును లగ్నంచేసి అగ్నిలో ప్రవేశించబోవుచున్న మహారాజును, బ్రాహ్మణ శ్రేష్ఠుని రూపంలో నున్న విశ్వేశ్వరుడు ఆవిర్భవించి పట్టుకొని నిలిపివేశాడు.

**తమీశ్వరం పంచముఖం త్రినేత్రం పినాకినం చంద్రకళావతంసమ్ ।**
**ప్రలంబపింగాసుజటాకలాపం మధ్యాహ్నసద్భాస్కర కోటితేజసమ్ ॥ 47 ॥**

అయిదు మోములవాడు, త్రినేత్రుడు, పినాకపాణి, చంద్రశేఖరుడు, వ్రేలాడే పింగవర్ణంగల జటాజూటంగలవాడు, కోటిప్రచండ మధ్యాహ్నసూర్యులతో సమానమైన కాంతిగలవాడు.

**మృణాలగౌరం గజచర్మవాససం గంగాతరంగోక్షితమౌళిదేశకమ్ ।**
**నాగేంద్రహారావళికంఠభూషణం కిరీటకాంచ్యంగదకంకణోజ్జ్వలమ్ ॥ 48 ॥**

తామర తూడువలె గౌరవర్ణం గలవాడు, గజచర్మాన్ని వస్త్రంగా ధరించినవాడు, గంగాతరంగాలతో తడుపబడుచున్న శిరోభాగం గలవాడు, నాగేంద్రహారావళి కంఠహారాలుగా ధరించినవాడు, కిరీటము, అంగదములు, కంకణాలతో వెలిగిపోవుచున్నవాడు,

**శూలాసిఖట్వాంగకుఠారచర్మమృగాభయాష్టాంగపినాకహస్తమ్ ।**
**వృషోపరిస్థం శితికంఠభూషణం ప్రోద్భూతమగ్రే స నృపో దదర్శ ॥ 49 ॥**

శూలము, ఖడ్గము, ఖట్వాంగము, గొడ్డలి, డాలు, మృగము, అభయముద్ర, వరదముద్ర మరియు పినాకము అను వాటిని చేతులలో దాల్చినవాడు, వృషభాన్ని అధిష్ఠించియున్నవాడు, తెల్లని కంఠాభరణాలు గలవాడునైన ఈశ్వరుడు తన ఎదుట ఆవిర్భవించగా ఆ మహారాజు చూశాడు.

**తతోఽంబరాద్ ద్రుతం పేతుర్దివ్యాః కుసుమవృష్టయః ।**
**ప్రణేదుర్దేవతూర్యాణి దేవ్యశ్చ ననృతుర్జగుః ॥ 50 ॥**

అప్పుడు ఆకాశంనుండి దివ్యమైన పుష్పవృష్టి కురిసింది. దేవదుందుభులుమ్రోగాయి. దేవతాస్త్రీలు గానంచేసి నాట్యమాడారు.

**తత్రాజగ్ముః స్తూయమానా హరిర్బ్రహ్మా తథా సురాః ।**
**ఇంద్రాదయో నారదాద్యా మునయశ్చాపరేఽపి చ ॥ 51 ॥**

విష్ణువు, బ్రహ్మ, ఇంద్రాది దేవతలు, నారదాది మహర్షులు, ఇతరులు కూడ స్తోత్రాలను చేస్తూ అచ్చటకు విచ్చేశారు.

**తదోత్సవో మహానాసీత్తత్ర భక్తిప్రవర్ధనః ।**
**సతి పశ్యతి భూపాలే భక్తినమ్రీకృతాంజలౌ ॥ 52 ॥**

అంతట భక్తితో, వినయంతో చేతులు జోడించి మహారాజు చూస్తూ ఉండగా భక్తి ప్రవర్ధకమైన గొప్ప ఉత్సవం జరిగింది.

**తద్దర్శనానందవిజృంభితాశయః ప్రవృద్ధబాష్పాంబువిలిప్తగాత్రః ।**
**ప్రహృష్టరోమా స హి గద్గదాక్షరస్తుష్టావ గీర్భిర్ముకులీకృతాంజలిః ॥ 53 ॥**

శివుని దర్శనంవల్ల కలిగిన ఆనందంతోనిండిన హృదయం గలవాడు, ఆనందబాష్పాలతో తడిసిన అవయవాలు గలవాడు, రోమాంచము, గద్గదమైన కంఠము గలవాడునైన ఆ రాజు చేతులను జోడించి, వాక్కులతో భగవానుని స్తుతించాడు.

**తతస్సభగవాన్రాజ్ఞా సంస్తుతః పరమేశ్వరః ।**
**ప్రసన్నః సహ పార్వత్యా తమువాచ దయానిధిః ॥ 54 ॥**

పార్వతీ సమేతుడు, దయానిధి, పరమేశ్వరుడునగు శివభగవానుడు మహారాజు స్తోత్రాలకు మిక్కిలి ప్రసన్నుడై అతనితో ఇలా పలికాడు.

**రాజంస్తే పరితుష్టోఽహం భక్త్యా త్వద్ధర్మతోఽధికమ్ ।**
**వరం బ్రూహి సపత్నీకం ప్రయచ్ఛామి న సంశయః ॥ 55 ॥**

ఓ రాజా! నీ భక్తికి, ధర్మబుద్ధికి నేను చాలాసంతోషించాను. నీవు భార్యతోగూడి వరాన్ని కోరుకో, నిస్సందేహంగా ఇస్తాను.

**తవ భావపరీక్షార్థం ద్విజో భూత్వాఽహమాగతః ।**
**వ్యాఘ్రేణ యా పరిగ్రస్తా సాక్షాద్దేవీ శివా హి సా ॥ 56 ॥**

నీ హృదయాన్ని పరీక్షించడానికే నేను బ్రాహ్మణవేషంలో వచ్చాను. పెద్దపులిచే అపహరింపబడిన యువతి సాక్షాత్తుగా పార్వతియే.

**వ్యాఘ్రో మాయామయో యస్తే శరైరక్షతవిగ్రహః ।**
**ధీరతాం ద్రష్టుకామస్తే పత్నీం యాచితవానహమ్ ॥ 57 ॥**

ఆ పెద్దపులి నా మాయచే సృష్టింపబడింది. అందువల్లనే, నీ బాణాలు దానికి హానిని చేయలేకపోయాయి. నేను నీ ధైర్యాన్ని పరీక్షించడానికే నీ భార్యనిమ్మని అడిగాను – అని శివుడు పలికాడు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యాకర్ణ్య ప్రభోర్వాక్యం సభద్రాయుర్మహీపతిః ।**
**పునః ప్రణమ్య సంస్తుత్య స్వామినం నతకోఽబ్రవీత్ ॥ 58 ॥**

శివప్రభుని ఈ మాటలను విని, భద్రాయుమహారాజు మరల ఆ ప్రభువుకు ప్రణమిల్లి, చక్కగా స్తుతించి, వినయంతో ఇలా పలికాడు.

**భద్రాయురువాచ –** భద్రాయువు పలికాడు.

**ఏక ఏవ వరో నాథ! యద్భవాన్పరమేశ్వరః ।**
**భవతాపప్రతప్తస్య మమ ప్రత్యక్షతాం గతః ॥ 59 ॥**

ఓ నాథా! సంసారతాపంచే ప్రతప్తుడనైన నాకు నీవు ప్రత్యక్షమయ్యావు. ఇది యే నాకు గొప్పవరం.

**యద్దదాసి పునర్నాథ! వరం స్వకృపయా ప్రభో! ।**
**వృణేఽహం పరమం త్యక్తో వరం హి వరదర్షభాత్ ॥ 60 ॥**

ఓ ప్రభూ! వరముల నిచ్చు వారిలో శ్రేష్ఠుడవైన నీవు, నీ కృపతో వరాన్ని ఇస్తున్నావు కావున, నేను నిన్ను ఒకే వరాన్ని కోరుతున్నాను.

**వజ్రబాహుః పితా మే హి సపత్నీకో మహేశ్వర! ।**
**సపత్నీకస్త్వహం నాథ! సదా త్వత్పాదసేవకః ॥ 61 ॥**

ఓనాథా! ఓ మహేశ్వరా! అన్నివేళలా నీ పాదసేవకులము. నా తండ్రియైన వజ్రబాహుడు, నాతల్లి, ఎప్పుడు మీ పాదసేవకులము. నేను, నాభార్య.

**వైశ్యః పద్మాకరో నామ తత్పుత్రస్సనయాభిధః ।**
**సర్వానేతాన్మహేశాన! సదా త్వం పార్శ్వగాన్కురు ॥ 62 ॥**

పద్మాకరుడనే వైశ్యుడు, సనయనుడనే అతని కుమారుడు, ఈ అందరినీ సర్వదా నీ ప్రక్కనే ఉండువారిగా అనుగ్రహించండి – అని భద్రాయువు కోరాడు.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**అథ రాజ్ఞీ చ తత్పత్నీ ప్రమత్తా కీర్తిమాలినీ ।**
**భక్త్యా ప్రసాద్య గిరిశం యయాచే వరముత్తమమ్ ॥ 63 ॥**

అనంతరం అతని భార్యయైన కీర్తిమాలిని మిక్కిలి ఆనందించినదై భక్తితో శివుని ప్రసన్నం చేసుకొని, ఉత్తమమైన వరాన్ని కోరింది.

**రాజ్ఞ్యువాచ** – రాణి పలికింది.

**చంద్రాంగదో మమ పితా మాతా సీమంతినీ చ మే ।**
**తయోర్యాచే మహాదేవ! త్వత్పార్శ్వే సన్నిధిం ముదా ॥ 64 ॥**

ఓ మహాదేవా! నా తండ్రియైన చంద్రాంగదుడు, నా తల్లియైన సీమంతిని, నీ సన్నిధిలో నీ ప్రక్కన ఆనందంగా ఉండే వరాన్ని ప్రసాదించమని వేడుకొంది.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఏవమస్త్వితి గౌరీశః ప్రసన్నో భక్తవత్సలః ।**
**తయోః కామవరాన్ దత్త్వా క్షణాదంతర్హితోఽభవత్ ॥ 65 ॥**

భక్తవత్సలుడు, పార్వతీ సమేతుడైన పరమేశ్వరుడు 'తథాస్తు' (అటులనే యగుగాక) అని పలికి, వారు కోరిన వరాలనిచ్చి, క్షణంలో అంతర్ధానమయ్యాడు.

**భద్రాయురపి సుప్రీత్యా ప్రసాదం ప్రాప్య శూలినః ।**
**సహితః కీర్తిమాలిన్యా బుభుజే విషయాన్బహూన్ ॥ 66 ॥**

పరమేశ్వరుని అనుగ్రహాన్ని పొంది, భద్రాయువు కీర్తిమాలినితో కలిసి అనేక భోగాలను మిక్కిలి ప్రీతితో అనుభవించాడు.

**కృత్వా వర్షాయుతం రాజ్యమవ్యాహతపరాక్రమః ।**
**రాజ్యం నిక్షిప్య తనయే జగామ శివసన్నిధిమ్ ॥ 67 ॥**

ఎదురులేని పరాక్రమంగల ఆ మహారాజు పదివేల సంవత్సరాల కాలం రాజ్యాన్ని పాలించి, రాజ్యాన్ని కుమారునికి అప్పగించి, శివుని సన్నిధికి చేరుకొన్నాడు.

**చంద్రాంగదోఽపి రాజేంద్రో రాజ్ఞీ సీమంతినీ చ సా ।**
**భక్త్యా సంపూజ్య గిరిశం జగ్మతుః శాంభవం పదమ్ ॥ 68 ॥**

చంద్రాంగద మహారాజు, మరియు మహారాణియునైన సీమంతిని భక్తితో శివుని పూజించి, శివసాయుజ్యం చేరుకొన్నారు.

**ద్విజేశ్వరావతారస్తే వర్ణితః పరమో మయా ।**
**మహేశ్వరస్య భద్రాయుపరమానందదః ప్రభో! ॥ 69 ॥**

ఓ ప్రభూ! భద్రాయువునకు పరమానందాన్ని అనుగ్రహించిన మహేశ్వరుని ద్విజేశ్వరావతారాన్ని గూర్చి నీకు వర్ణించి చెప్పాను.

**ఇదం చరిత్రం పరమం పవిత్రం శివావతారస్య పవిత్రకీర్తేః ।**
**ద్విజేశసంజ్ఞస్య మహాద్భుతం హి శృణ్వన్ పఠన్ శంభుపదం ప్రయాతి ॥ 70 ॥**

పవిత్రమైన కీర్తిగల శివుని ఈ ద్విజేశ్వరావతారగాథ మిక్కిలి పావనమైనది. మహాద్భుతమైనది. దీనిని వినినవారు, చదివినవారు, శంభుపదాన్ని పొందుతారు.

**య ఇదం శృణుయాన్నిత్యం శ్రావయేద్వా సమాహితః ।**
**న శ్చ్యోతతి స్వధర్మాత్స పరత్ర లభతే గతిమ్ ॥ 71 ॥**

ఎవడైతే దీనిని నిత్యం వింటాడో, శ్రద్ధతో ఇతరులకు వినిపిస్తాడో, అట్టివాడు ధర్మంనుండి పతితుడుగాడు. అతడు దేహత్యాగం తర్వాత పరమగతిని పొందుతాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం ద్విజేశనామశివావతారవర్ణనం నామ సప్తవింశోఽధ్యాయః ॥ 27 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు ద్విజేశ్వరావతారవర్ణనం అనే పేరుగల ఇరవైఏడవ అధ్యాయం సమాప్తం.

## అష్టావింశోఽధ్యాయః - ఇరవై ఎనిమిదవ అధ్యాయం

## యతినాథ - బ్రహ్మహంసాహ్వయశివావతారచరితవర్ణనమ్ - యతినాథ-బ్రహ్మహంస అనే శివావతారచరిత్రవర్ణనం

**నందీశ్వర ఉవాచ -** నందీశ్వరుడు పలికాడు.

**శ్రుణు ప్రాజ్ఞ! ప్రవక్ష్యామి శివస్య పరమాత్మనః ।**
**అవతారం పురానందం యతినాథాహ్వయం మునే! ॥ 1 ॥**

ఓ ప్రాజ్ఞా! మునీశ్వరా! పూర్వం పరమాత్మయైన శివుడు ఆనందదాయకమైన యతినాథావతారాన్ని స్వీకరించాడు. ఆ వృత్తాంతాన్ని చెబుతాను విను.

**అర్బుదాచలసంజ్ఞే తు పర్వతే భిల్లవంశజః ।**
**ఆహుకశ్చ తదభ్యాశే వసతి స్మ మునీశ్వర! ॥ 2 ॥**

మునివర్యా! అర్బుదాచలమనే పర్వతానికి సమీపంలో భిల్లవంశానికి చెందిన ఆహుకుడను వ్యక్తి నివసించేవాడు.

**తత్పత్నీ హ్యాహుకా నామ బభూవ కిల సువ్రతా ।**
**ఉభావపి మహాశైవావాస్తాం తౌ శివపూజకౌ ॥ 3 ॥**

అతని భార్యయైన ఆహుక మంచి నిష్ఠగలది. వారిరువురు శివపూజను చేసే గొప్ప శివభక్తులు.

**కస్మింశ్చిత్సమయే భిల్లః శివభక్తిరతః సదా ।**
**ఆహారార్థం స్వపత్న్యాశ్చ సుదూరం స గతో మునే! ॥ 4 ॥**

ఓ మునిశ్రేష్ఠా! ఎల్లప్పుడు శివభక్తినిష్ఠుడై ఉండే ఆ భిల్లుడు ఒకనాడు తన భార్యకు ఆహారం తేవడానికి చాలా దూరం వెళ్ళాడు.

**ఏతస్మిన్నంతరే తత్ర గేహే భిల్లస్య శంకరః ।**
**భూత్వా యతివపుః సాయం పరీక్షార్థం సమాయయౌ ॥ 5 ॥**

ఇంతలో సాయంకాలసమయమయ్యింది. ఆ సమయంలో శంకరుడు అతనిని పరీక్షించడానికి యతివేషాన్ని ధరించి ఆ భిల్లుని ఇంటికి వచ్చాడు.

**తస్మిన్నవసరే తత్ర జగామ స గృహాధిపః ।**
**పూజనం చ యతీశస్య చకార ప్రేమతః సుధీః ॥ 6 ॥**

అదే సమయంలో గృహయజమానియు పవిత్రమైన బుద్ధిగలవాడునైన ఆ భిల్లుడు అచటకు చేరుకుని ఆ యతీశ్వరుని ప్రేమతో పూజించాడు.

**తద్భావస్య పరీక్షార్థం యతిరూపస్స శంకరః ।**
**మహాలీలాతరః ప్రీత్యా భీతం ప్రోవాచ దీనగీః ॥ 7 ॥**

గొప్పలీలలను ప్రకటించే శంకరుడు ప్రేమతో అతని భావాన్ని పరీక్షింపగోరి, భయపడుతూ, ఆ భిల్లునితో దైన్యంగా ఇలా పలికాడు.

**యతినాథ ఉవాచ –** యతినాథుడు పలికాడు.

**అద్య స్థలం నివాసార్థం దేహి మే ప్రాతరేవ హి ।**
**యాస్యామి సర్వథా భిల్ల! స్వస్తి స్యాత్తవ సర్వదా ॥ 8 ॥**

ఓ భిల్లా! ఈరోజు నేను నివసించడానికి చోటు నియ్యి. ఉదయాన్నే తప్పని సరిగా వెళ్తాను. నీకు సర్వదా శుభమగుగాక!

**భిల్ల ఉవాచ –** భిల్లుడు పలికాడు.

**సత్యం ప్రోక్తం త్వయా స్వామిన్! శృణు మద్వచనం చ తే ।**
**అతిస్వల్పం స్థలం మే హి స్యాన్నివాసః కథం తవ ॥ 9 ॥**

ఓ స్వామీ! మీరు చక్కగా మాట్లాడారు. కాని నా మాటను కూడ వినండి. నాయిల్లు చాలా చిన్నది. మీరెలా నివసించగలరు?

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్తస్స యతిస్తేన గమనాయ మతిం దధే ।**
**తావద్భిల్ల్యా వచః ప్రోక్తం స్వామినం సంవిచార్య వై ॥ 10 ॥**

అతడిలా పలుకగా, ఆ యతి మరలి పోవడానికి నిశ్చయించుకున్నాడు. ఇంతలో ఆ భిల్లుని భార్య ఆలోచించి తన భర్తతో ఇట్లు పలికింది.

**భిల్ల్యువాచ –** భిల్లునిభార్య పలికింది.

**స్వామిన్! దేహి యతేః స్థానం విముఖం కురు మాఽతిథిమ్ ।**
**గృహధర్మం విచార్య త్వమన్యథా ధర్మసంక్షయః ॥ 11 ॥**

ఓ స్వామీ! ఈ యతికి స్థానాన్ని ఇవ్వండి. అతిథి తిరిగి వెళ్లిపోయేటట్లు చేయవద్దు. గృహస్థధర్మాన్ని గూర్చి ఆలోచించండి. అతిథిని ఆదరించనిచో ధర్మం తొలగిపోతుంది.

**స్థీయతాన్తే గృహాభ్యంతః సుఖేన యతినా సహ ।**
**అహం బహిః స్థితిం కుర్యామాయుధాని బృహన్త్యపి ॥ 12 ॥**

నీవు ఈయతితో కలిసి లోపల సుఖంగా ఉండుము. నేను, గొప్ప ఆయుధాలతో పాటు బయట ఉంటాను.

**నందీశ్వర ఉవాచ -** నందీశ్వరుడు పలికాడు.

**తస్యాస్తద్వచనం శ్రుత్వా భిల్ల్యా ధర్మాన్వితం శివమ్ ।**
**స్వపత్న్యా మనసా తేన భిల్లేన చ విచారితమ్ ॥ 13 ॥**

తన భార్యపలికిన ఈ మాటలను విని భిల్లుడు తన మనస్సులో ఇట్లు తలపోశాడు.

**స్త్రియం బహిశ్చ నిష్కాస్య కథం స్థేయం మయా గృహే ।**
**యతేరన్యత్ర గమనమధర్మకరమాత్మనః ॥ 14 ॥**

స్త్రీని బయటకు నెట్టి లోపల నేనెట్లు ఉండగలను? ఈ యతి మరియొక స్థలానికి వెళ్లినచో నాకు అధర్మం చుట్టుకుంటుంది.

**ద్వయమప్యుచితం నైవ సర్వథా గృహమేధినః ।**
**యద్భావి తద్భవేదేవ మయా స్థేయం గృహాద్బహిః ॥ 15 ॥**

గృహస్థుడనైన నాకు ఈ రెండు విధానాలు కూడ ఉచితమైనవి గావు. జరుగవలసింది జరిగితీరుతుంది. నేనే ఇంటి బయట ఉంటాను.

**ఇత్యాగ్రహస్తదా కృత్వా గృహాంతః స్థాప్య తౌ ముదా ।**
**స్వాయుధాని చ సంస్థాప్య భిల్లో ౽తిష్ఠద్గృహాద్బహిః ॥ 16 ॥**

అని అతడు దృఢంగా నిశ్చయించుకొని వారినిద్దరినీ లోపల ఉంచి, ఆయుధాలను బయట ఉంచి తాను కూడ ఇంటిబయట ఉన్నాడు.

**రాత్రౌ తం పశవః క్రూరా హింసకాః సమపీడయన్ ।**
**తేనాపి చ యథాశక్తి కృతో యత్నో మహాంస్తదా ॥ 17 ॥**

రాత్రియందు క్రూరమృగాలు అతనిని చాలా పీడించాయి. అయినను అతడు యథాశక్తిగా వాటిని ఎదుర్కొనడంలో గొప్ప ప్రయత్నం చేశాడు.

**ఏవం యత్నం ప్రకుర్వాణః స భిల్లో బలవానపి ।**
**ప్రారబ్ధాత్ప్రేరితైర్హింస్రైర్బలాదాసీచ్చ భక్షితః ॥ 18 ॥**

ఆ భిల్లుడు బలవంతుడైనను, ఈ తీరున ఎంత ప్రయత్నం చేసిననూ, తన ప్రారబ్ధంచే ప్రేరితమైన క్రూరమృగాలు అతనిని భక్షించాయి.

**ప్రాతరుత్థాయ స యతిర్దృష్ట్వా హింస్రైశ్చ భక్షితమ్ ।**
**భిల్లం వనే చరంతం వై దుఃఖితో౽భూదతీవ హి ॥ 19 ॥**

ఆ యతి ఉదయాన్నే నిద్రలేచి, ఆ భిల్లుడు క్రూరమృగాలచే భక్షింపబడటం చూచి మిక్కిలి దుఃఖితుడయ్యాడు.

**దుఃఖితం తం యతిం దృష్ట్వా భిల్లీ సా దుఃఖితాపి హి ।**
**ధైర్యాత్స్వదుఃఖం సంహృత్య వచనం చేదమబ్రవీత్ ॥ 20 ॥**

ఆ భిల్లుని భార్య తాను స్వయంగా దుఃఖితురాలైనప్పకీ, దుఃఖితుడై యున్న యతిని గాంచి, ధైర్యంతో తన దుఃఖాన్ని నిలద్రొక్కుకొని ఇలా పలికింది.

**భిల్ల్యువాచ –** భిల్లుని భార్య పలికింది.

**కిమర్థం క్రియతే దుఃఖం భద్రం జాతే యతేఽధునా ।**
**ధన్యోఽయం కృతకృత్యశ్చ యజ్జాతో మృత్యురీదృశః ॥ 21 ॥**

ఓ యతీంద్రా! మీరెల దుఃఖిస్తున్నారు? ఇప్పుడు మంగళమే జరిగింది. ఈ విధమైన మృత్యువును పొందిన ఈ భిల్లుడు ధన్యుడు, కృతార్థుడునైనాడు.

**అహం చైనం గమిష్యామి భస్మ భూత్వాఽనలే యతే! ।**
**చితాం కారయ సుప్రీత్యా స్త్రీణాం ధర్మః సనాతనః ॥ 22 ॥**

ఓ యతీంద్రా! నేను కూడ అగ్నిలో బూడిదయై ఇతని వెనుక వెళ్తాను. మిక్కిలి ప్రీతితో చితిని ఏర్పాటు చేయండి. ఇదియే స్త్రీలకు సనాతనధర్మము.

**ఇతి తద్వచనం శ్రుత్వా హితం మత్వా స్వయం యతిః ।**
**చితాం వ్యరచయత్సా హి ప్రవివేశ స్వధర్మతః ॥ 23 ॥**

ఆమె మాటలను వినిన యతి అట్లు చేయుటయే హితకరమని తలంచి, స్వయంగా చితిని ఏర్పరచగా, ఆమె తన ధర్మాన్ని అనుసరించి అగ్నిలో ప్రవేశించింది.

**ఏతస్మిన్నంతరే సాక్షాత్పురః ప్రాదురభూచ్ఛివః ।**
**ధన్యే! ధన్యే! ఇతి ప్రీత్యా ప్రశంసంస్తాం హరోఽబ్రవీత్ ॥ 24 ॥**

ఇంతలో ఆమె ఎదుట పాపహారియైన శివుడు స్వయంగా ప్రత్యక్షమై 'ఓ ధన్యురాలా! ధన్యురాలా!' అని ప్రీతితో ప్రశంసించి ఇలా పలికాడు.

**హర ఉవాచ –** హరుడు పలికాడు.

**వరం బ్రూహి ప్రసన్నోఽస్మి త్వదాచరణతోఽనఘే! ।**
**తవాదేయం న వై కించిద్వశ్యోఽహం తే విశేషతః ॥ 25 ॥**

ఓ పుణ్యాత్మురాలా! నీ ఆచరణచే ప్రసన్నుడనయ్యాను. వరాన్ని కోరుకో. నీకు ఈయదగిన వరమేదీ లేదు. నేను నీకు పూర్ణంగా వశుడనయ్యాను.

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**తచ్ఛ్రుత్వా శంభువచనం పరమానందదాయకమ్ ।**
**సుఖం ప్రాప్తం విశేషేణ న కించిత్స్మరణం యయౌ ॥ 26 ॥**

పరమానందదాయకమైన శంభుని వచనాలను విని ఆమె మహాసుఖాన్ని పొంది, సర్వాన్ని విస్మరించింది.

**తస్యాస్తద్గతిమాలక్ష్య సుప్రసన్నో హరోఽభవత్ ।**
**ఉవాచ చ పునః శంభుర్వరం బ్రూహీతి తాం ప్రభుః ॥ 27 ॥**

ఆమెయొక్క ఆ స్థితిని గాంచి పాపహారియైన శంభుప్రభువు మిక్కిలి ప్రసన్నుడై, వరాన్ని కోరుకొమ్మని ఆమెతో చెప్పి, ఆమెతో ఇంకనూ ఇలా పలికాడు.

**శివ ఉవాచ** - శివుడు పలికాడు.

**అయం యతిశ్చ మద్రూపో హంసరూపో భవిష్యతి ।**
**పరజన్మని వాం ప్రీత్యా సంయోగం కారయిష్యతి ॥ 28 ॥**

నా అవతారమైన ఈ యతి మీయొక్క తరువాతి జన్మలో హంసరూపాన్ని పొంది, మీ ఇద్దరిని ప్రేమపూర్వకంగా కలుపుతాడు.

**భిల్లశ్చ వీరసేనస్య నైషధే నగరే వరే ।**
**మహాన్పుత్రో నలో నామ భవిష్యతి న సంశయః ॥ 29 ॥**

ఈ భిల్లుడు నైషధనగరంలో మహారాజైన వీరసేనునికి పుత్రుడై జన్మించి, నలుడనే పేరుతో ప్రఖ్యాతిని పొందుతాడు. ఇందులో సందేహం లేదు.

**త్వం సుతా భీమరాజస్య వైదర్భే నగరేఽనఘే! ।**
**దమయంతీ చ విఖ్యాతా భవిష్యసి గుణాన్వితా ॥ 30 ॥**

ఓపుణ్యాత్మురాలా! విదర్భదేశరాజధానిలో ఆ దేశ మహారాజైన భీమరాజుకు కుమార్తెవై జన్మిస్తావు. సద్గుణాలతో విలసిల్లే నీవు 'దమయంతి' అనే పేరుతో ఖ్యాతిని పొందుతావు.

**యువాం చోభౌ మిలిత్వా చ రాజభోగం సువిస్తరమ్ ।**
**భుక్త్వా ముక్తిం చ లప్స్యేథే యోగినామపి దుర్లభామ్ ॥ 31 ॥**

మీరిద్దరు కలిసి మహారాజభోగాలననుభవించి, యోగీశ్వరులకైనను లభ్యంకాని ముక్తిని నిశ్చయంగా పొందుతారు.

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వా చ స్వయం శంభుర్లింగరూపోఽభవత్తదా ।**
**తస్మాన్న చలితో ధర్మాదచలేశ ఇతి స్మృతః ॥ 32 ॥**

శంభుడిట్లు పలికి తాను స్వయంగా లింగరూపాన్ని ధరించాడు. ధర్మాన్ని తప్పలేదు. కావున అతనికి అచలేశుడని పేరు కలిగింది.

**స భిల్ల ఆహుకశ్చాపి వీరసేనసుతోఽభవత్ ।**
**నైషధే నగరే తాత! నలనామా మహానృపః ॥ 33 ॥**

వత్సా! ఆహుకుడనే ఆ భిల్లుడు నైషధనగరంలో వీరసేనుని పుత్రుడై జన్మించాడు. అతడు నలమహారాజుగా ప్రఖ్యాతిని పొందాడు.

**ఆహుకా సా మహాభిల్లీ భీమస్య తనయాఽభవత్ ।**
**వైదర్భే నగరే రాజ్ఞో దమయంతీతి విశ్రుతా ॥ 34 ॥**

'ఆహుక' అనే ఆ భిల్ల యువతి వైదర్భనగరంలో భీమమహారాజునకు కుమార్తెయై జన్మించింది. దమయంతి అనే పేరుతో ప్రఖ్యాతిని పొందింది.

**యతినాథాహ్వయస్సోఽపి హంసరూపోఽభవచ్ఛివః ।**
**వివాహం కారయామాస దమయన్త్యా నలేన వై ॥ 35 ॥**

యతినాథుడుగా అవతరించిన ఆ శివుడు కూడ హంసరూపాన్ని దాల్చి నలదమయంతుల వివాహాన్ని జరిపించాడు.

**పూర్వసత్కారరూపేణ మహాపుణ్యేన శంకరః ।**
**హంసరూపం విధాయైవ తాభ్యాం సుఖమదాత్ప్రభుః ॥ 36 ॥**

పూర్వజన్మలో చేసిన సత్కారమనే మహాపుణ్యంచే శంకరప్రభుడు హంసరూపాన్ని ధరించి వారిద్దరికి సుఖాన్ని కలిగించాడు.

**శివో హంసావతారో హి నానావార్తావిచక్షణః ।**
**దమయన్త్యా నలస్యాపి పరమానందదాయకః ॥ 37 ॥**

అనేక సందేశాలనందజేయడంలో సమర్థుడైన శివుని ఈ హంసావతారం నలదమయంతులకు పరమానందాన్ని కలిగించింది.

**ఇదం చరితం పరమం పవిత్రం శివావతారస్య పవిత్రకీర్తేః ।**
**యతీశసంజ్ఞస్య మహాద్భుతం హి హంసాహ్వయస్యాపి విముక్తిదం హి ॥ 38 ॥**

శివుడు యతినాథునిగా, హంసగా అవతరించిన ఈ చరిత్ర పరమపవిత్రమైనది. ముక్తినిచ్చేది, మరియు మహాద్భుతమైనది.

**యతీశబ్రహ్మహంసాఖ్యావతారచరితం శుభమ్ ।**
**శృణుయాచ్ఛ్రావయేద్యో హి స లభేత పరాం గతిమ్ ॥ 39 ॥**

యతీశ్వరుడు, మరియు బ్రహ్మయొక్క హంస అనే ఈ రెండు అవతారాల శుభచరిత్రను ఎవడు వినిపిస్తాడో, వాడు పరమగతిని పొందుతాడు.

**ఇదమాఖ్యానమనఘం సర్వకామఫలప్రదమ్ ।**
**స్వర్గ్యం యశస్యమాయుష్యం భక్తివర్ధనముత్తమమ్ ॥ 40 ॥**

ఈ వృత్తాంతం పవిత్రమైనది. సర్వకామమును, ఫలాలను ఈడేరిస్తుంది. స్వర్గాన్ని, యశస్సును, ఆయుష్షును ఇస్తుంది. ఈ గాథ ఉత్తమమైన భక్తిని వర్ధిల్లజేస్తుంది.

**శ్రుత్వైతచ్చరితం శంభోర్యతిహంసస్వరూపయోః ।**
**ఇహ సర్వసుఖం భుక్త్వా సోఽన్తే శివపురం వ్రజేత్ ॥ 41 ॥**

శంభుని యతినాథ, హంసావతారాల ఈ చరిత్రను వినే వ్యక్తి ఇహలోకంలో సుఖాలనన్నింటిని అనుభవించి, మరణించిన పిదప శివుని పదాన్ని కూడ పొందుతాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం యతినాథ - బ్రహ్మహంసాహ్వయశివావతార చరితవర్ణనం నామాష్టావింశోఽధ్యాయః ॥ 28 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు యతినాథ-బ్రహ్మహంస అను పేరుగల యతినాథ-బ్రహ్మహంస అనే శివావతారచరిత్రవర్ణనం అనే పేరుగల ఇరవైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## ఏకోనత్రింశోఽధ్యాయః - ఇరవైతొమ్మిదవ అధ్యాయం

## కృష్ణదర్శనశివావతారవర్ణనమ్ - కృష్ణదర్శనశివావతారవర్ణనం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**సనత్కుమార! శంభోస్త్వమవతారం పరం శృణు ।**
**నభగజ్ఞానదం కృష్ణదర్శనాహ్వాయముత్తమమ్ ॥ 1 ॥**

ఓ సనత్కుమారా! నభగునకు జ్ఞానాన్ని ప్రసాదించిన, కృష్ణదర్శనమను పేరుగల శంభుని పరమోత్తమావతారాన్ని గూర్చి వినుము.

**ఇక్ష్వాకుప్రముఖా ఆసన్ శ్రాద్ధదేవసుతాశ్చ యే ।**
**నభగస్తత్ర నవమో నాభగస్తత్సుతః స్మృతః ॥ 2 ॥**

శ్రాద్ధదేవుడనే మనువునకు ఇక్ష్వాకువు మొదలైన పుత్రులున్నారు. వారిలో నభగుడు తొమ్మిదవవాడు. అతని కుమారుడు నాభగుడు.

**అంబరీషస్సుతస్తస్య విష్ణుభక్తో బభూవ సః ।**
**యస్యోపరి ప్రసన్నోఽభూద్దుర్వాసా బ్రహ్మభక్తితః ॥ 3 ॥**

విష్ణుభక్తుడైన అంబరీషుడు నాభగుని కుమారుడు అతని బ్రాహ్మణభక్తిని గాంచి దుర్వాసుడాతనిపై మిక్కిలి ప్రసన్నుడయ్యాడు.

**పితామహోఽమ్బరీషస్య నభగో యః ప్రకీర్తితః ।**
**తచ్చరితం శృణు మునే! యస్మై జ్ఞానమదాచ్ఛివః ॥ 4 ॥**

అంబరీషుని పితామహుడగు నభగునకు శివుడు జ్ఞానాన్ని ప్రసాదించాడు. ఆ వృత్తాంతం వినుము.

**నభగో మనుపుత్రస్తు పఠనార్థం సుబుద్ధిమాన్ ।**
**చక్రే గురుకులే వాసం బహుకాలం జితేంద్రియః ॥ 5 ॥**

మనువుయొక్క పుత్రుడైన నభగుడు చాలా బుద్ధిమంతుడు. అతడు విద్యాభ్యాసానికై చిరకాలం జితేంద్రియుడై గురుకులంలో నివసించాడు.

**ఏతస్మిన్సమయే తే వా ఇక్ష్వాకుప్రముఖాస్సుతాః ।**
**తస్మై భాగమకల్ప్యైవ భేజుర్భాగాన్నిజాన్క్రమాత్ ॥ 6 ॥**

ఆ సమయంలో ఇక్ష్వాకుడు మున్నగు మిగిలిన సోదరులు అతనికి వాటాను ఈయకుండగానే, తమ తమ భాగాలను పంచుకొన్నారు.

**స్వం స్వం భాగం గృహీత్వా తే బుభుజూ రాజ్యముత్తమమ్ ।**
**అవిషాదం మహాభాగాః పిత్రాదేశాత్సుబుద్ధయః ॥ 7 ॥**

మంచిబుద్ధిమంతులు, మహాత్ములునైన వారు తండ్రి ఆదేశించిన తమ తమ భాగాలను స్వీకరించి, దుఃఖమెరుగక ఉత్తమమగు రాజ్యాన్ని అనుభవించారు.

**స పశ్చాదాగతస్తత్ర బ్రహ్మచారీ గురుస్థలాత్ ।**
**నభగోఽధీత్య సర్వాశ్చ సాంగోపాంగాః శ్రుతీః క్రమాత్ ॥ 8 ॥**

బ్రహ్మచారియైన నభగుడు సాంగోపాంగంగా వేదాలనన్నింటినీ క్రమంగా అధ్యయనం చేసి, అనంతరం గురుకులంనుండి ఇంటికి వచ్చాడు.

**భ్రాతౄన్విలోక్య నభగో విభక్తాన్సకలాన్నిజాన్ ।**
**దాయార్థీ ప్రాహ తాన్ స్నేహాదిక్ష్వాకుప్రముఖాన్మునే ॥ 9 ॥**

మునీశ్వరా! నభగుడు, తమ తమ భాగాలననుభవిస్తున్న ఇక్ష్వాకువు మున్నగు తన సోదరులను గాంచి, తన భాగాన్ని కోరుకోదలచి వారితో ప్రేమపూర్వకంగా ఇలా పలికాడు.

**నభగ ఉవాచ -** నభగుడు పలికాడు.

**భ్రాతరో భక్తకం మహ్యం దాయం కృత్వా యథాతథమ్ ।**
**సర్వే విభక్తాస్సుప్రీత్యా స్వదాయార్థాగతాయ చ ॥ 10 ॥**

సోదరులారా! నాకు భాగాన్ని ఇవ్వకుండగానే, మీరందరు సర్వాన్ని ఆనందంగా పంచుకున్నారు. నేను నా భాగం కొరకు వచ్చాను.

**తదా విస్మృతమస్మాభిరిదానీం పితరం తవ ।**
**విభజామో వయం భాగం తం గృహాణ న సంశయః ॥ 11 ॥**

"అప్పుడు నీకు భాగమిచ్చుట మాచే విస్మరించబడింది. ఇప్పుడు నీవు తండ్రిని నీ భాగంగా స్వీకరించు. సందేహం వలదు".

**తచ్ఛ్రుత్వా భ్రాతృవచనం నభగః పరవిస్మితః ।**
**తదోపకంఠమాగత్య పితరం సమభాషత ॥ 12 ॥**

ఇట్లు పలికిన సోదరుల మాటను విని నభగుడు మిక్కిలి ఆశ్చర్యాన్ని పొంది తండ్రివద్దకు వచ్చి ఇట్లు పలికాడు.

**నభగ ఉవాచ -** నభగుడు పలికాడు.

**హే తాత! భ్రాతరః సర్వే త్యక్త్వా మాం వ్యభజంశ్చ తే ।**
**పఠనార్థం గతశ్చాహం బ్రహ్మచారీ గురోః కులే ॥ 13 ॥**

ఓ తండ్రీ! బ్రహ్మచారినైన నేను విద్యాభ్యాసంకొరకు గురుకులానికి వెళ్లియుండగా, సోదరులందరు నన్ను విడిచి వారు భాగాలను పంచుకున్నారు.

**తత ఆగత్య మే పృష్టా దాయదానార్థమాదరాత్ ।**
**తే త్వామూచుర్విభాగం మే తదర్థమహమాగతః ॥ 14 ॥**

నేను మరలి వచ్చి నా భాగాన్ని ఇమ్మని ప్రేమపూర్వకంగా కోరాను. నీవే నా భాగమని వారు చెప్పారు. అందుకొరకై నేను నీ వద్దకు వచ్చాను.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**తదాకర్ణ్య వచస్తస్య పితా తం ప్రాహ విస్మితః ।**
**ఆశ్వాస్య శ్రాద్ధదేవస్స సత్యధర్మరతం మునే! ॥ 15 ॥**

సనత్కుమారా! నభగుని మాటలను విని తండ్రియైన శ్రాద్ధదేవుడు ఆశ్చర్యపోయాడు. సత్యధర్మనిష్ఠుడైన తన కుమారునోదార్చి అతనితో ఇట్లు పలికాడు.

**మనురువాచ –** మనువు పలికాడు.

**తదుక్తం మా దృథాస్తాత! ప్రతారణకరం హి తత్ ।**
**న హ్యహం పరమం దాయం సర్వథా భోగసాధనమ్ ॥ 16 ॥**

కుమారా! వారు పలికిన మోసపు మాటలను లెక్కచేయకుము. అన్నివిధాలుగా అనుభవింపదగిన ఉత్తమమైన దాయభాగం నేను గాను.

**తథాపి దాయభావేన దత్తోఽహం తైః ప్రతారిభిః ।**
**తవ వై జీవనోపాయం వదామి శృణు తత్త్వతః ॥ 17 ॥**

అయినప్పటికి, ఆ మోసగాండ్రు నీకు దాయభాగరూపంలో నన్ను అప్పగించారు. నేను నీకు జీవనోపాయాన్ని చెబుతాను. శ్రద్ధగా వినుము.

**సత్రమాంగిరసా విప్రాః కుర్వంత్యద్య సుమేధసః ।**
**తత్ర కర్మణి ముహ్యంతి షష్ఠం షష్ఠమహః ప్రతి ॥ 18 ॥**

అంగిరసవంశంలో జన్మించిన ప్రజ్ఞాశాలురైన బ్రాహ్మణులు ఇప్పుడు సత్రయాగాన్ని అనుష్ఠిస్తున్నారు. వారు ప్రతి ఆరవ రోజునాడు చేయవలసిన కర్మవిషయంలో మోహాన్ని పొందుతున్నారు.

**తత్ర త్వం గచ్ఛ నభగ! తాన్ సుశంస మహాకవే! ।**
**సూక్తే ద్వే వైశ్వదేవే హి సత్రం శుద్ధం హి తద్భవేత్ ॥ 19 ॥**

ఓ నభగా! సుమతీ! నీవు అచ్చటికి వెళ్లు. ఆ మహాయజ్ఞంలో వారిని సమీపించి, రెండు వైశ్వదేవసూక్తాలను చక్కగా పఠించుము. దానివలన సత్రయాగం సుసంపన్నమౌతుంది.

**తత్కర్మణి సమాప్తే హి స్వర్యాంతో బ్రాహ్మణాశ్చ తే ।**
**ధనం దాస్యంతి తే తుష్టాస్స్వసత్రపరిశేషితమ్ ॥ 20 ॥**

ఆ కర్మ పూర్తి కాగానే ఆ బ్రాహ్మణులు స్వర్గానికి వెళ్తూ, చాల సంతసించి, వారంతటవారే తమ సత్రయాగంలో మిగిలిన ధనాన్ని నీకు ఇస్తారు అని పలికాడు.

**నందీశ్వర ఉవాచ -** నందీశ్వరుడు పలికాడు.

**తదాకర్ణ్య పితుర్వాక్యం నభగః సత్యసారవాన్ ।**
**జగామ తత్ర సుప్రీత్యా యత్ర తత్సత్రముత్తమమ్ ॥ 21 ॥**

సత్యముయొక్క సారమెరింగిన నభగుడు తండ్రిమాటలను విని మహానందంతో ఆ సత్రయాగం జరుగుతున్న స్థలానికి వెళ్లాడు.

**తదాహఃకర్మణి మునే! సత్రే తస్మిన్స మానవః ।**
**సూక్తే ద్వే వైశ్వదేవే హి ప్రోవాచ స్పష్టతస్సుధీః ॥ 22 ॥**

విద్వాంసుడైన అతడు ఆ దినం కర్మ జరుగుచుండగా ఆ సత్రయాగంలో రెండు వైశ్వదేవసూక్తాలను స్పష్టంగా పఠించాడు.

**సమాప్తే కర్మణి తతో విప్రా ఆంగిరసాశ్చ తే ।**
**తస్మై దత్త్వా యయుః స్వర్గం స్వం స్వం సత్రావశేషితమ్ ॥ 23 ॥**

ఆ యాగం సమాప్తం కాగానే, ఆ అంగిరస బ్రాహ్మణులు సత్రయాగంలో మిగిలిన సంపదనంతటిని అతనికిచ్చి స్వర్గానికి వెళ్లారు.

**తత్తదా స్వీకరిష్యంతం సుసత్రపరిశేషితమ్ ।**
**విజ్ఞాయ గిరిశః సద్య ఆవిర్భూతః సదూతికృత్ ॥ 24 ॥**

ఆ గొప్ప సత్రయాగంలో మిగిలిపోయిన సంపదను ఆతడు స్వీకరిస్తూ ఉండగా, ఆ విషయాన్ని ఎరింగి, శివుడు వెంటనే అక్కడ ఆవిర్భవించాడు.

**సర్వాంగసుందరః శ్రీమాన్ పురుషః కృష్ణదర్శనః ।**
**భావం సమీక్షితుం భాగం దాతుం జ్ఞానం పరం చ తత్ ॥ 25 ॥**

కృష్ణదర్శనుడనే పేరుగలవాడు, సర్వాంగసుందరుడు, శోభాయుక్తుడైన పురుషుని రూపంలో శివుడు నభగుని నిష్ఠను పరీక్షించి, అతనికి ఉత్తమజ్ఞానాన్ని ప్రసాదించడానికి ఆవిర్భవించాడు.

**అథో స శంకరః శంభుః పరీక్షాకర ఈశ్వరః ।**
**ఉవాచోత్తరతోఽభ్యేత్య నభగం తం హి మానవమ్ ॥ 26 ॥**

మంగళకరుడు, పరీక్షాకరుడునైన శంకరుడు అప్పుడు ఉత్తరమునుండి సమీపించి, ఆ నభగునితో ఇలా పలికాడు.

**ఈశ్వర ఉవాచ –** ఈశ్వరుడు పలికాడు.

**కస్త్వం గృహ్ణాసి పురుష! మమేదం వాస్తుకం వసు ।**
**ప్రేషితః కేన తత్సర్వం సత్యం వద మమాగ్రతః ॥ 27 ॥**

ఓయీ పురుషా! నీవెవరివి? నా వస్తురూపమైన సంపదను నీవేల తీసుకొని పోవుచుంటివి? నిన్ను పంపిన వారెవరు? సర్వం యథార్థంగా చెప్పుము.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**తచ్ఛ్రుత్వా తద్వచస్తాత! మానవో నభగః కవి ।**
**ప్రత్యువాచ వినీతాత్మా పురుషం కృష్ణదర్శనమ్ ॥ 28 ॥**

వత్సా! మనుపుత్రుడు, జ్ఞానియునైన నభగుడు ఆ మాటలను విని, వినయంతో కూడిన మనస్సుగలవాడై, కృష్ణదర్శనుడనే ఆ పురుషునకిలా సమాధానం చెప్పాడు.

**నభగ ఉవాచ –** నభగుడు పలికాడు.

**మమేదమృషిభిర్దత్తం వసు యజ్ఞగతం ఖలు ।**
**కథం వారయసే మాం త్వం గృహ్ణంతం కృష్ణదర్శన! ॥ 29 ॥**

ఓయీ కృష్ణదర్శనా! యజ్ఞంలో మిగిలిన ఈ సంపదను ఋషులు నాకు ఇచ్చియున్నారు. నేను తీసుకొని పోతుండగా నీవు నన్నెందుకు వారిస్తున్నావు?

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఆకర్ణ్య నాభగం వాక్యమిదం సత్యముదీరితమ్ ।**
**ప్రత్యువాచ ప్రసన్నాత్మా పురుషః కృష్ణదర్శనః ॥ 30 ॥**

నభగుడు పలికిన ఈ సత్యవాక్యాన్ని విని కృష్ణదర్శనుడను ఆ పురుషుడు ప్రసన్నాత్ముడై ఇలా బదులిచ్చాడు.

**కృష్ణదర్శన ఉవాచ –** కృష్ణదర్శనుడు పలికాడు.

**వివాదేఽస్మిన్హి నౌ తాత! ప్రమాణం జనకస్తవ ।**
**యాహి తం పృచ్ఛ స బ్రూయాత్తత్ప్రమాణం తు సత్యతః ॥ 31 ॥**

వత్సా! మన ఇద్దరి ఈ వివాదాన్ని తీర్చగల యోగ్యుడు నీ తండ్రి. నీవు అతని వద్దకు వెళ్లి అడుగుము. అతడు ధర్మాన్ని యథాతథంగా చెబుతాడు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**తదాకర్ణ్య వచస్తస్య నభగో మానవః కవిః ।**
**ఆగచ్ఛత్పితరం ప్రీత్యా తదుక్తం పృష్టవాన్మునే! ॥ 32 ॥**

అతని మాటను విని మనుపుత్రుడు, జ్ఞానియునైన నభగుడు ఆనందంతో తండ్రి వద్దకు వెళ్లి కృష్ణదర్శనుడు చెప్పిన విధాన్నంతటిని చెప్పాడు.

**పుత్రోదితం సమాకర్ణ్య శ్రాద్ధదేవస్స వై మనుః ।**
**స్మృత్వా శివపదాంభోజం ప్రాప్తస్మృతిరువాచ తమ్ ॥ 33 ॥**

ఆ శ్రాద్ధదేవమనువు పుత్రుని వచనాలను విని, శివుని పాదపద్మాలను స్మరించి, గుర్తునకు తెచ్చుకొని, అతనితో ఇట్లన్నాడు.

**మనురువాచ -** మనువు పలికాడు.

**హే తాత! శృణు మద్వాక్యం స దేవః పురుషః శివః ।**
**తస్యైవ సకలం వస్తు యజ్ఞప్రాప్తం విశేషతః ॥ 34 ॥**

ఓ కుమారా! నా మాటను వినుము. ఆ పురుషుడు శివదేవుడే. జగత్తులోని సర్వవస్తువులు ఆయనకు మాత్రమే చెందుతాయి. యజ్ఞానికి సంబంధించిన వస్తువులు విశేషించి ఆయనకే చెందుతాయి.

**అధ్వరోర్వరితం వస్తు రుద్రభాగః ప్రకీర్తితః ।**
**ఇత్యపి యజ్ఞవాదో హి క్వచిజ్జాతస్తదిచ్ఛయా ॥ 35 ॥**

యజ్ఞము తరువాత మిగిలిన వస్తువులన్నియు రుద్రభాగములని చెప్పబడతాయి. ఈ విధమైన యజ్ఞవాదములన్నియు ఆ శివుని సంకల్పంచేతనే అక్కడక్కడ ప్రచారంలోనికి వచ్చాయి.

**స దేవ ఈశ్వరః సర్వం వస్త్వర్హతి న సంశయః ।**
**యజ్ఞావశిష్టం కిముత పరే తస్యేచ్ఛయా విభోః ॥ 36 ॥**

ఆ ఈశ్వరదేవుడే వస్తువులన్నింటికి అధికారియనడంలో సందేహంలేదు. ఇక యజ్ఞంలో మిగిలిన వస్తువులు గురించి చెప్పునదేమున్నది? ఆయన ఇచ్ఛచేతనే ఇతర దేవతలు తమ తమ భాగాలను పొందుతున్నారు.

**అనుగ్రహార్థమాయాతస్తవ తద్రూపతః ప్రభుః ।**
**తత్ర త్వం గచ్ఛ నభగ! ప్రసన్నం కురు సత్యతః ॥ 37 ॥**

ఓ నభగా! ఆ ప్రభువు నిన్ను అనుగ్రహించడానికి అచ్చటకు ఆ రూపంలో వచ్చియున్నాడు. నీవచ్చటకు వెళ్లి నీ సత్యవచనంతో ఆయనను ప్రసన్నుని చేసుకొనుము.

**క్షమాపయ స్వాపరాధం సుప్రణమ్య స్తుతిం కురు ।**
**సర్వప్రభుస్స ఏవేశో యజ్ఞాధీశోఽఖిలేశ్వరః ॥ 38 ॥**

అపరాధాన్ని మన్నింపుమని వేడుకొనుము. చక్కగా ప్రణమిల్లి స్తుతించు. ఆ అఖిలేశ్వరుడే యజ్ఞానికి ప్రభువు. సమస్తానికి కూడ ఆయనయే ప్రభువు.

**విష్ణుబ్రహ్మాదయో దేవాః సిద్ధాస్సర్వర్షయోఽపి హి ।**
**తదనుగ్రహతస్తాత! సమర్థః సర్వకర్మణి ॥ 39 ॥**

విష్ణుబ్రహ్మాదిదేవతలు, సిద్ధులు, సకలమహర్షులు ఆయన అనుగ్రహంచేతనే కర్మలన్నింటియందు సమర్థులౌతున్నారు.

**కిం బహూక్త్యాఽఽత్మజశ్రేష్ఠ! గచ్ఛ తత్రాశు మా చిరమ్ ।**
**ప్రసాదయ మహాదేవం సర్వథా సకలేశ్వరమ్ ॥ 40 ॥**

ఇన్ని మాటలేల? నీవు నా పుత్రులలో శ్రేష్ఠుడవు. నీవు వెంటనే అచ్చటకు వెళ్లుము. సకలేశ్వరుడైన ఆ మహాదేవుని అన్నివిధాలుగా ప్రసన్నుని చేసుకొనుము.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వా స మనుః శ్రాద్ధదేవశ్చ తనయం ద్రుతమ్ ।**
**ప్రేషయామాస నికటం శంభోస్సోఽపి సమేత్య తమ్ ॥ 41 ॥**

శ్రాద్ధదేవమనువు ఇట్లు పలికి వెంటనే కుమారుని శంభుని వద్దకు పంపాడు. ఆ నభగుడు శంభునివద్దకు వచ్చాడు.

**నభగశ్చ ప్రణమ్యాశు సాంజలిర్నతమస్తకః ।**
**ప్రోవాచ సుప్రసన్నాత్మా వినయేన మహామతిః ॥ 42 ॥**

నభగుడు వెంటనే చేతులు జోడించి తలవంచి నమస్కరించాడు. గొప్ప బుద్ధిశాలియైన నభగుడు మిక్కిలి ప్రసన్నాత్ముడై వినయంతో ఇట్లన్నాడు.

**నభగ ఉవాచ –** నభగుడు పలికాడు.

**ఇదం తవేశ! సర్వం హి వస్తు త్రిభువనే హి యత్ ।**
**ఇత్యాహ మే పితా నూనం కిముతాధ్వరశేషితమ్ ॥ 43 ॥**

ఓ ఈశ్వరా! ముల్లోకాలలో గల వస్తువులన్నీ నీవేనని నా తండ్రి చెప్పాడు. యజ్ఞంలో మిగిలినవి నీవేనని వేరుగా చెప్పనక్కరలేదు గదా!

**అజానతా మయా నాథ! యదుక్తం తద్వచో భ్రమాత్ ।**
**అపరాధస్త్వం క్షమస్వ శిరసా త్వాం ప్రసాదయే ॥ 44 ॥**

ఓ నాథా! నేను పలికిన మాటలు అజ్ఞానంతో భ్రమపడి మాట్లాడినవి. కావున నా అపరాధాలన్నింటిని మన్నించండి. నేను తలవంచి నమస్కరించి వేడుకుంటున్నాను.

**ఇత్యుక్త్వా నభగస్సోఽతిదీనధీస్తు కృతాంజలిః ।**
**తుష్టావ తం మహేశానం కృష్ణదర్శనమానతః ॥ 45 ॥**

అతిదీనబుద్ధిగల నభగుడు తలవంచి, చేతులు జోడించి, ఇట్లు పలికి, కృష్ణదర్శనరూపంలోనున్న మహేశ్వరుని స్తుతించాడు.

**శ్రాద్ధదేవోఽపి శుద్ధాత్మా నతకస్సాంజలిస్సుధీః ।**
**తుష్టావ తం ప్రభుం నత్వా స్వాపరాధం క్షమాపయత్ ॥ 46 ॥**

శుద్ధాత్ముడు, విద్వాంసుడునైన శ్రాద్ధదేవుడుకూడ చేతులు జోడించి, నమస్కరించి, తన అపరాధాన్ని మన్నించుమని ఆ ప్రభువును స్తుతించాడు.

**ఏతస్మిన్నంతరే తత్ర విష్ణుర్బ్రహ్మాఖిలః సుధీః ।**
**వాసవాద్యాః సమాజగ్ముః సిద్ధాశ్చ మునయోఽపి హి ॥ 47 ॥**

ఇంతలో అక్కడకు విష్ణువు, బ్రహ్మాది సమస్త దేవతలు, ఇంద్రాదులు, సిద్ధులు, మునులు విచ్చేశారు.

**మహోత్సవం ప్రకుర్వంతః సుకృతాలయోఽఖిలాః ।**
**తుష్టువుర్నతకా భక్త్యా సుప్రణమ్య పృథక్ పృథక్ ॥ 48 ॥**

వారందరు చక్కగా చేతులు జోడించి వేర్వేరుగా సాష్టాంగప్రణామాలాచరించి మహోత్సవాన్ని చేస్తూ భక్తితో స్తుతించారు.

**అథ రుద్రః ప్రసన్నాత్మా కృపాదృష్ట్యా విలోక్య తాన్ ।**
**ఉవాచ నభగం ప్రీత్యా సస్మితం కృష్ణదర్శనః ॥ 49 ॥**

అంతట కృష్ణదర్శనరూపంలోనున్న రుద్రుడు ప్రసన్నాత్ముడై కృపాదృష్టితో వీక్షించి చిరునవ్వుతో, ప్రేమతో నభగుని ఉద్దేశించి ఇట్లు పలికాడు.

**కృష్ణదర్శన ఉవాచ** - కృష్ణదర్శనుడు పలికాడు.

**యత్తే పితాఽవదద్ధర్మ్యం వాక్యం తత్తు తథైవ హి ।**
**త్వయాపి సత్యముక్తం తత్సాధుస్త్వం నాత్ర సంశయః ॥ 50 ॥**

నీ తండ్రి ధర్మానురూపంగా పలికిన మాటలు యథార్థము. నీవు కూడ సత్యాన్ని పలికావు. కాబట్టి నీవు సాధుపురుషుడవనడంలో సందేహం లేదు.

**అతోఽహం సుప్రసన్నోఽస్మి సర్వథా సువ్రతేన తే ।**
**దదామి కృపయా తే హి జ్ఞానం బ్రహ్మ సనాతనమ్ ॥ 51 ॥**

నేను నీ సత్యవ్రతంచే అన్నివిధములుగ మిక్కిలి ప్రసన్నుడనయ్యాను. నేను దయతో నీకు సనాతనమైన బ్రహ్మజ్ఞానాన్ని ప్రసాదిస్తాను.

**మహాజ్ఞానీ భవ త్వం హి సవిప్రో నభగం ద్రుతమ్ ।**
**గృహాణ వస్త్విదం సర్వం మద్దత్తం కృపయాఽధునా ॥ 52 ॥**

ఓ నభగా! నీవు మహాజ్ఞానివౌతావు. నీయందు దయతో ఇప్పుడీవస్తువులనన్నింటిని నీకిస్తున్నాను. బ్రాహ్మణులతో గూడి నీవు స్వీకరించుము.

**ఇహ సర్వసుఖం భుంక్ష్వ నిర్వికారం మహామతే! ।**
**సుగతిం ప్రాప్స్యసి త్వం హి సవిప్రః కృపయా మమ ॥ 53 ॥**

ఓ మహామతీ! ఈ లోకంలో నీవు నిర్వికారంగా సకలసుఖాలను అనుభవించుము. నా దయతో నీవు బ్రాహ్మణధర్మములనాచరించి బ్రాహ్మణులందరితో కలసి ఉత్తమగతిని పొందుతావు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వా తాత! భగవాన్స రుద్రః సత్యవత్సలః ।**
**సర్వేషాం పశ్యతాం తేషాం తత్రైవాంతర్దధే హరః ॥ 54 ॥**

వత్సా! సత్యవత్సలుడైన రుద్రుడు ఈ విధంగా పలికి వారందరూ చూస్తూ ఉండగా అక్కడనే అంతర్ధానమయ్యాడు.

**విష్ణుర్బ్రహ్మాపి దేవాద్యాః సర్వే తే మునిసత్తమ! ।**
**స్వం స్వం ధామ యయుః ప్రీత్యా తస్యై నత్వా దిశే ముదా ॥ 55 ॥**

విష్ణువు, బ్రహ్మ, దేవతలు మున్నగువారందరు ఆ దిక్కునకు ఆనందంతో నమస్కరించి, తమ తమ స్థానాలకు వెళ్లారు.

**సపుత్రః శ్రాద్ధదేవోఽపి స్వస్థానమగమన్ముదా ।**
**భుక్త్వా భోగాన్సువిపులాన్సోఽన్తే శివపురం యయౌ ॥ 56 ॥**

శ్రాద్ధదేవుడు కూడ తన పుత్రునితో గూడి ఆనందంతో స్వస్థానానికి వెళ్లాడు. అతడు విస్తారమైన భోగాలననుభవించి, దేహాన్ని వీడిన పిదప శివుని పదమును చేరాడు.

**ఇత్థం తే కీర్తితో బ్రహ్మన్నవతారః శివస్య హి ।**
**కృష్ణదర్శననామా వై నభగానందదాయకః ॥ 57 ॥**

ఓ సనత్కుమారా! నభగునకు ఆనందాన్ని కలిగించిన శివుని కృష్ణదర్శనావతారాన్ని గూర్చి నీకు ఈ విధంగా వర్ణించి చెప్పాను.

**ఇదమాఖ్యానమనఘం భుక్తిముక్తిప్రదం సతామ్ ।**
**పఠతాం శృణ్వతాం వాపి సర్వకామఫలప్రదమ్ ॥ 58 ॥**

ఈ గాథ పవిత్రమైనది, సత్పురుషులకు భుక్తిని, ముక్తిని ప్రసాదిస్తుంది. దీనిని చదువువారికి, వినువారికి కూడ సర్వకామనలు, ఫలాలు సిద్ధిస్తాయి.

**య ఏతచ్చరితం ప్రాతస్సాయం చ స్మరతే సుధీః ।**
**కవిర్భవతి మన్త్రజ్ఞో గతిమన్తే లభేత్పరామ్ ॥ 59 ॥**

ఏ బుద్ధిమంతుడు ఈ వృత్తాంతాన్ని ఉదయం, మరియు సాయంకాలాలలో స్మరిస్తాడో, అతడు కవి, మంత్రవేత్తయు అగుటయేగాక, దేహత్యాగానంతరం పరమగతిని పొందుతాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం నందీశ్వరసనత్కుమారసంవాదే కృష్ణదర్శనశివావతారవర్ణనం నామైకోనత్రింశోఽధ్యాయః ॥ 29 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు నందీశ్వరసనత్కుమారసంవాదంలో కృష్ణదర్శనావతారవర్ణనం అనే పేరుగల ఇరవైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## త్రింశోఽధ్యాయః - ముప్పైయవ అధ్యాయం
## అవధూతేశ్వరశివావతారచరిత్రవర్ణనమ్ - అవధూతేశ్వరశివావతారచరిత్రవర్ణనం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**శృణు త్వం బ్రహ్మపుత్రాద్యవతారం పరమేశితుః ।**
**అవధూతేశ్వరాహ్వం వై శక్రగర్వాపహారకమ్ ॥ 1 ॥**

బ్రహ్మపుత్రుడవగు ఓ సనత్కుమారా! అవధూతేశ్వరుడనే పేరుతో ప్రసిద్ధినొందిన పరమేశ్వరావతారాన్ని గూర్చి వినుము. ఈ అవతారంలో శివుడు ఇంద్రుని గర్వాన్ని అణచాడు.

**శక్రః పురా హి సగురుః సర్వదేవసమన్వితః ।**
**దర్శనం కర్తుమీశస్య కైలాసమగమన్మునే! ॥ 2 ॥**

ఓ మహర్షీ! పూర్వం ఇంద్రుడు సకల దేవతలతో మరియు బృహస్పతితో గూడి శివుని దర్శనానికి కైలాసానికి బయలుదేరాడు.

**అథ గుర్వింద్రయోర్జ్ఞాత్వాఽఽగమనం శంకరస్తయోః ।**
**పరీక్షితుం చ తద్భావం స్వదర్శనరతాత్మనోః ॥ 3 ॥**

అపుడు శంకరుడు, ఆ ఇంద్ర బృహస్పతులిరువురూ తమ దర్శనమునందు ప్రీతితో నిండిన మనస్సులు గలవారై బయలుదేరారని తెలిసి, వారి భక్తిని పరీక్షించాలనుకున్నాడు.

**అవధూతస్వరూపోఽభూన్నానాలీలాకరః ప్రభుః ।**
**దిగంబరో మహాభీమో జ్వలదగ్నిసమప్రభః ॥ 4 ॥**

అనేకలీలను చేసే శివప్రభువు వెంటనే అవధూతరూపాన్ని ధరించాడు. అతడు దిగంబరుడై, జ్వలించే అగ్నివలె ప్రకాశిస్తూ గొప్ప భయాన్ని కలిగిస్తున్నాడు.

**సోఽవధూతస్వరూపో హి మార్గమారుధ్య సద్గతిః ।**
**లంబమానపటః శంభురతిష్ఠచ్ఛోభితాకృతిః ॥ 5 ॥**

సత్పురుషులకు శరణ్యుడైన శంభుడు అవధూతరూపంలో ప్రకాశిస్తూ మార్గానికి అడ్డుగా నిలచాడు. ఆయన భుజంనుండి ఉత్తరీయం వ్రేలాడుతోంది.

**అథ తౌ గురుశక్రౌ చ గచ్ఛంతౌ శివసన్నిధిమ్ ।**
**అద్రాష్టాం పురుషం భీమం మార్గమధ్యేఽద్భుతాకృతిమ్ ॥ 6 ॥**

అంతట శివుని సన్నిధికి వెళ్తున్న ఇంద్రబృహస్పతులు మార్గమధ్యంలో ఆశ్చర్యాన్ని కలిగించే ఆకారంతో భయాన్ని కలిగిస్తున్న ఆ పురుషుని చూశారు.

**అథ శక్రో మునేఽపృచ్ఛత్స్వాధికారేణ దుర్మదః ।**
**పురుషం తం స్వమార్గాంతఃస్థితమజ్ఞాయ శంకరమ్ ॥ 7 ॥**

సనత్కుమారా! అధికార దుర్మదుడైన ఇంద్రుడు తన దారికి అడ్డుగా నిలబడియున్న పురుషుడు శంకరుడని తెలియక, ఇట్లు ప్రశ్నించాడు.

**శక్ర ఉవాచ -** ఇంద్రుడు పలికాడు.

**కస్త్వం దిగంబరాకారావధూత! కుత ఆగతః ।**
**కిన్నామ తవ విఖ్యాతం తత్త్వతో వద మేఽచిరమ్ ॥ 8 ॥**

దిగంబరాకారుడైన అవధూతా! నీవెవరివి? ఎక్కడ నుండి వచ్చావు? నీ పేరేమిటి? వెంటనే ఉన్నది ఉన్నట్లుగా నాకు చెప్పుము.

**స్వస్థానే సంస్థితః శంభుః కిం వాన్యత్ర గతోఽధునా ।**
**దర్శనార్థం హి తస్యాహం గచ్ఛామి సగురుస్సురైః ॥ 9 ॥**

శంభువు తన స్థానంలో ఉన్నాడా? లేక ఇప్పుడు ఎక్కడికైనా వెళ్లాడా? నేను దేవతలతో, బృహస్పతితో గూడి ఆయనను చూసేందుకు వెళ్తున్నాను.

**నందీశ్వర ఉవాచ -** నందీశ్వరుడు పలికాడు.

**శక్రేణేత్థం స పృష్టశ్చ కించిన్నోవాచ పూరుషః ।**
**లీలాగృహీతదేహస్య శంకరో మదహా ప్రభుః ॥ 10 ॥**

తన లీలలను ప్రదర్శించుటకొఱకు వేషమునకు ధరించిన శంకరుడు ఇంద్రుని గర్వాన్ని అణచవలెనని తలంచాడు. ఈ విధంగా ప్రశ్నించిన ఇంద్రునికి ఎట్టి సమాధానం చెప్పలేదు.

**శక్రః పునరపృచ్ఛత్తం నోవాచ స దిగంబరః ।**
**అవిజ్ఞాతగతిశ్శంభుర్మహాకౌతుకకారకః ॥ 11 ॥**

ఎవ్వరిచేతనైననూ తెలియబడని స్వరూపంగలవాడు, గొప్ప ఉత్కంఠలను రేకెత్తించే లీలలను ప్రదర్శించే వాడునగు శంభువు దిగంబరాకారంలో నున్నవాడై, ఇంద్రుడు మరలా ప్రశ్నించిననూ సమాధానం చెప్పలేదు.

**పునః పురందరోఽపృచ్ఛత్త్రైలోక్యాధిపతిస్స్వరాట్ ।**
**తూష్ణీమాస మహాయోగీ మహాలీలాకరస్య వై ॥ 12 ॥**

ముల్లోకాలకు అధిపతి, స్వర్గలోకాధ్యక్షుడునగు ఇంద్రుడు మరలా ప్రశ్నించాడు. కాని గొప్ప లీలలను ప్రదర్శించే ఆ మహాయోగి మిన్నకున్నాడు.

**ఇత్థం పునః పునః పృష్టః శక్రేణ స దిగంబరః ।**
**నోవాచ కించిద్భగవాన్ శక్రదర్పజిఘాంసయా ॥ 13 ॥**

ఈ విధంగా ఇంద్రుడు దిగంబరుని పలుమార్లు ప్రశ్నించిననూ, ఇంద్రుని గర్వాన్ని అణచాలని తలంచిన భగవానుడు సమాధానమేమియు చెప్పలేదు.

**అథ చుక్రోధ దేవేశస్త్రైలోక్యైశ్వర్యగర్వితః ।**
**ఉవాచ వచనం క్రోధాత్తం నిర్భర్త్స్య జటాధరమ్ ॥ 14 ॥**

అప్పుడు తన ఐశ్వర్యాన్ని చూసికొని గర్వించిన, ముల్లోకాల అధిపతియైన ఇంద్రుడు కోపించి జటాధారియైన అవధూతను భయపెడుతూ ఇలా పలికాడు.

**ఇంద్ర ఉవాచ –** ఇంద్రుడు పలికాడు.

**పృచ్ఛమానోఽపి రే మూఢ! నోత్తరం దత్తవానసి ।**
**అతస్త్వాం హన్మి వజ్రేణ కస్తే త్రాతాఽస్తి దుర్మతే! ॥ 15 ॥**

ఓరీ మూర్ఖా! దుష్టబుద్ధీ! నేనెన్ని మార్లు అడిగిననూ నీవు సమాధానం చెప్పకున్నావు. కాబట్టి నిన్ను నేను వజ్రాయుధంతో సంహరిస్తాను. నిన్ను రక్షించేవాడెవడున్నాడు?

**ఇత్యుదీర్య తతో వజ్రీ సంనిరీక్ష్య క్రుధా హితమ్ ।**
**హంతుం దిగంబరం వజ్రముద్యతం స చకార హ ॥ 16 ॥**

వజ్రధారియైన ఇంద్రుడీ విధంగా పలికి, దిగంబరుని కోపంతో సంహరించడానికి వజ్రాన్ని సన్నద్ధం చేశాడు.

**వజ్రహస్తం చ తం దృష్ట్వా శక్రం శీఘ్రం సదాశివః ।**
**చకార స్తంభనం తస్య వజ్రపాతస్య శంకరః ॥ 17 ॥**

నిత్యమంగళస్వరూపుడగు శంకరుడు వజ్రాన్ని చేత బట్టియున్న ఇంద్రుని చూచి వెంటనే ఆ వజ్రపు దెబ్బ తనపై పడని విధంగా స్తంభింపజేశాడు.

**తతః స పురుషః క్రుద్ధః కరాలాక్షో భయంకరః ।**
**ద్రుతమేవ ప్రజజ్వాల తేజసా ప్రదహన్నివ ॥ 18 ॥**

అపుడు భయంకర ఆకారం గల ఆ దిగంబరపురుషుడు క్రోధంతో వికటంగానున్న కన్నులు గలవాడై తన తేజస్సుతో వెనువెంటనే తగులబెట్టనున్నాడా అన్నట్లు మండిపడ్డాడు.

**బాహుప్రతిష్టంభభువా మన్యునాంతశ్శచీపతిః ।**
**సమదహ్యత భోగీవ మంత్రరుద్ధపరాక్రమః ॥ 19 ॥**

బాహుప్రతిష్టంభనంతో కోపంగల శచీపతియైన ఇంద్రుడు, మంత్రంతో అడ్డుకొనబడిన పరాక్రమం గల పాము వలె లోలోపల మండిపడ్డాడు.

**దృష్ట్వా బృహస్పతిస్త్వేనం ప్రజ్వలంతం స్వతేజసా ।**
**పురుషం తం ధియామాస ప్రణనామ హరం ద్రుతమ్ ॥ 20 ॥**

బృహస్పతి మాత్రం, తన తేజస్సుతో గొప్పగా ప్రకాశిస్తున్న ఆ పురుషుని గాంచి వెంటనే ఆయన శివుడేనని గుర్తుపట్టి నమస్కరించాడు.

**కృతాంజలిపుటో భూత్వా తతో గురురుదారధీః ।**
**దండవత్ప్రో పునర్నత్వా ప్రభుం తుష్టావ భక్తితః ॥ 21 ॥**

అప్పుడు గొప్ప బుద్ధిమంతుడైన బృహస్పతి చేతులు జోడించి ఆ ప్రభువునకు సాష్టాంగనమస్కారం చేసి, భక్తితో స్తుతించాడు.

**గురురువాచ –** బృహస్పతి పలికాడు.

**దేవదేవ! మహాదేవ! శరణాగతవత్సల! ।**
**ప్రసన్నో భవ గౌరీశ! సర్వేశ్వర! నమోఽస్తు తే ॥ 22 ॥**

దేవదేవా! మహాదేవా! శరణాగతవత్సల! గౌరీశా! సర్వేశ్వరా! నీకు నమస్కారము. ప్రసన్నుడవు కమ్ము.

**మాయయా మోహితాస్సర్వే బ్రహ్మవిష్ణ్వాదయోఽపి తే ।**
**త్వాం న జానంతి తత్త్వేన జానంతి త్వదనుగ్రహాత్ ॥ 23 ॥**

బ్రహ్మ, విష్ణువు మున్నగు వారందరూ కూడా నీ మాయచే మోహాన్ని పొందుతారు. నీ స్వరూపాన్ని యథార్థంగా వారు తెలియకున్నారు. ఒకవేళ తెలిసిననూ, అది నీఅనుగ్రహంతో మాత్రమే సాధ్యం.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**బృహస్పతిరితి స్తుత్వా స తదా శంకరం ప్రభుమ్ ।**
**పాదయోః పాతయామాస తస్యేశస్య పురందరమ్ ॥ 24 ॥**

అప్పుడు ఆ బృహస్పతి, శంకరప్రభువును ఈ విధంగా స్తుతించి, ఈశ్వరుని కాళ్లపై ఇంద్రుడు పడేటట్లు చేశాడు.

**తతస్తాత! సురాచార్యః కృతాంజలిరుదారధీః ।**
**బృహస్పతిరువాచేదం ప్రశ్రయావనతః సుధీః ॥ 25 ॥**

వత్సా! అనంతరం గొప్ప బుద్ధిమంతుడు, దేవతలకు ఆచార్యుడు, జ్ఞానియునైన బృహస్పతి చేతులను జోడించి వినయంతో వంగి ఇట్లు పలికాడు.

**బృహస్పతిరువాచ –** బృహస్పతి పలికాడు.

**దీననాథ! మహాదేవ! ప్రణతం తవ పాదయోః ।**
**సముద్ధర చ మాం తత్త్వం క్రోధం న ప్రణయం కురు ॥ 26 ॥**

ఓ దీననాథా! మహాదేవా! నీ పాదాలకు నమస్కరించే నన్ను ఉద్ధరించుము. కావున నీవు కోపమును చేయకుము. ప్రేమను చూపుము.

**తుష్టో భవ మహాదేవ! పాహీంద్రం శరణాగతమ్ ।**
**వహ్నిరేష సమాయాతి భాలనేత్రసముద్భవః ॥ 27 ॥**

ఓ మహాదేవా! తుష్టుడవు కమ్ము. శరణు పొందిన ఇంద్రుని రక్షింపుము. నీఫాలనేత్రమునుండి సముద్భవమైన అగ్ని మావైపు వస్తోంది.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యాకర్ణ్య గురోర్వాక్యమవధూతాకృతిః ప్రభుః ।**
**ఉవాచ కరుణాసింధుర్విహసన్ స సదూతికృత్ ॥ 28 ॥**

కరుణాసముద్రుడైన వాడును, అవధూతరూపంలో నున్నవాడునైన శంకరప్రభువు బృహస్పతి మాటలను విని నవ్వుతూ ఇట్లు పలికాడు.

**అవధూత ఉవాచ** – అవధూత పలికాడు.

**క్రోధాచ్చ నిస్సృతం తేజో ధారయామి స్వనేత్రతః ।**
**కథం హి కంచుకీం సర్పస్సంధత్తే చోజ్ఝితాం పునః ॥ 29 ॥**

కోపంవల్ల నా కంటినుండి వచ్చిన తేజస్సును మరల ముందుకు రాకుండా నిలబెట్టడం ఎట్లు సాధ్యము? పాము విడిచిన కుబుసాన్ని మరల ఎలా ధరిస్తుంది?

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇతి శ్రుత్వా వచస్తస్య శంకరస్య బృహస్పతిః ।**
**ఉవాచ సాంజలిర్భూయో భయవ్యాకులమానసః ॥ 30 ॥**

శంకరుని మాటను విని బృహస్పతి భయంతో వ్యాకులమనస్కుడై మరల చేతులను జోడించి ఇలా పలికాడు.

**బృహస్పతిరువాచ** – బృహస్పతి పలికాడు.

**హే దేవ! భగవన్భక్తా అనుకంప్యాః సదైవ హి ।**
**భక్తవత్సలనామేతి స్వం సత్యం కురు శంకర! ॥ 31 ॥**

హేదేవా! భగవన్! భక్తులందరి పట్లదయను చూపాలి. నీకు భక్తవత్సలుడను నామం గలదు గదా! దానిని నీవు సత్యం చేయుము.

**క్షేప్తుమన్యత్ర దేవేశ స్వతేజోఽత్యుగ్రమర్హసి ।**
**ఉద్ధర్తా సర్వభక్తానాం సముద్ధర పురందరమ్ ॥ 32 ॥**

ఓ దేవేశా! అత్యుగ్రమైన నీ తేజస్సును మరియొకచోట పారవేయుము. భక్తులనందరినీ ఉద్ధరించే నీవు ఇంద్రుని సముద్ధరింపుము.

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్తో గురుణా రుద్రో భక్తవత్సలనామభాక్ ।**
**ప్రత్యువాచ ప్రసన్నాత్మా సురేజ్యం ప్రణతార్తిహా ॥ 33 ॥**

బృహస్పతి ఇట్లు పలుకగా, భక్తవత్సలుడని పేరుపొందినవాడు, నమస్కరించువారి కష్టాలను పారద్రోలేవాడునైన రుద్రుడు దేవగురువుతో ఇలా పలికాడు.

**రుద్ర ఉవాచ** - రుద్రుడు పలికాడు.

**ప్రీతస్తేఽహం సురాచార్య! దదామి వరముత్తమమ్ ।**
**ఇంద్రస్య జీవదానేన జీవేతి త్వం ప్రథాం వ్రజ ॥ 34 ॥**

ఓ సురాచార్యా! నీపై నాకు ప్రీతి కలిగింది. నీకు ఉత్తమమైన వరాన్ని ఇస్తాను. నీవు ఇంద్రుని జీవితాన్ని కాపాడావు. కావున నీకు 'జీవుడు' అనే పేరుతో ప్రసిద్ధిని పొందగలవు.

**సముద్భూతోఽనలో యోఽయం భాలనేత్రాత్సురా సహః ।**
**ఏనం త్యక్ష్యామ్యహం దూరే యథేంద్రం నైవ పీడయేత్ ॥ 35 ॥**

నా ఫాలనేత్రంనుండి పుట్టిన ఈ అగ్నిని దేవతలు సహించలేరు. ఇది ఇంద్రుని ఏవిధంగాను పీడించకుండేటట్లు దూరంగా విడిచిపెడతాను.

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వా స కరే ధృత్వా స్వతేజోఽనలమద్భుతమ్ ।**
**భాలనేత్రసముద్భూతం ప్రాక్షిపల్లవణాంభసి ॥ 36 ॥**

ఆ శంకరుడిట్లు పలికి, లలాటనేత్రంనుండి పుట్టిన తేజోరూపమైన అగ్నిని చేతితో పట్టుకొని, ఉప్పు సముద్రంలో పడేశాడు.

**అథో శివస్య తత్తేజో భాలనేత్రసముద్భవమ్ ।**
**క్షిప్తం చ లవణాంభోధౌ సద్యో బాలో బభూవ హ ॥ 37 ॥**

శివుని ఫాలనేత్రం నుండి పుట్టి, ఉప్పు సముద్రంలో పడేసేన శివుని తేజస్సు వెంటనే పిల్లవాడుగా మారింది.

**స జలంధరనామాభూత్సింధుపుత్రోఽసురేశ్వరః ।**
**తం జఘాన మహేశానో దేవప్రార్థనయా ప్రభుః ॥ 38 ॥**

సముద్రపుత్రుడైన ఆ బాలుడు జలంధరుడనే పేరుతో రాక్షసనామకుడై ప్రసిద్ధిని పొందాడు. దేవతలు ప్రార్థించగా మహేశ్వరుడు అతనిని సంహరించాడు.

**ఇత్థం కృత్వా సుచరితం శంకరో లోకశంకరః ।**
**అవధూతస్వరూపేణ తతశ్చాంతర్హితోఽభవత్ ॥ 39 ॥**

లోకశంకరుడైన శంకరుడు ఈ విధంగా అవధూతరూపాన్ని దాల్చి, చక్కని లీలను ప్రకటించి, తరువాత అంతర్ధానమయ్యాడు.

**బభూవుః సకలా దేవాః సుఖినశ్చాతినిర్భయాః ।**
**గురుశక్రౌ భయాన్ముక్తౌ జగ్మతుః సుఖముత్తమమ్ ॥ 40 ॥**

దేవతలందరు పూర్తిగా భయాన్ని విడనాడి సుఖాన్ని పొందారు. ఇంద్ర – బృహస్పతులు భయంనుండి విముక్తిని పొందినవారై, ఉత్తమమగు సుఖాన్ని అనుభవించారు.

**యదర్థే గమనోద్యుక్తౌ దర్శనం ప్రాప్య తస్య తౌ ।**
**కృతార్థౌ గురుశక్రౌ హి స్వస్థానం జగ్మతుర్ముదా ॥ 41 ॥**

ఆ ఇంద్ర – బృహస్పతులు ఏ ఈశ్వరుని దర్శనానికి బయలుదేరారో, అట్టి ఈశ్వరుని దర్శించుకొని, కృతార్థులై ఆనందంతో తమ స్థానాలకు వెళ్లారు.

**అవధూతేశ్వరాహ్వోఽవతారస్తే కథితో మయా ।**
**పరమేశస్య పరమానన్దదః ఖలదండదః ॥ 42 ॥**

పరమానందస్వరూపుడైన పరమేశ్వరుడు దుష్టులను శిక్షిస్తాడు. ఆయనయొక్క అవధూతేశ్వరావతారాన్ని గూర్చి నేను నీకు చెప్పాను.

**ఇదమాఖ్యానమనఘం యశస్యం స్వర్గ్యమేవ చ ।**
**భుక్తిముక్తిప్రదం దివ్యం సర్వకామఫలప్రదమ్ ॥ 43 ॥**

ఈ దివ్యమైనగాథ పవిత్రమైనది, కీర్తిని, స్వర్గాన్ని, భుక్తిని, ముక్తిని, ప్రసాదించేది. కోరికలన్నింటిని తీర్చేది.

**య ఇదం శృణుయాన్నిత్యం శ్రావయేద్వా సమాహితః ।**
**ఇహ సర్వసుఖం భుక్త్వా సోఽన్తే శివగతిం లభేత్ ॥ 44 ॥**

ఈ గాథను నిత్యం ఎవడు వింటాడో, ఏకాగ్రమైన మనస్సుతో ఈగాథను వినిపిస్తాడో, అట్టివాడు ఇహలోకంలో సకలసుఖాలను అనుభవించి, మరణించిన పిదప శివసాయుజ్యాన్ని పొందుతాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం నందీశ్వరసనత్కుమారసంవాదే అవధూతేశ్వరశివావతారచరిత్రవర్ణనం నామ త్రింశోఽధ్యాయః ॥ 30 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు నందీశ్వరసనత్కుమారసంవాదంలో అవధూతేశ్వర శివతారచరిత్రవర్ణనం అనే పేరుగల ముప్పదియవ అధ్యాయం సమాప్తం.

## ఏకత్రింశోఽధ్యాయః - ముప్పైఒకటవ అధ్యాయం

## భిక్షువర్యాహ్వశివావతారచరిత్రవర్ణనమ్ - భిక్షువర్యాశివావతారచరిత్రవర్ణనం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుదు పలికాదు.

**అథ వక్ష్యే మునిశ్రేష్ఠ! శంభోః శృణ్వవతారకమ్ ।**
**స్వభక్తదయయా విప్ర! నారీసందేహభంజకమ్ ॥ 1 ॥**

ఓ మునిశ్రేష్ఠ! బ్రాహ్మణోత్తమా!శంభుదు తన భక్తుని పైగల దయతో నారీసందేహభంజకమైన అవతారాన్ని స్వీకరించి యున్నాదు. ఆ గాథను చెబుతాను. వినుము.

**ఆసీత్సత్యరథో నామ్నా విదర్భవిషయే నృపః ।**
**ధర్మాత్మా సత్యశీలశ్చ మహాశైవ జనప్రియః ॥ 2 ॥**

సత్యరథుడనే విదర్భదేశపు రాజు ఉండేవాదు. ఆయన ధర్మాత్ముదు. సత్యశీలుదు, మహాశైవజన ప్రియుదు.

**తస్య రాజ్ఞస్సుధర్మేణ మహీం పాలయతో మునే! ।**
**మహాన్కాలో వ్యతీయాయ సుఖేన శివధర్మతః ॥ 3 ॥**

చక్కని శివధర్మంతో ధర్మబద్ధంగా, సుఖంగా ఆ రాజు రాజ్యపాలన చేస్తూ చాలాకాలం గడిపాదు.

**కదాచిత్తస్య రాజ్ఞస్తు శాల్వైశ్చ పురరోధిభిః ।**
**మహాన్రణో బభూవాథ బహుసైన్యైర్బలోద్ధతైః ॥ 4 ॥**

ఒకనాదు బలంతో గర్వించి, పెద్దసైన్యంతో నగరాన్ని ముట్టడించిన శాల్వరాజులతో ఆ రాజునకు గొప్ప యుద్ధం జరిగింది.

**స విదర్భనృపః కృత్వా సార్ధం తైర్దారుణం రణమ్ ।**
**ప్రనష్టోరుబలః శాల్వైర్నిహతో దైవయోగతః ॥ 5 ॥**

విదర్భమహారాజు శాల్వులతో దారుణమైన యుద్ధాన్ని చేశాదు. అతని సైన్యమంతా ఆ యుద్ధంలో నశించగా దైవయోగంవల్ల అతదు సంహరింపబద్దాదు.

**తస్మిన్నృపే హతే యుద్ధే శాల్వైస్తు భయవిహ్వలాః ।**
**సైనికా హతశేషాశ్చ మంత్రిభిస్సహ దుద్రువుః ॥ 6 ॥**

యుద్ధంలో ఆ రాజు మరణించగానే, మిగిలినసైనికులు శాల్వులవల్ల భయంతో పీడింపబడినవారై మంత్రులతో కలిసి పారిపోయారు.

**అథ తస్య మహారాజ్ఞీ రాత్రౌ స్వపురతో మునే! ।**
**సంరుద్ధా రిపుభిర్యత్నాదన్తర్వత్నీ బహిర్యయౌ ॥ 7 ॥**

ఆ రాజుయొక్క పట్టపురాణి గర్భవతి, శత్రువులచే ముట్టడింపబడిన తన నగరంనుండి ఆమె రాత్రిసమయంలో మిక్కిలి శ్రమతో బయటపడింది.

**నిర్గతా శోకసంతప్తా సా రాజమహిషీ శనైః ।**
**ప్రాచీం దిశం యయౌ దూరం స్మరన్తీశపదాంబుజమ్ ॥ 8 ॥**

శోకంతో మిక్కిలి బాధపడుతున్న ఆ పట్టపురాణి మెల్లగా బయటపడి, ఈశ్వరుని పాదాంబుజాలను స్మరిస్తూ తూర్పుదిక్కుగా కొంతదూరం వెళ్లింది.

**అథ ప్రభాతే సా రాజ్ఞీ దదర్శ విమలం సరః ।**
**అతీతా దూరమధ్వానం దయయా శంకరస్య హి ॥ 9 ॥**

తెల్లవారేసరికి శంకరుని దయచే ఆమె చాలా దూరం వెళ్లి స్వచ్ఛమైన సరస్సునొకదానిని చూచింది.

**తత్రాగత్య ప్రియా రాజ్ఞస్సంతప్తా సుకుమారిణీ ।**
**నివాసార్థం సరస్తీరే ఛాయావృక్షముపాశ్రయత్ ॥ 10 ॥**

సుకుమారి, దుఃఖితురాలునైన ఆ రాణి ఆ సరస్సు చెంతకు చేరి, ఒడ్డున ఉన్న ఒక చెట్టు నీడలో విశ్రాంతి కొరకు కూర్చుంది.

**తత్ర దైవవశాద్రాజ్ఞీ ముహూర్తే సద్గుణాన్వితే ।**
**అసూత తనయం దివ్యం సర్వలక్షణలక్షితమ్ ॥ 11 ॥**

దైవానుగ్రహంచే ఆ రాణి అచ్చట మంచి లక్షణాలతో కూడిన ముహూర్తంలో సర్వలక్షణలక్షితుడు, దివ్యమైన ప్రకాశంగలవాడునైన పుత్రుని ప్రసవించింది.

**అథ తజ్జననీ దైవాత్తృషితాతి నృపాంగనా ।**
**సరోఽవతీర్ణా పానార్థం గ్రస్తా గ్రాహేణ పాథసి ॥ 12 ॥**

అంతట ఆ తల్లి దాహానికి తాళలేక నీరు త్రాగడానికి సరస్సులోనికి దిగింది. దైవవశంచే ఒక మొసలి ఆమెను పట్టుకొని చంపివేసింది.

**స సుతో జాతమాత్రస్తు క్షుత్పిపాసార్దితో భృశమ్ ।**
**రురోద చ సరస్తీరే వినష్టపితృమాతృకః ॥ 13 ॥**

ఆ బాలుడు పుట్టడంతోడనే తల్లిదండ్రులను కోల్పోయి, ఆ సరస్సు ఒడ్డున ఆకలిదప్పికలచే మిక్కిలి పీడింపబడినవాడై ఏడుస్తున్నాడు.

**తస్మిన్వనే క్రందమానే జాతమాత్రే సుతే మునే! ।**
**కృపాన్వితో మహేశోఽభూదన్తర్యామీ స రక్షకః ॥ 14 ॥**

మహర్షీ! ఆ కుర్రవాడు అడవిలో ఆ విధంగా ఏడుస్తూ ఉండగా అంతర్యామి రక్షకుడునైన మహేశ్వరునికి జాలి కలిగింది.

**ప్రేరితా మనసా కాచిదీశేన త్రాసహారిణా ।**
**అకస్మాదాగతా తత్ర భ్రమంతీ భైక్ష్యజీవినీ ॥ 15 ॥**

ఈశ్వరునిచే ప్రేరేపింపబడి, భిక్షాటనచే జీవించే ఒకానొక స్త్రీ హఠాత్తుగా అచ్చటకు వచ్చింది.

**సా త్వేకహాయనం బాలం వహంతీ విధవా నిజమ్ ।**
**అనాథమేకం క్రందంతం శిశుం తత్ర దదర్శ హ ॥ 16 ॥**

ఆమె ఒక సంవత్సరం వయస్సు గల బిడ్డ గలిగిన విధవరాలు. ఆమె అచ్చట ఏడుస్తున్న అనాథ శిశువును చూసింది.

**సా దృష్ట్వా తత్ర తం బాలం వనే నిర్మనుజే మునే! ।**
**విస్మితాతి ద్విజస్త్రీ సాఽచిన్తయద్ హృదయే బహు ॥ 17 ॥**

మునీశ్వరా! నిర్జనవనంలో అచ్చట ఆ బాలుని గాంచి ఆ బ్రాహ్మణస్త్రీ మిక్కిలి చకితురాలై హృదయంలో పరిపరి విధాల తల పోసింది.

**అహో! సుమహదాశ్చర్యమిదం దృష్టమ్మయాధునా ।**
**అసంభావ్యమకథ్యం చ సర్వథా మనసా గిరా ॥ 18 ॥**

అహో! ఈనాడు నేనిచ్చట గొప్ప ఆశ్చర్యాన్ని చూశాను. ఇది ఏవిధంగనూ మనస్సునకు ఊహింప శక్యం కానిది, మాటలకు అందనిది.

**అచ్ఛిన్ననాభినాళోఽయం రసాయాం కేవలం శిశుః ।**
**శేతే మాతృవిహీనశ్చ క్రందంస్తేజస్వినాం వరః ॥ 19 ॥**

నాభినాళమైననూ ఛేదింపబడని ఈ శిశువు నేలపై పడియున్నాడు, తేజశ్శాలురలో శ్రేష్ఠుడైన ఈ బాలుడు తల్లి లేక ఏడుస్తున్నాడు.

**అస్య పిత్రాదయః కేఽపి న సంతీహ సహాయినః ।**
**కారణం కిం బభూవాథ హ్యహో! దైవబలం మహత్ ॥ 20 ॥**

ఆ బాలునకు సహాయం చేయడానికి తండ్రి మున్నగు వారెవ్వరూ అచ్చట లేరు. కారణం ఏమై ఉంటుంది. అహో! దైవబలం గొప్పది.

**న జానే కస్య పుత్రోఽయమస్య జ్ఞాతాఽత్ర కోఽపి న ।**
**యతః పృచ్ఛామ్యస్య జన్మ జాతా చ కరుణా మయి ॥ 21 ॥**

ఈ శిశువు ఎవరి పుత్రుడో నాకు తెలియదు. ఈ శిశువుయొక్క జన్మగురించి ఎవరిని ప్రశ్నించాలి? తెలిసిన వారొక్కరైననూ ఇచ్చట లేరు. నాకీ బాలునిపై దయ కలుగుతోంది.

**ఇచ్ఛామ్యేనం పోషితుం హి బాలమౌరసపుత్రవత్ ।**
**సంప్రష్టుం నోత్సహేఽజ్ఞాత్వా కులజన్మాది చాస్య వై ॥ 22 ॥**

నేనీ బాలుని స్వంత బిడ్డవలె పెంచాలనుకొంటున్నాను. కాని ఈ బాలుని కులం, జన్మ ఇత్యాదులు తెలియక పోవడంచేత సమీపించడానికి ఉత్సాహం కలగడం లేదు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇతి సంచింత్యమానాయాం తస్యాం విప్రవర! స్త్రియామ్ ।**
**కృపాం చకార మహతీం శంకరో భక్తవత్సలః ॥ 23 ॥**

బ్రాహ్మణోత్తమా! ఈ విధంగా బ్రాహ్మణ స్త్రీ ఆలోచిస్తూ ఉండగా, భక్తవత్సలుడైన శంకరుడు కరుణించాడు.

**దధ్రే భిక్షుస్వరూపం హి మహాలీలో మహేశ్వరః ।**
**సర్వథా భక్త సుఖదో నిరుపాధిః స్వయం సదా ॥ 24 ॥**

అన్ని విధాలుగా భక్తులకు సుఖాలనిచ్చేవాడు, తాను అన్ని విధాలా దేహోపాధి లేనివాడు, కాని గొప్ప లీలలను ప్రదర్శించువాడునైన మహేశ్వరుడు భిక్షుకరూపాన్ని ధరించాడు.

**తత్రాజగామ సహసా స భిక్షుః పరమేశ్వరః ।**
**యత్రాస్తి సందేహవతీ ద్విజస్త్రీ జ్ఞాతుమిచ్ఛతి ॥ 25 ॥**

బాలుని గూర్చిన వివరాలను తెలుసుకోవాలని కోరుకుంటున్న ఆ బ్రాహ్మణ స్త్రీవద్దకు పరమేశ్వరుడు భిక్షుక రూపంలో విచ్చేశాడు.

**భిక్షువర్యస్వరూపోఽసావవిజ్ఞాతగతిః ప్రభుః ।**
**తామాహ విప్రవనితాం విహస్య కరుణానిధిః ॥ 26 ॥**

ఎవని చేష్టలను తెలియుటకు శక్యం కాదో, అట్టి దయానిధియైన శంభువు భిక్షుకరూపంలో విచ్చేసి, ఆ బ్రాహ్మణస్త్రీతో ఇట్లు పలికాడు.

**భిక్షువర్య ఉవాచ –** భిక్షువర్యుడు పలికాడు.

**సందేహం కురు నో చిత్తే విప్రభామిని! మా ఖిద ।**
**రక్షైనం బాలకం ప్రీత్యా సుపవిత్రం స్వపుత్రకమ్ ॥ 27 ॥**

ఓ బ్రాహ్మణభామినీ! మనస్సులో సందేహించ వద్దు. దుఃఖింపవద్దు. మిక్కిలి పవిత్రుడైన ఈ బాలకుని ప్రేమతో నీ పుత్రునివలె రక్షింపుము.

**అనేన శిశునా శ్రేయః ప్రాప్స్యసే న చిరాత్పరమ్ ।**
**పుష్ణీహి సర్వథా హ్యేనం మహాతేజస్వినం శిశుమ్ ॥ 28 ॥**

ఈ శిశువు కారణంగా నీవు శీఘ్రంగా పరమ శ్రేయస్సును పొందగలవు. మహాతేజస్వియైన ఈ బాలుని అన్ని విధములుగా పోషింపుము.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్తవంతం తం భిక్షు స్వరూపం కరుణానిధిమ్ ।**
**సా విప్రవనితా శంభుం ప్రీత్యా పప్రచ్ఛ సాదరమ్ ॥ 29 ॥**

శంభువు భిక్షుకరూపంలో నుండి ఇట్లు పలుకగా, ఆ బ్రాహ్మణస్త్రీ ప్రీతితోను, ఆదరముతోను శంభుని ఇట్లుడిగింది.

**విప్రవనితోవాచ –** విప్రవనిత పలికింది.

**త్వదాజ్ఞయైనం బాలం హి రక్షిష్యామి స్వపుత్రవత్ ।**
**పోష్యామి నాత్ర సందేహో మద్భాగ్యాత్త్వమిహాగతః ॥ 30 ॥**

నీ ఆజ్ఞచే నేనీ బాలుని నా పుత్రుని వలె రక్షించి నిస్సందేహంగా పోషిస్తాను. నా భాగ్యవిశేషంచే నీ విచ్చటకు వచ్చావు.

**తథాపి జ్ఞాతుమిచ్ఛామి విశేషేణ తు తత్త్వతః ।**
**కోఽయం కస్య సుతశ్చాయం కస్త్వమత్ర సమాగతః ॥ 31 ॥**

అయినప్పటికీ యథార్థాన్ని యథాతథంగా తెలుసుకోవాలనుకుంటున్నాను. ఈ బాలుడు ఎవరి కుమారుడు? ఇచటకు విచ్చేసిన నీవెవరివి?

**ముహుర్మమ సమాయాతి జ్ఞానం భిక్షువర! ప్రభో! ।**
**త్వం శివః కరుణాసింధుస్త్వద్భక్తోఽయం శిశుః పురా ॥ 32 ॥**

ఓ భిక్షుకశ్రేష్ఠా! ప్రభూ! నాకు జ్ఞానం కలుగుతోంది. నీవు దయాసముద్రుడవైన శివుడవు. ఈ బాలకుడు పూర్వజన్మలో నీ భక్తుడు.

**కేనచిత్కర్మదోషేణ సంప్రాప్తోఽయం దశామిమామ్ ।**
**తద్భుక్త్వా పరమం శ్రేయః ప్రాప్స్యతే త్వదనుగ్రహాత్ ॥ 33 ॥**

ఒకానొక దుష్కర్మవలన ఈ దుర్దశను పొందియున్నాడు. దానిని అనుభవించి, నీ అనుగ్రహంచే పరమశ్రేయస్సును పొందగలడు.

**త్వన్మాయయైవ సాఽహం వై మార్గభ్రష్టా విమోహితా ।**
**ఆగతా ప్రేషితా త్వత్తో హ్యస్య రక్షణహేతుతః ॥ 34 ॥**

నేను నీ మాయచే మోహితురాలనై దారి తప్పాను. నన్ను నీవే ఇచ్చటకు ఈ బాలుని రక్షించడానికి పంపగా నేను వచ్చియుంటాను.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుదు పలికాడు.

**ఇతి తద్దర్శనప్రాప్తవిజ్ఞానాం విప్రకామినీమ్ ।**
**జ్ఞాతుకామాం విశేషేణ ప్రోచే భిక్షుతనుశ్శివః ॥ 35 ॥**

ఈ విధంగా శివుని దర్శనంచే ఆమెకు జ్ఞానం కలిగింది. అయినప్పటికీ, ఆ బ్రాహ్మణపత్ని వివరాలనింకనూ తెలియగోరింది. భిక్షుకరూపంలోనున్న శివుడు ఆమెతో ఇలా పలికాడు.

**భిక్షువర్య ఉవాచ** – భిక్షువర్యుడు పలికాడు.

**శృణు ప్రీత్యా విప్రపత్ని! బాలస్యాస్య పురే హితమ్ ।**
**సర్వమన్యస్య సుప్రీత్యా వక్ష్యతే తత్త్వతోఽనఘే! ॥ 36 ॥**

ఓ బ్రాహ్మణపత్నీ! పుణ్యాత్మురాలా! ఈ బాలకుని పూర్వవృత్తాంతం, ఇతని బంధువుల వివరాలు సర్వం నీకు తెలియజేస్తాను. మిక్కిలి ప్రీతితో వినుము.

**సుతో విదర్భరాజస్య శివభక్తస్య ధీమతః ।**
**అయం సత్యరథస్యైవ స్వధర్మనిరతస్య హి ॥ 37 ॥**

శివభక్తుడు, బుద్ధిమంతుడు, స్వధర్మనిరతుడునైన విదర్భదేశాధీశుడైన సత్యరథుని పుత్రుడే ఈ బాలకుడు.

**శృణు సత్యరథో రాజా హతః శాల్వై రణే పరైః ।**
**తత్పత్నీ నిశి సువ్యగ్రా నిర్యయౌ స్వగృహాద్ద్రుతమ్ ॥ 38 ॥**

సత్యరథమహారాజు యుద్ధంలో బలవంతులైన శాల్వులచే సంహరింపబడగా, అతని భార్య తొందరపాటున రాత్రిసమయంలో తన గృహంనుండి శీఘ్రంగా బయటపడింది.

**అసూత తనయం చైనం సమాయాతా ప్రగేఽత్ర హి ।**
**సరోఽవతీర్ణా తృషయా గ్రస్తా గ్రాహేణ దైవతః ॥ 39 ॥**

ఆమె తెల్లవారుసరికి ఇచ్చటకు చేరి, ఈ బాలుని ప్రసవించింది. ఆమె దప్పిక తీర్చుకోవడానికి సరస్సులోనికి దిగగానే, దైవవశంచే మొసలి ఆమెను భక్షించింది.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుదు పలికాడు.

**ఇతి తస్య సముత్పత్తిం తత్పితుః సంగరే మృతిమ్ ।**
**తన్మాతృమరణం గ్రాహాత్సర్వం తస్యై న్యవేదయత్ ॥ 40 ॥**

ఇట్లు ఆ పిల్లవాని పుట్టుక, ఆ బాలుని తండ్రి యుద్ధంలో మరణించడం, మొసలికి చిక్కి అతని తల్లి మరణించడం మున్నగు విషయాలన్నిటిని ఆమెకు చెప్పాడు.

**అథ సా బ్రాహ్మణీ తత్ర విస్మితాఽతిమునీశ్వర! ।**
**పునః పప్రచ్ఛ తం భిక్షుం జ్ఞానినం సిద్ధరూపకమ్ ॥ 41 ॥**

అప్పుడాబ్రాహ్మణస్త్రీ మిక్కిలి ఆశ్చర్యాన్ని పొంది, జ్ఞానియు, సిద్ధుడునైన భిక్షుకుని మరలా ఇట్లు ప్రశ్నించింది.

**బ్రాహ్మణ్యువాచ –** బ్రాహ్మణి పలికింది.

**స రాజాఽస్య పితా భిక్షో! వరభోగాన్తరేవ హి ।**
**కస్మాచ్ఛాల్వైస్స్వరిపుభిః స్వల్పేహైశ్చ విఘాతితః ॥ 42 ॥**

ఓ భిక్షూ! ఈ బాలుని తండ్రియైన ఆ మహారాజు గొప్ప భోగాలననుభవిస్తూ ఉండగా, మధ్యలో అతని శత్రువులు, స్వల్పవాంఛలుగల శాల్వులచే సంహరింపబడడానికి కారణమేమిటి?

**కస్మాదస్య శిశోర్మాతా గ్రాహేణాశు సుభక్షితా ।**
**యస్మాదనాథోఽయం జాతో విబంధుశ్చైవ జన్మతః ॥ 43 ॥**

ఈ బాలుని తల్లిని మొసలి భక్షించడానికి కారణమేమి? బాలుడు పుట్టిన వెంటనే బంధువులనందరిని కోల్పోయి అనాథయగుటకు కారణమేమి?

**కస్మాత్సుతో మమాపీహ సుదరిద్రో హి భిక్షుకః ।**
**భవేత్కథం సుఖం భిక్షో! పుత్రయోరనయోర్వద ॥ 44 ॥**

నా కుమారుడు కూడ అత్యంత దరిద్రుడు, ముష్టివాడు అగుటకు కారణమేమి? ఈ ఇద్దరు బాలకులు ఇప్పుడు నా పుత్రులు. వీరికి సుఖం కలిగే ఉపాయమేమి?

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇతి తస్యా వచః శ్రుత్వా స భిక్షుః పరమేశ్వరః ।**
**విప్రపత్న్యాః ప్రసన్నాత్మా ప్రోవాచ విహసంశ్చ తామ్ ॥ 45 ॥**

ఆమెయొక్క ఈ మాటలను విని భిక్షుకరూపంలో నున్న పరమేశ్వరుడు నవ్వి, ప్రసన్నాత్ముడై ఆ బ్రాహ్మణస్త్రీతో ఇట్లు పలికాడు.

**భిక్షువర్య ఉవాచ –** భిక్షువర్యుడు పలికాడు.

**విప్రపత్ని! విశేషేణ సర్వప్రశ్నాన్వదామి తే ।**
**శృణు త్వం సావధానేన చరిత్రమిదముత్తమమ్ ॥ 46 ॥**

ఓ బ్రాహ్మణపత్నీ! నీ ప్రశ్నలన్నింటికి వివరంగా సమాధానాలు చెబుతాను. ఈ ఉత్తమ గాథను నీవు శ్రద్ధగా వినుము.

**అముష్య బాలస్య పితా స విదర్భమహీపతిః ।**
**పూర్వజన్మని పాండ్యోఽసౌ బభూవ నృపసత్తమః ॥ 47 ॥**

ఈ బాలకుని తండ్రియైన విదర్భమహారాజు పూర్వజన్మలో పాండ్యమహారాజుగా జన్మించాడు.

**స శైవనృపతిర్ధర్మాత్పాలయన్నిఖిలాం మహీమ్ ।**
**స్వప్రజాం రంజయామాస సర్వోపద్రవనాశనః ॥ 48 ॥**

శివభక్తుడు, ధర్మాత్ముడునైన ఆ రాజు భూమండలాన్ని అంతటినీ పాలించి, ఉపద్రవాలనన్నింటిని నశింపజేసి, తన ప్రజలను రంజిల్లజేశాడు.

**కదాచిత్స హి సర్వేశం ప్రదోషే పర్యపూజయత్ ।**
**త్రయోదశ్యాం నిరాహారో దివానక్తవ్రతీ శివమ్ ॥ 49 ॥**

ఒకప్పుడు ఆయన త్రయోదశినాడు ఉపవాసంచేసి, రాత్రింబవళ్లు వ్రతనియమాలను పాటించి, ప్రదోషకాలంలో సర్వేశ్వరుడైన శివుని పూజించాడు.

**తస్య పూజయతః శంభుం ప్రదోషే గిరిశం రతే ।**
**మహాంఛబ్దో బభూవాథ వికటస్సర్వథా పురే ॥ 50 ॥**

ఆయన ప్రదోషకాలంలో శ్రద్ధతో కైలాసవాసియైన శివుని పూజిస్తూ ఉండగా, నగరంలో అన్ని వైపుల నుండి, కర్కశమైన పెద్ద ధ్వని బయలుదేరింది.

**తమాకర్ణ్య రవం సోఽథ రాజా త్యక్తశివార్చనః ।**
**రిప్వాగమనశంకాతో నిర్యయౌ భవనాద్బహిః ॥ 51 ॥**

ఆ రాజు ఆ శబ్దాన్ని విని శత్రువులు దండెత్తి వచ్చినారేమో అనే శంకతో శివపూజను విడిచి పెట్టి భవనం బయటకు వచ్చాడు.

**ఏతస్మిన్నేవ కాలే తు తస్యామాత్యో మహాబలీ ।**
**గృహీతశత్రుసామంతో రాజాంతికముపాయయౌ ॥ 52 ॥**

అదే సమయంలో మహాబలశాలియైన అతని మంత్రి, శత్రువైన సామంతరాజును చెరబట్టి రాజువద్దకు తీసుకొని వచ్చాడు.

**తం దృష్ట్వా శత్రుసామంతం మహాక్రోధేన విహ్వలః ।**
**అవిచార్య వృషం తస్య శిరశ్ఛేదమకారయత్ ॥ 53 ॥**

ఆ మహారాజు క్రోధంవల్ల వివేకాన్ని కోల్పోయి, ధర్మాన్ని విచారించకుండా ఆ శత్రుసామంతరాజు తలను తీయించాడు.

**అసమాప్యేశపూజాన్తామశుచిర్నష్టధీర్నృపః ।**
**రాత్రౌ చకార సుప్రీత్యా భోజనం నష్టమంగళః ॥ 54 ॥**

అమంగళకరమైన ఆలోచనలచే వినష్టమైన వివేకము, పుణ్యము గల ఆ రాజు ఈశ్వరుని పూజను పూర్తి చేయకుండగానే రాత్రియందు ప్రీతితో భుజించాడు.

**విదర్భే సోఽభవద్రాజా జన్మనీహ శివవ్రతీ ।**
**శివార్చనాంతరాయేణ పరైర్భోగాంతరే హతః ॥ 55 ॥**

శివవ్రతంగల ఆ రాజే ఈ జన్మలో విదర్భ దేశాధిపతి అయ్యాడు. శివార్చనలో అంతరాయాన్ని చేయడం-చేత అతడు భోగాలననుభవిస్తూ ఉండగానే, శత్రువులచే సంహరింపబడ్డాడు.

**తత్పుత్రో యః పూర్వభవే సోఽస్మింజన్మని తత్సుతః ।**
**అహమేవ హతైశ్వర్యః శివపూజావ్యతిక్రమాత్ ॥ 56 ॥**

పూర్వజన్మలో అతని పుత్రుడే ఈ జన్మలో కూడా మరలా పుత్రుడయ్యాడు. అహంకారంతో శివపూజలో లోపం చేయడం- వల్ల ఈ బాలుడు ఐశ్వర్యాన్ని కోల్పోయాడు.

**అస్య మాతా పూర్వభవే సపత్నీం ఛద్మనాఽహరత్ ।**
**భక్షితా తేన పాపేన గ్రాహేణాస్మిన్ భవే హి సా ॥ 57 ॥**

ఇతని తల్లి పూర్వజన్మలో సవతిని మోసంతో చంపించింది. ఆ పాపంచేత ఈ జన్మలో మొసలిచే భక్షింపబడింది.

**ఏషా ప్రవృత్తిరేతేషాం భవత్యై పరికీర్తితా ।**
**అనర్చితా శివా భక్త్యా ప్రాప్నువంతి దరిద్రతామ్ ॥ 58 ॥**

వీరందరి ప్రవృత్తులను నీకు చెప్పాను. పార్వతీదేవిని భక్తితో ఆరాధించనివారు దరిద్రులౌతారు.

**ఏష తే తనయః పూర్వజన్మని బ్రాహ్మణోత్తమః ।**
**ప్రతిగ్రహైర్వయో నిన్యే న యజ్ఞాద్యైస్సుకర్మభిః ॥ 59 ॥**

ఈ నీ కుమారుడు పూర్వజన్మలో బ్రాహ్మణోత్తముడైనను, యజ్ఞాదిపుణ్యకర్మలను విడనాడి, దానాలను పరిగ్రహిస్తూ జీవితాన్ని గడిపాడు.

**అతో దారిద్ర్యమాపన్నః పుత్రస్తే ద్విజభామిని! ।**
**తద్దోష పరిహారార్థం శరణం శంకరం వ్రజ ॥ 60 ॥**

ఓ బ్రాహ్మణపత్నీ! అందువల్లనే నీ ఈ పుత్రుడు దరిద్రుడయ్యాడు. ఆ దోషాన్ని పోగొట్టుకొనడానికి శంకరుని శరణు పొందుము.

**ఏతాభ్యాం ఖలు బాలాభ్యాం శివపూజా విధీయతామ్ ।**
**ఉపవీతానంతరం హి శివః శ్రేయః కరిష్యతి ॥ 61 ॥**

ఈ ఇద్దరు బాలురతో కలిసి ఉపనయనానంతరం శివపూజను చేయుము. శివుడు శ్రేయస్సును కలిగిస్తాడు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇతి తాముపదిశ్యాథ భిక్షువర్యతనుః శివః ।**
**స్వరూపం దర్శయామాస పరమం భక్తవత్సలః ॥ 62 ॥**

భక్తవత్సలుడు, భిక్షుకరూపధారియునైన శివుడు ఈ విధంగా ఆమెకుపదేశించి, అనంతరం తన స్వరూపాన్ని దర్శింపజేశాడు.

**అథ సా విప్రవనితా జ్ఞాత్వా తం శంకరం ప్రభుమ్ ।**
**సుప్రణమ్య హి తుష్టావ ప్రేమ్ణా గద్గదయా గిరా ॥ 63 ॥**

అంతట ఆ బ్రాహ్మణస్త్రీ ఆ శంకరప్రభువును గుర్తించి, చక్కగా నమస్కరించి, గద్గదకంఠంతో, ప్రేమతో స్తుతించింది.

**తతస్స భగవాంచ్ఛంభుర్ధృతభిక్షుతనుర్ద్రుతమ్ ।**
**పశ్యంత్యా విప్రపత్న్యాస్తు తత్రైవాంతరధీయత ॥ 64 ॥**

భిక్షురూపాన్ని ధరించిన ఆ శంభుభగవానుడు ఆ బ్రాహ్మణపత్ని చూస్తూ ఉండగానే, అక్కడనే అంతర్ధానమయ్యాడు.

**అథ తస్మిన్ గతే భిక్షౌ విస్రబ్ధా బ్రాహ్మణీ చ సా ।**
**తమర్భకం సమాదాయ సస్వపుత్రా గృహం యయౌ ॥ 65 ॥**

అపుడా భిక్షువు అంతర్ధానం కాగానే, ఆ బ్రాహ్మణస్త్రీ విశ్వాసాన్ని పొంది, ఆ పిల్లవానిని తీసుకొని, తన కుమారునితో సహా ఇంటికి వెళ్లింది.

**ఏకచక్రాహ్వయే రమ్యే గ్రామే కృతనికేతనా ।**
**స్వపుత్రం రాజపుత్రం చ వరాన్నైశ్చ వ్యవర్ధయత్ ॥ 66 ॥**

ఏకచక్రమనే సుందరమైన గ్రామంలో ఆమె నివసించి, తన పుత్రునికి, రాజపుత్రునికి శ్రేష్ఠమైన ఆహారాన్నిచ్చి పెంచింది.

**బ్రాహ్మణైః కృతసంస్కారౌ కృతోపనయనౌ చ తౌ ।**
**వవృధాతే స్వగేహే చ శివపూజనతత్పరౌ ॥ 67 ॥**

వారిద్దరు బ్రాహ్మణులచే చేయబడిన సంస్కారాలు, ఉపనయనాలు గలవారై, శివపూజాతత్పరులై పెరుగుతున్నారు.

**తౌ శాండిల్యమునేస్తాత! నిదేశాన్నియమస్థితౌ ।**
**ప్రదోషే చక్రతుః శంభోః పూజాం కృత్వా వ్రతం శుభమ్ ॥ 68 ॥**

వత్సా! వారు శాండిల్యమహర్షియొక్క ఆదేశాన్ని అనుసరించి, నియమాలను పాటిస్తూ, శివవ్రతాన్ని చేబట్టి ప్రదోషంలో శంభుని పూజను చేస్తున్నారు.

**కదాచిద్ద్విజపుత్రేణ వినాఽసౌ రాజనందనః ।**
**నద్యాం స్నాతుం గతః ప్రాప నిధానకలశం వరమ్ ॥ 69 ॥**

ఒకనాడు బ్రాహ్మణబాలకుడు, రాజకుమారుడు లేకుండగానే, నదీస్నానానికి వెళ్లగా, అచట ధనంతో నిండియున్న ఒక పెద్ద కలశం లభించింది.

**ఏవం పూజయతోః శంభుం రాజద్విజకుమారయోః ।**
**సుఖేనైవ వ్యతీయాయ తయోర్మాసచతుష్టయమ్ ॥ 70 ॥**

ఈ విధంగా శంభుని పూజిస్తున్న, ఆ బ్రాహ్మణ, రాజబాలకులకు సుఖంగా నాలుగు నెలలు గడిచాయి.

**ఏవమర్చయతోః శంభుం భూయోఽపి పరయా ముదా ।**
**సంవత్సరో వ్యతీయాయ తస్మిన్నేవ తయోర్గృహే ॥ 71 ॥**

మరల అదే స్వగృహంలో పరమభక్తితో శంభుని అర్చిస్తూ ఉండగా సంవత్సరం గడిచింది.

**సంవత్సరే వ్యతిక్రాంతే స రాజతనయో మునే! ।**
**గత్వా వనాన్తే విప్రేణ శివస్యానుగ్రహాద్విభోః ॥ 72 ॥**

**అకస్మాదాగతాం తత్ర దత్తాం తజ్జనకేన హ ।**
**వివాహ్య గంధర్వసుతాం చక్రే రాజ్యమకంటకమ్ ॥ 73 ॥**

ఓ మహర్షీ! ఈ విధంగా సంవత్సరంగడిచిన పిమ్మట రాజకుమారుడు బ్రాహ్మణ బాలకునితో కలిసి అడవిలోనికి వెళ్లాడు. సర్వవ్యాపకుడైన శివుని అనుగ్రహంతో అచ్చటకు అకస్మాత్తుగా ఒక గంధర్వకన్య వచ్చింది. ఆమె తండ్రి ఆ రాజకుమారునికి ఆమెనిచ్చి వివాహం చేశాడు. ఆమెను వివాహమాడి ఆ రాజకుమారుడు నిష్కంటకంగా రాజ్యపాలన చేశాడు.

**యా విప్రవనితా పూర్వే తమపుష్ణాత్స్వపుత్రవత్ ।**
**సైవ మాతాఽభవత్తస్య సభ్రాతా ద్విజనందనః ॥ 74 ॥**

పూర్వం అతనిని ఏ బ్రాహ్మణస్త్రీ తన పుత్రుని వలె పెంచిందో, ఆమెయే ఆ మహారాజునకు తల్లి అయ్యింది. ఆ బ్రాహ్మణబాలకుడు సోదరుడయ్యాడు.

**ఇత్థమారాధ్య దేవేశం ధర్మగుప్తాహ్వయస్స వై ।**
**విదర్భవిషయే రాజ్ఞ్యా తయా భోగం చకార హ ॥ 75 ॥**

ధర్మగుప్తుడను పేరుగల ఆ క్షత్రియుడు ఈ విధంగా దేవదేవుడైన శివుని ఆరాధించి, విదర్భరాజ్యాన్ని పాలిస్తూ, రాణితో కలిసి భోగాలననుభవించాడు.

**భిక్షువర్యావతారస్తే వర్ణితశ్చ మయాఽధునా ।**
**శివస్య ధర్మగుప్తాహ్వనృపబాలసుఖప్రదః ॥ 76 ॥**

ధర్మగుప్తుడను రాజకుమారునికి సుఖాలనొసంగిన శివుని శ్రేష్ఠమైన భిక్షుకావతారాన్ని గూర్చి నీకు వర్ణించి చెప్పాను.

**ఏతదాఖ్యానమనఘం పవిత్రం పావనం మహత్ ।**
**ధర్మార్థకామమోక్షాణాం సాధనం సర్వకామదమ్ ॥ 77 ॥**

ఈ గాథ పాపాలను పోగొట్టి పావనం చేస్తుంది. మిక్కిలి పవిత్రమైనది, ధర్మార్థకామమోక్షాలకు సాధనమైనది, అంతేగాదు కోర్కెలనన్నింటిని తీరుస్తుంది.

**య ఏతచ్ఛృణుయాన్నిత్యం శ్రావయేద్వా సమాహితః ।**
**స భుక్త్వేహాఖిలాన్కామాన్ సోఽన్తే శివపురం వ్రజేత్ ॥ 78 ॥**

ఎవడైతే నిత్యం దీనిని వింటాడో, ఏకాగ్రచిత్తంతో వినిపిస్తాడో, వాడు ఇహలోకంలో కోర్కెలనన్నింటినీ అనుభవించి, దేహం నశించిన తరువాత శివపదమును పొందుతాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం భిక్షువర్యాహ్వశివావతారచరిత్రవర్ణనం నామైకత్రింశోఽధ్యాయః ॥ 31 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు భిక్షువర్యావతారచరిత్రవర్ణనం అనే పేరుగల ముప్పైఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్వాత్రింశోఽధ్యాయః - ముప్పైరెండవ అధ్యాయం

## సురేశ్వరాఖ్యశివావతారచరిత్రవర్ణనమ్ - సురేశ్వరాఖ్యశివావతారచరిత్రవర్ణనం

**శృణు తాత! ప్రవక్ష్యామి శివస్య పరమాత్మనః ।**
**సురేశ్వరావతారస్తే ధౌమ్యాగ్రజహితావహమ్ ॥ 1 ॥**

వత్సా! పరమాత్ముడైన శివుని సురేశ్వరావతారాన్ని గూర్చి చెబుతాను విను. ఈ అవతారంలో శివుడు ధౌమ్యుని అన్నకు హితాన్ని చేకూర్చిన కథ ఇది.

**వ్యాఘ్రపాదసుతో ధీమానుపమన్యుస్సతాం ప్రియః ।**
**జన్మాంతరేణ సంసిద్ధః ప్రాప్తో మునికుమారతామ్ ॥ 2 ॥**

వ్యాఘ్రపాదుని కుమారుడైన ఉపమన్యుడు బుద్ధిశాలి. అంతేగాదు సత్పురుషులకు ప్రియమైనవాడు. అతడు పూర్వజన్మలో సిద్ధిని పొంది ఈ జన్మలో మునికుమారుడయ్యాడు.

**ఉవాస మాతులగృహే స మాత్రా శిశురేవ హి ।**
**ఉపమన్యుర్వ్యాఘ్రపాదిస్స్వైర్దరిద్రశ్చ దైవతః ॥ 3 ॥**

వ్యాఘ్రపాదుని పుత్రుడైన ఉపమన్యువు దైవవశంచే దరిద్రుడౌటవల్ల చిన్నవయసులో నుండగానే తల్లితో గూడి మేనమామ ఇంటిలో నివసించేవాడు.

**కదాచిత్ క్షీరమత్యల్పం పీతవాన్మాతులాశ్రమే ।**
**యయాచే మాతరం ప్రీత్యా బహుశో దుగ్ధలాలసః ॥ 4 ॥**

ఒకనాడు మేనమామ ఇంటిలో అతనికి అతి తక్కువ పాలు లభించాయి. అప్పుడతడు పాలపై మిక్కుటమైన మక్కువగలవాడై తల్లిని ప్రేమతో యాచించాడు.

**తచ్ఛ్రుత్వా పుత్రవచనం తన్మాతా చ తపస్వినీ ।**
**సాంతః ప్రవిశ్యాథ తదా శుభోపాయమరీరచత్ ॥ 5 ॥**

పుత్రుని మాటలను విని వాని తల్లి లోపలకు వెళ్లి ఒక చక్కని ఉపాయమాలోచించింది.

**ఉంఛవృత్త్యార్జితాన్బీజాన్పిష్ట్వాఽఽలోడ్య జలేన తాన్ ।**
**ఉపలాల్య సుతం తస్మై సా దదౌ కృత్రిమం పయః ॥ 6 ॥**

ఆమె ఉంఛవృత్తి ద్వారా సంపాదించిన గింజలను పిండి చేసి, నీటిలో కలిపి ఆ పిండిపాలను పుత్రునికి పాలనిస్తూ వచ్చింది.

**పీత్వా చ కృత్రిమం దుగ్ధం మాత్రా దత్తం స బాలకః ।**
**నైతత్ క్షీరమితి ప్రాహ మాతరం చారుదత్పునః ॥ 7 ॥**

తల్లి ఇచ్చిన పిండిపాలను త్రాగి ఆ బాలకుడు తల్లితో 'ఇవి పాలు కావు' అని పలికి ఏడ్వడం ప్రారంభించాడు.

**శ్రుత్వా సుతస్య రుదితం ప్రాహ సా దుఃఖితా సుతమ్ ।**
**సంమార్జ్య నేత్రే పుత్రస్య కరాభ్యాం కమలాకృతిః ॥ 8 ॥**

లక్ష్మివంటి రూపు గల ఆమె పుత్రుని ఏడ్పును విని మిక్కిలి దుఃఖించి, పుత్రుని కన్నీటిని చేతులతో తుడిచి ఇలా పలికింది.

**మాతోవాచ** – తల్లి పలికింది.

**క్షీరమత్ర కుతోఽస్మాకం వనే నివసతాం సదా ।**
**ప్రసాదేన వినా శంభోః పయః ప్రాప్తిర్భవేన్నహి ॥ 9 ॥**

ఎల్లప్పుడు అడవులలో నివసించు మనకు పాలెక్కడివి? శంభుని అనుగ్రహం లేనిదే పాలు లభింపవు.

**పూర్వజన్మని యత్కృత్యం శివముద్దిశ్య హే సుత! ।**
**తదేవ లభ్యతే నూనం నాత్ర కార్యా విచారణా ॥ 10 ॥**

ఓ పుత్రా! పూర్వజన్మలో శివునుద్దేశించి ఎంత ఆరాధన చేసి ఉంటామో అంత మాత్రమే లభిస్తుంది. ఇది నిశ్చయం. దీనిలో శంకకు తావులేదు.

**ఇతి మాతృవచశ్శ్రుత్వా వ్యాఘ్రపాదిః స బాలకః ।**
**ప్రత్యువాచ విశోకాత్మా మాతరం మాతృవత్సలః ॥ 11 ॥**

వ్యాఘ్రపాదుని కుమారుడును, తల్లియందు ప్రేమగలవాడునగు ఆ బాలకుడు తల్లియొక్క మాటలను విని శోకంతో నిండిన హృదయంగలవాడై తల్లికిట్లు బదులుపలికాడు.

**శోకేనాలమిమం మాతః! శంభుర్యద్యస్తి శంకరః ।**
**త్యజ శోకం మహాభాగే! సర్వం భద్రం భవిష్యతి ॥ 12 ॥**

ఓ తల్లీ! శోకాన్ని విడిచిపెట్టు, మంగళకరుడైన శంభువుంటే సర్వం సుసంపన్నం కాగలదు.

**శృణు మాతర్వచో మేఽద్య మహాదేవోఽస్తి చేత్క్వచిత్ ।**
**చిరాద్వా హ్యచిరాద్వాపి క్షీరోదం సాధయామ్యహమ్ ॥ 13 ॥**

ఇప్పుడు నా మాటను విను. మహాదేవుడెక్కడ ఉన్ననూ, శీఘ్రంగా గాని, చిరకాలానికి గాని నేను క్షీరసముద్రాన్ని సాధిస్తాను.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వా స శిశుః ప్రీత్యా శివం మేఽస్త్విత్యుదీర్యచ ।**
**విసృజ్య తాం సుప్రణమ్య తపః కర్తుం ప్రచక్రమే ॥ 14 ॥**

ఆ బాలుడు ప్రీతితో ఇట్లు పలికి 'నాకు శుభమగు గాక' అని పలికి ఆమెకు చక్కగా ప్రణమిల్లి ఆమెను విడిచి తపస్సును చేయడం మొదలు పెట్టాడు.

**హిమవత్పర్వతగతః వాయుభక్షస్సమాహితః ।**
**అష్టేష్టకాభిః ప్రాసాదం కృత్వా లింగం చ మృణ్మయమ్ ॥ 15 ॥**

అతడు హిమాలయాలకు పోయి ఎనిమిది ఇటుకలతో ఒక మందిరాన్నీ, మట్టిలింగాన్నీ చేసి, వాయువు మాత్రమే ఆహారంగా గలవాడై ఏకాగ్రమైన మనస్సుతోనున్నాడు.

**తత్రావాహ్య శివం సాంబం భక్త్యా పంచాక్షరేణ హ ।**
**పత్రపుష్పాదిభిర్వన్యైస్సమానర్చ శిశుః స వై ॥ 16 ॥**

ఆ లింగమునందు పార్వతీసమేతుడైన శివుని ఆహ్వానించి, భక్తితో ఆరాధించాడు. ఆ బాలకుడు పంచాక్షరీ మంత్రాన్ని జపిస్తూ, వనములందు లభించే పత్రపుష్పాదులతో చక్కగా ఆరాధించాడు.

**ధ్యాత్వా శివం చ తం సాంబం జపన్పంచాక్షరం మనుమ్ ।**
**సమభ్యర్చ్య చిరం కాలం చచార పరమం తపః ॥ 17 ॥**

అతడు పంచాక్షరీమంత్రాన్ని జపిస్తూ, పార్వతీ సమేతుడైన శివుని ధ్యానిస్తూ, చిరకాలం శివుని ఆరాధిస్తూ, గొప్ప తపస్సు చేశాడు.

**తపసా తస్య బాలస్య హ్యుపమన్యోర్మహాత్మనః ।**
**చరాచరం చ భువనం ప్రదీపితమభూన్మునే! ॥ 18 ॥**

ఓ మహర్షీ! బాలకుడు, మహాత్ముడునైన ఉపమన్యుని తపస్సుచే చరాచరజగత్తంతయూ తేజో-మయమయ్యింది.

**ఏతస్మిన్నంతరే శంభుర్విష్ణ్వాద్యైః ప్రార్థితః ప్రభుః ।**
**పరీక్షితుం చ తద్భక్తిం శక్రరూపోఽభవత్తదా ॥ 19 ॥**

ఇదే కాలంలో విష్ణువు మున్నగువారిచే ప్రార్థింపబడిన మహాదేవుడు అతని భక్తిని పరీక్షించడానికి ఇంద్రరూపాన్ని ధరించాడు.

**శివా శచీస్వరూపాఽభూద్గణాః సర్వేఽభవన్సురాః ।**
**ఐరావతగజో నందీ సర్వమేవ చ తన్మయమ్ ॥ 20 ॥**

పార్వతీదేవి శచీదేవి రూపాన్ని ధరించింది. గణాలందరూ దేవతలయ్యారు. నందీశ్వరుడు ఐరావత-గజమయ్యాడు. మిగిలినదంతయు ఇంద్రలోకసంబంధి రూపం ధరించింది.

**తతః సాంబః శివః శక్రస్వరూపస్సగణో ద్రుతమ్ ।**
**జగామానుగ్రహం కర్తుముపమన్యో స్తదాశ్రమమ్ ॥ 21 ॥**

అపుడు పార్వతీసమేతుడైన శివుడు ఇంద్రరూపంలో గణాలతో గూడి వెంటనే ఉపమన్యుని అనుగ్రహించడానికి అతని ఆశ్రమానికి విచ్చేశాడు.

**పరీక్షితుం చ తద్భక్తిం శక్రరూపధరో హరః ।**
**ప్రాహ గంభీరయా వాచా బాలకం తం మునీశ్వర! ॥ 22 ॥**

సనత్కుమారా! ఆ బాలకుని భక్తిని పరీక్షించడానికి ఇంద్రుని రూపం దాల్చిన శివుడు గంభీరమైన వాక్కుతో అతనిని ఉద్దేశించి ఇలా పలికాడు.

**సురేశ్వర ఉవాచ –** సురేశ్వరుడు పలికాడు.

**తుష్టోఽస్మి తే వరం బ్రూహి తపసాఽనేన సువ్రత! ।**
**దదామి చేప్సితాన్ కామాన్సర్వాన్నాత్రాస్తి సంశయః ॥ 23 ॥**

ఓ మహాతపస్వీ! నీ తపస్సునకు నేను సంతసించాను. వరాన్ని కోరుకో. నీవు కోరిన కోర్కెలనన్నింటినీ తీరుస్తాను. సందేహం లేదు.

**ఏవముక్తః స వై తేన శక్రరూపేణ శంభునా ।**
**వరయామి శివే భక్తిమిత్యువాచ కృతాంజలిః ॥ 24 ॥**

ఇంద్రుడిట్లు పలుకగా, ఆ మాటలను విని అతడు చేతులను జోడించి 'శివుని యందు భక్తిని గోరుచున్నాను' అని పలికాడు.

**తన్నిశమ్య హరిః ప్రాహ మాం న జానాసి లేఖపమ్ ।**
**త్రైలోక్యాధిపతిం శక్రం సర్వదేవనమస్కృతమ్ ॥ 25 ॥**

ఆ మాటలను విని ఇంద్రుడిలా పలికాడు 'నీవు నన్ను ఎరుగవు, దేవతలందరి చేత నమస్కరింపబడినవాడను నేనే. ముల్లోకాలకు ప్రభువునైన ఇంద్రుడను నేనే'.

**మద్భక్తో భవ విప్రర్షే! మామేవార్చయ సర్వదా ।**
**దదామి సర్వం భద్రం తే త్యజ రుద్రం చ నిర్గుణమ్ ॥ 26 ॥**

ఓ విప్రర్షీ! నీవు నా భక్తుడవై సర్వదా నన్ను ఆరాధించు. నీకు సర్వాన్ని ఇస్తాను. నీకు మంగళమౌగాక! నిర్గుణుడైన రుద్రుని విడిచిపెట్టు.

**రుద్రేణ నిర్గుణేనాలం కిం తే కార్యం భవిష్యతి ।**
**దేవజాతిబహిర్భూతో యః పిశాచత్వమాగతః ॥ 27 ॥**

నిర్గుణుడైన రుద్రుని ఆరాధించి ప్రయోజనమేమున్నది? ఈ ఆరాధనను చాలించు. రుద్రుడు దేవజాతినుండి బహిష్కరింపబడి పిశాచమయ్యాడు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**తచ్ఛ్రుత్వా స మునేః పుత్రో జపన్పంచాక్షరం మనుమ్ ।**
**మన్యమానో ధర్మవిఘ్నం ప్రాహ తం కర్తుమాగతమ్ ॥ 28 ॥**

ఆ మాటలను విని ఆ మునిపుత్రుడు, ఇంద్రుని తన ధర్మానికి విఘ్నం కలిగించడానికి వచ్చిన వానినిగా గణించి పంచాక్షరీమంత్రాన్ని జపిస్తూ ఇలా పలికాడు.

**ఉపమన్యురువాచ –** ఉపమన్యుడు పలికాడు.

**త్వయైవం కథితం సర్వం భవనిందారతేన వై ।**
**ప్రసంగాద్దేవదేవస్య నిర్గుణత్వం పిశాచతా ॥ 29 ॥**

దేవదేవుడైన శివుని ప్రసంగాన్ని మొదలుపెట్టి, శివునిందయందభిరుచిగల నీవు, నిర్గుణత్వం, పిశాచత్వం మున్నగు వాటిని గురించి చెప్పియున్నావు.

**త్వం న జానాసి వై రుద్రం సర్వదేవేశ్వరేశ్వరమ్ ।**
**బ్రహ్మవిష్ణ్వాదిదేవానాం జనకం ప్రకృతేః పరమ్ ॥ 30 ॥**

సర్వదేవేశ్వరేశ్వరుడును, త్రిమూర్తులకు తండ్రియు, ప్రకృతి కంటె అతీతుడైన రుద్రుని నీవెరుగవు.

**సదసద్వ్యక్తమవ్యక్తం యమాహుర్బ్రహ్మవాదినః ।**
**నిత్యమేకమనేకం చ వరం తస్మాద్ వృణోమ్యహమ్ ॥ 31 ॥**

రుద్రుడు కార్యకారణస్వరూపుడనియు, వ్యక్తమైన జగత్తు, అవ్యక్తమైన ప్రకృతియు ఆయన స్వరూపమేననియు, నిత్యుడనియు అద్వితీయుడనియు, అనేక రూపుడనియు బ్రహ్మవేత్తలు చెప్పెదరు. నేను అటువంటి రుద్రునినుండి వరాన్ని కోరతాను.

**హేతువాదవినిర్ముక్తం సాంఖ్యయోగార్థదం పరమ్ ।**
**యముశంతి హి తత్త్వజ్ఞా వరం తస్మాద్ వృణోమ్యహమ్ ॥ 32 ॥**

రుద్రుడు హేతువాదానికి దొరకడనియు, జ్ఞానయోగ ఫలమైన మోక్షాన్ని ఇచ్చువాడనియు, పరమాత్ముడనియు, తత్త్వవేత్తలు చెప్పుతున్నారు. నేనట్టి రుద్రునినుండి వరాన్ని కోరతాను.

**నాస్తి శంభోః పరం తత్త్వం సర్వకారణకారణాత్ ।**
**బ్రహ్మవిష్ణ్వాదిదేవానాం శ్రేష్ఠాద్గుణపరాద్విభోః ॥ 33 ॥**

శంభుని మించిన తత్త్వం లేదు. అతడే సర్వకారణకారణుడు. బ్రహ్మవిష్ణ్వాదిదేవతాశ్రేష్ఠుడు. గుణాతీతుడు, సర్వవ్యాపి.

**నాహం వృణే వరం త్వత్తో న విష్ణోర్బ్రహ్మణోఽపి వా ।**
**నాన్యస్మాదమరాద్వాపి శంకరో వరదోఽస్తు మే ॥ 34 ॥**

నేను నీ నుండి గాని, బ్రహ్మవిష్ణువుల నుండి గాని, ఇతర దేవతలనుండి గాని వరము కోరుట లేదు. నాకు శంకరుడే వరదుడు.

**బహునాత్ర కిముక్తేన వచ్మి తత్త్వం మతం స్వకమ్ ।**
**న ప్రార్థయే పశుపతేరన్యం దేవాదికం స్ఫుటమ్ ॥ 35 ॥**

ఇన్ని మాటలేల? నా నిశ్చయాన్ని యథార్థంగా చెబుతున్నాను. శివుని తక్క ఇతర దేవతల నుండి వరమును కోరను. ఇది నిశ్చయము.

**మద్భావం శృణు గోత్రారే! మయాద్యానుమితన్త్విదమ్ ।**
**భవాంతరే కృతం పాపం శ్రుతా నిందా భవస్య చేత్ ॥ 36 ॥**

ఓ ఇంద్రా! నా అభిప్రాయాన్ని వినుము. నేనీనాడు ఇట్లు ఊహిస్తున్నాను. పూర్వజన్మలో పాపం చేసియుండడం వల్ల ఇప్పుడు శివనిందను వినవలసి వచ్చింది.

**శ్రుత్వా నిందాం భవస్యాథ తత్క్షణాదేవ సంత్యజేత్ ।**
**స్వదేహం తన్నిహత్యాశు శివలోకం స గచ్ఛతి ॥ 37 ॥**

శివనిందను వినిన వ్యక్తి వెంటనే ఆ దేహాన్ని విడవాలి, అలా చేసినచో వెంటనే శివలోకాన్ని పొందుతాడు.

**ఆస్తాం తావన్మమేచ్ఛేయం క్షీరం ప్రతి సురాధమ! ।**
**నిహత్య త్వాం శివాస్త్రేణ త్యజామ్యేతత్కళేబరమ్ ॥ 38 ॥**

ఓ సురాధమా! పాలను గురించిన నాకు గల ఇచ్ఛను ప్రక్కకు బెట్టి, శివాస్త్రంచే నిన్ను సంహరించి, నేనీ-దేహాన్ని పరిత్యజిస్తాను.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఏవముక్త్వోపమన్యుస్తం మర్తుం వ్యవసితః స్వయమ్ ।**
**క్షీరే వాంఛామపి త్యక్త్వా నిహంతుం శక్రముద్యతః ॥ 39 ॥**

ఉపమన్యుడిట్లు పలికి, పాలయందలి కోర్కెను కూడ విడిచిపెట్టి, స్వయంగా ఇంద్రుని సంహరించడానికి పూనుకొన్నాడు.

**భస్మాదాయ తదాధారాదఘోరాస్త్రాభిమంత్రితమ్ ।**
**విసృజ్య శక్రముద్దిశ్య ననాద స మునిస్తదా ॥ 40 ॥**

ఆ మహర్షి అప్పుడు శివలింగంయొక్క పీఠం నుండి భస్మాన్ని తీసుకొని, అఘోరాస్త్రంతో అభిసంధించి ఇంద్రుని పైకి విడిచిపెట్టి సింహనాదాన్ని చేశాడు.

**స్మృత్వా స్వేష్టపదద్వంద్వం స్వదేహం దగ్ధుముద్యతః ।**
**ఆగ్నేయీం ధారణాం బిభ్రదుపమన్యురవస్థితః ॥ 41 ॥**

ఆ ఉపమన్యుడు తన ఇష్టదైవంయొక్క పాదపద్మాలను స్మరించి ఆగ్నేయాస్త్రాన్ని ధారణ చేసి తన దేహాన్ని దగ్ధం చేసుకోవడానికి సంసిద్ధుడయ్యాడు.

**ఏవం వ్యవసితే విప్రే భగవాన్ శక్రరూపవాన్ ।**
**వారయామాస సౌమ్యేన ధారణాం తస్య యోగినః ॥ 42 ॥**

ఆ బ్రాహ్మణుడిట్లు సంసిద్ధుడుకాగా, ఇంద్రరూపంలో నున్న శివుడు సౌమ్యమైన రూపాన్ని దాల్చి ఆ అగ్ని- యొక్క అగ్నిధారణను శమింపజేశాడు.

**తద్విసృష్టమఘోరాస్త్రం నందీశ్వరనియోగతః ।**
**జగృహే హ్యన్యతః క్షిప్తం నందీ శంకరవల్లభమ్ ॥ 43 ॥**

అతనిచే విడువబడినట్టియు, శంకరునకు ప్రియమైనట్టియు అఘోరాస్త్రాన్ని నంది మధ్యలో పట్టుకొని ఆవల పారవేశాడు.

**స్వరూపమేవ భగవానాస్థాయ పరమేశ్వరః ।**
**దర్శయామాస విప్రాయ బాలేందుకృతశేఖరమ్ ॥ 44 ॥**

పరమేశ్వరుడు నిజరూపాన్ని ధరించాడు. ఆ బ్రాహ్మణుడు చంద్రవంకచే అలంకరింపబడిన శిరస్సు గల భగవానుని దర్శించాడు.

**క్షీరార్ణవసహస్రం చ దధ్యాదేరర్ణవం తథా ।**
**భక్ష్యభోజ్యార్ణవం తస్మై దర్శయామాస స ప్రభుః ॥ 45 ॥**

ఆ ప్రభుడు ఆ బాలకునకు పాలు, పెరుగు, భక్ష్యాలు, భోజ్యాలు, మున్నగువాటి సముద్రాలను చూపించాడు.

**ఏవం స దదృశే శంభోర్దేవ్యా సార్ధం వృషోపరి ।**
**గణేశ్వరై స్త్రిశూలాద్యైః దివ్యాస్త్రైరపి సంవృతః ॥ 46 ॥**

పార్వతీదేవితో గూడి నందీశ్వరుని అధిష్ఠించి, గణాధ్యక్షులచే సేవింపబడుతూ, త్రిశూలాది దివ్యాస్త్రాలను ధరించియున్న శంభుని ఆ బాలకుడు ఈ తీరున చూశాడు.

**దివి దుందుభయో నేదుః పుష్పవృష్టిః పపాత హ ।**
**విష్ణుబ్రహ్మేంద్రప్రముఖైర్దేవైశ్ఛన్నా దిశో దశ ॥ 47 ॥**

దివిలో దుందుభులు మ్రోగాయి. పుష్పవృష్టి కురిసింది. విష్ణు బ్రహ్మాది దేవతలచే దశదిశలు నిండిపోయాయి.

**అథోపమన్యురానందసముద్రోర్మిభిరావృతః ।**
**పపాత దండవద్భూమౌ భక్తినమ్రేణ చేతసా ॥ 48 ॥**

అప్పుడు ఉపమన్యుని హృదయంలో ఆనంద సముద్రతరంగాలుద్భవించాయి. అతడు భక్తితో, వినయంతో కూడిన మనస్సుగలవాడై సాష్టాంగ ప్రణామాన్ని ఆచరించాడు.

**ఏతస్మిన్సమయే తత్ర సస్మితో భగవాన్భవః ।**
**ఏహ్యేహీతి సమాహూయ మూర్ధ్న్యాఽఽఘ్రాయ దదౌ వరాన్ ॥ 49 ॥**

ఇంతలో అచ్చుట చిరునవ్వుతో ప్రకాశించే శివభగవానుడు 'రమ్ము, రమ్ము' అని ఆ బాలకుని దగ్గరకు పిలిచి లలాటంపై ముద్దిడి వరాలనిచ్చాడు.

**శివ ఉవాచ –** శివుడు పలికాడు.

**వత్సోపమన్యో! తుష్టో ఽస్మి త్వదాచరణతో వరాత్ ।**
**దృఢభక్తోఽసి విప్రర్షే! మయా జిజ్ఞాసితోఽధునా ॥ 50 ॥**

ఓ వత్సా! ఉపమన్యూ! నీ శ్రేష్ఠమైన ఆచరణవలన నేను సంతోషించాను. నీవు దృఢమగు భక్తి గలవాడవు. నేనీనాడు నిన్ను పరీక్షించాలనుకున్నాను.

**భక్ష్యభోగాన్యథాకామం బాంధవైర్భుంక్ష్వ సర్వదా ।**
**సుఖీ భవ సదా దుఃఖనిర్ముక్తో భక్తిమాన్మమ ॥ 51 ॥**

నీవు సర్వకాలాలలో యథేచ్ఛగా బంధువులతో గూడి భక్ష్యాలను భుజించి, భోగాలననుభవించు. నీవు సర్వదా దుఃఖంనుండి విముక్తిని పొంది నాకు భక్తుడవై సుఖాన్ని పొందు.

**ఉపమన్యో! మహాభాగ! తవాంబైషా హి పార్వతీ ।**
**మయా పుత్రీకృతో హ్యద్య కుమారత్వం సనాతనమ్ ॥ 52 ॥**

ఉపమన్యూ! ఈమె నీ తల్లియైన పార్వతి. నేను నిన్ను శాశ్వతంగా నా కుమారునిగా స్వీకరిస్తున్నాను.

**దుగ్ధదధ్యాజ్యమధునామర్ణవాశ్చ సహస్రశః ।**
**భక్ష్యభోజ్యాదివస్తూనామర్ణవాశ్చాఖిలాస్తథా ॥ 53 ॥**

**తుభ్యం దత్తా మయా ప్రీత్యా త్వం గృహ్ణీష్వ మహామునే! ।**
**అమరత్వం తథా దక్ష! గాణపత్యం చ శాశ్వతమ్ ॥ 54 ॥**

పాలు, పెరుగు, నెయ్యి, తేనె, ఇత్యాది సర్వభక్ష్యముల సముద్రాలను అసంఖ్యాకంగా నేను నీకు ప్రీతితో ఇస్తున్నాను. ఓ మహర్షీ! స్వీకరించుము. నీవు సమర్థుడవు. నీకు నేను అమరత్వాన్ని, శాశ్వతమైన గణాధ్యక్షత్వాన్ని ఇస్తున్నాను.

**పితాఽహం తే మహాదేవో మాతా తే జగదంబికా ।**
**వరాన్వరయ సుప్రీత్యా మనోఽభిలషితాన్వరాన్ ॥ 55 ॥**

మహాదేవుడనైన నేను నీకు తండ్రిని. జగన్మాత నీ తల్లి. నీవు నీ మనస్సునకు నచ్చిన శ్రేష్ఠమైన వరాలను ఆనందంతో కోరుకొనుము.

**అజరశ్చారమరశ్చైవ భవ త్వం దుఃఖవర్జిత ।**
**యశస్వీ వరతేజస్వీ దివ్యజ్ఞానీ మహాప్రభుః ॥ 56 ॥**

నీవు దుఃఖాన్ని విడనాడి, జరామరణాలు లేనివాడవై, యశస్సును పొంది, గొప్పతేజస్వివై, దివ్యజ్ఞానాన్ని పొంది మహాప్రభుడవు కమ్ము.

**అథ శంభుః ప్రసన్నాత్మా స్మృత్వా తస్య తపో మహత్ ।**
**పునర్దశ వరాన్దివ్యాన్మునయే హ్యుపమన్యవే ॥ 57 ॥**

అపుడు శంభుడు ప్రసన్నాత్ముడై, ఉపమన్యుమహర్షియొక్క గొప్ప తపస్సును గుర్తు చేసికొని, మరల అతనికి దివ్యమైన పది వరాలనిచ్చాడు.

**వ్రతం పాశుపతం జ్ఞానం వ్రతయోగం చ తత్త్వతః ।**
**దదౌ తస్మై ప్రవక్తృత్వం పాటవం చ నిజం పదమ్ ॥ 58 ॥**

పాశుపతవ్రతాన్ని, వ్రతంతో ఈశ్వరుని పొందగలిగే జ్ఞానాన్ని, ప్రవచనశక్తిని, తన స్థానాన్ని అతనికి ఇచ్చాడు.

**ఏవం దత్త్వా మహాదేవః కరాభ్యాముపగృహ్య తమ్ ।**
**మూర్ధ్న్యుపాఘ్రాయ సుతస్తేఽయమితి దేవ్యై న్యవేదయత్ ॥ 59 ॥**

మహాదేవుడిట్లు అతనికి వరాలనిచ్చి, రెండు చేతులతో అతనిని దగ్గరకు తీసుకొని లలాటంపై ముద్దిడి 'ఈతడు నీ కుమారుడు' అని పార్వతీదేవికి తెలియజేశాడు.

**దేవీ చ శృణ్వతీ ప్రీత్యా మూర్ధ్ని దేశే కరాంబుజమ్ ।**
**విన్యస్య ప్రదదౌ తస్మై కుమారపదమక్షయమ్ ॥ 60 ॥**

ఆ మాటను విని పార్వతీదేవి ప్రేమతో పద్మం వంటి హస్తాన్ని శిరస్సుపై నుంచి, అతనికి అక్షయమైన కుమారపదమునిచ్చెను.

**క్షీరాబ్ధిమపి సాకారం క్షీరస్వాదుకరోదధిః ।**
**ఉపాస్థాయ దదౌ తస్మై పిండీభూతమనశ్వరమ్ ॥ 61 ॥**

క్షీరం వలె మాధుర్యంతో నిండిన హృదయం గల దయాసముద్రుడగు శివుడు అవినాశియైన క్షీరసముద్రాన్ని పిండంగా చేసి అతనికిచ్చాడు.

**యోగైశ్వర్యం సదా తుష్టం బ్రహ్మవిద్యామనశ్వరామ్ ।**
**సమృద్ధిం పరమాం తస్మై దదౌ సంతుష్టమానసః ॥ 62 ॥**

సంతసించిన మనస్సు గల శివుడు అతనికి యోగశక్తిని, నిత్యానందాన్ని, అవినాశియైన సమృద్ధమైన బ్రహ్మవిద్యను పరమసమృద్ధిని ప్రసాదించాడు.

**సోఽపి లబ్ధ్వా వరాన్దివ్యాన్కుమారత్వం చ సర్వదా ।**
**తస్మాచ్ఛివాచ్చ తస్యాశ్చ శివాయా ముదితోఽభవత్ ॥ 63 ॥**

అతడు కూడా ఆ శివపార్వతులనుండి దివ్యవరాలను శాశ్వతమైన కుమారత్వాన్ని పొంది ఆనందించాడు.

**తతః ప్రసన్నచేతస్కః సుప్రణమ్య కృతాంజలిః ।**
**యయాచే స వరం ప్రీత్యా దేవదేవాన్మహేశ్వరాత్ ॥ 64 ॥**

అంతట అతడు ప్రసన్నాత్ముడై, దేవదేవుడైన మహేశ్వరునికి ప్రణమిల్లి ప్రేమతో చేతులు జోడించి వరాన్ని కోరాడు.

**ఉపమన్యురువాచ –** ఉపమన్యుడు పలికాడు.

**ప్రసీద దేవదేవేశ! ప్రసీద పరమేశ్వర! ।**
**స్వభక్తిం దేహి పరమాం దివ్యామవ్యభిచారిణీమ్ ॥ 65 ॥**

ఓ దేవదేవా! ప్రసన్నుడవు కమ్ము. పరమేశ్వరా! ప్రసన్నుడవు కమ్ము. నీయందు హెచ్చుతగ్గులు లేని పరమ–దివ్యభక్తిని నాకు ఇమ్ము.

**శ్రద్ధాం దేహి మహాదేవ! స్వసంబంధిషు మే సదా ।**
**స్వదాస్యం పరమం స్నేహం స్వసాన్నిధ్యం చ సర్వదా ॥ 66 ॥**

ఓ మహాదేవా! సర్వదా నీకు భక్తులయందు శ్రద్ధను, నీ దాస్యాన్ని, పవిత్రమైన నీ స్నేహాన్ని, నీ సాన్నిధ్యాన్ని నాకు ఇమ్ము.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఏవముక్త్వా ప్రసన్నాత్మా హర్షగద్గదయా గిరా ।**
**తుష్టావ స మహాదేవముపమన్యుర్ద్విజోత్తమః ॥ 67 ॥**

ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడైన ఉపమన్యువు ఇట్లు పలికి ప్రసన్నాత్ముడై హర్షంతో బొంగురువోయిన కంఠంతో మహాదేవుని స్తుతించాడు.

**ఏవముక్తశ్శివస్తేన సర్వేషాం శృణ్వతాం ప్రభుః ।**
**ప్రత్యువాచ ప్రసన్నాత్మోపమన్యుం సకలేశ్వరః ॥ 68 ॥**

ఉపమన్యుడిట్లు స్తుతింపగా సర్వేశ్వరుడైన శివప్రభువు, ప్రసన్నాత్ముడై అందరు వినుచుండగా ఇట్లు బదులు పలికాడు.

**శివ ఉవాచ –** శివుడు పలికాడు.

**వత్సోపమన్యో! ధన్యస్త్వం మమ భక్తో విశేషతః ।**
**సర్వం దత్తం మయా తే హి యద్వృతం భవతాఽనఘ! ॥ 69 ॥**

ఓ వత్సా! ఉపమన్యూ! నీవు ధన్యుడవు. విశేషించి నా భక్తుడవు. నీవు కోరిన వరాల నన్నింటినీ నీకు ఇచ్చియున్నాను.

**అజరశ్చామరశ్చ త్వం సర్వదా దుఃఖవర్జితః ।**
**సర్వపూజ్యో నిర్వికారీ భక్తానాం ప్రవరో భవ ॥ 70 ॥**

నీవు జరామరణాలు లేనివాడవు. సర్వకాలాల్లో దుఃఖరహితుడవు సర్వులచే పూజింపబడువాడవు. వికారములు లేనివాడవు, భక్తులలో శ్రేష్ఠుడవు కమ్ము.

**అక్షయా బాంధవాశ్చైవ కులం గోత్రం చ తే సదా ।**
**భవిష్యతి ద్విజశ్రేష్ఠ! మయి భక్తిశ్చ శాశ్వతీ ॥ 71 ॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! నీ బంధువులు, కులం, గోత్రం వినాశం లేనివి కాగలవు. నీకు నాయందలి భక్తి శాశ్వతమైనదగును.

**సాన్నిధ్యం చాశ్రమే నిత్యం కరిష్యామి మునే! తవ ।**
**తిష్ఠ వత్స! యథాకామం నోత్కంఠాం చ కరిష్యసి ॥ 72 ॥**

ఓ మహర్షీ! నేను నీ ఆశ్రమంలో నిత్యం నివసిస్తాను. వత్సా! ఆనందంగా జీవించు. బెంగపెట్టుకొనకుము.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఏవముక్త్వా స భగవాంస్తస్మై దత్వా వరాన్వరాన్ ।**
**సాంబశ్చ సగణస్సద్యస్తత్రైవాంతర్దధే ప్రభుః ॥ 73 ॥**

ఇట్లు పలికి జగన్నాథుడైన భగవానుడు అతనికి శ్రేష్ఠమైన వరాలనిచ్చిన పిదప పార్వతితో, మరియు గణాలతో గూడి అచటనే అంతర్ధానమయ్యాడు.

**ఉపమన్యుః ప్రసన్నాత్మా ప్రాప్య శంభోర్వరాన్వరాన్ ।**
**సాంబశ్చ సగణస్సద్యస్తత్రైవాంతర్దధే ప్రభుః ॥ 74 ॥**

ఉపమన్యువు శివునినుండి దివ్యవరాలను పొంది, ప్రసన్నాత్ముడై, తల్లి ఉన్న స్థానానికి వెళ్లి, సర్వమును తల్లికి వర్ణించి చెప్పాడు.

**తచ్ఛ్రుత్వా తస్య జననీ మహాహర్షమవాప సా ।**
**సర్వపూజ్యోఽభవత్సోఽపి సుఖం ప్రాపాధికం సదా ॥ 75 ॥**

ఈ వృత్తాంతాన్ని విని అతని తల్లి మహానందాన్ని పొందింది. అతడు సర్వపూజ్యుడై, నిత్యమూ అధికసుఖాన్ని పొందాడు.

**ఇత్థం తే వర్ణితస్తాత! శివస్య పరమాత్మనః ।**
**సురేశ్వరావతారో హి సర్వదా సుఖదః సతామ్ ॥ 76 ॥**

వత్సా! సత్పురుషులకు సర్వదా సుఖాన్నిచ్చే, శివుని సురేశ్వరావతారాన్ని గూర్చి నీకు ఈ తీరున వర్ణించి చెప్పాను.

**ఇదమాఖ్యానమనఘం సర్వకామఫలప్రదమ్ ।**
**స్వర్గ్యం యశస్యమాయుష్యం భుక్తిముక్తిప్రదం సతామ్ ॥ 77 ॥**

పరమాత్మయైన శివుని ఈ గాథ పవిత్రమైనది, కోర్కెలనన్నింటినీ ఈడేరుస్తుంది. స్వర్గాన్ని, యశస్సును, ఆయుష్యాన్ని కలిగిస్తుంది. ఈ గాథ సత్పురుషులకు భుక్తిని, ముక్తిని కూడ ఇస్తుంది.

**య ఏతచ్ఛృణుయాద్భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।**
**ఇహ సర్వసుఖం భుక్త్వా సోఽన్తే శివగతిం లభేత్ ॥ 78 ॥**

ఎవడైతే దీనిని భక్తితో వింటాడో, ఏకాగ్రచిత్తంతో వినిపిస్తాడో, అట్టివాడు ఇహలోకంలో సర్వసుఖాలననుభవించి, మరణించిన పిదప శివపదాన్ని పొందుతాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం సురేశ్వరాఖ్యశివావతారచరిత్రవర్ణనం నామ ద్వాత్రింశోఽధ్యాయః ॥ 32 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు సురేశ్వరాఖ్యశివావతారచరిత్రవర్ణనం అనే పేరుగల ముప్పైరెండవ అధ్యాయం సమాప్తం.

# త్రయస్త్రింశోఽధ్యాయః - ముప్పైమూడవ అధ్యాయం
# బ్రహ్మచారిశివావతారవర్ణనమ్ - బ్రహ్మచారిశివావతారవర్ణనం

**నందీశ్వర ఉవాచ -** నందీశ్వరుడు పలికాడు.

**సనత్కుమార! సుప్రీత్యా శివస్య పరమాత్మనః ।**
**అవతారం శృణు విభోర్జటిలాహ్వం సుపావనమ్ ॥ 1 ॥**

ఓ సనత్కుమారా! సర్వవ్యాపకుడు, పరమాత్మయునగు శివుడు పరమపవిత్రమైన జటిలావతారాన్ని ధరించాడు. నీవాగాథను పరమప్రీతితో వినుము.

**పురా సతీ దక్షకన్యా త్యక్త్వా దేహం పితుర్మఖే ।**
**స్వపిత్రాఽనదృతా జజ్ఞే మేనాయాం హిమభూధరాత్ ॥ 2 ॥**

పూర్వము దక్షుని కుమార్తెయైన సతీదేవి తండ్రియొక్క యజ్ఞంలో తన తండ్రిచే అవమానింపబడి దేహత్యాగం చేసి మేనాహిమవంతులకు కుమార్తెయై జన్మించింది.

**సా గత్వా గహనేఽరణ్యే తేపే సువిమలం తపః ।**
**శంకరం పతిమిచ్ఛంతీ సఖీభ్యాం సంయుతా శివా ॥ 3 ॥**

ఆ పార్వతి శంకరుని భర్తగా పొందగోరి సఖురాండ్రతో గూడి దట్టమైన అరణ్యంలో ప్రవేశించి మహాతపస్సు చేసింది.

**తత్తపస్సుపరీక్షార్థం సప్తర్షీన్ప్రైషయచ్ఛివః ।**
**తపః స్థానం తు పార్వత్యా నానాలీలావిశారదః ॥ 4 ॥**

నానాలీలా విశారదుడైన శివుడు పార్వతి తపస్సును పరీక్షించడానికి, ఆమె తపస్సు చేస్తున్న స్థలానికి సప్తర్షులను పంపించాడు.

**తే గత్వా తత్ర మునయః పరీక్షాం చక్రురాదరాత్ ।**
**తస్యాః సుయత్నతో నైవ సమర్థా హ్యభవంశ్చ తే ॥ 5 ॥**

ఆ మహర్షులచ్చటకు వెళ్లి ఆమెను ఆదరపూర్వకంగా పరీక్షించారు, వారు ఎంత ప్రయత్నించిననూ, ఆమెలో ఏ దోషాన్నీ గాంచలేకపోయారు.

**తత్రాగత్య శివం నత్వా వృత్తాంతం చ నివేద్య తత్ ।**
**తదాజ్ఞాం సమనుప్రాప్య స్వర్లోకం జగ్మురాదరాత్ ॥ 6 ॥**

అంతట వారు కైలాసానికి వెళ్లి శివునకు ప్రణమిల్లి వృత్తాంతాన్నంతటిని విన్నవించి, ఆయన అనుమతిని పొంది వారు ఆదరంతో స్వర్గానికి వెళ్లారు.

**గతేషు తేషు మునిషు స్వస్థానం శంకరః స్వయమ్ ।**
**పరీక్షితుం శివావృత్తమైచ్ఛత్సూతికరః ప్రభుః ॥ 7 ॥**

ఆ మునులు తమ తమ స్థానాలకు వెళ్లినపిదప, లీలాకరుడగు శంకరప్రభువు పార్వతీదేవిప్రవృత్తిని స్వయంగా పరీక్షించాలని తలంచాడు.

**సుప్రసన్నస్తపస్వీచ్ఛాశమనాదయమీశ్వరః ।**
**బ్రహ్మచర్యస్వరూపోఽభూత్తదాద్భుతతరః ప్రభుః ॥ 8 ॥**

అంతట ఆ శంకరప్రభువు, కోరికలుపశమించుటచే సుప్రసన్నుడైనట్టియు, తపశ్శాలియునగు బ్రహ్మచారి రూపాన్ని ధరించాడు.

**అతీవ స్థవిరో విప్రదేహధారీ స్వతేజసా ।**
**ప్రజ్వలన్మనసా హృష్టో దండీ ఛత్రీ మహోజ్జ్వలః ॥ 9 ॥**

ఆయన మిక్కిలి ముదుసలియైన బ్రాహ్మణవేషాన్ని ధరించి, స్వీయతేజస్సుతో ప్రకాశిస్తూ, ఆనందంతో నిండిన మనస్సు కలవాడై, కర్రను, గొడుగును చేతబట్టి మహోజ్జ్వలంగా ప్రకాశించాడు.

**ధృత్వైవం జాటిలం రూపం జగామ గిరిజావనమ్ ।**
**అతిప్రీతియుతః శంభుః శంకరో భక్తవత్సలః ॥ 10 ॥**

ఇట్లు మంగళకరుడు, భక్తవత్సలుడునైన శంకరుడు, మిక్కిలిప్రీతితో బ్రహ్మచారిరూపాన్ని ధరించి, పార్వతీదేవి తపోవనంలో ప్రవేశించాడు.

**తత్రాపశ్యత్ స్థితాన్దేవీం సఖీభిః పరివారితామ్ ।**
**వేదికోపరి శుద్ధాంతాం శివామివ విధోః కలామ్ ॥ 11 ॥**

అచ్చట వేదికపై చెలికత్తెలతో చుట్టువారబడి, మంగళకరమైన చంద్రుని కళవలె ప్రకాశించే పార్వతీదేవిని చూశాడు.

**శంభుర్నిరీక్ష్య తాం దేవీం బ్రహ్మచారిస్వరూపవాన్ ।**
**ఉపకంఠం యయౌ ప్రీత్యా చోత్సుకీ భక్తవత్సలః ॥ 12 ॥**

బ్రహ్మచారిరూపంలోనున్న భక్తవత్సలుడగు శంభుడు, ఆ దేవిని చూచి, ప్రేమతోను, ఉత్కంఠతోనూ, దగ్గరకు వెళ్లాడు.

**ఆగతం సా తదా దృష్ట్వా బ్రాహ్మణం తేజసాఽద్భుతమ్ ।**
**అంగేషు లోమశం శాంతం దండచర్మసమన్వితమ్ ॥ 13 ॥**

తేజస్సుతో అద్భుతంగా ప్రకాశిస్తున్నట్టియు, పెద్దగడ్డముతోనున్నట్టినీ శాంతుడును, దండము, చర్మముతో కూడినట్టియు, ఆ బ్రాహ్మణుడు తన వద్దకు వచ్చుటను పార్వతి చూచింది.

**బ్రహ్మచర్యధరం వృద్ధం జటిలం సకమండలుమ్ ।**
**అపూజయత్పరప్రీత్యా సర్వపూజోపహారకైః ॥ 14 ॥**

అట్లే బ్రహ్మచర్యాశ్రమాన్ని ధరించినట్టియు ముదుసలియు, కమండలముతో కూడినట్టియు అతనిని ఆమె పరమప్రీతితో, సకల పూజాద్రవ్యాలతో పూజించింది.

**తతస్సా పార్వతీ దేవీ పూజితం పరయా ముదా ।**
**కుశలం పర్యపృచ్ఛత్తం బ్రహ్మచారిణమాదరాత్ ॥ 15 ॥**

ఇట్లు పూజలందుకున్న ఆ బ్రహ్మచారిని ఆమె పరమప్రీతితోను, ఆదరముతోను కుశలప్రశ్నలనడిగింది.

**బ్రహ్మచారిస్వరూపేణ కస్త్వం హి కుత ఆగతః ।**
**ఇదం వనం భాసయసి వద వేదవిదాం వర ॥ 16 ॥**

బ్రహ్మచారి స్వరూపంలోనున్న నీ వెవ్వడవు? ఎక్కడ నుండి వచ్చావు? వేదపండితశ్రేష్ఠా! నీవలన ఈ వనం భాసిస్తోంది.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇతి పృష్టస్తు పార్వత్యా బ్రహ్మచారీ స వై ద్విజః ।**
**ప్రత్యువాచ ద్రుతం ప్రీత్యా శివాభావపరీక్షయా ॥ 17 ॥**

పార్వతి ఇట్లు ప్రశ్నించగా, బ్రహ్మచారియగు ఆ బ్రాహ్మణుడు ఆమె భక్తిని పరీక్షించగోరి, వెంటనే ప్రేమతో ఇలా బదులిచ్చాడు.

**బ్రహ్మచార్యువాచ –** బ్రహ్మచారి పలికాడు.

**అహమిచ్ఛాభిగామీ చ బ్రహ్మచారీ ద్విజోఽస్మి వై ।**
**తపస్వీ సుఖదోఽన్యేషాముపకారీ న సంశయః ॥ 18 ॥**

నేను యథేచ్ఛగా సంచరించేవాడిని, బ్రహ్మచారిని, బ్రాహ్మణుడను, తపశ్శాలిని, ఇతరులకుపకారం చేసి, సుఖాన్ని కలిగిస్తూ ఉంటాననడంలో సందేహం లేదు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వా బ్రహ్మచారీ స శంకరో భక్తవత్సలః ।**
**తస్థివానుపకంఠం స గోపాయన్రూపమాత్మనః ॥ 19 ॥**

బ్రహ్మచారిరూపంలోనున్న, భక్తవత్సలుడైన శంకరుడిట్లు పలికి, తన యథార్థస్వరూపాన్ని రహస్యంగా ఉంచి, ఆమెకు దగ్గరలో నిలబడ్డాడు.

**బ్రహ్మచార్యువాచ –** బ్రహ్మచారి పలికాడు.

**కిం బ్రవీమి మహాదేవి! కథనీయం న విద్యతే ।**
**మహానర్థకరం వృత్తం దృశ్యతే వికృతం మహత్ ॥ 20 ॥**

ఓ మహాదేవీ! ఏమి చెప్పగలను? చెప్పదగినదేదియు లేదు. మహానర్థకరమైన మహావికృతమైన దృశ్యం నాకు కనబడుతోంది.

**నవే వయసి సద్భోగసాధనే సుఖకారణే ।**
**మహోపచారసద్భోగైర్వ్యర్థైవ త్వం తపస్యసి ॥ 21 ॥**

మంచి భోగాలకు సాధనమును, గొప్ప పరిచర్యలతోను, భోగాలతోను సుఖానికి హేతువైనట్టియు, నవయౌవనంతో నీవు వ్యర్థంగా తపస్సును చేస్తున్నావు.

**కా త్వం కస్యాసి తనయా కిమర్థం విజనే వనే ।**
**తపశ్చరసి దుర్ధర్షం మునిభిః ప్రయతాత్మభిః ॥ 22 ॥**

నీవెవరివి? ఎవరి దానవు? ఈ నిర్జనవనంలో సమాహితమనస్కులైన మహర్షులు కూడ చేయలేని కఠోర తపస్సును చేయడానికి గల కారణమేమిటి?

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇతి తద్వచనం శ్రుత్వా ప్రహస్య పరమేశ్వరీ ।**
**ఉవాచ వచనం ప్రీత్యా బ్రహ్మచారిణముత్తమమ్ ॥ 23 ॥**

ఉత్తముడైన బ్రహ్మచారియొక్క మాటలను విని, నవ్వి, ప్రీతిపూర్వకంగా పరమేశ్వరి ఇలా బదులిచ్చింది.

**పార్వత్యువాచ –** పార్వతి పలికింది.

**శృణు విప్ర! బ్రహ్మచారిన్మద్వృత్తమఖిలం మునే! ।**
**జన్మ మే భారతే వర్షే సాంప్రతం హిమవద్గృహే ॥ 24 ॥**

ఓ బ్రాహ్మణా! బ్రహ్మచారీ! ఓ మునీ! నా వృత్తాంతాన్నంతటిని విను. నేనీ జన్మలో భారతవర్షంలో హిమవంతుని ఇంట జన్మించాను.

**పూర్వం దక్షగృహే జన్మ సతీ శంకరకామినీ ।**
**యోగేన త్యక్తదేహాఽహం తాతేన పతినిందినా ॥ 25 ॥**

పూర్వజన్మలో దక్షుని కుమార్తెనై, శంకరుని పత్నినయ్యాను. నా తండ్రి నా భర్తను నిందించగా, నేను యోగాగ్నిచే దేహాన్ని విడిచిపెట్టాను.

**అత్ర జన్మని సంప్రాప్య సుపుణ్యేన శివో ద్విజ! ।**
**మాం త్యక్త్వా భస్మసాత్కృత్వా మన్మథం స జగామ హ ॥ 26 ॥**

ఓ బ్రాహ్మణుడా! మంచి పుణ్యంచేత ఈ జన్మలో శంకరుని దర్శించాను. కాని ఆయన మన్మథుని బూడిద చేసి, నన్ను విడిచి వెళ్లాడు.

**ప్రయాతే శంకరే తాపాత్పీడితాఽహం పితుర్గృహాత్ ।**
**ఆగచ్ఛమత్ర తపసే గురువాక్యేన సంయతా ॥ 27 ॥**

శంకరుడు నిష్క్రమించిన పిదప నేను దుఃఖాన్ని పొంది, సిగ్గుపడినదాననై గురువుయొక్క ఉపదేశాన్ని పొంది, తపస్సు చేయడానికి తండ్రిగారి యింటినుండి ఇక్కడకు వచ్చాను.

**మనసా వచసా సాక్షాత్కర్మణా పతిభావతః ।**
**సత్యం బ్రవీమి నోఽసత్యం సంవృతః శంకరో మయా ॥ 28 ॥**

నేను మనోవాక్కాయ కర్మలతో సాక్షాత్తుగా శంకరునే భర్తగా వరించాను. నేను సత్యమునే చెప్పుచున్నాను. ఇది అసత్యం కాదు.

**జానామి దుర్లభం వస్తు కథం ప్రాప్యం మయా భవేత్ ।**
**తథాపి మనసౌత్సుక్యాత్తప్యతే మే తపోఽధునా ॥ 29 ॥**

దుర్లభమైన వస్తువును నేనెట్లు పొందగలను? అయినప్పటికి మనస్సుయొక్క ఉత్సుకత కారణంగా తపస్సు చేస్తున్నాను.

**హిత్వేంద్రప్రముఖాన్దేవాన్విష్ణుం బ్రహ్మాణమప్యహమ్ ।**
**పతిం పినాకపాణిం వై ప్రాప్తుమిచ్ఛామి సత్యతః ॥ 30 ॥**

ఇంద్రుడు మున్నగు దేవతలను మాత్రమేగాక, బ్రహ్మ విష్ణువులను కూడ విడిచిపెట్టి, నేను పినాకపాణియైన శంకరుని భర్తగా పొందగోరుచున్నాను. ఇది యథార్థము.

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యేవం వచనం శ్రుత్వా పార్వత్యా హి సునిశ్చితమ్ ।**
**మునే! స జటిలో రుద్రో విహసన్వాక్యమబ్రవీత్ ॥ 31 ॥**

ఓ మునీ! పార్వతియొక్క ఈ నిశ్చితమైన మాటను విని, జటాధారియైన రుద్రుడు నవ్వి ఇట్లు పలికాడు.

**జటిల ఉవాచ** - జటిలుడు పలికాడు.

**హిమాచలసుతే! దేవి! కా బుద్ధిః స్వీకృతా త్వయా ।**
**రుద్రార్థం విబుధాన్హిత్వా కరోషి విపులం తపః ॥ 32 ॥**

ఓ హిమవత్పుత్రీ! దేవీ! దేవతలను కాదని రుద్రునికొరకై కఠోరమైన తపస్సు చేయడంలో నీవెట్టి బుద్ధిని కలిగియున్నావు?

**జానామ్యహం చ తం రుద్రం శృణు త్వం ప్రవదామి తే ।**
**వృషధ్వజస్స రుద్రో హి వికృతాత్మా జటాధరః ॥ 33 ॥**

ఆ రుద్రుడు నాకు తెలిసినవాడే. నేను చెబుతాను. నీవు విను. వృషధ్వజుడైన ఆ రుద్రుడు జటలతో వికృతదేహం కలిగియుంటాడు.

**ఏకాకీ చ సదా నిత్యం విరాగీ చ విశేషతః ।**
**తస్మాత్త్వం తేన రుద్రేణ మనో యోక్తుం నచార్హసి ॥ 34 ॥**

ఆయన సర్వకాలాలలోను ఏకాకిగా ఉంటాడు. విశేషించి ఆయన సంపూర్ణవిరాగి. కాబట్టి నీవు మనస్సును ఆ రుద్రునిపై ప్రసరింపజేయడం తగదు.

**సర్వం విరుద్ధం రూపాది తవ దేవి! హరస్య చ ।**
**మహ్యం న రోచతే హ్యేతద్యదీచ్ఛసి తథా కురు ॥ 35 ॥**

ఓ దేవీ! నీకు, ఆ శివునకు రూపం మున్నగు అన్నింటిలోను విరుద్ధంగా ఉంటుంది. ఇది నాకు నచ్చలేదు. నీకు నచ్చితే తోచినట్లు చేయుము.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వా చ పునా రుద్రో బ్రహ్మచారిస్వరూపవాన్ ।**
**నినింద బహుధాఽఽత్మానం తదగ్రే తాం పరీక్షితుమ్ ॥ 36 ॥**

ఈ విధంగా పలికి బ్రహ్మచారి రూపంలోనున్న రుద్రుడు మరలా ఆమెను పరీక్షించడానికి తనను తాను పలువిధాలుగా ఆమెయెదుట నిందించుకున్నాడు.

**తచ్ఛ్రుత్వా పార్వతీ దేవీ విప్రవాక్యం దురాసదమ్ ।**
**ప్రత్యువాచ మహాక్రుద్ధా శివనిందాపరం చ తమ్ ॥ 37 ॥**

సహింప శక్యం కాని ఆ బ్రాహ్మణుని పలుకులను విని పార్వతీదేవి గొప్ప కోపాన్ని పొంది, శివుని నిందించడమే ప్రధానకర్తవ్యంగా గల ఆయనకు ఇట్లు బదులు చెప్పింది.

**ఏతావద్ధి మయా జ్ఞాతం కశ్చిద్ధన్యో భవిష్యతి ।**
**పరం తు సకలం జ్ఞాతమవధ్యో దృశ్యతేఽధునా ॥ 38 ॥**

శివనిందను చేసిన వాడెవడైనా వధార్హుడని మాత్రము నాకు తెలుసు, కాని నీవు వధకు అర్హుడవు కావని నాకు తోస్తోంది.

**బ్రహ్మచారిస్వరూపేణ కశ్చిత్త్వం ధూర్త ఆగతః ।**
**శివనిందా కృతా మూఢ! త్వయా మన్యురభూన్మమ ॥ 39 ॥**

బ్రహ్మచారిరూపంలో వచ్చిన నీవు ఊరు పేరు లేని ధూర్తుడవు. నీవు శివుని నిందించి నాకు కోపాన్ని తెప్పించావు.

**శివం త్వం చ న జానాసి శివాత్త్వం హి బహిర్ముఖః ।**
**త్వత్పూజా చ కృతా యన్మే తస్మాత్తాపయుతాఽభవమ్ ॥ 40 ॥**

నీకు శివుడు తెలియదు. నీవు శివతత్త్వం విషయంలో బహిర్ముఖుడవు. నేను నిన్ను పూజించాననే విషయం నాకు మనస్తాపాన్ని కలిగిస్తోంది.

**శివనిందాం కరోతీహ తత్త్వమజ్ఞాయ యః పుమాన్ ।**
**ఆజన్మసంచితం పుణ్యం తస్య భస్మీభవత్యుత ॥ 41 ॥**

ఈ లోకంలో ఏ మానవుడు సత్యం తెలియనివాడై శివుని నిందిస్తాడో, వాని పూర్వజన్మార్జితమైన పుణ్యమంతా భస్మీభూతమౌతుంది.

**శివవిద్వేషిణం స్పృష్ట్వా ప్రాయశ్చిత్తం సమాచరేత్ ॥ 42 ॥**

శివుని ద్వేషించే వానిని ముట్టుకుంటే ప్రాయశ్చిత్తం చేసుకోవాలి.

**రేరే! దుష్ట! త్వయా ప్రోక్తమహం జానామి శంకరమ్ ।**
**నిశ్చయేన న విజ్ఞాతః శివ ఏవ పరః ప్రభుః ॥ 43 ॥**

ఓరీ దుష్టా! నాకు శంకరుడు తెలిసినవాడేనని నీవు చెప్పియున్నావు కాని పరమప్రభువైన శంకరుని నీవు ఖచ్చితంగా ఎరుగవు.

**యథా తథా భవేద్రుద్రో మాయయా బహురూపవాన్ ।**
**మమాభీష్టప్రదోఽత్యంతం నిర్వికారః సతాం ప్రియః ॥ 44 ॥**

ఆ రుద్రుడు మాయచే వివిధ రూపాలను ధరిస్తూ ఉంటాడు. నిర్వికారుడు, సతాంప్రియుడునైన ఆ శంకరుడు నిశ్చయంగా నా అభీష్టాన్ని నెరవేరుస్తాడు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వా తం శివా దేవీ శివతత్త్వం జగాద సా ।**
**యత్ర బ్రహ్మ తయా రుద్రః కథ్యతే నిర్గుణోఽవ్యయః ॥ 45 ॥**

పార్వతీదేవి బ్రహ్మచారితో ఇట్లు పలికి, మరల శివతత్త్వాన్ని ఈ విధంగా బోధించింది. నిర్గుణుడు, అవ్యయుడునగు పరబ్రహ్మమే సగుణోపాధియందు రుద్రుడని పిలువబడుతున్నాడు.

**తదాకర్ణ్య వచో దేవ్యా బ్రహ్మచారీ స వై ద్విజః ।**
**పునర్వచనమాదాతుం యావదేవ ప్రచక్రమే ॥ 46 ॥**

ఆ బ్రాహ్మణబ్రహ్మచారి పార్వతీదేవి మాటలను విని, మరలా మాట్లాడడానికి సిద్ధపడుతున్నాడు.

**ప్రోవాచ గిరిజా తావత్స్వసఖీం విజయాం ద్రుతమ్ ।**
**శివాసక్తమనోవృత్తిః శివనిందాపరాఙ్ముఖీ ॥ 47 ॥**

అంతలో శివునియందు లగ్నమైన మనోవృత్తులు గల పార్వతి శివనిందను భరించలేనిదై, వెంటనే తన సఖురాలైన విజయతో ఇలా పలికింది.

**గిరిజోవాచ** – గిరిజ పలికింది.

**వారణీయః ప్రయత్నేన సఖ్యయం హి ద్విజాధమః ।**
**పునర్వక్తుమనాశ్చాయం శివనిందాం కరిష్యతి ॥ 48 ॥**

ఓ సఖీ! నీవు ప్రయత్నపూర్వకంగానైనా ఈ బ్రాహ్మణాధముని ఆపుము. ఇతడు మరల ఏదో చెప్పబోతున్నాడు. మరల శివుని నిందిస్తాడు.

**న కేవలం భవేత్పాపం నిందాకర్తుః శివస్య హి ।**
**యో వై శృణోతి తన్నిందాం పాపభాక్స భవేదిహ ॥ 49 ॥**

ఈ లోకంలో శివుని నిందించేవానికి మాత్రమేగాక, ఆ నిందను వినేవానికి కూడ పాపం సంక్రమిస్తుంది.

**శివనిందాకరో వధ్యస్సర్వథా శివకింకరైః ।**
**బ్రాహ్మణశ్చేత్సవై త్యాజ్యో గంతవ్యం తత్స్థలాద్ద్రుతమ్ ॥ 50 ॥**

శివనింద చేయువాడు వధార్హుడు. శివభక్తులు అటువంటి వానిని వధించాలి. ఒకవేళ వాడు బ్రాహ్మణుడైనచో వదలిపెట్టాలి. లేదా అక్కడనుండి వెంటనే దూరంగా పోవాలి.

**అయం దుష్టః పునర్నిందాం కరిష్యతి శివస్య హి ।**
**బ్రాహ్మణత్వాదవధ్యశ్చ త్యాజ్యో஽దృశ్యశ్చ సర్వథా ॥ 51 ॥**

వీడు దుష్టుడు. మరలా శివుని నిందిస్తాడు. కాని బ్రాహ్మణుడు కాబట్టి వధార్హుడు కాడు. కావున మరల కంటికి కానరాని విధంగా వీనికి దూరంగా మనం పోవాలి.

**స్థలమేతద్ద్రుతం హిత్వా యాస్యామో஽న్యత్ర మా చిరమ్ ।**
**యథా సంభాషణం న స్యాదనేనావిదుషా పునః ॥ 52 ॥**

కాబట్టి మనం ఆలస్యం చేయవద్దు. మనమీ స్థలాన్ని విడిచిపెట్టి దూరంగా పోదాము. ఈ మూర్ఖునితో మనకు మరల సంభాషణ వద్దు.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వా చోమయా యావత్పదముత్క్షిప్యతే మునే! ।**
**అసౌ తావచ్ఛివః సాక్షాదాలలంబే పటం స్వయమ్ ॥ 53 ॥**

పార్వతీదేవి ఇట్లు పలికి కాలు ముందుకు వేసేలోగా శివుడు స్వయంగా ఆమె కొంగు పట్టుకున్నాడు.

**కృత్వా స్వరూపం దివ్యం చ శివాధ్యానం యథా తథా ।**
**దర్శయిత్వా శివాయై తామువాచావాఙ్ముఖీం శివః ॥ 54 ॥**

ఆ పార్వతీదేవి ధ్యానంలో ఎట్టి రూపాన్ని దర్శించిందో, అట్టి దివ్యరూపాన్నే శివుడామెకు చూపించి, తలవంచుకొనియున్న ఆమెతో ఇలా పలికాడు.

**శివ ఉవాచ –** శివుడు పలికాడు.

**కుత్ర త్వం యాసి మాం హిత్వా న త్వం త్యాజ్యా మయా శివే! ।**
**మయా పరీక్షితాసి త్వం దృఢభక్తాసి మేఽనఘే ॥ 55 ॥**

ఓ పార్వతీ! నన్ను విడిచి ఎక్కడకు వెళ్లుచున్నావు? నీవు నన్ను విడిచి వెళ్లరాదు. నేను నిన్ను పరీక్షించాను. నీకు నాయందు దృఢమైన భక్తి కలదు.

**బ్రహ్మచారిస్వరూపేణ భావమిచ్ఛుస్త్వదీయకమ్ ।**
**తవోపకంఠమాగత్య ప్రావోచం వివిధం వచః ॥ 56 ॥**

నీ భక్తిని తెలుసుకోవడానికి బ్రహ్మచారిరూపంలో నీ వద్దకు వచ్చి అనేక విధాలుగా మాట్లాడాను.

**ప్రసన్నోఽస్మి దృఢం భక్త్యా శివే! తవ విశేషతః ।**
**చిత్తేప్సితం వరం బ్రూహి నాదేయం విద్యతే తవ ॥ 57 ॥**

పార్వతీ! నీ దృఢమైన భక్తికి నేను ప్రసన్నుడనయ్యాను. నీ మనస్సునకు నచ్చిన వరాన్ని కోరుకొమ్ము. నీకు ఈయరానిదేదియు లేదు.

**అద్యప్రభృతి తే దాసస్తపోభిః ప్రేమనిర్భరే ।**
**కృతోఽస్మి తవ సౌందర్యాత్ క్షణ ఏకో యుగాయతే ॥ 58 ॥**

ప్రేమతో నిండిన హృదయం గల పార్వతీ! నేటినుండి నీ సౌందర్యానికి, తపస్సుకి దాసుడను. నీవులేని క్షణం ఒక యుగంగా తోస్తోంది.

**త్యజ్యతాం చ త్వయా లజ్జా మమ పత్నీ సనాతనీ ।**
**ఏహి ప్రియే! త్వయా సాకం ద్రుతం యామి స్వకం గిరిమ్ ॥ 59 ॥**

సుందరీ! నీవు సిగ్గును విడువుము. నీవు నాకు సనాతనధర్మపత్నివి. నీవు నాతో రమ్ము. నేను నిన్ను తీసుకొని వెంటనే నా కైలాసపర్వతానికి వెళ్తాను.

**ఇత్యుక్తవతి దేవేశే శివాతిముదవాప సా ।**
**తపోదుఃఖం తు యత్సర్వం తజ్జహౌ ద్రుతమేవ హి ॥ 60 ॥**

ఆ దేవదేవుడిట్లు పలుకగా, పార్వతి మహానందాన్ని పొందింది. ఆమె వెంటనే తపస్సులో తనకు కలిగిన క్లేశాన్ని మరచిపోయింది.

**తతః ప్రహృష్టా సా దృష్ట్వా దివ్యరూపం శివస్య తత్ ।**
**ప్రత్యువాచ ప్రభుం ప్రీత్యా లజ్జయాధోముఖీ శివా ॥ 61 ॥**

శివుని ఆ దివ్యరూపాన్ని గాంచి, మహానందాన్ని పొందియున్న శివపత్నియైన పార్వతి ప్రేమతోను, సిగ్గుతోను, తలను వంచుకున్నదై ఇట్లు బదులు పలికింది.

**శివోవాచ –** పార్వతి పలికింది.

**యది ప్రసన్నో దేవేశ! కరోషి చ కృపాం మయి ।**
**పతిర్మే భవ దేవేశ! ఇత్యుక్తశ్శివయా శివః ॥ 62 ॥**

'ఓ దేవదేవా! నీవు ప్రసన్నుడవైనచో నాయందు దయను చూపుము. నీవు నాకు భర్తవు కమ్ము' అని పార్వతి శివునితో పలికింది.

**గృహీత్వా విధివత్పాణిం కైలాసం స తయా యయౌ ।**
**పతిం తం గిరిజా ప్రాప్య దేవకార్యం చకార సా ॥ 63 ॥**

శివుడు పార్వతిని యథావిధిగా వివాహమాడి, ఆమెను తీసుకొని కైలాసానికి వెళ్లాడు. పార్వతి ఆయనను భర్తగా పొంది దేవకార్యాన్ని చేసింది.

**ఇతి ప్రోక్తస్తు తే తాత! బ్రహ్మచారిస్వరూపకః ।**
**శివావతారోహి మయా శివాభావపరీక్షకః ॥ 64 ॥**

ఓ వత్సా! ఈ విధంగా పార్వతియొక్క భక్తిని పరీక్షించిన శివుని బ్రహ్మచారి అవతారాన్ని గురించి, నేను నీకు చెప్పాను.

**ఇదమాఖ్యానమనఘం పరమం వ్యాహృతం మయా ।**
**య ఏతచ్ఛృణుయాత్ప్రీత్యా స సుఖీ గతిమాప్నుయాత్ ॥ 65 ॥**

నేను నీకు చెప్పిన ఈ పరమపవిత్ర గాథను ఎవడైతే ప్రీతితో వింటాడో, అట్టివాడు సమస్తసుఖాలను అనుభవించి మోక్షాన్ని పొందుతాడు.

**ఇతి చతురశీతిరవతారాః ।**
శివుని 84 అవతారాలు ఇప్పటి వరకు వర్ణింపబడ్డాయి.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం బ్రహ్మచారిశివావతారవర్ణనం నామ త్రయస్త్రింశోఽధ్యాయః ॥ 33 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు బ్రహ్మచారిశివావతారవర్ణనం అనే పేరుగల ముప్పైమూడవ అధ్యాయం సమాప్తం.

## **చతుస్త్రింశోఽధ్యాయః** - ముప్పైనాల్గవ అధ్యాయం
## **సునర్తకనటాహ్వశివావతారవర్ణనమ్** - సునర్తకనటావతారవర్ణనం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**సనత్కుమార! సర్వజ్ఞ! శివస్య పరమాత్మనః ।**
**అవతారం శృణు విభోస్సునర్తకనటాహ్వయమ్ ॥ 1 ॥**

ఓ సనత్కుమారా! సర్వజ్ఞా! సర్వవ్యాపకుడు, పరమాత్మయునగు శివుడు నాట్యాన్ని చేసే నటుని అవతారాన్ని దాల్చిన గాథను వినుము.

**యదా హి కాళికా దేవీ పార్వతీ హిమవత్సుతా ।**
**తేపే తపస్సువిమలం వనం గత్వా శివాప్తయే ॥ 2 ॥**

కాళిక, హిమవత్పుత్రికయునగు పార్వతీదేవి శివుని పొందగోరి, అడవికి వెళ్లి కఠోరమైన తపస్సు చేసింది.

**తదా శివః ప్రసన్నోఽభూత్తస్యాస్సుతపసో మునే! ।**
**తద్వృత్తసుపరీక్షార్థం వరం దాతుం ముదా యయౌ ॥ 3 ॥**

అప్పుడు శివుడు ఆమె గొప్ప తపస్సునకు ప్రసన్నుడయ్యాడు. ఆయన ఆమెయొక్క భావాన్ని దృఢంగా పరీక్షించి వరాన్ని ప్రసాదించడానికి ఆమె వద్దకు వెళ్లాడు.

**స్వరూపం దర్శయామాస తస్యై సుప్రీతమానసః ।**
**వరం బ్రూహీతి చోవాచ తాం శివాం శంకరో మునే! ॥ 4 ॥**

మిక్కిలి సంతసిల్లిన మనస్సు గల శంకరుడు ఆమెకు తన రూపాన్ని చూపించాడు. అపుడాయన ఆమెతో వరాన్ని కోరుకొమ్మని పలికాడు.

**తచ్ఛ్రుత్వా శంభువచనం దృష్ట్వా తద్రూపముత్తమమ్ ।**
**సుజహర్ష శివాఽతీవ ప్రాహ తం సుప్రణమ్య సా ॥ 5 ॥**

శంభుని వచనం విని, ఆయనయొక్క ఉత్తమమైన రూపాన్ని చూసి, ఆ పార్వతి ఆయనకు చక్కగా నమస్కరించి, మహానందాన్ని పొంది, ఆయనతో ఇట్లు పలికింది.

**పార్వత్యువాచ** - పార్వతి పలికింది.

**యది ప్రసన్నో దేవేశ! మహ్యం దేయో వరో యది ।**
**పతిర్భవ మమేశాన! కృపాం కురు మమోపరి ॥ 6 ॥**

ఓ దేవదేవా! నీవు ప్రసన్నుడవైనచో, నాకు వరమునీయదలచినచో నాకు భర్తవు కమ్ము. నాపై దయను చూపుము.

**పితుర్గృహే మయా సమ్యగ్గమ్యతే త్వదనుజ్ఞయా ।**
**గంతవ్యం భవతా నాథ! మత్పితుః పార్శ్వతః ప్రభో! ॥ 7 ॥**

నీ ఆజ్ఞననుసరించి నేను చక్కగా మా తండ్రి గారింటికి వెళ్తున్నాను. ఓ నాథా! ప్రభూ! నీవు నా తండ్రి వద్దకు విధిగా వెళ్లాలి.

**యాచస్వ మాం తతో భిక్షుః ఖ్యాపయంశ్చ యశః శుభమ్ ।**
**పితుర్మే సఫలం సర్వం కురు ప్రీత్యా గృహాశ్రమమ్ ॥ 8 ॥**

నీవు భిక్షుకుడవై నీ శుభకరమైన కీర్తిని విస్తరింపజేస్తూ, నా గురించి కోరుము. నీవు ప్రేమతో నా తండ్రియొక్క గృహస్థాశ్రమాన్ని పూర్ణంగా సార్థకం చేయుము.

**తతో యథోక్తవిధినా కర్తుమర్హసి భో ప్రభో! ।**
**వివాహం త్వం మహేశాన! దేవానాం కార్యసిద్ధయే ॥ 9 ॥**

ఓ ప్రభూ! అప్పుడు నీవు యథావిధిగా వివాహం చేసుకొనదగుదువు. నీవు దేవతల కార్యాన్ని ఈ విధంగా సిద్ధింపజేయుము.

**కామం మే పూరయ విభో! నిర్వికారో భవాన్సదా ।**
**భక్తవత్సలనామా హి తవ భక్తాఽస్మ్యహం సదా ॥ 10 ॥**

ఓ ప్రభూ! నీవు నా కోరికను నెరవేర్చుము. నీయందు ఏ కాలములోనైననూ వికారాలు లేవు. నీకు భక్తవత్సలుడను పేరుగలదు. నేను సర్వదా నీకు భక్తురాలను.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్తస్స తయా శంభుర్మహేశో భక్తవత్సలః ।**
**తథాస్త్వితి వచః ప్రోచ్యాఽన్తర్హితస్స్వగిరిం యయౌ ॥ 11 ॥**

ఆమె ఇట్లు పలుకగా, మహేశ్వరుడు, భక్తవత్సలుడునైన శంభుడు “తథాస్తు (అటులనే అగుగాక!)” అని పలికి, అంతర్ధానం చెంది, తన పర్వతానికి వెళ్లాడు.

**పార్వత్యపి తతః ప్రీత్యా స్వసఖీభ్యాం వయోఽన్వితా ।**
**జగామ స్వపితుర్గేహం రూపం కృత్వా తు సార్థకమ్ ॥ 12 ॥**

అనంతరం నవయౌవనవతియైన పార్వతి గూడ తన చెలికత్తెలతో కూడినదై, ప్రీతిపూర్వకంగా తన తండ్రిగారి ఇంటికి వెళ్లింది. ఆమె తన సౌందర్యాన్ని ఈ విధంగా సార్థకం చేసుకుంది.

**పార్వత్యాగమనం శ్రుత్వా మేనయా స హిమాచలః ।**
**పరివారయుతో ద్రష్టుం స్వసుతాం తాం యయౌ ముదా ॥ 13 ॥**

పార్వతి తిరిగి వచ్చినదని తెలిసి, మేనా హిమవంతులు పరివారంతో గూడి, తమ కుమార్తెను చూడడానికి ఆనందంతో వెళ్లారు.

**దృష్ట్వా తాం సుప్రసన్నాస్యామానయామాసతుర్గృహమ్ ।**
**కారయామాసతుః ప్రీత్యా మహానందౌ మహోత్సవమ్ ॥ 14 ॥**

మిక్కిలి ప్రసన్నమైన ఆ పార్వతిని చూచి, వారు ఇంటికి తీసుకుని వెళ్లి, మహానందంగలవారై, ప్రీతితో గొప్ప ఉత్సవాన్ని చేశారు.

**ధనం దదౌ ద్విజాదిభ్యో మేనా గిరివరస్తథా ।**
**మంగళం కారయామాస స వేదధ్వనిమాదరాత్ ॥ 15 ॥**

మేనా హిమవంతులిద్దరూ, బ్రాహ్మణులు మున్నగువారికి ధనమిచ్చారు. మంగళకరమైన వేదఘోషను సాదరంగా ఏర్పాటు చేశారు.

**తతః స్వకన్యయా సార్ధమువాస ప్రాంగణే ముదా ।**
**మేనా చ హిమవాంఛైలః స్నాతుం గంగాం జగామ సః ॥ 16 ॥**

అనంతరం మేనాదేవి కుమార్తెతో గూడి ఇంటి ముంగిట ఆనందంగా ఉండగా, హిమవంతుడు స్నానంచేయుటకు గంగకు వెళ్లాడు.

**ఏతస్మిన్నంతరే శంభుః సులీలో భక్తవత్సలః ।**
**సునర్తకనటో భూత్వా మేనకాసన్నిధిం యయౌ ॥ 17 ॥**

ఇంతలో చక్కని లీలలను ప్రకటించువాడూ, భక్తవత్సలుడూనైన శంభువు చక్కని నాట్యగాని వేషాన్ని ధరించి, మేనాదేవి వద్దకు వెళ్లాడు.

**శృంగం వామే కరే ధృత్వా దక్షిణే డమరుం తథా ।**
**పృష్ఠే కన్థాం రక్తవాసా నృత్యగానవిశారదః ॥ 18 ॥**

నృత్యగానవిశారదుడైన శివుడు ఎడమచేతిలో కొమ్ముబూరాను, కుడి చేతిలో డమరువును, (బుడబుక్కల వాద్యం) పట్టుకొని, భుజంపై బొంతను వేసుకొని, ఎర్రని వస్త్రాన్ని ధరించియున్నాడు.

**తతస్తు నటరూపోఽసౌ మేనకాప్రాంగణే ముదా ।**
**చక్రే స నృత్యం వివిధం గానం చాతిమనోహరమ్ ॥ 19 ॥**

తరువాత నటుని రూపంలో నున్న శివుడు మేనాదేవియొక్క ఇంటి వాకిట్లో ఆనందంతో రకరకాల నాట్యాన్ని చేస్తూ, మిక్కిలి మనోహరమైన పాటలను పాడాడు.

**శృంగం చ డమరుం తత్ర వాదయామాస సుధ్వనిమ్ ।**
**మహోతిం వివిధాం ప్రీత్యా స చకార మనోహరామ్ ॥ 20 ॥**

ఆయన అచ్చట కొమ్ముబూరాను, డమరువునూ, చక్కని ధ్వని కలిగేటట్లుగా వాయించాడు. అంతేగాక ఆయన మిక్కిలి మనోహరములైన రకరకాల గొప్పలీలలను ప్రీతిపూర్వకంగా ప్రకటించాడు.

**తం ద్రష్టుం నాగరాస్సర్వే పురుషాశ్చ స్త్రియస్తథా ।**
**ఆజగ్ముస్సహసా తత్ర బాలా వృద్ధా అపి ధ్రువమ్ ॥ 21 ॥**

అతనిని చూసేందుకు నగరంలోని స్త్రీలు, పురుషులు, పిల్లలు, వృద్ధులు, అందరూ వెంటనే అచ్చటకు నిస్సంకోచంగా విచ్చేశారు.

**శ్రుత్వా సుగీతం తం దృష్ట్వా సునృత్యం చ మనోహరమ్ ।**
**సహసా ముర్ముహుః సర్వే మేనాపి చ తదా మునే! ॥ 22 ॥**

సనత్కుమారా! ఆ చక్కని గానాన్ని విని, మనోహరమైన నాట్యాన్ని చూసి, వారందరు శీఘ్రంగా మోహాన్ని పొందారు. మేనాదేవి కూడ ఆ సమయంలో మోహాన్ని పొందింది.

**తతో మేనాశు రత్నాని స్వర్ణపాత్రస్థితాని చ ।**
**తస్మై దాతుం యయౌ ప్రీత్యా తదూతిప్రీతమానసా ॥ 23 ॥**

మేనాదేవి అతని లీలలకు ప్రీతిని పొందిన మనస్సు గలదై, వెంటనే బంగారు పాత్రలో రత్నాలను ఆయనకు ఇవ్వడానికి తెచ్చింది.

**తాని న స్వీచకారాసౌ భిక్షాం యాచే శివాం చ తామ్ ।**
**పునస్సునృత్యం గానం చ కౌతుకాత్కర్తుముద్యతః ॥ 24 ॥**

కాని, ఆయన వాటిని తీసుకొనలేదు. ఆయన పార్వతిని భిక్షగా కోరాడు. ఆయన ఉత్సాహంతో మరల చక్కని నాట్యాన్ని చేయడానికి, పాటను పాడడానికి సంసిద్ధుడయ్యాడు.

**మేనా తద్వచనం శ్రుత్వా చుకోపాతి సువిస్మితా ।**
**భిక్షుకం భర్త్సయామాస బహిష్కర్తుమియేష సా ॥ 25 ॥**

ఆయన మాటను విని, మేనాదేవి చాలా కోపాన్ని, ఆశ్చర్యాన్ని పొందింది, ఆమె ఆ భిక్షుకుని, బయటకు గెంటవలెనని తలపోసింది. ఆమె ఆయనను నిందించి భయపెట్టింది.

**ఏతస్మిన్నంతరే తత్ర గంగాతో గిరిరాడ్యయౌ ।**
**దదర్శ పురతో భిక్షుం ప్రాంగణస్థం నరాకృతిమ్ ॥ 26 ॥**

ఇంతలో పర్వతరాజైన హిమవంతుడు గంగనుండి తిరిగి వచ్చి, తన ఇంటి వాకిట్లో భిక్షుకుని రూపంలో మానవదేహాన్ని దాల్చియున్న శివుని చూశాడు.

**శ్రుత్వా మేనాముఖాద్వృత్తం తత్సర్వం సుచుకోప సః ।**
**ఆజ్ఞాం చకారానుచరాన్నృపిః కర్తుం చ భిక్షుకమ్ ॥ 27 ॥**

ఆయన మేనాదేవి చెప్పగా ఆ వృత్తాంతాన్నంతటిని విని చాల కోపించి, ఆ భిక్షుకుని బయటకు గెంటమని సేవకులను ఆజ్ఞాపించాడు.

**మహాగ్నిమివ దుఃస్పర్శం ప్రజ్వలన్తం సుతేజసమ్ ।**
**న శశాక బహిః కర్తుం కోఽపి తం మునిసత్తమ! ॥ 28 ॥**

ఓ మునిసత్తమా! మండే పెద్ద నిప్పువలె స్పృశింపశక్యం కానివాడూ, గొప్పతేజస్సు గలవాడూనగు ఆ శివుని బయటకు, గెంటడానికి ఎవ్వరికీ శక్తి లేకపోయింది.

**తతః స భిక్షుకస్తాత! నానాలీలావిశారదః ।**
**దర్శయామాస శైలాయ స్వప్రభావమనన్తకమ్ ॥ 29 ॥**

వత్సా! అనంతరం నానాలీలావిశారదుడైన ఆ భిక్షుకుడు తన అనంతప్రభావాన్ని హిమవంతునికి చూపించాడు.

**శైలో దదర్శ తం తత్ర విష్ణురూపధరం ద్రుతమ్ ।**
**తతో బ్రహ్మ స్వరూపంచ సూర్యరూపం తతః క్షణాత్ ॥ 30 ॥**

ఆ సమయంలో ఆయన హిమవంతునికి విష్ణురూపంలో, వెంటనే బ్రహ్మ రూపంలో, దాని తరువాత క్షణకాలంలో సూర్యరూపంలో కనిపించాడు.

**తతో దదర్శ తం తాత! రుద్రరూపం మహాద్భుతమ్ ।**
**పార్వతీసహితం రమ్యం విహసన్తం సుతేజసమ్ ॥ 31 ॥**

మునీశ్వరా! అనంతరం మహాద్భుతమైనట్టియు, పార్వతితో కూడి నవ్వుచున్న సుందరుడును, తేజస్వియును అయిన రుద్రుని రూపంలో హిమవంతుడు ఆయనను చూసాడు.

**ఏవం సుబహురూపాణి తస్య తత్ర దదర్శ సః ।**
**సువిస్మితో బభూవాశు పరమానందసంప్లుతః ॥ 32 ॥**

ఆయన ఈ విధంగా శివుని అనేకరూపాలను చూచి, మహాశ్చర్యాన్ని పొందాడు. వెనువెంటనే ఆయన హృదయం పరమానందంతో నిండి పోయింది.

**అథాసౌ భిక్షువర్యో హి తస్మాత్తస్యాశ్చ సూతికృత్ ।**
**భిక్షాం యయాచే దుర్గాం తాం నాన్యజ్జగ్రాహ కించన ॥ 33 ॥**

తరువాత చక్కని లీలలను చేసే ఆ భిక్షుకశ్రేష్ఠుడు, ఆ మేనాహిమవంతులనుండి ఆ దుర్గను భిక్షగా కోరాడు. మరియొక భిక్షను ఆయన స్వీకరించలేదు.

**తతశ్చాంతర్దధే భిక్షుస్వరూపః పరమేశ్వరః ।**
**స్వాలయం స జగామాశు దుర్గావాక్యప్రణోదితః ॥ 34 ॥**

తరువాత భిక్షురూపంలోనున్న పరమేశ్వరుడు దుర్గయొక్క వచనంచే ప్రేరేపింపబడి అంతర్ధానమై, వెంటనే తన నివాసానికి వెళ్లాడు.

**తదా బభూవ సుజ్ఞానం మేనాశైలేశయోరపి ।**
**ఆవాం శివో వంచయిత్వా గతవాన్స్వాలయం విభుః ॥ 35 ॥**

శివవిభుడు మనల్ని మోసగించి తన నివాసానికి వెళ్లాడనే జ్ఞానం మేనా హిమవంతులకు కూడా బాగా కలిగింది.

**అస్మై దేయా స్వకన్యేయం పార్వతీ సుతపస్వినీ ।**
**ఏవం విచార్య చ తయోః శివే భక్తిరభూత్పరా ॥ 36 ॥**

గొప్ప తపస్సు చేసిన మన కన్యయైన పార్వతిని ఈ శివునకే ఇవ్వాలని వారు నిశ్చయించుకున్నారు.వారిలో పరమశివభక్తి నెలకొంది.

**అతో రుద్రో మహెూతీశ్చ కృత్వా భక్తముదావహమ్ ।**
**వివాహం కృతవాన్ప్రీత్యా పార్వత్యా స విధానతః ॥ 37 ॥**

తరువాత గొప్ప లీలల్ని ప్రదర్శించే రుద్రుడు భక్తులకానందాన్ని కలిగించువాడై, పార్వతిని ప్రీతితో యథావిధిగా వివాహమాడాడు.

**ఇతి ప్రోక్తస్తు తే తాత! సునర్తకనటాహ్వయః ।**
**శివావతారో హి మయా శివావాక్యప్రపూరకః ॥ 38 ॥**

వత్సా! శివుడు ఈ విధంగా పార్వతీదేవి మాటను నిలబెట్టడానికై సుందరమైన నటుని అవతారాన్ని దాల్చి నర్తించాడు. ఈ వృత్తాంతాన్ని నీకు చెప్పియున్నాను.

**ఇదమాఖ్యానమనఘం పరమం వ్యాహృతం మయా ।**
**య ఏతచ్ఛృణుయాత్ప్రీత్యా స సుఖీ గతిమాప్నుయాత్ ॥ 39 ॥**

నేను నీకుచెప్పిన ఈ పరమపవిత్ర గాథను ఎవడైతే ప్రీతితో వింటాడో, వాడు సుఖాలను పొంది, పుణ్యగతిని కూడా పొందుతాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం సునర్తకనటాహ్వయశివావతారవర్ణనం నామ చతుస్త్రింశోఽధ్యాయః ॥ 34 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు సునర్తకనటావతారవర్ణనం అనే పేరుగల ముప్పైనాల్గవ అధ్యాయం సమాప్తం.

## పంచత్రింశోఽధ్యాయః - ముప్పైఐదవ అధ్యాయం

## సాధుద్విజశివావతారవర్ణనమ్ - సాధుద్విజశివావతారవర్ణనం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**సనత్కుమార! సర్వజ్ఞ! శివస్య పరమాత్మనః ।**
**అవతారం శృణు విభోస్సాధువేషద్విజాహ్వయమ్ ॥ 1 ॥**

ఓ సనత్కుమారా! సర్వజ్ఞా! సర్వసమర్థుడు, పరమాత్మయునగు శివుడు సత్పురుషుడైన బ్రాహ్మణుని అవతారాన్ని ధరించాడు. ఆ గాథను వినుము.

**మేనాహిమాలయోర్భక్తిం శివే జ్ఞాత్వా మహోత్తమామ్ ।**
**చింతామాపుస్సురాస్సర్వే మంత్రయామాసురాదరాత్ ॥ 2 ॥**

శివునియందు మేనాహిమవంతులకు గల సర్వోత్కృష్టమైన భక్తిని గురించి తెలుసుకొని, దేవతలందరు చింతను పొంది సాదరంగా సలహా సంప్రదింపులు చేశారు.

**ఏకాంతభక్త్యా శైలశ్చేత్కన్యాం దాస్యతి శంభవే ।**
**ధ్రువం నిర్వాణతాం సద్యః సంప్రాప్స్యతి శివస్య వై ॥ 3 ॥**

హిమవంతుడు ఏకాంతమైన భక్తితో శివునకు తన కన్య నిచ్చినచో, నిశ్చయంగా వెంటనే మోక్షాన్ని పొంది శివలోకం చేరుకోగలడు.

**అనంతరత్నాధారోఽసౌ చేత్ప్రయాస్యతి మోక్షతామ్ ।**
**రత్నగర్భాభిధా భూమిర్మిథ్యైవ భవితా ధ్రువమ్ ॥ 4 ॥**

లెక్కలేనన్ని శ్రేష్ఠవస్తువులకు ఆధారమైన హిమవంతుడు మోక్షాన్ని పొందితే, రత్నగర్భ అనే పేరు గల భూమికి ఆ పేరు నిశ్చయంగా అసత్యమౌతుంది.

**అస్థిరత్వం పరిత్యజ్య దివ్యరూపం విధాయ సః ।**
**కన్యాం శూలభృతే దత్త్వా శివాలోకం గమిష్యతి ॥ 5 ॥**

ఆయన తన కదలని రూపాన్ని విడిచిపెట్టి, దివ్యరూపాన్ని దాల్చి, కన్యను శూలపాణియైన శివునకు సమర్పించి, శివలోకం పొందుతాడు.

**మహాదేవస్య సారూప్యం ప్రాప్య శంభోరనుగ్రహాత్ ।**
**తత్ర భుక్త్వా మహాభోగాంస్తతో మోక్షమవాప్స్యతి ॥ 6 ॥**

హిమవంతుడు శంభుని అనుగ్రహంచే ఆ మహాదేవుని సారూప్యాన్ని పొంది, అచ్చటనే మహాభోగాలననుభవించి, తరువాత మోక్షాన్ని పొందగలడు.

**ఇత్యాలోచ్య సురాస్సర్వే జగ్ముర్గురుగృహం మునే! ।**
**చక్రుర్నివేదనం గత్వా గురవే స్వార్థసాధకాః ॥ 7 ॥**

స్వార్థాన్ని సాధించుకునే దేవతలందరు ఈ విధంగా ఆలోచించి, బృహస్పతి ఇంటికి వెళ్లి ఆయనకు ఇలా విన్నవించారు.

**దేవా ఊచుః –** దేవతలు పలికారు.

**గురో! హిమాలయగృహం గచ్ఛాస్మత్కార్యసిద్ధయే ।**
**కృత్వా నిందాం మహేశస్య గిరిభక్తిం నివారయ ॥ 8 ॥**

ఓ బృహస్పతీ! మన కార్యాన్ని సాధించడానికి నీవు హిమవంతుని ఇంటికి వెళ్లి, మహేశ్వరుని నిందించి, హిమవంతునికి ఆయనపై గల భక్తిని తొలగించుము.

**స్వశ్రద్ధయా సుతాం దత్త్వా శివాయ స గిరిర్గురో! ।**
**లభేత ముక్తిమత్రైవ ధరణ్యాం స హి తిష్ఠతు ॥ 9 ॥**

బృహస్పతీ! ఆ హిమవంతుడు స్వయంగా శ్రద్ధతో తన కన్యను శివునకు సమర్పించినచో ఆయనకు మోక్షం లభిస్తుంది. కాని ఆయన ఈ భూమిపైననే ఉండాలి.

**ఇతి దేవవచః శ్రుత్వా ప్రోవాచ చ విచార్య తాన్ ॥ 10 ॥**

ఆయన దేవతల ఈ మాటను విని, ఆలోచించి వారితో ఇట్లన్నాడు.

**గురురువాచ –** బృహస్పతి పలికాడు.

**కశ్చిన్మధ్యే చ యుష్మాకం గచ్ఛేచ్ఛైలాంతికం సురాః! ।**
**సంపాదయేత్స్వాభిమతమహం తత్కర్తుమక్షమః ॥ 11 ॥**

ఓ దేవతలారా! మీలో ఒకడు హిమవంతుని వద్దకు వెళ్లి, మీ కార్యాన్ని సాధించుకోవచ్చు. ఆ పనిని చేసే సామర్థ్యం నాకు లేదు.

**అథవా గచ్ఛత సురాః బ్రహ్మలోకం సవాసవాః ।**
**తస్మై వృత్తం కథయ స్వం స వః కార్యం కరిష్యతి ॥ 12 ॥**

ఓ దేవతలారా! లేదా మీరు ఇంద్రునితో కలిసి బ్రహ్మలోకానికి వెళ్లండి. ఆయనకు విషయాన్ని చెప్పండి. ఆయన మీ పనిని చేయగలడు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**తచ్ఛ్రుత్వా తే సమాలోచ్య జగ్ముర్విధిసభాం సురాః ।**
**సర్వం నివేదయామాసుస్తద్వృత్తం పురతో విధేః ॥ 13 ॥**

ఆ మాటలను విని, దేవతలు పరస్పరం చర్చించుకొని బ్రహ్మగారి సభకు వెళ్లి, ఆయన యెదుట ఆ వృత్తాంతాన్నంతటిని విన్నవించుకొన్నారు.

**అవోచత్తాన్విధిః శ్రుత్వా తద్వచః సువిచింత్య వై ।**
**నాహం కరిష్యే తన్నిందాం దుఃఖదాం కహరాం సదా ॥ 14 ॥**

వారి మాటను విని, బ్రహ్మ బాగా ఆలోచించి, వారితో ఇలా అన్నాడు. 'నేను శివనింద చేయను. శివుని నిందించే వారికి సుఖం శాశ్వతంగా దూరమై దుఃఖం కలుగుతుంది.

**సురా గచ్ఛత కైలాసం సంతోషయత శంకరమ్ ।**
**ప్రస్థాపయత తం దేవం హిమాలయగృహం ప్రతి ॥ 15 ॥**

ఓ దేవతలారా! మీరు కైలాసానికి వెళ్లి, శంకరుని సంతోషపెట్టండి. ఆ దేవుని హిమవంతుని ఇంటికి పంపండి.

**స గచ్ఛేదథ శైలేశమాత్మనిందాం కరోతు వై ।**
**పరనిందా వినాశాయ స్వనిందా యశసే మతా ॥ 16 ॥**

ఆయన హిమవంతుని వద్దకు వెళ్లి, తనను తాను నిందించుకొను గాక! ఇతరులను నిందిస్తే వినాశమూ, తనను తాను నిందించుకున్నచో కీర్తి కలుగుతుంది.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**తతస్తే ప్రయయుః శీఘ్రం కైలాసం నిఖిలాస్సురాః ।**
**సుప్రణమ్య శివం భక్త్యా తద్రుతం నిఖిలా జగుః ॥ 17 ॥**

అంతట దేవతలందరు వెంటనే కైలాసానికి వెళ్లి, భక్తితో శివునికి నమస్కరించి, వెంటనే ఆ విషయాన్ని ఆయనకు చెప్పారు.

**తచ్ఛ్రుత్వా దేవవచనం స్వీచకార మహేశ్వరః ।**
**దేవాన్సుయాపయామాస తానాశ్వాస్య విహస్య సః ॥ 18 ॥**

దేవతల మాటలను విని మహేశ్వరుడు వారి కోరిక నంగీకరించి, వారి నోదార్చి, నవ్వి, వారిని చక్కగా సాగనంపాడు.

**తతః స భగవాన్ శంభుర్మహేశో భక్తవత్సలః ।**
**గంతుమైచ్ఛచ్ఛైలమూలం మాయేశో న వికారవాన్ ॥ 19 ॥**

అనంతరం భక్తవత్సలుడు, మహేశ్వరుడు, మాయాధీశ్వరుడు, నిర్వికారుడు, అయిన శంభువు హిమవంతుని ఇంటికి వెళ్లాలనుకున్నాడు.

**దండీ ఛత్రీ దివ్యవాసా బిభ్రత్తిలకముజ్జ్వలమ్ ।**
**కరే స్ఫటికమాలాం చ శాలగ్రామం గళే దధత్ ॥ 20 ॥**

ఆయన కర్రను, గొడుగును పట్టుకొని, దివ్యమైన వస్త్రాలను ధరించి, మెరిసిపోయే తిలకాన్ని దిద్ది, చేతిలో స్ఫటికమాలను, కంఠంలో శాలగ్రామాన్ని ధరించాడు.

**జపన్నామ హరేర్భక్త్యా సాధువేషధరో ద్విజః ।**
**హిమాచలం జగామాశు బంధువర్గైస్సమన్వితమ్ ॥ 21 ॥**

ఆయన ఈ విధంగా, సాధుబ్రాహ్మణవేషాన్ని ధరించి, హరినామాన్ని జపిస్తూ, వెంటనే బంధువర్గాలతో కూడియున్న హిమవంతుని వద్దకు వెళ్లాడు.

**తం చ దృష్ట్వా సముత్తస్థౌ సగణోఽపి హిమాలయః ।**
**ననామ దండవద్భూమౌ సాష్టాంగం విధిపూర్వకమ్ ॥ 22 ॥**

హిమవంతుడు ఆయనను చూచి తన పరిజనంతో సహా లేచి నిలబడి, యథావిధిగా సాష్టాంగనమస్కారాన్ని చేశాడు.

**తతః పప్రచ్ఛ శైలేశస్తం ద్విజం కో భవానితి ।**
**ఉవాచ శీఘ్రం విప్రేంద్రస్స యోగ్యాద్రిమ్మహాదరాత్ ॥ 23 ॥**

అనంతరం ఆ పర్వతరాజు ఆ బ్రాహ్మణుని 'నీవెవరు?' అని ప్రశ్నించాడు. ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు యోగ్యుడైన హిమవంతునికి గొప్ప ఆదరంతో ఇలా బదులు పలికాడు.

**సాధుద్విజ ఉవాచ –** సాధుబ్రాహ్మణుడు పలికాడు.

**సాధుద్విజాహ్వః శైలాహం వైష్ణవః పరమార్థదృక్ ।**
**పరోపకారీ సర్వజ్ఞః సర్వగామీ గురోర్బలాత్ ॥ 24 ॥**

ఓ పర్వతరాజా! నేను పరమార్థాన్ని ఎరిగిన వైష్ణవుడను. నా పేరు సాధుద్విజుడు. నేను గురువుయొక్క అనుగ్రహం వల్ల సర్వం తెలుసుకొని, అన్ని స్థలాలకు వెళ్తూ, ఇతరులకుపకారం చేస్తూ ఉంటాను.

**మయా జ్ఞాతం స్వవిజ్ఞానాత్ స్వస్థానే శైలసత్తమ! ।**
**తచ్ఛృణు ప్రీతితో వచ్మి హిత్వా దంభం తవాంతికమ్ ॥ 25 ॥**

ఓ పర్వతరాజా! నేను ఉన్నచోటనే ఉండి, నా బుద్ధిశక్తిచే ఒక విషయాన్ని తెలుసుకున్నాను. నేనే ధర్మాత్ముడననే అహంకారాన్ని విడిచిపెట్టి నీ యెదుట ప్రేమపూర్వకంగా చెబుతాను వినుము.

**శంకరాయ సుతాన్దాతుస్త్వమిచ్ఛసి నిజోద్భవామ్ ।**
**ఇమాం పద్మాసమాం రమ్యామజ్ఞాతకులశీలినే ॥ 26 ॥**

లక్ష్మీదేవితో సమానమైన సౌందర్యం గల నీకుమార్తెను నీవు శంకరునకిచ్చి వివాహం చేయగోరుచున్నావు. కాని నీకు ఆయన కులంగాని, శీలంగాని తెలియవు.

**ఇయం మతిస్తే శైలేంద్ర! న యుక్తా మంగళప్రదా ।**
**నిబోధ జ్ఞానినాం శ్రేష్ఠ! నారాయణకులోద్భవ! ॥ 27 ॥**

ఓ పర్వతరాజా! నారాయణుని వంశంలో జన్మించిన వాడా! జ్ఞానులలో శ్రేష్ఠుడా! అమంగళకరమైన అట్టి ఆలోచన నీకు తగదు. ఈ విషయం నీవు తెలుసుకొనుము.

**పశ్య శైలాధిప! త్వం చ న తస్యైకోఽస్తి బాంధవః ।**
**బాంధవాన్ స్వాన్ ప్రయత్నేన పృచ్ఛ మేనాం చ స్వప్రియామ్ ॥ 28 ॥**

ఓ పర్వతరాజా! ఆ శివునకు బంధువు లెవ్వరూ లేరు. నీవీ విషయాన్ని గమనించాలి. నీ బంధువులను, నీ భార్యయైన మేనాదేవిని ప్రత్యేకంగా సంప్రదించు.

**సర్వాన్సంపృచ్ఛ యత్నేన మేనాదీన్పార్వతీం వినా ।**
**రోగిణే నౌషధం శైల! కుపథ్యం రోచతే సదా ॥ 29 ॥**

పార్వతిని మినహాయించి, మేనాదేవి మున్నగు వారినందరిని సంప్రదించు. ఎప్పుడూ రోగికి మందు రుచింపదు. కాని అపథ్యం మాత్రం రుచిస్తుంది.

**న తే పాత్రానురూపశ్చ పార్వతీదానకర్మణి ।**
**మహాజనః స్మేరముఖః శ్రుతిమాత్రాద్భవిష్యతి ॥ 30 ॥**

నీవు పార్వతిని కన్యాదానం చేయుటకు నిర్ణయించుకున్న శివుడు ఆమెకు అనురూపమైనవాడుకాడు, తగినవాడును కాడు, ఈ సంగతిని విన్నంతమాత్రం చేతనే పెద్దలు నవ్వుతారు.

**నిరాశ్రయస్సదా సంగో విరూపో నిర్గుణోఽవ్యయః ।**
**స్మశానవాసీ వికటో వ్యాలగ్రాహీ దిగంబరః ॥ 31 ॥**

ఆయన నిరాశ్రయుడు, ఎల్లపుడూ సంసారమునందాసక్తి లేనివాడు, విరూపుడు, నిర్గుణుడు, అవ్యయుడు, స్మశానవాసి, భయంకరాకారుడు, పాములను పట్టుకునేవాడు. దిగంబరుడు.

**విభూతిభూషణో వ్యాలవరావేష్టితమస్తకః ।**
**సర్వాశ్రమపరిభ్రష్టస్త్వవిజ్ఞాతగతిస్సదా ॥ 32 ॥**

భస్మమే అలంకారంగా కలవాడు, తల చుట్టూ భయంకరమైన పాములను చుట్టుకున్నవాడు, బ్రహ్మచర్యం-మొదలైన ఆశ్రమధర్మాలను వదలటంచేత భ్రష్టుడైనవాడు అగు ఆ శివుని స్థితిగతులు ఏనాడైననూ, ఎవ్వరికైననూ తెలియవు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**ఇత్యాద్యుక్త్వా వచస్తథ్యం శివనిందాపరం సహి ।**
**జగామ స్వాలయం శీఘ్రం నానాలీలాకరః శివః ॥ 33 ॥**

శివనిందతో కూడిన ఇట్టి వచనాలను పలికి శివుడు వెంటనే తన నివాసానికి వెళ్లాడు.

**తచ్ఛ్రుత్వా విప్రవచనమభూతాం చ తనూ తయోః ।**
**విపరీతానర్థపరే కిం కరిష్యావహే ధ్రువమ్ ॥ 34 ॥**

ఆ బ్రాహ్మణుని మాటలను విని, మేనాహిమవంతులిద్దరి దేహాలు విపరీతమైన పీడకు గురియయ్యాయి. వారిద్దరూ ఏమి చేయాలో తోచక బాధపడ్డారు.

**తతో రుద్రో మహోతిం చ కృత్వా భక్తముదావహామ్ ।**
**వివాహయిత్వా గిరిజాం దేవకార్యం చకార సః ॥ 35 ॥**

అంతట రుద్రుడు భక్తులకు ఆనందాన్ని కలిగించే గొప్ప లీలలను ప్రకటించి, పార్వతిని వివాహమాడి, దేవకార్యాన్ని సంపూర్ణం చేశాడు.

**ఇతి ప్రోక్తస్తు తే తాత! సాధువేషో ద్విజాహ్వయః ।**
**శివావతారో హి మయా దేవకార్యకరః ప్రభో! ॥ 36 ॥**

ఓ వత్సా! ప్రభూ! ఈ విధంగా శివుడు సాత్విక బ్రాహ్మణ వేషాన్ని ధరించి, దేవకార్యాన్ని చేసిన తీరును నీకు చెప్పాను.

**ఇదమాఖ్యానమనఘం స్వర్గ్యమాయుష్యముత్తమమ్ ।**
**యః పఠేచ్ఛృణుయాద్వాపి స సుఖీ గతిమాప్నుయాత్ ॥ 37 ॥**

పవిత్రమైనదియు, ఇహలోకంలో ఆయుర్దాయమును, స్వర్గాన్ని ప్రసాదించునదియునగు ఈ ఉత్తమమైన వృత్తాంతాన్ని పఠించినవాడు, విన్నవాడు సుఖాలననుభవించి ఉత్తమగతిని పొందుతాడు.

**షడశీత్యవతారాః –** ఇంత వరకు 86 అవతారాలు వర్ణింపబడ్డాయి.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం సాధుద్విజశివావతారవర్ణనం నామ పంచత్రింశోఽధ్యాయః ॥ 35 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు సాధుద్విజశివావతారవర్ణనం అనే పేరుగల ముప్పైఐదవ అధ్యాయం సమాప్తం.

## షట్త్రింశోఽధ్యాయః - ముప్పైఆరవ అధ్యాయం

## అశ్వత్థామావతారవర్ణనమ్ - అశ్వత్థామావతారవర్ణనం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**సనత్కుమార! సర్వజ్ఞ! శివస్య పరమాత్మనః ।**
**అవతారం శృణు విభోరశ్వత్థామాహ్వయం పరమ్ ॥ 1 ॥**

ఓ సనత్కుమారా! సర్వజ్ఞా! విభుడు, పరమాత్మయునైన శివుని అశ్వత్థామయను గొప్ప అవతారాన్ని గూర్చి విను.

**బృహస్పతేర్మహాబుద్ధేర్దేవర్షేరంశతో మునే! ।**
**భరద్వాజాత్సముత్పన్నో ద్రోణోఽయోనిజ ఆత్మవాన్ ॥ 2 ॥**

ఓ మునీ! మహాబుద్ధిశాలీ! దేవర్షియగు బృహస్పతి అంశవల్ల భరద్వాజునికి ద్రోణుడనే అయోనిజుడైన కుమారుడు కలిగాడు. ఆయన స్వాభిమానం గలవాడు.

**ధనుర్భృతాం వరః శూరో విప్రర్షిస్సర్వశాస్త్రవిత్ ।**
**బృహత్కీర్తిర్మహాతేజా యః సర్వాస్త్రవిదుత్తమః ॥ 3 ॥**

ఆయన ధనుర్ధారులలో శ్రేష్ఠుడు, శూరుడు, విప్రర్షి, సర్వశాస్త్రములు తెలిసినవాడు, సర్వాస్త్రవిదుడు, ఉత్తముడు, మహాతేజుడు.

**ధనుర్వేదే చ వేదే చ నిష్ణాతం యం విదుర్బుధాః ।**
**వరిష్ఠం చిత్రకర్మాణం ద్రోణం స్వకులవర్ధనమ్ ॥ 4 ॥**

ధనుర్వేదంలోను వేదంలోను, నిష్ణాతుడని పండితులంగీకరించారు. వరిష్ఠుడైన ద్రోణుడు చిత్రకర్మలనాచరించి తన కులాన్ని వృద్ధిలో తీసుకువచ్చాడు.

**కౌరవాణాం స ఆచార్య ఆసీత్స్వబలతో ద్విజ! ।**
**మహారథిషు విఖ్యాతః షట్సు కౌరవమధ్యతః ॥ 5 ॥**

మహామునీ! అతడు తన బలప్రభావంచే కౌరవులకు ఆచార్యుడయ్యాడు. కౌరవులలోని ఆరుగురు మహారథులలో ఆయన ఒకడని ప్రసిద్ధిగాంచాడు.

**సాహాయ్యార్థం కౌరవాణాం స తేపే విపులం తపః ।**
**శివముద్దిశ్య పుత్రార్థం ద్రోణాచార్యో ద్విజోత్తమః ॥ 6 ॥**

బ్రాహ్మణశ్రేష్ఠుడైన ద్రోణుడు, కౌరవులకు సహాయంచేయుటకొరకు పుత్రుని పొందగోరి శివుని ఉద్దేశించి గొప్ప తపస్సు చేశాడు.

**తతః ప్రసన్నో భగవాన్ శంకరో భక్తవత్సలః ।**
**ఆవిర్బభూవ పురతో ద్రోణస్య మునిసత్తమ! ॥ 7 ॥**

మునిశ్రేష్ఠా! అంతట భక్తవత్సలుడైన శంకర భగవానుడు ప్రసన్నుడై ద్రోణుని ఎదుట ఆవిర్భవించాడు.

**తం దృష్ట్వా స ద్విజో ద్రోణస్తుష్టావాశు ప్రణమ్య తమ్ ।**
**మహాప్రసన్నహృదయో నతకస్సుకృతాంజలిః ॥ 8 ॥**

బ్రాహ్మణుడైన ద్రోణుడు శివుని గాంచి మిక్కిలి సంతసించిన మనస్సు గలవాడై, వెంటనే చేతులు జోడించి, మోకరిల్లి ఆయనను స్తుతించాడు.

**తస్య స్తుత్యా చ తపసా సంతుష్టః శంకరః ప్రభుః ।**
**వరం బ్రూహీతి చోవాచ ద్రోణం తం భక్తవత్సలః ॥ 9 ॥**

అతని స్తుతికి, తపస్సునకు ప్రభువగు శంకరుడు సంతసిల్లి వరమును కోరుకొమ్మని ద్రోణునితో పలికాడు.

**తచ్ఛ్రుత్వా శంభువచనం ద్రోణః ప్రాహాథ సన్నతః ।**
**స్వాంశజం తనయం దేహి సర్వాజేయం మహాబలమ్ ॥ 10 ॥**

శంభుని వచనాలను విని ద్రోణుడు నమస్కరించి, "సర్వులకు జయింపశక్యంకానివాడు, నీ అంశచే జన్మించువాడు, మహాబలశాలియునైన పుత్రుని ఇమ్ము" అని కోరాడు.

**తచ్ఛ్రుత్వా ద్రోణవచనం శంభుః ప్రోచే తథాస్త్వితి ।**
**అభూదంతర్హితస్తాత! కౌతుకీ సుఖకృన్మునే ॥ 11 ॥**

వత్సా! ద్రోణుని మాటలను విని శంభువు 'తథాస్తు (అట్లే అగు గాక!)' అని పలికి అదృశ్యుడయ్యాడు. వత్సా! సుఖకరుడైన శంకరుని లీల ఉత్కంఠను కలిగిస్తుంది.

**ద్రోణోఽపగచ్ఛత్స్వం ధామ మహాహృష్టో గతభ్రమః ।**
**స్వపత్న్యై కథయామాస తద్వృత్తం సకలం ముదా ॥ 12 ॥**

భ్రమలు తొలగిన ద్రోణుడు మహానందంతో తన ఇంటికి వెళ్లి జరిగిన వృత్తాంతమునంతటినీ తన భార్యకు ఆనందంతో చెప్పాడు.

**అథావసరమాసాద్య రుద్రః సర్వాన్తకః ప్రభుః ।**
**స్వాంశేన తనయో జజ్ఞే ద్రోణస్య స మహాబలః ॥ 13 ॥**

అటు పిమ్మట సరియగు సమయంలో, సర్వాంతకుడైన శంకర ప్రభుడు తన అంశచే మహాబలశాలియైన ద్రోణపుత్రుడై జన్మించాడు.

**అశ్వత్థామేతి విఖ్యాతస్స బభూవ క్షితౌ మునే! ।**
**ప్రవీరః కంజపత్రాక్షః శత్రుపక్ష క్షయంకరః ॥ 14 ॥**

మునీ! అతడు లోకంలో 'అశ్వత్థామ' అనే పేరుతో ప్రసిద్ధినందాడు. మహావీరుడు, పద్మపత్రములవంటి నేత్రములు గలవాడునైన అశ్వత్థామ శత్రుపక్షాన్ని నాశనం చేయగల సమర్థుడు.

**యో భారతే రణే ఖ్యాతః పితురాజ్ఞామవాప్య చ ।**
**సహాయకృద్బభూవాథ కౌరవాణాం మహాబలః ॥ 15 ॥**

మహాబలుడైన అశ్వత్థామ తన తండ్రి అనుజ్ఞను పొంది, మహాభారత సంగ్రామంలో, కౌరవులకు సహాయమొనర్చి విఖ్యాతిని పొందాడు.

**యమాశ్రిత్య మహావీరం కౌరవాస్సుమహాబలాః ।**
**భీష్మాదయో బభూవుస్తేఽజేయా అపి దివౌకసామ్ ॥ 16 ॥**

మహావీరుడైన అశ్వత్థామ నాశ్రయించడంచేత, మిక్కిలి బలశాలురైన భీష్మాదికౌరవులు దేవతలకు అజేయులై నిలిచారు.

**యద్భయాత్పాండవాస్సర్వే కౌరవాన్ జేతుమక్షమాః ।**
**ఆసన్నష్టా మహావీరా అపి సర్వే చ కోవిదాః ॥ 17 ॥**

పాండవులందరూ మహావీరులు, యుద్ధవిశారదులూ అయిననూ, అతని భయంవల్ల కౌరవులను జయించు శక్తిలేని వారయ్యారు.

**కృష్ణోపదేశతశ్శంభోస్తపః కృత్వాతిదారుణమ్ ।**
**ప్రాప్య చాస్త్రం శంభువరాజ్జిగ్యే తానర్జునస్తతః ॥ 18 ॥**

అంతట అర్జునుడు కృష్ణుని ఉపదేశాన్ని అనుసరించి, శంభుని గూర్చి మిక్కిలి తీవ్రమైన తపమునాచరించి, శంభుని వరం వల్ల, అస్త్రాలను పొంది కౌరవులను జయించాడు.

**అశ్వత్థామా మహావీరో మహాదేవాంశజో మునే! ।**
**తదాపి తద్భక్తివశః స్వప్రతాపమదర్శయత్ ॥ 19 ॥**

సనత్కుమారా! మహావీరుడైన అశ్వత్థామ మహాదేవుని అంశచే జన్మించినవాడైననూ, మహాదేవునియందలి భక్తికి వశుడై తన ప్రతాపాన్ని ప్రదర్శించాడు.

**వినాశ్య పాండవసుతాన్ శిక్షితానపి యత్నతః ।**
**కృష్ణాదిభిర్మహావీరైరనివార్యబలః పరైః ॥ 20 ॥**

ప్రయత్నపూర్వకంగా సమర్థులైన పాండవపుత్రులను అశ్వత్థామ సంహరించాడు. శత్రుపక్షంలోని మహావీరులైన కృష్ణాదులు అతని బలాన్ని నిలువరింపలేకపోయారు.

**పుత్రశోకేన వికలమాపతన్తం తమర్జునమ్ ।**
**రథేనాచ్యుతవంతం హి దృష్ట్వా స చ పరాద్రవత్ ॥ 21 ॥**

పుత్రశోకంచే పీడితుడై, అచ్యుతునితో గూడి రథంపై దండెత్తి వస్తున్న అర్జునుని చూచి అతడు పారిపోయాడు.

**అస్త్రం బ్రహ్మశిరో నామ తదుపర్యసృజత్స హి ।**
**తతః ప్రాదురభూత్తేజః ప్రచండం సర్వతో దిశమ్ ॥ 22 ॥**

అంతట అశ్వత్థామ అర్జునునిపై బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగించాడు. దానినుండి ఉద్భవించిన ప్రచండ తేజస్సు అన్ని దిక్కులందు వ్యాపించింది.

**ప్రాణాపదమభిప్రేక్ష్య సోఽర్జునః క్లేశసంయుతః ।**
**ఉవాచ కృష్ణం విక్లాన్తో నష్టతేజా మహాభయః ॥ 23 ॥**

మిక్కిలి అలసి, నష్టతేజుడై, మహాభయాన్ని పొంది, ఆపదలోనున్న అర్జునుడు ప్రాణాపదను గూర్చి చింతించి శ్రీకృష్ణునితో ఇట్లన్నాడు.

**అర్జున ఉవాచ –** అర్జునుడు పలికాడు.

**కిమిదం స్వితుకుతో వేతి కృష్ణ! కృష్ణ! న వేద్మ్యహమ్ ।**
**సర్వతోముఖమాయాతి తేజశ్చేదం సుదుస్సహమ్ ॥ 24 ॥**

కృష్ణా! కృష్ణా! ఇది ఏమిటి? ఎక్కడనుండి వస్తోంది? నాకు తెలియడం లేదు. సుదుస్సహమైన ఈ తేజస్సు అన్నివైపులనుండి వస్తోంది.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**శ్రుత్వార్జునవచశ్చేదం స కృష్ణశ్శైవసత్తమః ।**
**దధ్యౌ శివం సదారం చ ప్రత్యాహార్జునమాదరాత్ ॥ 25 ॥**

అర్జునుని యీ మాటలను విని, శివభక్తాగ్రగణ్యుడైన కృష్ణుడు పార్వతీపరమేశ్వరులను ధ్యానించి, అర్జునునితో సాదరంగా ఇలా పలికాడు.

**కృష్ణ ఉవాచ –** కృష్ణుడు పలికాడు.

**వేత్థేదం ద్రోణపుత్రస్య బ్రాహ్మమస్త్రం మహోల్బణమ్ ।**
**న హ్యస్యాన్యతమం కించిదస్త్రం ప్రత్యవకర్శనమ్ ॥ 26 ॥**

"ద్రోణపుత్రుడు మహాశక్తియుతమైన బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగించాడని తెలుసుకో. అదియే ఇది. దీనికి ప్రతీకారం చేయగల మరియొక అస్త్రం లేదు.

**శివం స్మర ద్రుతం శంభుం స్వప్రభుం భక్తరక్షకమ్ ।**
**యేన దత్తం హి తే స్వాస్త్రం సర్వకార్యకరం పరమ్ ॥ 27 ॥**

మంగళస్వరూపుడు, నీకు ప్రభువు, భక్తరక్షకుడునైన శివుని వెంటనే స్మరించు, శివుడు సర్వకార్యకరమైన తన పరమాస్త్రాన్ని నీకు ఇచ్చియున్నాడు.

**జహ్యస్త్రతేజ ఉన్నద్ధస్త్వస్త్ర చైవాస్త్రతేజసా ।**
**ఇత్యుక్త్వా చ స్వయం కృష్ణశ్శివం దధ్యౌ తదర్థకః ॥ 28 ॥**

నీవు, ఆ శివుని అస్త్రంయొక్క తేజస్సు చేత, ప్రజ్వరిల్లుతున్న ఈ అస్త్రంయొక్క తేజస్సును శాంతింపజేయి" అని పలికి కృష్ణుడు అదే ప్రయోజనం కొరకు తాను స్వయంగా శివుని ధ్యానించాడు.

**తచ్ఛ్రుత్వా కృష్ణవచనం పార్థః స్మృత్వా శివం హృది ।**
**స్పృష్ట్వాపస్తం ప్రణమ్యాశు చిక్షేపాస్త్రం తతో మునే! ॥ 29 ॥**

మునిపుంగవా! శ్రీకృష్ణుని మాటలను విని, అర్జునుడు హృదయంతో శివుని స్మరించి, నీటిని స్పృశించి, శివునకు ప్రణమిల్లి వెంటనే అస్త్రాన్ని విడిచిపెట్టాడు.

**యద్యప్యస్త్రం బ్రహ్మశిరస్త్వమోఘం చాప్రతిక్రియమ్ ।**
**శైవాస్త్రతేజసా సద్యస్సమశామ్యన్మహామునే! ॥ 30 ॥**

ఓ మహామునీ! బ్రహ్మశిరోనామకాస్త్రం అమోఘమూ, ప్రతిక్రియ లేనిదీ అయినప్పటికినీ, అది అర్జునుడు ప్రయోగించిన శివుని అస్త్రంయొక్క తేజస్సుచే వెంటనే శాంతించింది.

**మంస్థా మా హ్యేతదాశ్చర్యం సర్వచిత్రమయే శివే ।**
**యః స్వశక్త్యాఖిలం విశ్వం సృజత్యవతి హన్త్యజః ॥ 31 ॥**

సర్వాశ్చర్యాలకు నిధానమైన శివుని విషయంలో ఇది ఆశ్చర్యమని తలంచవద్దు, పుట్టుకలేని ఆ శివుడు తన శక్తిచే జగత్తునంతటినీ సృజించి, రక్షించి, ఉపసంహరిస్తున్నాడు.

**అశ్వత్థామా తతో జ్ఞాత్వా వృత్తమేతచ్ఛివాంశజః ।**
**శైవం న వివ్యథే కించిచ్ఛివేచ్ఛాతుష్టధీర్మునే! ॥ 32 ॥**

ఓ మునీ! శివుని అంశవల్ల జన్మించిన అశ్వత్థామ అప్పుడీ వృత్తాంతాన్ని తెలుసుకొని, శివేచ్ఛచే సంతసిల్లిన బుద్ధిగలవాడై శివభక్తునకు ఏ విధమైన హానియూ కలిగించలేదు.

**అథ ద్రౌణిరిదం విశ్వం కృత్స్నం కర్తుమపాండవమ్ ।**
**ఉత్తరాగర్భగం బాలం నాశితుం మన ఆదధే ॥ 33 ॥**

అంతట అశ్వత్థామ సమస్త జగత్తును అపాండవం చేయడానికి ఉత్తరాగర్భమునందున్న బాలుని సంహరించడానికి నిశ్చయించాడు.

**బ్రహ్మాస్త్రమనివార్యం తదన్యైరస్త్రైర్మహాప్రభమ్ ।**
**ఉత్తరాగర్భముద్దిశ్య చిక్షేప స మహాప్రభుః ॥ 34 ॥**

ఇతరాస్త్రాలచే అనివార్యమైనదియు, గొప్ప సమర్థుడగు అశ్వత్థామ బ్రహ్మాస్త్రాన్ని ఉత్తరాగర్భాన్ని ఉద్దేశించి ప్రయోగించాడు.

**తతశ్చ సోత్తరా జిష్ణువధూర్వికలమానసా ।**
**కృష్ణం తుష్టావ లక్ష్మీశం దహ్యమానా తదస్త్రతః ॥ 35 ॥**

అభిమన్యుని పత్నియైన ఉత్తర అప్పుడు వికలమనస్కురాలై, ఆ అస్త్రంచే పీడను పొందినదై, లక్ష్మీపతియైన కృష్ణుని స్తుతించింది.

**తతః కృష్ణః శివం ధ్యాత్వా హృదా నుత్వా ప్రణమ్య చ ।**
**అపాండవమిదం కర్తుం ద్రౌణేరస్త్రమబుధ్యత ॥ 36 ॥**

అంతట కృష్ణుడు హృదయంలో శివుని ధ్యానించి, స్తుతించి, ప్రణమిల్లి, – 'ఈజగత్తులో పాండవులు లేకుండా చేయడానికి అశ్వత్థామ అస్త్రాన్ని ప్రయోగించాడని తెలుసుకున్నాడు.

**స్వరక్షార్థేంద్రదత్తేన తదస్త్రేణ సువర్చసా ।**
**సుదర్శనేన తస్యాశ్చ వ్యధాద్రక్షాం శివాజ్ఞయా ॥ 37 ॥**

అంతట కృష్ణుడు శివాజ్ఞను పొంది, తన రక్షణకొరకు శివుడు ఇచ్చిన గొప్పతేజస్సు గల సుదర్శనాస్త్రంతో ఉత్తరాగర్భాన్ని రక్షించాడు.

**స్వరూపం శంకరాదేశాత్కృతం శైవవరేణ హ ।**
**కృష్ణేన చరితం జ్ఞాత్వా విమనస్కః శనైరభూత్ ॥ 38 ॥**

శివభక్తాగ్రగణ్యుడగు కృష్ణుడు శంకరుని ఆదేశంచే తన అస్త్రాన్ని వ్యర్థంచేశాడని అశ్వత్థామ తెలుసుకొని, తన మనస్సులోని వైమనస్యాన్ని మెల్లగా తొలగించుకున్నాడు.

**తతస్స కృష్ణః ప్రీతాత్మా పాండవాన్సకలానపి ।**
**అపాతయత్తదంఘ్ర్యోస్తు తుష్టయే తస్య శైవరాట్ ॥ 39 ॥**

అంతట శివభక్తాగ్రగణ్యుడగు శ్రీకృష్ణుడు ప్రీతాత్ముడై అశ్వత్థామను సంతోషపెట్టడానికి పాండవులనందరిని అతని కాళ్లపై పడవేశాడు.

**అథ ద్రౌణిః ప్రసన్నాత్మా పాండవాన్కృష్ణమేవ చ ।**
**నానా వరాన్దదౌ ప్రీత్యా సోఽశ్వత్థామానుగృహ్య చ ॥ 40 ॥**

అపుడు ద్రోణపుత్రుడు ప్రసన్నాత్ముడై పాండవులను, శ్రీకృష్ణుని అనుగ్రహించి ప్రేమతో అనేక వరాలనిచ్చాడు.

**ఇత్థం మహేశ్వరస్తాత చక్రే లీలాం పరాం ప్రభుః ।**
**అవతీర్య క్షితౌ ద్రౌణిరూపేణ మునిసత్తమ! ॥ 41 ॥**

వత్సా! ఈ విధంగా మహేశ్వరప్రభువు భూమిపై అశ్వత్థామరూపంలో అవతరించి గొప్పలీలను ప్రదర్శించాడు.

**శివావతారోఽశ్వత్థామా మహాబలపరాక్రమః ।**
**త్రైలోక్యసుఖదోఽద్యాపి వర్తతే జాహ్నవీతటే ॥ 42 ॥**

మహాబలపరాక్రమములు గలవాడు, శివావతారుడు, ముల్లోకాలకు సుఖాలనిచ్చేవాడునగు అశ్వత్థామ ఈనాటికి గంగాతీరంలో ఉన్నాడు.

**అశ్వత్థామావతారస్తే వర్ణితశ్శంకరప్రభోః ।**
**సర్వసిద్ధికరశ్చాపి భక్తాభీష్టఫలప్రదః ॥ 43 ॥**

సర్వసిద్ధులనిచ్చేదీ, భక్తులకు అభీష్టాలనిచ్చేదీ అయిన శంకరప్రభువుయొక్క అశ్వత్థామావతారాన్ని నీకు వర్ణించి చెప్పాను.

**య ఇదం శృణుయాద్భక్త్యా కీర్తయేద్వా సమాహితః ।**
**స సిద్ధిం ప్రాప్నుయాదిష్టామన్తే శివపురం వ్రజేత్ ॥ 44 ॥**

దీనిని భక్తితో విన్నవాడు, సమాహితచిత్తుడై కీర్తించినవాడు ఇష్టసిద్ధిని పొంది దేహత్యాగానంతరం శివపురం చేరుతాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం అశ్వత్థామశివావతారవర్ణనం నామ షట్త్రింశోఽధ్యాయః ॥ 36 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు అశ్వత్థామావతారవర్ణనం అనే పేరుగల ముప్ఫైఆరవ అధ్యాయం సమాప్తం.

❀

## సప్తత్రింశోఽధ్యాయః - ముప్పైఏడవ అధ్యాయం

## కిరాతావతారవర్ణనప్రసంగేఽర్జునాయ వ్యాసోపదేశవర్ణనమ్ -

## కిరాతావతారవర్ణనప్రసంగంలో అర్జునునకు వ్యాసోపదేశవర్ణనం

**నందీశ్వర ఉవాచ -** నందీశ్వరుడు పలికాడు.

**శృణు ప్రాజ్ఞ! కిరాతాఖ్యమవతారం పినాకినః ।**
**మూకం చ హతవాన్ప్రీతో యోఽర్జునాయ వరం దదౌ ॥ 1 ॥**

ప్రాజ్ఞా! పినాకధారియైన శివుడు కిరాతావతారాన్ని ధరించి మూకుని సంహరించి ప్రీతితో అర్జునునకు వరమునిచ్చిన గాథను వినుము.

**సుయోధనజితాస్తే వై పాండవాః ప్రవరాశ్చ తే ।**
**ద్రౌపద్యా చ తయా సాధ్వ్యా ద్వైతాఖ్యం వనమాయయుః ॥ 2 ॥**

పాండవవీరులు సుయోధనునిచే ఓడింపబడి పతివ్రతయగు ద్రౌపదితో గూడి ద్వైతవనానికి వెళ్లారు.

**తత్రైవ సూర్యదత్తాం వై స్థాలీం చాశ్రిత్య తే తదా ।**
**కాలం చ వాహయామాసుః సుఖేన కిల పాండవాః ॥ 3 ॥**

పాండవులు అక్కడే సూర్యదత్తమైన అక్షయపాత్రను ఆధారంగా చేసుకొని సుఖంగా కాలాన్ని గడుపుతున్నారు.

**ఛలార్థం ప్రేరితస్తేన దుర్వాసా మునిపుంగవః ।**
**సుయోధనేన విప్రేంద్ర! పాండవాంతికమాదరాత్ ॥ 4 ॥**

ఓ విప్రేంద్రా! సుయోధనుడు మోసబుద్ధితో ప్రేరేపించగా దుర్వాసమహర్షి పాండవులవద్దకు సాదరంగా విచ్చేశాడు.

**ఛాత్రైః స్వైర్వాయుతైస్సార్ధం యయాచే తత్ర తాన్ముదా ।**
**భోజ్యం చిత్తేప్సితం వై స తేభ్యశ్చైవ సమాగతః ॥ 5 ॥**

అతడు తన పదివేల మంది శిష్యులతో గూడి అచ్చటకు ఆనందంగా వచ్చి వారిని కలిసి తమ మనస్సునకు నచ్చిన భోజనాన్ని ఇమ్మని కోరాడు.

**స్వీకృత్య పాండవైస్తైస్తైః స్నానార్థం ప్రేషితాస్తదా ।**
**దుర్వాసఃప్రముఖాశ్చైవ మునయశ్చ తపస్వినః ॥ 6 ॥**

పాండవులాతని కోర్కెను స్వీకరించి, వారిని స్నానం చేయటానికి పంపారు. అప్పుడు దుర్వాసుడు, తపశ్శాలురు, మునులునైన ఆతని శిష్యులు కూడా స్నానానికి వెళ్లారు.

**అథ తే పాండవాః సర్వే అన్నాభావాన్మునీశ్వర! ।**
**దుఃఖితాశ్చ తదా ప్రాణాంస్త్యక్తుం చిత్తే సమాదధుః ॥ 7 ॥**

సనత్కుమారా! అపుడు పాండవులందరూ అన్నం లేకపోవటంచేత దుఃఖితులై ప్రాణాలను వీడడానికి మనస్సులో నిశ్చయించుకొన్నారు.

**ద్రౌపద్యా చ స్మృతః కృష్ణ ఆగతస్తత్క్షణాదపి ।**
**శాకం చ భక్షయిత్వా తు తేషాం తృప్తిం సమాదధత్ ॥ 8 ॥**

అప్పుడు ద్రౌపది శ్రీకృష్ణుని స్మరించగా, శ్రీకృష్ణుడు వెంటనే అచటకు వచ్చి కూరగాయను తిని వారికందరికి తృప్తిని కలిగించాడు.

**దుర్వాసాశ్చ తదా శిష్యాన్ తృప్తాన్ జ్ఞాత్వా యయౌ పునః ।**
**పాండవాః కృచ్ఛ్రనిర్ముక్తాః కృష్ణస్య కృపయా తదా ॥ 9 ॥**

తన శిష్యులందరు తృప్తులైనారని విని దుర్వాసమహర్షి మరలి పోయాడు. ఆ విధంగా శ్రీకృష్ణుని దయచే పాండవులు కష్టంనుండి గట్టెక్కారు.

**అథ తే పాండవాః కృష్ణం పప్రచ్ఛుః కిం భవిష్యతి ।**
**బలవాన్ శత్రురుత్పన్నః కిం కార్యం తద్వద ప్రభో! ॥ 10 ॥**

అంతట ఆ పాండవులు శ్రీకృష్ణునితో ప్రభూ! "ఏమి జరుగబోతోంది? బలవంతుడైన శత్రువు వచ్చాడు. ఏమి చేయాలి? ఈ విషయాన్ని చెప్పండి" అని ప్రశ్నించారు.

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఇతి పృష్టస్తదా తైస్తు శ్రీకృష్ణః పాండవైర్మునే! ।**
**స్మృత్వా శివపదాంభోజౌ పాండవానిదమబ్రవీత్ ॥ 11 ॥**

పాండవులిట్లు ప్రశ్నించగా శ్రీకృష్ణుడు శివుని పాదపద్మాలను స్మరించి పాండవులతో ఇలా పలికాడు.

**శ్రీకృష్ణ ఉవాచ** - శ్రీకృష్ణుడు పలికాడు.

**శ్రూయతాం పాండవాః! శ్రేష్ఠాః శ్రుత్వా కర్తవ్యమేవ హి ।**
**మద్వృత్తాంతం విశేషేణ శివసేవాసమన్వితమ్ ॥ 12 ॥**

శ్రేష్ఠులగు పాండవులారా! వినండి. శివుని సేవతో నిండియున్న నా గాథను శ్రద్ధగా విని, చెప్పిన విధంగా ఆచరించండి.

**ద్వారకాం చ మయా గత్వా శత్రూణాం విజిగీషయా ।**
**విచార్య చోపదేశాంశ్చ ఉపమన్యోర్మహాత్మనః ॥ 13 ॥**

నేను శత్రువులను జయించే కోరికతో ద్వారకకు వెళ్లి, మహాత్ముడగు ఉపమన్యుని ఉపదేశాలను విచారించాను.

**మయా హ్యారాధితః శంభుః ప్రసన్నః పరమేశ్వరః ।**
**బటుకే పర్వతశ్రేష్ఠే సప్తమాసం సుసేవితః ॥ 14 ॥**

పర్వతరాజమగు 'బటుకము'నందు ఏడు నెలలు పరమేశ్వరుడగు శంభుని చక్కగా పూజించి ప్రసన్నుని చేసుకున్నాను.

**ఇష్టాన్కామానదాన్మహ్యం విశ్వేశశ్చ స్వయం స్థితః ।**
**తత్ప్రభావాన్మయా సర్వసామర్థ్యం లబ్ధముత్తమమ్ ॥ 15 ॥**

విశ్వేశ్వరుడు స్వయంగా సాక్షాత్కరించి, నాకు నచ్చిన కోర్కెల నిచ్చాడు. వాటి ప్రభావంచేతనే ఉత్తమమైన సర్వసామర్థ్యాలను పొందియున్నాను.

**ఇదానీం సేవ్యతే దేవో భుక్తిముక్తిఫలప్రదః ।**
**యూయం సేవత తం శంభుమపి సర్వసుఖావహమ్ ॥ 16 ॥**

భుక్తిముక్తి ఫలప్రదుడైన, ఆ దేవుని నేనిప్పటికి కూడా సేవిస్తూనే యున్నాను. మీరు కూడ సర్వసుఖాలనిచ్చే ఆ శంభుని సేవించండి.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వాంతర్దధే కృష్ణ ఆశ్వాస్యాథ చ పాండవాన్ ।**
**ద్వారకామగమచ్ఛీఘ్రం స్మరన్ శివపదాంబుజమ్ ॥ 17 ॥**

శ్రీకృష్ణుడిట్లు పలికి పాండవులనోదార్చి అంతర్ధానం పొందాడు. వెంటనే శివుని పాదపద్మాలను స్మరిస్తూ ద్వారకకు చేరాడు.

**పాండవా అథ భిల్లంచ ప్రేషయామాసురోజసా ।**
**గుణానాం చ పరీక్షార్థం తస్య దుర్యోధనస్య చ ॥ 18 ॥**

అనంతరం పాండవులు ఆ దుర్యోధనుని గుణాలను పరీక్షించడానికి ఒక వేటగాణ్ణి పంపించారు.

**సోఽపి సర్వం చ తత్రత్యం దుర్యోధనగుణోదయమ్ ।**
**సమీచీనం చ తత్ జ్ఞాత్వా పునః ప్రాప ప్రభూన్ప్రతి ॥ 19 ॥**

మునిశ్రేష్ఠా! ఆ వేటగాడు ఆ రాజ్యంలో దుర్యోధనుని గుణముల వికాసమును బాగుగా నెరిగి, అచటి వృత్తాంతమునంతటినీ చక్కగా సేకరించి, మరల పాండవుల వద్దకు తిరిగి వచ్చాడు.

**తదుక్తం తే నిశమ్యైవం దుఃఖం ప్రాపుర్మునీశ్వర! ।**
**పరస్పరం సమూచుస్తే పాండవా అతిదుఃఖితాః ॥ 20 ॥**

ఓ మునీశ్వరా! అతడు చెప్పిన వార్తను విని పాండవులు మిక్కిలి దుఃఖాన్ని పొందినవారై వారిలో వారు సంప్రదించుకొన్నారు.

**కిం కర్తవ్యం క్వ గంతవ్యమస్మాభిరధునా యుధి ।**
**సమర్థా అపి వై సర్వే సత్యపాశేన యంత్రితాః ॥ 21 ॥**

ఇప్పుడు మనం ఎక్కడకు పోవాలి? ఏమి చేయాలి? మన మందరమూ సమర్థులమైనప్పటికీ, సత్యపాశంచే కట్టుబడి ఉన్నాము.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఏతస్మిన్సమయే వ్యాసో భస్మభూషితమస్తకః ।**
**రుద్రాక్షాభరణశ్చాయాజ్జటాజూటవిభూషితః ॥ 22 ॥**

**పంచాక్షరం జపన్మంత్రం శివప్రేమసమాకులః ।**
**తేజసాం చ స్వయం రాశిః సాక్షాద్ధర్మ ఇవాపరః ॥ 23 ॥**

**తం దృష్ట్వా తే తదా ప్రీతా ఉత్థాయ పురతః స్థితాః ।**
**దత్త్వాసనం తదా తస్మై కుశాజినసుశోభితమ్ ॥ 24 ॥**

**తత్రోపవిష్టం తం వ్యాసం పూజయంతి స్మ హర్షితాః ।**
**స్తుతిం చ వివిధాం కృత్వా ధన్యాః స్మ ఇతి వాదినః ॥ 25 ॥**

ఇదే సమయంలో అచ్చటకు విభూతితో అలంకరింపబడిన లలాటం గలవాడును, రుద్రాక్షలే ఆభరణాలుగా గలవాడును, జటాజూటంతో ప్రకాశించువాడును, శివునియందు ప్రేమతో నిండిన హృదయం గలవాడును, తేజోమూర్తియును, ధర్మమే స్వయంగా రూపుదాల్చినట్లున్నవాడునునగు వ్యాసుడు అక్కడకు రాగా వారు ఆయనను చూచి ఆనందంతో లేచి, ఆయన యెదుట నిలబడి, దర్భలు, లేడి చర్మంతో శోభిల్లే ఆసనాన్ని, ఆయనకు సమకూర్చారు. అక్కడ కూర్చున్న వ్యాసుని వారు ఆనందంతో పూజించి వివిధ స్తోత్రాలను గావించి 'మేము ధన్యులమయ్యాము' అని పలికారు.

**తపశ్చైవ సుసంతప్తం దానాని వివిధాని చ ।**
**తత్సర్వం సఫలం జాతం తృప్తాస్తే దర్శనాత్ప్రభో! ॥ 26 ॥**

ఓ ప్రభూ! మేము చేసిన గొప్ప తపస్సు, వివిధ దానాలు ఈ సర్వం నీ దర్శనంచే సఫలమయ్యాయి. మేము తృప్తిని చెందాము.

**దుఃఖం చ దూరతో జాతం దర్శనాత్తే పితామహ! ।**
**దుష్టైశ్చైవ మహాదుఃఖం దత్తం నః క్రూరకర్మభిః ॥ 27 ॥**

ఓ పితామహా! నీ దర్శనంచే మా దుఃఖం దూరమయ్యింది. దుష్టులు క్రూరమైన కర్మల నాచరించి మాకు మహాదుఃఖాన్ని కలిగించారు.

**శ్రీమతాం దర్శనే జాతే దుఃఖం చైవ గమిష్యతి ।**
**కదాచిన్న గతం తత్ర నిశ్చయోఽయం విచారితః ॥ 28 ॥**

మహాత్ముల దర్శనంచే దుఃఖం దూరమౌతుంది. అప్పుడు కూడా దుఃఖం దూరం కానిచో, ఈ విధంగా విచారణ చేసి నిశ్చయించాలి.

**మహతామాశ్రమే ప్రాప్తే సమర్థే సర్వకర్మణి ।**
**యది దుఃఖం న గచ్ఛేత్తు దైవమేవాత్ర కారణమ్ ॥ 29 ॥**

మహాత్ముల సన్నిధి సర్వకర్మల్ని సిద్ధింపజేస్తుంది. అట్టి సన్నిధిలో కూడ దుఃఖం దూరం కానిచో, ఆ దుఃఖానికి దైవమే కారణమని నిశ్చయించాలి.

**నిశ్చయేనైవ గచ్ఛేత్తు దారిద్ర్యం దుఃఖకారణమ్ ।**
**మహతాం చ స్వభావోఽయం కల్పవృక్షసమో మతః ॥ 30 ॥**

దారిద్ర్యం దుఃఖానికి హేతువైనచో, అది తప్పక తొలగిపోతుంది. మహాత్ములు కల్పవృక్షం వంటివారు, దారిద్ర్యాన్ని తొలగింపజేయడం వారికి అతి సహజమైన పని.

**తద్గుణానేవ గణయేన్మహతో వస్తుమాత్రతః ।**
**ఆశ్రయస్య వశాదేవ పుంసో వై జాయతే ప్రభో ॥ 31 ॥**

ఓ ప్రభూ! మహాత్ముడైన వ్యక్తి సర్వప్రాణులకు ఆశ్రయమైన ఆత్మవస్తువును మాత్రమే దర్శిస్తాడు. దాని ప్రభావంచే అతడు ఇతరులలోని గుణాలను మాత్రమే పరిగణనలోనికి తీసుకుంటాడు.

**లఘుత్వం చ మహత్త్వం చ నాత్ర కార్యా విచారణా ।**
**ఉత్తమానాం స్వభావోఽయం యద్దీనప్రతిపాలనమ్ ॥ 32 ॥**

మహాత్ములు ఇతరులలోని చిన్న పెద్ద తేడాలను విచారించరు. దీనులను రక్షించుట మహాత్ములకు సహజ–స్వభావం.

**రంకస్య లక్షణం లోకే హ్యతిశ్రేయస్కరం మతమ్ ।**
**పురోఽస్య పరయత్నే వై సుజనానాం చ సేవనమ్ ॥ 33 ॥**

దారిద్ర్యం కూడ లోకంలో మానవునికి గొప్పశ్రేయస్సునిస్తుందని చెప్పబడింది. అట్టివాడు తన వద్దనున్న అవకాశాన్ని వినియోగించుకొని సత్పురుషులను సేవించాలి.

**అతః పరం చ భాగ్యం వై దోషశ్చైవ న దీయతామ్ ।**
**ఏతస్మాత్కారణాత్స్వామిన్! త్వయి హృష్టో శుభం తదా ॥ 34 ॥**

స్వామీ! అటు పిమ్మట వారి భాగ్యాన్ని బట్టి కలుగుతుంది. దాని విషయమై దోషమును పట్టుట కుదరదు. ఈ కారణం- చేత మీ దర్శనం శుభకరమని చెప్పవచ్చును.

**త్వదాగమనమాత్రేణ సంతుష్టాని మనాంసి నః ।**
**దిశోపదేశం యేనాశు దుఃఖం నష్టం భవేచ్చ నః ॥ 35 ॥**

ఓ స్వామీ! నీరాక మాత్రంచేతనే మా మనస్సులు సంతోషంతో నిండిపోయాయి. మా దుఃఖాన్ని శీఘ్రంగా పోగొట్టే ఉపదేశాన్ని మాకు అనుగ్రహించండి.

**నందీశ్వర ఉవాచ -** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యేతద్వచనం శ్రుత్వా పాండవానాం మహామునిః ।**
**ప్రసన్నమానసో భూత్వా వ్యాసశ్చైవాబ్రవీదిదమ్ ॥ 36 ॥**

పాండవుల ఈ మాటలను విని, వ్యాసముని ప్రసన్నమైన మనస్సుతో వారితో ఇలా పలికాడు.

**హే పాండవాశ్చ యూయం వై న కష్టం కర్తుమర్హథ ।**
**ధన్యాః స్థ కృతకృత్యాః స్థ సత్యం నైవ విలోపితమ్ ॥ 37 ॥**

ఓ పాండవులారా! మీరిట్లు కష్టాలపాలగుటకు తగరు. అయిననూ మీయందు సత్యం లోపించలేదు. మీరు ధన్యులు. కృతార్థులు.

**సుజనానాం స్వభావోఽయం ప్రాణాంతేఽపి సుశోభనః ।**
**ధర్మం త్యజంతి నైవాత్ర సత్యం సఫలభాజనమ్ ॥ 38 ॥**

జీవితానికి సార్థక్యాన్ని కలిగించే ధర్మాన్ని, సత్యాన్ని, ప్రాణాపాయస్థితిలోనైననూ విడనాడకపోవుట సత్పురుషుల స్వభావం.

**అస్మాకం చైవ యూయం చ తే చాపి సమతాం గతాః ।**
**తథాఽపి పక్షపాతో వై ధర్మిష్ఠానాం మతో బుధైః ॥ 39 ॥**

మాకు పాండవులందు, కౌరవులందు కూడ సమానభావమే కలదు. అయినను ధర్మాత్ములయందు పక్షపాతం కలిగియుండడం విద్వాంసులకు సమ్మతం.

**ధృతరాష్ట్రేన దుష్టేన ప్రథమం చ హ్యచక్షుషా ।**
**ధర్మస్త్యక్తః స్వయం లోభాద్యుష్మాకం రాజ్యమాహృతమ్ ॥ 40 ॥**

ధృతరాష్ట్రుడు దుష్టుడు, ఆది నుండి అంధుడు, అతడు ధర్మాన్ని విడనాడి లోభంచే స్వయంగా మీ రాజ్యాన్ని అపహరించాడు.

**తస్య యూయం చ తే చాపి పుత్రా ఏవ న సంశయః ।**
**పితర్యుపరతే బాలా అనుకంప్యా మహాత్మనః ॥ 41 ॥**

వానికి మీరు, వారు కూడ పుత్రులే అవుతారనడంలో సందేహం లేదు. మీ తండ్రి స్వర్గస్థుడైన పిమ్మట మహాత్ములైన మీపై ప్రేమను చూపించాలి.

**పశ్చాత్పుత్రశ్చ తేనైవ వారితో న కదాచన ।**
**అనర్థో నైవ జాయేత యచ్చైవం చ కృతం తదా ॥ 42 ॥**

అంతేగాదు, అతడు తన పుత్రుని ఏనాడూ దురాశలనుండి వారించలేదు. ఆనాడు అట్లు వారించి యున్నచో ఈనాడు ఈ అనర్థం జరిగియుండేది కాదు.

**అతః పరం చ యజ్జాతం తజ్జాతం నాన్యథా భవేత్ ।**
**అయం దుష్టో భవంతశ్చ ధర్మిష్ఠాః సత్యవాదినః ॥ 43 ॥**

ఇటుపై విధి యెలా ఉంటే అలా జరుగుతుంది. దుర్యోధనుడు దుష్టుడు. మీరు ధర్మాత్ములు, సత్యవాదులు.

**తస్మాదంతే చ తస్యైవాశుభం హి భవితా ధ్రువమ్ ।**
**యచ్చైవ వాపితం బీజం తత్ప్రరోహో భవేదిహ ॥ 44 ॥**

కాబట్టి చివరకు అశుభానికి వినాశం తప్పదు. ఎట్టి బీజం నాటితే అట్టి మొలకే వస్తుంది గదా!

**తస్మాద్దుఃఖం న కర్తవ్యం భవద్భిః సర్వథా ధ్రువమ్ ।**
**భవిష్యతి శుభం వో హి నాత్ర కార్యా విచారణా ॥ 45 ॥**

కాబట్టి మీరు ఎట్టి పరిస్థితులలోను దుఃఖింపవద్దు. మీకు అన్ని విధాలుగా శుభం కలుగుతుంది. ఇందులో సందేహం లేదు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వా పాండవాః సర్వే తేన వ్యాసేన ప్రీణితాః ।**
**యుధిష్ఠిరముఖాస్తే చ పునరేవాబ్రువన్వచః ॥ 46 ॥**

వ్యాసుడిట్లు పలుకగా, యుధిష్ఠిరాది పాండవులందరూ సంతోషించి మరలా ఇట్లు పలికారు.

**పాండవా ఊచుః –** పాండవులు పలికారు.

**సత్యముక్తం త్వయా నాథ! దుష్టైర్దుఃఖం నిరంతరమ్ ।**
**దుష్టాత్మభిర్వనే చాపి దీయతే హి ముహుర్ముహుః ॥ 47 ॥**

ప్రభూ! మీరు సత్యాన్నే పలికారు. ఆ దుర్మార్గులు నిరంతరంగా, వనంలో కూడ దుఃఖాన్ని కలిగిస్తూనే యున్నారు.

**తన్నాశయాశుభం మేఽద్య కించిద్దేయం శుభం విభో! ।**
**కృష్ణేన కథితం పూర్వమారాధ్యశ్శంకరస్సదా ॥ 48 ॥**

ఓ విభూ! కావున నీవు అశుభాన్ని నశింపజేయి. శుభమార్గాన్ని ఉపదేశించు. సర్వదా శంకరుని ఆరాధించాలని పూర్వం కృష్ణపరమాత్మ చెప్పియున్నాడు.

**ప్రమాదశ్చ కృతోఽస్మాభిస్తద్వచశ్శిథిలీకృతమ్ ।**
**స దేవమార్గస్తు పునరిదానీముపదిశ్యతామ్ ॥ 49 ॥**

మేము పొరపాటు చేశాము. ఆ మాటను సరిగా పాటించలేదు. ఓ దేవా! అదే మార్గాన్ని మరల ఇప్పుడుపదేశించండి.

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యేతద్వచనం శ్రుత్వా వ్యాసో హర్షసమన్వితః ।**
**ఉవాచ పాండవాన్ప్రీత్యా స్మృత్వా శివపదాంబుజమ్ ॥ 50 ॥**

ఈ మాటలను విని వ్యాసుడు మిక్కిలి ఆనందించి, శివుని పాదపద్మాలను స్మరించి, పాండవులనుద్దేశించి ప్రీతితో ఇట్లు పలికాడు.

**వ్యాస ఉవాచ** - వ్యాసుడు పలికాడు.

**శ్రూయతాం వచనం మేఽద్య పాండవా ధర్మబుద్ధయః ।**
**సత్యముక్తం తు కృష్ణేన మయా సంసేవ్యతే శివః ॥ 51 ॥**

ధర్మబుద్ధి గల పాండవులారా! ఇప్పుడు నా మాటను వినండి. శ్రీకృష్ణుడు సత్యమునే పలికాడు. నేను కూడ శివుని చక్కగా సేవిస్తూ ఉన్నాను.

**భవద్భిః సేవ్యతాం ప్రీత్యా సుఖం స్యాదతులం సదా ।**
**సర్వదుఃఖం భవత్యేవ శివాసేవాత ఏవ హి ॥ 52 ॥**

మీరు కూడ ప్రీతితో సేవించండి. మీకు సర్వదా సాటిలేని సుఖం కలుగుతుంది. శివుని సేవించకపోవడం వల్లనే దుఃఖాలన్నీ కలుగుతాయి సుమా!

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**అథ పంచసు తేష్వేవ విచార్య శివపూజనే ।**
**అర్జునం యోగ్యముచ్చార్య వ్యాసో మునివరస్తథా ॥ 53 ॥**

వ్యాసమహర్షి విచారణ చేసి, పాండవులయిదుగురిలో అర్జునుడు యోగ్యుడని నిర్ధారించాడు.

**తపః స్థానం విచార్యైవం తతస్స మునిసత్తమః ।**
**పాండవాన్ ధర్మసన్నిష్ఠాన్పునరేవాబ్రవీదిదమ్ ॥ 54 ॥**

అనంతరం వ్యాసమహర్షి, తపస్సు చేయదగిన స్థానాన్ని నిర్ణయించి, ధర్మనిష్ఠులైన పాండవులతో మరలా ఇలా పలికాడు.

**వ్యాస ఉవాచ –** వ్యాసుడు పలికాడు.

**శ్రూయతాం పాండవాస్సర్వే కథయామి హితం సదా ।**
**శివం సర్వం పరం దృష్ట్వా పరం బ్రహ్మ సతాంగతిమ్ ॥ 55 ॥**

పాండవులారా! మీరందరు వినండి. నేను ఎల్లపుడూ హితాన్నే చెబుతాను. సర్వమూ శివుడే. పరబ్రహ్మ, ఉత్తములకు దిక్కుగనున్న శివుని దర్శించుటయే పరమగతి.

**బ్రహ్మాది త్రిపరార్ధాన్తం యత్కించిద్దృశ్యతే జగత్ ।**
**తత్సర్వం శివరూపం చ పూజ్యం ధ్యేయం చ తత్పునః ॥ 56 ॥**

బ్రహ్మతో మొదలిడి అనంతం వరకు ఏ జగత్తు కనబడుతోందో, ఆ సర్వమూ శివస్వరూపమని ఎరింగి పూజించి ధ్యానించాలి.

**సర్వేషాం చైవ సేవ్యోఽసౌ శంకరస్సర్వదుఃఖహా ।**
**శివః స్వల్పేన కాలేన సంప్రసీదతి భక్తితః ॥ 57 ॥**

సర్వదుఃఖాలను పోగొట్టు శివుడు సర్వులకు సేవనీయుడు. మంగళకరుడైన శివుడు భక్తిచే స్వల్పకాలంలో సంప్రీతుడౌతాడు.

**సుప్రసన్నో మహేశో హి భక్తేభ్యః సకలప్రదః ।**
**భుక్తిం ముక్తిమిహాముత్ర యచ్ఛతీతి సునిశ్చితమ్ ॥ 58 ॥**

మహేశ్వరుడు సుప్రసన్నుడై ఇహలోకంలో భుక్తిని, దేహత్యాగానంతరం ముక్తిని, సమస్త ఫలాలను ఇస్తాడనుట సునిశ్చితం.

**తస్మాత్సేవ్యస్సదా శంభుర్భుక్తిముక్తిఫలేప్సుభిః ।**
**పురుషశ్శంకరః సాక్షాద్దుష్టహంతా సతాంగతిః ॥ 59 ॥**

కాబట్టి భుక్తి ముక్తి ఫలాలను కోరువాడు, సత్పురుషులకు శరణ్యుడు, దుష్టహంత, సాక్షాత్తు పురుషుడునైన శంకరుని సర్వదా సేవించాలి.

**పరం తు ప్రథమం శక్రవిద్యాం దృఢమనా జపేత్ ।**
**క్షత్రియస్య పరాఖ్యస్య చేదమేవ సమాహితమ్ ॥ 60 ॥**

అయితే క్షత్రియుడు ముందుగా దృఢమైన మనస్సుతో ఇంద్రవిద్యను జపించాలి. క్షత్రియునకు ఇదియే గొప్ప హితాన్ని చేకూరుస్తుంది.

**అతోఽర్జునశ్చ ప్రథమం శక్రవిద్యాం జపేద్దృఢః ।**
**కరిష్యతి పరీక్షాం ప్రాక్ సంతుష్టస్తద్భవిష్యతి ॥ 61 ॥**

కాబట్టి అర్జునుడు ముందుగా ఇంద్రవిద్యను దృఢమనస్కుడై జపించాలి. ఇంద్రుడు ముందుగా పరీక్ష చేస్తాడు. దానిలో నెగ్గినచో, ఆయన సంతోషాన్ని పొందుతాడు.

**సుప్రసన్నశ్చ విఘ్నాని సంహరిష్యతి సర్వదా ।**
**పునశ్చైవం శివస్యైవ పరం మంత్రం ప్రదాస్యతి ॥ 62 ॥**

ఇంద్రుడు ప్రసన్నుడైనచో, సర్వదా విఘ్నాలను తొలగించి, శివునియొక్క శ్రేష్ఠమైన మంత్రాన్ని ఉపదేశం చేస్తాడు.

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వార్జునమాహూయోపేంద్రవిద్యాముపాదిశత్ ।**
**స్నాత్వా చ ప్రాఙ్ముఖో భూత్వా జగ్రాహార్జున ఉగ్రధీః ॥ 63 ॥**

వ్యాసుడిట్లు పలికి, అర్జునుని తన వద్దకు పిలిచి ఇంద్రవిద్యను ఉపదేశించాడు. అర్జునుడు దృఢనిశ్చయుడై, స్నానం చేసి తూర్పువైపు కూర్చుండి స్వీకరించాడు.

**పార్థివస్య విధానం చ తస్మై మునివరో దదౌ ।**
**ప్రత్యువాచ చ తం వ్యాసో ధనంజయముదారధీః ॥ 64 ॥**

ఉదారబుద్ధిగల వ్యాసమహర్షి ధనంజయునకు పార్థివలింగపూజావిధానాన్ని కూడ ఉపదేశించి, ఇలా పలికాడు.

**వ్యాస ఉవాచ** - వ్యాసుడు పలికాడు.

**ఇతో గచ్ఛాధునా పార్థ! ఇంద్రకీలే సుశోభనే ।**
**జాహ్నవ్యాశ్చ సమీపే వై స్థిత్వా సమ్యక్ తపః కురు ॥ 65 ॥**

ఓ అర్జునా! ఇచటనుండి ఇప్పుడు అతి సుందరమైన ఇంద్రకీలపర్వతానికి వెళ్లుము. గంగానదికి సమీపంలో నుండి చక్కగా తపస్సును చేయుము.

**అదృశ్యా చైవ విద్యా స్యాత్సదా తే హితకారిణీ ।**
**ఇత్యాశిషం దదౌ తస్మై తతః ప్రోవాచ తాన్మునిః ॥ 66 ॥**

ఈ విద్య కంటికి కానరానిదై ఎల్లపుడూ నీ వెంట ఉండి నీకు హితాన్ని కలుగజేస్తుంది. ఆ మహర్షి అతనినట్లు ఆశీర్వదించిన పిమ్మట పాండవులతో ఇట్లన్నాడు.

**ధర్మమాస్థాయ సర్వం వై తిష్ఠంతు నృపసత్తమాః! ।**
**సిద్ధిః స్యాత్సర్వథా శ్రేష్ఠా నాత్ర కార్యా విచారణా ॥ 67 ॥**

ఓ రాజశ్రేష్ఠులారా! మీరందరూ ధర్మమార్గంలో స్థిరంగా నడవండి. మీకు అన్నివిధములుగా శ్రేష్ఠమైన సిద్ధికలుగుతుంది. ఈ విషయంలో సందేహం లేదు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇతి దత్త్వాఽఽశిషం తేభ్యః పాండవేభ్యో మునీశ్వరః ।**
**స్మృత్వా శివపదాంభోజం వ్యాసశ్చాంతర్దధే క్షణాత్ ॥ 68 ॥**

వ్యాసమహర్షి పాండవుల కిట్లు ఆశీస్సులనిచ్చి, శివపాదపద్మాలను స్మరించి, క్షణంలో అంతర్ధానమయ్యాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం కిరాతావతారవర్ణనప్రసంగేఽర్జునాయ వ్యాసోపదేశవర్ణనం నామ సప్తత్రింశోఽధ్యాయః ॥ 37 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు కిరాతావతారవర్ణనప్రసంగంలో అర్జునునకు వ్యాసోపదేశవర్ణనం అనే పేరుగల ముప్పైఏడవ అధ్యాయం సమాప్తం.

## **అష్టాత్రింశోఽధ్యాయః** – ముప్పైఎనిమిదవ అధ్యాయం

## **కిరాతావతారవర్ణనప్రసంగేఽర్జునతపోవర్ణనమ్** – కిరాతావతారవర్ణనంలో అర్జునతపోవర్ణనం

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**అర్జునోఽపి తదా తత్ర దీప్యమానో వ్యదృశ్యత ।**
**మంత్రేణ శివరూపేణ తేజశ్చాతులమావహన్ ॥ 1 ॥**

శివరూపమగు మంత్రంచే సాటిలేని తేజస్సు కలిగిన అర్జునుడు దేదీప్యమానంగా కనిపించాడు.

**సర్వే చార్జునం దృష్ట్వా పాండవా నిశ్చయం గతాః ।**
**జయోఽస్మాకం ధ్రువం జాతం తేజశ్చ విపులం యతః ॥ 2 ॥**

పాండవులందరూ అర్జునుని గాంచి “ఇతనియందింతటి దివ్యతేజస్సు కలదు గాన, మనకు విజయం నిశ్చయం” అని భావించారు.

**ఇదం కార్యం త్వయా సాధ్యం నాన్యేన చ కదాచన ।**
**వ్యాసస్య వచనాద్భాతి సఫలం కురు జీవితమ్ ॥ 3 ॥**

ఈ పనిని నీవు మాత్రమే చేయగలవు. ఇతరులు ఎన్నటికీ చేయజాలరు. వ్యాసుని వచనంచే ఈ సత్యం స్పష్టమయ్యింది. కాబట్టి నీ జీవితాన్ని సఫలం చేసుకొమ్ము.

**ఇతి ప్రోచ్యార్జునం తే వై విరహౌత్సుక్యకాతరాః ।**
**అనిచ్ఛన్తోఽపి తత్రైవ ప్రేషయామాసురాదరాత్ ॥ 4 ॥**

వారిట్లు పలికి విరహదుఃఖాన్ని గూర్చి భయపడుతూ ఇష్టం లేకపోయినప్పటికీ అర్జునుని సాదరంగా అచ్చటకు పంపించారు.

**ద్రౌపదీ దుఃఖసంయుక్తా నేత్రాశ్రూణి నిరుధ్య చ ।**
**ప్రేషయంతీ శుభం వాక్యం తదోవాచ పతివ్రతా ॥ 5 ॥**

పతివ్రతయైన ద్రౌపది దుఃఖంతో నిండిన హృదయంగలదై కన్నీటిని ఆపుకొని అర్జునునకు వీడ్కోలు పలుకుతూ ఈ శుభవచనాలను పలికింది.

**ద్రౌపద్యువాచ** – ద్రౌపది పలికింది.

**వ్యాసోపదిష్టం యద్రాజన్! త్వయా కార్యం ప్రయత్నతః ।**
**శుభప్రదోఽస్తు తే పంథాశ్శంకర శ్శంకరోఽస్తు వై ॥ 6 ॥**

అర్జునా! వ్యాసుని ఉపదేశాన్ని శ్రద్ధగా పాలించు. నీకు మార్గం శుభప్రదమౌ గాక! శంకరుడు నీకు మంగళమును కలిగించు గాక!

**తే సర్వే చావసంస్తత్ర విసృజ్యార్జునమాదరాత్ ।**
**అత్యంతదుఃఖమాపన్నా మిళిత్వా పంచ ఏవ చ ॥ 7 ॥**

తక్కిన పాండవులు, ద్రౌపది కలిసి అర్జునునకు వీడ్కోలు పలికి మహాదుఃఖాన్ని పొందినవారై అక్కడే నివసించారు.

**స్థితాస్తత్ర వదంతి స్మ శ్రూయతాం ఋషిసత్తమ! ।**
**దుఃఖేఽపి ప్రియసంగో వై న దుఃఖాయ ప్రజాయతే ॥ 8 ॥**

ఓ మహర్షీ! వారచ్చట ఉన్నవారై తమలో తామిట్లు మాటాడుకున్నారు వినుము. "ప్రియుని సన్నిధిలో దుఃఖం కలిగిననూ, అది అధికంగా పీడించదు".

**వియోగే ద్విగుణం తస్య దుఃఖం భవతి నిత్యశః ।**
**తత్ర ధైర్యధరస్యాపి కథం ధైర్యం భవేదిహ ॥ 9 ॥**

ప్రియవియోగంలో ఉండగా దుఃఖం కలిగితే, అది నిత్యం రెండు రెట్లు అధికపీడను కలిగిస్తుంది. ధైర్యం గలవానికైననూ, ఆ స్థితిలో ధైర్యం ఎలా నిలబడుతుంది?

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**కుర్వత్స్వేవ తదా దుఃఖం పాండవేషు మునీశ్వరః ।**
**కృపాసింధుశ్చ స వ్యాస ఋషివర్యస్సమాగత ॥ 10 ॥**

ఆ పాండవులీవిధంగా దుఃఖిస్తూ ఉండగా, ఆ సమయంలో దయానిధియైన వ్యాసమహర్షి విచ్చేశాడు.

**తం తదా పాండవాస్తే వై నత్వా సంపూజ్య చాదరాత్ ।**
**దత్త్వాసనం హి దుఃఖాఢ్యాః కరౌ బద్ధ్వా వచోఽబ్రువన్ ॥ 11 ॥**

అపుడు ఆ పాండవులు ఆయనకు నమస్కరించి సాదరంగా పూజించి ఆసనంపై కూర్చుండబెట్టి దుఃఖంతో నిండిన హృదయం గలవారై చేతులు జోడించి ఇలా పలికారు.

**పాండవా ఊచుః –** పాండవులు పలికారు.

**శ్రూయతామృషభశ్రేష్ఠ! దుఃఖదగ్ధా వయం ప్రభో! ।**
**దర్శనం తేఽద్య సంప్రాప్య హ్యానందం ప్రాప్నుమో మునే! ॥ 12 ॥**

ఓ మహర్షీ! ప్రభూ! వ్యాసమునీంద్రా! మేము దుఃఖంచే పీడితులమై యున్నాం. నీ దర్శనంచే ఈనాడు మాకు ఆనందం కలుగుతోంది.

**కియత్కాలం వసాత్రైవ దుఃఖనాశాయ నః ప్రభో! ।**
**దర్శనాత్తవ విప్రర్షేస్సర్వం దుఃఖం విలీయతే ॥ 13 ॥**

మా దుఃఖాన్ని పోగొట్టడానికి మీరు కొంతకాలం ఇచ్చటనే నివసించండి. మీ దర్శనంచే మా దుఃఖమంతా దూరమౌతుంది.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్తస్స ఋషిశ్రేష్ఠో న్యవసత్తత్సుఖాయ వై ।**
**కథాభిర్వివిధాభిశ్చ తద్దుఃఖం నోదయంస్తదా ॥ 14 ॥**

వారిట్లు కోరగా ఆ మహర్షి అచ్చట నివసించి వివిధ గాథలతో వారి దుఃఖాన్ని పోగొట్టి సుఖాన్ని కలిగించాడు.

**వార్తాయాం క్రియమాణాయాం తేన వ్యాసేన సన్మునే! ।**
**సుప్రణమ్య వినీతాత్మా ధర్మరాజోఽబ్రవీదిదమ్ ॥ 15 ॥**

ఓ మహర్షీ! వ్యాసుడీ విధంగా ఒకనాడు ప్రవచనం చేస్తూ ఉండగా వినయశీలుడైన ధర్మరాజు ప్రణమిల్లి ఇలా పలికాడు.

**ధర్మరాజ ఉవాచ –** ధర్మరాజు పలికాడు.

**శృణు త్వం హి ఋషిశ్రేష్ఠ! దుఃఖశాంతిర్మతా మమ ।**
**పృచ్ఛామి త్వాం మహాప్రాజ్ఞ! కథనీయం త్వయా ప్రభో! ॥ 16 ॥**

ఓ మహర్షీ! నీవు విను. నేనీ దుఃఖంయొక్క శాంతినపేక్షిస్తున్నాను. నీవు మహాప్రజ్ఞాశాలివి. నేను నిన్ను ప్రశ్నిస్తున్నాను. నీవు సమాధానం చెప్పాలి.

**ఈదృశం చైవ దుఃఖం చ పురా ప్రాప్తశ్చ కశ్చన ।**
**వయమేవ పరం దుఃఖం ప్రాప్తా వై నైవ కశ్చన ॥ 17 ॥**

ఇటువంటి దుఃఖాన్ని పూర్వం ఎవరైనా పొందారా? లేక మేమే మహాదుఃఖాన్ని పొందుతున్నామా? ఇతరుల–కెవ్వరికీ ఇంత దుఃఖం కలగలేదేమో.

**వ్యాస ఉవాచ –** వ్యాసుడు పలికాడు.

**రాజ్ఞస్తు నలనామ్నో వై నిషధాధిపతేః పురా ।**
**భవద్దుఃఖాధికం దుఃఖం జాతం తస్య మహాత్మనః ॥ 18 ॥**

పూర్వం నిషధదేశాధిపతియైన నలమహారాజునకు మీకంటె అధికమైన దుఃఖం కలుగగా ఆ మహాత్ముడు దానిని సహించాడు.

**హరిశ్చంద్రస్య నృపతేర్జాతం దుఃఖం మహత్తరమ్ ।**
**అకథ్య స్తద్విశేషేణ పరశోకావహం తథా ॥ 19 ॥**

హరిశ్చంద్రమహారాజునకు అంతకంటె అధికమైన దుఃఖం కలిగింది. మహాదుఃఖాన్ని కలిగించే ఆయన కష్టాలను వివరించి చెప్పడం సాధ్యం కాదు.

**దుఃఖస్తథైవ విజ్ఞేయం రామస్యాప్యథ పాండవ! ।**
**యచ్ఛ్రుత్వా స్త్రీనరాణాం చ భవేన్మోహో మహత్తరః ॥ 20 ॥**

ఓ ధర్మరాజా! అదే విధంగా రామునికి కూడా మహాదుఃఖం కలిగింది. ఆ దుఃఖాన్ని గూర్చి విన్న స్త్రీపురుషులందరూ మహామోహాన్ని పొందుతారు.

**తస్మాద్వర్ణయితుం నైవ శక్యతే హి మయా పునః ।**
**శరీరం దుఃఖరాశిం చ మత్వా త్యాజ్యం త్వయాఽధునా ॥ 21 ॥**

కావున ఆ దుఃఖాన్ని మరల వర్ణించే శక్తి నాకు లేదు. ఈ శరీరం దుఃఖనిలయం. నీవీ సత్యాన్ని తెలుసుకొని దుఃఖాన్ని విడనాడు.

**యేనేదంచ ధృతం తేన వ్యాప్తమేవ న సంశయః ।**
**ప్రథమం మాతృగర్భే వై జన్మ దుఃఖస్య కారణమ్ ॥ 22 ॥**

ఏ పరమేశ్వరుడు ఈ జగత్తును ధరిస్తున్నాడో, దీనినంతటనూ ఆయనయే వ్యాపించియున్నాడు. ఇందులో సందేహం లేదు. తల్లిగర్భంలో ప్రవేశించడమే మొట్టమొదటి దుఃఖకారణం.

**కౌమారేఽపి మహాదుఃఖం బాలలీలానుసారి యత్ ।**
**తతోఽపి యౌవనే కామాన్భుంజానో దుఃఖరూపిణః ॥ 23 ॥**

బాలచేష్టలతో కూడిన బాల్యావస్థయందు కూడా మహాదుఃఖం ఉంది. అనంతరం మానవుడు యౌవనంలో దుఃఖాత్మకమైన కోర్కెల ననుభవిస్తాడు.

**గతాగతైర్దినానాం హి కార్యభారైరనేకశః ।**
**ఆయుశ్చ క్షీయతే నిత్యం న జానాతి హ తత్పునః ॥ 24 ॥**

రాత్రింబవళ్లు ఒకదాని తరువాత మరియొకటి క్రమంగా వచ్చిపోతూ ఉంటాయి. అనేక కార్యముల భారం నెత్తిపై పడుతుంది. ప్రతిదినం ఆయుర్దాయం క్షీణిస్తూ ఉంటుంది. కాని మానవుడీ సత్యాన్ని గ్రహించడు.

**అంతే చ మరణం చైవ మహాదుఃఖమతః పరమ్ ।**
**నానానరకపీడాశ్చ భుజ్యంతేఽజ్ఞైర్నరైస్సదా ॥ 25 ॥**

ఆయుర్దాయం పూర్తి కాగానే మరణం సంప్రాప్తమౌతుంది. అనంతరం అజ్ఞులైన జీవులు అనేక నరకపీడల–ననుభవిస్తూ మహాదుఃఖాన్ని పొందుతారు.

**తస్మాదిదమసత్యం చ త్వం తు సత్యం సమాచార ।**
**యేనైవ తుష్యతే శంభుస్తథా కార్యం నరేణ చ ॥ 26 ॥**

కాబట్టి ఈ జగత్తంతయు అసత్యం. నీవు సత్యాన్ని అనుష్ఠించు. ఏ పనిచేస్తే శంభువు సంతుష్టుడౌతాడో, మానవుడాపనిని చేయాలి.

**నందీశ్వర ఉవాచ -** నందీశ్వరుడు పలికాడు.

**ఏవం వివిధవార్తాభిః కాలనిర్యాపణం తదా ।**
**చక్రుస్తే భ్రాతరః సర్వే మనోరథపథైః పునః ॥ 27 ॥**

ఆ సోదరులందరు ఇట్లు వివిధ గాథలను వింటూ, మనోరాజ్యంలో విహరిస్తూ కాలాన్ని గడుపుతున్నారు.

**అర్జునోఽపి స్వయం గచ్ఛన్దుర్గాద్రిషు దృఢవ్రతః ।**
**యక్షం లబ్ధ్వా చ తేనైవ దస్యూన్నిఘ్నన్ననేకశః ॥ 28 ॥**

దృఢవ్రతుడైన అర్జునుడు దుర్గమములైన పర్వతాలయందు సంచరిస్తూ దారిలో ఒక యక్షుని కలుసుకొని అతని ద్వారా చాలా మంది బందిపోటుదొంగలను సంహరించాడు.

**మనసా హర్షసంయుక్తో జగామాచలముత్తమమ్ ।**
**తత్ర గత్వా చ గంగాయాస్సమీపం సుందరం స్థలమ్ ॥ 29 ॥**

అతడు మనస్సులో హర్షంతో కూడినవాడై, ఉత్తమమైన ఇంద్రకీలపర్వతాన్ని చేరుకొని, అచట గంగానదీ-సమీపంలో అందమైన స్థలంలో విడిది చేశాడు.

**అశోకకాననం యత్ర తిష్ఠతి స్వర్గ ఉత్తమః ।**
**తత్ర తస్థౌ స్వయం స్నాత్వా నత్వా చ గురుముత్తమమ్ ॥ 30 ॥**

అశోకవనంతో కూడిన ఆ స్థానం స్వర్గంకంటె ఉత్తమంగా ఉంది. అతడు అక్కడ ఉంటూ, నదిలో స్నానమాడి గురువునకు నమస్కరించాడు.

**యథోపదిష్టం వేషాది తథా చైవాకరోత్స్వయమ్ ।**
**ఇంద్రియాణ్యపకృష్యాదౌ మనసా సంస్థితోఽభవత్ ॥ 31 ॥**

గురువు ఉపదేశించిన విధంగా వేషాదులను ధరించి, ఉపాసన మొదలు పెట్టాడు. ముందుగా ఇంద్రియాలను నిగ్రహించి, మనస్సునందు ఏకాగ్రం చేశాడు.

**పునశ్చ పార్థివం కృత్వా సుందరం సమసూత్రకమ్ ।**
**తదగ్రే ప్రణిదధ్యౌ స తేజోరాశిమనుత్తమమ్ ॥ 32 ॥**

అతడు చక్కని ఆసనంపై కూర్చుండి సుందరమూ, సమపరిమాణమూ గల పార్థివలింగాన్ని చేసి దాని ఎదుట కూర్చుండి సర్వశ్రేష్ఠుడు, తేజోరాశియునైన శివుని ధ్యానించాడు.

**త్రికాలం చైవ సుస్నాతః పూజనం వివిధం తదా ।**
**చకారోపాసనం తత్ర హరస్య చ పునః పునః ॥ 33 ॥**

అతడు మూడు కాలాలలోను స్నానంచేసి, శివుని మాటి మాటికీ అనేవిధముల పూజిస్తూ ఉపాసన చేస్తున్నాడు.

**తస్యైవ శిరసస్తేజో నిస్సృతం తచ్చరాస్తదా ।**
**దృష్ట్వా భయం సమాపన్నాః ప్రవిష్టశ్చ కదాహ్యయమ్ ॥ 34 ॥**

అతని శిరస్సు నుండి తేజస్సు బయల్వెడలుతోంది, దానిని చూచి ఇంద్రుని అనుచరులు భయపడ్డారు. 'ఇతడెప్పుడు ఇచ్చట ప్రవేశించాడు' వారు ఆశ్చర్యాన్ని పొందారు.

**పునస్తే చ విచార్యైవం కథనీయం బిడౌజసే ।**
**ఇత్యుక్త్వా తు గతాస్తే వై శక్రస్యాంతికమంజసా ॥ 35 ॥**

వారు మరలా ఆలోచించుకొని, ఈ విషయాన్ని ఇంద్రునకు చెప్పాలని నిశ్చయించుకొని, వెంటనే ఇంద్రుని వద్దకు వెళ్లారు.

**చరా ఊచుః –** చారులు పలికారు.

**దేవో వాథ ఋషిశ్చైవ సూర్యో వాథ విభావసుః ।**
**తపశ్చరతి దేవేశ! న జానీమో వనే చ తమ్ ॥ 36 ॥**

ఓ దేవేంద్రా! అడవిలో ఒక వ్యక్తి తపస్సు చేస్తున్నాడు. అతడు ఋషియా? దేవతయా? సూర్యుడా? అగ్నియా? అనే విషయం మాకు తెలియడం లేదు.

**తస్యైవ తేజసా దగ్ధా ఆగతాస్తవ సన్నిధౌ ।**
**నివేదితం చరిత్రం తత్క్రియతాముచితం తు యత్ ॥ 37 ॥**

అతని తేజస్సుచే పీడింపబడిన మేము నీ సన్నిధికి వచ్చాము. ఆ వృత్తాంతాన్ని నీకు నివేదించాము. నీవు ఉచితమైన ప్రతిక్రియను ఆచరించు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్తస్తైశ్చరైస్సర్వం జ్ఞాత్వా పుత్రచికీర్షితమ్ ।**
**స గోత్రపాన్విసృజ్యైవ తత్ర గంతుం మనో దధే ॥ 38 ॥**

ఆ అనుచరులిట్లు పలుకగా, ఇంద్రునకు తన కుమారుని సంకల్పం అవగతమయ్యింది. ఆయన ఆ పర్వత రక్షకులనచ్చటకు పంపించి, తానచ్చటకు వెళ్లాలని నిశ్చయించుకున్నాడు.

**స వృద్ధబ్రాహ్మణో భూత్వా బ్రహ్మచారీ శచీపతిః ।**
**జగామ తత్ర విప్రేంద్ర! పరీక్షార్థం హి తస్య వై ॥ 39 ॥**

బ్రాహ్మణశ్రేష్ఠా! ఆ ఇంద్రుడు అర్జునుని పరీక్షించడానికి వృద్ధబ్రాహ్మణబ్రహ్మచారి రూపాన్ని దాల్చి అచ్చటకు వెళ్లాడు.

**తమాగతం తదా దృష్ట్వాఽ ఽకార్షీత్పూజాం చ పాండవః ।**
**స్థితోఽగ్రే చ స్తుతిం కృత్వా క్వాయాతోఽసి వదాధునా ॥ 40 ॥**

అట్లు వచ్చిన బ్రాహ్మణుని చూచి, అర్జునుడు పూజించి, ఎదుట నిలబడి, స్తుతించి "అయ్యా! మీరెచ్చట-నుండి ఇప్పుడిచ్చటకు విచ్చేశారు?" అని అడిగాడు.

**ఇత్యుక్తస్తేన దేవేశో ధైర్యార్థం తస్య ప్రీతితః ।**
**పరీక్షాగర్వితం వాక్యం పాండవం తం తతోఽబ్రవీత్ ॥ 41 ॥**

ఇట్లు ప్రశ్నించగా ఇంద్రుడు ప్రేమతో అతనిని పరీక్షించి ధైర్యాన్ని కలిగించడానికి ఆ పాండుపుత్రునితో గర్వంగా ఇలా పలికాడు.

**బ్రాహ్మణ ఉవాచ** - బ్రాహ్మణుడు పలికాడు.

**నవే వయసి వై తాత! కిం తపస్యసి సాంప్రతమ్ ।**
**ముక్త్యర్థం వా జయార్థం కిం సర్వథైతత్తపస్తవ ॥ 42 ॥**

"వత్సా! నీవిప్పుడు యౌవనంలో నున్నావు. తపస్సు చేయడానికి కారణమేమి? నీయీ తపస్సునకు ముక్తి ప్రధానప్రయోజనమా? లేక యుద్ధంలో జయమా?"

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఇతి పృష్టస్తదా తేన సర్వం సంవేదితం పునః ।**
**తచ్ఛ్రుత్వా స పునర్వాక్యమువాచ బ్రాహ్మణస్తదా ॥ 43 ॥**

ఆ బ్రాహ్మణుడిట్లు ప్రశ్నించగా, అర్జునుడు అంతా విన్నవించాడు. ఆ బ్రాహ్మణుడు మరలా ఇలా పలికాడు.

**బ్రాహ్మణ ఉవాచ** - బ్రాహ్మణుడు పలికాడు.

**యుక్తం న క్రియతే వీర! సుఖం ప్రాప్తుం చ యత్తపః ।**
**క్షాత్రధర్మేణ క్రియతే ముక్త్యర్థం కురుసత్తమ ॥ 44 ॥**

"ఓ వీరా! నీవు క్షత్రియధర్మమైన యుద్ధం ద్వారా సుఖాన్ని పొందాలనుకొని తపస్సు చేయడం ఉచితం కాదు. ఓ కురుసత్తమా! ముక్తికొరకు తపస్సు చేయుము.

**ఇంద్రస్తు సుఖదాతా వై ముక్తిదాతా భవేన్న హి ।**
**తస్మాత్త్వం సర్వథా శ్రేష్ఠ! కర్తుమర్హసి సత్తపః ॥ 45 ॥**

ఇంద్రుడు సుఖాలనిచ్చేవాడేగాని, ముక్తినిచ్చేవాడు కాదు. కావున ఓ వీరా! నీవు సద్రూపుడైన పరమేశ్వరునుద్దేశించి తపస్సు చేయుట నిశ్చయంగా మంచి తపస్సు కాగలదు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇదం తద్వచనం శ్రుత్వా క్రోధం చక్రేఽర్జున స్తదా ।**
**ప్రత్యువాచ వినీతాత్మా తదనాదృత్య సువ్రతః ॥ 46 ॥**

అతని మాటలను విని అర్జుననకు కోపం వచ్చింది. గొప్పవ్రతం గల అర్జునుడు ఆ కోపాన్ని తొలగించుకొని వినయంతో నిండిన మనస్సు గలవాడై ఇలా బదులుపలికాడు.

**అర్జున ఉవాచ –** అర్జునుడు పలికాడు.

**రాజ్యార్థం న చ ముక్త్యర్థం కిమర్థం భాషసే త్విదమ్ ।**
**వ్యాసస్య వచనేనైవ క్రియతే తప ఈదృశమ్ ॥ 47 ॥**

నేను రాజ్యం కొరకు తపస్సు చేస్తున్నాను. ముక్తి కొరకు కాదు. నీవు ఇలా ఎందుకు మాట్లాడుతున్నావు? నేను వ్యాసుని ఆదేశంతో మాత్రమే ఈ తపస్సు చేస్తున్నాను.

**ఇతో గచ్ఛ బ్రహ్మచారిన్మాపాతయితుమిచ్ఛసి ।**
**ప్రయోజనం కిమత్రాస్తి తవ వై బ్రహ్మచారిణః ॥ 48 ॥**

ఓ బ్రహ్మచారీ! నీవు ఇచ్చటనుండి తొలగి పొమ్ము. నన్ను పతితుని చేసే ఇచ్ఛ విడనాడు. బ్రహ్మచారివైన నీకిచ్చట పనియేముంది?

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్తః స ప్రసన్నోఽభూత్సుందరం రూపమద్భుతమ్ ।**
**స్వోపస్కరణసంయుక్తం దర్శయామాస వై నిజమ్ ॥ 49 ॥**

అర్జునుడిట్లు పలుకగా, ఇంద్రుడు ప్రసన్నుడై, వజ్రాద్యాయుధములతో కూడియున్న తన అద్భుత సుందర–రూపాన్ని చూపాడు.

**శక్రరూపం తదా దృష్ట్వా లజ్జితశ్చార్జునస్తదా ।**
**స ఇంద్రస్తం సమాశ్వాస్య పునరేవ వచోఽబ్రవీత్ ॥ 50 ॥**

ఇంద్రుని రూపాన్ని చూచిన అర్జునుడు తన మాటలకు సిగ్గుపడుచుండగా, ఇంద్రుడతనికి నచ్చజెప్పి మరల ఇలా పలికాడు.

**ఇంద్ర ఉవాచ –** ఇంద్రుడు పలికాడు.

**వరం వృణీష్వ హే తాత! ధనంజయ! మహామతే! ।**
**యదిచ్ఛసి మనోభీష్టం నాదేయం విద్యతే తవ ॥ 51 ॥**

ఓ వత్సా! ధనంజయ! మహామతే! నీ మనస్సునకు నచ్చిన అభీష్టవరాన్ని కోరుకొమ్ము. నీకు ఈయదగని వరమేదియు లేదు.

**తచ్ఛ్రుత్వా శక్రవచనం ప్రత్యువాచార్జునస్తదా ।**
**విజయం దేహి మే తాత! శత్రుక్లిష్టస్య సర్వథా ॥ 52 ॥**

అంతట అర్జునుడు ఇంద్రుని మాటలను విని "ఓ తండ్రీ!, నేను అన్ని విధములా శత్రువులచే క్లేశాలకు గురికాబడి యున్నాను. నాకు విజయమునిమ్ము" అని బదులు పలికాడు.

**శక్ర ఉవాచ -** శక్రుడు పలికాడు.

**బలిష్ఠాశ్శత్రవస్తే చ దుర్యోధనపురస్సరాః ।**
**ద్రోణో భీష్మశ్చ కర్ణశ్చ సర్వే తే దుర్జయా ధ్రువమ్ ॥ 53 ॥**

నీకు శత్రువులైన దుర్యోధన, ద్రోణ, భీష్మ, కర్ణాదులందరూ బలవంతులు, దుర్జయులు అనే మాట నిశ్చయం.

**అశ్వత్థామా ద్రోణపుత్రో రౌద్రోంఽశో దుర్జయోఽతి సః ।**
**మయా సాధ్యా భవేయుస్తే సర్వథా స్వహితం శృణు ॥ 54 ॥**

ద్రోణపుత్రుడు, రుద్రాంశసంభూతుడునైన అశ్వత్థామను జయించుట మిక్కిలి కష్టమైన పని. నేను వారిని జయించే ఉపాయాన్ని పరిశీలిస్తాను. నీకు సర్వవిధములుగా హితం కలిగే మార్గాన్ని చెబుతాను విను.

**ఏతద్వీర! జపం కర్తుం న శక్తః కశ్చనాధునా ।**
**వర్తతే హి శివో వర్యస్తస్మాచ్ఛంభోర్జయోఽధునా ॥ 55 ॥**

ఓ వీరా! ఇపుడు ఈ జపం చేయగల వీరుడెవ్వడును లేడు. శివుడు దేవతలలో శ్రేష్ఠుడు. కాబట్టి మహాదేవుని కారణంగానే నీకు జయం కలుగును.

**శంకరః సర్వలోకేశశ్చరాచరపతిః స్వరాట్ ।**
**సర్వం కర్తుం సమర్థోఽస్తి భుక్తిముక్తిఫలప్రదః ॥ 56 ॥**

శంకరుడు సర్వలోకానికి ప్రభువు. స్థావర జంగమాత్మకమైన జగత్తునకు నియంత, సర్వదేవతాసార్వభౌముడు. సర్వమును చేసే సమర్థుడు. భుక్తి, ముక్తి ఫలాలనిచ్చేవాడు ఆయనయే.

**అహం మన్యే చ బ్రహ్మాద్యా విష్ణుః సర్వవరప్రదః ।**
**అన్యే జిగీషవో యే చ తే సర్వే శివపూజకాః ॥ 57 ॥**

బ్రహ్మాదిదేవతలు, సర్వవరప్రదుడైన విష్ణువు మాత్రమేగాక విజయాన్ని కాంక్షించేవారందరూ శివుని పూజిస్తారని నా భావన.

**అద్యప్రభృతి తన్మంత్రం హిత్వా భక్త్యా శివం భజ ।**
**పార్థివేన విధానేన ధ్యానేనైవ శివస్య చ ॥ 58 ॥**

ఈనాటినుండి ఆ ఇంద్రమంత్రాన్ని విడిచి, శివుని సేవించు. పార్థివలింగాన్ని పద్ధతిప్రకారం పూజించి, శివుని ధ్యానించు.

**ఉపచారైరనేకైశ్చ సర్వభావేన భారత! ।**
**సిద్ధిః స్యాదచలా తేఽద్య నాత్ర కార్యా విచారణా ॥ 59 ॥**

ఓ అర్జునా! అనేక ఉపచారాలతో శివుని పూజించు. అన్నీ నీవే అనే భావంతో పూజించు. నీకు నిశ్చయంగా సిద్ధి కలుగుతుంది. ఈ విషయంలో సంశయానికి తావు లేదు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వా చ చరాన్సర్వాన్సమాహూయాబ్రవీదిదమ్ ।**
**సావధానేన వై స్థేయమేతత్సంరక్షణే సదా ॥ 60 ॥**

ఇట్లు పలికి, ఇంద్రుడు తన అనుచరులనందరినీ సమావేశపరచి "మీరు నిత్యం సావధానులై ఉండి ఇతనిని రక్షించండి" అని ఆదేశించాడు.

**ప్రబోధ్య స్వచరానింద్రోఽర్జునసంరక్షణాదికమ్ ।**
**వాత్సల్యపూర్ణహృదయః పునరూచే కపిధ్వజమ్ ॥ 61 ॥**

ప్రేమతో నిండిన హృదయం గల ఇంద్రుడు ఈ విధంగా తన అనుచరులకు అర్జునుని సంరక్షించుట ఇత్యాది కార్యములనప్పగించి, మరల అర్జునునితో ఇలా పలికాడు.

**ఇంద్ర ఉవాచ –** ఇంద్రుడు పలికాడు.

**రాజ్యం త్వయా ప్రమాదాద్వై న కర్తవ్యం కదాచన ।**
**శ్రేయసే భద్ర! విద్యేయం భవేత్తవ పరంతప! ॥ 62 ॥**

ఓ వత్సా! పరంతప! నీవు పొరబడి ఎన్నడూ రాజ్యాన్ని పాలించవద్దు. ఈ విద్య నీకు శ్రేయస్సును కలిగిస్తుంది.

**ధైర్యం ధార్యం సాధకేన సర్వథా రక్షకః శివః ।**
**సంపత్తీశ్చ ఫలం తుల్యం దాస్యతే నాత్ర సంశయః ॥ 63 ॥**

సాధకుడు ధైర్యాన్ని కలిగియుండాలి. శివుడు అన్ని విధములా రక్షించి సంపత్తులను, కర్మానురూపమైన ఫలాన్ని ఇస్తాడనడంలో సంశయం లేదు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇతి దత్త్వా వరం తస్య భారతస్య సురేశ్వరః ।**
**స్మరన్ శివపదాంభోజం జగామ భవనం స్వకమ్ ॥ 64 ॥**

ఈ విధంగా ఇంద్రుడర్జునునకు వరాలనిచ్చి శివుని పాదపద్మాలను స్మరిస్తూ తన భవనానికి వెళ్లాడు.

**అర్జునోఽపి మహావీరస్సుప్రణమ్య సురేశ్వరమ్ ।**
**తపస్తేపే సంయతాత్మా శివముద్దిశ్య తద్విధమ్ ॥ 65 ॥**

మహావీరుడైన అర్జునుడు దేవేంద్రునకు ప్రణమిల్లి ఆయన చెప్పిన విధంగా మనస్సును నియమించి, శివుని ఉద్దేశించి తపస్సు చేశాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం కిరాతావతారవర్ణనప్రసంగేఽర్జున తపోవర్ణనం నామాష్టా త్రింశోఽధ్యాయః ॥ 38 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు కిరాతావతారవర్ణనంలో అర్జున తపోవర్ణనం అనే పేరుగల ముప్పైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## ఏకోనచత్వారింశోఽధ్యాయః - ముప్పైతొమ్మిదవ అధ్యాయం

## కిరాతావతారవర్ణనే మూకదైత్యవధః - కిరాతావతారవర్ణనంలో ముకాసురవధ

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**స్నానం స విధివత్కృత్వా న్యాసాది విధివత్తథా ।**
**ధ్యానం శివస్య సద్భక్త్యా వ్యాసోక్తం యత్తథాఽకరోత్ ॥ 1 ॥**

అర్జునుడు యథావిధిగా స్నానమాచరించి న్యాసాదులనునుష్ఠించి మంచి భక్తితో వ్యాసుడుపదేశించిన తీరులో శివుని ధ్యానించాడు.

**ఏకపాదతలేనైవ తిష్ఠన్మునివరో యథా ।**
**సూర్యే దృష్టిం నిబద్ధ్యైకాం మంత్రమావర్తయన్ స్థితః ॥ 2 ॥**

అతడు మునివరుని వలె ఒంటి కాలిపై నిలబడి సూర్యునియందు దృష్టిని లగ్నం చేసి మంత్రాన్ని జపించాడు.

**తపస్తేపేఽఽతి సంప్రీత్యా సంస్మరన్మనసా శివమ్ ।**
**పంచాక్షరం మనుం శంభోర్జపన్సర్వోత్తమోత్తమమ్ ॥ 3 ॥**

అతడు మనస్సులో శివుని స్మరిస్తూ సర్వశ్రేష్ఠమైన పంచాక్షరీమంత్రాన్ని జపిస్తూ మహాప్రీతితో శివుని గురించి తపస్సు చేస్తున్నాడు.

**తపస్తేజ ఏవాసీద్యథా దేవా విసిస్మియుః ।**
**పునశ్చైవ శివం యాతాః ప్రత్యూచుస్తే సమాహితాః ॥ 4 ॥**

అతడు తపస్సు చేస్తూ ఉండగా బయల్వెడలిన తేజస్సును గాంచి దేవతలు చకితులై మరల శివుని వద్దకు వెళ్లి సమాహితమనస్కులై ఇట్లు పలికారు.

**దేవాఊచుః** - దేవతలు పలికారు.

**నరేణైకేన సర్వేశ! త్వదర్థే తప ఆహితమ్ ।**
**యదిచ్ఛతి నరస్సోఽయం కిన్న యచ్ఛతి తత్ప్రభో! ॥ 5 ॥**

ఓ సర్వేశ్వరా! ఒక నరుడు నీ కొరకు తపస్సు చేస్తున్నాడు. అతని కోర్కెను నీవేల తీర్చరాదు? (తీర్చుము)

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వా తు స్తుతిం చక్రుః వివిధాన్ తే తదా సురాః ।**
**తత్పాదయోర్దృశః కృత్వా తత్ర తస్థుః స్థిరాధయః ॥ 6 ॥**

దేవతలిట్లు పలికి, శివుని పాదాలపై చూపును నిలిపి, ఏకాగ్రమనస్సు గలవారై అనేక స్తుతులను చేసి, అచ్చట నిలబడి యున్నారు.

**శివస్తు తద్వచః శ్రుత్వా మహాప్రభురుదారధీః ।**
**సువిహస్య ప్రసన్నాత్మా సురాన్వచనమబ్రవీత్ ॥ 7 ॥**

ఉదారబుద్ధి గల శివమహాప్రభువు వారి మాటలను విని ప్రసన్నమైన అంతఃకరణము గలవాడై నవ్వి దేవతలతో ఇలా పలికాడు.

**శివ ఉవాచ** - శివుడు పలికాడు.

**స్వస్థానం గచ్ఛత సురాః! సర్వే సత్యం న సంశయః ।**
**సర్వథాఽహం కరిష్యామి కార్యం వో నాత్ర సంశయః ॥ 8 ॥**

దేవతలారా! మీరందరు మీ మీ స్థానాలకు వెళ్లండి. మీ కార్యాన్ని నేను అన్ని విధాలా పూర్తి చేయగలను. ఇది సత్యం. ఇందులో సందేహం లేదు.

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**తచ్ఛ్రుత్వా శంభువచనం నిశ్చయం పరమం గతాః ।**
**పరావృత్య గతాః సర్వే స్వస్వస్థానం తే హి నిర్జరాః ॥ 9 ॥**

శంభుని ఆ వచనాలను విని, దేవతలందరు దృఢమైన విశ్వాసాన్ని పొందినవారై, వెనుదిరిగి తమ తమ స్థానాలకు వెళ్లారు.

**ఏతస్మిన్నంతరే దైత్యో మూకనామాఽఽగతస్తదా ।**
**సౌకరం రూపమాస్థాయ ప్రేషితశ్చ దురాత్మనా ॥ 10 ॥**

ఇంతలో 'మూకుడు' అనే రాక్షసుడు సూకరరూపాన్ని ధరించివచ్చాడు. దుర్బుద్ధి, మాయావి అయిన దుర్యోధనుడు వానినచటకు పంపియున్నాడు.

**దుర్యోధనేన విప్రేంద్ర! మాయినా చార్జునం తదా ।**
**యత్రార్జునః స్థితశ్చాసీత్తేన మార్గేణ వై తదా ॥ 11 ॥**

విప్రశ్రేష్ఠా! మాయావియైన దుర్యోధనునిచే పంపబడిన ఆ రాక్షసుడు ఆ మార్గాన్ని అనుసరించి, అర్జునుడున్న స్థలానికి వచ్చాడు.

**శృంగాణి పర్వతస్యైవ ఛిందన్వృక్షాననేకశః ।**
**శబ్దం చ వివిధం కుర్వన్నతివేగేన సంయుతః ॥ 12 ॥**

అతడు పర్వతశిఖరాలను కూలగొడుతూ, వృక్షాలను ముక్కలు చేస్తూ మహావేగంతో కూడినవాడై అనేకవిధాలైన శబ్దాలను చేస్తున్నాడు.

**అర్జునోఽపి చ తం దృష్ట్వా మూకనామాసురం తదా ।**
**స్మృత్వా శివపదాంభోజం విచారే తత్పరోఽభవత్ ॥ 13 ॥**

అర్జునుడు ఆ మూకాసురుని గాంచి, శివుని పాదపద్మాలను స్మరించి గాఢంగా ఆలోచించటం మొదలుపెట్టాడు.

**అర్జున ఉవాచ –** అర్జునుడు పలికాడు.

**కోఽయం వా కుత ఆయాతి క్రూరకర్మా చ దృశ్యతే ।**
**మమానిష్టం ధ్రువం కర్తుం సమాగచ్ఛత్యసంశయమ్ ॥ 14 ॥**

వరాహరూపంలో ఉన్న ఈ ప్రాణి ఎక్కడ నుండి వస్తోంది? క్రూరకర్మ గలదానివలె కనిపిస్తోంది. ఇది నాకు హానిచేయడానికి వస్తున్నదనుట నిస్సంశయం.

**మమైవం మన ఆయాతి శత్రురేవ న సంశయః ।**
**మయా వినిహతాః పూర్వమనేకే దైత్యదానవాః ॥ 15 ॥**

ఇది నాకు శత్రువనియే నాకు మనస్సులో తోస్తున్నది. సందేహం లేదు. నేను పూర్వంలో అనేక మంది దైత్యులను, దానవులను సంహరించియున్నాను.

**తదీయః కశ్చిదాయాతి వైరం సాధయితుం పునః ।**
**అథవా చ సఖా కశ్చిద్దుర్యోధనహితావహః ॥ 16 ॥**

వారి సంబంధీకులలో ఒకరు మరలా పగదీర్చుకోవడానికి వచ్చియుండవచ్చు. లేదా దుర్యోధనుని మిత్రుడు అతనికి హితం చేయాలనే కోరికతో వచ్చి యుండవచ్చు.

**యస్మిన్ దృష్టే ప్రసీదేత్స్వం మనః స హితకృద్ధ్రువమ్ ।**
**యస్మిన్ దృష్టే తదేవ స్యాదాకులం శత్రురేవ సః ॥ 17 ॥**

ఎవనిని చూసినచో మనస్సు ప్రసన్నమౌతుందో అతడు హితాన్ని చేస్తాడు. ఇది నిశ్చయం. ఎవనిని చూడగానే మనస్సు వ్యాకులపడునో వాడు శత్రువే అవుతాడు.

**ఆచారః కులమాఖ్యాతి వపురాఖ్యాతి భోజనమ్ ।**
**వచనం శ్రుతమాఖ్యాతి స్నేహమాఖ్యాతి లోచనమ్ ॥ 18 ॥**

ఆచారం కులాన్ని, శరీరం భోజనాన్ని, వచనం జ్ఞానాన్ని, చూపు స్నేహాన్ని స్పష్టం చేస్తుంది.

**ఆకారేణ తథా గత్యా చేష్టయా భాషితైరపి ।**
**నేత్రవక్త్రవికారాభ్యాం జ్ఞాయతేఽంతర్గతం మనః ॥ 19 ॥**

ఆకారం, నడక, చేష్ట, మాటలు, చూపులు, ముఖకవళికలు అను వాటిని బట్టి మనస్సులో దాగియున్న భావాన్ని పసిగట్టవచ్చు.

**ఉజ్జ్వలం సరసం చైవ వక్రమారక్తకం తథా ।**
**నేత్రం చతుర్విధం ప్రోక్తం తస్య భావం పృథగ్బుధాః ॥ 20 ॥**

ఉజ్జ్వలమైనది, సరసమైనది, వంకరయైనది, మిక్కిలి ఎర్రనైనది, అని నేత్రములు నాల్గు తెరగులని చెబుతున్నారు. వీటి భావాలు కూడ వేర్వేరుగా నున్నవని పండితులు చెబుతున్నారు.

**ఉజ్జ్వలం మిత్రసంయోగే సరసం పుత్రదర్శనే ।**
**వక్రం చ కామినీయోగే ఆరక్తం శత్రుదర్శనే ॥ 21 ॥**

మిత్రుని తోడి కలయికలో నేత్రముజ్జ్వలంగాను, పుత్రుని చూచినపుడు సరసంగాను అంటే ప్రేమపూర్వకంగాను, ప్రియురాలితో కూడియున్నప్పుడు వక్రంగాను, శత్రువును చూచినపుడు నేత్రం మిక్కిలి ఎర్రగాను ఉంటుంది.

**అస్మిన్మమ తు సర్వాణి కలుషాణీంద్రియాణి చ ।**
**అయం శత్రుర్భవేదేవ మారణీయో న సంశయః ॥ 22 ॥**

వీనిని చూచినంతనే, నా ఇంద్రియాలన్నీ కలుషితాలయ్యాయి. కాబట్టి వీడు నిశ్చయంగా శత్రువే అవుతాడు. వీనిని నిస్సంశయంగా సంహరించాలి.

**గురోశ్చ వచనం మేఽద్య వర్తతే దుఃఖదస్త్వయా ।**
**హంతవ్యః సర్వథా రాజన్నాత్ర కార్యా విచారణా ॥ 23 ॥**

ఈ విషయంలో నాకు గురువుయొక్క అనుమతి కలదు. “ఓ రాజా! నీకు దుఃఖాన్ని కలిగించే వానిని నిస్సంశయంగా, సర్వవిధోపాయాలతో సంహరించు” అని నాకు గురువు చెప్పియున్నాడు.

**ఏతదర్థం త్వాయుధాని మమ చైవ న సంశయః ।**
**విచార్యేతి చ తత్రైవ బాణం సంస్థాయ సంస్థితః ॥ 24 ॥**

అందువలననే ఆయుధాలను ధరించియున్నాను. అర్జునుడీవిధంగా ఆలోచించి, బాణాన్ని సంధించి అక్కడే నిలబడియున్నాడు.

**ఏతస్మిన్నంతరే తత్ర రక్షార్థం హ్యర్జునస్య వై ।**
**తద్భక్తేశ్చ పరీక్షార్థం శంకరో భక్తవత్సలః ॥ 25 ॥**

ఇంతలో భక్తవత్సలుడైన శంకరుడు అర్జునుని భక్తిని పరీక్షించడానికి, అర్జునుని రక్షించడానికి అచ్చటకు విచ్చేశాడు.

**విదగ్ధభిల్లరూపం హి గణైః సార్ధం మహాద్భుతమ్ ।**
**తస్య దైత్యస్య నాశార్థం ధ్రుతం కృత్వా సమాగతః ॥ 26 ॥**

అత్యద్భుతమూ, సర్వసమర్థమూనైన వేటగాడి రూపాన్ని దాల్చి గణాలతో గూడి ఆ రాక్షసుని సంహరించడానికి శంకరుడు అచ్చటకు విచ్చేశాడు.

**బద్ధకచ్ఛశ్చ వస్త్రీభిర్బద్ధేశానధ్వజస్తదా ।**
**శరీరే శ్వేతరేఖాశ్చ ధనుర్బాణయుతః స్వయమ్ ॥ 27 ॥**

అతడు పంచను గట్టిగా బిగించి కట్టాడు. వస్త్రశకలాలతో ఈశానధ్వజాన్ని బంధించాడు. శరీరమందు తెల్లని రేఖలున్నాయి. ఆయన స్వయంగా ధనుర్బాణాలు ధరించియున్నాడు.

**బాణానాం తూణకం పృష్ఠే ధృత్వా వై స జగామ హ ।**
**గణశ్చైవ తథా జాతో భిల్లరాజోఽభవచ్ఛివః ॥ 28 ॥**

ఆయన బాణాల తూణీరాన్ని వెనుక దాల్చి ముందుకు సాగాడు. శివుడీ విధంగా భిల్లరాజై నడువగా గణాలు కూడ ఆ విధంగానే సంసిద్ధమయ్యాయి.

**శబ్దాంశ్చ వివిధాన్ కృత్వా నిర్యయౌ వాహినీపతిః ।**
**సూకరస్య ససారాథ శబ్దశ్చ ప్రదిశో దశ ॥ 29 ॥**

సేనాధ్యక్షుడు వివిధ శబ్దాలను చేస్తూ బయటకు వెళ్లినాడు, ఇంతలో సూకరంయొక్క శబ్దం దశదిశలలో వ్యాపించింది.

**వనేచరేణ శబ్దేన వ్యాకులశ్చార్జునస్తదా ।**
**పర్వతాద్యాశ్చ తైశ్శబ్దైస్తే సర్వే వ్యాకులాస్తదా ॥ 30 ॥**

ఆ సూకరంయొక్క ధ్వనిని విని అర్జునుడు కలవరపడ్డాడు. పర్వతాదులు ప్రతిధ్వనించాయి. సమస్త ప్రాణులు కలవరపడ్డాయి.

**అహెూ! కిన్ను భవేదేష శివః శుభకరస్త్విహ ।**
**మయా చైవ శ్రుతం పూర్వం కృష్ణేన కథితం పునః ॥ 31 ॥**

అహో! ఏమి ఆశ్చర్యం! ఇది ఏమైయుండును? ఇచట శివుడు శుభాన్ని చేస్తాడని పూర్వం కృష్ణుడు చెప్పగా వినియున్నాను.

**వ్యాసేన కథితం చైవం స్మృత్వా దేవైస్తథా పునః ।**
**శివః శుభకరః ప్రోక్తః శివః సుఖకరస్తథా ॥ 32 ॥**

దేవతలు వ్యాసుడు చెప్పిన దానిని స్మరణకు తెచ్చుకొని, శివుడు శుభాన్ని, సుఖాన్ని కలిగిస్తాడని కూడ మరలా చెప్పియున్నారు.

**ముక్తిదశ్చ స్వయం ప్రోక్తో ముక్తిదానాన్న సంశయః ।**
**తన్నామస్మరణాత్పుంసాం కల్యాణం జాయతే ధ్రువమ్ ॥ 33 ॥**

ఆయన స్వయంగా ముక్తినిచ్చువాడైనందున ముక్తిదుడయ్యాడు. ఇందులో సందేహం లేదు. ఆయన నామాన్ని స్మరించు మానవులు కల్యాణాన్ని పొందుదురనుట నిశ్చయం.

**భజతాం సర్వభావేన దుఃఖం స్వప్నేఽపి నో భవేత్ ।**
**యదా కదాచిజ్జాయేత తదా కర్మసముద్భవమ్ ॥ 34 ॥**

ఆయనను సర్వాత్మభావనతో భజించువారికి స్వప్నమునందైనను దుఃఖం కలుగదు. ఎప్పుడైనా దుఃఖం కలిగినచో, అది కర్మఫలంగా వచ్చిందని తెలుసుకోవాలి.

**తదేతద్బహ్వపి జ్ఞేయం నూనమల్పం న సంశయః ।**
**ప్రారబ్ధస్యాథవా దోషో నూనం జ్ఞేయో విశేషతః ॥ 35 ॥**

అట్లు కర్మఫలరూపంలో సంప్రాప్తమైన దుఃఖం అధికంగా నుండవలసినదైనను, ఆయనను భజించుట వలన అల్పముగానే ఉండుననుటలో సందేహం లేదు. లేదా అది నిశ్చయంగా ప్రారబ్ధంయొక్క దోషమని తెలుసుకోవాలి.

**అథవా బహు చాల్పం హి భోగ్యం నిస్తీర్య శంకరః ।**
**కదాచిదిచ్ఛయా తస్య దూరీకుర్యాన్నసంశయః ॥ 36 ॥**

లేదా శంకరుడు అధికంగా గాని, అల్పంగా గాని అనుభవింపజేసి, అప్పుడప్పుడు తన ఇచ్ఛచే ఆ దుఃఖాన్ని మానవునకు దూరం చేస్తాడనడంలో సందేహం లేదు.

**విషం చైవామృతం కుర్యాదమృతం విషమేవ వా ।**
**యదిచ్ఛతి కరోత్యేవ సమర్థః కిం నిషిధ్యతే ॥ 37 ॥**

శివుడు విషాన్ని అమృతంగానూ, అమృతాన్ని విషంగానూ, తాను తలంచిన విధంగా చేయగలడు. సమర్థుడైన శివుని ఎవరు నిషేధించగలరు?

**ఇత్థం విచార్యమాణేఽపి భక్తైరన్యైః పురాతనైః ।**
**భావిభిశ్చ సదాభక్తైరిహానీయ మనః స్థిరమ్ ॥ 38 ॥**

ఈ విధంగా పూర్వులైన భక్తులెందరో విచారణ చేశారు. భవిష్యత్కాలంలో కూడా ఈ జ్ఞానాన్నే భక్తుల మనస్సులో సుస్థిరం చేయాలి.

**లక్ష్మీర్గచ్ఛేచ్చావతిష్ఠేన్మరణం నికటే పురః ।**
**నిందాం వాఽథ ప్రకుర్వంతు స్తుతిం వా దుఃఖసంక్షయమ్ ॥ 39 ॥**

లక్ష్మి ఉండవచ్చును, పోవచ్చును. మరణం ఎదుట నిలబడి యుండవచ్చును. జనులు నిందించవచ్చును, స్తుతించవచ్చును. కాని భక్తిని వీడకున్న వాని దుఃఖం నశించి తీరును.

**జయతే పుణ్యపాపాభ్యాం శంకరస్సుఖదః సదా ।**
**కదాచిచ్చ పరీక్షార్థం దుఃఖం యచ్ఛతి వై శివః ॥ 40 ॥**

మానవుడు పుణ్యపాపాలచే సుఖదుఃఖాలను పొందుతాడు. శంకరుడు సర్వదా సుఖాన్నే ఇస్తాడు. కాని అప్పుడప్పుడు పరీక్షించడానికి దుఃఖాన్ని కలిగిస్తూ ఉంటాడు.

**అంతే చ సుఖదః ప్రోక్తో దయాలుత్వాన్న సంశయః ।**
**యథా చైవ సువర్ణం చ శోధితం శుద్ధతాం వ్రజేత్ ॥ 41 ॥**

ఆయన దయామయుడుగనుక చివరకు సుఖాన్నే ఇస్తాడనడంలో సందేహం లేదు. బంగారాన్ని పుటం పెట్టి కాల్చడం వల్ల మరింత శుద్ధిని పొందుతోంది గదా! మానవుల భక్తికూడ అట్టిదియే.

**ఏవం చైవం మయా పూర్వం శ్రుతం మునిముఖాత్తథా ।**
**అతస్తద్భజనేనైవ లప్స్యేఽహం సుఖముత్తమమ్ ॥ 42 ॥**

ఈ మాటలు నేను పూర్వం మహర్షుల ముఖంనుండి వినియున్నాను. కాబట్టి నేను శివుని మాత్రమే సేవించి ఉత్తమసుఖాన్ని పొందుతాను.

**ఇత్యేవం తు విచారం స కరోతి యావదేవ హి ।**
**తావచ్చ సూకరః ప్రాప్తో బాణసంమోచనావధిః ॥ 43 ॥**

ఈ విధంగా అతడు ఆలోచిస్తూ ఉండగానే, సూకరం బాణం వేయదగిన పరిధిలోనికి వచ్చింది.

**శివోఽపి పృష్ఠతో లగ్నో హ్యాయాతః సూకరస్య హి ।**
**తయోర్మధ్యే తదా సోఽయం దృశ్యతే శృంగమద్భుతమ్ ॥ 44 ॥**

శివుడు కూడ దాని వెనుకనే వచ్చాడు. వారిద్దరి మధ్యలో ఆ సూకరం అద్భుతమైన పర్వతశిఖరంలా కనబడింది.

**తస్య ప్రోక్తం చ మాహాత్మ్యం శివః శీఘ్రతరం గతః ।**
**అర్జునస్య చ రక్షార్థం శంకరో భక్తవత్సలః ॥ 45 ॥**

దాని గొప్పదనం ఇంతకుముందు వర్ణింపబడింది. మంగళకరుడు, భక్తవత్సలుడునైన శంకరుడు అర్జునుని రక్షణార్థం మరింత వేగంగా, ముందుకు సాగాడు.

**ఏతస్మిన్సమయే తాభ్యాం కృతం బాణవిమోచనమ్ ।**
**శివబాణస్తు పుచ్ఛే వై హ్యర్జునస్య ముఖే తథా ॥ 46 ॥**

అదే సమయంలో వారిద్దరూ బాణాలను విడిచిపెట్టారు. అర్జునుడు ముఖాన్ని, శివుడు తోకను లక్ష్యంగా చేసి బాణాలను ప్రయోగించారు.

**శివస్య పుచ్ఛతో గత్వా ముఖాన్నిస్సృత్య శీఘ్రతః ।**
**భూమౌ విలీనః సంయాతస్తస్య వై పుచ్ఛతో గతః ॥ 47 ॥**

శివుని బాణం వేగంగా పుచ్ఛం నుండి దూసుకుపోయి, ముఖం నుండి బయటకు వచ్చి భూమిలో కలిసిపోయింది.

**పపాత పార్శ్వతశ్చైవ బాణశ్చైవార్జునస్య చ ।**
**సూకరస్తత్క్షణం దైత్యో మృతో భూమౌ పపాత హ ॥ 48 ॥**

అర్జునుని బాణం పుచ్ఛం వైపు నుండి బయటకు వచ్చి ప్రక్కనే పడింది. సూకర రూపంలోనున్న రాక్షసుడు వెంటనే మరణించి నేలగూలాడు.

**దేవా హర్షం పరం ప్రాపుః పుష్పవృష్టిం చ చక్రిరే ।**
**జయపూర్వం స్తుతికరాః ప్రణమ్య చ పునః పునః ॥ 49 ॥**

దేవతలు పరమానందాన్ని పొంది పుష్పవృష్టిని కురిపించారు. అనేక పర్యాయాలు ప్రణమిల్లి జయధ్వానాలను, స్తోత్రాలను చేశారు.

**శివస్తుష్టమనా ఆసీదర్జునః సుఖమాగతః ।**
**దైత్యస్య చ తదా దృష్ట్వా క్రూరం రూపం చ తౌ తదా ॥ 50 ॥**

అపుడా రాక్షసుని క్రూరరూపాన్ని గాంచి, శివుడు సంతసిల్లిన మనస్సు కలవాడయ్యెను. అర్జునుడు సుఖాన్ని పొందాడు.

**అర్జునస్తు విశేషేణ సుఖినా ప్రాహ చేతసా ।**
**అహో దైత్యవరశ్చాయం రూపం తు పరమాద్భుతమ్ ॥ 51 ॥**

అత్యంతసుఖంతో నిండిన మనస్సు గలవాడై అర్జునుడు ఇలా పలికాడు "అహో! ఈ రాక్షసశ్రేష్ఠుని రూపం పరమాద్భుతంగానున్నది.

**కృత్వాఽఽగతో మద్వధార్థం శివేనాహం సురక్షితః ।**
**ఈశ్వరేణ మమాద్యైవ బుద్ధిర్దత్తా న సంశయః ॥ 52 ॥**

ఇట్టి రూపాన్ని ధరించి నన్ను వధింప నిశ్చయించుకొని వచ్చాడు. కాని శివుడు నన్ను రక్షించాడు. వీడు శత్రువని నా బుద్ధికి తోపింపజేసినవాడు కూడా ఈశ్వరుడే అనడంలో సందేహం లేదు".

**విచార్యేఽత్యర్జునస్తత్ర జగౌ శివశివేతి చ ।**
**ప్రణనామ శివం భూయస్తుష్టావ చ పునః పునః ॥ 53 ॥**

అర్జునుడిట్లు తలంచి, 'శివ,శివా' అని శివుని నామాన్ని స్మరించి, శివునకనేకపర్యాయాలు ప్రణమిల్లి, మరల మరల స్తుతించాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం కిరాతావతారవర్ణనే మూకదైత్యవధోనామైకోన చత్వారింశోఽధ్యాయః ॥ 39 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు కిరాతావతారవర్ణనంలో మూకాసురవధ అనే పేరుగల ముప్పైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## చత్వారింశోఽధ్యాయః - నలభైయవ అధ్యాయం

## భిల్లార్జునసంవాదః - భిల్లార్జునసంవాదం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**సనత్కుమార! సర్వజ్ఞ! శృణు లీలాం పరాత్మనః ।**
**భక్తవాత్సల్యసంయుక్తాం తద్దృఢత్వవిదర్భితామ్ ॥ 1 ॥**

ఓ సనత్కుమారా! సర్వజ్ఞా! పరమాత్మలీలను వినుము. ఈ లీలలో శివునకు గల దృఢమైన భక్తవాత్సల్యం నిండియుంది.

**శివోఽప్యథ స్వభృత్యం వై ప్రేషయామాస స ద్రుతమ్ ।**
**బాణార్థే చ తదా తత్రార్జునోఽపి సమగాత్తతః ॥ 2 ॥**

అపుడా శివుడు తన బాణం కొరకు వెంటనే తన అనుచరుని పంపాడు. అపుడచటకు అర్జునుడు కూడా చేరాడు.

**ఏకస్మిన్ సమయే ప్రాప్తౌ బాణార్థం తద్గణార్జునౌ ।**
**అర్జునస్తం పరాభర్త్స్య స్వబాణం చాగ్రహీత్తదా ॥ 3 ॥**

శివానుచరుడు, అర్జునుడు బాణం కొరకు అచ్చటకు ఏకకాలంలో చేరారు. అర్జునుడాతనిని గద్దించి తన బాణాన్ని స్వీకరించాడు.

**గణః ప్రోవాచ తం తత్ర కిమర్థం గృహ్యతే శరః ।**
**బాణశ్చైవాస్మదీయో వై ముచ్యతాం ఋషిసత్తమ! ॥ 4 ॥**

అపుడా శివకింకరుడిలా పలికాడు “ఓ మహర్షీ! ఈ బాణం నాది. నీవు దానిని ఎందులకు తీసుకున్నావు? దానిని విడిచిపెట్టు”.

**ఇత్యుక్తస్తేన భిల్లస్య గణేన మునిసత్తమః ।**
**సోఽర్జునః శంకరం స్మృత్వా వచనం చ తమబ్రవీత్ ॥ 5 ॥**

ప్రభుని అనుచరుడైన కిరాతుడు ఈ విధంగా పలుకగా, మహర్షియైన అర్జునుడు శంకరుని స్మరించి, అతనితో ఇలా పలికాడు.

**అర్జున ఉవాచ** - అర్జునుడు పలికాడు.

**అజ్ఞాత్వా కిం చ వదసి మూర్ఖోఽసి త్వం వనేచర ।**
**బాణశ్చ మోచితో మేఽద్య త్వదీయశ్చ కథం పునః ॥ 6 ॥**

“ఓ వనచరా! నీవు తెలియకుండా ఏదో మాట్లాడుతున్నావు. నీవు మూర్ఖుడవు. నేను ఇప్పుడే బాణాన్ని ప్రయోగించాను. ఆ బాణం నీది ఎలా అయ్యింది?

**రేఖారూపం చ పిచ్ఛాని మన్నామాంకిత ఏవ చ ।**
**త్వదీయశ్చ కథం జాతః స్వభావో దుస్త్యజస్తవ ॥ 7 ॥**

దీని రేఖారూపం, పిచ్ఛంపై నా పేరు వ్రాసియుంది, ఇది నీదెట్లగును? నీవు నీ స్వభావాన్ని విడనాడలేకపోయావు".

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యేవం తద్వచః శ్రుత్వా విహస్య చ గణేశ్వరః ।**
**అర్జునం ఋషిరూపం తం భిల్లో వాక్యముపాదదే ॥ 8 ॥**

గణాధ్యక్షుడైన కిరాతుడు ఋషిరూపంలోనున్న అర్జునుని మాటలను విని నవ్వి అతనితో ఇట్లన్నాడు.

**తాపస! శ్రూయతాం రే త్వం న తపః క్రియతే త్వయా ।**
**వేషతశ్చ తపస్వీ త్వం న యథార్థం ఛలాయతే ॥ 9 ॥**

తాపసా! విను, నీవు తపస్సు చేయడం లేదు, కాని తాపస వేషాన్ని ధరించియున్నావు. ఇది వాస్తవం కాదు. నీవు మోసగాడివి.

**తపస్వీ చ కథం మిథ్యా భాషతే కురుతే నరః ।**
**నైకాకినం చ మాం త్వం చ జానీహి వాహినీపతిమ్ ॥ 10 ॥**

తపశ్శాలియైన వ్యక్తి అసత్యాన్ని ఏల పలకాలి? నేను ఒంటరినని తలంపకుము. నేను సైన్యాధ్యక్షుడనని యెరుంగుము.

**బహుభిర్వనభిల్లైశ్చ యుక్తః స్వామీ స ఆసతే ।**
**సమర్థస్సర్వథా కర్తుం నిగ్రహానుగ్రహౌ పునః ॥ 11 ॥**

మా ప్రభువు అనేక మంది వనవాసులైన కిరాతులతో గూడియున్నాడు. ఆయన దండించడానికిగాని, అనుగ్రహించడానికి గాని అన్ని విధములుగా సమర్థుడు.

**వర్తతే తస్య బాణోఽయం యో నీతశ్చ త్వయాఽధునా ।**
**అయం బాణశ్చ తే పార్శ్వే న స్థాస్యతి కదాచన ॥ 12 ॥**

ఇపుడు నీవు ఇచటనుండి తీసిన బాణం ఆయనది. ఆ బాణం నీ వద్ద చాలా సేపు ఉండబోదు.

**తపః ఫలం కథం త్వం చ హాతుమిచ్ఛసి తాపస! ।**
**చౌర్యాచ్ఛలార్ద్యమానాచ్చ విస్మయాత్సత్యభంజనాత్ ॥ 13 ॥**

**తపసా క్షీయతే సత్యమేతదేవ మయా శ్రుతమ్ ।**
**తస్మాచ్చ తపసస్తేఽద్య భవిష్యతి ఫలం కుతః ॥ 14 ॥**

ఓ తాపసా! నీవు తపః ఫలాన్ని వ్యర్థం చేసుకోవడానికెందుకు ప్రయత్నిస్తున్నావు? చౌర్యము, మోసము, గర్వించియుండుట, సత్యాన్ని విడనాడుట అను వాటిచే తపస్సు క్షీణమౌనని నేను వినియున్నాను. ఇది యథార్థం. కావున ఇపుడు నీ తపస్సునకు ఏమి ఫలం లభిస్తుంది?

**తస్మాచ్చ ముచ్యతే బాణాత్కృతఘ్నస్త్వం భవిష్యసి ।**
**మమైవ స్వామినో బాణస్తవార్థే మోచితో ధ్రువమ్ ॥ 15 ॥**

నీవు ఆ బాణాన్ని తీసుకొంటే తపఃఫలంనుండి వంచితుడవై కృతఘ్నుడవు కాగలవు. ఆ బాణం నా స్వామిది మాత్రమే యగును. ఆయన నిన్ను రక్షించడానికి దీనిని ప్రయోగించినాడనునది నిశ్చయం.

**శత్రుశ్చ మారితస్తేన పునర్బాణశ్చ రక్షితః ।**
**అత్యంతం చ కృతఘ్నోఽసి తపోఽశుభకరస్తథా ॥ 16 ॥**

ఆయన ఈ బాణంతో శత్రువును సంహరించుట మాత్రమేగాక, బాణం కూడ భద్రంగా ఉండేటట్లు చేశాడు. నీవు మిక్కిలి కృతఘ్నుడవు. నీవు తపమునాచరిస్తూ అశుభాన్ని ఆచరిస్తున్నావు.

**సత్యం న భాషసే త్వం చ కిమతః సిద్ధిమిచ్ఛసి ।**
**ప్రయోజనం చేద్బాణేన స్వామీ చ యాచ్యతాం మమ ॥ 17 ॥**

నీవు సత్యం పలుకుట లేదు. ఈ తపస్సువల్ల నీవెట్టి సిద్ధిని కోరుకుంటున్నావు? నీకీ బాణంతో పనియున్నచో, మా ప్రభువుని యాచించు.

**ఈదృశాంశ్చ బహూన్బాణాంస్తదా దాతుం క్షమః స్వయమ్ ।**
**రాజా చ వర్తతే మేఽద్య కిం త్వేవం యాచ్యతే త్వయా ॥ 18 ॥**

ఆయన ఇటువంటి అనేక బాణాలను నీకు స్వయంగా ఇవ్వగల సమర్థుడు. మా ప్రభువిప్పుడు ఇచ్చటనే యున్నాడు. నీవు నన్నెందులకు యాచిస్తున్నావు?

**ఉపకారం పరిత్యజ్య హ్యపకారం సమీహసే ।**
**నైతద్యుక్తం త్వయాఽద్యైవ క్రియతే త్యజ చాపలమ్ ॥ 19 ॥**

నీవు ఉపకారాన్ని విడిచి అపకారాన్ని చేయగోరుతున్నావు. నీవీనాడు చేయబూనిన పని నీకు తగినది కాదు. ఈ చాపల్యాన్ని విడిచిపెట్టు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యేవం వచనం తస్య శ్రుత్వా పార్థోఽర్జునస్తదా ।**
**క్రోధం కృత్వా శివం స్మృత్వా మితం వాక్యమథాబ్రవీత్ ॥ 20 ॥**

అతని ఈ మాటలను విని కుంతీపుత్రుడైన అర్జునుడు కోపించి, శివుని స్మరించి, అనంతరం మితంగా ఇలా పలికాడు.

**అర్జున ఉవాచ -** అర్జునుడు పలికాడు.

**శృణు భిల్ల! ప్రవక్ష్యామి న సత్యం తవ భాషణమ్ ।**
**యథా జాతిస్తథా త్వాం చ జానామి హి వనేచర! ॥ 21 ॥**

ఓ కిరాతా! వనేచరా! చెబుతాను విను. నీ వచనాలు సత్యం కావు. నీవు నీ జాతికి తగినట్లు ప్రవర్తిస్తున్నావు. నీ స్వభావం నాకు తెలిసింది.

**అహం రాజా భవాంశ్చోరః కథం యుద్ధప్రయుక్తతా ।**
**యుద్ధం మే సబలైః కార్యం నాధమైర్హి కదాచన ॥ 22 ॥**

నేను రాజును. నీవు చోరుడవు. నేను నీతో యుద్ధం చేయడం ఎలా సంభవం? నేను బలవంతులతో మాత్రమే యుద్ధం చేస్తాను. అధములతో ఎన్నడూ చేయను.

**తస్మాత్తే చ తథా స్వామీ భవిష్యతి భవాదృశః ।**
**దాతారశ్చ వయం ప్రోక్తాశ్చోరా యూయం వనేచరాః ॥ 23 ॥**

నీ ప్రభువు కూడ నీ వంటివాడే కాబోలు. మేము దాతలమని చెప్పబడతాం. మీరు వనచరులైన చోరులు.

**కథం యాచ్యో మయా భిల్లరాజ ఏవం చ సాంప్రతమ్ ।**
**త్వమేవ యాచసే నైవ బాణం మాం కిం వనేచరః ॥ 24 ॥**

ఇప్పుడు నేను భిల్లరాజును ఏ విధంగా యాచించాలి? నీవే నన్ను బాణంకొరకు యాచిస్తున్నావుకదా!

**దదామి తే తథా బాణాన్ సంతి మే బహవో ధ్రువమ్ ।**
**రాజా చ గ్రహణం చైవ న దాస్యతి తథా భవేత్ ॥ 25 ॥**

నేను నీకు బాణాలనిస్తాను. నా వద్ద నిశ్చయంగా చాలా బాణాలున్నాయి. రాజు వస్తువులనిస్తాడేగాని, ఎన్నడూ తీసుకోడు.

**కిం పునశ్చ తథా బాణాన్ప్రయచ్ఛామి వనేచర! ।**
**యది మే యా చికీర్షా స్యాత్కథం నాగమ్యతేఽధునా ॥ 26 ॥**

ఓ వనచరా! ఈ ఒక్క బాణమేల? ఇంకా అనేక బాణాలనిస్తాను. కాని నీ ప్రభువిచ్చటకు రావాలి. నీవింకా ఇచ్చటనే ఉన్నావేల? వెళ్లుము.

**యథాఽఽగచ్ఛతు తే భర్తా కిమర్థం భాషతేఽధునా ।**
**ఆగత్య చ మయా సార్ధం జిత్వా యుద్ధే చ మాం పునః ॥ 27 ॥**

నాతో యుద్ధాన్ని చేయాలనే కోరిక నీ ప్రభువునకు ఉందా? ఇంకనూ అనేక మాటలేల? నీ ప్రభువిచ్చటకు వచ్చి, యుద్ధంలో నన్ను జయించాలి.

**నీత్వా బాణమిమం భిల్ల! స్వామీ తే వాహినీపతిః ।**
**నిజాలయం సుఖం యాతు విలంబః క్రియతే కథమ్ ॥ 28 ॥**

ఓ కిరాతుడా! ఆపైన సైన్యాధ్యక్షుడైన నీ రాజు ఈ బాణాన్ని స్వీకరించి సుఖంగా తన యింటికి వెళ్లదగినవాడు. నీవింకా ఆలస్యం ఎందుకు చేస్తున్నావు?

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**మహేశ్వరకృపాప్రాప్తసద్బలస్యార్జునస్య హి ।**
**ఇత్యేతద్వచనం శ్రుత్వా భిల్లో వాక్యమథాబ్రవీత్ ॥ 29 ॥**

మహేశ్వరుని అనుగ్రహంచే పొందబడిన గొప్ప బలం గల అర్జునుని మాటలను విని, కిరాతుడిలా పలికాడు.

**భిల్ల ఉవాచ –** కిరాతుడు పలికాడు.

**అజ్ఞోఽసి త్వం ఋషిర్నాసి మరణం త్వీహసే కథమ్ ।**
**దేహి బాణం సుఖం తిష్ఠత్వన్యథా క్లేశభాగ్భవేః ॥ 30 ॥**

నీవు అజ్ఞానివి. నీవు ఋషివి గావు. నీవు మరణాన్ని ఏల కోరుకొనుచున్నావు? బాణాన్ని ఇచ్చి సుఖంగా ఉండు. లేనిచో కష్టముల పాలుకాగలవు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్తస్తేన భిల్లేన శివసచ్ఛక్తిశోభినా ।**
**గణేన పాండవస్తం చ ప్రాహ స్మృత్వా చ శంకరమ్ ॥ 31 ॥**

శివుని గొప్ప శక్తిచే ప్రకాశించే కిరాతుడిట్లు పలుకగా, అర్జునుడు శంకరుని స్మరించి, కిరాతరూపంలోనున్న గణాధ్యక్షునితో ఇలా పలికాడు.

**అర్జున ఉవాచ –** అర్జునుడు పలికాడు.

**మద్వాక్యం తత్త్వతో భిల్ల! శృణు త్వం చ వనేచర! ।**
**ఆగమిష్యతి తే స్వామీ దర్శయిష్యే ఫలం తదా ॥ 32 ॥**

ఓ కిరాతా! వనచరా! నా మాటలను వినుము. సారమును గ్రహించుము. నీ ప్రభువురాగానే, నీయీ మాటల ఫలాన్ని అప్పుడు చూపిస్తాను.

**న శోభతే త్వయా యుద్ధం కరిష్యే స్వామినా తవ ।**
**ఉపహాసకరం జ్ఞేయం యుద్ధం సింహశృగాలయోః ॥ 33 ॥**

నేను నీతో యుద్ధం చేయడం శోభించదు. నీ ప్రభువుతో యుద్ధం చేస్తాను సింహానికి, నక్కకు మధ్య యుద్ధం అపహాస్యం పాలౌతుంది.

**శ్రుతం చ మద్వచస్తేఽద్య ద్రక్ష్యసి త్వం మహాబలమ్ ।**
**గచ్ఛస్వ స్వామినం భిల్ల! యథేచ్ఛసి తథా కురు ॥ 34 ॥**

కిరాతా! ఇప్పుడు నీవు నా పలుకుల్ని వినియున్నావు. నా మహాబలాన్ని చూడగలవు. నీ ప్రభువువద్దకు పొమ్ము. నీకు నచ్చిన విధంగా చేసుకో.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్తస్తు గతస్తత్ర భిల్లః పార్థేన వై మునే! ।**
**శివావతారో యత్రాస్తే కిరాతో వాహినీపతిః ॥ 35 ॥**

ఓ సనత్కుమారా! అర్జునుడిట్లు పలుకగానే ఆ భిల్లుడు సైన్యాధ్యక్షుడగు కిరాతుని రూపంలోనున్న స్థలానికి వెళ్లాడు.

**అథార్జునస్య వచనం భిల్లనాథాయ విస్తరాత్ ।**
**సర్వం నివేదయామాస తస్మై భిల్లపరాత్మనే ॥ 36 ॥**

అప్పుడతడు కిరాతరాజు రూపంలోనున్న పరమాత్మునికి అర్జునుని పల్కులనన్నింటిని సవిస్తరంగా చెప్పాడు.

**స కిరాతేశ్వరః శ్రుత్వా తద్వచో హర్షమాగతః ।**
**ఆజగామ స్వసైన్యేన శంకరో భిల్లరూపధృక్ ॥ 37 ॥**

ఆ కిరాతుడు ఆ మాటలను విని ఆనందాన్ని పొందాడు. కిరాతరూపంలోనున్న శంకరుడు తన సైన్యాన్ని తోడ్కొని అచ్చటకు విచ్చేశాడు.

**అర్జునశ్చ తదా సేనాం కిరాతస్య చ పాండవః ।**
**దృష్ట్వా గృహీత్వా సశరం ధనుః సమ్ముఖ ఆయయౌ ॥ 38 ॥**

పాండుపుత్రుడైన అర్జునుడు కిరాతుని సేనను గాంచి, ధనుర్బాణాలను చేతబట్టి ఎదురేగాడు.

**అథో కిరాతశ్చ పునః ప్రేషయామాస తం చరమ్ ।**
**తన్ముఖేన జగౌ వాక్యం భారతాయ మహాత్మనే ॥ 39 ॥**

అంతట కిరాతరాజు మరల ఆ సేవకుని భరతవంశజుడు, మహాత్ముడునగు అర్జునుని వద్దకు పంపించి, అతని ముఖం ద్వారా ఈ వాక్యాలను చెప్పించాడు.

**కిరాత ఉవాచ –** కిరాతుడు పలికాడు.

**పశ్య సైన్యం తపస్విన్! త్వం ముంచ బాణం వ్రజాధునా ।**
**మరణం స్వల్పకార్యార్థం కథమిచ్ఛసి సాంప్రతమ్ ॥ 40 ॥**

ఓ తపస్వీ! నీవీ సైన్యాన్ని చూడు. బాణాన్ని విడిచిపెట్టి ఇప్పుడే వెళ్లిపో. చిన్న పని కోసం ఇప్పుడు మరణాన్ని ఎందుకు కోరుకుంటున్నావు?

**భ్రాతరస్తవ దుఃఖార్తాః కళత్రం చ తతః పరమ్ ।**
**పృథివీ హస్తతస్తేఽద్య యాస్యతీతి మతిర్మమ ॥ 41 ॥**

నీ సోదరులు దుఃఖంచే పీడింపబడతారు. నీ భార్య అంతకంటె అధికంగా దుఃఖితురాలౌతుంది. నీవిప్పుడు రాజ్యభ్రష్టుడవౌదువని నాకు తోస్తున్నది.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్తం పరమేశేన పార్థదార్ఢ్యపరీక్షయా ।**
**సర్వథాఽర్జునరక్షార్థం ధృతరూపేణ శంభునా ॥ 42 ॥**

అన్ని విధములుగా అర్జునుని రక్షించడానికి అవతరించిన పరమేశ్వరుడైన శంభుడు పార్థుని దృఢదీక్షను పరీక్షించడానికే ఇట్లు పలికాడు.

**ఇత్యుక్తస్తు తదాఽఽగత్య సగణశ్శంకరశ్చ తత్ ।**
**విస్తరాద్వృత్తమఖిలమర్జునాయ న్యవేదయత్ ॥ 43 ॥**

శంకరుడిట్లు చెప్పగానే, శంకరుని అనుచరుడు అర్జునుని వద్దకు వచ్చి, ఆ వివరాలనన్నింటిని అతనికి విన్నవించాడు.

**తచ్ఛ్రుత్వా తు పునః ప్రాహ ప్రార్థస్తం దూతమాగతమ్ ।**
**వాహినీపతయే వాచ్యం విపరీతం భవిష్యతి ॥ 44 ॥**

ఆ సందేహాన్ని విని అర్జునుడు తన వద్దకు వచ్చిన దూతతో మరలా ఇలా పలికాడు. మీ సేనాధ్యక్షునకు చెప్పుము. అంతా విపరీతం కాగలదు.

**యద్యహం చైవ తే బాణం యచ్ఛామి చ మదీయకమ్ ।**
**కులస్య దూషణం చాహం భవిష్యామి న సంశయః ॥ 45 ॥**

నేను నీకు నా బాణం ఇచ్చినచో, నేను నా కులాన్ని చెడగొట్టినవాడనగుదును. దీనిలో సందేహం లేదు.

**భ్రాతరశ్చైవ దుఃఖార్తాః భవంతు చ తథా ధ్రువమ్ ।**
**విద్యాశ్చ నిష్ఫలాః స్యుస్తా స్తస్మాదాగచ్ఛ వై ధ్రువమ్ ॥ 46 ॥**

నా సోదరులు దుఃఖపీడితులైనచో అగుదురు గాక, కాని నా విద్యలు వ్యర్థమగుట నాకు సమ్మతం కాదు. ఇది నిశ్చయం. కావున రమ్ము.

**సింహశ్చైవ శృగాలాద్వా భీతో నైవ మయా శ్రుతః ।**
**తథా వనేచరాద్రాజా న బిభేతి కదాచన ॥ 47 ॥**

సింహం ఎప్పుడైనా నక్కకు భయపడదని నేను విని యున్నాను. అదే విధంగా రాజు వనచరునివల్ల ఎన్నటికీ భయపడడు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్తస్తం పునర్గత్వా స్వామినం పాండవేన సః ।**
**సర్వం నివేదయామాస తదుక్తం హి విశేషతః ॥ 48 ॥**

అర్జునుడిట్లుపలుకగా, ఆ అనుచరుడు మరలా తన ప్రభువు వద్దకు వెళ్లి, అర్జునుని వచనాలనన్నింటిని జాగరూకతతో విన్నవించాడు.

**అథ సో௨పి కిరాతాహ్వో మహాదేవస్స్వసైన్యకః ।**
**తచ్ఛ్రుత్వా సైన్యసంయుక్తో హ్యర్జునం చాగమత్తదా ॥ 49 ॥**

అంతట కిరాతరూపంలోనున్న మహాదేవుడు ఆ మాటలను విని తన సైన్యంతో గూడి అర్జునునిపై దండెత్తాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం కిరాతావతారవర్ణనే భిల్లార్జునసంవాదో నామ చత్వారింశో௨ధ్యాయః ॥ 40 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు కిరాతావతారవర్ణనలో భిల్లార్జున సంవాదం అనే పేరుగల నలభైయవ అధ్యాయం సమాప్తం.

## ఏకచత్వారింశోఽధ్యాయః - నలభ్బైఒకటవ అధ్యాయం

## కిరాతేశ్వరావతారవర్ణనమ్ - కిరాతేశ్వరుని అవతారవర్ణనం

**తమాగతం తతో దృష్ట్వా ధ్యానం కృత్వా శివస్య సః ।**
**గత్వా తత్రార్జునస్తేన యుద్ధం చక్రే సుదారుణమ్ ॥ 1 ॥**

అచ్చటకు కిరాతరాజు వచ్చుటను చూసి, అర్జునుడు శివుని ధ్యానించి, అతని వద్దకు వెళ్లి, అతనితో మిక్కిలి దారుణమైన యుద్ధాన్ని చేశాడు.

**గణైశ్చ వివిధైస్తీక్ష్ణైరాయుధైస్తం న్యపీడయత్ ।**
**తైస్తదా పీడితః పార్థః సస్మార స్వామినం శివమ్ ॥ 2 ॥**

వివిధగణాలు, పదునైన ఆయుధాలతో అతనిని పీడించారు. ఆ విధంగా వారిచే పీడకు గురియైన అర్జునుడు శివప్రభుని స్మరించాడు.

**అర్జునశ్చ తదా తేషాం బాణావలిమథాచ్ఛినత్ ।**
**యదా యుద్ధం చ తైః క్షిప్తం తతః శర్వం పరామృశత్ ॥ 3 ॥**

అప్పుడర్జునుడు మనస్సులో శివుని స్మరించి, యుద్ధంలో వారిచే విడువబడిన బాణాలచే పీడింపబడినవాడై, ఆ బాణసమూహాలను ఛేదించాడు.

**పీడితాస్తే గణాస్తేన యయుశ్చైవ దిశో దశ ।**
**గణేశా వారితాస్తే చ నాజగ్ముః స్వామినం ప్రతి ॥ 4 ॥**

అతనిచే పీడకు గురియైన శివగణాలు దశదిశలకు పరుగులెత్తారు. గణాధ్యక్షులు శివునిచే వారింపబడినవారై, ఆ ప్రభువునకు తోడుగా వెళ్లలేదు.

**శివశ్చైవార్జునశ్చైవ యుయుధాతే పరస్పరమ్ ।**
**నానావిధైశ్చాయుధైర్హి మహాబలపరాక్రమౌ ॥ 5 ॥**

శివార్జునులు ద్వంద్వయుద్ధాన్ని చేశారు. మహాబలపరాక్రమసంపన్నులైన వారిరువురు పెక్కువిధాలైన ఆయుధాలను ప్రయోగించారు.

**శివోఽపి మనసా నూనం దయాం కృత్వార్జునం హ్యగాత్ ।**
**అర్జునశ్చ దృఢం తత్ర ప్రహారం కృతవాంస్తదా ॥ 6 ॥**

శివుడు మనస్సులో దయగలవాడై, అర్జునుని సమీపించగా, అర్జునుడు ఆయనపై పెద్ద ప్రహారాన్ని చేశాడు.

**ఆయుధాని శివస్సో వై హ్యర్జునస్యాచ్ఛినత్తదా ।**
**కవచాని చ సర్వాణి శరీరం కేవలం స్థితమ్ ॥ 7 ॥**

శివుడపుడు అర్జునుని ఆయుధాలనన్నింటిని, కవచాన్ని ఛేదించగా, అర్జునుడు కేవలం శరీరంతో నిలబడ్డాడు.

**తదార్జునః శివం స్మృత్వా మల్లయుద్ధం చకార సః ।**
**వాహినీపతినా తేన భయాత్ క్లిష్టోఽపి ధైర్యవాన్ ॥ 8 ॥**

అప్పుడు అర్జునుడు శివుని స్మరించి, భయపీడితుడైననూ, ధైర్యాన్ని వహించి కిరాతరాజుతో మల్లయుద్ధం చేశాడు.

**తద్యుద్ధేన మహీ సర్వా చకంపే ససముద్రకా ।**
**దేవా దుఃఖం సమాపన్నాః కింభవిష్యతి వా పునః ॥ 9 ॥**

ఆ యుద్ధంవల్ల సముద్రాలతో సహా భూమండలమంతా కంపించింది. 'ఏమి కాబోతున్నదో' నని దేవతలు దుఃఖాన్ని పొందారు.

**ఏతస్మిన్నంతరే దేవః శివో గగనమాస్థితః ।**
**యుద్ధం చకార తత్రస్థస్సోఽర్జునశ్చ తథాఽకరోత్ ॥ 10 ॥**

ఇంతలో శివప్రభువు ఆకాశానికి వెళ్లగా, అర్జునుడు కూడ అట్లే చేసి ఆకాశంలోనుండి యుద్ధం చేశాడు.

**ఉడ్డీయోడ్డీయ తౌ యుద్ధం చక్రతుర్దేవపార్థివౌ ।**
**దేవాశ్చ విస్మయం ప్రాపూ రణం దృష్ట్వా తదాఽద్భుతమ్ ॥ 11 ॥**

శివార్జునులిరువురూ ఆకాశంలో అటూ ఇటూ ఎగురుతూ యుద్ధాన్ని చేస్తున్నారు. అద్భుతమైన ఆ యుద్ధాన్ని గాంచి దేవతలాశ్చర్యాన్ని పొందారు.

**అథార్జునోత్తరే జ్ఞాత్వా స్మృత్వా శివపదాంబుజమ్ ।**
**దధార పాదయోస్తం వై తద్ధ్యానాదాప్తసద్బలః ॥ 12 ॥**

అంతట అర్జునుడు అనంతర కర్తవ్యాన్ని ఎరిగి, శివుని పాదపద్మాలను ధ్యానించి, శివుని ధ్యానించడంవల్ల కలిగిన మహాబలం గలవాడై, ఆయన పాదాలను పట్టుకున్నాడు.

**ధృత్వా పాదౌ తదా తస్య భ్రామయామాస సోఽర్జునః ।**
**విజహాస మహాదేవో భక్తవత్సల ఊతికృత్ ॥ 13 ॥**

అర్జునుడాయన పాదాలను పట్టుకొని గిరగిర త్రిప్పాడు. అంతట భక్తవత్సలుడు, లీలలను ప్రకటించువాడునైన మహాదేవుడు నవ్వినాడు.

**దాతుం స్వదాసతాం తస్మై భక్తవశ్యతయా మునే! ।**
**శివేనైవ కృతం హ్యేతచ్చరితం నాన్యథా భవేత్ ॥ 14 ॥**

ఓ మహర్షీ! భక్తపరాధీనుడగు శివుడతనికి తన దాస్యము నీయదలచి, స్వయంగా ఈ చరితమును ప్రవర్తిల్లజేశాడు ఈ చరితమునకు మరియొక కారణం లేదు.

**పశ్చాద్విహస్య తత్రైవ శంకరో రూపమద్భుతమ్ ।**
**దర్శయామాస సహసా భక్తవశ్యతయా శుభమ్ ॥ 15 ॥**

అనంతరం భక్తపరాధీనుడైన శంకరుడు నవ్వి, మంగళకరమైన తన అద్భుతరూపాన్ని దర్శింపజేశాడు.

**యథోక్తం వేదశాస్త్రేషు పురాణే పురుషోత్తమమ్ ।**
**వ్యాసోపదిష్టం ధ్యానాయ తస్య యత్సర్వసిద్ధిదమ్ ॥ 16 ॥**

వేదశాస్త్రములందును, పురాణములందును వర్ణింపబడినట్టియు, ఉపాసనకొరకై వ్యాసునిచే ఉపదేశింపబడినట్టియు, అర్జునునకు సర్వసిద్ధులనిచ్చునట్టిదియు, ధ్యానములో అతనిచే దర్శింపబడిన పురుషోత్తముని దర్శించెను.

**తద్దృష్ట్వా సుందరం రూపం ధ్యానప్రాప్తం శివస్య తు ।**
**బభూవ విస్మితోఽతీవ హ్యర్జునో లజ్జితః స్వయమ్ ॥ 17 ॥**

శివుని ఆ సుందరరూపాన్ని గాంచి, అర్జునుడు అత్యంతాశ్చర్యాన్ని పొందినవాడై, స్వయంగా చాలా లజ్జితుడయ్యాడు.

**అహో! శివశ్శివస్సోఽయం యో మే ప్రభుతయా వృతః ।**
**త్రిలోకేశః స్వయం సాక్షాద్ధా కృతం కిం మయాధునా ॥ 18 ॥**

అహో! శివుడు! ఈయన శివుడు! నేను ఈయనను నా ప్రభువుగా స్వీకరించియున్నాను. త్రిలోకేశుడైన ఈయన స్వయంగా ప్రత్యక్షమయ్యాడు. అయ్యో! ఇప్పుడు నేను చేసిన పనియేమి?

**ప్రభోర్బలవతీ మాయా మాయినామపి మోహినీ ।**
**కిం కృతం రూపమాచ్ఛాద్య ప్రభుణా ఛలితో హ్యహమ్ ॥ 19 ॥**

శివప్రభుని మాయ బలవత్తరమైనది. అది మాయావులను కూడ మోహింపజేస్తుంది. ప్రభువు తన యథార్థరూపాన్ని కప్పిపుచ్చి నన్ను మోసగించి ఎంత పని చేశాడు?

**ధియేతి సంవిచార్యైవం సాంజలిర్నతమస్తకః ।**
**ప్రణనామ ప్రభుం ప్రీత్యా తదోవాచ స ఖిన్నధీః ॥ 20 ॥**

అర్జునుడు తన మనస్సులో ఇట్లాలోచించి, చేతులు జోడించి, తలవంచి, ఆ ప్రభువుకు ప్రీతితో నమస్కరించాడు. ఖిన్నుడైన అర్జునుడంతట ఇట్లు పలికాడు.

**అర్జున ఉవాచ** – అర్జునుడు పలికాడు.

**దేవదేవ! మహాదేవ! కరుణాకర! శంకర! ।**
**మమాపరాధః సర్వేశ! క్షంతవ్యశ్చ త్వయా పునః ॥ 21 ॥**

ఓ దేవదేవా! మహాదేవా! కరుణాకరా! శంకరా! సర్వేశ్వరా! నీవు నా అపరాధాన్ని మన్నించుము.

**కిం కృతం రూపమాచ్ఛాద్య ఛలితో౾స్మి త్వయాధునా ।**
**ధిజ్ మాం సమరకర్తారం స్వామినా భవతా ప్రభో! ॥ 22 ॥**

ప్రభూ! నీవు నీ రూపాన్ని కప్పిపుచ్చి ఎంత పని చేశావు? నేనీనాడు నీ వలన మోసపోయాను. స్వామివైన నీతో యుద్ధం చేసిన నాకు నింద కలిగింది.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యేవం పాండవసోఽ౾థ పశ్చాత్తాపమవాప సః ।**
**పాదయోర్నిపపాతాశు శంకరస్య మహాప్రభోః ॥ 23 ॥**

ఈ విధంగా అర్జునుడు పశ్చాత్తాపాన్ని పొందినవాడై వెంటనే శంకరమహాప్రభుని పాదాలపై పడ్డాడు.

**అథేశ్వరః ప్రసన్నాత్మా ప్రత్యువాచార్జునం చ తమ్ ।**
**సమాశ్వాస్యేతి బహుశో మహేశో భక్తవత్సలః ॥ 24 ॥**

అంతట భక్తవత్సలుడు, మహేశుడునైన శంకరుడు ప్రసన్నాత్ముడై, అర్జునుని అనేక రీతులనోదార్చి అతనితో ఇట్లన్నాడు.

**శంకర ఉవాచ –** శంకరుడు పలికాడు.

**న ఖిద్య పార్థ! భక్తో౾సి మమత్వం హి విశేషతః ।**
**పరీక్షార్థం మయా తే౾ద్య కృతమేవం శుచం జహి ॥ 25 ॥**

ఓ అర్జునా! దుఃఖింపకుము. నీవు నాకు మహాభక్తుడవు. నేను నిన్ను పరీక్షించడానికే ఈనాడిలా చేశాను. దుఃఖాన్ని విడిచిపెట్టు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వా తం స్వహస్తాభ్యాముత్థాప్య ప్రభురర్జునమ్ ।**
**విలజ్జం కారయామాస గణైశ్చ స్వామినో గణైః ॥ 26 ॥**

శివుడిట్లు పలికి తన చేతులతో అర్జునుని పైకెత్తి, తాను స్వయంగా చెప్పడమేగాక, గణాలచే కూడ చెప్పించి అర్జునుడు లజ్జను విడనాడేటట్లు చేశాడు.

**పునశ్శివో౾ర్జునం ప్రాహ పాండవం వీరసమ్మతమ్ ।**
**హర్షయన్ సర్వథా ప్రీత్యా శంకరో భక్తవత్సలః ॥ 27 ॥**

మంగళకరుడు, భక్తవత్సలుడునగు శివుడు, వీరుడు, పాండుపుత్రుడునైన అర్జునుని ప్రేమతో అన్నివిధాలుగా హర్షయుక్తునిజేసి తిరిగి ఇలా పలికాడు.

**శివ ఉవాచ –** శివుడు పలికాడు.

**హే పార్థ! పాండవశ్రేష్ఠ! ప్రసన్నోఽస్మి వరం వృణు ।**
**ప్రహారైస్తాడనైస్తేఽద్య పూజనం మానితం మయా ॥ 28 ॥**

ఓ పార్థ! పాండవశ్రేష్ఠా! నేను ప్రసన్నుడనయ్యాను. వరాన్ని కోరుకొనుము. ఈనాడు నేను దెబ్బలను, పూజారూపంలో స్వీకరిస్తున్నాను.

**ఇచ్ఛయా చ కృతం మేఽద్య నాపరాధస్తవాధునా ।**
**నాదేయం విద్యతే తుభ్యం యదీచ్ఛసి వృణీష్వ తత్ ॥ 29 ॥**

ఈనాటి చరిత్ర అంతయూ నా ఇచ్ఛచే జరిగినదే. దీనిలో నీ అపరాధం లేదు. నీకు ఈయరానిది లేదు. నీకు నచ్చిన వరాన్ని కోరుకో.

**తే శత్రుషు యశోరాజ్యస్థాపనాయ శుభం కృతమ్ ।**
**ఏతద్దుఃఖం న కర్తవ్యం వైక్లబ్యం చ త్యజాఖిలమ్ ॥ 30 ॥**

నీవు శత్రువులను జయించి కీర్తిని, రాజ్యాన్ని స్థాపించడానికి శుభకరమైన తపస్సు చేశావు. నీవీ తీరున దుఃఖించకుము. నీలోని నిరుత్సాహాన్ని పూర్తిగా విడిచి పెట్టుము.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త స్త్వర్జునస్తేన ప్రభుణా శంకరేణ సః ।**
**ఉవాచ శంకరం భక్త్యా సావధానతయా స్థితః ॥ 31 ॥**

ఆ శంకర ప్రభువిట్లు పలుకగా, అర్జునుడు సావధానమనస్కుడై, శంకరునుద్దేశించి భక్తితో ఇలా పలికాడు.

**అర్జున ఉవాచ –** అర్జునుడు పలికాడు.

**భక్తప్రియస్య శంభోస్తే సుప్రభో! కిం సమీహితమ్ ।**
**వర్ణనీయం మయా దేవ! కృపాలుస్త్వం సదాశివ! ॥ 32 ॥**

ఓ సదాశివా! భక్తప్రియుడవైన నిన్ను కోరదగిన దేమిగలదని నేను చెప్పాలి. ఓ దేవా! నీవు దయామూర్తివి.

**ఇత్యుక్త్వా సంస్తుతిం తస్య శంకరస్య మహాప్రభోః ।**
**చకార పాండవస్సోఽథ సద్భక్తిం వేదసంమతామ్ ॥ 33 ॥**

అర్జునుడిట్లు పలికి, సద్భక్తితో, వేదసమ్మతమైన విధంగా శంకరమహాప్రభుని స్తుతించాడు.

**అర్జున ఉవాచ –** అర్జునుడు పలికాడు.

**నమస్తే దేవదేవాయ నమః కైలాసవాసినే ।**
**సదాశివ! సమస్తుభ్యం పంచవక్త్రాయ తే నమః ॥ 34 ॥**

దేవదేవుడవైన నీకు నమస్కారము. కైలాసవాసివైన నీకు నమస్కారము. సదాశివుడవైన నీకు నమస్కారము. పంచముఖుడవైన నీకు నమస్కారము.

**కపర్దినే నమస్తుభ్యం త్రినేత్రాయ నమోఽస్తు తే ।**
**మనః ప్రసన్నరూపాయ సహస్రవదనాయ చ ॥ 35 ॥**

జటాజూటధారివైన నీకు నమస్కారము. త్రినేత్రుడవైన నీకు నమస్కారము. మనస్సునకు ప్రసన్నతను కలిగించు రూపం గలిగిన నీకు నమస్కారము. సహస్ర వదనునకు నమస్కారము.

**నీలకంఠ! నమస్తేఽస్తు సద్యోజాతాయ వై నమః ।**
**వృషధ్వజ! నమస్తేఽస్తు వామాంగగిరిజాయ చ ॥ 36 ॥**

నీలకంఠా! నీకు నమస్కారము సద్యోజాతుడవు, వృషధ్వజుడవు, వామాంగమునందు పార్వతిని ధరించిన వాడవునైన నీకు నమస్కారము.

**దశదోషే నమస్తుభ్యం నమస్తే పరమాత్మనే ।**
**డమరుకపాలహస్తాయ నమస్తే ముండమాలినే ॥ 37 ॥**

పది భుజములు కలవాడవు, పరమాత్మవు, డమరుకమును, కపాలమును హస్తములందు ధరించినవాడవు, కపాలమాలను ధరించినవాడవునగు నీకు నమస్కారము.

**శుద్ధస్ఫటికసంకాశశుద్ధకర్పూరవర్ష్మణే ।**
**పినాకపాణయే తుభ్యం త్రిశూలవరధారిణే ॥ 38 ॥**

స్వచ్ఛమైన స్ఫటికంవలెనూ, కర్పూరంవలెనూ తెల్లని దేహం కలవాడవు, పినాకపాణివి, శ్రేష్ఠమైన త్రిశూలధారివినైన నీకు నమస్కారము.

**వ్యాఘ్రచర్మోత్తరీయాయ గజాంబరవిధారిణే ।**
**నాగాంగాయ నమస్తుభ్యం గంగాధర! నమోఽస్తు తే ॥ 39 ॥**

వ్యాఘ్రచర్మమే ఉత్తరీయంగా గలవాడవు, గజచర్మాన్ని ధరించినవాడవు, నాగములను శరీరావయవములందు ధరించినవాడవు, గంగాధరుడవునైన నీకు నమస్కారము.

**సుపాదాయ నమస్తేఽస్తు ఆరక్తచరణాయ చ ।**
**నంద్యాదిగణసేవ్యాయ గణేశాయ చ తే నమః ॥ 40 ॥**

ఎర్రని, అందమైన పాదాలు గలవాడవు, నంది మున్నగు గణాలచే సేవింపబడువాడవు, గణాధ్యక్షుడవునగు నీకు నమస్కారము.

**నమో గణేశరూపాయ కార్తికేయానుగాయ చ ।**
**భక్తిదాయ చ భక్తానాం ముక్తిదాయ నమో నమః ॥ 41 ॥**

కార్తికేయునిచే అనుసరింపబడే గణపతి నీ స్వరూపమే. భక్తులకు భక్తిని, ముక్తిని ప్రసాదించువాడవగు నీకు అనేక నమస్కారాలు.

**అగుణాయ నమస్తేఽస్తు సగుణాయ నమో నమః ।**
**అరూపాయ సరూపాయ సకలాయాకలాయ చ ॥ 42 ॥**

నిర్గుణుడవు, సగుణుడవు, రూపరహితుడవు, సరూపుడవు, సకలుడవు, అకలుడవునైన నీకు నమస్కారము.

**నమః కిరాతరూపాయ మదనుగ్రహకారిణే ।**
**యుద్ధప్రియాయ వీరాణాం నానాలీలానుకారిణే ॥ 43 ॥**

కిరాతరూపాన్ని దాల్చి నన్ను అనుగ్రహించినవాడవు, వీరులతో యుద్ధం చేయుటయందు ప్రీతిగలవాడవు, అనేకలీలలను ప్రకటించువాడవునగు నీకు నమస్కారము.

**యత్కించిద్దృశ్యతే రూపం తత్తేజస్తావకం స్మృతమ్ ।**
**చిద్రూపస్త్వం త్రిలోకేషు రమసేఽన్వయభేదతః ॥ 44 ॥**

ఈ సృష్టిలో ఏ రూపం కానవచ్చిననూ, అది నీ తేజస్సు మాత్రమేనని చెప్పబడింది. చిద్ఘనుడవగు నీవు ఉపాధిభేదంచే ముల్లోకాలందును రమిస్తున్నావు.

**గుణానాం తే న సంఖ్యాస్తి యథా భూరజసామిహ ।**
**ఆకాశే తారకాణాం హి కణానాం వృష్ట్యపామపి ॥ 45 ॥**

భూమి యొక్క రేణువులు, ఆకాశమునందలి నక్షత్రములు, వర్షమునందలి జలకణములు వలె నీ గుణాలు అసంఖ్యాకములు,

**న తే గుణాస్తు సంఖ్యాతుం వేదా వై సంభవంతి హి ।**
**మందబుద్ధిరహం నాథ! వర్ణయామి కథం పునః ॥ 46 ॥**

నాథా! నీ గుణాలు లెక్కించడానికి వేదాలు కూడ సమర్థములు కావు. అట్టి స్థితిలో మందబుద్ధినైన నేను నీ గుణాలనెట్లు వర్ణించగలను?

**సోఽసి యోఽసి నమస్తేఽస్తు కృపాం కర్తుమిహార్హసి ।**
**దాసోఽహం తే మహేశాన! స్వామీ త్వం మే మహేశ్వర! ॥ 47 ॥**

నీవు ఏదియో అదియే అగుదువు. నీకు నమస్కారము. నాయందు దయ చూపుము. నేను నీ దాసుడను. ఓ మహేశ్వరా! నీవు నా ప్రభువు.

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఇతి శ్రుత్వా వచస్తస్య పునః ప్రోవాచ శంకరః ।**
**సుప్రసన్నతరో భూత్వా విహసన్ప్రభురర్జునమ్ ॥ 48 ॥**

అర్జునుని ఈ పల్కులను విని శంకరుడు మిక్కిలి ప్రసన్నుడై నవ్వి మరల అతనితో ఇట్లు పలికాడు.

**శంకర ఉవాచ** - శంకరుడు పలికాడు.

**వచసా కిం బహూక్తేన శృణుష్వ వచనం మమ ।**
**శీఘ్రం వృణు వరం పుత్ర! సర్వం తచ్చ దదామి తే ॥ 49 ॥**

పెక్కుమాటలతో పనియేమి? నా మాట వినుము. ఓ పుత్రా! శీఘ్రంగా వరాన్ని కోరుకో. నీవు కోరినవన్నింటినీ నీకు ప్రసాదిస్తాను.

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్తశ్చార్జునస్తేన ప్రణిపత్య సదాశివమ్ ।**
**సాంజలిర్నతకః ప్రేమ్ణా ప్రోవాచ గద్గదాక్షరమ్ ॥ 50 ॥**

సదాశివుడిట్లు పలుకగా, అర్జునుడు చేతులు జోడించి, తలను వంచి ప్రణమిల్లి ప్రేమవల్ల గద్గదమైన కంఠంతో ఇలా పలికాడు.

**అర్జున ఉవాచ** - అర్జునుడు పలికాడు.

**కిం బ్రూయాం త్వం చ సర్వేషామంతర్యామితయా స్థితః ।**
**తథాఽపి వర్ణితం మేఽద్య శ్రూయతాం చ త్వయా విభో! ॥ 51 ॥**

ఓ విభో! నేనేమి చెప్పాలి? నీవు సర్వప్రాణులలో అంతర్యామివైయున్నావు. అయినను, నేను వర్ణించే విషయాన్ని నీవిప్పుడు వినుము.

**శత్రూణాం సంకటం యచ్చ తద్గతం దర్శనాత్తవ ।**
**ఐహికీం చ పరాం సిద్ధిం ప్రాప్నుయాం వై తథా కురు ॥ 52 ॥**

నీ దర్శనంవల్ల శత్రువుల సంకటం తొలగిపోయింది. నాకు ఇహలోకంలో సర్వశ్రేష్ఠమైన సిద్ధి కలిగేటట్లు చేయుము.

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వా తం నమస్కృత్య శంకరం భక్తవత్సలమ్ ।**
**నతస్కంధోఽర్జునస్తత్ర బద్ధాంజలిరుపస్థితః ॥ 53 ॥**

భక్తవత్సలుడైన శంకరునకు అర్జునుడు తలవంచి నమస్కరించి ఇట్లు పలికి చేతులు కట్టుకొని అచ్చటనే నిలబడ్డాడు.

**శివోఽపి చ తథాభూతం జ్ఞాత్వా పాండవమర్జునమ్ ।**
**నిజభక్తవరం స్వామీ మహాతుష్టో బభూవ హ ॥ 54 ॥**

పాండుపుత్రుడు, నిజభక్తవరుడునైన అర్జునుడు ఆ విధంగా నిలబడడాన్ని గాంచి, శివస్వామి మహానందాన్ని పొందాడు.

**అస్త్రం పాశుపతం స్వీయం దుర్జయం సర్వదాఽఖిలైః ।**
**దదౌ తస్మై మహేశానో వచనం చేదమబ్రవీత్ ॥ 55 ॥**

అంతట మహేశ్వరుడు ఏ కాలమునందైననూ, ఎవరి చేతనైననూ జయింప శక్యము కాని తన పాశుపతాస్త్రాన్ని అతనికిచ్చి ఇట్లు పలికాడు.

**శివ ఉవాచ** – శివుడు పలికాడు.

**స్వం మహాస్త్రం మయా దత్తం దుర్జయస్త్వం భవిష్యసి ।**
**అనేన సర్వశత్రూణాం జయకృత్యమవాప్నుహి ॥ 56 ॥**

నేను నీకు నా మహాస్త్రాన్ని ఇస్తున్నాను. నీవు దుర్జయుడవు కాగలవు. దీని ప్రభావంచే శత్రువులనందరినీ జయించుము.

**కృష్ణం చ కథయిష్యామి సాహాయ్యం తే కరిష్యతి ।**
**స వై మమాత్మభూతశ్చ మద్భక్తః కార్యకారకః ॥ 57 ॥**

నేను శ్రీకృష్ణునితో చెబుతాను. ఆయన నీకు సహాయం చేస్తాడు. ఆయన నాకు ఆత్మ. నా భక్తుడు. అంతేగాదు కార్యకారకుడు.

**మత్ప్రభావాన్ భారత! త్వం రాజ్యం నిష్కంటకం కురు ।**
**ధర్మాన్నానావిధాన్ భ్రాత్రా కారయ త్వం చ సర్వదా ॥ 58 ॥**

ఓ అర్జునా! నా ప్రభావంచే నీవు రాజ్యంలోని శత్రువులనందరిని ఏరివేసి, రాజ్యాన్ని నిష్కంటకం చేయుము. నీవు సర్వదా మీ అన్నగారిచే నానా విధాలైన ధర్మాలననుష్ఠింపజేయుము.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఇత్యుక్త్వా నిజహస్తం చ ధృత్వా శిరసి తస్య సః ।**
**పూజితో హ్యర్జునేనాశు శంకరోఽంతరధీయత ॥ 59 ॥**

శంకరుడిట్లు పలికి తన చేతిని అర్జునుని శిరస్సుపై నుంచి, అర్జునునిచే పూజింపబడినవాడై, వెంటనే అదృశ్యుడయ్యాడు.

**అథార్జునః ప్రసన్నాత్మా ప్రాప్యాస్త్రం చ వరం ప్రభోః ।**
**జగామ స్వాశ్రమే ముఖ్యం స్మరన్ భక్త్యా గురుం శివమ్ ॥ 60 ॥**

అంతట అర్జునుడు ప్రసన్నాత్ముడై, శివప్రభువునుండి అస్త్రాన్ని, వరాన్ని పొంది మహనీయుడైన శివుని భక్తితో స్మరిస్తూ, తన ఆశ్రమానికి వెళ్లాడు.

**సర్వే తే భ్రాతరః ప్రీతాస్తన్వాః ప్రాణమివాగతమ్ ।**
**మిళిత్వా తం సుఖం ప్రాపుర్ద్రౌపదీ చాతి సువ్రతా ॥ 61 ॥**

తన సోదరులందరూ, మరియు ద్రౌపది అతనితో కలసి తమ శరీరాలలోనికి ప్రాణాలు మరలివచ్చినట్లు సుఖాన్ని పొందారు.

**శివం పరం చ సంతుష్టం పాండవాః సర్వ ఏవ హి ।**
**నాతృప్యన్ సర్వవృత్తాంతం శ్రుత్వా హర్షముపాగతాః ॥ 62 ॥**

శివుడు మిక్కిలి సంతుష్టుడైన వృత్తాంతమునంతటినీ విని, ఆ సోదరులందరూ మహానందాన్ని పొందారు. ఎంత విన్ననూ వారికి తనివి తీరలేదు.

**ఆశ్రమే పుష్పవృష్టిశ్చ చందనేన సమన్వితా ।**
**పపాత సుకరార్థం చ తేషాం చైవ మహాత్మనామ్ ॥ 63 ॥**

మహాత్ములైన ఆ సోదరుల సౌభాగ్యానికై వారి ఆశ్రమంలో చందనంతో కూడిన పుష్పాలు వర్షించాయి.

**ధన్యం చ శంకరం చైవ నమస్కృత్య శివం ముదా ।**
**అవధిం చాగతం జ్ఞాత్వా జయశ్చైవ భవిష్యతి ॥ 64 ॥**

సంపదల నిచ్చి, మంగళములను కలిగించు శివునకు వారు ఆనందంతో నమస్కరించి, తమ అరణ్యవాసానికి ముగింపు సమీపించిందని తెలుసుకొని, విజయం లభించగలదని ఆశించారు.

**ఏతస్మిన్నంతరే కృష్ణశ్శ్రుత్వాఽర్జునమథాగతమ్ ।**
**మేలనాయ సమాయాతః శ్రుత్వా సుఖముపాగతః ॥ 65 ॥**

ఇంతలో అర్జునుడు సుఖంగా తిరిగి వచ్చాడని విని అతనిని కలియడానికి శ్రీకృష్ణుడు విచ్చేశాడు.

**అతశ్చైవ మయాఖ్యాతః శంకరః సర్వదుఃఖహా ।**
**స సేవ్యతే మయా నిత్యం భవద్భిరపి సేవ్యతామ్ ॥ 66 ॥**

ఇందువల్లనే, శంకరుడు సర్వదుఃఖాలను పోగొట్టునని నేను నిత్యమూ ఆయనను సేవిస్తున్నాను. గనుక మీరు కూడ ఆయనను సేవించుమని నేను మీకు చెప్పినానని శ్రీకృష్ణుడు వారితో చెప్పాడు.

**ఇత్యుక్తస్తే కిరాతాహ్వో౾వతారశ్శంకరస్య వై ।**
**తం శ్రుత్వా శ్రావయన్వాపి సర్వాన్ కామానవాప్నుయాత్ ॥ 67 ॥**

నేనింతవరకు శివుని కిరాతావతారాన్ని వర్ణించాను. దీనిని వినినవారు, వినిపించినవారు, తమ కోర్కెల నన్నింటిని పొందుతారు.

**ఇత్యష్టాశీత్యవతారాః ।**

ఇంత వరకు ఎనుబది ఎనిమిది అవతారాలు వర్ణింపబడ్డాయి.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం కిరాతేశ్వరావతారవర్ణనం నామైకచత్వారింశో౾ధ్యాయః ॥ 41 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు కిరాతేశ్వరావతారవర్ణనం అనే పేరుగల నలభైఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్విచత్వారింశోఽధ్యాయః - నలభైరెండవ అధ్యాయం

## ద్వాదశ జ్యోతిర్లింగావతారవర్ణనమ్ - ద్వాదశ జ్యోతిర్లింగాలఅవతారవర్ణనం

**నందీశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**అవతారాన్ శృణు విభోర్ద్వాదశప్రమితాన్వరాన్ ।**
**జ్యోతిర్లింగస్వరూపాన్వై నానోతి కారకాన్మునే! ॥ 1 ॥**

ఓ మహర్షీ! జ్యోతిర్లింగ రూపములలోనున్న, అనేక లీలలను ప్రదర్శించునవి అగు పన్నెండు పరమేశ్వరావతారాలను గూర్చి వినుము.

**సౌరాష్ట్రే సోమనాథంశ్చ శ్రీశైలే మల్లికార్జునః ।**
**ఉజ్జయిన్యాం మహాకాల ఓంకారే చామరేశ్వరః ॥ 2 ॥**

**కేదారో హిమవత్పృష్ఠే డాకిన్యాం భీమశంకరః ।**
**వారాణస్యాం చ విశ్వేశస్త్ర్యంబకో గౌతమీతటే ॥ 3 ॥**

**వైద్యనాథశ్చితాభూమౌ నాగేశో దారుకావనే ।**
**సేతుబంధే చ రామేశో ఘుశ్మేశశ్చ శివాలయే ॥ 4 ॥**

**అవతారద్వాదశకమేతచ్ఛంభోః పరాత్మనః ।**
**సర్వానందకరం పుంసాం దర్శనాత్స్పర్శనాన్మునే! ॥ 5 ॥**

సౌరాష్ట్రదేశంలో సోమనాథుడు, శ్రీశైలంలో మల్లికార్జునుడు, ఉజ్జయినిలో మహాకాలుడు, ఓంకారంలో అమరేశ్వరుడు, హిమవచ్ఛిఖరంపై కేదారేశ్వరుడు, డాకినీలో భీమశంకరుడు, వారాణసిలో విశ్వేశుడు, గౌతమీతీరంలో త్ర్యంబకుడు, చితాభూమిలో వైద్యనాథుడు, దారుకావనంలో నాగేశుడు, సేతుబంధంలో రామేశుడు, శివాలయంలో ఘుశ్మేశుడు - అనునవి పరమాత్మయైన శంభుని పన్నెండవతారాలు. ఓ మహర్షీ! స్పృశించుటచేత, దర్శించుటచేత మానవులకు ఈ లింగాలు అన్నివిధాలుగా ఆనందములను ఇస్తాయి.

**తత్రాద్యస్సోమనాథోఽహి చంద్రదుఃఖక్షయంకరః ।**
**క్షయకుష్ఠాదిరోగాణాం నాశకః పూజనాన్మునే! ॥ 6 ॥**

ఓ మహర్షీ! అందులో మొదటిది సోమనాథుడు, ఆయన చంద్రుని దుఃఖాన్ని పోగొట్టినవాడు. ఆయనను పూజిస్తే క్షయ, కుష్ఠు ఇత్యాది రోగాలు తొలగిపోతాయి.

**శివావతారస్సోమేశో లింగరూపేణ సంస్థితః ।**
**సౌరాష్ట్రే శుభదేశే చ శశినా పూజితః పురా ॥ 7 ॥**

శివుడు పూర్వం మంగళకరమైన సౌరాష్ట్రదేశంలో లింగరూపంలో ఆవిర్భవించగా, చంద్రుడు ఆయనను అర్చించాడు.

**చంద్రకుండం చ తత్రైవ సర్వపాపవినాశకమ్ ।**
**తత్ర స్నాత్వా నరో ధీమాన్సర్వరోగైః ప్రముచ్యతే ॥ 8 ॥**

అచ్చటనే సర్వపాపాలను పోగొట్టే చంద్రకుండం కలదు. బుద్ధిమంతుడగు మానవుడు దానియందు స్నానం చేసి, రోగాలన్నింటినుండి విముక్తిని పొందవచ్చు.

**సోమేశ్వరం మహాలింగం శివస్య పరమాత్మకమ్ ।**
**దృష్ట్వా ప్రముచ్యతే పాపాద్భుక్తిం ముక్తిం చ విందతి ॥ 9 ॥**

పరమాత్మస్వరూపమైన శివుని సోమేశ్వరమహాలింగాన్ని దర్శించే మానవుడు పాపవిముక్తిని, పొంది భుక్తిని మరియు ముక్తిని పొందుతాడు.

**మల్లికార్జునసంజ్ఞశ్చావతారశ్శంకరస్య వై ।**
**ద్వితీయః శ్రీగిరౌ తాత! భక్తాభీష్టఫలప్రదః ॥ 10 ॥**

ఓ వత్సా! భక్తాభీష్టఫలప్రదుడైన శంకరుడు శ్రీశైలమునందు 'మల్లికార్జునుడు' అనే పేరుతో అవతరించాడు. ఇది రెండవ జ్యోతిర్లింగము.

**సంస్తుతో లింగరూపేణ సుతదర్శనహేతుతః ।**
**గతస్తత్ర మహాప్రీత్యా స శివః స్వగిరేర్మునే! ॥ 11 ॥**

పుత్రసంతానాన్ని కోరువారు లింగరూపంలోనున్న మల్లికార్జునుని స్తుతిస్తారు. శివుడు తన కైలాసంనుండి శ్రీశైలానికి మహానందంతో విచ్చేశాడు.

**జ్యోతిర్లింగం ద్వితీయం తద్దర్శనాత్పూజనాన్మునే! ।**
**మహాసుఖకరం చాంతే ముక్తిదం నాత్ర సంశయః ॥ 12 ॥**

ఓ మునీ! ఈ రెండవ జ్యోతిర్లింగాన్ని దర్శించి, పూజించే వారికి మహాసుఖాలు కలగడమే గాక, మరణించిన పిదప ముక్తి కూడా లభిస్తుందనడంలో సందేహం లేదు.

**మహాకాలాభిధస్తాతావతారశ్శంకరస్య వై ।**
**ఉజ్జయిన్యాం నగర్యాం చ బభూవ స్వజనావనః ॥ 13 ॥**

వత్సా! తన భక్తులను 'మహాకాలుడు' అనే పేరుతో కాపాడే శివుని అవతారం ఉజ్జయినీ నగరంలో అవతరించింది.

**దూషణాఖ్యాసురం యస్తు వేదధర్మప్రమర్దకమ్ ।**
**ఉజ్జయిన్యాం గతం విప్రద్వేషిణం సర్వనాశనమ్ ॥ 14 ॥**

దూషణుడనే రాక్షసుడు వేదధర్మాన్ని నశింపజేయువాడై బ్రాహ్మణులను ద్వేషిస్తూ ఉజ్జయినిలో గల సమస్తాన్ని నాశనం చేశాడు.

**వేదవిప్రసుతధ్యాతో హుంకారేణైవ స ద్రుతమ్ ।**
**భస్మసాత్కృతవాంస్తం చ రత్నమాలనివాసినమ్ ॥ 15 ॥**

అప్పుడు బ్రాహ్మణులు, వారి పుత్రులు వేదాలతో శివుని ప్రార్థించగా ఆయన వెంటనే రత్నమాలనగర–వాసియైన ఆ దూషణుని హుంకారంతో భస్మం చేశాడు.

**తం హత్వా స మహాకాలో జ్యోతిర్లింగస్వరూపతః ।**
**దేవైస్స ప్రార్థితోఽతిష్ఠత్స్వ భక్త పరిపాలకః ॥ 16 ॥**

తన భక్తులను రక్షించే ఆ మహాకాలుడు దేవతలచే ప్రార్థింపబడినవాడై అచ్చటనే జ్యోతిర్లింగరూపంలో ఆవిర్భవించి స్థిరంగా అచ్చటనే యున్నాడు.

**మహాకాలాహ్వయం లింగం దృష్ట్వాఽభ్యర్చ్య ప్రయత్నతః ।**
**సర్వాన్కామానవాప్నోతి లభతే పరతో గతిమ్ ॥ 17 ॥**

మహాకాలేశ్వర లింగాన్ని దర్శించి, శ్రద్ధతో అర్చించే మానవుడు సమస్తమైన అభీష్టాలను పొందడమేగాక, మరణించిన పిదప పరమగతిని పొందుతాడు.

**ఓంకారః పరమేశానో ధృతః శంభోః పరాత్మనః ।**
**అవతారశ్చతుర్థో హి భక్తాభీష్టఫలప్రదః ॥ 18 ॥**

శంభుపరమాత్మ ఓంకారేశ్వరుని రూపంలో కూడ అవతరించాడు. ఈ నాల్గవ అవతారం భక్తాభీష్టఫల ప్రదమైనది.

**విధినా స్థాపితో భక్త్యా స్వలింగాత్పార్థివాన్మునే! ।**
**ప్రాదుర్భూతో మహాదేవో వింధ్యకామప్రపూరకః ॥ 19 ॥**

ఓ మునీ! వింధ్యుడు యథావిధిగా పార్థివలింగాన్ని స్థాపించి భక్తితో అర్చించాడు. ఆ పార్థివలింగం నుండి మహాదేవుడావిర్భవించి, వింధ్యుని కోర్కెను తీర్చాడు.

**దేవైస్సంప్రార్థితస్తత్ర ద్విధారూపేణ సంస్థితః ।**
**భుక్తిముక్తిప్రదో లింగరూపో వై భక్తవత్సల ॥ 20 ॥**

లింగరూపంలో నుండి భక్తులకు భుక్తిని, ముక్తిని ప్రసాదించే భక్తప్రియుడైన శివుడు దేవతల ప్రార్థనను మన్నించి, అక్కడ రెండు రూపాలలో ఆవిర్భవించాడు.

**ప్రణవే చైవ చోంకార నామాసీల్లింగముత్తమమ్ ।**
**పరమేశ్వర నామాసీత్పార్థివశ్చ మునీశ్వర ॥ 21 ॥**

ఓ మునీశ్వరా! వాటిలో ఒకటి ఓంకారంలో ఓంకారేశ్వరుడనే పేరు ఆవిర్భవించిన ఉత్తమలింగం. రెండవది పరమేశ్వరుడనే పేరుతో గల పార్థివలింగం.

**భక్తాభీష్టప్రదో జ్ఞేయో యోఽపి దృష్టోఽర్చితో మునే! ।**
**జ్యోతిర్లింగే మహాదివ్యే వర్ణితే తే మహామునే! ॥ 22 ॥**

ఓ మునీ! పైన వర్ణింపబడిన మహాదివ్యములైన ఈ రెండు జ్యోతిర్లింగాలలో ఏ ఒక్కదానినైననూ దర్శించి, అర్చించు భక్తుల అభీష్టాలను పరమేశ్వరుడు తీరుస్తాడు.

**కేదారేశోఽవతారస్తు పంచమః పరమశ్శివః ।**
**జ్యోతిర్లింగస్వరూపేణ కేదారే సంస్థితస్స చ ॥ 23 ॥**

పరమశివుడు కేదారమునందు 'కేదారేశ్వరుడు' అనే పేరుతో అయిదవ జ్యోతిర్లింగంగా అవతరించి యున్నాడు.

**నరనారాయణాఖ్యౌ యావవతారౌ హరేర్మునే! ।**
**తత్ప్రార్థితశ్శివస్తత్రైః కేదారే హిమభూధరే ॥ 24 ॥**

ఓ మహర్షీ! హిమవత్పర్వతమునందలి కేదారంలో శ్రీహరియొక్క అవతారాలైన నరనారాయణులు గలరు. వారు, అచటనున్న ఇతరులు ప్రార్థించగా శివుడు 'కేదారేశ్వరుడు' అనే పేరుతో అవతరించాడు.

**తాభ్యాం చ పూజితో నిత్యం కేదారేశ్వరసంజ్ఞకః ।**
**భక్తాభీష్టప్రదః శంభుర్దర్శనాదర్చనాదపి ॥ 25 ॥**

ఆ పరమశివుడు ప్రతిదినమూ, నరనారాయణుల పూజలనందుకుంటూ, భక్తాభీష్టఫలప్రదుడై, ఆయనను దర్శించు, అర్చించు భక్తుల కోర్కెలను నెరవేరుస్తున్నాడు.

**అస్య ఖండస్య స స్వామీ సర్వేశోఽపి విశేషతః ।**
**సర్వకామప్రదస్తాత! సోఽవతారశ్శివస్య వై ॥ 26 ॥**

వత్సా! శివుడు సర్వేశ్వరుడైననూ, విశేషించి ఈ అవతారంలో ఆ ప్రాంతానికి ప్రభువై వెలిశాడు. ఈ శివావతారం కోర్కెలనన్నింటిని నెరవేరుస్తుందని ప్రసిద్ధి.

**భీమశంకరసంజ్ఞస్తు షష్ఠః శంభోర్మహాప్రభోః ।**
**అవతారో మహాలీలో భీమాసురవినాశనః ॥ 27 ॥**

గొప్పలీలలను ప్రదర్శించే శంభుమహాప్రభుడు 'భీమశంకరుడు' అనే పేర ఆరవ అవతారంగా అవతరించి భీమాసురుని సంహరించాడు.

**సుదక్షిణాభిధం భక్తం కామరూపేశ్వరం నృపమ్ ।**
**యో రరక్షాద్భుతం హత్వాఽసురం తం భక్తదుఃఖదమ్ ॥ 28 ॥**

సుదక్షిణుడను పేరు గల భక్తుడును, కామరూపదేశ ప్రభువును, భక్తులకు దుఃఖాన్ని కలిగించే భయంకరుడైన భీమాసురుని బారినుండి రక్షించాడు.

**భీమశంకరనామా స డాకిన్యాం సంస్థిత స్స్వయమ్ ।**
**జ్యోతిర్లింగస్వరూపేణ ప్రార్థితస్తేన శంకరః ॥ 29 ॥**

ఆ రాజు ప్రార్థనను మన్నించి శంకరుడు డాకినీ నగరంలో భీమశంకరుడనే పేర జ్యోతిర్లింగమై స్వయంగా వెలసియున్నాడు.

**విశ్వేశ్వరావతారస్తు కాశ్యాం జాతో హి సప్తమః ।**
**సర్వబ్రహ్మాండరూపశ్చ భుక్తిముక్తిప్రదో మునే! ॥ 30 ॥**

ఓ మహర్షీ! సర్వబ్రహ్మాండస్వరూపుడు, భుక్తి ముక్తి ప్రదుడునగు శంకరుడు కాశీ నగరంలో విశ్వేశ్వరుడై, ఏడవ జ్యోతిర్లింగంగా అవతరించాడు.

**పూజితస్సర్వదేవైశ్చ భక్త్యా విష్ణ్వాదిభిస్సదా ।**
**కైలాసపతినా చాపి భైరవేణాపి నిత్యశః ॥ 31 ॥**

విష్ణువు మున్నగు సర్వదేవతలు, కైలాసపతియు, భైరవుడు కూడ ఆయనను నిత్యం భక్తితో పూజిస్తారు.

**జ్యోతిర్లింగస్వరూపేణ సంస్థితస్తత్ర ముక్తిదః ।**
**స్వయం సిద్ధస్వరూపో హి తథా స్వపురి స ప్రభుః ॥ 32 ॥**

ముక్తిదాతయగు శివప్రభుడు స్వీయనగరంలో స్వయంభూజ్యోతిర్లింగస్వరూపుడై వెలసియున్నాడు.

**కాశీవిశ్వేశయోర్భక్త్యా తన్నామజపకారకాః ।**
**నిర్లిప్తాః కర్మభిర్నిత్యం కైవల్యపదభాగినః ॥ 33 ॥**

ఎవరైతే కాశీ నగరాన్ని, విశ్వేశ్వరుని ఆరాధించి, భక్తితో శివనామాన్ని జపిస్తారో వారు సర్వదా కర్మబంధం-నుండి విముక్తులై కైవల్యపదాన్ని పొందుతారు.

**త్ర్యంబకాఖ్యోఽవతారో యః సోఽష్టమో గౌతమీతటే ।**
**ప్రార్థితో గౌతమేనావిర్బభూవ శశిమౌళినః ॥ 34 ॥**

చంద్రమౌళి యొక్క ఎనిమిదవ అవతారం త్ర్యంబకావతారం గౌతమ మహర్షి ప్రార్థించగా, గౌతమీ నదీ తీరంలో ఆవిర్భవించింది.

**గౌతమస్య ప్రార్థనయా జ్యోతిర్లింగస్వరూపతః ।**
**స్థితస్తత్రాచలః ప్రీత్యా తన్మునేః ప్రీతికామ్యయా ॥ 35 ॥**

గౌతమమహర్షి ప్రార్థనచే, ఆ మహర్షికి ప్రీతి కలిగింపగోరి శివుడు జ్యోతిర్లింగరూపంలో అక్కడ స్థిరంగానున్నాడు.

**తస్య సందర్శనాత్స్పర్శాద్దర్శనాచ్చ మహేశితుః ।**
**సర్వే కామాః ప్రసిధ్యంతి తతో ముక్తిర్భవేదహో! ॥ 36 ॥**

ఆహా! ఆ మహేశ్వరుని దర్శించి, స్పృశించిన వారికి కోర్కెలన్నీ ఈడేరుటయేగాక, దేహత్యాగానంతరం ముక్తి కూడా కలుగుతుంది.

**శివానుగ్రహతస్తత్ర గంగానామ్నా తు గౌతమీ ।**
**సంస్థితా గౌతమప్రీత్యా పావనీ శంకరప్రియా ॥ 37 ॥**

శంకరప్రియయు, పావనియునగు గంగ శివానుగ్రహంవల్ల గౌతమునికి ప్రీతిని కలిగించడానికి అచ్చట గౌతమి అనే పేరుతో ప్రవహించింది.

**వైద్యనాథావతారో హి నవమస్తత్ర కీర్తితః ।**
**ఆవిర్భూతో రావణార్థం బహులీలాకరః ప్రభుః ॥ 38 ॥**

జ్యోతిర్లింగాలలో తొమ్మిదవ అవతారం వైద్యనాథుడు. బహులీలాకరుడైన ఆ ప్రభువు రావణుని కొరకు ఆ రూపంలో అవతరించాడు.

**తదానయనరూపం హి వ్యాజం కృత్వా మహేశ్వరః ।**
**జ్యోతిర్లింగస్వరూపేణ చితాభూమౌ ప్రతిష్ఠితః ॥ 39 ॥**

రావణుడు తనను గొనిపోవుట అనే మిషను ఆధారంగా చేసుకొని, మహేశ్వరుడు చితాభూమిలో జ్యోతిర్లింగ స్వరూపంలో వెలసియున్నాడు.

**వైద్యనాథేశ్వరో నామ్నా ప్రసిద్ధోఽభూజ్జగత్త్రయే ।**
**దర్శనాత్పూజనాద్భక్త్యా భుక్తిముక్తిప్రదః స హి ॥ 40 ॥**

వైద్యనాథేశ్వరుని పేరు ముల్లోకాలలో ప్రసిద్ధి పొందింది. ఆయనను భక్తితో దర్శించి, పూజించేవారికి ఆయన భుక్తిని ముక్తిని కూడ ప్రసాదిస్తాడు.

**వైద్యనాథేశ్వరశివమాహాత్మ్యమనుశాసనమ్ ।**
**పఠతాం శృణ్వతాం చాపి భుక్తిముక్తిప్రదం మునే! ॥ 41 ॥**

ఓ మహర్షీ! వైద్యనాథేశ్వరుని రూపంలో అవతరించిన శివుని మాహాత్మ్యాన్ని, ఈ ఉపదేశాన్ని పఠించే వారికి, వినేవారికి కూడ భుక్తి, ముక్తి లభిస్తుంది.

**నాగేశ్వరావతారస్తు దశమః పరికీర్తితః ।**
**ఆవిర్భూతః స్వభక్తార్థం దుష్టానాం దండదస్సదా ॥ 42 ॥**

పదియవ అవతారం నాగేశ్వరుడని కీర్తింపబడ్డాడు. సర్వదా దుష్టులను శిక్షించే శివుడు తన భక్తుని కొరకై ఆ రూపంలో ఆవిర్భవించాడు.

**హత్వా దారుకనామానం రాక్షసం ధర్మఘాతకమ్ ।**
**స్వభక్తం వైశ్యనాథం చ ప్రారక్షత్సుప్రియాభిధమ్ ॥ 43 ॥**

ఆయన, ధర్మవిధ్వంసియైన దారుకాసురుని సంహరించి, వైశ్యప్రభువు, తనకు భక్తుడునగు సుప్రియుని రక్షించాడు.

**లోకానాముపకారార్థం జ్యోతిర్లింగస్వరూపధృక్ ।**
**సంతస్థౌ సాంబికశ్శంభుర్బహులీలాకరః పరః ॥ 44 ॥**

బహులీలాకరుడైన శంభుప్రభుడు లోకాలకుపకారం చేయడానికి పార్వతితో కూడి జ్యోతిర్లింగరూపంలో ప్రకటమై స్థిరంగా నెలకొన్నాడు.

**తద్దృష్ట్వా శివలింగం తు మునే! నాగేశ్వరాభిధమ్ ।**
**వినశ్యంతి ద్రుతం చార్చ్య మహాపాతకరాశయః ॥ 45 ॥**

సనత్కుమారా! నాగేశ్వరుడనే పేరు గల ఆ శివలింగాన్ని దర్శించి, అర్చిస్తే వెంటనే మహాపాపాల గుట్టలైనా పూర్తిగా నశిస్తాయి.

**రామేశ్వరావతారస్తు శివస్యైకాదశః స్మృతః ।**
**రామచంద్రప్రియకరో రామసంస్థాపితో మునే! ॥ 46 ॥**

మునీశ్వరా! శివుని పదకొండవ అవతారం రామేశ్వరావతారమని చెప్పారు. రాముడు స్థాపించిన ఆ రామేశ్వరుడు రామచంద్రునికి హితాన్ని కల్గించాడు.

**దదౌ జయవరం ప్రీత్యా యో రామాయ సుతోషితః ।**
**ఆవిర్భూతస్సలింగస్తు శంకరో భక్తవత్సలః ॥ 47 ॥**

భక్తవత్సలుడైన ఆ శంకరుడు లింగరూపంలో ఆవిర్భవించి, మిక్కిలి సంతసించినవాడై రామునకు విజయాన్ని వరంగా ఇచ్చాడు.

**రామేణ ప్రార్థితోఽత్యర్థం జ్యోతిర్లింగస్వరూపతః ।**
**సంతస్థౌ సేతుబంధే చ రామసంసేవితో మునే! ॥ 48 ॥**

ఓ మునీ! రామునిచే సేవింపబడిన ఆ శివుడు రాముడధికంగా ప్రార్థింపగా జ్యోతిర్లింగస్వరూపంతో సేతుబంధంతో స్థిరంగా వెలసియున్నాడు.

**రామేశ్వరస్య మహిమాఽద్భుతోఽభూద్భువి చాతులః ।**
**భుక్తిముక్తిప్రదశ్చైవ సర్వదా భక్తకామదః ॥ 49 ॥**

రామేశ్వరుని మహిమ చాలా అద్భుతమైనది. భూలోకంలో దానికి సాటి మరియొకటి లేదు. రామేశ్వరుడు సర్వదా భక్తులకు కామనలను, భుక్తిని, ముక్తిని కూడ ఇస్తూ ఉంటాడు.

**తం చ గంగాజలేనైవ స్నాపయిష్యతి యో నరః ।**
**రామేశ్వరం చ సద్భక్త్యా స జీవన్ముక్త ఏవ హి ॥ 50 ॥**

ఏ మానవుడు ఆయనను గంగాజలంతో మహాభక్తిపూర్వకంగా అభిషేకిస్తాడో, ఆ మానవుడు రామేశ్వరుని అనుగ్రహంచే జీవన్ముక్తుడౌతాడు.

**ఇహ భుక్త్వాఽఖిలాన్భోగాన్దేవతాదుర్లభానపి ।**
**అతః ప్రాప్య పరం జ్ఞానం కైవల్యం మోక్షమాప్నుయాత్ ॥ 51 ॥**

అట్టివాడు ఇహలోకంలో దేవతలకు కూడ దుర్లభమైన భోగాలనన్నింటిని అనుభవించి, దేహత్యాగానంతరం పరమజ్ఞానాన్ని, కైవల్యాన్ని, మోక్షాన్ని పొందుతాడు.

**ఘృష్ణేశ్వరావతారస్తు ద్వాదశశ్శంకరస్య హి ।**
**నానాలీలాకరో ఘుష్ణానందదో భక్తవత్సలః ॥ 52 ॥**

శంకరుని పన్నెండవ అవతారం ఘృష్ణేశ్వరుడు. భక్తవత్సలుడైన శివుడు అనేక లీలలను ప్రకటించి, ఘుష్ణాకు ఆనందాన్ని కలిగించాడు.

**దక్షిణస్యాం దిశి మునే! దేవశైలసమీపతః ।**
**ఆవిర్బభూవ సరసి ఘుశ్మాప్రియకరః ప్రభుః ॥ 53 ॥**

ఓ మునీ! దక్షిణదిక్కునందు దేవశైలానికి సమీపంలో శివుడు సరస్సునందు ఆవిర్భవించి, ఘుశ్మకు ప్రీతిని కలిగించాడు.

**సుదేహ్యామారితం ఘుశ్మాపుత్రం సాకల్యతో మునే! ।**
**తుష్టస్తద్భక్తితశ్శంభుర్యోఽరక్షద్భక్తవత్సలః ॥ 54 ॥**

ఓ మహర్షీ! సుదేహ తనచెల్లియగు ఘుశ్మయొక్క పుత్రుని సంహరించగా ఘుశ్మయొక్క భక్తికి భక్తవత్సలుడైన శంభువు సంతసించి, అతనిని పూర్తిగా రక్షించాడు.

**తత్రప్రార్థితస్స వై శంభుస్తడాగే తత్ర కామదః ।**
**జ్యోతిర్లింగస్వరూపేణ తస్థౌ ఘుశ్మేశ్వరాభిధః ॥ 55 ॥**

ఓ మహర్షీ! ఆమె ప్రార్థించగా, ఆమె కోర్కెను తీర్చుటకై శంభువు అచ్చటి సరస్సులో ఘుశ్మేశ్వరుడనే పేరుతో జ్యోతిర్లింగరూపుడై వెలిశాడు.

**తం దృష్ట్వా శివలింగం తు సమభ్యర్చ్య చ భక్తితః ।**
**ఇహ సర్వసుఖం భుక్త్వా తతో ముక్తిం చ విందతి ॥ 56 ॥**

ఆ శివలింగాన్ని దర్శించి, భక్తితో ఆరాధించే వ్యక్తి, ఇహలోకంలో సుఖాలనన్నింటినీ అనుభవించి, అనంతరం ముక్తిని కూడా పొందుతాడు. (ఔరంగాబాదుకు సమీపంతో ఘుశ్మేశ్వరక్షేత్రమున్నది. ఈ క్షేత్రము 'ఘృష్ణేశ్వరం' అని వ్యవహరింప బడుచున్నది.)

**ఇతి తే హి సమాఖ్యాతా జ్యోతిర్లింగావళీ మయా ।**
**ద్వాదశప్రమితా దివ్యా భుక్తిముక్తిప్రదాయినీ ॥ 57 ॥**

ఈ విధంగా భుక్తి ముక్తి ప్రదమైనట్టియు, దివ్యమైనట్టియు, ద్వాదశ జ్యోతిర్లింగాల క్రమాన్ని నీకు చక్కగా చెప్పియున్నాను.

**ఏతాం జ్యోతిర్లింగకథాం యః పఠేచ్ఛృణుయాదపి ।**
**ముచ్యతే సర్వపాపేభ్యో భుక్తిం ముక్తిం చ విందతి ॥ 58 ॥**

ఈ జ్యోతిర్లింగవృత్తాంతాన్ని ఎవడు పఠిస్తాడో, ఎవడు వింటాడో, వాడు పాపాలన్నింటినుండి విముక్తుడై, భుక్తిని, ముక్తిని పొందుతాడు.

**శతరుద్రాభిధా చేయం వర్ణితా సంహితా మయా ।**
**శతావతారసత్కీర్తిస్సర్వకామఫలప్రదా ॥ 59 ॥**

నేనింతవరకు శతరుద్రసంహితను వర్ణించాను. కోర్కెల నన్నింటిని ఈడేర్చి, సత్ఫలాలనిచ్చే ఈ సంహితయందు, శివుని వంద అవతారాల పుణ్యకీర్తి వర్ణింపబడింది.

**ఇమాం యః పఠతే నిత్యం శృణుయాద్వా సమాహితః ।**
**సర్వాన్కామానవాప్నోతి తతో ముక్తిం లభేద్ధ్రువమ్ ॥ 60 ॥**

ఎవడైతే దీనిని నిత్యం పఠిస్తాడో, లేదా సమాహితచిత్తుడై వింటాడో, అట్టివాడు తన అభీష్టాలనన్నింటిని పొంది, పిదప నిశ్చయంగా ముక్తిని పొందుతాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే తృతీయాయాం శతరుద్రసంహితాయాం సనత్కుమారనందీశ్వరసంవాదే ద్వాదశజ్యోతిర్లింగావతారవర్ణనం నామ ద్విచత్వారింశోఽధ్యాయః ॥ 42 ॥**

శ్రీశివమహాపురాణంలోని మూడవదియగు శతరుద్రసంహితయందు సనత్కుమార – నందీశ్వర సంవాదములో ద్వాదశజ్యోతిర్లింగాల అవతారవర్ణనం అనే పేరుగల నలభైరెండవ అధ్యాయం సమాప్తం.

**॥ సమాప్తేయం శతరుద్రసంహితా ॥**

॥శతరుద్రసంహిత సమాప్తం॥

## కోటిరుద్రసంహిత

## ప్రథమోఽధ్యాయః - మొదటి అధ్యాయం

## జ్యోతిర్లింగ - తదుపలింగమాహాత్మ్యవర్ణనమ్ - జ్యోతిర్లింగాలు వాటి ఉపలింగాలమాహాత్మ్యవర్ణనం

**యో ధత్తే నిజమాయయైవ భువనాకారం వికారోజ్ఝితో**
**యస్యాహుః కరుణాకటాక్షవిభవౌ స్వర్గాపవర్గాభిధౌ ।**
**ప్రత్యగ్బోధసుఖాద్వయం హృది సదా పశ్యంతి యం యోగినః**
**తస్మై శైలసుతాజితార్ధవపుషే శశ్వన్నమస్తేజసే ॥ 1 ॥**

ఏ పరమాత్మ వికారరహితుడై తన మాయచే జగద్రూపాన్ని ధరించియున్నాడో, స్వర్గమోక్షాలు ఎవని కరుణాకటాక్షాల మహిమచే మాత్రమే సిద్ధిస్తున్నాయో, ఎవనిని సచ్చిదానంద, అద్వితీయ, ఆత్మరూపంగా యోగులు హృదయాలలో దర్శిస్తున్నారో, ఏ శివుడు పార్వతీదేవిచే అర్ధాంగంగా అలంకరింపబడినాడో అటువంటి తేజస్స్వరూపుడగు శివునకు అనేక ప్రణామాలు.

**కృపాలలితవీక్షణం స్మితమనోజ్ఞవక్త్రాంబుజం శశాంకకలయోజ్జ్వలం శమితఘోరతాపత్రయమ్ ।**
**కరోతు కిమపి స్ఫురత్పరమసౌఖ్యసచ్చిద్వపుర్ధరాధరసుతాభుజోద్వలయితం మహో మంగళమ్ ॥ 2 ॥**

దయతో సుందరమైన చూపులు గలిగి, చిరునవ్వుతో సుందరమైన పద్మంవంటి ముఖంతో, చంద్రరేఖతో ప్రకాశిస్తూ, భయంకరమైన తాపత్రయాలను శమింపజేస్తూ, సచ్చిదానందవిగ్రహములతో ప్రకాశిస్తూ, పార్వతీ భుజాలింగనంతో కూడిన ఒకానొక వర్ణింప శక్యం కాని జ్యోతిస్సు మంగళాన్ని కలిగించు గాక!

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**సమ్యగుక్తం త్వయా సూత! లోకానాం హితకామ్యయా ।**
**శివావతారమాహాత్మ్యం నానాఖ్యానసమన్వితమ్ ॥ 3 ॥**

ఓ సూతా! నీవు లోకాల హితాన్ని కోరి అనేక గాథలతో కూడిన శివావతారమహిమను చక్కగా చెప్పావు.

**పునశ్చ కథ్యతాం తాత! శివమాహాత్మ్యముత్తమమ్ ।**
**లింగసంబంధి సుప్రీత్యా ధన్యస్త్వం శైవసత్తమః ॥ 4 ॥**

ఓ తండ్రీ! శివభక్తులలో శ్రేష్ఠుడవైన నీవు ధన్యుడవు. నీవు మరల శివునికి సంబంధించిన అతిశయించిన ప్రీతితో శివలింగంయొక్క ఉత్తమమాహాత్మ్యాన్ని చెప్పుము.

**శృణ్వన్తస్త్వన్ముఖాంభోజాన్న తృప్తాస్స్మో వయం ప్రభో! ।**
**శైవం యశోఽమృతం రమ్యం తదేవ పునరుచ్యతామ్ ॥ 5 ॥**

ఓ ప్రభూ! నీ ముఖపద్మంనుండి శివయశస్సు అనే రమ్యమైన అమృతాన్ని ఆస్వాదిస్తున్న మాకు తృప్తి కలగడం లేదు. కావున అదే గాథను మరలా చెప్పుము.

**పృథివ్యాం యాని లింగాని తీర్థే తీర్థే శుభాని హి ।**
**అన్యత్ర వా స్థలే యాని ప్రసిద్ధాని స్థితాని వై ॥ 6 ॥**

**తాని తాని చ దివ్యాని లింగాని పరమేశితుః ।**
**వ్యాసశిష్య! సమాచక్ష్వ లోకానాం హితకామ్యయా ॥ 7 ॥**

ఓ వ్యాసశిష్యా! భూమండలంలో వివిధ తీర్థాలలో, క్షేత్రాలలో, తదితర స్థలాలలో మంగళకరములు, ప్రసిద్ధములు, దివ్యములు అయిన పరమేశ్వరుని లింగాలను లోకహితం కోసం చెప్పుము.

**సూత ఉవాచ** - సూతమహర్షి చెప్పాడు.

**సాధు పృష్టమృషిశ్రేష్ఠ! లోకానాం హితకామ్యయా ।**
**కథయామి భవత్స్నేహాత్తాని సంక్షేపతో ద్విజాః! ॥ 8 ॥**

ఓ ఋషిశ్రేష్ఠా! నీవు లోకాల హితాన్ని కోరి చక్కగా ప్రశ్నించావు. ఓ బ్రాహ్మణులారా! మీ యందలి ప్రేమచే వాటిని గూర్చి సంక్షేపంగా చెబుతాను.

**సర్వేషాం శివలింగానాం మునే! సంఖ్యా న విద్యతే ।**
**సర్వా లింగమయీ భూమిః సర్వం లింగమయం జగత్ ॥ 9 ॥**

ఓ మునీ! సమస్త శివలింగాల సంఖ్య కానరాదు. ఈ భూమండలమంతా లింగమయం. ఈ జగత్తంతా లింగమయం.

**లింగమయాని తీర్థాని సర్వం లింగే ప్రతిష్ఠితమ్ ।**
**సంఖ్యా న విద్యతే తేషాం తాని కించిద్బ్రువీమ్యహమ్ ॥ 10 ॥**

సమస్తతీర్థాలు లింగమయాలే. సర్వము లింగంలోనే ప్రతిష్ఠితమయ్యింది. లింగాలకు సంఖ్యలేదు. నేను వాటిని గూర్చి కొద్దిగా చెబుతాను.

**యత్కించిద్ దృశ్యతే దృశ్యం వర్ణ్యతే స్మర్యతే చ యత్ ।**
**తత్సర్వం శివరూపం హి నాన్యదస్తీతి కించన ॥ 11 ॥**

ఏ దృశ్యం అయితే చూడబడుచున్నదో, వర్ణింపబడుచున్నదో, స్మరింపబడుచున్నదో, అది అంతా శివస్వరూపమే. శివునికంటె భిన్నమైనదేదీ ఈ జగత్తులో లేదు.

**తథాపి శ్రూయతాం ప్రీత్యా కథయామి యథా శ్రుతమ్ ।**
**లింగాని చ ఋషిశ్రేష్ఠాః! పృథివ్యాం యాని తాని హ ॥ 12 ॥**

అయినప్పటికీ ఓ మునిపుంగవులారా! పృథివిలో ఏయే లింగాలున్నాయో, వాటిని గూర్చి నేను విన్నంతవరకు సంతోషంగా చెబుతాను. వినండి.

**పాతాళే చాపి వర్తంతే స్వర్గే చాపి తథా భువి ।**
**సర్వత్ర పూజ్యతే శంభుః సదేవాసురమానుషైః ॥ 13 ॥**

శివలింగాలు పాతాళలోకంలోను, స్వర్గలోకంలోను, భూలోకంలోను ఉన్నాయి. దేవతలు, అసురులు, మానవులు సర్వత్రా శివుని పూజిస్తారు. (భూమియందు మానవులూ, పాతాళంలో రాక్షసులూ, స్వర్గంలో దేవతలూ పూజిస్తారు.)

**త్రిజగచ్ఛంభునా వ్యాప్తం సదేవాసురమానుషమ్ ।**
**అనుగ్రహాయ లోకానాం లింగరూపేణ సత్తమాః! ॥ 14 ॥**

సత్పురుషులారా! దేవాసురమానవులతో కూడిన ఈ ముల్లోకాలను అనుగ్రహించడం కోసం, పరమశివుడు లింగరూపంతో సర్వత్రా వ్యాపించియున్నాడు.

**అనుగ్రహాయ లోకానాం లింగాని చ మహేశ్వరః ।**
**దధాతి వివిధాన్యత్ర తీర్థే చాన్యస్థలే తథా ॥ 15 ॥**

మహేశ్వరుడు లోకాలననుగ్రహించడానికి, ఈ భూలోకంలోని తీర్థాలలోని గాక, తదితరస్థలాలలో కూడ వివిధ లింగరూపాలను ధరిస్తున్నాడు.

**యత్ర యత్ర యదా శంభుర్భక్త్యా భక్తైశ్చ సంస్మృతః ।**
**తత్ర తత్రావతీర్యాథ కార్యం కృత్వా స్థితస్తదా ॥ 16 ॥**

ఎక్కడెక్కడైతే భక్తులు భక్తితో శంభుని స్మరిస్తారో, అక్కడక్కడ ఆయన అవతరించి కార్యాన్ని చక్కబెట్టి అక్కడే స్థిరంగా ఉండిపోతాడు.

**లోకానాముపకారార్థం స్వలింగం చాప్యకల్పయత్ ।**
**తల్లింగం పూజయిత్వా తు సిద్ధిం సమధిగచ్ఛతి ॥ 17 ॥**

ఆయన లోకోపకారము కొఱకు లింగరూపంలో కూడ అవతరిస్తూంటాడు. ఆయా లింగాలను సేవించిన భక్తులు సిద్ధిని పొందుతారు.

**పృథివ్యాం యాని లింగాని తేషాం సంఖ్యా న విద్యతే ।**
**తథాపి చ ప్రధానాని కథ్యంతే చ మయా ద్విజాః! ॥ 18 ॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! భూమండలమునందలి లింగాలను గణించడం అసంభవం. అయినా నేను ప్రధానమైనవాటిని చెబుతాను.

**ప్రధానేషు చ యానీహ ముఖ్యాని ప్రవదామ్యహమ్ ।**
**యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే మానవః క్షణాత్ ॥ 19 ॥**

ప్రధానమైన వాటిలో కూడా మరింత ముఖ్యమైన వాటిని గూర్చి నేను చెబుతాను. దీనిని విన్న మానవుడు వెంటనే పాపాలనుండి ముక్తుడౌతాడు.

**జ్యోతిర్లింగాని యానీహ ముఖ్యముఖ్యాని సత్తమ! ।**
**తాన్యహం కథయామ్యద్య శ్రుత్వా పాపం వ్యపోహతి ॥ 20 ॥**

ఓ మహాత్మా! ఈ లోకంలో అత్యంత ప్రముఖమైన జ్యోతిర్లింగాలను గూర్చి నేనిప్పుడు చెబుతాను. దీనిని విన్నవారి పాపాలు వెంటనే నశిస్తాయి.

**సౌరాష్ట్రే సోమనాథం చ శ్రీశైలే మల్లికార్జునమ్ ।**
**ఉజ్జయిన్యాం మహాకాలమోంకారే పరమేశ్వరమ్ ॥ 21 ॥**

**కేదారం హిమవత్పృష్ఠే డాకిన్యాం భీమశంకరమ్ ।**
**వారాణస్యాం చ విశ్వేశం త్ర్యంబకం గౌతమీతటే ॥ 22 ॥**

**వైద్యనాథం చితాభూమౌ నాగేశం దారుకావనే ।**
**సేతుబంధే చ రామేశం ఘుశ్మేశం చ శివాలయే ॥ 23 ॥**

**ద్వాదశైతాని నామాని ప్రాతరుత్థాయ యః పఠేత్ ।**
**సర్వపాపవినిర్ముక్తః సర్వసిద్ధిఫలం లభేత్ ॥ 24 ॥**

సౌరాష్ట్ర దేశంలో సోమనాథుడు, శ్రీశైలంలో మల్లికార్జునుడు, ఉజ్జయినిలో మహాకాలుడు, ఓంకారంలో పరమేశ్వరుడు, హిమవత్పర్వతాలలో కేదారేశ్వరుడు, డాకినిలో భీమశంకరుడు, వారాణసిలో విశ్వేశ్వరుడు, గోదావరితీరంలో త్ర్యంబకేశ్వరుడు, శ్మశానభూమిలో వైద్యనాథుడు, దారుకావనంలో నాగేశ్వరుడు, సేతుబంధంలో రామేశ్వరుడు, శివాలయంలో ఘుశ్మేశ్వరుడు. ఉదయాన్నే లేచిన వెంటనే ఈ పన్నెండు నామాలను పఠించినవాడు పాపాలన్నింటినుండి విముక్తుడై సర్వసిద్ధుల ఫలాన్ని పొందుతాడు.

**యం యం కామమపేక్ష్యైవ పఠిష్యంతి నరోత్తమాః ।**
**ప్రాప్స్యంతి కామం తం తం హి పరత్రేవ మునీశ్వరాః! ॥ 25 ॥**

ఓ మహర్షులారా! మానవశ్రేష్ఠులు ఏయే కోరికలను అపేక్షించి దీనిని పఠిస్తారో వారు ఆయా కోరికలను, ఇహ - పరలోకాల్లో పొందుతారు.

**యే నిష్కామతయా తాని పఠిష్యంతి శుభాశయాః ।**
**తేషాం చ జననీగర్భే వాసో నైవ భవిష్యతి ॥ 26 ॥**

శుద్ధమైన అంతఃకరణము గల మానవులు నిష్కామంతో ఆ నామాలను పఠిస్తే వారికి పునర్జన్మ ఉండదు.

**ఏతేషాం పూజనేనైవ వర్ణానాం దుఃఖనాశనమ్ ।**
**ఇహ లోకే పరత్రాపి ముక్తిర్భవతి నిశ్చితమ్ ॥ 27 ॥**

ఈ లింగాలరూపాలను పూజించినంతమాత్రాన సర్వవర్ణాలవారికి ఈ లోకంలో దుఃఖాలు నశించడమే గాక, పరలోకంలో కూడ నిశ్చింతగా మోక్షం కల్గుతుంది.

**గ్రాహ్యమేషాం చ నైవేద్యం భోజనీయం ప్రయత్నతః ।**
**తత్కర్తుః సర్వపాపాని భస్మసాద్యాంతి వై క్షణాత్ ॥ 28 ॥**

ఈ జ్యోతిర్లింగాల నైవేద్యాన్ని ప్రయత్నపూర్వకంగా స్వీకరించి శ్రద్ధగా భుజించిన వాని పాపాలన్నీ వెనువెంటనే భస్మమౌతాయి.

**జ్యోతిషాం చైవ లింగానాం బ్రహ్మాదిభిరలం ద్విజాః! ।**
**విశేషతః ఫలం వక్తుం శక్యతే న పరైస్తథా ॥ 29 ॥**

ఓ బ్రాహ్మణులారా! జ్యోతిర్లింగార్చనాఫలాన్ని బ్రహ్మాదులైనా విశేషంగా వర్ణించలేరు. ఇతరుల గురించి చెప్పవలసినదేమున్నది?

**ఏకం చ పూజితం యేన షణ్మాసం తన్నిరంతరమ్ ।**
**తస్య దుఃఖం న జాయేత మాతృకుక్షిసముద్భవమ్ ॥ 30 ॥**

నిరంతరం ఆరుమాసాలపాటు ఒక లింగాన్ని పూజించిన వానికి మాతృగర్భవాసమనే పునర్జన్మ దుఃఖం కలుగదు.

**హీనయోనౌ యదా జాతో జ్యోతిర్లింగం చ పశ్యతి ।**
**తస్య జన్మ భవేత్తత్ర విమలే సత్కులే పునః ॥ 31 ॥**

హీనయోనిలో జన్మించిన ప్రాణి జ్యోతిర్లింగాన్ని దర్శిస్తే, ఆ ప్రాణి మరుజన్మలో పవిత్రమైన సత్కులంలో జన్మిస్తుంది.

**సత్కులే జన్మ సంప్రాప్య ధనాఢ్యో వేదపారగః ।**
**శుభకర్మ తదా కృత్వా ముక్తిం యాత్యనపాయినీమ్ ॥ 32 ॥**

ఆ జీవుడు సత్కులంలో జన్మించి ధనవంతుడు మాత్రమే గాక వేదవిదుడై పవిత్రకర్మలనాచరించి శాశ్వతమైన మోక్షాన్ని పొందుతాడు.

**మ్లేచ్ఛో వాऽప్యంత్యజో వాపి షండో వాపి మునీశ్వరాః! ।**
**ద్విజో భూత్వా భవేన్ముక్తస్తస్మాత్తద్దర్శనం చరేత్ ॥ 33 ॥**

ఓ మహర్షులారా! మ్లేచ్ఛుడుగాని, (వేదాచారాన్ని ఆచరించనివాడు) అంత్యజుడుగాని, నపుంసకుడుగాని జ్యోతిర్లింగాన్ని దర్శిస్తే ద్విజుడై పుట్టి ముక్తిని పొందుతాడు. కాబట్టి జ్యోతిర్లింగాలను విధిగా దర్శించాలి.

**జ్యోతిషాం చైవ లింగానాం కించిత్ప్రోక్తం ఫలం మయా ।**
**జ్యోతిషాం చోపలింగాని శ్రూయంతామృషిసత్తమాః! ॥ 34 ॥**

ఓ మహర్షులారా! జ్యోతిర్లింగాల ఫలాన్ని నేను కొంతవఱకు మాత్రమే చెప్పాను. జ్యోతిర్లింగాల ఉపలింగాలను గూర్చి వినండి.

**సోమేశ్వరస్య యల్లింగమంతకేశముదాహృతమ్ ।**
**మహ్యాస్సాగరసంయోగే తల్లింగముపలింగకమ్ ॥ 35 ॥**

మహీ అనే నది సముద్రంలో కలిసే (మాళవ దేశంలో) చోటగల అంతకేశ్వరలింగం సోమేశ్వరుని ఉపలింగం.

**మల్లికార్జునసంభూతముపలింగముదాహృతమ్ ।**
**రుద్రేశ్వరమితి ఖ్యాతం భృగుకక్షే సుఖావహమ్ ॥ 36 ॥**

భృగుకక్షలో గల సుఖాలనిచ్చే రుద్రేశ్వరలింగం మల్లికార్జునుని నుండి ఉద్భవించడంచేత అది దానికి ఉపలింగమయ్యింది.

**మహాకాలభవం లింగం దుగ్ధేశమితి విశ్రుతమ్ ।**
**నర్మదాయాం ప్రసిద్ధం తత్సర్వపాపహరం స్మృతమ్ ॥ 37 ॥**

మహాకాలేశ్వరునినుండి ఉద్భవించి, నర్మదానదీతీరంలో వెలిసిన లింగం దుగ్ధేశ్వరలింగమని ప్రసద్ధిచెందింది. ఇది సర్వపాపాలను పోగొడుతుంది.

**ఓంకారజం చ యల్లింగం కర్దమేశమితి శ్రుతమ్ ।**
**ప్రసిద్ధం బిందుసరసి సర్వకామఫలప్రదమ్ ॥ 38 ॥**

ఓంకారేశ్వరునినుండి ఉద్భవించి, కర్దమేశుడని ప్రసద్ధిగాంచిన లింగం బిందుసరస్సులో ఉండి సర్వుల కోర్కెలను (అన్ని కోరికలనూ) తీరుస్తూ సత్ఫలాలనిస్తోంది.

**కేదారేశ్వరసంజాతం భూతేశం యమునాతటే ।**
**మహాపాపహరం ప్రోక్తం పశ్యతామర్చతాన్తథా ॥ 39 ॥**

కేదారేశ్వరంనుండి ఉద్భవించి, యమునాతీరంలో నున్న భూతేశ్వరుడు తనను దర్శించినవారికి, అర్చించువారికి మహాపాపాలను పోగొడతాడని చెప్పబడింది.

**భీమశంకరసంభూతం భీమేశ్వరమితి స్మృతమ్ ।**
**సహ్యాచలే ప్రసిద్ధం తన్మహాబలవివర్ధనమ్ ॥ 40 ॥**

భీమశంకరునినుండి ఉద్భవించిన భీమేశ్వరుడు సహ్యాద్రిలో ఉంటూ గొప్ప బలాన్ని వర్ధిల్లజేస్తాడని మహర్షులు చెబుతారు.

**నాగేశ్వరసముద్భూతం భూతేశ్వరముదాహృతమ్ ।**
**మల్లికాసరసీతీరే దర్శనాత్పాపహారకమ్ ॥ 41 ॥**

నాగేశ్వరునినుండి ఉద్భవించి, మల్లికాసరోవరతీరమునందు వెలసిన భూతేశ్వరుడు దర్శనమాత్రం చేతనే పాపాలను పోగొడుతాడు.

**రామేశ్వరాచ్చ యజ్జాతం గుప్తేశ్వరమితి స్మృతమ్ ।**
**ఘుశ్మేశాచ్చైవ యజ్జాతం వ్యాఘ్రేశ్వరమితి స్మృతమ్ ॥ 42 ॥**

రామేశ్వరునినుండి ఉద్భవించినది గుప్తేశ్వరలింగము, ఘుశ్మేశ్వరునినుండి వెలసినది వ్యాఘ్రేశ్వర లింగము అని మహర్షులు చెబుతారు.

**జ్యోతిర్లింగోపలింగాని ప్రోక్తానీహ మయా ద్విజాః! ।**
**దర్శనాత్పాపహారీణి సర్వకామప్రదాని చ ॥ 43 ॥**

ఓ బ్రాహ్మణులారా! దర్శనమాత్రం చేతనే పాపాలు పోగొట్టి కోర్కెలనన్నిటిని తీర్చే జ్యోతిర్లింగములు మరియు వాని ఉపలింగాలను గూర్చి చెప్పాను.

**ఏతాని సుప్రధానాని ముఖ్యతాం హి గతాని చ ।**
**అన్యాని చాపి ముఖ్యాని శ్రూయంతామృషిసత్తమాః! ॥ 44 ॥**

ఓ మహర్షులారా! ఇవి మిక్కిలి ప్రధానమైన శివలింగాలుగా ప్రసిద్ధిగాంచాయి. ఇంకనూ మరికొన్ని ముఖ్యలింగాలను గూర్చి చెబుతాను వినండి.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం జ్యోతిర్లింగ-తదుపలింగమాహాత్మ్యవర్ణనం నామ ప్రథమోఽధ్యాయః ॥ 1 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు జ్యోతిర్లింగాలు వాటి ఉపలింగాల మాహాత్మ్యవర్ణనం అనే పేరుగల మొదటి అధ్యాయం సమాప్తం.

## ద్వితీయోఽధ్యాయః - రెండవ అధ్యాయం

## శివలింగమాహాత్మ్యవర్ణనమ్ - శివలింగమాహాత్మ్యవర్ణనం

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**గంగాతీరే సుప్రసిద్ధా కాశీ ఖలు విముక్తిదా ।**
**సా హి లింగమయీ జ్ఞేయా శివవాసస్థలీ స్మృతా ॥ 1 ॥**

గంగాతీరంలో మోక్షమిచ్చే క్షేత్రంగా ప్రసిద్ధిగాంచినది కాశీక్షేత్రం. లింగాలతో నిండియున్న ఆ క్షేత్రం శివుని నివాసస్థలమని ఋషులు చెబుతారు.

**లింగం తత్రైవ ముఖ్యం చ సంప్రోక్తమవిముక్తకమ్ ।**
**కృత్తివాసేశ్వరః సాక్షాత్తత్తుల్యా వృద్ధబాలకాః ॥ 2 ॥**

అక్కడ గల ప్రధానలింగానికి అవిముక్తకమనిపేరు. సాక్షాత్తుగా చర్మాంబరధారియగు మహాశివుడే ఆ విధంగా వెలిశాడు. అక్కడి పిల్లలు, పెద్దలు శివునితో సమానమైనవారు.

**తిలభాండేశ్వరశ్చైవ దశాశ్వమేధ ఏవ చ ।**
**గంగాసాగరసంయోగే సంగమేశ ఇతి స్మృతః ॥ 3 ॥**

దశాశ్వమేధమని ప్రసిద్ధిపొందినచోట తిలభాండేశ్వరుడున్నాడు. గంగాసాగరసంగమమునందలి శివునకు సంగమేశ్వరుడని పేరు.

**భూతేశ్వరో యః సంప్రోక్తో భక్తసర్వార్థదః సదా ।**
**నారీశ్వర ఇతి ఖ్యాతః కౌశిక్యాః స సమీపగః ॥ 4 ॥**

భూతేశ్వరుడని ప్రసిద్ధిగాంచిన శివుడు సర్వదా భక్తుల కోర్కెలనన్నిటిని తీరుస్తాడని చెప్పబడింది. కౌశికీనదికి సమీపంలో నారీశ్వరుడని ఖ్యాతినందిన శివుడున్నాడు.

**వర్తతే గండకీతీరే బటుకేశ్వర ఏవ సః ।**
**పూరేశ్వర ఇతి ఖ్యాతః ఫల్గుతీరే సుఖప్రదః ॥ 5 ॥**

గండకీనదీతీరంలో బటుకేశ్వరుడు, ఫల్గునదీతీరంలో సుఖాలనిచ్చే పూరేశ్వరుడు ఉన్నారు.

**సిద్ధనాథేశ్వరశ్చైవ దర్శనాత్సిద్ధిదో నృణామ్ ।**
**దూరేశ్వర ఇతి ఖ్యాతః పత్తనే చోత్తరే తథా ॥ 6 ॥**

సిద్ధనాథేశ్వరుడు దర్శనం చేతనే మానవులకు సిద్ధిని కలిగిస్తాడు. ఉత్తరదిక్కున గల పట్టణంలో దూరేశ్వరుడని ప్రసిద్ధినొందిన శివుడున్నాడు.

**శృంగేశ్వరశ్చ నామ్నా వై వైద్యనాథస్తథైవ చ ।**
**జప్యేశ్వరస్తథా ఖ్యాతో యో దధీచిరణస్థలే ॥ 7 ॥**

శృంగేశ్వరుడు, వైద్యనాథుడు కూడ అక్కడే ఉన్నారు. దధీచి యుద్ధం చేసిన స్థలంలో శివుడు జప్యేశ్వరుడనే పేర వెలిశాడు.

**గోపేశ్వరః సమాఖ్యాతః రంగేశ్వర ఇతి స్మృతః ।**
**వామేశ్వరశ్చ నాగేశః కామేశో విమలేశ్వరః ॥ 8 ॥**

**వ్యాసేశ్వరశ్చ విఖ్యాతః సుకేశశ్చ తథైవ హి ।**
**భాండేశ్వరశ్చ విఖ్యాతో హుంకారేశస్తథైవ చ ॥ 9 ॥**

**సురోచనశ్చ విఖ్యాతో భూతేశ్వర ఇతి స్వయమ్ ।**
**సంగమేశస్తథా ప్రోక్తో మహాపాతకనాశనః ॥ 10 ॥**

గోపేశ్వర, రంగేశ్వర, వామేశ్వర, నాగేశ్వర, కామేశ్వర, విమలేశ్వర, వ్యాసేశ్వర, సుకేశేశ్వర, భాండేశ్వర, హుంకారేశ్వర, సురోచనేశ్వర, భూతేశ్వరులు అనే లింగాలు స్వయంభూలింగాలని ప్రసిద్ధి. ఈ లింగములన్నియు మహాపాతకాలను పోగొడతాయని ప్రసిద్ధి.

**తతశ్చ తప్తకాతీరే కుమారేశ్వర ఏవ చ ।**
**సిద్ధేశ్వరశ్చ విఖ్యాతః సేనేశశ్చ తథా స్మృతః ॥ 11 ॥**

అట్లే తప్తకానదీ తీరంలో కుమారేశ్వరుడున్నాడు. అతడు సిద్ధేశ్వరుడు, సేనేశ్వరుడు అని పిలువబడుతున్నాడు.

**రామేశ్వర ఇతి ప్రోక్తః కుంభేశశ్చ పరో మతః ।**
**నందీశ్వరశ్చ పుంజేశః పూర్ణాయాం పూర్ణకస్తథా ॥ 12 ॥**

రామేశ్వరుడు అలాగే కుంభేశ్వరుడు, నందీశ్వరుడు, పుంజేశుడు కూడా గొప్ప దైవమని పెద్దలు చెబుతారు. అట్లే పూర్ణానదీతీరంలో పూర్ణేశ్వరుడు ప్రఖ్యాతులే.

**బ్రహ్మేశ్వరః ప్రయాగే చ బ్రహ్మణా స్థాపితః పురా ।**
**దశాశ్వమేధతీర్థే హి చతుర్వర్గఫలప్రదః ॥ 13 ॥**

పూర్వం ప్రయాగలో దశాశ్వమేధతీర్థంలో ధర్మార్థకామమోక్షాలనిచ్చే బ్రహ్మేశ్వరుని బ్రహ్మ ప్రతిష్ఠించాడు.

**తథా సోమేశ్వరస్తత్ర సర్వాపద్వినివారకః ।**
**భారద్వాజేశ్వరశ్చైవ బ్రహ్మవర్చఃప్రవర్ధకః ॥ 14 ॥**

అదేవిధంగా అచ్చటి సోమేశ్వరుడు ఆపదలనన్నిటినీ నివారిస్తాడు. భారద్వాజేశ్వరుడు బ్రహ్మవర్చస్సు వర్ధిల్లజేస్తాడు.

**శూలటంకేశ్వరః సాక్షాత్కామనాప్రద ఈరితః ।**
**మాధవేశశ్చ తత్రైవ భక్తరక్షావిధాయకః ॥ 15 ॥**

శివుని స్వయంభూలింగమైన శూలటంకేశ్వరుడు భక్తుల కోర్కెలన్నీ తీర్చేవాడుగా ప్రతీతి. అచ్చటనే మాధవేశ్వరుడు వెలసి భక్తులను రక్షిస్తున్నాడు.

**నాగేశాఖ్యః ప్రసిద్ధో హి సాకేతనగరే ద్విజాః! ।**
**సూర్యవంశోద్భవానాం చ విశేషేణ సుఖప్రదః ॥ 16 ॥**

ఓ బ్రాహ్మణులారా! అయోధ్యానగరంలో వెలసి, సూర్యవంశరాజులకు విశేష సుఖాన్నిచ్చినవాడుగా నాగేశ్వరుడు ప్రసిద్ధుడు.

**పురుషోత్తమపుర్యాం తు భువనేశస్సుసిద్ధిదః ।**
**లోకేశశ్చ మహాలింగః సర్వానందప్రదాయకః ॥ 17 ॥**

పురుషోత్తమపురంలో వెలసిన భువనేశ్వరుడు సిద్ధిదాయకుడు. సకలానందప్రదాయకుడైన లోకేశ్వర మహాలింగం కూడా ఇక్కడే వెలసియున్నది.

**కామేశ్వరః శంభులింగో గంగేశః పరశుద్ధికృత్ ।**
**శక్రేశ్వరః శుక్రసిద్ధో లోకానాం హితకామ్యయా ॥ 18 ॥**

శంభుని లింగావతారమైన కామేశ్వరుడు, పరమపావనుడైన గంగేశ్వరుడు ప్రసిద్ధమైనవారే. ఇక్కడ శివుడు లోకహితాన్ని కోరి శక్రేశ్వరుడు, శుక్రసిద్ధుడు అనుపేర్లతో రూపాలలో వెలిసినాడు.

**తథా వటేశ్వరః ఖ్యాతః సర్వకామఫలప్రదః ।**
**సింధుతీరే కపాలేశో వక్త్రేశః సర్వపాపహా ॥ 19 ॥**

అదేవిధంగా సింధునదీతీరంలో కోర్కెలన్నిటినీ ఈడేర్చే వటేశ్వరుడు, కపాలేశ్వరుడు, వక్త్రేశ్వరుడు వెలిశారు సర్వపాపాలను పోగొట్టే వక్త్రేశ్వరుడు ప్రసిద్ధమైనవాడు.

**ధౌతపాపేశ్వరః సాక్షాదంశేన పరమేశ్వరః ।**
**భీమేశ్వర ఇతి ప్రోక్తః సూర్యేశ్వర ఇతి స్మృతః ॥ 20 ॥**

సాక్షాత్తుగా పరమేశ్వరుడు తన అంశతో ధౌతపాపేశ్వరుడైనాడు. అతడే భీమేశ్వరుడు, సూర్యేశ్వరుడు అని కూడా పిలవబడినాడు.

**నందేశ్వరశ్చ విజ్ఞేయో జ్ఞానదో లోకపూజితః ।**
**నాకేశ్వరో మహాపుణ్యస్తథా రామేశ్వరః స్మృతః ॥ 21 ॥**

లోకపూజితుడైన నందేశ్వరుడు జ్ఞానదాతగా ప్రసిద్ధుడు. మహాపుణ్యప్రదాతయైన నాకేశ్వరుడు, రామేశ్వరుడుగా సుప్రసిద్ధుడు.

**విమలేశ్వరనామా వై కంటకేశ్వర ఏవ చ ।**
**పూర్ణసాగరసంయోగే ధర్తుకేశస్తథైవ చ ॥ 22 ॥**

విమలేశ్వరుడు, కంటకేశ్వరుడుగా పిలువబడిన స్వయంభూలింగము, పూర్ణానదియొక్క సాగరసంగమంలో ధర్తుకేశ్వరుడుగా ప్రసిద్ధుడు.

**చంద్రేశ్వరశ్చ విజ్ఞేయశ్చంద్రకాంతిఫలప్రదః ।**
**సర్వకామప్రదశ్చైవ సిద్ధేశ్వర ఇతి స్మృతః ॥ 23 ॥**

చంద్రేశ్వరుడు భక్తులకు చంద్రునివంటి తేజం ఇచ్చేవాడుగా ప్రసిద్ధి. అన్నికోరికలూ తీర్చే లింగానికి సిద్ధేశ్వరుడనిపేరు.

**బిల్వేశ్వరశ్చ విఖ్యాతశ్చాంధకేశస్తథైవ చ ।**
**యత్ర వా హ్యంధకో దైత్యః శంకరేణ హతః పురా ॥ 24 ॥**

పూర్వం శంకరుడు అంధకాసురుని సంహరించిన చోట, బిల్వేశ్వరుడు, అంధకేశ్వరుడు అనియూ ప్రఖ్యాతినందియున్నాడు.

**అయం స్వరూపమంశేన ధృత్వా శంభుః పునః స్థితః ।**
**శరణేశ్వర విఖ్యాతో లోకానాం సుఖదః సదా ॥ 25 ॥**

లోకాలను సర్వదా సుఖాలనిచ్చే శివుడు అంశరూపంగా అవతరించి, శరణేశ్వరుడని ఖ్యాతినందాడు.

**కర్దమేశః పరః ప్రోక్తః కోటీశశ్చార్బుదాచలే ।**
**అచలేశశ్చ విఖ్యాతో లోకానాం సుఖదః సదా ॥ 26 ॥**

అర్బుదపర్వతం మీద వెలసిన కర్దమేశుడు కోటీశుడు, అచలేశ్వరుడు అను పేర్లతో సర్వదా సుఖాలనిచ్చే శ్రేష్ఠమైన దైవంగా ప్రసిద్ధిని పొందాడు.

**నాగేశ్వరస్తు కౌశిక్యాస్తీరే తిష్ఠతి నిత్యశః ।**
**అనంతేశ్వరసంజ్ఞశ్చ కల్యాణశుభభాజనః ॥ 27 ॥**

కౌశికీతీరంలో నాగేశ్వరుడు నిత్యనివాసియైయున్నాడు. అతడు కల్యాణాలకు, శుభాలకు కారణమైన అనంతేశ్వరుడుగా పిలువబడినాడు.

**యోగేశ్వరశ్చ విఖ్యాతో వైద్యనాథేశ్వరస్తథా ।**
**కోటీశ్వరశ్చ విజ్ఞేయః సప్తేశ్వర ఇతి స్మృతః ॥ 28 ॥**

యోగేశ్వరుడు, వైద్యనాథేశ్వరుడు, కోటీశ్వరుడు, సప్తేశ్వరుడు అన్న పేర్లతో శివుడు ఋషులచే వర్ణింపబడినాడు.

**భద్రేశ్వరశ్చ విఖ్యాతో భద్రనామా హరః స్వయమ్ ।**
**చండీశ్వరస్తథా ప్రోక్తః సంగమేశ్వర ఏవ చ ॥ 29 ॥**

శంకరుడు స్వయంగా భద్రేశ్వరుడు, భద్రుడు, చండీశ్వరుడు, సంగమేశ్వరుడు అను పేర్లతో అవతరించాడు.

**పూర్వస్యాం దిశి జాతాని శివలింగాని యాని చ ।**
**సామాన్యాన్యపి చాన్యాని తానీహ కథితాని తే ॥ 30 ॥**

తూర్పుదిక్కున ఆవిర్భవించిన ప్రముఖమైన, ఇతరములైన శివలింగాలను గురించి నీకు చెప్పాను.

**దక్షిణస్యాం దిశి తథా శివలింగాని యాని చ ।**
**సంజాతాని మునిశ్రేష్ఠ! తాని తే కథయామ్యహమ్ ॥ 31 ॥**

ఓ మహర్షీ! అదేవిధంగా దక్షిణదిక్కున ఆవిర్భవించిన శివలింగాలను గూర్చి నీకు చెబుతాను.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం శివలింగమాహాత్మ్యవర్ణనం నామ ద్వితీయోఽధ్యాయః ॥ 2 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు శివలింగమాహాత్మ్యవర్ణనం అనే పేరుగల రెండవ అధ్యాయం సమాప్తం.

## తృతీయోఽధ్యాయః – మూడవ అధ్యాయం

## అనసూయాత్రితపోవర్ణనమ్ – అనసూయ – అత్రిమునులతపోవర్ణనం

**సూత ఉవాచ** – సూతుడు చెప్పాడు.

**బ్రహ్మపుర్యాం చిత్రకూటం లింగం మత్తగజేంద్రకమ్ ।**
**బ్రహ్మణా స్థాపితం పూర్వం సర్వకామసమృద్ధిదమ్ ॥ 1 ॥**

పూర్వము బ్రహ్మదేవుడు బ్రహ్మపురంలో అన్ని కోరికలను తీర్చగలిగిన చిత్రకూటలింగమును ప్రతిష్ఠించాడు. దీనికి మత్తగజేంద్రకలింగమనియు ప్రసిద్ధికలదు.

**తత్పూర్వదిశి కోటీశం లింగం సర్వవరప్రదమ్ ।**
**గోదావర్యాః పశ్చిమే తల్లింగం పశుపతినామకమ్ ॥ 2 ॥**

దానికి తూర్పుదిక్కులో వరాలనన్నిటినిచ్చే కోటీశ్వరలింగం వుంది. గోదావరినదికి పశ్చిమతీరంలో పశుపతీశ్వరలింగం వుంది.

**దక్షిణస్యాం దిశి కశ్చిదత్రీశ్వర ఇతి స్వయమ్ ।**
**లోకానాముపకారార్థమనసూయాసుఖాయ చ ॥ 3 ॥**

**ప్రాదుర్భూతః స్వయం దేవో హ్యనావృష్ట్యామజీవయత్ ।**
**స ఏవ శంకరః సాక్షాదంశేన స్వయమేవ హి ॥ 4 ॥**

లోకోపకారముకొఱకు మరియు అనసూయాదేవికి సుఖాన్ని ప్రసాదించడానికీ స్వయంగా దక్షిణ దిక్కులో అత్రీశ్వరుడై వెలిశాడు. అనావృష్టి కలిగినప్పుడు శంకరదేవుడు స్వయంగా అంశరూపంలో వెలసి ప్రాణులకు జీవనాన్నిచ్చాడు.

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**సూత! సూత! మహాభాగ! కథమత్రీశ్వరో హరః ।**
**ఉత్పన్నః పరమో దివ్యస్తత్త్వం కథయ సువ్రత! ॥ 5 ॥**

ఓ సూతా! మహాత్మా! సువ్రతా! పరమప్రకాశస్వరూపుడైన హరుడు అత్రీశ్వరుడై వెలసిన వృత్తాంతంలోని తత్త్వాన్ని తెలియచేయండి.

**సూత ఉవాచ** – సూతుడు చెప్పాడు.

**సాధు పృష్టమృషిశ్రేష్ఠాః! కథయామి కథాం శుభామ్ ।**
**యాం కథాం సతతం శ్రుత్వా పాతకైర్ముచ్యతే ధ్రువమ్ ॥ 6 ॥**

ఓ మహర్షులారా! చక్కగా ప్రశ్నించారు. ఆ శుభగాథను చెబుతాను. ఈ కథ నిత్యం విన్నవారు నిశ్చయంగా పాపాలనుండి విముక్తులౌతారు.

**దక్షిణస్యాం దిశి మహత్ కామదం నామ యద్వనమ్ ।**
**చిత్రకూటసమీపేఽస్తి తపసాం హితదం సతామ్ ॥ 7 ॥**

దక్షిణదిక్కున చిత్రకూటపర్వతానికి సమీపంలో 'కామదము' అనే గొప్ప అరణ్యముంది. అది తపస్సు చేసుకునే సత్పురుషులకు సానుకూలమైనది.

**తత్ర చ బ్రహ్మణః పుత్రో హ్యత్రినామా ఋషిః స్వయమ్ ।**
**తపస్తేపేఽతికఠినమనసూయాసమన్వితః ॥ 8 ॥**

అచ్చట బ్రహ్మపుత్రుడైన అత్రిమహర్షి తనభార్య అనసూయతో గూడి స్వయంగా మిక్కిలి కఠినమైన తపస్సు చేశాడు.

**పూర్వం కదాచిత్తత్రైవ హ్యనావృష్టిరభూన్మునే! ।**
**దుఃఖదా ప్రాణినాం దైవాద్వికటా శతవార్షికీ ॥ 9 ॥**

ఓ మునీశ్వరులారా! పూర్వం ఒకానొక సమయంలో అదే స్థానంలో దైవవశంచేత భయంకరమైన అనావృష్టి వందసంవత్సరాలు కొనసాగి, ప్రాణులకు మిక్కిలి దుఃఖాన్ని కలిగించింది.

**వృక్షాశ్శుష్కా స్తదా సర్వే పల్లవాని ఫలాని చ ।**
**నిత్యార్థం న జలం క్వాపి దృష్టమాసీన్మునీశ్వరాః! ॥ 10 ॥**

ఓ మహర్షులారా! అప్పుడు చెట్లన్నీ ఎండిపోయాయి. చిగుళ్ళు, పండ్లు కరువయ్యాయి. నిత్యకర్మకు ఎక్కడా నీరుకూడా లభించడం లేదు.

**ఆర్ద్రీభావో న లభ్యేత ఖరా వాతా దిశో దశ ।**
**హాహాకారో మహానాసీత్పృథివ్యాం దుఃఖదోఽతి హి ॥ 11 ॥**

ఎక్కడా తడి కానరాలేదు. దశదిశలా వేడిగాలులు వీస్తున్నాయి. భూమండలంలో మహాదుఃఖాన్ని కలిగించే హాహాకారాలు బయలుదేరాయి.

**సంవర్తం చైవ భూతానాం దృష్ట్వాఽత్రిగృహిణీ ప్రియా ।**
**సాధ్వీ చైవాబ్రవీదత్రిం మయా దుఃఖం న సహ్యతే ॥ 12 ॥**

ప్రాణుల వినాశనాన్ని చూసిన అత్రిమహర్షి గృహిణియైన సాధ్వి అనసూయ తానీ దుఃఖాన్ని సహించలేనని అత్రితో చెప్పింది.

**సమాధౌ చ విలీనోఽభూదాసనే సంస్థితః స్వయమ్ ।**
**ప్రాణాయామం త్రిరావృత్యా కృత్వా మునివరస్తదా ॥ 13 ॥**

అపుడు అత్రిమహర్షి స్వయంగా ఆసనం బంధించి, మూడు మార్లు ప్రాణాయామం చేసి సమాధిస్థితిలో విలీనమయ్యాడు.

**ధ్యాయతి స్మ పరంజ్యోతిరాత్మస్థమాత్మనా చ సః ।**
**అత్రిర్మునివరో జ్ఞానీ శంకరం నిర్వికారకమ్ ॥ 14 ॥**

జ్ఞానియైన అత్రిమహర్షి, పరంజ్యోతిస్వరూపుడు, ఆత్మస్వరూపుడు నిర్వికారుడు అయిన శంకరుని మనస్సులో ధ్యానించాడు.

**స్వామిని ధ్యానలీనే చ శిష్యాస్తే దూరతో గతాః ।**
**అన్నం వినా తదా తే తు ముక్త్వా తం స్వగురుం మునిమ్ ॥ 15 ॥**

తమ గురువగు అత్రిమహర్షి ధ్యానమగ్నుడుకావడంతో అతని శిష్యులు, ఆహారం లభించక ఆయనను వీడి దూరంగా వెళ్లిపోయారు.

**ఏకాకినీ తదా జాతా సాఽనసూయా పతివ్రతా ॥ 16 ॥**

పతివ్రతయైన అనసూయ అప్పుడు ఏకాకి అయ్యింది.

**సిషేవే సా చ సతతం తం ముదా మునిసత్తమమ్ ।**
**పార్థివం సుందరం కృత్వా మంత్రేణ విధిపూర్వకమ్ ॥ 17 ॥**

అప్పుడామె శంకరుని మట్టిబొమ్మను సుందరంగా తయారుచేసి ఆ విగ్రహాన్ని యథావిధిగా నిత్యం మంత్రపూర్వకంగా సేవించేది.

**మానసైరుపచారైశ్చ పూజయామాస శంకరమ్ ।**
**తుష్టావ శంకరం భక్త్యా సంసేవిత్వా ముహుర్ముహుః ॥ 18 ॥**

అంతేగాక ఆమె శంకరుని భక్తితో మానసోపచారాలతో పలుమార్లు చక్కగా సేవించి, పూజించేది.

**బద్ధాంజలిపుటా భూత్వా ప్రక్రమ్య స్వామినం శివమ్ ।**
**దండవత్ప్రణిపాతేనప్రతిప్రక్రమణం తదా ॥ 19 ॥**

ఆమె చేతులు జోడించి, శివస్వరూపుడయిన తన భర్తకు ప్రదక్షిణలు సాష్టాంగప్రణామాలు, ప్రతిప్రదక్షిణాలు కూడ చేసేది.

**చకార సుచరిత్రా సాఽనసూయా మునికామినీ ।**
**దైత్యాశ్చ దానవాః సర్వే దృష్ట్వా తు సుందరీం తదా ॥ 20 ॥**

అత్రియొక్క ప్రియురాలు సుందరి, గొప్పశీలవతి అయిన ఆ అనసూయను దైత్య, దానవులందరూ చూశారు.

**విహ్వలాశ్చాభవంస్తత్ర తేజసా దూరతః స్థితాః ।**
**అగ్నిం దృష్ట్వా యథా దూరే వర్తంతే తద్వదేవ హి ॥ 21 ॥**

జనులు అగ్నికి దూరంగా తొలగునట్లు వారామె తేజస్సుకు తట్టుకోలేక, దూరంగా పోసాగారు.

**తథైనాం చ తదా దృష్ట్వా నాయాంతీహ సమీపగాః ।**
**అత్రేశ్చ తపసశ్చైవానసూయా శివసేవనమ్ ॥ 22 ॥**

అత్రియొక్క తపస్సును అధిగమించేలా శివసేవనూ, పతిసేవనూ చేస్తున్న ఆమెను చూచి దేవతలు ఆమె దగ్గరకు రాలేకపోయేవారు.

**విశిష్యతే స్మ విప్రేంద్రా మనోవాక్కాయసంస్కృతమ్ ।**
**తావత్కాలం తు సా దేవీ పరిచర్యాం చకార హ ॥ 23 ॥**

**యావత్కాలం మునివరః ప్రాణాయామపరాయణః ।**
**తౌ దంపతీ తదా తత్ర స్వస్వకార్యపరాయణౌ ॥ 24 ॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! ప్రాణాయామంలో నిమగ్నుడైన అత్రిమహర్షి తపమాచరించినంతకాలము, ఆమె మనోవాక్కాయాలతో శుద్ధమైన శివుణ్ణి భర్తనూసేవించింది. అచ్చట ఆ దంపతులు అలా తమ తమ కార్యాలలో నిమగ్నమయ్యారు.

**సంస్థితౌ మునిశార్దూల! నాన్యః కశ్చిత్పరః స్థితః ।**
**ఏవం జాతే తదా కాలే హ్యత్రిశ్చ ఋషిసత్తమః ॥ 25 ॥**

ఓ మహర్షీ! అక్కడ మూడవ వ్యక్తి లేడు. ఈ విధంగా అచ్చట కొంతకాలం గడిచింది.

**ధ్యానే చ పరమే లీనో న వ్యబుధ్యత కించన ।**
**అనసూయాఽపి సా సాధ్వీ స్వామినం వై శివం తథా ॥26॥**

ధ్యాననిమగ్నుడైన అత్రిమహర్షికి లోకం తెలియదు. పతివ్రతయైన అనసూయ కూడ శివస్వామిని అదేవిధంగా సేవించింది.

**భేజే నాన్యత్పరం కించిజ్జానీతే స్మ చ సా సతీ ।**
**తస్యైవ తపసా సర్వే తస్యాశ్చ భజనేన చ ॥ 27 ॥**

భర్తృసేవ, శివపూజ తక్క ఆ పతివ్రతకు మరియొకటి తెలియదు. పతిసేవయే తపస్సుగ భావించింది.

**దేవాశ్చ ఋషయశ్చైవ గంగాద్యాస్సరితస్తథా ।**
**దర్శనార్థం తయోః సర్వాః పరే ప్రీత్యా సమాయయుః ॥ 28 ॥**

ఆయన తపస్సును, ఆమె శివసేవను చూడడానికి దేవతలు, ఋషులు, గంగాది సర్వనదులు, ఇతరులు పరమప్రీతితో అచ్చటకు విచ్చేశారు.

**దృష్ట్వా చ తత్తపస్సేవాం విస్మయం పరమం యయుః ।**
**తయోస్తదద్భుతం దృష్ట్వా సమూచుర్భజనం వరమ్ ॥ 29 ॥**

ఆయనయొక్క అద్భుతమైన తపస్సును, ఆమెయొక్క శివసేవను చూచి విస్మయాన్ని పొంది, ఆ దేవతా సమూహం వారిలో వారు ఇలా అనుకున్నారు.

**ఉభయోః కిం విశిష్టం చ తపసో భజనస్య చ ।**
**అత్రేశ్చైవ తపః ప్రోక్తమనసూయానుసేవనమ్ ॥ 30 ॥**

అత్రియొక్క తపస్సు, అనసూయ యొక్క సేవ ఈ రెండింటిలో ఏది గొప్పది? అని వారు పరిశీలించసాగారు.

**తత్సర్వముభయోర్దృష్ట్వా సమూచుర్భజనం వరమ్ ।**
**పూర్వైశ్చ ఋషిభిశ్చైవ దుష్కరం తు తపః కృతమ్ ॥ 31 ॥**

వారిరువురి కార్యాలను సమగ్రంగా పరిశీలించి ఆమె సేవయే గొప్పదని తేల్చారు. ఎందుకనగా ప్రాచీనులగు అనేకమంది మహర్షులు కఠినమైన తపస్సునాచరించారు.

**ఏతాదృశం తు కేనాపి క్వ కృతం నైతదబ్రువన్ ।**
**ధన్యోఽయం చ మునిర్ధన్యా తథేయమనసూయికా ॥ 32 ॥**

కాని ఇటువంటి సేవను పూర్వం ఎవ్వరూ చేయలేదు. ఆ ముని ధన్యుడు. అదేవిధంగా ఈ అనసూయ దేవి కూడ ధన్యురాలు.

**యదేతాభ్యాం పరప్రీత్యా క్రియతే సుతపః పునః ।**
**ఏతాదృశం శుభం చైతత్తపో దుష్కరముత్తమమ్ ॥ 33 ॥**

వీరిద్దరు ఇతరుల కొఱకు ప్రీతితో చేస్తున్న శుభకరమైన ఉత్తమమైన ఈ తపస్సు ఇతరులకు సాధ్యము కానిది.

**త్రిలోక్యాం క్రియతే కేన సాంప్రతం జ్ఞాయతే న హి ।**
**తయోరేవ ప్రశంసాం చ కృత్వా తే తు యథాగతమ్ ॥ 34 ॥**

ముల్లోకాలలోనూ ఇలా తపస్సు చేసినట్టుగా తెలియదు – అని దేవతాసమూహం ఆ యిద్దరినీ విశిష్టంగా ప్రశంసించి వచ్చిన దారిన వెళ్లారు.

**గతాస్తే చ తదా తత్ర గంగా న గిరిశం వినా ।**
**గంగా మద్భజనప్రీతా సాధ్వీ ధర్మవిమోహితా ॥ 35 ॥**

**కృత్వోపకారమేతస్యా గమిష్యామీత్యువాచ సా ।**
**శివో ఽపి ధ్యానసంబద్ధో మునేరత్రేర్మునీశ్వరాః! ॥ 36 ॥**

అందరూ అలా వెళ్లగా గంగాదేవి, శివుడు మాత్రం మిగిలారు. అంతట 'మమ్ములను సేవించడంలో గల ప్రీతిచేత ఈ సాధ్వి సర్వం మరచిపోయింది' అని తలపోసి. 'ఈమెకుపకారం చేసి నేను వెళ్తాను' అని గంగాదేవి పలికింది. ఓ మునీశ్వరులారా! శివుడు కూడ అత్రిమహర్షి యొక్క ధ్యానంచే కట్టివేయబడ్డాడు.

**పూర్ణాంశేన స్థితస్తత్ర కైలాసం తం జగామ హ ।**
**పంచాశచ్చ తథా చాత్ర చత్వారి ఋషిసత్తమాః! ॥ 37 ॥**

**వర్షాణి చ గతాన్యాసన్ వృష్టిర్నైవాభవత్తదా ।**
**యావచ్చాప్యత్రిణా హ్యేవం తపసా ధ్యానమాశ్రితమ్ ॥ 38 ॥**

శివుడు మునుల ధ్యానంలో పూర్ణాంశతో ధ్యానమూర్తిగా అక్కడ నిలిచి, తాను స్వయంగా కైలాసం వెళ్లాడు. ఓ మహర్షులారా! అలా యాభైనాలుగు సంవత్సరాలు గడిచిపోయాయి. అత్రిమహర్షి ఈ తీరున ధ్యానమగ్నుడై తపస్సు చేస్తూ ఉండిపోయాడు. వర్షాలు మాత్రం పడనే లేదు.

**అనసూయా తదా నైవ గృహ్ణామీతీషణా కృతా ।**
**ఏవం చ క్రియమాణే హి మునినా తపసి స్థితే ॥**
**అనసూయాసుభజనే యజ్జాతం శ్రూయతామితి ॥ 39 ॥**

ఈ తీరున అత్రిమహర్షి ధ్యానమగ్నుడై తపస్సు చేయుచున్నంత కాలం తాను ఆహారాన్ని భుజించకూడదని అనసూయ నిశ్చయించుకుంది. ఈ విధంగా ఆ ముని తపస్సు, అనసూయ శివసేవ చేస్తూండగా జరిగిన వృత్తాంతాన్ని వినండి.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం అనసూయాత్రితపోవర్ణనం నామ తృతీయోఽధ్యాయః ॥ 3 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు అనసూయ - అత్రిమునుల తపోవర్ణనం అనే పేరుగల మూడవ అధ్యాయం సమాప్తం.

## చతుర్థోఽధ్యాయః - నాల్గవ అధ్యాయం

## అత్రీశ్వరమాహాత్మ్యవర్ణనం - అత్రీశ్వరమాహాత్మ్యవర్ణన

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికాడు.

**కదాచిత్స ఋషిశ్రేష్ఠో హ్యత్రిర్బ్రహ్మవిదాం వరః ।**
**జాగృతశ్చ జలం దేహి ప్రత్యువాచ ప్రియామితి ॥ 1 ॥**

ఒకనాడు బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడైన అత్రిమహర్షి సమాధినుండి మేల్కొని ప్రియురాలైన అనసూయను నీటినిమ్మని కోరాడు.

**సాపి సాధ్వీ త్వవశ్యం చ గృహీత్వాథ కమండలుమ్ ।**
**జగామ విపినే తత్ర జలం మే నీయతే కుతః ॥ 2 ॥**

ఆ పతివ్రత అట్లేనని పలికి కమండలాన్ని చేతబట్టి అడవిలోకి వెళ్లింది. నీటిని ఎక్కడ నుండి తేవాలి?

**కిం కరోమి క్వ గచ్ఛామి కుతో నీయేత వై జలమ్ ।**
**ఇతి విస్మయమాపన్నా తాం గంగాం హి దదర్శ సా ॥ 3 ॥**

నేనేమి చేయాలి? ఎక్కడకు వెళ్లాలి? అని ఆమె ఆలోచిస్తూ అడవిలో కంగారుపడుతూ ఉండగా గంగ కనిపించింది.

**తామనువ్రజతీ యావత్ సాఽబ్రవీచ్చ  సదా హి తామ్ ।**
**గంగా సరిద్వరా దేవీ బిభ్రతీ సుందరాం తనుమ్ ॥ 4 ॥**

గంగను అనుసరించివెళ్ళుచుండగా సుందరమైన దేహాన్ని దాల్చిన నదీమతల్లియైన గంగాదేవి ఇలా పలికింది.

**గంగోవాచ** - గంగ పలికింది.

**ప్రసన్నాస్మి చ తే దేవి! కుత్ర యాసి వదాధునా ।**
**ధన్యా త్వం సుభగే! సత్యం తవాజ్ఞాం చ కరోమ్యహమ్ ॥ 5 ॥**

"ఓ దేవీ! నేను నీ  విషయంలో ప్రసన్నురాలనయ్యాను. నీవిప్పుడెక్కడకు వెళ్తున్నావు? ఓ సౌభాగ్యవతీ! నీవు యథార్థంగా ధన్యురాలవు. నేను నీ ఆజ్ఞను పాలిస్తాను."

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**తద్వచశ్చ తదా శ్రుత్వా ఋషిపత్నీ తపస్వినీ ।**
**ప్రత్యువాచ వచః ప్రీత్యా స్వయం సుచకితా ద్విజాః! ॥ 6 ॥**

ఓ బ్రాహ్మణులారా! తపస్విని అయిన ఋషిపత్ని అనసూయ గంగాదేవి మాటను విని, మిక్కిలి చకితురాలై ప్రేమతో ఇట్లు బదులు పలికింది.

**అనసూయోవాచ** - అనసూయ పలికింది.

**కా త్వం కమలపత్రాక్షి! కుతో వా త్వం సమాగతా ।**
**తథ్యం బ్రూహి కృపాం కృత్వా సాధ్వీ సుప్రవదా సతీ ॥ 7 ॥**

ఓ కమలపత్రాక్షీ! నీవెవరివి? నీవెక్కడ నుండి వచ్చావు? సాధ్వియైన యువతి సత్యాన్ని మాత్రమే పలుకుతుంది. గనక దయచేసి సత్యాన్ని పలుకుము.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఇత్యుక్తే చ తయా తత్ర మునిపత్న్యా మునీశ్వరాః ।**
**సరిద్వరా దివ్యరూపా గంగా వాక్యమథాబ్రవీత్ ॥ 8 ॥**

ఓ మునీశ్వరులారా! మునిపత్నియైన అనసూయ ఈవిధంగా పలుకగా, నదీమతల్లి, దివ్యమైన రూపంగల గంగాదేవి ఇలా పలికింది.

**గంగోవాచ** - గంగాదేవి పలికింది.

**స్వామినః సేవనం దృష్ట్వా శివస్య చ పరాత్మనః ।**
**సాధ్వి! ధర్మం చ తే దృష్ట్వా స్థితాస్మి తవ సన్నిధౌ ॥ 9 ॥**

ఓ పతివ్రతా! నీవు నీ భర్తకు, శివపరమాత్మునకు చేసిన సేవను, నీ సాధ్వీధర్మాన్ని చూచి నీ యెదుట నిలబడియున్నాను.

**అహం గంగా సమాయాతా భజనాత్తే శుచిస్మితే! ।**
**వశీభూతా హ్యహం జాతా యదిచ్ఛసి వృణీష్వ తత్ ॥ 10 ॥**

ఓ స్వచ్ఛమైన చిరునవ్వుగలదానా! నేను గంగాదేవిని. నీ సేవను చూచి సంతసించి నీకు వశురాలనయ్యాను. నీకు నచ్చిన వరాన్ని కోరుకో అనుగ్రహిస్తాను.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఇత్యుక్తే గంగయా సాధ్వీ నమస్కృత్య పురః స్థితా ।**
**ఉవాచేతి జలం దేహి చేత్ప్రసన్నా మమాధునా ॥ 11 ॥**

గంగ ఇట్లు పలుకగా, సాధ్వియైన అనసూయ ఆమె ఎదుట నిలబడి నమస్కరించి "నీవు నాయందు ప్రసన్నురాలవైనచో, నాకిప్పుడు నీటినిమ్ము" అని పలికింది.

**ఇత్యేతద్వచనం శ్రుత్వా గర్తం కుర్వితి సాఽబ్రవీత్ ।**
**శీఘ్రం చాయాచ్చ తత్కృత్వా స్థితా తత్క్షణమాత్రతః ॥ 12 ॥**

ఈ మాటను విని గంగ 'గోతిని త్రవ్వుము' అని పలికింది. అప్పుడు అనసూయ వెనువెంటనే గోతిని తవ్వి నిలబడింది.

**తత్ర సా చ ప్రవిష్టా చ జలరూపమభూత్తదా ।**
**ఆశ్చర్యం పరమం గత్వా గృహీతం చ జలం తయా ॥ 13 ॥**

అంతట గంగాదేవి జలరూపాన్ని దాల్చి గోతిలోనికి ప్రవేశించింది. అనసూయ ఆశ్చర్యపడి నీటిని స్వీకరించింది.

**ఉవాచ వచనం చైతల్లోకానాం సుఖహేతవే ।**
**అనసూయా మునేః పత్నీ దివ్యరూపాం సరిద్వరామ్ ॥ 14 ॥**

మునిపత్నియైన అనసూయ లోకంలోని ప్రాణుల సుఖాన్నికోరి, నదీమతల్లి, దివ్యరూపధారి అయిన గంగతో ఇలా అంది.

**అనసూయోవాచ –** అనసూయ పలికింది.

**యది త్వం సుప్రసన్నా మే వర్తసే చ కృపామయి ।**
**స్థాతవ్యం చ త్వయా తావన్మత్స్వామీ యావదావ్రజేత్ ॥ 15 ॥**

నీవు నాయందు మిక్కిలి ప్రసన్నురాలవయితే, నీకు నాయందు దయ గలిగితే, నా భర్త వచ్చువఱకు నీవు ఇచ్చటనే నిలచియుండుము.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇతి శ్రుత్వాఽనసూయాయా వచనం సుఖదం సతామ్ ।**
**గంగోవాచ ప్రసన్నాతి హ్యత్రేర్దాస్యసి మేఽనఘే! ॥ 16 ॥**

సత్పురుషులకు సుఖాన్నిచ్చే అనసూయ మాటలు వినిన గంగ మిక్కిలి ప్రసన్నురాలై 'ఓ పుణ్యాత్మురాలా! ముందు నా యీ జలాన్ని అత్రిమహర్షికిమ్ము' అని పలికింది.

**ఇత్యుక్తే చ తయా తత్ర హ్యనపాయి కృతా తథా ।**
**స్వామినే తజ్జలం దివ్యం దత్వా తత్పురతః స్థితా ॥ 17 ॥**

గంగ ఆదేశానుసారంగా అనసూయ వెంటనే అత్రిమహర్షి చెంతకు చేరి ఆ దివ్యజలాన్ని తన భర్తకిచ్చి ఆయనకెదురుగ నిలబడింది.

**స ఋషిశ్చాపి సుప్రీత్యా స్వాచమ్య విధిపూర్వకమ్ ।**
**పపౌ దివ్యం జలం తచ్చ పీత్వా సుఖమవాప హ ॥ 18 ॥**

ఆ మహర్షి మిక్కిలి ప్రీతితో యథావిధిగా ఆచమనం చేసి, ఆ దివ్యజలాన్ని త్రాగి సుఖాన్ని పొందాదు.

**అహెూ! నిత్యం జలం యచ్చ పీయతే తజ్జలం న హి ।**
**విచార్యేతి చ తేనాశు పరితశ్చావలోకితమ్ ॥ 19 ॥**

"ఆహా! ఈ జలం నేను నిత్యం త్రాగే జలం కాదు' అని ఆయన ఆలోచిస్తూ నలువైపులా తేరిపారచూశాడు.

**శుష్కాన్వృక్షాన్సమాలోక్య దిశో రూక్షతరాస్తథా ।**
**ఉవాచ తామృషిశ్రేష్ఠో న జాతం వర్షణం పునః ॥ 20 ॥**

ఆ మహర్షి ఎండిన వృక్షాలను, ఎడారివలెనున్న దిక్కులను చూచి 'వర్షం పడలేదా యేమి ' అని ప్రశ్నించాడు.

**తదుక్తం తత్ సమాకర్ణ్య నేతి నేతి ప్రియా తదా ।**
**తామువాచ పునః సోఽపి జలం నీతం కుతస్త్వయా ॥ 21 ॥**

అనసూయ ఆ మాటలకు 'లేదు, లేదు' అని సమాధానం చెప్పగా, అయితే "నీవు నీటినెచ్చటి నుండి తెచ్చావు?" అని మరల ఆయన ప్రశ్నించాడు.

**ఇత్యుక్తే తు తదా తేన విస్మయం పరమం గతా ।**
**అనసూయా స్వమనసి సచింతా తు మునీశ్వరాః! ॥ 22 ॥**

ఓ మహర్షులారా! ఆయనిట్లు ప్రశ్నించగా, అనసూయ పరమాశ్చర్యాన్ని పొంది తన మనస్సులో ఇట్లు తలంచింది.

**నివేద్యతే మయా చేద్వై తదోత్కర్షో భవేన్మమ ।**
**నివేద్యతే యదా నైవ వ్రతభంగో భవేన్మమ ॥ 23 ॥**

"నేను నిజాన్ని చెబితే, నా గొప్పతనం చెప్పుకున్నట్టు అవుతుంది. చెప్పకపోతే వ్రతభంగమౌతుంది." అని ఆలోచించింది.

**నోభయం చ తథా స్యాద్వై నివేద్యం తత్తథా మమ ।**
**ఇతి యావద్విచార్యేత తావత్పృష్టా పునః పునః ॥ 24 ॥**

"ఈ రెండు దోషాలు కలుగని విధంగా నేను ఈయనకు విషయాన్ని ఎలా విన్నవించాలి." అని ఆలోచిస్తూ ఉండగా ఆయన ఇదే ప్రశ్నను మళ్ళీ మళ్లీ అడిగాడు.

**అథానుగ్రహతః శంభోః ప్రాప్తబుద్ధిః పతివ్రతా ।**
**ఉవాచ శ్రూయతాం స్వామిన్! యజ్జాతం కథయామి తే ॥ 25 ॥**

శంభుని అనుగ్రహంతో అప్పుడా పతివ్రతకు ఉపాయం తోచి "స్వామీ! జరిగిన వృత్తాంతాన్ని మీకు చెబుతాను" అని పలికింది.

**అనసూయోవాచ** – అనసూయ పలికింది,

**శంకరస్య ప్రతాపాచ్చ తవైవ సుకృతైస్తథా ।**
**గంగా సమాగతాత్రైవ తదీయం సలిలన్త్విదమ్ ॥ 26 ॥**

పరమేశ్వరుని మాహాత్మ్యము చేత, మీరు చేస్తున్న తపస్సు, పుణ్యములచేతను గంగాదేవి ఇక్కడికే వచ్చింది. ఇది గంగాజలమే అని చెప్పింది.

**సూత ఉవాచ** – సూతుడు చెప్పాడు.

**ఏవం వచస్తదా శ్రుత్వా మునిర్విస్మయమానసః ।**
**ప్రియామువాచ సుప్రీత్యా శంకరం మనసా స్మరన్ ॥ 27 ॥**

అపుడీమాట విని ఆ మునీశ్వరుడు ఆశ్చర్యంతో శంకరుని మనస్సులో స్మరిస్తూ అతిశయించిన ప్రేమతో తన ప్రియురాలితో ఇలా అన్నాడు.

**అత్రిరువాచ** – అత్రి పలికాడు.

**ప్రియే! సుందరి! త్వం సత్యమథ వాచం వ్యలీకకామ్ ।**
**బ్రవీషి చ యథార్థం త్వం న మన్యే దుర్లభన్త్విదమ్ ॥ 28 ॥**

ఓ ప్రియా! సుందరీ! నీవు సత్యాన్ని పలికావో, అసత్యాన్ని పలికావో నేను విశ్వసింప లేకున్నాను. ఇది దుర్లభమైన విషయం కదా!

**అసాధ్యం యోగిభిర్యచ్చ దేవైరపి సదా శుభే! ।**
**తచ్చైవాద్య కథం జాతం విస్మయః పరమో మమ ॥ 29 ॥**

ఓ పుణ్యాత్మురాలా! యోగులకు, దేవతలకు కూడ సాధింప శక్యం కాని ఈ కార్యం ఈనాడెట్లు సంఘటిల్లింది? నాకు అత్యాశ్చర్యం కలుగుతోంది.

**యద్యేవం దృశ్యతే చేద్వై తన్మయే ఉ హం న చాన్యథా ।**
**ఇతి తద్వచనం శ్రుత్వా ప్రత్యువాచ పతిం ప్రియా ॥ 30 ॥**

"నేను దీనిని నా కళ్లతో చూస్తేనే నమ్ముతాను. లేకుంటే నమ్మను" అని అత్రి పలుకగా అనసూయ ఇలా బదులు పలికింది.

**అనసూయోవాచ** – అనసూయ పలికింది.

**ఆగమ్యతాం మయా సార్ధం త్వయా నాథ! మహామునే! ।**
**సరిద్వరాయా గంగాయా ద్రష్టుమిచ్ఛా భవేద్యది ॥ 31 ॥**

"ఓ నాథా! మహర్షీ! మీరు నదీమతల్లియైన గంగాదేవిని చూడగోరినట్లయితే నాతో పాటు రండి" అని ఆహ్వానించినది.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యుక్త్వా తు సమాదాయ పతిం తం సా పతివ్రతా ।**
**గతా ద్రుతం శివం స్మృత్వా యత్ర గంగా సరిద్వరా ॥ 32 ॥**

ఇలా విన్నవించిన పతివ్రత అయిన అనసూయ తన భర్తను తోడ్కొని శివుని స్మరిస్తూ ఉత్తమనదియైన గంగాదేవి ఉన్న చోటికి శీఘ్రంగా వెళ్ళింది.

**దర్శయామాస తాం తత్ర గంగాం పత్యే పతివ్రతా ।**
**గర్తే చ సంస్థితాం తత్ర స్వయం దివ్యస్వరూపిణీమ్ ॥ 33 ॥**

ఆ పతివ్రత, భర్తకు అచ్చట గోతిలోనున్న దివ్యస్వరూపిణియైన గంగాదేవిని సాక్షాత్తుగా చూపించింది.

**తత్ర గత్వా ఋషిశ్రేష్ఠో గర్తం చ జలపూరితమ్ ।**
**ఆకంఠం సుందరం దృష్ట్వా ధన్యేయమితి చాబ్రవీత్ ॥ 34 ॥**

ఆ మహర్షి అచ్చటకు కంఠం లోతువఱకు నీటితోనిండిన గోతిని చూచి ఆనందంతో 'ఈమె ధన్యురాలు' అని ఇలా పలికాడు.

**కిం మదీయం తపశ్చైవ కిమన్యేషాం పునస్తదా ।**
**ఇత్యుక్తో మునిశార్దూలో భక్త్యా తుష్టావ తాం తదా ॥ 35 ॥**

"ఇది నేను చేసిన తపస్సు ఫలమా! లేక ఇతరులు చేసిన తపః ఫలమా? అని పలికి అత్రిమహర్షి భక్తితో గంగాదేవిని స్తుతించాడు.

**తతో హి స మునిస్తత్ర సుస్నాతః సుభగే జలే ।**
**ఆచమ్య పునరేవాత్ర స్తుతిం చక్రే పునః పునః ॥ 36 ॥**

ఆ తరువాత అత్రిమహర్షి ఆ పవిత్రజలంలో చక్కగా స్నానం, ఆచమనం చేసి పలుమార్లు గంగను ప్రస్తుతించాడు.

**అనసూయాపి సంస్నాతా సుందరే తజ్జలే తదా ।**
**నిత్యం చక్రే మునిః కర్మ సాఽనసూయాపి సువ్రతా ॥ 37 ॥**

అంతట అనసూయ కూడ ఆ పవిత్రజలాలలో చక్కగా స్నానమాడింది. సువ్రతయైన ఆమె మరియు అత్రిమహర్షి ఇరువురూ నిత్యకర్మనాచరించారు.

**తతస్సోవాచ తాం గంగా గమ్యతే స్వస్థలం మయా ।**
**ఇత్యుక్తే చ పునః సాధ్వీ తామువాచ సరిద్వరామ్ ॥ 38 ॥**

తరువాత గంగాదేవి “నేను నా నివాసానికి వెళ్తున్నాను”. అని పలుకగా అనసూయ ఆమెతో మరల ఇలా పలికింది.

**అనసూయోవాచ** – అనసూయ పలికింది.

**యది ప్రసన్నా దేవేశి! యద్యస్తి చ కృపా మయి ।**
**త్వయా స్థేయం నిశ్చలత్వాదస్మిన్ దేవి! తపోవనే ॥ 39 ॥**

**మహతాం చ స్వభావశ్చ నాంగీకృత్య పరిత్యజేత్ ।**
**ఇత్యుక్త్వా చ కరౌ బద్ధ్వా తాం తుష్టావ పునః పునః ॥ 40 ॥**

“ఓ దేవదేవీ! నీవు నా యందు ప్రసన్నురాలయితే, నీవు నాపై దయ తలచినట్టయితే, ఈ తపోవనమందు నీవు స్థిరంగా ఉండుము. ఇచ్చిన మాట తప్పకుండుట మహాత్ముల స్వభావము కదా!” అని పలికి ఆమె చేతులుజోడించి గంగాదేవిని పలుమార్లు స్తుతించింది.

**ఋషిశ్చాపి తథోవాచ త్వయా స్థేయం సరిద్వరే! ।**
**సానుకూలా భవ త్వం హి సనాథాన్ దేవి! నః కురు ॥ 41 ॥**

అత్రిమహర్షి కూడా “ఓ నదీరాజమా! నీవిచ్చటనే యుండి మాకు సౌకర్యాన్ని సుఖమును కలుగజేయి. ఓ దేవీ! మాకు రక్షణను అనుగ్రహించు” అని కోరుకున్నాడు.

**తదీయం తద్వచః శ్రుత్వా రమ్యా గంగా సరిద్వరా ।**
**ప్రసన్నమానసా గంగాఽనసూయాం వాక్యమబ్రవీత్ ॥ 42 ॥**

వారి మాటలనాలకించిన నదీమతల్లి అయిన గంగ సుప్రసన్నురాలై అనసూయతో ఇట్లు పలికింది.

**గంగోవాచ** – గంగ పలికింది.

**శంకరార్చనసంభూతఫలం వర్షస్య యచ్ఛసి ।**
**స్వామినశ్చ తదా స్థాస్యే దేవానాముపకారణాత్ ॥ 43 ॥**

నీవు, నీ భర్త ఈ సంవత్సరకాలం శివుని అర్చించి పొందిన ఫలాన్ని నాకు ఇచ్చినట్టయితే, దేవతలకు ఉపకారం కొఱకు నేనిచ్చటనే ఉండిపోతాను.

**తథా దానైర్న మే తుష్టిస్తీర్థస్నానైస్తథా చ వై ।**
**యజ్ఞైస్తథాఽథవా యోగైర్యథా పాతివ్రతేన చ ॥ 44 ॥**

పాతివ్రత్యంచేత నాకు కలిగే సంతోషం దానాలచేత గాని, తీర్థస్నానాలచేత గాని, యజ్ఞాలచేత గాని, యోగాలతో గాని కలుగదు.

**పతివ్రతాం యథా దృష్ట్వా మనసః ప్రీణనం భవేత్ ।**
**తథా నాన్యైరుపాయైశ్చ సత్యం మే వ్యాహృతం సతి! ॥ 45 ॥**

పతివ్రతను చూచినప్పుడు మనస్సునకు కలిగే ప్రీతి కలుగునో, ఆ ప్రీతి ఇతరములైన ఉపాయాల ద్వారా కలుగదు. ఓ పతివ్రతా! నేను సత్యాన్నే పలికాను.

**పతివ్రతాం స్త్రియం దృష్ట్వా పాపనాశో భవేన్మమ ।**
**శుద్ధా జాతా విశేషేణ గౌరీతుల్యా పతివ్రతా ॥ 46 ॥**

పతివ్రతయైన స్త్రీని చూసినందున నా పాపాలు తొలగిపోయి అతిశయించిన శుద్ధి కలుగుతుంది. పతివ్రత పార్వతీదేవితో సమానము.

**తస్మాచ్చ యది లోకస్య హితాయ తత్ప్రయచ్ఛసి ।**
**తర్హ్యహం స్థిరతాం యాస్యే యది కల్యాణమిచ్ఛసి ॥ 47 ॥**

కావున నీవు లోకహితాన్ని, సామాన్య జనుల సౌభాగ్యాన్ని కోరినట్టయితే, నీ పుణ్యాన్ని నాకు ధారపోయి. అప్పుడు నేనిక్కడ స్థిరంగా ఉంటాను.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఇత్యేవం వచనం శ్రుత్వాఽనసూయా సా పతివ్రతా ।**
**గంగాయై ప్రదదౌ పుణ్యం సర్వం తద్వర్షసంభవమ్ ॥ 48 ॥**

గంగాదేవిమాటలను విన్న పతివ్రతయైన అనసూయ సంవత్సరకాలంపాటు సంపాదించిన పుణ్య ఫలాన్నంతటిని గంగాదేవికి ధారపోసింది.

**మహతాం చ స్వభావో హి పరేషాం హితమావహేత్ ।**
**సువర్ణం చందనం చేక్షురసస్తత్ర నిదర్శనమ్ ॥ 49 ॥**

పరోపకారం చేయడం మహాత్ముల స్వభావమై యున్నది. బంగారం, చందనం, ఇక్షురసం దీనికి దృష్టాంతాలు.

**ఏతద్దృష్ట్వాఽనసూయం తత్కర్మ పాతివ్రతం మహత్ ।**
**ప్రసన్నోఽభూన్మహాదేవః పార్థివాదావిరాశు వై ॥ 50 ॥**

మహాపతివ్రతయైన అనసూయ చేసిన ఈ త్యాగానికి ప్రసన్నుడైన మహాదేవుడు పార్థివలింగనుండి ఆవిర్భవించాడు.

**శంభురువాచ** - శంభుడు పలికాడు.

**దృష్ట్వా తే కర్మ సాధ్వ్యేతత్ ప్రసన్నోఽస్మి పతివ్రతే! ।**
**వరం బ్రూహి ప్రియే! మత్తో యతః ప్రియతరాసి మే ॥ 51 ॥**

ఓ సాధ్వీ! పతివ్రతా! నీవు చేసిన ఈ త్యాగానికి నేను ప్రసన్నుడనయ్యాను. ఓ భక్తురాలా! నీకిష్టమైన వరాన్ని కోరుకో అనుగ్రహిస్తాను.

**అథ తౌ దంపతీ శంభుమభూతాం సుందరాకృతిమ్ ।**
**పంచవక్త్రాదిసంయుక్తం హరం ప్రేక్ష్య సువిస్మితౌ ॥ 52 ॥**

అప్పుడు పంచముఖాలతో, అపూర్వమైన సుందరాకారంతో ప్రత్యక్షమైన పాపహరుడైన శంకరుని చూచి అత్రిదంపతులు మిక్కిలి విస్మితులయ్యారు.

**నత్వా స్తుత్వా కరౌ బద్ధ్వా మహాభక్తిసమన్వితౌ ।**
**అవోచేతాం సమభ్యర్చ్య శంకరం లోకశంకరమ్ ॥ 53 ॥**

లోకాలకు మంగళాలను కలిగించే శంకరుని మహాభక్తితో వారిద్దరు చేతులు జోడించి నమస్కరించి స్తుతించి చక్కగా అర్చించి ఇలా పలికారు.

**దంపతీ ఊచతుః –** దంపతులు పలికారు.

**యది ప్రసన్నో దేవేశ! ప్రసన్నా జగదంబికా ।**
**అస్మింస్తపోవనే తిష్ఠ లోకానాం సుఖదో భవ ॥ 54 ॥**

ఓ దేవదేవా! నీవు మరియు జగన్మాత ప్రసన్నులయితే, ఈ తపోవనంలోనే వెలసి లోకాలకు సుఖాలని కలిగించండి.

**ప్రసన్నా చ తదా గంగా ప్రసన్నశ్చ శివస్తదా ।**
**ఉభౌ తౌ చ స్థితౌ తత్ర యత్రాసీదృషిసత్తమః ॥ 55 ॥**

వారి అనన్యభక్తితో ప్రసన్నులైన శివుడు, గంగాదేవి ఇరువురు అత్రిమహర్షి ఉన్నచోటనే స్థిరంగా ఉండిపోయారు.

**అత్రీశ్వరశ్చ నామ్నాఽఽసీదీశ్వరః పరదుఃఖహా ।**
**గంగా సాపి స్థితా తత్ర తదా గర్తేఽథ మాయయా ॥ 56 ॥**

మహాదుఃఖాలను పోగొట్టే ఆ శివుడు అత్రీశ్వరుడు అని పేరు గాంచాడు. గంగకూడ తన మాయాశక్తిచేత ఆ గోతిలోనే స్థిరంగా ఉండిపోయింది.

**తద్దినం హి సమారభ్య తత్రాక్షయ్యజలం సదా ।**
**హస్తమాత్రే హి తద్గర్తే గంగా మందాకినీ హ్యభూత్ ॥ 57 ॥**

ఆనాటినుండి ఒక చేయిపరిమాణముకల (వెడల్పు చేయిపరిమాణం, లోతు కంఠంవరకూ) ఆ గోతిలో స్వర్గలోకవాసినియైన గంగ సర్వకాలాలలోను తరుగు లేని నీటితో మందాకిని అయింది.

**తత్రైవ ఋషయో దివ్యాః సమాజగ్ముస్సహాంగనాః ।**
**తీర్థాత్తీర్థాచ్చ తే సర్వే తే పురా నిర్గతా ద్విజాః ॥ 58 ॥**

పూర్వం వివిధ తీర్థాలకు వలసపోయిన దేవర్షులు, బ్రాహ్మణులు తమ కుటుంబాలతో పాటు అచ్చటకు తిరిగి విచ్చేశారు.

**యవాశ్చ వ్రీహయశ్చైవ యజ్ఞయాగపరాయణాః ।**
**యుక్తా ఋషివరైస్తైశ్చ హోమం చక్రుశ్చ తే జనాః ॥ 59 ॥**

అక్కడ యవలు, వడ్లు, పంటలు పండసాగాయి – వైదికులు యజ్ఞయాగాలను చేయసాగారు. అక్కడి మహర్షుల అడుగుజాడలలో సమృద్ధులైన జనానీకం నిత్యహోమాలను చేయసాగారు.

**కర్మభిస్తైశ్చ సంతుష్టా వృష్టిం చక్రుర్ఘనాస్తదా ।**
**ఆనందః పరమో లోకే బభూవాతిమునీశ్వరాః! ॥ 60 ॥**

అప్పటి వారి ఆ కర్మలకు సంతోషించి మేఘాలు వర్షాన్ని కురిపించాయి. ఓ మునీశ్వరులారా! లోకంలో పరమానందం తాండవించింది.

**అత్రీశ్వరస్య మాహాత్మ్యమిత్యుక్తం వః సుఖావహమ్ ।**
**భుక్తిముక్తిప్రదం సర్వకామదం భక్తివర్ధనమ్ ॥ 61 ॥**

సుఖావహము, భుక్తి – ముక్తిప్రదము, సర్వకామదము, భక్తివర్ధనము అయిన అత్రీశ్వరమాహాత్మ్యము మీకీవిధంగా చెప్పారు.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం అత్రీశ్వరమాహాత్మ్యవర్ణనం నామ చతుర్థోఽధ్యాయః ॥ 4 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు అత్రీశ్వరమాహాత్మ్యవర్ణన అనే పేరుగల నాల్గవ అధ్యాయం సమాప్తం.

**పంచమోఽధ్యాయం** – ఐదవ అధ్యాయం

**నందికేశ్వరమాహాత్మ్యే బ్రాహ్మణీమరణవర్ణనమ్** – నందికేశ్వరమాహాత్మ్యంలోబ్రాహ్మణీమరణవర్ణనం

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**కాలంజరే గిరౌ దివ్యే నీలకంఠో మహేశ్వరః ।**
**లింగరూపస్సదా చైవ భక్తానందప్రదః సదా ॥ 1 ॥**

దివ్యమైన కాలంజరపర్వతంపై నీలకంఠుడైన మహేశ్వరుడు లింగరూపంలో వెలసి సర్వదా భక్తులకానందాన్నిస్తున్నాడు.

**మహిమా తస్య దివ్యోఽస్తి శ్రుతిస్మృతిప్రకీర్తితః ।**
**తీర్థం తదాఖ్యయా తత్ర స్నానాత్పాతకనాశకృత్ ॥ 2 ॥**

ఆయన దివ్యమహిమను శ్రుతులు, స్మృతులు కొనియాడుతున్నాయి. అదే పేరుతో ప్రసిద్ధిగాంచిన అచ్చటి తీర్థంలో స్నానం చేస్తే పాపాలు నశిస్తాయి.

**రేవాతీరే యాని సంతి శివలింగాని సువ్రతాః! ।**
**సర్వసౌఖ్యకరాణీహ తేషాం సంఖ్యా న విద్యతే ॥ 3 ॥**

ఓ సువ్రతులారా! ఇహలోకంలో సర్వసౌఖ్యాలనిచ్చే శివలింగాలు రేవానదీతీరంలో అనంతసంఖ్యలో ఉన్నాయి.

**సా చ రుద్రస్వరూపా హి దర్శనాత్పాపహారికా ।**
**తస్యాం స్థితాశ్చ యే కేచిత్పాషాణాః శివరూపిణః ॥ 4 ॥**

ఆ రేవానదియే శివస్వరూపం. దాని దర్శనంచేతనే పాపాలు నశిస్తాయి. దానిలో గల పాషాణాలన్నీ శివ స్వరూపాలే.

**తథాపి చ ప్రవక్ష్యామి యథాన్యాని మునీశ్వరాః ।**
**ప్రధానశివలింగాని భుక్తిముక్తిప్రదాని చ ॥ 5 ॥**

ఓ మహర్షులారా! అయినప్పటికీ భుక్తి ముక్తిప్రదమైన శివలింగాలలో ప్రధానమైన మరికొన్ని లింగాలను గూర్చి చెబుతాను.

**ఆర్తేశ్వరసునామా హి వర్తతే పాపహారకః ।**
**పరమేశ్వర ఇతి ఖ్యాతః సింహేశ్వర ఇతి స్మృతః ॥ 6 ॥**

**శర్మేశశ్చ తథా చాత్ర కుమారేశ్వర ఏవ చ ।**
**పుండరీకేశ్వరః ఖ్యాతో మండపేశ్వర ఏవ చ ॥ 7 ॥**

పాపాలను పోగొట్టే పరమేశ్వరుడు, ఆర్తేశ్వరుడు, సింహేశ్వరుడు, శర్మేశ్వరుడు, కుమారేశ్వరుడు, పుండరీకేశ్వరుడు, మండపేశ్వరుడు అనే పేర్లతోప్రఖ్యాతి గాంచినాడు.

**తీక్ష్ణేశనామా తత్రాసీద్దర్శనాత్పాపహారకః ।**
**ధుంధురేశ్వరనామాసీత్పాపహా నర్మదాతటే ॥ 8 ॥**

తీక్ష్ణేశ్వరుడను పేరుతో శివుడక్కడ ఉన్నాడు. దర్శనంచేతనే పాపాలు హరిస్తాయని ప్రసిద్ధి. నర్మదానదీతీరంలో పాపాలను పోగొట్టే ధుంధురేశ్వరుడు ఉన్నాడు.

**శూలేశ్వర ఇతి ఖ్యాతస్తథా కుంభేశ్వరః స్మృతః ।**
**కుబేరేశ్వరనామాపి తథా సోమేశ్వరః స్మృతః ॥ 9 ॥**

అతడు శూలేశ్వరుడు, కుంభేశ్వరుడు, కుబేరేశ్వరుడన్న పేరుతోనూ, అలాగే సోమేశ్వరుడనియు ప్రఖ్యాతి గాంచిన శివరూపాలు

**నీలకంఠో మంగలేశో మంగలాయతనో మహాన్ ।**
**మహాకపీశ్వరో దేవః స్థాపితో హి హనూమతా ॥ 10 ॥**

నీలకంఠేశ్వరుడు గొప్ప మంగళాలకు కారకుడైనవాడు. మహాకపీశ్వరదేవుడు హనుమంతునిచే ప్రతిష్ఠింపబడినాడు.

**తతశ్చ నందికో దేవో హత్యాకోటినివారకః ।**
**సర్వకామార్థదశ్చైవ మోక్షదో హి ప్రకీర్తితః ॥ 11 ॥**

నందీశ్వరదేవుడు అనే స్వామి కోటి హత్యల పాపాలను నివారిస్తాడు, అన్ని కోరికలను తీర్చువాడు. మోక్ష ప్రదుడని కీర్తింపబడినాడు.

**నందీకేశం చ యశ్చైవ పూజయేత్పరయా ముదా ।**
**నిత్యం తస్యాఖిలా సిద్ధిర్భవిష్యతి న సంశయః ॥ 12 ॥**

నందీకేశ్వరుని అనునిత్యం పరమానందంతో పూజించిన వానికి సకల సిద్ధులు కలుగుతాయనడంలో సందేహం లేదు.

**తత్ర తీరే చ యః స్నాతి రేవాయాం మునిసత్తమాః! ।**
**తస్య కామాశ్చ సిధ్యంతి సర్వం పాపం వినశ్యతి ॥ 13 ॥**

ఓ మహర్షులారా! రేవానదిలో స్నానమాచరించిన వారి పాపాలన్నీ నశించి కోరిన కోరికలు సిద్ధిస్తాయి.

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**ఏవం తస్య చ మాహాత్మ్యం కథం తత్ర మహామతే! ।**
**నందికేశస్య కృపయా కథ్యతాం చ త్వయాఽధునా ॥ 14 ॥**

ఓ మహామతీ ! అచ్చటి నందికేశ్వరుని గురించి, అతని మాహాత్మ్యాన్ని గూర్చి మాకిప్పుడు దయతో చెప్పండి.

**సూత ఉవాచ** – సూతుడు చెప్పాడు.

**సమ్యక్ పృష్టం భవద్భిశ్చ కథయామి యథాశ్రుతమ్ ।**
**శౌనకాద్యాశ్చ మునయః సర్వే హి శృణుతాదరాత్ ॥ 15 ॥**

ఓ శౌనకాదిమునులారా! మీరు చక్కగా ప్రశ్నించారు. నేను విన్నదానిని విన్నట్లు చెబుతాను. మీరందరు శ్రద్ధగా వినండి.

**పురా యుధిష్ఠిరేణైవం పృష్టశ్చ ఋషిసత్తమః ।**
**యథోవాచ తథా వచ్మి భవత్స్నేహానుసారతః ॥ 16 ॥**

పూర్వం ధర్మరాజు ప్రశ్నించగా ఆ మహర్షి చెప్పిన విషయాన్ని నేను మీ యందలి ప్రేమతో చెబుతున్నాను.

**రేవాయాః పశ్చిమే తీరే కర్ణికీ నామ వై పురీ ।**
**విరాజతే సుశోభాఢ్యా చతుర్వర్ణసమాకులా ॥ 17 ॥**

రేవానదికి పశ్చిమతీరంలో మిక్కిలి శోభాయమానంగా, నాల్గు వర్ణాలవారితో కూడిన 'కర్ణికీ' అని ప్రఖ్యాతిగాంచిన మనోహరమైన నగరం ఉన్నది.

**తత్ర ద్విజవరః కశ్చిదుత్తస్య కులసంభవః ।**
**కాశ్యాం గతశ్చ పుత్రాభ్యామర్పయిత్వా స్వపత్నికామ్ ॥ 18 ॥**

అక్కడొకానొక బ్రాహ్మణ శ్రేష్ఠుడుండేవాడు. అతడు ఉత్తస్యుని కులంలో జన్మించినవాడు. అతడు తన భార్యను కుమారులిద్దరికీ అప్పగించి, తాను కాశీకి వెళ్లాడు.

**తత్రైవ స మృతో విప్రః పుత్రాభ్యాం చ శ్రుతం తదా ।**
**తదీయం చైవ తత్కృత్యం చక్రాతే పుత్రకావుభౌ ॥ 19 ॥**

అతడచ్చటనే మృతిచెందగా, ఆ వార్తను విని అతని పుత్రులిద్దరు శ్రాద్ధాదికర్మలు చేశారు.

**పత్నీ చ పాలయామాస పుత్రౌ పుత్రహితైషిణీ ।**
**పుత్రౌ చ వర్ధయిత్వా చ విభక్తం వై ధనం తయా ॥ 20 ॥**

పుత్రుల హితాన్ని కోరిన ఆ తల్లి కుమారులిద్దరిని పాలించి పోషించింది. ఆమె వారిని పెంచి పెద్దజేసిన తరువాత వారిరువురికి ఆస్తిని పంచియిచ్చింది.

**స్వీయం చ రక్షితం కించిద్ధనం మరణహేతవే ।**
**తతశ్చ ద్విజపత్నీ హి కియత్కాలం మృతా చ సా ॥ 21 ॥**

ఆమె తాను మరణించేవరకు సుఖంగా జీవించడానికి అవసరమైన కొంత ధనాన్ని తన వద్ద ఉంచుకున్నది. కొన్ని రోజుల తరువాత ఆ బ్రాహ్మణపత్ని మరణానికి చేరువయ్యింది.

**కదాచిత్మ్రియమాణా సా వివిధం పుణ్యమాచరత్ ।**
**న మృతా దైవయోగేన ద్విజపత్నీ చ సా ద్విజాః ॥ 22 ॥**

ఓ బ్రాహ్మణులారా! ఆమె వివిధ పుణ్యకర్మలనాచరించింది. దైవవశంచేత ఆ బ్రాహ్మణపత్ని మరణించలేదు.

**యదా ప్రాణాన్న ముముచే మాతా దైవాత్తయోశ్చ సా ।**
**తద్దృష్ట్వా జననీకష్టం పుత్రకావూచతుస్తదా ॥ 23 ॥**

ఆ తల్లి దైవేచ్ఛచే ప్రాణాలు వీడజాలక కష్టపడుతుండగా ఆమె కష్టాన్ని చూచిన ఆ పుత్రులిద్దరూ ఇలా పలికారు.

**పుత్రావూచతుః** – పుత్రులు పలికారు.

**కిం న్యూనం విద్యతే మాతః! కష్టం యద్విద్యతే మహత్ ।**
**మ్రియతాం తద్ద్రుతం ప్రీత్యా తదాఽఽవాం కరవావహై ॥ 24 ॥**

ఓ తల్లీ! నీకేమి తక్కువయ్యింది? నీకెందుకీ కష్టం? నీకేదైనా కోరిక ఉన్నట్టయితే తెలియజేయి. ప్రీతితో దానిని మేము తీరుస్తాము.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**తచ్ఛ్రుత్వోక్తం తయా తత్ర న్యూనం తు విద్యతే బహు ।**
**తదేవ క్రియతే చేద్వై సుఖేన మరణం భవేత్ ॥ 25 ॥**

వారి మాటలు విని ఆమె ఇలా పలికింది. నాకో పెద్ద లోటుంది. మీరు ఆ లోటు తీరిస్తే నేను సుఖంగా మరణిస్తాను.

**జ్యేష్ఠపుత్రశ్చ యస్తస్యాస్తేనోక్తం కథ్యతాం త్వయా ।**
**కరిష్యామి తదేతద్ధి తయా చ కథితం తదా ॥ 26 ॥**

అప్పుడు పెద్ద కుమారుడామెతో "అమ్మా! చెప్పు. నీవు చెప్పిన విధంగా నేను చేస్తాను" అని పలికాడు. అప్పుడామె ఇలా పలికింది.

**ద్విజపత్న్యువాచ** – ద్విజపత్ని పలికింది.

**శృణు పుత్ర! వచః ప్రీత్యా పురాసీన్మే మనఃస్పృహా ।**
**కాశ్యాం గంతుం తథా నాసీదిదానీం మ్రియతే పునః ॥ 27 ॥**

ఓ కుమారా! నా మాట ప్రీతితో విను. పూర్వం నా మనస్సులో కాశీక్షేత్రానికి వెళ్లాలనే కోరిక ఉండేది. కాని అది సిద్ధించలేదు. ఇప్పుడు మృత్యువు ఆసన్నమయ్యింది.

**మమాస్థీని త్వయా పుత్ర! క్షేపణీయాన్యతంద్రితమ్ ।**
**గంగాజలే శుభం తేఽద్య భవిష్యతి న సంశయః ॥ 28 ॥**

ఓ పుత్రా! నీవు అశ్రద్ధ చేయకుండా, నా అస్థికలను గంగానదిలో కలుపు. నీకు శుభం కలుగుతుంది. సంశయం లేదు.

**సూత ఉవాచ –** సూతుడు చెప్పాడు.

**ఇత్యుక్తే చ తయా మాత్రా స జ్యేష్ఠతనయోఽబ్రవీత్ ।**
**మాతరం మాతృభక్తస్తు సువ్రతాం మరణోన్ముఖీమ్ ॥ 29 ॥**

తల్లి ఈ విధంగా పలుకగా తల్లియందు భక్తి గల పెద్దకుమారుడు మరణించడానికి సిద్ధంగానున్న చక్కని నియమాలను ఆచరించే తల్లితో ఇట్లన్నాడు.

**పుత్ర ఉవాచ –** పుత్రుడు పలికాడు.

**మాతస్త్వయా సుఖేనైవ ప్రాణాస్త్యాజ్యా న సంశయః ।**
**తవ కార్యం పురా కృత్వా పశ్చాత్కార్యం మదీయకమ్ ॥ 30 ॥**

"తల్లీ! నీవు సుఖంగా ప్రాణాలు వీడు. సందేహం వద్దు. నేను ముందుగా నీ పనిని చేసిన తరువాత నా పనిని చేసుకుంటాను."

**ఇతి హస్తే జలం దత్త్వా యావత్పుత్రో గృహం గతః ।**
**తావత్సా చ మృతా తత్ర హరస్మరణతత్పరా ॥ 31 ॥**

పుత్రుడిలా పలికి ఆమె చేతిలో నీటిని వదలి అతడింటికి వెళ్లులోపలే ఆ తల్లి హఠాత్తుగా ప్రాణాలు వీడింది.

**తస్యాశ్చైవ తు యత్కృత్యం తత్సర్వం సంవిధాయ సః ।**
**మాసికం కర్మ కృత్వా తు గమనాయ ప్రచక్రమే ॥ 32 ॥**

అతడామె శ్రాద్ధకర్మలన్నింటిని చక్కగా నిర్వర్తించి మాసికకర్మను కూడ పూర్తి చేసి ప్రయాణానికి సంసిద్ధుడయ్యాడు.

**ద్వయోః శ్రేష్ఠతరో యో వై సువాదో నామ విశ్రుతః ।**
**తదస్థీని సమాదాయ నిస్సృతస్తీర్థకామ్యయా ॥ 33 ॥**

ఆ ఇద్దరు పుత్రులలో పెద్దవాడైన సువాదుడు శ్రేష్ఠుడుగా విఖ్యాతి చెందాడు. తన తల్లి అస్థికలు తీసికొని తీర్థసేవనానికి బయలుదేరాడు.

**సంగృహ్య సేవకం కంచిత్తేనైవ సహితస్తదా ।**
**ఆశ్వాస్య భార్యాపుత్రాంశ్చ మాతుః ప్రియచికీర్షయా ॥ 34 ॥**

అతడు తల్లి కోర్కెను పూర్తిచేయడానికి భార్యాపుత్రులకు నచ్చజెప్పి ఒక సేవకుని వెంటబెట్టుకొని బయలుదేరాడు.

**శ్రాద్ధదానాదికం భోజ్యం కృత్వా విధిమనుత్తమమ్ ।**
**మంగళస్మరణం కృత్వా నిర్జగామ గృహోద్విజః ॥ 35 ॥**

అతడు శ్రాద్ధకాలంలో బ్రాహ్మణులకు భోజనాదులనేర్పాటు చేసి దానాలు చేసి శ్రేయోదాయకమైన ధర్మాన్ని యథావిధిగా అనుష్ఠించి మంగళస్మరణపూర్వకంగా ఇంటినుండి బయలుదేరాడు.

**తద్దినే యోజనం గత్వా వింశతి గ్రామకే శుభే ।**
**ఉవాసాస్తంగతే భానౌ గృహే విప్రస్య కస్యచిత్ ॥ 36 ॥**

ఆనాడతడు యోజనదూరం ప్రయాణం చేసి శుభకరమైన 'వింశతి' అనే గ్రామం చేరి సూర్యాస్తమయానికి పిమ్మట ఒక బ్రాహ్మణుని ఇంటిలో మకాం చేశాడు.

**చక్రే సంధ్యాది సత్కర్మ స ద్విజో విధిపూర్వకమ్ ।**
**స్తవాది కృతవాంస్తత్ర శంభోరద్భుతకర్మణః ॥ 37 ॥**

అపుడా బ్రాహ్మణుడు సంధ్యావందనాది సత్కర్మలు యథావిధిగా చేసి అద్భుతమైన లీలలు ప్రదర్శించెడి శంభుని స్తోత్రాలు పఠించాడు.

**సేవకేన తదా యుక్తో బ్రాహ్మణః సంస్థితస్తదా ।**
**యామినీ చ గతా తత్ర ముహూర్తద్వయసంమితా ॥ 38 ॥**

బ్రాహ్మణుడు సేవకునితో పాటు ఆ ఇంట ఉండగా రాత్రి రెండు ముహూర్తాల కాలం గడిచింది.

**ఏతస్మిన్నంతరే తత్రైకమాశ్చర్యమభూత్తదా ।**
**శృణుతాదరతస్తచ్చ మునయో వో వదామ్యహమ్ ॥ 39 ॥**

ఓ మునులారా! ఆ సమయంలో అక్కడ ఒక ఆశ్చర్యం జరిగింది. దానిని చెబుతాను. శ్రద్ధతో వినండి.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం నందికేశ్వరమాహాత్మ్యే బ్రాహ్మణీమరణవర్ణనం నామ పంచమోఽధ్యాయః ॥ 5 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు నందికేశ్వరమాహాత్మ్యంలో బ్రాహ్మణిమరణవర్ణనం అనే పేరుగల ఐదవ అధ్యాయం సమాప్తం.

## షష్ఠోఽధ్యాయః – ఆరవ అధ్యాయం

## బ్రాహ్మణీస్వర్గతివర్ణనం – బ్రాహ్మణస్త్రీస్వర్గతివర్ణనం

**సూత ఉవాచ –** సూతమహర్షి చెప్పాడు.

**గౌశ్చైకాప్యభవత్తత్ర హ్యంగణే బంధితా శుభా ।**
**తదైవ బ్రాహ్మణో రాత్రావాజగామ బహిర్గతః ॥ 1 ॥**

అచ్చట వాకిట్లో ఒక శుభకరమైన ఆవు కట్టి వేయబడియుంది. అదే సమయంలో గ్రామాంతరం వెళ్లిన గృహయజమాని బ్రాహ్మణుడు రాత్రివేళకు తిరిగి వచ్చాడు.

**స ఉవాచ ప్రియాం స్వీయాం దృష్ట్వా గామంగణే స్థితామ్ ।**
**అదుగ్ధాం ఖేదనిర్విణ్ణో దోగ్ధుకామో మునీశ్వరాః! ॥ 2 ॥**

మునులారా! వాకిట్లో నున్న ఆవును చూచి ఆ బ్రాహ్మణుడు ఆవు పాలు పితకలేదని తన భార్య ద్వారా తెలుసుకుని ఆ యజమాని దుఃఖితుడయ్యాడు.

**గౌః ప్రియే! నైవ దుగ్ధా తే సేత్యుక్త్వా వత్సమానయత్ ।**
**దోహనార్థం సమాహూయ స్త్రియం శీఘ్రతరం తదా ॥ 3 ॥**

"ప్రియా! ఆవు నీ దగ్గఅపాలు ఇవ్వడం లేదు. సరే దూడను తీసికొని రమ్ము" అని ఆమెను తొందర పెట్టాడు.

**వత్సం కీలే స్వయం బద్ధుం యత్నం చైవాకరోత్తదా ।**
**బ్రాహ్మణస్య గృహస్వామీ మునయో దుగ్ధలాలసః ॥ 4 ॥**

అప్పుడాయన ఆ దూడను రాటకు కట్టడానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఓ మునులారా! గృహయజమాని బ్రాహ్మణుడు పాలయందు లోభం గలవాడు.

**వత్సోఽపి కర్షమాణశ్చ పాదే వై పాదపీడనమ్ ।**
**చకార బ్రాహ్మణశ్చైవ కష్టం ప్రాప్తశ్చ సువ్రతాః ॥ 5 ॥**

ఓ సువ్రతులారా! ఆయన దూడను లాగుతుండగా అది ఆయన కాలిపై తొక్కింది. దానితో ఆ బ్రాహ్మణునకు చాలా నొప్పి కలిగింది.

**తేన పాదప్రహారేణ స ద్విజః క్రోధమూర్ఛితః ।**
**వత్సం చ తాడయామాస కూపైర్దృఢతరం తదా ॥ 6 ॥**

దూడ కాలిని తొక్కగానే ఆ బ్రాహ్మణుడు కోపాన్ని పట్టజాలక కట్టురాటతో దానిని గట్టిగా కొట్టాడు.

**వత్సోఽపి పీడితస్తేన శ్రాంతశ్చైవాభవత్తదా ।**
**దుగ్ధా గౌర్మోచితో వత్సో న క్రోధేన ద్విజన్మనా ॥ 7 ॥**

అప్పుడా దూడ ఆ దెబ్బలు తిని బాగా అలసిపోయింది. ఆ బ్రాహ్మణుడు కోపంతో పాలు పితికిన తరువాత కూడ దూడను విడువలేదు.

**గౌర్దోగ్ధం మహాప్రీత్యా రోదనం చాకరోత్తదా ।**
**దృష్ట్వా చ రోదనం తస్యా వత్సో వాక్యమథాబ్రవీత్ ॥ 8 ॥**

ఆవు ప్రేమతో దూడకు పాలివ్వాలనుకుంది. కాని అది కుదరకపోవడంతో అది చాలా దుఃఖించింది. దాని రోదనను చూచిన దూడ ఆవుతో ఇలా అంది.

**వత్స ఉవాచ -** దూడ పలికింది.

**కథం చ రుద్యతే మాతః! కిం తే దుఃఖముపస్థితమ్ ।**
**తన్నివేదయ మే ప్రీత్యా తచ్ఛ్రుత్వా గౌరవోచత ॥ 9 ॥**

"తల్లీ! ఏల ఏడుస్తున్నావు? నీకు వచ్చిన కష్టమేమిటి? నాతో ప్రేమపూర్వకంగా చెప్పు." ఈ మాటకు ఆవు ఇలా పలికింది.

**శ్రూయతాం పుత్ర! మే దుఃఖం వక్తుం శక్నోమ్యహం న హి ।**
**దుష్టేన తాడితస్త్వం చ తేన దుఃఖం మమాప్యభూత్ ॥ 10 ॥**

"ఓ కుమారా! విను. నా దుఃఖాన్ని గూర్చి చెప్పలేకున్నాను. ఆ దుష్టుడు నిన్ను కొట్టాడు. అందువల్ల నాకు కూడ దుఃఖం కలిగింది."

**సూత ఉవాచ -** సూతమహర్షి చెప్పసాగాడు.

**స్వమాతుర్వచనం శ్రుత్వా స వత్సః ప్రత్యబోధయత్ ।**
**ప్రత్యువాచ స్వజననీం ప్రారబ్ధపరినిష్ఠితః ॥ 11 ॥**

తల్లిమాటను విని దూడ ప్రారబ్ధమునందు దృఢమైన నిష్ఠగలదై తన తల్లికి ఇలా బోధించింది.

**కిం కర్తవ్యం క్వ గంతవ్యం కర్మబద్ధా వయం యతః ।**
**కృతం చైవ యథా పూర్వం భుజ్యతే చ తథాఽధునా ॥ 12 ॥**

ఏమి చేయాలి? ఎక్కడకు పోవాలి? మనం కర్మచే బంధింపబడియున్నాం గదా! గతంలో మనం చేసిన కర్మలకు అనురూపమైన ఫలాన్ని ఇప్పుడు అనుభవిస్తున్నాము.

**హసతా క్రియతే కర్మ రుదతా పరిభుజ్యతే ।**
**దుఃఖదాతా న కోఽప్యస్తి సుఖదాతా న కశ్చన ॥ 13 ॥**

జీవుడు నవ్వుతూ కర్మలు చేసి ఏడుస్తూ వాటి ఫలాలననుభవిస్తాడు. జీవునకు సుఖాన్ని గాని, దుఃఖాన్ని గాని ఇతరులెవ్వరూ ఇవ్వరు.

**సుఖదుఃఖే పరైర్దత్తే ఇత్యేషా కుమతిర్మతా ।**
**అహం చాపి కరోమ్యత్ర మిథ్యాజ్ఞానం తదోచ్యతే ॥ 14 ॥**

సుఖదుఃఖాలను ఇతరులు కలిగిస్తారనే భావన తప్పు. నేను కర్తననే ధారణ కూడ అజ్ఞానమేనని పెద్దలు చెబుతారు.

**స్వకర్మణా భవేద్దుఃఖం సుఖం తేనైవ కర్మణా ।**
**తస్మాచ్చ పూజ్యతే కర్మ సర్వం కర్మణి సంస్థితమ్ ॥ 15 ॥**

జీవుడు తాను చేసిన కర్మలకనురూపంగానే సుఖదుఃఖాలను పొందుతాడు. కాబట్టి కర్మ పూజింపబడుతున్నది. సర్వమూ కర్మయందే ప్రతిష్ఠితమై యున్నది.

**త్వం చైవాహం చ జనని! ఇమే జీవాదయశ్చ యే ।**
**తే సర్వే కర్మణా బద్ధా న శోచ్యాః కర్హిచిత్త్వయా ॥ 16 ॥**

ఓ తల్లీ! నీవు, నేను, సర్వజీవులు కర్మచే బంధింపబడియున్నాము. కాబట్టి నీవు ఏ కాలంలోనూ దుఃఖింప తగదు.

**సూత ఉవాచ –** సూతమహర్షి పలికాడు.

**ఏవం శ్రుత్వా స్వపుత్రస్య వచనం జ్ఞానగర్భితమ్ ।**
**పుత్రశోకాన్వితా దీనా సా చ గౌరబ్రవీదిదమ్ ॥ 17 ॥**

పుత్రశోకంతో దీనురాలైన ఆ గోవు జ్ఞానంతో నిండియున్న తన పుత్రుని మాటలు విని ఇలా పలికింది.

**గౌరువాచ –** గోవు అన్నది.

**వత్స! సర్వం విజానామి కర్మాధీనాః ప్రజా ఇతి ।**
**తథాపి మాయయా గ్రస్తా దుఃఖం ప్రాప్నోమ్యహం పునః ॥ 18 ॥**

"ఓ కుమారా! జీవులు కర్మవశులై యుంటారనే విషయాన్ని నేనెరుగుదును. అయినప్పటికి జీవులు మాయకు లోబడియుంటారు. కావున నాకు దుఃఖం కలుగుతోంది.

**రోదనం చ కృతం భూరి దుఃఖశాంతిర్భవేన్నహి ।**
**ఇత్యేతద్వచనం శ్రుత్వా ప్రసూం వత్సోఽబ్రవీదిదమ్ ॥ 19 ॥**

చాలసేపు రోదించాను. అయినా దుఃఖం తగ్గడం లేదు." తల్లి మాటలు విని దూడ ఇలా పలికింది.

**వత్స ఉవాచ –** దూడ చెప్పింది.

**యద్యేవం చ విజానాసి పునశ్చ రోదనం కుతః ।**
**కృత్వా చ సాధ్యతే కించిత్తస్మాద్దుఃఖం త్యజాధునా ॥ 20 ॥**

"నీకీ సత్యం తెలిసీ మరల రోదించడానికి కారణమేమిటి? ఏడ్చి సాధించిందేముంది? కాబట్టి వెంటనే దుఃఖాన్ని విడిచిపెట్టు."

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికాడు.

**ఏవం పుత్రవచః శ్రుత్వా తన్మాతా దుఃఖసంయుతా ।**
**నిఃశ్వస్యాతి తదా ధేనుర్వత్సం వచనమబ్రవీత్ ॥ 21 ॥**

పుత్రుని మాటలు విని ఆ గోమాత దుఃఖంతో నిట్టూర్పులు విడుస్తూ ఇలా పలికింది.

**గౌరువాచ** - గోవు అన్నది.

**మమ దుఃఖం తదా గచ్ఛేద్యదా దుఃఖం తథావిధమ్ ।**
**భవేద్ధి బ్రాహ్మణస్యాపి సత్యమేతద్బ్రవీమ్యహమ్ ॥ 22 ॥**

"నాకు కలిగిన దుఃఖం ఈ బ్రాహ్మణునికి కూడ కలగాలి. అప్పుడు మాత్రమే నా దుఃఖం ఉపశమిస్తుంది. నేను సత్యాన్నే పలుకుతున్నాను."

**ప్రాతశ్చైవ మయా పుత్ర! శృంగాభ్యాం హి హనిష్యతే ।**
**హతస్య జీవితం సద్యో యాస్యత్యస్య న సంశయః ॥ 23 ॥**

ఓ పుత్రా! ఉదయాన్నే నేను వీని పుత్రుని కొమ్ములతో పొడుస్తాను. అప్పుడా బాలుడు నిస్సందేహంగా ప్రాణాలు కోల్పోతాడు.

**వత్స ఉవాచ** - దూడ చెప్పింది.

**ప్రథమం యత్కృతం కర్మ తత్ఫలం భుజ్యతేఽధునా ।**
**అస్యాశ్చ బ్రహ్మహత్యాయా మాతః కిం ఫలమాప్స్యసే ॥ 24 ॥**

పూర్వం చేసిన కర్మఫలాన్ని ఇప్పుడు మనం అనుభవిస్తున్నాము. ఓ తల్లీ! బ్రహ్మహత్యచేయుటవలన ఎట్టి ఫలాన్ని పొందుతావో గదా!

**సమాభ్యాం పుణ్యపాపాభ్యాం భవేజ్జన్మ చ భారతే ।**
**తయోః క్షయే చ భోగేన మాతర్ముక్తిరవాప్యతే ॥ 25 ॥**

ఓ తల్లీ! పుణ్యపాపాలు సమానంగా ఉండే జీవుడు భారతదేశంలో జన్మిస్తాడు. వాటిననుభవిస్తే అవి క్షయమైన తరువాత ముక్తి లభిస్తుంది.

**కదాపి కర్మణో నాశః కదా భోగః ప్రజాయతే ।**
**తస్మాచ్చ పునరేవం త్వం కర్మ మా కర్తుముద్యతా ॥ 26 ॥**

ఒకప్పుడు కర్మఫలం ఇవ్వకుండా నశిస్తే, ఆ కర్మఫలం మరొకప్పుడు లభిస్తుంది. కాబట్టి నీవు మరల ఇటువంటి కర్మ చేయడానికి పూనుకోరాదు.

**అహం కుతస్తే పుత్రోఽద్య త్వం మాతా కుత ఏవ చ ।**
**వృథాభిమానః పుత్రత్వే మాతృత్వే చ విచార్యతామ్ ॥ 27 ॥**

విచారించి చూస్తే నేను నీకు పుత్రుడనెలా అవుతాను? నీవు తల్లివెలా అవుతావు? పుత్రుడనియు, తల్లి అనియు ఈ అభిమానం వ్యర్థం.

**క్వ మాతా క్వ పితా విద్ధి క్వ స్వామీ క్వ కళత్రకమ్ ।**
**న కోఽపి కస్య చాస్తీహ సర్వేఽపి స్వకృతం భుజః ॥ 28 ॥**

తల్లి ఎక్కడ? తండ్రి ఎక్కడ? భర్త ఎక్కడ? భార్య ఎక్కడ? ఈ లోకంలో ఎవరూ, ఎవరికీ ఏమీ కారని తెలుసుకో. సర్వప్రాణులు తమ కర్మఫలాన్ని అనుభవించవలసి ఉంటుంది.

**ఏవం జ్ఞాత్వా త్వయా మాతర్దుఃఖం త్యాజ్యం సుయత్నతః ।**
**సుభగాచరణం కార్యం పరలోకసుఖేప్సయా ॥ 29 ॥**

ఓ తల్లీ! నీవీ సత్యాన్ని తెలుసుకొని దుఃఖాన్ని ప్రయత్నపూర్వకంగా ప్రక్కన బెట్టు. పరలోకంలో సుఖాన్ని కోరే జీవుడు పుణ్యకార్యాలు చేయాలి.

**గౌరువాచ** – గోవు అన్నది.

**ఏవం జానామ్యహం పుత్ర! మాయా మాం న జహాత్యసౌ ।**
**త్వద్దుఃఖేన సుదుఃఖం మే తస్మై దాస్యే తదేవ హి ॥ 30 ॥**

ఓ పుత్రా! నేనీ విషయాన్ని ఎరుగుదును. కాని ఈ మాయ నన్ను విడిచి పెట్టడం లేదు. నీ దుఃఖాన్ని చూచిన నాకు చాలా దుఃఖం కలిగింది. కాబట్టి అదే దుఃఖాన్ని ఆ బ్రాహ్మణునికి కూడా కలిగిస్తాను.

**పునశ్చ బ్రహ్మహత్యాయా నాశో యత్ర భవేదిహ ।**
**తత్స్థలం చ మయా దృష్టం హత్యా మే హి గమిష్యతి ॥ 31 ॥**

అంతేగాక బ్రహ్మహత్యను పోగొట్టే స్థలాన్ని నేను చూచియున్నాను. కాబట్టి నా బ్రహ్మహత్యాదోషాన్ని నేనే తొలగించుకుంటాను.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఇత్యేతద్వచనం శ్రుత్వా స్వమాతుర్గోర్ద్విజోత్తమాః ।**
**మౌనం హి స్వీకృతం తత్ర వత్సేనోక్తం న కించన ॥ 32 ॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! తల్లిమాటలు విన్న దూడ మౌనంగా ఉండిపోయింది. మరలా మాట్లాడలేదు.

**తయోస్తదద్భుతం వృత్తం శ్రుత్వా పాంథో ద్విజస్తదా ।**
**హృదా విచారయామాస విస్మితో హి మునీశ్వరాః! ॥ 33 ॥**

ఓ మహర్షులారా! వారి అద్భుతసంవాదాన్ని విని బాటసారియైన సువాదుడనే ఆ బ్రాహ్మణుడు ఆశ్చర్యపడి తన మనస్సులో ఇలా భావించాడు.

**ఇదమత్యద్భుతం వృత్తం దృష్ట్వా ప్రాతర్మయా ఖలు ।**
**గంతవ్యం పునరేవాతో గంతవ్యం తత్స్థలం పునః ॥ 34 ॥**

ఉదయాన్నే ఈ అత్యద్భుత వృత్తాంతాన్ని చూచిన తరువాతనే నేను నా గమ్యస్థానానికి బయలుదేరుతాను.

**సూత ఉవాచ –** సూతుడు చెప్పాడు.

**విచార్యేతి హృదా విప్రః స ద్విజాః! సేవకేన చ ।**
**సుష్వాప తత్ర జననీభక్తః పరమవిస్మితః ॥ 35 ॥**

ఓ బ్రాహ్మణులారా! తల్లియందు భక్తిగల ఆ బాటసారి బ్రాహ్మణుడు మిక్కిలి విస్మయాన్ని పొంది అచ్చటే సేవకునితో సహా మరలా నిద్రించాడు.

**ప్రాతః కాలే తదా జాతే గృహస్వామీ సముత్థితః ।**
**బోధయామాస తం పాంథం వచనం చేదమబ్రవీత్ ॥ 36 ॥**

తెల్లవారగానే ఆ గృహయజమాని నిద్రలేచి ఆ బాటసారిని నిద్రలేపి ఇలా పలికాడు.

**ద్విజ ఉవాచ –** ద్విజుడు పలికాడు.

**స్వపిషి త్వం కిమర్థం హి ప్రాతఃకాలో భవత్యలమ్ ।**
**స్వయాత్రాం కురు తం దేశం గమనేచ్ఛా చ యత్ర హ ॥ 37 ॥**

నీవింకా ఎందుకు నిద్రిస్తున్నావు? తెల్లవారింది. నిద్రచాలు. నీవు వెళ్ళగోరే స్థలానికి బయలుదేరు.

**తేనోక్తం శ్రూయతాం బ్రహ్మన్! శరీరే సేవకస్య మే ।**
**వర్తతే హి వ్యథా స్థిత్వా ముహూర్తం గమ్యతే తతః ॥ 38 ॥**

అంతటాతడిట్లు బదులు పలికాడు 'ఓ బ్రాహ్మణా! నా సేవకుని శరీరం బాగా అలసిపోయి ఉంది. మరికొంతసేపు విశ్రాంతి తీసుకుని తరువాత వెళ్తాము.

**సూత ఉవాచ –** సూతమహర్షి పలికాడు.

**ఇత్యేవం చ మిషం కృత్వా సుష్వాప పురుషస్తదా ।**
**తద్వృత్తమఖిలం జ్ఞాతుమద్భుతం విస్మయావహమ్ ॥ 39 ॥**

అలా ఆ బాటసారి సువాదుడు ఆశ్చర్యాన్ని కలిగించే అద్భుతవృత్తాంతాన్ని ప్రత్యక్షంగా చూడదలచి ఈవిధంగా వంకపెట్టి మరలా నిద్రించాడు.

**దోహనస్య తదా కాలే బ్రాహ్మణః స్వసుతం ప్రతి ।**
**ఉవాచ గంతుకామశ్చ కార్యార్థం కుత్రచిచ్చ సః ॥ 40 ॥**

ఇంతలో పాలుపితికే వేళయ్యింది. యజమాని పనిమీద బయటకు వెళ్లగోరి తన కుమారునితో ఇలా పలికాడు.

**పితోవాచ –** తండ్రి పలికాడు.

**మయా తు గమ్యతే పుత్ర! కార్యార్థం కుత్రచిత్పునః ।**
**ధేనుర్దోహ్యా త్వయా వత్స! సావధానాదియం నిజా ॥ 41 ॥**

ఓ పుత్రా! నేనొక పనిమీద ఒక చోటకు వెళ్తున్నాను. నీవు జాగ్రత్తగా మన ఆవుపాలు పితుకు.

**సూత ఉవాచ –** సూతమహర్షి పలికాడు.

**ఇత్యుక్త్వా బ్రాహ్మణవరస్స జగామ చ కుత్రచిత్ ।**
**పుత్రః సముత్థితస్తత్ర వత్సం చ ముక్తవాంస్తదా ॥ 42 ॥**

ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడిట్లు పలికి ఎక్కడికో వెళ్లాడు. మేల్కొన్న అతని పుత్రుడు లేచి దూడను విడిచిపెట్టాడు.

**మాతా చ తస్య దోహార్థమాజగామ స్వయం తదా ।**
**ద్విజపుత్రస్తదా వత్సం ఖిన్నం కీలేన తాడితమ్ ॥ 43 ॥**

**బంధనార్థం హి గోః పార్శ్వమనయద్దుగ్ధలాలసః ।**
**పునర్గౌశ్చ తదా క్రుద్ధా శృంగేణాతాడయచ్చ తమ్ ॥ 44 ॥**

పాలివ్వడానికి ఆ దూడయొక్క తల్లి కూడా స్వయంగా వచ్చింది. అపుడు బ్రాహ్మణపుత్రుడు రాత్రి రాటచే కొట్టబడిన దూడను, పాలు పితకడానికి ఆవుయొక్క సమీపానికి తీసుకొని వెళ్లాడు. అంతట ఆవు కోపించి వానిని కొమ్ములతో పొడిచింది.

**పపాత మూర్ఛాం సంప్రాప్య సోఽపి మర్మణి తాడితః ।**
**లోకాశ్చ మిళితాస్తత్ర గవా బాలో విహింసితః ॥ 45 ॥**

ఆ దెబ్బ మర్మస్థానంలో తగలడంతో ఆ బాలుడు వెంటనే క్రిందపడి మూర్ఛపోయాడు. ఆవు బాలుని చంపిందన్న వార్తతో జనులు గుమిగూడారు.

**జలం జలం వదంతస్తే పిత్రాద్యా యత్ర సంస్థితాః ।**
**యత్నశ్చ క్రియతే యావత్తావద్బాలో మృతస్తదా ॥ 46 ॥**

'నీరు తెండి'. 'నీరు తెండి' అని పలుకుతూ తండ్రి మున్నగు వారందరూ ఆ బాలుని రక్షించే ప్రయత్నం చేస్తుండగానే ఆ బాలుడు మరణించాడు.

**మృతే చ బాలకే తత్ర హాహాకారో మహానభూత్ ।**
**తన్మాతా దుఃఖితా హ్యాసీద్రురోద చ పునః పునః ॥ 47 ॥**

ఆ బాలకుడలా మరణించగానే పెద్దగా హాహాకారాలు చెలరేగాయి. అతని తల్లి దుఃఖితురాలై పలుమార్లు ఏడ్చింది.

**కిం కరోమి క్వ గచ్ఛామి కో మే దుఃఖం వ్యపోహతి ।**
**రుదిత్వేతి తదా గాం చ తాడయిత్వా వ్యమోచయత్ ॥ 48 ॥**

నేనేమి చేయుదును? ఎక్కడకు పోయెదను? నా దుఃఖాన్ని ఎవరు పోగొడతారు? అంటూ ఏడుస్తూ ఆమె ఆవును కొట్టి బంధాన్ని విడదీసింది.

**శ్వేతవర్ణా తదా సా గౌర్ద్రుతం శ్యామా వ్యదృశ్యత ।**
**అహో చ దృశ్యతాం లోకాశ్చుక్రుశుశ్చ పరస్పరమ్ ॥ 49 ॥**

తెల్లని ఆ గోవు వెనువెంటనే నల్లనిరంగు పొందినట్లు కనిపించింది. ఆశ్చర్యం! చూడండి! అని జనులు ఒకరితో నొకరు బిగ్గరగా చెప్పుకోసాగారు.

**బ్రాహ్మణశ్చ తదా పాంథో దృష్ట్వాశ్చర్యం వినిర్గతః ।**
**యత్ర గౌశ్చ గతస్తత్ర తామను బ్రాహ్మణో గతః ॥ 50 ॥**

బాటసారి బ్రాహ్మణుడు తన యాత్రకు బయలుదేరుతూ అద్భుతాన్ని చూసి ఆవు వెళ్ళిన మార్గాన్ని అనుసరించి వెళ్లాడు.

**ఊర్ధ్వపుచ్ఛం తదా కృత్వా శీఘ్రం గౌర్నర్మదాం ప్రతి ।**
**ఆగత్య నందికస్యాస్య సమీపే నర్మదాజలే ॥ 51 ॥**

ఆ గోవు తన తోకను పైకెత్తి వేగంగా నర్మదానదితీరాన వెలసిన నందికేశ్వరుని సమీపానికి వచ్చింది.

**సంనిమజ్య త్రివారం తు శ్వేతత్వం చ గతా హి సా ।**
**యథా౾౾గతం గతా సా చ బ్రాహ్మణో విస్మయం గతః ॥ 52 ॥**

నర్మదానదీజలాల్లో మూడుమార్లు మునకలువేసి అది తెల్లదనాన్ని పొందింది. ఆనంతరం ఆ గోవు వచ్చినదారిలోనే వెళ్ళింది. ఆ బ్రాహ్మణుడు విస్మయాన్ని పొందాడు.

**అహెూ! ధన్యతమం తీర్థం బ్రహ్మహత్యానివారణమ్ ।**
**స్వయం మమజ్జ తత్రాసౌ బ్రాహ్మణస్సేవకస్తథా ॥ 53 ॥**

అహెూ! బ్రహ్మహత్యను తొలగించగలిగిన ఈ తీర్థం మిక్కిలి ధన్యమైనదని తెలుసుకుని ఆ బ్రాహ్మణుడు సేవకునితో పాటు ఆ తీర్థంలో స్నానం చేశాడు.

**నిమజ్జ్య హి గతౌ తౌ చ ప్రశంసంతౌ నదీం చ తామ్ ।**
**మార్గే చ మిళితా కాచిత్సుందరీ భూషణాన్వితా ॥ 54 ॥**

వారిద్దరూ తీర్థంలో స్నానంచేసి ఆ తీర్థమహిమని కొనియాడుతూ వెళ్తుండగా దారిలో అలంకారాలతో కూడియున్న ఒక సుందరి వారిని కలిసింది.

**తయోక్తం తం చ భోః పాంథ! కుతో యాసి సువిస్మితః ।**
**సత్యం బ్రూహిచ్ఛలం త్యక్త్వా విప్రవర్య! మమాగ్రతః ॥ 55 ॥**

ఓ బాటసారీ! "మిక్కిలి ఆశ్చర్యంలో మునిగియున్న నీవు ఎక్కడినుండి వస్తున్నావు? ఓ విప్రవర్యా! మోసాన్ని విడిచి నాతో సత్యాన్ని పలుకు" అని పలికింది.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఏవం వచస్తదా శ్రుత్వా ద్విజేనోక్తం యథాతథమ్ ।**
**పునశ్చాయం ద్విజస్తత్ర స్త్రియోక్తః స్థీయతాం త్వయా ॥ 56 ॥**

సుందరియొక్కమాటలను వినిన ఆ బ్రాహ్మణుడు జరిగిన విషయం చెప్పాడు. ఆ స్త్రీ ఆ వృత్తాంతాన్ని విని అతనితో "నీవిచ్చటనే యుండుము" అని పలికింది.

**తయోక్తం చ సమాకర్ణ్య స్థితస్స బ్రాహ్మణస్తతః ।**
**ప్రత్యువాచ వినీతాత్మా కథ్యతే కిం వదేతి చ ॥ 57 ॥**

ఆమె మాటననుసరించి ఆ బ్రాహ్మణుడలాగే చేశాడు. వినయసంపన్నుడయిన ఆ బాటసారి చెప్పదలచిన దానిని చెప్పుమని అడిగాడు.

**సా చాహ పునరేవాత్ర త్వయా దృష్టం స్థలం చ యత్ ।**
**తత్రాధునా క్షిపాస్థీని మాతుః కిం గమ్యతేఽన్యతః ॥ 58 ॥**

అపుడామె ఇలా పలికింది "నీవు చూసిన తీర్థస్థలంలోనే నీవిప్పుడు నీ తల్లి అస్థికలను కలపవచ్చు. మరి యొకచోటికి పోనేల?"

**తవ మాతా పాంథవర్య! సాక్షాద్దివ్యమయం వరమ్ ।**
**దేహం ధృత్వా ద్రుతం సాక్షాచ్ఛంభోర్యాస్యతి సద్గతిమ్ ॥ 59 ॥**

ఓ బాటసారీ! అలాచేస్తే నీ తల్లి దివ్యమైన, శ్రేష్ఠమైన దేహాన్ని ధరించి వెంటనే సాక్షాత్తు పరమశివుని పవిత్రధామం పొందుతుంది.

**వైశాఖే చైవ సంప్రాప్తే సప్తమ్యాం చ దినే శుభే ।**
**సితే పక్షే సదా గంగా హ్యాయాతి ద్విజసత్తమ! ॥ 60 ॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! వైశాఖ శుక్ల సప్తమి పవిత్రమైన దినంనాడు ప్రతి సంవత్సరం గంగ ఇక్కడకు వస్తుంది.

**అద్యైవ సప్తమీ యా సా గంగారూపాస్తి తత్ర వై ।**
**ఇత్యుక్త్వాంతర్దధే దేవీ సా గంగా మునిసత్తమాః! ॥ 61 ॥**

ఓ మహర్షులారా! ఆ సప్తమి ఈనాడే. ఆ గంగయే ఇపుడీ నదిలో ఉన్నది - అని పలికి ఆమె అంతర్ధానమయ్యింది. గంగయే ఆ స్త్రీ రూపంలో వచ్చింది.

**నివృత్తశ్చ ద్విజః సోఽపి మాత్రస్థ్యర్థం స్వవస్త్రతః ।**
**క్షిపేద్యావత్తత్ర తీర్థే తావచ్చిత్రమభూత్తదా ॥ 62 ॥**

ఆ బ్రాహ్మణుడు కాశీ ప్రయాణాన్ని మాని తన వద్ద నున్న మూటలోనుండి తల్లి అస్థికలలో సగభాగమును ఆ తీర్థంలో కలుపునంతలో అచ్చటొక చిత్రం జరిగింది.

**దివ్యదేహత్వమాపన్నా స్వమాతా చ వ్యదృశ్యత ।**
**ధన్యోఽసి కృతకృత్యోఽసి పవిత్రం చ కులం త్వయా ॥ 63 ॥**

ఆ బ్రాహ్మణుడు దివ్యదేహాన్ని ధరించిన తన తల్లిని చూశాడు. ఆమె ఇలా అన్నది "నీవు ధన్యుడవు. నీవు కృతార్థుడవు. నీ వల్ల వంశం పవిత్రమయింది.

**ధనం ధాన్యం తథా చాయుర్వంశో వై వర్ధతాం తవ ।**
**ఇత్యాశిషం ముహుర్దత్త్వా స్వపుత్రాయ దివం గతా ॥ 64 ॥**

"నీకు ధనధాన్యాలు, ఆయుర్దాయం, వంశాభివృద్ధి సిద్ధించుగాక! " అని ఆమె తన పుత్రుని అనేకమార్లు ఆశీర్వదించి స్వర్గానికి వెళ్లింది.

**తత్ర భుక్త్వా సుఖం భూరి చిరకాలం మహోత్తమమ్ ।**
**శంకరస్య ప్రసాదేన గతా సా హ్యుత్తమాం గతిమ్ ॥ 65 ॥**

ఆమె స్వర్గలోకంలో చిరకాలం గొప్పసుఖాలననుభవించి శంకరుని అనుగ్రహంతో ఉత్తమగతిని పొందింది.

**బ్రాహ్మణశ్చ సుతస్తస్యాః క్షిప్త్వాస్థీని పునస్తతః ।**
**ప్రసన్నమానసోఽభూత్స శుద్ధాత్మా స్వగృహం గతః ॥ 66 ॥**

శుద్ధాత్ముడు, ఆమె పుత్రుడునైన ఆ బ్రాహ్మణుడు మిగిలిన అస్థికలను నర్మదానదిలో కలిపి ప్రసన్నమానసుడై తన యింటికి తిరిగి వెళ్లాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం నందికేశ్వరలింగమాహాత్మ్యవర్ణనే బ్రాహ్మణీస్వర్గతివర్ణనం నామ షష్ఠోఽధ్యాయః ॥ 6 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు నందికేశ్వరలింగమాహాత్మ్యవర్ణనలో బ్రాహ్మణస్త్రీస్వర్గతివర్ణనం అనే పేరుగల ఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్తమోఽధ్యాయః - ఏడవ అధ్యాయం

## నందికేశ్వరశివలింగమాహాత్మ్యవర్ణనమ్ - నందికేశ్వరశివలింగమాహాత్మ్యవర్ణనం

**ఋషయ ఊచుః** - శౌనకాది మహర్షులు అడిగారు.

**కథం గంగా సమాయాతా వైశాఖే సప్తమీ దినే ।**
**నర్మదాయా విశేషేణ సూతైతద్వర్ణయ ప్రభో ॥ 1 ॥**

ఓ సూతమహర్షీ! వైశాఖసప్తమీనాడు గంగ నర్మదలోనికి వచ్చిన విధమెట్టిది? ఈ విషయాన్ని విశేషంగా వివరించి చెప్పండి.

**ఈశ్వరశ్చ కథం జాతో నందికేశో హి నామతః ।**
**వృత్తం తదపి సుప్రీత్యా కథయ త్వం మహామతే! ॥ 2 ॥**

ఓ బుద్ధిమంతుడా! ఈశ్వరునకు నందికేశ్వరుడు అనే పేరెలా వచ్చింది? ఈ వృత్తాంతాన్ని కూడ ప్రీతితో వినిపించండి.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**సాధు పృష్టమృషిశ్రేష్ఠాః! నందికేశాశ్రితం వచః ।**
**తదహం కథయామ్యద్య శ్రవణాత్పుణ్యవర్ధనమ్ ॥ 3 ॥**

మహర్షులారా! నందికేశ్వరుని వృత్తాంతాన్ని గూర్చి మీరు చక్కగా ప్రశ్నించారు. శ్రవణం చేయడంవల్లనే పుణ్యాన్ని వర్ధిల్లజేసే ఈ గాథ నిప్పుడు చెబుతాను.

**బ్రాహ్మణీ ఋషికా నామ్నా కస్యచిచ్చ ద్విజన్మనః ।**
**సుతా వివాహితా కస్మైచిద్ద్విజాయ విధానతః ॥ 4 ॥**

ఒక బ్రాహ్మణునకు 'ఋషిక' అను కుమార్తె ఉండేది. ఆమెను ఒక బ్రాహ్మణుడు యథావిధిగా వివాహమాడాడు.

**పూర్వకర్మప్రభావేణ పత్నీ సా హి ద్విజన్మనః ।**
**సువ్రతాపి చ విప్రేంద్రాః! బాలవైధవ్యమాగతా ॥ 5 ॥**

ఓ బ్రాహ్మణోత్తములారా! ఈ బ్రాహ్మణపత్ని గొప్ప వ్రతనిష్ఠ కలిగినదయినా, పూర్వకర్మల ప్రభావంచేత బాల్యంలోనే భర్తృవియోగం పొందింది.

**అథ సా ద్విజపత్నీ హి బ్రహ్మచర్యవ్రతాన్వితా ।**
**పార్థివార్చనపూర్వం హి తపస్తేపే సుదారుణమ్ ॥ 6 ॥**

అనంతరం ఆ బ్రాహ్మణపత్ని బ్రహ్మచర్యవ్రతాన్ని స్వీకరించి, పార్థివలింగాన్ని పూజిస్తూ కఠోరమైన తపస్సు చేయసాగింది.

**తస్మిన్నవసరే దుష్టో మూఢనామాఽసురో బలీ ।**
**యయౌ తత్ర మహామాయీ కామబాణేన తాడితః ॥ 7 ॥**

ఆ సమయంలో దుష్టుడు, బలవంతుడు, మహామాయావి అయిన మూఢుడనే రాక్షసుడు కామబాణపీడితుడై అక్కడకు వెళ్లాడు.

**తపంతీం తాం సమాలోక్య సుందరీమతికామినీమ్ ।**
**తయా భోగం యయాచే స నానాలోభం ప్రదర్శయన్ ॥ 8 ॥**

అతిశయించిన సౌందర్యం గల ఆమె తపస్సు చేస్తుండగా చూసి, వివిధలోభాలను ఆకర్షిత అయ్యేట్టు చూపించి, ఆమెను భోగించగోరాడు.

**అథ సా సువ్రతా నారీ శివధ్యానపరాయణా ।**
**తస్మిన్దృష్టిం దదౌ నైవ కామదృష్ట్యా మునీశ్వరాః! ॥ 9 ॥**

ఓ మహర్షులారా! వ్రతనిష్ఠురాలు అయిన ఆ యువతి, శివధ్యానతత్పరురాలు వాని వైపు కామదృష్టితో చూడలేదు.

**న మానితవతీ తం చ బ్రాహ్మణీ సా తపోరతా ।**
**అతీవ హి తపోనిష్ఠాఽఽసీచ్ఛివధ్యానమాశ్రితా ॥ 10 ॥**

తపస్సునందు నిష్ఠగల ఆ బ్రాహ్మణస్త్రీ తపోనిష్ఠయందుండి, శివుని ధ్యానిస్తూ ఆ దుష్టుని ఆదరించలేదు.

**అథ మూఢః స దైత్యేంద్రః తయా తన్వ్యా తిరస్కృతః ।**
**చుక్రోధ వికటం తస్యై పశ్చాద్రూపమదర్శయత్ ॥ 11 ॥**

అపుడు మూఢుడనే ఆ రాక్షసరాజు ఆ సుందరిచే తిరస్కరింపబడి, కోపించి తన భయంకరమైన రూపాన్ని ఆమెకు చూపాడు.

**అథ ప్రోవాచ దుష్టాత్మా దుర్వచో భయకారకమ్ ।**
**త్రాసయామాస బహుశస్తాం చ పత్నీం ద్విజన్మనః ॥ 12 ॥**

ఆ దుష్టాత్ముడు భయకారకములైన దుర్వచనాలను పలుకుతూ ఆ బ్రాహ్మణపత్నిని పరిపరివిధాల భయపెట్టాడు.

**తదా సా భయసంత్రస్తా బహువారం శివేతి చ ।**
**బభాషే స్నేహతస్తన్వీ ద్విజపత్నీ శివాశ్రయా ॥ 13 ॥**

అపుడు ఆ బ్రాహ్మణపత్ని శివుని శరణుజొచ్చి భయవిహ్వలయై, 'శివా! శివా!' అని ప్రీతితో పలుమార్లు ఎలుగెత్తి పిలిచింది.

**విహ్వలాఽతీవ సా నారీ శివనామప్రభాషిణీ ।**
**జగామ శరణం శంభోః స్వధర్మావనహేతవే ॥ 14 ॥**

మిక్కిలి భయపడిన ఆ యువతి శివనామాన్ని ఉచ్చరిస్తూ తన ధర్మాన్ని రక్షించుకోవడానికి శివుని శరణు వేడింది.

**శరణాగతరక్షార్థం కర్తుం సద్వృత్తమాహితమ్ ।**
**ఆనందార్థం హి తస్యాస్తు శివ ఆవిర్బభూవ హ ॥ 15 ॥**

శరణుజొచ్చిన ఆమెను రక్షించడానికి బద్ధకంకణుడగు శివుడు, ఆమెకానందం కలిగించడానికి ఆమె ఎదుట సాక్షాత్కరించాడు.

**అథ తం మూఢనామానం దైత్యేంద్రం కామవిహ్వలమ్ ।**
**చకార భస్మసాత్సద్యః శంకరో భక్తవత్సలః ॥ 16 ॥**

అంతట భక్తవత్సలుడైన శంకరుడు కామంతో కన్నుకానని మూఢాసురుని వెంటనే భస్మం చేశాడు.

**తతశ్చ పరమేశానో కృపాదృష్ట్యా విలోక్య తామ్ ।**
**వరం బ్రూహీతి చోవాచ భక్తరక్షణదక్షధీః ॥ 17 ॥**

అనంతరం భక్తరక్షణదక్షుడైన శంకరుడు ఆమెపై దయాదృష్టిని ప్రసరించి వరమును కోరుకొమ్మని పలికాడు.

**శ్రుత్వా మహేశవచనం సా సాధ్వీ ద్విజకామినీ ।**
**దదర్శ శాంకరం రూపమానందజనకం శుభమ్ ॥ 18 ॥**

పతివ్రతయైన ఆ బ్రాహ్మణపత్ని మహేశ్వరుని వచనాన్ని విని ఆనందదాయకుడైన శంకరుని శుభరూపాన్ని దర్శించింది.

**తతః ప్రణమ్య తం శంభుం పరమేశం సుఖావహమ్ ।**
**తుష్టావ సాంజలిః సాధ్వీ నతస్కంధా శుభాశయా ॥ 19 ॥**

పవిత్రమైన అంతఃకరణంగల ఆ సాధ్వి చేతులు జోడించి, భుజములు వంచి, నమస్కరించి, పరమేశుడైన శంభునిలా స్తుతించింది.

**ఋషికోవాచ –** ఋషిక పలికింది.

**దేవదేవ! మహాదేవ! శరణాగతవత్సల! ।**
**దీనబంధుస్త్వమీశానో భక్తరక్షాకరః సదా ॥ 20 ॥**

ఓ దేవదేవా! మహాదేవా! శరణాగతవత్సలా! నీవు దీనబంధుడవు. ఈశ్వరుడవు. సదా భక్తరక్షాకరుడవు.

**త్వయా మే రక్షితో ధర్మో మూఢనామ్నో ఽసురాదిహ ।**
**యదయం నిహతో దుష్టో జగద్రక్షా కృతా త్వయా ॥ 21 ॥**

నీవు ఈ మూఢాసురుని బారినుండి రక్షించి నా ధర్మాన్ని నిలబెట్టావు. ఈ దుష్టుని సంహరించి నీవు జగత్తును కాపాడావు.

**స్వపాదయోః పరాం భక్తిం దేహి మే హ్యనపాయినీమ్ ।**
**అయమేవ వరో నాథ! కిమన్యదధికం హ్యతః ॥ 22 ॥**

ఓ నాథా! నాకు నీ పాదాలయందు నిశ్చలమైన భక్తిననుగ్రహించు. ఇదే నేను కోరే వరం. ఇంతకు మించినదేముంది?

**అన్యదాకర్ణయ విభో! ప్రార్థనాం మే మహేశ్వర! ।**
**లోకానాముపకారార్థమిహ త్వం సంస్థితో భవ ॥ 23 ॥**

ఓ విభూ! మహేశ్వరా! నా ప్రార్థన మరియొకటి గలదు. లోకోపకారం కొఱకు మీరిచ్చటే స్థిరంగా ఉండిపోవాలి.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఇతి స్తుత్వా మహాదేవమృషికా సా శుభవ్రతా ।**
**తూష్ణీమాసాథ గిరిశః ప్రోవాచ  కరుణాకరః ॥ 24 ॥**

శుభవ్రతయైన ఋషిక మహాదేవునిట్లు స్తుతించగా కరుణానిధి, కైలాసవాసి, కరుణాసముద్రుడు అయిన పరమేశ్వరుడిట్లు పలికాడు.

**గిరిశ ఉవాచ** – శివుడు పలికాడు.

**ఋషికే! సుచరిత్రా త్వం మమ భక్తా విశేషతః ।**
**దత్తా వరాశ్చ తే సర్వే తుభ్యం యే యే హి యాచితాః ॥ 25 ॥**

ఓ ఋషికా! నీ చరిత్ర చాలా గొప్పది. నీకు నా యందు గల విశేషమైన భక్తికి సంతసించి నీవు కోరిన వరాలనన్నిటినీ నీకు ప్రసాదిస్తున్నాను.

**ఏతస్మిన్నంతరే తత్ర హరిబ్రహ్మాదయస్సురాః ।**
**శివావిర్భావమాజ్ఞాయ యయుర్హర్షసమన్వితాః ॥ 26 ॥**

ఇంతలో విష్ణువు, బ్రహ్మ మున్నగు దేవతలు శివుడచ్చట ఆవిర్భవించాడని తెలిసి ఆనందంతో అక్కడికి విచ్చేశారు.

**శివం ప్రణమ్య సుప్రీత్యా సమానర్చుశ్చ తేఽఖిలాః ।**
**తుష్టువుర్నతకా విప్రాః కరౌ బద్ధ్వా సుచేతసః ॥ 27 ॥**

ప్రసన్నమైన మనస్సుగల వారందరు శివునికి మహాప్రీతితో చేతులు జోడించి ప్రణమిల్లి పూజించి స్తుతించారు.

**ఏతస్మిన్సమయే గంగా సాధ్వీ తాం స్వర్ధునీ జగౌ ।**
**ఋషికాం సుప్రసన్నాత్మా ప్రశంసంతీ చ తద్విధమ్ ॥ 28 ॥**

అదే సమయంలో స్వర్గంలో ప్రవహించే పవిత్రమగు గంగాదేవి ప్రసన్నాత్మురాలై సాధ్వియైన ఋషిక భాగ్యాన్ని కొనియాడుతూ ఆమెతో ఇలా పలికింది.

**గంగోవాచ –** గంగ పలికింది.

**మమార్థే చైవ వైశాఖే మాసి దేయం త్వయా వచః ।**
**స్థిత్యర్థం దినమేకం మే సామీప్యం కార్యమేవ హి ॥ 29 ॥**

నా కొఱకు నీవు వైశాఖమాసంలో ఒక రోజు ఇక్కడ ఉంటానని, నాకు మాట నిమ్ము. ఆనాడు నేను కూడ ఈ తీర్థంలో ఉండగోరుచున్నాను.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**గంగావచనమాకర్ణ్య సా సాధ్వీ ప్రాహ సువ్రతా ।**
**తథాస్త్వితి వచః ప్రీత్యా లోకానాం హితహేతవే ॥ 30 ॥**

సువ్రతయైన ఆ సాధ్వి ఇలా గంగాదేవియొక్క మాట విని మానవుల హితాన్ని గోరి 'అటులనే యగు గాక' అని అంగీకరించింది.

**ఆనందార్థం శివస్తస్యాః సుప్రసన్నశ్చ పార్థివే ।**
**తస్మింల్లింగే లయం యాతః పూర్ణాంశేన తయా హరః ॥ 31 ॥**

పాపహారియైన శివుడు మిక్కిలి ప్రసన్నుడై ఆమెకానందాన్ని కలిగించగోరి పూర్ణాంశతో ఆ పార్థివలింగంలో విలీనమయ్యాడు.

**దేవాః సర్వే సుప్రసన్నాః ప్రశంసంతి శివం చ తామ్ ।**
**స్వం స్వం ధామ యయుర్విష్ణుబ్రహ్మాద్యా అపి స్వర్ణదీ ॥ 32 ॥**

విష్ణువు, బ్రహ్మ మున్నగు సమస్త దేవతలు గంగానదిని శివుని మరియు ఋషికను ప్రశంసించి తమ తమ నివాసాలకు వెళ్ళిపోయారు.

**తద్దినాత్పావనం తీర్థమాసీదీదృశముత్తమమ్ ।**
**నందికేశః శివః ఖ్యాతః సర్వపాపవినాశనః ॥ 33 ॥**

ఆనాటినుండి ఆ స్థానం ఉత్తమము, పావనము అయిన తీర్థమయ్యింది. ఆ శివుడు నందికేశ్వరుడను పేరుతో విఖ్యాతిని పొంది సర్వుల పాపాలను నశింపజేస్తున్నాడు.

**గంగాపి ప్రతివర్షం తద్దినే యాతి శుభేచ్ఛయా ।**
**క్షాళనార్థం స్వపాపస్య యద్గృహీతం నృణాం ద్విజాః! ॥ 34 ॥**

ఓ ద్విజులారా! గంగాదేవికూడ ప్రతి సంవత్సరం శుభాన్ని కోరి మానవులనుండి తనకు సంక్రమించిన పాపాలను ప్రక్షాళన చేసుకోవటానికి ఆనాడు అక్కడకు వస్తుంది.

**తత్ర స్నాతో నరః సమ్యజ్ నందికేశం సమర్చ్య చ ।**
**బ్రహ్మహత్యాదిభిః పాపైర్ముచ్యతే హ్యఖిలైరపి ॥ 35 ॥**

ఈ తీర్థంలో స్నానం చేసి, నందికేశ్వరుని చక్కగా అర్చించిన మానవుడు, బ్రహ్మహత్యాది సమస్త పాపాలనుండి విముక్తుడౌతాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం నందికేశ్వరశివలింగమాహాత్మ్యవర్ణనం నామ సప్తమోఽధ్యాయః ॥ 7 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు నందికేశ్వరశివలింగమాహాత్మ్యవర్ణనం అనే పేరుగల ఏడవ అధ్యాయం సమాప్తం.

## **అష్టమోఽధ్యాయః - ఎనిమిదవ అధ్యాయం**

## **మహాబలమాహాత్మ్యవర్ణనమ్ - మహాబలమాహాత్మ్యవర్ణనం**

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ద్విజాః! శృణుత సద్భక్త్యా శివలింగాని తాని చ ।**
**పశ్చిమాయాం దిశాయాం వై యాని ఖ్యాతాని భూతలే ॥ 1 ॥**

ఓ బ్రాహ్మణులారా! భూలోకంలో పశ్చిమదిక్కున ప్రఖ్యాతిగాంచిన శివలింగాలను గూర్చి వివరిస్తాను భక్తితో వినండి.

**కపిలాయాం నగర్యాం తు కాలరామేశ్వరాభిధే ।**
**శివలింగే మహాదివ్యే దర్శనాత్పాపహారకే ॥ 2 ॥**

కపిలానగరంలో 'కాలరామేశ్వరుడు' అను పేరుగల శివలింగం సుప్రసిద్ధమైనది. దానిని దర్శిస్తే చాలు పాపాలు నశిస్తాయి.

**పశ్చిమే సాగరే చైవ మహాసిద్ధేశ్వరః స్మృతః ।**
**ధర్మార్థకామదశ్చైవ తథా మోక్షప్రదోఽపి హి ॥ 3 ॥**

పశ్చిమసముద్రతీరంలో గల 'మహాసిద్ధేశ్వరుడు' ధర్మార్థకామాలను మాత్రమే గాకుండా మోక్షాన్ని కూడ ఇస్తాడని మహర్షులు చెబుతారు.

**పశ్చిమాంబుధితీరస్థం గోకర్ణం క్షేత్రముత్తమమ్ ।**
**బ్రహ్మహత్యాదిపాపఘ్నం సర్వకామఫలప్రదమ్ ॥ 4 ॥**

పశ్చిమసముద్రతీరంలో బ్రహ్మహత్యాదిపాపాలను నశింపజేయగలిగేది, సర్వకామఫలాలనిచ్చేది పవిత్రమైన క్షేత్రం గోకర్ణ క్షేత్రం. ఇది అత్యుత్తమమయిన క్షేత్రం.

**గోకర్ణే శివలింగాని విద్యంతే కోటికోటిశః ।**
**అసంఖ్యాతాని తీర్థాని తిష్ఠంతి చ పదే పదే ॥ 5 ॥**

గోకర్ణక్షేత్రంలో కోట్లాదిలో శివలింగాలు, తీర్థప్రదేశంలో అడుగడుగునా కనబడతాయి. వాటి సంఖ్య ఊహకందదు.

**బహునాత్ర కిముక్తేన గోకర్ణస్థాని సర్వశః ।**
**శివప్రత్యక్షలింగాని తీర్థాన్యంభాంసి సర్వశః ॥ 6 ॥**

వేయి మాటలేల! శివుని స్వయంభూలింగాలు, సర్వతీర్థాలు గోకర్ణమంతటా ఉన్నాయి.

**గోకర్ణే శివలింగానాం తీర్థానామపి సర్వశః ।**
**వర్ణ్యతే మహిమా తాత! పురాణేషు మహర్షిభిః ॥ 7 ॥**

ఓ వత్సా! గోకర్ణంలోని శివలింగాలకు, తీర్థాలకు గల మహిమను పురాణాలలో మహర్షులు అనేక విధాలుగా వర్ణించారు.

**కృతే యుగే స హి శ్వేతస్త్రేతాయాం సోఽతిలోహితః ।**
**ద్వాపరే పీతవర్ణశ్చ కలౌ శ్యామో భవిష్యతి ॥ 8 ॥**

శివుడు కృతయుగంలో తెల్లగాను, త్రేతాయుగంలో మిక్కిలి ఎర్రగాను, ద్వాపరయుగంలో పచ్చగాను, కలియుగంలో నల్లగాను ఉంటాడు.

**ఆక్రాంతసప్తపాతాళకుహరోఽపి మహాబలః ।**
**ప్రాప్తే కలియుగే ఘోరే మృదుతాముపయాస్యతి ॥ 9 ॥**

మహాబలేశ్వరుడు ఏడు పాతాళలోకాల వరకు వ్యాపించియున్నాడు. కాని భయంకరమైన కలియుగం రాగానే ఆయన మెత్తదనాన్ని పొందుతాడు.

**మహాపాతకినశ్చాత్ర సమభ్యర్చ్య మహాబలమ్ ।**
**శివలింగం చ గోకర్ణే ప్రయాతాశ్శంకరం పదమ్ ॥ 10 ॥**

గోకర్ణంలో మహాబలేశ్వరుని చక్కగా ఆరాధించేవారు మహాపాపాలనుండి విముక్తులై శంకరధామాన్ని పొందుతారు.

**గోకర్ణే తత్ర మునయో గత్వా పుణ్యర్క్ష వాసరే ।**
**యేఽర్చయంతి చ తం భక్త్యా తే రుద్రాః స్యుర్న సంశయః ॥ 11 ॥**

ఓ మునులారా! గోకర్ణానికి వెళ్లి పుణ్య నక్షత్రంలో పుణ్యదినం నాడు భక్తితో ఆయననారాధించేవారు నిస్సంశయంగా రుద్రులే అవుతారు.

**యదా కదాచిద్గోకర్ణే యో వా కో వాపి మానవః ।**
**పూజయేచ్ఛివలింగం తత్స గచ్ఛేద్బ్రహ్మణఃపదమ్ ॥ 12 ॥**

ఏ మానవుడైనా, ఏసమయంలోనైనా, ఎప్పుడైనా గోకర్ణంలోని శివలింగాన్ని పూజిస్తే అతడు బ్రహ్మపదాన్ని పొందుతాడు.

**బ్రహ్మవిష్ణ్వాదిదేవానాం శంకరో హితకామ్యయా ।**
**మహాబలాభిధానేన దేవః సన్నిహితస్సదా ॥ 13 ॥**

బ్రహ్మ, విష్ణువు మున్నగు దేవతల హితాన్ని కోరిన శంకరుడు మహాబలేశ్వరుడను పేరుతో నిత్యం గోకర్ణంలో సన్నిహితుడై యున్నాడు.

**ఘోరేణ తపసా లబ్ధం రావణాఖ్యేన రక్షసా ।**
**తల్లింగం స్థాపయామాస గోకర్ణగణనాయకః ॥ 14 ॥**

రావణాసురుడు ఘోరతపస్సు చేసి సంపాదించిన శివలింగాన్ని విఘ్నేశ్వరుడు గోకర్ణంలో ప్రతిష్ఠించాడు.

**విష్ణుర్బ్రహ్మా మహేంద్రశ్చ విశ్వేదేవా మరుద్గణాః ।**
**ఆదిత్యా వసవో దస్రౌ శశాంకశ్చ సతారకః ॥ 15 ॥**

**ఏతే విమానగతయో దేవాశ్చ సహ పార్షదైః ।**
**పూర్వద్వారం నిషేవంతే తస్య వై ప్రీతికారణాత్ ॥ 16 ॥**

విష్ణువు, బ్రహ్మ, దేవేంద్రుడు, విశ్వేదేవతలు, మరుద్గణాలు, ఆదిత్యులు, వసువులు, అశ్వినీ దేవతలు, నక్షత్రాలతో కూడిన చంద్రుడు అను ఈ దేవతలు తమ గణాలతో బాటు విమానాలపై వచ్చి శివునకు ప్రీతిని కలిగించడానికి తూర్పు ద్వారంలో సేవిస్తున్నారు.

**యమో మృత్యుః స్వయం సాక్షాచ్చిత్రగుప్తశ్చ పావకః ।**
**పితృభిః సహ రుద్రైశ్చ దక్షిణద్వారమాశ్రితః ॥ 17 ॥**

స్వయంగా మృత్యుదేవత, యముడు, చిత్రగుప్తుడు, అగ్ని, పితృదేవతలు, రుద్రులు దక్షిణ ద్వారాన్ని ఆశ్రయించియున్నారు.

**వరుణః సరితాం నాథో గంగాదిసరితాం గణైః ।**
**మహాబలం చ సేవంతే పశ్చిమద్వారమాశ్రితాః ॥ 18 ॥**

వరుణుడు, సముద్రుడు, గంగాది నదీసముదాయంతో పశ్చిమ ద్వారాన్ని ఆశ్రయించి మహాబలేశ్వరుని సేవిస్తూ ఉన్నాయి.

**తథా వాయుః కుబేరశ్చ దేవేశీ భద్రకాళికా ।**
**మాతృభిశ్చండికాద్యాభిరుత్తరద్వారమాశ్రితాః ॥ 19 ॥**

అట్లే వాయువు, కుబేరుడు, దేవేరియైన భద్రకాళి, చండిక మున్నగు మాతృమూర్తులు ఉత్తర ద్వారాన్నాశ్రయించి యున్నారు.

**సర్వే దేవాస్సగంధర్వాః పితరః సిద్ధచారణాః ।**
**విద్యాధరాః కింపురుషాః కిన్నరా గుహ్యకాః ఖగాః ॥ 20 ॥**

**నానాపిశాచా బేతాళా దైతేయాశ్చ మహాబలాః ।**
**నాగాశ్శేషాదయస్సర్వే సిద్ధాశ్చ మునయోఽఖిలాః ॥ 21 ॥**

**ప్రణువంతి చ తం దేవం ప్రణమంతి మహాబలమ్ ।**
**లభంత ఈప్సితాన్కామాన్నమంతే చ యథాసుఖమ్ ॥ 22 ॥**

**బహుభిస్తత్ర సుతపస్తప్తం సంపూజ్య తం విభుమ్ ।**
**లబ్ధా హి పరమా సిద్ధిరిహాముత్రాపి సౌఖ్యదా ॥ 23 ॥**

సమస్త దేవతలు, గంధర్వులు, పితరులు, సిద్ధులు, చారణులు, విద్యాధరులు, కింపురుషులు, కిన్నరులు, గుహ్యాంకులు, గరుడులు, అనేక రకాల పిశాచాలు, బేతాళులు, మహాబలశాలురైన రాక్షసులు, శేషుడు మున్నగు నాగులు, సకలసిద్ధులు, సమస్తమునులు, ఆ మహాబలదేవుని స్తుతించి, ప్రణమిల్లి, అభీష్టకామనలను పొంది సుఖంగా నివసిస్తున్నారు. అనేకులు ఆ విభుని పూజించి గొప్ప తపస్సు చేసి ఇహపరసుఖాలనిచ్చే పరమసిద్ధిని పొందారు.

**గోకర్ణే శివలింగం తు మోక్షద్వార ఉదాహృతః ।**
**మహాబలాభిధానోఽసౌ పూజితః సంస్తుతో ద్విజాః ॥ 24 ॥**

ఓ బ్రాహ్మణులారా! గోకర్ణంలోని మహాబలేశ్వరుడనే శివలింగాన్ని స్తుతించి పూజిస్తే మోక్షద్వారం తెరుచుకుంటుందని చెబుతారు.

**మాఘాసితచతుర్దశ్యాం మహాబలసమర్చనమ్ ।**
**విముక్తిదం విశేషేణ సర్వేషాం పాపినామపి ॥ 25 ॥**

పాపాత్ములతో సహా, అందరూ కూడ విశేషించి మాఘకృష్ణచతుర్దశినాడు మహాబలేశ్వరుని ఆరాధిస్తే ముక్తిని పొందుతారు.

**అస్యాం శివతిథౌ సర్వే మహోత్సవదిదృక్షవః ।**
**ఆయాంతి సర్వదేశేభ్యశ్చాతుర్వర్ణ్యమహాజనాః ॥ 26 ॥**

ఈ శివతిథినాడు అన్ని ప్రాంతాలనుండి, అన్ని వర్ణాల ప్రజలు మహోత్సవాన్ని చూడడానికి వస్తుంటారు.

**స్త్రియో వృద్ధాశ్చ బాలాశ్చ చతురాశ్రమవాసినః ।**
**దృష్ట్వా తత్రైత్య దేవేశం లేభిరే కృతకృత్యతామ్ ॥ 27 ॥**

స్త్రీలు, వృద్ధులు, బాలురు, నాలుగాశ్రమాలకు చెందినవారు, అచటికి వచ్చి శివుని దర్శించి కృతకృత్యులౌతారు.

**మహాబలప్రభావాత్తు తచ్చ లింగం శివస్య తు ।**
**సంపూజ్యైకాథ చాండాలీ శివలోకం గతా ద్రుతమ్ ॥ 28 ॥**

ఒక చండాలస్త్రీ ఆ శివలింగాన్ని చక్కగా పూజించి మహాబలేశ్వరుని మహిమచే శీఘ్రంగా శివలోకాన్ని పొందింది.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాంమహాబలమాహాత్మ్యవర్ణనం నామాష్టమోఽధ్యాయః ॥ 8 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు మహాబలమాహాత్మ్యవర్ణనం అనే పేరుగల ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## నవమోఽధ్యాయః - తొమ్మిదవ అధ్యాయం

## చాండాలీసద్గతివర్ణనమ్ - చాండాలీసద్గతివర్ణనం

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**సూత! సూత! మహాభాగ! ధన్యస్త్వం శైవసత్తమః ।**
**చాండాలీ కా సమాఖ్యాతా తత్కథాం కథయ ప్రభో! ॥ 1 ॥**

ఓ సూతా! సూతా! మహాభాగా! శివభక్తాగ్రేసరుడవైన నీవు ధన్యుడవు. ఓ ప్రభూ! ఆ చాండాలి ఎవరు? ఆ గాథను వినిపించండి.

**సూత ఉవాచ** - సూతుడు చెప్పాడు.

**ద్విజాః! శృణుత సద్భక్త్యా తాం కథాం పరమాద్భుతామ్ ।**
**శివప్రభావసంమిశ్రాం శృణ్వతాం భక్తివర్ధినీమ్ ॥ 2 ॥**

ఓ బ్రాహ్మణులారా! భక్తితో వినండి. ఈ కథ పరమాద్భుతమైనది. శివప్రభావంతో విరాజిల్లుతూ ఉన్నది. వినేవారి భక్తిని పెంపొందింపచేస్తుంది.

**చాండాలీ సా పూర్వభవేఽభవద్బ్రాహ్మణకన్యకా ।**
**సౌమినీ నామ చంద్రాస్యా సర్వలక్షణసంయుతా ॥ 3 ॥**

ఆ చాండాలి తన పూర్వజన్మలో చంద్రుని వంటి ముఖంతో సర్వసులక్షణ అయిన బ్రాహ్మణకన్య. ఆమె పేరు సౌమిని.

**అథ సా సమయే కన్యా యువతిః సౌమినీ ద్విజాః! ।**
**పిత్రా దత్తా చ కస్మైచిద్విధినా ద్విజసూనవే ॥ 4 ॥**

ఓ బ్రాహ్మణోత్తములారా ! ఆమెకు యుక్తవయస్సురాగానే ఆమె తండ్రి ఆమెనొక బ్రాహ్మణకుమారునకిచ్చి యథావిధిగా వివాహం చేశాడు.

**సా భర్తారమనుప్రాప్య కించిత్కాలం శుభవ్రతా ।**
**రేమే తేన ద్విజశ్రేష్ఠాః! నవయౌవనశాలినీ ॥ 5 ॥**

ఓ బ్రాహ్మణోత్తములారా! ఆమె శుభవ్రతం గలది, నూతన యౌవనంలో ఉన్న ఆ బ్రాహ్మణయువతి భర్తను పొంది, కొంతకాలం శృంగారసుఖాన్ని అనుభవించింది.

**అథ తస్యాః పతిర్విప్రస్తరుణస్సురుజార్దితః ।**
**సౌమిన్యాః కాలయోగాత్తు పంచత్వమగమద్ద్విజాః ॥ 6 ॥**

ఓ బ్రాహ్మణులారా! తరువాత కొంతకాలానికి సౌమిని భర్తయైన బ్రాహ్మణయువకుడు పెద్ద వ్యాధిపీడితుడై మరణించాడు.

**మృతే భర్తరి సా నారీ దుఃఖితాతివిషణ్ణధీః ।**
**కించిత్కాలం శుభాచారా సుశీలోవాస సద్మని ॥ 7 ॥**

భర్త మరణించిన తరువాత ఆ యువతి దుఃఖాతిశయంతో కూడి సౌశీల్యసదాచారాలతో కొంతకాలం వఱకు ఆ గృహంలోనే నివసించింది.

**తతస్సా మన్మథావిష్టహృదయా విధవాపి చ ।**
**యువావస్థావిశేషేణ బభూవ వ్యభిచారిణీ ॥ 8 ॥**

అనంతరం ఆమె భర్తృహీనయైనప్పటికీ, యౌవనప్రభావంతో మన్మథావేశంతో నిండిన మనస్సుగలదై వ్యభిచారిణి అయ్యింది.

**తద్ జ్ఞాత్వా గోత్రిణస్తస్యా దుష్కర్మ కులదూషణామ్ ।**
**సమేతాస్తత్యజుర్దూరం నీత్వా తాం సకచగ్రహామ్ ॥ 9 ॥**

కులప్రతిష్ఠను చెడగొట్టే ఆమెయొక్క చెడుప్రవర్తనను చూచి ఆమె బంధువులు ఆమెను జుట్టుపట్టుకొని తీసుకువెళ్లి దూరంగా విడిచిపెట్టారు.

**కశ్చిచ్ఛూద్రవరస్తాం వై విచరంతీం నిజేచ్ఛయా ।**
**దృష్ట్వా వనే స్త్రియం చక్రే నినాయ స్వగృహం తతః ॥ 10 ॥**

అడవిలో యథేచ్ఛగా సంచరిస్తున్న ఆ యువతిని చూచిన ఒక శూద్రప్రముఖుడామెను వివాహమాడి తన ఇంటికి తీసుకొనిపోయాడు.

**అథ సా పిశితాహారా నిత్యమాపీతవారుణీ ।**
**అజీజనత్సుతాన్ తేన శూద్రేణ సురతప్రియా ॥ 11 ॥**

అనంతరం ఆమె ప్రతిదినం మాంసాన్ని భక్షిస్తూ, మద్యాన్ని త్రాగుతూ, ఆ శూద్రునితో ప్రీతితో రమిస్తూ పుత్రులను కూడా పొందింది.

**కదాచిద్భర్తరి క్వాపి యాతే పీతసురాఽథ సా ।**
**ఇయేష పిశితాహారం సౌమినీ వ్యభిచారిణీ ॥ 12 ॥**

ఒకనాడు భర్త ఎక్కడికో వెళ్లాడు. వ్యభిచారిణియైన ఆ సౌమిని మద్యం త్రాగింది. మాంసాహారం కోరుకుంది.

**తతో మేషేషు బద్ధేషు గోభిస్సహ బహిర్వ్రజే ।**
**నిశాముఖే తమోఽంధే హి ఖడ్గమాదాయ సా యయౌ ॥ 13 ॥**

ఆమె ఆ రాత్రి సమయంలో, గాఢాంధకారంలో కత్తిని చేతబట్టి పశువుల శాలకు వెళ్లింది. అక్కడ గోవులతో బాటు మేకలు కూడా కట్టివేయబడియున్నాయి.

**అవిమృశ్య మదావేశాన్మేషబుధ్యాఽఽమిష ప్రియా ।**
**ఏకం జఘాన గోవత్సం క్రోశంతమతిదుర్భగా ॥ 14 ॥**

మాంసాహారాన్ని ఇష్టపడే ఆ మహాదుష్టురాలు మద్యం ప్రభావంతో కన్నుమిన్ను గానక మేక అని తలచి బిగ్గరగ అరుస్తున్న ఒక ఆవుదూడను సంహరించింది.

**హతం తం గృహమానీయ జ్ఞాత్వా గోవత్సమంగనా ।**
**భీతా శివ శివేత్యాహ కేనచిత్పుణ్యకర్మణా ॥ 15 ॥**

సౌమిని ఆ మృతపశువును ఇంటికి తెచ్చి అది ఆవుదూడ అని గుర్తించి భయంతో ఏదో ఒక పూర్వపుణ్య-ప్రభావంతో 'శివ, శివ' అని పలికింది.

**సా ముహూర్తం శివం ధ్యాత్వాఽఽమిషభోజనలాలసా ।**
**ఛిత్వా తమేవ గోవత్సం చకారాహారమీప్సితమ్ ॥ 16 ॥**

ఆమె ముహూర్తకాలం శివుని ధ్యానించింది. మాంసభక్షణంలో ప్రీతిగల ఆమె ఆవుదూడను కోసి తనకు నచ్చిన వంటకాన్ని చేసుకొంది.

**ఏవం బహుతిథే కాలే గతే సా సౌమినీ ద్విజాః ।**
**కాలస్య వశమాపన్నా జగామ యమసంక్షయమ్ ॥ 17 ॥**

ఓ బ్రాహ్మణులారా! ఈ విధంగా చాలకాలం గడిచింది. అనంతరం ఆ 'సౌమిని' మరణించి యమలోకానికి వెళ్లింది.

**యమోఽపి ధర్మమాలోక్య తస్యాః కర్మ చ పౌర్వికమ్ ।**
**నివర్త్య నిరయావాసాచ్చక్రే చాండాలజాతికామ్ ॥ 18 ॥**

ధర్మాన్ని పరిపాలించే యముడు ఆమె పూర్వజన్మలో చేసిన కర్మలను పరిశీలించి ఆమెను వెనుకకు పంపి చండాలజాతిలో జన్మింపజేశాడు.

**సాఽథ భ్రష్టా యమపురాచ్చాండాలీ గర్భమాశ్రితా ।**
**తతో బభూవ జన్మాంధా ప్రశాంతాంగారమేచకా ॥ 19 ॥**

ఆమె యమలోకంనుండి భ్రష్టురాలై చండాలస్త్రీ గర్భంలో పుట్టుగ్రుడ్డియై జన్మించింది. ఆమె నిప్పునార్పగా మిగిలిన బొగ్గులాగా నల్లగా ఉండేది.

**జన్మాంధా సాఽథ బాల్యేఽపి విధ్వస్తపితృమాతృకా ।**
**ఊఢా న కేనచిద్దుష్టా మహాకుష్ఠరుజార్దితా ॥ 20 ॥**

పుట్టు గ్రుడ్డిదైన ఆమె తల్లిదండ్రులు బాల్యంలోనే మరణించారు. మహాకుష్ఠువ్యాధితో పీడింపబడుతున్న ఆ దుష్టురాలికి వివాహం కాలేదు.

**తతః క్షుధార్దితా దీనా యష్టిపాణిర్గతేక్షణా ।**
**చాండాలోచ్ఛిష్టపిండేన జఠరాగ్నిమతర్పయత్ ॥ 21 ॥**

చూపులేని ఆ దీనురాలు కర్ర చేతబట్టి ఆకలికి తాళలేక చండాలురు తినగా మిగిలిన అన్నంతో కడుపు నింపుకునేది.

**ఏవం కృచ్ఛ్రేణ మహతా నీత్వా స్వవిపులం వయః ।**
**జరయా గ్రస్తసర్వాంగీ దుఃఖమాప దురత్యయమ్ ॥ 22 ॥**

ఇలా ఆమె మహాదుఃఖాన్ననుభవిస్తూ చిరకాలం జీవించింది. ఆమె అవయవాలన్నీ ముసలితనంచే శిథిలమయ్యాయి. ఆమె భరించరాని దుఃఖాన్ని అనుభవించింది.

**కదాచిత్సాఽథ చాండాలీ గోకర్ణం తం మహాజనాన్ ।**
**ఆయాస్యంత్యాం శివతిథౌ గచ్ఛతో బుబుధేఽన్వగాన్ ॥ 23 ॥**

రాబోయే శివపర్వదినానికి గోకర్ణానికి వెళ్ళే మహాత్ములు ఆ దారిని వెళతారని ఒకమారు ఆమెకు తెలిసింది.

**అథాఽసావపి చాండాలీ వసనాశనతృష్ణయా ।**
**మహాజనాన్ యాచయితుం సంచచార శనైః శనైః ॥ 24 ॥**

ఆ చాండాలి కట్టుగుడ్డలయందు, వస్త్రములు మరియు భోజనమునందు తృష్ణగలిగి సంపన్నులైన జనాలను యాచింపగోరి ఆ మార్గంలో మెల్లమెల్లగా అటు ఇటు తిరగసాగింది.

**గత్వా తత్రాథ చాండాలీ ప్రార్థయంతీ మహాజనాన్ ।**
**యత్ర తత్ర చచారసౌ దీనవాక్ప్రసృతాంజలిః ॥ 25 ॥**

చేతులు చాచి దీనంగా పలుకుతూ మహాజనులను యాచిస్తూ ఆమె గోకర్ణమార్గంలో అటు ఇటు తిరగసాగింది.

**ఏవమభ్యర్థయంత్యాస్తు చాండాల్యాః ప్రసృతాంజలౌ ।**
**ఏకః పుణ్యతమః పాంథః ప్రాక్షిపద్బిల్వమంజరీమ్ ॥ 26 ॥**

ఈ విధంగా యాచిస్తున్న ఆ చాండాలిచేతిలో మహాపుణ్యాత్ముడైన ఒక బాటసారి మారేడుదళాల గుత్తిని జారవిడిచాడు.

**తామంజలౌ నిపతితాం సా విమృశ్య పునః పునః ।**
**అభక్ష్యమితి మత్వాథ దూరే ప్రాక్షిపదాతురా ॥ 27 ॥**

తన చేతిలో పడిన ఆ వస్తువును ఆమె చాలామార్లు స్పర్శతో పరిశీలించి, అది తినే వస్తువు కాదని తలంచి దుఃఖితురాలై దూరంగా పారవైచింది.

**తస్యాః కరాద్వినిర్ముక్తా రాత్రౌ సా బిల్వమంజరీ ।**
**పపాత కస్యచిద్దిష్ట్యా శివలింగస్య మస్తకే ॥ 28 ॥**

ఆమె చేతినుండి విసిరివేయబడిన ఆ మారేడుదళాల గుత్తి దైవయోగంచే ఒకానొక శివలింగం శిరస్సుపై పడింది.

**సైవం శివచతుర్దశ్యాం రాత్రౌ పాంథజనాన్ముహుః ।**
**యాచమానాపి యత్కించిన్న లేభే దైవయోగతః ॥ 29 ॥**

ఆమె ఈ విధంగా శివచతుర్దశినాడు రాత్రియందు బాటసారులను పలుమార్లు యాచించినా దైవనిర్ణయం వల్ల ఆమెకేమియూ లభించలేదు.

**ఏవం శివచతుర్దశ్యాం వ్రతం జాతం చ నిర్మలమ్ ।**
**అజ్ఞానతో జాగరణం పరమానందదాయకమ్ ॥ 30 ॥**

ఈ విధంగా పవిత్రము, పరమానందదాయకము అయిన శివచతుర్దశీవ్రతం, మరియు జాగరణం, ఆమెకు తెలియకుండగానే సిద్ధించాయి.

**తతః ప్రభాతే సా నారీ శోకేన మహతాఽఽవృతా ।**
**శనైర్నివవృతే దీనా స్వదేశాయైవ కేవలమ్ ॥ 31 ॥**

మరునాడు ఉదయం ఆ స్త్రీ మహాదుఃఖాన్ననుభవిస్తూ దీనురాలై మెల్లగా తన స్థానానికి మరలింది.

**శ్రాంతా చిరోపవాసేన నిపతంతీ పదే పదే ।**
**అతీత్య తావతీం భూమిం నిపపాత విచేతనా ॥ 32 ॥**

ఆమె చిరకాలం ఉపవాసంచే సొక్కి అడుగడుగునా పడిపోతూ కొద్దిదూరం వెళ్లి కూప్పకూలి ప్రాణాలు విడిచింది.

**అథ సా శంభుకృపయా జగామ పరమం పదమ్ ।**
**ఆరుహ్య సువిమానం చ నీతం శివగణైర్ద్రుతమ్ ॥ 33 ॥**

అపుడామె శివుని కృపవలన శివగణములతో కలసి విమానమెక్కి కైలాసమునకు వెళ్ళెను.

**ఆదౌ యదేషా శివనామ నారీ ప్రమాదతో వాప్యసతీ జగాద ।**
**తేనేహ భూయః సుకృతేన విప్రా మహాబలస్థానమవాప దివ్యమ్ ॥ 34 ॥**

ఓ బ్రాహ్మణులారా! ఆ బ్రాహ్మణయువతి దుష్టురాలే. కాని శివనామాన్ని అనుకోనివిధంగా ఉచ్చరించింది. ఆ మహాపుణ్యప్రభావంచే ఇహలోకంలో ఆమె దివ్యమైన మహాబలేశ్వరం చేరగలిగింది.

**శ్రీగోకర్ణే శివతిథావుపోష్య శివమస్తకే ।**
**కృత్వా జాగరణం సా హి చక్రే బిల్వార్చనం నిశి ॥ 35 ॥**

శ్రీగోకర్ణంలో శివతిథినాడామె ఉపవసించి జాగరణం చేసి శివుని శిరస్సుపై రాత్రివేళ బిల్వపత్రాలను పూజించింది.

**అకామతః కృతస్యాస్య పుణ్యస్యైవ చ తత్ఫలమ్ ।**
**భునక్త్యద్యాపి సా చైవ మహాబలప్రసాదతః ॥ 36 ॥**

ఆమె అనుకోకుండా చేసిన పుణ్యఫలం మహాబలేశ్వరుని అనుగ్రహంచేత ఈనాటికీ ఆమె అనుభవిస్తున్నది.

**ఏవంవిధం మహాలింగం శంకరస్య మహాబలమ్ ।**
**సర్వపాపహరం సద్యః పరమానందదాయకమ్ ॥ 37 ॥**

సకల పాపాలను పోగొట్టి, వెంటనే పరమానందాన్నిచ్చే మహేశ్వరలింగం ఇట్టి మహిమను గలిగివున్నది.

**ఏవం వః కథితం విప్రాః! మాహాత్మ్యం పరమం మయా ।**
**మహాబలాభిధానస్య శివలింగవరస్య హి ॥ 38 ॥**

ఓ బ్రాహ్మణులారా! శివలింగాలలో శ్రేష్ఠమైన మహాబలేశ్వరుడని పిలువబడే శివలింగం యొక్క పవిత్రమాహాత్మ్యాన్ని నేను మీకీ విధంగా తెలియచేశాను.

**అథాన్యదపి వక్ష్యామి మాహాత్మ్యం తస్య చాద్భుతమ్ ।**
**శ్రుతమాత్రేణ యేనాశు శివే భక్తిః ప్రజాయతే ॥ 39 ॥**

ఇంతేగాక ఆ శివుని మహిమను గూర్చి మరియొక కథను చెబుతాను. దీనిని విన్నవెంటనే శివునియందు భక్తి ఉదయిస్తుంది.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం చాండాలీసద్గతివర్ణనం నామ నవమోఽధ్యాయః ॥ 9 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు చాండాలీసద్గతివర్ణనం అనే పేరుగల తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## దశమోఽధ్యాయః - పదవ అధ్యాయం

## మహాబాహ్వాహ్వ శివలింగమాహాత్మ్యవర్ణనం - మహాబాహ్వాశివలింగమాహాత్మ్యవర్ణనం

**సూత ఉవాచ** - సూతుడు చెప్పాడు.

**శ్రీమతీక్ష్వాకువంశే హి రాజా పరమధార్మికః ।**
**ఆసీన్మిత్రసహో నామ శ్రేష్ఠస్సర్వధనుష్మతామ్ ॥ 1 ॥**

శోభాయమానమైన ఇక్ష్వాకువంశంలో మహాధార్మికుడు, ధనుర్ధారులందరిలో శ్రేష్ఠుడైన 'మిత్రసహుడు' అనే మహారాజు ఉండేవాడు.

**తస్య రాజ్ఞః సుధర్మిష్ఠా మదయంతీ ప్రియా శుభా ।**
**దమయంతీ నలస్యేవ బభూవ విదితా సతీ ॥ 2 ॥**

నలునకు దమయంతి వలె ఆ రాజునకు గొప్ప ధర్మాత్మురాలు, ప్రియురాలు, శుభకరురాలు, పతివ్రతయని ప్రఖ్యాతిగాంచిన 'మదయంతి' అను భార్య ఉండేది.

**స ఏకదా హి మృగయాస్నేహీ మిత్రసహో నృపః ।**
**మహాబలేన సంయుక్తో జగామ గహనం వనమ్ ॥ 3 ॥**

వేటయందభిరుచిగల మిత్రసహ మహారాజు ఒకనాడు గొప్పసైన్యాన్ని వెంటబెట్టుకొని దట్టమైన అడవికి వేటకోసం వెళ్లాడు.

**విహరంస్తత్ర స నృపః కమఠాహ్వం నిశాచరమ్ ।**
**నిజఘాన మహాదుష్టం సాధుపీడాకరం ఖలమ్ ॥ 4 ॥**

ఆ మహారాజు ఆ అడవిలో విహరిస్తూ మహాపాపి, సాధుపీడారతుడునైన కమఠాసురుని సంహరించాడు.

**అథ తస్యానుజః పాపీ జయేయం ఛద్మనైవ తమ్ ।**
**మత్వా జగామ నృపతేరంతికచ్ఛద్మకారకః ॥ 5 ॥**

అనంతరం పాపియైన ఆ రాక్షసుని సోదరుడు మహారాజును మోసంతోనే జయించాలని నిశ్చయించుకొని మారువేషంలో ఆయన వద్దకు వెళ్ళాడు.

**తం వినమ్రాకృతిం దృష్ట్వా భృత్యతాం కర్తుమాగతమ్ ।**
**చక్రే మహానసాధ్యక్షమజ్ఞానాత్స మహీపతిః ॥ 6 ॥**

వినయవిధేయతలతో సేవచేయడానికి వచ్చిన ఆ వ్యక్తిని చూచి విషయం తెలియని ఆ మహారాజు వానిని వంటశాలకు అధిపతిగా నియమించాడు.

**అథ తస్మిన్వనే రాజా కియత్కాలం విహృత్య సః ।**
**నివృత్తో మృగయాం హిత్వా స్వపురీమాయయౌ ముదా ॥ 7 ॥**

అనంతరం ఆ మహారాజు కొద్దిరోజులు అడవిలో విహరించి వేటను ముగించుకొని, ఆనందంతో తన నగరానికి తిరిగివెళ్లాడు.

**పితుః క్షయాహే సంప్రాప్తే నిమంత్ర్య స్వగురుం నృపః ।**
**వసిష్ఠం గృహమానిన్యే భోజయామాస భక్తితః ॥ 8 ॥**

తండ్రి మరణించిన తిథి వచ్చినప్పుడు రాజు తన గురువగు వసిష్ఠుని ఆహ్వానించి భక్తితో భోజనానికి సిద్ధం చేశాడు.

**రక్షసా సూదరూపేణ సంమిశ్రితనరామిషమ్ ।**
**శాకామిషం పురః క్షిప్తం దృష్ట్వా గురురథాబ్రవీత్ ॥ 9 ॥**

వంటవానిరూపంలో నున్న ఆ రాక్షసుడు కూరలో నరమాంసం కలిపి వడ్డించాడు. దానిని చూచి గురువిలా పలికాడు.

**గురురువాచ –** గురువు పలికాడు.

**ధిక్ త్వాం నరామిషం రాజన్! త్వయైతచ్ఛద్మకారిణా ।**
**ఖలేనోపహృతం మహ్యం తతో రక్షో భవిష్యసి ॥ 10 ॥**

ఓ రాజా! నీకు నిందయగు గాక! మోసగాడైన ఈ దుష్టునిచే నీవు నాకు నరమాంసాన్ని వడ్డింపజేశావు. కావున నీవు రాక్షసుడవు అవుతావు.

**రక్షఃకృతం చ విజ్ఞాయ తదైవం స గురుస్తదా ।**
**పునర్విమృశ్య తం శాపం చకార ద్వాదశాబ్దికమ్ ॥ 11 ॥**

ఇదంతా రాక్షసుని పనియని గుర్తించిన గురువు మరల ఆలోచించి ఆ శాపాన్ని పన్నెండు సంవత్సరాల వ్యవధికలదిగా చేశాడు.

**స రాజాఽనుచితం శాపం విజ్ఞాయ క్రోధమూర్ఛితః ।**
**జలాంజలిం సమాదాయ గురుం శప్తుం సముద్యతః ॥ 12 ॥**

తనకా శాపం తగదని భావించిన ఆ రాజు కోపంతో ఆవేశింపబడినవాడై చేతిలో నీటిని తీసుకొని గురువును శపించడానికి సిద్ధుడయ్యాడు.

**తదా చ తత్ప్రియా సాధ్వీ మదయంతీ సుధర్మిణీ ।**
**పతిత్వా పాదయోస్తస్య శాపం తం హి న్యవారయత్ ॥ 13 ॥**

అప్పుడు గొప్ప ధర్మాత్మురాలు, సాధ్వి అయిన అతని భార్య మదయంతి అతని పాదాలపై బడి ఆ శాపాన్ని ఆపివేసింది.

**తతో నివృత్తశాపస్తు తస్యా వచనగౌరవాత్ ।**
**తత్యాజ పాదయోరంభః పాదౌ కల్మషతాం గతౌ ॥ 14 ॥**

ఆమె మాటయందలి గౌరవంచేత రాజు శాపమివ్వడం మానివేసి, ఆ నీటిని పాదాలపై విడిచిపెట్టగా, పాదాలు నల్లగా అయ్యాయి.

**తతః ప్రభృతి రాజాఽభూత్స లోకేఽస్మిన్మునీశ్వరాః! ।**
**కల్మాషాంఘ్రిరితి ఖ్యాతః ప్రభావాత్తజ్జలస్య హి ॥ 15 ॥**

ఓ మహర్షులారా! నాటి నుండి ఆ నీటిప్రభావంవల్ల ఆ రాజు లోకంలో 'కల్మాషపాదుడు' అని పేరుగాంచాడు.

**రాజా మిత్రసహః శాపాద్గురో ఋషివరస్య హి ।**
**బభూవ రాక్షసో ఘోరో హింసకో వనగోచరః ॥ 16 ॥**

మిత్రసహ మహారాజు గురువైన మహర్షియొక్క శాపం వల్ల అడవిలో తిరుగాడే భయంకర రాక్షసుడై హింసించసాగాడు.

**స బిభ్రద్రాక్షసం రూపం కాలాంతకయమోపమమ్ ।**
**చఖాద వివిధాన్ జంతూన్ మానుషాదీన్వనేచరః ॥ 17 ॥**

ఆ రాజు ప్రళయకాలమందలి మృత్యువును పోలిన రాక్షసరూపాన్ని ధరించి మనుష్యులను భక్షించే జంతువులను భక్షిస్తూ అడవిలో తిరగసాగాడు.

**స కదాచిద్వనే క్వాపి రమమాణౌ కిశోరకౌ ।**
**అపశ్యదంతకాకారో నవోఢౌ మునిదంపతీ ॥ 18 ॥**

ఒకనాడు అడవిలో విహరిస్తూ కొత్తగా వివాహమై యౌవనంలోనున్న మునికుమార దంపతులను రాక్షసుడు చూశాడు.

**రాక్షసః స నరాహారః కిశోరం మునినందనమ్ ।**
**జగ్ధుం జగ్రాహ శాపార్తో వ్యాఘ్రో మృగశిశుం యథా ॥ 19 ॥**

శాపపీడితుడై నరమాంసాన్ని భక్షించే ఆ రాక్షసుడు యౌవనంలో నున్న ఆ మునికుమారుని తినడానికి పెద్దపులి లేడిపిల్లను పట్టుకున్నట్లుగా పట్టుకున్నాడు.

**కుక్షౌ గృహీతం భర్తారం దృష్ట్వా భీతా చ తత్ప్రియా ।**
**సా చక్రే ప్రార్థనాం తస్మై వదంతీ కరుణం వచః ॥ 20 ॥**

ఉదరంలో పట్టుకొనబడిన భర్తను చూచి, అతని భార్య భయంతో దయకలిగేలా పలుకుతూ ఆ రాక్షసుని బ్రతిమిలాడింది.

**ప్రార్థ్యమానోఽపి బహుశః పురుషాదః స నిర్ఘృణః ।**
**చఖాద శిర ఉత్కృత్య విప్రసూనోర్దురాశయః ॥ 21 ॥**

నరమాంసభక్షకుడు, దుర్మార్గుడు అయినట్టి ఆ రాక్షసుడు ఎన్ని విధముల బ్రతిమిలాడినా వినక బ్రాహ్మణకుమారుని తలను ఖండించి భక్షించాడు.

**అథ సాధ్వీ చ సా దీనా విలప్య భృశదుఃఖితా ।**
**ఆహృత్య భర్తురస్థీని చితాం చక్రే కిలోల్బణామ్ ॥ 22 ॥**

అంతట దీనురాలు, సాధ్విఅయిన మునిపత్ని దీనంగా విలపించి తనభర్త అస్థికలను సంగ్రహించి భయంకరమైన చితిని ఏర్పాటు చేసుకుంది.

**భర్తారమనుగచ్ఛంతీ సంవిశంతీ హుతాశనమ్ ।**
**రాజానం రాక్షసాకారం సా శశాప ద్విజాంగనా ॥ 23 ॥**

ఆ బ్రాహ్మణస్త్రీ భర్త ననుసరించి వెళ్లడానికి నిశ్చయించి అగ్నిలో ప్రవేశించబోతూ రాక్షసరూపంలోనున్న రాజును శపించింది.

**అద్యప్రభృతి నారీషు యదా త్వం సంగతో భవేః ।**
**తదా మృతిస్తవేత్యుక్త్వా వివేశ జ్వలనం సతీ ॥ 24 ॥**

నేటినుండి ఏనాడైతే నీవు స్త్రీతో సంగమిస్తావో అప్పుడు నీకు మృత్యువు కలుగుతుందని పలికి ఆ పతివ్రత అగ్నిలో ప్రవేశించింది.

**సోఽపి రాజా గురోశ్శాపమనుభూయ కృతావధిమ్ ।**
**పునః స్వరూపమాస్థాయ స్వగృహం ముదితో యయౌ ॥ 25 ॥**

ఆ రాజు గురువుచే విధింపబడిన గడువు పూర్తియగువరకు శాపాన్ని అనుభవించి మరల తన రూపాన్ని పొంది ఆనందంతో తన యింటికి వెళ్లాడు.

**జ్ఞాత్వా విప్రసతీశాపం మదయంతీ రతిప్రియమ్ ।**
**పతిం నివారయామాస వైధవ్యాదతిబిభ్యతీ ॥ 26 ॥**

బ్రాహ్మణపత్ని యిచ్చిన శాపాన్ని గూర్చి మదయంతి తెలుసుకొని వైధవ్యానికి భయపడి రతిలో ఉత్కంఠగల భర్తను వారించింది.

**అనపత్యో వినిర్విణ్ణో రాజ్యభోగేషు పార్థివః ।**
**విసృజ్య సకలాం లక్ష్మీం వనమేవ జగామ హ ॥ 27 ॥**

సంతానం లేని ఆ మహారాజు రాజభోగాలయందు తీవ్రమైన వైరాగ్యం గలవాడై సంపదనంతటినీ విడిచి అడవికి వెళ్ళిపోయాడు.

**స్వపృష్ఠతః సమాయాంతీం బ్రహ్మహత్యాం సుదుఃఖదామ్ ।**
**దదర్శ వికటాకారాం తర్జయంతీం ముహుర్ముహుః ॥ 28 ॥**

ఆ రాజు తనవెంటనే పలుమార్లు భయపెడుతూ మహాదుఃఖాన్ని కలిగిస్తూ వస్తున్న భయంకరాకారం గల బ్రహ్మహత్యను చూశాడు.

**తస్యా నిర్భ్రమన్విచ్ఛన్ రాజా నిర్విణ్ణమానసః ।**
**చకార నానోపాయాన్ స జపవ్రతమఖాదికాన్ ॥ 29 ॥**

నిర్వేదంతో నిండిన మనస్సుగల రాజు బ్రహ్మహత్యనుండి విముక్తిని కోరి జపం, వ్రతం యజ్ఞం మొదలైన సత్కర్మలను చేయనారంభించాడు.

**నానోపాయైర్యదా రాజ్ఞస్తీర్థస్నానాదిభిర్ద్విజాః! ।**
**న నివృత్తా బ్రహ్మహత్యా మిథిలాం స యయౌ తదా ॥ 30 ॥**

ఓ బ్రాహ్మణులారా! తీర్థస్నానాదులనెడి అనేక ఉపాయాలచేత కూడ ఆ బ్రహ్మహత్య తొలగిపోలేదు. అప్పుడా రాజు మిథిలానగరానికి వెళ్లాడు.

**బాహ్యోద్యానగతస్తస్యాశ్చింతయా పరయార్దితః ।**
**దదర్శ మునిమాయాంతం గౌతమం పార్థివశ్చ సః ॥ 31 ॥**

ఆ మహారాజు మిక్కిలి చింతాక్రాంతుడై మిథిలానగరానికి బయటనున్న ఉద్యానవనానికి చేరి ఎదురుగా వస్తున్న గౌతమమహర్షిని చూశాడు.

**అభిసృత్య స రాజేంద్రో గౌతమం విమలాశయమ్ ।**
**తద్దర్శనాప్తకించిత్కః ప్రణనామ ముహుర్ముహుః ॥ 32 ॥**

గౌతమమునిని చూడగానే ఆ మహారాజుకు కొంత సుఖం కలిగింది. ఆ రాజు, పవిత్రాంతఃకరణుడైన గౌతముని సమీపించి పలుమార్లు ప్రణమిల్లాడు.

**అథ తత్పృష్టకుశలో దీర్ఘముష్ణం చ నిశ్వసన్ ।**
**తత్కృపాదృష్టిసంప్రాప్తసుఖః ప్రోవాచ తం నృపః ॥ 33 ॥**

ఆ మహర్షి దయాదృష్టిచే రాజును కుశల ప్రశ్నను వేయగా అతడు దీర్ఘమైన వేడి నిట్టూర్పు విడచి ఇలా అన్నాడు.

**రాజోవాచ –** రాజు పలికాడు.

**మునే! మాం బాధతే హ్యేషా బ్రహ్మహత్యా దురత్యయా ।**
**అలక్షితా పరైస్తాత! తర్జయంతీ పదే పదే ॥ 34 ॥**

ఓ మునీ! తండ్రీ! దాటరానిది, ఇతరులకు కానరానిది, అడుగడుగునా బెదిరించేది అయిన బ్రహ్మహత్యాదోషం నన్ను బాధిస్తోంది.

**యన్మయా శాపదగ్ధేన విప్రపుత్రశ్చ భక్షితః ।**
**తత్పాపస్య న శాంతిర్హి ప్రాయశ్చిత్తసహస్రకైః ॥ 35 ॥**

నేను శాపోపహతుడనై బ్రాహ్మణకుమారుని భక్షించాను. లెక్కలేనన్ని ప్రాయశ్చిత్తాలు చేసినప్పటికీ ఆ పాపముపశమించడం లేదు.

**నానోపాయాః కృతా మే హి తచ్ఛాంత్యై భ్రమతా మునే! ।**
**న నివృత్తా బ్రహ్మహత్యా మమ పాపాత్మనః కిము? ॥ 36 ॥**

ఓ మహర్షీ! నేను సర్వత్రా తిరిగి, అనేక రకాలైన సత్కర్మలనుష్ఠించాను. పాపాత్ముడనైన నాకు ఈ బ్రహ్మహత్య తొలగిపోదా యేమి?

**అద్య మే జన్మసాఫల్యం సంప్రాప్తమివ లక్షయే ।**
**యతస్త్వద్దర్శనాదేవ మమానందభరోఽభవత్ ॥ 37 ॥**

ఈనాడు మీ దర్శనంచే నా జన్మ సఫలమయ్యిందని నాకు తోస్తున్నది. నాకు గొప్ప ఆనందం కలుగుతున్నది.

**అద్య మే తవ పాదాబ్జశరణస్య కృతైనసః ।**
**శాంతిం కురు మహాభాగ! యేనాహం సుఖమాప్నుయామ్ ॥ 38 ॥**

పాపాత్ముడనైన నేను నీ పాదపద్మాలను శరణుజొచ్చాను. ఓ మహాత్మా! నేను సుఖం పొందేవిధంగా శాంతిని ప్రసాదించండి.

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**ఇతి రాజ్ఞా సమాదిష్టో గౌతమః కరుణార్ద్రధీః ।**
**సమాదిదేశ ఘోరాణామఘానాం సాధు నిష్కృతిమ్ ॥ 39 ॥**

ఈ విధంగా రాజు ప్రార్థించగా కరుణార్ద్రహృదయుడైన గౌతముడు భయంకరమైన పాపాలకు మంచి నిష్కృతిని ఉపదేశించాడు.

**గౌతమ ఉవాచ -** గౌతముడు పలికాడు.

**సాధు రాజేంద్ర! ధన్యోఽసి మహాఘేభ్యో భయం త్యజ ।**
**శివే శాస్తరి భక్తానాం క్వ భయం శరణైషిణామ్ ॥ 40 ॥**

ఓ రాజేంద్రా! నీవు ధన్యుడవు. మహాపాపాలవల్ల భయాన్ని విడిచిపెట్టుము. శాసకుడైన శివునియందు శరణాగతి చేసినచో భక్తులకు భయమెక్కడిది?

**శృణు రాజన్! మహాభాగ! క్షేత్రమన్యత్ప్రతిష్ఠితమ్ ।**
**మహాపాతకసంహారి గోకర్ణాఖ్యం శివాలయమ్ ॥ 41 ॥**

ఓ రాజా! మహాభాగా! వినుము. మహాపాపాలను పోగొట్టగలుగునది, శివునకు నివాసస్థానమైనది అయిన గోకర్ణమనే క్షేత్రం ప్రసిద్ధిగాంచింది.

**తత్ర స్థితిర్న పాపానాం మహద్భ్యో మహతామపి ।**
**మహాబలాభిధానేన శివః సన్నిహితః స్వయమ్ ॥ 42 ॥**

పెద్ద పెద్దవైన పాపాలు కూడా అక్కడ మనజాలవు. అచ్చట 'మహాబలుడు' అనే పేరుతో శివుడు స్వయంగా వెలిసియున్నాడు.

**సర్వేషాం శివలింగానాం సార్వభౌమో మహాబలః ।**
**చతుర్యుగే చతుర్వర్ణస్సర్వపాపాపహారకః ॥ 43 ॥**

నాలుగు యుగాలలో నాలుగు వర్ణాలవారి పాపాలనన్నింటిని పోగొట్టే మహాబలుడు శివలింగాలన్నింటికీ సార్వభౌముడులాంటివాడు.

**పశ్చిమాంబుధితీరస్థం గోకర్ణం తీర్థముత్తమమ్ ।**
**తత్రాస్తి శివలింగం తన్మహాపాతకనాశకమ్ ॥ 44 ॥**

గోకర్ణమనే ఉత్తమమైన పుణ్యక్షేత్రం పశ్చిమ సముద్రతీరంలో ఉన్నది. అక్కడి శివలింగం మహాపాతకాలను సైతం నాశనం చేస్తుంది.

**తత్ర గత్వా మహాపాపాః స్నాత్వా తీర్థేషు భూరిశః ।**
**మహాబలం చ సంపూజ్య ప్రయాతాశ్శాంకరం పదమ్ ॥ 45 ॥**

మహాపాపాత్ములయిన వారనేకులు అచ్చటకు వెళ్ళి తీర్థాలలో స్నానం చేసి మహాబలేశ్వరుని అనుగ్రహంతో శంకరధామం చేరుకున్నారు.

**తథా త్వమపి రాజేంద్ర! గోకర్ణం గిరిశాలయమ్ ।**
**గత్వా సంపూజ్య తల్లింగం కృతకృత్యత్వమాప్నుయాః ॥ 46 ॥**

ఓ రాజేంద్రా! అదేవిధంగా నీవుకూడ గోకర్ణంలోని శివాలయానికి వెళ్ళి ఆ లింగాన్ని శ్రద్ధగా పూజించి కృతకృత్యుడవు కమ్ము.

**తత్ర సర్వేషు తీర్థేషు స్నాత్వాఽభ్యర్చ్య మహాబలమ్ ।**
**సర్వపాపవినిర్ముక్తః శివలోకం త్వమాప్నుయాః ॥ 47 ॥**

అచ్చట గల అన్ని తీర్థాలలో నీవు స్నానం చేసి మహాబలేశ్వరునారాధించి పాపముల నుండి విముక్తుడవై శివలోకాన్ని పొందుము.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యాదిష్టః స మునినా గౌతమేన మహాత్మనా ।**
**మహాహృష్టమనా రాజా గోకర్ణం ప్రత్యపద్యత ॥ 48 ॥**

మహాత్ముడైన గౌతమముని ఆదేశానుసారంగా ఆ రాజు మహానందంతో గోకర్ణం చేరాడు.

**తత్ర తీర్థేషు సుస్నాత్వా సమభ్యర్చ్య మహాబలమ్ ।**
**నిర్ధూతాశేషపాపౌఘోఽలభచ్ఛంభోః పరం పదమ్ ॥ 49 ॥**

అక్కడాతడు తీర్థాలన్నింటిలో చక్కగా స్నానం చేసి మహాబలేశ్వరునర్చించి పాపసమూహములనుండి విముక్తుడై శంభుని పరమపదాన్ని పొందాడు.

**య ఇమాం శృణుయాన్నిత్యం మహాబలకథాం ప్రియామ్ ।**
**త్రిసప్తకులజైస్సార్ధం శివలోకే వ్రజత్యసౌ ॥ 50 ॥**

ప్రీతికరమైన ఈ మహాబలేశ్వరకథను ప్రతినిత్యం విన్నవాడు తన వంశంలోని ఇరవైఒక్క తరాల వారితో బాటు శివలోకాన్ని పొందుతాడు.

**ఇతి వశ్చ సమాఖ్యాతం మాహాత్మ్యం పరమాద్భుతమ్ ।**
**మహాబలస్య గిరిశలింగస్య నిఖిలాఘహృత్ ॥ 51 ॥**

సర్వపాపాలను పోగొట్టే మహాబలేశ్వరశివలింగంయొక్క అత్యద్భుత మాహాత్మ్యాన్ని మీకీ విధంగా తెలియచేశాను.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం మహాబాహ్వాహ్వాశివలింగమాహాత్మ్య వర్ణనం నామ దశమోఽధ్యాయః ॥ 10 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు మహాబాహ్వాశివలింగమాహాత్మ్యవర్ణనం అనే పేరుగల పదవ అధ్యాయం సమాప్తం.

## ఏకాదశోఽధ్యాయః - పదకొండవ అధ్యాయం

## చంద్రభాల, పశుపతినాథలింగమాహాత్మ్యవర్ణనమ్ - చంద్రభాల, పశుపతినాథలింగమాహాత్మ్యవర్ణనం

**ఋషయ ఊచుః -** ఋషులు పలికారు.

**సూత! సూత! మహాభాగ! ధన్యస్త్వం శివసక్తధీః ।**
**మహాబలస్య లింగస్య శ్రావితేయం కథాఽద్భుతా ॥ 1 ॥**

ఓ సూతా! మహాత్మా! శివునియందు లగ్నమైన బుద్ధిగల నీవు ధన్యుడవు. మహాబలేశ్వరలింగంయొక్క అద్భుతగాథను వినిపించావు.

**ఉత్తరస్యాం దిశాయాం చ శివలింగాని యాని చ ।**
**తేషాం మాహాత్మ్యమనఘ! వద త్వం పాపనాశకమ్ ॥ 2 ॥**

ఓ పవిత్రుడా! పాపనాశకములు అయిన ఉత్తరదిక్కునందు గల శివలింగాల మాహాత్మ్యాన్ని చెప్పుము.

**సూత ఉవాచ -** సూతుడు చెప్పసాగాడు.

**శృణుతాదరతో విప్రాః! ఔత్తరాణాం విశేషతః ।**
**మాహాత్మ్యం శివలింగానాం ప్రవదామి సమాసతః ॥ 3 ॥**

ఓ బ్రాహ్మణులారా! ఉత్తర దిక్కునందలి శివలింగాల మాహాత్మ్యాన్ని సంగ్రహంగా చెబుతాను. సాదరంగా వినండి.

**గోకర్ణం క్షేత్రమపరం మహాపాతకనాశనమ్ ।**
**మహావనం చ తత్రాస్తి పవిత్రమతివిస్తరమ్ ॥ 4 ॥**

గోకర్ణక్షేత్రంలో మరియొక శివలింగం కలదు. అది మహాపాపాలను పోగొడుతుంది. అచ్చట పవిత్రము, అధికవిస్తారము అయిన ఒక వనం గలదు.

**తత్రాస్తి చంద్రభాలాఖ్యం శివలింగమనుత్తమమ్ ।**
**రావణేన సమానీతం సద్భక్త్యా సర్వసిద్ధిదమ్ ॥ 5 ॥**

ఆ వనంలో 'చంద్రభాలేశ్వరుడు' అనే సర్వశ్రేష్ఠమైన శివలింగం కలదు. సర్వసిద్ధులనిచ్చే ఆ లింగాన్ని రావణుడు సద్భక్తితో తీసుకొనివచ్చాడు.

**తస్య తత్ర స్థితిర్వైద్యనాథస్యేవ మునీశ్వరాః! ।**
**సర్వలోకహితార్థాయ కరుణాసాగరస్య చ ॥ 6 ॥**

ఓ మహర్షులారా! వైద్యనాథునివలె ఆయన కూడ అచ్చటవుండి సర్వలోకహితాన్ని కలిగిస్తున్నాడు. ఆయన కరుణాసాగరుడు కూడా.

**స్నానం కృత్వా తు గోకర్ణే చంద్రభాలం సమర్చ్య చ ।**
**శివలోకమవాప్నోతి సత్యం సత్యం న సంశయః ॥ 7 ॥**

గోకర్ణంలో స్నానం చేసి చంద్రభాలేశ్వరుని భక్తితో అర్చించువాడు నిస్సంశయంగా శివలోకాన్ని పొందుతాడు. ఇది సత్యము, సత్యము.

**చంద్రభాలస్య లింగస్య మహిమా పరమాద్భుతః ।**
**న శక్యో వర్ణితుం వ్యాసాద్భక్తస్నేహితరస్య హి ॥ 8 ॥**

భక్తులయందు పరమవాత్సల్యం గల చంద్రభాలేశ్వరుని పరమాద్భుతమహిమను సంగ్రహంగా వర్ణించడం అసంభవం.

**చంద్రభాలమహాదేవలింగస్య మహిమా మహాన్ ।**
**యథాకథంచిత్సంప్రోక్తః పరలింగస్య వై శృణు ॥ 9 ॥**

చంద్రభాలమహాదేవలింగంయొక్క మహిమ గొప్పది. మరియొక శివలింగం మహిమ వినుము.

**దధీచం శివలింగం తు మిశ్రర్షివరతీర్థకే ।**
**దధీచినా మునీశేన సుప్రీత్యా చ ప్రతిష్ఠితమ్ ॥ 10 ॥**

మిశ్రమహర్షికి చెందిన పవిత్రతీర్థక్షేత్రంలో దధీచిమహర్షి పరమ ప్రీతితో స్థాపించినది 'దధీచీశ్వరలింగం'.

**తత్ర గత్వా చ తత్తీర్థే స్నాత్వా సమ్యగ్విధానతః ।**
**శివలింగం సమర్చేద్వై దధీచేశ్వరమాదరాత్ ॥ 11 ॥**

అక్కడకు వెళ్లిన వారు, ఆ తీర్థంలో యథావిధిగా స్నానం చేసి, దధీచేశ్వరశివలింగాన్ని భక్తిశ్రద్ధలతో అర్చించాలి.

**దాధీచమూర్తిస్తత్రైవ సమర్చ్యా విధిపూర్వకమ్ ।**
**శివప్రీత్యర్థమేవాశు తీర్థయాత్రాఫలార్థిభిః ॥ 12 ॥**

తీర్థయాత్రయొక్క సంపూర్ణఫలాన్ని పొందకోరే మానవుడు అచ్చటి దాధీచమూర్తిని శివప్రీత్యర్థం యథావిధిగా అర్చించాలి.

**ఏవం కృతే మునిశ్రేష్ఠాః! కృతకృత్యో భవేన్నరః ।**
**ఇహ సర్వసుఖం భుక్త్వా పరత్ర గతిమాప్నుయాత్ ॥ 13 ॥**

ఓ మునిశ్రేష్ఠులారా! ఈ విధంగా చేసిన మానవుడు భూలోకంలో సర్వసుఖాలననుభవించి పరమగతిని పొంది కృతకృత్యుడౌతాడు.

**నైమిషారణ్యతీర్థే తు నిఖిలర్షిప్రతిష్ఠితమ్ ।**
**ఋషీశ్వరమితి ఖ్యాతం శివలింగం సుఖప్రదమ్ ॥ 14 ॥**

నైమిషారణ్యక్షేత్రంలో మహర్షులందరు కలసి ప్రతిష్ఠించిన 'ఋషీశ్వరుడు' అనే శివలింగం సుఖప్రదమని విఖ్యాతి చెందింది.

**తద్దర్శనాత్పూజనాచ్చ జనానాం పాపినామపి ।**
**భుక్తిముక్తిశ్చ తేషాం తు పరత్రేహ మునీశ్వరాః! ॥ 15 ॥**

ఓ మునీశ్వరులారా! దానిని దర్శించి పూజించు జనులు సహజంగా పాపాత్ములైనా ఇహలోకంలో భుక్తిని, పరలోకంలో ముక్తిని పొందుతారు.

**హత్యాహరణతీర్థే తు శివలింగమఘాపహమ్ ।**
**పూజనీయం విశేషేణ హత్యాకోటివినాశనమ్ ॥ 16 ॥**

ఓ మహర్షులారా! హత్యాహరణతీర్థంలోని శివలింగం పాపాలను పోగొట్టి విశేషంగా పూజించువారి కోటిహత్యల పాపాన్ని పోగొడుతుంది.

**దేవప్రయాగతీర్థే తు లలితేశ్వరనామకమ్ ।**
**శివలింగం సదా పూజ్యం నరైస్సర్వాఘనాశనమ్ ॥ 17 ॥**

దేవప్రయాగతీర్థంలో 'లలితేశ్వరుడు' అనే పేరుతో ప్రఖ్యాతిగాంచిన శివలింగం సర్వదా పూజనీయమైనది. దానిని పూజించే మానవుల పాపాలన్నీ నశిస్తాయి.

**నయపాలాఖ్యపుర్యాం తు ప్రసిద్ధాయాం మహీతలే ।**
**లింగం పశుపతీశాఖ్యం సర్వకామఫలప్రదమ్ ॥ 18 ॥**

భూలోకంలో ప్రసిద్ధిగాంచిన 'నయపాల' నగరంలో సకల కోరికలను, ఫలాలను ప్రసాదించేది 'పశు పతీశ్వరలింగం'.

**శిరోభాగస్వరూపేణ శివలింగం తదస్తి హి ।**
**తత్కథాం కథయిష్యామి కేదారేశ్వరవర్ణనే ॥ 19 ॥**

ఈ శివలింగం 'తల' అనే అవయవాన్ని పోలివుంటుంది. కేదారేశ్వరుని గురించి చెప్పేటప్పుడు ఈ గాథను గురించి చెబుతాను.

**తదారాన్ముక్తినాథాఖ్యం శివలింగం మహాద్భుతమ్ ।**
**దర్శనాదర్చనాత్తస్య భుక్తిర్ముక్తిశ్చ లభ్యతే ॥ 20 ॥**

దానికి సమీపంలో మహాశ్చర్యకరమైన 'ముక్తినాథేశ్వరలింగం' గలదు. దానిని దర్శించి పూజించే వారికి భుక్తి, ముక్తి లభిస్తుంది.

**ఇతి వశ్చ సమాఖ్యాతం లింగవర్ణనముత్తమమ్ ।**
**చతుర్దిక్షు మునిశ్రేష్ఠాః! కిమన్యచ్ఛ్రోతుమిచ్ఛథ ॥ 21 ॥**

ఓ మహర్షులారా! మీకీ విధంగా నాలుగు దిక్కులలో గల శ్రేష్ఠమైన శివలింగాల వృత్తాంతాన్ని చెప్పాను. మీరింకనూ ఏమి వినగోరుచున్నారు?

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం చంద్రభాల, పశుపతినాథలింగమాహాత్మ్యవర్ణనం నామైకాదశోఽధ్యాయః ॥ 11 ॥**

శ్రీశివమహాపురాణంలో నాలుగవదైన కోటిరుద్రసంహితయందు చంద్రభాల, పశుపతినాథలింగ మాహాత్మ్యవర్ణనం అనే పేరుగల పదకొండవ అధ్యాయం సమాప్తం.

## ద్వాదశోఽధ్యాయః - పన్నెండవ అధ్యాయం

## లింగస్వరూపకారణవర్ణనమ్ - లింగస్వరూపకారణవర్ణనం

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**సూత! జానాసి సకలం వస్తు వ్యాసప్రసాదతః ।**
**తవాజ్ఞాతం న విద్యేత తస్మాత్పృచ్ఛామహే వయమ్ ॥ 1 ॥**

ఓ సూతమహర్షీ! నీవు వ్యాసుని అనుగ్రహంవలన సమస్తజ్ఞానాన్ని కలిగియున్నావు. నీకు తెలియనిదుండదు. కాబట్టి మేము నిన్ను అడుగుతున్నాము.

**లింగం చ పూజ్యతే లోకే తత్త్వయా కథితం చ యత్ ।**
**తత్తథైవ న చాన్యద్వా కారణం విద్యతే త్విహ ॥ 2 ॥**

లోకంలో లింగం పూజింపబడుతోంది. దానిని గురించి నీవు చెప్పియున్నావు. అది ఆ విధంగా పూజింపబడడానికి ఇతర కారణమేమైనా కలదా?

**బాణరూపా శ్రుతా లోకే పార్వతీ శివవల్లభా ।**
**ఏతత్కిం కారణం సూత! కథయ త్వం యథాశ్రుతమ్ ॥ 3 ॥**

శివుని ప్రియురాలైన పార్వతి లోకంలో బాణరూపంలో ప్రసిద్ధి గాంచింది. దీనికి కారణమేమిటి? నీవు వినిన విధంగా మాకు తెలియజేయగలవు.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**కల్పభేదకథా చైవ శ్రుతా వ్యాసాన్మయా ద్విజాః! ।**
**తామేవ కథయామ్యద్య శ్రూయతామృషిసత్తమాః! ॥ 4 ॥**

ఓ బ్రాహ్మణులారా! మరియొక కల్పానికి చెందిన కథను నేను వ్యాసుని వల్ల విన్నాను. ఇపుడు దానిని చెబుతాను. వినండి.

**పురా దారువనే జాతం యద్వృత్తం తు ద్విజన్మనామ్ ।**
**తదేవ శ్రూయతాం సమ్యక్ కథయామి యథాశ్రుతమ్ ॥ 5 ॥**

పూర్వం దారుకావనంలో బ్రాహ్మణుల సన్నిధిలో జరిగిన వృత్తాంతాన్ని విన్నది విన్నట్లు చెబుతాను. వినండి.

**దారునామ వనం శ్రేష్ఠం తత్రాసన్నృషిసత్తమాః ।**
**శివభక్తాస్సదా నిత్యం శివధ్యానపరాయణాః ॥ 6 ॥**

దారుకావనం చాలా గొప్పది. సదా శివభక్తులూ, నిత్యమూ శివధ్యానంలో నిమగ్నమైన మహర్షులూ అచ్చట నివసించేవారు.

**త్రికాలం శివపూజాం చ కుర్వంతి స్మ నిరంతరమ్ ।**
**నానావిధైః స్తవైర్దివ్యైస్తుష్టువుస్తే మునీశ్వరాః ॥ 7 ॥**

నిరంతరం మూడు కాలాల్లోను శివుని పూజించే ఆ మహర్షులు అనేక దివ్యస్తోత్రాలతో అతనిని స్తుతించేవారు.

**తే కదాచిద్వనే యాతాస్సమిదాహరణాయ చ ।**
**సర్వే ద్విజర్షభాశ్శైవాశ్శివధ్యానపరాయణాః ॥ 8 ॥**

శివభక్తులు, శివధ్యానతత్పరులు అయిన ఆ బ్రాహ్మణశ్రేష్ఠులందరూ ఒకనాడు సమిధలు తేవడానికి అడవికి వెళ్లారు.

**ఏతస్మిన్నంతరే సాక్షాచ్ఛంకరో నీలలోహితః ।**
**విరూపం చ సమాస్థాయ పరీక్షార్థం సమాగతః ॥ 9 ॥**

ఇంతలో కంఠమునందు నీలవర్ణం, ఇతరత్ర ఎర్రని వర్ణంగల శంకరుడు వారిని పరీక్షించడానికి  స్వయంగా వికటరూపం ధరించి అక్కడికి వచ్చాడు.

**దిగంబరోఽతితేజస్వీ భూతిభూషణభూషితః ।**
**స చేష్టామకరోద్దుష్టాం హస్తే లింగం విధారయన్ ॥ 10 ॥**

దిగంబరుడు, మహాతేజశ్శాలి, భూతిభూషణభూషితుడు అయిన శివుడు చేతిలో లింగమును ధరించి అక్కడ వికృతమైన చేష్టలు చేయసాగాడు.

**మనసా చ ప్రియం తేషాం కర్తుం వై వనవాసినామ్ ।**
**జగామ తద్వనం ప్రీత్యా భక్తప్రీతో హరః స్వయమ్ ॥ 11 ॥**

భక్తప్రియుడైన శివుడు వనంలోని మహర్షులకందరికి ప్రియం చేయగోరి స్వయంగా ప్రేమతో ఆ వనానికి వచ్చాడు.

**తం దృష్ట్వా ఋషిపత్న్యస్తాః పరం త్రాసముపాగతాః ।**
**విహ్వలా విస్మితాశ్చాన్యాస్సమాజగ్ముస్తథా పునః ॥ 12 ॥**

ఆయనను చూచిన ఋషిపత్నులు కంగారుపడి భయాన్ని విస్మయాన్ని మోహాన్ని అధికంగా పొందారు.

**ఆలిలింగుస్తథా చాన్యాః కరం ధృత్వా తథా పరాః ।**
**పరస్పరం తు సంఘర్షాత్సంమగ్నాస్తాః స్త్రియస్తదా ॥ 13 ॥**

వారు కామమోహితులై ఆ దిగంబరమూర్తిని చుట్టుముట్టి అతని కరచరణాదులు తాకుతూ పరస్పరం కౌగిలించుకున్నారు. అప్పుడు కంగారులో వారి మధ్య త్రొక్కిసలాట జరిగింది.

**ఏతస్మిన్నేవ సమయే ఋషివర్యాః సమాగమన్ ।**
**విరుద్ధం తం చ తే దృష్ట్వా దుఃఖితాః క్రోధమూర్ఛితాః ॥ 14 ॥**

అదే సమయంలో మహర్షులు తిరిగివచ్చి ఈ విద్దూరం చూచి అతిశయించిన దుఃఖాన్ని, క్రోధాన్ని పొందారు.

**తదా దుఃఖమనుప్రాప్తాః కోఽయం కోఽయం తథాఽబ్రువన్ ।**
**సమస్తా ఋషయస్తే వై శివమాయావిమోహితాః ॥ 15 ॥**

'ఎవడితడు? ఎవడితడు?' అంటూ శివమాయావిమోహితులైన ఋషులందరూ దుఃఖాన్ని పొందారు.

**యదా చ నోక్తవాన్ కించిత్సోఽవధూతో దిగంబరః ।**
**ఊచుస్తం పురుషం భీమం తదా తే పరమర్షయః ॥ 16 ॥**

దిగంబరుడైన ఆ అవధూత సమాధానమీయలేదు. అంతట భయంకరాకారుడైన ఆ పురుషునితో మహర్షులిలా పలికారు.

**త్వయా విరుద్ధం క్రియతే వేదమార్గవిలోపి యత్ ।**
**తతస్త్వదీయం తల్లింగం పతతాం పృథివీతలే ॥ 17 ॥**

నీవు వేదమార్గానికి హానిని కలిగించి, తద్విరుద్ధంగా ప్రవర్తిస్తున్నావు. కావున నీ లింగం నేలపై పడుగాక!

**సూత ఉవాచ –** సూతుడు చెప్పాడు.

**ఇత్యుక్తే తు తదా తైశ్చ లింగం చ పతితం క్షణాత్ ।**
**అవధూతస్య తస్యాశు శివస్యాద్భుతరూపిణః ॥ 18 ॥**

వారలా పలుకగానే అద్భుతమైన అవధూతరూపంలో నున్న శివుని లింగం వెంటనే నేలపై క్రిందపడింది.

**తల్లింగం చాగ్నివత్సర్వం యద్దదాహ పురా స్థితమ్ ।**
**యత్ర యత్ర చ తద్యాతి తత్ర తత్ర దహేత్పునః ॥ 19 ॥**

ఆ లింగం అగ్నివలె ఎదుటనున్న సర్వాన్ని దహించడమే గాక అది ఎక్కడెక్కడకు వెళ్తుందో ఆయాప్రదేశాన్నంతటినీ దహించడం ఆరంభించింది.

**పాతాళే చ గతం తచ్చ స్వర్గే చాపి తథైవ చ ।**
**భూమౌ సర్వత్ర తద్యాతం న కుత్రాపి స్థిరం హి తత్ ॥ 20 ॥**

అది ఒకచోట స్థిరంగా ఉండకుండా, భూ, పాతాళ, స్వర్గలోకాలన్నింటిలోకి ప్రవేశించింది.

**లోకాశ్చ వ్యాకులా జాతా ఋషయస్తేఽతిదుఃఖితాః ।**
**న శర్మ లేభిరే కేచిద్దేవాశ్చ ఋషయస్తథా ॥ 21 ॥**

జనులు కంగారు పడ్డారు. ఆ ఋషులు అతిశయించిన దుఃఖం పొందారు. దేవతలకు గాని, ఋషులకు గాని ఎవ్వరికినీ సుఖం కలగడం లేదు.

**న జ్ఞాతస్తు శివో యైస్తు తే సర్వే చ సురర్షయః ।**
**దుఃఖితా మిళితాశ్శీఘ్రం బ్రహ్మాణం శరణం యయుః ॥ 22 ॥**

శివతత్త్వాన్ని ఎరుగని, ఆ దేవతలు, ఋషులూ అందరూ దుఃఖితులై ఒకచోట గూడి వెంటనే బ్రహ్మను శరణువేడారు.

**తత్ర గత్వా చ తే సర్వే నత్వా స్తుత్వా విధిం ద్విజాః ।**
**తత్సర్వమవదన్వృత్తం బ్రహ్మణే సృష్టికారిణే ॥ 23 ॥**

ఓ బ్రాహ్మణులారా! వారందరూ బ్రహ్మలోకానికి వెళ్లి సృష్టికర్తయైన బ్రహ్మకు నమస్కరించి స్తుతించి ఆ వృత్తాంతాన్నంతటినీ చెప్పారు.

**బ్రహ్మా తద్వచనం శ్రుత్వా శివమాయావిమోహితాన్ ।**
**జ్ఞాత్వా తాంచ్ఛంకరం నత్వా ప్రోవాచ ఋషిసత్తమాన్ ॥ 24 ॥**

బ్రహ్మ, వారి మాటలు విని ఆ మహర్షులు శివమాయావిమోహితులై యున్నారని గ్రహించి శంకరునికి నమస్కరించి వారితో ఇట్లన్నాడు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**జ్ఞాతారశ్చ భవంతో వై కుర్వతే గర్హితం ద్విజాః! ।**
**అజ్ఞాతారో యదా కుర్యుః కిం పునః కథ్యతే పునః ॥ 25 ॥**

ఓ బ్రాహ్మణులారా! జ్ఞానులగు మీరు కూడ అజ్ఞానులు చేసిన విధంగా నిందనీయమైన పనిచేశారు. ఇంకేమి చెప్పగలము?

**విరుద్ధ్యైవం శివం దేవం కుశలం కస్సమీహతే ।**
**మధ్యాహ్నసమయే యో వై నాతిథిం చ పరామృశేత్ ॥ 26 ॥**

**తస్యైవ సుకృతం నీత్వా స్వీయం చ దుష్కృతం పునః ।**
**సంస్థాప్య చాతిథిర్యాతి కిం పునః శివమేవ వా ॥ 27 ॥**

దైవమైన శివునితో ఈ విధంగా ప్రవర్తించే మానవుడు క్షేమాన్ని ఎలా పొందగలడు? మధ్యాహ్న సమయంలో విచ్చేసిన అతిథిని ఎవడైతే సత్కరించడో వాని పుణ్యాన్ని ఆ అతిథి తీసుకొని తన పాపాన్ని అప్పగించి తన దారిన వెళ్తాడు. ఇక శివుని విషయంలో చెప్పేదేముంది?

**యావల్లింగం స్థిరం నైవ జగతాం త్రితయే శుభమ్ ।**
**జాయతే న తదా క్వాపి సత్యమేతద్వదామ్యహమ్ ॥ 28 ॥**

ఆ లింగం స్థిరమయ్యేవరకు ముల్లోకాలలో ఎక్కడా శుభం కలుగబోదు. నేను సత్యాన్ని పలుకుతున్నాను.

**భవద్భిశ్చ తథా కార్యం యథా స్వాస్థ్యం భవేదిహ ।**
**శివలింగస్య ఋషయో మనసా సంవిచార్యతామ్ ॥ 29 ॥**

ఓ ఋషులారా! శివలింగం స్థిరంగా ఉండేటట్లు మీరే చేయాలి. మీరు బుద్ధితో ఆలోచించండి.

**సూత ఉవాచ** – సూతుడు చెప్పాడు.

**ఇత్యుక్తాస్తే ప్రణమ్యోచుర్బ్రహ్మాణమృషయశ్చ వై ।**
**కిమస్మాభిర్విధే కార్యం తత్కార్యం త్వం సమాదిశ ॥ 30 ॥**

ఆయన ఈ విధంగా చెప్పగా మునులు బ్రహ్మకు ప్రణమిల్లి – ఓ విధీ! ఇప్పుడు మా కర్తవ్యమేమిటో చెప్పండి? అని పలికారు.

**ఇత్యుక్తశ్చ మునీశైస్తైస్సర్వలోకపితామహః ।**
**మునీశాంస్తాంస్తదా బ్రహ్మా స్వయం ప్రోవాచ వై తదా ॥ 31 ॥**

ఆ మహర్షులు అలా పలుకగా లోకాలన్నింటికీ పితామహుడైన బ్రహ్మ మహర్షులతో స్వయంగా ఇట్లన్నాడు

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ పలికాడు.

**ఆరాధ్య గిరిజాం దేవీం ప్రార్థయంతు సురాశ్శివమ్ ।**
**యోనిరూపా భవేచ్చేద్వై తదా తత్ స్థిరతాం వ్రజేత్ ॥ 32 ॥**

దేవతలు పార్వతీదేవిని ఆరాధించి శివుని ప్రార్థించాలి. ఆమె యోనిరూపమైనట్లయితే అప్పుడా లింగం స్థిరమౌతుంది.

**తద్విధిం ప్రవదామ్యద్య సర్వే శృణుత సత్తమాః! ।**
**తామేవ కురుత ప్రేమ్ణా ప్రసన్నా సా భవిష్యతి ॥ 33 ॥**

తపస్సంపన్నులారా! అందరూ శ్రద్ధగా వినండి. నేను చెప్పిన విధంగా ప్రేమతో శ్రద్ధతో ఆమె నారాధించండి. ఆమె ప్రసన్నురాలవుతుంది!

**కుంభమేకం చ సంస్థాప్య కృత్వాఽష్టదళముత్తమమ్ ।**
**దూర్వాయవాంకురై స్తీర్థోదకమాపూరయేత్తతః ॥ 34 ॥**

అష్టదళపద్మాన్ని రంగవల్లిగా తీర్చి దానిపై ఉత్తమమైన కలశాన్ని స్థాపించి దానిని దూర్వలతోను, యవధాన్యపు మొక్కల చిగుళ్ళతోను అలంకరించి దానియందు తీర్థజలాన్ని నిండుగా పోయాలి.

**వేదమంత్రైస్తతస్తం వై కుంభం చైవాభిమంత్రయేత్ ।**
**శ్రుత్యుక్తవిధినా తస్య పూజాం కృత్వా శివం స్మరన్ ॥ 35 ॥**

అనంతరం ఆ కలశాన్ని వేదమంత్రాలతో అభిమంత్రించి శివుని స్మరిస్తూ వేదోక్తవిధానంతో పూజచేయాలి.

**తల్లింగం తజ్జలేనాభిషేచయేత్పరమర్షయః ।**
**శతరుద్రియమంత్రైస్తు ప్రోక్షితం శాంతిమాప్నుయాత్ ॥ 36 ॥**

మహర్షులు పూజించిన ఆ జలంతో ఆ లింగాన్ని శతరుద్రీయమంత్రాలను పఠిస్తూ అభిషేకిస్తే శివలింగం శాంతిస్తుంది.

**గిరిజాం యోనిరూపాం చ బాణం స్థాప్య శుభం పునః ।**
**తత్ర లింగం చ తత్ స్థాప్యం పునశ్చైవాభిమంత్రయేత్ ॥ 37 ॥**

పార్వతిని, మరియు బాణాన్ని (నర్మదా నదిలోని శిల) స్థాపించాలి. బాణం శుభకరమైనది. దానియందు లింగాన్ని ఉంచి మరల అభిమంత్రించాలి.

**సుగంధైశ్చందనైశ్చైవ పుష్పధూపాదిభిస్తథా ।**
**నైవేద్యాదికపూజాభిస్తోషయేత్పరమేశ్వరమ్ ॥ 38 ॥**

అనంతరం చందనగంధాదులు, పుష్పాలు, ధూపం, నైవేద్యం మున్నగువాటిని సమర్పించి పరమేశ్వరుని పూజించి సంతోషపెట్టాలి.

**ప్రణిపాతైః స్తవైః పుణ్యైర్వాద్యైర్గానైస్తథా పునః ।**
**తతః స్వస్త్యయనం కృత్వా జయేతి వ్యాహరేత్తథా ॥ 39 ॥**

అనంతరం నమస్కారాలు, పవిత్రస్తోత్రాలు, వాద్యగానాదులను సమర్పించి, స్వస్తిమంత్రాలను పఠించి, జయధ్వానాలు చేయాలి.

**ప్రసన్నో భవ దేవేశ! జగదాహ్లాదకారక! ।**
**కర్తా పాలయితా త్వం చ సంహర్తా త్వం నిరక్షరః ॥ 40 ॥**

ఓ దేవదేవా! ప్రసన్నుడవు కమ్ము, జగదాహ్లాదకారకా! జగత్తుయొక్క సృష్టిస్థితి లయకారకుడవు నీవే. నీకు వినాశం లేదు.

**జగదాదిర్జగద్యోనిర్జగదంతర్గతోఽపి చ ।**
**శాంతో భవ మహేశాన! సర్వాంల్లోకాంశ్చ పాలయ ॥ 41 ॥**

మహేశ్వరా! జగత్కారణం నీవే. సృష్టికి ఆదిలో నీవే ఉన్నావు. జగత్తు లోపల కూడ నీవే ఉన్నావు. నీవు శాంతుడవై లోకాలను పాలించు.

**ఏవం కృతే విధౌ స్వాస్థ్యం భవిష్యతి న సంశయః ।**
**వికారో న త్రిలోకేఽస్మిన్భవిష్యతి సుఖం సదా ॥ 42 ॥**

ఈ విధంగా ప్రార్థిస్తే స్వస్థత కలుగుతుంది. సందేహం లేదు. అప్పుడు ముల్లోకాలలోను వికారాలుండవు. నిత్యసుఖం కలుగుతుంది.

**సూత ఉవాచ –** సూతుడు చెప్పాడు.

**ఇత్యుక్తాస్తే ద్విజా దేవాః ప్రణిపత్య పితామహమ్ ।**
**శివం తం శరణం ప్రాప్తాస్సర్వలోకసుఖేప్సయా ॥ 43 ॥**

ఆయనిట్లా పలుకగా ద్విజులు, దేవతలు పితామహునకు ప్రణమిల్లి లోకాలన్నింటికి సుఖాన్ని కలిగించే కోరికతో శివుని శరణు పొందారు.

**పూజితః పరయా భక్త్యా ప్రార్థితః శంకరస్తదా ।**
**సుప్రసన్నస్తతో భూత్వా తానువాచ మహేశ్వరః ॥ 44 ॥**

అప్పుడు వారు పరమభక్తితో శంకరుని పూజించి ప్రార్థించగా మహేశ్వరుడు దానివల్ల మిక్కిలి ప్రసన్నుడై వారితో ఇలా పలికాడు

**మహేశ్వర ఉవాచ –** మహేశ్వరుడు పలికాడు.

**హే దేవా! ఋషయః! సర్వే మద్వచః శృణుతాదరాత్ ।**
**యోనిరూపేణ మల్లింగం ధ్రుతం చేత్స్యాత్తదా సుఖమ్ ॥ 45 ॥**

ఓ దేవతలారా! ఋషులారా! మీరందరు నా మాటను ఆదరంతో వినండి. యోనిరూపంలో నాలింగాన్ని ధరిస్తే సుఖం లభిస్తుంది.

**పార్వతీం చ వినా నాన్యా లింగం ధారయితుం క్షమా ।**
**తయా ధృతం చ మల్లింగం ధ్రుతం శాంతిం గమిష్యతి ॥ 46 ॥**

పార్వతి తప్ప మరియొకరు లింగాన్ని ధరించడానికి సమర్థులు కారు. ఆమె ధరించిన వెంటనే లింగం శాంతించగలదు.

**సూత ఉవాచ –** సూతుడు చెప్పాడు.

**తచ్ఛ్రుత్వా ఋషిభిర్దేవైస్సుప్రసన్నైర్మునీశ్వరాః ।**
**గృహీత్వా చైవ బ్రహ్మాణం గిరిజా ప్రార్థితా తదా ॥ 47 ॥**

ఓ మహర్షులారా! మహేశ్వరుని పలుకులను విని ఋషులు, దేవతలు మిక్కిలి ప్రసన్నులై బ్రహ్మను తోడ్కొని వెళ్లి పార్వతిని ప్రార్థించారు.

**ప్రసన్నాం గిరిజాం కృత్వా వృషభధ్వజమేవ చ ।**
**పూర్వోక్తం చ విధిం కృత్వా స్థాపితం లింగముత్తమమ్ ॥ 48 ॥**

వారు పార్వతిని, వృషభధ్వజుని ప్రసన్నులుగా చేసికొని పూర్వోక్తవిధానంలో ఉత్తమమైన లింగాన్ని స్థాపించారు.

**మంత్రోక్తేన విధానేన దేవాశ్చ ఋషయస్తథా ।**
**చక్రుః ప్రసన్నాం గిరిజాం శివం చ ధర్మహేతవే ॥ 49 ॥**

దేవతలు, ఋషులు ధర్మంకొఱకు మంత్రోక్తవిధానంచే పార్వతీపరమేశ్వరులను ప్రసన్నులను చేసుకున్నారు.

**సమానర్చుర్విశేషేణ సర్వే దేవర్షయః శివమ్ ।**
**బ్రహ్మా విష్ణుః పరే చైవ త్రైలోక్యం సచరాచరమ్ ॥ 50 ॥**

దేవతలు, ఋషులు, బ్రహ్మ, విష్ణువు, తదితరులందరు ముల్లోకాలలోని చరాచర ప్రాణులు శివుని విశేషంగా పూజించారు.

**సుప్రసన్నః శివో జాతః శివా చ జగదంబికా ।**
**ధృతం తయా చ తల్లింగం తేన రూపేణ వై తదా ॥ 51 ॥**

శివుడు, జగన్మాతయైన పార్వతియు మిక్కిలి ప్రసన్నులయ్యారు. అప్పుడామె ఆ రూపంలో ఆ లింగాన్ని ధరించింది.

**లోకానాం స్థాపితే లింగే కల్యాణం చాభవత్తదా ।**
**ప్రసిద్ధం చైవ తల్లింగం త్రిలోక్యామభవద్ద్విజాః ॥ 52 ॥**

లింగం స్థాపించబడగానే లోకాలకు కల్యాణం కలిగింది. ఓ బ్రాహ్మణులారా! ఆ లింగం ముల్లోకాలలో ప్రసిద్ధిగాంచింది.

**హాటకేశమితి ఖ్యాతం తచ్ఛివాశివమిత్యపి ।**
**పూజనాత్తస్య లోకానాం సుఖం భవతి సర్వథా ॥ 53 ॥**

దానికి హాటకేశ్వరుడని, అర్ధనారీశ్వరుడనియు పేరు వచ్చింది. దానిని పూజించు మానవులకు అన్ని విధములైన సుఖాలు కలుగుతాయి.

**ఇహ సర్వసమృద్ధిః స్యాన్నానాసుఖవహాధికా ।**
**పరత్ర పరమా ముక్తిర్నాత్ర కార్యా విచారణా ॥ 54 ॥**

అటువంటివారు ఇహలోకంలో సకల సమృద్ధులను, వివిధ సుఖాలను అధికంగా అనుభవించి, దేహాన్ని వీడిన పిదప ముక్తిని పొందుతారనడంలో సందేహం లేదు.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం లింగస్వరూపకారణవర్ణనం నామ ద్వాదశోఽధ్యాయః ॥ 12 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు లింగస్వరూపకారణవర్ణనం అనే పేరుగల పన్నెండవ అధ్యాయం సమాప్తం.

## త్రయోదశోఽధ్యాయః - పదమూడవ అధ్యాయం

## వటుకోత్పత్తివర్ణనమ్ - వటుకోత్పత్తివర్ణనం

**సూత ఉవాచ -** సూతుడు చెప్పాడు.

**యథాఽభవల్లింగరూపః సంపూజ్యస్త్రిభవే శివః ।**
**తథోక్తం వా ద్విజాః! ప్రీత్యా కిమన్యచ్ఛ్రోతుమిచ్ఛథ ॥ 1 ॥**

ఓ ద్విజులారా! శివుడు ముల్లోకాలలో లింగరూపంలో పూజింపబడే విధానాన్ని ప్రీతితో చెప్పాను. ఇంకనూ మీరేమి వినగోరుతున్నారు?

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**అంధకేశ్వరలింగస్య మహిమానం వద ప్రభో! ।**
**తథాఽన్యచ్ఛివలింగానాం ప్రీత్యా వక్తుమిహార్హసి ॥ 2 ॥**

ఓ ప్రభూ! అంధకేశ్వరలింగం యొక్క మహిమను, తదితర శివలింగాలను గూర్చి ప్రేమతో వివరించండి.

**సూత ఉవాచ -** సూతుడు చెప్పాడు.

**పురాబ్ధిగర్తమాశ్రిత్య వసన్ దైత్యోఽన్ధకాసురః ।**
**స్వవశం కారయామాస త్రైలోక్యం సురసూదనః ॥ 3 ॥**

పూర్వం అంధకాసురుడు సముద్రంలోని ఒక లోతైన స్థానాన్నాశ్రయించి దేవతలను జయించి ముల్లోకాలను తన వశం చేసుకొన్నాడు.

**తస్మాద్గర్తాచ్చ నిస్సృత్య పీడయిత్వా పునః ప్రజాః ।**
**ప్రావిశచ్చ తదా దైత్యస్తం గర్తం సుపరాక్రమః ॥ 4 ॥**

అతడు తన లోతైన స్థానంనుండి బయటకువచ్చి ప్రజలను పీడించి మరల దానిలో ప్రవేశించేవాడు. వాడు మహాపరాక్రమశాలి.

**దేవాశ్చ దుఃఖితాః సర్వే శివం ప్రార్థ్య పునః పునః ।**
**సర్వం నివేదయామాసుః స్వదుఃఖం చ మునీశ్వరాః ॥ 5 ॥**

ఓ మహర్షులారా! దుఃఖితులైన దేవతలందరు శివుని పలుమార్లు ప్రార్థించారు. ఆయనకు తమ దుఃఖాన్నంతటినీ వారు విన్నవించుకున్నారు.

**సూత ఉవాచ -** సూతుడు చెప్పాడు.

**తదాకర్ణ్య వచస్తేషాం దేవానాం పరమేశ్వరః ।**
**ప్రత్యువాచ ప్రసన్నాత్మా దుష్టహంతా సతాం గతిః ॥ 6 ॥**

దుష్టశిక్షకుడు, శిష్టరక్షకుడైన పరమేశ్వరుడు దేవతల పలుకులు విని ప్రసన్నాత్ముడై ఇట్లు బదులు పలికాడు.

**శివ ఉవాచ** – శివుడు పలికాడు.

**ఘాతయిష్యామి తం దైత్యమంధకం సురసూదనమ్ ।**
**సైన్యం చ నీయతాన్దేవాః! హ్యాయామి చ గణైస్సహ ॥ 7 ॥**

దేవతలను పీడించే ఆ అంధకాసురుని నేను సంహరిస్తాను. దేవతలారా! మీరు సైన్యంతో నడవండి. నేను కూడ ప్రమథ గణాలతో కలిసి వస్తున్నాను.

**తస్మాద్గర్తాదంధకే హి దేవర్షిద్రుహి భీకరే ।**
**నిస్సృతే చ తదా తస్మిన్దేవా గర్తముపాశ్రితాః ॥ 8 ॥**

దేవతలకు, ఋషులకు ద్రోహాన్ని చేసే భయంకరుడైన అంధకుడు సముద్రగర్భంలోని బిలమునుండి బయటకురాగానే దేవతలు ఆ బిలంలో ప్రవేశించారు.

**దైత్యాశ్చ దేవతాశ్చైవ యుద్ధం చక్రుః సుదారుణమ్ ।**
**శివానుగ్రహతో దేవాః ప్రబలాశ్చాఽభవంస్తదా ॥ 9 ॥**

దేవదానవుల మధ్య మిక్కిలి భయంకరమైన యుద్ధం జరిగింది. కాని శివుని అనుగ్రహంచేత దేవతల బలం అతిశయించింది.

**దేవైశ్చ పీడితః సోఽపి యావద్గర్తముపాగతః ।**
**తావచ్ఛూలేన సంప్రోతః శివేన పరమాత్మనా ॥ 10 ॥**

దేవతలచే పీడింపబడిన ఆ రాక్షసుడు బిలం వద్దకు వచ్చేసరికి పరమాత్మయైన శివుడు వానిని శూలంతో పొడిచాడు.

**తత్రత్యశ్చ తదా శంభుం ధ్యాత్వా సంప్రార్థయత్తదా ।**
**అంతకాలే చ త్వాం దృష్ట్వా తాదృశో భవతి క్షణాత్ ॥ 11 ॥**

అప్పుడారాక్షసుడు అచ్చట నిలబడి శంభుని ధ్యానించి "ఓ స్వామీ! మరణసమయంలో నిన్ను దర్శించిన వ్యక్తి అదే క్షణంలో నీవంటి వాడౌతాడు" కదా! అని స్తుతించాడు.

**ఇత్యేవం సంస్తుతస్సోఽపి ప్రసన్నః శంకరస్తదా ।**
**ఉవాచ వచనం తత్ర వరం బ్రూహి దదామి తే ॥ 12 ॥**

అతడిలా స్తుతింపగా శంకరుడు ప్రసన్నుడై "వరాన్నికోరుకో. నీకిస్తాను" అని అన్నాడు.

**ఇత్యేవం వచనం శ్రుత్వా స దైత్యః పునరబ్రవీత్ ।**
**సుప్రణమ్య శివం స్తుత్వా సత్త్వభావముపాశ్రితః ॥ 13 ॥**

ఈ మాటవిని రాక్షసుడు సత్త్వగుణ ప్రధానమైన హృదయం గలవాడై శివునకు ప్రణమిల్లి స్తుతించి ఇలా అడిగాడు.

**అంధక ఉవాచ** – అంధకుడు చెప్పాడు.

**యది ప్రసన్నో దేవేశ! స్వభక్తిం దేహి మే శుభామ్ ।**
**కృపాం కృత్వా విశేషేణ సంస్థితో భవ చేహ వై ॥ 14 ॥**

ఓ దేవదేవా! నీవు ప్రసన్నుడవయితే నీయందు శుభకరమైన భక్తిని నాకు ప్రసాదించు. అలాగే నీవు ప్రత్యేకంగా కృపను చూపి ఇదే స్థానంలోనే స్థిరంగా ఉండిపోవాలి!

**సూత ఉవాచ** – సూతుడు చెప్పాడు.

**ఇత్యుక్తస్తేన దైత్యం తం తద్గర్తే చాక్షిపద్ధరః ।**
**స్వయం తత్ర స్థితో లింగరూపోఽసౌ లోకకామ్యయా ॥ 15 ॥**

ఆ రాక్షసుడిలా అడుగగా శివుడాతనిని బిలంలో పడవేశాడు. అనంతరం ఆయన లోకహితాన్ని గోరి అక్కడే స్వయంగా లింగరూపంలో ఉండిపోయాడు.

**అంధకేశం చ తల్లింగం నిత్యం యః పూజయేన్నరః ।**
**షణ్మాసాజ్జాయతే తస్య వాంఛా సిద్ధిర్న సంశయః ॥ 16 ॥**

ఏ మానవుడైతే అంధకేశ్వరలింగాన్ని ప్రతినిత్యం పూజిస్తాడో వానికి ఆరు మాసాలలో నిస్సందేహంగా కోర్కెలీడేరుతాయి.

**వృత్త్యర్థం పూజయేల్లింగం లోకస్య హితకారకమ్ ।**
**షణ్మాసం యో ద్విజశ్చైవ స వై దేవలకః స్మృతః ॥ 17 ॥**

జీవికకొఱకు లోకహితకరమైన ఈ లింగాన్ని పూజించాలి. ఆరు మాసాలు ఈ శివలింగాన్ని పూజించినవాడు 'దేవలకుడు' అని పిలవబడతాడు.

**యథా దేవలకశ్చైవ స భవేదిహ వై తదా ।**
**దేవలకశ్చ యః ప్రోక్తో నాధికారో ద్విజస్య హి ॥ 18 ॥**

దేవలకుడై జీవించే బ్రాహ్మణునకు వైదికకర్మలయందధికారం ఉండదు.

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**దేవలకశ్చ కః ప్రోక్తః కిం కార్యం తస్య విద్యతే ।**
**తత్త్వం వద మహాప్రాజ్ఞ! లోకానాం హితహేతవే ॥ 19 ॥**

ఓ మహాప్రాజ్ఞా! దేవలకుడెవరు? ఆతని కర్తవ్యమేమిటి? లోకహితం కలిగించడానికి ఈ తత్త్వాన్ని తెలియచెప్పుము.

**సూత ఉవాచ –** సూతుడు చెప్పాడు.

**దధీచిర్నామ విప్రో యో ధర్మిష్ఠో వేదపారగః ।**
**శివభక్తిరతో నిత్యం శివశాస్త్రపరాయణః ॥ 20 ॥**

ధర్మాత్ముడు, వేదపారగుడు, శివభక్తిరతుడు, నిత్యమూ శివశాస్త్రపరాయణుడునైన దధీచి అనే బ్రాహ్మణుడు ఉండేవాడు.

**తస్య పుత్రస్తథా హ్యాసీత్ స్మృతో నామ్నా సుదర్శనః ।**
**తస్య భార్యా దుకూలా చ నామ్నా దుష్టకులోద్భవా ॥ 21 ॥**

ఆయనకు సుదర్శనుడను ప్రసిద్ధిగాంచిన పుత్రుడు. అతనికి దుష్టకులంలో జన్మించిన 'దుకూల' యను భార్య ఉండేది.

**తద్వశే స చ భర్తాఽసీత్తస్య పుత్రచతుష్టయమ్ ।**
**సోఽపి నిత్యం శివస్యైవ పూజాం చ స్మ కరోత్యసౌ ॥ 22 ॥**

అతడామెకు వశుడై యుండెడివాడు. వానికి నలుగురు పుత్రులు కలిగారు. అతడు కూడ ప్రతిదినం శివుని పూజించేవాడు.

**దధీచేస్తు తదా హ్యాసీద్గ్రామాంతరనివేశనమ్ ।**
**జ్ఞాతిసంయోగతశ్చైవ జ్ఞాతిభిర్న స మోచితః ॥ 23 ॥**

దధీచి బంధువులను కలుసుకోవడానికి మరియొక గ్రామానికి వెళ్ళాడు. అక్కడ బంధువులాతనిని విడిచి పెట్టలేదు.

**కథయిత్వా చ పుత్రం స శివభక్తిరతో భవ ।**
**ఇత్యుక్త్వా స గతో ముక్తో దధీచిశ్శైవసత్తమః ॥ 24 ॥**

జీవన్ముక్తుడు, శివభక్తాగ్రేసరుడు అయిన దధీచి, తను వెళ్ళునపుడు పుత్రునితో 'శివభక్తియందు ప్రీతితో శివార్చన చేయము' అని చెప్పివెళ్లాడు.

**సుదర్శనస్తత్పుత్రోఽపి శివపూజాం చకార హ ।**
**ఏవం చిరతరః కాలో వ్యతీయాయ మునీశ్వరాః! ॥ 25 ॥**

మునిశ్రేష్ఠులారా! దధీచి పుత్రుడైన సుదర్శనుడు కూడ శివుని పూజిస్తూ ఉండేవాడు. ఈ విధంగా చాలకాలం గడిచింది.

**ఏవం చ శివరాత్రిశ్చ సమాయాతా కదాచన ।**
**తస్యాం చోపోషితాస్సర్వే స్వయం సంయోగతస్తదా ॥ 26 ॥**

ఇంతలో ఒకనాడు శివరాత్రి వచ్చింది. ఆనాడందరూ ఉపవాసమున్నారు. సుదర్శనుడు తాను కూడ ఉపవసించాడు.

**పూజాం కృత్వా గతస్సోఽపి సుదర్శన ఇతి స్మృతః ।**
**స్త్రీసంగం శివరాత్రౌ తు కృత్వా పునరిహాగతః ॥ 27 ॥**

సుదర్శనుడు పూజ చేసివెళ్లాడు. కాని శివరాత్రి నాడు అతడు స్త్రీసంగమం చేసి శివాలయానికి మరల వచ్చాడు.

**న స్నానం తేన చ కృతం తద్రాత్ర్యాం శివపూజనమ్ ।**
**తేన తత్కర్మపాకేన క్రుద్ధః ప్రోవాచ శంకరః ॥ 28 ॥**

అతడు స్నానం చేయలేదు. ఆనాటి రాత్రి శివుని పూజించలేదు. అతని చేష్టలకు శంకరుడు కోపించి ఇలా పలికాడు.

**మహేశ్వర ఉవాచ** – మహేశ్వరుడు పలికాడు.

**శివరాత్ర్యాం త్వయా దుష్ట! సేవనం చ స్త్రియాః కృతమ్ ।**
**అస్నాతేన మదీయా చ కృతా పూజాఽవివేకినా ॥ 29 ॥**

ఓరీ దుష్టా! నీవు శివరాత్రినాడు స్త్రీతో కులాసాగా గడపడమే కాకుండా వివేకహీనుడవై స్నానం కూడా చేయకుండగా నన్ను పూజించావు.

**జ్ఞాత్వా చైవం కృతం యస్మాత్తస్మాత్త్వం జడతాం వ్రజ ।**
**మమాస్పృశ్యో భవ త్వం చ దూరతో దర్శనం కురు ॥ 30 ॥**

నీవు తెలిసికూడా ఈ విధంగా చేశావు. కాబట్టి నీవు జడుడవు కమ్ము. నీకు నన్ను స్పృశించే అధికారం లేదు. నాకు దూరంగా ఉండు!

**సూత ఉవాచ** – సూతుడు చెప్పాడు.

**ఇతి శప్తో మహేశేన దాధీచిస్స సుదర్శనః ।**
**జడత్వం ప్రాప్తవాన్సద్యశ్శివమాయావిమోహితః ॥ 31 ॥**

దధీచిపుత్రుడైన సుదర్శనుడు శివమాయావిమోహితుడై, మహేశ్వరునిచే ఈ విధంగా శపింపబడిన వెంటనే జడుడయ్యాడు.

**ఏతస్మిన్సమయే విప్రా దధీచిః శైవసత్తమః ।**
**గ్రామాంతరాత్సమాయాతో వృత్తాంతం శ్రుతవాంశ్చ సః ॥ 32 ॥**

బ్రాహ్మణులారా! ఇంతలో శివభక్తాగ్రగణ్యుడైన దధీచి గ్రామాంతరం నుండి మరలి వచ్చి ఆ వృత్తాంతాన్ని విన్నాడు.

**శివేన భర్త్సితః సోఽపి దుఃఖితోఽభూదతీవ హి ।**
**రురోద హా హతోఽస్మీతి దుఃఖేన సుతకర్మణా ॥ 33 ॥**

శివాపరాధంవల్ల ఆయన పుత్రుడు చేసిన పనివలన అతిశయించిన దుఃఖాన్ని పొంది, 'అయ్యో! నేను హతుడనయ్యాను' అని పలుకుతూ రోదించసాగాడు.

**పునః పునరువాచేతి స దధీచిస్సతాం మతః ।**
**అనేనేదం కుపుత్రేణ హతం మే కులముత్తమమ్ ॥ 34 ॥**

సత్పురుషులకు సమాదరణీయుడైన దధీచి పలుమార్లు ఇలా పలికాడు. దుష్టుడైన ఈ నా పుత్రుడు ఉత్తమమైన కులానికి వినాశం తెచ్చాడు.

**స పుత్రోఽపి హతో భార్యాం పుంశ్చలీం కృతవాన్ద్రుతమ్ ।**
**పశ్చాత్తాపమనుప్రాప్య స్వపిత్రా పరిభర్త్సితః ॥ 35 ॥**

నా పుత్రుడు కూడా వినాశం పొందాడు. అతడు తొందరపడి దుష్టురాలిని వివాహమాడాడు. ఈ విధంగా తండ్రి నిందించగా, ఆ కుమారుడు పశ్చాత్తాపాన్ని పొందాడు.

**తత్పిత్రా గిరిజా తత్ర పూజితా విధిభిర్వరైః ।**
**సుయత్నతో మహాభక్త్యా స్వపుత్రసుఖహేతవే ॥ 36 ॥**

అంతట దధీచి తన పుత్రుని సుఖం కొఱకు శ్రేష్ఠమైన విధానాన్ననుసరించి మహాభక్తితో శ్రద్ధాపూర్వకంగా పార్వతీదేవిని పూజించసాగాడు.

**సుదర్శనోఽపి గిరిజాం పూజయామాస చ స్వయమ్ ।**
**చండీపూజనమార్గేణ మహాభక్త్యా శుభైః స్తవైః ॥ 37 ॥**

సుదర్శనుడు కూడ చండీపూజావిధానాన్ననుసరించి, మహాభక్తితో, శుభస్తోత్రాలతో పార్వతీదేవిని పూజించాడు.

**పితాపుత్రౌ చ తావేవం నానోపాయైః సుభక్తితః ।**
**ప్రసన్నాం చక్రతుర్దేవీం గిరిజాం భక్తవత్సలామ్ ॥ 38 ॥**

ఈ విధంగా ఆ తండ్రీకొడుకులు మహాభక్తితో అనేకములైన ఉపాయాలతో అనుష్ఠించి భక్తవత్సలయగు పార్వతీదేవిని ప్రసన్నం చేసుకున్నారు.

**తయోః సేవాప్రభావేణ ప్రసన్నా చండికా తదా ।**
**సుదర్శనం చ పుత్రత్వే చకార గిరిజా మునే! ॥ 39 ॥**

ఓ మునీ! వారి సేవాప్రభావంతో ప్రసన్నురాలైన పర్వతరాజపుత్రికయగు చండిక సుదర్శనుని తన పుత్రునిగా స్వీకరించింది.

**శివం ప్రసాదయామాస పుత్రార్థే చండికా స్వయమ్ ।**
**క్రుద్ధాఽక్రుద్ధా పునశ్చండీ తత్పుత్రస్య ప్రసన్నధీః ॥ 40 ॥**

తాను పుత్రునిగా స్వీకరించిన సుదర్శనునికొఱకు అప్పటివఱకు కోపాన్ని పొందిన చండిక ప్రశాంతతను పొంది శివుణ్ణి శాంతింపజేసింది.

**అథాజ్ఞాయ ప్రసన్నం తం మహేశం వృషభధ్వజమ్ ।**
**నమస్కృత్య స్వయం తస్య హ్యుత్సంగే తం న్యవేశయత్ ॥ 41 ॥**

వృషభధ్వజుడైన మహేశ్వరుడు ప్రసన్నుడైనాడని తెలిసి ఆమె ఆయనకు నమస్కరించి, సుదర్శనుని స్వయంగా శివుని ఒడిలో కూర్చుండబెట్టింది.

**ఘృతస్నానం తతః కృత్వా పుత్రస్య గిరిజా స్వయమ్ ।**
**త్రిరావృత్తోపవీతం చ గ్రంథినైకేన సంయుతమ్ ॥ 42 ॥**

పార్వతి స్వయంగా తనపుత్రుడైన సుదర్శనునకు నేతితో స్నానాన్ని చేయించి మూడు పేటలతో మరియొక ముడితో నున్న యజ్ఞోపవీతాన్ని వేసింది.

**సుదర్శనాయ పుత్రాయ దదౌ ప్రీత్యా తదాంబికా ।**
**ఉద్దిశ్య శివగాయత్రీం షోడశాక్షరసంయుతామ్ ॥ 43 ॥**

అపుడా శివుడు అంబికా పుత్రుడైన సుదర్శనునకు పదునారక్షరాలుగల శివగాయత్రీమంత్రాన్ని ప్రేమతో ఉపదేశించాడు.

**తదోమ్ నమః శివాయేతి శ్రీశబ్దపూర్వకాయ చ ।**
**వారాన్ షోడశ సంకల్పపూజాం కుర్యాదయం వటుః ॥ 44 ॥**

అప్పుడా బ్రాహ్మణబాలకుడు పదునారు పర్యాయాలు 'ఓం నమశ్శివాయ' అనే మంత్రానికి 'శ్రీ' కారాన్ని ముందుజోడించి సంకల్పపూజ చేశాడు.

**ఆస్నానాదిప్రణామాంతం పూజయన్వృషభధ్వజమ్ ।**
**మంత్రవాదిత్రపూజాభిస్సర్షీణాం సన్నిధౌ తథా ॥ 45 ॥**

అతడు మహర్షుల సన్నిధిలో స్నానం ఆరంభించి ప్రదక్షిణవరకు గల ఉపచారాలతో వృషభధ్వజుని పూజించి మంత్రాలను పఠించి వాద్యగోష్ఠి చేయించాడు.

**నామమంత్రాననేకాంశ్చ పాఠయామాస వై తదా ।**
**ఉవాచ సుప్రసన్నాత్మా చండికా చ శివస్తథా ॥ 46 ॥**

అంతేగాక అనేక నామమంత్రాలను పఠింపజేశాడు. అంతట చండిక, శివుడు కూడ మిక్కిలి ప్రసన్నులయ్యారు. అంతట శివుడిట్లు పలికాడు.

**మదర్పితం చ యత్కించిద్ధనధాన్యాదికం తథా ।**
**తత్సర్వం చ త్వయా గ్రాహ్యం న దోషాయ భవిష్యతి ॥ 47 ॥**

నా కర్పించబడే ధనధాన్యాలన్నింటినీ నీవు స్వీకరించవచ్చును. నీకు దోషమంటదు.

**మమ కృత్యే భవాన్ముఖ్యో దేవీకృత్యే విశేషతః ।**
**ఘృతతైలాదికం సర్వం త్వయా గ్రాహ్యం మదర్పితమ్ ॥ 48 ॥**

నన్ను, దేవిని పూజించేవారిలో నీవు ప్రధానుడవు. నాకర్పింపబడిన నేయి, నూనె ఇత్యాది వస్తువులు వాటిని నీవు తీసుకొనవచ్చును.

**ప్రాజాపత్యం భవేద్యర్హి తర్హ్యేకో హి భవాన్భవేత్ ।**
**తదా పూజా చ సంపూర్ణాఽన్యథా సర్వా చ నిష్ఫలా ॥ 49 ॥**

ప్రాజాపత్యవ్రతం చేసే సమయంలో నీవొక్కడివి మాత్రమే అక్కడుండాలి. అప్పుడు మాత్రమే ఆ పూజ సఫలమౌతుంది. లేనిచో పూజ వ్యర్థమౌతుంది.

**తిలకం వర్తులం కార్యం స్నానం కార్యం సదా త్వయా ।**
**శివసంధ్యా చ కర్తవ్యా గాయత్రీ చ తదీయికా ॥ 50 ॥**

నీవు స్నానం చేయాలి. గుండ్రని తిలకాన్ని ధరించాలి. సంధ్యాకాలంలో శివుని ధ్యానించాలి. శివగాయత్రిని జపించాలి.

**మత్సేవాం ప్రథమం కృత్వా కార్యమన్యత్కులోచితమ్ ।**
**ఏవం కృతేఽఖిలే భద్రం దోషాః క్షాంతా మయా తవ ॥ 51 ॥**

ముందుగా నన్ను సేవించిన తరువాత మాత్రమే నీ కులానికి తగిన కర్మలు చేయాలి. ఈ విధంగా అనుష్ఠిస్తే నీకు మంగళం కలుగుతుంది. నీ దోషాలను నేను క్షమిస్తాను.

**సూత ఉవాచ -** సూతుడు చెప్పాడు.

**ఇత్యుక్త్వా తస్య పుత్రాశ్చ చత్వారో బటుకాస్తదా ।**
**అభిషిక్తాశ్చతుర్దిక్షు శివేన పరమాత్మనా ॥ 52 ॥**

ఇట్లు పలికిన తరువాత శివపరమాత్మ, వాని పుత్రులైన నలుగురు వటువులను నాల్గు దిక్కులలో అభిషేకించాడు.

**చండీ చైవాత్మనికటే పుత్రం స్థాప్య సుదర్శనమ్ ।**
**తత్పుత్రాన్ప్రేరయామాస వరాన్ దత్త్వా హ్యనేకశః ॥ 53 ॥**

చండి కూడ పుత్రుడైన సుదర్శనుని తన సమీపంలోనే ఉంచుకొని వాని పుత్రులకు అనేకవరాల నిచ్చి ప్రోత్సహించింది.

**దేవ్యువాచ –** దేవి పలికింది.

**ఉభయోర్యువయోర్మధ్యే వటుకో యో భవేన్మమ ।**
**తస్య స్యాద్విజయో నిత్యం నాత్ర కార్యా విచారణా ॥ 54 ॥**

మీ యిద్దరిలో ఎవరైతే నా పూజలో వటుస్థానంలో (శివరూపియైన బ్రహ్మచారి) పూజింపబడతారో, వానికి నిత్యం విజయం కలుగుతుందనడంలో సందేహం లేదు.

**భవాంశ్చ పూజితో యేన తేనైవాహం ప్రపూజితా ।**
**కర్తవ్యం హి భవద్భిశ్చ స్వీయం కర్మ సదా సుత! ॥ 55 ॥**

ఓ కుమారా! నిన్ను పూజించినవారికి మాత్రమే నన్ను పూజించే అర్హత కలుగుతుంది. మీరు సర్వదా మీ కర్తవ్యాన్ని పాలించండి.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఏవం తస్మై వరా దత్త్వాస్సపుత్రాయ మహాత్మనే ।**
**సుదర్శనాయ కృపయా శివాభ్యాం జగతాం కృతే ॥ 56 ॥**

ఈ విధంగా పార్వతీపరమేశ్వరులు లోకహితం కోరి మహాత్ముడైన సుదర్శనునికి, అతని పుత్రులకు దయతో వరాలనిచ్చారు.

**శివాభ్యాం స్థాపితా యస్మాత్తస్మాత్తే వటుకాః స్మృతాః ।**
**తపోభ్రష్టాశ్చ యే జాతాః స్మృతాస్తస్మాత్తపోధమాః ॥ 57 ॥**

వారు పార్వతీపరమేశ్వరులచే స్థాపింపబడినందున 'వటువులు' అనబడ్డారు. ఎవరైతే తపస్సునుండి జారిపోతారో వారు తపోఽధములనబడుతున్నారు.

**శివయోః కృపయా సర్వే విస్తారం బహుధా గతాః ।**
**తేషాం చ ప్రథమా పూజా మహాపూజా మహాత్మనః ॥ 58 ॥**

పార్వతీ పరమేశ్వరుల అనుగ్రహంచే ఆ వటువులు పలువిధాల అభివృద్ధి చెందారు. పరమేశ్వరుడైన శివుని పూజలో ముందుగా వారిని పూజించాలి. అప్పుడా పూజ మహిమాన్వితమౌతుంది.

**తేన యావత్కృతా నైవ పూజా వై శంకరస్య చ ।**
**తావత్పూజా న కర్తవ్యా కృతా చేన్న శుభాపి సా ॥ 59 ॥**

వారిని పూజించకుండా శంకరుని పూజచేయరాదు. ఒక వేళ చేసినట్లయితే, అది శుభకరం కాదు.

**శుభం వాప్యశుభం వాపి వటుకం న పరిత్యజేత్ ।**
**ప్రాజాపత్యే చ భోజ్యే వై వటురేకో విశిష్యతే ॥ 60 ॥**

శుభాశుభకర్మలలో వటువును విడిచి పెట్టరాదు. ప్రాజాపత్యవ్రతమునకు సంబంధించిన భోజనంలో వటువు ప్రశస్తుడు.

**శివయోశ్చ తథా కార్యే విశేషోఽత్ర ప్రదృశ్యతే ।**
**తదేవ శృణు సుప్రాజ్ఞ! యథాఽహం వచ్మి తేఽనఘ! ॥ 61 ॥**

ఓ ప్రజ్ఞాశాలీ! ఓ పుణ్యాత్ముడా! పార్వతీపరమేశ్వరుల ఆరాధనలో ఒక విశేషం కనబడుతుంది. నీవు దోషరహితుడవు. ఆ విశేషాన్ని నీకు చెబుతాను. విను.

**తస్యైవ నగరే రాజ్ఞో భద్రస్య నిత్యభోజనే ।**
**ప్రాజాపత్యస్య నియమే హ్యంధకేశసమీపతః ॥ 62 ॥**

అదే నగరంలో భద్రమహారాజు నియమంగా ప్రాజాపత్యవ్రతాన్ని అంధకేశ్వరుని సన్నిధిలో అనుష్ఠించి, నిత్యాన్నదానం చేస్తుండేవాడు.

**యజ్జాతమద్భుతం వృత్తం శివానుగ్రహకారణాత్ ।**
**శ్రూయతాం తచ్చ సుప్రీత్యా కథయామి యథాశ్రుతమ్ ॥ 63 ॥**

శివుని అనుగ్రహప్రభావంచే ఒక అద్భుతవృత్తాంతం జరిగింది. దానిని నేను విన్నంతవరకు చెబుతాను. మీరు పరమప్రీతితో వినండి.

**ధ్వజ ఏకశ్చ తద్రాజ్ఞే దత్తస్తుష్టేన శంభునా ।**
**ప్రోక్తశ్చ కృపయా రాజా దేవదేవేన తేన సః ॥ 64 ॥**

దేవదేవుడైన శంభుడు ప్రసన్నుడై ఆ రాజునకొక ధ్వజాన్నిచ్చి దయతో ఇలా చెప్పాడు.

**ప్రాతశ్చ వర్ధ్యతాం రాజన్! ధ్వజో రాత్రౌ పతిష్యతి ।**
**మమ త్వేవం చ సంపూర్ణే ప్రాజాపత్యే తథా పునః ॥ 65 ॥**

"ఓ రాజా! ఉదయాన్నే ఈ ధ్వజాన్ని ఎగురవేసి కట్టివేయండి. రాత్రియందు క్రింద పడుతుంది. ప్రాజాపత్యవ్రతం పూర్ణమైన సందర్భంలో నా యీ ధ్వజం ఇలా ప్రవర్ధిల్లుతుంది.

**అన్యథాఽయం ధ్వజో మే హి రాత్రావపి స్థిరో భవేత్ ।**
**ఇత్యుక్త్వాంతర్హితశ్శంభూ రాజ్ఞే తుష్టః కృపానిధిః ॥ 66 ॥**

అట్లు కాని పక్షంలో నా ధ్వజం రాత్రియందు కూడా స్థిరంగా ఉండిపోతుంది. ఇట్లు రాజుతో పలికి దయా–సముద్రుడైన శంభుడు ప్రసన్నుడై అంతర్ధానమయ్యాడు.

**తథేతి నియమశ్చాసీత్తస్య రాజ్ఞో మహామునే! ।**
**ప్రాజాపత్యం కృతం నిత్యం శివపూజావిధానతః ॥ 67 ॥**

ఓ మహర్షీ! ఆ రాజు అదే నియమాన్ని పాటించాడు. ఆయన శివపూజావిధానంతో ప్రతిదినం ప్రాజాపత్యవ్రతం చేసేవాడు.

**స్వయం ప్రాతిర్వివర్ధేత ధ్వజః సాయం పతేదితి ।**
**యది కార్యం చ సంపూర్ణం జాతం చైవ భవేదిహ ॥ 68 ॥**

ఈ కార్యాలు సంపూర్ణమౌతుండేవి.కావుననే ధ్వజం ఉదయాన్నే తానే స్వయంగా పైకి లేచి ఎగురుతూ, సాయంకాలం మరల పడుతూండేది.

**ఏకస్మిన్సమయే చాత్ర వటోః కార్యం పురా హ్యభూత్ ।**
**ధ్వజః స పతితో వై హి బ్రహ్మభోజం వినాపి హి ॥ 69 ॥**

ఒకనాడు వారు వటుకార్యాన్ని ముందుగా చేశారు. అంతట బ్రాహ్మణభోజనానికి ముందుగానే ధ్వజం పడిపోయింది.

**దృష్ట్వా తచ్చ తదా తత్ర పృష్టా రాజ్ఞా చ పండితాః ।**
**భుంజతే బ్రాహ్మణా హ్యత్ర నోత్థితో వై ధ్వజస్త్వితి ॥ 70 ॥**

దానిని చూచి రాజు పండితులనిలా ప్రశ్నించాడు. ఇక్కడ బ్రాహ్మణులు భుజిస్తున్నారు.కాని ధ్వజమింకనూ లేవలేదు.

**కథం చ పతితః సోఽత్ర బ్రాహ్మణా బ్రూత సత్యతః ।**
**తే పృష్టాశ్చ తదా ప్రోచుర్బ్రాహ్మణాః పండితోత్తమాః ॥ 71 ॥**

ఓ బ్రాహ్మణోత్తములారా! అది అట్లు పడిపోవడానికి కారణమేమి? సత్యం చెప్పండి. రాజు ఆ విధంగా ప్రశ్నించగానే పండితోత్తములైన బ్రాహ్మణులిట్లు బదులు పలికారు.

**బ్రహ్మభోజే మహారాజ! వటుకో భోజితః పురా ।**
**చండీపుత్రశ్శివస్తుష్టస్తస్మాచ్చ పతితో ధ్వజః ॥ 72 ॥**

ఓ మహారాజా! బ్రాహ్మణభోజనం కంటె ముందుగా వటువు భుజించాడు. చండీపుత్రుడు, మంగళకరుడునైన వటువు సంతృప్తి చెందాడు. అందువలననే ధ్వజం పడిపోయింది.

**తచ్ఛ్రుత్వా నృపతి స్సోఽథ జనాశ్చాన్యేఽపి సర్వశః ।**
**అభవన్విస్మితాస్తత్ర ప్రశంసాం చక్రిరే తతః ॥ 73 ॥**

ఆ మాటలు విని మహారాజు, తదితర జనులందరు ఆశ్చర్యపడ్డారు. అనంతరం వారు ప్రశంసించారు.

**ఏవం చ మహిమా తేషాం వర్ధితః శంకరేణ హి ।**
**తస్మాచ్చ వటుకాః శ్రేష్ఠాః పురావిద్భిః ప్రకీర్తితాః ॥ 74 ॥**

ఈ విధంగా శంకరుడు వారి మహిమను వర్ధిల్లజేశాడు. కావుననే 'వటువులు' శ్రేష్ఠులని, సంప్రదాయజ్ఞులు కీర్తిస్తారు.

**శివపూజా తు తైః పూర్వముత్తార్యా నాన్యథా పునః ।**
**అన్యేషాం నాధికారోఽస్తి శివస్య వచనాదిహ ॥ 75 ॥**

ముందుగా ఆ వటువులు శివుని పూజించాలి. దీనికి భిన్నంగా చేయరాదు. శివాజ్ఞచే దీనిలో ఇతరులకధికారం లేదు.

**ఉత్తారణం చ కార్యం వై పూజా పూర్ణా భవత్వితి ।**
**ఏతావదేవ తేషాం తు కార్యం నాన్యత్తథైవ చ ॥ 76 ॥**

'పూజ పూర్ణమగు గాక' అని పలికి పూజను పరిసమాప్తి చేయాలి. వారు చేయవలసిన కార్యమింతే. ఇంతకు మించి లేదు.

**ఏతత్సర్వం సమాఖ్యాతం యత్పృష్టం చ మునీశ్వరాః! ।**
**యచ్ఛ్రుత్వా శివపూజాయాః ఫలం ప్రాప్నోతి వై నరః ॥ 77 ॥**

ఓ మహర్షులారా! మీరు ప్రశ్నించినవాటిని నేను వివరంగా చెప్పాను. దీనిని వినిన మానవులకు 'శివపూజాఫలం' లభిస్తుంది.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం వటుకోత్పత్తివర్ణనం నామ త్రయోదశోఽధ్యాయః ॥ 13 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు వటుకోత్పత్తివర్ణనం అనే పేరుగల పదమూడవ అధ్యాయం సమాప్తం.

## చతుర్దశోఽధ్యాయః - పద్నాల్గవ అధ్యాయం

## సోమనాథజ్యోతిర్లింగోత్పత్తివర్ణనమ్ - సోమనాథజ్యోతిర్లింగోత్పత్తివర్ణనం

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**జ్యోతిషాం చైవ లింగానాం మాహాత్మ్యం కథయాధునా ।**
**ఉత్పత్తిం చ తథా తేషాం బ్రూహి సర్వం యథాశ్రుతమ్ ॥ 1 ॥**

ఓ సూత మహర్షీ! జ్యోతిర్లింగాల మాహాత్మ్యాన్ని, వాటి పుట్టుకను సమస్తాన్ని నీవు వినిన విధంగా ఇప్పుడు మాకు చెప్పుము.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**శృణ్వంతు విప్రా వక్ష్యామి తన్మాహాత్మ్యం జనిం తథా ।**
**సంక్షేపతో యథాబుద్ధి సద్గురోశ్చ మయా శ్రుతమ్ ॥ 2 ॥**

ఓ బ్రాహ్మణులారా! వాటి ఉత్పత్తి, మాహాత్మ్యాలను గూర్చి నా బుద్ధికి తోచినవిధంగా, నేను సద్గురువు-నుండి వినిన దానిని సంక్షేపంగా మీకు చెబుతాను. వినండి.

**ఏతేషాం చైవ మాహాత్మ్యం వక్తుం వర్షశతైరపి ।**
**శక్యతే న మునిశ్రేష్ఠాస్తథాపి కథయామి వః ॥ 3 ॥**

ఓ మహర్షులారా! వీటి మాహాత్మ్యాన్ని వర్ణించడానికి కొన్ని వందల సంవత్సరాల కాలమైనా సరిపోదు, అయినప్పటికి మీకు చెబుతాను.

**సోమనాథశ్చ తేషాం వై ప్రథమః పరికీర్తితః ।**
**తన్మాహాత్మ్యం శృణు మునే! ప్రథమం సావధానతః ॥ 4 ॥**

వారిలో మొదటివాడు సోమనాథుడని కీర్తింపబడ్డాడు. కావున ముందుగా ఆయన మాహాత్మ్యాన్ని శ్రద్ధగా వినండి.

**సప్తవింశన్మితాః కన్యా దక్షేణ చ మహాత్మనా ।**
**తేన చంద్రమసే దత్తా అశ్విన్యాద్యా మునీశ్వరాః! ॥ 5 ॥**

ఓ మహర్షులారా! మహాత్ముడైన దక్షుడు అశ్విని మొదలగు ఇరువది ఏడుగురు కుమార్తెలను చంద్రునికిచ్చి వివాహం చేశాడు. (వింశతిశబ్దంలోని ఇకారానికి లోపం ఛాందసము. వింశత్+మితాః వింశన్మితాః)

**చంద్రం చ స్వామినం ప్రాప్య శోభమానా విశేషతః ।**
**చంద్రోఽపి చైవ తాః ప్రాప్య శోభతే స్మ నిరంతరమ్ ॥ 6 ॥**

వారు చంద్రుని భర్తగా పొంది మిక్కిలి శోభిల్లారు. చంద్రుడు కూడ వారిని పొంది సర్వకాలాలలో శోభతో వెలుగొందుతున్నాడు.

**హేమ్నా చైవ మణిర్భాతి మణినా హేమ చైవ హి ।**
**ఏవం చ సమయే తస్య యజ్జాతం శ్రూయతామితి ॥ 7 ॥**

బంగారంవలన మణికి, మణివలన బంగారానికి శోభకలుగుతుంది గదా! ఆ సమయంలో జరిగిన వృత్తాంతాన్ని వినండి.

**సర్వాస్వపి చ పత్నీషు రోహిణీ నామ యా స్మృతా ।**
**యథైకా సా ప్రియా చాసీత్తథాన్యా న కదాచన ॥ 8 ॥**

భార్యలందరిలో రోహిణి అనునామెపై ఎల్లప్పుడు ప్రేమను చూపేవాడు. ఇతర భార్యలపై అలాంటి ప్రేమ లేదు.

**అన్యాశ్చ దుఃఖమాపన్నాః పితరం శరణం యయుః ।**
**గత్వా తస్మై చ యద్దుఃఖం తథా తాభిర్నివేదితమ్ ॥ 9 ॥**

మిగిలిన భార్యలు దుఃఖితలై, తండ్రివద్దకు వెళ్లి ఆయనను శరణుపొంది తమ దుఃఖాన్ని ఆయనకు విన్నవించుకున్నారు.

**దక్షస్స చ తథా శ్రుత్వా దుఃఖం చ ప్రాప్తవాంస్తదా ।**
**సమాగత్య ద్విజాశ్చంద్రం శాంత్యాஉవోచద్వచస్తదా ॥ 10 ॥**

దక్షుడా వృత్తాంతాన్ని విని దుఃఖితుడయ్యాడు. అప్పుడాతడు చంద్రుని వద్దకు వచ్చి శాంతిపూర్వకంగా ఇలా పలికాడు.

**దక్ష ఉవాచ –** దక్షుడు పలికాడు.

**విమలే చ కులే త్వం హి సముత్పన్నః కళానిధే! ।**
**ఆశ్రితేషు చ సర్వేషు న్యూనాధిక్యం కథం తవ ॥ 11 ॥**

ఓ కళానిధీ! పవిత్రమైన కులంలో జన్మించిన నీకు, నిన్నాశ్రయించిన వారి యెడల సమభావము గాక హెచ్చుతగ్గులుండుటకు కారణమేమి?

**కృతం చేత్తత్కృతం తచ్చ న కర్తవ్యం త్వయా పునః ।**
**వర్తనం విషమత్వేన నరకప్రదమీరితమ్ ॥ 12 ॥**

జరిగినదేదో జరిగింది. అదే తప్పు మరల నీవు చేయకు. హెచ్చు తగ్గులు చూపుట నరకహేతువగునని పెద్దలు చెబుతారు.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**దక్షశ్చైవం చ సంప్రార్థ్య చంద్రం జామాతరం స్వయమ్ ।**
**జగామ మందిరం స్వం వై నిశ్చయం పరమం గతః ॥ 13 ॥**

దక్షుడు తన అల్లునితో స్వయంగా ఇట్లు పలికి దృఢనిశ్చయం గలవాడై తనయింటికి వెళ్లాడు.

**చంద్రోఽపి వచనం తస్య న చకార విమోహితః ।**
**శివమాయాప్రభావేణ యయా సంమోహితం జగత్ ॥ 14 ॥**

సర్వజగత్తును మోహింపజేయగల శివమాయచే అధికంగా మోహాన్ని పొందిన చంద్రుడు దక్షుని మాటలను లెక్కచేయలేదు.

**శుభం భావి యదా యస్య శుభం భవతి తస్య వై ।**
**అశుభం చ యదా భావి కథం తస్య శుభం భవేత్ ॥ 15 ॥**

ఎవని ప్రారబ్ధంలో శుభం కలుగవలసి యున్నదో, వానికి నిశ్చయంగా శుభం కలుగుతుంది. ప్రారబ్ధంలో అశుభం కలుగవలసియున్న వానికి శుభ మెట్లు కలుగుతుంది?

**చంద్రోఽపి బలవద్భావివశాన్మేనే న తద్వచః ।**
**రోహిణ్యాం చ సమాసక్తో నాన్యాం మేనే కదాచన ॥ 16 ॥**

బలవంతమైన ప్రారబ్ధానికి వశుడైయున్న చంద్రుడు దక్షుని వచనాలను లెక్కచేయలేదు. రోహిణి-యందాసక్తిగలవాడై మిగిలిన భార్యలనందరినీ ఉపేక్షించాడు.

**తచ్ఛ్రుత్వా పునరాగత్య స్వయం దుఃఖసమన్వితః ।**
**ప్రార్థయామాస చంద్రం స దక్షో దక్షస్సునీతితః ॥ 17 ॥**

నీతిశాస్త్రంలో సమర్థుడైన దక్షుడు ఆ విషయాన్ని విని దుఃఖంతో కూడినవాడై మరలా వచ్చి చంద్రుని వేడుకున్నాడు.

**దక్ష ఉవాచ –** దక్షుడు పలికాడు.

**శ్రూయతాం చంద్ర! యత్పూర్వం ప్రార్థితో బహుధా మయా ।**
**న మానితం త్వయా యస్మాత్తస్మాత్త్వం చ క్షయీ భవ ॥ 18 ॥**

ఓ చంద్రా! వినుము. పూర్వం నిన్ను నేను అనేక విధాలుగా ప్రార్థించియున్నాను. అయిననూ నీవు నన్ను లెక్కచేయలేదు. కావున నీవు క్షయము కలవాడవు కమ్ము.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యుక్తే తేన చంద్రో వై క్షయీ జాతః క్షణాదిహ ।**
**హాహాకారో మహానాసీత్తదేందౌ క్షీణతాం గతే ॥ 19 ॥**

దక్షుడిట్లు పలికిన మరుక్షణంలో చంద్రుడు క్షయరోగపీడితుడయ్యాడు. చంద్రుడు క్షీణింపగానే పెద్దగా హాహాకారాలు వ్యాపించాయి.

**దేవర్షయస్తదా సర్వే కిం కార్యం హా కథం భవేత్ ।**
**ఇతి దుఃఖం సమాపన్నా విహ్వలా హ్యభవన్మునే! ॥ 20 ॥**

ఓ మునీ! అప్పుడు సమస్త దేవతలు, ఋషులు, 'ఏమిచేయాలి? ఈ గండాన్ని ఎట్లు దాటాలి?' అని కంగారుపడుతూ దుఃఖితులయ్యారు.

**విజ్ఞాపితాశ్చ చంద్రేణ సర్వే శక్రాదయస్సురాః ।**
**ఋషయశ్చ వసిష్ఠాద్యా బ్రహ్మాణం శరణం యయుః ॥ 21 ॥**

చంద్రునిచే ప్రార్థింపబడిన ఇంద్రాదిదేవతలు, వసిష్ఠాదిమహర్షులు బ్రహ్మను శరణు పొందారు.

**గత్వాపి తు తదా ప్రోచుస్తద్వృత్తం నిఖిలం మునే! ।**
**బ్రహ్మణే ఋషయో దేవా నత్వా నుత్వాతివిహ్వలాః ॥ 22 ॥**

ఓ మహర్షీ! దేవతలు, మహర్షులందరూ ఆ సమయంలో మహాదుఃఖాన్ని పొందినవారై బ్రహ్మవద్దకు వెళ్ళి ఆయనకు ప్రణమిల్లి స్తుతించి ఆ వృత్తాంతమంతటినీ చెప్పారు.

**బ్రహ్మాపి తద్వచః శ్రుత్వా విస్మయం పరమం యయౌ ।**
**శివమాయాం సుప్రశస్య శ్రావయంస్తానువాచ హ ॥ 23 ॥**

బ్రహ్మ కూడా వారి మాటలు విని మిక్కిలి చకితుడై,శివమాయనధికంగా ప్రశంసించి వారితో ఇలా పలికాడు

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**అహో! కష్టం మహజ్జాతం సర్వలోకస్య దుఃఖదమ్ ।**
**చంద్రస్తు సర్వదా దుష్టో దక్షశ్చ శప్తవానముమ్ ॥ 24 ॥**

అయ్యో! సర్వప్రాణులకూ దుఃఖాన్ని కలిగించే పెద్దకష్టం వచ్చింది. చంద్రుడు సర్వకాలాలలోను దుష్టుడే, ఇపుడు వానిని దక్షుడు శపించాడు.

**సర్వం దుష్టేన చంద్రేణ కృతం కర్మాప్యనేకశః ।**
**శ్రూయతామృషయో దేవాశ్చంద్రకృత్యం పురాతనమ్ ॥ 25 ॥**

దేవతలారా! ఓ ఋషులారా! దుష్టుడైన చంద్రుడనేకపర్యాయాలిటువంటి పనులే చేశాడు. వానిది పూర్తిగా దుష్టప్రవృత్తి. చంద్రుడు పూర్వంలో చేసిన పనులను గూర్చి వినండి.

**బృహస్పతేర్గృహం గత్వా తారా దుష్టేన వై హృతా ।**
**తస్య భార్యా పునశ్చైవ సదైత్యాన్సముపస్థితః ॥ 26 ॥**

ఆ దుష్టుడు బృహస్పతి యింటికి వెళ్లి ఆయన భార్యయైన తారనపహరించాడు. అంతేగాక రాక్షసులనాశ్రయించాడు.

**సమాశ్రితస్తదా దైత్యాన్యుద్ధం దేవైశ్చకార హ ।**
**మయాఽత్రిణా నిషిద్ధశ్చ తస్మై తారాం దదౌ శశీ ॥ 27 ॥**

అపుడా చంద్రుడు రాక్షసుల ఆశ్రయాన్ని పొంది దేవతలతో యుద్ధం చేశాడు. నేను, అత్రిముని మందలించగా తారను బృహస్పతికప్పగించాడు.

**తాం చ గర్భవతీం దృష్ట్వా న గృహ్ణామీతి సోఽబ్రవీత్ ।**
**అస్మాభిర్వారితో జీవః కృచ్ఛ్రాజ్జగ్రాహ తాం తదా ॥ 28 ॥**

ఆమె గర్భవతియై యుండుటను గాంచి, బృహస్పతి తారను స్వీకరించుటకు నిరాకరించాడు. మేము నచ్చజెప్పిన తరువాత అతికష్టం మీద ఆమెను స్వీకరించాడు.

**యది గర్భం జహాతీహ గృహ్ణామీత్యబ్రవీత్పునః ।**
**గర్భే మయా పునస్తత్ర త్యాజితే మునిసత్తమాః! ॥ 29 ॥**

ఓ మునిశ్రేష్ఠులారా! ఈమె గర్భాన్ని విడిచి పెట్టినచో నేనామెను స్వీకరిస్తానని ఆయన పలికాడు. అప్పుడామె గర్భాన్ని పరిత్యజించేటట్లు నేను చేశాను.

**కస్యాయం చ పునర్గర్భస్సోమస్యేతి చ సాఽబ్రవీత్ ।**
**పశ్చాత్తేన గృహీతా సా మయా చ వారితేన వై ॥ 30 ॥**

"ఈ గర్భమెవరిది?" అని ప్రశించగా, 'చంద్రునిది' అని యామె బదులు పలికింది. తరువాత నేను నచ్చజెప్పగా ఆయన ఆమెను స్వీకరించాడు.

**ఏవంవిధాని చంద్రస్య దుశ్చారిత్రాణ్యనేకశః ।**
**వర్ణ్యంతే కిం పునస్తాని సోఽద్యాపి కురుతే కథమ్ ॥ 31 ॥**

ఈ విధంగా చంద్రుడు చేసిన తప్పుడు పనులు చాలా గలవు. వాటిని వర్ణించడం వల్ల ఏమి ప్రయోజనం? అతడిప్పటికీ అట్లే ప్రవర్తించడానికి కారణమేమిటి?

**యజ్జాతం తత్సుసంజాతం నాన్యథా భవతి ధ్రువమ్ ।**
**అతః పరముపాయం వో వక్ష్యామి శృణుతాదరాత్ ॥ 32 ॥**

ఏది జరిగినా మన మంచికే. విధికి భిన్నంగా ఏదీ జరుగదు. ఇది నిశ్చయం. కాబట్టి మీకు గొప్ప ఉపాయం చెబుతాను. శ్రద్ధతో వినండి.

**ప్రభాసకే శుభే క్షేత్రే వ్రజేచ్చంద్రస్సదైవతైః ।**
**శివమారాధయేత్తత్ర మృత్యుంజయ విధానతః ॥ 33 ॥**

చంద్రుడు శుభకరమైన ప్రభాసక్షేత్రానికి దేవతలతో సహా వెళ్లి, అచ్చట యథావిధిగా మృత్యుంజయ మంత్రాన్ని జపిస్తూ శివుని ఆరాధించాలి.

**నిధాయేశం పురస్తత్ర చంద్రస్తపతు నిత్యశః ।**
**ప్రసన్నశ్చ శివః పశ్చాదక్షయం తం కరిష్యతి ॥ 34 ॥**

అచ్చట చంద్రుడు తన యెదుట శివలింగాన్ని స్థాపించి, నిత్యమూ తపస్సు చేయాలి. అనంతరం శివుడు ప్రసన్నుడై అతని క్షయరోగాన్ని నిర్మూలిస్తాడు.

**సూత ఉవాచ –** సూతుడు చెప్పాడు.

**ఇతి శ్రుత్వా వచస్తస్య బ్రహ్మణస్తే సురర్షయః ।**
**సంనివృత్త్యాయయుస్సర్వే యత్ర దక్షవిధూ తతః ॥ 35 ॥**

సమస్తదేవతలు, ఋషులు బ్రహ్మ పలుకులను విని దక్షుడు, చంద్రుడు ఉన్న స్థలానికి మరలి వచ్చారు.

**గృహీత్వా తే తతశ్చంద్రం దక్షం చాశ్వాస్య నిర్జరాః ।**
**ప్రభాసే ఋషయశ్చక్రుస్తత్ర గత్వాఖిలాశ్చ వై ॥ 36 ॥**

దేవతలు, ఋషులు దక్షునోదార్చి చంద్రుని తోడ్కొని ప్రభాసక్షేత్రానికి వెళ్లి అచట లింగాన్ని స్థాపించారు.

**ఆవాహ్య తీర్థవర్యాణి సరస్వత్యాదికాని చ ।**
**పార్థివేన తదా పూజాం మృత్యుంజయవిధానతః ॥ 37 ॥**

వారు సరస్వతి మున్నగు ప్రసిద్ధతీర్థాలనన్నింటిని ఆహ్వానించారు. పార్థివలింగాన్ని స్థాపించి పూజించారు. యథావిధిగా మృత్యుంజయమంత్రాన్ని పఠించారు.

**తే దేవాశ్చ తదా సర్వే ఋషయో నిర్మలాశయాః ।**
**స్థాప్య చంద్రం ప్రభాసే చ స్వం స్వం ధామ యయుర్ముదా ॥ 38 ॥**

సమస్త దేవతలు, పవిత్రాంతఃకరణులైన ఋషులు చంద్రుని ప్రభాసక్షేత్రంలో నుంచి తమ తమ స్థానాలకు వెళ్లారు.

**చంద్రేణ చ తపస్తప్తం షణ్మాసం చ నిరంతరమ్ ।**
**మృత్యుంజయేన మంత్రేణ పూజితో వృషభధ్వజః ॥ 39 ॥**

చంద్రుడారుమాసాలు నిరంతరం తపస్సు చేశాడు. అతడు మృత్యుంజయమంత్రంతో వృషభధ్వజుడైన శివుని పూజించాడు.

**దశకోటిమితం మంత్రం సమావృత్య శశీ చ తమ్ ।**
**ధ్యాత్వా మృత్యుంజయం మంత్రం తస్థౌ నిశ్చలమానసః ॥ 40 ॥**

చంద్రుడు మృత్యుంజయమంత్రాన్ని పదికోట్లు జపంచేసి నిశ్చలమనస్సుతో శివుని ధ్యానించి స్థిరుడైయున్నాడు.

**తం దృష్ట్వా శంకరో దేవః ప్రసన్నోఽభూత్తతః ప్రభుః ।**
**ఆవిర్భూయ విధుం ప్రాహ స్వభక్తం భక్తవత్సలః ॥ 41 ॥**

అప్పుడాతనిని గాంచి భక్తవత్సలుడైన శంకరుడు ప్రసన్నుడయ్యాడు. ఆ ప్రభుడు తన భక్తుడైన చంద్రుని యెదుట ప్రత్యక్షమై ఇట్లు పలికాడు.

**శంకర ఉవాచ –** శంకరుడు పలికాడు.

**వరం వృణీష్వ భద్రం తే మనసా యత్సమీప్సితమ్ ।**
**ప్రసన్నోఽహం శశిన్సర్వం దాస్యే వరమనుత్తమమ్ ॥ 42 ॥**

ఓ చంద్రా! నీ మనసుకు నచ్చిన వరాన్ని కోరుకొమ్ము. నీకు మంగళమగు గాక! నేను ప్రసన్నుడనయ్యాను. నీవు కోరిన శ్రేష్ఠవరాలనన్నింటిని ఇస్తాను.

**చంద్ర ఉవాచ –** చంద్రుడు పలికాడు.

**యది ప్రసన్నో దేవేశ! కిమసాధ్యం భవేన్మమ ।**
**తథాపి మే శరీరస్య క్షయం వారయ శంకర! ॥ 43 ॥**

ఓ దేవదేవా! శంకరా! నీవు ప్రసన్నుడవైనచో, నాకు సాధ్యంకానిదేముంటుంది? అయినప్పటికి నా శరీరం–యొక్క క్షయరోగాన్ని నివారింపజేయుము.

**క్షంతవ్యో మేఽపరాధశ్చ కల్యాణం కురు సర్వదా ।**
**ఇత్యుక్తే చ తదా తేన శివో వచనమబ్రవీత్ ॥ 44 ॥**

నా అపరాధాన్ని మన్నించి, నాకు సర్వకాలములందునూ, మంగళాన్ని కలిగించుము. అతడిట్లు పలుకగా, శివుడిలా చెప్పాడు.

**శివ ఉవాచ –** శివుడు పలికాడు.

**పక్షే చ క్షీయతాం చంద్ర! కళా తే చ దినే దినే ।**
**పునశ్చ వర్ధతాం పక్షే సా కళా చ నిరంతరమ్ ॥ 45 ॥**

ఓ చంద్రా! నీ కళలు మాసంలోని మొదటి పక్షంలో దినానికొక్కటి చొప్పున తగ్గి, మరల రెండవ పక్షంలో ఆ కళలు పెరుగుతూ ఉంటాయి. ఇట్లు నిరంతరంగా జరుగుతుంది.

**సూత ఉవాచ –** సూతుడు చెప్పాడు.

**ఏవం సతి తదా దేవా హర్షనిర్భరమానసాః ।**
**ఋషయశ్చ తథా సర్వే సమాజగ్మూర్ద్రుతం ద్విజాః! ॥ 46 ॥**

ఓ బ్రాహ్మణులారా! ఈ విధంగా జరుగగా దేవతలందరూ ఆనందంతో నిండిన మనస్సుగల వారయ్యారు. అంతట ఋషులందరూ వెంటనే అచ్చటకు విచ్చేశారు.

**ఆగత్య చ తదా సర్వే చంద్రాయాశిషమబ్రువన్ ।**
**శివం నత్వా కరౌ బద్ధ్వా ప్రార్థయామాసురాదరాత్ ॥ 47 ॥**

వారందరూ అచ్చటకు వచ్చి చంద్రునకాశీస్సులు పలికి చేతులు జోడించి శివునకు నమస్కరించి ఆదరంతో ప్రార్థించారు.

**దేవా ఊచుః** – దేవతలు పలికారు.

**దేవదేవ! మహాదేవ! పరమేశ! నమోఽస్తు తే ।**
**ఉమయా సహితశ్శంభో! స్వామిన్నత్ర స్థిరో భవ ॥ 48 ॥**

ఓ దేవదేవా! మహాదేవా! పరమేశా! ఉమాపతీ! నీకు నమస్కారము. ఓ శంభూ! నీవు పార్వతితో గూడి ఇచ్చుట స్థిరముగా నుండుము.

**సూత ఉవాచ** – సూతుడు చెప్పాడు.

**తతశ్చంద్రేణ సద్భక్త్యా సంస్తుతశ్శంకరః పురా ।**
**నిరాకారశ్చ సాకారః పునశ్చైవాభవత్ప్రభుః ॥ 49 ॥**

అంతట చంద్రుడు ముందుగా సాకారుని, అనంతరం నిరాకారుని, పవిత్రభక్తితో చక్కగా స్తుతించాడు.

**ప్రసన్నశ్చ స దేవానాం క్షేత్రమాహాత్మ్యహేతవే ।**
**చంద్రస్య యశసే తత్ర నామ్నా చంద్రస్య శంకరః ॥ 50 ॥**

**సోమేశ్వరశ్చ నామాసీద్విఖ్యాతో భువనత్రయే ।**
**క్షయకుష్ఠాదిరోగాణాం నాశకః పూజనాద్ద్విజాః ॥ 51 ॥**

అప్పుడా శంకరప్రభువు దేవతలయందు ప్రసన్నుడై ఆ క్షేత్రానికి మహిమ కలిగించే ఉద్దేశ్యంతోను, చంద్రుని కీర్తిని విస్తరింపజేయుటకును, అచ్చట చంద్రుని పేరుతో వెలిశాడు. ఓ బ్రాహ్మణులారా! ఆయన ముల్లోకాలలో సోమేశ్వరుడని ప్రసిద్ధిగాంచి పూజించే వారికి క్షయ, కుష్ఠ మున్నగు రోగాలను పోగొడుతున్నాడు.

**ధన్యోఽయం కృతకృత్యోఽయం యన్నామ్నా శంకరస్స్వయమ్ ।**
**స్థితశ్చ జగతాం నాథః పావయన్ జగతీతలమ్ ॥ 52 ॥**

జగన్నాథుడైన శంకరుడు స్వయంగా ఎవరిపేరుతో వెలసి ముల్లోకాలను పావనం చేస్తున్నాడో అట్టి ఆ చంద్రుడు ధన్యుడు, కృతకృత్యుడు.

**తత్కుండం తైశ్చ తత్రైవ సర్వైర్దేవైః ప్రతిష్ఠితమ్ ।**
**శివేన బ్రహ్మణా తత్ర హ్యవిభక్తం తు తత్పునః ॥ 53 ॥**

దేవతలందరు కలసి అచ్చట చంద్రకుండాన్ని ప్రతిష్ఠించారు. శివుడు, బ్రహ్మ దానియందు విభేదం లేకుండా సమానంగా వెలసియున్నారు.

**చంద్రకుండం ప్రసిద్ధం చ పృథివ్యాం పాపనాశనమ్ ।**
**తత్ర స్నాతి నరో యస్సః సర్వైః పాపైః ప్రముచ్యతే ॥ 54 ॥**

భూమండలంలో ప్రసిద్ధిగాంచి పాపాలను పోగొట్టే ఈ చంద్రకుండంలో స్నానం చేయు మానవుడు పాపాలన్నింటినుండి విముక్తుడౌతాడు.

**రోగాస్సర్వే క్షయాద్యాశ్చ హ్యసాధ్యా యే భవంతి వై ।**
**తే సర్వే చ క్షయం యాంతి షణ్మాసం స్నానమాత్రతః ॥ 55 ॥**

దానియందారు మాసాలు స్నానం చేస్తే క్షయ మున్నగు మొండి వ్యాధులన్నీ నశిస్తాయి.

**ప్రభాసం చ పరిక్రమ్య పృథివీక్రమసంభవమ్ ।**
**ఫలం ప్రాప్నోతి శుద్ధాత్మా మృతః స్వర్గే మహీయతే ॥ 56 ॥**

పరిశుద్ధమైన అంతఃకరణంతో ప్రభాసక్షేత్రాన్ని చుట్టి వచ్చిన మానవుడు భూప్రదక్షిణఫలాన్ని పొంది మరణానంతరం స్వర్గాన్ని పొందగలడు.

**సోమలింగం నరో దృష్ట్వా సర్వపాపాత్ప్రముచ్యతే ।**
**లబ్ధ్వా ఫలం మనోఽభీష్టం మృతస్స్వర్గం సమీహతే ॥ 57 ॥**

సోమలింగాన్ని దర్శించిన మానవుడు సర్వపాపాలనుండి విముక్తుడై మనోభీష్టఫలాలు పొంది మరణానంతరం స్వర్గాన్ని పొందుతాడు.

**యద్యత్ఫలం సముద్దిశ్య కురుతే తీర్థముత్తమమ్ ।**
**తత్తత్ఫలమవాప్నోతి సర్వథా నాత్ర సంశయః ॥ 58 ॥**

మానవుడే యే ఫలాలను కోరి ఈ ఉత్తమతీర్థాన్ని దర్శిస్తాడో, ఆయా ఫలాలు పొందుతాడనడంలో సందేహం లేదు.

**ఇతి తే ఋషయో దేవాః ఫలం దృష్ట్వా తథావిధమ్ ।**
**ముదా శివం నమస్కృత్య గృహీత్వా చంద్రమక్షయమ్ ॥ 59 ॥**

**పరిక్రమ్య చ తత్తీర్థం ప్రశంసంతశ్చ తే యయుః ।**
**చంద్రశ్చాపి స్వకీయం చ కార్యం చక్రే పురాతనమ్ ॥ 60 ॥**

ఆ విధంగా ఫలమిచ్చే మహిమను గాంచి, దేవతలు, ఋషులు ఆనందంతో శివునకు నమస్కరించి క్షయరోగవిముక్తుడైన చంద్రుని తోడ్కొని ఆ తీర్థానికి ప్రదక్షిణ చేసి దానిని కొనియాడుతూ వెళ్లారు. చంద్రుడు కూడ పూర్వం తాను చేయవలసిన కర్తవ్యాన్ని మొదలుపెట్టాడు.

**ఇతి సర్వః సమాఖ్యాతః సోమేశస్య సముద్భవః ।**
**ఏవం సోమేశ్వరం లింగం సముత్పన్నం మునీశ్వరాః! ॥ 61 ॥**

మహర్షులారా! ఈ విధంగా సోమేశ్వరలింగం ఆవిర్భవించిన వృత్తాంతమంతటినీ చెప్పియున్నాను.

**యః శృణోతి తదుత్పత్తిం శ్రావయేద్వా పరాన్నరః ।**
**సర్వాన్కామానవాప్నోతి సర్వపాపైః ప్రముచ్యతే ॥ 62 ॥**

ఏ మానవుడు దాని ఆవిర్భావాన్ని గూర్చి వింటాడో, ఇతరులకు వినిపిస్తాడో అట్టివాడు కోర్కెలన్నింటినీ పొంది సర్వపాపాలనుండి విముక్తుడౌతాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం సోమనాథజ్యోతిర్లింగోత్పత్తివర్ణనం నామ చతుర్దశోఽధ్యాయః ॥ 14 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు సోమనాథజ్యోతిర్లింగోత్పత్తివర్ణనం అనే పేరుగల పద్నాల్గవ అధ్యాయం సమాప్తం.

## పంచదశోఽధ్యాయః – పదిహేనవ అధ్యాయం

## మల్లికార్జునద్వితీయజ్యోతిర్లింగవర్ణనమ్ – మల్లికార్జునద్వితీయజ్యోతిర్లింగవర్ణనం

**సూత ఉవాచ** – సూతుడు చెప్పాడు.

**అతః పరం ప్రవక్ష్యామి మల్లికార్జునసంభవమ్ ।**
**యః శ్రుత్వా భక్తిమాన్ ధీమాన్ సర్వపాపైః ప్రముచ్యతే ॥ 1 ॥**

ఇకపై మల్లికార్జునుని ప్రాదుర్భావాన్ని గూర్చి చెబుతాను. భక్తిమంతుడు, బుద్ధిమంతుడునైన మానవుడు దీనిని విని సర్వపాపాలనుండి విముక్తిని పొందుతాడు.

**పూర్వం చ కథితం యచ్చ తత్పునః కథయామ్యహమ్ ।**
**కుమారచరితం దివ్యం సర్వపాపవినాశనమ్ ॥ 2 ॥**

సర్వపాపాలను పోగొట్టే దివ్యమైన కుమారస్వామివృత్తాంతం నేను పూర్వం చెప్పియున్నాను. దానిని మరల ఇప్పుడు చెబుతున్నాను.

**యదా పృథ్వీం సమాక్రమ్య కైలాసం పునరాగతః ।**
**కుమారస్స శివాపుత్రస్తారకారిర్మహాబలః ॥ 3 ॥**

తారకాసురసంహారకుడు, మహాబలశాలి, పార్వతీపుత్రుడునగు కుమారస్వామి భూమికి ప్రదక్షిణం చేసి కైలాసానికి తిరిగివచ్చాడు.

**తదా సురర్షిరాగత్య సర్వం వృత్తం జగాద హ ।**
**గణేశ్వరవివాహాది భ్రామయంస్తం స్వబుద్ధితః ॥ 4 ॥**

అప్పుడు దేవర్షియైన నారదుడు వచ్చి గణేశ్వరుని వివాహం మున్నగు వృత్తాంతమునంతటినీ అతనికి చెప్పి అతని బుద్ధిని భ్రమింపజేశాడు.

**తచ్ఛ్రుత్వా స కుమారో హి ప్రణమ్య పితరౌ చ తౌ ।**
**జగామ పర్వతం క్రౌంచం పితృభ్యాం వారితోఽపి హి ॥ 5 ॥**

దానిని విని తల్లిదండ్రులు వారించిననూ వినకుండగా కుమారస్వామి వారికి నమస్కరించి క్రౌంచపర్వతానికి వెళ్లాడు.

**కుమారస్య వియోగేన తన్మాతా గిరిజా యదా ।**
**దుఃఖితాసీత్తదా శంభుస్తామువాచ సుబోధకృత్ ॥ 6 ॥**

కుమారస్వామివియోగంచే అతని తల్లియైన పార్వతి దుఃఖితురాలయ్యింది. అపుడు చక్కని బోధను చేసే శంభుడామెతో ఇట్లన్నాడు.

**కథం ప్రియే! దుఃఖితాసి న దుఃఖం కురు పార్వతి! ।**
**ఆయాస్యతి సుతః సుభ్రూస్త్యజ్యతాం దుఃఖముత్కటమ్ ॥ 7 ॥**

ఓ ప్రియురాలా! ఓ పార్వతీ! ఎందులకు దుఃఖిస్తున్నావు? దుఃఖింపకుము. ఓ సుందరీ! కుమారుడు రాగలడు. తీవ్రమైన దుఃఖాన్ని విడనాడుము.

**సా యదా చ న తన్మేనే పార్వతీ దుఃఖితా భృశమ్ ।**
**తదా చ ప్రేషితాస్తత్ర శంకరేణ సురర్షయః ॥ 8 ॥**

మిక్కిలి దుఃఖితురాలైయున్న పార్వతి ఆ మాటలనంగీకరించలేదు. అంతట శంకరుడు దేవతలను, ఋషులను అచ్చటకు పంపాడు.

**దేవాశ్చ ఋషయస్సర్వే సగణా హి ముదాన్వితాః ।**
**కుమారానయనార్థం వై తత్ర జగ్ముః సుబుద్ధయః ॥ 9 ॥**

గొప్ప బుద్ధిశాలురైన దేవతలు, ఋషులు అందరు ఆనందంతో కూడినవారై తమ గణాలతో గూడి కుమారస్వామిని తోడ్కొని రావడానికచ్చటకు వెళ్లారు.

**తత్ర గత్వా చ తే సర్వే కుమారం సుప్రణమ్య చ ।**
**విజ్ఞాప్య బహుధాప్యేనం ప్రార్థనాం చక్రురాదరాత్ ॥ 10 ॥**

వారందరు అచ్చటకు వెళ్లి కుమారస్వామికి నమస్కరించి ఆదరంతో ప్రార్థించి పరిపరివిధాల విన్నవించారు.

**దేవాదిప్రార్థనాం తాం చ శివాజ్ఞాసంకులాం గురుః ।**
**న మేనే స కుమారో హి మహాహంకారవిహ్వలః ॥ 11 ॥**

గొప్పవాడు, మహాహంకారంతో కూడిన కుమారస్వామి శివుని ఆజ్ఞతో కూడుకొనియున్న దేవప్రార్థనను మన్నించలేదు.

**తతశ్చ పునరావృత్య సర్వే తే హి శివాంతికమ్ ।**
**స్వం స్వం స్థానం గతా నత్వా ప్రాప్య శంకరశాసనమ్ ॥ 12 ॥**

అంతట వారందరు శివుని వద్దకు తిరిగివచ్చి నమస్కరించి ఆయన అనుజ్ఞ పొంది తమ తమ స్థానాలకు వెళ్లారు.

**తదా చ గిరిజా దేవీ విరహం పుత్రసంభవమ్ ।**
**శంభుశ్చ పరమం దుఃఖం ప్రాప తస్మిన్ననాగతే ॥ 13 ॥**

అప్పుడు పార్వతీదేవి పుత్రవిరహంచే దుఃఖించింది. కుమారస్వామి తిరిగిరాని కారణంచే శివుడు కూడ మహాదుఃఖాన్ని పొందాడు.

**అథో సుదుఃఖితౌ దీనౌ లోకాచారకరౌ తదా ।**
**జగ్మతుస్తత్ర సుస్నేహాత్స్వపుత్రో యత్ర చంస్థితః ॥ 14 ॥**

అపుడు లోకాచారాన్ని పాటించే వారిద్దరూ మహాదుఃఖాన్ని పొంది దృఢమైన పుత్రప్రేమచే దీనులై తమ పుత్రుడున్న చోటికి వెళ్లారు.

**స పుత్రశ్చ కుమారాఖ్యః పిత్రోరాగమనం గిరేః ।**
**జ్ఞాత్వా దూరం గతోఽస్నేహాద్యోజనత్రయమేవ చ ॥ 15 ॥**

పార్వతీపరమేశ్వరుల పుత్రుడైన కుమారస్వామి, తన తల్లిదండ్రులు ఆ పర్వతానికి వచ్చారని తెలిసి కోపంతో మూడు యోజనాల దూరానికి వెళ్లిపోయాడు.

**క్రౌంచే చ  పర్వతే దూరం గతే తస్మిన్స్వపుత్రకే ।**
**తౌ చ తత్ర సమాసీనౌ జ్యోతీరూపం సమాశ్రితౌ ॥ 16 ॥**

తమ పుత్రుడు దూరంగా వెళ్లిపోగానే వారిద్దరూ జ్యోతీరూపాన్ని దాల్చి ఆ క్రౌంచపర్వతమునందే నిలిచియున్నారు.

**పుత్రస్నేహాతురౌ తౌ వై శివౌ పర్వణి పర్వణి ।**
**దర్శనార్థం కుమారస్య స్వపుత్రస్య హి గచ్ఛతః ॥ 17 ॥**

పుత్రునియందలి ప్రేమచే దుఃఖితులైన పార్వతీపరమేశ్వరులు ప్రతి పక్షంలోను తమ పుత్రుడైన కుమారస్వామిని చూడడానికి వెళ్తున్నారు.

**అమావాస్యాదినే శంభు స్స్వయం గచ్ఛతి తత్ర హ ।**
**పౌర్ణమాసీదినే తత్ర పార్వతీ గచ్ఛతి ధ్రువమ్ ॥ 18 ॥**

ఆ శంభుడు అమావాస్యనాడు స్వయంగా వెళ్తాడు. పార్వతి అచ్చటకు పూర్ణిమనాడు తప్పనిసరిగా వెళ్తూ ఉంటుంది.

**తద్దినం హి సమారభ్య మల్లికార్జునసంభవమ్ ।**
**లింగం చైవ శివస్యైకం ప్రసిద్ధం భువనత్రయే ॥ 19 ॥**

ఆనాటి నుండి మల్లికార్జునశివలింగం అచ్చట వెలసి ముల్లోకాలలో ప్రసిద్ధిగాంచింది.

**తల్లింగం యః సమీక్షేత స సర్వైః కిల్బిషైరపి ।**
**ముచ్యతే నాత్ర సందేహః సర్వాన్కామానవాప్నుయాత్ ॥ 20 ॥**

ఆ లింగాన్ని దర్శించే మానవుడు సర్వపాపాలనుండి విముక్తిని పొంది కోర్కెలనన్నింటిని పొందుతాడనంలో సందేహం లేదు.

**దుఃఖం చ దూరతో యాతి సుఖమాత్యంతికం లభేత్ ।**
**జననీగర్భసంభూతం కష్టం నాప్నోతి వై పునః ॥ 21 ॥**

అట్టివాని దుఃఖం దూరంగా తొలగిపోతుంది. అతడు పరమసుఖాన్ని పొంది (మోక్షాన్ని పొంది), మరల జననీగర్భంలో పుట్టవలసిన కష్టానికి గురికాదు.

**ధనధాన్యసమృద్ధిశ్చ ప్రతిష్ఠాఽఽరోగ్యమేవ చ ।**
**అభీష్టఫలసిద్ధిశ్చ జాయతే నాత్ర సంశయః ॥ 22 ॥**

అతనికి ధనధాన్యసమృద్ధి, కీర్తి, ఆరోగ్యం, అభీష్టఫలసిద్ధి కలుగుతాయనడంలో సందేహం లేదు.

**జ్యోతిర్లింగం ద్వితీయం చ ప్రోక్తం మల్లికసంజ్ఞితమ్ ।**
**దర్శనాత్సర్వసుఖదం కథితం లోకహేతవే ॥ 23 ॥**

దర్శించేవారికి సమస్త సుఖాలనొసగే మల్లికార్జునుడను పేరుగల రెండవ జ్యోతిర్లింగాన్ని గురించి మానవకల్యాణం కొరకు చెప్పియున్నాను.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం మల్లికార్జునద్వితీయజ్యోతిర్లింగవర్ణనం నామ పంచదశోఽధ్యాయః ॥ 15 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు మల్లికార్జునద్వితీయజ్యోతిర్లింగవర్ణనం అనే పేరుగల పదిహేనవ అధ్యాయం సమాప్తం.

## షోడశోఽధ్యాయః - పదహారవ అధ్యాయం

## మహాకాలజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనమ్ - మహాకాలేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం

**ఋషయ! ఊచుః** - ఋషులు పలికారు.

**సూత! సర్వం విజానాసి వస్తు వ్యాసప్రసాదతః ।**
**జ్యోతిషాం చ కథాం శ్రుత్వా తృప్తిర్నైవ ప్రజాయతే ॥ 1 ॥**

ఓ సూతా! వ్యాసుని అనుగ్రహంచే నీకు విషయాలన్నియూ తెలియును. జ్యోతిర్లింగాల కథ వింటున్న మాకు తృప్తి కలగడం లేదు.

**తస్మాత్త్వం హి విశేషేణ కృపాం కృత్వాఽతులాం ప్రభో! ।**
**జ్యోతిర్లింగం తృతీయం చ కథయ త్వం హి నోఽధునా ॥ 2 ॥**

ఓ ప్రభూ! కాబట్టి నీవు సాటిలేని దయ మాపై చూపి మాకిప్పుడు మూడవ జ్యోతిర్లింగాన్ని గురించి వివరించి చెప్పండి.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ధన్యోఽహం కృతకృత్యోఽహం శ్రీమతాం భవతాం యది ।**
**గతశ్చ సంగమం విప్రాః ధన్యా వై సాధుసంగతిః ॥ 3 ॥**

ఓ విప్రులారా! వేదవిదులైన మీతో కలవడం వలన నేను ధన్యుడను, కృతార్థుడను అయినాను. సాధుసమాగమం పుణ్యప్రదమైనది గదా!

**అతో మత్వా స్వభాగ్యం హి కథయిష్యామి పావనీమ్ ।**
**పాపప్రణాశినీం దివ్యాం కథాం చ శ్రుణుతాదరాత్ ॥ 4 ॥**

కాబట్టి ఇది నా భాగ్యమని భావించి పావనమైనదియు, పాపనాశనమైనదియునగు దివ్యగాథను చెబుతాను, ఆదరంతో వినండి.

**అవంతీ నగరీ రమ్యా ముక్తిదా సర్వదేహినామ్ ।**
**శివప్రియా మహాపుణ్యా వర్తతే లోకపావనీ ॥ 5 ॥**

సుందరమైనదియు, సర్వప్రాణులకు మోక్షాన్నిచ్చేదియు, శివునకు ప్రియమైనదియు, పరమపవిత్రమైనదియు, జనులకు శుద్ధిని కలిగించేదియునగు అవంతీనగరం కలదు.

**తత్రాసీద్బ్రాహ్మణశ్రేష్ఠశ్శుభకర్మపరాయణః ।**
**వేదాధ్యయనకర్తా చ వేదకర్మరతస్సదా ॥ 6 ॥**

**అగ్న్యాధానసమాయుక్తశ్శివపూజారతస్సదా ।**
**పార్థివీం ప్రత్యహం మూర్తిం పూజయామాస వై ద్విజః ॥ 7 ॥**

అక్కడ శుభకర్మపరాయణుడు, వేదాధ్యయనం చేసేవాడు, వేదవిహితకర్మాచరణరతుడు, నిత్యాగ్నిహోత్రుడు, సదా శివపూజారతుడునగు బ్రాహ్మణశ్రేష్ఠుడున్నాడు. ఆ బ్రాహ్మణుడు ప్రతినిత్యం శివుని పార్థివమూర్తిని పూజించేవాడు.

**సర్వకర్మఫలం ప్రాప్య ద్విజో వేదప్రియస్సదా ।**
**సతాం గతిం సమాలేభే సమ్యగ్జ్ఞానపరాయణః ॥ 8 ॥**

వేదమునందభిరుచి గలవాడు, సుజ్ఞానతత్పరుడునగు ఆ బ్రాహ్మణుడు తానాచరించిన సర్వకర్మఫలంగా సత్పురుషులు పొందే గతి పొందాడు.

**తత్పుత్రాస్తాదృశాశ్చాసంశ్చత్వారో మునిసత్తమాః! ।**
**శివపూజారతా నిత్యం పిత్రోరనవమాస్సదా ॥ 9 ॥**

ఓ మహర్షులారా! ఆయనకు తనతో సమానమైనవారు, తల్లిదండ్రులకు తీసిపోనివారు, శివపూజారతులునగు నలుగురు కుమారులున్నారు. (అవమాః = అధమాః, నిన్దితాః న అవమాః అనవమాః ।)

**దేవప్రియశ్చ తజ్జ్యేష్ఠః ప్రియమేధాస్తతః పరమ్ ।**
**తృతీయస్సుకృతో నామ ధర్మవాహీ చ సువ్రతః ॥ 10 ॥**

పెద్ద కుమారునకు దేవప్రియుడని పేరు. తరువాతి వాడు ప్రియమేధసుడు. మూడవవాడు సుకృతుడు. చక్కని ధర్మనిష్ఠలు గల నాల్గవవాని పేరు ధర్మవాహి.

**తేషాం పుణ్యప్రతాపాచ్చ పృథివ్యాం సుఖమైధత ।**
**శుక్లపక్షే యథా చంద్రో వర్ధతే చ నిరంతరమ్ ॥ 11 ॥**

వారి పుణ్యప్రభావంవల్ల భూమండలంలో సుఖం వర్ధిల్లింది. సుఖకరమైన వారి గుణాలు శుక్లపక్షచంద్రుని వలె దినదినప్రవర్ధమానమయ్యాయి.

**తథా తేషాం గుణాస్తత్ర వర్ధంతే స్మ సుఖావహాః ।**
**బ్రహ్మతేజోమయీ సా వై నగరీ చాభవత్తదా ॥ 12 ॥**

ఆ విధంగా సుఖావహమైన వారి గుణాలు ప్రవర్ధమానమగుటచే ఆ నగరం బ్రహ్మతేజస్సుతో ప్రకాశించేది.

**ఏతస్మిన్నంతరే తత్ర యజ్జాతం వృత్తముత్తమమ్ ।**
**శ్రూయతాం తద్ద్విజశ్రేష్ఠాః! కథయామి యథాశ్రుతమ్ ॥ 13 ॥**

ఓ బ్రాహ్మణోత్తములారా! ఇంతలో అక్కడ జరిగిన వృత్తాంతాన్ని నేను విన్నంతవరకు మీకు చెబుతాను దానిని వినండి.

**పర్వతే రత్నమాలే చ దూషణాఖ్యో మహాసురః ।**
**బలవాన్దైత్యరాజశ్చ ధర్మద్వేషీ నిరంతరమ్ ॥ 14 ॥**

రత్నమాలపర్వతంలో బలవంతుడు, నిరంతరం ధర్మాన్ని ద్వేషించేవాడు, రాక్షస చక్రవర్తియునగు దూషణాసురుడున్నాడు.

**బ్రహ్మణో వరదానాచ్చ జగత్తుచ్ఛీచకార హ ।**
**దేవాః పరాజితాస్తేన స్థానాన్నిస్సారితాస్తథా ॥ 15 ॥**

వాడు బ్రహ్మవరప్రభావంవల్ల జగత్తును అత్యల్పంగా భావించి దేవతలను జయించి వారిని వారి వారి స్థానాల నుండి వెళ్లగొట్టాడు.

**పృథివ్యాం వేదధర్మాశ్చ స్మృతిధర్మాశ్చ సర్వశః ।**
**స్ఫోటితాస్తేన దుష్టేన సింహేనేవ శశాః ఖలు ॥ 16 ॥**

దుష్టుడైన ఆ రాక్షసుడు భూమండలమునందంతటా వేదోక్తధర్మాలను, స్మృతివిహితధర్మాలను, కుందేళ్లను సింహం నాశనం చేసినట్లుగా అన్ని విధాలుగా నాశనం చేశాడు.

**యావంతో వేదధర్మాశ్చ తావంతో దూరతః కృతాః ।**
**తీర్థే తీర్థే తథా క్షేత్రే ధర్మో నీతశ్చ దూరతః ॥ 17 ॥**

ఎన్ని విధాలైన వేదధర్మాలున్నాయో వాటినన్నింటిని వాడు నాశనం చేశాడు. సర్వతీర్థాలలోను, సర్వక్షేత్రాలలోను ధర్మము దూరమయ్యేలాగ, లోపించేలాగ చేశాడు.

**అవంతీ నగరీ రమ్యా తత్రైకా దృశ్యతే పునః ।**
**ఇత్థం విచార్య తేనైవ యత్కృతం శ్రూయతాం హి తత్ ॥ 18 ॥**

కాని భూమండలానికంతటికి అవంతీనగరం మాత్రమే అందంగా ఉండటాన్ని గాంచి, వాడాలోచించి చేసిన పనిని గూర్చి చెబుతాను వినండి.

**బహుసైన్యసమాయుక్తో దూషణస్స మహాసురః ।**
**తత్రస్థాన్బ్రాహ్మణాన్సర్వానుద్దిశ్య సముపాయయౌ ॥ 19 ॥**

ఆ దూషణాసురుడు పెద్దసైన్యాన్ని తీసుకొని ఆ నగరంలోని బ్రాహ్మణులందరికీ హాని చేయడానికి బయలుదేరాడు.

**తత్రాగత్య స దైత్యేంద్రశ్చతురో దైత్యసత్తమాన్ ।**
**ప్రోవాచాహూయ వచనం విప్రద్రోహీ మహాఖలః ॥ 20 ॥**

బ్రాహ్మణద్రోహి, పరమదుష్టుడును అగు ఆ రాక్షసరాజు నలుగురు రాక్షస వీరులతో ఇలా పలికాడు.

**దైత్య ఉవాచ –** దైత్యుడు చెప్పాడు.

**కిమేతే బ్రాహ్మణా దుష్టా న కుర్వంతి వచో మమ ।**
**వేదధర్మరతా ఏతే సర్వే దండ్యా మతే మమ ॥ 21 ॥**

దుష్టులైన బ్రాహ్మణులు నా మాట వినక పోవడానికి కారణమేమిటి? వేదధర్మరతులైన వీరందరు దండనార్హులని నా అభిప్రాయం.

**సర్వే దేవా మయా లోకే రాజానశ్చ పరాజితాః ।**
**వశే కిం బ్రాహ్మణాశ్శక్యా న కర్తుం దైత్యసత్తమాః ॥ 22 ॥**

ఓ రాక్షసశ్రేష్ఠులారా! లోకంలోని సమస్త దేవతలను, రాజులను పరాజితులను చేశాను. ఈ బ్రాహ్మణులను వశం చేసుకోవడం సంభవం కాదా యేమి?

**యది జీవితుమిచ్ఛా స్యాత్తదా ధర్మం శివస్య చ ।**
**వేదానాం పరమం ధర్మం త్యక్త్వా సుఖసుభాగినః ॥ 23 ॥**

వీరికి ప్రాణాలపై తీపియుంటే, బ్రతకాలని ఆశ ఉంటే శివధర్మాన్ని, వేదవిహిత పరమధర్మాన్ని పరిత్యజించి సుఖాలనుభవిస్తారు.

**అన్యథా జీవనే తేషాం సంశయశ్చ భవిష్యతి ।**
**ఇతి సత్యం మయా ప్రోక్తం తత్కురుధ్వం విశంకితాః ॥ 24 ॥**

అట్లు కానిచో వారి ప్రాణాలకు ముప్పు తప్పదు. ఇది సత్యం. నేను నిజాన్నే చెబుతున్నాను. కాబట్టి మీరు ఏ విధమైన సందేహములేకుండ అట్లే చేయండి.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఇతి నిశ్చిత్య తే దైత్యాశ్చత్వారః పావకా ఇవ ।**
**చతుర్దిక్షు తదా జాతాః ప్రళయే చ యథా పురా ॥ 25 ॥**

ఆ నలుగురు రాక్షసులు ఆ విధంగా నిశ్చయించి ప్రళయాగ్ని వలె వారు నాల్గు దిక్కులందు ముట్టడించారు.

**తే బ్రాహ్మణాస్తథా శ్రుత్వా దైత్యానాముద్యమం తదా ।**
**న దుఃఖం లేభిరే తత్ర శివధ్యానపరాయణాః ॥ 26 ॥**

అప్పుడా బ్రాహ్మణులు శివధ్యానపరాయణులైనందున ఆ రాక్షసుల ప్రయత్నాలను గూర్చి వినినను వారే- విధమైన దుఃఖాన్ని పొందలేదు.

**ధైర్యం సమాశ్రితాస్తే చ రేఖామాత్రం తదా ద్విజాః ।**
**న చేలుః పరమధ్యానాద్వరాకాః కే శివాగ్రతః ॥ 27 ॥**

ఆ బ్రాహ్మణులు ధైర్యాన్ని పూని పరమేశ్వరధ్యానంనుండి ఏ కొంచెమైననూ చలింపక నిశ్చలంగా నున్నారు. శివసన్నిధిలో నున్న వారికి దైన్యమెక్కడుంటుంది?

**ఏతస్మిన్నంతరే తైస్తు వ్యాప్తాసీన్నగరీ శుభా ।**
**లోకాశ్చ పీడితాస్తైస్తు బ్రాహ్మణాస్సముపాయయుః ॥ 28 ॥**

ఇంతలో ఆ రాక్షసులు ఆ శుభనగరాన్ని ఆక్రమించి ప్రజలను పీడించడం ప్రారంభించారు. అప్పుడా జనులందరు బ్రాహ్మణుల చెంతకు వచ్చారు.

**లోకా ఊచుః –** లోకులు పలికారు.

**స్వామినః! కిం చ కర్తవ్యం దుష్టాశ్చ సముపాగతాః ।**
**హింసితా బహవో లోకా ఆగతాశ్చ సమీపతః ॥ 29 ॥**

ఓ స్వాములారా! దుష్టులైన రాక్షసులు మా దగ్గరకు వచ్చి చాలామంది జనులను హింసిస్తున్నారు. ఇప్పుడు మేమేమి చేయాలి?

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**తేషామితి వచశ్రుత్వా వేదప్రియసుతాశ్చ తే ।**
**సమూచుర్బ్రాహ్మణాస్తాన్వై విశ్వస్తాశ్శంకరే సదా ॥ 30 ॥**

వేదప్రియుని కుమారులైన ఆ బ్రాహ్మణులు సర్వదా శంకరునియందు విశ్వాసం గలవారై వారి మాటలు విని వారితో ఇలా పలికారు.

**బ్రాహ్మణా ఊచుః –** బ్రాహ్మణులు పలికారు.

**శ్రూయతాం విద్యతే నైవ బలం దుష్టభయావహమ్ ।**
**న శస్త్రాణి తథా సంతి యచ్చ తే విముఖాః పునః ॥ 31 ॥**

మీరందరూ వినండి. ఈ దుష్టులను తరిమివేయగల సైన్యం గాని, భయపెట్టగల ఆయుధాలు గాని మన వద్ద లేవు.

**సామాన్యస్యాపమానో నో హ్యాశ్రయస్య భవేదిహ ।**
**పునశ్చ కిం సమర్థస్య శివస్యేహ భవిష్యతి ॥ 32 ॥**

సామాన్యజనునకు జరిగే అవమానం అతనికి గాక అతడాశ్రయించిన వానికి కలుగుతుంది. కాని సమర్థుడైన శివునకిచ్చుట ఎటువంటి హాని కలుగుతుంది?

**శివో రక్షాం కరోత్వద్యాసురాణాం భయతః ప్రభుః ।**
**నాన్యథా శరణం లోకే భక్తవత్సలతశ్శివాత్ ॥ 33 ॥**

ఈనాడు రాక్షసభయంనుండి మనలను శివప్రభునే రక్షిస్తాడు. లోకంలో భక్తవత్సలుడైన శివునికంటె భిన్నంగా మరొక శరణం లేదు.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు

**ఇతి ధైర్యం సమాస్థాయ సమర్చాం పార్థివస్య చ ।**
**కృత్వా తే చ ద్విజాః సమ్యక్ స్థితా ధ్యానపరాయణాః ॥**

**దృష్ట్వా దైత్యేన తావచ్చ తే విప్రాస్సబలేన హి ॥ 34 ॥**

ఆ బ్రాహ్మణులీవిధంగా ధైర్యాన్ని చెప్పి పార్థివలింగాన్ని పూజించి స్థిరంగా ధ్యానపరాయణులయ్యారు. అప్పుడు సైన్యంతో కూడియున్న దూషణాసురుడు ఆ బ్రాహ్మణులను చూశాడు.

**దూషణేన వచః ప్రోక్తం హన్యతాం వధ్యతామితి ।**
**తచ్ఛ్రుతం తైస్తదా నైవ దైత్యప్రోక్తం వచో ద్విజైః ॥**
**వేదప్రియసుతైశ్శంభోర్ధ్యానమార్గపరాయణైః ॥ 35 ॥**

అట్లు చూచిన దూషణాసురుడు వీరిని చంపండి, వధించండి అని దూషణ వాక్యాలు పలికాడు. వేదప్రియుని కుమారులైన ఆ బ్రాహ్మణులు ధ్యానమార్గంలో శంభుని ధ్యానం చేస్తున్నందువల్ల వారు ఆ రాక్షసుల పలుకులు వినసే లేదు.

**అథ యావత్స దుష్టాత్మా హంతుమైచ్ఛద్ ద్విజాంశ్చ తాన్ ।**
**తావచ్చ పార్థివస్థానే గర్త ఆసీత్సశబ్దకః ॥ 36 ॥**

ఇంతలో ఆ దుష్టాత్ముడు బ్రాహ్మణులను చంపడానికుద్యమించగా, పార్థివలింగం స్థానంలో పెద్దశబ్దంతో పెద్ద గోయి ఏర్పడింది.

**గర్తాత్తతస్సముత్పన్నః శివో వికటరూపధృక్ ।**
**మహాకాల ఇతి ఖ్యాతో దుష్టహంతా సతాం గతిః ॥ 37 ॥**

శిష్టరక్షకుడు, దుష్టశిక్షకుడునైన శివుడు మహాకాలుడని ప్రసిద్ధిగాంచిన భయంకర రూపం దాల్చి ఆ గోతి-నుండి ఆవిర్భవించాడు.

**మహాకాలస్సముత్పన్నో దుష్టానాం త్వాదృశామహమ్ ।**
**ఖల! త్వం బ్రాహ్మణానాం హి సమీపాద్దూరతో వ్రజ ॥ 38 ॥**

"ఓరీ దుష్టా! నీవంటి దుష్టుల పాలిట భయంకరమృత్యువైన నేనావిర్భవించాను. నీవా బ్రాహ్మణులనుండి దూరంగా పొమ్ము".

**ఇత్యుక్త్వా హుంకృతేనైవ భస్మసాత్కృతవాంస్తదా ।**
**దూషణం చ మహాకాలః శంకరస్సబలం ద్రుతమ్ ॥ 39 ॥**

అని పలికి ఆ మహాకాలేశ్వరుడు హుంకారంతోనే ఆ దూషణుని, వాని సైన్యాన్ని భస్మం చేశాడు.

**కియత్సైన్యం హతం తేన కించిత్సైన్యం పలాయితమ్ ।**
**దూషణశ్చ హతస్తేన శివేనేహ పరాత్మనా ॥ 40 ॥**

శివుడు కొంత సైన్యాన్ని సంహరించగా, మరికొంత సైన్యం పారిపోయింది. అంతట శివపరమాత్మ దూషణాసూరుని కూడా సంహరించాడు.

**సూర్యం దృష్ట్వా యథా యాతి సంక్షయం సర్వశస్తమః ।**
**తథైవ చ శివం దృష్ట్వా తత్సైన్యం వినినాశ హ ॥ 41 ॥**

అంతటా వ్యాపించిన చీకటి సూర్యుని చూచిన వెంటనే ఏ విధంగా తొలగిపోతుందో అదే విధంగా శివుని గాంచిన సైన్యం కూడ నశించింది.

**దేవదుందుభయో నేదుః పుష్పవృష్టిః పపాత హ ।**
**దేవాస్సమాయయుస్సర్వే హరిబ్రహ్మాదయస్తథా ॥ 42 ॥**

అంతట దేవదుందుభులు మ్రోగాయి. పుష్పవర్షం కురిసింది. హరి – బ్రహ్మాదులతో కూడిన దేవతలందరు విచ్చేశారు.

**భక్త్యా ప్రణమ్య తం దేవం శంకరం లోకశంకరమ్ ।**
**తుష్టువుర్వివిధైః స్తోత్రైః కృతాంజలిపుటా ద్విజాః ॥ 43 ॥**

ఆ బ్రాహ్మణులు చేతులు జోడించి ప్రణమిల్లి లోకశంకరుడైన శంకరదేవుని వివిధ స్తోత్రాలతో భక్తిపూర్వకంగా స్తుతించారు.

**బ్రాహ్మణాంశ్చ సమాశ్వాస్య సుప్రసన్నశ్శివస్స్వయమ్ ।**
**వరం బ్రూతేతి చోవాచ మహాకాలో మహేశ్వరః ॥ 44 ॥**

మహాకాలేశ్వరరూపంలోనున్న శివుడు స్వయంగా బ్రాహ్మణులనోదార్చి ధైర్యాన్ని చెప్పి వరాన్ని కోరుకొమ్మని పలికాడు.

**తచ్ఛ్రుత్వా తే ద్విజాస్సర్వే కృతాంజలిపుటాస్తదా ।**
**సుప్రణమ్య శివం భక్త్యా ప్రోచుస్సన్నతమస్తకాః ॥ 45 ॥**

ఆ మాటలు విని బ్రాహ్మణులందరు చేతులు జోడించి భక్తితో నమస్కరించి తలలువంచి శివునితో ఇలా పలికారు.

**ద్విజా ఊచుః –** ద్విజులు పలికారు

**మహాకాల! మహాదేవ! దుష్టదండకర! ప్రభో! ।**
**ముక్తిం ప్రయచ్ఛ నశ్శంభో! సంసారాంబుధితశ్శివ! ॥ 46 ॥**

ఓ మహాకాలేశ్వరా! మహాదేవా! దుష్టులను దండించే ప్రభూ! హే శంభో! శివా! మాకు సంసారసముద్రం–నుండి ముక్తిని ప్రసాదించండి.

**అత్రైవ లోకరక్షార్థం స్థాతవ్యం హి త్వయా శివ! ।**
**స్వదర్శకాన్ నరాంచ్ఛంభో! తారయ త్వం సదా ప్రభో! ॥ 47 ॥**

ఓ శివా! శంభూ! ప్రభూ! లోకరక్షణార్థం మీరిక్కడే స్థిరంగా నుండి మిమ్ము దర్శించే మానవులను ఎల్లప్పుడూ తరింపజేయండి.

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**ఇత్యుక్తస్తైశ్శివస్తత్ర తస్థౌ గర్తే సుశోభనే ।**
**భక్తానాం చైవ రక్షార్థం దత్త్వా తేభ్యశ్చ సద్గతిమ్ ॥ 48 ॥**

వారిట్లు పలుకగా శివుడు వారి కుత్తమగతిని కలిగించి భక్తులను రక్షించడానికి పరమ సుందరమైన ఆ బిలమునందే స్థిరంగా ఉండిపోయాడు.

**ద్విజాస్తే ముక్తిమాపన్నాశ్చతుర్దిక్షు శివాస్పదమ్ ।**
**క్రోశమాత్రం తదా జాతం లింగరూపిణ ఏవ చ ॥ 49 ॥**

ఆ బ్రాహ్మణులు ముక్తిని పొందారు. ఆ శివలింగంయొక్క ఆధారపీఠం నాల్గుదిక్కులందు క్రోసెడు దూరం విస్తరించింది.

**మహాకాలేశ్వరో నామ శివః ఖ్యాతశ్చ భూతలే ।**
**తం దృష్ట్వా న భవేత్ స్వప్నే కించిద్దుఃఖమపి ద్విజాః! ॥ 50 ॥**

ఓ బ్రాహ్మణులారా! శివుడు భూలోకంలో 'మహాకాలేశ్వరుడు' అను పేర ప్రఖ్యాతిగాంచాడు. ఆయనను దర్శించిన వారికి స్వప్నంలోనైననూ దుఃఖం ప్రాప్తించదు.

**యం యం కామమపేక్ష్యైవ తల్లింగం భజతే తు యః ।**
**తం తం కామమవాప్నోతి లభేన్మోక్షం పరత్ర చ ॥ 51 ॥**

మానవులేయే కోరికలతో ఆ శివలింగాన్ని ఆరాధిస్తారో వారు ఆయా కోరికలను పొందడమేగాక మరణానంతరం మోక్షం కూడ పొందుతారు.

**ఏతత్సర్వం సమాఖ్యాతం మహాకాలస్య సువ్రతాః! ।**
**సముద్భవశ్చ మాహాత్మ్యం కిమన్యచ్ఛ్రోతుమిచ్ఛథ ॥ 52 ॥**

ఓ సువ్రతులైన ఋషులారా! ఈ విధంగా మహాకాలేశ్వరుని ఆవిర్భావం, మహిమలను గూర్చి మీకు సమగ్రంగా చెప్పియున్నాను. ఇంకనూ మీరేమి వినగోరుచున్నారో తెలుపండి?

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం మహాకాలజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం నామ షోడశోఽధ్యాయః ॥ 16 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు మహాకాలేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం అనే పేరుగల పదహారవ అధ్యాయం సమాప్తం.

## సప్తదశోఽధ్యాయః - పదిహేడవ అధ్యాయం

## మహాకాలజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనమ్ - మహాకాలేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం

**ఋషయ ఊచుః -** ఋషులు పలికారు.

**మహాకాలసమాహ్వస్థజ్యోతిర్లింగస్య రక్షిణః ।**
**భక్తానాం మహిమానం చ పునర్బ్రూహి మహామతే! ॥ 1 ॥**

ఓ మహామతీ! భక్తరక్షకుడు, జ్యోతిర్లింగ స్వరూపుడునగు మహాకాలేశ్వరుని మహిమను గూర్చి మరల చెప్పండి.

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**శృణుతాదరతో విప్రాః! భక్తరక్షావిధాయినః ।**
**మహాకాలస్య లింగస్య మాహాత్మ్యం భక్తివర్ధనమ్ ॥ 2 ॥**

ఓ బ్రాహ్మణులారా! భక్తులను రక్షించే మహాకాలేశ్వరలింగమందు భక్తిని పెంపొందించే మహాకాలేశ్వర లింగమాహాత్మ్యాన్ని ఆదరంతో వినండి.

**ఉజ్జయిన్యామభూద్రాజా చంద్రసేనాహ్వయో మహాన్ ।**
**సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞశ్శివభక్తో జితేంద్రియః ॥ 3 ॥**

ఉజ్జయినీనగరంలో సమస్త శాస్త్రార్థతత్త్వజ్ఞుడు శివభక్తుడు, జితేంద్రియుడునగు చంద్రసేనుడనే మహారాజుండేవాడు.

**తస్యాభవత్సఖా రాజ్ఞో మణిభద్రో గణో ద్విజాః ।**
**గిరీశగణముఖ్యశ్చ సర్వలోకనమస్కృతః ॥ 4 ॥**

ఓ బ్రాహ్మణులారా! శివగణాధ్యక్షులలో ప్రముఖుడు, సర్వలోకాలు నమస్కరింపదగినవాడునగు మణిభద్రుడా రాజునకు మిత్రుడు.

**ఏకదా స గణేంద్రో హి ప్రసన్నాస్యో మహామణిమ్ ।**
**మణిభద్రో దదౌ తస్మై చింతామణిముదారధీః ॥ 5 ॥**

ఉదారబుద్ధి గలవాడు, ప్రసన్నమైనముఖం గలవాడు, గణాధ్యక్షుడునైన మణిభద్రుడొకనాడు మహారాజునకు 'చింతామణి' అనే మహామణినిచ్చాడు.

**స వై మణిః కౌస్తుభవద్ద్యోతమానోఽర్కసన్నిభః ।**
**ధ్యాతో దృష్టః శ్రుతో వాపి మంగళం యచ్ఛతి ధ్రువమ్ ॥ 6 ॥**

కౌస్తుభమణివలెను, సూర్యునివలెను ప్రకాశించే ఆ మణి తనను ధ్యానించేవారికి, దర్శించినవారికి, దానిని గూర్చి వినేవారికి కూడ మంగళాలనిస్తుందనడంలో సందేహం లేదు.

**తస్య కాంతితలస్పృష్టం కాంస్యం తామ్రమయం త్రపు ।**
**పాషాణాదికమన్యద్వా ద్రుతం భవతి హాటకమ్ ॥ 7 ॥**

కంచు, రాగి, ఇనుము, తగరం, పాషాణం మున్నగు సమస్త ద్రవ్యాలు, ప్రకాశించే చింతామణి ఉపరితలాన్ని స్పృశించిన వెంటనే బంగారంగా మారిపోతాయి.

**స తు చింతామణిం కంఠే బిభ్రద్రాజా శివాశ్రయః ।**
**చంద్రసేనో రరాజాతి దేవమధ్యే వ భానుమాన్ ॥ 8 ॥**

శివాశ్రయుడైన చంద్రసేన మహారాజు ఆ చింతామణిని కంఠంలో ధరించి, దేవతల మధ్యలో ఆదిత్యుని వలె ప్రకాశించాడు. (ఇవార్థంలో “వ” అనునది అవ్యయము)

**శ్రుత్వా చింతామణిగ్రీవం చంద్రసేనం నృపోత్తమమ్ ।**
**నిఖిలాః క్షితిరాజానస్తృష్ణాక్షుబ్ధహృదోఽభవన్ ॥ 9 ॥**

చంద్రసేనమహారాజు చింతామణిని మెడలో ధరించాడని విని మహారాజులందరి హృదయాలు దురాశచే క్షోభిల్లాయి.

**నృపా మత్సరిణస్సర్వే తం మణిం చంద్రసేనతః ।**
**నానోపాయైరయాచంత దేవలబ్ధమబుద్ధయః ॥ 10 ॥**

బుద్ధిహీనులు, అసూయాపరులునైన ఆ రాజులందరు పరమేశ్వరునినుండి అతనికి లభించిన ఆ మణిని తమకిమ్మని అనేకోపాయాలతో చంద్రసేనమహారాజునర్థించారు.

**సర్వేషాం భూభృతాం యాచ్ఞాం చంద్రసేనేన తేన వై ।**
**వ్యర్థీకృతా మహాకాలదృఢభక్తేన భూసురాః! ॥ 11 ॥**

ఓ బ్రాహ్మణులారా! మహాకాలేశ్వరునియందు దృఢభక్తి గల చంద్రసేనమహారాజు ఆ రాజులందరి ప్రార్థనలు మన్నించలేదు.

**తే కదర్థీకృతాస్సర్వే చంద్రసేనేన భూభృతా ।**
**రాజా నస్సర్వదేశానాం సంరంభం చక్రిరే తదా ॥ 12 ॥**

చంద్రసేనమహారాజుచే నిరాకరింపబడిన సమస్త దేశాధీశులు అతనితో యుద్ధానికి సన్నద్ధం కాజొచ్చారు.

**అథ తే సర్వరాజానశ్చతురంగబలాన్వితాః ।**
**చంద్రసేనం రణే జేతుం సంబభూవుః కిలోద్యతాః ॥ 13 ॥**

అంతట రాజులందరు చతురంగబలాలతో కూడినవారై చంద్రసేనుని యుద్ధంలో జయించడానికి తగిన ప్రయత్నాలు చేశారు.

**తే తు సర్వే సమేతా వై కృతసంకేతసంవిదః ।**
**ఉజ్జయిన్యాశ్చతుర్ద్వారం రురుధుర్బహుసైనికాః ॥ 14 ॥**

వారందరు కలసి సమాలోచనలు చేసి, కుట్రపన్ని, పెద్ద సైన్యంతో ఉజ్జయిని నగరంయొక్క నాల్గు ద్వారాలను ముట్టడించారు.

**సంరుధ్యమానాం స్వపురీం దృష్ట్వా నిఖిలరాజభిః ।**
**తమేవ శరణం రాజా మహాకాలేశ్వరం యయౌ ॥ 15 ॥**

తన నగరాన్ని రాజులందరు ముట్టడించడాన్ని గాంచి చంద్రసేన మహారాజు మహాకాలేశ్వరుని మాత్రమే శరణుజొచ్చాడు.

**నిర్వికల్పో నిరాహారస్స నృపో దృఢనిశ్చయః ।**
**సమానర్చ మహాకాలం దివానక్తమనన్యధీః ॥ 16 ॥**

నిర్వికల్పుడు, నిరాహారుడు, దృఢనిశ్చయుడునైన ఆ రాజు రాత్రింబవళ్లు ఏకాగ్రచిత్తంతో మహాకాలేశ్వరుని చక్కగా అర్చించాడు.

**తతస్స భగవాంఛంభుర్మహాకాలః ప్రసన్నధీః ।**
**తం రక్షితుముపాయం వై చక్రే తం శృణుతాదరాత్ ॥ 17 ॥**

అనంతరం భగవంతుడైన మహాకాలేశ్వరుడు ప్రసన్నుడై ఆ మహారాజును రక్షించే ఉపాయం చేశాడు. ఆ ఉపాయాన్ని గూర్చి శ్రద్ధగ వినండి.

**తదైవ సమయే గోపీ కాచిత్తత్ర పురోత్తమే ।**
**చరంతీ సశిశుర్విప్రా మహాకాలాంతికం యయౌ ॥ 18 ॥**

ఓ బ్రాహ్మణులారా! అదే సమయంలో, ఆ గొప్పనగరంలో ఒకానొక గొల్లయువతి తన బిడ్డతో సహా సంచరిస్తూ మహాకాలేశ్వరుని సమీపానికి వెళ్లింది.

**పంచాబ్దవయసం బాలం వహన్తీ గతభర్తృకా ।**
**రాజ్ఞా కృతాం మహాకాలపూజాం సాఽపశ్యదాదరాత్ ॥ 19 ॥**

భర్తృవిహీనయైన ఆ యువతి ఐదు సంవత్సరాల వయస్సు గల తన బాలుని ఎత్తుకొని చంద్రసేనమహారాజు చేస్తున్న మహాకాలేశ్వరపూజను శ్రద్ధతో దర్శించింది.

**సా దృష్ట్వా సుమహాశ్చర్యాం శివపూజాం చ తత్కృతామ్ ।**
**ప్రణిపత్య స్వశిబిరం పునరేవాభ్యపద్యత ॥ 20 ॥**

మహారాజు చేసిన మహాశ్చర్యకరమైన శివపూజ గాంచి ప్రణమిల్లి తన శిబిరానికి తిరిగి వెళ్లింది.

**ఏతత్సర్వమశేషేణ స దృష్ట్వా వల్లవీసుతః ।**
**కుతూహలేన తాం కర్తుం శివపూజాం మనో దధే ॥ 21 ॥**

ఆ గొల్లపిల్లవాడు ఆ పూజనంతా చూచి కుతూహలంచే ఆ శివపూజ చేయడానికి నిశ్చయించుకున్నాడు.

**ఆనీయ హృద్యం పాషాణం శూన్యే తు శిబిరాంతరే ।**
**అవిదూరే స్వశిబిరాచ్ఛివలింగం స భక్తితః ॥ 22 ॥**

ఆ బాలుడు తన యింటికి సమీపంలో నున్న ఒక అందమైన పాషాణాన్ని తెచ్చి ఇంటిలోపల ఏకాంతంలో దానిని శివలింగరూపంలో స్థాపించి భక్తితో పూజించాడు.

**గంధాలంకారవాసోభిర్ధూపదీపాక్షతాదిభిః ।**
**విధాయ కృత్రిమైర్ద్రవ్యై ర్నైవేద్యం చాప్యకల్పయత్ ॥ 23 ॥**

అతడు కృత్రిమ పదార్థాలతో గంధం, అలంకారం, వస్త్రాలు, ధూపం, దీపం, అక్షతలు, నైవేద్యం మున్నగు ఉపచారాలన్నింటిని చేశాడు.

**భూయో భూయస్సమభ్యర్చ్య పత్రైః పుష్పైర్మనోరమైః ।**
**నృత్యం చ వివిధం కృత్వా ప్రణనామ పునః పునః ॥ 24 ॥**

అతడు సుందరమైన పత్రపుష్పాలతో అనేకమార్లు అర్చించి వివిధ నృత్యాలు ప్రదర్శించి అనేక పర్యాయాలు ప్రణమిల్లాడు.

**ఏతస్మిన్సమయే పుత్రం శివాసక్తసుచేతసమ్ ।**
**ప్రణయాద్గోపికా సా తం భోజనాయ సమాహ్వయత్ ॥ 25 ॥**

ఆ సమయంలో గోపిక శివాసక్తమైన మనసుగల తన కుమారుని భోజనానికి పిలిచింది.

**యదాహూతోఽపి బహుశశ్శివపూజాక్తమానసః ।**
**బాలశ్చ భోజనం నైచ్ఛత్తదా తత్ర యయౌ ప్రసూః ॥ 26 ॥**

అనేక మార్లు పిలిచినప్పటికి శివపూజయందు నిమగ్నమైన మనస్సు గల ఆ బాలుడు భోజనమపేక్షించలేదు. అతని తల్లి అప్పుడచ్చటకు వచ్చింది.

**తం విలోక్య శివస్యాగ్రే నిషణ్ణం మీలితేక్షణమ్ ।**
**చకర్ష పాణిం సంగృహ్య కోపేన సమతాడయత్ ॥ 27 ॥**

శివుని యెదుట కన్నులు మూసుకొని కూర్చుండియున్న ఆ బాలుని గాంచి, అతని చేతిని పట్టుకొని లాగి కోపంతో కొట్టింది.

**ఆకృష్టస్తాడితశ్చాపి నాగచ్ఛత్ స్వసుతో యదా ।**
**తాం పూజాం నాశయామాస క్షిప్త్వా లింగం చ దూరతః ॥ 28 ॥**

ఆ విధంగా లాగినప్పటికి ఆ బాలకుడు తల్లితో వెళ్లలేదు. అంతట ఆమె లింగాన్ని దూరంగా పారవైచి, శివపూజను నాశనం చేసింది.

**హాహేతి దూయమానం తం నిర్భర్త్స్య స్వసుతం చ సా ।**
**పునర్వివేశ స్వగృహం గోపీ క్రోధసమన్వితా ॥ 29 ॥**

అయ్యో! అయ్యో! అని దుఃఖిస్తున్న తన కుమారుని, కోపంతో కూడిన ఆమె బెదిరించి మరల తన యింటిలోనికి వెళ్లిపోయింది.

**మాత్రా వినాశితాం పూజాం దృష్ట్వా దేవస్య శూలినః ।**
**దేవదేవేతి చుక్రోశ నిపపాత స బాలకః ॥ 30 ॥**

తల్లి శివపూజ ధ్వంసం చేయడాన్ని గాంచిన బాలకుడు 'దేవదేవా!' అని ఏడుస్తూ క్రిందపడిపోయాడు.

**ప్రనష్టసంజ్ఞః సహసా స బభూవ శుచాకులః ।**
**లబ్ధసంజ్ఞో ముహూర్తేన చక్షుషీ ఉదమీలయత్ ॥ 31 ॥**

దుఃఖంచే కల్లోలితుడైన ఆ బాలుడు వెంటనే స్పృహ కోల్పోయాడు. కొద్దిసేపటిలో అతడు మరలా తెలివిని పొంది కన్నులు తెరిచాడు.

**తదైవ జాతం శిబిరం మహాకాలస్య సుందరమ్ ।**
**దదర్శ స శిశుస్తత్ర శివానుగ్రహతోఽచిరాత్ ॥ 32 ॥**

అదే సమయంలో శివానుగ్రహంవలన ఆ బాలుడు చూస్తూ ఉండగానే, ఆ యిల్లు సుందరమైన మహాకాలేశ్వరుని నిలయమయ్యింది.

**హిరణ్మయబృహద్ద్వారం కపాటవరతోరణమ్ ।**
**మహార్ఘనీలవిమలవజ్రవేదీవిరాజితమ్ ॥ 33 ॥**

బంగారంతో చేసిన పెద్ద ద్వారాలు గలది, శ్రేష్ఠమైన తలుపులు, తోరణాలు గలది, మిక్కిలి విలువైన నీల-మణులు, స్వచ్ఛమైన వజ్రాలు పొదిగిన అరుగులతో ప్రకాశించింది ఆ మందిరం.

**సంతప్తహేమకలశైర్విచిత్రైర్బహుభిర్యుతమ్ ।**
**ప్రోద్భాసితమణిస్తంభైర్బద్ధస్ఫటిక భూతలైః ॥ 34 ॥**

పుటం పెట్టిన బంగారంతో చేసిన రంగురంగుల పెక్కు కలశాలతో కూడియుంది. అతిశయించిన ప్రకాశం-గల మణిస్తంభాలతోను, శుద్ధస్ఫటికాలు పొదిగిన నేలలతోను విరాజిల్లింది.

**తన్మధ్యే రత్నలింగం హి శంకరస్య కృపానిధేః ।**
**స్వకృతార్చన సంయుక్తమపశ్యద్గోపికాసుతః ॥ 35 ॥**

ఆ మందిరం మధ్యలో తాను చేసిన పూజాద్రవ్యాలతో అలరారే శంకరుని రత్నలింగాన్ని ఆ గొల్లపిల్లవాడు చూశాడు.

**స దృష్ట్వా సహసోత్థాయ శిశుర్విస్మితమానసః ।**
**సన్నిమగ్న ఇవాసీద్వై పరామనందసాగరే ॥ 36 ॥**

ఆశ్చర్యంతో కూడిన మనస్సు గల ఆ బాలుడు దానిని చూచి పరమానందసంద్రంలో మునిగియున్నాడా! అన్నట్లు వెంటనే లేచి నిలబడ్డాడు.

**తతః స్తుత్వా స గిరిశం భూయో భూయః ప్రణమ్య చ ।**
**సూర్యే చాస్తంగతే బాలో నిర్జగామ శివాలయాత్ ॥ 37 ॥**

అంతట ఆ బాలుడు కైలాసపతిని స్తుతించి పలుమార్లు ప్రణమిల్లి సూర్యాస్తమయానంతరం శివాలయం-నుండి బయటకు వెళ్ళాడు.

**అథాపశ్యత్స్వశిబిరం పురందరపురోపమమ్ ।**
**సద్యో హిరణ్మయీభూతం విచిత్రం పరమోజ్జ్వలమ్ ॥ 38 ॥**

అప్పుడాతడు అంతటా బంగారు కాంతులు వెదజల్లుతూ మహేంద్రుని రాజధానిని పోలియున్న విచిత్రమైన తన యింటిని చూసాడు.

**సోఽంతర్వివేశ భవనం సర్వశోభాసమన్వితమ్ ।**
**మణిహేమగణాకీర్ణమోదమానో నిశాముఖే ॥ 39 ॥**

సర్వశోభాసమన్వితము, మణిహేమాదులతో వ్యాప్తమునగు తన భవనంలోనికి అతడు రాత్రి ఆరంభసమయంలో ప్రవేశించాడు.

**తత్రాపశ్యత్స్వజననీం స్వపంతీం దివ్యలక్షణామ్ ।**
**రత్నాలంకారదీప్తాంగీం సాక్షాత్సురవధూమివ ॥ 40 ॥**

అతడక్కడ నిద్రపోవుచున్నదియు, దివ్యలక్షణ సంపన్నయునగు తన తల్లిని చూశాడు. ఆమె రత్నాలంకారాలతో సాక్షాత్తుగా దేవతాస్త్రీవలె భాసిస్తోంది.

**అథో స తనయో విప్రాశ్శివానుగ్రహభాజనమ్ ।**
**జవేనోత్థాపయామాస మాతరం సుఖవిహ్వలః ॥ 41 ॥**

ఓ విప్రులారా! శివానుగ్రహానికి పాత్రుడైన ఆ బాలుడు పట్టరాని ఆనందంతో తన తల్లిని వేగంగా నిద్రలేపాడు.

**సోత్థితాఽద్భుతమాలక్ష్యాపూర్వం సర్వమివాభవత్ ।**
**మహానందసుమగ్నా హి సస్వజే స్వసుతం చ తమ్ ॥ 42 ॥**

ఆమె నిద్రలేచి అద్భుతము, అపూర్వమునైన వైభవమంతా చూచి మహానందసముద్రంలో మునకలు వేస్తూ తన కుమారుని కౌగిలించుకుంది.

**శ్రుత్వా పుత్రముఖాత్సర్వం ప్రసాదం గిరిజాపతేః ।**
**ప్రభుం విజ్ఞాపయామాస యో భజత్యనిశం శివమ్ ॥ 43 ॥**

కొడుకు నోటినుండి పార్వతీపతి అనుగ్రహవృత్తాంతాన్నంతటినీ ఆమె విని, ఈ వృత్తాంతాన్ని మహారాజునకు విన్నవించింది.

**స రాజా సహసాఽఽగత్య సమాప్తనియమో నిశి ।**
**దదర్శ గోపికాసూనోః ప్రభావం శివతోషణమ్ ॥ 44 ॥**

ఆ రాజు తన వ్రతనియమం పూర్తియైన వెంటనే రాత్రి సమయంలో విచ్చేసి గొల్లపిల్లవాడు శివుని సంతోషపెట్టి సంపాదించిన మహిమను దర్శించాడు.

**దృష్ట్వా మహీపతిస్సర్వం తత్సామాత్యపురోహితః ।**
**ఆసీన్నిమగ్నో విధృతిః పరమానందసాగరే ॥ 45 ॥**

మంత్రులతో, పురోహితులతో కూడియున్న మహారాజు సమస్తాన్ని చూచి, పరమానందసాగరంలో మునకలు వేసి, విశేషమైన ధైర్యాన్ని పొందాడు.

**ప్రేమ్ణా బాష్పజలం ముంచన్ చంద్రసేనో నృపో హి సః ।**
**శివనామోచ్చరన్ప్రీత్యా పరిరేభే తమర్భకమ్ ॥ 46 ॥**

చంద్రసేనమహారాజు ప్రేమతో కన్నీటిని విడుస్తూ శివనామాన్ని ఉచ్చరిస్తూ ఆ బాలుని ప్రీతితో కౌగిలించుకున్నాడు.

**మహామహోత్సవస్తత్ర ప్రబభూవాద్భుతో ద్విజాః! ।**
**మహేశకీర్తనం చక్రుస్సర్వే చ సుఖవిహ్వలాః ॥ 47 ॥**

ఓ ద్విజులారా! అప్పుడచ్చట అద్భుతమైన మహోత్సవం జరిగింది. అందరూ పట్టలేని ఆనందంతో మహేశ్వరుని కీర్తించారు.

**ఏవమత్యద్భుతాచారాచ్ఛివమాహాత్మ్యదర్శనాత్ ।**
**పౌరాణాం సంభ్రమాచ్చైవం సా రాత్రిః క్షణతామగాత్ ॥ 48 ॥**

ఈ విధంగా అత్యద్భుతమైన ఈ ఘటనలో శివమహిమ ప్రకటమగుటచే పురజనులు మహాసంరంభం చేస్తుండగా, ఆ రాత్రి క్షణం వలె గడచిపోయింది.

**అథ ప్రభాతే యుద్ధాయ పురం సంరుధ్య సంస్థితాః ।**
**రాజానశ్చారవక్త్రేభ్యశ్శుశ్రువుశ్చరితం చ తత్ ॥ 49 ॥**

మరునాడు ఉదయం నగరాన్ని ముట్టడించడానికి సిద్ధంగా నున్న రాజులు గూఢచారుల ద్వారా ఆ వృత్తాంతాన్ని అంతటిని విన్నారు.

**తే సమేతాశ్చ రాజానః సర్వే యే యే సమాగతాః ।**
**పరస్పరమితి ప్రోచుస్తచ్ఛ్రుత్వా చకిత అతి ॥ 50 ॥**

అచ్చట జతగూడిన రాజులందరు ఆ వృత్తాంతాన్ని విని మిక్కిలి చకితులై వారిలో వారిట్లు సంభాషించుకున్నారు.

**రాజాన ఊచుః –** రాజులు పలికారు.

**అయం రాజా చంద్రసేనశ్శివభక్తోఽతిదుర్జయః ।**
**ఉజ్జయిన్యా మహాకాలపుర్యాఃపతిరనాకులః ॥ 51 ॥**

మహాశివభక్తుడైన చంద్రసేనమహారాజును జయించడం సంభవం కాదు. మహాకాలేశ్వరుని నగరమైన ఉజ్జయినిపాలకునకు దుఃఖం కలుగదు.

**ఈదృశాశ్శిశవో యస్య పుర్యాం సంతి శివవ్రతాః ।**
**స రాజా చంద్రసేనస్తు మహాశంకరసేవకః ॥ 52 ॥**

ఎవని నగరంలో ఇట్టి మహాశివభక్తులైన బాలకులున్నారో అట్టి చంద్రసేనమహారాజు శంకరసేవకులలో గొప్పవాడు.

**నూనమస్య విరోధేన శివః క్రోధం కరిష్యతి ।**
**తత్క్రోధాద్ధి వయం సర్వే భవిష్యామో వినష్టకాః ॥ 53 ॥**

ఇతనితో విరోధం పెట్టుకొన్నవారిపై శివుడు క్రోధం బూనడం నిశ్చయం. ఆయన కోపిస్తే మనమందరమూ వినాశాన్ని పొందుతాము.

**తస్మాదనేన రాజ్ఞా వై మిలాపః కార్య ఏవ హి ।**
**ఏవం సతి మహేశానః కరిష్యతి కృపాం పరామ్ ॥ 54 ॥**

కాబట్టి ఈ రాజుతో మనం సంధి చేసుకొని తీరాలి. అట్లు చేస్తే మహేశ్వరుడపారమైన దయ చూపుతాడు.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇతి నిశ్చిత్య తే భూపాస్త్యక్తవైరాస్సదాశయాః ।**
**సర్వే బభూవుస్సుప్రీతా న్యస్తశస్త్రాస్త్రపాణయః ॥ 55 ॥**

ఆ రాజులందరూ ఈ విధంగా నిశ్చయించుకొని వైరాన్ని వీడి శుద్ధమైన అంతఃకరణములుగలవారై చేతులలోని శస్త్రాస్త్రాలు పారవైచి సుప్రీతులయ్యారు.

**వివిశుస్తే పురీం రమ్యాం మహాకాలస్య భూభృతః ।**
**మహాకాలం సమానర్చుశ్చంద్రసేనానుమోదితాః ॥ 56 ॥**

ఆ రాజులు చంద్రసేనుని అనుమతి పొంది సుందరమైన మహాకాలేశ్వరుని నగరంలోనికి ప్రవేశించి మహాకాలుని చక్కగా అర్చించారు.

**తతస్తే గోపవనితాగేహం జగ్ముర్మహీభృతః ।**
**ప్రశశంసంతశ్చ తద్భాగ్యం సర్వే దివ్యమహోదయమ్ ॥ 57 ॥**

అనంతరం ఆ రాజులందరు ఆ గోపిక గృహానికి వెళ్లి మహాదేవుని గొప్ప అనుగ్రహంచే ఆమెకు కలిగిన భాగ్యాన్ని కొనియాడారు.

**తే తత్ర చంద్రసేనేన ప్రత్యుద్గమ్యాభిపూజితాః ।**
**మహార్హవిష్టరగతాః ప్రత్యనందన్సువిస్మితాః ॥ 58 ॥**

అచ్చట చంద్రసేనుడు వారికెదురేగి సత్కరించి మిక్కిలి విలువైన ఆసనాలతో కూర్చుండబెట్టాడు. వారు మహాశ్చర్యాన్ని పొంది ఆయనను అభినందించారు.

**గోపసూనోః ప్రసాదాత్తత్ప్రాదుర్భూతం శివాలయమ్ ।**
**సంవీక్ష్య శివలింగం చ శివే చక్రుః పరాం మతిమ్ ॥ 59 ॥**

శివుడు గొల్లపిల్లవానిపై చూపిన అనుగ్రహంచే ప్రాదుర్భవించిన శివాలయాన్ని, శివలింగాన్ని దర్శించి వారు శివునిపై మనస్సునేకాగ్రం చేశారు.

**తతస్తే గోపశిశవే ప్రీతా నిఖిలభూభుజః ।**
**దదుర్బహూని వస్తూని తస్మై శివకృపార్థినః ॥ 60 ॥**

శివానుగ్రహాన్ని కోరే ఆ రాజులందరు గోపబాలకునిపై ప్రేమతో అనేక వస్తువులనతనికిచ్చారు.

**యే యే సర్వేషు దేశేషు గోపాస్తిష్ఠంతి భూరిశః ।**
**తేషాం తమేవ రాజానం చక్రిరే సర్వపార్థివాః ॥ 61 ॥**

ఆ రాజులందరు వారి వారి దేశాలలో గోపాలకులధికంగా గల ప్రాంతాలన్నింటికి అతనిని రాజుగా చేశారు.

**అథాస్మిన్నంతరే సర్వైస్త్రిదశైరభిపూజితః ।**
**ప్రాదుర్బభూవ తేజస్వీ హనూమాన్వానరేశ్వరః ॥ 62 ॥**

ఇంతలో అచ్చట దేవతలచే పూజింపబడువాడు, తేజశ్శాలి, వానరవీరుడునగు హనుమంతుడు ప్రత్యక్షమయ్యాడు.

**తే తస్యాభిగమాదేవ రాజానో జాతసంభ్రమాః ।**
**ప్రత్యుత్థాయ నమశ్చక్రుర్భక్తినమ్రాత్మమూర్తయః ॥ 63 ॥**

ఆయనను చూడడంతోనే రాజులందరు కంగారుగా లేచి ఆయన కెదురేగి భక్తితో వినమ్రమైన దేహాలు గలవారై నమస్కరించారు.

**తేషాం మధ్యే సమాసీనః పూజితః ప్లవగేశ్వరః ।**
**గోపాత్మజం తమాలింగ్య రాజ్ఞో వీక్ష్యేదమబ్రవీత్ ॥ 64 ॥**

వానరవీరుడైన హనుమంతుడు పూజలందుకొని ఆ గోపబాలకుని కౌగిలించుకొని వారి మధ్యలో కూర్చుండి ఆ రాజుల వైపు చూస్తూ ఇలా పలికాడు.

**హనుమానువాచ** – హనుమంతుడు పలికాడు.

**సర్వే శృణ్వంతు భద్రం వో రాజానో యే చ దేహినః ।**
**ఋతే శివం నాన్యతమో గతిరస్తి శరీరిణామ్ ॥ 65 ॥**

ఓ రాజులారా! అందరూ వినండి. మీకు మంగళమగు గాక! దేహధారులైన ప్రాణులకు శివుడు తప్ప వేరే గతి లేదు.

**ఏవం గోపసుతో దిష్ట్యా శివపూజాం విలోక్య చ ।**
**అమంత్రేణాపి సంపూజ్య శివం శివమవాప్తవాన్ ॥ 66 ॥**

ఈ గోపబాలుడు దైవవశంచే శివపూజ చూచి మంత్రం లేకుండగానే శివుని పూజించి శివానుగ్రహాన్ని పొందాడు.

**ఏష భక్తవరశ్శంభోర్గోపానాం కీర్తివర్ధనః ।**
**ఇహ భుక్త్వాఖిలాన్భోగానంతే మోక్షమవాప్స్యతి ॥ 67 ॥**

శివభక్తాగ్రేసరుడు, గోపాలుర కీర్తివర్ధనుడునైన ఈ బాలకుడు ఈ లోకంలో సకల భోగాలు అనుభవించి దేహత్యాగానంతరం మోక్షాన్ని పొందుతాడు.

**అస్య వంశేఽష్టమో భావీ నందో నామ మహాయశాః ।**
**ప్రాప్స్యతే తస్య పుత్రత్వం కృష్ణో నారాయణస్స్వయమ్ ॥ 68 ॥**

ఇతని వంశంలో ఎనిమిదవ తరంలో గొప్ప కీర్తిమంతుడైన నందుడనువాడు పుట్టగలడు. నారాయణుడు స్వయంగా ఆయనకు పుత్రుడై శ్రీకృష్ణుడనే పేరుతో అవతరించగలడు.

**అద్యప్రభృతి లోకేస్మిన్నేష గోపకుమారకః ।**
**నామ్నా శ్రీకర ఇత్యుచ్చైర్లోకఖ్యాతిం గమిష్యతి ॥ 69 ॥**

ఈనాటి నుండియు ఈ గోపబాలకుడీ లోకంలో 'శ్రీకరుడు' అనే పేరుతో గొప్పఖ్యాతిని పొందుతాడు.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఏవముక్త్వాంజనీసూనుః శివరూపో హరీశ్వరః ।**
**సర్వాన్రాజ్ఞశ్చంద్రసేనం కృపాదృష్ట్యా దదర్శ హ ॥ 70 ॥**

అంజనీపుత్రుడు, వానరవీరుడు, శివస్వరూపుడునగు హనుమంతుడిట్లు పలికి రాజులందరిని, చంద్రసేనుని, దయాదృష్టితో చూశాడు.

**అథ తస్మై శ్రీకరాయ గోపపుత్రాయ ధీమతే ।**
**ఉపాదిదేశ సుప్రీత్యా శివాచారం శివప్రియమ్ ॥ 71 ॥**

అనంతరం హనుమంతుడు గోపబాలకుడు, బుద్ధిశాలియునైన శ్రీకరునకు శివప్రీతికరమైన శివవ్రతాన్ని పరమప్రీతితో ఉపదేశించాడు.

**హనూమానథ సుప్రీతః సర్వేషాం పశ్యతాం ద్విజాః! ।**
**చంద్రసేనం శ్రీకరం చ తత్రైవాంతరధీయత ॥ 72 ॥**

ఓ ద్విజులారా! హనుమంతుడంతట మిక్కిలి సంతసించి, అందరూ చంద్రసేన, శ్రీకరులను చూస్తూ ఉండగా అక్కడనే అంతర్ధానమయ్యాడు.

**తం సర్వే చ మహీపాలాస్సంహృష్టాః ప్రతిపూజితాః ।**
**చంద్రసేనం సమామంత్ర్య ప్రతిజగ్ముర్యథాగతమ్ ॥ 73 ॥**

చక్కగా సత్కరింపబడడంచే మిక్కిలి హర్షాన్ని పొందియున్న రాజులందరు చంద్రసేనుని వద్ద సెలవు తీసుకొని వచ్చిన దారిన తిరిగి వెళ్లారు.

**శ్రీకరోఽపి మహాతేజా ఉపదిష్టో హనూమతా ।**
**బ్రాహ్మణైస్సహ ధర్మజ్ఞైశ్చక్రే శంభోస్సమర్హణామ్ ॥ 74 ॥**

హనుమంతుని వద్దనుండి ఉపదేశాన్ని పొందియున్న మహాతేజశ్శాలియైన శ్రీకరుడు కూడ, ధర్మజ్ఞులైన బ్రాహ్మణులతో గూడి, శంభుని చక్కగా అర్చించాడు.

**చంద్రసేనో మహారాజః శ్రీకరో గోపబాలకః ।**
**ఉభావపి పరప్రీత్యా మహాకాలం చ భేజతుః ॥ 75 ॥**

చంద్రసేనమహారాజు, గోపబాలకుడైన శ్రీకరుడు ఇద్దరూ కూడ పరమానందంతో మహాకాలుని సేవించారు.

**కాలేన శ్రీకరస్సోఽపి చంద్రసేనశ్చ భూపతిః ।**
**సమారాధ్య మహాకాలం భేజతుః పరమం పదమ్ ॥ 76 ॥**

చంద్రసేన మహారాజు, శ్రీకరుడు ఇద్దరూ కూడ కొంతకాలం వరకు మహాకాలుని శ్రద్ధగా ఆరాధించి, పరమపదాన్ని పొందారు.

**ఏవంవిధో మహాకాలశ్శివలింగస్సతాం గతిః ।**
**సర్వథా దుష్టహంతా చ శంకరో భక్తవత్సలః ॥ 77 ॥**

ఈవిధంగా సత్పురుషులకు శరణం, సర్వథా దుష్టహంతకుడు, భక్తవత్సలుడునగు శంకరుడు మహాకాలేశ్వరరూపాన్ని ధరించాడు.

**ఇదం పవిత్రం పరమం రహస్యం సర్వసౌఖ్యదమ్ ।**
**ఆఖ్యానం కథితం స్వర్గ్యం శివభక్తివివర్ధనమ్ ॥ 78 ॥**

పరమపవిత్రమైనదియు, రహస్యమును, సర్వసౌఖ్యదము, స్వర్గప్రదము, శివునియందు భక్తిని పెంపొందించునదియునగు ఈ వృత్తాంతాన్ని చెప్పాను.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం మహాకాలజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం నామ సప్తదశోఽధ్యాయః ॥ 17 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు మహాకాలేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం అనే పేరుగల పదిహేడవ అధ్యాయం సమాప్తం.

## అష్టాదశోఽధ్యాయః - పద్దెనిమిదవ అధ్యాయం

## ఓంకారేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనమ్ - ఓంకారేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం

**ఋషయ ఊచుః -** ఋషులు పలికారు.

**త్వయా సూత! మహాభాగ శ్రావితా హ్యద్భుతా కథా ।**
**మహాకాలాఖ్యలింగస్య నిజభక్తసురక్షికః ॥ 1 ॥**

ఓ సూతా! మహాభాగా! తన భక్తులను చక్కగా రక్షించే మహాకాలేశ్వరజ్యోతిర్లింగం యొక్క అద్భుతగాథ వినిపించావు.

**జ్యోతిర్లింగం చతుర్థం చ కృపయా వద విత్తమ! ।**
**ఓంకారం పరమేశస్య సర్వపాతకహారిణః ॥ 2 ॥**

ఓ మహాజ్ఞానీ! సర్వపాతకహారిణియు, పరమేశ్వరునియొక్క నాల్గవదైన ఓంకారజ్యోతిర్లింగాన్ని గూర్చి కూడ దయతో చెప్పండి.

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**ఓంకారే పరమేశాఖ్యం లింగమాసీద్యథా ద్విజాః! ।**
**తథా వక్ష్యామి వః ప్రీత్యా శ్రూయతాం పరమర్షయః! ॥ 3 ॥**

ఓ బ్రాహ్మణులారా! ఓ మహర్షులారా! ఓంకారంలో పరమేశ్వరలింగం ఆవిర్భవించిన తీరు చెబుతాను. మీరు ప్రీతితో వినండి.

**కస్మింశ్చిత్సమయే చాథ నారదో భగవాన్మునిః ।**
**గోకర్ణాఖ్యం శివం గత్వా సిషేవే పరభక్తిమాన్ ॥ 4 ॥**

ఒకానొక సమయంలో పరమభక్తుడైన నారదభగవానుడు గోకర్ణానికి వెళ్లి మిక్కిలి భక్తితో శివుని సేవించాడు.

**తతస్స ఆగతో విన్ధ్యం నగేశం మునిసత్తమః ।**
**తత్రైవ పూజితస్తేన బహుమానపురస్సరమ్ ॥ 5 ॥**

అనంతరం ఆయన పర్వతరాజమైన వింధ్య వద్దకు వచ్చాడు. అతడచ్చట బహుమానపురస్సరంగా నారదమహర్షిని చక్కగా పూజించాడు.

**మయి సర్వం విద్యతే చ న న్యూనం హి కదాచన ।**
**ఇతి భావం సమాస్థాయ సంస్థితో నారదాగ్రతః ॥ 6 ॥**

"నా యందు సర్వమున్నది. ఏకాలంలో నైననూ ఏ లోపం లేదు" అనే భావన గలవాడై వింధ్యుడు నారదుని యెదుట నిలబడ్డాడు.

**తన్మానం తత్తదా శ్రుత్వా నారదో మానహా తతః ।**
**నిశ్వస్య సంస్థితస్తత్ర శ్రుత్వా విన్ధ్యోఽబ్రవీదిదమ్ ॥ 7 ॥**

గర్వంతో కూడిన ఇతని వచనాలు విని గర్వాపహారుడైన నారదుడు నిట్టూర్పు విడిచి అక్కడ కూర్చుండి యున్నాడు. ఆ మాటలను విని వింధ్యుడు ఇలా పలికాడు.

**వింధ్య ఉవాచ** - వింధ్యుడు పలికాడు.

**కిం న్యూనం చ త్వయా దృష్టం మయి నిశ్వాసకారణమ్ ।**
**తచ్ఛ్రుత్వా నారదో వాక్యమబ్రవీత్స మహామునిః ॥ 8 ॥**

నీ నిట్టూర్పునకు కారణమైన దోషం నాలో నీకు ఏమి కనబడింది? ఈ మాటలు విని నారద మహర్షి ఇలా పలికాడు.

**నారద ఉవాచ** - నారదుడు పలికాడు.

**విద్యతే త్వయి సర్వం హి మేరురుచ్చతరః పునః ।**
**దేవేష్వపి విభాగోఽస్య న తవాస్తి కదాచన ॥ 9 ॥**

నీయందు సర్వం కలదు. కాని మేరువు నీకంటె ఎత్తైన వాడు. అంతేగాక మేరుపర్వతం దేవతలలో ఒకనిగా లెక్కింపబడుతున్నాడు. ఆ ఘనత నీకు ఏ కాలంలోనైనను లేదు.

**సూత ఉవాచ** - సూతుడు చెప్పాడు.

**ఇత్యుక్త్వా నారదస్తస్మాజ్జగామ చ యథాగతమ్ ।**
**విన్ధ్యశ్చ పరితప్తో వై ధిగ్జీ మే జీవితాదికమ్ ॥ 10 ॥**

నారదుడిట్లు పలికి అచ్చటినుండి వచ్చిన దారిన వెళ్లాడు. వింధ్యపర్వతుడు పరితాపం చెందాడు. “నా జీవితం మున్నగునవన్నియు నిందార్హమైనవయ్యాయి.

**విశ్వేశ్వరం తథా శంభుమారాధ్య చ తపామ్యహమ్ ।**
**ఇతి నిశ్చిత్య మనసా శంకరం శరణం గతః ॥ 11 ॥**

నేను విశ్వేశ్వరుడైన శంభుని ఆరాధిస్తూ తపస్సు చేస్తాను” అని తన మనస్సులో నిశ్చయించుకొని శంకరుని శరణు పొందాడు.

**జగామ తత్ర సుప్రీత్యా హ్యోంకారో యత్ర వై స్వయమ్ ।**
**చకార చ పునస్తత్ర శివమూర్తిం చ పార్థివీమ్ ॥ 12 ॥**

అప్పుడాతడు ఓంకారేశ్వరుడు స్వయంగా వెలసియున్న స్థలానికి పరమప్రీతితో వెళ్లి అచ్చట మట్టితో శివమూర్తిని చేశాడు.

**ఆరాధ్య చ తదా శంభుం షణ్మాసం స నిరంతరమ్ ।**
**న చచాల తపఃస్థానాచ్ఛివధ్యానపరాయణః ॥ 13 ॥**

అప్పుడతడు ఎడతెరపి లేకుండగా ఆరు మాసాలు శంభుని ఆరాధించాడు. శివధ్యానంలో నిమగ్నుడైన అతడు తాను తపస్సు చేస్తున్న చోటనుండి కదలలేదు.

**ఏవం వింధ్యతపో దృష్ట్వా ప్రసన్నః పార్వతీపతిః ।**
**స్వరూపం దర్శయామాస దుర్లభం యోగినామపి ॥ 14 ॥**

ఈ విధంగా తపస్సు చేస్తున్న వింధ్యుని గాంచి పార్వతీపతి ప్రసన్నుడై యోగులకు దుర్లభమైన తన రూపాన్ని సాక్షాత్కరింపజేశాడు.

**ప్రసన్నస్స తదోవాచ బ్రూహి త్వం మనసేప్సితమ్ ।**
**తపసా తే ప్రసన్నోఽస్మి భక్తానామీప్సితప్రదః ॥ 15 ॥**

ప్రసన్నుడైన శివుడు అప్పుడిట్లు పలికాడు. "నీ మనస్సులోని కోరిక వెల్లడించుము. నీ తపస్సునకు నేను ప్రసన్నుడనయ్యాను. నేను భక్తుల కోర్కెలను తీరుస్తాను."

**వింధ్య ఉవాచ –** వింధ్యుడు పలికాడు.

**యది ప్రసన్నో దేవేశ! బుద్ధిం దేహి యథేప్సితామ్ ।**
**స్వకార్యసాధినీం శంభో! త్వం సదా భక్తవత్సలః ॥ 16 ॥**

ఓ దేవదేవా! నీవు ప్రసన్నుడవైనచో నా కార్యాన్ని సాధించగల బుద్ధిని నాకు ప్రసాదించు. ఓ శంభూ! నీవు సర్వదా భక్తులయందు వాత్సల్యం గలవాడవు.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**తచ్ఛ్రుత్వా భగవాన్ శంభుశ్చిచేత హృదయే చిరమ్ ।**
**పరోపతాపదం వింధ్యో వరమిచ్ఛతి మూఢధీః ॥ 17 ॥**

ఈ మాట విని శంభుభగవానుడు తన మనస్సులో చిరకాలం ఇట్లు తలపోశాడు. "విమోహితమైన బుద్ధిగల వింధ్యుడు ఇతరులకు కష్టాన్ని కలిగించే వరాన్ని కోరుతున్నాడు.

**కిం కరోమి యదేతస్మై వరదానం భవేచ్ఛుభమ్ ।**
**మద్దత్తం పరదుఃఖాయ వరదానం యథా న హి ॥ 18 ॥**

ఏమి చేయాలి? నేనితనికిచ్చే వరం శుభకరం కావాలి. నాచే ఈయబడే వరం ఇతరులకు దుఃఖదాయకం కారాదు.

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**తథాపి దత్తవాన్ శంభుస్తస్మై తద్వరముత్తమమ్ ।
వింధ్యపర్వతరాజ! త్వం యథేచ్ఛసి తథా కురు ॥ 19 ॥**

అయిననూ, శంభుడు "పర్వతరాజమైన వింధ్యమా! నీకు నచ్చిన విధంగానే కానిమ్ము" అని పలికి వానికుత్తమమైన వరమిచ్చాడు.

**ఏవం చ సమయే దేవా ఋషయశ్చామలాశయాః ।
సంపూజ్య శంకరం తత్ర స్థాతవ్యమితి చాబ్రువన్ ॥ 20 ॥**

అదే సమయంలో దేవతలు, పవిత్రాంతఃకరణులైన ఋషులు శంకరుని పూజించి అక్కడనే స్థిరంగా నుండుమని పలికాడు.

**తచ్ఛ్రుత్వా దేవవచనం ప్రసన్నః పరమేశ్వరః ।
తథైవ కృతవాన్ప్రీత్యా లోకానాం సుఖహేతవే ॥ 21 ॥**

దేవతల మాటలు విని ప్రసన్నుడైన పరమేశ్వరుడు లోకాలకు సుఖాన్ని కలిగించడానికి ప్రేమపూర్వకంగా అట్లే చేశాడు.

**ఓంకారం చైవ యల్లింగమేకం తచ్చ ద్విధాగతమ్ ।
ప్రణవే చైవ ఓంకారనామాసీత్స సదాశివః ॥ 22 ॥**

ఓంకారేశ్వరలింగం రెండు రూపాలలో ఉంది. ఆ సదాశివుడు ప్రణవమునందున్నవాడై ఓంకారేశ్వరుడనే పేరు పొందాడు.

**పార్థివే చైవ యజ్జాతం తదాసీత్పరమేశ్వరః ।
భక్తాభీష్టప్రదౌ చోభౌ భుక్తిముక్తిప్రదౌ ద్విజాః! ॥ 23 ॥**

ఓ బ్రాహ్మణులారా! పార్థివమూర్తినుండి పుట్టిన లింగం పరమేశ్వరుడయ్యాడు. ఈ రెండు రూపాలు కూడ భక్తులకు కోరికలను భుక్తిని, ముక్తిని ప్రసాదిస్తాయి.

**తత్పూజాం చ తదా చక్రుర్దేవాశ్చ ఋషయస్తథా ।
ప్రాపుర్వరాననేకాంశ్చ సంతోష్య వృషభధ్వజమ్ ॥ 24 ॥**

అంతట దేవతలు, ఋషులు వృషభధ్వజుడైన శివుని పూజించి ప్రసన్నుని చేసికొని అనేక వరాలు పొందారు.

**స్వస్వస్థానం యయుర్దేవా వింధ్యోఽపి ముదితోఽధికమ్ ।
కార్యం సాధితవాన్ స్వీయం పరితాపం జహౌ ద్విజాః ॥ 25 ॥**

దేవతలు తమ తమ స్థానాలకు వెళ్లారు. వింధ్యుడు కూడ తన కార్యం సిద్ధించడంచేత పరమానందాన్ని పొంది తన మనస్సులోని పరితాపాన్ని విడనాడాడు.

**య ఏవం పూజయేచ్ఛంభుం మాతృగర్భం వసేన్న హి ।**
**యదభీష్టం ఫలం తచ్చ ప్రాప్నుయాన్నాత్ర సంశయః ॥ 26 ॥**

శివుని ఈ విధంగా పూజించేవారలకు అభీష్టఫలం లభించడమేగాక వారు తిరిగి గర్భవాసదుఃఖాన్ని అనుభవించరనడంలో సందేహం లేదు.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఏతత్తే సర్వమాఖ్యాతమోంకారప్రభవే ఫలమ్ ।**
**అతః పరం ప్రవక్ష్యామి కేదారం లింగముత్తమమ్ ॥ 27 ॥**

ఈ విధంగా ఓంకారేశ్వరుని పూజించడంవల్ల లభించే ఫలాన్ని గూర్చి మీకు చెప్పియున్నాను. ఇటుపై ఉత్తమమైన కేదారలింగాన్ని గూర్చి చెబుతాను.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం ఓంకారేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం నామాష్టాదశోఽధ్యాయః ॥ 18 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు ఓంకారేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం అనే పేరుగల పద్దెనిమిదవ అధ్యాయం సమాప్తం.

## ఏకోనవింశోఽధ్యాయః - పంతొమ్మిదవ అధ్యాయం

## కేదారేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనమ్ - కేదారేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**నరనారాయణాఖ్యౌ యావవతారౌ హరేర్ద్విజాః! ।**
**తేపాతే భారతే ఖండే బదర్యాశ్రమ ఏవ హి ॥ 1 ॥**

ఓ బ్రాహ్మణులారా! విష్ణువు అవతారాలైన నరనారాయణులు భారతఖండంలో బదరికాశ్రమంలో తపస్సు చేశారు.

**తాభ్యాం సంప్రార్థితశ్శంభుః పార్థివే పూజనాయ వై ।**
**ఆయాతి నిత్యం తల్లింగే భక్తాధీనతయా శివః ॥ 2 ॥**

పార్థివలింగంలో పూజించడానికి వారు శివుని ప్రార్థించగా భక్తవశుడగు శివుడు ప్రతిదినం ఆ లింగంలో ఉపస్థితుడయ్యేవాడు.

**ఏవం పూజయతోశ్శంభుం తయోర్విష్ణ్వవతారయోః ।**
**చిరకాలో వ్యతీయాయ శైవయోర్ధర్మపుత్రయోః ॥ 3 ॥**

శివభక్తులు, విష్ణువుయొక్క ధర్మావతారాలు, శివునియొక్క ధర్మపుత్రులునైన వారిరువురు ఇట్లు శివుని పూజిస్తూ ఉండగా చిరకాలం గడిచింది.

**ఏకస్మిన్సమయే తత్ర ప్రసన్నః పరమేశ్వరః ।**
**ప్రత్యువాచ ప్రసన్నోఽస్మి వరో మే వ్రియతామితి ॥ 4 ॥**

ఒకానొక సమయంలో పరమేశ్వరుడు ప్రసన్నుడై అచ్చట ప్రత్యక్షమై 'నేను మీయందు ప్రసన్నుడనయ్యాను. మీ అభీష్టవరాన్ని కోరుకొమ్ము' అని పలికాడు.

**ఇత్యుక్తే చ తదా తేన నరో నారాయణస్స్వయమ్ ।**
**ఊచతుర్వచనం తత్ర లోకానాం హితకామ్యయా ॥ 5 ॥**

శివుడట్లు పలుకగా నరనారాయణులు లోకాలకు హితం చేయాలనే తలంపుతో శివునితో స్వయంగా ఇలా పలికారు.

**నరనారాయణావూచతుః** - నరనారాయణులు పలికారు.

**యది ప్రసన్నో దేవేశ! యది దేయో వరస్త్వయా ।**
**స్థీయతాం స్వేన రూపేణ పూజార్థం శంకరస్స్వయమ్ ॥ 6 ॥**

"ఓ దేవేశా! శంకరా! నీవు ప్రసన్నుడవై వరమీయ సంకల్పిస్తే నీ రూపంతో పూజకొఱకు ఇచ్చట స్థిరంగా నుండుము" అని ప్రార్థించారు.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యుక్తస్తు తదా తాభ్యాం కేదారే హిమసంశ్రయే ।**
**స్వయం చ శంకరస్తస్థౌ జ్యోతీరూపో మహేశ్వరః ॥ 7 ॥**

అప్పుడు వారిరువురు ఆ విధంగా పలుకగా మంచునకు నిలయమైన కేదారంలో మంగళకరుడైన మహేశ్వరుడు స్వయంగా జ్యోతిర్లింగరూపంలో వెలిశాడు.

**తాభ్యాం చ పూజితశ్చైవ సర్వదుఃఖభయాపహః ।**
**లోకానాముపకారార్థం భక్తానాం దర్శనాయ వై ॥ 8 ॥**

సకల దుఃఖాలను, భయాలను పోగొట్టు శంభుడు వారిద్దరిచే పూజింపబడినవాడై లోకులకుపకారార్థమును, భక్తులకు దర్శనమివ్వడానికని అచ్చట వెలశాడు.

**స్వయం స్థితస్తదా శంభుః కేదారేశ్వరసంజ్ఞకః ।**
**భక్తాభీష్టప్రదో నిత్యం దర్శనాదర్చనాదపి ॥ 9 ॥**

స్వయంగా అచ్చట వెలసిన పరమేశ్వరుడు కేదారేశ్వరుడనే పేరుతో ప్రసిద్ధుడయ్యాడు. తనను అర్చించినట్టియు, దర్శించినట్టియు భక్తులకు అభీష్టప్రదానం నిత్యం చేస్తున్నాడు.

**దేవాశ్చ పూజయంతీహ ఋషయశ్చ పురాతనాః ।**
**మనోఽభీష్టఫలం తే తే సుప్రసన్నాన్మహేశ్వరాత్ ॥ 10 ॥**

దేవతలు, ప్రాచీనులైన ఋషులు అచ్చటి మహేశ్వరుని పూజించి ప్రసన్నుని చేసుకొని మనోభీష్టఫలాలు పొందుతున్నారు.

**భవస్య పూజనాన్నిత్యం బదర్యాశ్రమవాసినః ।**
**ప్రాప్నువంతి యతః సోఽసౌ భక్తాభీష్టప్రదః సదా ॥ 11 ॥**

బదరికాశ్రమవాసులు నిత్యం శివుని పూజించడంవల్ల వారి కామనలు పొందుతున్నారు. కాబట్టియే ఆయనకు 'భక్తాభీష్టప్రదుడు' అను ఖ్యాతి కలిగింది.

**తద్దినం హి సమారభ్య కేదారేశ్వర ఏవ చ ।**
**పూజితో యేన భక్త్యా వై దుఃఖం స్వప్నేఽతిదుర్లభమ్ ॥ 12 ॥**

ఆనాటినుండి ఎవడైతే భక్తితో కేదారేశ్వరుని పూజిస్తాడో, వానికి దుఃఖం స్వప్నంలో కూడా కనిపించదు.

**యో వై హి పాండవాన్దృష్ట్వా మాహిషం రూపమాస్థితః ।**
**మాయామాస్థాయ తత్రైవ పలాయనపరోఽభవత్ ॥ 13 ॥**

అచ్చట పాండవులను చూచి మాయాప్రభావంచే మహిషరూపం దాల్చి పారిపోయిన వాడాయనయే.

**ధృతశ్చ పాండవైస్తత్ర హ్యవాఙ్ముఖతయా స్థితః ।**
**పుచ్ఛం చైవ ధృతం తైస్తు ప్రార్థితశ్చ పునః పునః ॥ 14 ॥**

పాండవులాయనను పట్టుకోగా, ఆయన తలవంచుకొని నిలబడ్డాడు. వారు తోకను పట్టుకొని పలుమార్లు ప్రార్థించారు.

**తద్రూపేణ స్థితస్తత్ర భక్తవత్సలనామభాక్ ।**
**నయపాలే శిరోభాగో గతస్తద్రూపతః స్థితః ॥ 15 ॥**

ఆయన అచ్చట అదే రూపంలో నుండి 'భక్తవత్సలుడు' అనే పేరు పొందాడు. ఆయన శిరోభాగం నయపాలం (నేపాల దేశం) చేరింది. ఆయన అచ్చట ఆ రూపంలోనే ఉన్నాడు.

**స వై వ పూజనాన్నిత్యమాజ్ఞాం చైవాప్యదాత్తథా ।**
**పూజితశ్చ స్వయం శంభుస్తత్ర తస్థౌ వరానదాత్ ॥ 16 ॥**

అదే రూపంలో తనను పూజించాలని అప్పుడాయన ఆజ్ఞాపించాడు. వారట్లు పూజించగా శంభుడు అచ్చటనే స్థిరంగా నుండి వరాలనిచ్చాడు.

**పూజయిత్వా గతాస్తే తు పాండవా ముదితాస్తదా ।**
**లబ్ధ్వా చిత్తేప్సితం సర్వం విముక్తాస్సర్వదుఃఖతః ॥ 17 ॥**

అప్పుడు పాండవులాయనను పూజించి ఆనందంతో ముందుకు సాగారు. వారు తమ మనస్సులోని కోరికలన్నింటిని పొంది సకలదుఃఖాలనుండి విముక్తులయ్యారు.

**తత్ర నిత్యం హరస్సాక్షాత్ క్షేత్రే కేదారసంజ్ఞకే ।**
**భారతీభిః ప్రజాభిశ్చ తదేవ పరిపూజ్యతే ॥ 18 ॥**

'కేదారము' అనే పేరు గల ఆ క్షేత్రంలో శివుడు స్వయంగా నిత్యనివాసం చేసి, భారతదేశవాసులైన ప్రజలచే ఆ విధంగానే పూజింపబడుతున్నాడు.

**తత్రత్యం వలయం యో వై దదాతి హరవల్లభః ।**
**హరరూపాంతికం తచ్చ హరరూపసమన్వితమ్ ॥ 19 ॥**

అక్కడకు వెళ్లి శివుని రూపంతో కూడిన కంకణదానం చేసినవాడు శివునకు ప్రీతిపాత్రుడౌతాడు. ఆ విధంగా కంకణదానం చేసే వ్యక్తి శివుని ధామం చేరి సారూప్యముక్తిని పొందుతాడు.

**తథైవ రూపం దృష్ట్వా చ సర్వపాపైః ప్రముచ్యతే ।**
**జీవన్ముక్తో భవేత్సోఽపి యో గతో బదరీవనే ॥ 20 ॥**

ఎవడైతే బదరీవనం వెళ్లి అటువంటి శివుని రూపాన్ని దర్శిస్తాడో అట్టివాడు నిశ్చయంగా సర్వపాపాల-నుండి విముక్తుడై జీవన్ముక్తుడౌతాడు.

**దృష్ట్వా రూపం నరస్యైవ తథా నారాయణస్య హి ।**
**కేదారేశ్వరశంభోశ్చ ముక్తభాగీ న సంశయః ॥ 21 ॥**

నరనారాయణులయొక్కయు, కేదారేశ్వరునియొక్కయు రూపాలను దర్శించే వ్యక్తి ముక్తుడౌతాడనడంలో సందేహం లేదు.

**కేదారేశస్య భక్తా యే మార్గస్థాస్తస్య వై మృతాః ।**
**తేఽపి ముక్తా భవంత్యేవ నాత్ర కార్యా విచారణా ॥ 22 ॥**

కేదారేశుని దర్శనానికి వెళుతూ, మార్గమధ్యంలో మరణించేవారు కూడా నిస్సందేహంగా మోక్షాన్ని పొందుతారు. ఇందులో విచారించవలసిన పనియేమియు లేదు.

**గత్వా తత్ర ప్రీతియుక్తః కేదారేశం ప్రపూజ్య చ ।**
**తత్రత్యముదకం పీత్వా పునర్జన్మ న విందతి ॥ 23 ॥**

అక్కడకు వెళ్లి ప్రేమతో కేదారేశ్వరుని పూజించి అచ్చటి నీటిని త్రాగినవానికి పునర్జన్మ ఉండదు.

**ఖండేఽస్మిన్భారతే విప్రాః! నరనారాయణేశ్వరః ।**
**కేదారేశః ప్రపూజ్యశ్చ సర్వైర్జీవైస్సుభక్తితః ॥ 24 ॥**

ఓ బ్రాహ్మణులారా! భారతఖండంలోని జనులందరూ నరనారాయణులకు ప్రభుడైన కేదారేశ్వరుని మహాభక్తితో చక్కగా పూజించాలి.

**అస్య ఖండస్య స స్వామీ సర్వేశోఽపి విశేషతః ।**
**సర్వకామప్రదశ్శంభుః కేదారాఖ్యో న సంశయః ॥ 25 ॥**

ఆయన సర్వేశ్వరుడైనప్పటికి, విశేషించి ఈ భారతఖండానికి ప్రభువు ఆయనయే. కేదారేశ్వరుడు సమస్త కామనలను ప్రసాదిస్తాడనడంలో సందేహం లేదు.

**ఏతద్వచస్సమాఖ్యాతం యత్పృష్టమృషిసత్తమాః! ।**
**శ్రుత్వా పాపం హరేత్సర్వం నాత్ర కార్యా విచారణా ॥ 26 ॥**

ఓ మహర్షులారా! మీరడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాను. ఈ వృత్తాంతాన్ని విన్నవారు, సర్వపాప – వినిర్ముక్తులౌతారనడంలో సందేహం లేదు.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం కేదారేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం నామైకోన వింశోఽధ్యాయః ॥ 19 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు కేదారేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం అనే పేరుగల పంతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## వింశోఽధ్యాయః – ఇరవైయవ అధ్యాయం

## భీమేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యేభీమాసురకృతోపద్రవవర్ణనమ్ – భీమేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యంలో భీమాసురుని ఉపద్రవవర్ణనం

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**అతఃపరం ప్రవక్ష్యామి మాహాత్మ్యం భైమశంకరమ్ ।**
**యస్య శ్రవణమాత్రేణ సర్వాభీష్టం లభేన్నరః ॥ 1 ॥**

ఇకపై భీమశంకరుని మాహాత్మ్యాన్ని గురించి వివరిస్తాను. దీనిని వినినంత మాత్రం చేతనే మానవులకు సర్వాభీష్టాలు నెరవేరుతాయి.

**కామరూపాభిధే దేశే శంకరో లోకకామ్యయా ।**
**అవతీర్ణః స్వయం సాక్షాత్కల్యాణసుఖభాజనమ్ ॥ 2 ॥**

లోకుల కల్యాణాలకు, సుఖాలకు నిదానమైన శంకరుడు లోకుల కోరికపై 'కామరూపము' అనే ప్రాంతంలో స్వయంగా అవతరించాడు.

**యదర్థమవతీర్ణోఽసౌ శంకరో లోకశంకరః ।**
**శృణుతాదరతస్తచ్చ కథయామి మునీశ్వరాః! ॥ 3 ॥**

ఓ మహర్షులారా! లోకశంకరుడైన శంకరుడీ విధంగా అవతరించడానికి గల పరమార్థాన్ని వివరిస్తాను. సాదరంగా వినండి.

**భీమో నామ మహావీర్యో రాక్షసోఽభూత్పురా ద్విజాః ।**
**దుఃఖదస్సర్వభూతానాం ధర్మధ్వంసకరస్సదా ॥ 4 ॥**

ఓ బ్రాహ్మణులారా! పూర్వకాలంలో సర్వప్రాణులకు దుఃఖాన్ని కలిగించేవాడు, సర్వదా ధర్మానికి హానితలపెట్టేవాడు, మహాపరాక్రమశాలియునైన భీముడనే రాక్షసుడుండేవాడు.

**కుంభకర్ణాత్సముత్పన్నః కర్కట్యాం సుమహాబలః ।**
**సహ్యే చ పర్వతే సోఽపి మాత్రా వాసం చకార హ ॥ 5 ॥**

కుంభకర్ణుని వల్ల కర్కటియందు జన్మించిన మహాబలశాలియైన ఈ రాక్షసుడు తల్లితో కలసి సహ్యాపర్వతం మీద నివాసముండేవాడు.

**కుంభకర్ణే చ రామేణ హతే లోకభయంకరే ।**
**రాక్షసీ పుత్రసంయుక్తా సహ్యేఽతిష్ఠత్స్వయం తదా ॥ 6 ॥**

లోక భయంకరుడైన కుంభకర్ణుని శ్రీరాముడు సంహరించిన తరువాత ఆ రాక్షసి కొడుకుతో కలసి సహ్యాపర్వతంపై ఉండేది.

**స బాల ఏకదా భీమః కర్కటీం మాతరం ద్విజాః! ।**
**పప్రచ్ఛ చ ఖలో లోకదుఃఖదో భీమవిక్రమః ॥ 7 ॥**

ఓ బ్రాహ్మణులారా! బాలుడు, దుష్టుడు, లోకాలకు దుఃఖదుడు, భయంకరపరాక్రమం గలవాడునగు ఆ భీముడు ఒకనాడు తల్లియైన కర్కటిని ఇట్లు ప్రశ్నించాడు.

**భీమ ఉవాచ** – భీముడు పలికాడు.

**మాతర్మే కః పితా కుత్ర కథం వైకాకినీ స్థితా ।**
**జ్ఞాతుమిచ్ఛామి తత్సర్వం యథార్థం త్వం వదాధునా ॥ 8 ॥**

అమ్మా! నా తండ్రి ఎవరు? ఎక్కడున్నాడు? నీవు ఒంటరిగా నుండడానికి కారణమేమిటి? వీటి గురించి నేను తెలియగోరుతున్నాను. నీవిప్పుడు యథార్థగాథను వివరించుము.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఏవం పృష్టా తదా తేన పుత్రేణ రాక్షసీ చ సా ।**
**ఉవాచ పుత్రం సా దుష్టా శ్రూయతాం కథయామ్యహమ్ ॥ 9 ॥**

తన కుమారుడిట్లు ప్రశ్నించగా దుష్టురాలైన రాక్షసి ఓ పుత్రా! చెబుతాను, వినుమని ఇలా చెప్పింది.

**కర్కట్యువాచ** – కర్కటి పలికింది.

**పితా తే కుంభకర్ణశ్చ రావణానుజ ఏవ చ ।**
**రామేణ మారితస్సోఽయం భ్రాత్రా సహ మహాబలః ॥ 10 ॥**

రావణుని తమ్ముడైన కుంభకర్ణుడే నీ తండ్రి. మహాబలశాలియైన కుంభకర్ణుని, వాని సోదరుడైన రావణుని శ్రీరాముడు సంహరించాడు.

**అత్రాగతః కదాచిద్వై కుంభకర్ణస్స రాక్షసః ।**
**మద్భోగం కృతవాంస్తాత ప్రసహ్య బలవాన్పురా ॥ 11 ॥**

బలవంతుడైన కుంభకర్ణుడనే రాక్షసుడు పూర్వమొకనాడు ఇక్కడకు వచ్చి బలాత్కారంగా నన్ను అనుభవించాడు.

**లంకాం స గతవాన్ మాం చ త్యక్త్వాత్రైవ మహాబలః ।**
**మయా న దృష్టా సా లంకా హ్యత్రైవ నివసామ్యహమ్ ॥ 12 ॥**

మహాబలశాలియైన అతడు నన్నిచ్చటే విడిచిపెట్టి లంకకు వెళ్లాడు. నేనులంకను చూడలేదు. ఇక్కడే నివసిస్తున్నాను.

**పితా మే కర్కటో నామ మాతా మే పుష్కసీ మతా ।**
**భర్తా మమ విరాధో హి రామేణ నిహతః పురా ॥ 13 ॥**

నా తండ్రి కర్కటుడు, తల్లి పుష్కసి, నా భర్తయైన విరాధుని పూర్వం శ్రీరాముడు సంహరించాడు.

**పిత్రోః పార్శ్వే స్థితా చాహం నిహతే స్వామిని ప్రియే ।**
**పితరౌ మే మృతౌ చాత్ర ఋషిణా భస్మసాత్కృతౌ ॥ 14 ॥**

నా ప్రియభర్తయైన విరాధుడు మరణించిన పిదప నేను నా తల్లిదండ్రుల వద్దనే యున్నాను. ఒక ఋషి నా తల్లిదండ్రులను భస్మం చేశాడు.

**భక్షణార్థం గతౌ తత్ర క్రుద్ధేన సుమహాత్మనా ।**
**సుతీక్ష్ణేన సుతపసాఽగస్త్యశిష్యేణ వై తదా ॥ 15 ॥**

ఇదే స్థానంలో తనను (అగస్త్యశిష్యుని) భక్షించడానికి వచ్చిన నా తల్లిదండ్రులను, గొప్పమహాత్ముడు, తపస్సంపన్నుడు, అగస్త్యుని శిష్యుడునగు 'సుతీక్ష్ణుడు' అనే ఋషి కోపించి భస్మం చేశాడు.

**సాఽహమేకాకినీ జాతా దుఃఖితా పర్వతే పురా ।**
**నివసామి స్మ దుఃఖార్తా నిరాలంబా నిరాశ్రయా ॥ 16 ॥**

అప్పటినుండియు నేను ఏకాకినై ఈ పర్వతాన్ని ఆశ్రయించి, జీవిక లేనిదాననై, నిరాశ్రయురాలనై దుఃఖంచే పీడింపబడుతూ నివసిస్తున్నాను.

**ఏతస్మిన్సమయే హ్యత్ర రాక్షసో రావణానుజః ।**
**ఆగత్య కృతవాన్ సంగం మాం విహాయ గతో హి సః ॥ 17 ॥**

ఈ సమయంలోనే రావణుని సోదరుడైన కుంభకర్ణుడు ఇచ్చటకు వచ్చి నాతో స్నేహం చేసి, నన్ను విడిచి పెట్టి వెళ్లాడు.

**తతస్త్వం చ సముత్పన్నో మహాబలపరాక్రమః ।**
**అవలంబ్య పునస్త్వాం చ కాలక్షేపం కరోమ్యహమ్ ॥ 18 ॥**

అనంతరం మహాబలపరాక్రమశాలివైన నీవు జన్మించావు. నేను నిన్ను నమ్ముకొని మరల ఎలాగో కాలం గడపుతున్నాను.

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**ఇతి శ్రుత్వా వచస్తస్యా భీమో భీమపరాక్రమః ।**
**క్రుద్ధశ్చ చింతయామాస కిం కరోమి హరిం ప్రతి ॥ 19 ॥**

భయంకర పరాక్రమం గల భీమాసురుడు తల్లి మాటలు విని కోపించి, విష్ణువు విషయంలో ఏమి చేయాలా? అని ఆలోచించాడు.

**పితాఽనేన హతో మే హి తథా మాతామహో హ్యపి ।**
**విరాధశ్చ హతోఽనేన దుఃఖం బహుతరం కృతమ్ ॥ 20 ॥**

“ఈతడు నా తండ్రిని, తల్లి తండ్రిని (మాతామహుణ్ణి) విరాధుని సంహరించి అతిశయించిన దుఃఖాన్ని కలిగించాడు.

**తత్పుత్రోఽహం భవేయం చేద్ధరిం తం పీడయామ్యహమ్ ।**
**ఇతి కృత్వా మతిం భీమస్తపస్తప్తుం మహద్యయౌ ॥ 21 ॥**

నేను నా తండ్రియొక్క పుత్రుడనైతే, ఆ హరికి దుఃఖాన్ని కలిగిస్తానని నిశ్చయించుకొని గొప్ప తపస్సు చేయడానికి వెళ్లాడు.

**బ్రహ్మాణం చ సముద్దిశ్య వర్షాణాం చ సహస్రకమ్ ।**
**మనసా ధ్యానమాశ్రిత్య తపశ్చక్రే మహత్తదా ॥ 22 ॥**

అప్పుడాతడు మనస్సునేకాగ్రం చేసి బ్రహ్మనుద్దేశించి వేయి సంవత్సరాలు గొప్ప తపస్సు చేశాడు.

**ఊర్ధ్వబాహుశ్చైకపాదస్సూర్యే దృష్టిం దధత్పురా ।**
**సంస్థితస్స బభూవాథ భీమో రాక్షసపుత్రకః ॥ 23 ॥**

కుంభకర్ణుని కుమారుడైన భీముడు చేతులను పైకెత్తి, ఒంటి కాలిపై నిలబడి, సూర్యుని వైపు చూస్తూ నిలబడి తపస్సు చేశాడు.

**శిరసస్తస్య సంజాతం తేజః పరమదారుణమ్ ।**
**తేన దగ్ధాస్తదా దేవా బ్రహ్మాణం శరణం యయుః ॥ 24 ॥**

అతని శిరస్సునుండి పరమదారుణమైన తేజస్సు పుట్టింది. దానిచే దహింపబడిన దేవతలు బ్రహ్మను శరణుజొచ్చారు.

**ప్రణమ్య వేధసం భక్త్యా తుష్టువుర్వివిధైః స్తవైః ।**
**దుఃఖం నివేదయాంచక్రుర్బ్రహ్మణే తే సవాసవాః ॥ 25 ॥**

ఇంద్రాది దేవతలందరు బ్రహ్మకు భక్తితో నమస్కరించి వివిధ స్తోత్రాలతో స్తుతించి తమ దుఃఖాన్ని విన్నవించుకున్నారు.

**దేవా ఊచుః** – దేవతలు పలికారు.

**బ్రహ్మన్! వై రక్షసస్తేజో లోకాన్పీడితుముద్యతమ్ ।**
**యత్ప్రార్థ్యతే చ దుష్టేన తత్త్వం దేహి వరం విధే! ॥ 26 ॥**

ఓ బ్రహ్మా! ఓ విధీ! రాక్షసుని తేజస్సు లోకాలను పీడించడానికి సంసిద్ధమయ్యింది. కాబట్టి నీవా దుష్టుడు ఏ వరం కోరితే ఆ వరాన్ని ఇమ్ము.

**నోచేదద్య వయం దగ్ధాస్తీవ్రతత్తేజసా పునః ।**
**యాస్యామస్సంక్షయం సర్వే తస్మాత్తం దేహి ప్రార్థితమ్ ॥ 27 ॥**

నీ వట్లు ఈయనిచో, వాని తీవ్రమైన తేజస్సుచే దహింపబడే మేమందరం నాశనమౌతాము. కాబట్టి వాని కోర్కె తీర్చండి.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఇతి తేషాం వచశ్శ్రుత్వా బ్రహ్మా లోకపితామహః ।**
**జగామ చ వరం దాతుం వచనం చేదమబ్రవీత్ ॥ 28 ॥**

లోకపితామహుడైన బ్రహ్మ దేవతల మాటలు విని భీమునకు వరమివ్వడానికి వాని వద్దకు వెళ్లి ఇలా పలికాడు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ పలికాడు.

**ప్రసన్నోఽస్మి వరం బ్రూహి యత్తే మనసి వర్తతే ।**
**ఇతి శ్రుత్వా విధేర్వాక్యమబ్రవీద్రాక్షసో హి సః ॥ 29 ॥**

ఓ భీమా! నేను ప్రసన్నుడనయ్యాను. నీ మనస్సులో గల కోరికను చెప్పుము. బ్రహ్మయొక్క మాటలు విని ఆ రాక్షసుడిలా పలికాడు.

**భీమ ఉవాచ** – భీముడు పలికాడు.

**యది ప్రసన్నో దేవేశ! యది దేయో వరస్త్వయా ।**
**అతులం చ బలం మేఽద్య దేహి త్వం కమలాసన! ॥ 30 ॥**

"ఓ దేవేశా! కమలాసనా! నీవు ప్రసన్నుడవై నాకు వరమివ్వడానికి నిశ్చయిస్తే, నాకీనాడు సాటిలేని బలాన్నిమ్ము".

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఇత్యుక్త్వా తు నమశ్చక్రే బ్రహ్మణే స హి రాక్షసః ।**
**బ్రహ్మా చాపి తదా తస్మై వరం దత్త్వా గృహం యయౌ ॥ 31 ॥**

ఆ రాక్షసుడిట్లు పలికి బ్రహ్మకు నమస్కరించాడు. బ్రహ్మ కూడ అతనికి వరమిచ్చి తన నివాసానికి వెళ్లాడు.

**రాక్షసో గృహమాగత్య బ్రహ్మాప్తాతిబలస్తదా ।**
**మాతరం ప్రణిపత్యాశు స భీమః ప్రాహ గర్వవాన్ ॥ 32 ॥**

బ్రహ్మనుండి పొందిన బలంచే గర్వించిన భీమాసురుడు వెంటనే ఇంటికి వచ్చి తల్లికి నమస్కరించి, గర్వంతో ఇలా పలికాడు.

**భీమ ఉవాచ –** భీముడు పలికాడు.

**పశ్య మాతర్బలం మేఽద్య కరోమి ప్రళయం మహత్ ।**
**దేవానాం శక్రముఖ్యానాం హరేర్వై తత్సహాయినః ॥ 33 ॥**

ఓ అమ్మా! ఈనాటి నాయీ బలాన్ని చూడు. ఇంద్రాది దేవతలకు, వారికి సహకరిస్తున్న విష్ణువునకు ప్రళయాన్ని సృష్టిస్తాను.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యుక్త్వా ప్రథమం భీమో జిగ్యే దేవాన్సవాసవాన్ ।**
**స్థానాన్నిస్సారయామాస స్వాత్స్వాత్తాన్భీమవిక్రమః ॥ 34 ॥**

ఇట్లు పలికి భయంకరమగుపరాక్రమం గల భీముడు ముందుగా ఇంద్రాది దేవతలను జయించి, వారిని వారి వారి స్థానాలనుండి తొలగించాడు.

**తతో జిగ్యే హరిం యుద్ధే ప్రార్థితం నిర్జరైరపి ।**
**తతో జేతుం రసాం దైత్యః ప్రారంభం కృతవాన్ముదా ॥ 35 ॥**

అనంతరం దేవతలచే ప్రార్థింపబడి యుద్ధానికి వచ్చిన విష్ణువును యుద్ధంలో జయించాడు. అనంతరం భీమాసురుడు ఆనందంతో పాతాళాన్ని జయించే ప్రయత్నం ప్రారంభించాడు.

**పురా సుదక్షిణాం తత్ర కామరూపేశ్వరం ప్రభుమ్ ।**
**జేతుం గతస్తతస్తేన యుద్ధమాసీద్భయంకరమ్ ॥ 36 ॥**

ముందుగా అతడు కామరూపేశ్వరుడైన సుదక్షిణుని జయించడానికి ఆ ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ వానికి ఆయనతో భయంకరమైన యుద్ధం జరిగింది.

**భీమోఽథ తం మహారాజం ప్రభావాద్బ్రహ్మణోఽసురః ।**
**జిగ్యే వరప్రభావేణ మహావీరం శివాశ్రయమ్ ॥ 37 ॥**

అప్పుడు భీమాసురుడు బ్రహ్మయొక్క వరప్రభావంచే శివభక్తుడు, మహావీరుడునైన ఆ మహారాజును జయించాడు.

**స హి జిత్వా తతస్తం చ కామరూపేశ్వరం ప్రభుమ్ ।**
**బబంధ తాడయామాస భీమో భీమపరాక్రమః ॥ 38 ॥**

భయంకరమగు పరాక్రమం గల భీమాసురుడు ఆ కామరూపేశ్వరప్రభుని జయించిన తరువాత అతనిని బంధించి కొట్టాడు.

**గృహీతం తస్య సర్వస్వం రాజ్యం సోపస్కరం ద్విజాః ।**
**తేన భీమేన దుష్టేన శివదాసస్య భూపతేః ॥ 39 ॥**

ఓ బ్రాహ్మణులారా! దుష్టుడైన ఆ భీముడు శివభక్తుడైన ఆ మహారాజు రాజ్యాన్ని, సమస్త సంపదలను లాగుకున్నాడు.

**రాజా చాపి సుధర్మిష్ఠః ప్రియధర్మో హరప్రియః ।**
**గృహీతో నిగడైస్తేన హ్యేకాంతే స్థాపితశ్చ సః ॥ 40 ॥**

పరమధర్మాత్ముడు, ధర్మప్రియుడు, శివప్రియుడునైన ఆ రాజును గొలుసులతో ఏకాంతస్థానంలో బంధించియుంచాడు.

**తత్ర తేన తదా కృత్వా పార్థివీం మూర్తిముత్తమామ్ ।**
**భజనం చ శివస్యైవ ప్రారబ్ధీ ప్రియకామ్యయా ॥ 41 ॥**

అప్పుడా మహారాజు తన ప్రియమైన కోరికను పొందగోరి అచ్చట శివుని పార్థివమూర్తిని చేసి సేవించడం ప్రారంభించాడు.

**గంగాయాస్తవనం తేన బహుధా చ తదా కృతమ్ ।**
**మానసం స్నానకర్మాది కృత్వా శంకరపూజనమ్ ॥ 42 ॥**

ఆ సమయంలో ఆయన మానసికమైన స్నానాదికర్మలు చేసి శంకరుని పూజించి గంగామాతననేక విధాలుగా స్తుతించాడు.

**పార్థివేన విధానేన చకార నృపసత్తమః ।**
**తద్ధ్యానం చ యథా స్యాద్వై కృత్వా చ విధిపూర్వకమ్ ॥ 43 ॥**

ఆ మహారాజు పార్థివవిధానంచే యథావిధిగా పూజించి అక్కడి వీలును బట్టి శివుని ధ్యానిస్తున్నాడు.

**ప్రణిపాతైస్తథా స్తోత్రైర్ముద్రాసనపురస్సరమ్ ।**
**కృత్వా హి సకలం తచ్చ స భేజే శంకరం ముదా ॥ 44 ॥**

ఆ మహారాజు! ఆసనం వేసి, నమస్కారం చేసి, స్తోత్రం పఠించి, ముద్రలు ప్రదర్శించి, సకలోపచారాలతో శంకరుని ఆనందంతో సేవించాడు.

**పంచాక్షరమయీం విద్యాం జజాప ప్రణవాన్వితామ్ ।**
**నాన్యత్కార్యం స వై కర్తుం లబ్ధవానన్తరం తదా ॥ 45 ॥**

ఓంకారంతో కూడిన పంచాక్షరీమంత్రాన్ని జపించాడు. ఆయన కచ్చట మరియొక పని చేసే అవకాశమే లభించడం లేదు.

**తత్పత్నీ చ తదా సాధ్వీ దక్షిణా నామ విశ్రుతా ।**
**నిధానం పార్థివం ప్రీత్యా చకార నృపవల్లభా ॥ 46 ॥**

పతివ్రతయు, దక్షిణయని ప్రసిద్ధిగాంచినదియునగు అతని పత్నియు, ప్రీతితో పార్థివ పూజ చేసింది.

**దంపతీ త్వేకభావేన శంకరం భక్తశంకరమ్ ।**
**భేజాతే తత్ర తౌ నిత్యం శివారాధనతత్పరౌ ॥ 47 ॥**

శివారాధనాపరాయణులగు ఆ దంపతులు ఏకాగ్రతతో భక్తులకు మంగళాన్ని ప్రసాదించే శంకరుని నిత్యం సేవించారు.

**రాక్షసో యజ్ఞకర్మాది వరదర్పవిమోహితః ।**
**లోపయామాస తత్సర్వం మహ్యం వై దీయతామితి ॥ 48 ॥**

వరగర్వంతో విమోహితుడైన రాక్షసుడు 'ఆహుతులు నాకీయాలి' అని చెప్పి యజ్ఞయాగాదికర్మలన్నింటికి లోపం కలిగేటట్లు చేశాడు.

**బహుసైన్యసమాయుక్తో రాక్షసానాం దురాత్మనామ్ ।**
**చకార వసుధాం సర్వాం స్వవశే చర్షిసత్తమాః! ॥ 49 ॥**

ఓ మహర్షులారా! దుర్మార్గులైన పెద్ద రాక్షససైన్యంతో గూడినవాడై భీమాసురుడు భూమండలాన్నంతటిని తన వశం చేసుకున్నాడు.

**వేదధర్మం శాస్త్రధర్మం స్మృతిధర్మం పురాణజమ్ ।**
**లోపయిత్వా చ తత్సర్వం బుభుజే స్వయమూర్జితః ॥ 50 ॥**

బలవంతుడైన ఆ రాక్షసుడు వేదధర్మానికి, శాస్త్రధర్మానికి, స్మృతిధర్మానికి, పురాణోక్తధర్మానికి లోపం కలిగించి సర్వం తానే అనుభవించాడు.

**దేవాశ్చ పీడితాస్తేన సశక్రా ఋషయస్తథా ।**
**అత్యంతం దుఃఖమాపన్నా లోకాన్నిస్సారితా ద్విజాః! ॥ 51 ॥**

ఓ బ్రాహ్మణులారా! వానిచే పీడింపబడిన ఇంద్రాది దేవతలు, ఋషులు తమ తమ స్థానాల నుండి వెడల-గొట్టబడినవారై మహాదుఃఖాన్ని పొందారు.

**తే తతో వికలాస్సర్వే సవాసవసురర్షయః ।**
**బ్రహ్మవిష్ణూ పురోధాయ శంకరం శరణం యయుః ॥ 52 ॥**

అంతట ఇంద్రాది దేవతలు, ఋషులందరు మిక్కిలి దుఃఖించి బ్రహ్మ విష్ణువులను ముందిడుకొని శంకరుని శరణు పొందారు.

**స్తుత్వా స్తోత్రైరనేకైశ్చ శంకరం లోకశంకరమ్ ।**
**ప్రసన్నం కృతవంతస్తే మహాకోశ్యాస్తటే శుభే ॥ 53 ॥**

వారు పవిత్రమైన "మహాకోశీ" నదీతీరంలో లోకాలకు మంగళకారకుడైన శంకరుని వివిధ స్తోత్రాలతో స్తుతించి ప్రసన్నుని చేసుకున్నారు.

**కృత్వా చ పార్థివీం మూర్తిం పూజయిత్వా విధానతః ।**
**తుష్టువుర్వివిధైః స్తోత్రైర్నమస్కారాదిభిః క్రమాత్ ॥ 54 ॥**

వారు పార్థివమూర్తిని చేసి యథావిధిగా పూజించి వివిధ స్తోత్రాలతో స్తుతించి నమస్కారాది ఉపచారాలనన్నింటిని క్రమంగా చేశారు.

**ఏవం స్తుతస్తదా శంభుర్దేవానాం స్తవనాదిభిః ।**
**సుప్రసన్నతరో భూత్వా తాన్సురానిదమబ్రవీత్ ॥ 55 ॥**

దేవతలు చేసిన ఈ స్తోత్రాదులతో మిక్కిలి ప్రసన్నుడైన శంభువపుడు దేవతలతో ఇలా పలికాడు.

**శివ ఉవాచ –** శివుడు పలికాడు.

**హే హరే! హే విధే! దేవాః! ఋషయశ్చాఖిలా అహమ్ ।**
**ప్రసన్నోఽస్మి వరం బ్రూత కిం కార్యం కరవాణి వః ॥ 56 ॥**

ఓ విష్ణూ! ఓ బ్రహ్మా! దేవతలారా! ఋషులారా! మీయందరి విషయంలో నేను ప్రసన్నుడనయ్యాను. వరాన్ని కోరుకోండి. నేను మీకు చేయవలసిన పనియేమి?

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యుక్తే చ తదా తేన శివేన వచనం ద్విజాః! ।**
**సుప్రణమ్య కరౌ బద్ధ్వా దేవా ఊచుశ్శివం తదా ॥ 57 ॥**

ఓ బ్రాహ్మణులారా! అప్పుడు శివుడిట్లు పలుకగా దేవతలు చక్కగా ప్రణమిల్లి చేతులు కట్టుకొని శివునితో ఇట్లన్నారు.

**దేవా ఊచుః –** దేవతలు పలికారు.

**సర్వం జానాసి దేవేశ! సర్వేషాం మనసి స్థితమ్ ।**
**అంతర్యామీ చ సర్వస్య నాజ్ఞాతం విద్యతే తవ ॥ 58 ॥**

ఓ దేవదేవా! అందరి మనస్సులలో నున్నవన్నియు నీకు తెలిసినవే. సర్వాంతర్యామివైన నీకు తెలియని విషయమేదియు ఈ సృష్టిలో కానరాదు.

**తథాపి శ్రూయతాం నాథ! స్వదుఃఖం బ్రూమహే వయమ్ ।**
**త్వదాజ్ఞయా మహాదేవ! కృపాదృష్ట్యా విలోకయ ॥ 59 ॥**

నాథా! మహాదేవా! అయినప్పటికి మీ ఆజ్ఞననుసరించి మేము మా దుఃఖాన్ని గూర్చి తెలియజేస్తాము. దయాదృష్టితో మమ్ము చూడుము.

**రాక్షసః కర్కటీపుత్రః కుంభకర్ణోద్భవో బలీ ।**
**పీడయత్యనిశం దేవాన్బ్రహ్మదత్తవరోర్జితః ॥ 60 ॥**

కర్కటీ – కుంభకర్ణులకు పుట్టిన బలశాలియైన రాక్షసుడు బ్రహ్మదత్తవరప్రభావంచే అమితబలాన్ని పొంది సర్వకాలాలలో దేవతలను పీడిస్తున్నాడు.

**తమిమం జహి భీమాహ్వం రాక్షసం దుఃఖదాయకమ్ ।**
**కృపాం కురు మహేశాన! విలంబం న కురు ప్రభో! ॥ 61 ॥**

ఓ మహేశ్వరా! ఈ విధంగా దుఃఖాన్ని కలిగిస్తున్న ఈ భీమాసురుని నీవు సంహరింపుము. దయచూపుము. ఓ ప్రభూ! ఆలస్యం చేయకుము.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యుక్తస్తు సురైస్సర్వై శ్శంభుర్వై భక్తవత్సలః ।**
**వధం తస్య కరిష్యామీత్యుక్త్వా దేవాంస్తతో ఽబ్రవీత్ ॥ 62 ॥**

దేవతలందరు ఇట్లు చెప్పగా భక్తవత్సలుడైన శంభుడు వానిని వధిస్తానని చెప్పి దేవతలతో మరల ఇట్లన్నాడు.

**శంభురువాచ –** శంభుడు పలికాడు.

**కామరూపేశ్వరో రాజా మదీయో భక్త ఉత్తమః ।**
**తస్మై బ్రూతేతి వై దేవాః! కార్యం శీఘ్రం భవిష్యతి ॥ 63 ॥**

కామరూపమహారాజు నా భక్తులలో ఉత్తముడు. ఓ దేవతలారా! అతనితో ఈవిధంగా చెప్పండి. మీకార్యం శీఘ్రంగా సంపన్నం కాగలదు.

**సుదక్షిణమహారాజ! కామరూపేశ్వర! ప్రభో! ।**
**మద్భక్తస్త్వం విశేషేణ కురు మద్భజనం రతేః ॥ 64 ॥**

"ఓ సుదక్షిణమహారాజా! కామరూపేశ్వర ప్రభూ! నీవు నా భక్తులలో శ్రేష్ఠుడవు. నీవు నన్ను ప్రీతితో సేవింపుము.

**దైత్యం భీమాహ్వయం దుష్టం బ్రహ్మప్రాప్తవరోర్జితమ్ ।**
**హనిష్యామి న సందేహస్త్వత్తిరస్కారకారిణమ్ ॥ 65 ॥**

దుష్టుడైన భీమాసురుడు బ్రహ్మదత్తవరంచే బలాన్ని పొందియున్నాడు. నిన్ను తిరస్కరించిన భీమాసురుని నిస్సందేహంగా సంహరిస్తాను.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**అథ తే నిర్జరాస్సర్వే తత్ర గత్వా ముదాన్వితాః ।**
**తస్మై మహానృపాయోచుర్యదుక్తం శంభునా చ తత్ ॥ 66 ॥**

అనంతరం ఆ దేవతలందరు ఆనందంతో కూడినవారై అచ్చటకు వెళ్ళి కామరూపమహారాజునకు శంభుని వచనాలు విన్నవించారు.

**తమిత్యుక్త్వా చ వై దేవా ఆనందం పరమం గతాః ।**
**మహర్షయశ్చ తే సర్వే యయుశ్శీఘ్రం నిజాశ్రమాన్ ॥ 67 ॥**

మహర్షులు, దేవతలందరు, ఆ మహారాజునకు విన్నవించిన పిదప పరమానందాన్ని పొంది వెంటనే తమ తమ స్థానాలకు వెళ్లారు.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం భీమేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యే భీమాసుర-కృతోపద్రవవర్ణనం నామ వింశోఽధ్యాయః ॥ 20 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు భీమేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యంలో భీమాసురుని ఉపద్రవవర్ణనం అనే పేరుగల ఇరవైయవ అధ్యాయం సమాప్తం.

## ఏకవింశోఽధ్యాయః - ఇరవైఒకటవ అధ్యాయం

## భీమేశ్వరజ్యోతిర్లింగోత్పత్తిమాహాత్మ్యవర్ణనమ్ - భీమేశ్వరజ్యోతిర్లింగోత్పత్తిమాహాత్మ్యవర్ణనం

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**శివోఽపి చ గణైస్సార్ధం జగామ హితకామ్యయా ।**
**స్వభక్తనికటం గుప్తస్తస్థౌ రక్షార్థమాదరాత్ ॥ 1 ॥**

శివుడు కూడ గణాలతో కూడి తన భక్తునకు హితం చేయడానికి అతని సమీపానికి వెళ్లి అతనిని రక్షించాలనే శ్రద్ధతో అచ్చట రహస్యంగా దాగియున్నాడు.

**ఏతస్మిన్నంతరే తత్ర కామరూపేశ్వరేణ చ ।**
**అత్యంతం ధ్యానమారబ్ధం పార్థివస్య పురస్తదా ॥ 2 ॥**

ఇంతలో కామరూపమహారాజు శివుని పార్థివమూర్తి యెదుట విశిష్ట ధ్యానాన్ని ప్రారంభించాడు.

**కేనచిత్తత్ర గత్వా చ రాక్షసాయ నివేదితమ్ ।**
**రాజా కించిత్కరోత్యేవం త్వదర్థం హ్యభిచారికమ్ ॥ 3 ॥**

ఒకానొకడు ఆ రాక్షసుని వద్దకు వెళ్లి, ఈ రాజు నీపై ఏదో ఒక చేతబడిని చేస్తున్నాడని చెప్పాడు.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**రాక్షసస్స చ తచ్ఛ్రుత్వా క్రుద్ధస్తద్ధననేచ్ఛయా ।**
**గృహీత్వా కరవాలం చ జగామ నృపతిం ప్రతి ॥ 4 ॥**

రాక్షసుడు దానిని విని మిక్కిలి కోపించి ఆ మహారాజును సంహరించడానికి కత్తిని చేతబట్టుకొని ఆయన వద్దకు వెళ్లాడు.

**తద్దృష్ట్వా రాక్షసస్తత్ర పార్థివాదిస్థితం చ యత్ ।**
**తదర్థం తత్స్వరూపం చ దృష్ట్వా కించిత్కరోత్యసౌ ॥ 5 ॥**

ఆ రాక్షసుడచ్చటకు వెళ్లి పార్థివమూర్తి మున్నగు వాటిని చూచి ఇట్లాలోచించాడు. "ఇతడీ మూర్తిని చూస్తూ ఏదో చేస్తున్నాడు.

**అత ఏనం బలాదద్య హన్మి సోపస్కరం నృపమ్ ।**
**విచార్యేతి మహాక్రుద్ధో రాక్షసః ప్రాహ తం నృపమ్ ॥ 6 ॥**

కాబట్టి పరిచారకులతో సహా ఈ మహారాజును బలప్రయోగం చేసి సంహరిస్తాను" అని ఆలోచించి ఆ రాక్షసుడు మహాక్రోధంతో ఆ రాజునుద్దేశించి ఇట్లన్నాడు.

**భీమ ఉవాచ** - భీముడు పలికాడు.

**రే రే పార్థివ! దుష్టాత్మన్! క్రియతే కిం త్వయాధునా ।**
**సత్యం వద న హన్యాం త్వామన్యథా హన్మి నిశ్చితమ్ ॥ 7 ॥**

"ఓరీ రాజా! దుర్బుద్ధీ! నీవిప్పుడేమిచేస్తున్నావు? సత్యం పలుకు. సత్యం చెబితే నిన్ను సంహరించను. లేనిచో నిన్ను నిశ్చయంగా సంహరిస్తాను".

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఇతి శ్రుత్వా వచస్తస్య కామరూపేశ్వరశ్చ సః ।**
**మనసీతి చిచింతాశు శివవిశ్వాసపూరితః ॥ 8 ॥**

ఈ మాటలు విని, శివునియందు నమ్మకముతో నిండినవాడగు కామరూపమహారాజు మనస్సులో ఇలా అనుకున్నాడు.

**భవిష్యం యద్భవత్యేవ నాస్తి తస్య నివర్తకః ।**
**ప్రారబ్ధాధీనమేవాత్ర ప్రారబ్ధస్స శివః స్మృతః ॥ 9 ॥**

"జరుగవలసింది జరిగియే తీరుతుంది. దానిని నివారించే వారెవ్వరు లేరు. ఈ లోకంలో సర్వం ప్రారబ్ధం పైననే ఆధారపడియుంది. అట్టి ప్రారబ్ధకర్మ ఫలాన్నిచ్చేవాడు శివుడని చెప్పబడింది.

**కృపాళుశ్శంకరశ్చాత్ర పార్థివే వర్తతే ధ్రువమ్ ।**
**మదర్థం న కరోతీహ కుతః కోఽయం చ రాక్షసః ॥ 10 ॥**

దయాళువైన శంకరుడీ పార్థివమూర్తియందు నిశ్చయంగా ఉన్నాడు. ఇప్పుడాయన నా పని చేయడాయేమి? ఈ రాక్షసుడెవ్వడు?

**స్వానురూపాం ప్రతిజ్ఞాం స సత్యం చైవ కరిష్యతి ।**
**సత్యప్రతిజ్ఞో భగవాన్ శివశ్చేతి శ్రుతౌ శ్రుతః ॥ 11 ॥**

ఆయన తనకు తగిన ప్రతిజ్ఞ చేసి, దానిని సత్యం చేస్తాడు. శివభగవానుడు సత్యప్రతిజ్ఞ గలవాడని వేదం స్పష్టం చేస్తోంది.

**మమ భక్తం యదా కశ్చిత్పీడయత్యతిదారుణః ।**
**తదాహం తస్య రక్షార్థం దుష్టం హన్మి న సంశయః ॥ 12 ॥**

నా భక్తుని ఎవడైనా క్రూరాత్ముడు పీడిస్తే, అప్పుడు నేనా భక్తుని రక్షించడానికి నిస్సందేహంగా ఆ దుష్టుని సంహరిస్తాను".

**ఏవం ధైర్యం సమాలంబ్య ధ్యాత్వా దేవం చ శంకరమ్ ।**
**ప్రార్థయామాస సద్భక్త్యా మనసైవ రసేశ్వరః ॥ 13 ॥**

ఈ విధమైన ప్రతిజ్ఞపై విశ్వాసంచేత ధైర్యం వహించిన మహారాజు శంకరుని ధ్యానించి ఉత్తమమైన భక్తితో మనస్సులోనే ప్రార్థించాడు.

**త్వదీయోఽస్మి మహారాజ! యథేచ్ఛసి తథా కురు ।**
**సత్యం చ వచనం హ్యత్ర బ్రవీమి కురు మే హితమ్ ॥ 14 ॥**

"ఓ జగన్నాథా! నేను నీవాడను. నేను సత్యాన్నే పలుకుతున్నాను. నీకు తోచినట్లు చేయుము. నాకు హితాన్ని కలిగించుము".

**ఏవం మనసి స ధ్యాత్వా సత్యపాశేన మంత్రితః ।**
**ప్రాహ సత్యం వచో రాజా రాక్షసం చావమానయన్ ॥ 15 ॥**

ఈ విధంగా రాజు మనసులో ధ్యానించి సత్యపాశంచే నియంత్రింపబడినవాడై ఆ రాక్షసునకవమానం కలిగే విధంగా సత్యవచనాన్నిలా పలికాడు.

**నృప ఉవాచ –** రాజు పలికాడు

**భజామి శంకరం దేవం స్వభక్తపరిపాలకమ్ ।**
**చరాచరాణాం సర్వేషామీశ్వరం నిర్వికారకమ్ ॥ 16 ॥**

"తన భక్తులను పరిపాలించేవాడు, చరాచర జగత్తునకంతటికి ప్రభువు, నిర్వికారకుడునగు శంకరుని సేవిస్తున్నాను".

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇతి తస్య వచః శ్రుత్వా కామరూపేశ్వరస్య సః ।**
**క్రోధేన ప్రచలద్గాత్రో భీమో వచనమబ్రవీత్ ॥ 17 ॥**

కామరూపమహారాజుయొక్క ఈ మాటలు విని కోపంతో కంపించే దేహం గలవాడై భీమాసురుడిలా పలికాడు.

**భీమ ఉవాచ –** భీముడు పలికాడు.

**శంకరస్తే మయా జ్ఞాతః కిం కరిష్యతి వై మమ ।**
**యో మే పితృవ్యకేనైవ స్థాపితః కింకరో యథా ॥ 18 ॥**

"నీ శంకరుడు నాకు తెలిసినవాడే, ఆయన నన్నేమి చేస్తాడు? ఆయనను నా పినతండ్రి తనవద్ద సేవకునిగా ఉంచుకున్నాడు.

**తద్బలం హి సమాశ్రిత్య విజేతుం త్వం సమీహసే ।**
**తర్హి త్వయా జితం సర్వం నాత్ర కార్యా విచారణా ॥ 19 ॥**

నీవు అతని బలాన్ని నమ్ముకొని నన్ను జయించాలనుకుంటున్నావు. అలా అయినచో నీవు జయించినట్లే! ఈ విషయంలో సందేహం లేదు.

**యావన్మయా న దృష్టో హి శంకరస్త్వత్ప్రపాలకః ।**
**తావత్త్వం స్వామినం మత్వా సేవసే నాన్యథా క్వచిత్ ॥ 20 ॥**

నిన్ను రక్షించే శివుని నేను చూడనంత వరకు, నీవు అతనిని ప్రభువుగా తలంచి సేవించుము. దీనికి భిన్నంగా ఎన్నడూ జరుగదు.

**మయా దృష్టే చ తత్సర్వం స్ఫుటం స్యాత్సర్వథా నృప! ।**
**తస్మాత్త్వం వై శివస్యేదం రూపం దూరతరం కురు ॥ 21 ॥**

ఓ రాజా! ఆయన నాకు కనబడితే అన్నివిధాలుగా ఈ సర్వస్వం భగ్నమౌతుంది. కాబట్టి నీవు శివునియొక్క ఈ మూర్తిని దూరంగా పారవేయుము.

**అన్యథా హి భయం తేఽద్య భవిష్యతి న సంశయః ।**
**స్వామినస్తే కరం తీక్ష్ణం దాస్యేఽహం భీమవిక్రమః ॥ 22 ॥**

నీవావిధంగా చేయనిచో నీకీనాడు భయం సంప్రాప్తమౌతుందనడంలో సందేహం లేదు. భయంకర పరాక్రమం గల నేను నీ స్వామికి నా చేతి దెబ్బను చూపడం నిశ్చయం."

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**ఇతి తద్వచనం శ్రుత్వా కామరూపేశ్వరో నృపః ।**
**దృఢం శంకరవిశ్వాసో ద్రుతం వాక్యమువాచ తమ్ ॥ 23 ॥**

శంకరునియందు దృఢమైన విశ్వాసంగల ఆ కామరూపమహారాజు వాని మాటలు విని భీమాసురునితో ఇలా అన్నాడు.

**రాజోవాచ -** రాజు పలికాడు.

**అహం చ పామరో దుష్టో న మోక్ష్యే శంకరం పునః ।**
**సర్వోత్కృష్టశ్చ మే స్వామీ న మాం ముంచతి కర్హిచిత్ ॥ 24 ॥**

"నేను పామరుడను. దుష్టుడను. నేను శంకరుని మాత్రం విడిచిపెట్టను. సర్వోత్కృష్టుడైన నా స్వామి నన్నేనాడూ విడిచిపెట్టడు."

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఏవం వచస్తదా శ్రుత్వా తస్య రాజ్ఞశ్శివాత్మనః ।**
**తం ప్రహస్య ద్రుతం భీమో భూపతిం రాక్షసోఽబ్రవీత్ ॥ 25 ॥**

శివస్వరూపుడైన ఆ రాజు మాటలు విని భీమాసురుడు వెంటనే ఆ మహారాజును అవహేళన చేసి ఇలా పలికాడు.

**భీమ ఉవాచ** – భీముడు పలికాడు.

**మత్తో భిక్షయతే నిత్యం స కిం జానాతి స్వాకృతిమ్ ।**
**యోగినాం కా చ నిష్ఠా వై భక్తానాం ప్రతిపాలనే ॥ 26 ॥**

"మత్తుడైన శివుడు నిత్యం భిక్షాటన చేస్తాడు. తన రూపమేమిటో తనకేమి తెలుసు? భక్తులను రక్షించే పాలకత్వం యోగులకెందుకుంటుంది?

**ఇతి కృత్వా మతిం త్వం చ దూరతో భవ సర్వథా ।**
**అహం చ తవ స స్వామీ యుద్ధం వై కరవావహై ॥ 27 ॥**

నీవీవిషయాన్ని తెలుసుకొని సర్వవిధాలుగా నీవాయనకు దూరంగా ఉండు. నీ స్వామి, నేను యుద్ధం చేస్తాము."

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఇత్యుక్తస్స నృపశ్రేష్ఠశ్శంభుభక్తో దృఢవ్రతః ।**
**ప్రత్యువాచాభయో భీమం దుఃఖదం జగతాం సదా ॥ 28 ॥**

లోకాలకు సర్వదా దుఃఖాన్ని కలిగించే భీమాసురుడిట్లు పలుకగా శంభుని భక్తుడు, దృఢవ్రతుడునైన మహారాజు నిర్భయంగా ఇలా బదులు పలికాడు.

**రాజోవాచ** – రాజు పలికాడు.

**శృణు రాక్షస! దుష్టాత్మన్మయా కర్తుం న శక్యతే ।**
**త్వయా విక్రియతే తర్హి కుతస్త్వం శక్తిమానసి ॥ 29 ॥**

"ఓ రాక్షసా! దుష్టాత్మా! విను. నీ మాటలు పాలించడం నా వల్ల కాదు. నీకు తప్పుమార్గంలో వెళ్లడానికి కావలసిన శక్తి ఎక్కడిది?"

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఇత్యుక్తస్సైన్యమాదాయ రాజానం పరిభర్త్స్య తమ్ ।**
**కరాలం కరవాలం చ పార్థివే ప్రాక్షిపత్తదా ॥ 30 ॥**

ఆ రాజు ఈ విధంగా పలుకగానే భీముడు ఆయనను నిందాపూర్వకంగా బెదిరించి సైన్యం తోడురాగా భయంకరమైన కత్తిని శివుని పార్థివమూర్తిపై ప్రయోగించాడు.

**పశ్య త్వం స్వామినోఽద్యైవ బలం భక్తసుఖావహమ్ ।**
**ఇత్యువాచ విహస్యైవ రాక్షసైస్స మహాబలః ॥ 31 ॥**

"భక్తులకు సుఖాన్ని కలిగించే నీ స్వామి బలం నీవిప్పుడే చూడు" అని మహాబలశాలుడైన రాక్షసుడు పలికాడు. అతడు, ఇతర రాక్షసులు బిగ్గరగా నవ్వారు.

**కరవాలః పార్థివం చ యావత్ స్పృశతి నో ద్విజాః! ।**
**యావచ్చ పార్థివాత్తస్మాదావిరాసీత్స్వయం హరః ॥ 32 ॥**

ఓ బ్రాహ్మణులారా! ఆ కత్తి పార్థివలింగాన్ని స్పృశించేలోపుగ ఆ పార్థివలింగంనుండి సాక్షాత్తుగా శివుడు ఆవిర్భవించాడు.

**పశ్య భీమేశ్వరోఽహం చ రక్షార్థం ప్రకటోఽభవమ్ ।**
**మమ పూర్వవ్రతం హ్యేతద్రక్ష్యో భక్తో మయా సదా ॥ 33 ॥**

"చూడు, నేను భీమేశ్వరుడను. భక్తులను రక్షించడానికి నేను ప్రకటితుడనయ్యాను. సర్వకాలాలలో నా భక్తులు నాచే రక్షణీయులనే వ్రతం నాకు పూర్వం నుండి కలదు.

**ఏతస్మాత్పశ్య మే శీఘ్రం బలం భక్తసుఖావహమ్ ।**
**ఇత్యుక్త్వా స పినాకేన కరవాలో ద్విధా కృతః ॥ 34 ॥**

కాబట్టి నా భక్తులకు సుఖాన్ని కలిగించే నా బలాన్ని నీవు శీఘ్రంగా చూస్తావని పలికి ఆయన కత్తిని పినాకంతో రెండు ముక్కలుగా చేశాడు.

**పునశ్చైవ త్రిశూలం స్వం చిక్షిపే తేన రక్షసా ।**
**తచ్ఛూలం శతధా నీతమపి దుష్టస్య శంభునా ॥ 35 ॥**

మరల ఆ దుష్టరాక్షసుడు తన త్రిశూలాన్ని విసరగా మహేశ్వరుడు ఆ శూలాన్ని వందముక్కలు చేశాడు.

**పునశ్శక్తిశ్చ నిఃక్షిప్తా తేన శంభూపరి ద్విజాః ।**
**శంభునా సాపి బాణైస్స్వైర్లక్షధా చ కృతా ద్రుతమ్ ॥ 36 ॥**

ఓ బ్రాహ్మణులారా! ఆ రాక్షసుడు శంభునిపై మరల శక్తిని ప్రయోగించాడు. శివుడు వెంటనే దానిని తన బాణంతో లక్ష ముక్కలు చేశాడు.

**పట్టిశశ్చ తతస్తేన నిక్షిప్తో హి శివోపరి ।**
**శివేన స త్రిశూలేన తిలశశ్చ కృతం క్షణాత్ ॥ 37 ॥**

అనంతరం వాడు శివునిపై పట్టిశాయుధం ప్రయోగించగా దానిని శివుడు క్షణంలో త్రిశూలంతో నుగ్గునుగ్గ చేశాడు.

**తతశ్శివగణానాం చ రాక్షసానాం పరస్పరమ్ ।**
**యుద్ధమాసీత్తదా ఘోరం పశ్యతాం దుఃఖకావహమ్ ॥ 38 ॥**

అప్పుడు శివగణాలకు రాక్షసులకు, పరస్పరం జరిగిన భయంకర యుద్ధం చూసేవారందరికి ఎంతో బాధను కలిగించింది.

**తతశ్చ పృథివీ సర్వా వ్యాకులా చాభవత్ క్షణాత్ ।**
**సముద్రాశ్చ తదా సర్వే చుక్షుభుస్సమహీధరాః ॥ 39 ॥**

అప్పుడు క్షణంలో భూమండలమంతా అల్లకల్లోలమయ్యింది. సకల సముద్రాలు, పర్వతాలు కంపించి పోయాయి.

**దేవాశ్చ ఋషయస్సర్వే బభూవుర్వికలా అతి ।**
**ఊచుః పరస్పరం చేతి వ్యర్థం వై ప్రార్థితశ్శివః ॥ 40 ॥**

సకల దేవతలు, ఋషులు చాలా వ్యాకులత చెందారు. మనం అనవసరంగా శివుని ప్రార్థించి పొరపాటు చేశామని వారు తమలో తాము పలుకజొచ్చారు.

**నారదశ్చ సమాగత్య శంకరం దుఃఖదాహకమ్ ।**
**ప్రార్థయామాస తత్రైవ సాంజలిర్నతమస్తకః ॥ 41 ॥**

నారదుడు వచ్చి చేతులు జోడించి తలవంచి దుఃఖదాహకుడైన శంకరుని అదే స్థానంలో ప్రార్థించాడు.

**నారద ఉవాచ** – నారదుడు పలికాడు.

**క్షమ్యతాం క్షమ్యతాం నాథ! త్వయా విభ్రమకారక! ।**
**తృణే కశ్చ కుఠారో వై హన్యతాం శీఘ్రమేవ హి ॥ 42 ॥**

"ఓ నాథా! క్షమించుము క్షమించుము. విశేషంగా సమ్మోహాన్ని కలిగించువాడా! గడ్డి త్రుంచడానికి గొడ్డలితో పనియేమి? వీనిని శీఘ్రంగా సంహరించుము".

**ఇతి సంప్రార్థితశ్శంభుః సర్వాన్రక్షోగణాన్ప్రభుః ।**
**హుంకారేణైవ చాస్త్రేణ భస్మసాత్కృతవాంస్తదా ॥ 43 ॥**

ఈ విధంగా ప్రార్థింపబడిన శంభువప్పుడు హుంకారాస్త్రంచేతనే రాక్షసగణాలనన్నింటినీ భస్మం చేశాడు.

**సర్వే తే రాక్షసా దగ్ధాః శంకరేణ క్షణం మునే! ।**
**బభూవుస్తత్ర సర్వేషాం దేవానాం పశ్యతాం ద్రుతమ్ ॥ 44 ॥**

ఓ మహర్షీ! దేవతలందరూ చూస్తుండగా శంకరునిచే రాక్షసులందరు క్షణకాలంలో దగ్ధం చేయబడ్డారు.

**దావానలగతో వహ్నిర్యథా చ వనమాదహేత్ ।**
**తథా శివేన క్రుద్ధేన రాక్షసానాం బలం క్షణాత్ ॥ 45 ॥**

దావాగ్ని, వనాన్ని దహించినట్లుగా, కోపించిన శంకరుడు రాక్షససైన్యాన్ని క్షణంలో పూర్తిగా తగులబెట్టాడు.

**భీమస్యైవ చ కిం భస్మ న జ్ఞాతం కేనచిత్తదా ।**
**పరివారయుతో దగ్ధో నామ న శ్రూయతే క్వచిత్ ॥ 46 ॥**

భీమాసురుడు పరివారసమేతంగా నిశ్శేషంగా దహింపబడ్డాడు. అతని భస్మం కూడా ఇతరులకెవ్వరికి కనబడలేదు. అతని మాటయైనా ఎవరికీ వినబడలేదు.

**తతశ్శివస్య కృపయా శాంతిం ప్రాప్తా మునీశ్వరాః ।**
**దేవాస్సర్వే చ శక్రాద్యాస్స్వాస్థ్యం ప్రాపాఖిలం జగత్ ॥ 47 ॥**

అంతట శివుని కృపచే మునులు, సమస్తదేవతలు, ఇంద్రాదులు శాంతిని పొందారు. లోకాలన్నీ స్వస్థతను పొందాయి.

**క్రోధజ్వాలా మహేశస్య నిస్ససార వనాద్వనమ్ ।**
**రాక్షసానాం చ తద్భస్మ సర్వం వ్యాప్తం వనేఽఖిలమ్ ॥ 48 ॥**

మహేశ్వరుని కోపాగ్ని జ్వాలలు ఒక వనంనుండి మరియొక వనానికి వ్యాపించాయి. రాక్షసుల భస్మము, వనమంతటా వ్యాపించింది.

**తతశ్చౌషధయో జాతా నానాకార్యకరాస్తథా ।**
**రూపాంతరం తతో నృణాం భవేద్వేషాంతరం తథా ॥ 49 ॥**

దానినుండి వివిధ ప్రయోజనాలను సిద్ధింపజేసే ఓషధులు పుట్టాయి. మానవులాభస్మమును వినియోగించి వివిధ వేషాలు, రూపాలు ధరించవచ్చు.

**భూతప్రేతపిశాచాది దూరతశ్చ తతో వ్రజేత్ ।**
**తన్న కార్యం చ యచ్చైవ తతో న భవతి ద్విజాః! ॥ 50 ॥**

ఓ బ్రాహ్మణులారా! భస్మంవల్ల భూతప్రేత పిశాచాదులు దూరమౌతాయి. భస్మంచే సాధించలేని కార్యం లేదు.

**తైర్దేవైః ప్రార్థితశ్శంభుర్మునిభిశ్చ విశేషతః ।**
**స్థాతవ్యం స్వామినా హ్యత్ర లోకానాం సుఖహేతవే ॥ 51 ॥**

దేవతలు, మునులు విశేషంగా శంభుని ఇట్లు ప్రార్థించారు. "ఓ దేవా! లోకాలకు సుఖం కలిగించడానికి నీవిచ్చటనే స్థిరనివాసముండాలి".

**అయం వై కుత్సితో దేశ అయోధ్యాలోకదుఃఖదః ।**
**భవంతం చ తదా దృష్ట్వా కల్యాణం సంభవిష్యతి ॥ 52 ॥**

ఈ ప్రాంతం ప్రజలకు దుఃఖాన్ని కలిగించేది, అపవిత్రమైనది, ప్రవేశించడానికి అసాధ్యమైనది. కాని ఇక్కడ నీ దర్శనం చేయడంవల్ల ఇది మంగళకరం కాగలదు.

**భీమశంకరనామా త్వం భవితా సర్వసాధకః ।**
**ఏతల్లింగం సదా పూజ్యం సర్వాపద్వినివారకమ్ ॥ 53 ॥**

భీమశంకరుడనే పేరు గల నీవు కార్యాలన్నింటిని సాధించి పెడతావు. ఆపదలనన్నింటిని పోగొట్టే ఈ శివలింగం సర్వదా పూజనీయం కాగలదు".

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యేవం ప్రార్థితశ్శంభుర్లోకానాం హితకారకః ।**
**తత్రైవాస్థితవాన్ప్రీత్యా స్వతంత్రో భక్తవత్సలః ॥ 54 ॥**

లోకహితకారకుడు, స్వతంత్రుడు, భక్తవత్సలుడునైన శంభువు ఈవిధంగా ప్రార్థింపబడినవాడై ప్రీతితో అక్కడనే స్థిరంగానున్నాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం భీమేశ్వరజ్యోతిర్లింగోత్పత్తిమాహాత్మ్యవర్ణనం నామైకవింశోఽధ్యాయః ॥ 21 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు భీమేశ్వరజ్యోతిర్లింగోత్పత్తి మాహాత్మ్యవర్ణనం అనే పేరుగల ఇరవైఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్వావింశోఽధ్యాయః - ఇరవైరెండవ అధ్యాయం

## కాశ్యాం రుద్రాగమనవర్ణనమ్ - కాశీకి రుద్రాగమనవర్ణనం

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**అతః పరం ప్రవక్ష్యామి శ్రూయతామృషిసత్తమాః! ।**
**విశ్వేశ్వరస్య మాహాత్మ్యం మహాపాతకనాశనమ్ ॥ 1 ॥**

ఓ శ్రేష్ఠమహర్షులారా! ఇటుపై మహాపాతకనాశకుడైన విశ్వేశ్వరుని మాహాత్మ్యాన్ని చెబుతాను వినండి.

**యదిదం దృశ్యతే కించిజ్జగత్యాం వస్తుమాత్రకమ్ ।**
**చిదానందస్వరూపం చ నిర్వికారం సనాతనమ్ ॥ 2 ॥**

ఈ జగత్తులో కనబడే సమస్త వస్తుజాలము నిర్వికారము, సనాతనము, చిదానందఘనమునైన పరబ్రహ్మ మాత్రమే అయి ఉంటుంది.

**తస్యైవ కైవల్యరతేర్ద్వితీయేచ్ఛా తతోఽభవత్ ।**
**స ఏవ సగుణో జాతశ్శివ ఇత్యభిధీయతే ॥ 3 ॥**

అప్పుడు అద్వితీయానందఘనమైన పరబ్రహ్మకు రెండవ ఇచ్ఛ కలిగింది. ఆ పరబ్రహ్మయే సగుణమై 'శివుడు' అనే పేరు పొందాడు.

**స ఏవ హి ద్విధా జాతః పుంస్త్రీరూపప్రభేదతః ।**
**యః పుమాన్స శివః ఖ్యాతః స్త్రీశక్తిస్సా హి కథ్యతే ॥ 4 ॥**

ఆ శివుడే స్త్రీ, పురుషభేదంచే రెండు రూపాలు ధరించాడు. పురుషునకు శివుడనియు, స్త్రీకి శక్తి అనియు ఖ్యాతి కలిగింది.

**చిదానందస్వరూపాభ్యాం పురుషావపి నిర్మితౌ ॥ 5 ॥**

**అదృష్టాభ్యాం తదా తాభ్యాం స్వభావాన్మునిసత్తమాః ।**
**తావద్దృష్ట్వా తదా తౌ చ స్వమాతాపితరౌ ద్విజాః ॥ 6 ॥**

**మహాసంశయమాపన్నౌ ప్రకృతిః పురుషశ్చ తౌ ।**
**తదా వాణీ సముత్పన్నా నిర్గుణాత్పరమాత్మనః ॥**
**తపశ్చైవ ప్రకర్తవ్యం తతస్సృష్టిరనుత్తమా ॥ 7 ॥**

ఓ మహర్షులారా! చైతన్యం, ఆనందం స్వరూపంగా గలవారు ఇంద్రియగోచరం కానివారునైన ఆ శక్తి-శివులు నుండియే మాయాప్రభావంచే ప్రకృతి - పురుషులు నిర్మింపబడ్డారు. ఓ బ్రాహ్మణులారా! అంతట ఆ ప్రకృతి-పురుషులు తమ తల్లిదండ్రులను గాంచి గొప్పసంశయం పొందారు. అప్పుడు నిర్గుణ పరబ్రహ్మం నుండి "తపస్సు చేయండి. అనంతరం సర్వశ్రేష్ఠమైన సృష్టిచేయండి" అనే శబ్దం (వాణి) విన వచ్చింది.

**ప్రకృతిపురుషావూచతుః -** ప్రకృతిపురుషులు పలికారు.

**తపసస్తు స్థలం నాస్తి కుత్రావాభ్యాం ప్రభోఽధునా ।**
**స్థిత్వా తపః ప్రకర్తవ్యం తవ శాసనతశ్శివ ॥ 8 ॥**

"ఓ ప్రభూ! తపస్సు చేయడానికి స్థలం లేదు. ఓ శివా! మేము మీ ఆజ్ఞచే ఇప్పుడే స్థలంలో కూర్చుండి తపస్సు చేయాలి?

**తతశ్చ తేజసస్సారం పంచక్రోశాత్మకం శుభమ్ ।**
**సర్వోపకరణైర్యుక్తం సుందరం నగరం తథా ॥ 9 ॥**

**నిర్మాయ ప్రేషితం తత్స్వం నిర్గుణేన శివేన చ ।**
**అంతరిక్షే స్థితం తచ్చ పురుషస్య సమీపతః ॥ 10 ॥**

అంతట నిర్గుణుడైన శివుడు తేజోఘనము, శుభకరము, అయిదు క్రోసుల పరిమాణం కలది, సమస్త పరికరాలతో కూడియున్నదియునైన సుందరనగరాన్ని నిర్మించి పంపించాడు. అది అంతరిక్షంలో పురుషుని సమీపంలో నిలబడింది.

**తదధిష్ఠాయ హరిణా సృష్టికామనయా తతః ।**
**బహుకాలం తపస్తప్తం తద్ధ్యానమవలంబ్య చ ॥ 11 ॥**

అప్పుడు విష్ణువు సృష్టిని చేయగోరి దానినధిష్ఠించి శివుని ధ్యానిస్తూ చిరకాలం తపస్సు చేశాడు.

**శ్రమేణ జలధారాశ్చ వివిధాశ్చాభవంస్తదా ।**
**తాభిర్వ్యాప్తం చ తచ్ఛూన్యం నాన్యత్కించిదదృశ్యత ॥ 12 ॥**

ఆ శ్రమచే అనేక నీటిధారలు పుట్టి ఆ శూన్యమంతా వాటితో నిండిపోయింది. ఇతర మేమియూ కానరాలేదు.

**తతశ్చ విష్ణునా దృష్టం కిమేతద్దృశ్యతేఽద్భుతమ్ ।**
**ఇత్యాశ్చర్యం తదా దృష్ట్వా శిరసః కంపనం కృతమ్ ॥ 13 ॥**

**తతశ్చ పతితః కర్ణాత్ మణిశ్చ పురతః ప్రభో ।**
**తద్బభూవ మహత్తీర్థం నామతో మణికర్ణికా ॥ 14 ॥**

అప్పుడు "ఏమిది, అద్భుతము కనిపించుచున్నదే!" అని విష్ణువు ఆశ్చర్యం ప్రకటించి శిరస్సును ఊపెను. అంతట విష్ణువుయొక్క చెవి నుండి ఒక మణి అతని యెదుట పడింది. అదియే 'మణికర్ణిక' యనే గొప్పతీర్థమయ్యింది.

**జలౌఘే ప్లావ్యమానా సా పంచక్రోశీ యదాఽభవత్ ।**
**నిర్గుణేన శివేనాశు త్రిశూలేన ధృతా తదా ॥ 15 ॥**

అయిదు క్రోసుల నిడివి గల ఆ క్షేత్రం జలసమూహంలో కొట్టుకొని పోతుండగా నిర్గుణుడైన శివుడప్పుడు దానిని వెంటనే త్రిశూలంతో నిలబెట్టాడు.

**విష్ణుస్తత్రైవ సుష్వాప ప్రకృత్యా స్వస్త్రియా సహ ।**
**తన్నాభికమలాజ్జాతో బ్రహ్మా శంకరశాసనాత్ ॥ 16 ॥**

విష్ణువు తన భార్యయైన ప్రకృతితో గూడి అక్కడే నిద్రించాడు. శంకరుని శాసనంచే ఆయన నాభికమలం-నుండి బ్రహ్మ పుట్టాడు.

**శివాజ్ఞాం స సమాసాద్య సృష్టిం చక్రేఽద్భుతాం తదా ।**
**చతుర్దశమితా లోకా బ్రహ్మాండే యత్ర నిర్మితాః ॥ 17 ॥**

అప్పుడాతడు శివాజ్ఞను పొంది అద్భుతమైన సృష్టి చేశాడు. ఆ బ్రహ్మాండంలో పదునాల్గు లోకాలు నిర్మింపబడ్డాయి.

**యోజనానాం చ పంచాశత్కోటిసంఖ్యాప్రమాణతః ।**
**బ్రహ్మాండస్యైవ విస్తారో మునిభిః పరికీర్తితః ॥ 18 ॥**

బ్రహ్మాండంయొక్క పరిమాణం ఏబది కోట్ల యోజనాలని మునులు ప్రశంసిస్తున్నారు.

**బ్రహ్మాండే కర్మణా బద్ధాః ప్రాణినో మాం కథం పునః ।**
**ప్రాప్స్యంతీతి విచింత్యైతత్పంచక్రోశీ విమోచితా ॥ 19 ॥**

'బ్రహ్మాండంలో కర్మచేత బంధింపబడ్డ ప్రాణులు మరలా నన్ను చేరే ఉపాయమేది?' అని ఆలోచించి ఆ పంచక్రోశిని విడిచిపెట్టాడు.

**ఇయం చ శుభదా లోకే కర్మనాశకరీ మతా ।**
**మోక్షప్రకాశికా కాశీ జ్ఞానదా మమ సుప్రియా ॥ 20 ॥**

"ఈ కాశీనగరి లోకంలో శుభాలనిచ్చేది, కర్మబంధాన్ని నశింపజేసేది, మోక్షసాధనమైన జ్ఞానాన్ని ప్రకాశింపజేసేది, నాకు మిక్కిలి ప్రియమైనది" అని చెప్పబడింది.

**అవిముక్తం స్వయం లింగం స్థాపితం పరమాత్మనా ।**
**న కదాచిత్త్వయా త్యాజ్యమిదం క్షేత్రం మమాంశక! ॥ 21 ॥**

పరమాత్మయే అచ్చట స్వయంగా అవిముక్తలింగాన్ని స్థాపించాడు. "నా అంశమైన ఓ విష్ణూ! నీవెన్నటికీ ఈ క్షేత్రాన్ని విడువరాదు".

**ఇత్యుక్త్వా చ త్రిశూలాత్ స్వాదవతార్య హరస్స్వయమ్ ।**
**మోచయామాస భువనే మర్త్యలోకే హి కాశికామ్ ॥ 22 ॥**

అని పలికి శివుడు స్వయంగా క్షేత్రాన్ని త్రిశూలంనుండి దింపి బ్రహ్మాండంలోని మర్త్యలోకంలో విడిచిపెట్టాడు.

**బ్రహ్మణశ్చ దినే సా హి న వినశ్యతి నిశ్చితమ్ ।**
**తదా శివస్త్రిశూలేన దధాతి మునయశ్చ తామ్ ॥ 23 ॥**

బ్రహ్మయొక్క దినం పూర్తియైనప్పుడు కూడ ఈ నగరం నశించదు. ఓ మునులారా! ఆ సమయంలో దీనిని శివుడు తన త్రిశూలంతో ధరించి యుంటాడు.

**పునశ్చ బ్రహ్మణా సృష్టౌ కృతాయాం స్థాప్యతే ద్విజాః! ।**
**కర్మణాం కర్షణాచ్చైవ కాశీతి పరిపఠ్యతే ॥ 24 ॥**

ఓ బ్రాహ్మణులారా! మరల బ్రహ్మ సృష్టి చేయగానే ఆ కాశీనగరం మరల అచ్చట స్థాపింపబడుతుంది. కర్మలనన్నింటిని ఆకర్షించి నశింపజేస్తుంది. కనుక దానికి 'కాశి' అని పేరు వచ్చింది.

**అవిముక్తేశ్వరం లింగం కాశ్యాం తిష్ఠతి సర్వదా ।**
**ముక్తిదాతృ చ లోకానాం మహాపాతకినామపి ॥ 25 ॥**

మహాపాపాత్ములైన జనులకైనప్పటికీ ముక్తినిచ్చే అవిముక్తేశ్వరలింగం సర్వదా కాశీ యందుంటుంది.

**అన్యత్ర ప్రాప్యతే ముక్తిస్సారూప్యాదిర్మునీశ్వరాః! ।**
**అత్రైవ ప్రాప్యతే జీవైః సాయుజ్యా ముక్తిరుత్తమా ॥ 26 ॥**

ఓ మునీశ్వరులారా! ఇతర క్షేత్రాలు సారూప్యముక్తి ఇత్యాది ఇతర ముక్తులను మాత్రమే ఈయగలుగుతాయి. కాని జీవులు ఇచ్చట మాత్రమే ఉత్తమమైన సాయుజ్యముక్తిని (పరమేశ్వరునిలో ఐక్యమగుట) పొందగలరు.

**యేషాం క్వాపి గతిర్నాస్తి తేషాం వారాణసీ పురీ ।**
**పంచక్రోశీ మహాపుణ్యా హత్యాకోటివినాశనీ ॥ 27 ॥**

ఎవరికైతే ఎక్కడనైననూ ముక్తి రాదో, వారికి ఐదు క్రోసుల నిడివిగలిగినది, మహాపవిత్రమైనది, కోటిహత్యాపాతకమైనను నశింపజేయునదియైన వారాణసినగరం మాత్రం ముక్తిని ప్రసాదిస్తుంది.

**అమరా మరణం సర్వే వాంఛంతీహ పరే చ కే ।**
**భుక్తిముక్తిప్రదా చైషా సర్వదా శంకరప్రియా ॥ 28 ॥**

దేవతలే ఇచ్చట మరణించాలని కోరుకుంటుండగా ఇతరుల గురించి చెప్పవలసిందేమున్నది? సర్వకాలాలలో శంకరునకు ప్రియమైన ఈ నగరం భుక్తిని ముక్తిని ఇస్తుంది.

**బ్రహ్మా చ శ్లాఘతే చామూం విష్ణుస్సిద్ధాశ్చ యోగినః ।**
**మునయశ్చ తథైవాన్యే త్రిలోకస్థా జనాః సదా ॥ 29 ॥**

బ్రహ్మ, విష్ణువు, సిద్ధులు, యోగులు, మునులు, అంతే కాదు ముల్లోకాలలోని ఇతర జనులు వారణాసిని సర్వదా కొనియాడుతూనే ఉంటారు.

**కాశ్యాశ్చ మహిమానం వై వక్తుం వర్షశతైరపి ।**
**శక్నోమ్యహం న సర్వం హి యథాశక్తి బ్రువే తతః ॥ 30 ॥**

కాశీనగరంయొక్క మాహాత్మ్యాన్ని సమగ్రంగా చెప్పడం వంద సంవత్సరాలలోనైనా సాధ్యం కాదు. అయినప్పటికి యథాశక్తిగా చెబుతున్నాను.

**కైలాసస్య పతిర్యో వై హ్యంతస్సత్త్వో బహిస్తమాః ।**
**కాలాగ్నిర్నామతః ఖ్యాతో నిర్గుణో గుణవాన్భవః ॥**
**ప్రణిపాతైరనేకైశ్చ వచనం చేదమబ్రవీత్ ॥ 31 ॥**

లోపల సత్త్వగుణం గలవాడు, బయటకు తమోగుణం గలవాడు, 'కాలాగ్ని' పేరుతో ప్రఖ్యాతి చెందినవాడు, నిర్గుణుడు, సగుణుడు, సద్రూపుడు, కైలాసపతియునైన రుద్రుడు పలుమార్లు నమస్కరించి ఇట్లు పలికాడు.

**రుద్ర ఉవాచ -** రుద్రుడు పలికాడు.

**విశ్వేశ్వర! మహేశాన! త్వదీయోఽస్మి న సంశయః ।**
**కృపాం కురు మహాదేవ! మయి త్వం సాంబ! ఆత్మజే ॥ 32 ॥**

ఓ విశ్వేశ్వరా! మహేశ్వరా! నేను నిస్సందేహంగా నీవాడను, ఓ మహాదేవా! సాంబా! పుత్రుడనైన నాపై దయను చూపుము.

**స్థాతవ్యం చ సదాఽత్రైవ లోకానాం హితకామ్యయా ।**
**తారయస్వ జగన్నాథ! ప్రార్థయామి జగత్పతే! ॥ 33 ॥**

ఓ జగన్నాథా! నీవు లోకాల హితం కోరి సర్వదా ఇక్కడనే స్థిరంగా యుండి తరింపజేయుమని ప్రార్థిస్తున్నాను.

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**అవిముక్తేఽపి దాంతాత్మా తం సంప్రార్థ్య పునః పునః ।**
**నేత్రాశ్రూణి ప్రముచ్యైవ ప్రీతః ప్రోవాచ శంకరమ్ ॥ 34 ॥**

జితేంద్రియుడైన అవిముక్తుడు కూడ ఆనందంతో కన్నుల వెంబడి నీరు స్రవిస్తుండగా, పలుమార్లు శంకరుని ప్రార్థించి ఇట్లు పలికాడు.

**అవిముక్త ఉవాచ -** అవిముక్తుడు పలికాడు.

**దేవదేవ! మహాదేవ! కాలామయసుభేషజ! ।**
**త్వం త్రిలోకపతిస్సత్యం సేవ్యో బ్రహ్మాచ్యుతాదిభిః ॥ 35 ॥**

దేవదేవా! మహాదేవా! కాలమనే రోగానికి గొప్ప మందు వంటివాడా! నీవు త్రిలోకాధిపతివి. ఇది సత్యము. బ్రహ్మ, విష్ణువు మున్నగు వారిచే సేవింపబడుతున్నావు.

**కాశ్యాం పుర్యాం త్వయా దేవ! రాజధానీ ప్రగృహ్యతామ్ ।**
**మయా ధ్యానతయా స్థేయమచింత్యసుఖహేతవే ॥ 36 ॥**

ఓ దేవా! నీవు కాశీనగరాన్ని రాజధానిగా స్వీకరించుము. ఊహకందని సుఖాన్ని పొందడానికి నేను నిన్ను ధ్యానిస్తూ ఉంటాను.

**ముక్తిదాతా భవానేవ కామదశ్చ న చాపరః ।**
**తస్మాత్త్వముపకారాయ తిష్ఠోమాసహితస్సదా ॥ 37 ॥**

కోర్కెలు తీర్చి మోక్షాన్నిచ్చేది నీవు తప్ప మరియొకరు కాదు. కాబట్టి నీవు లోకోపకారానికి పార్వతితో గూడి సర్వకాలాలయందు ఇచ్చట స్థిరంగా నుండుము.

**జీవాన్భవాబ్ధేరఖిలాంస్తారయ త్వం సదాశివ! ।**
**భక్తకార్యం కురు హర! ప్రార్థయామి పునః పునః ॥ 38 ॥**

ఓ సదాశివా! సమస్త జీవులను సంసారసముద్రంనుండి గట్టెక్కించుము. ఓ హరా! భక్తుల కార్యాన్ని చక్కబెట్టుము. నేను నిన్ను మరలా మరలా ప్రార్థిస్తున్నాను.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యేవం ప్రార్థితస్తేన విశ్వనాథేన శంకరః ।**
**లోకానాముపకారార్థం తస్థౌ తత్రాపి సర్వరాట్ ॥ 39 ॥**

విశ్వనాథుడిట్లు ప్రార్థింపగా, సర్వజగన్నాథుడైన శంకరుడు లోకోపకారం కొఱకు అచ్చట స్థిరంగా నున్నాడు.

**యద్దినం హి సమారభ్య హరః కాశ్యాముపాగతః ।**
**తదారభ్య చ సా కాశీ సర్వశ్రేష్ఠతరాఽభవత్ ॥ 40 ॥**

ఏ దినంనుండి శివుడు కాశీకి వచ్చాడో, ఆనాటినుండి కాశి అన్ని క్షేత్రములకంటె మరింత శ్రేష్ఠమైనదయ్యింది.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం విశ్వేశ్వరమాహాత్మ్యే కాశ్యాం రుద్రాగమనవర్ణనం నామ ద్వావింశోఽధ్యాయః ॥ 22 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు విశ్వేశ్వరమాహాత్మ్యంలో కాశీకి రుద్రాగమన వర్ణనం అనే పేరుగల ఇరవైరెండవ అధ్యాయం సమాప్తం.

## త్రయోవింశోఽధ్యాయః - ఇరవైమూడవ అధ్యాయం
## కాశీవిశ్వేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనమ్ - కాశీవిశ్వేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**ఏవం వారాణసీ పుణ్యా యది సూత! మహాపురీ ।**
**తత్ప్రభావం వదాస్మాకమవిముక్తస్య చ ప్రభో! ॥ 1 ॥**

ఓ సూతా! ప్రభూ! వారాణసీ మహానగరం ఇంతటి పుణ్యప్రదమైనదిగదా! దాని ప్రభావాన్ని, అవిముక్తి మహిమను, మాకు చెప్పండి.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**వక్ష్యే సంక్షేపతస్సమ్యగ్వారాణస్యాస్సుశోభనమ్ ।**
**విశ్వేశ్వరస్య మాహాత్మ్యం శ్రూయతాం చ మునీశ్వరాః! ॥ 2 ॥**

ఓ మునీశ్వరులారా! వారాణసియొక్క పరమసుందరవైభవము, విశ్వేశ్వరునియొక్క గొప్పతనమూ సంక్షేపంగా చెబుతాను వినండి.

**కదాచిత్పార్వతీ దేవీ శంకరం పరయా ముదా ।**
**లోకకామనయాఽపృచ్ఛన్మాహాత్మ్యమవిముక్తయోః ॥ 3 ॥**

ఒకనాడు పార్వతీదేవి లోకహితాన్ని గోరి పరమానందంతో అవిముక్త క్షేత్రమూ, విశ్వేశ్వరుల మాహాత్మ్యాన్ని గురించి శంకరుని ప్రశ్నించింది. ("అవిముక్తయోః" అనుచోట ద్వివచనము ఆర్షప్రయోగము).

**పార్వత్యువాచ** - పార్వతి పలికింది.

**అస్య క్షేత్రస్య మాహాత్మ్యం వక్తుమర్హస్యశేషతః ।**
**మమోపరి కృపాం కృత్వా లోకానాం హితకామ్యయా ॥ 4 ॥**

లోకాల హితాన్ని గోరి నాయందు దయ చూపి, ఈ క్షేత్రంయొక్క మాహాత్మ్యాన్ని పూర్తిగా చెప్పదగును.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**దేవ్యాస్తద్వచనం శ్రుత్వా దేవదేవో జగత్ప్రభుః ।**
**ప్రత్యువాచ భవానీం తాం జీవానాం ప్రియహేతవే ॥ 5 ॥**

జగన్నాథుడు, దేవదేవుడునగు శివుడు భవానీదేవియొక్క మాటలను విని జీవులకు హితం చేయగోరి ఆమెకిలా బదులిచ్చాడు.

**పరమేశ్వర ఉవాచ** - పరమేశ్వరుడు పలికాడు.

**సాధు పృష్టం త్వయా భద్రే! లోకానాం సుఖదం శుభమ్ ।**
**కథయామి యథార్థం వై మాహాత్మ్యమవిముక్తయోః ॥ 6 ॥**

ఓ మంగళ స్వరూపురాలా! లోకాలకు సుఖాన్ని కలిగించే శుభకరమైన ప్రశ్నను చక్కగా అడిగావు. అవిముక్త మాహాత్మ్యాన్ని, విశ్వేశ్వరుని మహిమను నేను యథాతథంగా చెబుతున్నాను.

**ఇదం గుహ్యతమం క్షేత్రం సదా వారాణసీ మమ ।**
**సర్వేషామేవ జంతూనాం హేతుర్మోక్షస్య సర్వథా ॥ 7 ॥**

ఈ వారాణసి సర్వదా నా రహస్యక్షేత్రము. ఇది సర్వప్రాణులకు, అన్నివిధాలుగా మోక్షానికి హేతువౌతోంది.

**అస్మిన్ సిద్ధాస్సదా క్షేత్రే మదీయం వ్రతమాశ్రితాః ।**
**నానాలింగధరా నిత్యం మమ లోకాభికాంక్షిణః ॥ 8 ॥**

ఈ క్షేత్రంలో సిద్ధులు సర్వదా నా లోకాన్ని పొందగోరి నిత్యమూ అనేక లింగాలు ధరించి నా వ్రతాన్ని స్వీకరిస్తారు.

**అభ్యస్యంతి మహాయోగం జితాత్మానో జితేంద్రియాః ।**
**పరం పాశుపతం శ్రౌతం భుక్తిముక్తిఫలప్రదమ్ ॥ 9 ॥**

వారు ఇంద్రియాలను, మనస్సును జయించి భుక్తిముక్తి ఫలప్రదము, వేదోక్తము, సర్వోత్కృష్టమైనదియునగు పాశుపతమహాయోగాన్ని అభ్యసిస్తారు.

**రోచతే మే సదా వాసో వారాణస్యాం మహేశ్వరి! ।**
**హేతునా యేన సర్వాణి విహాయ శృణు తద్ధ్రువమ్ ॥ 10 ॥**

ఓ మహేశ్వరీ! నాకు సర్వదా వారాణసియందు నివాసం ప్రీతికరమైనది. నీవు సర్వకార్యాలను ప్రక్కన బెట్టి దీనికి గల కారణాలను నిశ్చయంగా వినుము.

**యో మే భక్తశ్చ విజ్ఞానీ తావుభౌ ముక్తిభాగినౌ ।**
**తీర్థాపేక్షా చ న తయోర్విహితావిహితే సమౌ ॥ 11 ॥**

నా భక్తుడు మరియు విజ్ఞాని అనే వీరిరువురు ముక్తికి అర్హులు. వారికి తీర్థాలతో పనిలేదు. వారికి విధి-నిషేధాలు రెండూ సమానమే.

**జీవన్ముక్తౌ తు తౌ జ్ఞేయౌ యత్ర కుత్రాపి వై మృతౌ ।**
**ప్రాప్నుతో మోక్షమాశ్వేవ మయోక్తం నిశ్చితం వచః ॥ 12 ॥**

వారిద్దరు జీవన్ముక్తులని తెలియాలి. వారెక్కడ మరణించినప్పటికీ వెనువెంటనే మోక్షాన్ని పొందుతారు. నేనీ విషయాన్ని ఖచ్చితంగా చెబుతున్నాను.

**అత్ర తీర్థే విశేషోఽస్త్యవిముక్తాఖ్యే పరోత్తమే ।**
**శ్రూయతాం తత్త్వయా దేవి! పరశక్తే! సుచిత్తయా ॥ 13 ॥**

అవిముక్తమనే సర్వశ్రేష్ఠమైన ఈ తీర్థంలో విశేషముంది. ఓ దేవీ! పరాశక్తీ! దానిని నీవు సావధానంగా వినుము.

**సర్వే వర్ణా ఆశ్రమాశ్చ బాలయౌవనవార్ధకాః ।**
**అస్యాం పుర్యాం మృతాశ్చేత్స్యుర్ముక్తా ఏవ న సంశయః ॥ 14 ॥**

అన్ని వర్ణాల వారు, ఆశ్రమాల వారు, బాలురు, యువకులు, వృద్ధులు ఈ నగరంలో మరణిస్తే నిస్సందేహంగా మోక్షాన్ని పొందుతారు.

**అశుచిశ్చ శుచిర్వాపి కన్యా పరిణతా తథా ।**
**విధవాఽథ వా వంధ్యా రజోదోషయుతాపి వా ॥ 15 ॥**

**ప్రసూతా సంస్కృతా కాపి యాదృశీ తాదృశీ ద్విజాః! ।**
**అత్ర క్షేత్రే మృతా చేత్స్యాన్మోక్షభాఙ్నాత్ర సంశయః ॥ 16 ॥**

ఓ బ్రాహ్మణులారా! శౌచంగలవాడు గాని, లేనివాడు గాని, కన్య గాని, వివాహిత గాని, వితంతువు గాని, సంతానంలేని స్త్రీగాని, రజోదోషం గల స్త్రీ గాని, శిశువును ప్రసవించియున్న స్త్రీ గాని, సంసారవంతురాలు గాని, ఎటువంటి స్త్రీయైననూ ఈ క్షేత్రంలో మరణిస్తే నిస్సందేహంగా మోక్షాన్ని పొందుతుంది.

**స్వేదజశ్చాండజో వాపి హ్యుద్భిజ్జోఽథ జరాయుజః ।**
**మృతో మోక్షమవాప్నోతి యథాఽత్ర న తథా క్వచిత్ ॥ 17 ॥**

చెమటనుండి, గ్రుడ్డునుండి, విత్తనంనుండి, లేదా తల్లి గర్భంనుండి పుట్టిన ఏ ప్రాణియైనా ఇచ్చట మరణించి మోక్షాన్ని పొందుతుంది. ఈ క్షేత్రానికి గల ఈ మహిమ ఇతర క్షేత్రాలకు దేనికీ లేదు.

**జ్ఞానాపేక్షా న చాత్రైవ భక్త్యపేక్షా న వై పునః ।**
**కర్మాపేక్షా న దేవ్యత్ర దానాపేక్షా న చైవ హి ॥ 18 ॥**

ఓ దేవీ! ఈ క్షేత్రంలో మరణించి మోక్షాన్ని పొందడానికి జ్ఞానం, భక్తి, కర్మ, దానం, అపేక్ష లేదు.

**సంస్కృత్యపేక్షా నైవాత్ర ధ్యానాపేక్షా న కర్హిచిత్ ।**
**నామాపేక్షార్చనాపేక్షా సుజాతీనాం తథాత్ర న ॥ 19 ॥**

సంస్కారం, ధ్యానం, నామసంకీర్తనం, అర్చన, గొప్పవంశం అనువాటి అపేక్ష లేనే లేదు.

**మమ క్షేత్రే మోక్షదే హి యో వా వసతి మానవః ।**
**యథా తథా మృతః స్యాచ్చేన్మోక్షమాప్నోతి నిశ్చితమ్ ॥ 20 ॥**

ముక్తినిచ్చే ఈ నా క్షేత్రంలో ఏ మానవుడు నివసిస్తాడో, ఏ విధంగానైనా మరణిస్తాడో, అట్టివాడు నిశ్చయంగా మోక్షాన్ని పొందుతాడు.

**ఏతన్మమ పురం దివ్యం గుహ్యాద్గుహ్యతరం ప్రియే! ।**
**బ్రహ్మాదయోఽపి జానంతి మాహాత్మ్యం నాస్య పార్వతి! ॥ 21 ॥**

ఓ ప్రియురాలా! ఈ నా దివ్యమైన నగరం రహస్యాలలో కెల్లా రహస్యమైనది. ఓ పార్వతీ! బ్రహ్మాదులు కూడ దీని మాహాత్మ్యాన్ని తెలియకున్నారు.

**మహత్ క్షేత్రమిదం తస్మాదవిముక్తమితి స్మృతమ్ ।**
**సర్వేభ్యో నైమిషాదిభ్యః పరం మోక్షప్రదం మృతే ॥ 22 ॥**

ఇందువల్లనే ఈ గొప్పక్షేత్రానికి 'అవిముక్తము' అను పేరు వచ్చింది. మరణించువారికి నైమిషాది సర్వక్షేత్రాలకంటె గొప్పగా మోక్షాన్ని ఇస్తుంది.

**ధర్మస్యోపనిషత్సత్యం మోక్షస్యోపనిషత్సమమ్ ।**
**క్షేత్రతీర్థోపనిషదమవిముక్తం విదుర్బుధాః ॥ 23 ॥**

ధర్మంలోకెల్లా సారభూతరహస్యము సత్యము. మోక్షముయొక్క రహస్యం సమత్వం. క్షేత్రాలు, తీర్థాలలో సారభూతరహస్యం అవిముక్తక్షేత్రమని పండితులు చెబుతున్నారు.

**కామం భుంజన్ స్వపన్ క్రీడన్ కుర్వన్హి వివిధాః క్రియాః ।**
**అవిముక్తే త్యజన్ ప్రాణాన్ జంతుర్మోక్షాయ కల్పతే ॥ 24 ॥**

యథేచ్ఛగా భుజిస్తూ, నిద్రిస్తూ, క్రీడిస్తూ, వివిధ కర్మలు చేస్తూ అవిముక్తంలో ప్రాణాలు విడిచే జీవుడు మోక్షానికర్హుడౌతాడు.

**కృత్వా పాపసహస్రాణి పిశాచత్వం వరం నృణామ్ ।**
**న చ క్రతుసహస్రత్వం స్వర్గే కాశీం పురీం వినా ॥ 25 ॥**

మానవులు వేయి క్రతువులు చేసి స్వర్గంలో నివసించడం కంటె వేయి పాపాలు చేసి, పిశాచత్వాన్ని పొంది కాశీనగరంలో నుండుట మేలు.

**తస్మాత్సర్వప్రయత్నేన సేవ్యతే కాశికా పురీ ।**
**అవ్యక్తలింగం మునిభిర్ధ్యాయతే చ సదాశివః ॥ 26 ॥**

కావున ప్రాణులు సర్వవిధముల ప్రయత్నించి కాశీనగరాన్ని సేవిస్తున్నారు. మునులు సదాశివుని ఆకృతి విశేషాలు లేని లింగాన్ని ధ్యానిస్తున్నారు.

**యద్యత్ఫలం సముద్దిశ్య తపంత్యత్ర నరః ప్రియే! ।**
**తేభ్యశ్చాహం ప్రయచ్ఛామి సమ్యక్ తత్తత్ఫలం ధ్రువమ్ ॥ 27 ॥**

ఓ ప్రియురాలా! మానవులేయే ఫలాలనపేక్షించి ఇక్కడ తపస్సు చేస్తారో, వారికి చక్కగా ఆయా ఫలాలను తప్పకుండ నేనిస్తున్నాను.

**సాయుజ్యమాత్మనః పశ్చాదీప్సితం స్థానమేవ చ ।**
**న కుతశ్చిత్కర్మబంధస్త్యజతామత్ర వై తనుమ్ ॥ 28 ॥**

ఇచ్చట దేహాన్ని త్యజించే వారికి కర్మబంధం నశించి, అనంతరం వారు కోరుకొనే నా సాయుజ్యముక్తి లభిస్తుంది.

**బ్రహ్మా దేవర్షిభిస్సార్ధం విష్ణుర్వాపి దివాకరః ।**
**ఉపాసతే మహాత్మానస్సర్వే మామిహ చాపరే ॥ 29 ॥**

బ్రహ్మ, దేవర్షులు, విష్ణువు, సూర్యుడు, ఇతర మహాత్ములందరూ నన్నిచట ఉపాసిస్తారు.

**విషయాసక్తచిత్తోఽపి త్యక్తధర్మరుచిర్నరః ।**
**ఇహ క్షేత్రే మృతో యో వై సంసారం న పునర్విశేత్ ॥ 30 ॥**

విషయభోగాలయందాసక్తి గలవాడైనను, ధర్మమందభిరుచిలేనివాడైనను, ఈ క్షేత్రంలో మరణిస్తే తిరిగి సంసారంలోనికి ప్రవేశించడు.

**కిం పునర్నిర్మమా ధీరా సత్త్వస్థా దంభవర్జితాః ।**
**కృతినశ్చ నిరారంభాస్సర్వే తే మయి భావితాః ॥ 31 ॥**

మమకారం లేనివారు, పండితులు, సత్త్వగుణప్రధానులు, దంభంలేనివారు, సర్వకర్మసన్న్యాసులగు కృతార్థులు, నాయందు భక్తి గలవారునైన సర్వుల గురించి చెప్పేదేమున్నది?

**జన్మాంతరసహస్రేషు జన్మ యోగీ సమాప్నుయాత్ ।**
**తదిహైవ పరం మోక్షం మరణాదధిగచ్ఛతి ॥ 32 ॥**

వేయి జన్మల తరువాత యోగి ఇచట జన్మించి ఇచటనే మరణించి పరమపురుషార్థమైన మోక్షాన్ని పొందుతాడు.

**అత్ర లింగాన్యనేకాని భక్తైస్సంస్థాపితాని హి ।**
**సర్వకామప్రదానీహ మోక్షదాని చ పార్వతి! ॥ 33 ॥**

ఓ పార్వతీ! భక్తులచే స్థాపింపబడినవీ, ఇహలోకంలో సర్వకామనలను, మోక్షాన్ని కూడ ఇచ్చునవియైన లింగాలిచట అనేకమున్నాయి.

**పంచక్రోశం చతుర్దిక్షు క్షేత్రమేతత్ప్రకీర్తితమ్ ।**
**సమంతాచ్చ తథా జంతోర్మృతి కాలేఽమృతప్రదమ్ ॥ 34 ॥**

ఈ క్షేత్రం నాలుగు దిక్కులయందు ఐదు క్రోసుల దూరం వ్యాపించియుంది. ఈ విశాల దేశంలో ఎక్కడైననూ మానవునకు మరణించే సమయంలో 'అమృతం' లభిస్తుంది.

**అపాపశ్చ మృతో యో వై సద్యో మోక్షం సమశ్నుతే ।**
**సపాపశ్చ మృతో యస్యాత్కాయవ్యూహాన్సమశ్నుతే ॥ 35 ॥**

పాపాలు చేయనివాడు మరణించిన వెంటనే మోక్షాన్ని పొందుతాడు. పాపాత్ముడు మరణించిన పిదప వివిధ దేహాలు ధరిస్తాడు.

**యాతనాం సోఽనుభూయైవ పశ్చాన్మోక్షమవాప్నుయాత్ ।**
**పాతకం యోఽవిముక్తాఖ్యే క్షేత్రేఽస్మిన్కురుతే ధ్రువమ్ ॥ 36 ॥**

**భైరవీం యాతనాం ప్రాప్య వర్షాణామయుతే పునః ।**
**తతో మోక్షమవాప్నోతి భుక్త్వా పాపం చ సుందరి! ॥ 37 ॥**

అట్టివాడు కూడ యాతన తప్పనిసరిగా అనుభవించిన తరువాత మోక్షాన్ని పొందుతాడు. ఓ సుందరీ! ఎవడైతే ఈ అవిముక్తమనబడే క్షేత్రంలో పాపాన్ని చేస్తాడో, వాడు పదివేల సంవత్సరాలు భైరవుని చేతిలో పాపఫలరూపమైన యాతనలనుభవించి తరువాత మోక్షాన్ని పొందుతాడు.

**ఇతి తే చ సమాఖ్యాతా పాపాచారే చ యా గతిః ।**
**ఏవం జ్ఞాత్వా నరస్సమ్యక్ సేవయేదవిముక్తకమ్ ॥ 38 ॥**

ఇట్లు పాపాలనాచరించేవారు పొందే గతిని నీకు చెప్పాను. మానవుడీ విషయాన్ని చక్కగా తెలుసుకొని అవిముక్తాన్ని సేవించాలి.

**కృతకర్మక్షయో నాస్తి కల్పకోటిశతైరపి ।**
**అవశ్యమేవ భోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్ ॥ 39 ॥**

చేసిన కర్మ వందకోట్ల కల్పాల తరువాతనైననూ నశించదు. మంచిగాని, చెడుగాని చేసిన కర్మయొక్క ఫలాన్ని అనుభవింపక తప్పదు.

**కేవలం చాశుభం కర్మ నరకాయ భవేదిహ ।**
**శుభం స్వర్గాయ జాయేత ద్వాభ్యాం మానుష్యమీరితమ్ ॥ 40 ॥**

ఈ లోకంలో చేయబడే కేవల పాపకర్మ నరకాన్ని, శుభకర్మ స్వర్గాన్ని, పుణ్యపాపాల మిశ్రమం మనుష్య జన్మను ఇస్తుందని చెప్పబడింది.

**జన్మ సమ్యగసమ్యక్ చ న్యూనాధిక్యే భవేదిహ ।**
**ఉభయోశ్చ క్షయో ముక్తిర్భవేత్సత్యం హి పార్వతి! ॥ 41 ॥**

ఓ పార్వతీ! పుణ్యపాపాల హెచ్చుతగ్గులనుబట్టి మంచి లేదా చెడు జన్మలు కలుగుతాయి. పుణ్యపాపాలు రెండూ క్షయమైతే మోక్షం కలుగుతుంది. ఇది సత్యం.

**కర్మ చ త్రివిధం ప్రోక్తం కర్మకాండే మహేశ్వరి! ।**
**సంచితం క్రియమాణం చ ప్రారబ్ధం చేతి బంధకృత్ ॥ 42 ॥**

ఓ మహేశ్వరీ! కర్మకాండలో కర్మ మూడు విధాలని వర్ణింపబడింది. ఇది సంచితము, క్రియమాణము, ప్రారబ్ధము అను మూడు విధాలుగా నుండి బంధిస్తుందని చెప్పబడింది.

**పూర్వజన్మ సముద్భూతం సంచితం సముదాహృతమ్ ।**
**భుజ్యతే చ శరీరేణ ప్రారబ్ధం పరికీర్తితమ్ ॥ 43 ॥**

పూర్వజన్మలో చేయబడిన కర్మ సంచితమనబడుతుంది. శరీరంచే అనుభవింపబడేది ప్రారబ్ధమనబడుతుంది.

**అనేన జన్మనా యచ్చ క్రియతే కర్మ సాంప్రతమ్ ।**
**శుభాశుభం చ దేవేశి! క్రియమాణం విదుర్బుధాః ॥ 44 ॥**

ఓ దేవేశీ! ఈ జన్మలో ఇప్పుడు చేయబడుచున్న పుణ్యపాపకర్మ క్రియమాణమనబడుతుందని పండితులు చెబుతున్నారు.

**ప్రారబ్ధకర్మణో భోగాత్ క్షయశ్చైవ న చాన్యథా ।**
**ఉపాయేన ద్వయోర్నాశః కర్మణోః పూజనాదినా ॥ 45 ॥**

ప్రారబ్ధకర్మ భోగంచేత మాత్రమే క్షయమౌతుంది. అది నశించడానికి ఇతర మార్గమేమీ లేదు. మిగిలిన రెండు కర్మలు పూజాది ఉపాయాలచే నశిస్తాయి.

**సర్వేషాం కర్మణాం నాశో నాస్తి కాశీం పురీం వినా ।**
**సర్వం చ సులభం తీర్థం దుర్లభా కాశికా పురీ ॥ 46 ॥**

కాశీ నగరంలేనిదే సర్వకర్మవినాశం సంభవం కాదు. సర్వతీర్థాలు తేలికగా లభించునవియే. కాని కాశీ తీర్థం మాత్రం దుర్లభం.

**పూర్వజన్మకృతం చేద్వై కాశీదర్శనమాదరాత్ ।**
**తదా కాశీం చ సంప్రాప్య లభేన్మృత్యుం న చాన్యథా ॥ 47 ॥**

పూర్వజన్మలో పుణ్యం చేసుకున్న వారికి మాత్రమే కాశీ నగరం చేరి, శ్రద్ధతో దానిని దర్శించడం, అచట మరణించడం అనేవి సిద్ధిస్తాయి. పూర్వపుణ్యం లేనిచో ఇవి సంభవం కాదు.

**కాశీం ప్రాప్య నరో యస్తు గంగాయాం స్నానమాచరేత్ ।**
**తదా చ క్రియమాణస్య సంచితస్యాపి సంక్షయః ॥ 48 ॥**

కాశీనగరం చేరి గంగలో స్నానంచేసిన వానికి అప్పుడే సంచితంతో బాటు క్రియమాణం కూడా నశిస్తుంది.

**ప్రారబ్ధం న వినా భోగో నశ్యతీతి సునిశ్చితమ్ ।**
**మృతిశ్చ తస్య సంజాతా తదా తస్య క్షయో భవేత్ ॥ 49 ॥**

భోగం లేనిదే ప్రారబ్ధకర్మ నశించదని దృఢంగా నిశ్చయింపబడిన విషయం. కాని ఆ వ్యక్తి కాశిలో మరణిస్తే అదే సమయంలో ప్రారబ్ధం కూడ నశిస్తుంది.

**పూర్వం చైవ కృతా కాశీ పశ్చాత్పాపం సమాచరేత్ ।**
**తద్బీజేన బలవతా నీయతే కాశికా పునః ॥ 50 ॥**

మానవుడు ముందుగా కాశీకి వెళ్లి వచ్చిన తరువాత పాపం చేస్తే, అతడా సంస్కారబలంచే తిరిగి కాశికి చేరుతాడు.

**తదా సర్వాణి పాపాని భస్మసాచ్చ భవంతి హి ।**
**తస్మాత్కాశీం నరస్సేవేత్కర్మనిర్మూలనీం ధ్రువమ్ ॥ 51 ॥**

అప్పుడు పాపాలన్నీ భస్మమౌతాయి. కాబట్టి కర్మబంధాన్ని నిర్మూలించు 'కాశీ'ని మానవుడు నిశ్చయంగా సేవించాలి.

**ఏకోఽపి బ్రాహ్మణో యేన కాశ్యాం సంవాసితః ప్రియే! ।**
**కాశీవాసమవాప్యైవ తతో ముక్తిం స విందతి ॥ 52 ॥**

ఓ ప్రియురాలా! ఎవడైతే బ్రాహ్మణుని కాశిలో నివసింపజేస్తాడో, అతడు అనంతరకాలంలో కాశీ వాసాన్ని పొంది తదనంతరం ముక్తిని పొందుతాడు.

**కాశ్యాం యో వై మృతశ్చైవ తస్య జన్మ పునర్నహి ।**
**సముద్దిశ్య ప్రయాగే చ మృతస్య కామనాఫలే ॥ 53 ॥**

కాశిలో మరణించిన వారికి పునర్జన్మ లేదు. కోరికలు గల వ్యక్తి ప్రయాగలో మరణిస్తే, కోరికలు తీరడమే గాక మోక్షం కూడ పొందుతాడు.

**సంయోగశ్చ తయోశ్చేత్ స్యాత్కాశీజన్యం ఫలం వృథా ।**
**యది న స్యాత్తయోర్యోగస్తీర్థరాజఫలం వృథా ॥ 54 ॥**

ప్రయాగలో ఈ రెండు ఫలాలు లభిస్తాయి. గావున ఈ రెండు కోరువానికి కాశీవాసఫలం వ్యర్థం. రెండు ఫలాలు గాక, కేవలం మోక్షఫలాన్ని కోరేవారికి తీర్థశ్రేష్ఠమైన ప్రయాగను సేవించిన ఫలం వ్యర్థమౌతుంది.

**తస్మాన్మచ్ఛాసనాద్విష్ణుస్సృష్టిం సాక్షాద్ధి నూతనామ్ ।**
**విధాయ మనసోద్దిష్టాం తత్సిద్ధిం యచ్ఛతి ధ్రువమ్ ॥ 55 ॥**

కావున, నా శాసనంచే విష్ణువు ఈ పుణ్యాలను మనస్సులో నిర్ధారించి వినూత్నమైన సృష్టిని చేసి ఆయా ఫలాలను సాధకులకిస్తాడు. ఇది నిశ్చితము.

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**ఇత్యాది బహు మాహాత్మ్యం కాశ్యాం వై మునిసత్తమాః! ।**
**తథా విశ్వేశ్వరస్యాపి భుక్తిముక్తిప్రదం సతామ్ ॥ 56 ॥**

ఓ మహర్షులారా! ఈ విధంగా కాశిలో చాలా మహిమ గలదు. అట్లే సత్పురుషులకు భుక్తిని, ముక్తినిచ్చే విశ్వేశ్వరునకు చాల మహిమ గలదు.

**అతః పరం ప్రవక్ష్యామి మాహాత్మ్యం త్ర్యంబకస్య చ ।**
**యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే మానవః క్షణాత్ ॥ 57 ॥**

ఇటుపైన ఓ బ్రాహ్మణులారా! త్ర్యంబకేశ్వరమాహాత్మ్యాన్ని వర్ణిస్తాను. దీనిని విన్న మానవుడు క్షణంలో సకల పాపాలనుండి విముక్తిని పొందుతాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం కాశీవిశ్వేశ్వర జ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం నామ త్రయోవింశోఽధ్యాయః ॥ 23 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు కాశీవిశ్వేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం అనే పేరుగల ఇరవైమూడవ అధ్యాయం సమాప్తం.

## **చతుర్వింశోఽధ్యాయః - ఇరవైనాల్గవ అధ్యాయం**

## **గౌతమప్రభావవర్ణనమ్ - గౌతమప్రభావవర్ణనం**

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**శ్రూయతామృషయః! శ్రేష్ఠాః! కథాం పాపప్రణాశినీమ్ ।**
**కథయామి యథా వ్యాసాత్సద్గురోశ్చ శ్రుతా మయా ॥ 1 ॥**

ఓ శ్రేష్ఠమైన మహర్షులారా! సద్గురువులైన వ్యాసులవారినుండి నేను విన్న విధంగా పాపాలు నిర్మూలించే కథను చెబుతున్నాను వినండి.

**పురా ఋషివరశ్చాసీద్గౌతమో నామ విశ్రుతః ।**
**అహల్యా నామ తస్యాసీత్పత్నీ పరమధార్మికీ ॥ 2 ॥**

పూర్వం గౌతముడని ప్రఖ్యాతి గాంచిన మహర్షి ఉండేవాడు. ఆయనకు పరమధర్మాత్మురాలైన అహల్యయను భార్య ఉండేది.

**దక్షిణస్యాం దిశి హి యో గిరిర్బ్రహ్మేతిసంజ్ఞకః ।**
**తత్ర తేన తపస్తప్తం వర్షాణామయుతం తథా ॥ 3 ॥**

దక్షిణదిక్కునందు గల బ్రహ్మపర్వతంపై ఆయన పదివేల సంవత్సరాలు తపస్సు చేశాడు.

**కదాచిచ్చ హ్యనావృష్టిరభవత్తత్ర సువ్రతాః! ।**
**వర్షాణాం చ శతం రౌద్రీ లోకా దుఃఖముపాగతాః ॥ 4 ॥**

ఓ సువ్రతులారా! ఒకప్పుడచ్చట భయంకరంగా వంద సంవత్సరాల అనావృష్టి కలిగింది. ప్రాణులు దుఃఖాన్ని పొందాయి.

**ఆర్ద్రం చ పల్లవం న స్మ దృశ్యతే పృథివీతలే ।**
**కుతో జలం విదృశ్యేత జీవానాం ప్రాణధారకమ్ ॥ 5 ॥**

భూతలంపై పచ్చని, తడి ఆకు కానరాలేదు. అట్టి స్థితిలో జీవుల ప్రాణాలను నిలబెట్టే నీరెక్కడ కానవస్తుంది?

**తదా తే మునయశ్చైవ మనుష్యాః పశవస్తథా ।**
**పక్షిణశ్చ మృగాస్తత్ర గతాశ్చైవ దిశో దశ ॥ 6 ॥**

అప్పుడు ఋషులు, సామాన్య మానవులు, పశువులు, పక్షులు దశదిశలకు చెదిరిపోయాయి.

**తాం దృష్ట్వా చర్షయో విప్రాః! ప్రాణాయామపరాయణాః ।**
**ధ్యానేన చ తదా కేచిత్కాలం నిన్యుస్సుదారుణమ్ ॥ 7 ॥**

ఓ బ్రాహ్మణులారా! ఆ స్థితిని చూచిన ఋషులలో కొందరు ప్రాణాయామంతోను, మరికొందరు ధ్యానంతోను, మిక్కిలి భయంకరమైన ఆ కాలాన్ని గడిపినారు.

**గౌతమోఽపి స్వయం తత్ర వరుణార్థే తపశ్శుభమ్ ।**
**చకార చైవ షణ్మాసం ప్రాణాయామపరాయణః ॥ 8 ॥**

గౌతముడు కూడ అక్కడ స్వయంగా ప్రాణాయామమునందు నిమగ్నుడై ఆరు మాసాలు వరుణునుద్దేశించి శుభకరమైన తపస్సు చేశాడు.

**తతశ్చ వరుణస్తస్మై వరం దాతుం సమాగతః ।**
**ప్రసన్నోఽస్మి వరం బ్రూహి దదామి చ వచోఽబ్రవీత్ ॥ 9 ॥**

అంతట వరుణుడు ఆయనకు వరాన్నివ్వడానికి విచ్చేసి, "నేను ప్రసన్నుడనయ్యాను వరాన్ని కోరుకొమ్ము" అని పలికాడు.

**తతశ్చ గౌతమస్తం వై వృష్టిం చ ప్రార్థయత్తదా ।**
**తతస్స వరుణస్తం వై ప్రత్యువాచ మునిం ద్విజాః! ॥ 10 ॥**

ఓ బ్రాహ్మణులారా! అంతట గౌతముడు వరుణుని వర్షం గురించి ప్రార్థించగా అతడామహర్షితో ఇలా పలికాడు.

**వరుణ ఉవాచ** - వరుణుడు పలికాడు.

**దేవాజ్ఞాం చ సముల్లంఘ్య కథం కుర్యామహం చ తామ్ ।**
**అన్యత్ప్రార్థయ సుజ్ఞోఽసి యదహం కరవాణి తే ॥ 11 ॥**

"దేవతల ఆజ్ఞనుల్లంఘించి నేను వర్షాన్ని కురిపించడం ఎట్లు సంభవం? నీవు గొప్ప జ్ఞానివి. వేరొక వరాన్ని కోరుకుంటే తీరుస్తాను".

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఇత్యేతద్వచనం తస్య వరుణస్య మహాత్మనః ।**
**పరోపకారీ తచ్ఛ్రుత్వా గౌతమో వాక్యమబ్రవీత్ ॥ 12 ॥**

మహాత్ముడైన వరుణుని మాట విని పరోపకారస్వభావం గల గౌతముడిలా పలికాడు.

**గౌతమ ఉవాచ** - గౌతముడు పలికాడు.

**యది ప్రసన్నో దేవేశ! యది దేయో వరో మమ ।**
**యదహం ప్రార్థయామ్యద్య కర్తవ్యం హి త్వయా తథా ॥ 13 ॥**

ఓ దేవేశా! నీవు ప్రసన్నుడవై నాకు వరాన్ని ఈయదలిస్తే నేను దేనిని కోరితే దానినే నీవీయాలి.

**యతస్త్వం జలరాశీశస్తస్మాద్దేయం జలం మమ ।**
**అక్షయం సర్వదేవేశ! దివ్యం నిత్యఫలప్రదమ్ ॥ 14 ॥**

ఓ సర్వదేవప్రభూ! నీవు జలరాశులకు అధీశ్వరుడవు. కావున నాకు శాశ్వతఫలమిచ్చే అక్షయ దివ్యజలమిమ్ము.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇతి సంప్రార్థితస్తేన వరుణో గౌతమేన వై ।**
**ఉవాచ వచనం తస్మై గర్తశ్చ క్రియతాం త్వయా ॥ 15 ॥**

ఆ గౌతముడు ఈవిధంగా ప్రార్థించగా వరుణుడు ఆయనతో "నీవు బిలం చేయుము" అని చెప్పాడు.

**ఇత్యుక్తే చ కృతస్తేన గర్తో హస్తప్రమాణతః ।**
**జలేన పూరితస్తేన దివ్యేన వరుణేన సః ॥ 16 ॥**

వరుణుడిలా చెప్పగానే ఆయన హస్తప్రమాణమైన లోతుగల గోతిని త్రవ్వాడు. వరుణుడు దానిని దివ్యజలంతో నింపాడు.

**అథోవాచ మునిం దేవో వరుణో హి జలాధిపః ।**
**గౌతమం మునిశార్దూలం పరోపకృతిశాలినమ్ ॥ 17 ॥**

అనంతరం జలాధిపతియైన వరుణదేవుడు, పరోపకారస్వభావం గల గౌతమమహర్షినుద్దేశించి ఇలా పలికాడు.

**వరుణ ఉవాచ –** వరుణుడు పలికాడు.

**అక్షయ్యం చ జలం తేఽస్తు తీర్థభూతం మహామునే! ।**
**తవ నామ్నా చ విఖ్యాతం క్షితావేతద్భవిష్యతి ॥ 18 ॥**

ఓ మహర్షీ! ఈ జలం అక్షయమగుటయేగాక ఇది తీర్థమౌతుంది. ఇది భూమండలంలో నీ పేరుతో ప్రఖ్యాతి పొందగలదు.

**అత్ర దత్తం హుతం తప్తం సురాణాం యజనం కృతమ్ ।**
**పితౄణాం చ కృతం శ్రాద్ధం సర్వమేవాక్షయం భవేత్ ॥ 19 ॥**

ఇచ్చట చేయబడే దానం, హోమం, తపస్సు, దేవయజ్ఞం, పితృశ్రాద్ధం మొదలైనవన్నీ అక్షయమౌతాయి.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యుక్త్వాంతర్దధే దేవస్స్తుతస్తేన మహర్షిణా ।**
**గౌతమోఽపి సుఖం ప్రాప కృత్వాఽన్యోపకృతిం మునిః ॥ 20 ॥**

వరుణదేవుడిట్లు పలికి గౌతమమహర్షిచే స్తుతింపబడినవాడై అంతర్ధానమయ్యాడు. ఇతరులకు ఉపకారం చేసిన గౌతమమహర్షి కూడ సుఖాన్ని పొందాడు.

**మహతో హ్యాశ్రయః పుంసాం మహత్త్వాయోపజాయతే ।**
**మహాంతస్తత్స్వరూపం చ పశ్యంతి నేతరేఽశుభాః ॥ 21 ॥**

మహాత్ములనాశ్రయించే పురుషులకు కూడ గొప్పదనం అబ్బుతుంది. మహాత్ములు మాత్రమే ఈశ్వర–స్వరూపాన్ని చూడగలుగుతారు. అది పాపాత్ములైన ఇతరులకు కానరాదు.

**యాదృఙ్నరం చ సేవేత తాదృశం ఫలమశ్నుతే ।**
**మహతస్సేవయోచ్చత్వం క్షుద్రస్య క్షుద్రతాం తథా ॥ 22 ॥**

మానవుడు ఎటువంటి వ్యక్తిని సేవిస్తాడో, అటువంటి ఫలాన్ని మాత్రమే పొందుతాడు. గొప్పవారిని సేవిస్తే గొప్పదనం, నీచులను సేవిస్తే నీచత్వం కలుగుతుంది.

**సింహస్య మందిరే సేవా ముక్తాఫలకరీ మతా ।**
**శృగాలమందిరే సేవా త్వస్థిలాభకరీ స్మృతా ॥ 23 ॥**

సింహంయొక్క నివాసంలో సేవచేస్తే ముత్యాలు లభిస్తాయి. నక్కయొక్క మందిరంలో సేవచేస్తే ఎముకలు దొరుకుతాయి.

**ఉత్తమానాం స్వభావోఽయం పరదుఃఖాసహిష్ణుతా ।**
**స్వయం దుఃఖం చ సంప్రాప్తం మన్యతేఽన్యస్య వార్యతే ॥ 24 ॥**

ఇతరుల దుఃఖాన్ని సహించలేకపోవడం ఉత్తముల స్వభావమైయున్నది. వారు తమకు కలిగిన దుఃఖాన్ని సహించి, ఇతరుల దుఃఖాన్ని నివారిస్తారు.

**వృక్షాశ్చ హాటకం చైవ చందనం చేక్షుకస్తథా ।**
**ఏతే భువి పరార్థే చ దక్షా ఏవం న కేచన ॥ 25 ॥**

వృక్షాలు, బంగారం, చందనం, చెరకు అనేవి ఈ భూలోకంలో పరోపకారం కొఱకు మాత్రమే ఉన్నాయి. ఇంతటి పరోపకారసామర్థ్యం ఇతరులలో లేదు.

**దయాళురమదస్పర్శ ఉపకారీ జితేంద్రియః ।**
**ఏతైశ్చ పుణ్యస్తంభైస్తు చతుర్భిర్ధార్యతే మహీ ॥ 26 ॥**

దయాళువు, గర్వాన్నెరుగనివాడు, పరోపకారి, జితేంద్రియుడు అనే నలుగురు పుణ్యమూర్తులు భూమండలాన్ని నిలబెట్టే స్తంభాలవంటి వారు.

**తతశ్చ గౌతమస్తత్ర జలం ప్రాప్య సుదుర్లభమ్ ।**
**నిత్యనైమిత్తికం కర్మ చకార విధివత్తదా ॥ 27 ॥**

తరువాత గౌతముడచ్చట దుర్లభమైన నీటిని పొందినవాడై నిత్యనైమిత్తిక కర్మలను యథావిధిగా ఆచరించాడు.

**తతో వ్రీహీన్యవాంశ్చైవ నీవారానప్యనేకధా ।**
**వాపయామాస తత్రైవ హవనార్థం మునీశ్వరః ॥ 28 ॥**

అనంతరం ఆ మహర్షి హోమంకొఱకు అచ్చటనే వరి ధాన్యం, యవలు, నీవారధాన్యం, మున్నగు వివిధములైన పంట ధాన్యాలను పండించాడు.

**ధాన్యాని వివిధానీహ వృక్షాశ్చ వివిధాస్తథా ।**
**పుష్పాణి చ ఫలాన్యేవ హ్యాసంస్తత్రాప్యనేకశః ॥ 29 ॥**

అక్కడ వివిధ ధాన్యాల పంటలు, వివిధ రకాల వృక్షాలు, పుష్పాలు, ఫలాలు లభించడం ఆరంభమయ్యింది.

**తచ్ఛ్రుత్వా ఋషయశ్చాన్యే తత్రాయాతాస్సహస్రశః ।**
**పశవః పక్షిణశ్చాన్యే జీవాశ్చ బహవోఽగమన్ ॥ 30 ॥**

ఈ వార్త విని వేలాది ఇతర మహర్షులచ్చటకు వచ్చారు. అట్లే పశుపక్ష్యాది ఇతరజీవులు కూడ అనేకం అచ్చటకు చేరాయి.

**తద్వనం సుందరం హ్యాసీత్ పృథివ్యాం మండలే పరమ్ ।**
**తదక్షయకరాయోగాదనావృష్టిర్న దుఃఖదా ॥ 31 ॥**

భూమండలంలో ఆ వనం పరమసుందరమై భాసిల్లింది. అక్షయమైన ఆ జలనిధి ఉండడంచే వారికి అనావృష్టిమూలకమైన దుఃఖం కలుగలేదు.

**ఋషయోఽపి వనే తత్ర శుభకర్మపరాయణాః ।**
**వాసం చక్రురనేకే చ శిష్యభార్యాసుతాన్వితాః ॥ 32 ॥**

అనేకమంది మహర్షులు కూడ తమ శిష్యులతో, భార్యాపుత్రులతో కూడి ఆ వనంలో నివసించి శుభకర్మలను నిష్ఠతో చేసికొన్నారు.

**ధాన్యాని వాపయామాసుః కాలక్రమణహేతవే ।**
**ఆనందస్తద్వనే హ్యాసీత్ప్రభావాద్గౌతమస్య చ ॥ 33 ॥**

వారు జీవనాధారంకొఱకు ధాన్యాలను పండించారు. గౌతముని ప్రభావంవల్ల ఆ వనంలో ఆనందం వెల్లివిరిసింది.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం త్ర్యంబకేశ్వరమాహాత్మ్యే గౌతమప్రభావవర్ణనం నామ చతుర్వింశోఽధ్యాయః ॥ 24 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు త్ర్యంబకేశ్వరమాహాత్మ్యంలో గౌతమప్రభావవర్ణనం అనే పేరుగల ఇరువదినాల్గవ అధ్యాయం సమాప్తం.

✡

## పంచవింశోఽధ్యాయః - ఇరవైఐదవ అధ్యాయం

## గౌతమవ్యవస్థావర్ణనమ్ - గౌతమవ్యవస్థావర్ణనం

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**కదాచిద్గౌతమేనైవ జలార్థం ప్రేషితా నిజాః ।**
**శిష్యాస్తత్ర గతా భక్త్యా కమండలుకరా ద్విజాః! ॥ 1 ॥**

ఓ బ్రాహ్మణులారా! ఒకనాడు గౌతముడు నీటికొఱకు తన శిష్యులను అచ్చటకు పంపించాడు. వారు భక్తితో కమండలాలను చేతబట్టి వెళ్లారు.

**శిష్యాన్ జలసమీపే తు గతాన్ దృష్ట్వా న్యషేధయన్ ।**
**జలార్థమగతాంస్తత్ర చర్షిపత్న్యోఽప్యనేకశః ॥ 2 ॥**

నీటి కొఱకు జలాశయ సమీపానికి వెళ్లిన శిష్యులను చూచి ఋషుల భార్యలనేక విధాలుగా నిషేధించారు.

**ఋషిపత్న్యో వయం పూర్వం గ్రహీష్యామో విదూరతః ।**
**పశ్చాచ్చైవ జలం గ్రాహ్యమిత్యేవం పర్యభర్త్సయన్ ॥ 3 ॥**

"ఋషిపత్నులమైన మేము ముందుగా నీటిని తీసుకుంటాము. మీరు దూరంగా ఉండండి. మీరు తరువాత తీసుకొనండి" అని ఋషిపత్నులు బెదిరించారు.

**పరావృత్య తదా తైశ్చ ఋషిపత్న్యై నివేదితమ్ ।**
**సా చాపి తాన్సమాదాయ సమాశ్వాస్య చ తైః స్వయమ్ ॥ 4 ॥**

వారు వెనుకకు తిరిగి వచ్చి ఋషిభార్యయైన అహల్యకు విన్నవించారు. ఆమె వారినోదార్చి వారిని తోడ్కొని తాను అచ్చటకు వెళ్లింది.

**జలం నీత్వా దదౌ తస్మై గౌతమాయ తపస్వినీ ।**
**నిత్యం నిర్వాహయామాస జలేన ఋషిసత్తమః ॥ 5 ॥**

ఆ తపశ్శాలినియైన అహల్య నీటిని తెచ్చి గౌతమునకీయగా, ఆయన తన నిత్యకర్మను పూర్తి చేశాడు.

**తాశ్చైవమృషిపత్న్యస్తు క్రుద్ధాస్తాం పర్యభర్త్సయన్ ।**
**పరావృత్య గతాస్సర్వాస్స్వోటజాన్ కుటిలాశయాః ॥ 6 ॥**

వక్రబుద్ధి గల యితర ఋషిపత్నులందరు కోపించి ఆమెను బెదిరించి తమ కుటీరాలకు మరలి వెళ్లారు.

**స్వామ్యగ్రే విపరీతం చ తద్వృత్తం నిఖిలం తతః ।**
**దుష్టాశయాభిః స్త్రీభిశ్చ తాభిర్వై వినివేదితమ్ ॥ 7 ॥**

దుర్బుద్ధిగల ఆ స్త్రీలు తరువాత తమ భర్తల యెదుట ఆ వృత్తాంతమునంతటినీ సత్యవిరుద్ధంగా విన్నవించారు.

**అథ తాసాం వచః శ్రుత్వా భావికర్మవశాత్తదా ।**
**గౌతమాయ చ సంక్రుద్ధాశ్చాసంస్తే పరమర్షయః ॥ 8 ॥**

అప్పుడామహర్షులు వారి మాటలను విని, దైవవశంచేత గౌతమునిపై మిక్కిలి కోపించారు.

**విఘ్నార్థం గౌతమస్యైవ నానాపూజోపహారకైః ।**
**గణేశం పూజయామాసుస్సంక్రుద్ధాస్తే కుబుద్ధయః ॥ 9 ॥**

అధికకోపంచే చెడిన బుద్ధిగల ఆ ఋషులు గౌతమునికి విఘ్నాన్ని కలిగించడానికి వివిధోపచారాలతో విఘ్నేశ్వరుని పూజించారు.

**ఆవిర్బభూవ చ తదా ప్రసన్నో హి గణేశ్వరః ।**
**ఉవాచ వచనం తత్ర భక్తాధీనః ఫలప్రదః ॥ 10 ॥**

అప్పుడు భక్తులకు వశులై ఫలాలనిచ్చే గణేశ్వరుడు ప్రసన్నుడై అచ్చట సాక్షాత్కరించి వారితో ఇట్లన్నాడు.

**గణేశ ఉవాచ –** గణేశుడు పలికాడు.

**ప్రసన్నోఽస్మి వరం బ్రూత యూయం కిం కరవాణ్యహమ్ ।**
**తదీయం తద్వచః శ్రుత్వా ఋషయస్తేఽబ్రువం స్తదా ॥ 11 ॥**

"నేను ప్రసన్నుడనయ్యాను. మీరు వరాన్ని కోరుకొనండి. నేను చేయదగిన పనియేది?" గణేశుని ఆ మాటలను విని అప్పుడా ఋషులు ఇట్లు పలికారు.

**ఋషయ ఊచుః –** ఋషులు పలికారు.

**త్వయా యది వరో దేయో గౌతమః స్వాశ్రమాద్బహిః ।**
**నిష్కాస్యం నో ఋషిభిః పరిభర్త్స్య తథా కురు ॥ 12 ॥**

నీవు వరాన్ని ఈయదలచినచో, మా ఋషులందరు గౌతముని నిందించి ఆశ్రమం నుండి వెళ్ళగొట్టునట్లు చేయుము.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**స ఏవం ప్రార్థితస్తైస్తు విహస్య వచనం పునః ।**
**ప్రోవాచేభముఖః ప్రీత్యా బోధయంస్తాన్సతాం గతిః ॥ 13 ॥**

వారిట్లు కోరగా, సత్పురుషులకు శరణ్యుడైన గణేశుడు నవ్వి వారికి ప్రేమతో బోధిస్తూ మరల ఇలా పలికాడు.

**గణేశ ఉవాచ –** గణేశుడు పలికాడు.

**శ్రూయతామృషయస్సర్వే యుక్తం న క్రియతేఽధునా ।**
**అపరాధం వినా తస్మై క్రుధ్యతాం హానిరేవ చ ॥ 14 ॥**

ఓ ఋషులారా! మీరందరు వినండి. మీరు చేయాలనుకున్న పని తగినది కాదు. అపరాధం లేకుండగా, ఇతరులపై కోపించే వారికి నిశ్చయంగా హాని కలుగుతుంది.

**ఉపస్కృతం పురా యైస్తు తేభ్యో దుఃఖం హితం న హి ।**
**యదా చ దీయతే దుఃఖం తదా నాశో భవేదిహ ॥ 15 ॥**

ఒకప్పుడు ఉపకారం చేసినవారికి దుఃఖం కలిగించడం క్షేమకరం కాదు. అటువంటి వారికి దుఃఖం కలిగించేవారు ఈ జన్మలోనే వినాశం పొందుతారు.

**ఈదృశం చ తపః కృత్వా సాధ్యతే ఫలముత్తమమ్ ।**
**శుభం ఫలం స్వయం హిత్వా సాధ్యతే నాహితం పునః ॥ 16 ॥**

ఇంతటి తపస్సు చేసిన మీరు ఉత్తమఫలాన్ని సాధించాలి. తమంతట తాముగా శుభఫలాన్ని విడిచిపెట్టి వివేకులు అహితాన్ని కోరుకొనరు.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఇత్యేవం వచనం శ్రుత్వా తస్య తే మునిసత్తమాః ।**
**బుద్ధిమోహం తదా ప్రాప్తా ఇదమేవ వచోఽబ్రువన్ ॥ 17 ॥**

ఆయన మాటలను విని మహర్షులు బుద్ధియందు మోహాన్ని పొందినవారగుటచే మరల అదే తీరులో ఈ విధంగా పలికారు.

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**కర్తవ్యం హి త్వయా స్వామిన్నిదమేవ న చాన్యథా ।**
**ఇత్యుక్తస్తు తదా దేవో గణేశో వాక్యమబ్రవీత్ ॥ 18 ॥**

"ఓ ప్రభూ! నీవు మాకు చేసిపెట్టవలసిన పని యిదియే. మరొకటి లేదు". వారిట్లు పలుకగా అప్పుడు గణేశుడు ఋషులతో ఇట్లు పలికాడు.

**గణేశ ఉవాచ** - గణేశుడు పలికాడు.

**అసాధుస్సాధుతాం చైవ సాధుశ్చాసాధుతాం తథా ।**
**కదాచిదపి నాప్నోతి బ్రహ్మోక్తమితి నిశ్చితమ్ ॥ 19 ॥**

అసాధువు సాధువుగాను, సాధువు అసాధువుగాను ఎన్నటికీ మారడని బ్రహ్మ చెప్పిన మాట యథార్థం.

**యదా చ భవతాం దుఃఖం జాతం చానశనాత్పురా ।**
**తదా సుఖం ప్రదత్తం వై గౌతమేన మహర్షిణా ॥ 20 ॥**

ఒకప్పుడు మీకు తిండిలేక దుఃఖం కలిగినప్పుడు గౌతమమహర్షి మీకు సుఖాన్ని కలిగించాడు.

**ఇదానీం వై భవద్భిశ్చ తస్మై దుఃఖం ప్రదీయతే ।**
**నైతద్యుక్తతమం లోకే సర్వథా సువిచార్యతామ్ ॥ 21 ॥**

ఇప్పుడు మీరాయనకు దుఃఖాన్నిస్తున్నారు. ఈ లోకంలో ఇది ఏ విధంగాను తగని పని. బాగుగా ఆలోచించుకొనండి.

**స్త్రీబలాన్మోహితా యూయం న మే వాక్యం కరిష్యథ ।**
**ఏతద్ధితతమం తస్య భవిష్యతి న సంశయః ॥ 22 ॥**

స్త్రీలవలన పొంగిపోయి మీరు మోహాన్ని పొందియున్నారు. కాబట్టి నా మాట లెక్క చేయడం లేదు. ఇది నిస్సందేహంగా ఆయనకు మరింత హితాన్ని కలిగిస్తుంది.

**పునశ్చాయమృషిశ్రేష్ఠో దాస్యతే వస్సుఖం ధ్రువమ్ ।**
**తారణం న చ యుక్తం స్యాద్వరమన్యం వృణీత వై ॥ 23 ॥**

ఈ మహర్షి మరలా మీకు సుఖాన్ని మాత్రమే ఇస్తాడు. ఇది నిశ్చయం. ఇట్టి మోసం తగదు. మరొక వరాన్ని కోరుకొనండి.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యేవం వచనం తేన గణేశేన మహాత్మనా ।**
**యద్యప్యుక్తమృషిభ్యశ్చ తదప్యేతే న మేనిరే ॥ 24 ॥**

మహాత్ముడైన గణేశుడీవిధంగా ఎంత చెప్పిననూ ఋషులాయన మాటను లెక్కచేయలేదు.

**భక్తాధీనతయా సోఽథ శివపుత్రోఽబ్రవీత్తదా ।**
**ఉదాసీనేన మనసా తానృషీన్దుష్టశేముషీన్ ॥ 25 ॥**

శివపుత్రుడైన గణేశుడు భక్తాధీనుడగుటచే ఉదాసీనమైన మనస్సు గలవాడై దుష్టబుద్ధి గల ఋషులతో ఇట్లన్నాడు.

**గణేశ ఉవాచ –** గణేశుడు పలికాడు.

**భవద్భిః ప్రార్థ్యతే యచ్చ కరిష్యేఽహం తథా ఖలు ।**
**పశ్చాద్భావి భవేదేవ ఇత్యుక్త్వాంతర్దధే పునః ॥ 26 ॥**

"మీరు కోరిన విధంగానే నేను చేస్తాను. ఆపై జరుగవలసింది జరుగుతుంది" అని పలికి ఆయన అంతర్ధానం చెందాడు.

**గౌతమస్స న జానాతి మునీనాం వై దురాశయమ్ ।**
**ఆనందమనసా నిత్యం పత్న్యా కర్మ చకార తత్ ॥ 27 ॥**

ఆ మునుల దుర్బుద్ధి గురించి తెలియని గౌతముడు ఆనందంగా భార్యతో గూడి నిత్యకర్మలను చేస్తూ ఉన్నాడు.

**తదంతరే చ యజ్జాతం చరితం వరయోగతః ।**
**తద్దుష్టర్షిప్రభావాత్తు శ్రూయతాం తన్మునీశ్వరాః! ॥ 28 ॥**

ఓ మహర్షులారా! ఇంతలో దుష్ట ఋషులు తపస్సు చేసి పొందిన వరప్రభావంచే జరిగిన వృత్తాంతాన్ని వినండి.

**గౌతమస్య చ కేదారే తత్రాసన్ వ్రీహయో యవాః ।**
**గణేశస్తత్ర గౌర్భూత్వా జగామ కిల దుర్బలా ॥ 29 ॥**

గౌతముని పంట పొలాలలో వరి, యవలు అనే ధాన్యాల పంటలున్నాయి. గణేశుడు బక్క చిక్కిన ఆవు రూపంలో అక్కడకు వచ్చాడు.

**కంపమానా చ సా గత్వా తత్ర తద్వరయోగతః ।**
**వ్రీహీన్సంభక్షయామాస యవాంశ్చ మునిసత్తమాః! ॥ 30 ॥**

ఓ మునిశ్రేష్ఠులారా! గణేశుని వరప్రభావంచే ఆ ఆవు అక్కడ వణికిపోతూ వరి, యవల పంటను తింటోంది.

**ఏతస్మిన్నంతరే దైవాద్గౌతమస్తత్ర చాగతః ।**
**స దయాళుస్తృణస్తంబైర్వారయామాస తాం తదా ॥ 31 ॥**

ఇంతలో దైవవశంచే దయాహృదయుడైన గౌతముడచ్చటకు వచ్చి అప్పుడు దానిని గడ్డిపోచలతో తోలాడు.

**తృణస్తంబేన సా స్పృష్టా పపాత పృథివీతలే ।**
**మృతా చ తత్క్షణాదేవ తదృషేః పశ్యతస్తదా ॥ 32 ॥**

ఆ ఆవు గడ్డిపోచ తగలగానే నేలపై బడి ఆ ఋషి చూస్తుండగానే అదే క్షణంలో మరణించింది.

**ఋషయశ్ఛన్నరూపాస్తే ఋషిపత్న్యస్తథాఽశుభాః ।**
**ఊచుస్తత్ర తదా సర్వే కిం కృతం గౌతమేన చ ॥ 33 ॥**

అక్కడనే దాగియున్న ఋషులు, అశుభబుద్ధి గల వారి భార్యలందరు, "గౌతముడెటువంటి పని చేశాడు?" అన్నారు.

**గౌతమోఽపి తథాఽహల్యామాహూయాసీత్సువిస్మితః ।**
**ఉవాచ దుఃఖతో విప్రా దూయమానేన చేతసా ॥ 34 ॥**

ఓ బ్రాహ్మణులారా! గౌతముడు కూడ మిక్కిలి ఆశ్చర్యం పొంది అహల్యను పిలిచి, వికలమైన మనస్సుగలవాడై దుఃఖంతో ఆమెతో ఇలా పలికాడు.

**గౌతమ ఉవాచ -** గౌతముడు పలికాడు.

**కిం జాతం చ కథం దేవి! కుపితః పరమేశ్వరః ।**
**కిం కర్తవ్యం క్వ గంతవ్యం హత్యా చ సముపస్థితా ॥ 35 ॥**

ఓ దేవీ! ఏమి జరిగింది? ఎలా జరిగింది? పరమేశ్వరుడు కోపించాడు. నేనేమి చేయాలి? ఎక్కడకు పోవాలి? గోహత్య సంప్రాప్తమయ్యింది.

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**ఏతస్మిన్నంతరే విప్రో గౌతమం పర్యభర్త్స్యయన్ ।**
**విప్రపత్న్యస్తథాఽహల్యాం దుర్వచోభిర్వ్యథాం దదుః ॥ 36 ॥**

ఇంతలో ఆ బ్రాహ్మణులు గౌతముని నిందించి పీడించారు. వారి భార్యలు కూడ అనరాని మాటలతో అహల్యకు దుఃఖాన్ని కలిగించారు.

**దుర్బుద్ధయశ్చ తచ్ఛిష్యాస్సుతాస్తేషాం తథైవ చ ।**
**గౌతమం పరిభర్త్స్యైవ ప్రత్యూచుర్ధిగ్వచో ముహుః ॥ 37 ॥**

దుర్బుద్ధులైన వారి శిష్యులు, పుత్రులు కూడ గౌతముని పలుమార్లు బెదిరిస్తూ నిందావచనాలు పలికారు.

**ఋషయ ఊచుః -** ఋషులు పలికారు.

**ముఖం న దర్శనీయం తే గమ్యతాం గమ్యతామితి ।**
**దృష్ట్వా గోఘ్నముఖం సద్యస్సచేలం స్నానమాచరేత్ ॥ 38 ॥**

నీ ముఖం చూడరాదు. పొమ్ము పొమ్ము. గోహంతకుని ముఖం చూస్తే కట్టుబట్టలతో స్నానం చేయాలి.

**యావదాశ్రమమధ్యే త్వం తావదేవ హవిర్భుజః ।**
**పితరశ్చ న గృహ్ణంతి హ్యస్మద్దత్తం హి కించన ॥ 39 ॥**

నీవు ఆశ్రమమధ్యలో ఉన్నంతవరకు దేవతలు, పితృదేవతలు మేమిచ్చే హవ్య-కవ్యాలను స్వీకరించరు.

**తస్మాద్గచ్ఛాన్యతస్త్వం చ పరివారసమన్వితః ।**
**విలంబం కురు నైవ త్వం ధేనుహన్పాపకారక! ॥ 40 ॥**

కాబట్టి నీవు కుటుంబంతో సహా మరియొక చోటికి వెళ్లిపొమ్ము. గోవును సంహరించిన ఓ పాపీ! ఏ మాత్రమూ ఆలస్యం చేయకుము.

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**ఇత్యుక్త్వా తే చ తం సర్వే పాషాణైస్సమతాడయన్ ।**
**వ్యథాం దదురతీవాస్మై త్వహల్యాం చ దురుక్తిభిః ॥ 41 ॥**

వారందరు ఇట్లు పలికి ఆయనను రాళ్లతో కొట్టి చాల దుఃఖాన్ని కలిగించారు. నిందావచనాలతో అహల్యకు కూడా వ్యథ కలిగించారు.

**తాడితో భర్త్సితో దుష్టైర్గౌతమో గిరమబ్రవీత్ ।**
**ఇతో గచ్ఛామి మునయో హ్యన్యత్ర నివసామ్యహమ్ ॥ 42 ॥**

దుష్టులచే కొట్టబడి, పీడింపబడిన గౌతముడు "ఓ మునులారా! నేనిక్కడనుండి వెళ్లిపోతాను. వేరొక చోట నివసిస్తాను" అని పలికాడు.

**ఇత్యుక్త్వా గౌతమస్తస్మాత్ స్థానాచ్చ నిర్గతస్తదా ।**
**గత్వా క్రోశం తదా చక్రే హ్యాశ్రమం తదనుజ్ఞయా ॥ 43 ॥**

గౌతముడిట్లు పలికి అప్పుడాస్థానంనుండి బయటపడి వారి అనుమతితో క్రోసుదూరంలో ఆశ్రమాన్ని కట్టుకున్నాడు.

**యావచ్చైవాభిశాపో వై తావత్కార్యం న కించన ।**
**న కర్మణ్యధికారోఽస్తి దైవే పిత్ర్యేఽథ వైదికే ॥ 44 ॥**

"ఆ గోహత్యాపాపమున్నంత వరకూ నీవెట్టి కర్మలను చేయరాదు. దైవసంబంధమైన, పితృసంబంధమైన, వైదికకర్మలలో నీకెట్టి అధికారం లేదు.

**మాసార్ధం చ తతో నీత్వా మునీన్సంప్రార్థయత్తదా ।**
**గౌతమో మునివర్యస్స తేన దుఃఖేన దుఃఖితః ॥ 45 ॥**

గౌతమమహర్షి ఈవిధంగా పదిహేను రోజులు గడపి, ఆ దుఃఖంచే పీడింపబడినవాడై ఋషులనిట్లు ప్రార్థించాడు.

**గౌతమ ఉవాచ –** గౌతముడు పలికాడు.

**అనుకంప్యో భవద్భిశ్చ కథ్యతాం క్రియతే మయా ।**
**యథా మదీయం పాపం చ గచ్ఛత్వితి నివేద్యతామ్ ॥ 46 ॥**

మీరు నా యందు దయ చూపండి, నేను మీరు చెప్పినట్లు చేస్తాను. నా పాపం తొలగిపోయే ఉపాయం చెప్పండి.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యుక్తాస్తే తదా విప్రా నోచుశ్చైవ పరస్పరమ్ ।**
**అత్యంతం సేవయా పృష్టా మిళితా హ్యేకతస్థితాః ॥ 47 ॥**

గౌతముడిట్లు పలుకగా ఆ బ్రాహ్మణులు మిన్నకున్నారు. అప్పుడు గౌతముడతిశయించిన వినయంతో ప్రశ్నించగా వారొకరితో నొకరు కూడబలుకుకొని ఒక చోట గుమిగూడి నిలబడ్డారు.

**గౌతమో దూరతః స్థిత్వా నత్వా తానృషిసత్తమాన్ ।**
**పప్రచ్ఛ వినయావిష్టః కిం కార్యం హి మయాధునా ॥ 48 ॥**

గౌతముడు వారికి దూరంగా నిలబడి అత్యంత వినయంతో ఆ మహర్షులను "ఇప్పుడు నేనేమి చేయాలి"? అని ప్రశ్నించాడు.

**ఇత్యుక్తే మునినా తేన గౌతమేన మహాత్మనా ।**
**మిళితాస్సకలాస్తే వై మునయో వాక్యమబ్రువన్ ॥ 49 ॥**

మహాత్ముడైన గౌతమమహర్షి ఇట్లు పలుకగా ఆ ఋషులందరూ ఏకమై ఇట్లు పలికారు.

**ఋషయ ఊచుః –** ఋషులు పలికారు.

**నిష్కృతిం హి వినా శుద్ధిర్జాయతే న కదాచన ।**
**తస్మాత్త్వం దేహశుద్ధ్యర్థం ప్రాయశ్చిత్తం సమాచర ॥ 50 ॥**

ఎప్పుడైనను, ప్రాయశ్చిత్తం లేనిదే పాపనిష్కృతి లేదు. కాబట్టి నీవు శరీరశుద్ధ్యర్థం ప్రాయశ్చిత్తం చేసుకో.

**త్రివారం పృథివీం సర్వాం క్రమ పాపం ప్రకాశయన్ ।**
**పునరాగత్య చాత్రైవ చర మాసవ్రతం తథా ॥ 51 ॥**

మూడు మార్లు భూమండలమంతా పరిక్రమణం చేస్తూ నీ పాపాన్ని ప్రకటించు. అనంతరం ఇచ్చటకు తిరిగి వచ్చి మాసవ్రతాన్నాచరించు.

**శతమేకోత్తరం చైవ బ్రహ్మణోఽస్య గిరేస్తథా ।**
**ప్రక్రమణం విధాయైవం శుద్ధిస్తే చ భవిష్యతి ॥ 52 ॥**

ఈ బ్రహ్మగిరికి నూట ఒక్కమార్లు ప్రదక్షిణం చేయుము. అప్పుడు నీకు శుద్ధి లభిస్తుంది.

**అథవా త్వం సమానీయ గంగాస్నానం సమాచర ।**
**పార్థివానాం తథా కోటిం కృత్వా దేవం నిషేవయ ॥ 53 ॥**

లేదా గంగాజలాన్ని తెచ్చి స్నానం చేసి కోటి పార్థివ శివలింగాలు చేసి సేవించు.

**గంగాయాం చ తతః స్నాత్వా పునశ్చైవ భవిష్యతి ।**
**పురా దశ తథా చైకం గిరేస్త్వం క్రమణం కురు ॥ 54 ॥**

మళ్ళీ గంగలో స్నానం చేసి ఈ పర్వతానికి పదకొండు మార్లు ప్రదక్షిణం చేయుము.

**శతకుంభైస్తథా స్నాత్వా పార్థివం నిష్కృతిర్భవేత్ ।**
**ఇతి తైరృషిభిః ప్రోక్తస్తథేత్యోమితి తద్వచః ॥ 55 ॥**

అనంతరం పార్థివలింగానికి వంద కడవలతో అభిషేకం చేస్తే నీకు పాపనిష్కృతి కలుగుతుంది. ఋషులిట్లు నిర్దేశించగా గౌతముడు సరేనని అంగీకరించాడు.

**పార్థివానాం తథా పూజాం గిరేః ప్రక్రమణం తథా ।**
**కరిష్యామి మునిశ్రేష్ఠాః! ఆజ్ఞయా శ్రీమతామిహ ॥ 56 ॥**

"ఓ మహర్షులారా! శోభాయుక్తులైన మీ అనుమతితో పార్థివపూజను, గిరిప్రదక్షిణను చేస్తాను".

**ఇత్యుక్త్వా సర్షివర్యశ్చ కృత్వా ప్రక్రమణం గిరేః ।**
**పూజయామాస నిర్మాయ పార్థివాన్మునిసత్తమః ॥ 57 ॥**

గౌతమ మహర్షి ఇట్లు పలికి గిరి ప్రదక్షిణం చేసి పార్థివలింగాలను నిర్మించి పూజించాడు.

**అహల్యా చ తతస్సాధ్వీ తచ్చ సర్వం చకార సా ।**
**శిష్యాశ్చ ప్రతిశిష్యాశ్చ చక్రుస్సేవాం తయోస్తదా ॥ 58 ॥**

అంతట సాధ్వియైన అహల్య కూడ ఆ కార్యాన్నంతటినీ చేసింది. వారి శిష్యులు, తమ శిష్యులతో గూడి వారినిద్దరిని సేవించారు.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం గౌతమవ్యవస్థావర్ణనం నామ పంచవింశోఽధ్యాయః ॥ 25 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు గౌతమవ్యవస్థావర్ణనం అనే పేరుగల ఇరవైఐదవ అధ్యాయం సమాప్తం.

## షడ్వింశోఽధ్యాయః - ఇరవైఆరవ అధ్యాయం
## త్ర్యంబకేశ్వరమాహాత్మ్యవర్ణనమ్ - త్ర్యంబకేశ్వరమాహాత్మ్యవర్ణనం

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఏవం కృతే తు ఋషిణా సస్త్రీకేన ద్విజాశ్శివః ।**
**ఆవిర్బభూవ స శివః ప్రసన్నస్సగణ స్తదా ॥ 1 ॥**

ఓ బ్రాహ్మణులారా! గౌతమ మహర్షి భార్యతో గూడి ఈ విధంగా చేయగానే, శివుడు ప్రసన్నుడై పార్వతితోను, గణాలతోను గూడి సాక్షాత్కరించాడు.

**అథ ప్రసన్నస్స శివో వరం బ్రూహి మహామునే! ।**
**ప్రసన్నోఽహం సుభక్త్యా త ఇత్యువాచ కృపానిధిః ॥ 2 ॥**

అప్పుడు దయానిధియైన శివుడు ప్రసన్నుడై ఇలా పలికాడు. "ఓ మహర్షీ! నీ గొప్పభక్తికి నేను ప్రసన్నుడనయ్యాను వరాన్ని కోరుకొమ్ము".

**తదా తత్సుందరం రూపం దృష్ట్వా శంభోర్మహాత్మనః ।**
**ప్రణమ్య శంకరం భక్త్యా స్తుతిం చక్రే ముదాన్వితః ॥ 3 ॥**

అప్పుడు గౌతముడు మంగళకరుడు, పరమాత్మయునైన శంభుని సుందరరూపాన్ని చూచి భక్తితో ప్రణమిల్లి ఆనందంతో గూడినవాడై స్తుతించాడు.

**స్తుత్వా బహుప్రణమ్యేశం బద్ధాంజలిపుటః స్థితః ।**
**నిష్పాపం కురు మాం దేవాబ్రవీదితి స గౌతమః ॥ 4 ॥**

ఆ గౌతముడు పరిపరివిధాల స్తుతించి చేతులు జోడించి ఈశ్వరునకు నమస్కరించి "ఓ దేవా! నా పాపాన్ని నిర్మూలింపుము" అని వేడుకున్నాడు.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్య గౌతమస్య మహాత్మనః ।**
**సుప్రసన్నతరో భూత్వా శివో వాక్యముపాదదే ॥ 5 ॥**

మహాత్ముడైన గౌతముని మాట విని శివుడు మరింత ప్రసన్నుడై ఇట్లు పలికాడు.

**శివ ఉవాచ** - శివుడు పలికాడు.

**ధన్యోఽసి కృతకృత్యోఽసి నిష్పాపోఽసి సదా మునే! ।**
**ఏతైర్దుష్టైః కిల త్వం చచ్ఛలితోఽసి ఖిలాత్మభిః ॥ 6 ॥**

"ఓ మహర్షీ! నీవు ధన్యుడవు. కృతార్థుడవు. నీవు సర్వకాలాలలో పాపరహితుడవే. క్రూరమనస్కులైన ఈ దుష్టులు నిన్ను మోసగించారు.

**త్వదీయదర్శనాల్లోకా నిష్పాపాశ్చ భవంతి హి ।**
**కిం పునస్త్వం సపాపోఽసి మద్భక్తినిరతస్సదా ॥ 7 ॥**

నిన్ను చూచిన మానవులు పాపవిముక్తులౌతారు. సర్వదా నా భక్తినిరతుడవైన నీవు పాపాత్ముడగుట ఎట్లు సంభవం?

**ఉపద్రవస్త్వయి మునే! యైఃకృతస్తు దురాత్మభిః ।**
**తే పాపాశ్చ దురాచారా హత్యావంతస్త ఏవ హి ॥ 8 ॥**

ఓమునీ! ఏ దురాత్ములైతే నీకీ ఆపద కలిగించారో వారే పాపాత్ములు, దురాచారులు, హత్యాదోషం గలవారు అవుతున్నారు.

**ఏతేషాం దర్శనాదన్యే పాపిష్ఠాః సంభవంతు చ ।**
**కృతఘ్నాశ్చ తథా జాతా నైతేషాం నిష్కృతిః క్వచిత్ ॥ 9 ॥**

ఈ కృతఘ్నులను చూచినవారికి పాపం చుట్టుకుంటుంది. వీరికి ఎక్కడైనను నిష్కృతి లేదు.

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**ఇత్యుక్త్వా శంకరస్తస్మై తేషాం దుశ్చరితం తదా ।**
**బహూవాచ ప్రభుర్విప్రాః! సత్కృదోఽసత్సు దండదః ॥ 10 ॥**

ఓ బ్రాహ్మణులారా! సత్పురుషులకానందాన్నిచ్చి దుష్టులకు దండన విధించే శంకర ప్రభువు, వారి దుశ్చేష్టలను గురించి అతనికి వివరంగా చెప్పాడు.

**శర్వోక్తమితి స శ్రుత్వా సువిస్మితమనా ఋషిః ।**
**సుప్రణమ్య శివం భక్త్యా సాంజలిః పునరబ్రవీత్ ॥ 11 ॥**

శివుని మాటలు విని గౌతమమహర్షి పరమాశ్చర్యాన్ని పొంది శివునకు చేతులు జోడించి భక్తితో ప్రణమిల్లి మరలా ఇలా పలికాడు.

**గౌతమ ఉవాచ -** గౌతముడు పలికాడు.

**ఋషిభిస్తైర్మహేశాన! హ్యుపకారః కృతో మహాన్ ।**
**యద్యేవం న కృతం తైస్తు దర్శనం తే కుతో భవేత్ ॥ 12 ॥**

ఓ మహేశ్వరా! ఈ ఋషులు నాకు మహోపకారం చేశారు. వారావిధంగా చేసియుండనిచో నాకు మీ దర్శనమెట్లు లభిస్తుంది?

**ధన్యాస్తే ఋషయో యైస్తు మహ్యం శుభతరం కృతమ్ ।**
**తద్దురాచరణాదేవ మమ స్వార్థో మహానభూత్ ॥ 13 ॥**

నాకు అతిశయించిన శుభాన్ని కలిగించిన ఆ మహర్షులు ధన్యులు. వారి దురాచారాలవల్ల నాకు మహోపకారం సిద్ధించింది.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యేవం తద్వచశ్శ్రుత్వా సుప్రసన్నో మహేశ్వరః ।**
**గౌతమం ప్రత్యువాచాశు కృపాదృష్ట్యా విలోక్య చ ॥ 14 ॥**

గౌతముని మాటలు విని మహేశ్వరుడు మిక్కిలి ప్రసన్నుడై ఆయనపై దయాదృష్టితో చూచి వెంటనే ఇట్లు బదులిచ్చాడు.

**శివ ఉవాచ –** శివుడు పలికాడు.

**ఋషిధన్యోఽసి విప్రేంద్ర! ఋషే! శ్రేష్ఠతరోఽసి వై ।**
**జ్ఞాత్వా మాం సుప్రసన్నం హి వృణు త్వం వరముత్తమమ్ ॥ 15 ॥**

"ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! ఋషీ! నీవు ధన్యుడవైన మహర్షివి. పరమశ్రేష్ఠుడవు. నేను మిక్కిలి ప్రసన్నుడనయ్యాను. నీవు ఉత్తమమైన వరాన్ని కోరుకొమ్ము.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**గౌతమోఽపి విచార్యైవం లోకే విశ్రుతమిత్యుత ।**
**అన్యథా న భవేదేవ తస్మాదుక్తం సమాచరేత్ ॥ 16 ॥**

ఈ వృత్తాంతం లోకంలో ప్రసిద్ధి చెందుతుంది. దీనిని ఆపే ఉపాయం లేనేలేదు. కావున నేను చెప్పినట్లు చేస్తాను అని గౌతముడాలోచించాడు.

**నిశ్చిత్యైవం మునిశ్రేష్ఠో గౌతమశ్శివభక్తిమాన్ ।**
**సాంజలిర్నతశీర్షో హి శంకరం వాక్యమబ్రవీత్ ॥ 17 ॥**

శివభక్తుడైన గౌతమమహర్షి ఇట్లు నిశ్చయించుకొని చేతులు జోడించి, శిరస్సువంచి, శంకరునితో ఇలా పలికాడు.

**గౌతమ ఉవాచ –** గౌతముడు పలికాడు.

**సత్యం నాథ! బ్రవీషి త్వం తథాపి పంచభిః కృతమ్ ।**
**నాన్యథా భవతీత్యత్ర యజ్జాతం జాయతాం తు తత్ ॥ 18 ॥**

ఓ నాథా! నీవు సత్యాన్ని పలికావు. ముఖ్యమైన ఐదుగురీపని చేశారు. విధిబలంచే ఆ విధంగా జరగవలసియుంది. జరిగినదాని గురించి చింతవలదు.

**యది ప్రసన్నో దేవేశ! గంగా చ దీయతాం మమ ।**
**కురు లోకోపకారం హి నమస్తేఽస్తు నమోఽస్తు తే ॥ 19 ॥**

ఓ దేవేశా! నీవు ప్రసన్నుడవైతే నాకు గంగనిచ్చి లోకోపకారం చేయుము. నీకనేక నమస్కారాలు.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఇత్యుక్త్వా వచనం తస్య ధృత్వా వై పాదపంకజమ్ ।**
**నమశ్చకార దేవేశం గౌతమో లోకకామ్యయా ॥ 20 ॥**

గౌతముడిట్లు పలికి లోకహితం కోరి దేవదేవుని పాదపద్మాలు పట్టుకొని నమస్కరించాడు.

**తతస్తు శంకరో దేవః పృథివ్యాశ్చ దివశ్చ సః ।**
**సారం చైవ సముద్ధృత్య రక్షితం పూర్వమేవ తత్ ॥ 21 ॥**

**వివాహే బ్రహ్మణా దత్తమవశిష్టం చ కించన ।**
**తత్తస్మై దత్తవాన్ శంభుర్మునయే భక్తవత్సలః ॥ 22 ॥**

పూర్వం భూలోక – స్వర్గలోకాల సారాన్ని తీసి దానిలో కొంతభాగం గౌతమునకు వివాహంలో బ్రహ్మచే ఈయబడింది. మిగిలినది దాచి యుంచబడింది. అప్పుడు భక్తవత్సలుడు మంగళకరుడునైన శంభుదేవుడు దానిని గౌతమ మహర్షికిచ్చాడు.

**గంగాజలం తదా తత్ర స్త్రీరూపమభవత్పరమ్ ।**
**తస్యాశ్చైవ ఋషిశ్రేష్ఠః స్తుతిం కృత్వా నతిం వ్యధాత్ ॥ 23 ॥**

అప్పుడచ్చట గంగాజలం గొప్ప స్త్రీ రూపం ధరించింది. ఆ మహర్షి ఆమెకు నమస్కరించి స్తుతించాడు.

**గౌతమ ఉవాచ** – గౌతముడు పలికాడు.

**ధన్యాసి కృతకృత్యాసి పావితం భువనం త్వయా ।**
**మాం చ పావయ గంగే! త్వం పతంతం నిరయే ధ్రువమ్ ॥ 24 ॥**

ఓ గంగా! నీవు ధన్యురాలవు. కృతకృత్యురాలవు. నీవు లోకాన్ని పవిత్రం చేశావు. నిశ్చయంగా నరకంలో పడబోయే నన్ను కూడ పవిత్రం చేయుము.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**శంభుశ్చాపి తదోవాచ సర్వేషాం హితకృచ్ఛృణు ।**
**గంగే! గౌతమమేనం త్వం పావయస్వ మదాజ్ఞయా ॥ 25 ॥**

అప్పుడు సర్వులకు హితాన్ని చేసే శంభువు కూడ ఇట్లు పలికాడు. “ఓ గంగా! విను. నా ఆజ్ఞచే గౌతముని నీవు పావనం చేయుము”.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఇతి శ్రుత్వా వచస్తస్య శంభోశ్చ గౌతమస్య చ ।**
**ఉవాచైవం శివం గంగా శివభక్తిర్హి పావనీ ॥ 26 ॥**

శంభునియొక్కయు, గౌతమునియొక్కయు మాటలు విని శివుని శివభక్తురాలు, పరమపావనియునగు గంగ శివునితో ఇలా పలికింది.

**గంగోవాచ –** గంగ పలికింది.

**ఋషిం తు పావయిత్వాఽహం పరివారయుతం ప్రభో! ।**
**గమిష్యామి నిజస్థానం వచస్సత్యం బ్రవీమి హ ॥ 27 ॥**

ఓ ప్రభూ! నేనీ ఋషిని కుటుంబసమేతంగా పావనం చేసి నా స్థానానికి వెళతాను. నేను సత్యాన్నే పలుకుతున్నాను.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యుక్తో గంగయా తత్ర మహేశో భక్తవత్సలః ।**
**లోకోపకరణార్థాయ పునర్గంగాం వచోఽబ్రవీత్ ॥ 28 ॥**

ఆ సమయంలో గంగ ఇట్లు పలుకగా భక్తవత్సలుడైన మహేశ్వరుడు లోకాలకు ఉపకారం చేయగోరి గంగతో మరలా ఇలా పలికాడు.

**శివ ఉవాచ –** శివుడు పలికాడు.

**త్వయా స్థాతవ్యమత్రైవ వ్రజేద్యావత్కలిర్యుగః ।**
**వైవస్వతో మనుర్దేవి! హ్యష్టావింశత్తమో భవేత్ ॥ 29 ॥**

ఓ దేవీ! సూర్యుని కుమారుడును, ఇరవై ఎనిమిదవ వైవస్వతమన్వంతరం పూర్తియగువరకు నీవీ కలియుగంలో భూమండలంపై ఉండాలి.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇతి శ్రుత్వా వచస్తస్య స్వామినశ్శంకరస్య తత్ ।**
**ప్రత్యువాచ పునర్గంగా పావనీ సా సరిద్వరా ॥ 30 ॥**

శంకరప్రభువుయొక్క మాట విని నదీమతల్లి, పరమ పావనియునగు గంగ ఇట్లు బదులు పలికింది.

**గంగోవాచ –** గంగ పలికింది.

**మాహాత్మ్యమధికం చేత్ స్యాన్మమ స్వామిన్మహేశ్వర! ।**
**సర్వేభ్యశ్చ తదా స్థాస్యే ధరాయాం త్రిపురాంతక! ॥ 31 ॥**

ఓ స్వామీ! మహేశ్వరా! త్రిపురాంతకా! భూమండలంలో అన్నింటినీ మించిన గొప్పదనం నాకు కలిగే పక్షంలో నేనిచ్చట ఉండగలను.

**కించాన్యచ్చ శృణు స్వామిన్! వపుషా సుందరేణ హ ।**
**తిష్ఠ త్వం మత్సమీపే వై సగణస్సాంబికః ప్రభో! ॥ 32 ॥**

ఓ స్వామీ! మరియొక విషయం కూడ వినండి. ఓ ప్రభూ! నీవు గణాలతోను, పార్వతితోను గూడి సుందరమైన దేహాన్ని ధరించి నా సమీపంలో నుండుము.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఏవం తస్యా వచః శ్రుత్వా శంకరో భక్తవత్సలః ।**
**లోకోపకరణార్థాయ పునర్గంగాం వచోఽబ్రవీత్ ॥ 33 ॥**

ఆమెయొక్క ఈ మాట విని భక్తవత్సలుడైన శంకరుడు లోకాలకుపకారం చేయగోరి గంగాదేవితో మరలా ఇలా పలికాడు.

**శివ ఉవాచ** - శివుడు పలికాడు.

**ధన్యాసి శ్రూయతాం గంగే! హ్యహం భిన్నస్త్వయా న హి ।**
**తథాపి స్థీయతే హ్యత్ర స్థీయతాం చ త్వయాపి హి ॥ 34 ॥**

ఓ గంగా! నీవు ధన్యురాలవు. విను. నీవు నాకంటె వేరుగా లేవు. అయిననూ నేనిచ్చట ఉంటాను. నీవు కూడా ఉండుము.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఇత్యేవం వచనం శ్రుత్వా స్వామినః పరమేశితుః ।**
**ప్రసన్న మానసా భూత్వా గంగా చ ప్రత్యపూజయత్ ॥ 35 ॥**

పరమేశ్వరప్రభువుయొక్క వచనం విని గంగ మిక్కిలి ప్రసన్నమైన మనస్సుగలదై ఆయనను పూజించింది.

**ఏతస్మిన్నంతరే దేవా ఋషయశ్చ పురాతనాః ।**
**సుతార్థాన్యప్యనేకాని క్షేత్రాణి వివిధాని చ ॥ 36 ॥**

**ఆగత్య గౌతమం సర్వే గంగాం చ గిరిశం తథా ।**
**జయజయేతి భాషంతః పూజయామాసురాదరాత్ ॥ 37 ॥**

ఇంతలో అచ్చటకు దేవతలు, ప్రాచీనులైన ఋషులు, అనేక తీర్థాలు, వివిధ క్షేత్రాలు వచ్చి జయజయధ్వానాలు పలికి గౌతమునిని, గంగను, కైలాసపతిని ఆదరంతో పూజించారు.

**తతస్తే నిర్జరాస్సర్వే తేషాం చక్రుః స్తుతిం ముదా ।**
**కరాన్ బద్ధ్వా నతస్కంధా హరిబ్రహ్మాదయస్తదా ॥ 38 ॥**

అనంతరం విష్ణువు, బ్రహ్మ మున్నగు దేవతలందరు చేతులు కట్టుకొని వంగి ఆనందంతో వారిని స్తుతించారు.

**గంగా ప్రసన్నా తేభ్యశ్చ గిరిశశ్చైచతుస్తదా ।**
**వరం బ్రూత సురశ్రేష్ఠాః! దద్వో వః ప్రియకామ్యయా ॥ 39 ॥**

అంతట వారి విషయంలో గంగ, శివుడు ప్రసన్నులై ఇలా పలికారు – "ఓ దేవోత్తములారా! మీకు ప్రియాన్ని చేయగోరి వరాన్ని ఇచ్చుటకు సంకల్పించాము. కోరుకొనండి."

**దేవా ఊచుః –** దేవతలు పలికారు.

**యది ప్రసన్నో దేవేశ! ప్రసన్నా త్వం సరిద్వరే! ।**
**స్థాతవ్యమత్ర కృపయా నః ప్రియార్థం తథా నృణామ్ ॥ 40 ॥**

ఓ దేవేశా! ఓ నదీశ్రేష్ఠమా! మీరు ప్రసన్నులైతే మాయందు, మానవులయందు ప్రీతితో దయతో ఇచ్చటనే స్థిరంగా ఉండండి.

**గంగోవాచ –** గంగ పలికింది.

**యూయం సర్వం ప్రియార్థం చ తిష్ఠతాత్ర న కిం పునః ।**
**గౌతమం క్షాళయిత్వాహం గమిష్యామి యథాగతమ్ ॥ 41 ॥**

సర్వులకు ప్రీతిని కలిగించడానికి మీరిచ్చటనే ఏల ఉండరాదు? నేను గౌతముని పాపాన్ని కడిగివేసి వచ్చిన దారిన వెళ్ళతాను.

**భవత్సు మే విశేషోఽత్ర జ్ఞేయశ్చైవ కథం సురాః! ।**
**తత్ప్రమాణం కృతం చేత్స్యాత్తదా తిష్ఠామ్యసంశయమ్ ॥ 42 ॥**

ఓ దేవతలారా! మీ అందరిలో నా ప్రత్యేకత తెలిసే విధమేది? మీరా విషయాన్ని నిరూపిస్తే అప్పుడు నేను నిస్సందేహంగా ఉంటాను.

**సర్వే ఊచుః –** అందరూ పలికారు.

**సింహరాశౌ యదా స్యాద్వై గురుస్సర్వసుహృత్తమః ।**
**తదా వయం చ సర్వే త్వా గమిష్యామో న సంశయః ॥ 43 ॥**

సర్వులకు ప్రియమిత్రుడైన గురువు ఎప్పుడైతే సింహరాశిలో ఉంటాడో అప్పుడు మేమందరం నిస్సంశయంగా నీలోనికి వస్తాము.

**ఏకాదశ చ వర్షాణి లోకానాం పాతకం త్విహ ।**
**క్షాళితం యద్భవేదేవం మలినాస్స్మః సరిద్వరే! ॥ 44 ॥**

ఓ నదీశ్రేష్ఠమా! పదకొండు సంవత్సరాలు మేము మానవుల పాతకాలను క్షాళితం చేసి మేము కూడ మాలిన్యాన్ని పొందుతాము.

**తస్యైవ క్షాళనాయ త్వాయాస్యామస్సర్వథా ప్రియే! ।**
**త్వత్సకాశం మహాదేవి! ప్రోచ్యతే సత్యమాదరాత్ ॥ 45 ॥**

ఓ ప్రీతిపాత్రమైనదానా! అప్పుడు మేము ఆ మాలిన్యాన్ని క్షాళితం చేసుకోవడానికి నీ సమీపానికి వస్తాము. ఓ మహాదేవీ! మేము నీ యెదుట ఆదరంతో సత్యాన్నే పలుకుతున్నాము.

**అనుగ్రహాయ లోకానామస్మాకం ప్రియకామ్యయా ।**
**స్థాతవ్యం శంకరేణాపి త్వయా చైవ సరిద్వరే! ॥ 46 ॥**

ఓ నదీశ్రేష్ఠమా! లోకానుగ్రహం కొరకును, మాకు ప్రీతిని కలిగించడానికిని నీవు శంకరునితో కూడి ఇచ్చటనే స్థిరంగా ఉండుము.

**యావత్సింహే గురుశ్చైవ స్థాస్యామస్తావదేవ హి ।**
**త్వయి స్నానం త్రికాలం చ శంకరస్య చ దర్శనమ్ ॥ 47 ॥**

**కృత్వా స్వపాపం నిఖిలం విమోక్ష్యామో న సంశయః ।**
**స్వదేశాంశ్చ గమిష్యామో భవచ్ఛాసనతో వయమ్ ॥ 48 ॥**

సింహంలో గురుడున్నంతవఱకు మేము నీయందుంటాము. మూడు కాలాలయందు నీలో స్నానం చేసి, శంకరుని దర్శించి మేము మా పాపాలన్నింటి నుండి నిస్సందేహంగా విముక్తిని పొందుతాము. తరువాత నీ అనుమతిని పొంది మా మా స్థానాలకు వెళ్తాము.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యేవం ప్రార్థితస్తైస్తు గౌతమేన మహర్షిణా ।**
**స్థితో౽సౌ శంకరః ప్రీత్యా స్థితా సా చ సరిద్వరా ॥ 49 ॥**

ఈ విధంగా గౌతమమహర్షియు, ఇతరులును ప్రార్థించగా శంకరుడును, నదీరాజమైన గంగయు ప్రీతితో అచ్చటనే ఉండిపోయారు.

**సా గంగా గౌతమీ నామ్నా లింగం త్ర్యంబకమీరితమ్ ।**
**ఖ్యాతా ఖ్యాతం బభూవాథ మహాపాతకనాశనమ్ ॥ 50 ॥**

ఆ గంగను గౌతమియనియు, మహాపాతకనాశనమైన ఆ లింగానికి త్ర్యంబకేశ్వరుడనియు, అనంతర కాలంలో ఖ్యాతి కలిగింది.

**తద్దినం హి సమారభ్య సింహస్థే చ బృహస్పతౌ ।**
**ఆయాంతి సర్వతీర్థాని క్షేత్రాణి దైవతాని చ ॥ 51 ॥**

ఆనాటి నుండియు గురువు సింహరాశిలో నుండగా సర్వతీర్థాలు, క్షేత్రాలు, దేవతలు అచ్చటకు వస్తున్నారు.

**సరాంసి పుష్కరాదీని గంగాద్యాస్సరితస్తథా ।**
**వాసుదేవాదయో దేవాః సంతి వై గౌతమీతటే ॥ 52 ॥**

అప్పుడు పుష్కరం మున్నగు సరస్సులు, గంగాది నదులు, వాసుదేవుడు మున్నగు దేవతలు గౌతమీతటంలో ఉంటారు.

**యావత్తత్ర స్థితానీహ తావత్తేషాం ఫలం న హి ।**
**స్వప్రదేశే సమాయాతాస్తర్హ్యేతేషాం ఫలం భవేత్ ॥ 53 ॥**

ఇక్కడ ఉన్నంత వరకు, వాటికి తమ స్వస్థానంలో మహిమ ఉండదు. అవి తమ స్థానాలకు వెళ్లిన పిదప మరలా ఫలాలనీయగల్గుతారు.

**జ్యోతిర్లింగమిదం ప్రోక్తం త్ర్యంబకం నామ విశ్రుతమ్ ।**
**స్థితం తటే హి గౌతమ్యా మహాపాతకనాశనమ్ ॥ 54 ॥**

గౌతమీతీరమునందున్న వారి మహాపాపాలను పోగొట్టే ఈ జ్యోతిర్లింగం త్ర్యంబకమని పిలువబడుతోంది.

**యః పశ్యేద్భక్తితో జ్యోతిర్లింగం త్ర్యంబకనామకమ్ ।**
**పూజయేత్ప్రణమేత్ స్తుత్వా సర్వపాపైః ప్రముచ్యతే ॥ 55 ॥**

ఎవడైతే త్ర్యంబకేశ్వర జ్యోతిర్లింగాన్ని దర్శించి నమస్కరించి స్తుతించి పూజిస్తాడో అట్టివాడు సర్వపాపాల నుండి విముక్తిని పొందుతాడు.

**జ్యోతిర్లింగం త్ర్యంబకం హి పూజితం గౌతమేన హ ।**
**సర్వకామప్రదం చాత్ర పరత్ర పరముక్తిదమ్ ॥ 56 ॥**

గౌతమునిచే పూజింపబడిన త్ర్యంబకేశ్వర జ్యోతిర్లింగం ఈ లోకంలో కోర్కెలనన్నింటిని తీర్చి పరలోకంలో సర్వోత్కృష్టమైన ముక్తినిస్తుంది.

**ఇతి వశ్చ సమాఖ్యాతం యత్పృష్టోఽహం మునీశ్వరాః! ।**
**కిమన్యదిచ్ఛథ శ్రోతుం తద్బ్రూయాం వో న సంశయః ॥ 57 ॥**

"ఓ మహర్షులారా! మీరడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ వృత్తాంతాన్ని చెప్పాను. మీరింకనూ ఏమి వినగోరుచున్నారు? నేను నిస్సందేహంగా చెబుతాను."

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం త్ర్యంబకేశ్వరమాహాత్మ్యవర్ణనం నామ షడ్వింశోఽధ్యాయః ॥ 26 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు త్ర్యంబకేశ్వరమాహాత్మ్యవర్ణనం అనే పేరుగల ఇరవైఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్తవింశోఽధ్యాయః - ఇరవైఏడవ అధ్యాయం

## త్ర్యంబకేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనమ్ - త్ర్యంబకేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం

**ఋషయ ఊచుః -** ఋషులు పలికారు.

**గంగా చ జలరూపేణ కుతో జాతా వద ప్రభో! ।**
**తన్మాహాత్మ్యం విశేషేణ కుతో జాతం వద ప్రభో! ॥ 1 ॥**

ఓ ప్రభూ! గంగ జలరూపంలో ఎక్కడి నుండి ఆవిర్భవించింది? దానికి విశేషమైన మహిమ ఎక్కడ నుండి వచ్చింది? ఓ ప్రభూ! ఈ విషయం చెప్పుము.

**యైర్విప్రైర్గౌతమాయేవ దుఃఖం దత్తం దురాత్మభిః ।**
**తేషాం కిం చ తతో జాతముచ్యతాం వ్యాససద్గురో! ॥ 2 ॥**

వ్యాసుడు సద్గురువుగా గలవాడా! దుర్బుద్ధి గల ఏ బ్రాహ్మణులు గౌతమునకు దుఃఖాన్ని కలిగించారో వారికి తదనంతరం ఏమయ్యిందో ఈవిషయం కూడ చెప్పండి.

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**ఏవం సంప్రార్థితా గంగా గౌతమేన తదా స్వయమ్ ।**
**బ్రహ్మణశ్చ గిరేర్విప్రా ద్రుతం తస్మాదవాతరత్ ॥ 3 ॥**

ఓ బ్రాహ్మణులారా! అప్పుడు గౌతముడు స్వయంగా ప్రార్థించగా గంగ ఆ బ్రహ్మగిరినుండి వేగంగా క్రిందకు దిగింది.

**ఔదుంబరస్య శాఖాయాస్తత్ప్రవాహో వినిస్సృతః ।**
**తత్ర స్నానం ముదా చక్రే గౌతమో విశ్రుతో మునిః ॥ 4 ॥**

ఆ ప్రవాహం ఔదుంబరవృక్షంయొక్క (మేడి చెట్టు) కొమ్మనుండి ఆవిర్భవించింది. ప్రఖ్యాతిగాంచిన గౌతమమహర్షి దానియందు ఆనందంతో స్నానం చేశాడు.

**గౌతమస్య చ యే శిష్యా అన్యే చైవ మహర్షయః ।**
**సమాగతాశ్చ తే తత్ర స్నానం చక్రుర్ముదాన్వితాః ॥ 5 ॥**

గౌతముని శిష్యులు, అక్కడకు వచ్చిన ఇతర మహర్షులు ఆనందంతో దానియందు స్నానం చేశారు.

**గంగాద్వారం చ తన్నామ ప్రసిద్ధమభవత్తదా ।**
**సర్వపాపహరం రమ్యం దర్శనాన్మునిసత్తమాః! ॥ 6 ॥**

అప్పటి నుండి అది గంగాద్వారమని ప్రసిద్ధిచెందింది. ఓ మహర్షులారా! ఆ సుందరప్రదేశం దర్శన-మాత్రంచేతనే సర్వపాపాలను పోగొడుతుంది.

**గౌతమస్పర్ధినస్తే చ ఋషయస్తత్ర చాగతాః ।**
**స్నానార్థం తాంశ్చ సా దృష్ట్వా హ్యంతర్ధానం గతా ద్రుతమ్ ॥ 7 ॥**

గౌతమునిపై విరోధం బూనిన మహర్షులచ్చటకు స్నానం కొఱకు వచ్చారు. వారిని చూచి గంగ వెంటనే అంతర్ధానమయ్యింది.

**మామేతి గౌతమస్తత్ర వ్యాజహార వచో ద్రుతమ్ ।**
**ముహుర్ముహుః స్తువన్ గంగాం సాంజలిర్నతమస్తకః ॥ 8 ॥**

ఆ సమయంలో గౌతముడు చేతులు జోడించి తలవంచి అనేక పర్యాయాలు స్తుతిస్తూ "వద్దు వద్దు" అని వేగంగా పలికాడు.

**గౌతమ ఉవాచ –** గౌతముడు పలికాడు.

**ఇమే చ శ్రీమదాంధాశ్చ సాధవో వాఽప్యసాధవః ।**
**ఏతత్పుణ్యప్రభావేణ దర్శనం దీయతాం త్వయా ॥ 9 ॥**

వీరు ధనమదంతో గ్రుడ్డివారయియుండవచ్చు. వీరు సాధుపురుషులు కావచ్చు, కాకపోవచ్చు. అని ఈ స్థలంయొక్క పుణ్యప్రభావంచే నీవు వీరికి దర్శనమీయదగును.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**తతో వాణీ సముత్పన్నా గంగాయా వ్యోమమండలాత్ ।**
**తచ్ఛృణుధ్వమృషిశ్రేష్ఠాః! గంగావచనముత్తమమ్ ॥ 10 ॥**

అంతట ఆకాశంనుండి గంగాదేవి వాణి వినవచ్చింది. "ఓ మహర్షులారా! గంగయొక్క ఉత్తమ వచనాలు వినండి.

**ఏతే దుష్టతమాశ్చైవ కృతఘ్నాః స్వామిద్రోహిణః ।**
**జాల్మాః పాఖండినశ్చైవ ద్రష్టుం వర్జ్యాశ్చ సర్వదా ॥ 11 ॥**

వీరు పరమదుర్మార్గులు, కృతఘ్నులు, స్వామి ద్రోహులు. పాపాత్ములు, పాషండులు. కాబట్టి వీరి నెన్నడూ చూడరాదు.

**గౌతమ ఉవాచ –** గౌతముడు పలికాడు.

**మాతశ్చ శ్రూయతామేతన్మహతాం గిర ఏవ చ ।**
**తస్మాత్త్వయా చ కర్తవ్యం సత్యం చ భగవద్వచః ॥ 12 ॥**

ఓ తల్లీ! ఈ మహాత్ముల మాటలు విను. ఇది భగవానుని మాట గనుక దీనిని నీవు సత్యం చేయుము.

**అపకారిషు యో లోక ఉపకారం కరోతి వై ।**
**తేన పూతో భవామ్యత్ర భగవద్వచనం త్విదమ్ ॥ 13 ॥**

లోకంలో ఎవడైతే అపకారం చేసిన వాడికి ఉపకారం చేస్తాడో వానిచే నేను పవిత్రుడనౌతానని భగవద్వచనం.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఇతి శ్రుత్వా మునేర్వాక్యం గౌతమస్య మహాత్మనః ।**
**పునర్వాణీ సముత్పన్నా గంగాయా వ్యోమమండలాత్ ॥ 14 ॥**

మహాత్ముడైన గౌతమమహర్షి మాటలను వినిన తరువాత ఆకాశమండలంనుండి గంగాదేవి వాణి మరల ఆవిర్భవించింది.

**కథ్యతే హి త్వయా సత్యం గౌతమర్షే! శివం వచః ।**
**తథాపి సంగ్రహార్థం చ ప్రాయశ్చిత్తం చరంతు వై ॥ 15 ॥**

ఓ గౌతమ మహర్షీ! నీవు సత్యము, మంగళకరమునైన మాట చెప్పావు. అయినప్పటికి లోకసంగ్రహార్థం వీరు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి.

**శతమేకోత్తరం చాత్ర కార్యం ప్రక్రమణం గిరేః ।**
**భవచ్ఛాసనతస్త్వే తై స్త్వదధీనైర్విశేషతః ॥ 16 ॥**

వీరందరు ప్రత్యేకంగా నీ ఆధీనంలో ఉండాలి. నీ ఆజ్ఞ ననుసరించి ఈ పర్వతానికి నూట ఒక్కమార్లు ప్రదక్షిణం చేయాలి.

**తతశ్చైవాధికారశ్చ జాయతే దుష్టకారిణామ్ ।**
**మద్దర్శనే విశేషేణ సత్యముక్తం మయా మునే! ॥ 17 ॥**

ఓ మహర్షీ! దుష్టకర్మలు చేసే వారికి ఆ విధంగా ప్రాయశ్చిత్తం చేసుకున్న తరువాత మాత్రమే నన్ను దర్శించే విశేషాధికారం లభిస్తుంది. నేను సత్యాన్నే పలికితిని.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఇతి శ్రుత్వా వచస్తస్యాశ్చక్రుర్వైతే తథాఽఖిలాః ।**
**సంప్రార్థ్య గౌతమం దీనాః క్షంతవ్యో నోఽపరాధకః ॥ 18 ॥**

ఆమె మాటలు వినిన వారందరూ ఆ విధంగానే మా అపరాధాన్ని మన్నించమని దీనంగా గౌతముని వేడుకొన్నారు.

**ఏవం కృతే తదా తేన గౌతమేన తదాజ్ఞయా ।**
**కుశావర్తం నామ చక్రే గంగా ద్వారాదధోగతమ్ ॥ 19 ॥**

వారట్లు చేసిన తరువాత ఆమె అనుమతిని పొంది గౌతముడు గంగాద్వారానికి క్రిందిభాగంలో కుశావర్తమనే ఒక గోయి త్రవ్వాడు.

**తతః ప్రాదురభూత్తత్ర సా తస్య ప్రీతయే పునః ।**
**కుశావర్తం చ విఖ్యాతం తీర్థమాసీత్తదుత్తమమ్ ॥ 20 ॥**

అప్పుడు గంగ ఆయనకు ప్రీతిని కలిగించడానికి మరలా అచ్చట ఆవిర్భవించింది. అది 'కుశావర్తము' అనే పేరుతో ఉత్తమమైన తీర్థంగా ప్రఖ్యాతి పొందింది.

**తత్ర స్నాతో నరో యస్తు మోక్షాయ పరికల్పతే ।**
**త్యక్త్వా సర్వానఘాన్సద్యో విజ్ఞానం ప్రాప్య దుర్లభమ్ ॥ 21 ॥**

అక్కడ స్నానం చేసి మానవుడు వెంటనే సర్వపాపాలనుండి విముక్తుడై దుర్లభమైన జ్ఞానాన్ని పొంది మోక్షానికి అర్హుడౌతాడు.

**గౌతమో ఋషయశ్చాన్యే మిళితాశ్చ పరస్పరమ్ ।**
**లజ్జితాస్తే తదా యే చ కృతఘ్నా హ్యభవన్పురా ॥ 22 ॥**

గౌతముడు, తదితర మహర్షులు ఒకరి నొకరు కలుసుకున్నారు. తాము కృతఘ్నులమయ్యామని ఆ మునులు సిగ్గుపడ్డారు.

**ఋషయ ఊచుః –** ఋషులు పలికారు.

**అస్మాభిరన్యథా సూత! శ్రుతం తద్వర్ణయామహే ।**
**గౌతమస్తాన్ ద్విజాన్ క్రుద్ధశ్శశాపేతి ప్రబుధ్యతామ్ ॥ 23 ॥**

ఓ సూతా! మేము మరియొక విధంగా వినియున్నాము. దానిని మీకు చెబుతాము "గౌతముడు కోపించి ఆ బ్రాహ్మణులను శపించాడు" అని తెలిసింది.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ద్విజాస్తదపి సత్యం వై కల్పభేదసమాశ్రయాత్ ।**
**వర్ణయామి విశేషేణ తాం కథామపి సువ్రతాః! ॥ 24 ॥**

ఓ బ్రాహ్మణులారా! కల్పభేదాన్ని స్వీకరిస్తే ఆ కథ కూడ సత్యమే. ఓ సువ్రతులారా! ఆ కథ కూడ వివరంగా వర్ణించి చెబుతాను.

**గౌతమోఽపి ఋషీన్ దృష్ట్వా తదా దుర్భిక్షపీడితాన్ ।**
**తపశ్చకార సుమహద్వరుణస్య మహాత్మనః ॥ 25 ॥**

అప్పుడు గౌతముడు దుర్భిక్షంచే బాధింపబడుతున్న ఋషులను చూచి మహాత్ముడైన వరుణునుద్దేశించి మిక్కిలి గొప్ప తపస్సు చేశాడు.

**అక్షయ్యం కల్పయామాస జలం వరుణమాయయా ।**
**తతో వ్రీహీన్ యవాంశ్చైవ వాపయామాస భూరిశః ॥ 26 ॥**

ఆయన వరుణుని మాయాప్రభావంవల్ల అక్షయమైన నీటినేర్పాటు చేసి అనంతరం ధాన్యం, యవలు అధికంగా పండింప సాగాడు.

**ఏవం పరోపకారీ స గౌతమో మునిసత్తమాః! ।**
**ఆహారం కల్పయామాస తేభ్యః స్వతపసో బలాత్ ॥ 27 ॥**

ఓ మునిశ్రేష్ఠులారా! ఇట్లు పరోపకారియైన గౌతముడు తన తపోబలంచే వారికి ఆహారాన్ని ఏర్పాటు చేశాడు.

**కదాచిత్తత్స్త్రియో దుష్టా జలార్థమపమానితాః ।**
**ఊచుః పతిభ్యస్తాః క్రుద్ధా గౌతమేర్ష్యాకరం వచః ॥ 28 ॥**

ఒకనాడు దుర్బుద్ధి గల మునుల భార్యలు నీటి కొఱకు అవమానం పొంది కోపించి తమ భర్తలకు గౌతమునిపై ఈర్ష్య కలిగే మాటలు చెప్పారు.

**తతస్తే భిన్నమతయో గాం కృత్వా కృత్రిమాం ద్విజాః ।**
**తద్ధాన్యభక్షణాసక్తాం చక్రుస్తాం కుటిలాశయాః ॥ 29 ॥**

అంతట వక్రబుద్ధి గల ఆ బ్రాహ్మణులు గౌతమునిపై వ్యతిరేకభావం గలవారై కృత్రిమమైన గోవును సృష్టించి అది గౌతముని ధాన్యం భక్షించేటట్లు చేశారు.

**స్వధాన్యభక్షణాసక్తాం గాం దృష్ట్వా గౌతమస్తదా ।**
**తృణేన తాడయామాస శనైస్తాం సన్నివారయన్ ॥ 30 ॥**

తన ధాన్యాన్ని ఆసక్తితో భక్షిస్తున్న గోవును చూచి గౌతముడు దానిని మెల్లగా నివారించబోయి గడ్డిపరకతో అదిలించాడు.

**తృణసంస్పర్శమాత్రేణ సా భూమౌ పతితా చ గౌః ।**
**మృతా హ్యభూత్ క్షణం విప్రాః! భావికర్మవశాత్తదా ॥ 31 ॥**

ఓ బ్రాహ్మణులారా! అప్పుడు భవిష్యత్తు నిర్ధారించే కర్మప్రభావంచేత ఆ గోవు గడ్డిపరక తగిలినంత మాత్రంచేతనే అది నేలపైబడి వెనువెంటనే మరణించింది.

**గౌర్హతా గౌతమేనేతి తదా తే కుటిలాశయాః ।**
**ఏకత్రీభూయ తత్రత్యైః సకలా ఋషయోఽవదన్ ॥ 32 ॥**

అంతట కుటిలాత్ములైన ఆ ఋషులందరు అక్కడి వారితో జతగట్టి 'గౌతముడు గోవును చంపాడు' అని చెప్పారు.

**తతస్స గౌతమో భీతో గౌర్హతేతి బభూవ హ ।**
**చకార విస్మయం నార్యహల్యా శిష్యైశ్శివానుగః ॥ 33 ॥**

అంతట శివభక్తుడైన గౌతముడు భీతుడై భార్యయైన అహల్యతోను, శిష్యులతోను గూడి 'గోవు సంహరింపబడింది' అని విస్మయాన్ని పొందాడు.

**తతస్స గౌతమో జ్ఞాత్వా తాం గాం క్రోధసమాకులః ।**
**శశాప తానృషీన్ సర్వాన్ గౌతమో మునిసత్తమః ॥ 34 ॥**

అనంతరం గౌతమమహర్షి ఆ గోవు యొక్క యథార్థ స్వరూపాన్ని తెలుసుకొని కోపంతో నిండిన మనస్సు గలవాడై ఆ ఋషులనందరిని శపించాడు.

**గౌతమ ఉవాచ** – గౌతముడు పలికాడు.

**యూయం సర్వే దురాత్మానో దుఃఖదా మే విశేషతః ।**
**శివభక్తస్య సతతం స్యుర్వేదవిముఖాస్సదా ॥ 35 ॥**

"దుర్మార్గులైన మీరందరు శివభక్తుడనైన నాకు విశేషదుఃఖాన్ని కలిగించారు. కాబట్టి మీరు సర్వదా వేదము-నందు శ్రద్ధలేని వారౌదురు గాక!

**అద్య ప్రభృతి వేదోక్తే సత్కర్మణి విశేషతః ।**
**మా భూయాద్భవతాం శ్రద్ధా శైవమార్గే విముక్తిదే ॥ 36 ॥**

ఈనాటి నుండి మీకు వేదవిహితమైన సత్కర్మలయందును విశేషించి మోక్షమిచ్చే శైవమార్గమందును శ్రద్ధ కలుగకుండు గాక!

**అద్యప్రభృతి దుర్మార్గే తత్ర శ్రద్ధా భవేత్తు వః ।**
**మోక్షమార్గవిహీనే హి సదా శ్రుతిబహిర్ముఖే ॥ 37 ॥**

ఈనాటి నుండి మీకు మోక్షమార్గ విరుద్ధమైనట్టియు వేదబాహ్యమైనట్టియు, చెడుమార్గమునందు నిత్యం శ్రద్ధ కలిగియుందురు గాక!

**అద్యప్రభృతి భాలాని మృల్లిప్తాని భవంతు వః ।**
**స్రంసధ్వం నరకే యూయం భాలముల్లేపనాద్ద్విజాః ॥ 38 ॥**

ఈనాటి నుండి మీ నుదురులు మట్టి పూసినవగు గాక! ఓ బ్రాహ్మణులారా! మట్టి పూసిన నుదురులు గల మీరు నరకంలో పడుదురు గాక!

**భవంతో మా భవిన్త్యేవ శివైకపరదైవతాః ।**
**అన్యదేవ సమత్వేన జానంతు శివమద్వయమ్ ॥ 39 ॥**

మీరు శివుడు మాత్రమే పరదేవతగా గలవారు కాకుందురు గాక! అద్వితీయుడైన శివుని మీరు అన్యదేవతలతో సముడని భావింతురు గాక!

**మా భూయాద్భవతాం ప్రీతిశ్శివపూజాదికర్మణి ।**
**శివనిష్ఠేషు భక్తేషు శివపర్వసు సర్వదా ॥ 40 ॥**

మీకు శివపూజాది కర్మలందును, శివపరాయణులైన భక్తులయందును, శివసంబంధి పర్వదినాలయందును, ఎప్పటికీ మీకు ప్రీతి కలుగకుండు గాక!

**అద్య దత్తా మయా శాపా యావంతో దుఃఖదాయకాః ।**
**తావంతస్సంతు భవతాం సంతతావపి సర్వదా ॥ 41 ॥**

నాకు దుఃఖాన్ని కలిగించిన ఎంతమందికి నేనీనాడు శాపమిచ్చానో, మీ అందరికి, మీ సంతానానికి కూడ ఈ శాపం ఉండు గాక!

**అశైవాస్సంతు భవతాం పుత్రపౌత్రాదయో ద్విజాః ।**
**పుత్రైస్సహైవ తిష్ఠంతు భవంతో నరకే ధ్రువమ్ ॥ 42 ॥**

ఓ బ్రాహ్మణులారా! మీ పుత్రపౌత్రాదిసంతానం శివభక్తి లేని వారగుదురు గాక! మీరు మీ సంతానంతో సహా నిశ్చయంగా నరకాన్ని పొందుతారు.

**తతో భవంతు చండాలా దుఃఖదారిద్ర్యపీడితాః ।**
**శఠా నిందాకరాస్సర్వే తప్తముద్రాంకితాస్సదా ॥ 43 ॥**

మీరందరు దుఃఖంతోను, దారిద్ర్యంతోను పీడింపబడువారు, మోసగాళ్లు, ఇతరులను నిందించువారు, కాల్చిన ముద్రల చిహ్నాలు శరీరంపై ధరించేవారును అగుదురు గాక! చండాలురగుదురు గాక!

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇతి శప్త్వా మునీన్ సర్వాన్ గౌతమః స్వాశ్రమం యయౌ ।**
**శివభక్తిం చకారాతి స బభూవ సుపావనః ॥ 44 ॥**

పరమ పవిత్రుడైన గౌతముడు మునులందరినీ ఈ విధంగా శపించి తన ఆశ్రమానికి వెళ్లి దృఢమైన శివభక్తితో జీవించాడు.

**తతస్తైః ఖిన్నహృదయా ఋషయస్తేఽఖిలా ద్విజాః ।**
**కాంచ్యాం చక్రుర్నివాసం హి శైవధర్మ బహిష్కృతాః ॥ 45 ॥**

ఓ బ్రాహ్మణులారా! అనంతరం ఆ ఋషులందరు శాపంవల్ల దుఃఖంతో నిండిన హృదయం గలవారై శివధర్మంనుండి బహిష్కరింపబడ్డారు. కాంచీనగరంలో నివాసమేర్పాటు చేసుకున్నారు.

**తత్పుత్రాశ్చాభవన్సర్వే శైవధర్మబహిష్కృతాః ।**
**అగ్రే తద్వద్భవిష్యంతి కలౌ బహుజనాః ఖలాః ॥ 46 ॥**

వారి పుత్రులందరు శివధర్మంనుండి బహిష్కరింపబడ్డారు. భవిష్యత్తులో కలియుగంలో కూడ దుష్టులైన అనేకమంది జనులు కూడ అట్లే కాగలరు.

**ఇతి ప్రోక్తమశేషేణ తద్వృత్తం మునిసత్తమాః! ।**
**పూర్వవృత్తమపి ప్రాజ్ఞాః! శ్రుతం సర్వైస్తు చాదరాత్ ॥ 47 ॥**

ఓ మహర్షులారా! ఈ విధంగా ఆ వృత్తాంతాన్నంతటిని సమగ్రంగా చెప్పాను. ఓ ప్రాజ్ఞులారా! పూర్వకల్పంలోని వృత్తాంతాన్ని కూడ మీరు ఆదరంతో విన్నారు.

**ఇతి వశ్చ సమాఖ్యాతో గౌతమ్యాశ్చ సముద్భవః ।**
**మాహాత్మ్యముత్తమం చైవ సర్వపాపహరం పరమ్ ॥ 48 ॥**

ఈ విధంగా మీకు 'గౌతమి' యొక్క ఆవిర్భావం గూర్చియు, సర్వపాపహరమైన దాని సర్వోత్కృష్టమహిమను గూర్చియు చెప్పాను.

**త్ర్యంబకస్య చ మాహాత్మ్యం జ్యోతిర్లింగస్య కీర్తితమ్ ।**
**యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే నాత్ర సంశయః ॥ 49 ॥**

త్ర్యంబకేశ్వరజ్యోతిర్లింగంయొక్క మాహాత్మ్యాన్ని కూడ వర్ణించాను. దీనిని వినినవారు సకల పాపాల-నుండి విముక్తిని పొందుతారు. ఇది నిస్సంశయం.

**అతః పరం ప్రవక్ష్యామి వైద్యనాథేశ్వరస్య హి ।**
**జ్యోతిర్లింగస్య మాహాత్మ్యం శ్రూయతాం పాపహారకమ్ ॥ 50 ॥**

ఇటుపై పాపహరమైన వైద్యనాథేశ్వరజ్యోతిర్లింగంయొక్క మాహాత్మ్యాన్ని చెబుతాను వినండి.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం త్ర్యంబకేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం నామ సప్తవింశోఽధ్యాయః ॥ 27 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు త్ర్యంబకేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం అనే పేరుగల ఇరవైఏడవ అధ్యాయం సమాప్తం.

## అష్టావింశోఽధ్యాయః - ఇరవైఎనిమిదవ అధ్యాయం

## వైద్యనాథేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనమ్ - వైద్యనాథేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**రావణో రాక్షసశ్రేష్ఠో మానీ మానపరాయణః ।**
**ఆరరాధ హరం భక్త్యా కైలాసే పర్వతోత్తమే ॥ 1 ॥**

గర్విష్ఠి, అభిమానధనుడు, రాక్షసశ్రేష్ఠుడునైన రావణుడు పర్వతోత్తమమైన కైలాసంలో భక్తితో శివుని ఆరాధించాడు.

**ఆరాధితః కియత్కాలం న ప్రసన్నో హరో యదా ।**
**తదా చాన్యత్తపశ్చక్రే ప్రసాదార్థం శివస్య సః ॥ 2 ॥**

కొంతకాలం ఆరాధించినప్పటికీ శివుడు ప్రసన్నుడు కాలేదు. అంతట అతడు శివానుగ్రహం కొఱకు మరియొక విధమైన తపస్సు చేశాడు.

**నతశ్చాయం హిమవతస్సిద్ధిస్థానస్య వై గిరేః ।**
**పౌలస్త్యో రావణః శ్రీమాన్ దక్షిణే వృక్షఖండకే ॥ 3 ॥**

**భూమౌ గర్తం వరం కృత్వా తత్రాగ్నిం స్థాప్య స ద్విజాః! ।**
**తత్సన్నిధౌ శివం స్థాప్య హవనం స చకార హ ॥ 4 ॥**

ఓ బ్రాహ్మణులారా! సిద్ధిస్థానమనదగిన హిమవత్పర్వతంయొక్క దక్షిణ భాగంలో గుబురైన చెట్ల మధ్యలో పులస్త్యుని కుమారుడు, శోభాయుక్తుడునగు రావణుడు శివునకు నమస్కరించి భూమిలో లోతైన గోయి తీసి దానియందగ్నిస్థాపన చేసి అద్దాని సమీపంలో శివుని ప్రతిష్ఠించి హోమాన్ని చేశాడు.

**గ్రీష్మే పంచాగ్నిమధ్యస్థో వర్షాసు స్థండిలేశయః ।**
**శీతే జలాంతరస్థో హి త్రిధా చక్రే తపశ్చ సః ॥ 5 ॥**

వేసవికాలంలో పంచాగ్నుల మధ్యలో నుండియు, వర్షాకాలమందు నేలపై పరుండియు, శీతాకాలంలో నీటిలోపలనుండియు ఈ విధంగా మూడు విధాలుగా తపస్సు చేశాడు.

**చకారైవం బహు తపో న ప్రసన్నస్తదాపి హి ।**
**పరమాత్మా మహేశానో దురారాధ్యో దురాత్మభిః ॥ 6 ॥**

ఈ విధంగా గొప్ప తపస్సు చేసినను శివుడు ప్రసన్నుడు కాలేదు. పరమాత్మయగు మహేశ్వరుని దుర్మార్గులారాధించడం చాల కఠినం.

**తతశ్శిరాంసి ఛిత్త్వా చ పూజనం శంకరస్య వై ।**
**ప్రారబ్ధం దైత్యపతినా రావణేన మహాత్మనా ॥ 7 ॥**

తరువాత రాక్షసాధిపుడు, మహాత్ముడునైన రావణుడు తన శిరస్సులను నరికి శంకరుని ఆరాధించడానికి ఉపక్రమించాడు.

**ఏకైకం చ శిరశ్ఛిన్నం విధినా శివపూజనే ।**
**ఏవం సత్క్రమతస్తేన ఛిన్నాని నవ వై యదా ॥ 8 ॥**

వరుసగా ఒక్కొక్క తల నరికి యథావిధిగా అతడు శివుని పూజిస్తూ క్రమంగా తొమ్మిది తలలను ఛేదించుకున్నాడు.

**ఏకస్మిన్నవశిష్టే తు ప్రసన్నశ్శంకరస్తదా ।**
**ఆవిర్బభూవ తత్రైవ సంతుష్టో భక్తవత్సలః ॥ 9 ॥**

ఇంక ఒకతల మాత్రమే మిగిలియుండగా భక్తవత్సలుడైన శంకరుడు ప్రసన్నుడై మిక్కిలి సంతోషించి అక్కడ ప్రత్యక్షమయ్యాడు.

**శిరాంసి పూర్వవత్కృత్వా నీరుజాని తథా ప్రభుః ।**
**మనోరథం దదౌ తస్మాదతులం బలముత్తమమ్ ॥ 10 ॥**

ఆ ప్రభుడతనికి నొప్పిలేని విధంగా తలలను పూర్వం వలెనే ఉంచి అతనికి సాటిలేని ఉత్తమ బలాన్నిచ్చి కోరిక తీర్చాడు.

**ప్రసాదం తస్య సంప్రాప్య రావణస్స చ రాక్షసః ।**
**ప్రత్యువాచ శివం శంభుం నతస్కంధః కృతాంజలిః ॥ 11 ॥**

మంగళస్వరూపుడైన శంభుని అనుగ్రహాన్ని పొందిన రావణాసురుడు చేతులు జోడించి తల వంచి ప్రణమిల్లి ఇలా పలికాడు.

**రావణ ఉవాచ –** రావణుడు పలికాడు.

**ప్రసన్నో భవ దేవేశ! లంకాం చ త్వాం నయామ్యహమ్ ।**
**సఫలం కురు మే కామం త్వామహం శరణం గతః ॥ 12 ॥**

ఓ దేవేశా! ప్రసన్నుడవు కమ్ము. నేను నిన్ను లంకకు తీసుకొని పోతున్నాను. నా కోర్కె సఫలం చేయుము. నేను నిన్ను శరణు పొందుతున్నాను.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యుక్తశ్చ తదా తేన శంభుర్వై రావణేన సః ।**
**ప్రత్యువాచ విచేతస్కః సంకటం పరమం గతః ॥ 13 ॥**

రావణుడప్పుడట్లు పలుకగా శంభువు పెద్ద సంకటంలో పడ్డాడు. ఆయన మనస్సులో ఉత్సాహం లేక ఆయనిట్లు బదులు పలికాడు.

**శివ ఉవాచ -** శివుడు పలికాడు.

**శ్రూయతాం రాక్షసశ్రేష్ఠ! వచో మే సారవత్తయా ।**
**నీయతాం స్వగృహే మే హి సద్భక్త్యా లింగముత్తమమ్ ॥ 14 ॥**

ఓ రాక్షసశ్రేష్ఠా! నేను సారవంతమైన మాటలు చెబుతున్నాను. కావున సావధానంగా వినుము. ఉత్తమమైన శివలింగాన్ని సద్భక్తితో నీ యింటికి తీసుకొని వెళ్లుము.

**భూమౌ లింగం యదా త్వం చ స్థాపయిష్యసి తత్ర వై ।**
**స్థాస్యత్యత్ర న సందేహో యథేచ్ఛసి తథా కురు ॥ 15 ॥**

కాని నీవు ఎప్పుడైననూ లింగాన్ని భూమిపై ఉంచితే, అది అక్కడనే స్థిరంగా ఉంటుంది. అది నిశ్చితం. కావున నీకు నచ్చిన విధంగా చేయుము.

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**ఇత్యుక్తశ్శంభునా తేన రావణో రాక్షసేశ్వరః ।**
**తథేతి తత్సమాదాయ జగామ భవనం నిజమ్ ॥ 16 ॥**

శంభుడీవిధంగా పలుకగా రాక్షసేశ్వరుడైన రావణుడు 'సరే' యని పలికి దానిని తీసుకొని తన గృహానికి బయలుదేరాడు.

**ఆసీన్మూత్రోత్సర్గకామో మార్గే హి శివమాయయా ।**
**తత్ స్తంభితుం న శక్తోఽభూత్పౌలస్త్యో రావణః ప్రభుః ॥ 17 ॥**

శివుని మాయాప్రభావంచే మార్గమధ్యంలో రావణప్రభువునకు మూత్రవిసర్జన అవశ్యమయ్యింది. అతడు దానిని ఆపుకొనలేకపోయాడు.

**దృష్ట్వైకం తత్ర వై గోపం ప్రార్థ్య లింగం దదౌ చ తత్ ।**
**ముహూర్తకే హ్యతిక్రాంతే గోపోఽభూద్వికలస్తదా ॥ 18 ॥**

అక్కడతడొక గోపాలకుని చూచి వానిని ప్రార్థించి లింగాన్ని వానికి అప్పజెప్పాడు. ఒక ముహూర్తకాలం గడచింది. ఆ గోపాలకుడు కంగారుపడసాగాడు.

**భూమౌ సంస్థాపయామాస తద్భారేణాతిపీడితః ।**
**తత్రైవ తత్ స్థితం లింగం వజ్రసారసముద్భవమ్ ॥ 19 ॥**

**సర్వకామప్రదం చైవ దర్శనాత్పాపహారకమ్ ॥**

ఆ గోపాలకుడు శివలింగం బరువు మోయలేక దానిని నేలపై పెట్టాడు. దృఢమైన వజ్రంనుండి పుట్టిన లింగం అక్కడనే స్థిరంగా ఉండిపోయింది. దర్శించువారి పాపాలు పోగొట్టే ఆ లింగం సర్వకామప్రదమయ్యింది.

**వైద్యనాథేశ్వరం నామ్నా తల్లింగమభవన్మునే ।**
**ప్రసిద్ధిం త్రిషు లోకేషు భుక్తిముక్తిప్రదం సతామ్ ॥ 20 ॥**

ఓ మహర్షీ! ఆ లింగం ముల్లోకాలలో 'వైద్యనాథేశ్వరుడు' అను పేర ప్రసిద్ధి గాంచి సత్పురుషులకు భుక్తి ముక్తి ప్రదమయ్యింది.

**జ్యోతిర్లింగమిదం శ్రేష్ఠం దర్శనాత్పూజనాదపి ।**
**సర్వపాపహరం దివ్యం భుక్తివర్ధనముత్తమమ్ ॥ 21 ॥**

దర్శించి పూజించువారల సర్వపాపాలను పోగొట్టేది, దివ్యమైనది, భక్తివర్ధనమైనది, ఉత్తమమైనదియునైన ఆ జ్యోతిర్లింగం సర్వశ్రేష్ఠమయ్యింది.

**తస్మిన్ లింగే స్థితే తత్ర సర్వలోకహితాయ వై ।**
**రావణః స్వగృహం గత్వా వరం ప్రాప్య మహోత్తమమ్ ॥ 22 ॥**

**ప్రియాయై సర్వమాచఖ్యౌ సుఖేనాతి మహాసురః ॥**

ఆ లింగం సర్వలోకాల క్షేమం కొరకు అక్కడనే స్థిరంగా ఉంది. రాక్షసేశ్వరుడైన రావణుడు మహోత్కృష్టమైన వరాన్ని పొంది తన యింటికి వెళ్లి వృత్తాంతాన్నంతటినీ తన ప్రియురాలికి చెప్పి మహాభోగాలననుభవించాడు.

**తచ్ఛ్రుత్వా సకలా దేవాశ్శక్రాద్యా మునయస్తథా ।**
**పరస్పరం సమామంత్ర్య శివాసక్తధియోఽమలాః ॥ 23 ॥**

ఓ మహర్షీ! ఈ విషయాన్ని ఇంద్రుడు మున్నగు దేవతలు, మునులు, ఒకరినొకరు పిలుచుకొని శివునియందు లగ్నమైన పవిత్రమైన అంతఃకరణం కలవారయ్యారు.

**తస్మిన్కాలే సురాస్సర్వే హరిబ్రహ్మాదయో మునే! ।**
**ఆజగ్ముస్తత్ర సుప్రీత్యా పూజాం చక్రుర్విశేషతః ॥ 24 ॥**

అప్పుడు హరి, బ్రహ్మాదిదేవతలందరు అక్కడకు వచ్చి మహానందంతో శివలింగానికి విశేషపూజ చేశారు.

**ప్రత్యక్షం తం తదా దృష్ట్వా ప్రతిష్ఠాప్య చ తే సురాః ।**
**వైద్యనాథేతి సంప్రోచ్య నత్వా నుత్వా దివం యయుః ॥ 25 ॥**

ఆ దేవతలు ప్రత్యక్షంగా భగవానుని దర్శించి ఆ లింగాన్ని అచ్చట ప్రతిష్ఠించి 'వైద్యనాథుడు' అని పేరు పెట్టి నమస్కరించి స్తుతించి స్వర్గానికి వెళ్లారు.

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**తస్మిన్ లింగే స్థితే తత్ర రావణే చ గృహం గతే ।**
**కిం చరిత్రమభూత్తాత! తతస్తద్వద విస్తరాత్ ॥ 26 ॥**

ఓ తండ్రీ! ఆ లింగమక్కడ స్థిరమై, రావణాసురుడింటికి వెళ్లిన పిదప ఏమి జరిగింది? దానిని వివరంగా చెప్పండి.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**రావణోఽపి గృహం గత్వా వరం ప్రాప్య మహోత్తమమ్ ।**
**ప్రియాయై సర్వమాచఖ్యౌ ముమోదాతి మహాసురః ॥ 27 ॥**

సర్వోత్కృష్టమైన వరాన్ని పొంది రావణుడింటికి వెళ్లాడు. ఆ మహారాక్షసుడా వృత్తాంతాన్నంతటిని తన ప్రియురాలికి చెప్పి ఆనందాతిశయాన్ని పొందాడు.

**తచ్ఛ్రుత్వా సకలం దేవాః శక్రాద్యా మునయస్తథా ।**
**పరస్పరం సమూచుస్తే సముద్విగ్నా మునీశ్వరాః ॥ 28 ॥**

ఓ మహర్షులారా! ఆ వృత్తాంతాన్ని వినిన ఇంద్రాదిదేవతలు, మునులు చాల కంగారుపడి పరస్పరం ఇట్లు సంప్రదించుకున్నారు.

**దేవాదయ ఊచుః** – దేవాదులు పలికారు.

**రావణోఽయం దురాత్మా హి దేవద్రోహీ ఖలః కుధీః ।**
**శివాద్వరం చ సంప్రాప్య దుఃఖం దాస్యతి నోఽపి సః ॥ 29 ॥**

ఈ రావణుడు దుర్మార్గుడు. దేవద్రోహి, ఖలుడు, క్రూరబుద్ధి గలవాడు. వీడు శివునినుండి వరం పొందాడు. వీడు మనకు దుఃఖాన్ని కలిగిస్తాడు.

**కిం కుర్మః క్వ చ గచ్ఛామః కిం భవిష్యతి వా పునః ।**
**దుష్టశ్చ దక్షతాం ప్రాప్తః కిం కిం నో సాధయిష్యతి ॥ 30 ॥**

ఏమి చేద్దాం? ఎక్కడికి వెళదాము? భవిష్యత్తులో ఏమౌతుంది? సామర్థ్యాన్ని పొందిన దుష్టుడు మనల-నేయే కష్టాలకు గురిచేస్తాడో గదా?

**ఇతి దుఃఖం సమాపన్నాః శక్రాద్యా మునయస్సురాః ।**
**నారదం చ సమాహూయ పప్రచ్ఛుర్వికలాస్తదా ॥ 31 ॥**

ఇంద్రాది దేవతలు, మునులు ఈ విధంగా దుఃఖించి నారదునాహ్వానించి ఇలా ప్రశ్నించారు.

**దేవా ఊచుః** – దేవతలు పలికారు.

**సర్వం కార్యం సమర్థోఽసి కర్తుం త్వం మునిసత్తమ! ।**
**ఉపాయం కురు దేవర్షే! దేవానాం దుఃఖనాశనే ॥ 32 ॥**

ఓ మహర్షీ! నీవు సమస్త కార్యాలను చక్కబెట్టగల సమర్థుడవు. ఓ దేవర్షీ! దేవతల దుఃఖాన్ని నాశనం చేసే ఉపాయం ఆలోచించండి.

**రావణోఽయం మహాదుష్టః కింకిం నైవ కరిష్యతి ।**
**క్వ యాస్యామో వయం చాత్ర దుష్టేనాపీడితా వయమ్ ॥ 33 ॥**

ఈ రావణుడు మహాదుష్టుడు. వీడు చేయజాలని అకృత్యమేముంది? ఇప్పుడిక్కడున్న మేము ఈ దుష్టునిచే పీడింపబడి ఎక్కడకు పోతామో గదా!

**నారద ఉవాచ –** నారదుడు పలికాడు.

**దుఃఖం త్యజత భో దేవాః! యుక్తిం కృత్వా చ యామ్యహమ్ ।**
**దేవ కార్యం కరిష్యామి కృపయా శంకరస్య వై ॥ 34 ॥**

ఓ దేవతలారా! దుఃఖాన్ని విడిచిపెట్టండి. నేను యుక్తితోను, శంకరుని అనుగ్రహంతోను దేవకార్యాన్ని చక్కబెడతాను.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యుక్త్వా స తు దేవర్షిరగమద్రావణాలయమ్ ।**
**సత్కారం సమనుప్రాప్య ప్రీత్యోవాచాఖిలం చ తత్ ॥ 35 ॥**

దేవర్షి ఇట్లు పలికి రావణుని గృహానికి వెళ్లాడు. ఆయనచ్చట సమస్తసత్కారాలు పొంది ఆనందంతో ఇట్లన్నాడు.

**నారద ఉవాచ –** నారదుడు పలికాడు

**రాక్షసోత్తమ! ధన్యస్త్వం శైవవర్యస్తపోధనః ।**
**త్వాం దృష్ట్వా చ మనో మేఽద్య ప్రసన్నమతి రావణ! ॥ 36 ॥**

"ఓ రాక్షసోత్తమా! నీవు ధన్యుడవు. శైవవర్యుడవు. తపస్సునందు గొప్ప శ్రద్ధగలవాడవు. ఓ రావణా! ఈనాడు నిన్ను చూచి నా మనస్సు అతిశయించిన ప్రసన్నత పొందుతోంది.

**స్వవృత్తం బ్రూహ్యశేషేణ శివారాధనసంభవమ్ ।**
**ఇతి పృష్టస్తదా తేన రావణో వాక్యమబ్రవీత్ ॥ 37 ॥**

నీవు శివుని ఆరాధించావు. దాని ఫలాన్ని, తదితర నీవృత్తాంతాన్ని సమగ్రంగా చెప్పుము. అని నారదుడడుగగా, అప్పుడు రావణుడిలా పలికాడు.

**రావణ ఉవాచ –** రావణుడు పలికాడు.

**గత్వా మయా తు కైలాసే తపోఽర్థం చ మహామునే! ।**
**తత్రైవ బహుకాలం వై తపస్తప్తం సుదారుణమ్ ॥ 38 ॥**

ఓ మహర్షీ! నేను తపస్సు చేయడానికి కైలాసం వెళ్లి అక్కడనే చిరకాలం అత్యంత దారుణమైన తపస్సు చేశాను.

**యదా న శంకరస్తుష్టస్తతశ్చ పరివర్తితమ్ ।**
**ఆగత్య వృక్షఖండే వై పునస్తప్తం మయా మునే! ॥ 39 ॥**

ఓ మునీ! శంకరుడు ప్రసన్నుడు కాలేదు. అప్పుడు నేను స్థలాన్ని మార్చి హిమాలయంలో దట్టమైన వృక్షాల స్థానంలో మరల తపస్సు చేశాను.

**గ్రీష్మే పంచాగ్నిమధ్యే తు వర్షాసు స్థండిలేశయః ।**
**శీతే జలాంతరస్థో హి కృతం చైవ త్రిధా తపః ॥ 40 ॥**

వేసవికాలంలో పంచాగ్నుల మధ్యలోను, వర్షాకాలంలో నేలపైన, శీతాకాలంలో నీటి లోపల నుండి మూడు రకాల విధంగా తపస్సు చేశాను.

**ఏవం మయా కృతం తత్ర తపోఽత్యుగ్రం మునీశ్వర! ।**
**తథాపి శంకరో మహ్యం న ప్రసన్నోఽభవన్మనాక్ ॥ 41 ॥**

ఓ మునీశ్వరా! ఈవిధంగా నేనచ్చట మిక్కిలి ఉగ్రమైన తపస్సు చేశాను. కాని శంకరుడు నాపై లేశమైనను ప్రసన్నుడు కాలేదు.

**తదా మయా తు క్రుద్ధేన భూమౌ గర్తం విధాయ చ ।**
**తత్రాగ్నిం చ సమాధాయ పార్థివం చ ప్రకల్ప్య చ ॥ 42 ॥**

అప్పుడు నేను కోపించి నేలలో గోతిని చేసి దానిలో అగ్ని స్థాపన చేసి పార్థివలింగాన్ని నిర్మించాను.

**గంధైశ్చ చందనై శ్చైవ ధూపైశ్చ వివిధైస్తదా ।**
**నైవేద్యైః పూజితశ్శంభురారార్తికవిధానతః ॥ 43 ॥**

చందన గంధాదులు, వివిధ ధూపాలు, నైవేద్యాలతో శివుని పూజించి దీపాలతో నిరంతరంగా హారతినిస్తూ ఆరాధించాను.

**ప్రణిపాతైః స్తవైః పుణ్యైస్తోషితశ్శంకరో మయా ।**
**గీతైర్నృత్యైశ్చ వాద్యైశ్చ ముఖాంగుళిసమర్పణైః ॥ 44 ॥**

నమస్కారాలు, పుణ్యస్తోత్రాలు, పాటలు, నాట్యాలు, వాద్యాలు, అంతేగాక నోటియందు వ్రేళ్లనుంచి వివిధ ముద్రలు ప్రదర్శించుట అనే ఉపచారాలతో శంకరుని సంతోషపెట్టాను.

**ఏతైశ్చ వివిధైశ్చాన్యైరుపాయైర్భూరిభిర్మునే! ।**
**శాస్త్రోక్తేన విధానేన పూజితో భగవాన్ హరః ॥ 45 ॥**

ఓ మునీ! ఇతరమైన వివిధోపచారాలతో శాస్త్రోక్త విధివిధానాన్ని పాటిస్తూ భగవంతుడైన హరుని పూజించాను.

**న తుష్టః సమ్ముఖో జాతో యదా చ భగవాన్ హరః ।**
**తదాహం దుఃఖితోఽభూవం తపసోఽప్రాప్య సత్ఫలమ్ ॥ 46 ॥**

కాని హరభగవానుడు సంతోషాన్ని పొందలేదు. దర్శనమీయలేదు. అంతట నేను తపస్సుయొక్క సత్ఫలాన్ని పొందజాలకపోయినందులకు దుఃఖితుడనయ్యాను.

**ధిక్ శరీరం బలం చైవ ధిక్ తపః కరణం మమ ।**
**ఇత్యుక్త్వా తు మయా తత్ర స్థాపితేఽగ్నౌ హుతం బహు ॥ 47 ॥**

"నా శరీరం, బలం, తపస్సు సర్వము నింద్యమగు గాక!" అని పలికి నేనచ్చట అగ్నిని స్థాపించి చిరకాలం హోమం చేశాను.

**పునశ్చేతి విచార్యైవ త్యక్ష్యామ్యగ్నౌ నిజాం తనుమ్ ।**
**సంఛిన్నాని శిరాంస్యేవ తస్మిన్ ప్రజ్జ్వలితే శుచౌ ॥ 48 ॥**

"నేను నా దేహాన్ని అగ్నిలో వదలిపెడతాను. తలలు నరికి ప్రజ్వలించే అగ్నిలో హోమం వేస్తాను" అని మరల తలపోశాను.

**సుచ్ఛిత్త్వైకైకశస్తాని కృత్వా శుద్ధాని సర్వశః ।**
**శంకరాయార్పితాన్యేవ నవసంఖ్యాని వై మయా ॥ 49 ॥**

ఒక్కొక్కటిగా తొమ్మిది తలలు క్రమంగా చక్కగా నరికి, వాటినన్ని విధాలుగా శుద్ధిచేసి శంకరునకర్పించాను.

**యావచ్చ దశమం ఛేత్తుం ప్రారబ్ధమృషిసత్తమ! ।**
**తావదావిరభూత్తత్ర జ్యోతీరూపో హరః స్వయమ్ ॥ 50 ॥**

ఓ మహర్షీ! నేను పదవ తల నరకబోవుచుండగా శివుడు స్వయంగా జ్యోతిరూపంలో అక్కడ ఆవిర్భవించాడు.

**మా మేతి వ్యాహరత్ ప్రీత్యా ద్రుతం వై భక్తవత్సలః ।**
**ప్రసన్నశ్చ వరం బ్రూహి దదామి మనసేప్సితమ్ ॥ 51 ॥**

భక్తవత్సలుడైన శివుడు 'వద్దు వద్దు' అని ప్రేమతో పలుకుతూ శీఘ్రంగా ప్రసన్నుడై "నీ మనస్సునకు నచ్చిన వరాన్ని కోరుకో" అని పలికాడు.

**ఇత్యుక్తే చ తదా తేన మయా దృష్టో మహేశ్వరః ।**
**ప్రాణతస్సంస్తుతశ్చైవ కరౌ బద్ధ్వా సుభక్తితః ॥ 52 ॥**

మహేశ్వరుడిట్లు పలుకగానే నేను మహేశ్వరుని దర్శించి చేతులు జోడించి నమస్కరించి పరమభక్తితో చక్కగా స్తుతించాను.

**తదా వృతం మయైతచ్చ దేహి మే హ్యతులం బలమ్ ।**
**యది ప్రసన్నో దేవేశ! దుర్లభం కిం భవేన్మమ ॥ 53 ॥**

ఓ దేవదేవా! నీవు ప్రసన్నుడవైతే నాకు దుర్లభమైనదేముంటుంది? నాకు సాటిలేని బలాన్నిమ్మన్ని కోరాను.

**శివేన పరితుష్టేన సర్వం దత్తం కృపాళునా ।**
**మహ్యం మనోఽభిలషితం గిరా ప్రోచ్య తథాస్త్వితి ॥ 54 ॥**

దయానిధియైన శివుడు మిక్కిలి సంతోషించి, "అట్లేయగు గాక! అని పలికి నా మనోభీష్టాన్ని నాకు ప్రసాదించాడు."

**అమోఘయా సుదృష్ట్యా వై వైద్యవద్యోజితాని మే ।**
**శిరాంసి సంధయిత్వా తు దృష్టాని పరమాత్మనా ॥ 55 ॥**

ఆ పరమాత్మ వైద్యుని వలె నా శిరస్సులతికించి అమోఘమైన దయాదృష్టితో వాటిని చూశాడు.

**ఏవంకృతే తదా తత్ర శరీరం పూర్వవన్మమ ।**
**జాతం తస్య ప్రసాదాచ్చ సర్వం ప్రాప్తం ఫలం మయా ॥ 56 ॥**

ఆయన అట్లు చేయగానే, ఆయన అనుగ్రహంచే నా శరీరం పూర్వం వలెనే దృఢంగా అయ్యింది. నేను సమగ్రమైన ఫలాన్ని పొందాను.

**తదా చ ప్రార్థితో మే సంస్థితోఽసౌ వృషభధ్వజః ।**
**వైద్యనాథేశ్వరో నామ్నా ప్రసిద్ధోఽభూజ్జగత్త్రయే ॥ 57 ॥**

అప్పుడు నేను ప్రార్థించగా వృషభధ్వజుడచ్చటనే స్థిరంగా ఉండి, ముల్లోకాలలో వైద్యనాథేశ్వరుడనే పేర ప్రసిద్ధి గాంచాడు.

**దర్శనాత్పూజనాజ్జ్యోతిర్లింగరూపో మహేశ్వరః ।**
**భుక్తిముక్తిప్రదో లోకే సర్వేషాం హితకారకః ॥ 58 ॥**

లోకంలోని వారికందరికి హితాన్ని చేయడానికి మహేశ్వరుడు జ్యోతిర్లింగరూపాన్ని దాల్చి దర్శించి పూజించేవారికి భుక్తి, ముక్తిప్రదుడయ్యాడు.

**జ్యోతిర్లింగమహం తద్వై పూజయిత్వా విశేషతః ।**
**ప్రణిపత్యాగతశ్చాత్ర విజేతుం భువనత్రయమ్ ॥ 59 ॥**

ఆ జ్యోతిర్లింగాన్ని నేను విశేషంగా పూజించి ప్రణమిల్లి ముల్లోకాలను జయించడానికిచ్చటకు వచ్చాను.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**తదీయం తద్వచః శ్రుత్వా దేవర్షిర్జ్ఞాతసంభ్రమః ।**
**విహస్య చ మనస్యేవ రావణం నారదోఽబ్రవీత్ ॥ 60 ॥**

దేవర్షియైన నారదుడు వాని మాటలు విని కంగారుపడి మనస్సులో మాత్రమే నవ్వుకొని రావణునితో ఇట్లన్నాడు.

**నారద ఉవాచ** – నారదుడు పలికాడు.

**శ్రూయతాం రాక్షసశ్రేష్ఠ! కథయామి హితం తవ ।**
**త్వయా తదేవ కర్తవ్యం మదుక్తం నాన్యథా క్వచిత్ ॥ 61 ॥**

ఓ రాక్షసరాజా! నీకు హితాన్ని చెబుతాను వినుము. నీవు నేను చెప్పిన విధంగా మాత్రమే చేయుము. ఏ సమయంలోనైననూ దానికి విరుద్ధంగా చేయవద్దు.

**త్వయోక్తం యచ్ఛివేనైవ హితం దత్తం మమాధునా ।**
**తత్సర్వం చ త్వయా సత్యం న మంతవ్యం కదాచన ॥ 62 ॥**

శివుడు నేను కోరిన దానిని నాకిచ్చాడని నీవిప్పుడే నాకు చెప్పావు. అదియంతయూ సత్యమని నీవెన్నడూ తలంచవద్దు.

**అయం వై వికృతిం ప్రాప్తః కిం కిం నైవ బ్రవీతి చ ।**
**సత్యం నైవ భవేత్తద్వై కథం జ్ఞేయం ప్రియోఽస్తి మే ॥ 63 ॥**

ఈ శివుడు వికారాన్ని పొందియున్నాడు. ఆయన పలుకని పలుకులేమున్నాయి? ఆ పలుకులు సత్యం కానేకావు. ఈ విషయం నీకెలా తెలుస్తుంది? నీవు నాకు ప్రియుడవు.

**ఇతి గత్వా పునః కార్యం కురు త్వం హ్యాహితాయ వై ।**
**కైలాసోద్ధరణే యత్నః కర్తవ్యశ్చ త్వయా పునః ॥ 64 ॥**

నీవు మరలా వెళ్లి నీకిష్టమైన దానిని కోరి ఆ విధంగా చేయుము. నీవు కైలాసాన్ని పైకెత్తే ప్రయత్నం చేయుము.

**యది చైవోద్ధృతశ్చాయం కైలాసో హి భవిష్యతి ।**
**తదైవ సఫలం సర్వం భవిష్యతి న సంశయః ॥ 65 ॥**

నీవు కైలాసాన్ని పైకి ఎత్తగలిగినప్పుడు మాత్రమే నీకు సర్వం సఫలమౌతుంది. ఇందులో సందేహం లేదు.

**పూర్వవత్ స్థాపయిత్వా త్వం పునరాగచ్ఛ వై సుఖమ్ ।**
**నిశ్చయం పరమం గత్వా యథేచ్ఛసి తథా కురు ॥ 66 ॥**

ఆ కైలాసాన్ని ఎత్తిన తర్వాత మరల యథాస్థానంలో నుంచి మనస్సులో నీ బలాన్ని గూర్చి స్థిరమైన నిశ్చయం పొంది సుఖంగా తిరిగి రమ్ము. అప్పుడు నీవు యథేచ్ఛగా చేయుము.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఇత్యుక్తస్స హితం మేనే రావణో విధిమోహితః ।**
**సత్యం మత్వా మునేర్వాక్యం కైలాసమగమత్తదా ॥ 67 ॥**

నారదుడిట్లు పలుకగా, విధిమోహితుడైన రావణుడా మునియొక్క మాటలు సత్యమని తలచి వెంటనే కైలాసానికి వెళ్లాడు.

**గత్వా తత్ర సముద్ధారం చక్రే తస్య గిరేస్స చ ।**
**తత్రస్థం చైవ తత్సర్వం విపర్యస్తం పరస్పరమ్ ॥ 68 ॥**

అక్కడకు వెళ్లి అతడాపర్వతాన్ని పైకెత్తాడు. ఆ పర్వతం పై నున్న సర్వపదార్థాలు ఒకదానిపై మరియొకటి పడి అన్నీ తల్లక్రిందులయ్యాయి

**గిరీశోఽపి తదా దృష్ట్వా కిం జాతమితి సోఽబ్రవీత్ ।**
**గిరిజా చ తదా శంభుం ప్రత్యువాచ విహస్య తమ్ ॥ 69 ॥**

పరమేశ్వరుడు దానిని చూచి "ఏమయ్యింది?" అన్నాడు. అప్పుడు పార్వతి నవ్వి, ఆయన కిట్లు బదులిచ్చింది.

**గిరిజోవాచ** - గిరిజ పలికింది.

**సచ్ఛిష్యస్య ఫలం జాతం సమ్యగ్జాతం తు శిష్యతః ।**
**శాంతాత్మనే సువీరాయ దత్తం యదతులం బలమ్ ॥ 70 ॥**

మంచి శిష్యుడున్నందులకు ఫలం దక్కింది. శిష్యుడు చక్కగా చేశాడు. ఎందుకనగా నీవు శాంతస్వభావం గల గొప్పవీరుడైన శిష్యునికి సాటిలేని బలాన్నిచ్చావు.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**గిరిజాయాశ్చ సాకూతం వచః శ్రుత్వా మహేశ్వరః ।**
**కృతఘ్నం రావణం మత్వా శశాప బలదర్పితమ్ ॥ 71 ॥**

గిరిజాదేవి వెటకారంగా పలికిన పలుకులు విని మహేశ్వరుడు, బలాన్ని పొంది గర్వించియున్న రావణుడు కృతఘ్నుడని తలంచి అతనిని శపించాడు.

**మహాదేవ ఉవాచ** - మహాదేవుడు పలికాడు.

**రే రే రావణ! దుర్భక్త! మా గర్వం వహ దుర్మతే! ।**
**శీఘ్రం చ తవ హస్తానాం దర్పఘ్నశ్చ భవేదిహ ॥ 72 ॥**

ఓరీ రావణా! దుర్భక్తా! దుర్మతీ! గర్వాన్ని పొందకుము. నీ చేతుల దర్పాన్ని అణుచువాడీలోకంలో తొందరలోనే ఉదయిస్తాడు.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఇతి తత్ర చ యజ్జాతం నారదః శ్రుతవాంస్తదా ।**
**రావణోఽపి ప్రసన్నాత్మాఽగాత్ స్వధామ యథాగతమ్ ॥ 73 ॥**

ఈ విధంగా అచ్చట జరిగిన వృత్తాంతమంతా అప్పుడు నారదుడు విన్నాడు. రావణుడు కూడ ప్రసన్నాత్ముడై వచ్చినదారిలో తన నివాసానికి వెళ్లాడు.

**నిశ్చయం పరమం కృత్వా బలీ బలవిమోహితః ।**
**జగద్వశం హి కృతవాన్రావణః పరదర్పహా ॥ 74 ॥**

బలశాలియు, శత్రువుల దర్పాన్ని అణచువాడునైన రావణుడు తన బలం గురించి నిశ్చయాన్ని పొంది బలవ్యామోహితుడై జగత్తునంతటిని తన ఆధీనం చేసుకున్నాడు.

**శివాజ్ఞయా చ ప్రాప్తేన దివ్యాస్త్రేణ మహౌజసా ।**
**రావణస్య ప్రతిభటో నాలం కశ్చిదభూత్తదా ॥ 75 ॥**

శివాజ్ఞచే దివ్యాస్త్రాలు సంపాదించడం వల్ల, ఆ కాలంలో అతనితో పోటీపడగల వాడొక్కడైననూ లేడు.

**ఇత్యేతచ్చ సమాఖ్యాతం వైద్యనాథేశ్వరస్య చ ।**
**మాహాత్మ్యం శృణ్వతాం పాపం నృణాం భవతి భస్మసాత్ ॥ 76 ॥**

ఈ విధంగా వైద్యనాథేశ్వరుని మాహాత్మ్యాన్ని చక్కగా చెప్పాను. దీనిని వినిన మానవుల పాపం భస్మమౌతుంది.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం వైద్యనాథేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం నామాష్టావింశో ఽ ధ్యాయః ॥ 28 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు వైద్యనాథేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యవర్ణనం అనే పేరుగల ఇరవైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## **ఏకోనత్రింశోఽధ్యాయః** - ఇరవైతొమ్మిదవ అధ్యాయం

## **దారుకావనరాక్షసోపద్రవవర్ణనమ్** - దారుకావనరాక్షసోపద్రవవర్ణనం

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**అథాతః సంప్రవక్ష్యామి నాగేశాఖ్యం పరాత్మనః ।**
**జ్యోతీరూపం యథా జాతం పరమం లింగముత్తమమ్ ॥ 1 ॥**

ఇకపై పరమాత్మయొక్క సర్వశ్రేష్ఠము, ఉత్తమమునైన నాగేశ్వరజ్యోతిర్లింగావిర్భవవిధానాన్ని గురించి చెబుతాను.

**దారుకా రాక్షసీ కాచిత్పార్వతీవరదర్పితా ।**
**దారుకశ్చ పతిస్తస్యా బభూవ బలవత్తరః ॥ 2 ॥**

పార్వతీదేవి వరంచే గర్వించిన 'దారుక' అనే ఒక రాక్షసి యుండేది. ఆమెకు మహాబలశాలియైన "దారుకుడు" భర్త.

**బహుభీ రాక్షసైస్తత్ర చకార కదనం సతామ్ ।**
**యజ్ఞధ్వంసం చ లోకానాం ధర్మధ్వంసం తదాఽకరోత్ ॥ 3 ॥**

అతడనేకమంది రాక్షసులతో గూడి సత్పురుషులతో యుద్ధం చేసి యజ్ఞధ్వంసము, ధర్మధ్వంసం చేసేవాడు.

**పశ్చిమే సాగరే తస్య వనం సర్వసమృద్ధిమత్ ।**
**యోజనానాం షోడశభిర్విస్తృతం సర్వతో దిశమ్ ॥ 4 ॥**

దారుకుని వనం పశ్చిమసముద్రతీరంలో అన్ని దిక్కులందును పదహారు యోజనాల విస్తారం కలిగియుంది.

**దారుకాస్వవిలాసార్థం యత్ర గచ్ఛతి తద్వనమ్ ।**
**భూమ్యా చ తరుభిస్తత్ర సర్వోపకరణైర్యుతమ్ ॥ 5 ॥**

దారుక తన విలాసం కొరకు ఆ వనానికి వెళ్లిన సమయాలలో అచటి భూమి చెట్లతోను, సర్వాలంకారాలతోను నిండియుంది.

**దారుకాయై దదౌ దేవీ తద్వనస్యావలోకనమ్ ।**
**ప్రయాతి తద్వనం సా హి పత్యా సహ యదృచ్ఛయా ॥ 6 ॥**

ఆ వనాన్ని పరిరక్షించే బాధ్యత పార్వతి దారుకకు అప్పగించింది. ఆమె తనకు తోచినప్పుడు భర్తతో కలిసి ఆ వనానికి వెళ్లుతుండేది.

**తత్ర స్థిత్వా తదా సోఽపి సర్వేషాం చ భయం దదౌ ।**
**దారుకో రాక్షసః పత్న్యా తయా దారుకయా సహ ॥ 7 ॥**

ఆ దారుకాసురుడు భార్యయైన దారుకతో కలిసి ఆ వనంలోనుండి సర్వులకు భయాన్ని కలిగిస్తున్నాడు.

**తే సర్వే పీడితా లోకా ఔర్వస్య శరణం యయుః ।**
**నత్వా ప్రీత్యా విశేషేణ తమూచుర్నతమస్తకాః ॥ 8 ॥**

వారిచే పీడింపబడిన జనులందరు ఔర్వుని వద్దకు వెళ్లి విశేషప్రీతితో ఆయనకు తలవంచి నమస్కరించి శరణుపొంది ఇలా పలికారు.

**లోకా ఊచుః –** లోకులు పలికారు.

**మహర్షే! శరణం దేహి నో చేద్దుష్టైశ్చ మారితాః ।**
**సర్వం కర్తుం సమర్థోఽసి తేజసా దీప్తిమానసి ॥ 9 ॥**

ఓ మహర్షీ! మమ్ములను దుష్టులు హింసిస్తున్నారు. మాకు శరణు నిమ్ము. తేజస్సుచే ప్రకాశించే నీవు సర్వం చేయడానికి సమర్థుడవు.

**పృథ్వ్యాం న వర్తతే కశ్చిత్త్వాం వినా శరణం చ నః ।**
**యామో యస్య సమీపే తు స్థిత్వా సుఖమవాప్నుమః ॥ 10 ॥**

నీవు దక్క ఈ లోకంలో మాకు వేరే శరణం లేదు. నీవు దగ్గరలో ఉన్నంత వరకు మాకు సుఖం కలుగుతుంది.

**త్వాం దృష్ట్వా రాక్షసాస్సర్వే పలాయంతే విదూరతః ।**
**త్వయి శైవం సదా తేజో విభాతి జ్వలనో యథా ॥ 11 ॥**

నిన్ను చూచి రాక్షసులు దూరంగా పారిపోతారు. నీయందు సర్వదా శివుని తేజస్సు అగ్నిహోత్రం వలె ప్రకాశిస్తుంది.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యేవం ప్రార్థితో లోకైరౌర్వో హి మునిసత్తమః ।**
**శోచమానః శరణ్యశ్చ రక్షాయై హి వచోఽబ్రవీత్ ॥ 12 ॥**

శరణుపొందిన వారిని రక్షించే స్వభావంగల ఔర్వమహర్షిని జనులీ విధంగా ప్రార్థించగా, ఆయన బాధపడి వారి రక్షణ కొఱకు ఇట్లన్నాడు.

**ఔర్వ ఉవాచ –** ఔర్వుడు పలికాడు.

**పృథివ్యాం యది రక్షాంసి హింస్యుర్వై ప్రాణినస్తదా ।**
**స్వయం ప్రాణైర్వియుజ్యేయూ రాక్షసా బలవత్తరాః ॥ 13 ॥**

రాక్షసులు అధికబలశాలురైనను భూలోకంలో ప్రాణులను హింసించినప్పుడు వారే తమ ప్రాణాలు కోల్పోతారు.

**యదా యజ్ఞా న హన్యేరంస్తదా ప్రాణైర్వియోజితాః ।**
**భవంతు రాక్షసాస్సర్వే సత్యమేతన్మయోచ్యతే ॥ 14 ॥**

ఆ రాక్షసులందరు ఏ సమయంలో యజ్ఞాలకు హాని కలిగిస్తారో, అదే సమయంలో వారు ప్రాణాలు కోల్పోతారు. నేను సత్యాన్నే పలుకుతున్నాను.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యుక్త్వా వచనం తేభ్యస్సమాశ్వాస్య ప్రజాః పునః ।**
**తపశ్చకార వివిధమౌర్వో లోకసుఖావహః ॥ 15 ॥**

లోకాలకు సుఖాన్ని కలిగించే ఔర్వమహర్షి ఆ ప్రజలతో ఈ విధంగా పలికి వారినోదార్చి వివిధమైన తపస్సులు చేశాడు.

**దేవాస్తదా తే విజ్ఞాయ శాపస్య కారణం హి తత్ ।**
**యుద్ధాయ చ సముద్యోగం చక్రుర్దేవారిభిస్సహ ॥ 16 ॥**

అంతట దేవతలు శాపకారణాన్ని తెలుసుకొని, దేవతల శత్రువులైన రాక్షసులతో యుద్ధానికి పెద్ద సన్నాహం చేశారు.

**సర్వైశ్చైవ ప్రయత్నైశ్చ నానాయుధధరాస్సురాః ।**
**సర్వే శక్రాదయస్తత్ర యుద్ధార్థం సముపాగతాః ॥ 17 ॥**

ఇంద్రాది దేవతలందరు అనేకవిధాలైన ఆయుధాలు ధరించి, అన్ని విధాలైన ప్రయత్నాలలో యుద్ధం చేయడానికచ్చటకు విచ్చేశారు.

**తాన్ దృష్ట్వా రాక్షసాస్తత్ర విచారే తత్పరాః పునః ।**
**బభూవుస్తేఽఖిలా దుష్టా మిథో యే యత్ర సంస్థితాః ॥ 18 ॥**

వారిని చూచి వివిధ స్థానాలలో నున్న రాక్షసులందరు ఒకచోట చేరి పరస్పర సమాలోచనలలో నిమగ్నమయ్యారు.

**రాక్షసా ఊచుః –** రాక్షసులు పలికారు.

**కిం కర్తవ్యం క్వ గంతవ్యం సంకటం సముపాగతాః ।**
**యుధ్యతే మ్రియతే చైవ యుధ్యతే న విహన్యతే ॥ 19 ॥**

మనమేమి చేయాలి? ఎక్కడకు వెళ్లాలి? ఆపద వచ్చి పడింది. మనం యుద్ధం చేసి మరణిస్తుండగా, వారు యుద్ధం చేసినప్పటికీ మరణించడం లేదు.

**తథైవ స్థీయతే చేద్వై భక్ష్యతే కిం పరస్పరమ్ ।**
**దుఃఖం హి సర్వథా జాతం క ఏనం వినివారయేత్ ॥ 20 ॥**

ఈ పరిస్థితి ఇట్లే కొనసాగితే మనం ఒకరినొకరు తినాలా? ఏమి? అన్ని విధాలుగా దుఃఖం సంప్రాప్తమయ్యింది. దీనిని నివారించేవారెవరు?

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**విచార్యేతి చ తే తత్ర దారుకాద్యాశ్చ రాక్షసాః ।**
**ఉపాయం న విజానంతో దుఃఖం ప్రాప్తాస్సదా హి వై ॥ 21 ॥**

అప్పుడు దారుకుడు మున్నగు రాక్షసులందరూ ఈవిధంగా విచారించి ఉపాయాన్ని కనుగొనలేకపోయారు. వారధికమైన దుఃఖాన్ని పొందారు.

**దారుకా రాక్షసీ చాపి జ్ఞాత్వా దుఃఖం సమాగతమ్ ।**
**భవాన్యాశ్చ వరం తం చ కథయామాస సా తదా ॥ 22 ॥**

తమకు వచ్చిన ఆ దుఃఖాన్ని గూర్చి తెలుసుకొని, దారుక అనే రాక్షసి తనకు భవాని యిచ్చిన వరాన్ని గూర్చి తెలిపింది.

**దారుకోవాచ –** దారుక పలికింది.

**మయా హ్యారాధితా పూర్వం భవపత్నీ వరం దదౌ ।**
**వనం గచ్ఛ నిజైః సార్ధం యత్ర గంతుం త్వమిచ్ఛసి ॥ 23 ॥**

పూర్వం నేను భవానినారాధించగా ఆమెనాకొక వరాన్నిచ్చింది. నీవు నీ వారితో గూడి వనంలో నీకిష్టమైన ఎక్కడికైనా వెళ్లవచ్చునని ఆమె చెప్పింది.

**తద్వరశ్చ మయా ప్రాప్తః కథం దుఃఖం విషహ్యతే ।**
**జలం వనం చ నీత్వా వై సుఖం స్థేయం తు రాక్షసైః ॥ 24 ॥**

నేనటువంటి వరాన్ని పొందియున్నాను. మీరు దుఃఖింపనేల? మీరు రాక్షసులతో గూడి జలంలోని ఈ వనానికి వెళ్లి సుఖంగా నుండండి.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**తస్యాస్తద్వచనం శ్రుత్వా రాక్షస్యా హర్షమాగతాః ।**
**ఊచుస్సర్వే మిథస్తే హి రాక్షసా నిర్భయాస్తదా ॥ 25 ॥**

ఆ రాక్షసియొక్క మాటలు విని రాక్షసులందరు నిర్భయులై ఆనందాన్ని పొంది అప్పుడు వారిలో వారు ఒకరితోనొకరు ఇలా పలికారు.

**ధన్యేయం కృతకృత్యేయం రాజ్ఞ్యా వై జీవితాస్స్వయమ్ ।**
**నత్వా తస్యైచ తత్సర్వం కథయామాసురాదరాత్ ॥ 26 ॥**

ఈమె ధన్యురాలు. కృతకృత్యురాలు. మనకీ రాణి ప్రాణదానం చేసిందని పలికి వారామెకు నమస్కరించి వృత్తాంతమంతటిని చెప్పారు.

**యది గంతుం భవేచ్ఛక్తిర్గమ్యతాం కిం విచార్యతే ।**
**తత్ర గత్వా జలే దేవి! సుఖం స్థాస్యామ నిత్యశః ॥ 27 ॥**

వెళ్లగలిగే శక్తి యుంటే వెళ్లడమే మంచిది. ఆలోచించి ప్రయోజనమేముంది? ఓ దేవీ! అక్కడకు వెళ్లి సర్వదా సుఖాన్ని అనుభవిస్తూ నీటిలో నివసిద్దాం.

**ఏతస్మిన్నంతరే లోకా దేవైస్సార్ధం సమాగతాః ।**
**యుద్ధాయ వివిధైర్దుఃఖైః పీడితా రాక్షసైః పురా ॥ 28 ॥**

ఇంతలో పూర్వం రాక్షసులచే వివిధ దుఃఖాలకు గురియైన జనులు దేవతలతో గూడి యుద్ధానికి వచ్చారు.

**పీడితాశ్చ తదా తస్యా భవాన్యా బలమాశ్రితాః ।**
**సమగ్రం నగరం నీత్వా జలస్థలసమన్వితమ్ ॥ 29 ॥**

కష్టాలపాలైన రాక్షసులప్పుడు భవానియొక్క వరబలాన్ని ఆశ్రయించినవారై, సముద్రమధ్యంలోనున్న నగరానికి తమ సామగ్రినంతటినీ తీసుకొని వెళ్లారు.

**జయ జయేతి దేవ్యాస్తు స్తుతిముచ్చార్య రాక్షసీ ।**
**తత ఉడ్డయనం కృత్వా సపక్షో గిరిరాద్యథా ॥ 30 ॥**

ఆ రాక్షసి జయ జయ ధ్వానాలతో దేవిని స్తుతించి, రెక్కలుగల పర్వతరాజువలె అక్కడినుండి ఎగిరింది.

**సముద్రస్య చ మధ్యే సా సంస్థితా నిర్భయా తదా ।**
**సకలైః పరివారైశ్చ ముముదేతి శివానుగా ॥ 31 ॥**

పార్వతిభక్తురాలైన ఆమె సమస్త పరివారంతో గూడి నిర్భయంగా సముద్రమధ్యంలో ఆనందంగా నివసించింది.

**తత్ర సింధౌ చ తే స్థిత్వా నగరే చ విలాసినః ।**
**రాక్షసాశ్చ సుఖం ప్రాపుర్నిర్భయాశ్చ విజహ్రిరే ॥ 32 ॥**

సముద్రంలోని ఆ నగరంలో రాక్షసులందరూ నిర్భయంగా నివసించి సుఖభోగాలనుభవిస్తూ విహరింపసాగారు.

**రాక్షసాశ్చ పృథివ్యాం వై నాజగ్ముశ్చ కదాచన ।**
**మునేశ్శాపభయాదేవ బభ్రముస్తే జలే తదా ॥ 33 ॥**

రాక్షసులు మహర్షిశాపభయంచే ఏనాడూ భూమిపైకి రావడంలేదు. వారు సముద్రం మధ్యలోనే సంచరిస్తున్నారు.

**నౌషు స్థితాన్ జనాన్నీత్వా నగరే తత్ర తాంస్తదా ।**
**చిక్షిపుర్బంధనాగారే కాంశ్చిజ్జఘ్నుస్తదా హి తే ॥ 34 ॥**

వారు నౌకలలోని జనాలను నగరంలోనికి తీసుకొని పోయి కారాగారంలో పారవేసేవారు. వారిలో కొందరిని సంహరించేవారు.

**యథా యథా పునః పీడాం చక్రుస్తే రాక్షసాస్తదా ।**
**తత్ర స్థితా భవాన్యాశ్చ వరదానాచ్చ నిర్భయాః ॥ 35 ॥**

భవానీవరప్రభావంచే నిర్భయంగా అక్కడ నివసిస్తున్న రాక్షసులు వీలుచిక్కిన సందర్భాలలో మరలా జనులను పీడిస్తూనే ఉన్నారు.

**యథా పూర్వం స్థలే లోకే భయం చాసీన్నిరంతరమ్ ।**
**తథా భయం జలే తేషామాసీన్నిత్యం మునీశ్వరాః! ॥ 36 ॥**

ఓ మునీశ్వరులారా! పూర్వం భూమిపై నివసించే జనులకు రాక్షసపీడ ఏవిధంగా ఉండేదో, అదే విధంగా ఇప్పుడు సముద్రనివాసులైన జనులకు రాక్షసుల నిరంతర పీడ తప్పలేదు.

**కదాచిద్రాక్షసీ సా చ నిస్సృతా నగరాజ్జలే ।**
**రుద్ధ్వా మార్గం స్థితా లోకపీడార్థం ధరణౌ చ హి ॥ 37 ॥**

ఒకనాడారాక్షసి సముద్రంలోని నగరంనుండి బయటకు వచ్చి, భూమిలోని జనులను పీడించడానికి దారికడ్డంగా నిలబడింది.

**ఏతస్మిన్నంతరే తత్ర నావో బహుతరాః శుభాః ।**
**ఆగతా బహుధా తత్ర సర్వతో లోకసంవృతాః ॥ 38 ॥**

ఇంతలో అక్కడకు వివిధ దేశాలనుండి అనేకరకాలైన సుందరమైన నావలు జనులతో నిండియుండి వస్తున్నాయి.

**తా నావశ్చ తదా దృష్ట్వా హర్షం సంప్రాప్య రాక్షసాః ।**
**ద్రుతం గత్వా హి తత్రస్థాన్వేగాత్సందధ్రిరే ఖలాః ॥ 39 ॥**

అంతట దుష్టులైన రాక్షసులు ఆ నావలను చూచి మహానందాన్ని పొంది వెంటనే వెళ్లి ఆ నావలలోని జనులనందరిని బంధించారు.

**ఆజగ్ముర్నగరం తే చ తానాదాయ మహాబలాః ।**
**చిక్షిపుర్బంధనాగారే బద్ధ్వా హి నిగడైర్దృఢైః ॥ 40 ॥**

మహాబలశాలురైన ఆ రాక్షసులు వారిని తీసుకొనివచ్చి, దృఢమైన సంకెళ్లతో బంధించి, నగరంలోని కారాగారంలో పడవేశారు.

**బద్ధాస్తే నిగడైర్లోకాః సంస్థితా బంధనాలయే ।**
**అతీవ దుఃఖమాజగ్ముర్భర్త్సితాస్తే ముహుర్ముహుః ॥ 41 ॥**

సంకెళ్లతో బంధింపబడి, కారాగారంలోనికి త్రోసివేయబడిన జనులచ్చట వారిచే పదే పదే పీడింపబడి మహాదుఃఖాన్ని అనుభవిస్తున్నారు.

**తేషాం మధ్యే చ యోఽధీశస్స వైశ్యః సుప్రియాభిధః ।**
**శివప్రియశుభాచారః శైవశ్చాసీత్సదాతనః ॥ 42 ॥**

వారికి సుప్రియుడనే వైశ్యుడు నాయకుడు. అతడు సదాచారసంపన్నుడు. శాశ్వతశివభక్తుడు. శివ–ప్రియుడు.

**వినా చ శివపూజాం వై న తిష్ఠతి కదాచన ।**
**సర్వథా శివధర్మా హి భస్మరుద్రాక్షభూషణః ॥ 43 ॥**

సర్వవిధాలుగా శివధర్మానుష్ఠాత, భస్మము, రుద్రాక్షలే ఆభరణాలుగా గలవాడు నగు వైశ్యుడు శివపూజ చేయని దినములేదు.

**యది పూజా న జాతా చేన్న భునక్తి తదా తు సః ।**
**అతస్తత్రాపి వైశ్యోఽసౌ చకార శివపూజనమ్ ॥ 44 ॥**

ఆయన శివపూజ చేయనిదే భోజనం చేసేవాడు కాదు. కావున ఆయన అక్కడ కూడా శివపూజ చేశాడు.

**కారాగృహగతస్సోఽపి బహూంశ్చాశిక్షయత్తదా ।**
**శివమంత్రం చ పూజాం చ పార్థివీమృషిసత్తమాః! ॥ 45 ॥**

ఓ ఋషిశ్రేష్ఠులారా! ఆయన కారాగారంలో నున్నప్పటికీ అచ్చటనున్న అనేకులకు శివమంత్రాన్ని, పార్థివలింగపూజను నేర్పాడు.

**తే సర్వే చ తదా తత్ర శివపూజాం స్వకామదామ్ ।**
**చక్రిరే విధివత్తత్ర యథా దృష్టం యథా శ్రుతమ్ ॥ 46 ॥**

వారందరూ తాము విన్నదానికి, చూచిన దానికి అనురూపంగా యథావిధిగా తమ కోర్కెలనీడేర్చే శివుని పూజింపసాగారు.

**కేచిత్తత్ర స్థితా ధ్యానే బద్ధ్వాసనమనుత్తమమ్ ।**
**మానసీం శివపూజాం చ కేచిచ్చక్రుర్ముదాన్వితాః ॥ 47 ॥**

కొందరచ్చట సర్వోత్కృష్టమైన ఆసనం బంధించి ధ్యానమగ్నుయ్యారు. మరికొందరు ఆనందంతో మానసికమైన శివపూజ చేశారు.

**తదధీశేన తత్రైవ ప్రత్యక్షం శివపూజనమ్ ।**
**కృతం చ పార్థివస్యైవ విధానేన మునీశ్వరాః! ॥ 48 ॥**

ఓ మునీశ్వరులారా! వారి నాయకుడచ్చటనే బహిరంగంగానే శివపూజను పార్థివవిధానంలో చేయసాగాడు.

**అన్యే చ యే న జానంతి విధానం స్మరణం పరమ్ ।**
**నమశ్శివాయ మంత్రేణ ధ్యాయంతః శంకరం స్థితాః ॥ 49 ॥**

స్మృతివిహితమైన శ్రేష్ఠమైన విధివిధానం తెలియని మరికొందరు 'నమశ్శివాయ' మంత్రంతో శంకరుని స్థిరంగా ధ్యానిస్తున్నారు.

**సుప్రియో నామ యశ్చాసీద్వైశ్యవర్యః శివప్రియః ।**
**ధ్యాయంశ్చ మనసా తత్ర చకార శివపూజనమ్ ॥ 50 ॥**

శివప్రియుడైన సుప్రియుడనే వైశ్యశ్రేష్ఠుడు మనసా ధ్యానిస్తూ శివుని పూజిస్తున్నాడు.

**యథోక్తరూపీ శంభుశ్చ ప్రత్యక్షం సర్వమాదదే ।**
**సోఽపి స్వయం న జానాతి గృహ్యతే న శివేన వై ॥ 51 ॥**

వర్ణింపబడిన రూపంలో శంభుడు ప్రత్యక్షంగా ఆ వైశ్యుడు సమర్పించిన ఉపచారాలనన్నింటినీ స్వీకరించేవాడు. తాను సమర్పించే ఉపచారాలను శివుడు స్వీకరిస్తున్నాడో లేదో వైశ్యునకు తెలియదు.

**ఏవం చ క్రియమాణస్య వైశ్యస్య శివపూజనమ్ ।**
**వ్యతీయుస్తత్ర షణ్మాసా నిర్విఘ్నేన మునీశ్వరాః! ॥ 52 ॥**

ఓ మునీశ్వరులారా! ఈ విధంగా ఆ వైశ్యుడు అచ్చట నిర్విఘ్నంగా శివపూజ చేస్తుండగా ఆరు మాసాలు గడిచిపోయింది.

**అతః పరం చ యజ్జాతం చరితం శశిమౌళినః ।**
**తచ్ఛృణుధ్వమృషిశ్రేష్ఠాః! సావధానేన చేతసా ॥ 53 ॥**

ఓ మహర్షులారా! తదనంతరం జరిగిన చంద్రశేఖరచరిత్రను సావధానమనస్కులై వినండి.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం నాగేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యేదారుకావన-రాక్షసోపద్రవవర్ణనం నామైకోన త్రింశోఽధ్యాయః ॥ 29 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు నాగేశ్వరజ్యోతిర్లింగమాహాత్మ్యంలో దారుకావన రాక్షసోపద్రవవర్ణనం అనే పేరుగల ఇరవైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## త్రింశోఽధ్యాయః - ముప్పైయవ అధ్యాయం

## నాగేశ్వరజ్యోతిర్లింగోద్భవమాహాత్మ్యవర్ణనమ్ - నాగేశ్వరజ్యోతిర్లింగోద్భవమాహాత్మ్యవర్ణనం

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**కదాచిత్సేవకస్తస్య రాక్షసస్య దురాత్మనః ।**
**తదగ్రే సుందరం రూపం శంకరస్య దదర్శ హ ॥ 1 ॥**

ఒకనాడు దురాత్ముడైన దారుకాసురుని సేవకుడొకడు సుప్రియుని యెదుట శంకరుని సుందరరూపాన్ని చూశాడు.

**తస్మై నివేదితం రాజ్ఞే రాక్షసానాం యథార్థకమ్ ।**
**సర్వం తచ్చరితం తేన స కౌతుకమథాద్భుతమ్ ॥ 2 ॥**

వాడు రాక్షసరాజైన దారుకునకు కుతూహలంతో ఆ అద్భుతవృత్తాంతాన్నంతటినీ ఉన్నదున్నట్లుగా విన్నవించాడు.

**రాజాపి తత్ర చాగత్య రాక్షసానాం స దారుకః ।**
**విహ్వలస్సుబలః శీఘ్రం పర్యపృచ్ఛచ్చ తం శివమ్ ॥ 3 ॥**

బలశాలియునైన రాక్షసరాజు దారుకుడు భయపడి వెంటనే అక్కడకు వచ్చి ఆ శివుని గూర్చి ఇలా ప్రశ్నించాడు.

**దారుక ఉవాచ** - దారుకుడు పలికాడు.

**కిం ధ్యాయసి హి వైశ్య! త్వం సత్యం వద మమాగ్రతః ।**
**ఏవం సతి న మృత్యుస్తే మమ వాక్యం చ నాన్యథా ॥ 4 ॥**

ఓ వైశ్యుడా! నీవు దేనిని ధ్యానిస్తున్నావు? నా యెదుట సత్యాన్నే చెప్పు. నీవు సత్యం పలికితే నీకు మృత్యువు తప్పుతుంది. నా మాటకు విరుద్ధంగా ఏమియూ జరుగదు.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**తేనోక్తం చ న జానామి తచ్ఛ్రుత్వా కుపితస్స వై ।**
**రాక్షసాన్ప్రేరయామాస హన్యతాం రాక్షసా అయమ్ ॥ 5 ॥**

నాకేమి తెలియదని వైశ్యుడు చెప్పాడు. ఆ మాట విని రాక్షసరాజు కోపించి “ఓ రాక్షసులారా! వీనిని చంపండి” అని రాక్షసులను ప్రేరేపించాడు.

**తదుక్తాస్తే తదా హంతుం నానాయుధధరాగతాః ।**
**ద్రుతం తం వైశ్యశార్దూలం శంకరాసక్తచేతసమ్ ॥ 6 ॥**

వాడట్లు ఆజ్ఞాపించగానే రాక్షసులు వివిధ రకాల ఆయుధాలు ధరించి శంకరునియందు లీనమైన మనసుగల వైశ్యశ్రేష్ఠుని సంహరించడానికి వెళ్లారు.

**తానాగతాంస్తదా దృష్ట్వా భయవిత్రస్తలోచనః ।**
**శివం సస్మార సుప్రీత్యా తన్నామాని జగౌ ముహుః ॥ 7 ॥**

వారావిధంగా తన మీదకు వస్తున్నట్లుగా చూచిన వైశ్యుని కళ్లలో తీవ్రమైన భయం కనిపించింది. ఆయన పరమప్రీతితో శివనామాలు పలుమార్లు జపిస్తూ శివుని స్మరించాడు.

**వైశ్యపతిరువాచ –** వైశ్యశ్రేష్ఠుడు పలికాడు.

**పాహి శంకర! దేవేశ! పాహి శంభో! శివేతి చ ।**
**దుష్టాదస్మాత్త్రిలోకేశ! ఖలహన్! భక్తవత్సల! ॥ 8 ॥**

ఓ శంకరా! దేవేశా! రక్షింపుము. ఓ శంభో! శివా! త్రిలోకేశా! దుష్టసంహారకా! భక్తవత్సలా! ఈ దుష్టుని-బారి నుండి రక్షింపుము.

**సర్వస్వం చ భవానద్య మమ దేవ! త్వమేవ హి ।**
**త్వదధీన స్త్వదీయోఽహం త్వత్ప్రాణస్సర్వదా ప్రభో! ॥ 9 ॥**

ఓ దేవా! ఈనాడు నా సర్వస్వం నీవే. నీ ఆధీనంలో నున్న నేను నీవాడను. ఓ ప్రభూ! నా ప్రాణాలు సర్వదా నీ ఆధీనంలో నున్నాయి.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇతి సంప్రార్థితశ్శంభుర్వివరాన్నిర్గతస్తదా ।**
**భవనేనోత్తమేనాథ చతుర్ద్వారయుతేన చ ॥ 10 ॥**

ఈ విధంగా ప్రార్థింపబడిన శంభుడు, నాలుగు ద్వారాలతో కూడియున్న ఉత్తమమైన భవనంతో సహా వివరంనుండి బయటకు వచ్చాడు.

**మధ్యజ్యోతిస్స్వరూపం చ శివరూపం తదద్భుతమ్ ।**
**పరివారసమాయుక్తం దృష్ట్వా చాపూజయత్స వై ॥ 11 ॥**

మధ్యలో జ్యోతిస్వరూపంతో. పరివారంతో కూడియుంది. అట్టి అద్భుతమైన శివరూపాన్ని చూచి అతడు పూజించాడు.

**పూజితశ్చ తదా శంభుః ప్రసన్నో హ్యభవత్స్వయమ్ ।**
**అస్త్రం పాశుపతం నామ దత్త్వా రాక్షసపుంగవాన్ ॥ 12 ॥**

**జఘాన సోపకరణాంస్తాన్సర్వాన్సగణాన్ ద్రుతమ్ ।**
**అరక్షచ్చ స్వభక్తం వై దుష్టహా స హి శంకరః ॥ 13 ॥**

పూజలందుకొన్న శంభువు ప్రసన్నుడై ఆయుధాలతోను, గణాలతోను కూడియున్న రాక్షస వీరులనందరిని శివుడు పాశుపతాస్త్రంతో స్వయంగా వెనువెంటనే సంహరించాడు. దుష్టసంహారకుడైన శంకరుడు తన భక్తుని రక్షించాడు.

**సర్వాంస్తాంశ్చ తదా హత్వా వరం ప్రాదాద్వనస్య చ ।**
**అత్యద్భుతకరశ్శంభుః స్వలీలాత్తసువిగ్రహః ॥ 14 ॥**

అత్యద్భుతమైన లీలలు నెరపువాడు, తాను కోరుకొన్నరీతిగ స్వీకరింపబడిన సుందరదేహం గలవాడునగు శంభువప్పుడు వారినందరిని సంహరించి ఆ వనానికి వరాన్నిచ్చాడు.

**అస్మిన్ వనే సదా వర్ణధర్మా వై సంభవంతు చ ।**
**బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాం హి తథైవ చ ॥ 15 ॥**

"ఈ వనంలో సర్వదా బ్రాహ్మణ - క్షత్రియ - వైశ్య - శూద్రుల వర్ణధర్మాలు ప్రవర్తిల్లు గాక!

**భవంత్వత్ర మునిశ్రేష్ఠాస్తామసా న కదాచన ।**
**శివధర్మప్రవక్తారశ్శివధర్మప్రవర్తకాః ॥ 16 ॥**

ఇచ్చటి మహర్షులు ఎన్నడైననూ తమో గుణప్రధానులు కాకుందురు గాక! వారు శివధర్మాన్ని తాము పాటించి ఇతరులకు బోధించువారౌదురు గాక!"

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఏతస్మిన్సమయే సా వై రాక్షసీ దారుకాహ్వయా ।**
**దేవ్యాః స్తుతిం చకారాసౌ పార్వత్యా దీనమానసా ॥ 17 ॥**

ఇంతలో దారుక అనే రాక్షసి దీనమనస్కురాలై పార్వతీదేవిని స్తుతించింది.

**ప్రసన్నా చ తదా దేవీ కిం కరోమీత్యువాచ హి ।**
**సాఽప్యువాచ పునస్తత్ర వంశో మే రక్ష్యతాం త్వయా ॥ 18 ॥**

అప్పుడా దేవి ప్రసన్నురాలై "ఏమి చేయాలి?" అని ప్రశ్నించగా "నీవు నా వంశాన్ని రక్షించాలి" అని రాక్షసి బదులిచ్చింది.

**రక్షయిష్యామి తే వంశం సత్యం చ కథ్యతే మయా ।**
**ఇత్యుక్త్వా చ శివేనైవ విగ్రహం సా చకార హ ॥ 19 ॥**

"నేను నీ వంశాన్ని రక్షిస్తాను. నేను యథార్థాన్నే పలుకుతున్నాను" అని పలికి పార్వతీదేవి శివునితో సాక్షాత్తుగా విరోధానికి ఒడిగట్టింది.

**శివోఽపి కుపితాం దేవీం దృష్ట్వా వరవశః ప్రభుః ।**
**ప్రత్యువాచేతి సుప్రీత్యా యథేచ్ఛసి తథా కురు ॥ 20 ॥**

వరాలకు వశుడై ఉండే శివప్రభువు కూడ కోపంతో నున్న పార్వతీదేవిని చూచి, పరమప్రీతితో "నీకు తోచినట్లు చేయుము" అని బదులిచ్చాడు.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఇతి శ్రుత్వా వచస్తస్య స్వపతేశ్శంకరస్య వై ।**
**సుప్రసన్నా విహస్యాశు పార్వతీ వాక్యమబ్రవీత్ ॥ 21 ॥**

తన భర్తయైన శంకరుని మాటలు విని పార్వతి మిక్కిలి ప్రసన్నురాలై నవ్వి వెంటనే ఇలా పలికింది.

**పార్వత్యువాచ** – పార్వతి పలికింది.

**భవదీయం వచస్తథ్యం యుగాంతే సంభవిష్యతి ।**
**తావచ్చ తామసీ సృష్టిర్భవత్వితి మతం మమ ॥ 22 ॥**

"మీ వచనం ఈ యుగాంతంలో యథార్థం కాగలదు. అంతవరకు తమోగుణప్రధానమైన సృష్టి కూడ ఉండాలని నా అభిప్రాయం.

**అన్యథా ప్రలయః స్యాద్వై సత్యం మే వ్యాహృతం శివ! ।**
**ప్రమాణీక్రియతాం నాథ! త్వదీయాస్మి త్వదాశ్రయా ॥ 23 ॥**

ఓ శివా! అట్లుగానిచో ప్రళయం వస్తుంది. నేను సత్యాన్నే పలుకుతున్నాను. ఓ నాథా! నా మాటలకు ప్రామాణ్యమును కలిగించండి. నేను నిన్నాశ్రయించుకొనియున్న నీ దానను.

**ఇయం చ దారుకా దేవీ రాక్షసీ శక్తికా మమ ।**
**బలిష్ఠా రాక్షసీనాం చ రక్షో రాజ్యం ప్రశాస్తు చ ॥ 24 ॥**

ఈ దారుకాదేవియనే రాక్షసి నా శక్తి. రాక్షసస్త్రీలలో అత్యధిక బలవంతురాలైన ఈమె రాక్షసరాజ్యాన్ని పరిపాలించు గాక!

**ఇమా రాక్షసపత్న్యస్తు ప్రసవిష్యంతి పుత్రకాన్ ।**
**తే సర్వే మిళితాశ్చైవ వనే వాసాయ మే మతాః ॥ 25 ॥**

ఈ రాక్షసుల భార్యలు పుత్రులను ప్రసవించగలరు. వారందరు కలసి ఈ వనంలో నివసించాలని నా అభిమతం."

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఇత్యేవం వచనం శ్రుత్వా పార్వత్యాః స్వస్త్రియా ప్రభుః ।**
**ప్రసన్నమానసో భూత్వా శంకరో వాక్యమబ్రవీత్ ॥ 26 ॥**

తన భార్యయైన పార్వతియొక్క మాటలు విని శంకరప్రభువు ప్రసన్నమైన మనస్సు గలవాడై ఇట్లు పలికాడు.

**శంకర ఉవాచ -** శంకరుడు పలికాడు.

**ఇతి బ్రవీషి త్వం వై చేచ్ఛృణు మద్వచనం ప్రియే! ।**
**స్థాస్యామ్యస్మిన్వనే ప్రీత్యా భక్తానాం పాలనాయ చ ॥ 27 ॥**

ఓ ప్రియురాలా! నీవిట్లు పలుకుచున్నావు గదా! అట్లైన నా మాట వినుము. నేను భక్తులను రక్షించడానికి ప్రీతిపూర్వకంగా ఈ వనంలో స్థిరంగా ఉంటాను.

**అత్ర మే వర్ణధర్మస్థో దర్శనం ప్రీతిసంయుతమ్ ।**
**కరిష్యతి చ యో వై స చక్రవర్తీ భవిష్యతి ॥ 28 ॥**

ఎవడైతే వర్ణధర్మమునందుండి నన్నిక్కడ ప్రీతిపూర్వకంగా దర్శిస్తాడో, వాడు చక్రవర్తి కాగలడు.

**అన్యథా కలిపర్యాయే సత్యస్యాదౌ నృపేశ్వరః ।**
**మహాసేనయుతో యో వై వీరసేనేతి విశ్రుతః ॥ 29 ॥**

లేదా కలియుగం పూర్తియైన తరువాత, సత్యయుగంయొక్క ఆరంభంలో వీరసేనుడని ప్రఖ్యాతి చెందిన మహాసేనుని కుమారుడైన రాజు పెద్ద సైన్యంతో ఇక్కడకు వస్తాడు.

**స మే భక్త్యాతివిక్రాంతో దర్శనం మే కరిష్యతి ।**
**దర్శనం మే స కృత్వైవ చక్రవర్తీ భవిష్యతి ॥ 30 ॥**

వాడు నన్ను భక్తితో దర్శిస్తాడు. నన్ను దర్శించడంతోనే చక్రవర్తి కాగలడు.

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**ఇత్యేవం దంపతీ తౌ చ కృత్వా హాస్యం పరస్పరమ్ ।**
**స్థితౌ తత్ర స్వయం సాక్షాన్మహత్త్వకారకౌ ద్విజాః! ॥ 31 ॥**

ఓ బ్రాహ్మణులారా! దంపతులైన శివపార్వతులు ఈ విధంగా ఒకరితోనొకరు పరిహాసమాడి అక్కడ స్వయంగా మహత్వకారకులై ప్రతిష్ఠితులయ్యారు.

**జ్యోతిర్లింగస్వరూపో హి నామ్నా నాగేశ్వరశ్శివః ।**
**నాగేశ్వరీ శివా దేవీ బభూవ చ సతాం ప్రియౌ ॥ 32 ॥**

శివుడు నాగేశ్వరుడనే జ్యోతిర్లింగస్వరూపుడుగాను, పార్వతీదేవి నాగేశ్వరిగాను వెలసి సత్పురుషులకు ప్రీతి కలిగించారు.

**ఋషయ ఊచుః -** ఋషులు పలికారు.

**వీరసేనః కథం తత్ర యాస్యతే దారుకావనే ।**
**కథమర్చిష్యతి శివం త్వం తద్వద మహామతే! ॥ 33 ॥**

“ఓ మహామతీ! వీరసేనుడు ఆ దారుకావనానికి ఏవిధంగా వెళ్లబోతున్నాడు?. శివుని ఏ విధంగా అర్చింపబోతున్నాడు?” నీవావిషయాలన్నీ మాకు చెప్పుము.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**నిషధే సుందరే దేశే క్షత్రియాణాం కులే చ సః ।**
**మహాసేనసుతో వీరసేనశ్చైవ శివప్రియః ॥ 34 ॥**

నిషధమనే సుందరదేశంలో క్షత్రియకులంలో మహాసేనుడనే వానికి వీరసేనుడనే శివప్రియుడైన పుత్రుడున్నాడు.

**పార్థివేశార్చనం కృత్వా తపః పరమదుష్కరమ్ ।**
**చకార వీరసేనో వై వర్షాణాం ద్వాదశావధిః ॥ 35 ॥**

వీరసేనుడు పార్థివలింగపూజచేసి పన్నెండు సంవత్సరాలు పరమదుష్కరమైన తపస్సు చేశాడు.

**తతః ప్రసన్నో దేవేశః ప్రత్యక్షం ప్రాహ శంకరః ।**
**కాష్ఠస్య మత్స్యికాం కృత్వా త్రపుధాతువిలేపనామ్ ॥ 36 ॥**

అంతట దేవేశుడైన శంకరుడు ప్రసన్నుడై సాక్షాత్కరించి ఇలా పలికాడు. కర్రతో చేపను బోలిన పడవ చేసి దానికి సీసమనే లోహంతో పూత వేయుము.

**విధాయ యోగమాయాం చ దాస్యామి వీరసేనక! ।**
**తాం గృహీత్వా ప్రవిశ్యైతం నృభిస్సహ వ్రజాధునా ॥ 37 ॥**

“ఓ వీరసేనా! నేను యోగమాయను నిర్మించి ఇస్తాను. ఆ యోగమాయను తీసుకొని నీ మనుష్యులతో గూడి దానిలో ప్రవేశింపుము.

**తతస్త్వం తత్ర గత్వా చ వివరే చ కృతే మయా ।**
**ప్రవిశ్య చ తదా పూజాం కృత్వా నాగేశ్వరస్య చ ॥ 38 ॥**

అనంతరం నీవు పశ్చిమ సముద్రంలోని ద్వీపానికి వెళ్లి నేను చేసిన బిలంగుండా ప్రవేశించి అప్పుడు నాగేశ్వరుని పూజింపుము.

**తతః పాశుపతం ప్రాప్య హత్వా చ రాక్షసీముఖాన్ ।**
**మయి దృష్టే తదా కించిన్న్యూనం తే న భవిష్యతి ॥ 39 ॥**

తరువాత పాశుపతాస్త్రాన్ని పొంది ఆ రాక్షసి మున్నగు వారిని సంహరించి నన్ను మరలా దర్శించుము. నీకు సర్వమూ సుసంపన్నం కాగలదు.

**పార్వత్యాశ్చ బలం చైవ సంపూర్ణం వై భవిష్యతి ।**
**అన్యే చ మ్లేచ్ఛరూపా యే భవిష్యంతి వనే శుభాః ॥ 40 ॥**

పార్వతి బలం కూడ సంపూర్ణం కాగలదు. ఈ వనమునందుండే ఇతర మ్లేచ్ఛులు కూడ శుభకర్మపరాయణులు కాగలరు."

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**ఇత్యుక్త్వా శంకరస్తత్ర వీరసేనం హి దుఃఖహా ।**
**కృత్వా కృపాం చ మహతీం తత్రైవాంతర్దధే ప్రభుః ॥ 41 ॥**

దుఃఖాలను పోగొట్టే శంకరప్రభువువీరసేనునితోనిట్లు పలికి గొప్ప దయ చూపి అక్కడే అంతర్ధానమయ్యాడు.

**ఇతి దత్తవరస్సోఽపి శివేన పరమాత్మనా ।**
**శక్తస్సర్వం తదా కర్తుం సంబభూవ న సంశయః ॥ 42 ॥**

ఈ విధంగా పరమాత్మచే పొందబడిన వరాలు గల ఆ వీరసేనుడు సర్వమునూ చేయగలిగినాడనుటలో సందేహం లేదు.

**ఏవం నాగేశ్వరో దేవ ఉత్పన్నో జ్యోతిషాం పతిః ।**
**లింగరూపస్త్రిలోకస్య సర్వకామప్రదస్సదా ॥ 43 ॥**

త్రిలోకాలకు సర్వదా సర్వకామనలిచ్చే పరమేశ్వరుడీవిధంగా జ్యోతిర్లింగాలలో శ్రేష్ఠమైన నాగేశ్వరరూపంలో ఆవిర్భవించాడు.

**ఏతద్యః శృణుయాన్నిత్యం నాగేశోద్భవమాదరాత్ ।**
**సర్వాన్కామానియాద్ధీమాన్మహాపాతకనాశనాన్ ॥ 44 ॥**

ఎవడైతే ఈ నాగేశ్వరావిర్భావాన్ని సాదరంగా నిత్యము వింటాడో, ఆ బుద్ధిమంతుడు మహాపాపాలన్నింటి-నుండియు విముక్తిని పొంది, సకల కోరికలను పొందుతాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం నాగేశ్వరజ్యోతిర్లింగోద్భవమాహాత్మ్యవర్ణనం నామ త్రింశోఽధ్యాయః ॥ 30 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు నాగేశ్వరజ్యోతిర్లింగోద్భవమాహాత్మ్యవర్ణనం అనే పేరుగల ముప్పైయవ అధ్యాయం సమాప్తం.

## ఏకత్రింశోऽధ్యాయః - ముప్పైఒకటవ అధ్యాయం

## రామేశ్వరమాహాత్మ్యవర్ణనమ్ - రామేశ్వరమాహాత్మ్యవర్ణనం

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**అతః పరం ప్రవక్ష్యామి లింగం రామేశ్వరాభిధమ్ ।**
**ఉత్పన్నం చ యథా పూర్వమృషయః శృణుతాదరాత్ ॥ 1 ॥**

ఓ మహర్షులారా! ఇకపై రామేశ్వరుడనే పేరుగల లింగం ఆవిర్భవించిన వృత్తాంతాన్ని చెబుతున్నాను. సాదరంగా వినండి.

**పురా విష్ణుః పృథివ్యాం చావతతార సతాం ప్రియః ॥ 2 ॥**

సత్పురుషులకు ప్రియుడైన విష్ణువు పూర్వం భూమిపై అవతరించాడు.

**తత్ర సీతా హృతా విప్రాః! రావణేనోరుమాయినా ।**
**ప్రాపితా స్వగృహం సా హి లంకాయాం జనకాత్మజా ॥ 3 ॥**

ఓ బ్రాహ్మణులారా! ఆ అవతారంలో మహామాయావియైన రావణుడు జనకుని కుమార్తెయైన సీతనపహరించి లంకయందలి తన గృహానికి తీసుకొనిపోయాడు.

**అన్వేషణపరస్తస్యాః కిష్కింధాఖ్యాం పురీమగాత్ ।**
**సుగ్రీవహితకృద్భూత్వా వాలినం సంజఘాన హ ॥ 4 ॥**

ఆమెను వెదుకుతూ శ్రీరాముడు కిష్కింధయనే నగరం చేరి సుగ్రీవుని ప్రియమిత్రుడై వాలిని సంహరించాడు.

**తత్ర స్థిత్వా కియత్కాలం తదన్వేషణతత్పరః ।**
**సుగ్రీవాద్యైర్లక్ష్మణేన విచారం కృతవాన్స వై ॥ 5 ॥**

ఆయన అచ్చటనే కొంతకాలముండి సీతాన్వేషణతత్పరుడై సుగ్రీవాది వానరులతోను, లక్ష్మణునితోను చర్చించాడు.

**కపీన్సంప్రేషయామాస చతుర్దిక్షు నృపాత్మజః ।**
**హనూమత్ప్రముఖాన్రామస్తదన్వేషణహేతవే ॥ 6 ॥**

రాజకుమారుడైన శ్రీరాముడు సీతను వెదకడానికి హనుమంతుడు మున్నగు వానరులను నాలుగు దిక్కులకు పంపించాడు.

**అథ జ్ఞాత్వా గతాం లంకాం సీతాం కపివరాననాత్ ।**
**సీతా చూడామణిం ప్రాప్య ముముదే సోऽతి రాఘవః ॥ 7 ॥**

తరువాత వానరశ్రేష్ఠుడైన హనుమంతుని ద్వారా సీత లంకలో ఉన్నదని తెలిసి ఆమెయొక్క చూడామణిని పొంది శ్రీరాముడు చాలా సంతోషించాడు.

**సకపీశస్తదా రామో లక్ష్మణేన యుతో ద్విజాః! ।**
**సుగ్రీవప్రముఖైః పుణ్యైర్వానరైర్బలవత్తరైః ॥ 8 ॥**

**పద్మైరష్టాదశాఖ్యైశ్చ యయౌ తీరం పయోనిధేః ।**
**దక్షిణే సాగరే యో వై దృశ్యతే లవణాకరః ॥ 9 ॥**

ఓ బ్రాహ్మణులారా! లక్ష్మణునితోను, వానరాధిపుడైన హనుమంతునితోను కూడియున్న శ్రీరాముడు సుగ్రీవాది మహాబలశాలురు పుణ్యాత్ములునైన లక్ష పద్దెనిమిది కోట్ల వానరసైన్యం వెంటరాగా దక్షిణ దిక్కులోనున్న లవణసాగరతీరానికి వెళ్లాడు.

**తత్రాగత్య స్వయం రామో వేలాయాం సంస్థితో హి సః ।**
**వానరైః సేవ్యమానస్తు లక్ష్మణేన శివప్రియః ॥ 10 ॥**

శివునకు ప్రియుడైన శ్రీరాముడు వానరులచే సేవింపబడుతున్నవాడై లక్ష్మణునితో బాటు స్వయంగా సముద్రంయొక్క చెలియలి కట్టవద్దకు వచ్చి అచ్చట నిలబడి యున్నాడు.

**హా! జానకి! కుతో యాతా కదా చేయం మిలిష్యతి ।**
**అగాధస్సాగరశ్చైవాతార్యా సేనా చ వానరీ ॥ 11 ॥**

"ఓ జానకీ! ఎక్కడకు వెళ్లావు? నేను నిన్ను కలుసుకొనేదెప్పుడు? ఈ అగాధమైన సముద్రాన్ని దాటడం ఈ వానరసేనకు సాధ్యమా?

**రాక్షసో గిరిధర్తా చ మహాబలపరాక్రమః ।**
**లంకాఖ్యో దుర్గమో దుర్గ ఇంద్రజిత్తనయోఽస్య వై ॥ 12 ॥**

ఆ రాక్షసుడు మహాబలపరాక్రమశాలి. అంతియేగాక కైలాసాన్ని పైకెత్తినవాడు. లంకాదుర్గాన్ని జయించడం చాల కఠినం. వాని కుమారుడు ఇంద్రుని జయించినవాడు."

**ఇత్యేవం స విచార్యైవ తటే స్థిత్వా సలక్ష్మణః ।**
**ఆశ్వాసితో వనౌకోభిరంగదాదిపురస్సరైః ॥ 13 ॥**

సముద్రతీరంలో లక్ష్మణునితో గూడి నిలబడిన రాముడు ఈ విధంగా ఆలోచిస్తుండగా, అంగదాది వానరులాయనను ఓదారుస్తున్నారు.

**ఏతస్మిన్నంతరే తత్ర రాఘవశ్శైవసత్తమః ।**
**ఉవాచ భ్రాతరం ప్రీత్యా జలార్థీ లక్ష్మణాభిధమ్ ॥ 14 ॥**

ఇంతలో శివభక్తాగ్రగణ్యుడైన శ్రీరాముడు, సోదరుడైన లక్ష్మణుని ప్రీతిపూర్వకంగా నీటినిమ్మని అడిగాడు.

**రామ ఉవాచ –** రాముడు పలికాడు.

**భ్రాతర్లక్ష్మణ! వీరేశాహం జలార్థీ పిపాసితః ।**
**తదానయ ద్రుతం పాథో వానరైః కైశ్చిదేవ హి ॥ 15 ॥**

ఓ సోదరా! లక్ష్మణా! మహావీరా! నాకు దాహం వేస్తోంది. కాబట్టి వెంటనే వానరులెవరిచేతనైననూ నీటిని తెప్పించుము.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**తచ్ఛ్రుత్వా వానరాస్తత్ర హ్యధావంత దిశో దశ ।**
**నీత్వా జలం చ తే ప్రోచుః ప్రణిపత్య పురఃస్థితాః ॥ 16 ॥**

ఆ మాటలు విని వానరులు పది దిక్కులకు పరుగెత్తారు. వారు నీటిని తెచ్చి నమస్కరించి ఎదుట నిలబడి ఇలా పలికారు.

**వానరా ఊచుః –** వానరులు పలికారు.

**జలం చ గృహ్యతాం స్వామిన్నానీతం తత్తు త్వదాజ్ఞయా ।**
**మహోత్తమం చ సుస్వాదు శీతలం ప్రాణతర్పణమ్ ॥ 17 ॥**

ఓ ప్రభూ! మిక్కిలి ఉత్తమమైనది, మిక్కిలి రుచికరమైనది, చల్లనిది, ప్రాణాలకు తృప్తినిచ్చునదియునైన నీటిని నీ ఆజ్ఞచే తెచ్చాము. స్వీకరించుము.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**సుప్రసన్నతరో భూత్వా కృపాదృష్ట్యా విలోక్య తాన్ ।**
**తచ్ఛ్రుత్వా రామచంద్రోఽసౌ స్వయం జగ్రాహ తజ్జలమ్ ॥ 18 ॥**

వారి మాటలు విని రామచంద్రుడు మిక్కిలి ప్రసన్నుడై వారిని దయాదృష్టితో చూచి తాను, ఆ నీటిని స్వీకరించాడు.

**స రామస్తజ్జలం నీత్వా పాతుమారబ్ధవాన్యదా ।**
**తదా చ స్మరణం జాతమిత్థమస్య శివేచ్ఛయా ॥ 19 ॥**

శ్రీరాముడా నీటిని తీసుకొని త్రాగబోవునంతలో శివుని సంకల్పంచే ఆయనకిట్టి స్మరణ కలిగింది.

**న కృతం దర్శనం శంభోర్గృహ్యతే చ జలం కథమ్ ।**
**స్వస్వామినః పరేశస్య సర్వానందప్రదస్య వై ॥ 20 ॥**

ప్రభువు, పరమేశ్వరుడు, సర్వులకు ఆనందాన్నిచ్చేవాడునైన శంభుని నేను దర్శించలేకపోయాను. అలాంటప్పుడు నేనీ నీటినెలా తీసుకోవాలి?

**ఇత్యుక్త్వా చ జలం పీతం తదా రఘువరేణ చ ।**
**పశ్చాచ్చ పార్థివీం పూజాం చకార రఘునందనః ॥ 21 ॥**

రాఘవుడప్పుడిట్లు పలికి నీటిని త్రాగి అనంతరం పార్థివలింగపూజ చేశాడు.

**ఆవాహనాదికాంశ్చైవ హ్యుపచారాన్ప్రకల్ప్య వై ।**
**విధివత్ షోడశం ప్రీత్యా దేవమానర్చ శంకరమ్ ॥ 22 ॥**

ఆవాహనాది షోడశోపచారాలు యథావిధిగా చేసి ప్రీతితో శంకరదేవుని ఆరాధించాడు.

**ప్రణిపాతైః స్తవైర్దివ్యైఃశ్శివం సంతోష్య యత్నతః ।**
**ప్రార్థయామాస సద్భక్త్యా స రామశ్శంకరం ముదా ॥ 23 ॥**

అంతట శ్రీరాముడు నమస్కృతులతోను, దివ్యమైన స్తోత్రాలతోను మంగళకరుడైన శివుని ప్రయత్నపూర్వకంగా సంతుష్టుని గావించి ఆనందంతోను, సద్భక్తితోను ఇలా ప్రార్థించాడు.

**రామ ఉవాచ –** రాముడు పలికాడు.

**స్వామిన్! శంభో! మహాదేవ! సర్వదా భక్తవత్సల! ।**
**పాహి మాం శరణాపన్నం త్వద్భక్తం దీనమానసమ్ ॥ 24 ॥**

“ఓ స్వామీ! శంభూ! మహాదేవా! సర్వకాలాలలోను భక్తులయందు వాత్సల్యం గలవాడా! దీనమైన మనస్సు గలవాడనై నిన్ను శరణుజొచ్చిన నీ భక్తుడనైన నన్ను రక్షించుము.

**ఏతజ్జలమగాధం చ వారిధేర్భవతారణ! ।**
**రావణాఖ్యో మహావీరో రాక్షసో బలవత్తరః ॥ 25 ॥**

సంసారసముద్రాన్ని దాటించువాడా! ఈ సముద్రం అగాధమైనది, రావణాసురుడు మహావీరుడు, మహాబలశాలి.

**వానరాణాం బలం హ్యేతచ్చంచలం యుద్ధసాధనమ్ ।**
**మమ కార్యం కథం సిద్ధం భవిష్యతి ప్రియాప్తయే ॥ 26 ॥**

చపలచిత్తులైన వానరసైన్యం నాకు యుద్ధానికి సాధనం. నాకు నా ప్రియురాలిని తిరిగి పొందడమనే కార్యమెట్లు సిద్ధిస్తుంది?

**తస్మిన్దేవ! త్వయా కార్యం సాహాయ్యం మమ సువ్రత! ।**
**సాహాయ్యం తే వినా నాథ! మమ కార్యం హి దుర్లభమ్ ॥ 27 ॥**

ఓ దేవా! సువ్రతా! నీవిప్పుడు నాకు ఈ కార్యంలో సహాయం చేయాలి. ఓ నాథా! నీ సాహాయ్యం లేనిదే నా కార్యం నెరవేరదు.

**త్వదీయో రావణోఽపీహ దుర్జయస్సర్వథాఽఖిలైః ।**
**త్వద్దత్తవరదృప్తశ్చ మహావీరస్త్రిలోకజిత్ ॥ 28 ॥**

నీవిచ్చిన వరాలచే గర్వించియున్నవాడు, మహావీరుడు, ముల్లోకాలను జయించినవాడు, అంతేగాక నీవాడునైన రావణుని ఎవ్వరైననూ, ఏవిధంగానైనను జయించుట అసాధ్యం.

**అప్యహం తవ దాసోఽస్మి త్వదధీనశ్చ సర్వథా ।**
**విచార్యేతి త్వయా కార్యః పక్షపాతస్సదాశివ! ॥ 29 ॥**

నేను నీ దాసుడను. నేను అన్నివిధాలుగా నీ ఆధీనంలోనున్నవాడిని. ఓ సదాశివా! నీవాలోచించి నీవు నాయందు పక్షపాతం చూపదగును."

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యేవం స చ సంప్రార్థ్య నమస్కృత్య పునః పునః ।**
**తదా జయ జయేత్యుచ్చైరుద్ఘోషైశ్శంకరేతి చ ॥ 30 ॥**

ఆయనీవిధంగా చక్కగా ప్రార్థించి పలుమార్లు నమస్కరించిన పిదప "ఓ శంకరా! జయం! జయం!" అనే ఘోష బిగ్గరగా చేశాడు.

**ఇతి స్తుత్వా శివం తత్ర మంత్రధ్యానపరాయణః ।**
**పునః పూజాం తతః కృత్వా స్వామ్యగ్రే స ననర్త హ ॥ 31 ॥**

ఆయన ఆ సమయంలో ఈవిధంగా శివుని స్తుతించి మంత్రాన్ని ధ్యానించడంలో నిమగ్నుడై మరల పూజించిన పిదప శివుని యెదుట నాట్యం చేశాడు.

**ప్రేమవిక్లిన్నహృదయో గలనాదం యదాఽకరోత్ ।**
**తదా చ శంకరో దేవస్సుప్రసన్నో బభూవ హ ॥ 32 ॥**

శ్రీరాముడు ఎప్పుడైతే ప్రేమతో నిండిన హృదయం గలవాడై బిగ్గరగా కంఠనాదం చేశాడో అప్పుడు శంకరదేవుడు మిక్కిలి ప్రసన్నుడయ్యాడు.

**సాంగస్సపరివారశ్చ జ్యోతీరూపో మహేశ్వరః ।**
**యథోక్తరూపమమలం కృత్వాఽవిరభవద్ద్రుతమ్ ॥ 33 ॥**

ప్రకాశస్వరూపుడైన మహేశ్వరుడు పూర్వం వర్ణింపబడిన శుద్ధరూపాన్ని దాల్చి, సాంగసపరివారంగా శీఘ్రమే ప్రత్యక్షమైనాడు.

**తతస్సంతుష్టహృదయో రామభక్త్యా మహేశ్వరః ।**
**శివమస్తు వరం బ్రూహి రామేతి స తదాఽబ్రవీత్ ॥ 34 ॥**

అంతట మహేశ్వరుడు శ్రీరాముని భక్తికి ప్రసన్నహృదయుడై "ఓ మహారాజా! నీకు శుభం కలుగు గాక! నీవు వరాన్ని కోరుకొమ్ము" అని ప్రీతితో రామునితో పలికాడు.

**తద్రూపం చ తదా దృష్ట్వా సర్వే పూతాస్తతః స్వయమ్ ।**
**కృతవాన్రాఘవః పూజాం శివధర్మపరాయణః ॥ 35 ॥**

అప్పుడక్కడున్నవారందరు ఆ రూపాన్ని చూచి పవిత్రులయ్యారు. శివధర్మపరాయణుడైన రాఘవుడప్పుడు శివుని పూజించాడు.

**స్తుతిం చ వివిధాం కృత్వా ప్రణిపత్య శివం ముదా ।**
**జయం చ ప్రార్థయామాస రావణాజౌ తదాత్మనః ॥ 36 ॥**

ఆయన అప్పుడు వివిధ స్తోత్రాలు చేసి శివునికి ఆనందంతో నమస్కరించి యుద్ధంలో రావణుని జయించాలని కోరాడు.

**తతః ప్రసన్నహృదయో రామభక్త్యా మహేశ్వరః ।**
**జయోఽస్తు తే మహారాజ! ప్రీత్యా స పునరబ్రవీత్ ॥ 37 ॥**

అంతట శ్రీరాముని భక్తికి ప్రసన్నహృదయుడైన మహేశ్వరుడు "ఓ మహారాజా! నీకు జయము కలుగు గాక!" అని మరలా పలికాడు.

**శివదత్తం జయం ప్రాప్య హ్యనుజ్ఞాం సమవాప్య చ ।**
**పునశ్చ ప్రార్థయామాస సాంజలిర్నతమస్తకః ॥ 38 ॥**

శివదత్తమైన అనుగ్రహాన్ని జయాశీర్వాదాన్ని స్వీకరించి శివుని అనుమతి పొంది చేతులు కట్టుకొని తల వంచి రాముడు మరల ఇట్లు ప్రార్థించాడు.

**రామ ఉవాచ** - రాముడు పలికాడు.

**త్వయా స్థేయమిహ స్వామిన్! లోకానాం పావనాయ చ ।**
**పరేషాముపకారార్థం యది తుష్టోఽసి శంకర! ॥ 39 ॥**

"ఓ స్వామీ! శంకరా! నీవు సంతుష్టుడవైతే లోకాలను పవిత్రం చేయడానికి పరోపకారానికి నీవిచ్చటే స్థిరంగానుండదగును".

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఇత్యుక్తస్తు శివస్తత్ర లింగరూపోఽభవత్తదా ।**
**రామేశ్వరశ్చ నామ్నా వై ప్రసిద్ధో జగతీతలే ॥ 40 ॥**

శ్రీరాముడిట్లు పలుకగా అప్పుడక్కడ శివుడు లింగరూపంలో ప్రకటితుడై భూమండలంలో 'రామేశ్వరుడు' అనే పేరుతో ప్రసిద్ధుడయ్యాడు.

**రామస్తు తత్ప్రభావాద్వై సింధుముత్తీర్య చాంజసా ।**
**రావణాదీన్నిహత్యాశు రాక్షసాన్ప్రాప తాం ప్రియామ్ ॥ 41 ॥**

శివుని వరప్రభావం చేతనే శ్రీరాముడు సముద్రాన్ని శీఘ్రంగా దాటి రావణాది రాక్షసులనందరిని సంహరించి, తన ప్రియురాలిని పొందాడు.

**రామేశ్వరస్య మహిమాఽద్భుతోఽభూద్భువి చాతులః ।**
**భుక్తిముక్తిప్రదశ్చైవ సర్వదా భక్తకామదః ॥ 42 ॥**

ఈ భూమండలంలో రామేశ్వరుని మాహాత్మ్యం కూడ అత్యద్భుతమై, సాటిలేనిదై అలరారింది. రామేశ్వరలింగం భుక్తి - ముక్తి ప్రదమైనది. సర్వదా భక్తుల కోరికలను నెరవేర్చేది.

**దివ్యగంగాజలేనైవ స్నాపయిష్యతి యశ్శివమ్ ।**
**రామేశ్వరం చ సద్భక్త్యా స జీవన్ముక్త ఏవ హి ॥ 43 ॥**

ఎవడైతే దివ్యగంగాజలంతో రామేశ్వరునికి సద్భక్తితో అభిషేకం చేస్తాడో, వాడు నిశ్చయంగా జీవన్ముక్తుడౌతాడు.

**ఇహ భుక్త్వాఽఖిలాన్భోగాన్దేవానాం దుర్లభానపి ।**
**అంతే ప్రాప్య పరం జ్ఞానం కైవల్యం ప్రాప్నుయాద్ధ్రువమ్ ॥ 44 ॥**

అట్టివాడు నిశ్చయంగా ఈ లోకంలో దేవతలకు కూడా దుర్లభమైన సకలభోగాలు అనుభవించి పరమజ్ఞానాన్ని పొంది మరణానంతరం మోక్షాన్ని పొందుతాడు.

**ఇతి వశ్చ సమాఖ్యాతం జ్యోతిర్లింగం శివస్య తు ।**
**రామేశ్వరాభిధం దివ్యం శృణ్వతాం పాపహారకమ్ ॥ 45 ॥**

ఈ విధంగా రామేశ్వరజ్యోతిర్లింగస్వరూపుడైన శివుని పాపహారకమైన దివ్యగాథను మీకు వివరించి చెప్పాను.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం రామేశ్వరమాహాత్మ్యవర్ణనం నామైక-త్రింశోఽధ్యాయః ॥ 31 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు రామేశ్వరమాహాత్మ్యవర్ణనం అనే పేరుగల ముప్పైఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్వాత్రింశోఽధ్యాయః - ముప్పైరెండవ అధ్యాయం

## సుదేహా-సుధర్మాచరితవర్ణనమ్ - సుదేహా-సుధర్మాచరితవర్ణనం

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**అతః పరం చ ఘుశ్మేశం జ్యోతిర్లింగముదాహృతమ్ ।**
**తస్యైవ చ సుమాహాత్మ్యం శ్రూయతాం ఋషిసత్తమాః! ॥ 1 ॥**

ఓ మహర్షులారా! ఘుశ్మేశ్వరుడనే జ్యోతిర్లింగం ప్రసిద్ధమైనది. ఇకపై దానిగొప్ప మహిమను గురించి చెబుతాను వినండి.

**దక్షిణస్యాం దిశి శ్రేష్ఠో గిరిర్దేవేతిసంజ్ఞకః ।**
**మహాశోభాన్వితో నిత్యం రాజతేఽద్భుతదర్శనః ॥ 2 ॥**

దక్షిణ దిక్కునందు శ్రేష్ఠమైనది, మహాశోభాన్వితము, అత్యద్భుతదర్శనమిచ్చునదియునైన 'దేవగిరి' యనే పేరుగల పర్వతరాజం శోభిల్లుతోంది.

**తస్యైవ నికటే కశ్చిద్భారద్వాజకులోద్భవః ।**
**సుధర్మా నామ విప్రశ్చ న్యవసద్బ్రహ్మవిత్తమః ॥ 3 ॥**

దానికి సమీపంలో భారద్వాజగోత్రోత్పన్నుడు, బ్రహ్మవేత్తలలో ప్రముఖుడునైన సుధర్ముడనే ఒకానొక బ్రాహ్మణుడు నివసిస్తున్నాడు.

**తస్య ప్రియా సుదేహా చ శివధర్మపరాయణః ।**
**పతిసేవాపరా నిత్యం గృహకర్మవిచక్షణా ॥ 4 ॥**

శివధర్మపరాయణురాలు, ఇంటి పనులయందు తెలివితేటలు గలది, పతిసేవాపరురాలునైన 'సుదేహ' అతని భార్య.

**సుధర్మా చ ద్విజశ్రేష్ఠో దేవతాతిథిపూజకః ।**
**వేదమార్గపరో నిత్యమగ్నిసేవాపరాయణః ॥ 5 ॥**

బ్రాహ్మణశ్రేష్ఠుడైన సుధర్ముడు దేవతలను, అతిథులను పూజించేవాడు. వేదమార్గమునందు నిష్ఠగల ఆయన నిత్యం అగ్నిని సేవించడంలో నిమగ్నమై యుండేవాడు.

**త్రికాలసంధ్యయా యుక్తస్సూర్యరూపసమద్యుతిః ।**
**శిష్యాణాం పాఠకశ్చైవ వేదశాస్త్రవిచక్షణః ॥ 6 ॥**

మూడు కాలాలయందును సంధ్యోపాసన చేయడంవల్ల అతడు సూర్యకాంతితో సమానమైన కాంతి కలిగియున్నాడు. వేదశాస్త్రవిద్వాంసుడైన ఆయన శిష్యులకు పాఠాలనుబోధిస్తూ ఉండేవాడు.

**ధనవాంశ్చ పరో దాతా సౌజన్యగుణభాజనః ।**
**శివకర్మరతో నిత్యం శైవశ్శైవజనప్రియః ॥ 7 ॥**

మంచితనమనే గుణానికి పెట్టిన పేరనదగిన ఆ బ్రాహ్మణుడు ధనవంతుడు, గొప్పదాత, శివభక్తుడు, శివకర్మరతుడు, శివునియందు, శివభక్తులయందు ప్రీతి గలవాడు.

**ఆయుర్బహు వ్యతీయాయ తస్య ధర్మం ప్రకుర్వతః ।**
**పుత్రశ్చ నాభవత్తస్య ఋతుః స్యాదఫలః స్త్రియాః ॥ 8 ॥**

ఈ విధంగా ధర్మానుష్ఠానం చేస్తున్న ఆ బ్రాహ్మణుడు పెద్దవాడయ్యాడు. కాని ఆయనకు పుత్రసంతానం కలగలేదు. ఆయన భార్యయొక్క ఋతుధర్మం వ్యర్థమయ్యింది.

**తేన దుఃఖం కృతం నైవ వస్తుజ్ఞానపరేణ హి ।**
**ఆత్మనస్తారకశ్చాత్మా హ్యాత్మనః పావనశ్చ సః ॥ 9 ॥**

ఆయన బ్రహ్మజ్ఞానియైనందున దుఃఖాన్ని లేశమైననూ పొందలేదు. ఆత్మను రక్షించేది ఆత్మయే. ఆత్మను పవిత్రం చేసేది కూడ ఆత్మయే.

**ఇత్యేవం మానసం ధృత్వా దుఃఖం న కృతవాంస్తదా ।**
**సుదేహా చ తదా దుఃఖం చకార పుత్రసంభవమ్ ॥ 10 ॥**

ఈ విధమైన వివేకం గలవాడైనందున ఆయన దుఃఖం పొందలేదు. కాని సుదేహ మాత్రం పుత్రుడు లేడనే దుఃఖం పొందింది.

**నిత్యం చ స్వామినం సా వై ప్రార్థయద్యత్నసాధనే ।**
**పుత్రోత్పాదనహేతోశ్చ సర్వవిద్యావిశారదమ్ ॥ 11 ॥**

సర్వవిద్యావిశారదుడైన తన భర్తను 'పుత్రసంతానం లభించే ప్రయత్నం చేయుము' అని నిత్యం సుదేహ ప్రార్థించేది.

**సోఽపి స్త్రియం తదా భర్త్స్య కిం పుత్రశ్చ కరిష్యతి ।**
**కా మాతా కః పితా పుత్రః కో బంధుశ్చ ప్రియశ్చ కః ॥ 12 ॥**

అతడు భార్యపై ఇలా కోపపడేవాడు "పుత్రుడేమి చేస్తాడు? తల్లి ఎవరు? తండ్రి యెవరు? బంధువు-లెవరు? ప్రియుడెవరు? పుత్రుడెవరు?

**సర్వం స్వార్థపరం దేవి! త్రిలోక్యాం నాత్ర సంశయః ।**
**జానీహి త్వం విశేషేణ బుద్ధ్యా శోకం న వై కురు ॥ 13 ॥**

ఓ దేవీ! ముల్లోకాలలో సర్వం స్వార్థాన్ని ఆశ్రయించుకొని యున్నదే. నీవీ విషయాన్ని బుద్ధినుపయోగించి విశేషంగా తెలుసుకో.

**తస్మాద్దేవి! త్వయా దుఃఖం త్యజనీయం సునిశ్చితమ్ ।**
**నిత్యం మహ్యం త్వయా నైవ కథనీయం శుభవ్రతే! ॥ 14 ॥**

కాబట్టి ఓ దేవీ! నీవు దుఃఖాన్ని విడిచిపెట్టు. నేను నీకు ప్రతిదినం చెప్పనవసరం లేదు.

**ఏవం తాం సన్నివార్యైవ భగవద్ధర్మతత్పరః ।**
**ఆసీత్పరమసంతుష్టో ద్వంద్వదుఃఖం సమత్యజత్ ॥ 15 ॥**

భగవద్ధర్మమునందు నిష్ఠగల ఆ బ్రాహ్మణుడు ఈవిధంగా ఆమెను నివారించి పరమసంతోషం గలవాడై శీతోష్ణాది అన్ని విధములైన ద్వంద్వాలకు అతీతుడైయున్నాడు.

**కదాచిచ్చ సుదేహా వై గేహే చ సహవాసినః ।**
**జగామ ప్రియగోష్ఠ్యర్థం వివాదస్తత్ర సంగతః ॥ 16 ॥**

ఒకనాడు సుదేహ ఇష్టాగోష్ఠికొఱకు ప్రక్కింటి వారివద్దకు వెళ్లగా అచ్చట ఒక వివాదం చెలరేగింది.

**తత్పత్నీ స్త్రీస్వభావాచ్చ భర్త్సితా సా తయా తదా ।**
**ఉక్తా చేతి దురుక్త్యా వై సుదేహా విప్రకామినీ ॥ 17 ॥**

ఆ యింటి యజమానురాలు స్త్రీస్వభావంవల్ల ఆ సమయంలో బ్రాహ్మణపత్నియైన సుదేహను చెడు మాటలతో ఇలా నిందించింది.

**ద్విజపత్న్యువాచ –** ద్విజపత్ని పలికింది.

**అపుత్రిణి! కథం గర్వం కురుషే పుత్రిణీ హ్యహమ్ ।**
**మద్ధనం భోక్ష్యతే పుత్రో ధనం తే కశ్చ భోక్ష్యతే ॥ 18 ॥**

“సంతానం లేనిదానా! నీకెందుకు గర్వం? నాకు పుత్రుడున్నాడు. నా ధనాన్ని నా పుత్రుడనుభవిస్తాడు. నీ ధనాన్నెవరు అనుభవిస్తారు?

**నూనం హరిష్యతే రాజా త్వద్ధనం నాత్ర సంశయః ।**
**ధిగ్ధిక్త్వాం తే ధనం ధిక్చ ధిక్తే మానం హి వంధ్యకే! ॥ 19 ॥**

నీ ధనాన్ని నిశ్చయంగా రాజు తీసుకుంటాడనడంలో సందేహం లేదు. నీకనేక పర్యాయాలు నిందయగు గాక! ఓసీ సంతాన హీనురాలా! నీ ధనం, నీ గర్వం నిందింపబడుతుంది”.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**భర్త్సితా తాభిరితి సా గృహమాగత్య దుఃఖితా ।**
**స్వామినే కథయామాస తదుక్తం సర్వమాదరాత్ ॥ 20 ॥**

సుదేహను వారిట్లు నిందించగా ఆమె దుఃఖితురాలై ఇంటికి వచ్చి వారి మాటలను యథాతథంగా భర్తకు వివరించి చెప్పింది.

**బ్రాహ్మణోఽపి తదా దుఃఖం న చకార సుబుద్ధిమాన్ ।**
**కథితం కథ్యతామేవ యద్భావి తద్భవేత్ప్రియే! ॥ 21 ॥**

మహాబుద్ధిమంతుడైన ఆ బ్రాహ్మణుడు ఆ సమయంలో కూడా దుఃఖం పొందలేదు. "వారికి తోచినట్లు వారు పలుకుతారు. ఓ ప్రియురాలా! ఏది జరగవలసియుంటే అది జరుగుతుంది".

**ఇత్యేవం చ తదా తేన హ్యాశ్వస్తాపి పునః పునః ।**
**న తదా సాఽత్యజద్దుఃఖం హ్యాగ్రహం కృతవత్యసౌ ॥ 22 ॥**

ఇట్లు పలికి ఆయన ఆమెను పలుమార్లు ఓదార్చిననూ, ఆమె దుఃఖం విడిచిపెట్టలేదు. పైగా ఆమె పట్టు–బట్టడం మొదలుపెట్టింది.

**సుదేహోవాచ –** సుదేహ పలికింది.

**యథా తథా త్వయా పుత్రః సముత్పాద్యః ప్రియోఽసి మే ।**
**త్యక్ష్యామి హ్యన్యథాఽహం చ దేహం దేహభృతాంవర! ॥ 23 ॥**

"దేహధారులలో శ్రేష్ఠుడైనవాడా! నీవెట్లైనా పుత్రసంతానం పొంది తీరాలి. నీవు నాకు ప్రియమైనవాడవు. అట్లుగానిచో నేను ప్రాణాలు విడిచిపెట్టేస్తాను."

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఏవముక్తం తయా శ్రుత్వా సుధర్మా బ్రాహ్మణోత్తమః ।**
**శివం సస్మార మనసా తదాగ్రహనిపీడితః ॥ 24 ॥**

ఆమె పలుకులు విని బ్రాహ్మణోత్తముడైన సుధర్ముడు ఆమె పట్టుదలకు దుఃఖించి, మనస్సులో శివుని స్మరించాడు.

**అగ్నేరగ్రేఽక్షిపత్పుష్పద్వయం విప్రో హ్యతంద్రితః ।**
**మనసా దక్షిణం పుష్పం తం మేనే పుత్రకామదమ్ ॥ 25 ॥**

సోమరితనమెరుగని బ్రాహ్మణుడు రెండు పుష్పాలు అగ్నియెదుట నుంచి, కుడివైపున నున్న పుష్పం పుత్ర–సంతానాన్ని సూచిస్తుందని మనస్సులో భావన చేశాడు.

**ఏవం కృత్వా పణం పత్నీమువాచ బ్రాహ్మణస్స చ ।**
**అనయోర్గ్రాహ్యమేకం తే పుష్పం పుత్రఫలాప్తయే ॥ 26 ॥**

ఈ విధంగా ప్రతిజ్ఞ చేసుకొని బ్రాహ్మణుడు భార్యతో ఇలా పలికాడు. "పుత్రసంతానం పొందడానికి ఈ రెండు పుష్పాలలో ఒకదానిని తీయుము".

**తయా చ మనసా ధృత్వా పుత్రశ్చైవ భవేన్మమ ।**
**తదా చ స్వామినా యచ్చ ధ్రుతం పుష్పం సమేతు మామ్ ॥ 27 ॥**

"నాకు పుత్రుడు కలుగు గాక! నా భర్త ఏ పుష్పాన్ని, ఫలాన్ని నిర్దేశించాడో, ఆ పుష్పం నా చేతికి వచ్చు గాక!"

**ఇత్యుక్త్వా చ తయా తత్ర నమస్కృత్య శివం తదా ।**
**నత్వా చాగ్నిం పునః ప్రార్థ్య గృహీతం పుష్పమేకకమ్ ॥ 28 ॥**

అని ఆమె మనస్సులో భావించి శివునకు అగ్నికి నమస్కరించి ప్రార్థించి ఒక పుష్పాన్ని తీసింది.

**స్వామినా చింతితం యచ్చ తద్గృహీతం తయా నహి ।**
**సుదేహయా విమోహేన శివేచ్ఛాసంభవేన వై ॥ 29 ॥**

శివేచ్ఛచే ఉదయించిన వ్యామోహంచే సుదేహ మాత్రం తన భర్తచే ఏ పుష్పం భావన చేయబడిందో, ఆమె దానిని తీయలేదు.

**తద్దృష్ట్వా పురుషశ్చైవ నిశ్వాసం పర్యమోచయత్ ।**
**స్మృత్వా శివపదాంభోజమువాచ నిజకామినీమ్ ॥ 30 ॥**

ఆమె తీసిన పుష్పాన్ని చూచి ఆ భర్త నిట్టూర్పు విడిచాడు. అతడు శివుని పాదపద్మాలను స్మరించి తన భార్యతో ఇట్లు పలికాడు.

**సుధర్మోవాచ -** సుధర్ముడు పలికాడు.

**నిర్మితం చేశ్వరేణైవ కథం చైవాన్యథా భవేత్ ।**
**ఆశాం త్యజ ప్రియే! త్వం చ పరిచర్యాం కురు ప్రభోః ॥ 31 ॥**

ఈశ్వరునిచే నిర్ణయింపబడిన దానికి భిన్నంగా ఎట్లు జరుగుతుంది? ఓ ప్రియురాలా! నీవు పుత్రుడు కావాలనే ఆశ వదలి శివప్రభుని సేవించు.

**ఇత్యుక్త్వా తు స్వయం విప్ర! ఆశాం పరివిహాయ చ ।**
**ధర్మకార్యరతస్సోఽభూచ్ఛంకరధ్యానతత్పరః ॥ 32 ॥**

ఇట్లు పలికి ఆ బ్రాహ్మణుడు కూడా ఆశ పూర్తిగా వదలి శంకరుని ధ్యానించడంలోను, ధర్మకార్యాచరణలోను నిమగ్నుడయ్యాడు.

**సా సుదేహాఽఽగ్రహం నైవ ముమోచాత్మజకామ్యయా ।**
**ప్రత్యువాచ పతిం ప్రేమ్ణా సాంజలిర్నతమస్తకా ॥ 33 ॥**

సుదేహ మాత్రం తన పట్టుదలను, కోపాన్ని విడిచిపెట్టలేదు. పుత్రుని పొందాలనే కోరికతో ఆమె చేతులు జోడించి తలవంచి నమస్కరించి భర్తతో ప్రేమపూర్వకంగా ఇట్లు పలికింది.

**సుదేహోవాచ** – సుదేహ పలికింది.

**మయి పుత్రో న చాస్త్వన్యా పత్నీం కురు మదాజ్ఞయా ।**
**తస్యాం నూనం సుతశ్చైవ భవిష్యతి న సంశయః ॥ 34 ॥**

'నాకు పుత్రుడు కలగనిచో అట్లేకానిమ్ము. కాని పునర్వివాహానికి నీకనుమతినిస్తున్నాను. కాబట్టి నీవు మరల వివాహమాడినచో ఆ భార్య యందు నిశ్చయంగా పుత్రసంతానం కలుగుతుంది. ఇది నిస్సంశయం.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**తదైవ ప్రార్థితో వై స బ్రాహ్మణః శైవసత్తమః ।**
**ఉవాచ స్వప్రియాం తాం చ సుదేహాం ధర్మతత్పరః ॥ 35 ॥**

ఆమె ఆ విధంగా కోరగా శివభక్తాగ్రగణ్యుడు, ధర్మతత్పరుడునైన ఆ బ్రాహ్మణుడు తన భార్యయైన సుదేహతో ఇట్లన్నాడు.

**సుధర్మోవాచ** – సుధర్ముడు పలికాడు.

**త్వదీయం చ మదీయం చ సర్వం దుఃఖం గతం ధ్రువమ్ ।**
**తస్మాత్త్వం ధర్మవిఘ్నం చ ప్రియే! మా కురు సాంప్రతమ్ ॥ 36 ॥**

'ఓ ప్రియా! నీ దుఃఖం, నా దుఃఖం, సమస్త దుఃఖాలు తొలగిపోయాయి. ఇది నిశ్చయం. కాబట్టి నీవు ధర్మానికి విఘ్నం కలిగించవద్దు'.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఇత్యేవం వారితా సా చ స్వమాతుః పుత్రికాం తదా ।**
**గృహమానీయ భర్తారం వృణు త్వేనామిదం జగౌ ॥ 37 ॥**

ఆయన ఈ విధంగా వారించినప్పటికినీ, ఆమె తన చెల్లిని ఇంటికి తెచ్చి, ఆమెను వివాహమాడమని భర్తతో చెప్పింది. (చెల్లెలు అనే అర్థంలో 'స్వమాతుః పుత్రికా' అనే ప్రయోగం విలక్షణమైనది)

**సుధర్మోవాచ** – సుధర్ముడు పలికాడు.

**ఇదానీం వదసి త్వం చ మత్ప్రియేయం తతః పునః ।**
**పుత్రసూశ్చ యదా స్యాద్వై తదా స్పర్ధాం కరిష్యసి ॥ 38 ॥**

ఈమె నాకు ప్రియమైన భార్య కాగలదని నీ విప్పుడు చెబుతున్నావు. కాని ఈమె పుత్రుని పొందిన పిదప నీవీమెతో వైరం చేస్తావు.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఇత్యుక్త్వా తేన పతినా సా సుదేహా చ తత్ప్రియా ।**
**పునః ప్రాహ కరౌ బద్ధ్వా సుధర్మాణం పతిం ద్విజాః ॥ 39 ॥**

**(నాహం స్పర్ధాం భగిన్యా వై కరిష్యే ద్విజసత్తమ! ।**
**ఉపయచ్ఛస్వ పుత్రార్థమిమామాజ్ఞాపయామి చ ॥)**

ఆమె భర్త ఇట్లు పలుకగా, ఆ బ్రాహ్మణపత్నియైన సుదేహ భర్తయైన సుధర్మునకు చేతులు జోడించి నమస్కరించి, మరల ఇలా పలికింది. 'ఓ బ్రాహ్మణోత్తమా! నా సోదరితో నేను విరోధం పొందను. పుత్రసంతానం-కొఱకు నీవీమెను వివాహమాడు. నేను ఈమెను ఆజ్ఞాపిస్తాను'.

**ఇత్యేవం ప్రార్థితస్సోఽపి సుధర్మా ప్రియయా తయా ।**
**ఘుశ్మాం తాం సముపాయంస్త వివాహవిధినా ద్విజః ॥ 40 ॥**

తన భార్య ఇట్లు పలుకగా సుధర్ముడు 'ఘుశ్మ' అనే ఆ యువతిని యథావిధిగా వివాహమాడాడు.

**తతస్తాం పరిణీయాథ ప్రార్థయామాస తాం ద్విజః ।**
**త్వదీయేయం కనిష్ఠా హి సదా పోష్యాఽనఘే! ప్రియే! ॥ 41 ॥**

ఆమెను వివాహమాడిన తరువాత ఆ బ్రాహ్మణుడు సుదేహతో "ఓ ప్రియురాలా! పాపమెరుగనిదానా! ఈమె నీకు చెల్లెలు. నీ వ్యక్తి. కాబట్టి నీవీమెను సర్వదా చక్కగా పోషింపుము" అని ప్రార్థించాడు.

**ఉక్త్వైవ స చ ధర్మాత్మా సుధర్మా శైవసత్తమః ।**
**యథాయోగ్యం చకారాశు ధర్మ సంగ్రహమాత్మనః ॥ 42 ॥**

ధర్మాత్ముడు, శివభక్తాగ్రగణ్యుడునైన సుధర్ముడు ఈ విధముగ సుదేహకుచెప్పి తన ధర్మాన్ని తాను యథా-యోగ్యంగా కొనసాగించాడు.

**సా చాపి మాతృపుత్రీం తాం దాసీవత్పర్యవర్తత ।**
**పరిత్యజ్య విరోధం హి పుపోషాహర్నిశం ప్రియా ॥ 43 ॥**

సుదేహ చెల్లియగు ఘుశ్మకు కూడ తన దాసివలె సేవచేసి విరోధాన్ని వీడి రాత్రింబవళ్లు ప్రేమతో పోషించింది.

**కనిష్ఠా చైవ యా పత్నీ స్వస్రనుజ్ఞామవాప్య చ ।**
**పార్థివాన్సా చకారాశు నిత్యమేకోత్తరం శతమ్ ॥ 44 ॥**

**విధానపూర్వకం ఘుశ్మా సోపచారసమన్వితమ్ ।**
**కృత్వా తాన్ ప్రాక్షిపత్తత్ర తడాగే నికటస్థితే ॥ 45 ॥**

చిన్న భార్యయగు ఘుశ్మ అక్కగారి అనుమతిని పొంది ప్రతినిత్యం నూటఒక్క శివుని పార్థివమూర్తులను చేస్తూ ఉండేది. ఆ మూర్తులనన్నింటిని యథావిధిగా సమస్తోపచారాలతో అర్చించి సమీపంలో నున్న తటాకంలో విసర్జించేది.

**ఏవం నిత్యం చకారాసౌ శివపూజాం స్వకామదామ్ ।**
**విసృజ్య పునరావాహ్య తత్సపర్యావిధానతః ॥ 46 ॥**

ఈ విధంగా ఆమె ప్రతినిత్యం తన కోర్కెలను తీర్చే శివుని యథావిధిగా పూజించి విసర్జించి మరల ఆవాహన చేస్తూ ఉండేది.

**కుర్వంత్యా నిత్యమేవం హి తస్యాశ్శంకరపూజనమ్ ।**
**లక్షసంఖ్యాఽభవత్పూర్ణా సర్వకామఫలప్రదా ॥ 47 ॥**

ఈ విధంగా ఆమె నిత్యం శంకరుని పూజిస్తూ ఉండగా సమస్త కోరికలను తీర్చే లక్షసంఖ్యాత్మకమైన శివపూజ పూర్తి అయ్యింది.

**కృపయా శంకరస్యైవ తస్యాః పుత్రో వ్యజాయత ।**
**సుందరస్సుభగశ్చైవ కల్యాణగుణభాజనమ్ ॥ 48 ॥**

శంకరుని అనుగ్రహంచే ఆమెకు సుందరుడు, భాగ్యవంతుడు, కల్యాణగుణసంపన్నుడునగు పుత్రుడు జన్మించాడు.

**తం దృష్ట్వా పరమప్రీతః స విప్రో ధర్మవిత్తమః ।**
**అనాసక్తస్సుఖం భేజే జ్ఞానధర్మపరాయణః ॥ 49 ॥**

ధర్మవేత్తయైన ఆ బ్రాహ్మణుడు ఆ బాలుని చూచి పరమానందాన్ని పొందాడు. జ్ఞానంలోను, ధర్మమునందును తత్పరుడైన ఆ సుధర్ముడు అనాసక్తతతో పుత్రసుఖాన్ని అనుభవిస్తున్నాడు.

**సుదేహా తావదస్యాస్తు స్పర్ధాముగ్రాం చకార సా ।**
**ప్రథమం శీతలం తస్యా హృదయం హ్యసివత్పునః ॥ 50 ॥**

సుదేహ మాత్రం అంతట ఘుశ్మపై తీవ్రమైన ద్వేషాన్ని ప్రదర్శించింది. ముందు శీతలంగా నున్న ఆమె హృదయం ఇప్పుడు కత్తి వలె మారిపోయింది.

**తతః పరం చ యజ్జాతం కుత్సితం కర్మ దుఃఖదమ్ ।**
**సావధానేన మనసా శ్రూయతాం తన్మునీశ్వరాః! ॥ 51 ॥**

"ఓ మునీశ్వరులారా! తరువాత జరిగిన దుఃఖదాయకమైన కుత్సితకర్మను గూర్చి సావధానమనస్కులై వినండి".

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం ఘుశ్మేశ్వరమాహాత్మ్యే సుదేహాసుధర్మాచరిత-వర్ణనం నామ ద్వాత్రింశోఽధ్యాయః ॥ 32 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు ఘుశ్మేశ్వరమాహాత్మ్యంలో సుదేహాసుధర్మాచరిత్రవర్ణనం అనే పేరుగల ముప్పైరెండవ అధ్యాయం సమాప్తం.

## త్రయస్త్రింశోఽధ్యాయః - ముప్పైమూడవ అధ్యాయం

## ఘుశ్మేశజ్యోతిర్లింగోత్పత్తిమాహాత్మ్యవర్ణనమ్ - ఘుశ్మేశజ్యోతిర్లింగోత్పత్తిమాహాత్మ్యవర్ణనం

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**పుత్రం దృష్ట్వా కనిష్ఠాయా జ్యేష్ఠా దుఃఖముపాగతా ।**
**విరోధం సా చకారాశు న సహంతీ చ తత్సుఖమ్ ॥ 1 ॥**

చిన్న భార్యయొక్క పుత్రుని, ఆమె అనుభవిస్తున్న సుఖాన్ని చూచి సహించలేక పెద్ద భార్య దుఃఖాన్ని పొంది శీఘ్రమే విరోధించడం మొదలుపెట్టింది.

**సర్వే పుత్రప్రసూతిం తాం ప్రశశంసుర్నిరంతరమ్ ।**
**తయా తత్సహ్యతే న స్మ శిశో రూపాదికం తథా ॥ 2 ॥**

అందరు పుత్రుని ప్రసవించిన చిన్న భార్యను నిరంతరంగా ప్రశంసించడం, ఆ శిశువుయొక్క రూపము, మున్నగు వాటిని ఆమె సహించలేక పోయింది.

**సుప్రియం తనయం తం చ పిత్రోస్సద్గుణభాజనమ్ ।**
**దృష్ట్వాఽభవత్తదా తస్యా హృదయం తప్తమగ్నివత్ ॥ 3 ॥**

తల్లిదండ్రులకు మిక్కిలి ప్రీతి పాత్రుడైనవాడు, సద్గుణనిధియునగు బాలకుని చూచి సుదేహాయొక్క హృదయం అగ్ని వలె మండజొచ్చింది.

**ఏతస్మిన్నంతరే విప్రాః కన్యాం దాతుం సమాగతాః ।**
**వివాహం తస్య తత్రైవ చకార విధివచ్చ సః ॥ 4 ॥**

ఇంతలో బ్రాహ్మణులు తమ కన్యను ఆ కుమారునకివ్వడానికి ముందుకు వచ్చారు. సుధర్ముడతని వివాహాన్ని అచ్చటనే యథావిధిగా చేశాడు.

**సుధర్మా ఘుశ్మయా సార్ధమానందం పరమం గతః ।**
**సర్వే సంబంధినస్తస్యాం ఘుశ్మాయాం మానమాదధుః ॥ 5 ॥**

సుధర్ముడు ఘుశ్మతో గూడి పరమానందం పొందాడు. బంధువులందరు ఘుశ్మను పెద్దగా గౌరవంగా చూశారు.

**తం దృష్ట్వా సా సుదేహా హి మనసి జ్వలితా తదా ।**
**అత్యంతం దుఃఖమాపన్నా హా! హతాస్మీతి వాదినీ ॥ 6 ॥**

దానిని చూచి సుదేహా మనస్సు మండిపోగా, అప్పుడామె మహాదుఃఖాన్ని పొంది “అయ్యో! నేను హతురాలనయ్యాను” అని భావించింది.

**సుధర్మా గృహమాగత్య వధూం పుత్రం వివాహితమ్ ।**
**ఉత్సాహం దర్శయామాస ప్రియాభ్యాం హర్షయన్నివ ॥ 7 ॥**

సుధర్ముడింటికి వచ్చినప్పుడు వివాహితుడైన కుమారుని, కోడలిని తన యిద్దరి భార్యలను సంతోషపెట్టుచున్నాడా అన్నట్లు ఉత్సాహాన్ని చూపుతున్నాడు.

**అభవద్ధర్షితా ఘుశ్మా సుదేహా దుఃఖమాగతా ।**
**న సహంతీ సుఖం తచ్చ దుఃఖం కృత్వాఽపతద్భువి ॥ 8 ॥**

ఘుశ్మ ఆనందాన్ని పొందుచుండగా, ఆమె సుఖాన్ని చూచి సహించలేని సుదేహ దుఃఖితురాలై ఆ దుఃఖప్రభావంచే నేలపై దొర్లుతుండేది.

**ఘుశ్మాఽవదద్వధూపుత్రౌ త్వదీయౌ న మదీయకౌ ।**
**వధూః పుత్రశ్చ తాం ప్రీత్యా ప్రసూం శ్వశ్రూమమన్యత ॥ 9 ॥**

ఈ కొడుకు మరియు కోడలు నీవారే గాని, నావారు కాదని ఘుశ్మ చెప్పింది. ఆ పుత్రుడు సుదేహను తల్లి–గాను, కోడలు ఆమెనే అత్తగాను భావించి ఆదరించారు.

**భర్తా ప్రియాం తాం జ్యేష్ఠాం చ మేనే నైవ కనిష్ఠికామ్ ।**
**తథాపి సా తదా జ్యేష్ఠా స్వాంతర్మలవతీ హ్యభూత్ ॥ 10 ॥**

భర్త కూడ పెద్ద భార్యయే తన ప్రియురాలని భావించాడే గాని, చిన్న భార్యయందు ప్రత్యేకప్రేమను చూపనే లేదు. అయిననూ పెద్ద భార్యయైన సుదేహ అంతఃకరణం మాలిన్యాన్ని పొందింది.

**ఏకస్మిన్దివసే జ్యేష్ఠా సా సుదేహా చ దుఃఖినీ ।**
**హృదయే సంచిచింతేతి దుఃఖశాంతిః కథం భవేత్ ॥ 11 ॥**

ఒకనాడు పెద్ద భార్యయైన సుదేహ దుఃఖితురాలై 'ఈ దుఃఖాన్ని శాంతింపజేసే ఉపాయమేమిటి?' అని మనస్సులో ఆలోచించింది.

**సుదేహోవాచ** – సుదేహ పలికింది.

**మదీయో హృదయాగ్నిశ్చ ఘుశ్మానేత్రజలేన వై ।**
**భవిష్యతి ధ్రువం శాంతో నాన్యథా దుఃఖజేన హి ॥ 12 ॥**

దుఃఖంచే ఘుశ్మయొక్క నేత్రాలనుండి స్రవించే నీటితో తప్ప నా హృదయంలోని మంట మరియొక విధంగా శాంతింపదు. ఇది నిశ్చయం.

**అతోఽహం మారయామ్యద్య తత్పుత్రం ప్రియవాదినమ్ ।**
**అగ్రే భావి భవేదేవం నిశ్చయః పరమో మమ ॥ 13 ॥**

కావున ప్రియవచనాలు గల ఆ పుత్రుని ఈ రోజే సంహరిస్తాను. ఆపైన ఏది జరగాలో అదే జరుగుతుంది. ఇది నా దృఢనిశ్చయం.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**కదర్యాణాం విచారశ్చ కృత్యాకృత్యే భవేన్న హి ।**
**కఠోరః ప్రాయశో విప్రాః సాపత్నో భావ ఆత్మహా ॥ 14 ॥**

దుష్టులకు కృత్యాకృత్యాల ఆలోచన ఉండదు. ఓ బ్రాహ్మణులారా! ఈ సవతుల మధ్య ఉండే కఠోరవివాదం ఆత్మనాశనానికి దారి తీస్తుంది.

**ఏకస్మిన్దివసే జ్యేష్ఠా సుప్తం పుత్రం వధూయుతమ్ ।**
**చిచ్ఛేద నిశి చాంగేషు గృహీత్వా ఛురికాం చ సా ॥ 15 ॥**

ఒకానొక రోజున పెద్ద భార్య కత్తిని తీసుకొని భార్యతో సహా నిద్రిస్తున్న పుత్రుని అవయవాలను నరికింది.

**సర్వాంగం ఖండయామాస రాత్రౌ ఘుశ్మాసుతస్య సా ।**
**నీత్వా సరసి తత్రైవాక్షిపద్ధృష్టా మహాబలా ॥ 16 ॥**

ఆమె ఘుశ్మ కుమారుని శరీరంలోని అవయవాలనన్నింటిని ముక్కలు ముక్కలుగా నరికి, ఆ రాత్రి సమయంలో సరస్సు దగ్గరకు తీసుకొని వెళ్లి దానిలో పారవేసింది.

**యత్ర క్షిప్తాని లింగాని ఘుశ్మయా నిత్యమేవ హి ।**
**తత్ర క్షిప్త్వా సమాయాతా సుష్వాప సుఖమాగతా ॥ 17 ॥**

ఎక్కడ ఘుశ్మ నిత్యమూ లింగాలు విడిచిపెట్టేదో అదే స్థానంలో పారవేసి, తిరిగి వచ్చి సుఖంగా నిద్రించింది.

**ప్రాతశ్చైవ సముత్థాయ ఘుశ్మా నిత్యం తథాఽకరోత్ ।**
**సుధర్మా చ స్వయం శ్రేష్ఠో నిత్యకర్మ సమాచరత్ ॥ 18 ॥**

ఘుశ్మ ఉదయమే లేచి నిత్యకర్మలు యథావిధిగా చేసింది. శ్రేష్ఠుడైన సుధర్ముడు కూడ స్వయంగా నిత్యకర్మనాచరించాడు.

**ఏతస్మిన్నంతరే సా చ జ్యేష్ఠా కార్యం గృహస్య వై ।**
**చకారానందసంయుక్తా సుశాంతహృదయానలా ॥ 19 ॥**

ఇంతలో ఆ పెద్ద భార్య మనసులోని మంట పూర్తిగా చల్లారడంచేత ఆనందంతో కూడినదై గృహకృత్యాల-నన్నింటిని ప్రశాంతహృదయంతో చేస్తోంది.

**ప్రాతఃకాలే సముత్థాయ వధూశ్శయ్యాం విలోక్య సా ।**
**రుధిరార్ద్రాం దేహఖండైర్యుక్తాం దుఃఖముపాగతా ॥ 20 ॥**

కోడలు ఉదయమే లేచి, రక్తంతోను, శరీరావయవాల ముక్కలతోను కూడియున్న శయ్యను చూచి దుఃఖాన్ని పొందింది.

**శ్వశ్రూం నివేదయామాస పుత్రస్తే చ కుతో గతః ।**
**శయ్యా చ రుధిరార్ద్రా వై దృశ్యంతే దేహఖండకాః ॥ 21 ॥**

ఆమె అత్తగారికి ఇలా విన్నవించింది. "నీ కుమారుడెక్కడకు వెళ్లాడు? శయ్య రక్తంతో తడిసియుంది. శరీరావయవాల ముక్కలు కూడా కనబడ్డాయి".

**హా!హతాఽస్మి కృతం కేన దుష్టం కర్మ శుచివ్రతే! ।**
**ఇత్యుచ్చార్య రురోదాతి వివిధం తత్ప్రియా చ సా ॥ 22 ॥**

"అయ్యో! హతురాలనయ్యాను. ఓ పవిత్రురాలా! ఈ దుష్టకర్మనెవరు చేశారు?" అని పలికి కోడలు పరిపరివిధాలుగా, బిగ్గరగా ఏడ్చింది.

**జ్యేష్ఠా దుఃఖం తదాపన్నా హా! హతాఽస్మి కిలేతి చ ।**
**బహిర్దుఃఖం చకారాసౌ మనసా హర్షసంయుతా ॥ 23 ॥**

పెద్ద భార్యకు మనస్సులో ఆనందం నిండినప్పటికీ, కోడలు దుఃఖించడం చూచి, "అయ్యో! హతురాలనయ్యాను" అంటూ బయటకు దుఃఖాన్ని ప్రకటించింది.

**ఘుశ్మా చాపి తదా తస్యా వధ్వా దుఃఖం నిశమ్య సా ।**
**న చచాల వ్రతాత్తస్మాన్నిత్యపార్థివపూజనాత్ ॥ 24 ॥**

ఆ సమయంలో నిత్యపార్థివలింగపూజ చేస్తున్న ఘుశ్మ, తన కోడలి దుఃఖాన్ని వినినప్పటికీ ఆమె తన వ్రతంనుండి మాత్రం చలించలేదు.

**మనశ్చైవోత్సుకం నైవ జాతం తస్యా మనాగపి ।**
**భర్తాపి చ తథైవాసీద్యావద్వ్రతవిధిర్భవేత్ ॥ 25 ॥**

ఆమె మనస్సులో కొంచెమైనా ఆదుర్దా కలుగలేదు. ఆమె భర్త కూడ వ్రతవిధి పూర్తి అయ్యేవరకు అట్లే ఉన్నాడు.

**మధ్యాహ్నే పూజనాంతే చ దృష్ట్వా శయ్యాం భయావహామ్ ।**
**తథాపి న తదా కించిత్కృతం దుఃఖం హి ఘుశ్మయా ॥ 26 ॥**

మధ్యాహ్నపూజ పూర్తియైన తరువాత భయావహమైన శయ్యను చూచి కూడ, ఘుశ్మ కొంచెమైనా దుఃఖాన్ని పొందలేదు.

**యేనైవ చార్పితశ్చాయం స వై రక్షాం కరిష్యతి ।**
**భక్తప్రియస్స విఖ్యాతః కాలకాలస్సతాం గతిః ॥ 27 ॥**

"ఈ కుమారుని ఇచ్చినవాడే, వానిని రక్షిస్తాడు. ఆ శివుడు భక్తప్రియుడనియు, మృత్యువునకు మృత్యువనియు, సతాంగతియనియు ప్రఖ్యాతి పొందియున్నాడు.

**యది నో రక్షితా శంభురీశ్వరః ప్రభురేకః ।**
**మాలాకార ఇవాసౌ యాన్ యుంక్తే తాన్ వియునక్తి చ ॥ 28 ॥**

శంభువు, ఈశ్వరుడు, ఏకైకప్రభువనగు శంభువు కూడా రక్షింపకున్నచో, ఆయన మాలాకారుని వంటివాడు. ఆయన ఎవరిని కలుపుతాడో! వారినే, విడదీస్తాడు.

**అద్య మే చింతయా కిం స్యాదితి తత్త్వం విచార్య సా ।**
**న చకార తదా దుఃఖం శివే ధైర్యం సమాగతా ॥ 29 ॥**

ఈ విషయంలో నేను చింతించి ప్రయోజనమేమున్నది?" ఈ విధంగా ధైర్యంగా తత్త్వాన్ని విచారించి శివునియందు గల ధైర్యంతో ఆమె అప్పుడు దుఃఖాన్ని పొందలేదు.

**పార్థివాంశ్చ గృహీత్వా సా పూర్వవత్ స్వస్థమానసా ।**
**శంభోర్నామాన్యుచ్చరంతీ జగామ సరసస్తటే ॥ 30 ॥**

ఆమె ఎప్పటి వలెనే పార్థివలింగాలను తీసుకొని, శంభుని నామాలను జపిస్తూ స్వస్థమానసురాలై సరస్సు ఒడ్డునకు వెళ్లింది.

**క్షిప్త్వా చ పార్థివాంస్తత్ర పరావర్తత సా యదా ।**
**తదా పుత్రస్తడాగస్థో దృశ్యతే స్మ తటే తయా ॥ 31 ॥**

ఆమె ఆ సరస్సులో పార్థివలింగాలను నిమజ్జనం చేసి వెనుకకు మరలునంతలో గట్టుమీద నున్న ఆమెకు, తన కుమారుడు సరస్సులో కనబడ్డాడు.

**పుత్ర ఉవాచ –** పుత్రుడు పలికాడు.

**మాతరేహి మిలిష్యామి మృతోఽహం జీవితోఽధునా ।**
**తవ పుణ్యప్రభావాద్ధి కృపయా శంకరస్య వై ॥ 32 ॥**

'ఓ అమ్మా! ఇటు రమ్ము. నేను నిన్ను కలుస్తాను. మరణించిన నేను నీ పుణ్యప్రభావంచేతను, శంకరుని దయచేతను మరలా బ్రతికాను.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**జీవితం తం సుతం దృష్ట్వా ఘుశ్మా సా తత్రసూర్ద్విజాః! ।**
**ప్రహృష్టా నాభవత్తత్ర దుఃఖితా న యథా పురా ॥ 33 ॥**

ఓ బ్రాహ్మణులారా! ఆ కుమారుని తల్లియైన ఘుశ్మ, జీవించి వచ్చిన తన పుత్రుని చూచి, అత్యంత హర్షాన్ని పొందలేదు. పూర్వమతడు మరణించినప్పుడు కూడ ఆమె అత్యంతదుఃఖాన్ని పొందలేదు.

**ఏతస్మిన్సమయే తత్ర స్వావిరాసీచ్ఛివో ద్రుతమ్ ।**
**జ్యోతీరూపో మహేశశ్చ సంతుష్టః ప్రత్యువాచ హ ॥ 34 ॥**

అదే సమయంలో మంగళకరుడైన మహేశ్వరుడు జ్యోతిర్లింగరూపంలో అక్కడ స్వయంగా ఆవిర్భవించి, వెంటనే సంతోషంతో ఇట్లన్నాడు.

**శివ ఉవాచ –** శివుడు పలికాడు.

**ప్రసన్నోఽస్మి వరం బ్రూహి దుష్టయా మారితో హ్యయమ్ ।**
**ఏనాం చ మారయిష్యామి త్రిశూలేన వరాననే! ॥ 35 ॥**

ఓ సుందరీ! నేను ప్రసన్నుడనయ్యాను. వరాన్ని కోరుకో. ఈ నీ కుమారుని చంపిన ఆ దుష్టురాలిని త్రిశూలంతో సంహరిస్తాను.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఘుశ్మా తదా వరం వవ్రే సుప్రణమ్య శివం నతా ।**
**రక్షణీయా త్వయా నాథ! సుదేహేయం స్వసా మమ ॥ 36 ॥**

అప్పుడు ఘుశ్మ శివునకు పవిత్రాంతఃకరణతో నమస్కరించి వరాన్ని ఇలా కోరింది "ఓ నాథా! నా అక్కయైన ఈ సుదేహను నీవు రక్షింపుము".

**శివ ఉవాచ –** శివుడు పలికాడు.

**అపకారః కృతస్తస్యాముపకారః కథం త్వయా ।**
**క్రియతే హననీయా చ సుదేహా దుష్టకారిణీ ॥ 37 ॥**

అపకారం చేసిన ఆమెకు నీవు ఉపకారం ఎలా చేస్తున్నావు? పాపకృత్యం చేసిన ఈ సుదేహ సంహరింపదగినది.

**ఘుశ్మోవాచ –** ఘుశ్మ పలికింది.

**తవ దర్శనమాత్రేణ పాతకం నైవ తిష్ఠతి ।**
**ఇదానీం త్వాం చ వై దృష్ట్వా తత్పాపం భస్మతాం వ్రజేత్ ॥ 38 ॥**

నిన్ను దర్శించినంతమాత్రంచేతనే పాపం మిగిలియుండదు. అటువంటప్పుడు ఈమె నిన్ను చూడడం తోనే ఆమె పాపాలన్నియు భస్మమౌతాయి.

**అపకారేషు యశ్చైవ హ్యుపకారం కరోతి చ ।**
**తస్య దర్శనమాత్రేణ పాపం దూరతరం వ్రజేత్ ॥ 39 ॥**

అపకారం చేసిన వారికి ఉపకారం చేసేవాడిని దర్శించడం తోడనే పాపాలన్నీ సుదూరంగా తొలగిపోతాయి.

**ఇతి శ్రుతం మయా దేవ! భగవద్వాక్యమద్భుతమ్ ।**
**తస్మాచ్చైవం కృతం యేన క్రియతాం చ సదాశివ! ॥ 40 ॥**

ఓ దేవా! అద్భుతమైన ఈ భగవానుని ఉత్తమమైన వాక్యాన్ని వినియున్నాను. కాబట్టి ఈ విధంగా చేయడమే ఉత్తమం. ఓ సదాశివా! కాబట్టి నీవటులనే చేయుము.

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**ఇత్యుక్తస్తు తయా తత్ర ప్రసన్నోఽత్యభవత్పునః ।**
**మహేశ్వరః కృపాసింధుః సమూచే భక్తవత్సలః ॥ 41 ॥**

ఆమె అట్లు పలుకగా అప్పుడు దయాసాగరుడు, భక్తవత్సలుడునైన మహేశ్వరుడు మిక్కిలి ప్రసన్నుడై మరల ఇట్లు పలికాడు.

**శివ ఉవాచ -** శివుడు పలికాడు.

**అన్యద్వరం బ్రూహి ఘుశ్మే! దదామి చ హితం తవ ।**
**త్వద్భక్త్యా సుప్రసన్నోఽస్మి నిర్వికారస్స్వభావతః ॥ 42 ॥**

ఓ ఘుశ్మా! నీవు మరియొక వరాన్ని కోరుకో. నేను నీకు నచ్చిన వరాన్నిస్తాను. నిర్వికారస్వభావంగల నీ భక్తికి చాల ప్రసన్నుడనయ్యాను.

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**సోవాచ తద్వచః శ్రుత్వా యది దేయో వరస్త్వయా ।**
**లోకానాం చైవ రక్షార్థమత్ర స్థేయం మదాఖ్యయా ॥ 43 ॥**

ఆ మాటలు విని ఆమె యిట్లు పలికింది. " నాకు నీవు వరమీయదలచినచో, లోకరక్షణార్థం నీవిచ్చట నా పేరుతో స్థిరంగా నుండుము".

**తదోవాచ శివస్తత్ర సుప్రసన్నో మహేశ్వరః ।**
**స్థాస్యేఽత్ర తవ నామ్నాఽహం ఘుశ్మేశాఖ్యస్సుఖప్రదః ॥ 44 ॥**

అప్పుడు మంగళకరుడు, సుప్రసన్నుడునైన మహేశ్వరుడిట్లు పలికాడు. "నేనిచ్చట నీ పేరుతో ఘుశ్మేశ్వరుడుగా స్థిరంగానుంటాను, సుఖప్రదుడనై యుంటాను".

**ఘుశ్మేశాఖ్యం సుప్రసిద్ధం లింగం మే జాయతాం శుభమ్ ।**
**ఇదం సరస్తు లింగానామాలయం జాయతాం సదా ॥ 45 ॥**

ఘుశ్మేశ్వరుడనే పేరు గల ఈ శివలింగం శుభకరమైనదని మిక్కిలి ప్రసిద్ధి పొందుతుంది. ఈ సరస్సు శివలింగాల నిలయమై వర్ధిల్లుతుంది.

**తస్మాచ్ఛివాలయం నామ ప్రసిద్ధం భువనత్రయే ।**
**సర్వకామప్రదం హ్యేతద్దర్శనాత్ స్యాత్సదా సరః ॥ 46 ॥**

కాబట్టి ఈ సరస్సు సర్వదా ముల్లోకాలలో శివాలయమని ప్రసిద్ధి గాంచి దర్శించే వారి కోరికలనన్నింటిని నెరవేరుస్తుంది.

**తవ వంశే శతం చైకం పురుషావధి సువ్రతే! ।**
**ఈదృశాః పుత్రకాః శ్రేష్ఠా భవిష్యంతి న సంశయః ॥ 47 ॥**

ఓ సువ్రతురాలా! నీ వంశంలో నూట ఒక్కతరాల వరకు ఇటువంటి శ్రేష్ఠులైన పుత్రులు జన్మిస్తారు. ఇందులో సందేహం లేదు.

**సుస్త్రీకాస్సుధనాశ్చైవ స్వాయుష్యాశ్చ విచక్షణాః ।**
**విద్యావంతో హ్యుదారాశ్చ భుక్తిముక్తిఫలాప్తయే ॥ 48 ॥**

వారు చక్కని భార్యలు కలవారై, ధనవంతులై ఆయుష్మంతులై, బుద్ధిమంతులై, విద్యావంతులై, దానగుణముగలవారై భుక్తి, ముక్తులను పొందగలరు.

**శతమేకోత్తరం చైవ భవిష్యంతి గుణాధికాః ।**
**ఈదృశో వంశవిస్తారో భవిష్యతి సుశోభనః ॥ 49 ॥**

నూట ఒక్క తరాల వరకు ఇటువంటి సద్గుణసంపన్నులుదయిస్తారు. సుశోభనమైన ఇట్టి వంశం విస్తరిస్తుంది.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యుక్త్వా చ శివస్తత్ర లింగరూపోఽభవత్తదా ।**
**ఘుశ్మేశో నామ విఖ్యాతః సరశ్చైవ శివాలయమ్ ॥ 50 ॥**

శివుడిట్లు పలికి, అప్పుడచ్చట లింగరూపాన్ని పొంది ఘుశ్మేశ్వరుడనే పేర ప్రఖ్యాతి పొందాడు. ఈ సరస్సు కూడ శివాలయమని పేరు పొందింది.

**సుధర్మా స చ ఘుశ్మా చ సుదేహా చ సమాగతాః ।**
**ప్రదక్షిణం శివస్యాశు శతమేకోత్తరం దధుః ॥ 51 ॥**

సుధర్ముడు, ఘుశ్మ, సుదేహ ఒకరినొకరు కలుసుకొన్నారు. వారు వెంటనే శివునకు నూట ఒక్క ప్రదక్షిణలు చేశారు.

**పూజాం కృత్వా మహేశస్య మిలిత్వా చ పరస్పరమ్ ।**
**హిత్వా చాంతర్మలం తత్ర లేభిరే పరమం సుఖమ్ ॥ 52 ॥**

వారు మహేశ్వరుని పూజించి ఒకరితోనొకరు కలుసుకొని, హృదయాలలో మాలిన్యం లేనివారై పరమసుఖాన్ని పొందారు.

**పుత్రం దృష్ట్వా సుదేహా సా జీవితం లజ్జితాఽభవత్ ।**
**తౌ క్షమాప్యాచరద్విప్రాః! నిజ పాపాపహం వ్రతమ్ ॥ 53 ॥**

జీవించి వచ్చిన పుత్రుని చూచి సుదేహ సిగ్గుపడి క్షమాపణ కోరింది. ఓ బ్రాహ్మణులారా! ఆమె తన పాపాలు పోగొట్టుకోవడానికి వ్రతాన్ని ఆచరించింది.

**ఘుశ్మేశాఖ్యమిదం లింగమిత్థం జాతం మునీశ్వరాః! ।**
**తద్దృష్ట్వా పూజయిత్వా హి సుఖం సంవర్ధతే సదా ॥ 54 ॥**

ఓ మహర్షులారా! ఘుశ్మేశ్వరలింగం ఈ విధంగా ఆవిర్భవించింది. దానిని దర్శించి పూజించేవారలకు సర్వదా సుఖం వర్ధిల్లుతుంది.

**ఇతి వశ్చ సమాఖ్యాతా జ్యోతిర్లింగావలీ మయా ।**
**ద్వాదశప్రమితా సర్వకామదా భుక్తిముక్తిదా ॥ 55 ॥**

నేనీ విధంగా మీకు సర్వకాలాలలో సర్వకామనలను, భుక్తిని, ముక్తిని ప్రసాదించే ద్వాదశ జ్యోతిర్లింగాల ఆవిర్భావక్రమాన్ని చెప్పియున్నాను.

**ఏతజ్జ్యోతిర్లింగకథాం యః పఠేచ్ఛృణుయాదపి ।**
**ముచ్యతే సర్వపాపేభ్యో భుక్తిం ముక్తిం చ విందతి ॥ 56 ॥**

ఏ మానవుడైతే ఈ ద్వాదశ జ్యోతిర్లింగకథ పఠిస్తాడో, వింటాడో, వాడు సకల పాపాలనుండి విముక్తుడై, భుక్తిని, ముక్తిని పొందుతాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం ఘుశ్మేశజ్యోతిర్లింగోత్పత్తిమాహాత్మ్యవర్ణనం నామ త్రయస్త్రింశోఽధ్యాయః ॥ 33 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు ఘుశ్మేశజ్యోతిర్లింగోత్పత్తిమాహాత్మ్యవర్ణనం అనే పేరుగల ముప్పైమూడవ అధ్యాయం సమాప్తం.

## చతుస్త్రింశోఽధ్యాయః – ముప్పైనాల్గవ అధ్యాయం

## విష్ణుసుదర్శనచక్రలాభవర్ణనమ్ – విష్ణువునకు సుద్శనచక్రలాభవర్ణనం

**వ్యాస ఉవాచ** – వ్యాసుడు పలికాడు.

**ఇతి శ్రుత్వా వచస్తస్య సూతస్య చ మునీశ్వరాః ।**
**సమూచుస్తం సుప్రశస్య లోకానాం హితకామ్యయా ॥ 1 ॥**

ఆ మహర్షులు సూతుని వచనాలు విని ఆయనను అధికంగా కొనియాడి, లోకాల హితం కోరి ఇలా పలికారు.

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**సూత! సర్వం విజానాసి తతః పృచ్ఛామహే వయమ్ ।**
**హరీశ్వరస్య లింగస్య మహిమానం వద ప్రభో! ॥ 2 ॥**

ఓ సూతమహర్షీ! నీకు సర్వం తెలుసు. కాబట్టి ప్రశ్నిస్తున్నాము. ఓ ప్రభూ! హరీశ్వరలింగంయొక్క మహిమ గురించి చెప్పండి.

**చక్రం సుదర్శనం ప్రాప్తం విష్ణునేతి శ్రుతం పురా ।**
**తదారాధనతస్తాత! తత్కథా చ విశేషతః ॥ 3 ॥**

ఓ తండ్రీ! పూర్వం విష్ణువు హరీశ్వరుని ఆరాధించి సుదర్శనచక్రాన్ని పొందాడని మేము విన్నాము. ఆ కథ వివరంగా చెప్పండి.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**శ్రూయతాం చ ఋషిశ్రేష్ఠాః! హరీశ్వరకథా శుభా ।**
**యతస్సుదర్శనం లబ్ధం విష్ణునా శంకరాత్పురా ॥ 4 ॥**

ఓ మహర్షులారా! శుభకరమైన హరీశ్వరుని గాథ వినండి. పూర్వం శంకరునినుండి విష్ణువు సుదర్శనాన్ని పొందిన వృత్తాంతాన్ని చెబుతాను.

**కస్మింశ్చిత్సమయే దైత్యాః సంజాతా బలవత్తరాః ।**
**లోకాంస్తే పీడయామాసుర్ధర్మలోపం చ చక్రిరే ॥ 5 ॥**

ఒకానొక సమయంలో రాక్షసులు అధికబలాన్ని పొంది లోకాలను పీడిస్తూ ధర్మానికి హాని కలిగించారు.

**తే దేవాః పీడితా దైత్యైర్మహాబలపరాక్రమైః ।**
**స్వం దుఃఖం కథయామాసుర్విష్ణుం నిర్జరరక్షకమ్ ॥ 6 ॥**

మహాబలపరాక్రమాలు గల రాక్షసులచే పీడింపబడిన దేవతలు తమ దుఃఖాన్ని తమ రక్షకుడైన విష్ణువుతో మొరపెట్టుకున్నారు.

**దేవా ఊచుః** - దేవతలు పలికారు.

**కృపాం కురు ప్రభో! త్వం చ దైత్యైస్సంపీడితా భృశమ్ ।**
**కుత్ర యామశ్చ కిం కుర్మశ్శరణ్యం త్వాం సమాశ్రితాః ॥ 7 ॥**

ఓ ప్రభూ! నీవు దయ చూపుము. రాక్షసులు మమ్ములను అత్యధికంగా పీడిస్తున్నారు. మేమెక్కడికి పోవాలి? ఏమి చేయాలి? శరణుజొచ్చిన వారిని రక్షించే నిన్ను శరణు జొచ్చాము.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఇత్యేవం వచనం శ్రుత్వా దేవానాం దుఃఖితాత్మనామ్ ।**
**స్మృత్వా శివపదాంభోజం విష్ణుర్వచనమబ్రవీత్ ॥ 8 ॥**

దుఃఖంతో నిండిన హృదయం గల దేవతల వచనాలు విని శివుని పాదపద్మాలను స్మరించి విష్ణువు ఇలా పలికాడు.

**విష్ణురువాచ** - విష్ణువు పలికాడు.

**కరిష్యామి చ వః కార్యమారాధ్య గిరిశం సురాః! ।**
**బలిష్ఠాశ్శత్రవో హ్యేతే విజేతవ్యాః ప్రయత్నతః ॥ 9 ॥**

ఓ దేవతలారా! నేను కైలాసపతిని ఆరాధించి మీ పని చేయగలను. ఈ శత్రువులు బలవంతులు. వీరిని ప్రయత్నపూర్వకంగా జయించాలి.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు

**ఇత్యుక్తాస్తే సురాస్సర్వే విష్ణునా ప్రభవిష్ణునా ।**
**మత్వా దైత్యాన్ హతాన్ దుష్టాన్యయుర్ధామ స్వకం స్వకమ్ ॥ 10 ॥**

సర్వసమర్థుడైన విష్ణువిట్లుపలుకగా, దేవతలందరు దుష్టులైన రాక్షసులు సంహరింపబడతారని భావించి తమ తమ నివాసాలకు వెళ్లారు.

**విష్ణురప్యమరాణాం తు జయార్థమభజచ్ఛివమ్ ।**
**సర్వామరాణామధిపం సర్వసాక్షిణమవ్యయమ్ ॥ 11 ॥**

విష్ణువు దేవతలకు జయమును కలిగించాలనే కుతూహలంతో సమస్తదేవతలకు అధిపుడును, సర్వసాక్షియు అవ్యయుడునైన శివుని సేవించాడు.

**గత్వా కైలాసనికటే తపస్తేపే హరిః స్వయమ్ ।**
**కృత్వా కుండం చ సంస్థాప్య జాతవేదసమగ్రతః ॥ 12 ॥**

కైలాసపర్వతము దగ్గరకు వెళ్ళి అగ్నిహోత్రునికి ఎదురుగ కుండమును ఏర్పాటు చేసికొని గొప్ప తపస్సుచేశాడు.

**పార్థివేన విధానేన మంత్రైర్నానావిధైరపి ।**
**స్తోత్రైశ్చైవాప్యనేకైశ్చ గిరిశం చాభజన్ముదా ॥ 13 ॥**

ఆయన పార్థివలింగార్చనావిధానంలో, నానావిధాలైన మంత్రాలతో, అనేక విధాలైన స్తోత్రాలతో ఆనంద–పూర్వకంగా కైలాసనాథుని సేవించాడు.

**కమలైస్సరసో జాతైర్మానసాఖ్యాన్మునీశ్వరాః! ।**
**బద్ధ్వా చైవాసనం తత్ర న చచాల హరిస్స్వయమ్ ॥ 14 ॥**

ఓ మహర్షులారా! ఆయన మానససరోవరంలో పుట్టిన కమలాలతో సేవించాడు. విష్ణువు స్వయంగా ఆసనాన్ని బంధించి అక్కడ నిశ్చలుడై యున్నాడు.

**ప్రసాదావధి చైవాత్ర స్థేయం వై సర్వథా మయా ।**
**ఇత్యేవం నిశ్చయం కృత్వా సమానర్చ శివం హరిః ॥ 15 ॥**

'అనుగ్రహం లభించే వరకు నేనెట్టి పరిస్థితులలోనైననూ ఇక్కడ నుండి కదలకూడదు' అని నిశ్చయించుకొని విష్ణువు శివుని చక్కగా పూజించాడు.

**యదా నైవ హరస్తుష్టో బభూవ హరయే ద్విజాః! ।**
**తదా స భగవాన్విష్ణుర్విచారే తత్పరోఽభవత్ ॥ 16 ॥**

ఓ బ్రాహ్మణులారా! కాని శివుడు విష్ణువునకు ప్రసన్నుడు కాలేదు. అంతట విష్ణుభగవానుడు ఆలోచనలో పడ్డాడు.

**విచార్యైవం స్వమనసి సేవనం బహుధా కృతమ్ ।**
**తథాపి న హరస్తుష్టో బభూవాతికరః ప్రభుః ॥ 17 ॥**

శివుని బహుధా సేవించాడు. అయినప్పటికి లీలాకరుడైన శంకరప్రభువు ప్రసన్నుడుకాలేదని విష్ణువు తన మనసులో విచారించాడు.

**తతస్సువిస్మితో విష్ణుర్భక్త్యా పరమయాన్వితః ।**
**సహస్రైర్నామభిః ప్రీత్యా తుష్టావ పరమేశ్వరమ్ ॥ 18 ॥**

అంతట విష్ణువు మిక్కిలి ఆశ్చర్యచకితుడై, పరమభక్తితో పరమేశ్వరుని ప్రీతిపూర్వకంగా సహస్రనామాలతో స్తుతించాడు.

**ప్రత్యేకం కమలం తస్మై నామ మంత్రముదీర్య చ ।**
**పూజయామాస వై శంభుం శరణాగతవత్సలమ్ ॥ 19 ॥**

విష్ణువు శరణాగతవత్సలుడైన శంకరుని ఒక్కొక్క నామాన్ని పఠిస్తూ, ఒక్కొక్క కమలంతో పూజింపసాగాడు.

**పరీక్షార్థం విష్ణుభక్తేస్తదా వై శంకరేణ హ ।**
**కమలానాం సహస్రాత్తు హృతమేకం చ నీరజమ్ ॥ 20 ॥**

అప్పుడు విష్ణువుయొక్క భక్తిని పరీక్షించడానికి శంకరుడు వేయి కమలాల నుండి ఒక కమలాన్ని అపహరించాడు.

**న జ్ఞాతం విష్ణునా తచ్చ మాయాకారణమద్భుతమ్ ।**
**న్యూనం తచ్చాపి సంజ్ఞాయ తదన్వేషణతత్పరః ॥ 21 ॥**

ఒక కమలం తగ్గడానికి కారణమైన శంకరుని అద్భుతమాయను విష్ణువు తెలుసుకోలేక, కమలం తగ్గిందని భావించి దానికొఱకు వెదకడం మొదలుపెట్టాడు.

**బభ్రామ సకలాం పృథ్వీం తత్ప్రీత్యై సుదృఢవ్రతః ।**
**తదప్రాప్య విశుద్ధాత్మా నేత్రమేకముదాహరత్ ॥ 22 ॥**

శివుని సంతుష్టపరచాలనే దృఢవ్రతం గల విష్ణువు కమలంకొఱకు భూమండలమంతా వెదికాడు. కాని దొరకలేదు. విశుద్ధాత్ముడైన విష్ణువు తన నేత్రం సమర్పించాడు.

**తం దృష్ట్వా స ప్రసన్నోఽభూచ్ఛంకరస్సర్వదుఃఖహా ।**
**ఆవిర్బభూవ తత్రైవ జగాద వచనం హరిమ్ ॥ 23 ॥**

సర్వదుఃఖాలను పోగొట్టే శంకరుడు దానిని చూచి ప్రసన్నుడై వెంటనే అక్కడ ప్రత్యక్షమై విష్ణువుతో ఇట్లన్నాడు.

**శివ ఉవాచ** - శివుడు పలికాడు.

**ప్రసన్నోఽస్మి హరే! తుభ్యం వరం బ్రూహి యథేప్సితమ్ ।**
**మనోఽభిలషితం దద్మి నాదేయం విద్యతే తవ ॥ 24 ॥**

ఓ విష్ణూ! నేను నీ విషయంలో ప్రసన్నుడనయ్యాను. నీవు కోరిన వరాన్నిస్తాను కోరుకో. నీకీయదగని వరం లేదు.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**తచ్ఛ్రుత్వా శంభువచనం కేశవః ప్రీతమానసః ।**
**మహాహర్షసమాపన్నో హ్యబ్రవీత్సాంజలిశ్శివమ్ ॥ 25 ॥**

శంభుని పలుకులను వినిన కేశవుడు సంతసించిన మనస్సు గలవాడై మహానందాన్ని పొంది చేతులు జోడించి శివునితో ఇలా పలికాడు.

**విష్ణురువాచ** – విష్ణువు పలికాడు.

**వాచ్యం కిం మే త్వదగ్రే వై హ్యంతర్యామీ త్వమాస్థితః ।**
**తథాపి కథ్యతే నాథ! తవ శాసనగౌరవాత్ ॥ 26 ॥**

ఓ నాథా! నీయెదుట నేను చెప్పదగినదేముంటుంది? ఎందుకనగా నీవు సర్వాంతర్యామివైయున్నావు. అయినప్పటికి నీ ఆజ్ఞ పై గల గౌరవంచే చెబుతున్నాను.

**దైత్యైశ్చ పీడితం విశ్వం సుఖం నో నస్సదాశివ! ।**
**దైత్యాన్ హంతుం మమ స్వామిన్! స్వాయుధం న ప్రవర్తతే ॥ 27 ॥**

ఓ సదాశివా! జగత్తు రాక్షసులచే పీడింపబడుతోంది. మాకు సుఖం లేకుంది. ఓ స్వామీ! నా ఆయుధం రాక్షసులను సంహరించడానికి సమర్థమైనది కాకున్నది.

**కిం కరోమి క్వ గచ్ఛామి నాన్యో మే రక్షకః పరః ।**
**అతోఽహం పరమేశాన! శరణం త్వాం సమాగతః ॥ 28 ॥**

ఏమి చేయాలి? ఎక్కడకు పోవాలి? నాకు వేరొక రక్షకుడు లేడు. కాబట్టి ఓ పరమేశ్వరా! నేను నిన్ను శరణు వేడుతున్నాను.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఇత్యుక్త్వా చ నమస్కృత్య శివాయ పరమాత్మనే ।**
**స్థితశ్చైవాగ్రతశ్శంభోః స్వయం చ పురుపీడితః ॥ 29 ॥**

మిక్కిలి పీడితుడైన విష్ణువు స్వయంగా ఇట్లు పలికి మంగళకరుడైన శంభునకు నమస్కరించి ఎదుట నిలబడ్డాడు.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఇతి శ్రుత్వా వచో విష్ణోర్దేవదేవో మహేశ్వరః ।**
**దదౌ తస్మై స్వకం చక్రం తేజోరాశిం సుదర్శనమ్ ॥ 30 ॥**

విష్ణువు మాటలు విని దేవదేవుడైన మహేశ్వరుడు తేజోరాశియైన తన సుదర్శనచక్రాన్ని విష్ణువుకిచ్చాడు.

**తత్ప్రాప్య భగవాన్విష్ణుర్దైత్యాంస్తాన్బలవత్తరాన్ ।**
**జఘాన తేన చక్రేణ ద్రుతం సర్వాన్వినా శ్రమమ్ ॥ 31 ॥**

శ్రీమహావిష్ణువు దానిని పొంది, దానితో మహాబలశాలురైన రాక్షసులనందరినీ శీఘ్రంగా, శ్రమలేకుండగా వధించాడు.

**జగత్ స్వాస్థ్యం పరం లేభే బభూవుస్సుఖినస్సురాః ।**
**సుప్రీతః స్వాయుధం ప్రాప్య హరిరాసీన్మహాసుఖీ ॥ 32 ॥**

జగత్తు స్వస్థతను పొందింది. దేవతలందరు సుఖాన్ని పొందారు. చక్కని ఆయుధాన్ని పొంది విష్ణువు మహానందాన్ని, మహాసుఖాన్ని పొందాడు.

**ఋషయ ఊచుః -** ఋషులు పలికారు.

**కిం తన్నామ సహస్రం వై కథయ త్వం హి శాంకరమ్ ।**
**యేన తుష్టో దదౌ చక్రం హరయే స మహేశ్వరః ॥ 33 ॥**

ఏ సహస్రనామస్తోత్రప్రభావంచే మహేశ్వరుడు సంతోషించి విష్ణువునకు సుదర్శనచక్రాన్ని ఇచ్చాడో ఆ శంకరుని సహస్రనామాలు మాకు చెప్పండి.

**తన్మాహాత్మ్యం మమ బ్రూహి శివసంవాదపూర్వకమ్ ।**
**కృపాలుత్వం చ శంభోర్వై విష్ణూపరి యథాతథమ్ ॥ 34 ॥**

దాని మాహాత్మ్యాన్ని, శివ - విష్ణువు సంవాదాన్ని, విష్ణువుపై శంభుని కృపాళుత్వాన్ని, ఉన్నదున్నట్లుగా చెప్పండి.

**వ్యాస ఉవాచ -** వ్యాసుడు పలికాడు.

**ఇతి తేషాం వచశ్శ్రుత్వా మునీనాం భావితాత్మనామ్ ।**
**స్మృత్వా శివపదాంభోజం సూతో వచనమబ్రవీత్ ॥ 35 ॥**

పరిశుద్ధాంతఃకరణులైన మునుల మాటలు విని సూతమహర్షి శివుని పాదపద్మాలు స్మరించి వారితో ఇలా పలికాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం విష్ణుసుదర్శనచక్రలాభవర్ణనం నామ చతుస్త్రింశోఽధ్యాయః ॥ 34 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు విష్ణువునకు సుదర్శనచక్రలాభవర్ణనం అనే పేరుగల ముప్పైనాల్గవ అధ్యాయం సమాప్తం.

## పంచత్రింశోఽధ్యాయః - ముప్పైఐదవ అధ్యాయం

## శివసహస్రనామవర్ణనమ్ - శివసహస్రనామవర్ణనం

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

> **శ్రూయతామృషయః! శ్రేష్ఠాః! కథయామి యథాశ్రుతమ్ ।**
> **విష్ణునా ప్రార్థితో యేన సంతుష్టః పరమేశ్వరః ॥**
> **తదహం కథయామ్యద్య పుణ్యం నామసహస్రకమ్ ॥ 1 ॥**

ఓ మహర్షులారా! శ్రేష్ఠులారా! విష్ణువు ఏ స్తోత్రం పఠించడంచేత పరమేశ్వరుడు ప్రసన్నమయ్యాడో అట్టి పవిత్రమైన సహస్రనామస్తోత్రాన్ని నేను వినిన విధంగా మీకు చెబుతాను వినండి.

**శ్రీవిష్ణురువాచ** - శ్రీవిష్ణువు చెప్పాడు.

> **శివో హరో మృడో రుద్రః పుష్కరః పుష్పలోచనః ।**
> **అర్థిగమ్యః సదాచారః శర్వః శంభుర్మహేశ్వరః ॥ 2 ॥**

మంగళస్వరూపుడు, పాపాలు హరించువాడు, అనుగ్రహాన్ని వర్షించేవాడు, దుఃఖాన్ని పారద్రోలువాడు, పోషించువాడు, పుష్పములవంటి నేత్రాలు గలవాడు, అర్థులకు గమ్యమైనవాడు, సదాచారస్వరూపుడు, దుష్టహింసకుడు, మంగళప్రదాత, సర్వానికి ప్రభువు.

> **చంద్రాపీడశ్చంద్రమౌళిర్విశ్వం విశ్వంభరేశ్వరః ।**
> **వేదాంతసారసందోహః కపాలీ నీలలోహితః ॥ 3 ॥**

చంద్రుడు శిరోభూషణంగా గలవాడు, శిరస్సుపై చంద్రుని ధరించువాడు, జగత్స్వరూపుడు, జగత్తును పోషించు ప్రభువు, వేదాంతప్రతిపాద్యతత్త్వమైనవాడు, కపాలాన్ని ధరించినవాడు, కంఠంలో నీలవర్ణం, తక్కిన అవయవాలలో ఎర్రనిరంగు గలవాడు.

> **ధ్యానాధారోఽపరిచ్ఛేద్యో గౌరీభర్తా గణేశ్వరః ।**
> **అష్టమూర్తిర్విశ్వమూర్తిః త్రివర్గః స్వర్గసాధనః ॥ 4 ॥**

ధ్యానానికి ఆధారమైనవాడు, దేశకాలవస్తు పరిచ్ఛేదాలు లేనివాడు, గౌరీపతి, గణాలకధ్యక్షుడు, పృథివి-జలం-అగ్ని-వాయువు-ఆకాశం-సూర్యుడు-చంద్రుడు-సోమయాజి అనే ఎనిమిది రూపాలు గలవాడు, జగద్రూపుడు, ధర్మార్థకామస్వరూపుడు, స్వర్గానికి సాధనమైనవాడు.

> **జ్ఞానగమ్యో దృఢప్రజ్ఞో దేవదేవస్త్రిలోచనః ।**
> **వామదేవో మహాదేవః పటుః పరివృఢో దృఢః ॥ 5 ॥**

జ్ఞానంచే పొందదగినవాడు, సర్వోత్కృష్టమైన ప్రజ్ఞగలవాడు, దేవతలకు దేవుడు, ముక్కంటి, దుష్టుల మదమునణచువాడు, గొప్పదేవుడు, సమర్థుడు, నాయకుడు, దృఢమైనవాడు.

**విశ్వరూపో విరూపాక్షో వాగీశః శుచిసత్తమః ।**
**సర్వప్రమాణసంవాదీ వృషాంకో వృషవాహనః ॥ 6 ॥**

విశ్వమే రూపంగా గలవాడు, బేసి కన్నులవాడు, వాక్కునకు అధిపతి, పరమపవిత్రమైనవాడు, ప్రమాణాలన్నింటి సమన్వయస్వరూపుడు, వృషభం చిహ్నంగా గలవాడు, వృషభం వాహనంగా గలవాడు.

**ఈశః పినాకీ ఖట్వాంగీ చిత్రవేషశ్చిరంతనః ।**
**తమోహరో మహాయోగీ గోప్తా బ్రహ్మా చ ధూర్జటిః ॥ 7 ॥**

పాలకుడు, పినాకమనే ధనుస్సు ధరించువాడు, ఖట్వాంగమనే ఆయుధం ధరించువాడు, చిత్రవేషం గలవాడు, శాశ్వతమైనవాడు, తమోగుణాన్ని పోగొట్టువాడు, యోగులలో గొప్పవాడు, రక్షకుడు, బ్రహ్మరూపుడు, జటాభారం గలవాడు.

**కాలకాలః కృత్తివాసాః సుభగః ప్రణవాత్మకః ।**
**ఉన్నధ్రః పురుషో జుష్యో దుర్వాసాః పురశాసనః ॥ 8 ॥**

మృత్యువునకు మృత్యువు, చర్మాన్ని ధరించువాడు, సుందరమైనవాడు, ఓంకారస్వరూపుడు, అందరికంటె ఉన్నతుడు, పూర్ణస్వరూపుడు, సేవించదగినవాడు, దుర్వాసమహర్షిరూపంలో అవతరించినవాడు, త్రిపురాసురుణ్ణి సంహరించినవాడు.

**దివ్యాయుధః స్కందగురుః పరమేష్ఠీః పరాత్పరః ।**
**అనాదిమధ్యనిధనో గిరీశో గిరిజాధవః ॥ 9 ॥**

దివ్యమైన ఆయుధాలు గలవాడు, కుమారస్వామికి తండ్రి, అన్నిటికి అతీతమైనవాడు, పరమేశ్వరుడు, ఆది-మధ్యాంతాలు లేనివాడు, కైలాసపతి, పార్వతీపతి.

**కుబేరబంధుః శ్రీకంఠో లోకవర్ణోత్తమో మృదుః ।**
**సమాధివేద్యః కోదండీ నీలకంఠః పరశ్వధీ ॥ 10 ॥**

కుబేరుని మిత్రుడు, కంఠంలో విషాన్ని ధరించినవాడు, లోకంలోని వర్ణాలన్నింటిలోను ఉత్తమమైన వర్ణం గలవాడు, మృదువైనవాడు, సమాధిస్థితిలో తెలియబడువాడు, ధనుస్సు గలవాడు, నీలకంఠుడు, పరశుధారి.

**విశాలాక్షో మృగవ్యాధః సురేశః సూర్యతాపనః ।**
**ధర్మధామా క్షమాక్షేత్రం భగవాన్ భగనేత్రభిత్ ॥ 11 ॥**

విశాలమైన నేత్రాలు గలవాడు, మృగాలను సంహరించే కిరాతకుడు, దేవతల ప్రభువు, సూర్యుని నియంత్రించువాడు, ధర్మానికి నిలయమైనవాడు, క్షమకు ఆకరమైనవాడు, షడ్గుణైశ్వర్యసంపన్నుడు, భగుని నేత్రాలను ఊడబెరికినవాడు.

**ఉగ్రః పశుపతిస్తార్‌క్ష్యః ప్రియభక్తః పరంతపః ।**
**దాతా దయాకరో దక్షః కపర్దీ కామశాసనః ॥ 12 ॥**

భయంకరాకారుడు, జీవులకు భర్త, గరుడుడు, భక్తులయందు ప్రీతి గలవాడు, శత్రువులను తపింపజేయువాడు, దాత, దయానిధి, సమర్థుడు, జటాజూటం గలవాడు, మన్మథుని సంహరించినవాడు.

**శ్మశాననిలయః సూక్ష్మః శ్మశానస్థో మహేశ్వరః ।**
**లోకకర్తా మృగపతిర్మహాకర్తా మహౌషధిః ॥ 13 ॥**

శ్మశానం ఇల్లుగ గలవాడు, ఇంద్రియాలకు గోచరం కానివాడు, శ్మశానంలో నుండువాడు, మహేశ్వరుడు, లోకాలను సృష్టించువాడు, పశుపతి, నిరతిశయకర్త, గొప్ప ఔషధము.

**ఉత్తరో గోపతిర్గోప్తా జ్ఞానగమ్యః పురాతనః ।**
**నీతిః సునీతిః శుద్ధాత్మా సోమః సోమరతః సుఖీ ॥ 14 ॥**

సర్వాతీతుడు, వాక్కులకు ప్రభువు, రక్షకుడు, జ్ఞానగమ్యుడు, పురాతనమైనవాడు (సనాతనుడు), నీతియైనవాడు, మంచినీతియే స్వరూపంగా గలవాడు, పవిత్రాంతఃకరణ గలవాడు, చంద్రుడు, సోమయాగమునందు ప్రీతిగలవాడు, సుఖస్వరూపుడు.

**సోమపోఽమృతపః సౌమ్యో మహాతేజా మహాద్యుతిః ।**
**తేజోమయోఽమృతమయోఽన్నమయశ్చ సుధాపతిః ॥ 15 ॥**

సోమపానం చేయువాడు, అమృతపానం చేయువాడు, ఆహ్లాదకరుడు, గొప్ప తేజస్సు గలవాడు, గొప్ప ప్రకాశం గలవాడు, తేజస్స్వరూపుడు, అమృతస్వరూపుడు, అన్నస్వరూపుడు, అమృతానికి ప్రభువు.

**అజాతశత్రురాలోకః సంభావ్యో హవ్యవాహనః ।**
**లోకకరో వేదకరః సూత్రకారః సనాతనః ॥ 16 ॥**

శత్రువులు లేనివాడు, జ్యోతిస్వరూపుడు, తెలియదగినవాడు, అగ్నిహోత్రుడు, లోకాలను సృష్టించువాడు, వేదాలను సృష్టించువాడు, సూత్రాలను సృష్టించువాడు, సనాతనమైనవాడు.

**మహర్షిః కపిలాచార్యో విశ్వదీప్తిస్త్రిలోచనః ।**
**పినాకపాణిర్భూదేవః స్వస్తిదః స్వస్తికృత్సుధీః ॥ 17 ॥**

ఆచార్యుడైన కపిలమహర్షిగా అవతరించినవాడు, జగత్తును ప్రకాశింపజేయువాడు, ముక్కంటి, పినాకమునుచేతిలో ధరించినవాడు, బ్రాహ్మణస్వరూపుడు, శుభాలనిచ్చువాడు, శుభాలను సృష్టించువాడు, జ్ఞానస్వరూపుడు.

**ధాతృధామా ధామకరః సర్వగః సర్వగోచరః ।**
**బ్రహ్మసృగ్విశ్వసృక్ సర్గః కర్ణికారః ప్రియః కవిః ॥ 18 ॥**

బ్రహ్మకు ఆశ్రయమైనవాడు, ప్రకాశాన్నిచ్చువాడు, సర్వవ్యాపకుడు, సర్వమునందు దర్శనమిచ్చువాడు, బ్రహ్మను సృష్టించినవాడు, విశ్వాన్ని సృష్టించినవాడు, సృష్టిస్వరూపుడు, చెట్టుకలువస్వరూపుడు, ప్రీతిగలవాడు, త్రికాలజ్ఞుడు,

**శాఖో విశాఖో గోశాఖః శివో భిషగనుత్తమః ।**
**గంగాప్లవోదకో భవ్యః పుష్కలః స్థపతిః స్థిరః ॥ 19 ॥**

కుమారస్వామి, విశాఖఋషి, వేదశాఖాస్వరూపుడు, మంగళకరుడు, భవరోగానికి సాటిలేని వైద్యుడు, గంగాజలరూపంలో ప్రవహించువాడు, ఉదాత్తమైనవాడు, పూర్ణుడు, శిల్పశాస్త్రవేత్త, స్థిరుడు,

**విజితాత్మా విధేయాత్మా భూతవాహనసారథిః ।**
**సగణో గణకాయశ్చ సుకీర్తిశ్ఛిన్నసంశయః ॥ 20 ॥**

ఇంద్రియజయం గలవాడు, మనోనియంత్రణ గలవాడు, శరీరమనే రథాన్ని బుద్ధిరూపంలో నడిపించే సారథియైనవాడు, గణసమేతుడు, గణాలచే రక్షింపబడువాడు, పవిత్రకీర్తి గలవాడు, సంశయరహితుడు.

**కామదేవః కామపాలో భస్మోద్ధూళితవిగ్రహః ।**
**భస్మప్రియో భస్మశాయీ కామీ కాంతః కృతాగమః ॥ 21 ॥**

మన్మథస్వరూపుడు, మన్మథుని పాలించువాడు, భస్మలేపనంతో గూడిన దేహం గలవాడు, భస్మప్రియుడు, భస్మమందు శయనించువాడు, భక్తులకిష్టమైనవాడు, సుందరస్వరూపుడు, ఆగమకర్త.

**సమావర్తోఽనివృత్తాత్మా ధర్మపుంజః సదాశివః ।**
**అకల్మషశ్చ పుణ్యాత్మా చతుర్బాహుర్దురాసదః ॥ 22 ॥**

సంసారచక్రాన్ని త్రిప్పేవాడు, లయం చేయబడిన మనస్సు గలవాడు, మూర్తీభవించిన ధర్మము, సర్వదా మంగళస్వరూపుడు, పాపసంసర్గం లేనివాడు, పుణ్యాత్ముడు, నాల్గు భుజాలు గలవాడు, సమీపింప శక్యం కానివాడు.

**దుర్లభో దుర్గమో దుర్గః సర్వాయుధవిశారదః ।**
**అధ్యాత్మయోగనిలయః సుతంతుస్తంతువర్ధనః ॥ 23 ॥**

అరుదైనవాడు, లభింప శక్యం కానివాడు, చేరుటకు శక్యం కానివాడు, సమస్తాయుధములందు నైపుణ్యం గలవాడు, అధ్యాత్మయోగంలో నివసించువాడు, మంచి సంతానరూపంలో నుండువాడు, సంతానాన్ని వృద్ధి చేయువాడు.

**శుభాంగో లోకసారంగో జగదీశో జనార్దనః ।**
**భస్మశుద్ధికరో మేరురోజస్వీ శుద్ధవిగ్రహః ॥ 24 ॥**

శుభకరమైన అవయవాలు గలవాడు, సర్వజగత్తుయొక్క సారస్వరూపుడు, జగత్ప్రభువు, దుష్టజనులను శిక్షించువాడు, భస్మముచే శుద్ధిచేయువాడు, మేరుపర్వతస్వరూపుడు, మహాబలశాలి, పవిత్రదేహం గలవాడు.

**అసాధ్యః సాధుసాధ్యశ్చ భృత్యమర్కటరూపధృక్ ।**
**హిరణ్యరేతాః పౌరాణో రిపుజీవహరో బలీ ॥ 25 ॥**

సాధింపశక్యం కానివాడు, సాధుపురుషులచే సాధింపబడువాడు, సేవచేసే కోతిరూపం దాల్చినవాడు, తేజస్సు బీజంగా గలవాడు, సనాతనుడు, శత్రువుల ప్రాణాలను హరించువాడు, బలశాలి.

**మహాహ్రదో మహాగర్తస్సిద్ధో వృందారవందితః ।**
**వ్యాఘ్రచర్మాంబరో వ్యాలీ మహాభూతో మహానిధిః ॥ 26 ॥**

సముద్రస్వరూపుడు, పెద్ద బిలం స్వరూపంగా గలవాడు, సిద్ధపురుషుడు, దేవవందితుడు, వ్యాఘ్రచర్మాన్ని ధరించేవాడు, పాములను ధరించేవాడు, పంచమహాభూతస్వరూపుడు, మహానిధి.

**అమృతోఽమృతపః శ్రీమాన్ పాంచజన్యః ప్రభంజనః ।**
**పంచవింశతితత్త్వస్థః పారిజాతః పరాత్పరః ॥ 27 ॥**

అమృతస్వరూపుడు, అమృతపానం చేయువాడు, శోభాయుక్తుడు, పంచవిధజనులకు ప్రియుడు, గాలివాన రూపంలో నుండువాడు, ఇరవైయైదు తత్త్వాలలో నుండువాడు, పారిజాతవృక్షస్వరూపుడు, పరాత్పరుడు.

**సులభస్సువ్రతశ్శూరో వాఙ్మయైకనిధిర్నిధిః ।**
**వర్ణాశ్రమగురుర్వర్ణీ శత్రుజిచ్ఛత్రుతాపనః ॥ 28 ॥**

తేలికగా లభించువాడు, గొప్ప వ్రతనిష్ఠ గలవాడు, శూరుడు, వాఙ్మయమనే ఏకైక నిధి, నిధి, వర్ణాశ్రమధర్మానికి గురువు, బ్రహ్మచారి, శత్రువులను జయించేవాడు, శత్రువులను తపింపజేయువాడు.

**ఆశ్రమః క్షపణః క్షామో జ్ఞానవానచలేశ్వరః ।**
**ప్రమాణభూతో దుర్జ్ఞేయః సుపర్ణో వాయువాహనః ॥ 29 ॥**

ఆశ్రమస్వరూపుడు, సన్న్యాసి, బక్కచిక్కినవాడు, జ్ఞానవంతుడు, కైలాసపర్వతాధిపతి, ప్రమాణస్వరూపుడు, తెలియశక్యం కానివాడు, సుందరమైన రెక్కలు గలవాడు, గంధస్వరూపుడు.

**ధనుర్ధరో ధనుర్వేదో గుణః శశిగుణాకరః ।**
**సత్యస్సత్యపరోఽదీనో ధర్మో గోధర్మశాసనః ॥ 30 ॥**

ధనుర్ధారి, ధనుర్వేదస్వరూపుడు, త్రిగుణస్వరూపుడు, చంద్రుని ఆహ్లాదకరగుణానికి మూలమైనవాడు, సత్యస్వరూపుడు, సత్యమునందు నిష్ఠగలవాడు, దైన్యమెరుగనివాడు, ధర్మస్వరూపుడు, వేదధర్మం ద్వారా శాసించువాడు.

**అనంతదృష్టిరానందో దండో దమయితా దమః ।**
**అభిచార్యో మహామాయో విశ్వకర్మవిశారదః ॥ 31 ॥**

అనంతమైన దృష్టి గలవాడు, ఆనందఘనుడు, దండస్వరూపుడు, దండించువాడు, దయాస్వరూపుడు, సమీపింపదగినవాడు, మహామాయావి, విశ్వమును నిర్మించుటలో నిపుణుడు.

**వీతరాగో వినీతాత్మా తపస్వీ భూతభావనః ।**
**ఉన్మత్తవేషః ప్రచ్ఛన్నో జితకామోஉజితప్రియః ॥ 32 ॥**

రాగం లేనివాడు, వినయంతో కూడిన మనస్సు గలవాడు, తపశ్శాలి, భూతములను సృష్టించువాడు, ఉన్మత్తుని వలె వేషాన్ని ధరించినవాడు, దాగియుండువాడు, కామాన్ని జయించినవాడు, ప్రీతిపాత్రుల కపజయాన్ని కలిగించనివాడు.

**కల్యాణప్రకృతిః కల్పః సర్వలోకప్రజాపతిః ।**
**తరస్వీ తారకో ధీమాన్ ప్రధానః ప్రభురవ్యయః ॥ 33 ॥**

మంగళస్వభావం గలవాడు, కల్పస్వరూపుడు, సమస్తలోకాలకు ప్రజాపతి, వేగం గలవాడు, తరింపజేయువాడు, ధీమంతుడు, ప్రధానస్వరూపుడు, ప్రభువు, నాశనం లేనివాడు.

**లోకపాలోஉంతర్హితాత్మా కల్పాదిః కమలేక్షణః ।**
**వేదశాస్త్రార్థతత్త్వజ్ఞోஉనియమో నియతాశ్రయః ॥ 34 ॥**

లోకపాలకుడు, దాగియున్న స్వరూపం గలవాడు, కల్పాది స్వరూపుడు, కమలాలవంటి కన్నులు గలవాడు, వేదశాస్త్రముల తత్త్వమెరింగినవాడు, నియమాలు లేనివాడు, స్థిరమైన నివాసం గలవాడు.

**చంద్రః సూర్యః శనిః కేతుర్వరాంగో విద్రుమచ్ఛవిః ।**
**భక్తివశ్యః పరంబ్రహ్మ మృగబాణార్పణోஉనఘః ॥ 35 ॥**

చంద్రుడు, సూర్యుడు, శని, కేతువు, శ్రేష్ఠమైన అవయవాలు గలవాడు, పగడపు కాంతిగలవాడు, భక్తిచే వశమగువాడు, పరం బ్రహ్మ, మృగంపై బాణాలు ప్రయోగించినవాడు, పాపసంపర్కం లేనివాడు.

**అద్రిరద్ర్యాలయః కాంతః పరమాత్మా జగద్గురుః ।**
**సర్వకర్మాలయస్తుష్టో మంగల్యో మంగలావృతః ॥ 36 ॥**

పర్వతము, పర్వతంపై నివసించేవాడు, సుందరుడు, పరమాత్మ, జగద్గురువు, సమస్త కర్మలకు నిలయం, సంతోషం గలవాడు, మంగళనిధానము, మంగళాలచే చుట్టువారబడి యుండువాడు.

**మహాతపా దీర్ఘతపాః స్థవిష్ఠః స్థవిరో ధ్రువః ।**
**అహః సంవత్సరో వ్యాప్తిః ప్రమాణం పరమం తపః ॥ 37 ॥**

గొప్ప తపస్సు గలవాడు, దీర్ఘకాలం తపస్సు చేయువాడు, స్థూలస్వరూపుడు, పెద్దవాడు, ధ్రువమండల–స్వరూపుడు, పగటి కాలానికి అధిష్ఠానదేవత, సంవత్సరస్వరూపుడు, నిత్యసంబంధస్వరూపుడు, ప్రమాణస్వరూపుడు, శ్రేష్ఠమైన తపస్స్వరూపుడు.

**సంవత్సరకరో మంత్రః ప్రత్యయః సర్వతాపనః ।**
**అజః సర్వేశ్వరస్సిద్ధో మహాతేజా మహాబలః ॥ 38 ॥**

సంవత్సరమనే కాలాన్ని చేయు సూర్యస్వరూపుడు, మంత్రస్వరూపుడు, శ్రద్ధాస్వరూపుడు, సర్వులను తపింపజేయువాడు, పుట్టుకలేనివాడు, సర్వేశ్వరుడు, సిద్ధుడు, మహాతేజశ్శాలి, మహాబలశాలి.

**యోగీ యోగ్యో మహారేతాః సిద్ధిః సర్వాదిరగ్రహః ।**
**వసుర్వసుమనాః సత్యః సర్వపాపహరో హరః ॥ 39 ॥**

యోగి, యోగ్యమైనవాడు, సమస్త జగత్తునకు బీజరూపుడు, సిద్ధిస్వరూపుడు, సర్వకారణుడు, సర్వానికి ముందున్నవాడు, సంపత్స్వరూపుడు, కొనియాడదగిన మనస్సు గలవాడు, సత్యస్వరూపుడు సర్వపాపహరుడు.

**సుకీర్తిః శోభనః స్రగ్వీ వేదాంగో వేదవిన్మునిః ।**
**భ్రాజిష్ణుర్భోజనం భోక్తా లోకనాథో దురాధరః ॥ 40 ॥**

మంచి కీర్తి గలవాడు, శోభగలవాడు, మాలను ధరించువాడు, వేదాంగస్వరూపుడు, వేదాలనెరిగినవాడు, ముని, ప్రకాశించువాడు, అన్నస్వరూపుడు, భోక్తృస్వరూపుడు, లోకనాథుడు, జయింపశక్యం కానివాడు.

**అమృతః శాశ్వతః శాంతో బాణహస్తః ప్రతాపవాన్ ।**
**కమండలుధరో ధన్వీ హ్యవాఙ్మానసగోచరః ॥ 41 ॥**

అమృతుడు, శాశ్వతుడు, శాంతుడు, బాణహస్తుడు, ప్రతాపం గలవాడు, కమండలాన్ని ధరించినవాడు, ధనుస్సు గలవాడు, వాక్కునకు, మనస్సునకు కూడా గోచరం కానివాడు.

**అతీంద్రియో మహామాయః సర్వావాసశ్చతుష్పథః ।**
**కాలయోగీ మహానాదో మహోత్సాహో మహాబలః ॥ 42 ॥**

ఇంద్రియాలకు గోచరం కానివాడు, మహామాయగలవాడు, సమస్తమందుండువాడు, నాలుగు మార్గాలు గలవాడు, కాలంతో సంబంధం గలవాడు, గొప్పనాదం గలవాడు, మహోత్సాహం గలవాడు, మహాబలం గలవాడు.

**మహాబుద్ధిర్మహావీర్యో భూతచారీ పురందరః ।**
**నిశాచరః ప్రేతచారీ మహాశక్తి ర్మహాద్యుతిః ॥ 43 ॥**

మహాబుద్ధిగలవాడు, మహాపరాక్రమం గలవాడు, పంచభూతాలతో కలిసి సంచరించువాడు, త్రిపురాలను నాశనం చేసినవాడు, రాత్రియందు సంచరించువాడు, ప్రేతాలతో కలిసి తిరుగువాడు, మహాశక్తిగలవాడు, మహాకాంతిగలవాడు.

**అనిర్దేశ్యవపుః శ్రీమాన్సర్వాచార్యమనోగతిః ।**
**బహుశ్రుతిర్మహామాయో నియతాత్మా ధ్రువోఽధ్రువః ॥ 44 ॥**

నిర్దేశింప శక్యం కాని దేహం గలవాడు, శ్రీమంతుడు, ఆచార్యులందరి మనస్సులలో ధ్యానింపబడువాడు, సర్వశాస్త్రజ్ఞానప్రవర్తకుడు, మహామాయ గలవాడు, నియతాత్ముడు, నిత్యుడు, అనిత్యుడు.

**తేజస్తేజో ద్యుతిధరో జనకః సర్వశాసకః ।**
**నృత్యప్రియో నృత్యనిత్యః ప్రకాశాత్మా ప్రకాశకః ॥ 45 ॥**

తేజస్సులకు తేజస్సు, కాంతి గలవాడు, తండ్రి, సర్వులను శాసించువాడు, నృత్యప్రియుడు, నిత్యమూ నాట్యం చేయువాడు, ప్రకాశస్వరూపుడు, ప్రకాశింపజేయువాడు.

**స్పష్టాక్షరో బుధో మంత్రః సమానః సారసంప్లవః ।**
**యుగాదికృద్యుగావర్తో గంభీరో వృషవాహనః ॥ 46 ॥**

స్పష్టాక్షరస్వరూపుడు, పండితుడు, మంత్రస్వరూపుడు, సర్వసముడు, సారస్వరూపుడు, యుగారంభము చేయువాడు, యుగచక్రాన్ని త్రిప్పేవాడు, గంభీరుడు, వృషభవాహనుడు.

**ఇష్టో విశిష్టః శిష్టేష్టః సులభః సారశో ధనః ।**
**తీర్థరూపస్తీర్థనామా తీర్థదృశ్యస్తు తీర్థదః ॥ 47 ॥**

ప్రీతిపాత్రుడు, గొప్పవాడు, శిష్టులకిష్టుడు, సులభుడు, జీవుని సారస్వరూపాన్ని శోధించువాడు, తీర్థస్వరూపుడు, తీర్థాల నామం గలవాడు, తీర్థాలలో దర్శింపబడువాడు, మంచితీర్థాలనిచ్చువాడు.

**అపాంనిధిరధిష్ఠానం విజయో జయకాలవిత్ ।**
**ప్రతిష్ఠితః ప్రమాణజ్ఞో హిరణ్యకవచో హరిః ॥ 48 ॥**

జలనిధి, జగదధిష్ఠానం, విజయుడు, జయాన్నిచ్చే కాలం తెలిసినవాడు, ప్రతిష్ఠింపబడినవాడు, ప్రమాణ-జ్ఞానం గలవాడు, తేజస్సు కవచంగా గలవాడు, విష్ణుస్వరూపుడు.

**విమోచనః సురగణో విద్యేశో బిందుసంశ్రయః ।**
**వాతరూపోఽమలోన్మాయీ వికర్తా గహనో గుహః ॥ 49 ॥**

ముక్తినిచ్చువాడు, దేవతలచే సేవింపబడువాడు, విద్యలకు ప్రభువు, బిందువునందుండువాడు, వాయుస్వరూపుడు, దోషవర్జితుడు, జగత్కర్త, తెలియశక్యం కానివాడు, గుహస్వరూపుడు.

**కరణం కారణం కర్తా సర్వబంధవిమోచనః ।**
**వ్యవసాయో వ్యవస్థానః స్థానదో జగదాదిజః ॥ 50 ॥**

కరణం, కారణం, కర్త, బంధాలనన్నింటిని విడిపించువాడు, సువ్యవస్థయే స్వరూపంగా గలవాడు, స్థానాన్నిచ్చువాడు, జగత్తుయొక్క ఆరంభంలో హిరణ్యగర్భరూపంలో జన్మించినవాడు.

**గురుదో లలితోఽభేదో నవాత్మాత్మని సంస్థితః ।**
**వీరేశ్వరో వీరభద్రో వీరాసనవిధిర్గురుః ॥ 51 ॥**

గురువుననుగ్రహించువాడు, లలితుడు, అభేదస్వరూపుడు, నూతనమైన మనోవృత్తి స్వరూపుడు, హృదయగుహలో నుండువాడు, వీరులకు ప్రభువు, వీరభద్రుడు, వీరాసనమునందుపవిష్టుడైయుండువాడు, గురువు.

**వీరచూడామణిర్వేత్తా చిదానందో నదీధరః ।**
**ఆజ్ఞాధారస్త్రిశూలీ చ శిపివిష్టః శివాలయః ॥ 52 ॥**

వీరులకు చూడామణి వంటివాడు, జ్ఞాని, చిదానందస్వరూపుడు, నదులను ధరించువాడు, ఆజ్ఞాచక్రము నందుండువాడు, త్రిశూలం గలవాడు, కాంతిస్వరూపుడు, మంగళకరనివాసం గలవాడు.

**వాలఖిల్యో మహావీరస్తిగ్మాంశుర్బధిరః ఖగః ।**
**అభిరామః సుశరణః సుబ్రహ్మణ్యః సుధాపతిః ॥ 53 ॥**

వాలఖిల్యమహర్షిస్వరూపుడు, మహావీరుడు, తీక్ష్ణమైన కిరణాలు గలవాడు, చెవిటివాడు, పక్షి, ఆహ్లాదకరమైనవాడు, చక్కని శరణమైనవాడు. సుబ్రహ్మణ్యుడు, అమృతానికి అధీశ్వరుడు.

**మఘవాన్కౌశికో గోమాన్విరామః సర్వసాధనః ।**
**లలాటాక్షో విశ్వదేహః సారః సంసారచక్రభృత్ ॥ 54 ॥**

ఇంద్రుడు, కౌశికుడు, సూర్యుడు, విశ్రాంతిస్థానం, సర్వసాధకుడు, లలాటమునందు కన్నుగలవాడు, విశ్వమే దేహంగా గలవాడు, సారస్వరూపుడు, సంసారచక్రాన్ని ధరించువాడు.

**అమోఘదండీ మధ్యస్థో హిరణ్యో బ్రహ్మవర్చసః ।**
**పరమార్థః పరోమాయీ శంబరో వ్యాఘ్రలోచనః ॥ 55 ॥**

అమోఘమైన దండం గలవాడు, రాగద్వేషాలు లేనివాడు, తేజస్స్వరూపుడు. బ్రహ్మవర్చసస్వరూపుడు, పరమార్థస్వరూపుడు, గొప్ప మాయావి, మేఘస్వరూపుడు, పెద్దపులి కన్నులు గలవాడు.

**రుచిర్బహురుచిర్వేద్యో వాచస్పతిరహస్పతిః ।**
**రవిర్విరోచనః స్కందః శాస్తా వైవస్వతో యమః ॥ 56 ॥**

సుందరుడు, అధికమైన ప్రకాశం గలవాడు, వైద్యుడు, బృహస్పతి, సూర్యుడు, ఆదిత్యుడు, విరోచనుడు, స్కందుడు, శాసించువాడు, సూర్యపుత్రుడు, యముడు.

**యుక్తిరున్నతకీర్తిశ్చ సానురాగః పురంజయః ।**
**కైలాసాధిపతిః కాంతః సవితా రవిలోచనః ॥ 57 ॥**

యుక్తిస్వరూపుడు, గొప్పకీర్తిగలవాడు, ప్రేమగలవాడు, త్రిపురాసురసంహర్త, కైలాసాధిపతి, సుందరమైనవాడు, జగత్తునకు తండ్రి, సూర్యుడే కన్నుగా గలవాడు.

**విశ్వోత్తమో వీతభయో విశ్వభర్తాஉనివారితః ।**
**నిత్యో నియతకల్యాణః పుణ్యశ్రవణకీర్తనః ॥ 58 ॥**

విశ్వోత్తముడు, భయం లేనివాడు, జగత్తును పోషించువాడు, నివారింపశక్యం కానివాడు, నిత్యుడు, నిశ్చితమైన మంగళం గలవాడు, శ్రవణ - కీర్తనలచే పుణ్యమునిచ్చువాడు,

**దూరశ్రవో విశ్వసహో ధ్యేయో దుఃస్వప్ననాశనః ।**
**ఉత్తారణో దుష్కృతిహా విజ్ఞేయో దుఃసహోऽభవః ॥ 59 ॥**

దూరంనుండియే వినేవాడు, విశ్వాన్ని సహించువాడు, ధ్యానింపబడువాడు, చెడు కలలను పోగొట్టువాడు, తరింపజేయువాడు, పాపకృత్యాలను నశింపజేసేవాడు, తెలియదగినవాడు, సహింపశక్యం కానివాడు, పుట్టుక లేనివాడు.

**అనాదిర్భూర్భువో లక్ష్మీః కిరీటీ త్రిదశాధిపః ।**
**విశ్వగోప్తా విశ్వకర్తా సువీరో రుచిరాంగదః ॥ 60 ॥**

ఆది లేనివాడు, భూస్వరూపుడు, భూమియందలి సంపదయే స్వరూపంగా గలవాడు, కిరీటం గలవాడు, దేవతలకధిపతి, జగత్తును రక్షించువాడు, జగత్తును సృష్టించువాడు, గొప్పవీరుడు, సుందరమైన అవయవాలనిచ్చువాడు.

**జననో జనజన్మాదిః ప్రీతిమాన్నీతిమాన్ ధ్రువః ।**
**వసిష్ఠః కశ్యపో భానుర్భీమో భీమపరాక్రమః ॥ 61 ॥**

జన్మనిచ్చువాడు, జనుల జన్మకు కారణమైనవాడు, ప్రీతి గలవాడు, నీతి గలవాడు, నిత్యుడు, వసిష్ఠుడు, కశ్యపుడు, సూర్యుడు, భయంకరుడు, భయంకరమైన పరాక్రమం గలవాడు.

**ప్రణవః సత్పథాచారో మహాకోశో మహాధనః ।**
**జన్మాధిపో మహాదేవః సకలాగమపారగః ॥ 62 ॥**

ఓంకారస్వరూపుడు, సన్మార్గంలో సంచరించువాడు, గొప్ప నిధి, గొప్ప ధనం గలవాడు, జన్మకు అధిపతి, మహాదేవుడు, సకల వేదాల సారస్వరూపుడు.

**తత్త్వం తత్త్వవిదేకాత్మా విభుర్విష్ణువిభూషణః ।**
**ఋషిర్బ్రాహ్మణ ఐశ్వర్యజన్మమృత్యుజరాతిగః ॥ 63 ॥**

పరమార్థస్వరూపుడు, ఆత్మతత్త్వం తెలిసినవాడు, అద్వితీయాత్మ, సర్వవ్యాపి, విష్ణువునకలంకారం, మహర్షి, బ్రాహ్మణుడు, ఐశ్వర్యం - పుట్టుక - మరణం - వృద్ధాప్యం అనే వాటికతీతుడు.

**పంచయజ్ఞసముత్పత్తిర్విశ్వేశో విమలోదయః ।**
**ఆత్మయోనిరనాద్యంతో వత్సలో భక్తలోకధృక్ ॥ 64 ॥**

పంచ యజ్ఞాలను సృష్టించినవాడు, విశ్వేశ్వరుడు, స్వచ్ఛమైన ఉదయం గలవాడు, ఆత్మయందు నివాసముండేవాడు, ఆద్యంతాలు లేనివాడు, వాత్సల్యస్వరూపుడు, భక్తలోకాన్ని ధరించువాడు.

**గాయత్రీవల్లభః ప్రాంశుర్విశ్వావాసః ప్రభాకరః ।**
**శిశుర్గిరిరతః సమ్రాట్ సుషేణః సురశత్రుహా ॥ 65 ॥**

గాయత్రీవల్లభుడు, పొడుగైనవాడు, విశ్వమే నివాసంగా గలవాడు, ప్రభాకరుడు, బాలకుడు, పర్వత-మందు ప్రీతిగలవాడు, చక్రవర్తి, గొప్పసైన్యం గలవాడు, దేవతల శత్రువులను సంహరించువాడు.

**అనేమిరిష్టనేమిశ్చ ముకుందో విగతజ్వరః ।**
**స్వయంజ్యోతిర్మహాజ్యోతిస్తనుజ్యోతిరచంచలః ॥ 66 ॥**

పరిచ్ఛేదాలు లేనివాడు, భక్తులకు మోక్షాన్నిచ్చేవాడు, ముకుందుడు, దుఃఖం లేనివాడు, స్వయం-ప్రకాశస్వరూపుడు, గొప్ప తేజశ్శాలి, సూక్ష్మజ్యోతిస్వరూపుడు, చలనం లేనివాడు.

**పింగలః కపిలశ్మశ్రుర్భాలనేత్రస్త్రయీతనుః ।**
**జ్ఞానస్కందో మహానీతిర్విశ్వోత్పత్తిరుపప్లవః ॥ 67 ॥**

పింగళవర్ణం గలవాడు, కపిలవర్ణం గల గెడ్డం గలవాడు (దుర్వాసుడు), లలాటంలో కన్నుగలవాడు, వేదమే శరీరంగా గలవాడు, జ్ఞానాన్నిచ్చువాడు, మహానీతిగలవాడు, జగత్కారణుడు, జగత్సంహారకుడు.

**భగో వివస్వానాదిత్యో గతపారో బృహస్పతిః ।**
**కల్యాణగుణనామా చ పాపహా పుణ్యదర్శనః ॥ 68 ॥**

సంపద, సూర్యుడు, ఆదిత్యుడు, సంసారానికి ఆవల ఉండువాడు, బృహస్పతి, మంగళకరమైన గుణాలు, నామాలు గలవాడు, పాపాలు పోగొట్టువాడు, దర్శనంచేతనే పుణ్యాన్నిచ్చువాడు.

**ఉదారకీర్తిరుద్యోగీ సద్యోగీ సదసత్త్రపః ।**
**నక్షత్రమాలీ నాకేశః స్వాధిష్ఠానః షడాశ్రయః ॥ 69 ॥**

మహోత్తమమైన కీర్తి గలవాడు, గొప్పయోగం గలవాడు, పవిత్రమైన యోగం గలవాడు, కార్యకారణ-స్వరూపుడు, నక్షత్రమండలస్వరూపుడు, స్వర్గాధిపతి, స్వాధిష్ఠానచక్రమునందుండువాడు, షట్చక్రముల యందుండువాడు.

**పవిత్రః పాపహారీ చ మణిపూరో నభోగతిః ।**
**హృత్పుండరీకమాసీనః శక్రః శాంతో వృషాకపిః ॥ 70 ॥**

పవిత్రుడు, పాపాలు హరించువాడు, మణిపూరచక్రమునందుండువాడు, ఆకాశమార్గంలో సంచరించేవాడు, హృదయపద్మంలో నివసించువాడు, ఇంద్రుడు, శాంతుడు, ధర్మస్వరూపుడు.

**ఉష్ణో గ్రహపతిః కృష్ణః సమర్థోఽనర్థనాశనః ।**
**అధర్మశత్రురజ్ఞేయః పురుహూతః పురశ్రుతః ॥ 71 ॥**

ఉష్ణస్వరూపుడు, గ్రహాలకధిపతి, శ్రీకృష్ణుడు, సమర్థుడు, అనర్థాలను పోగొట్టేవాడు, అధర్మానికి శత్రువు, తెలియ శక్యం కానివాడు, యజ్ఞంలో పదే పదే ఆహ్వానింపబడువాడు, గొప్ప కీర్తి గలవాడు.

**బ్రహ్మగర్భో బృహద్గర్భో ధర్మధేనుర్ధనాగమః ।**
**జగద్ధితైషీ సుగతః కుమారః కుశలాగమః ॥ 72 ॥**

బ్రహ్మ గర్భమునందు గలవాడు, పెద్ద గర్భం గలవాడు, ధర్మదేవత, ధనాన్నిచ్చువాడు, జగత్తునకు హితాన్ని కోరువాడు, బుద్ధుడు, కుమారుడు, క్షేమానికి నిధి.

**హిరణ్యవర్ణో జ్యోతిష్మాన్నానాభూతరతో ధ్వనిః ।**
**ఆరోగ్యో నమనాధ్యక్షో విశ్వామిత్రో ధనేశ్వరః ॥ 73 ॥**

బంగారు రంగువాడు, తేజస్స్వరూపుడు, సర్వప్రాణులయందు ప్రీతి గలవాడు, శబ్దస్వరూపుడు, ఆరోగ్యస్వరూపుడు, సంధ్యావందనాదులకధిష్ఠాన దేవత, విశ్వామిత్రుడు, కుబేరుడు.

**బ్రహ్మజ్యోతిర్వసుర్ధామా మహాజ్యోతిరనుత్తమః ।**
**మాతామహో మాతరిశ్వా నభస్వాన్నాగహారధృక్ ॥ 74 ॥**

పరబ్రహ్మ, జ్యోతిస్స్వరూపుడు, సుందరమైన ధామం గలవాడు, మహాజ్యోతి, నిరతిశయుడు, తల్లికి తండ్రి, ఆకాశంలో సంచరించే వాయుదేవత, నాగులను హారాలుగా ధరించేవాడు.

**పులస్త్యః పులహోఽగస్త్యో జాతూకర్ణ్యః పరాశరః ।**
**నిరావరణనిర్వారో వైరంచ్యో విష్టరశ్రవాః ॥ 75 ॥**

పులస్త్యుడు, పులహుడు, అగస్త్యుడు, జాతూకర్ణ్యుడు, పరాశరుడు, ఆవరణం, ఆటంకం లేనివాడు, బ్రహ్మపుత్రుడు, విస్తృతమైన కీర్తిగలవాడు.

**ఆత్మభూరనిరుద్ధోఽత్రిర్జ్ఞానమూర్తిర్మహాయశాః ।**
**లోకవీరాగ్రణీర్వీరశ్చండః సత్యపరాక్రమః ॥ 76 ॥**

స్వయంభువుడు, అనిరుద్ధుడు, అత్రి, జ్ఞానస్వరూపుడు, గొప్ప కీర్తిగలవాడు, లోకంలోని వీరాగ్రేసరుడు, వీరుడు, భయంకరుడు, నిజమైన పరాక్రమం గలవాడు.

**వ్యాలకల్పో మహాకల్పః కల్పవృక్షః కలాధరః ।**
**అలంకరిష్ణురచలో రోచిష్ణుర్విక్రమోన్నతః ॥ 77 ॥**

మహాసర్పాన్ని పోలియున్నవాడు, మహాకల్పస్వరూపుడు, కల్పవృక్షం, చంద్రుడు, అలంకరించుకొనే స్వభావం గలవాడు, చలనం లేనివాడు, సుందరుడు, విక్రమముచే ఉన్నతుడు.

**ఆయుః శబ్దపతిర్వాగ్మీ ప్లవనశ్శిఖిసారథిః ।**
**అసంతుష్టోఽతిథి శ్శత్రుః ప్రమాథీ పాదపాసనః ॥ 78 ॥**

కాలస్వరూపుడు, శబ్దాలకు ప్రభువు, వక్త, ఎగురువాడు, అగ్ని సారథిగా గలవాడు, అసంతుష్టుడు, అతిథి, శత్రుసంహారకుడు వృక్షమే ఆసనంగా గలవాడు.

**వసుశ్రవాః కవ్యవాహః ప్రతప్తో విశ్వభోజనః ।**
**జప్యో జరాదిశమనో లోహితశ్చ తనూనపాత్ ॥ 79 ॥**

సుందరమైన కర్ణాలు గలవాడు, పితృదేవతలకీయబడే కవ్యాలు వారికి సమర్పించువాడు, అత్యుష్ణస్వరూపుడు, జగత్తును భక్షించువాడు, జపింపదగినవాడు, వృద్ధాప్యం మున్నగువాటిని పోగొట్టువాడు, ఎర్రనివాడు, అగ్నిహోత్రుడు.

**పృషదశ్వో నభోయోనిః సుప్రతీకస్తమిస్రహా ।**
**నిదాఘస్తపనో మేఘభక్షః పరపురంజయః ॥ 80 ॥**

వాయువు, ఆకాశానికి కారణమైనవాడు, మంచి అవయవములు గలవాడు, చీకటిని (తమోగుణాన్ని) పోగొట్టువాడు, గ్రీష్మఋతువు, సూర్యుడు, మేఘాలను భక్షించువాడు, శత్రునగరాలను జయించువాడు.

**సుఖానిలః సునిష్పన్నః సురభిఃశిశిరాత్మకః ।**
**వసంతో మాధవో గ్రీష్మో నభస్యో బీజవాహనః ॥ 81 ॥**

సుఖకరుడైన వాయువు, సుందరమైన జన్మ గలవాడు, సుగంధస్వరూపుడు, శిశిరస్వరూపుడు, వసంతుడు, వైశాఖం, గ్రీష్మం, భాద్రపదం, బీజాలను ప్రవర్తిల్లజేయువాడు.

**అంగిరా గురురాత్రేయో విమలో విశ్వపావనః ।**
**పావనః పురజిచ్ఛక్రస్త్రైవిద్యో నవవారణః ॥ 82 ॥**

అంగిరస్సు, గురువు, ఆత్రేయుడు, విమలమైనవాడు, జగత్తును పావనం చేయువాడు, పవిత్రుడు, త్రిపురాలను జయించినవాడు, ఇంద్రుడు, వేదవిద్యాస్వరూపుడు, శ్రేష్ఠమైన వృషభవాహనం గలవాడు,

**మనోబుద్ధిరహంకారః క్షేత్రజ్ఞః క్షేత్రపాలకః ।**
**జమదగ్నిర్బలనిధిర్విగాలో విశ్వగాలవః ॥ 83 ॥**

మనస్సు–బుద్ధి–అహంకారం–క్షేత్రాన్ని తెలియువాడు, క్షేత్రాన్ని పాలించువాడు, జమదగ్ని, బలానికి నిధానం, జటలనుండి గంగను ప్రవహింపజేయువాడు, విశ్వానికి ఆశ్రయం.

**అఘోరోఽనుత్తరో యజ్ఞః శ్రేయో నిఃశ్రేయసప్రదః ।**
**శైలో గగనకుందాభో దానవారిరరిందమః ॥ 84 ॥**

శాంతస్వరూపుడు, నిరతిశయుడు, యజ్ఞస్వరూపుడు, మోక్షస్వరూపుడు, మోక్షాన్నిచ్చువాడు, పర్వత స్వరూపుడు, చంద్రుని వలె ప్రకాశించువాడు, రాక్షసశత్రువు, శత్రువులను సంహరించువాడు.

**చాముండో జనకశ్చారుర్నిశ్శల్యో లోకశల్యధృక్ ।**
**చతుర్వేదశ్చతుర్భావశ్చతురశ్చతురప్రియః ॥ 85 ॥**

చాముండీస్వరూపుడు, తండ్రి, సుందరుడు, హృదయవేదనలేనివాడు, జనులకు హృదయవేదన గలిగించువాడు, నాలుగు వేదాల స్వరూపుడు, నాల్గు భావాలు గలవాడు, నిపుణుడు, నిపుణులయందు ప్రీతిగలవాడు.

**ఆమ్నాయోఽథ సమామ్నాయస్తీర్థదేవః శివాలయః ।**
**బహురూపో మహారూపస్సర్వరూపశ్చరాచరః ॥ 86 ॥**

వేదం, వేదపఠనం, తీర్థాలు, వాటి యందలి దేవతలు, శివాలయం, అనేక రూపాలు గలవాడు, మహారూపం గలవాడు, సర్వస్వరూపుడు, చరాచరస్వరూపుడు.

**న్యాయనిర్మాయకో నేయో న్యాయగమ్యో నిరంజనః ।**
**సహస్రమూర్ధా దేవేంద్రః సర్వశస్త్రప్రభంజనః ॥ 87 ॥**

న్యాయనిర్ణేత, భక్తులకు వశమై ఉండువాడు, అనంతశిరస్సులు గలవాడు, దేవేంద్రుడు, ఆయుధాలనన్నింటిని భగ్నం చేయువాడు.

**ముండీ విరూపో వికృతో దండీ నాదీ గుణోత్తమః ।**
**పింగళాక్షో హి బహ్వయో నీలగ్రీవో నిరామయః ॥ 88 ॥**

ముండితశిరస్కుడు, భయంకరరూపుడు, వికృతరూపుడు, దండధారి, నాదం చేయువాడు, గుణోత్తముడు, పింగళవర్ణం గల నేత్రాలతో ప్రకాశించువాడు, గుణోత్తముడు, నీలగ్రీవుడు, దోషాలు లేనివాడు.

**సహస్రబాహుః సర్వేశః శరణ్యః సర్వలోకధృక్ ।**
**పద్మాసనః పరంజ్యోతిః పారంపర్యఫలప్రదః ॥ 89 ॥**

అనంత బాహువులు గలవాడు, సర్వేశ్వరుడు, శరణు పొందదగినవాడు, లోకాలన్నింటిని ధరించువాడు, పద్మాసనమునందుండువాడు, పరమప్రకాశస్వరూపుడు, పారంపర్యఫలాలనిచ్చువాడు.

**పద్మగర్భో మహాగర్భో విశ్వగర్భో విచక్షణః ।**
**పరావరజ్ఞో వరదో వరేణ్యశ్చ మహాస్వనః ॥ 90 ॥**

పద్మమునందుండువాడు, విశాలమైన గర్భం గలవాడు, గర్భంలో విశ్వాన్ని ధరించువాడు, జ్ఞాని, మిథ్యా-సత్యాల నెరింగినవాడు, వరాల నిచ్చువాడు, సర్వశ్రేష్ఠుడు, పెద్దధ్వని గలవాడు.

**దేవాసురగురుర్దేవో దేవాసురనమస్కృతః ।**
**దేవాసురమహామిత్రో దేవాసురమహేశ్వరః ॥ 91 ॥**

దేవతలకు-రాక్షసులకు తండ్రి, ప్రకాశస్వరూపుడు, దేవాసురనమస్కృతుడు, దేవాసురులకు మహామిత్రుడు, దేవాసురులకు మహేశ్వరుడు,

**దేవాసురేశ్వరో దివ్యో దేవాసురమహాశ్రయః ।**
**దేవదేవోఽనయోఽచింత్యో దేవతాత్మాఽఽత్మసంభవః ॥ 92 ॥**

ఆశ్రయమైనవాడు, దేవదేవుడు, కుటిలనీతిలేనివాడు, మనస్సునకు అందనివాడు, దేవతలకు ఆత్మస్వరూపుడు, స్వయంభువు.

**సద్యో మహాసురవ్యాధో దేవసింహో దివాకరః ।**
**విబుధాగ్రచరః శ్రేష్ఠః సర్వదేవోత్తమోత్తమః ॥ 93 ॥**

సద్యోజాతుడు, మహాసురులను సంహరించు కిరాతుడు, దేవతలలో శ్రేష్ఠుడు, దివాకరుడు, దేవతలలో అగ్రేసరుడు, శ్రేష్ఠుడు, దేవతలందరిలో ఉత్తమోత్తముడు.

**శివజ్ఞానరతః శ్రీమాన్ శిఖీ శ్రీపర్వతప్రియః ।**
**వజ్రహస్తః సిద్ధఖడ్గో నరసింహనిపాతనః ॥ 94 ॥**

శివజ్ఞానమునందు ప్రీతిగలవాడు, శోభాయుక్తుడు, అగ్ని, శ్రీశైలంనందు ప్రీతిగలవాడు, వజ్రహస్తుడు, పరాజయమెరుగని ఖడ్గాన్ని ధరించువాడు, నరసింహుని పడగొట్టినవాడు.

**బ్రహ్మచారీ లోకచారీ ధర్మచారీ ధనాధిపః ।**
**నందీ నందీశ్వరోఽనంతో నగ్నవ్రతధరః శుచిః ॥ 95 ॥**

బ్రహ్మచారి, లోకసంచారి, ధర్మంలో చరించువాడు, కుబేరుడు, వృషభస్వరూపుడు, నందీశ్వరుడు, అనంతుడు, దిగంబరవ్రతాన్ని పాటించువాడు, అగ్ని.

**లింగాధ్యక్షః సురాధ్యక్షో యుగాధ్యక్షో యుగాపహః ।**
**స్వధామా స్వగతః స్వర్గీ స్వరః స్వరమయః స్వనః ॥ 96 ॥**

లింగాలకు అధిష్ఠాన దేవత, దేవతలకధిపతి, యుగాధ్యక్షుడు, యుగాలనుపసంహరించువాడు, స్వయం-ప్రకాశస్వరూపుడు, ఆత్మారాముడు, స్వర్గలోకనివాసి, స్వరస్వరూపుడు, అక్షరమాతృకాస్వరూపుడు, ధ్వనిస్వరూపుడు.

**బాణాధ్యక్షో బీజకర్తా కర్మకృద్ధర్మసంభవః ।**
**దంభో లోభోఽథ వై శంభుః సర్వభూతమహేశ్వరః ॥ 97 ॥**

బాణాలకధిపతి (బాణాసురునకు అధిపతి), బీజశక్తిని సృష్టించువాడు, యజ్ఞాది కర్మలు చేయువాడు, ధర్మంనుండి ఉదయించువాడు, దంభస్వరూపుడు, లోభస్వరూపుడు, మంగళస్వరూపుడు, సర్వప్రాణులకు అధీశ్వరుడు.

**శ్మశాననిలయస్త్ర్యక్షస్సేతురప్రతిమాకృతిః ।**
**లోకోత్తరస్ఫుటో లోకః త్ర్యంబకో నాగభూషణః ॥ 98 ॥**

శ్మశానమునందు నివసించువాడు, ముక్కంటి, ధర్మవిధారకుడు, సాటిలేని ఆకారం గలవాడు, లోకాలకతీతుడై వెలుగొందువాడు, జగత్స్వరూపుడు, ముక్కంటి, నాగభూషణుడు.

**అంధకారిర్మఖద్వేషీ విష్ణుకంధరపాతనః ।**
**హీనదోషో౽క్షయగుణో దక్షారిః పూషదంతభిత్ ॥ 99 ॥**

అంధకుని శాసించినవాడు, దక్షయజ్ఞవినాశకుడు, విష్ణువుయొక్క మెడను నరికినవాడు, దోషరహితుడు, అనంతగుణసంపన్నుడు, దక్షునికి శత్రువు, పూషయొక్క దంతాలనూడబెరికినవాడు.

**పూర్ణః పూరయితా పుణ్యః సుకుమారః సులోచనః ।**
**సన్మార్గమప్రియో ధూర్తః పుణ్యకీర్తిరనామయః ॥ 100 ॥**

పూర్ణుడు, పూరించువాడు, పవిత్రుడు, సుకుమారుడు, సులోచనుడు, సన్మార్గులయందు ప్రీతిగలవాడు, ధూర్తుడు, పుణ్యకీర్తిగలవాడు, రోగరహితుడు.

**మనోజవస్తీర్థకరో జటిలో నియమేశ్వరః ।**
**జీవితాంతకరో నిత్యో వసురేతా వసుప్రదః ॥ 101 ॥**

మనస్సుతో సమానమైన వేగం గలవాడు, తీర్థాలను నిర్మించువాడు, జటాజూటధారి, నియమాలకధిపతి, జీవితాలను అంతం చేయువాడు, నిత్యుడు, సంపదకు బీజమైనవాడు, సంపదలనిచ్చువాడు.

**సద్గతిః సిద్ధిదః సిద్ధిః సజ్జాతిః ఖలకంటకః ।**
**కలాధరో మహాకాలభూతః సత్యపరాయణః ॥ 102 ॥**

సద్గతి, సిద్ధినిచ్చువాడు, సిద్ధి, మంచి జన్మగలవాడు, దుష్టులను హింసించువాడు, చంద్రకళను ధరించువాడు, మహాకాలస్వరూపుడు, సత్యపరాయణుడు.

**లోకలావణ్యకర్తా చ లోకోత్తరసుఖాలయః ।**
**చంద్రసంజీవనః శాస్తా లోకగ్రాహో మహాధిపః ॥ 103 ॥**

లోకాలలోని లావణ్యాన్ని నిర్మించువాడు, అతీంద్రియసుఖానికి నిధానమైనవాడు, చంద్రునకు జీవితాన్ని అనుగ్రహించినవాడు, శాస్త, లోకాలనుపసంహరించువాడు, సర్వేశ్వరేశ్వరుడు.

**లోకబంధుర్లోకనాథః కృతజ్ఞః కృత్తిభూషితః ।**
**అనపాయో౽క్షరః కాంతః సర్వశస్త్రభృతాంవరః ॥ 104 ॥**

లోకబంధువు, లోకనాథుడు, కృతజ్ఞుడు, గజచర్మాన్ని అలంకరించుకున్నవాడు, అనపాయుడు, అక్షరుడు, సుందరుడు, శస్త్రధారులందరిలో శ్రేష్ఠుడు.

**తేజోమయో ద్యుతిధరో లోకమానీ ఘృణార్ణవః ।**
**శుచిస్మితః ప్రసన్నాత్మా హ్యజేయో దురతిక్రమః ॥ 105 ॥**

తేజోమయుడు, ప్రకాశవంతుడు, లోకపూజ్యుడు, దయాసముద్రుడు, స్వచ్ఛమైన చిరునవ్వు గలవాడు, ప్రసన్నాత్ముడు, అజేయుడు, ఎవ్వరిచేతను అతిక్రమింపబడనివాడు.

**జ్యోతిర్మయో జగన్నాథో నిరాకారో జలేశ్వరః ।**
**తుంబవీణో మహాకాయో విశోకః శోకనాశనః ॥ 106 ॥**

జ్యోతిర్మయుడు, జగన్నాథుడు, నిరాకారుడు, జలేశ్వరుడు, ఆనపబుర్రతో చేసిన వీణగలవాడు, మహాకాయుడు, శోకం లేనివాడు, శోకాన్ని నశింపజేయువాడు.

**త్రిలోకపస్త్రిలోకేశః సర్వశుద్ధిరధోక్షజః ।**
**అవ్యక్తలక్షణో దేవో వ్యక్తో౽వ్యక్తో విశాంపతిః ॥ 107 ॥**

ముల్లోకాలను రక్షించువాడు, ముల్లోకాలకు ప్రభువు, సర్వం శుద్ధిచేయువాడు, విరాట్ స్వరూపుడు, వ్యక్తంకాని లక్షణాలు గలవాడు, దేవుడు, ఇంద్రియగోచరుడు, ఇంద్రియాలకు గోచరం కానివాడు, మానవుల కధిపతి.

**పరఃశివో వసుర్నాసాసారో మానధరో యమః ।**
**బ్రహ్మా విష్ణుః ప్రజాపాలో హంసో హంసగతిర్వయః ॥ 108 ॥**

పరంబ్రహ్మ, మంగళకరుడు, సంపత్స్వరూపుడు, నాసికకు సారమైన శ్వాసస్వరూపుడు, మానమును కాపాడువాడు, యముడు, బ్రహ్మ, విష్ణువు, లోకపాలుడు, హంస, హంసగమనం వంటి గమనం గలవాడు, పక్షి.

**వేధా విధాతా ధాతా చ స్రష్టా హర్తా చతుర్ముఖః ।**
**కైలాసశిఖరావాసీ సర్వావాసీ సదాగతిః ॥ 109 ॥**

జ్ఞాని, కర్మఫలదాత, పోషించువాడు, సృష్టికర్త, సంహారకుడు, చతుర్ముఖుడు, కైలాసశిఖరంపై నివసించువాడు, అంతటా నివసించువాడు, సర్వదా చలనం గలవాడు. (చైతన్యశీలుడు)

**హిరణ్యగర్భో ద్రుహిణో భూతపాలో౽థ భూపతిః ।**
**సద్యోగీ యోగవిద్యోగీ వరదో బ్రాహ్మణప్రియః ॥ 110 ॥**

హిరణ్యగర్భుడు, బ్రహ్మ, భూతపాలుడు, రాజు, గొప్పయోగి, యోగవేత్త, యోగి, వరాలనిచ్చువాడు, బ్రాహ్మణప్రియుడు.

**దేవప్రియో దేవనాథో దేవకో దేవచింతకః ।**
**విషమాక్షో విరూపాక్షో వృషదో వృషవర్ధనః ॥ 111 ॥**

దేవప్రియుడు, దేవనాథుడు, దేవకుడు, దేవతల హితమును గూర్చి చింతించువాడు, బేసికన్నులవాడు, వికృతరూపమైన కన్నులుగలవాడు, ధర్మమునిచ్చువాడు, ధర్మాన్ని వర్ధిల్లజేయువాడు.

**నిర్మమో నిరహంకారో నిర్మోహో నిరుపద్రవః ।**
**దర్పహా దర్పదో దృప్తః సర్వార్థపరివర్తకః ॥ 112 ॥**

మమకారం లేనివాడు, అహంకారంలేనివాడు, మోహం లేనివాడు, ఉపద్రవాలులేనివాడు, దర్పాన్ని పోగొట్టువాడు, దర్పాన్ని కలిగించువాడు, గర్వించువాడు, పదార్థాలన్నింటిలోని మార్పులకు కారణమైనవాడు.

**సహస్రార్చిర్భూతిభూషః స్నిగ్ధాకృతిరదక్షిణః ।**
**భూతభవ్యభవన్నాథో విభవో భూతినాశనః ॥ 113 ॥**

వేయి తేజస్సులు గలవాడు, భస్మమే అలంకారంగా గలవాడు, మనోహరమైన ఆకారం గలవాడు, సరళమైన స్వభావం గలవాడు, భూతభవిష్యద్వర్తమాన కాలాలకు ప్రభువు, విభవస్వరూపుడు, సంపదను నాశనం చేయువాడు.

**అర్థోఽనర్థో మహాకోశః పరకార్యైకపండితః ।**
**నిష్కంటకః కృతానందో నిర్వ్యాజో వ్యాజమర్దనః ॥ 114 ॥**

సంపద, కష్టం, మహానిధి, పరోపకారపారీణుడు, ఆటంకాలులేనివాడు, ఆనందకారకుడు, మోసం లేనివాడు, మోసాన్ని దండించువాడు.

**సత్త్వవాన్ సాత్త్వికః సత్యః కృతస్నేహః కృతాగమః ।**
**అకంపితో గుణగ్రాహీ నైకాత్మా నైకకర్మకృత్ ॥ 115 ॥**

సత్త్వగుణమూర్తి, సాత్త్వికుడు, సత్యస్వరూపుడు, ప్రేమ (స్నేహం) చేయువాడు, వేదకర్త, చలనం లేనివాడు, గుణాన్ని గ్రహించువాడు, సర్వాత్మ, సర్వకర్మలను చేయువాడు.

**సుప్రీతః సుఖదః సూక్ష్మః సుకరో దక్షిణానిలః ।**
**నందిస్కందో ధరో ధుర్యః ప్రకటః ప్రీతివర్ధనః ॥ 116 ॥**

మిక్కిలి ప్రీతిగలవాడు, సుఖాన్నిచ్చువాడు, సూక్ష్మమైనవాడు, తేలికగా లభించువాడు, దక్షిణవాయు స్వరూపుడు, ఆనందంతో కూడిన స్కందుడు గలవాడు, ధారకుడు, సర్వశ్రేష్ఠుడు, ప్రకటితుడైనవాడు, ప్రీతివర్ధనుడు.

**అపరాజితః సర్వసహో గోవిందః సత్త్వవాహనః ।**
**అధృతః స్వధృతః సిద్ధః పూతమూర్తిర్యశోధనః ॥ 117 ॥**

పరాజయమెరుగనివాడు, సర్వాన్ని సహించువాడు, గోవిందుడు, సత్త్వగుణాన్ని కలిగించేవాడు, ఆధారం లేనివాడు, స్వయంగా తనకు తాను ఆధారమైనవాడు, సిద్ధుడు, పవిత్రమూర్తి, యశోధనుడు.

**వారాహశృంగధృక్ శృంగీ బలవానేకనాయకః ।**
**శ్రుతిప్రకాశః శ్రుతిమానేకబంధురనేకధృక్ ॥ 118 ॥**

వరాహంయొక్క శృంగాన్ని ధరించువాడు, కొమ్ముగలవాడు, బలవంతుడు, ఏకైకనాయకుడు, వేదాలచే తెలియబడువాడు, వేదవిదుడు, ఏకైకబంధువు, సర్వానికి ఏకైకపాలకుడు.

**శ్రీవత్సలః శివారంభః శాంతభద్రః సమో యశః ।**
**భూయశో భూషణో భూతిర్భూతికృద్భూతభావనః ॥ 119 ॥**

లక్ష్మియందు వాత్సల్యం గలవాడు, మంగళకరమైన ఆరంభం కలవాడు, శాంతుడు, మంగళ స్వరూపుడు, సముడు, కీర్తి, భూమండలమందు కీర్తింపబడువాడు, అలంకారం, ఐశ్వర్యం, ఐశ్వర్యకారకుడు, ప్రాణులను సృష్టించువాడు.

**అకంపో భక్తికాయస్తు కాలహానిః కలావిభుః ।**
**సత్యవ్రతీ మహాత్యాగీ నిత్యశాంతిపరాయణః ॥ 120 ॥**

కంపనం లేనివాడు, భక్తియే దేహంగా గలవాడు, కాలాన్ని కబళించేవాడు, కళలకు ప్రభువు, సత్యవ్రతం గలవాడు, మహాత్యాగి, నిత్యము శాంతి మాత్రమే ఏకైక లక్ష్యంగా గలవాడు.

**పరార్థవృత్తిర్వరదో విరక్తస్తు విశారదః ।**
**శుభదః శుభకర్తా చ శుభనామా శుభః స్వయమ్ ॥ 121 ॥**

పరోపకారానికి మాత్రమే శ్రమించువాడు, వరాలనిచ్చువాడు, విరక్తుడు, విశారదుడు, శుభాలనిచ్చువాడు, శుభాలను చేయువాడు, శుభకరమైన నామం గలవాడు, స్వయంగా శుభస్వరూపుడు.

**అనర్థితో గుణగ్రాహీ హ్యకర్తా కనకప్రభః ।**
**స్వభావభద్రో మధ్యస్థః శత్రుఘ్నో విఘ్ననాశనః ॥ 122 ॥**

ఇతరులచే వృద్ధిని పొందనివాడు, గుణాలను గ్రహించువాడు, కర్తృత్వం లేనివాడు, బంగారుకాంతి గలవాడు, స్వభావంచేతనే మంగళుడు, మధ్యస్థుడు, శత్రువులను సంహరించువాడు, విఘ్నాలను నాశనం చేయువాడు.

**శిఖండీ కవచీ శూలీ జటీ ముండీ చ కుండలీ ।**
**అమృత్యుః సర్వదృక్ సింహస్తేజోరాశిర్మహామణిః ॥ 123 ॥**

శిఖ గలవాడు, కవచం గలవాడు, శూలం గలవాడు, జటలు గలవాడు, ముండితశిరస్కుడు, కుండలాలు గలవాడు, మృత్యురహితుడు, సర్వసాక్షి, సింహం, తేజోరాశి, మహామణి.

**అసంఖ్యేయోఽప్రమేయాత్మా వీర్యవాన్ వీర్యకోవిదః ।**
**వేద్యశ్చ వై వియోగాత్మా సప్తావరమునీశ్వరః ॥ 124 ॥**

పరిగణింప శక్యం కానివాడు, ఇంద్రియగోచరంకాని తత్త్వంగలవాడు, వీరుడు, పరాక్రమపండితుడు, తెలియదగినవాడు, అసంగమైన ఆత్మస్వరూపుడు, పరాపరబ్రహ్మల నెరింగిన మహర్షుల రూపంలో నున్నవాడు.

**అనుత్తమో దురాధర్షో మధురః ప్రియదర్శనః ।**
**సురేశః స్మరణః సర్వః శబ్దః ప్రతపతాంవరః ॥ 125 ॥**

సర్వోత్తముడు, జయింప శక్యంకానివాడు, మధురమైనవాడు, ప్రియాన్ని కలిగించే దర్శనం గలవాడు, దేవదేవుడు, స్మృతిస్వరూపుడు, సర్వము తానేయైనవాడు, శబ్దస్వరూపుడు, తపించువారిలో శ్రేష్ఠుడు.

**కాలపక్షః కాలకాలః సుకృతీకృతవాసుకిః ।**
**మహేష్వాసో మహీభర్తా నిష్కలంకో విశ్రుంఖలః ॥ 126 ॥**

కాలమే రెక్కలుగా కలవాడు, కాలకాలుడు, వాసుకిని సుకృతునిగా చేసినవాడు, గొప్పధనుస్సు గలవాడు, భూమండలానికి ప్రభువు, దోషరహితుడు, బంధనాలు లేనివాడు.

**ద్యుమణిస్తరణిర్ధన్యః సిద్ధిదః సిద్ధిసాధనః ।**
**విశ్వతస్సంప్రవృతస్తు వ్యూఢోరస్కో మహాభుజః ॥ 127 ॥**

ఆకాశంలో మణి వలె ప్రకాశించువాడు, సంసారసంద్రంనుండి తరింపజేసే నౌకవంటి వాడు, ధన్యుడు, సిద్ధినిచ్చువాడు, సిద్ధికి సాధనమైనవాడు, విశ్వమునందంతటను చక్కగా ప్రవర్తించువాడు, విశాలమైన వక్షఃస్థలం గలవాడు, పొడుగైన భుజాలు గలవాడు.

**సర్వయోనిర్నిరాతంకో నరనారాయణప్రియః ।**
**నిర్లేపో యతిసంగాత్మా నిర్వ్యంగో వ్యంగనాశనః ॥ 128 ॥**

సర్వకారణుడు, భయం లేనివాడు, నరనారాయణులందు ప్రీతి గలవాడు, నిర్లిప్తుడు, ఆత్మయందు యతిసాంగత్యంగలవాడు, అంగవైకల్యం లేనివాడు, అంగవైకల్యాన్ని పోగొట్టువాడు.

**స్తవ్యః స్తవప్రియః స్తోతా వ్యాసమూర్తిర్నిరంకులః ।**
**నిరవద్యమయోపాయో విద్యారాశిశ్చ సత్కృతః ॥ 129 ॥**

స్తుతింపదగినవాడు, స్తోత్రప్రియుడు, స్తుతించువాడు, వ్యాసునిగా అవతరించినవాడు, ఆదుర్దా లేనివాడు, దోషరహితమైన సాధనాలు గలవాడు, విద్యారాశి, సత్కరింపబడువాడు.

**ప్రశాంతబుద్ధిరక్షుణ్ణః సంగ్రహో నిత్యసుందరః ।**
**వైయాఘ్రధుర్యో ధాత్రీశః సంకల్పః శర్వరీపతిః ॥ 130 ॥**

ప్రశాంతమైన బుద్ధిగలవాడు, తెలియ శక్యం కానివాడు, సర్వసంహారకుడు, నిత్యసుందరుడు, మృగాలలో వ్యాఘ్రంవలె దేవతలలో అగ్రేసరుడు, భూలోకాధిపతి, సంకల్పస్వరూపుడు, రాత్రికి అధిపతి.

**పరమార్థగురుర్దత్తః సూరిరాశ్రితవత్సలః ।**
**సోమో రసజ్ఞో రసదః సర్వసత్త్వావలంబనః ॥ 131 ॥**

యథార్థమైన గురువు, దత్తాత్రేయుడు, విద్వాంసుడు, ఆశ్రితవత్సలుడు, ఉమాదేవితో గూడినవాడు, రసజ్ఞుడు, రసమునిచ్చువాడు, సర్వప్రాణులకు ఆలంబనమైనవాడు.

**ఏవం నామ్నాం సహస్రేణ తుష్టావ హి హరం హరిః ।**
**ప్రార్థయామాస శంభుం వై పూజయామాస పంకజః ॥ 132 ॥**

ఈ విధమైన వేయి నామాలతో విష్ణువు పాపరహితుడైన శివుని స్తుతించి ప్రార్థించి పద్మాలతో పూజించాడు.

**తతః స కౌతుకీ శంభుశ్చకార చరితం ద్విజాః! ।**
**మహాద్భుతం సుఖకరం తదేవ శృణుతాదరాత్ ॥ 133 ॥**

ఓ బ్రాహ్మణులారా! అనంతరం కౌతుకంతో కూడినవాడైన శంభువు ఆనందదాయకము, అత్యద్భుతమునగు చరిత్ర చేశాడు. దానిని మీరు శ్రద్ధతో వినండి.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం శివసహస్రనామవర్ణనం నామ పంచత్రింశోఽధ్యాయః ॥ 35 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు శివసహస్రనామవర్ణనం అనే పేరుగల ముప్పైఐదవ అధ్యాయం సమాప్తం.

## షట్త్రింశోఽధ్యాయః – ముప్పైఆరవ అధ్యాయం

## శివసహస్రనామస్తోత్రఫలవర్ణనమ్ – శివసహస్రనామస్తోత్రఫలవర్ణనం

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**శ్రుత్వా విష్ణుకృతం దివ్యం పరనామ విభూషితమ్ ।**
**సహస్రనామ స్వస్తోత్రం ప్రసన్నోఽభూన్మహేశ్వరః ॥ 1 ॥**

విష్ణుకృతమైనదియు, దివ్యమైనదియు, శ్రేష్ఠమైన నామాలతో కూడినదియునైన తన సహస్రనామ స్తోత్రాన్ని మహేశ్వరుడు విని ప్రసన్నుడయ్యాడు.

**పరీక్షార్థం హరేరీశః కమలేషు మహేశ్వరః ।**
**గోపయామాస కమలం తదైకం భువనేశ్వరః ॥ 2 ॥**

మహేశ్వరుడు, భువనేశ్వరుడునైన శివుడు విష్ణువును పరీక్షించడానికి కమలాలలోని ఒక కమలాన్ని దాచిపెట్టాడు.

**పంకజేషు తదా తేషు సహస్రేషు బభూవ చ ।**
**న్యూనమేకం తదా విష్ణుర్విహ్వలః శివపూజనే ॥ 3 ॥**

అప్పుడు పద్మాలతో శివపూజ చేయాలనే కంగారుతో నున్న విష్ణువు వేయి పద్మాలలో ఒకటి తక్కువైనదని గ్రహించాడు.

**హృదా విచారితం తేన కుతో వై కమలం గతమ్ ।**
**యాతం యాతు సుఖేనైవ మన్నేత్రం కమలం న కిమ్ ॥ 4 ॥**

అప్పుడాతడు తన మనస్సులో ఇలా ఆలోచించాడు. "కమలం ఎక్కడకు పోయిందో? అది సుఖంగా తన దారిని తాను పోతే పోవుగాక! నా నేత్రకమలం లేదా యేమి!"

**జ్ఞాత్వేతి నేత్రముద్ధృత్య సర్వసత్త్వావలంబనాత్ ।**
**పూజయామాస భావేన స్తవయామాస తేన చ ॥ 5 ॥**

ఇట్లు భావించి కన్నునొక దానిని ఊడబెరికి, ఆఖరి నామమైన 'సర్వసత్త్వాలంబనః, (సర్వప్రాణుల–కాలంబనమైనవాడు) అనే నామంతో స్తుతించి తన పద్మనయనంతో భక్తి పూర్వకంగా పూజించాడు.

**తతః స్తుతమథో దృష్ట్వా తథాభూతం హరో హరిమ్ ।**
**మా మేతి వ్యాహరన్నేవ ప్రాదురాసీజ్జగద్గురుః ॥ 6 ॥**

ఆ విధంగా స్తుతించిన విష్ణువును గాంచి, జగద్గురువగు శివుడు "వద్దు, వద్దు" అని పలుకుతూ వెంటనే ఆవిర్భవించాడు.

**తస్మాదవతారాశు మండలాత్పార్థివస్య చ ।**
**ప్రతిష్ఠితస్య హరిణా స్వలింగస్య మహేశ్వరః ॥ 7 ॥**

విష్ణువుచే ప్రతిష్ఠింపబడిన పార్థివలింగమండలం నుండి మహేశ్వరుడు వెంటనే ఆవిర్భవించాడు. (అవతరించాడు).

**యథోక్తరూపిణం శంభుం తేజోరాశిసముత్థితమ్ ।**
**నమస్కృత్య పురః స్థిత్వా స తుష్టావ విశేషతః ॥ 8 ॥**

ఆ విష్ణువుచే వర్ణింపబడిన రూపంతో, తేజోరాశియై అవతరించిన శంభునకు నమస్కరించి ఎదుట నిలబడి విశేషంగా స్తుతించాడు.

**తదా ప్రాహ మహాదేవః ప్రసన్నః ప్రహసన్నివ ।**
**సంప్రేక్ష్య కృపయా విష్ణుం కృతాంజలిపుటం స్థితమ్ ॥ 9 ॥**

అప్పుడు మహాదేవుడు ప్రసన్నుడై చిరునవ్వుతోను, కృపాదృష్టితోను, చేతులు కట్టుకొనియున్న విష్ణువును జూచి ఇలా పలికాడు.

**శంకర ఉవాచ –** శంకరుడు పలికాడు.

**జ్ఞాతం మయేదం సకలం తవ చిత్తేప్సితం హరే! ।**
**దేవకార్యం విశేషేణ దేవకార్యరతాత్మనః ॥ 10 ॥**

ఓ హరీ! నీ మనస్సులో కోరిక నాకు పూర్తిగా తెలిసింది. దేవకార్యం సాధించడంలో విశేష శ్రద్ధ గల నీవు దేవకార్యం కోరుతున్నావు.

**దేవకార్యస్య సిద్ధ్యర్థం దైత్యనాశాయ చాశ్రమమ్ ।**
**సుదర్శనాఖ్యం చక్రం చ దదామి తవ శోభనమ్ ॥ 11 ॥**

శ్రమ లేకుండగా రాక్షసులు నశించి, దేవకార్యం సిద్ధించడానికి నీకు 'సుదర్శనము' అని పిలవబడే చక్రాన్ని ఇస్తున్నాను.

**యద్రూపం భవతా దృష్టం సర్వలోక సుఖావహమ్ ।**
**హితాయ తవ దేవేశ! ధృతం భావయ తద్ధ్రువమ్ ॥ 12 ॥**

ఓ దేవేశా! నేను నీ హితంకొఱకు ధరించినట్టియు, సర్వజీవులకు సుఖాన్నిచ్చే నాయీ రూపం చూచి యున్నావు. దానిని నీవు నిశ్చయంగా ధ్యానించు.

**రణాజిరే స్మృతం తద్వై దేవానాం దుఃఖనాశనమ్ ।**
**ఇదం చక్రమిదం రూపమిదం నామసహస్రకమ్ ॥ 13 ॥**

యుద్ధరంగంలో ఈ చక్రాన్ని, ఈ రూపాన్ని, ఈ సహస్ర నామాలను స్మరిస్తే దేవతల దుఃఖం అంతమౌతుంది.

**యే శృణ్వంతి సదా భక్త్యా సిద్ధిః స్యాదనపాయినీ ।**
**కామానాం సకలానాం చ ప్రసాదాన్మమ సువ్రత! ॥ 14 ॥**

ఓ సువ్రత! ఎవరైతే దీనిని సర్వదా భక్తితో వింటారో, వారికి శాశ్వతమైన సిద్ధి లభించడమేగాక నా అనుగ్రహంచే సమస్త కోరికలు నెరవేరుతాయి.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఏవముక్త్వా దదౌ చక్రం సూర్యాయుతసమప్రభమ్ ।**
**సుదర్శనం స్వపాదోత్థం సర్వశత్రువినాశనమ్ ॥ 15 ॥**

ఇట్లు పలికి ఆయన తన పాదంనుండి పుట్టి పదివేల సూర్యుల కాంతితో ప్రకాశిస్తున్న సర్వశత్రుసంహారకమైన సుదర్శనచక్రాన్నిచ్చాడు.

**విష్ణుశ్చాపి సుసంస్కృత్య జగ్రాహోదఙ్ముఖస్తదా ।**
**నమస్కృత్య మహాదేవం విష్ణుర్వచనమబ్రవీత్ ॥ 16 ॥**

అప్పుడు విష్ణువు కూడ తనను తాను చక్కగా సంస్కరించుకొని ఉత్తరముఖంగానుండి మహాదేవునకు నమస్కరించి దానిని స్వీకరించి ఇలా పలికాడు.

**విష్ణురువాచ** – విష్ణువు పలికాడు.

**శృణు దేవ! మయా ధ్యేయం పఠనీయం చ కిం ప్రభో! ।**
**దుఃఖానాం నాశనార్థం హి వద త్వం లోకశంకర! ॥ 17 ॥**

ఓ దేవా! ప్రభూ! విను. నేను దుఃఖవినాశనానికి దేనిని ధ్యానించాలి? దేనిని పఠించాలి? లోకశంకరా! నీవు చెప్పు.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఇతి పృష్టస్తదా తేన సంతుష్టస్తు శివోఽబ్రవీత్ ।**
**ప్రసన్నమానసో భూత్వా విష్ణుం దేవసహాయకమ్ ॥ 18 ॥**

విష్ణువిట్లు ప్రశ్నించగా శివుడు సంతోషించి ప్రసన్నమైన మనస్సు గలవాడై దేవసహాయకుడైన విష్ణువుతో ఇట్లన్నాడు.

**శివ ఉవాచ** – శివుడు పలికాడు.

**రూపం ధ్యేయం హరే! మే హి సర్వానర్థప్రశాంతయే ।**
**అనేకదుఃఖనాశార్థం పఠ నామసహస్రకమ్ ॥ 19 ॥**

ఓ విష్ణూ! అన్ని అనర్థములనుండి ప్రశాంతికొఱకు నా రూపాన్ని ధ్యానించు. దుఃఖాలు నశించడానికి ఈ సహస్రనామాలను పఠించు.

**ధార్యం చక్రం సదా మే హి సర్వాభీష్టస్య సిద్ధయే ।**
**త్వయా విష్ణో! ప్రయత్నేన సర్వచక్రవరం త్విదమ్ ॥ 20 ॥**

ఓ విష్ణూ! సర్వాభీష్టసిద్ధి కలగడానికి నీవు ఈ చక్రాన్ని సదా ధరించాలి. సర్వచక్రశ్రేష్ఠమైన దీనిని నీవు ప్రయత్నపూర్వకంగా ధరించాలి.

**అన్యే చ యే పఠిష్యంతి పాఠయిష్యంతి నిత్యశః ।**
**తేషాం దుఃఖం న స్వప్నేఽపి జాయతే నాత్ర సంశయః ॥ 21 ॥**

నీవు మాత్రమేగాక ఇతరులెవరైతే దీనిని నిత్యం పఠిస్తారో, పఠింపజేస్తారో వారికి కలలోనైననూ దుఃఖం దరికి రాదు. ఇందులో ఎటువంటి సందేహం లేదు.

**రాజ్ఞా చ సంకటే ప్రాప్తే శతావృత్తిం చరేద్యదా ।**
**సాంగం చ విధిసంయుక్తం కల్యాణం లభతే నరః ॥ 22 ॥**

ఆపదను పొందిన రాజు దీనిని సాంగంగా, యథావిధిగా, వందమార్లు పఠిస్తే కల్యాణం పొందుతాడు.

**రోగనాశకరం హ్యేతద్విద్యావిత్తదముత్తమమ్ ।**
**సర్వకామప్రదం పుణ్యం శివభక్తిప్రదం సదా ॥ 23 ॥**

ఉత్తమమైనది, పవిత్రమైనదియునగు ఈ స్తోత్రం రోగాలను నశింపజేస్తుంది. విద్యను, విత్తాన్ని, సర్వకోరికలను, శివభక్తిని ప్రసాదిస్తుంది.

**యదుద్దిశ్య ఫలం శ్రేష్ఠం పఠిష్యంతి నరాస్త్విహ ।**
**లప్స్యంతే నాత్ర సందేహః ఫలం తత్సత్యముత్తమమ్ ॥ 24 ॥**

ఇహలోకంలో మానవులీ ఉత్తమస్తోత్రాన్ని, ఎటువంటి శ్రేష్ఠఫలాన్ని ఆశించి పఠిస్తారో, వారు ఆ ఫలాన్ని పొందుతారనడంలో సందేహం లేదు.

**యశ్చ ప్రాతః సముత్థాయ పూజాం కృత్వా మదీయికామ్ ।**
**పఠతే మత్సమక్షం వై నిత్యం సిద్ధిర్న దూరతః ॥ 25 ॥**

ఎవడైతే ఉదయాన్నే లేచి నన్ను పూజించి నా సమక్షంలో నిత్యమూ దీనిని పఠిస్తాడో వానికి సిద్ధి దూరంలో నుండదు. (అంటే సమీపమౌతుందనుట నిశ్చయం.)

**ఐహికీం సిద్ధిమాప్నోతి నిఖిలాం సర్వకామికామ్ ।**
**అంతే సాయుజ్యముక్తిం వై ప్రాప్నోత్యత్ర న సంశయః ॥ 26 ॥**

అట్టివానికి ఈ లోకంలో సకల కోరికలు సిద్ధించి సర్వకార్యాలు నెరవేరుతాయి. అంతమాత్రమే గాక మరణానంతరం సాయుజ్యముక్తి కూడ లభిస్తుందనడంలో సందేహం లేదు.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఏవముక్త్వా తదా విష్ణుం శంకరః ప్రీతమానసః ।**
**ఉపస్పృశ్య కరాభ్యాం తమువాచ గిరిశః పునః ॥ 27 ॥**

అప్పుడు కైలాసవాసియైన శంకరుడు సంతసించిన మనస్సు గలవాడై విష్ణువును చేతులతో స్పృశించి మరల ఇలా పలికాడు.

**శివ ఉవాచ –** శివుడు పలికాడు.

**వరదోఽస్మి సురశ్రేష్ఠ! వరాన్వృణు యథేప్సితాన్ ।**
**భక్త్యా వశీకృతో నూనం స్తవేనానేన సువ్రతః ॥ 28 ॥**

ఓ దేవోత్తమా! నేను నీకు వరాలనిస్తాను. నీకు నచ్చిన వరం కోరుకో. మంచి నియమాలు గలవాడై నీవు భక్తితో సహస్రనామస్తోత్రాన్ని పఠించి నిశ్చయంగా నన్ను వశం చేసుకున్నావు.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యుక్తో దేవదేవేన దేవదేవం ప్రణమ్య తమ్ ।**
**సుప్రసన్నతరో విష్ణుః సాంజలిర్వాక్యమబ్రవీత్ ॥ 29 ॥**

దేవదేవుడైన శివుడిట్లు పలుకగా విష్ణువు మిక్కిలి సంతసించి ఆయనకు ప్రణమిల్లి, అంజలి జోడించి ఇలా పలికాడు.

**విష్ణు రువాచ –** విష్ణువు పలికాడు.

**యథేదానీం కృపానాథ! క్రియతే చాన్యతః పరా ।**
**కార్యా చైవ విశేషేణ కృపాళుత్వాత్త్వయా ప్రభో ॥ 30 ॥**

ఓ నాథా! నీవు దయామయుడవు. నీవిప్పుడెట్లు గొప్ప దయ చూపించావో అదే విధంగా ఇతర సందర్భాలలో కూడ విశేషమైన దయను మాయందు చూపించు.

**త్వయి భక్తిర్మహాదేవ! ప్రసీద వరముత్తమమ్ ।**
**నాన్యమిచ్ఛామి భక్తానామార్తయో నైవ యత్ప్రభో! ॥ 31 ॥**

ఓ మహాదేవా! నీ యందు భక్తియనే ఉత్తమ వరాన్ని మీరు నాకు అనుగ్రహించండి. ఓ ప్రభూ! నీ భక్తులకు కష్టాలు లేనే లేవు. కాబట్టి నేను మరేవిధమైన వరాన్ని కోరడం లేదు.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**తచ్ఛ్రుత్వా వచనం తస్య దయావాన్సుతరాం భవః ।**
**పస్పర్శ చ తదీయాంగం ప్రాహ శీతాంశుశేఖరః ॥ 32 ॥**

విష్ణువు వచనాలు విని పరమదయామూర్తియు, చంద్రశేఖరుడునగు శివుడు విష్ణువు దేహాన్ని స్పృశించి ఇలా పలికాడు.

**శివ ఉవాచ** – శివుడు పలికాడు.

**మయి భక్తిస్సదా తే తు హరే! స్యాదనపాయినీ ।**
**సదా వంద్యశ్చ పూజ్యశ్చ లోకే భవ సురైరపి ॥ 33 ॥**

ఓ విష్ణూ! నీకు నాయందు సర్వకాలాలలోను భక్తి స్థిరంగా ఉంటుంది. నీవు లోకంలోను, దేవతలకు కూడ సర్వదా వందనీయుడవు, పూజనీయుడవు కాగలవు.

**విశ్వంభరేతి తే నామ సర్వపాపహరం పరమ్ ।**
**భవిష్యతి న సందేహో మత్ప్రసాదాత్సురోత్తమ! ॥ 34 ॥**

ఓ దేవోత్తమా! నీకు సకల పాపాలను పోగొట్టే 'విశ్వంభరుడు' అనే శ్రేష్ఠనామం నా అనుగ్రహంచే కలుగుతుంది. ఇది నిస్సంశయం.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఇత్యుక్త్వాంతర్దధే రుద్రః సర్వదేవేశ్వరః ప్రభుః ।**
**పశ్యతస్తస్య విష్ణోస్తు తత్రైవ చ మునీశ్వరాః! ॥ 35 ॥**

ఓ మహర్షులారా! సర్వదేవేశ్వరుడు, ప్రభుడునైన రుద్రుడు ఈ విధంగా పలికి విష్ణువు చూస్తూ ఉండగానే అంతర్ధానమయ్యాడు.

**జనార్దనోఽపి భగవాన్వచనాచ్ఛంకరస్య చ ।**
**ప్రాప్య చక్రం శుభం తద్వై జహర్షాతి స్వచేతసి ॥ 36 ॥**

జనార్దనుడు కూడ శంకర భగవానుని వచనాలు పాటించి శుభంకరమైన చక్రాన్ని పొంది తన మనస్సులో చాల సంతసించాడు.

**కృత్వా ధ్యానం చ తచ్ఛంభోః స్తోత్రమేతన్నిరంతరమ్ ।**
**పపాఠాధ్యాపయామాస భక్తేభ్యస్తదుపాదిశత్ ॥ 37 ॥**

ఆయన శంభుని ధ్యానించి నిరంతరం ఈ స్తోత్రాన్ని పఠించి దానిని భక్తులకు ఉపదేశించి వారిచే పఠింపజేశాడు.

**ఇతి పృష్టం మయాఽఽఖ్యాతం శృణ్వతాం పాపహారకమ్ ।**
**అతః పరం చ కిం శ్రేష్ఠాః! ప్రష్టుమిచ్ఛథ వై పునః ॥ 38 ॥**

ఈ విధంగా మీరడిగిన ప్రశ్నకు నేను సమాధానం చెప్పాను. దీనిని విన్నవారికి పాపాలు తొలగిపోతాయి. ఓ మహాత్ములారా! ఈపై మీరింకనూ ఏమి తెలియగోరుతున్నారు?

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం శివసహస్రనామస్తోత్రఫలవర్ణనం నామ షట్త్రింశోఽధ్యాయః ॥ 36 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు శివసహస్రనామస్తోత్రఫలవర్ణనం అనే పేరుగల ముప్పైఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్తత్రింశోఽధ్యాయః – ముప్పైఏడవ అధ్యాయం
## దేవర్షినృపశైవత్వవర్ణనమ్ – దేవర్షినృపశైవత్వవర్ణనం

**ఋషయ ఊచుః –** ఋషులు పలికారు.

**సూత! సూత! మహాభాగ! జ్ఞానవానసి సువ్రత! ।**
**పునరేవ శివస్య వై చరితం బ్రూహి విస్తరాత్ ॥ 1 ॥**

ఓ సూతా! సూతా! మహాభాగా! సువ్రతా! నీవు జ్ఞానవంతుడవు. మరల శివుని వృత్తాంతాన్నే సవిస్తరంగా చెప్పు.

**పురాతనాశ్చ రాజాన ఋషయో దేవతాస్తథా ।**
**ఆరాధనం చ తస్యైవ చక్రుర్దేవవరస్య హి ॥ 2 ॥**

ఆ దేవదేవుని మాత్రమే ఆరాధించిన పురాతన రాజులు, ఋషులు, దేవతలు ఎవరున్నారో తెలియజేయుము.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**సాధు పృష్టమృషిశ్రేష్ఠాః! శ్రూయతాం కథయామి వః ।**
**చరిత్రం శాంకరం రమ్యం శృణ్వతాం భుక్తిముక్తిదమ్ ॥ 3 ॥**

ఓ మహర్షులారా! మీరు చక్కగా ప్రశ్నించారు. వినేవారికి భుక్తిని, ముక్తిని ప్రసాదించే సుందరమైన శంకరుని వృత్తాంతం మీకు చెబుతాను.

**ఏతదేవ పురా పృష్టో నారదేన పితామహః ।**
**ప్రత్యువాచ ప్రసన్నాత్మా నారదం మునిసత్తమమ్ ॥ 4 ॥**

ఇట్లే పూర్వ కాలంలో నారదుడు బ్రహ్మను ప్రశ్నించగా ఆయన ప్రసన్నాత్ముడై నారదునితో ఇలా చెప్పాడు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**శృణు నారద! సుప్రీత్యా శాంకరం చరితం వరమ్ ।**
**ప్రవక్ష్యామి భవత్స్నేహాన్మహాపాతకనాశనమ్ ॥ 5 ॥**

ఓ నారదా! మహాపాపాలను పోగొట్టే శంకరుని శ్రేష్ఠమైన చరితమును నీయందలి ప్రేమచే చెబుతాను. పరమప్రీతితో విను.

**రమయా సహితో విష్ణుః శివపూజాం చకార హ ।**
**కృపయా పరమేశస్య సర్వాన్కామానవాప హి ॥ 6 ॥**

లక్ష్మీదేవితో గూడిన శ్రీ మహావిష్ణువు శివుని పూజించి, పరమేశ్వరుని దయచే కోర్కెలన్నింటిని పొందాడు.

**అహం పితామహశ్చాపి శివపూజనకారకః ।**
**తస్యైవ కృపయా తాత! విశ్వసృష్టికరస్సదా ॥ 7 ॥**

ఓ కుమారా! పితామహుడనైన నేను కూడ శివుని పూజించి ఆయన దయచేతనే సర్వదా సృష్టి చేస్తున్నాను.

**శివపూజాకరా నిత్యం మత్పుత్రాః పరమర్షయః ।**
**అన్యే చ ఋషయో యే తే శివపూజనకారకాః ॥ 8 ॥**

నా కుమారులైన మహర్షులు, తదితర మహర్షులు కూడ సర్వదా శివుని పూజిస్తారు.

**నారద! త్వం విశేషేణ శివపూజనకారకః ।**
**సప్తర్షయో వసిష్ఠాద్యాః శివపూజనకారకాః ॥ 9 ॥**

నారదా! నీవు శివుని విశేషంగా పూజిస్తావు. వసిష్ఠుడు మున్నగు సప్తర్షులు కూడ శివుని పూజిస్తారు.

**అరుంధతీ మహాసాధ్వీ లోపాముద్రా తథైవ చ ।**
**అహల్యా గౌతమస్త్రీ చ శివపూజనకారికాః ॥ 10 ॥**

మహాపతివ్రతయైన అరుంధతి, లోపాముద్ర, మరియు గౌతమునిభార్యయైన అహల్య కూడ శివుని పూజిస్తారు.

**దుర్వాసాః కౌశికః శక్తిర్దధీచో గౌతమస్తథా ।**
**కణాదో భార్గవో జీవో వైశంపాయన ఏవ చ ॥ 11 ॥**

దుర్వాసుడు, కౌశికుడు, శక్తి, దధీచుడు, గౌతముడు, కణాదుడు, భార్గవుడు, బృహస్పతి, వైశంపాయనుడు కూడ శివుని పూజించేవారే.

**ఏతే చ మునయస్సర్వే శివపూజాకరా మతాః ।**
**తథా పరాశరో వ్యాసః శివపూజారతస్సదా ॥ 12 ॥**

ఈ మునులందరు మాత్రమే గాక, పరాశరుడు, వ్యాసభగవానుడు కూడ శివపూజయందు నిష్ఠగలవారే.

**ఉపమన్యుర్మహాభక్తః శివస్య పరమాత్మనః ।**
**యాజ్ఞవల్క్యో మహాశైవో జైమినిర్గర్గ ఏవ చ ॥ 13 ॥**

ఉపమన్యుడు శివపరమాత్మకు మహాభక్తుడు. జైమిని, యాజ్ఞవల్క్యుడు, గర్గుడు కూడ మహాశివభక్తులే.

**శుకశ్చ శౌనకాద్యాశ్చ శంకరస్య ప్రపూజకాః ।**
**అన్యేఽపి బహవః సంతి మునయో మునిసత్తమాః ॥ 14 ॥**

శుకశౌనకాది మహర్షులు కూడ శంకరపూజకులే. వీరేగాక శంకరపూజకులైన మహర్షులెందరో ఉన్నారు.

**అదితిర్దేవమాతా చ నిత్యం ప్రీత్యా చకార హ ।**
**పార్థివీం శైవపూజాం వై సవధూః ప్రేమతత్పరా ॥ 15 ॥**

దేవమాతయైన అదితి కోడలితో కలిసి, నిత్యం పరమప్రేమతో పార్థివ శివలింగ పూజ చేసేది.

**శక్రాదయో లోకపాలా వసవశ్చ సురాస్తథా ।**
**మహారాజకదేవాశ్చ సాధ్యాశ్చ శివపూజకాః ॥ 16 ॥**

ఇంద్రుడు మున్నగు లోకపాలకులు, వసువులు, దేవతలు, మహారాజకదేవతలు, సాధ్యులు కూడ శివపూజకులే.

**గంధర్వా కిన్నరాద్యాశ్చోపసురాః శివపూజకాః ।**
**తథాఽసురా మహాత్మానః శివపూజాకరా మతాః ॥ 17 ॥**

గంధర్వులు, కిన్నరులు, ఉపదేవతలు మున్నగువారు మాత్రమే గాక మహాత్ములైన రాక్షసులు కూడ శివుని పూజించేవారని పెద్దలు చెబుతారు.

**హిరణ్యకశిపుర్దైత్యః సానుజస్ససుతో మునే! ।**
**శివపూజాకరో నిత్యం విరోచనబలీ తథా ॥ 18 ॥**

ఓ నారదమునీ! హిరణ్యకశిపుడనే రాక్షసుడు సోదరులతోను, పుత్రులతోను గూడి నిత్యం శివుని పూజించేవాడు. విరోచనుడు, బలి కూడ అట్లే శివుని పూజించేవారు.

**మహాశైవస్స్మృతో బాణో హిరణ్యాక్షసుతాస్తథా ।**
**వృషపర్వా దనుస్తాత! దానవాః శివపూజకాః ॥ 19 ॥**

ఓ నారదా! దనుడు మరియు అతని సంతానమగు బాణుడు మహాశైవుడని కీర్తింపబడ్డాడు. ఓ కుమారా! ఇంతేగాక హిరణ్యాక్షుని కుమారులు, వృషపర్వుడు, దానవులు కూడ శివపూజకులే.

**శేషశ్చ వాసుకిశ్చైవ తక్షకశ్చ తథా పరే ।**
**శివభక్తా మహానాగా గరుడాద్యాశ్చ పక్షిణః ॥ 20 ॥**

శేషుడు, వాసుకి, తక్షకుడు, తదితర మహాసర్పాలు మాత్రమే గాక, గరుడుడు మున్నగు పక్షులు కూడ శివభక్తి గలవే.

**సూర్యచంద్రావుభౌ దేవౌ పృథ్వ్యాం వంశప్రవర్తకౌ ।**
**శివసేవారతౌ నిత్యం సవంశ్యౌ తౌ మునీశ్వర! ॥ 21 ॥**

ఓ మహర్షీ! భూలోకంలో వంశాలను ప్రవర్తిల్లజేసిన సూర్యచంద్రులిద్దరు తమ వంశీయులతో సహా నిత్యం నిష్ఠతో శివుని పూజించేవారే.

**మనవశ్చ తథా చక్రుః స్వాయంభువపురస్సరాః ।**
**శివపూజాం విశేషేణ శివవేషధరా మునే! ॥ 22 ॥**

ఓ మునీ! స్వాయంభువు మున్నగు మనువులు కూడ శివవేషధరులై శివపూజను విశేషంగా చేసేవారు.

**ప్రియవ్రతశ్చ తత్పుత్రాస్తథా చోత్తానపాత్సుతః ।**
**తద్వంశాశ్చైవ రాజానః శివపూజనకారకాః ॥ 23 ॥**

ప్రియవ్రతుడు, ఆయన పుత్రులు, ఉత్తానపాదుడు, అతని కుమారుడు, వారి వంశంలోని రాజులందరు శివుని పూజించెడివారే.

**ధ్రువశ్చ ఋషభశ్చైవ భరతో నవ యోగినః ।**
**తద్భ్రాతరః పరే చాపి శివపూజనకారకాః ॥ 24 ॥**

ధ్రువుడు, ఋషభుడు, భరతుడు, అతని సోదరులైన తొమ్మిదిమంది యోగులు, తదితరులు కూడ శివుని పూజించెడివారే.

**వైవస్వతసుతాస్తార్క్ష్య ఇక్ష్వాకుప్రముఖా నృపాః ।**
**శివపూజారతాత్మానః సర్వదా సుఖభోగినః ॥ 25 ॥**

వైవస్వతుని కుమారులు, తార్క్ష్యుడు, ఇక్ష్వాకువు మొదలగు రాజులు సర్వకాలాలలో శివుని నిష్ఠతో పూజించి సుఖాలనుభవించారు.

**కకుత్స్థశ్చాపి మాంధాతా సగరః శైవసత్తమః ।**
**ముచుకుందో హరిశ్చంద్రః కల్మాషాంఘ్రిస్తథైవ చ ॥ 26 ॥**

కకుత్సుడు, మాంధాత, సగరుడు, ముచుకుందుడు, హరిశ్చంద్రుడు, కల్మాషపాదుడు కూడ గొప్ప శివభక్తులే.

**భగీరథాదయో భూపా బహవో నృపసత్తమాః ।**
**శివపూజాకరా జ్ఞేయాః శివవేషవిధాయినః ॥ 27 ॥**

భగీరథుడు మున్నగు అనేక మహారాజులు శివవేషం ధరించి శివపూజ చేసేవారని తెలుసుకోవాలి.

**ఖట్వాంగశ్చ మహారాజో దేవసాహాయ్యకారకః ।**
**విధితః పార్థివీం మూర్తిం శివస్యాపూజయత్సదా ॥ 28 ॥**

దేవతలకు సహాయం చేసిన ఖట్వాంగ మహారాజు యథావిధిగా పార్థివశివమూర్తిని చేసి నిత్యం పూజించేవాడు.

**తత్పుత్రో హి దిలీపశ్చ శివపూజనకృత్సదా ।**
**రఘుస్తత్తనయః శైవః సుప్రీత్యాః శివపూజకః ॥ 29 ॥**

ఆయన పుత్రుడైన దిలీపుడు నిత్యం శివపూజ చేసేవాడు. ఆయన కుమారుడైన రఘుమహారాజు ప్రేమతో శివుని పూజించే శివభక్తుడు.

**అజశ్శివార్చకస్తస్య తనయో ధర్మయుద్ధకృత్ ।**
**జాతో దశరథో భూయో మహారాజో విశేషతః ॥ 30 ॥**

ధర్మయుద్ధం చేయువాడునైన రఘువంశంలోని అజుడు శివార్చకుడే. ఆయన కుమారుడును, మిక్కిలి విఖ్యాతిగాంచిన మహారాజు దశరథుడు శివపూజకులే.

**పుత్రార్థే పార్థివీం మూర్తిం శైలీం దశరథో హి సః ।**
**సమానర్చ విశేషణ వసిష్ఠస్యాజ్ఞయా మునేః ॥ 31 ॥**

దశరథమహారాజు పుత్రసంతానంకొఱకు వసిష్ఠమహర్షి ఆజ్ఞచే, శివుని పార్థివమూర్తిని విశేషశ్రద్ధతో ఆరాధించాడు.

**పుత్రేష్టిం చ చకారాసౌ పార్థివో భవభక్తిమాన్ ।**
**ఋష్యశృంగమునేరాజ్ఞాం సంప్రాప్య నృపసత్తమః ॥ 32 ॥**

శివభక్తుడైన ఆ మహారాజు ఋష్యశృంగమహర్షియొక్క ఆజ్ఞతో పుత్రకామేష్టిని చేశాడు.

**కౌసల్యా తత్ప్రియా మూర్తిం పార్థివీం శాంకరీం ముదా ।**
**ఋష్యశృంగసమాదిష్టా సమానర్చ సుతాప్తయే ॥ 33 ॥**

దశరథుని ప్రియురాలైన కౌసల్య ఋష్యశృంగుని ఆదేశంతో శంకరుని పార్థివమూర్తిని పుత్రసంతానం-కొఱకు ఆనందంతో పూజించేది.

**సుమిత్రా చ శివం ప్రీత్యా కైకేయీ నృపవల్లభా ।**
**పూజయామాస సత్పుత్రప్రాప్తయే మునిసత్తమ! ॥ 34 ॥**

ఓ మహర్షీ! దశరథుని భార్యలైన సుమిత్ర, కైకేయి కూడ సత్పుత్రప్రాప్తికొఱకు ప్రీతిపూర్వకంగా శివుని పూజించారు.

**శివప్రసాదతస్తా వై పుత్రాన్ ప్రాపుశ్శుభంకరాన్ ।**
**మహాప్రతాపినో వీరాన్సన్మార్గనిరతాన్మునే! ॥ 35 ॥**

ఓ నారదమునీ! వారు శివుని అనుగ్రహంచే, శుభకర్మల ననుష్ఠించువారును, గొప్ప ప్రతాపం గలవారును. సన్మార్గంలో ప్రీతి గలవారును, వీరులునునగు పుత్రులను పొందారు.

**తతః శివాజ్ఞయా తస్మాత్తాసు రాజ్ఞః స్వయం హరిః ।**
**చతుర్భిశ్చైవ రూపైశ్చావిర్బభూవ నృపాత్మజః ॥ 36 ॥**

కాబట్టియే శివాజ్ఞచే విష్ణువు దశరథుని భార్యలందు స్వయంగా నాలుగు రూపాలతో రాజకుమారులుగా అవతరించాడు.

**కౌసల్యాయాః సుతో రామః సుమిత్రాయాశ్చ లక్ష్మణః ।**
**శత్రుఘ్నశ్చైవ కైకేయ్యా భరతశ్చేతి సువ్రతాః ॥ 37 ॥**

కౌసల్యకు రాముడు, సుమిత్రకు లక్ష్మణుడు మరియు శత్రుఘ్నుడు, కైకేయికి భరతుడు కుమారులై జన్మించి, ధర్మబద్ధమైన జీవితాన్ని గడిపారు.

**రామః ససహజో నిత్యం పార్థివం సమపూజయత్ ।**
**భస్మరుద్రాక్షధారీ చ విరజాగమమాస్థితః ॥ 38 ॥**

రాముడు సోదరులతో కలిసి భస్మాన్ని, రుద్రాక్షలను, ధరించే 'విరజ' అనే శైవాగమనియమాలను పఠిస్తూ నిత్యం పార్థివలింగాన్ని పూజించేవాడు.

**తద్వంశే యే సముత్పన్నా రాజానః సానుగా మునే! ।**
**తే సర్వే పార్థివం లింగం శివస్య సమపూజయన్ ॥ 39 ॥**

ఓ మునీ! వారి వంశంలో పుట్టిన రాజులందరు తమ అనుచరులతో కలిసి శివుని పార్థివలింగాన్ని చక్కగా పూజించారు.

**సుద్యుమ్నశ్చ మహారాజః శైవో మునిసుతో మునే! ।**
**శివశాపాత్ప్రియాహేతోరభూన్నారీ ససేవకః ॥ 40 ॥**

ఓ మునీ! మహర్షికుమారుడు, శివభక్తుడునగు సుద్యుమ్న మహారాజు ప్రియురాలి కారణంగా శివుని శాపంచే సేవకునితో సహా స్త్రీరూపాన్ని పొందాడు.

**పార్థివేశసమర్చాతః పునః సోஉభూత్పుమాన్వరః ।**
**మాసం స్త్రీ పురుషో మాసమేవం స్త్రీత్వం న్యవర్తత ॥ 41 ॥**

**తతో రాజ్యం పరిత్యజ్య శివధర్మపరాయణః ।**
**శివవేషధరో భక్త్యా దుర్లభం మోక్షమాప్తవాన్ ॥ 42 ॥**

అతడు పార్థివశివలింగాన్ని పూజించి మరలా శ్రేష్ఠుడైన పురుషుడయ్యాడు. ఒక నెల పురుషుడు, ఒక నెల స్త్రీ అను విధంగా కొంతకాలం గడిచిన తరువాత శాపం పూర్తిగా తొలగిపోయింది. అనంతరం అతడు రాజ్యాన్ని విడిచి శివధర్మపరాయణుడై శివవేషాన్ని ధరించి భక్తితో దుర్లభమైన మోక్షాన్ని పొందాడు.

**పురూరవాశ్చ తత్పుత్రో మహారాజః సుపూజకః ।**
**శివస్య దేవదేవస్య తత్సుతః శివపూజకః ॥ 43 ॥**

వాని పుత్రుడైన పురూరవ మహారాజు గొప్పగా శివపూజ చేసేవాడు. వాని కుమారుడు కూడ దేవదేవుడైన శివుని పూజించేవాడు.

**భరతస్తు మహాపూజాం శివస్యైవ సదాஉకరోత్ ।**
**నహుషశ్చ మహాశైవః శివపూజారతో హ్యభూత్ ॥ 44 ॥**

భరతుడు కూడ నిత్యం శివుని గొప్పగా పూజించేవాడు. మహాశివభక్తుడైన నహుషుడు శివపూజయందు మహాప్రీతిని కలిగియుండేవాడు.

**యయాతిః శివపూజాతః సర్వాన్కా మానవాప్తవాన్ ।**
**అజీజనత్సుతాన్పంచ శివధర్మపరాయణాన్ ॥ 45 ॥**

**తత్సుతా యదుముఖ్యాశ్చ పంచాపి శివపూజకాః ।**
**శివపూజాప్రభావేణ సర్వాన్కామాంశ్చ లేభిరే ॥ 46 ॥**

యయాతి శివపూజచేసి కోర్కెలన్నింటిని పొందాడు. ఆయనకు శివధర్మపరాయణులైన ఐదుగురు కుమారులు కలిగారు. యదువు మున్నగు ఆ ఐదుగురు కుమారులు కూడ శివుని పూజించి ఆ ప్రభావంచే కోర్కెలన్నింటిని పొందారు.

**అన్యేఽపి యే మహాభాగాః సమానర్చుః శివం హి తే ।**
**తద్వంశ్యా అన్యవంశ్యాశ్చ భుక్తిముక్తిప్రదం మునే! ॥ 47 ॥**

ఓ మునీ! వీరే గాక వారి వంశీయులు, ఇతర వంశీయులెందరో మహాత్ములు భుక్తి-ముక్తిప్రదుడైన శివుని చక్కగా పూజించారు.

**కృష్ణేన చ కృతం నిత్యం బదరీపర్వతోత్తమే ।**
**పూజనం తు శివస్యైవ సప్తమాసావధి స్వయమ్ ॥ 48 ॥**

ఉత్తమమైన బదరీపర్వతం పై శ్రీకృష్ణుడు స్వయంగా ఏడు మాసాలవఱకు నిత్యం శివుని మాత్రమే పూజించాడు.

**ప్రసన్నాద్భగవాంస్తస్మాద్వరాన్ దివ్యాననేకశః ।**
**సంప్రాప్య చ జగత్సర్వం వశేఽనయత శంకరాత్ ॥ 49 ॥**

శంకరుడు ప్రసన్నుడు కాగా, ఆయన ద్వారా శ్రీకృష్ణ భగవానుడనేక వరాలను పొంది సమస్తజగత్తును తన వశం చేసుకున్నాడు.

**ప్రద్యుమ్నః తత్సుతస్తాత! శివపూజాకరస్సదా ।**
**అన్యే చ కార్ష్ణిప్రవరాస్సాంబాద్యా శ్శివపూజకాః ॥ 50 ॥**

ఓ కుమారా! శ్రీ కృష్ణుని కుమారుడైన ప్రద్యుమ్నుడు నిత్యం శివుని పూజించేవాడు. అంతేగాక సాంబుడు మున్నగు శ్రీకృష్ణుని ఇతర పుత్రులు కూడా శివపూజకులే.

**జరాసంధో మహాశైవః త ద్వంశ్యాశ్చ నృపాస్తథా ।**
**నిమిః శైవశ్చ జనకస్తత్పుత్రాశ్శివపూజకాః ॥ 51 ॥**

మహాశైవుడు జరాసంధుడు, వాని వంశీయులైన రాజులు, నిమి, వాని పుత్రుడైన జనకుడు కూడ శివ–పూజకులే.

**నలేన చ కృతా పూజా వీరసేనసుతేన వై ।**
**పూర్వజన్మని యో భిల్లో వనే పాంథసురక్షకః ॥ 52 ॥**

వీరసేన కుమారుడైన నలమహారాజు కూడ శివపూజకుడే. అతడు పూర్వజన్మలో భిల్లుడు. అపుడతడు అడవిలో బాటసారిని రక్షించాడు.

**యతిశ్చ రక్షితస్తేన పురా హరసమీపతః ।**
**స్వయం వ్యాఘ్రాదిభీ రాత్రౌ భక్షితశ్చ మృతో వృషాత్ ॥ 53 ॥**

**తేన పుణ్యప్రభావేణ స భిల్లో హి నలోఽభవత్ ।**
**చక్రవర్తీ మహారాజో దమయంతీప్రియోఽభవత్ ॥ 54 ॥**

పూర్వజన్మలో అతడు శివుని సమీపంలో రాత్రి సమయంలో యతిని రక్షించడానికి తాను స్వయంగా పెద్దపులిచే భక్షింపబడి ధర్మంకొఱకు ప్రాణాలు బలి పెట్టాడు. ఆ పుణ్యప్రభావంచే ఆ భిల్లుడే నలుడై జన్మించి చక్రవర్తియై రాజ్యపాలన చేసి దమయంతికి భర్త అయ్యాడు.

**ఇతి తే కథితం తాత! యత్పృష్టం భవతాఽనఘ! ।**
**శాంకరం చరితం దివ్యం కిమన్యత్ప్రష్టుమిచ్ఛసి ॥ 55 ॥**

ఓ వత్సా! పుణ్యాత్మా! నీవు కోరిన విధంగా దివ్యమైన శంకరచరిత్రను చెప్పాను. ఇంకనూ ఏమి ప్రశ్నింపదలచుకున్నావు?

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం దేవర్షినృపశైవత్వవర్ణనం నామ సప్తత్రింశోఽధ్యాయః ॥ 37 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు దేవర్షినృపశైవత్వవర్ణనం అనే పేరుగల ముప్పైఏడవ అధ్యాయం సమాప్తం.

## అష్టత్రింశోఽధ్యాయః - ముప్పైఎనిమిదవ అధ్యాయం

## శివరాత్రివ్రతమహిమనిరూపణమ్ - శివరాత్రివ్రతమాహాత్మ్యవర్ణనం

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**ధన్యోఽసి కృతకృత్యోఽసి జీవితం సఫలం తవ ।**
**యచ్ఛ్రావయసి నస్తాత! మహేశ్వరకథాం శుభామ్ ॥ 1 ॥**

ఓ తండ్రీ! నీవు ధన్యుడవు. నీవు కృతార్థుడవు. నీ జీవితం సార్థకమయ్యింది. ఎందుకనగా నీవు మాకు శుభంకరమైన మహేశ్వరగాథను వినిపించుచున్నావు.

**బహుభిశ్చర్షిభిస్సూత! శ్రుతం యద్యపి వస్తు సత్ ।**
**సందేహో న మతోఽస్మాకం తదేతత్కథయామి తే ॥ 2 ॥**

ఓ సూతమహర్షీ! ఈ సద్వస్తువును గూర్చి అనేకులైన ఋషులు చెప్పినను మా సందేహం తొలగిపోలేదు. కాబట్టి నిన్ను ప్రశ్నిస్తున్నాం.

**కేన వ్రతేన సంతుష్టః శివో యచ్ఛతి సత్సుఖమ్ ।**
**కుశలః శివకృత్యే త్వం తస్మాత్పృచ్ఛామహే వయమ్ ॥ 3 ॥**

ఏ వ్రతాన్ని అనుష్ఠిస్తే శివుడు సంతోషించి ఉత్తమమైన సుఖాన్ని ఇస్తాడు? నీవు శివారాధనకర్మలందు నిపుణుడవు. కావున మేము నిన్ను ప్రశ్నిస్తున్నాం.

**భుక్తిర్ముక్తిశ్చ లభ్యేత భక్తైర్యేన వ్రతేన వై ।**
**తద్వద త్వం విశేషేణ వ్యాసశిష్య! నమోఽస్తు తే ॥ 4 ॥**

ఓ వ్యాసశిష్యా! భక్తులు ఏ వ్రతంచే భుక్తిని, ముక్తిని పొందగల్గుదురో దానిని నీవు ప్రత్యేకంగా చెప్పుము. నీకు నమస్కారం.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**సమ్యక్ పృష్టమృషిశ్రేష్ఠాః! భవద్భిః కరుణాత్మభిః ।**
**స్మృత్వా శివపదాంభోజం కథయామి యథాశ్రుతమ్ ॥ 5 ॥**

ఓ మహర్షులారా! దయామూర్తులైన మీరు చక్కగా ప్రశ్నించారు. శివుని పాదపద్మాలను స్మరించి నేను విన్నదాని ప్రకారం మీకు చెబుతాను.

**యథా భవద్భిః పృచ్ఛేత తథా పృష్టం హి వేధసా ।**
**హరిణా శివయా చైవ తథా వై శంకరం ప్రతి ॥ 6 ॥**

మీరు ప్రశ్నించిన విధంగానే బ్రహ్మ, విష్ణువు, పార్వతీదేవి శంకరుని ప్రశ్నించియున్నారు.

**కస్మింశ్చిత్సమయే తైస్తు పృష్టం చ పరమాత్మనే ।**
**కేన వ్రతేన సంతుష్టో భుక్తిం ముక్తిం చ యచ్ఛసి ॥ 7 ॥**

వారొకనాడు పరమాత్మయైన శంకరుని "ఏ వ్రతం చేస్తే నీవు సంతసించి భక్తులకు భుక్తి, ముక్తి ప్రసాదిస్తావు?" అని ప్రశ్నించారు.

**ఇతి పృష్టస్తదా తైస్తు హరిణా తేన వై తదా ।**
**తదహం కథయామ్యద్య శృణ్వతాం పాపహారకమ్ ॥ 8 ॥**

ఇట్లు వారు ప్రశ్నించగా శివుడు వారికి చెప్పిన విషయాన్ని నేను మీకు చెబుతున్నాను. దీనిని వినినవారికి పాపవిముక్తి కలుగుతుంది.

**శివ ఉవాచ** – శివుడు పలికాడు.

**భూరి వ్రతాని మే సంతి భుక్తిముక్తిప్రదాని చ ।**
**ముఖ్యాని తత్ర జ్ఞేయాని దశసంఖ్యాని తాని వై ॥ 9 ॥**

భుక్తిని, ముక్తిని ప్రసాదించే నా వ్రతాలు చాలా ఉన్నాయి. కాని వాటిలో పది మాత్రం ముఖ్యమైనవని తెలుసుకోవాలి.

**దశ శైవవ్రతాన్యాహుర్జాబాలశ్రుతిపారగాః ।**
**తాని వ్రతాని యత్నేన కార్యాణ్యేవ ద్విజైః సదా ॥ 10 ॥**

జాబాలశ్రుతిలో పండితులైన ఋషులు పది శైవ వ్రతాలు చెప్పియున్నారు. బ్రాహ్మణులు సర్వదా ఆ పది వ్రతాలను తప్పక ప్రయత్నపూర్వకంగా అనుష్ఠించాలి.

**ప్రత్యష్టమ్యాం ప్రయత్నేన కర్తవ్యం నక్తభోజకమ్ ।**
**కాలాష్టమ్యాం విశేషేణ హరే! త్యాజ్యం హి భోజనమ్ ॥ 11 ॥**

ప్రతి అష్టమినాడు రాత్రియందు మాత్రమే భోజనం చేయాలి. ఓ విష్ణూ! కాలాష్టమినాడు భోజనాన్ని తప్పనిసరిగా విడిచి పెట్టాలి.

**ఏకాదశ్యాం సితాయాం తు త్యాజ్యం విష్ణో! హి భోజనమ్ ।**
**అసితాయాం తు భోక్తవ్యం నక్తమభ్యర్చ్య మాం హరే! ॥ 12 ॥**

ఓ విష్ణూ! శుక్లపక్షంలో ఏకాదశినాడు భోజనం చేయరాదు. ఓ హరీ! కృష్ణపక్షంలో ఏకాదశి నాడు రాత్రియందు నన్ను (శివుని) ఆరాధించి భుజించాలి.

**త్రయోదశ్యాం సితాయాం తు కర్తవ్యం నిశి భోజనమ్ ।**
**అసితాయాం తు భూతాయాం తన్న కార్యం శివవ్రతైః ॥ 13 ॥**

శుక్లపక్షంలోని త్రయోదశినాడు రాత్రి భోజనం మాత్రమే చేయాలి. శివవ్రతానుష్ఠానపరులకు కృష్ణపక్షంలో త్రయోదశినాడు రాత్రి భోజనం నిషిద్ధం.

**నిశి యత్నేన కర్తవ్యం భోజనం సోమవాసరే ।**
**ఉభయోః పక్షయోర్విష్ణో! సర్వస్మిన్ శివతత్పరైః ॥ 14 ॥**

ఓ విష్ణూ! రెండు పక్షాలలోను ప్రతి సోమవారంనాడు తప్పనిసరిగా రాత్రి మాత్రమే శివారాధకులు భుజించాలి.

**వ్రతేష్వేతేషు సర్వేషు శైవా భోజ్యాః ప్రయత్నతః ।**
**యథాశక్తి ద్విజశ్రేష్ఠా వ్రతసంపూర్తిహేతవే ॥ 15 ॥**

ఈ వ్రతాలన్నింటియందు బ్రాహ్మణశ్రేష్ఠులైన శైవులకు యథాశక్తిగా శ్రద్ధతో భోజనమేర్పాటు చేస్తే వ్రతం సంపూర్ణమౌతుంది.

**వ్రతాన్యేతాని నియమాత్కర్తవ్యాని ద్విజన్మభిః ।**
**వ్రతాన్యేతాని తు త్యక్త్వా జాయంతే తస్కరా ద్విజాః ॥ 16 ॥**

బ్రాహ్మణులు తప్పనిసరిగా ఈ వ్రతాలను ఆచరించాలి. ఈ వ్రతాలను విడిచి పెట్టిన బ్రాహ్మణులు చోరులుగా జన్మిస్తారు.

**ముక్తిమార్గప్రవీణైశ్చ కర్తవ్యం నియమాదితి ।**
**ముక్తేస్తు ప్రాపకం చైవ చతుష్టయముదాహృతమ్ ॥ 17 ॥**

ముక్తిమార్గంలో నిష్ణాతులైనవారు ఈ నాలుగు వ్రతాలను నియమం తప్పకుండా ఆచరించాలి. ఈ నాలుగూ ముక్తిసాధనములని చెప్పబడ్డాయి.

**శివార్చనం రుద్రజప ఉపవాసః శివాలయే ।**
**వారాణస్యాం చ మరణం ముక్తిరేషా సనాతనీ ॥ 18 ॥**

శివపూజ, రుద్రజపం, శివాలయంలో ఉపవాసం, వారాణసిలో మరణం అనునీ నాలుగు సనాతనమైన ముక్తిమార్గాలు.

**అష్టమీ సోమవారే చ కృష్ణపక్షే చతుర్దశీ ।**
**శివతుష్టికరం చైతన్నాత్ర కార్యా విచారణా ॥ 19 ॥**

అష్టమితిథితో కూడిన సోమవారం, కృష్ణపక్ష చతుర్దశి శివునకు సంతుష్టికరములనడంలో సందేహం లేదు.

**చతుర్ష్వపి బలిష్ఠం హి శివరాత్రివ్రతం హరే! ।**
**తస్మాత్తదేవ కర్తవ్యం భుక్తిముక్తిఫలేప్సుభిః ॥ 20 ॥**

ఓ హరీ! ఈ నాల్గింటిలో శివరాత్రివ్రతం సర్వోత్తమమైనది. కాబట్టి భుక్తి ముక్తి ఫలాలు కోరేవారు ఈ వ్రతాన్ని నిశ్చయంగా ఆచరించాలి.

**ఏతస్మాచ్చ వ్రతాదన్యాన్నాస్తి నృణాం హితావహమ్ ।**
**ఏతద్వ్రతం తు సర్వేషాం ధర్మసాధనముత్తమమ్ ॥ 21 ॥**

మానవులకు హితాన్ని కలిగించే వాటిలో శివరాత్రివ్రతాన్ని మించినదిలేదు ఈ వ్రతం ధర్మ-సాధనాలన్నింటిలోను ఉత్తమమైనది.

**నిష్కామానాం సకామానాం సర్వేషాం చ నృణాన్తథా ।**
**వర్ణానామాశ్రమాణాం చ స్త్రీబాలానాం తథా హరే! ॥ 22 ॥**

ఓ హరీ! కోరికలుగలవారు, కోరికలు లేని వారు, సర్వవర్ణాల వారు, అన్ని ఆశ్రమాల వారు (బ్రహ్మచర్యాది ఆశ్రమాలు) స్త్రీలు, బాలురు, మున్నగు సర్వప్రాణులకు ఈ వ్రతం గొప్ప హితాన్ని కలిగిస్తుంది.

**దాసానాం దాసికానాం చ దేవాదీనాం తథైవ చ ।**
**శరీరిణాం చ సర్వేషాం హితమేతద్వ్రతం వరమ్ ॥ 23 ॥**

దాసులకు, దాసీలకు, సమస్త దేవతలకు, అట్లే సమస్త శరీర ధారులకు వ్రతం గొప్పహితాన్ని కలిగిస్తుంది.

**మాఘస్య హ్యసితే పక్షే విశిష్టా సాఽతికీర్తితా ।**
**నిశీథవ్యాపినీ గ్రాహ్యా హత్యాకోటివినాశినీ ॥ 24 ॥**

మాఘమాసంలోని కృష్ణపక్షంలో ఈ వ్రతమాచరించుట చాల శ్రేష్ఠమైనది. అప్పుడు రాత్రియంతయు ఈ వ్రతం చేస్తే కోటిహత్యల పాపం నశిస్తుంది.

**తద్దినే చైవ యత్కార్యం ప్రాతరారభ్య కేశవ! ।**
**శ్రూయతాం తన్మనో దత్త్వా సుప్రీత్యా కథయామి తే ॥ 25 ॥**

ఓ కేశవా! ఆ రోజు ఉదయమే ఆరంభించి చేయదగిన కర్తవ్యాన్నంతటిని నేను చెబుతున్నాను. మనస్సును లగ్నం చేసి పరమప్రీతితో వినండి.

**ప్రాతరుత్థాయ మేధావీ పరమానందసంయుతః ।**
**సమాచరేన్నిత్యకృత్యం స్నానాదికమతంద్రితః ॥ 26 ॥**

బుద్ధిమంతుడైన మానవుడు పరమానందభరితుడై స్నానాదినిత్యకృత్యాలు ఉపేక్షచేయకుండా, చక్కగా చేసుకోవాలి.

**శివాలయే తతో గత్వా పూజయిత్వా యథావిధి ।**
**నమస్కృత్య శివం పశ్చాత్సంకల్పం సమ్యగాచరేత్ ॥ 27 ॥**

అనంతరం శివాలయానికి వెళ్లి యథావిధిగా పూజచేసి శివునకు నమస్కరించి తరువాత సంకల్పం చేయాలి.

**దేవదేవ! మహాదేవ! నీలకంఠ! నమోఽస్తు తే ।**
**కర్తుమిచ్ఛామ్యహం దేవ! శివరాత్రివ్రతం తవ ॥ 28 ॥**

ఓ దేవదేవా! మహాదేవా! నీలకంఠా! నీకు నమస్కారం. ఓ దేవా! నేను నీ శివరాత్రివ్రతాన్ని చేయగోరుతున్నాను.

**తవ ప్రభావాద్దేవేశ! నిర్విఘ్నేన భవేదితి ।**
**కామాద్యాః శత్రవో మాం వై పీడాం కుర్వంతు నైవ హి ॥ 29 ॥**

“ఓ దేవేశా! నీ ప్రభావంచే ఇది నిర్విఘ్నంగా పూర్తియగు గాక! కామము మున్నగు శత్రువులు లేశమైనను పీడను కలిగించకుండును గాక!”

**ఏవం సంకల్పమాస్థాయ పూజాద్రవ్యం సమాహరేత్ ।**
**సుస్థలే చైవ యల్లింగం ప్రసిద్ధం చాగమేషు వై ॥ 30 ॥**

**రాత్రౌ తత్ర స్వయం గత్వా సంపాద్య విధిముత్తమమ్ ।**
**శివస్య దక్షిణే భాగే పశ్చిమే వా స్థలే శుభే ॥ 31 ॥**

**నిధాయ చైవ తద్ద్రవ్యం పూజార్థం శివసన్నిధౌ ।**
**పునః స్నాయాత్తదా తత్ర విధిపూర్వం నరోత్తమః ॥ 32 ॥**

ఈ విధంగా సంకల్పించి, పూజాద్రవ్యాలను తెచ్చుకోవాలి. ఆగమాలలో ప్రసిద్ధమైన లింగమున్న పవిత్ర–స్థలానికి రాత్రియందు స్వయంగా వెళ్లి ఉత్తమమైన విధిని పాటిస్తూ శివునకు దక్షిణమునందు గాని, పశ్చిమమందుగాని శుభమైన స్థలంలో పూజాద్రవ్యాలను శివుని సన్నిధిలో నుంచి నరోత్తముడు అచ్చట యథావిధిగా మరల స్నానంచేయాలి.

**పరిధాయ శుభం వస్త్రమంతర్వాసశ్శుభం తథా ।**
**ఆచమ్య చ త్రివారం హి పూజారంభం సమాచరేత్ ॥ 33 ॥**

శుభ్రమైన వస్త్రాన్ని ధరించాలి. శుభ్రమైన లోపలి వస్త్రాలను కూడ ధరించి మూడు మార్లు ఆచమనం చేసి పూజ మొదలుపెట్టాలి.

**యస్య మంత్రస్య యద్ద్రవ్యం తేన పూజాం సమాచరేత్ ।**
**అమంత్రకం న కర్తవ్యం పూజనం తు హరస్య చ ॥ 34 ॥**

ఏ మంత్రానికి ఏ ద్రవ్యం విహితమో, ఆ క్రమంలో మాత్రమే పూజ చేయాలి. మంత్రం లేకుండా శివపూజ చేయరాదు.

**గీతైర్వాద్యై స్తథా నృత్యైః భక్తిభావసమన్వితః ।**
**పూజనం ప్రథమే యామే కృత్వా మంత్రం జపేద్బుధః ॥ 35 ॥**

గీతం, వాద్యం మరియు నృత్యం అను వాటితో మొదటి యామంలో పూజ పూర్తిచేసి మంత్రాన్ని జపించాలి.

**పార్థివం చ తదా శ్రేష్ఠం విదధ్యాన్మంత్రవాన్యది ।**
**కృతనిత్యక్రియః పశ్చాత్పార్థివం చ సమర్చయేత్ ॥ 36 ॥**

మంత్రోపదేశం గల వ్యక్తి అయితే శ్రేష్ఠమైన పార్థివలింగాన్ని చేసి నిత్యకర్మానుష్ఠానానంతరం చక్కగా పూజించాలి.

**ప్రథమం పార్థివం కృత్వా పశ్చాత్ స్థాపనమాచరేత్ ।**
**స్తోత్రైర్నానావిధైర్దేవం తోషయేద్వృషభధ్వజమ్ ॥ 37 ॥**

ముందుగా పార్థివలింగాన్ని చేసి తరువాత స్థాపించాలి. వివిధరకాల స్తోత్రాలతో వృషభధ్వజుని ప్రసన్నుని చేసుకోవాలి.

**మాహాత్మ్యం వ్రతసంభూతం పఠితవ్యం సుధీమతా ।**
**శ్రోతవ్యం భక్తవర్యేణ వ్రతసంపూర్తికామ్యయా ॥ 38 ॥**

బుద్ధిమంతుడైన వ్యక్తి వ్రతానికి సంబంధించిన మాహాత్మ్యాన్ని పఠించాలి. వ్రతసంపూర్తిని కోరు భక్త-వరేణ్యుడు దానిని వినాలి.

**చతుర్ష్వపి చ యామేషు మూర్తీనాం చ చతుష్టయమ్ ।**
**కృత్వా వాహనపూర్వం హి విసర్గావధి వై క్రమాత్ ॥ 39 ॥**

నాలుగు జాములందు (యామములయందు) నాలుగు మూర్తులను చేసి ఆవాహననుండి ఉద్వాసన-వఱకు యథాక్రమంగా పూజించాలి.

**కార్యం జాగరణం ప్రీత్యా మహోత్సవసమన్వితమ్ ।**
**ప్రాతః స్నాత్వా పునస్తత్ర స్థాపయేత్పూజయేచ్ఛివమ్ ॥ 40 ॥**

మహోత్సవపురస్సరంగా ప్రీతితో జాగరణ చేయాలి. ఉదయమే స్నానం చేసి మరల అచ్చట శివుని స్థాపించి పూజించాలి.

**తతః సంప్రార్థయేచ్ఛంభుం నతస్కంధః కృతాంజలిః ।**
**కృతసంపూర్ణవ్రతకో నత్వా తం చ పునః పునః ॥ 41 ॥**

తరువాత చేతులు జోడించి తలవంచి శంభునకు నమస్కరించాలి. ఈవిధంగా వ్రతాన్ని పూర్తిచేసి పలుమార్లు ప్రణమిల్లాలి.

**నియమో యో మహాదేవ! కృతశ్చైవ త్వదాజ్ఞయా ।**
**విసృజ్యతే మయా స్వామిన్! వ్రతం జాతమనుత్తమమ్ ॥ 42 ॥**

ఓ మహాదేవా! నీవు ఆదేశించిన విధంగ ఉత్తమమైన ఈ వ్రతాన్ని ఆచరించి పూర్తిచేస్తాను. మంచివికానట్టి ఇతర వ్రతములను వదలిపెడతాను.

**వ్రతేనానేన దేవేశ! యథాశక్తి కృతేన చ ।**
**సంతుష్టో భవ శర్వాద్య కృపాం కురు మమోపరి ॥ 43 ॥**

ఓ దేవేశా! నేను యథాశక్తితో చేయదలచిన ఈ వ్రతం నీకు సంతోషాన్ని కలిగించు గాక! ఓ శర్వా! నీవీనాడు నాపై దయ చూపు.

**పుష్పాంజలిం శివే దత్త్వా దద్యాద్దానం యథావిధి ।**
**నమస్కృత్య శివాయైవ నియమం తం విసర్జయేత్ ॥ 44 ॥**

ఈ విధంగా శివునకు పుష్పాంజలి సమర్పించి యథావిధిగా దానాదులను చేసి శివునకు నమస్కరించి ఆ వ్రతనియమాన్ని విడిచి పెట్టాలి.

**యథాశక్తి ద్విజాన్ శైవాన్యతినశ్చ విశేషతః ।**
**భోజయిత్వా సుసంతోష్య స్వయం భోజనమాచరేత్ ॥ 45 ॥**

యథాశక్తిగా బ్రాహ్మణులకు, శివభక్తులకు, విశేషించి సన్న్యాసులకు భోజనం పెట్టి సంతుష్టులను చేయాలి. తరువాత తాను భోజనం చేయాలి.

**యామే యామే యథా పూజా కార్యా భక్తవరైర్హరే! ।**
**శివరాత్రౌ విశేషేణ తామహం కథయామి తే ॥ 46 ॥**

ఓ హరీ! శివరాత్రినాడు విశేషంగా ప్రతి యామంలోను భక్తశ్రేష్ఠులు పూజచేయదగిన విధానాన్ని నీకు చెబుతున్నాను.

**ప్రథమే చైవ యామే చ స్థాపితం పార్థివం హరే! ।**
**పూజయేత్పరయా భక్త్యా సూపచారైరనేకశః ॥ 47 ॥**

ఓ విష్ణూ! మొదటి యామంలో పార్థివలింగాన్ని స్థాపించి, అనేకములైన ఉపచారాలతో పరమభక్తిపూర్వకంగా పూజించాలి.

**పంచద్రవ్యైశ్చ ప్రథమం పూజనీయో హరస్సదా ।**
**తస్య తస్య చ మంత్రేణ పృథగ్ద్రవ్యం సమర్పయేత్ ॥ 48 ॥**

ముందుగా శివుని ఐదు ద్రవ్యాలతో తప్పనిసరిగా పూజించాలి. ఆయా ద్రవ్యాలను ఆయా మంత్రాలతో వేర్వేరుగా సమర్పించాలి.

**తచ్చ ద్రవ్యం సమర్ప్యైవ జలధారాం దధీత వై ।**
**పశ్చాచ్చ జలధారాభిర్ద్రవ్యాణ్యుత్తారయేద్బుధః ॥ 49 ॥**

ఆ ద్రవ్యాలు సమర్పించిన తరువాత జలధారనేర్పాటు చేయాలి. వివేకియైన భక్తుడు ఆ జలధారలతో ఆ ద్రవ్యాలు తొలగేటట్లు చేయాలి.

**శతమష్టోత్తరం మంత్రం పఠిత్వా జలధారయా ।**
**పూజయేచ్చ శివం తత్ర నిర్గుణం గుణరూపిణమ్ ॥ 50 ॥**

శివుడు నిర్గుణుడైనప్పటికి సగుణుడైన లింగాన్ని నూట ఎనిమిదిమార్లు మంత్రాన్ని జపించిన తరువాత జలధారతో పూజించాలి.

**గురుదత్తేన మంత్రేణ పూజయేద్వృషభధ్వజమ్ ।**
**అన్యథా నామమంత్రేణ పూజయేద్వై సదాశివమ్ ॥ 51 ॥**

గురువుచే ఉపదేశింపబడిన మంత్రంతో వృషభధ్వజుని పూజించాలి. లేదా సదాశివనామమంత్రంతో నైన పూజించాలి.

**చందనేన విచిత్రేణ తండులైశ్చాప్యఖండితైః ।**
**కృష్ణైశ్చైవ తిలైః పూజా కార్యా శంభోః పరాత్మనః ॥ 52 ॥**

రంగురంగుల చందనం, నూకలు లేని బియ్యం, నల్లని తిలలు, ఈ వస్తువులతో శంభుపరమాత్మను పూజించాలి.

**పుష్పైశ్చ శతపత్రైశ్చ కరవీరైస్తథా పునః ।**
**అష్టభిర్నామమంత్రైశ్చార్పయేత్పుష్పాణి శంకరే ॥ 53 ॥**

శంకరుని ఎనిమిది నామమంత్రాలను పఠిస్తూ ఎర్రగన్నేరు, పద్మం, ఇత్యాది పుష్పాలను శంకరున కర్పించాలి.

**భవః శర్వస్తథా రుద్రః పునః పశుపతిస్తథా ।**
**ఉగ్రో మహాంస్తథా భీమ ఈశాన ఇతి తాని వై ॥ 54 ॥**

భవుడు, శర్వుడు, రుద్రుడు, పశుపతి, ఉగ్రుడు, మహాన్, భీముడు, ఈశానుడు అనునవి శంకరుని ఎనిమిది నామాలు.

**శ్రీపూర్వైశ్చ చతుర్థ్యంతైర్నామభిః పూజయేచ్ఛివమ్ ।**
**పశ్చాద్ధూపం చ దీపం చ నైవేద్యం చ తతఃపరమ్ ॥ 55 ॥**

పై నామాలను చతుర్థీ విభక్తిలోనికి మార్చి, వాటికి ముందు 'శ్రీ' కారాన్ని చేర్చి శివుని పూజించాలి. అనంతరం ధూపదీపనైవేద్యాలు అర్పించాలి. (వ్యాసమహర్షికి వ్యాకరణశాస్త్రం పట్ల గల మోజుకు దర్పణం ఈ శ్లోకం)

**ఆద్యే యామే చ నైవేద్యం పక్వాన్నం కారయేద్బుధః ।**
**అర్ఘ్యం చ శ్రీఫలం దత్త్వా తాంబూలం చ నివేదయేత్ ॥ 56 ॥**

పండితుడైనవాడు మొదటియామం (3గంటలు) లో పక్వాన్నాన్ని నివేదన చేయాలి. కొబ్బరికాయనిచ్చి తాంబూలాన్ని సమర్పించాలి.

**నమస్కారం తతో ధ్యానం జపః ప్రోక్తో గురోర్మనోః ।**
**అన్యథా పంచవర్ణేన తోషయేత్తేన శంకరమ్ ॥ 57 ॥**

అనంతరం నమస్కారం, ధ్యానం, తదనంతరం గురుదత్తమైన మంత్రజపం అనే వాటిని చేయాలి. లేదా పంచాక్షరీ మంత్రాన్ని జపించి శంకరునకు సంతోషాన్ని కలిగించాలి.

**ధేనుముద్రాం ప్రదర్శ్యాథ సుజలైస్తర్పణం చరేత్ ।**
**పంచ బ్రాహ్మణభోజం చ కల్పయేద్వై యథాబలమ్ ॥ 58 ॥**

అనంతరం ధేనుముద్రను ప్రదర్శించి, పవిత్ర జలాలతో తర్పణాలు చేయాలి. యథాశక్తిగా ఐదుగురు బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి.

**మహోత్సవశ్చ కర్తవ్యో యావద్యామో భవేదిహ ।**
**తతః పూజాఫలం తస్మై నివేద్య చ విసర్జయేత్ ॥ 59 ॥**

యామం పూర్తయ్యే వరకు మహోత్సవం చేసి తదనంతరం పూజాఫలాన్ని పరమేశ్వరునకు సమర్పించి ఉద్వాసన చెప్పాలి.

**పునర్ద్వితీయే యామే చ సంకల్పం సుసమాచరేత్ ।**
**అథైకదైవ సంకల్ప్య కుర్యాత్పూజాం తథావిధామ్ ॥ 60 ॥**

మరల రెండవ యామంలో సంకల్పం చెప్పబడాలి. లేదా ఒకేసారి సంకల్పం చెప్పి పూజను అదేవిధంగా కొనసాగించాలి.

**ద్రవ్యైః పూర్వైస్తథా పూజాం కృత్వా ధారాం సమర్పయేత్ ।**
**పూర్వతో ద్విగుణం మంత్రం సముచ్చార్యార్చయేచ్ఛివమ్ ॥ 61 ॥**

పూర్వం ఉపయోగించిన ద్రవ్యాలతోనే పూజచేసి ధారను ఏర్పాటు చేయాలి. మొదటి యామానికి రెట్టింపు మంత్రజపం చేసి శివుని ఆరాధించాలి.

**పూర్వైస్తిలయవైశ్చాథ కమలైః పూజయేచ్ఛివమ్ ।**
**బిల్వపత్రైర్విశేషణ పూజయేత్పరమేశ్వరమ్ ॥ 62 ॥**

పూర్వయామంలో చేసిన విధానంలో శివుణ్ణి తిలలు, యవలు, కమలాలతో పూజించాలి. ఆ పరమేశ్వరుని విశేషంగా బిల్వపత్రాలతో పూజించాలి.

**అర్ఘ్యం చ బీజపూరేణ నైవేద్యం పాయసం తథా ।**
**మంత్రావృత్తిస్తు ద్విగుణా పూర్వతోఽపి జనార్దన! ॥ 63 ॥**

నిమ్మపండుతో అర్ఘ్యమీయాలి. పాయసం నివేదన చేయాలి. ఓ జనార్దనా! పూర్వయామంలోకంటె రెట్టింపు మంత్రజపం చేయాలి.

**తతశ్చ బ్రాహ్మణానాం హి భుక్తే సంకల్పమాచరేత్ ।**
**అన్యత్సర్వం తథా కుర్యాద్యావచ్చ ద్వితయావధి ॥ 64 ॥**

అనంతరం బ్రాహ్మణులకు భోజనం పెడతానని సంకల్పం చేయాలి. మిగిలిన పూజాదికమంతయు ప్రథమయామంతో చేయబడిన విధానంగానే చేయాలి.

**యామే ప్రాప్తే తృతీయే చ పూర్వవత్పూజనం చరేత్ ।**
**యవస్థానే చ గోధూమాః పుష్పాణ్యర్కభవాని చ ॥ 65 ॥**

మూడవ యామం రాగానే పూర్వం వలెనే పూజ చేయాలి. పూర్వంలో చేసిన యవలకు బదులుగా ఈ యామంలో గోధుమలు వాడాలి. జిల్లేడుపూలతో పూజించాలి.

**ధూపైశ్చ వివిధైస్తత్ర దీపైర్నానావిధైరపి ।**
**నైవేద్యాపూపకైర్విష్ణో! శాకైర్నానావిధైరపి ॥ 66 ॥**

ఓ విష్ణూ! వివిధ ధూపాలు, నానావిధములైన దీపాలు కూడ సమర్పించి వివిధ శాకములు, అప్పములు నైవేద్యం పెట్టాలి.

**కృత్వైవం చాథ కర్పూరైరారార్తిక విధిం చరేత్ ।**
**అర్ఘ్యం సదాడిమం దద్యాద్ద్విగుణం జపమాచరేత్ ॥ 67 ॥**

ఈ విధంగా చేసి కర్పూరహారతులిచ్చి తదనంతరం దాడిమఫలంతో (దానిమ్మపండుతో) అర్ఘ్యమీయాలి. రెట్టింపు జపం చేయాలి.

**తతశ్చ బ్రహ్మభోజస్య సంకల్పం చ సదక్షిణమ్ ।**
**ఉత్సవం పూర్వవత్కుర్యాద్యావద్యామావధిర్భవేత్ ॥ 68 ॥**

తరువాత బ్రాహ్మణభోజనాన్ని దక్షిణలతో సహా సంకల్పించి పూర్వమునందు వలెనే యామం పూర్తియగువఱకు ఉత్సవం చేయాలి.

**యామే చతుర్థే సంప్రాప్తే కుర్యాత్తస్య విసర్జనమ్ ।**
**ప్రయోగాది పునః కృత్వా పూజాం విధివదాచరేత్ ॥ 69 ॥**

నాలుగవ యామం ప్రారంభం కాగానే పూర్వం దానికి ఉద్వాసన చెప్పి ప్రయోగాన్నంతటినీ మరల చేసి వివిధపూజలు చేయాలి.

**మాషైః ప్రియంగుభిర్ముద్గైః సప్తధాన్యై స్తథాఽథవా ।**
**శంఖీపుష్పైర్బిల్వపత్రైః పూజయేత్పరమేశ్వరమ్ ॥ 70 ॥**

మినుములు, పెసలు, ప్రియంగుధాన్యం, లేదా ఏడు ధాన్యాలలో ఏదో ఒక ధాన్యం, శంఖీపుష్పాలు, మారేడు పత్రాలు మున్నగు వాటితో పరమేశ్వరుని పూజించాలి.

**నైవేద్యం తత్ర దద్యాద్వై మధురైర్వివిధైరపి ।**
**అథవా చైవ మాషాన్నైః తోషయేచ్చ సదాశివమ్ ॥ 71 ॥**

ఆ సమయంలో వివిధ మధుర పదార్థాలు గాని, మినుములతో కూడిన అన్నం గాని, నైవేద్యం చేసి సదాశివుని సంతోషపెట్టాలి.

**అర్ఘ్యం దద్యాత్కదల్యాశ్చ ఫలేనైవాథవా హరే! ।**
**వివిధైశ్చ ఫలైశ్చైవ దద్యాదర్ఘ్యం శివాయ చ ॥ 72 ॥**

హరీ! అరటిపండుతో గాని, ఏదైన ఒక పండుతో గాని శివునకు అర్ఘ్యమీయాలి. వివిధ ఫలాలతో శివునకు అర్ఘ్యమీయాలి.

**పూర్వతో ద్విగుణం కుర్యాన్మంత్రజాపం నరోత్తమః ।**
**సంకల్పం బ్రహ్మభోజస్య యథాశక్తి చరేద్బుధః ॥ 73 ॥**

ఉత్తమ భక్తుడు మొదటి యామానికి రెట్టింపు జపం చేయాలి. వివేకి యథాశక్తి బ్రాహ్మణభోజనానికి సంకల్పం చేయాలి.

**గీతైర్వాద్యైస్తథా నృత్యైర్నయేత్కాలం చ భక్తితః ।**
**మహోత్సవైర్భక్తజనైర్యావత్స్యాదరుణోదయః ॥ 74 ॥**

గీతాలు, వాద్యాలు, నృత్యాలతోను భక్తిపూర్వకంగా కాలం గడపాలి. భక్తజనులు తెల్లవారేవఱకు మహోత్సవాలు చేయాలి.

**ఉదయే చ తథా జాతే పునస్స్నాత్వాఽర్చయేచ్ఛివమ్ ।**
**నానా పూజోపహారైశ్చ స్వాభిషేకమథాచరేత్ ॥ 75 ॥**

ఉదయాన్నే మరల స్నానం చేసి శివునకు చక్కగా అభిషేకం చేసి వివిధ ద్రవ్యాలతో శివుని పూజించాలి.

**నానావిధాని దానాని భోజ్యం చ వివిధం తథా ।**
**బ్రాహ్మణానాం యతీనాం చ కర్తవ్యం యామసంఖ్యయా ॥ 76 ॥**

బ్రాహ్మణులకు, యతులకు యామసంఖ్యను బట్టి వివిధ భోజ్యాలు, నానావిధాలైన దానాలు చేయాలి.

**శంకరాయ నమస్కృత్య పుష్పాంజలిమథాచరేత్ ।**
**ప్రార్థయేత్సుస్తుతిం కృత్వా మంత్రైరేతైర్విచక్షణః ॥ 77 ॥**

అనంతరం వివేకియైన భక్తుడు శంకరునకు నమస్కరించి పుష్పాంజలి సమర్పించి చక్కగా ఈ మంత్రాలతో స్తుతించాలి.

**తావకస్త్వద్గతప్రాణః త్వచ్చిత్తోఽహం సదా మృడ! ।**
**కృపానిధే! ఇతి జ్ఞాత్వా యథా యోగ్యం తథా కురు ॥ 78 ॥**

ఓ మృడా! నేను నీ వాడను. నా ప్రాణాలు నీయందే యున్నాయి. నా మనస్సు సర్వదా నీ పై లగ్నమయ్యింది. ఓ దయానిధీ! ఈ విషయాన్ని గమనించి తరువాత యథాయోగ్యంగా చేయుము.

**అజ్ఞానాద్యది వా జ్ఞానాజ్జపపూజాదికం మయా ।**
**కృపానిధిత్వాజ్జ్ఞాత్వైవ భూతనాథ! ప్రసీద మే ॥ 79 ॥**

ఓ భూతనాథా! నేను తెలిసిగాని, తెలియకగాని, జపం, పూజ ఇత్యాదులలో లోపం చేసినచో దానిని దయానిధివైన నీవు గమనించిననూ ప్రసన్నతను విడనాడవద్దు.

**అనేనైవోపవాసేన యజ్జాతం ఫలమేవ చ ।**
**తేనైవ ప్రీయతాం దేవః శంకరః సుఖదాయకః ॥ 80 ॥**

ఈ ఉపవాసంచే ఏ ఫలం కలిగిందో, దానిచే సుఖకరుడైన శంకరదేవుడు ప్రసన్నుడగు గాక!

**కులే మమ మహాదేవ! భజనం తేఽస్తు సర్వదా ।**
**మా భూత్తస్య కులే జన్మ యత్ర త్వం న హి దేవతా ॥ 81 ॥**

ఓ మహాదేవా! నా వంశంలో సర్వదా నీ సేవాభాగ్యముండుగాక! నిన్ను ఆరాధించని వ్యక్తి ఈ కులంలోను, వంశంలోను జన్మించకుండుగాక!

**పుష్పాంజలిం సమర్ప్యైవం తిలకాశిష ఏవ చ ।**
**గృహ్ణీయాద్బ్రాహ్మణేభ్యశ్చ తతశ్శంభుం విసర్జయేత్ ॥ 82 ॥**

ఈ విధంగా పుష్పాంజలి సమర్పించి బ్రాహ్మణులనుండి తిలకాన్ని, ఆశీర్వచనాలను స్వీకరించి, తదనంతరం శంభునకుద్వాసన చెప్పాలి.

**ఏవం వ్రతం కృతం యేన తస్మాద్దూరో హరో న హి ।**
**న శక్యతే ఫలం వక్తుం నాదేయం విద్యతే మమ ॥ 83 ॥**

ఈ విధమైన వ్రతం చేయువానికి శివుడు దూరంలో లేడు. వాని ఫలాలు చెప్పడానికి సాధ్యం కాదు. అట్టి వానికి శంకరుడు ఈయదగనిది ఏదియు లేదు. అన్నింటినీ ప్రసాదిస్తాడు.

**అనాయాసతయా చేద్వై కృతం వ్రతమిదం పరమ్ ।**
**తస్య వై ముక్తిబీజం చ జాతం నాత్ర విచారణా ॥ 84 ॥**

ఈ గొప్ప వ్రతం అనాయాసంగా, నిష్కామంగా చేసేవానికి ముక్తిబీజం ఉదయించిందని చెప్పవచ్చు. ఇందులో సందేహం లేదు.

**ప్రతిమాసం వ్రతం చైవ కర్తవ్యం భక్తితో నరైః ।**
**ఉద్యాపనవిధిం పశ్చాత్కృత్వా సాంగఫలం లభేత్ ॥ 85 ॥**

ఈ వ్రతాన్ని మానవులు ప్రతినెల భక్తితో చేయాలి. అనంతరం ఉద్యాపనం చేస్తే సాంగఫలం లభిస్తుంది.

**వ్రతస్య కరణాన్నూనం శివోఽహం సర్వదుఃఖహా ।**
**దద్మి భుక్తిం చ ముక్తిం చ సర్వం వై వాంఛితం ఫలమ్ ॥ 86 ॥**

సర్వదుఃఖాలను పోగొట్టే శివుడను నేను. ఈ వ్రతం చేసినవానికి భుక్తిని, ముక్తిని, వాంఛితఫలాలనన్నింటిని ప్రసాదిస్తాను.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఇతి శివవచనం నిశమ్య విష్ణుర్హితతరమద్భుతమాజగామ ధామ ।**
**తదను వ్రతముత్తమం జనేషు సమచరదాత్మహితేషు చైతదేవ ॥ 87 ॥**

మిక్కిలి హితకరమైనట్టియు, అద్భుతమైనట్టియు శివుని యీ మాటలు విని విష్ణువు తన నివాసానికి తిరిగి వచ్చాడు. ఆత్మహితం కోరు మానవులు ఈ ఉత్తమవ్రతాన్ని మాత్రమే ఆచరించాలి.

**కదాచిన్నారదాయాథ శివరాత్రివ్రతం త్విదమ్ ।**
**భుక్తిముక్తిప్రదం దివ్యం కథయామాస కేశవః ॥ 88 ॥**

అనంతరకాలంలో ఒకానొకనాడు కేశవుడు నారదునకు భుక్తిముక్తిప్రదమైనది, దివ్యమైనదియు నగు ఈ శివరాత్రివ్రతాన్ని గూర్చి చెప్పాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం వ్యాధేశ్వర మాహాత్మ్యే శివరాత్రివ్రతమహిమ నిరూపణం నామాష్టాత్రింశోఽధ్యాయః ॥ 38 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు వ్యాధేశ్వరమాహాత్మ్యంలో శివరాత్రి వ్రతమాహాత్మ్యవర్ణనం అనే పేరుగల ముప్పైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## ఏకోనచత్వారింశోఽధ్యాయః - ముప్పైతొమ్మిదవ అధ్యాయం
## శివరాత్రివ్రతోద్యాపనవర్ణనమ్ - శివరాత్రివ్రతోద్యాపనవర్ణనం

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**ఉద్యాపనవిధిం బ్రూహి శివరాత్రివ్రతస్య చ ।**
**యత్కృత్వా శంకరస్సాక్షాత్ప్రసన్నో భవతి ధ్రువమ్ ॥ 1 ॥**

ఓ సూతమహర్షీ! దేనిని అనుష్ఠిస్తే శంకరుడు స్వయంగా ప్రసన్నుడగుట నిశ్చయమో, అట్టి శివరాత్రి-వ్రతంయొక్క ఉద్యాపనవిధిని వివరించి చెప్పండి.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**శ్రూయతామృషయో భక్త్యా తదుద్యాపనమాదరాత్ ।**
**యస్యానుష్ఠానతః పూర్ణం వ్రతం భవతి తద్ధ్రువమ్ ॥ 2 ॥**

ఓ ఋషులారా! శివరాత్రివ్రతంయొక్క ఉద్యాపనవిధిని భక్తి శ్రద్ధలతో వినండి. దానిని అనుష్ఠించడం చేత మాత్రమే ఈ వ్రతం నిశ్చయంగా సంపూర్ణమౌతుంది.

**చతుర్దశాబ్దం కర్తవ్యం శివరాత్రివ్రతం శుభమ్ ।**
**ఏకభుక్తం త్రయోదశ్యాం చతుర్దశ్యాముపోషణమ్ ॥ 3 ॥**

శుభకరమైన శివరాత్రివ్రతాన్ని పదునాల్గు సంవత్సరాలు చేయాలి. త్రయోదశినాడు ఒక పూట మాత్రమే భోజనంచేసి చతుర్దశినాడు ఉపవాసం చేయాలి.

**శివరాత్రిదినే ప్రాప్తే నిత్యం సంపాద్య వై విధిమ్ ।**
**శివాలయం తతో గత్వా పూజాం కృత్వా యథావిధి ॥ 4 ॥**

శివరాత్రి రాగానే నిత్యవిధిననుష్ఠించి అనంతరం శివాలయానికి వెళ్లి యథావిధిగా పూజించాలి.

**తతశ్చ కారయేద్దివ్యం మండలం తత్ర యత్నతః ।**
**గౌరీతిలకనామ్నా వై ప్రసిద్ధం భువనత్రయే ॥ 5 ॥**

అనంతరం అచ్చట ముల్లోకాలలో గౌరీతిలకమని ప్రసిద్ధిగాంచిన దివ్యమైన మండపాన్ని ప్రయత్నపూర్వకంగా చేయాలి.

**తన్మధ్యే లేఖయేద్దివ్యం లింగతోభద్రమండలమ్ ।**
**అథవా సర్వతోభద్రం మండపాంతః ప్రకల్పయేత్ ॥ 6 ॥**

ఆ మండపానికి మధ్య భాగంలో "లింగతోభద్రం, లేదా సర్వతోభద్రం" అనే ముగ్గు వేయాలి.

**కుంభాస్తత్ర ప్రకర్తవ్యాః ప్రాజాపత్యవిసంజ్ఞయా ।**
**సవస్త్రాః సఫలాస్తత్ర దక్షిణాసహితాః శుభాః ॥ 7 ॥**

వస్త్రం, ఫలం, దక్షిణతో కూడిన శుభకరమైన కుంభాలను అచ్చట ప్రాజాపత్యవిధానంతో స్థాపించాలి.

**మండలస్య చ పార్శ్వే వై స్థాపనీయాః ప్రయత్నతః ।**
**మధ్యే చైకశ్చ సంస్థాప్య సౌవర్ణో వాఽపరో ఘటః ॥ 8 ॥**

కుంభాలకు, మండపానికి పార్శ్వభాగంలో వీటినన్నిటిని జాగ్రత్తగా ఉంచాలి. మధ్యలో ఒక బంగారు ఘటాన్నిలేదా మరొక ఘటాన్ని ఉంచాలి.

**తత్రోమాసహితాం శంభుమూర్తిర్నిర్మాయ హాటకీమ్ ।**
**పలేన వా తదర్ధేన యథాశక్త్యథవా వ్రతీ ॥ 9 ॥**

వ్రతం చేసేవాడు, పలం లేదా అర్ధపలం బంగారంతో గాని, యథాశక్తిగా గాని పార్వతీ పరమేశ్వరుల మూర్తిని నిర్మించి అచ్చట ఉంచాలి.

**నిధాయ వామభాగే తు శివామూర్తిమతంద్రితః ।**
**తదీయాం దక్షిణే భాగే కృత్వా రాత్రౌ ప్రపూజయేత్ ॥ 10 ॥**

శివుని మూర్తిని కుడివైపున, పార్వతి మూర్తిని ఎడమవైపున ఉంచి రాత్రి శ్రద్ధగా పూజించాలి.

**ఆచార్యం వరయేత్తత్ర చర్త్విగ్భిస్సహితం శుచిమ్ ।**
**అనుజ్ఞాతశ్చ తైర్భక్త్యా శివపూజాం సమాచరేత్ ॥ 11 ॥**

ఆ సమయంలో ఋత్విక్కులతో సహా ఆచార్యుని కూడ వరణం చేసి వారి అనుజ్ఞతో భక్తిపూర్వకంగా శివుని పూజించాలి.

**రాత్రౌ జాగరణం కుర్యాత్పూజాం యామోద్భవాం చరన్ ।**
**రాత్రిమాక్రమయేత్సర్వాం గీతనృత్యాదినా వ్రతీ ॥ 12 ॥**

వ్రతనిష్ఠగల భక్తుడు రాత్రియందు ప్రతియామంలోను పూజ చేస్తూ జాగరణం చేయాలి. వ్రతం చేసేవాడు రాత్రియంతయు గాననాట్యాదులతో గడపాలి.

**ఏవం సంపూజ్య విధివత్సంతోష్య ప్రాతరేవ చ ।**
**పునః పూజాం తతః కృత్వా హోమం కుర్యాద్యథావిధి ॥ 13 ॥**

ఈ విధంగా యథావిధిగా పూజించి శివుని ప్రసన్నుని చేసికొని ఉదయమే మరల పునఃపూజ చేసి యథావిధిగా హోమం చేయాలి.

**యథాశక్తి విధానం చ ప్రాజాపత్యం సమాచరేత్ ।**
**బ్రాహ్మణాన్ భోజయేత్ప్రీత్యా దద్యాద్దానాని భక్తితః ॥ 14 ॥**

యథాశక్తిగా ప్రాజాపత్యవ్రతం చేసి, బ్రాహ్మణులకు ప్రీతిపూర్వకంగా భోజనం పెట్టి భక్తితో దానాలు చేయాలి.

**ఋత్విజశ్చ సపత్నీకాన్ వస్త్రాలంకారభూషణైః ।**
**అలంకృత్య విధానేన దద్యాద్దానం పృథక్ పృథక్ ॥ 15 ॥**

భార్యలతో కూడిన ఋత్విక్కులను వస్త్రాలతోను, ఆభరణాలతోను అలంకరించి వేర్వేరుగా యథావిధిగా దానాలు చేయాలి.

**గాం సవత్సాం విధానేన యథోపస్కరసంయుతామ్ ।**
**ఉక్త్వాచార్యాయ వై దద్యాచ్ఛివో మే ప్రీయతామితి ॥ 16 ॥**

దూడతోను, ఇతర అలంకారాలతోను, ఇతర ఉపకరణాలతోను కూడియున్న ఆవును యథావిధిగా ఆచార్యునకు గోదానం చేసి "శివుడు నాయందు ప్రీతి పొందు గాక!" అని పలకాలి.

**తతస్సకుంభాం తన్మూర్తిం సవస్త్రాం వృషభే స్థితామ్ ।**
**సర్వాలంకారసహితామాచార్యాయ నివేదయేత్ ॥ 17 ॥**

అనంతరం కుంభాలతోను, వస్త్రాది సర్వాలంకారాలతోను కూడియున్న పార్వతీ – పరమేశ్వరుల మూర్తులను వృషభం పై నుంచి ఆచార్యునకు నివేదించాలి.

**తతః సంప్రార్థయేద్దేవం మహేశానం మహాప్రభుమ్ ।**
**కృతాంజలిర్నతస్కంధస్సుప్రీత్యా గద్గదాక్షరః ॥ 18 ॥**

అనంతరం మహేశానుడు, మహాప్రభుడునగు దేవునికి చేతులు జోడించి తలవంచి నమస్కరించి పరమప్రీతివలన గద్గదమైన వాక్కుతో శ్రద్ధగా ప్రార్థించాలి.

**దేవదేవ! మహాదేవ! శరణాగతవత్సల! ।**
**వ్రతేనానేన దేవేశ! కృపాం కురు మమోపరి ॥ 19 ॥**

"ఓ దేవదేవా! మహాదేవా! శరణాగతవత్సలా! ఓ దేవేశా! ఈ వ్రతం చేసిన నా పై దయ చూపుము.

**మయా భక్త్యనుసారేణ వ్రతమేతత్కృతం శివా ।**
**న్యూనం సంపూర్ణతాం యాతు ప్రసాదాత్తవ శంకర! ॥ 20 ॥**

ఓ శివా! నేను భక్తి పూర్వకంగా ఈ వ్రతాన్ని చేశాను. ఓ శంకరా! లోపములేవేని ఉంటే, అవి కూడ నీ అనుగ్రహంచేత సంపూర్ణమగు గాక!

**అజ్ఞానాద్యది వా జ్ఞానాజ్జపపూజాదికం మయా ।**
**కృతం తదస్తు కృపయా సఫలం తవ శంకర! ॥ 21 ॥**

ఓ శంకరా! నేను తెలిసిగాని, తెలియకగాని జపపూజాదులలో దోషం చేసియున్నను, నీ కృపచే సర్వం సఫలం కాగలదు.

**ఏవం పుష్పాంజలిం దత్త్వా శివాయ పరమాత్మనే ।**
**నమస్కారం తతః కుర్యాత్ప్రార్థనా పునరేవ చ ॥ 22 ॥**

ఈ విధంగా శివపరమాత్మకు పుష్పాంజలి సమర్పించి నమస్కరించిన తరువాత మరలా ప్రార్థించాలి.

**ఏవం వ్రతం కృతం యేన న్యూనం తస్య న విద్యతే ।**
**మనోభీష్టాం తతః సిద్ధిం లభతే నాత్ర సంశయః ॥ 23 ॥**

ఈ వ్రతమీవిధంగా చేసేవారికి ఏ లోపమూ ఉండదు. దానివలన అతనికి నిస్సందేహంగా మనోభీష్టం సిద్ధిస్తుంది.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం శివరాత్రివ్రతోద్యాపనం నామైకోనచత్వారింశోఽధ్యాయః ॥ 39 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు శివరాత్రివ్రతోద్యాపనవర్ణన అనే పేరుగల ముప్పైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## చత్వారింశో ధ్యాయః - నలభైయవ అధ్యాయం
## శివరాత్రివ్రతమాహాత్మ్యవర్ణనమ్ - శివరాత్రివ్రతమాహాత్మ్యవర్ణనం

**ఋషయ ఊచుః -** ఋషులు పలికారు.

**సూత! తే వచనం శ్రుత్వా పరానందం వయం గతాః ।**
**విస్తరాత్కథయ ప్రీత్యా తదేవ వ్రతముత్తమమ్ ॥ 1 ॥**

ఓ సూతమహర్షీ! మీ వచనాలు వినిన మాకు పరమానందం కలుగుతోంది. ఆ ఉత్తమమైన వ్రతాన్నే ప్రీతితో విస్తరంగా చెప్పండి.

**కృతం పురా తు కేనేహ సూతైతద్వ్రతముత్తమమ్ ।**
**కృత్వాప్యజ్ఞానతశ్చైవ ప్రాప్తం కిం ఫలముత్తమమ్ ॥ 2 ॥**

ఓ సూత మహర్షీ! ఇటువంటి ఉత్తమవ్రతం ఈ లోకంలో పూర్వం ఎవరిచే చేయబడింది? అజ్ఞానంతో చేసిన వారికి కూడ ఎట్టి ఉత్తమఫలం లభించింది?

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**శ్రూయతాం ఋషయః! సర్వే కథయామి పురాతనమ్ ।**
**ఇతిహాసం నిషాదస్య సర్వపాపప్రణాశనమ్ ॥ 3 ॥**

ఓ ఋషులారా! సర్వపాపాలను పోగొట్టే పురాతనమైన కిరాతుని గాథ చెబుతున్నాను. మీరందరూ వినండి.

**పురా కశ్చిద్వనే భిల్లో నామ్నా హ్యాసీద్గురుద్రుహః ।**
**కుటుంబీ బలవాన్ క్రూరః క్రూరకర్మపరాయణః ॥ 4 ॥**

పూర్వం ఒకానొక అడవిలో గురుద్రుహుడనే పేరుతో, కుటుంబీకుడును, బలవంతుడును, క్రూరుడును, క్రూరకర్మలు చేయడంలో నిష్ణాతుడు నగు ఒక కిరాతుడుండేవాడు.

**నిరంతరం వనే గత్వా మృగాన్ హంతి స్మ నిత్యశః ।**
**చౌర్యం చ వివిధం తత్ర కరోతి స్మ వనే వసన్ ॥ 5 ॥**

అతడు నిరంతరం అడవికి వెళ్లి మృగాలను సంహరిస్తూ వివిధ చౌర్యాలు చేస్తూ అడవిలో నివసించెడివాడు.

**బాల్యాదారభ్య తేనేహ కృతం కించిచ్ఛుభం న హి ।**
**మహాన్ కాలో వ్యతీయాయ వనే తస్య దురాత్మనః ॥ 6 ॥**

బాల్యంనుండి వానిచే ఏకొంచెం శుభకర్మ యైనను చేయబడలేదు. ఆ విధంగా ఆ దుష్టుడు ఆ అడవిలో నివసిస్తూ ఉండగా చాలా కాలం గడిచింది.

**కదాచిచ్ఛివరాత్రిశ్చ ప్రాప్తాసీత్తత్ర శోభనా ।**
**న దురాత్మా స్మ జానాతి మహద్వననివాసకృత్ ॥ 7 ॥**

ఒకనాడు పరమశోభనమైన శివరాత్రి సంప్రాప్తమయ్యింది. ఆ విషయం అడవిలో నివాసముంటున్న ఆ దురాత్మునికి తెలియదు.

**ఏతస్మిన్సమయే భిల్లో మాత్రా పిత్రా స్త్రియా తథా ।**
**ప్రార్థితశ్చ క్షుధావిష్టైర్భక్ష్యం దేహి వనేచర! ॥ 8 ॥**

అదే సమయంలో ఆ కిరాతుని తల్లి, తండ్రి, భార్య ఆకలిగొన్నవారై "ఓ వనేచరా! ఆహారాన్ని ఇమ్ము" అని ప్రార్థించారు.

**ఇతి సంప్రార్థితః సోఽపి ధనురాదాయ సత్వరమ్ ।**
**జగామ మృగహింసార్థం బభ్రామ సకలం వనమ్ ॥ 9 ॥**

ఈ విధంగా ప్రార్థింపబడిన ఆ కిరాతుడు వెంటనే ధనుస్సు తీసుకొని మృగాలను సంహరించడానికి అరణ్యమంతటా తిరిగాడు.

**దైవయోగాత్తదా తేన న ప్రాప్తం కించిదేవ హి ।**
**అస్తం ప్రాప్తస్తదా సూర్యస్స వై దుఃఖముపాగతః ॥ 10 ॥**

దైవయోగంచే వానికి ఆ సమయంలో ఏదీ లభించలేదు. ఇంతలో సూర్యుడస్తమించగా ఇతడు దుఃఖాన్ని పొందాడు.

**కిం కర్తవ్యం క్వ గంతవ్యం న ప్రాప్తం మేఽద్య కించన ।**
**బాలాశ్చ యే గృహే తేషాం కిం పిత్రోశ్చ భవిష్యతి ॥ 11 ॥**

ఏమి చేయాలి? ఎక్కడకు వెళ్లాలి? ఈనాడు నాకు ఏమీ దొరకలేదు. ఇంటిలోని పిల్లలకు తల్లిదండ్రులకు ఏమౌతుందో?

**మదీయం వై కలత్రం చ తస్యాః కించిద్భవిష్యతి ।**
**కించిద్గృహీత్వా హి మయా గంతవ్యం నాన్యథా భవేత్ ॥ 12 ॥**

నా భార్యకేమౌతుందో? నేను ఏదో ఒక దానిని తీసుకొనియే ఇంటికి వెళతాను. లేనిచో కుదరదు.

**ఇత్థం విచార్య స వ్యాధో జలాశయసమీపగః ।**
**జలావతరణం యత్ర తత్ర గత్వా స్వయం స్థితః ॥ 13 ॥**

ఆ కిరాతుడు ఈ విధంగా ఆలోచించి జలపాతం చెంతకు వెళ్లాడు. జంతువులు నీటిలో దిగే స్థలం వద్ద కాపు వేశాడు.

**అవశ్యమత్ర కశ్చిద్వై జీవశ్చైవాగమిష్యతి ।**
**తం హత్వా స్వగృహం ప్రీత్యా యాస్యామి కృతకార్యకః ॥ 14 ॥**

ఇక్కడకు ఏదో ఒక జంతువు తప్పని సరిగా వస్తుంది. దానిని చంపి కృతకృత్యుడనై ప్రీతితో స్వగృహానికి వెళతాను.

**ఇతి మత్వా స వై వృక్షమేకం బిల్వేతి సంజ్ఞకమ్ ।**
**సమారుహ్య స్థితస్తత్ర జలమాదాయ భిల్లకః ॥ 15 ॥**

ఇట్లాలోచించి ఆ కిరాతుడు నీటిని తీసుకొని సమీపంలో నున్న మారేడు చెట్టుపైకెక్కి అక్కడ వేచియున్నాడు.

**కదా యాస్యతి కశ్చిద్వై కదా హన్యామహం పునః ।**
**ఇతి బుద్ధిం సమాస్థాయ స్థితో௨సౌ క్షుత్తృషాన్వితః ॥ 16 ॥**

"ఏదో ఒక జంతువు ఎప్పుడు వస్తుందో కదా! నేను దానిని ఎప్పుడు సంహరిస్తానో గదా!" అని ఆలోచిస్తూ ఆకలి – దప్పికలతో బాధపడుతూ అక్కడే వేచి చూస్తున్నాడు.

**తద్రాత్రౌ ప్రథమే యామే మృగీ త్వేకా సమాగతా ।**
**తృషార్తా చకితా సా చ ప్రోత్ఫాలం కుర్వతీ తదా ॥ 17 ॥**

ఆనాటి రాత్రి మొదటి జాములో ఒక ఆడలేడి దప్పికతో బాధపడుతూ, భయంతో ఎగురుతూ వచ్చింది.

**తాం దృష్ట్వా చ తదా తేన తద్వధార్థమథో శరః ।**
**సంహృష్టేన ద్రుతం విష్ణో! ధనుషి స్వే హి సందధే ॥ 18 ॥**

ఓ విష్ణూ! ఆ కిరాతుడు దానిని చూచి చాల సంతోషించి వెంటనే దానిని చంపడానికి బాణాన్ని ధనుస్సులో సంధించాడు.

**ఇత్యేవం కుర్వతస్తస్య జలం బిల్వదళాని చ ।**
**పతితాని హ్యధస్తత్ర శివలింగమభూత్తతః ॥ 19 ॥**

అతడా ప్రయత్నంలో ఉండగా క్రిందకు కొంచెం నీరు, మారేడు దళాలు పడ్డాయి. అక్కడ ఒక శివలింగం ఉంది.

**యామస్య ప్రథమస్యైవ పూజా జాతా శివస్య చ ।**
**తన్మహిమ్నా హి తస్యైవ పాతకం గలితం తదా ॥ 20 ॥**

ఆ విధంగా శివుని ప్రథమయామంలో పూజ సంపన్నమయ్యింది. దాని మహిమచే వాని పాతకం వెంటనే తొలగిపోయింది.

**తత్రత్యం చైవ తచ్ఛబ్దం శ్రుత్వా సా హరిణీ భియా ।**
**వ్యాధం దృష్ట్వా వ్యాకులా హి వచనం చేదమబ్రవీత్ ॥ 21 ॥**

ఆ సమయంలో వచ్చిన ఆ శబ్దాన్ని విని, లేడి భయపడి కిరాతుని చూచి కంగారుపడి ఇట్లు పలికింది.

**మృగ్యువాచ** – ఆడమృగం పలికింది.

**కిం కర్తుమిచ్ఛసి వ్యాధ! సత్యం వద మమాగ్రతః ।**
**తచ్ఛ్రుత్వా హరిణీవాక్యం వ్యాధో వచనమబ్రవీత్ ॥ 22 ॥**

"ఓ కిరాతా! నీవేమి చేయాలనుకుంటున్నావు? నాతో నిజం చెప్పు". ఆ లేడియొక్క ఈ మాటలు విని కిరాతుడిలా పలికాడు.

**వ్యాధ ఉవాచ** – వ్యాధుడు పలికాడు.

**కుటుంబం క్షుధితం మేఽద్య హత్వా త్వాం తర్పయామ్యహమ్ ।**
**దారుణం తద్వచశ్శ్రుత్వా దృష్ట్వా తం దుర్ధరం ఖలమ్ ॥ 23 ॥**

"నా కుటుంబం ఆకలితో ఉంది. నిన్ను చంపి నేను వారిని తృప్తిపరుస్తాను." కిరాతుని మాటలు లేడి విని నివారింపశక్యం గాని ఆ దుర్మార్గుని చూచింది.

**కిం కరోమి క్వ గచ్ఛామి హ్యుపాయం రచయామ్యహమ్ ।**
**ఇత్థం విచార్య సా తత్ర వచనం చేదమబ్రవీత్ ॥ 24 ॥**

"నేనేమి చేయాలి? ఎక్కడకు పోతాను? నేనొక ఉపాయాన్ని చేస్తాను." అని ఆలోచించి ఆ లేడి అప్పుడిలా పలికింది.

**మృగీ ఉవాచ** – లేడి పలికింది.

**మన్మాంసేన సుఖం తే స్యాద్దేహస్యానర్థకారిణః ।**
**అధికం కిం మహత్పుణ్యం ధన్యాఽహం నాత్ర సంశయః ॥ 25 ॥**

నా మాంసంచే నీకు సుఖం కలగడంకంటె, అనర్థాలను కలగజేసే ఈ శరీరానికి అధికమైన గొప్ప పుణ్యం మరియొకటి లేదు. నేను ధన్యురాలను. సందేహం లేదు.

**ఉపకారకరస్యైవ యత్పుణ్యం జాయతే త్విహ ।**
**తత్పుణ్యం శక్యతే నైవ వక్తుం వర్షశతైరపి ॥ 26 ॥**

ఈ లోకంలో ఉపకారం చేసేవానికి లభించే పుణ్యంయొక్క గొప్పదనం వర్ణించడానికి వంద సంవత్సరాలైనా చాలదు.

**పరం తు శిశవో మేఽద్య వర్తంతే స్వాశ్రమేఽఖిలాః ।**
**భగిన్యై తాన్ సమర్ప్యైవ ప్రాయాస్యే స్వామినేఽథవా ॥ 27 ॥**

కాని నాకు పిల్లలున్నారు. వారందరు ఇక్కడనే ఆశ్రమంలోనున్నారు. వారిని నా చెల్లిలికి గాని, నా భర్తకు గాని అప్పగించి తిరిగి వస్తాను.

**న మే మిథ్యా వచస్త్వం హి విజానీహి వనేచర! ।**
**ఆయాస్యేఽహం పునశ్చేహ సమీపం తే న సంశయః ॥ 28 ॥**

నా మాట అసత్యం కాదు. ఓ కిరాతా! నేను మరల తిరిగి నీ సమీపానికి వస్తాను. ఇందులో సందేహం లేదు. ఇది నిజం. ఈ సత్యాన్ని నీవు తెలుసుకో.

**స్థితా సత్యేన ధరణీ సత్యేనైవ చ వారిధిః ।**
**సత్యేన జలధారాశ్చ సత్యే సర్వం ప్రతిష్ఠితమ్ ॥ 29 ॥**

ఈ భూమండలమంతయు సత్యంపైనే ఆధారపడి యుంది. సముద్రం కూడ సత్యంవల్లనే చెలియలి కట్టదాటక నిలచియుంది. సత్యంవల్లనే జలధారలు సాగుతున్నాయి. సత్యంలోనే సమస్తం ప్రతిష్ఠితమయ్యింది.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇత్యుక్తోఽపి తయా వ్యాధో న మేనే తద్వచో యదా ।**
**తదా సువిస్మితా భీతా వచనం సాఽబ్రవీత్పునః ॥ 30 ॥**

ఆ లేడి ఇట్లు పలికినప్పటికీ కిరాతుడంగీకరించలేదు. అప్పుడది చాల భయాన్ని, విస్మయాన్ని పొంది మరలా ఇలా పలికింది.

**మృగీ ఉవాచ –** లేడి పలికింది.

**శృణు వ్యాధ! ప్రవక్ష్యామి శపథం హి కరోమ్యహమ్ ।**
**ఆగచ్ఛేయం యథా తే న సమీపం స్వగృహాద్గతా ॥ 31 ॥**

**బ్రాహ్మణో వేదవిక్రేతా సంధ్యాహీనస్త్రికాలకమ్ ।**
**స్త్రియః స్వస్వామినో హ్యాజ్ఞాం సముల్లంఘ్య క్రియాన్వితాః ॥ 32 ॥**

**కృతఘ్నే చైవ యత్పాపం తత్పాపం విముఖే హరే ।**
**ద్రోహిణ శ్చైవ యత్పాపం తత్పాపం ధర్మలంఘనే ॥ 33 ॥**

**విశ్వాసఘాతకే తచ్చ తథా వై ఛలకర్తరి ।**
**తేన పాపేన లింపామి యద్యహం నాగమే పునః ॥ 34 ॥**

**ఇత్యాద్యనేకశపథాన్మృగీ కృత్వా స్థితా యదా ।**
**తదా వ్యాధస్స విశ్వస్య గచ్ఛేతి గృహమబ్రవీత్ ॥ 35 ॥**

"ఓ కిరాతా! నామాటలు విను. నేను శపథాలు చేస్తున్నా. నేను నా యింటికి వెళ్లి నీ సమీపానికి తిరిగి రాని పక్షంలో – మూడు కాలాలలోను సంధ్యావందనం వీడి వేదాన్ని అమ్ముకొని బ్రతికే బ్రాహ్మణుడు, తమ భర్తల మాటను కాదని స్వేచ్ఛగా వ్యవహరించే స్త్రీలు, చేసిన ఉపకారాన్ని మరచిన కృతఘ్నులు, శివునియందు భక్తి

లేనివాడు, ద్రోహాన్ని చేసేవాడు, ధర్మాన్ని ఉల్లంఘించేవాడు, విశ్వాసఘాతకుడు, మోసగాడు, ఏ పాపాన్ని పొందుతారో, నేను కూడా అట్టి పాపాన్నే పొందుతాను.” ఈ విధంగా అనేక శపథాలు చేసి నిలబడింది. ఆ శపథాలపై వ్యాధునికి విశ్వాసం కుదిరి ఇంటికి వెళ్లమని లేడితో పలికాడు.

**మృగీ హృష్టా జలం పీత్వా గతా స్వాశ్రమమండలమ్ ।**
**తావచ్చ ప్రథమో యామస్తస్య నిద్రాం వినా గతః ॥ 36 ॥**

ఆ లేడి ఆనందంతో నీటిని త్రాగి తన ఆశ్రమానికి వెళ్లింది. ఇంతలో ఆ కిరాతునికి నిద్రలేకుండగానే మొదటి యామం గడిచిపోయింది.

**తదీయా భగినీ యా వై మృగీ చ పరిభావితా ।**
**తస్యా మార్గం విచిన్వంతీ హ్యాజగామ జలార్థినీ ॥ 37 ॥**

ఆ లేడియొక్క చెల్లెలు కూడ దానిని గానక దుఃఖిస్తూ దానికొఱకు వెదకుతూ నీటిని త్రాగడానికి అచ్చటకు వచ్చింది.

**తాం దృష్ట్వా చ స్వయం భిల్లోఽకార్షీద్బాణస్య కర్షణమ్ ।**
**పూర్వవజ్జలపత్రాణి పతితాని శివోపరి ॥ 38 ॥**

ఆ లేడిని చూచిన వెంటనే కిరాతుడు బాణాన్ని ఎక్కుపెట్టాడు. ఇంతకు ముందు వలెనే ఇప్పుడు కూడ శివుని పై నీరు, మారేడుదళాలు పడ్డాయి.

**యామస్య చ ద్వితీయస్య తేన శంభోర్మహాత్మనః ।**
**పూజా జాతా ప్రసంగేన వ్యాధస్య సుఖదాయినీ ॥ 39 ॥**

దానివల్ల ఆ కిరాతునకు అనుకోకుండగా, సమస్త సుఖాలనిచ్చే శంభుపరమాత్మయొక్క రెండవ జాము పూజ సంపన్నమయ్యింది.

**మృగీ సా ప్రాహ తం దృష్ట్వా కిం కరోషి వనేచర! ।**
**పూర్వవత్కథితం తేన తచ్ఛ్రుత్వాహ మృగీ పునః ॥ 40 ॥**

ఆ లేడి కిరాతుని చూచి ‘ఓ కిరాతా ! నీవేమి చేస్తున్నావు. అని ప్రశ్నించగా, అతడు పూర్వం వలెనే బదులు చెప్పాడు. ఆమాట విని ఆ లేడి మరల ఇలా పలికింది.

**మృగీ ఉవాచ –** లేడి పలికింది.

**ధన్యాహం శ్రూయతాం వ్యాధ! సఫలం దేహధారణమ్ ।**
**అనిత్యేన శరీరేణ హ్యుపకారో భవిష్యతి ॥ 41 ॥**

ఓ కిరాతా! నేను ధన్యురాలను విను. నేను దేహాన్ని ధరించడం సఫలమయ్యింది. అనిత్యమైన ఈ శరీరంతో పరోపకారం సిద్ధించబోతోంది.

**పరంతు మమ బాలాశ్చ గృహే తిష్ఠంతి చార్భకాః ।**
**భర్త్రే తాంశ్చ సమర్ప్యైవ హ్యాగమిష్యామ్యహం పునః ॥ 42 ॥**

కాని, నా చిన్నపిల్లలు ఇంటి వద్ద ఉన్నారు. వారిని నా భర్తకు అప్పగించి నేను తిరిగివస్తాను.

**వ్యాధ ఉవాచ -** కిరాతుడు పలికాడు.

**త్వయా చోక్తం న మన్యేఽహం హన్మి త్వాం నాత్ర సంశయః ।**
**తచ్ఛ్రుత్వా హరిణీ ప్రాహ శపథం కుర్వతీ హరే! ॥ 43 ॥**

నేను నీ మాటలనంగీకరించడం లేదు. నిన్ను నేను సంహరించడం నిశ్చయం. సందేహం లేదు. ఆ మాట విని శ్రీహరీ! లేడి శపథం చేస్తూ ఇట్లు పలికింది.

**మృగీ ఉవాచ -** లేడి చెప్పింది.

**శృణు వ్యాధ! ప్రవక్ష్యామి నాగచ్ఛేయం పునర్యది ।**
**వాచా విచలితో యస్తు సుకృతం తేన హారితమ్ ॥ 44 ॥**

"ఓ కిరాతా! నేను చెప్పే మాట విను. నేను తిరిగి రాక పోతే నేను నీకిచ్చిన మాట తప్పిన కారణంగా, నా పుణ్యం నీవు హరిస్తావు.

**పరిణీతాం స్త్రియం హిత్వా గచ్ఛత్యన్యాం చ యః పుమాన్ ।**
**వేదధర్మం సముల్లంఘ్య కల్పితేన చ యో వ్రజేత్ ॥ 45 ॥**

**విష్ణుభక్తిసమాయుక్తః శివనిందాం కరోతి యః ।**
**పిత్రోః క్షయాహమాసాద్య శూన్యం చైవాక్రమేదిహ ॥ 46 ॥**

**కృత్వా చ పరితాపం హి కరోతి వచనం పునః ।**
**తేన పాపేన లింపామి నాగచ్ఛేయం పునర్యది ॥ 47 ॥**

వివాహమాడిన భార్యను విడిచి మరియొక స్త్రీ పొందు కోరే వ్యక్తియు, వేదధర్మాన్ని విడచి కల్పిత ధర్మం వెంటబడే వాడును, విష్ణువును ఆరాధిస్తూ శివుని నిందించేవాడును, శూన్యతిథినాడు తల్లిదండ్రులకు క్షయాహ కర్మ చేసేవాడును, దుఃఖాన్ని కలిగించి ఆపై తియ్యగా మాట్లాడే వాడును, ఏ పాపం పొందుతారో, నేను తిరిగి రాకపోతే అటువంటి పాపాన్నే పొందుతాను."

**సూత ఉవాచ -** సూతుడు పలికెను.

**ఇత్యుక్తశ్చ తయా వ్యాధో గచ్ఛేత్యాహ మృగీం చ సః ।**
**సా మృగీ చ జలం పీత్వా హృష్టాఽఽగచ్ఛత్ స్వమాశ్రమమ్ ॥ 48 ॥**

ఆ లేడి ఇట్లు పలుకగా కిరాతుడు దానితో ఇంటికి పొమ్మని పలికాడు. ఆ లేడి ఆనందించి, నీటిని త్రాగి, తన ఆశ్రమానికి వెళ్లింది.

**తావద్ద్వితీయో యామో వై తస్య నిద్రాం వినా గతః ।**
**ఏతస్మిన్సమయే తత్ర ప్రాప్తే యామే తృతీయకే ॥ 49 ॥**

ఈ విధంగా వానికి నిద్ర లేకుండగానే రెండవ యామం కూడ గడిచింది. ఇంతలో మూడవ యామం ఆరంభమయ్యింది.

**జ్ఞాత్వా విలంబం చకితస్తదన్వేషణతత్పరః ।**
**తద్యామే మృగమద్రాక్షీజ్జలమార్గగతం తతః ॥ 50 ॥**

ఆ కిరాతుడు ఆలస్యమౌతోందని తలచి మృగాన్ని వెతికే కంగారులో ఉన్నాడు. మూడవ యామంలో నీటి కోసం వెళుతున్న ఒక లేడి వాని కంటబడింది.

**పుష్టం మృగం చ తం దృష్ట్వా హృష్టో వనచరస్స వై ।**
**శరం ధనుషి సంధాయ హంతుం తం హి ప్రచక్రమే ॥ 51 ॥**

బలిసియున్న ఆ మృగాన్ని చూచి కిరాతుడు సంతసించి బాణాన్ని ధనుస్సులో సంధించి దానిని కొట్టడానికి సిద్ధపడుతున్నాడు.

**తదైవం కుర్వతస్తస్య బిల్వపత్రాణి కానిచిత్ ।**
**తత్ర్పారబ్ధవశాద్విష్ణో! పతితాని శివోపరి ॥ 52 ॥**

ఓ విష్ణూ! అతడా ప్రయత్నంలో నుండగా వాని పూర్వపుణ్య విశేషంచే కొన్ని మారేడు పత్రాలు శివునిపై పడ్డాయి.

**తేన తృతీయయామస్య తద్రాత్రౌ తస్య భాగ్యతః ।**
**పూజా జాతా శివస్యైవ కృపాళుత్వం ప్రదర్శితమ్ ॥ 53 ॥**

వాని భాగ్యంచే ఆ విధంగా ఆ రాత్రి మూడవ యామపూజ కూడ సంపన్నమయ్యింది. దీనితో శివుని దయాగుణం ప్రకటితమయ్యింది.

**శ్రుత్వా తత్ర చ తం శబ్దం కిం కరోషీతి ప్రాహ సః ।**
**కుటుంబార్థమహం హన్మి త్వాం వ్యాధశ్చేతి సోఽబ్రవీత్ ॥ 54 ॥**

అక్కడ ఆ శబ్దాన్ని విని "నీవేమి చేస్తున్నావు?" అని ఆ మృగం ప్రశ్నించగా, 'నేను నా కుటుంబ పోషణకొఱకు నిన్ను సంహరింపబోతున్నాను' అని కిరాతుడు బదులు పలికాడు.

**తచ్ఛ్రుత్వా వ్యాధవచనం హరిణో హృష్టమానసః ।**
**ద్రుతమేవ చ తం వ్యాధం వచనం చేదమబ్రవీత్ ॥ 55 ॥**

కిరాతుని ఈ మాటలు విని మృగం సంతోషంతో నిండిన మనస్సు గలదై వెంటనే కిరాతునితో ఇలా పలికింది.

**హరిణ ఉవాచ** - లేడి పలికింది.

**ధన్యోఽహం పుష్టిమానద్య భవత్తృప్తిర్భవిష్యతి ।**
**యస్యాంగం నోపకారార్థం తస్య సర్వం వృథా గతమ్ ॥ 56 ॥**

నేను ధన్యుడను. బలిసిన నా శరీరంతో మీకు తృప్తి కలుగగలదు. ఎవని దేహం పరోపకారంకొఱకు వినియోగించబడదో వానికి సర్వం వ్యర్థమైనట్లే.

**యో వై సామర్థ్యయుక్తశ్చ నోపకారం కరోతి వై ।**
**తత్సామర్థ్యం భవేద్వ్యర్థం పరత్ర నరకం వ్రజేత్ ॥ 57 ॥**

ఎవడైతే సామర్థ్యమున్నప్పటికి పరోపకారం చేయడో, వాని సామర్థ్యం వ్యర్థమౌటయే గాక, అట్టివాడు మరణించిన తరువాత నరకాన్ని పొందుతాడు.

**పరంతు బాలకాన్ స్వాంశ్చ సమర్ప్య జననీం శిశూన్ ।**
**ఆశ్వాస్యాప్యథ తాన్ సర్వానాగమిష్యామ్యహం పునః ॥ 58 ॥**

కాని నేను నా చిన్న పిల్లలను తల్లికి అప్పగించి, వారినందరిని ఓదార్చి మరల వస్తాను.

**ఇత్యుక్తస్తేన స వ్యాధో విస్మితోఽతీవ చేతసి ।**
**మనాక్ శుద్ధమనా నష్టపాపపుంజో వచోఽబ్రవీత్ ॥ 59 ॥**

ఆ మృగం ఇట్లు పలుకగా, కిరాతుడు మనస్సులో చాల ఆశ్చర్యాన్ని పొందాడు. అతని పాపసమూహం నశించి, మనస్సు కొంతవరకు శుద్ధమయ్యింది. అతడిట్లు పలికాడు.

**వ్యాధ ఉవాచ** - వ్యాధుడు పలికాడు.

**యే యే సమాగతాశ్చాత్ర తే తే సర్వే త్వయా యథా ।**
**కథయిత్వా గతా హ్యత్ర నాయాన్త్యద్యాపి వంచకాః ॥ 60 ॥**

"ఇక్కడకు వచ్చిన మృగాలన్నీ నీవు చెప్పిన విధంగానే చెప్పి వెళ్లాయి. ఆ మృగాలన్నీ నన్ను మోసగించాయి. అవి యింతవరకు తిరిగి రాలేదు.

**త్వం చాపి సంకటే ప్రాప్తో వ్యలీకం చ గమిష్యసి ।**
**మమ సంజీవనం చాద్య భవిష్యతి కథం మృగ! ॥ 61 ॥**

నీవు కూడ కష్టం రాగానే మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నావు. ఓ మృగమా! నేనెట్లు బ్రతకాలి?"

**మృగ ఉవాచ** - లేడి పలికింది.

**శృణు వ్యాధ! ప్రవక్ష్యామి నానృతం విద్యతే మయి ।**
**సత్యేన సర్వం బ్రహ్మాండం తిష్ఠత్యేవ చరాచరమ్ ॥ 62 ॥**

"ఓ కిరాతా! నేను చేప్పే మాట విను. నేను అసత్యం పలుకటలేదు. స్థావరజంగమాత్మకమైన ఈ బ్రహ్మాండ-మంతయు సత్యమునందు మాత్రమే ప్రతిష్ఠితమయ్యింది.

**యస్య వాణీ వ్యలీకా హి తత్పుణ్యం గలితం క్షణాత్ ।**
**తథాపి శృణు వై సత్యాం ప్రతిజ్ఞాం మమ భిల్లక! ॥ 63 ॥**

అసత్యం పలికే వాని పుణ్యం క్షణకాలంలో వినష్టమౌతుంది. ఓ కిరాతా! అయినను నేను చేసే సత్య ప్రతిజ్ఞ విను.

**సంధ్యాయాం మైథునే ఘస్రే శివరాత్ర్యాం చ భోజనే ।**
**కూటసాక్ష్యే న్యాసహారే సంధ్యాహీనే ద్విజే తథా ॥ 64 ॥**

**శివహీనం ముఖం యస్య నోపకర్తా క్షమోఽపి సన్ ।**
**పర్వణి శ్రీఫలస్యైవ త్రోటనేఽభక్ష్య భక్షణే ॥ 65 ॥**

సంధ్యాకాలంలో మైథునం చేసేవాడును, శివరాత్రినాడు భోజనం చేసేవాడును, అసత్యసాక్ష్యం పలికేవాడును, దాచి పెట్టమని ఇచ్చిన సొమ్మును అపహరించినవాడును, సంధ్యావందనం చేయని బ్రాహ్మణుడును, శివనామాన్ని పలుకని నోరుగల వాడును, సమర్థుడై యుండియు ఉపకారం చేయనివాడు, పర్వదినం నాడు, కొబ్బరి కాయను ముచికవద్ద త్రుంచువాడు, తినకూడని పదార్థాన్ని తినేవాడు.

**అసంపూజ్య శివం భస్మ రహితశ్చాన్నభుక్ చ యః ।**
**ఏతేషాం పాతకం మే స్యాన్నాగచ్ఛేయం పునర్యది ॥ 66 ॥**

శివుని పూజింపకుండాను, భస్మధారణ చేయకుండాను, భోజనం చేసేవాడును – పొందే పాపాలు నేను తిరిగి రాకపోతే నాకు సంక్రమించు గాక!"

**శివ ఉవాచ –** శివుడు పలికాడు.

**ఇతి శ్రుత్వా వచస్తస్య గచ్ఛ శీఘ్రం సమావ్రజ ।**
**స వ్యాధేనైవ ముక్తస్తు జలం పీత్వా గతో మృగః ॥ 67 ॥**

ఆ లేడి ఈ మాటలు విని ఆ కిరాతుడు సరే, తొందరగా వెళ్లి తిరిగిరమ్మని పలికాడు. అది ఆ మాట విని నీటిని త్రాగి వెళ్లింది.

**తే సర్వే మిలితాస్తత్ర స్వాశ్రమే కృతసుప్రణాః ।**
**వృత్తాంతం చైవ తం సర్వం శ్రుత్వా సమ్యక్ పరస్పరమ్ ॥ 68 ॥**

ఈ విధంగా గొప్ప శపథాలు చేసి వెళ్లిన మృగాలన్నీ తమ నివాసంలో కలుసుకొని ఒకరినుండి మరియొకరు ఆ వృత్తాంతాన్నంతటిని విన్నాయి.

**గంతవ్యం నిశ్చయేనేతి సత్యపాశేన యంత్రితాః ।**
**ఆశ్వాస్య బాలకాంస్తత్ర గంతుముత్కంఠితాస్తదా ॥ 69 ॥**

సత్యమనే పాశంతో బంధింపబడిన ఆ మృగాలన్నీ, తప్పనిసరిగా తిరిగి వెళ్లాలని నిశ్చయించుకొని, ఇంటిలోని బాలకులనోదార్చి వెళ్లడానికి తొందరపడుతున్నాయి.

**మృగీ జ్యేష్ఠా చ యా తత్ర స్వామినం వాక్యమబ్రవీత్ ।**
**త్వాం వినా బాలకా హ్యత్ర కథం స్థాస్యంతి వై మృగాః ॥ 70 ॥**

ఆడలేళ్లలో పెద్దది తన భర్తతో ఇలా పలికింది. "స్వామీ! నీవు లేకుండా ఈ బాలకులెట్లుండగలుగుతారు?

**ప్రథమం తు మయా తత్ర ప్రతిజ్ఞా చ కృతా ప్రభో! ।**
**తస్మాన్మయా చ గంతవ్యం భవద్భ్యాం స్థీయతామిహ ॥ 71 ॥**

ఓ ప్రభూ! ముందుగా నేను ప్రతిజ్ఞ చేశాను. కావున నేను అచ్చటకు వెళ్లాలి. మీరిక్కడనే ఉండండి."

**ఇతి తద్వచనం శ్రుత్వా కనిష్ఠా వాక్యమబ్రవీత్ ।**
**అహం త్వత్సేవికా చాద్య గచ్ఛామి స్థీయతాం త్వయా ॥ 72 ॥**

ఆ మాటలు విని, చిన్న ఆడులేడి (రెండవ ఆడలేడి) ఇలా పలికింది. "నేను నీ సేవకురాలను. ఇప్పుడు నేను వెళుతున్నాను. మీరిద్దరు ఇక్కడనే ఉండండి".

**తచ్ఛ్రుత్వా చ  మృగః ప్రాహ గమ్యతే తత్ర వై మయా ।**
**భవత్యౌ తిష్ఠతాం చాత్ర మాతృతః శిశురక్షణమ్ ॥ 73 ॥**

ఆ మాటలు విని, మగలేడి ఇలా పలికింది. "నేను వెళుతున్నాను. మీరిద్దరు ఇక్కడనే యుండండి. పిల్లలను రక్షించడం తల్లి కర్తవ్యం."

**తత్ స్వామివచనం శ్రుత్వా మేనాతే తన్న ధర్మతః ।**
**ప్రోచుః ప్రీత్యా స్వభర్తారం వైధవ్యే జీవితం చ ధిక్ ॥ 74 ॥**

తమ భర్త మాటలు వినిన ఆ హరిణాలు ఆ మాటలు ధర్మబద్ధాలని భావించలేదు. అవి తమ భర్తతో ప్రేమ పూర్వకంగా ఇలా పలికాయి. "వైధవ్యజీవితం నిందల పాలే గదా!"

**బాలానాశ్వాస్య తాంస్తత్ర సమర్ప్య సహవాసినః ।**
**గతాస్తే సర్వ ఏవాశు యత్రాస్తే వ్యాధసత్తమః ॥ 75 ॥**

అవి అన్నీ కూడ పిల్లలనోదార్చి వాటిని తమ తోటివారికి అప్పజెప్పి కిరాతశ్రేష్ఠుడున్న స్థలానికి శీఘ్రంగా వెళ్లాయి.

**తే బాలా అపి సర్వే వై విలోక్యాను సమాగతాః ।**
**ఏతేషాం యా గతిః స్యాద్వై హ్యస్మాకం సా భవత్వితి ॥ 76 ॥**

"వారికి లభించిన గతియే మాకు కూడ లభించుగాక!" అని తలంచి పిల్లలన్నీ ఆ మృగాలు వెళ్లుటను గాంచి, తాము కూడ వాటి వెనుకే వెళ్లాయి.

**తాన్ దృష్ట్వా హర్షితో వ్యాధో బాణం ధనుషి సందధే ।**
**పునశ్చ జలపత్రాణి పతితాని శివోపరి ॥ 77 ॥**

ఆ కిరాతుడు మృగాలనన్నింటిని చూచి చాల ఆనందించి బాణాన్ని ధనుస్సులో ఎక్కుపెట్టాడు. ఈ సమయంలో పూర్వం లాగే నీరు, కొన్ని మారేడుపత్రాలు శివునిపై పడ్డాయి.

**తేన జాతా చతుర్థస్య పూజా యామస్య వై శుభా ।**
**తస్య పాపం తదా సర్వం భస్మసాదభవత్ క్షణాత్ ॥ 78 ॥**

ఈ విధంగా శుభకరమైన నాల్గవ జాము పూజకూడ సంపన్న మయ్యింది. వెంటనే ఆ కిరాతుని పాపాలన్నీ క్షణంలో బూడిద అయ్యాయి.

**మృగీ మృగీ మృగశ్చోచుః శీఘ్రం వై వ్యాధసత్తమ! ।**
**అస్మాకం సార్థకం దేహం కురు త్వం హి కృపాం కురు ॥ 79 ॥**

రెండు ఆడ వేళ్ళు, ఒక మగ లేడి వెంటనే ఇలా పలికాయి. "ఓ కిరాతశ్రేష్ఠుడా! నీవు మాయందు దయయుంచి శీఘ్రమే మా దేహాలను సార్థకం చేయుము."

**శివ ఉవాచ –** శివుడు పలికాడు.

**ఇతి తే షాం వచః శ్రుత్వా వ్యాధో విస్మయమాగతః ।**
**శివపూజాప్రభావేణ జ్ఞానం దుర్లభమాప్తవాన్ ॥ 80 ॥**

వాటి మాటలు విని కిరాతుడు ఆశ్చర్యపోయాడు. శివుని పూజించిన ప్రభావంచే ఆ కిరాతునికి దుర్లభమైన జ్ఞానం లభించింది.

**ఏతే ధన్యా మృగాశ్చైవ జ్ఞానహీనాః సుసంమతాః ।**
**స్వీయేనైవ శరీరేణ పరోపకరణే రతాః ॥ 81 ॥**

"అందరూ జ్ఞానం లేనివని భావించే ఈ మృగాలే తమ శరీరాలను సమర్పించి పరోపకారంచేయడంలో నిష్ఠగలిగి ధన్యమయ్యాయి.

**మానుష్యం జన్మ సంప్రాప్య సాధితం కిం మయాఽధునా ।**
**పరకాయం చ సంపీడ్య శరీరం పోషితం మయా ॥ 82 ॥**

నేను మానవజన్మ పొంది ఏమి సాధించాను? ఇతర ప్రాణులను సంహరించి వాటి దేహాలతో నేను పొట్ట పోసుకున్నాను.

**కుటుంబం పోషితం నిత్యం కృత్వా పాపాన్యనేకశః ।**
**ఏవం పాపాని హా! కృత్వా కా గతిర్మే భవిష్యతి ॥ 83 ॥**

నిత్యం అనేక పాపాలు చేసి కుటుంబం పోషించాను. అయ్యో! ఈ విధంగా పాపాలు చేసిన నాకు ఎటువంటి గతిపట్టనున్నదో గదా!

**కాం వా గతిం గమిష్యామి పాతకం జన్మతః కృతమ్ ।**
**ఇదానీం చింతాయామ్యేవం ధిగ్ధిక్ చ జీవనం మమ ॥ 84 ॥**

పుట్టిన నాటినుండీ పాపాలు చేసిన నేను ఏ గతిని పొందుతానో గదా! ఇప్పుడీ విధంగా చింతిస్తున్నాను. నా జీవితానికి అనేక మార్లు నిందయగుగాక!"

**ఇతి జ్ఞానం సమాపన్నో బాణం సంవారయంస్తదా ।**
**గమ్యతాం చ మృగశ్రేష్ఠాః! ధన్యాః స్థ ఇతి చాబ్రవీత్ ॥ 85 ॥**

అతడిట్టి జ్ఞానాన్ని పొందినవాడై బాణాన్ని ఉపసంహరించుకున్నాడు. "ఓ మృగశ్రేష్ఠములారా! మీరు ధన్యులు, మీరు వెళ్లండి" అని కిరాతుడు పలికాడు.

**శివ ఉవాచ** - శివుడు పలికాడు.

**ఇత్యుక్తే చ తదా తేన ప్రసన్నః శంకరస్తదా ।**
**పూజితం చ స్వరూపం హి దర్శయామాస సమ్మతమ్ ॥ 86 ॥**

ఆ కిరాతుడిట్లు పలుకగానే శంకరుడు ప్రసన్నుడై వానిచే పూజింపబడినదియు, సర్వులకు అభీష్టమైనదియునగు తన రూపాన్ని చూపించాడు.

**సంస్పృశ్య కృపయా శంభుస్తం వ్యాధం ప్రీతితోఽబ్రవీత్ ।**
**వరం బ్రూహి ప్రసన్నోఽస్మి వ్రతేనానేన భిల్లక! ॥ 87 ॥**

శంభువు ప్రీతిపూర్వకంగా కిరాతుని దయతో స్పృశించి ఇట్లు పలికాడు. "ఓ కిరాతా! నీ యీ వ్రతంచే నేను ప్రసన్నుడినయ్యాను. వరం కోరుకొనుము."

**వ్యాధోఽపి శివరూపం చ దృష్ట్వా ముక్తోఽభవత్ క్షణాత్ ।**
**పపాత శివపాదాగ్రే సర్వం ప్రాప్తమితి బ్రువన్ ॥ 88 ॥**

వ్యాధుడు కూడ శివుని రూపాన్ని చూచి "క్షణంలో ముక్తుడనయ్యాను. నాకు సర్వస్వం లభించింది." అని పలికి అతడు శివుని పాదాలపై పడ్డాడు.

**శివోఽపి సుప్రసన్నాత్మా నామ దత్వా గుహేతి చ ।**
**విలోక్య తం కృపాదృష్ట్యా తస్మై దివ్యాన్వరానదాత్ ॥ 89 ॥**

శివుడు కూడా మిక్కిలి ప్రసన్నుడై గుహుడని అతనికి పేరు పెట్టి అతనిని దయాదృష్టితో చూచి దివ్యవరాల-నిచ్చాడు.

**శివ ఉవాచ –** శివుడు పలికాడు.

**శృణు వ్యాధాద్య భోగాంస్త్వం భుంక్ష్వ దివ్యాన్యథేప్సితాన్ ।**
**రాజధానీం సమాశ్రిత్య శృంగవేరపురే పరామ్ ॥ 90 ॥**

"ఓ కిరాతుడా! విను. ఈ జన్మలో నీవు అభీష్టములైన దివ్య భోగాలననుభవించు. శ్రేష్ఠమైన శృంగబేరపురం నీకు రాజధాని కాగలదు.

**అనపాయా వంశవృద్ధిః శ్లాఘనీయః సురైరపి ।**
**గృహే రామస్తవ వ్యాధ! సమాయాస్యతి నిశ్చితమ్ ॥ 91 ॥**

దేవతలచేత కూడ కొనియాడదగిన నీవంశం ఆపదలేమీ లేకుండా వృద్ధిని పొందగలదు. ఓ కిరాతా! శ్రీరాముడు నిశ్చయంగా నీ గృహానికి రాగలడు.

**కరిష్యతి త్వయా మైత్రీం మద్భక్తస్నేహకారకః ।**
**మత్సేవాసక్తచేతాస్త్వం ముక్తిం యాస్యసి దుర్లభామ్ ॥ 92 ॥**

నా భక్తులతో స్నేహాన్ని చేసే శ్రీరాముడు నీతో మైత్రిని చేయగలడు. నా సేవయందు ఆసక్తమైన మనస్సు గల నీవు దుర్లభమైన ముక్తిని పొందగలవు."

**ఏతస్మిన్నంతరే తే తు కృత్వా శంకరదర్శనమ్ ।**
**సర్వే ప్రణమ్య సన్ముక్తిం మృగయోనేః ప్రపేదిరే ॥ 93 ॥**

ఇదే సమయంలో ఆ మృగాలన్నీ శంకరుని దర్శించి ప్రణమిల్లి మృగజన్మనుండి విముక్తిని పొందాయి.

**విమానం చ సమారుహ్య దివ్యదేహా గతాస్తదా ।**
**శివదర్శనమాత్రేణ శాపాన్ముక్తా దివం గతాః ॥ 94 ॥**

అప్పుడా మృగాలు శివుని దర్శనమాత్రంచేతనే శాపంనుండి విముక్తిని పొంది దివ్యదేహాలను దాల్చి, విమానాన్ని అధిరోహించి స్వర్గం చేరాయి.

**వ్యాధేశ్వరః శివో జాతః పర్వతే హ్యర్బుదాచలే ।**
**దర్శనాత్పూజనాత్సద్యో భుక్తిముక్తిప్రదాయకః ॥ 95 ॥**

అర్బుద పర్వతమునందు శివుడు వ్యాధేశ్వరుడనే పేరుతో వెలసెను. ఆయనను దర్శించి పూజించువారలకు ఆయన శీఘ్రంగా భుక్తిని, ముక్తిని ఇస్తాడు.

**వ్యాధోఽపి తద్దినాన్నూనం భోగాన్స సురసత్తమ! ।**
**భుక్త్వా రామకృపాం ప్రాప్య శివసాయుజ్యమాప్తవాన్ ॥ 96 ॥**

ఓ సురశ్రేష్ఠుడైన శ్రీహరీ! ఆ వ్యాధుడు కూడ ఆనాటి నుండి భోగాలననుభవించి శ్రీరాముని కృపకు పాత్రుడై శివుని సాయుజ్యాన్ని పొందాడు.

**అజ్ఞానాత్స వ్రతం చైతత్కృత్వా సాయుజ్యమాప్తవాన్ ।**
**కిం పునర్భక్తిసంపన్నా యాంతి తన్మయతాం శుభామ్ ॥ 97 ॥**

అతడు తెలియకుండగానే వ్రతమునాచరించిసాయుజ్యాన్ని పొందగా భక్తితో కూడియున్నవారు, శుభకరమైన ఈశ్వరైక్యాన్ని పొందుతారని చెప్పవలసిన పనియేమి?

**విచార్య సర్వశాస్త్రాణి ధర్మాంశ్చైవాప్యనేకశః ।**
**శివరాత్రివ్రతమిదం సర్వోత్కృష్టం ప్రకీర్తితమ్ ॥ 98 ॥**

సర్వశాస్త్రాలు, అనేక ధర్మాలు పరిశీలించి ఈ శివరాత్రివ్రతం సర్వశ్రేష్ఠమైనదని గొప్పగా కీర్తించబడింది.

**వ్రతాని వివిధాన్యత్ర తీర్థాని వివిధాని చ ।**
**దానాని చ విచిత్రాణి మఖాశ్చ వివిధాస్తథా ॥ 99 ॥**

**తపాంసి వివిధాన్యేవ జపాశ్చైవాప్యనేకశః ।**
**నైతేన సమతాం యాంతి శివరాత్రివ్రతేన చ ॥ 100 ॥**

వివిధవ్రతాలు, అనేక తీర్థాలు, రకరకాల దానాలు, వివిధయజ్ఞాలు, వివిధతపస్సులు, అనేకజపాలు ఈ శివరాత్రివ్రతంతో సమానం కావు.

**తస్మాచ్ఛుభతరం చైతత్కర్తవ్యం హితమీప్సుభిః ।**
**శివరాత్రివ్రతం దివ్యం భుక్తిముక్తిప్రదం సదా ॥ 101 ॥**

కాబట్టి హితాన్ని కోరుకొనే మానవులు, మిక్కిలి శుభకరమైనదియు, దివ్యమైనదియు, భుక్తి, ముక్తి ప్రదమైనది యునగు ఈ శివరాత్రి వ్రతాన్ని సర్వదా చేస్తూ ఉండాలి.

**ఏతత్సర్వం సమాఖ్యాతం శివరాత్రివ్రతం శుభమ్ ।**
**వ్రతరాజేతి విఖ్యాతం కిమన్యచ్ఛ్రోతుమిచ్ఛసి ॥ 102 ॥**

శుభకరమైనదియు, వ్రతరాజమని పేరుగాంచినదియునగు ఈ శివరాత్రివ్రతాన్ని సమగ్రంగా చెప్పాను. నీవింకనూ ఏమి వినగోరుచున్నావు.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం వ్యాధేశ్వరమాహాత్మ్యే శివరాత్రివ్రతమాహాత్మ్య వర్ణనం నామ చత్వారింశోఽధ్యాయః ॥ 40 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు వ్యాధేశ్వరమాహాత్మ్యంలో శివరాత్రి వ్రతమాహాత్మ్యవర్ణనం అనే పేరుగల నలభైయవ అధ్యాయం సమాప్తం.

## **ఏకచత్వారింశో ధ్యాయః** – నలభైఒకటవ అధ్యాయం

## **ముక్తినిరూపణమ్** – ముక్తినిరూపణం

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**ముక్తిర్నామ త్వయా ప్రోక్తా తస్యాం కిం ను భవేదిహ ।**
**అవస్థా కీదృశీ తత్ర భవేదితి వదస్వ నః ॥ 1 ॥**

నీవు 'ముక్తి' అనే పదాన్ని వాడావు. దాని యందేమి జరుగుతుంది? దాని యందెట్టి అవస్థ ఉంటుంది.? ఈ విషయాన్ని మాకు చెప్పుము.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ముక్తిశ్చతుర్విధా ప్రోక్తా శ్రూయతాం కథయామి వః ।**
**సంసార క్లేశసంహర్త్రీ పరమానందదాయినీ ॥ 2 ॥**

"సంసారక్లేశాన్ని నాశనం చేసి పరమానందదాయకమైన ముక్తి నాలుగు విధాలని చెప్పబడింది. దానిని గూర్చి నేను మీకు చెబుతున్నాను. వినండి.

**సారూప్యా చైవ సాలోక్యా సాన్నిధ్యా చ తథా పరా ।**
**సాయుజ్యా చ చతుర్థీ సా వ్రతేనానేన యా భవేత్ ॥ 3 ॥**

సారూప్యం, సాలోక్యం, సాన్నిధ్యం, సాయుజ్యం అని ముక్తి నాలుగు విధాలు. వాటిలో సాయుజ్యముక్తి శివరాత్రివ్రతంచే లభిస్తుంది.

**ముక్తేర్దాతా మునిశ్రేష్ఠాః! కేవలం శివ ఉచ్యతే ।**
**బ్రహ్మాద్యా నహి తే జ్ఞేయా కేవలం చ త్రివర్గదాః ॥ 4 ॥**

ఓ మహర్షులారా! కేవలం శివుడు మాత్రమే ముక్తినిస్తాడని చెప్పబడింది. బ్రహ్మాదులు ముక్తినిచ్చువారు కాదు. వారు కేవలం ధర్మార్థకామాలను మాత్రమే ఇస్తారని తెలియదగినది.

**బ్రహ్మాద్యాస్త్రిగుణాధీశాః శివః త్రిగుణతః పరః ।**
**నిర్వికారీ పరబ్రహ్మ తుర్యః ప్రకృతితః పరః ॥ 5 ॥**

బ్రహ్మాదులు త్రిగుణాలకు అధీశ్వరులు. శివుడు త్రిగుణాలకు అతీతుడు. ఆయన నిర్వికారి, పరబ్రహ్మ. ప్రకృతికతీతుడైన తురీయుడు.

**జ్ఞానరూపోఽవ్యయః సాక్షీ జ్ఞానగమ్యోఽద్వయః స్వయమ్ ।**
**కైవల్యముక్తిదస్సోఽత్ర త్రివర్గస్య ప్రదోఽపి హి ॥ 6 ॥**

జ్ఞానస్వరూపుడు, వినాశంలేని వాడు, సాక్షి, జ్ఞానగమ్యుడు, అద్వితీయుడునగు ఆయన మాత్రమే స్వయంగా ముక్తినిస్తాడు. ధర్మార్థకామాలనిచ్చేవాడు కూడ ఆయనయే.

**కైవల్యాఖ్యా పంచమీ చ దుర్లభా సర్వథా నృణామ్ ।**
**తల్లక్షణం ప్రవక్ష్యామి శ్రూయతామృషిసత్తమాః! ॥ 7 ॥**

సర్వవిధాలుగా మానవులకు దుర్లభమైన కైవల్యమనే ఐదవ ముక్తి గలదు. ఓ మహర్షులారా! దాని లక్షణాన్ని చెబుతాను వినండి.

**ఉత్పద్యతే యతః సర్వం యేనైతత్పాల్యతే జగత్ ।**
**యస్మింశ్చ లీయతే తద్ధి యేన సర్వమిదం తతమ్ ॥ 8 ॥**

**తదేవ శివరూపం హి పఠ్యతే చ మునీశ్వరాః! ।**
**సకలం నిష్కలం చేతి ద్వివిధం వేదవర్ణితమ్ ॥ 9 ॥**

ఎవనినుండి ఈ జగత్తు సర్వం ఉదయిస్తుందో, ఎవనిచే పాలింపబడుతోందో, ఎవనియందు లీనమౌతోందో, ఎవనిచే ఈ జగత్తు వ్యాపింపబడియున్నదో అదియే శివస్వరూపమని చెప్పబడుతున్నది. ఓ మహర్షులారా! అది సకల, నిష్కల భేదంచే ద్వివిధంగా ఉన్నదని వేదాలు వర్ణిస్తున్నాయి. (ఈ శ్లోకాలు పోతనామాత్యుల వారి "ఎవ్వనిచే జనించు" అనే పద్యాన్ని గుర్తు చేస్తున్నాయి.)

**విష్ణునా తచ్చ న జ్ఞాతం బ్రహ్మణా న చ తత్తథా ।**
**కుమారాద్యైశ్చ న జ్ఞాతం న జ్ఞాతం నారదేన వై ॥ 10 ॥**

దానిని విష్ణువు గాని, బ్రహ్మ గాని, కుమారస్వామి మున్నగు వారు గాని, నారదుడు గాని తెలియకున్నారు.

**శుకేన వ్యాసపుత్రేణ వ్యాసేన చ మునీశ్వరైః ।**
**తత్పూర్వైశ్చాఖిలైర్దేవైర్వేదైః శాస్త్రైస్తథా న హి ॥ 11 ॥**

వ్యాసపుత్రుడైన శుకుడు, వ్యాసుడు, మహర్షులు, వారికి పూర్వమునందున్న సకలదేవతలు, వేదాలు, శాస్త్రాలు కూడ తెలిసికొనలేకపోయాయి.

**సత్యం జ్ఞానమనంతం చ సచ్చిదానందసంజ్ఞితమ్ ।**
**నిర్గుణో నిరుపాధిశ్చావ్యయః శుద్ధో నిరంజనః ॥ 12 ॥**

బ్రహ్మ సత్యం, జ్ఞానం, అనంతం. దానికే సచ్చిదానందమని పేరు. అది నిర్గుణం. దానికి ఉపాధులు లేవు. అది నాశం లేనిది, కర్మలేపం లేనిది, శుద్ధమైనదియు.

**న రక్తో నైవ పీతశ్చ న శ్వేతో నీల ఏవ చ ।**
**న హ్రస్వో న చ దీర్ఘశ్చ న స్థూలః సూక్ష్మ ఏవ చ ॥ 13 ॥**

అది ఎరుపు కాదు, పచ్చనిది కాదు, తెల్లనిది కాదు, నీలవర్ణమూ కాదు, అది పొట్టిదియు కాదు, పొడగైనదియు కాదు. స్థూలమైనదియు కాదు, సూక్ష్మమైనదియు కాదు.

**యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ ।**
**తదేవ పరమం ప్రోక్తం బ్రహ్మైవ శివసంజ్ఞకమ్ ॥ 14 ॥**

వాక్కులు మనస్సుతో సహా దానిని పొందజాలక, దానినుండి వెనుదిరిగాయి. ఆ పరబ్రహ్మయే శివుడనే నామాన్ని కలిగియున్నదని ఋషులు చెబుతున్నారు.

**ఆకాశం వ్యాపకం యద్వత్తథైవ వ్యాపకస్త్విదమ్ ।**
**మాయాతీతం పరాత్మానం ద్వంద్వాతీతం విమత్సరమ్ ॥ 15 ॥**

**తత్ప్రాప్తిశ్చ భవేదత్ర శివజ్ఞానోదయాద్ధ్రువమ్ ।**
**భజనాద్వా శివస్యైవ సూక్ష్మమత్యా సతాం ద్విజాః! ॥ 16 ॥**

అది ఆకాశం వలె సర్వవ్యాపకం. పరమాత్మ మాయకు ద్వంద్వాలకు అతీతమై మత్సరాదిదోషాలు లేనిదై యుంటుంది. ఓ బ్రాహ్మణులారా! శివజ్ఞానం ఉదయించడం ద్వారా గాని, లేదా సూక్ష్మబుద్ధితో శివుని సేవించడం ద్వారా గాని, సత్పురుషులచే అది ఇహలోకంలోనే నిశ్చయంగా పొందదగును.

**జ్ఞానం తు దుష్కరం లోకే భజనం సుకరం మతమ్ ।**
**తస్మాచ్ఛివం చ భజత ముక్త్యర్థమపి సత్తమాః! ॥ 17 ॥**

లోకంలో జ్ఞానం మిక్కిలి దుష్కరమైనది. కాని భక్తి తేలిక యని పెద్దలు చెబుతారు. ఓ సత్పురుషులారా! కాబట్టి ముక్తి కొరకు కూడా శివుని సేవించండి.

**శివో హి భజనాధీనో జ్ఞానాత్మా మోక్షదః పరః ।**
**భక్త్యైవ బహవః సిద్ధా ముక్తిం ప్రాపుః పరాం ముదా ॥ 18 ॥**

జ్ఞానస్వరూపుడు, పరబ్రహ్మయునైన శివుడు సేవకధీనుడై మోక్షాన్ని ఇస్తాడు. సర్వోత్కృష్టులైన అనేకులు భక్తిచే మాత్రమే మోక్షాన్ని ఆనందంగా పొందగలిగారు.

**జ్ఞానమాతా శంభుభక్తిర్ముక్తిభుక్తిప్రదా సదా ।**
**సులభా యత్ప్రసాదాద్ధి సత్ప్రేమాంకురలక్షణా ॥ 19 ॥**

సర్వదా భుక్తిని, ముక్తిని ప్రసాదించే శివునియందలి భక్తి జ్ఞానానికి తల్లి. శుద్ధమైన ప్రేమ అంకురించుటయే దీని లక్షణం. ఇది శివానుగ్రహంచే లభిస్తుంది.

**సా భక్తిర్ద్వివిధా జ్ఞేయా సగుణా నిర్గుణా ద్విజాః! ।**
**వైధీ స్వాభావికీ యా యా వరా సా సా స్మృతా పరా ॥ 20 ॥**

ఓ బ్రాహ్మణులారా! సగుణం, నిర్గుణమని భక్తి రెండు విధాలుగానున్నది. విధి విహితమూ, స్వభావసిద్ధమైనదియునగు భక్తి సర్వశ్రేష్ఠమని చెప్పబడింది.

**నైష్ఠిక్యనైష్ఠికీభేదాద్ద్వివిధైవ హి కీర్తితా ।**
**షడ్విధా నైష్ఠికీ భేదాద్ద్వితీయైకవిధా స్మృతా ॥ 21 ॥**

ఆ భక్తి నైష్ఠికి (పూజాదికాలు గలది), అనైష్ఠికి( పూజాదికాలులేనిది) యని మరల రెండు విధాలుగా నుంది. నైష్ఠికీభక్తిలో ఆరు భేదాలుండగా, అనైష్ఠికీభక్తిలో భేదాలు లేవు.

**విహితాఽవిహితాభేదాత్తామనేకాం విదుర్బుధాః ।**
**తయోర్బహువిధత్వాచ్చ విస్తారో న హి వర్ణ్యతే ॥ 22 ॥**

విహితం, అవిహితం అని భక్తిలో అనేక భేదాలున్నాయిని పండితులు చెబుతారు. ఆ రెండింటిలో అనేక-రకాలుండడం చేత వివరాలు వర్ణింపబడడం లేదు.

**తే నవాంగే ఉభే జ్ఞేయే శ్రవణాదికభేదతః ।**
**సుదుష్కరే తత్ప్రసాదం వినా చ సుకరే తతః ॥ 23 ॥**

ఆ రెండువిధాల భక్తిలోను శ్రవణం మున్నగు తొమ్మిది అంగాలున్నాయి. శ్రవణము, కీర్తనము, స్మరణము, పాదసేవ, అర్చన, వందనము, దాస్యము, సఖ్యము, ఆత్మనివేదనము శివానుగ్రహంచే తేలికగా సాధింపదగిన ఈ భక్తి, శివానుగ్రహం లేనిచో దుష్కరమౌతుంది.

**భక్తిజ్ఞానే న భిన్నే హి శంభునా వర్ణితే ద్విజాః! ।**
**తస్మాద్భేదో న కర్తవ్యః తత్కర్తుస్సర్వదా సుఖమ్ ॥ 24 ॥**

ఓ బ్రాహ్మణులారా! భక్తి, జ్ఞానాలలో భేదం లేదని శంభుడు వర్ణించియున్నాడు. కాబట్టి భక్తి జ్ఞానములలో భేదాన్ని పాటించరాదు. వాటినాచరించువానికి సర్వకాలాలలో సుఖం లభిస్తుంది.

**విజ్ఞానం న భవత్యేవ ద్విజా భక్తివిరోధినః ।**
**శంభుభక్తికరస్యైవ భవేత్ జ్ఞానోదయో ద్రుతమ్ ॥ 25 ॥**

ఓ బ్రాహ్మణులారా! భక్తిని వ్యతిరేకించేవారికి జ్ఞానం ఉదయించే ప్రసక్తియే లేదు. శంభునందు శ్రేష్ఠమైన భక్తిగల వానికి మాత్రమే శీఘ్రంగా జ్ఞానముదయిస్తుంది.

**తస్మాద్భక్తిర్మహేశస్య సాధనీయా మునీశ్వరాః! ।**
**తయైవ నిఖిలం సిద్ధం భవిష్యతి న సంశయః ॥ 26 ॥**

కాబట్టి ఓ మహర్షులారా! మహేశ్వరునియందు భక్తిని సాధించాలి. దానివల్ల సర్వం సిద్ధిస్తుందనడంలో సందేహం లేదు.

**ఇతి పృష్టం భవద్భిర్యత్తదేవ కథితం మయా ।**
**తచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే నాత్ర సంశయః ॥ 27 ॥**

ఈ విధంగా మీరడిగిన వానికి సమాధానం చెప్పియున్నాను. దీనిని వినేవారికి పాపాలన్నియు నశిస్తాయనడంలో సందేహం లేదు."

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం ముక్తినిరూపణం నామైకచత్వారింశోఽధ్యాయః ॥ 41 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు ముక్తినిరూపణం అనే పేరుగల నలభ్బైఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్విచత్వారింశోఽధ్యాయః - నలభైరెండవ అధ్యాయం
## సగుణ-నిర్గుణవర్ణనమ్ - సగుణ-నిర్గుణవర్ణనం

**ఋషయ ఊచుః -** ఋషులు పలికారు.

**శివః కో వా హరిః కో వా రుద్రః కో వా విధిశ్చ కః ।**
**ఏతేషు నిర్గుణః కో వా హ్యేతం నశ్ఛింధి సంశయమ్ ॥ 1 ॥**

శివుడెవరు? విష్ణువెవరు? రుద్రుడెవరు? బ్రహ్మయెవరు? వీరిలో నిర్గుణుడెవరు? మా యీ సంశయాలను తొలగించు.

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**యచ్చాదౌ హి సముత్పన్నం నిర్గుణాత్పరమాత్మనః ।**
**తదేవ శివసంజ్ఞం హి వేదవేదాంతినో విదుః ॥ 2 ॥**

నిర్గుణపరమాత్మనుండి ముందుగా జన్మించినదేదో అదియే 'శివ' అనే నామాన్ని పొందిందని వేద వేదాంతవిదులు చెబుతున్నారు.

**తస్మాత్ప్రకృతిరుత్పన్నా పురుషేణ సమన్వితా ।**
**తాభ్యాం తపః కృతం తత్ర మూలస్థే చ జలే సుధీః ॥ 3 ॥**

ఆ శివునినుండి ప్రకృతిపుట్టినది. పురుషునితో కలిసి మూలంలోనున్న జలంలో తపస్సు చేశాడు.

**పంచక్రోశీతి విఖ్యాతా కాశీ సర్వాతివల్లభా ।**
**వ్యాప్తం చ సకలం హ్యేతత్తజ్జలం విశ్వతో గతమ్ ॥ 4 ॥**

'పంచక్రోశి' అను పేరు గాంచి శివునకత్యంతప్రియమైన కాశీనగరం తప్ప మిగిలిన విశ్వమంతా ఈ జలంతో నిండియున్నది.

**సంభావ్య మాయయా యుక్తస్తత్ర సుప్తో హరిస్స వై ।**
**నారాయణేతి విఖ్యాతః ప్రకృతిర్నారాయణీ మతా ॥ 5 ॥**

దీనిని చూచి 'నారాయణి' అనబడే మాయ (ప్రకృతి) తో కూడియున్న నారాయణనామధేయుడై హరి ఆజలమునందు నిద్రించాడు.

**తన్నాభికమలే యో వై జాతస్స చ పితామహః ।**
**తేనైవ తపసా దృష్టస్స వై విష్ణురుదాహృతః ॥ 6 ॥**

ఆయన నాభికమలంనుండి జన్మించినవాడే పితామహుడు. ఆయన తపస్సుచేసి విష్ణువును దర్శించాడు.

**ఉభయోర్వ్వాదశమనే యద్రూపం సందర్శితం బుధాః ।**
**మహాదేవేతి విఖ్యాతం నిర్గుణేన శివేన హి ॥ 7 ॥**

ఓ విద్వాంసులారా! వారిద్దరి మధ్య వాదం శమించిన పిమ్మట నిర్గుణుడైన శివుడు చూపించిన రూపానికి 'మహాదేవుడు' అని పేరు వచ్చింది.

**తేన ప్రోక్తమహం శంభుర్భవిష్యామి కభాలతః ।**
**రుద్రో నామ స విఖ్యాతో లోకానుగ్రహకారకః ॥ 8 ॥**

నేను బ్రహ్మయొక్క లలాటంనుండి జన్మిస్తానని శంభువు చెప్పాడు. ఆయనయే రుద్రుడని విఖ్యాతుడై లోకానుగ్రహకారకుడయ్యాడు.

**ధ్యానార్థం చైవ సర్వేషామరూపో రూపవానభూత్ ।**
**స ఏవ చ శివస్సాక్షాద్భక్తవాత్సల్యకారకః ॥ 9 ॥**

సర్వప్రాణులు ధ్యానం చేయడానికే రూపంలేని ఆ శివుడు రూపం ధరించాడు. రూపంతోనున్న అతడే భక్తులయందు ప్రేమను వర్షించే 'శివుడు'.

**శివే త్రిగుణసంభిన్నే రుద్రే తు గుణధామని ।**
**వస్తుతో న హి భేదోఽస్తి స్వర్ణే తద్భూషణే యథా ॥ 10 ॥**

త్రిగుణాతీతుడైన శివునకు, గుణధాముడైన రుద్రునకు, బంగారానికి ఆభరణాలకు వలె వస్తుతత్త్వమునందు భేదం లేదు.

**సమానరూపకర్మాణౌ సమభక్తగతిప్రదౌ ।**
**సమానాఖిలసంసేవ్యౌ నానాలీలావిహారిణౌ ॥ 11 ॥**

వారిద్దరు సమానమైన రూపం, సమానమైన కర్మగలవారు. భక్తులకు వారు సమానంగా ఉత్తమగతినిస్తారు. అందరికీ వారు సమానంగా సేవించదగినవారు. వారనేకలీలలు ప్రకటిస్తూ విహరిస్తారు.

**సర్వథా శివరూపో హి రుద్రో రౌద్రపరాక్రమః ।**
**ఉత్పన్నో భక్తకార్యార్థం హరిబ్రహ్మసహాయకృత్ ॥ 12 ॥**

భయంకరపరాక్రమం గల రుద్రుడు అన్ని విధములుగా శివరూపుడే. ఆయన భక్తుల కార్యాన్ని నెరవేర్చడానికే ఉదయించి బ్రహ్మ – విష్ణువులకు సాహాయ్యమునందించాడు.

**అన్యే చ యే సముత్పన్నా యథానుక్రమతో లయమ్ ।**
**యాంతి నైవ తథా రుద్రః శివే రుద్రో విలీయతే ॥ 13 ॥**

మిగిలినవారందరూ ఏ క్రమంలో జన్మించారో, అదే క్రమంలో లయాన్ని పొందుతారు. కాని రుద్రుడట్లు లయం కాడు. ఆయన శివునిలో ఐక్యమౌతాడు.

**తే వై రుద్రం మిలిత్వా తు ప్రయాంతి ప్రకృతా ఇమే ।**
**ఇమాన్రుద్రో మిలిత్వా తు న యాతి శ్రుతిశాసనమ్ ॥ 14 ॥**

ప్రకృతిజన్యములైన కార్యాలన్నీ రుద్రుని కలిసి లయాన్ని పొందుతాయి. కాని రుద్రుడు వాటితో కలసి లయాన్ని పొందడని వేదంయొక్క అనుశాసనం.

**సర్వే రుద్రం భజంత్యేవ రుద్రః కంచిద్భజేన్నహి ।**
**స్వాత్మనా భక్తవాత్సల్యాద్భజత్యేవ కదాచన ॥ 15 ॥**

సర్వులు రుద్రుని నిశ్చయంగా భజిస్తున్నారు. కాని రుద్రుడు ఇతరులను సేవించడం లేదు. కాని ఆయన స్వరూపతః భక్తులయందు ప్రేమగలవాడు. ఒకప్పుడు తనంత తానుగా సేవించవచ్చును.

**అన్యం భజంతి యే నిత్యం తస్మింస్తే లీనతాం గతాః ।**
**తేనైవ రుద్రం తే ప్రాప్తాః కాలేన మహతా బుధాః! ॥ 16 ॥**

ఓ విద్వాంసులారా! నిత్యము ఇతరులను సేవించేవారు వారిలోననే లీనమౌతారు. కావున వారు చిరకాలం తరువాత రుద్రునిలోనే లీనమౌతారు.

**రుద్రభక్తాస్తు యే కేచిత్ క్షణం శివతాం గతాః ।**
**అన్యాపేక్షా న వై తేషాం శ్రుతిరేషా సనాతనీ ॥ 17 ॥**

రుద్రభక్తులు ఆ క్షణంలోనే శివునిలో ఐక్యమగుదురనియు, వారికి తన సాధనాలతో కూడ పనిలేదనియు, అనాదియైన వేదం చెబుతోంది.

**అజ్ఞానం వివిధం హ్యేతద్విజ్ఞానం వివిధం న హి ।**
**తత్ప్రకారమహం వక్ష్యే శృణుతాదరతో ద్విజాః! ॥ 18 ॥**

అజ్ఞానంలో అనేక భేదాలున్నాయి. కాని ఈ జ్ఞానంలో మాత్రం వివిధత్వం లేదు. ఓ బ్రాహ్మణులారా! దాని వివరాలు చెబుతాను. ఆదరంతో వినండి.

**బ్రహ్మాదితృణపర్యంతం యత్కించిద్ దృశ్యతే త్విహ ।**
**తత్సర్వం శివ ఏవాస్తి మిథ్యా నానాత్వకల్పనా ॥ 19 ॥**

బ్రహ్మమొదలు గడ్డిపోచవరకు ఈ జగత్తులో కనిపించేదంతయు మిథ్య, ఈ నానాత్వం కల్పితం. ఈ సర్వం శివునికంటె భిన్నంగా లేదు.

**సృష్టేః పూర్వం శివః ప్రోక్తః సృష్టేర్మధ్యే శివస్తథా ।**
**సృష్టేరంతే శివః ప్రోక్తః సర్వశూన్యే తదా శివః ॥ 20 ॥**

సృష్టికి పూర్వమున్నది శివుడే. సృష్టికి మధ్యలో నున్నది శివుడే. సృష్టి నశించిన తరువాత ఉండేది శివుడే. సర్వశూన్యావస్థలలోనైనను ఉండేది శివుడే.

**తస్మాచ్చతుర్గుణః ప్రోక్తః శివ ఏవ మునీశ్వరాః! ।**
**స ఏవ సగుణో జ్ఞేయః శక్తిమత్వాద్ద్విధాపి సః ॥ 21 ॥**

ఓ మునీశ్వరులారా! అందువల్లనే శివునియందు మాత్రమే నాలుగు గుణాలున్నాయని చెబుతారు. సగుణుడు కూడ ఆయనయే. శక్తిసమేతుడగుటచే ఆయనయే సగుణ-నిర్గుణ భేదంతో భాసిల్లుతున్నాడు.

**యేనైవ విష్ణవే దత్తాః సర్వే వేదాః సనాతనాః ।**
**వర్ణా మాత్రా హ్యనేకాశ్చ ధ్యానం స్వస్య చ పూజనమ్ ॥ 22 ॥**

ఆ శివుడే స్వయంగా సనాతనమైన వేదాలు, అనేకములైన వర్ణాలు, మాత్రలు, ధ్యానం, తనను పూజించు విధిని విష్ణువున కిచ్చాడు.

**ఈశానః సర్వ విద్యానాం శ్రుతిరేషా సనాతనీ ।**
**వేదకర్తా వేదపతిస్తస్మాచ్ఛంభురుదాహృతః ॥ 23 ॥**

విద్యలన్నింటికి ఆయనయే ఈశానుడని సనాతనమైన వేదం చెబుతోంది. కాబట్టి వేదాలను రచించినవాడు, వేదాలకధిపతియు శంభుడేనని మహర్షులు చెబుతున్నారు.

**స ఏవ శంకరః సాక్షాత్సర్వానుగ్రహకారకః ।**
**కర్తా భర్తా చ హర్తా చ సాక్షీ నిర్గుణ ఏవ సః ॥ 24 ॥**

సర్వులను అనుగ్రహించువాడు, జగత్తుయొక్క సృష్టిస్థితిలయములను చేయువాడు, సాక్షి, నిర్గుణుడునగు ఆ పరబ్రహ్మ సాక్షాత్తుగా శంకరుడే.

**అన్యేషాం కాలమానం చ కాలస్య కలనా నహి ।**
**మహాకాలః స్వయం సాక్షాన్మహాకాలీసమాశ్రితః ॥ 25 ॥**

సర్వజీవులకు ఆయుర్దాయంయొక్క పరిగణన కలదు. కాని కాలస్వరూపుడైన శివునకు పరిగణనతో సంబంధం లేదు. ఆయనయే మహాకాళితో గూడి స్వయంగా మహాకాలస్వరూపుడై యున్నాడు.

**తథా చ బ్రాహ్మణా రుద్రం తథా కాలీం ప్రచక్షతే ।**
**సర్వం తాభ్యాం తతః ప్రాప్తమిచ్ఛయా సత్యలీలయా ॥ 26 ॥**

వారినే బ్రాహ్మణులు రుద్రుడనియు, కాళియనియు వర్ణిస్తున్నారు. ఈ సర్వమూ వారి ఇచ్ఛచేత, వారి సత్యలీలచే వారినుండి ఉద్భవించింది.

**న తస్యోత్పాదకః కశ్చిద్భర్తా హర్తా న తస్య హి ।**
**స్వయం సర్వస్య హేతుస్తే కార్యాస్తత్రాచ్యుతాదయః ॥ 27 ॥**

శివునకు కారణం లేదు. శివునకు పోషించేవాడు గాని, లయం చేసేవాడు గాని లేదు. ఆయనయే స్వయంగా స్వకారణకారణుడై యున్నాడు. అచ్యుతుడు మున్నగు వారందరు కార్యస్వరూపులు.

**స్వయం చ కారణం కార్యం స్వస్య నైవ కదాచన ।**
**ఏకో హ్యనేకతాం యాతోఽప్యనేకోఽప్యేకతాం వ్రజేత్ ॥ 28 ॥**

కారణస్వరూపుడైన ఆయనకు మరియొక కారణం లేదు. ఆయన ఒక్కడుగా నుండి అనేకత్వాన్ని, అనేక స్వరూపుడే అయిననూ ఏకత్వాన్ని పొందుతున్నాడు.

**ఏకం బీజం బహిర్భూత్వా పునర్బీజం చ జాయతే ।**
**బహుత్వే చ స్వయం సర్వం శివరూపీ మహేశ్వరః ॥ 29 ॥**

ఒకే బీజం వృక్షరూపంలో ప్రకటమై మరల బీజాలకు జన్మనిస్తోంది. ఈ నానాత్వమంతయూ ఆ వృక్షంలో అంతర్గతమవుతుంది. శివస్వరూపుడైన మహేశ్వరుని విషయంలో కూడ ఇదియే వ్యవస్థ.

**ఏతత్పరం శివజ్ఞానం తత్త్వతస్తదుదాహృతమ్ ।**
**జానాతి జ్ఞానవానేవ నాన్యః కశ్చిదృషీశ్వరాః! ॥ 30 ॥**

శివునియొక్క ఈ పరమజ్ఞానాన్ని నేను యథాతథంగా చెప్పాను. ఓ మహర్షులారా! దీనిని జ్ఞాని మాత్రమే తెలుసుకొంటాడు. అజ్ఞానికిది తెలియదు."

**మునయ ఊచుః** – మునులు పలికారు.

**జ్ఞానం సలక్షణం బ్రూహి యద్ జ్ఞాత్వా శివతాం వ్రజేత్ ।**
**కథం శివశ్చ తత్సర్వం సర్వం వా శివ ఏవ చ ॥ 31 ॥**

ఏ జ్ఞానం చే మానవుడు శివునితో ఐక్యమగునో, అట్టి జ్ఞానాన్ని లక్షణ సహితంగా చెప్పు. శివుడే సర్వంగా ఎట్లయ్యాడు? సర్వము శివునియందు ఎట్లున్నది?

**వ్యాస ఉవాచ** – వ్యాసుడు పలికెను.

**ఏతదాకర్ణ్య వచనం సూతః పౌరాణికోత్తమః ।**
**స్మృత్వా శివపదాంభోజం మునీంస్తానబ్రవీద్వచః ॥ 32 ॥**

పౌరాణికోత్తముడైన సూతుడీవచనాన్ని విని శివుని పాదపద్మాలను స్మరించి, ఆ మునులతో ఇలా పలికాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం సగుణ-నిర్గుణవర్ణనం నామ ద్విచత్వారింశోఽధ్యాయః ॥ 42 ॥**

శ్రీశివమహాపురాణంలోని నాలుగవదైన కోటిరుద్రసంహితయందు సగుణ-నిర్గుణవర్ణనం అనే పేరుగల నలభైరెండవ అధ్యాయం సమాప్తం.

## త్రిచత్వారింశోఽధ్యాయం: - నలభైమూడవ అధ్యాయం

## జ్ఞానిరూపణమ్ - జ్ఞానిరూపణం

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**శ్రూయతాం ఋషయస్సర్వే శివజ్ఞానం యథాశ్రుతమ్ ।**
**కథయామి మహాగుహ్యం పరముక్తిస్వరూపకమ్ ॥ 1 ॥**

ఓ ఋషులారా! పరమ రహస్యమూ, పరముక్తి స్వరూపకమునైన శివజ్ఞానాన్ని గూర్చి నేను వినినది మీకు చెబుతున్నాను. మీరందరు శ్రద్ధగా వినండి.

**కనారదకుమారాణాం వ్యాసస్య కపిలస్య చ ।**
**ఏతేషాం చ సమాజే తైర్నిశ్చిత్య సముదాహృతమ్ ॥ 2 ॥**

బ్రహ్మ, నారదుడు, కుమారస్వామి, వ్యాసుడు, కపిలుడు అనువారి సమక్షంలో ఇది నిశ్చయింపబడి ప్రవచింపబడింది.

**ఇతి జ్ఞానం సదా జ్ఞేయం సర్వం శివమయం జగత్ ।**
**శివః సర్వమయో జ్ఞేయః సర్వజ్ఞేన విపశ్చితా ॥ 3 ॥**

సర్వము తెలిసిన విద్వాంసుడు సమస్త జగత్తు శివమయమనియు, శివుడు సర్వాత్మకుడనియు సర్వదా తెలుసుకోవాలి.

**ఆబ్రహ్మతృణపర్యంతం యత్కించిద్ దృశ్యతే జగత్ ।**
**తత్సర్వం శివ ఏవాస్తి స దేవః శివ ఉచ్యతే ॥ 4 ॥**

బ్రహ్మమొదలు గడ్డిపోచ పర్యంతం గల దృశ్యమానమగు జగత్తు సర్వము శివుడే అయి ఉన్నాడు. ఇట్లు ప్రకాశస్వరూపుడైన వాడే శివుడు

**యదేచ్ఛా తస్య జాయేత తదా చ క్రియతే త్విదమ్ ।**
**సర్వం స ఏవ జానాతి తం న జానాతి కశ్చన ॥ 5 ॥**

ఆయన సంకల్పం కలిగినప్పుడు ఈ జగత్తు సృష్టింపబడుతుంది. ఆయనకు సర్వము తెలుస్తుంది. కాని ఆయనను తెలిసినవాడెవడు లేదు.

**రచయిత్వా స్వయం తచ్చ ప్రవిశ్య దూరతః స్థితః ।**
**న తత్ర చ ప్రవిష్టోఽసౌ నిర్లిప్తశ్చిత్స్వరూపవాన్ ॥ 6 ॥**

ఆయన ఈ జగత్తును నిర్మించి దానిలో ప్రవేశించి దూరంగా నున్నాడు. కాని నిర్లిప్తుడు, చైతన్యస్వరూపుడు-నైన ఆ పరమేశ్వరుడు వాస్తవంగా ఈ జగత్తునందు ప్రవేశించలేదు.

**యథా చ జ్యోతిషశ్చైవ జలాదౌ ప్రతిబింబతా ।**
**వస్తుతో న ప్రవేశో వై తథైవ చ శివః స్వయమ్ ॥ 7 ॥**

సూర్యుడు నీరు మున్నగు వాటియందు ప్రతిఫలిస్తున్నాడే కాని యథార్థంగా ప్రవేశించడం లేదు. శివుడు కూడ అదే విధంగా చేతనుడై ప్రతిఫలిస్తున్నాడు.

**వస్తుతస్తు స్వయం సర్వం క్రమో హి భాసతే శుభః ।**
**అజ్ఞానం చ మతేర్భేదో నాస్త్యన్యచ్చ ద్వయం పునః ॥ 8 ॥**

శుభకరుడైన శివుడే స్వయంగా సర్వజగద్రూపంలో భాసిస్తున్నాడు. బుద్ధియందలి అజ్ఞానమే భేదదర్శన–హేతువౌతోంది. వాస్తవంగా ద్వితీయవస్తువు లేదు.

**దర్శనేషు చ సర్వేషు మతిభేదః ప్రదర్శ్యతే ।**
**పరం వేదాంతినో నిత్యమద్వైతం ప్రతిచక్షతే ॥ 9 ॥**

దర్శనశాస్త్రకారులందరిలో అభిప్రాయభేదాలున్నాయి. కాని వేదాంతులు నిత్యమైన అద్వైతాన్ని మాత్రమే ప్రతిపాదిస్తున్నారు. వర్ణిస్తున్నారు.

**స్వస్యాప్యంశస్య జీవోఽంశో హ్యవిద్యామోహితో వశః ।**
**అన్యోఽహమితి జానాతి తయా ముక్తో భవేచ్ఛివః ॥ 10 ॥**

జీవుడు స్వయంగా పరమేశ్వరుని అంశవంటి అంశమే అయినా అజ్ఞానంచే మోహితుడై దానిచే పరవశుడై తనను ఈశ్వరభిన్నునిగా భావిస్తున్నాడు. ఆ అజ్ఞానం తొలగి పోగానే జీవుడు శివుడౌతాడు.

**సర్వం వ్యాప్య శివః సాక్షాద్ వ్యాపకః సర్వజంతుషు ।**
**చేతనాచేతనేశోఽపి సర్వత్ర శంకరః స్వయమ్ ॥ 11 ॥**

సర్వవ్యాపకుడు, స్థావర–జంగమాత్మకమైన జగత్తునకు ప్రభువు, మంగళకరుడునైన శివుడు స్వయంగా సర్వంలోను, సర్వదేశాలలోను వ్యాపించి యున్నాడు.

**ఉపాయం యః కరోత్యస్య దర్శనార్థం విచక్షణః ।**
**వేదాంతమార్గమాశ్రిత్య తద్దర్శనఫలం లభేత్ ॥ 12 ॥**

ఏ విద్వాంసుడైతే పరమేశ్వరదర్శనానికి ఉపనిషత్ప్రతిపాదితమైన మార్గంలో యత్నిస్తాడో వానికి దర్శనం, దాని ఫలమైన మోక్షం లభిస్తుంది.

**యథాగ్నిర్వ్యాపకశ్చైవ కాష్ఠే కాష్ఠే చ తిష్ఠతి ।**
**యో వై మంథతి తత్కాష్ఠం స వై పశ్యత్యసంశయమ్ ॥ 13 ॥**

వ్యాపకుడైన అగ్ని కట్టెలన్నింటియందునున్నాడు. కాని ఎవడైతే కట్టెను రాపిడి చేస్తాడో వానికి మాత్రమే అగ్ని నిస్సందేహంగా దర్శనమిస్తాడు.

**భక్త్యాదిసాధనానీహ యః కరోతి విచక్షణః ।**
**స వై పశ్యత్యవశ్యం హి తం శివం నాత్ర సంశయః ॥ 14 ॥**

ఏ విద్వాంసుడైతే ఇహలోకంలో భక్తి మున్నగు సాధనాలననుష్ఠిస్తాడో, వాడు మాత్రమే నిశ్చితంగా నిస్సందేహంగా శివుని దర్శిస్తాడు.

**శివః శివః శివశ్చైవ నాన్యదస్తీతి కించన ।**
**భ్రాంత్యా నానా స్వరూపో హి భాసతే శంకరస్సదా ॥ 15 ॥**

శివుడు, శివుడు, శివుడే. ఈ జగత్తులో శివుడు తప్ప మరియొక తత్త్వంలేదు. కాని భ్రాంతివల్ల సర్వదా శంకరుడు నానారూపాలుగా భాసిస్తున్నాడు.

**యథా సముద్రో మృచ్చైవ సువర్ణమథవా పునః ।**
**ఉపాధితో హి నానాత్వం లభతే శంకరస్తథా ॥ 16 ॥**

సముద్రం, మట్టి, బంగారం, ఈ విధంగా ఉపాధిమూలకంగానే నానాత్వాన్ని పొందుతున్నాయి. అట్లే శంకరుడు కూడ ఉపాధిచే అనేకంగా కానవస్తున్నాడు.

**కార్యకారణయోర్భేదో వస్తుతో న ప్రవర్తతే ।**
**కేవలం భ్రాంతిబుద్ధ్యైవ తదభావే స నశ్యతి ॥ 17 ॥**

కార్య-కారణాల మధ్య యథార్థమైన భేదం లేదు. కేవలం భ్రాంతిబుద్ధిచే మాత్రమే ద్వైతంగా భాసిస్తోంది. భ్రాంతి లేనిచో ద్వైతం కూడ మాయమౌతుంది.

**తదా బీజాత్ప్రరోహశ్చ నానాత్వం హి ప్రకాశయేత్ ।**
**అంతే చ బీజమేవ స్యాత్ తత్ప్రరోహశ్చ నశ్యతి ॥ 18 ॥**

బీజంనుండి అంకురం ఉదయించి, కొమ్మలు, ఆకులు మొదలగు విధమ్గ నానాత్వం ప్రకటితమౌతుంది. అంతంలో మరల బీజం మాత్రమే మిగులుతుంది. అంతకుముందు ఉదయించిన అంకురం, కొమ్మలు, ఆకులన్నీ నశిస్తాయి.

**జ్ఞానీ చ బీజమేవ స్యాత్ ప్రరోహా వికృతయో మతాః! ।**
**తన్నివృత్తౌ పునర్జ్ఞానీ నాత్ర కార్యా విచారణా ॥ 19 ॥**

జ్ఞాని బీజంవంటివాడు. అతనిలో వచ్చు వికారాలు అంకురాలు. అంకురం నశించగానే అతడు మరల జ్ఞాని యౌతాడనడంలో సందేహం లేదు.

**సర్వం శివః శివం సర్వం నాస్తి భేదశ్చ కశ్చన ।**
**కథం చ వివిధం పశ్యత్యేకత్వం చ కథం పునః ॥ 20 ॥**

సర్వమూ శివుడే. శివుడే సర్వం. భేదం లేశమైననూ లేదు. అట్లైనచో ఈ నానాత్వం కనబడడానికి కారణమేమి? నానాత్వంనుండి మరల ఏకత్వంలోనికి వచ్చుట ఎట్లు?

**యథైకం చైవ సూర్యాఖ్యం జ్యోతిర్నానావిధం జనైః ।**
**జలాదౌ చ విశేషేణ దృశ్యతే తత్తథైవ సః ॥ 21 ॥**

సూర్యుడు అనే జ్యోతిర్మండలం ఒక్కటే అయినప్పటికి జనులచే నానారూపాలలో దర్శింపబడుతోంది. జలం మున్నగు వాటియందు సూర్యుడు భిన్నభిన్నంగా దర్శనమిస్తున్నాడు. అదే విధంగా పరమేశ్వరునియందు ద్వైతం భాసిస్తోంది.

**సర్వత్ర వ్యాపకశ్చైవ స్పర్శత్వం న విబధ్యతే ।**
**తథైవ వ్యాపకో దేవో బధ్యతే న క్వచిత్స వై ॥ 22 ॥**

ఆకాశం సర్వవ్యాపకమే. కాని దానికి దేనితోను సంగం, బంధం లేదు. అట్లే సర్వవ్యాపకుడైన పరమేశ్వరుడు కూడ దేనిచేతనూ బంధింపబడడం లేదు.

**సాహంకారస్తథా జీవస్తన్ముక్తః శంకరః స్వయమ్ ।**
**జీవస్తుచ్ఛః కర్మభోగీ నిర్లిప్తః శంకరో మహాన్ ॥ 23 ॥**

అహంకారంతో కూడిన చైతన్యం జీవుడు కాగా, అహంకారవినిర్ముక్తమైన చైతన్యమే స్వయంగా శివుడౌతోంది. జీవుడు కర్మ ఫలాలననుభవించే అల్పుడు కాగా, శంకరుడు నిర్లిప్తుడైన బ్రహ్మ.

**యథైకం చ సువర్ణాది మిళితం రజతాదినా ।**
**అల్పమూల్యం ప్రజాయేత తథా జీవోఽ ప్యహం యుతః ॥ 24 ॥**

బంగారాన్ని వెండి మున్నగు వాటితో కలిపితే, బంగారం విలువ తగ్గిపోతుంది. అట్లే అహంకారంతో కూడిన జీవుని మహత్త్వం కూడ తగ్గిపోతుంది.

**యథైవ హి సువర్ణాది క్షారాదేః శోధితం శుభమ్ ।**
**పూర్వవన్మూల్యతాం యాతి తథా జీవోఽ పి సంస్కృతేః ॥ 25 ॥**

కల్తీ బంగారాన్ని క్షారం మున్నగు వాటితో శుద్ధి చేసినట్లయితే మరల పూర్వమునందలి విలువ లభిస్తుంది. అట్లే జీవుడు కూడ సంస్కారాలచే శుద్ధి పొందుతాడు.

**ప్రథమం సద్గురుం ప్రాప్య భక్తిభావసమన్వితః ।**
**శివబుద్ధ్యా కరోత్యుచ్చైః పూజనం స్మరణాదికమ్ ॥ 26 ॥**

మానవుడు ముందుగా సద్గురువును పొంది భక్తిభావంతో కూడినవాడై గురువునందు శివబుద్ధిని కలిగి అధికంగా పూజ, భగవంతుని స్మరణ చేయాలి.

**తద్బుధ్యా దేహతో యాతి సర్వపాపాదికో మలః ।**
**తదాఽ జ్ఞానం చ నశ్యేత జ్ఞానవాన్ జాయతే యదా ॥ 27 ॥**

అట్టి సంస్కారంపొందిన బుద్ధిప్రభావంచేత దేహంనుండి సకల పాపాలు, దోషాలు దూరమౌతాయి. అప్పుడు అజ్ఞానం కూడ నశించి అతడు జ్ఞానాన్ని పొందుతాడు.

**తదాహంకారనిర్ముక్తో జీవో నిర్మలబుద్ధిమాన్ ।**
**శంకరస్య ప్రసాదేన యాతి శంకరతాం పునః ॥ 28 ॥**

అంతట ఆ జీవుడు నిర్మలమైన బుద్ధిగలవాడై శంకరుని అనుగ్రహంచే అహంకారంనుండి వినిర్ముక్తుడై శంకరునిలో ఐక్యమౌతాడు.

**యథాఽఽదర్శస్వరూపే చ స్వీయరూపం ప్రదృశ్యతే ।**
**తథా సర్వత్రగం శంభుం పశ్యతీతి సునిశ్చితమ్ ॥ 29 ॥**

అప్పుడాతడు అద్దంలో తన ముఖం చూచుకున్నవిధంగా సర్వవ్యాపకుడైన శంభుని దర్శించడం నిశ్చితం.

**జీవన్ముక్తస్స ఏవాసౌ దేహః శీర్ణః శివే మిలేత్ ।**
**ప్రారబ్ధవశగో దేహస్తద్భిన్నో జ్ఞానవాన్ మతః ॥ 30 ॥**

అతడు జీవన్ముక్తుడనబడతాడు. అతని దేహం పడిపోయిన తరువాత అతడు శివునిలో ఐక్యమౌతాడు. దేహం ప్రారబ్ధకర్మానుసారంగా నడుస్తుంది. కాని జ్ఞాని దేహంకంటె భిన్నమైనవాడు.

**శుభం లబ్ధ్వా న హృష్యేత కుప్యేల్లబ్ధ్వాఽశుభం నహి ।**
**ద్వంద్వేషు సమతా యస్య జ్ఞానవానుచ్యతే హి సః ॥ 31 ॥**

శుభం లభించినప్పుడు హర్షాన్ని పొందరాదు. అశుభం కలిగినపుడు కోపించరాదు. సుఖదుఃఖాది ద్వంద్వాలలో సమమైన చిత్తంగలవాడు మాత్రమే జ్ఞాని యనబడతాడు.

**ఆత్మయోగేన తత్త్వానామథవా చ వివేకతః ।**
**యథా శరీరతో యాయాచ్ఛరీరం ముక్తిమిచ్ఛతః ॥ 32 ॥**

ముక్తిని కోరువాడు మనస్సును నిరోధించి, తత్త్వాలను వివేచన చేసి, శరీరభిన్నమైన ఆత్మను దర్శించాలి.

**సదాశివో విలీయేత ముక్తో విరహమేవ చ ।**
**జ్ఞానమూలం తథాధ్యాత్మ్యం తస్య భక్తిః శివస్య చ ॥ 33 ॥**

అధ్యాత్మయోగం, శివునియందు భక్తి అనేవి జ్ఞానానికి మూలాలు. జ్ఞాని మోక్షాన్ని పొంది సదాశివునిలో విలీనుడౌతాడు. అతనికి సంసారంనుండి విముక్తి లభిస్తుంది.

**భక్తేశ్చ ప్రేమ సంప్రోక్తం ప్రేమ్ణశ్చ శ్రవణం తథా ।**
**శ్రవణాచ్చాపి సత్సంగః సత్సంగాచ్చ గురుర్బుధః ॥ 34 ॥**

భక్తినుండి ప్రేమ, ప్రేమనుండి శ్రవణం, శ్రవణంనుండి సత్సంగం, సత్సంగంనుండి పండితుడైన గురువు లభిస్తారు.

**సంపన్నే చ తథా జ్ఞానే ముక్తో భవతి నిశ్చితమ్ ।**
**ఇతి చేజ్జ్ఞానవాన్యో వై శంభుమేవ సదా భజేత్ ॥ 35 ॥**

అంతట జ్ఞానం సంపన్నమై మానవుడు ముక్తుడగుట నిశ్చయం. కాబట్టి వివేకి సర్వదా శంభుని భజించాలి.

**అనన్యయా చ భక్త్యా వై యుక్తః శంభుం భజేత్పునః ।**
**అంతే చ ముక్తిమాయాతి నాత్ర కార్యా విచారణా ॥ 36 ॥**

సాధకుడు అనన్యమైన భక్తితో శంభుని సేవించాలి. అట్టి సాధకునకు దేహత్యాగానంతరం ముక్తి లభిస్తుందనడంలో సందేహం లేదు.

**అతోఽధికో న దేవోఽస్తి ముక్తిప్రాప్త్యై చ శంకరాత్ ।**
**శరణం ప్రాప్య యం చైవ సంసారాద్వినివర్తతే ॥ 37 ॥**

ముక్తిని పొందడానికి శంకరుని మించిన మరియొక దైవంలేదు. ఆయనను శరణు పొందినవాడు సంసారంనుండి ముక్తిని పొందుతాడు.

**ఇతి మే వివిధం వాక్యం ఋషీణాం చ సమాగతైః ।**
**నిశ్చిత్య కథితం విప్రాః! ధియా ధార్యం ప్రయత్నతః ॥ 38 ॥**

ఓ విప్రులారా! నేను వివిధ వచనాలను నన్ను కలిసిన ఋషులతో సమాలోచన చేసి నిశ్చయించి మీకు చెప్పాను. దీనిని ప్రయత్నపూర్వకంగా బుద్ధిలో నిలపండి.

**ప్రథమం విష్ణవే దత్తం శంభునా లింగసమ్ముఖే ।**
**విష్ణునా బ్రహ్మణే దత్తం బ్రహ్మణా సనకాదిషు ॥ 39 ॥**

ఈ జ్ఞానం మున్ముందుగా శివుడు లింగసన్నిధిలో విష్ణువునకిచ్చాడు. విష్ణువు బ్రహ్మకు, బ్రహ్మ సనకాదిమహర్షులకు చెప్పారు.

**నారదాయ తతః ప్రోక్తం తద్ జ్ఞానం సనకాదిభిః ।**
**వ్యాసాయ నారదేనోక్తం తేన మహ్యం కృపాలునా ॥ 40 ॥**

తదనంతరం సనకాది మహర్షులు ఈ జ్ఞానాన్ని నారదునకు చెప్పారు. నారదుడు వ్యాసునకు చెప్పాడు. దయానిధియైన వ్యాసుడు నాకు చెప్పాడు.

**మయా చైవ భవద్భ్యశ్చ భవద్భిర్లోకహేతవే ।**
**స్థాపనీయం ప్రయత్నేన శివప్రాప్తికరం చ తత్ ॥ 41 ॥**

నాచే మీకు చెప్పబడింది. మీరు లోకోపకారంకొఱకు దీనిని ప్రయత్నపూర్వకంగా స్థిరం చేయండి. ఈ జ్ఞానం శివుని పొందడానికి సహకరిస్తుంది.

**ఇతి వశ్చ సమాఖ్యాతం యత్పృష్టోఽహం మునీశ్వరాః! ।**
**గోపనీయం ప్రయత్నేన కిమన్య చ్ఛ్రోతుమిచ్ఛథ ॥ 42 ॥**

ఓ మహర్షులారా! మీరడిగిన దానికి నేను సమాధానమిచ్చియున్నాను. దీనిని మీరు రహస్యంగా నుంచండి. మీరింకనూ ఏమి వినగోరుతున్నారు.

**వ్యాస ఉవాచ -** వ్యాసుడు పలికాడు.

**ఏతచ్ఛ్రుత్వా తు ఋషయ ఆనందం పరమం గతాః ।**
**హర్షగద్గదయా వాచా నత్వా తే తుష్టువుర్ముహుః ॥ 43 ॥**

ఈ వ్యాక్యాన్ని విని ఆ ఋషులు ఆనందాన్ని పొంది ఆయనకు నమస్కరించి హర్షంతో గద్గదమైన వాక్కుతో పలుమార్లు స్తుతించారు.

**ఋషయ ఊచుః** -ఋషులు పలికారు.

**వ్యాసశిష్య! నమస్తేఽస్తు ధన్యస్త్వం శైవసత్తమః ।**
**శ్రావితం నః పరం వస్తు శైవం జ్ఞానమనుత్తమమ్ ॥ 44 ॥**

ఓ వ్యాసశిష్యా! నీకు నమస్కారం. శైవసత్తముడవైన నీవు ధన్యుడవు. మాకు పరమతత్త్వాన్ని బోధించావు. సర్వోత్కృష్టమైన శివసంబంధి జ్ఞానం ఉపదేశించావు.

**అస్మాకం చేతసో భ్రాంతిర్గతా హి కృపయా తవ ।**
**సంతుష్టాశ్శివసజ్ఞానం ప్రాప్య త్వత్తో విముక్తిదమ్ ॥ 45 ॥**

నీ దయచే మా మనస్సులలోని సంశయాలు దూరమయ్యాయి. మోక్షాన్నిచ్చే పవిత్రమైన శివజ్ఞానాన్ని నీనుండి పొంది మేము సంతోషించాం.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**నాస్తికాయ న వక్తవ్యమశ్రద్ధాయ శఠాయ చ ।**
**అభక్తాయ మహేశస్య నచాశుశ్రుషవే ద్విజాః! ॥ 46 ॥**

ఓ బ్రాహ్మణులారా! నాస్తికునకు, శ్రద్ధలేనివానికి, మోసగానికి మహేశుని యందు భక్తిలేనివారికి, వినాలని ఇచ్ఛలేని వానికి దీనిని చెప్పరాదు.

**ఇతిహాసపురాణాని వేదాన్ శాస్త్రాణి చాసకృత్ ।**
**విచార్యోద్ధృత్య తత్సారం మహ్యం వ్యాసేన భాషితమ్ ॥ 47 ॥**

వ్యాసుడు ఇతిహాసపురాణాలను, వేదశాస్త్రాలను పలుమార్లు పరిశీలించి వాటిలోని సారాన్ని తీసి నాకు చెప్పియున్నాడు.

**ఏతచ్ఛ్రుత్వా హ్యేకవారం భవేత్పాపం హి భస్మసాత్ ।**
**అభక్తో భక్తిమాప్నోతి భక్తస్య భక్తివర్ధనమ్ ॥ 48 ॥**

దీనిని ఒకసారి వింటే పాపం భస్మమౌతుంది. భక్తుడు కాని వానికి భక్తి కలుగుతుంది. భక్తునకు భక్తి వర్ధిల్లుతుంది.

**పునశ్శ్రుతే చ సద్భక్తిర్ముక్తిస్స్యాచ్చ శ్రుతే పునః ।**
**తస్మాత్పునః పునః శ్రావ్యం భుక్తిముక్తిఫలేప్సుభిః ॥ 49 ॥**

మరల దీనిని వింటే సద్భక్తి, మరలా వింటే ముక్తి కలుగుతాయి. కాబట్టి భుక్తిని, ముక్తిని, వాంఛితఫలాలను కోరేవారు దీనిని మరల మరల వింటూ ఉండాలి.

**ఆవృత్తయః పంచ కార్యాః సముద్దిశ్య ఫలం పరమ్ ।**
**తత్ప్రాప్నోతి న సందేహో వ్యాసస్య వచనం త్విదమ్ ॥ 50 ॥**

పరమఫలాన్ని కోరేవారు ఐదు పర్యాయాలు విన్నచో ఉత్తమఫలితాన్ని నిస్సందేహంగా పొందుతారని వ్యాసుడు చెప్పియున్నాడు.

**న దుర్లభం హి తస్యైవ యేనేదం శ్రుతముత్తమమ్ ।**
**పంచకృత్వస్తదాఽఽవృత్త్యా లభ్యతే శివదర్శనమ్ ॥ 51 ॥**

ఈ ఉత్తమమైన జ్ఞానం వినిన వారికి దుర్లభమైనది లేదు. దీనిని ఐదుసార్లు ఆవృత్తి చేసిన వానికి శివదర్శనం లభిస్తుంది.

**పురాతనాశ్చ రాజానో విప్రా వైశ్యాశ్చ సత్తమాః ।**
**ఇదం శ్రుత్వా పంచకృత్వో ధియా సిద్ధిం పరాం గతాః ॥ 52 ॥**

పూర్వపురాజులు, బ్రాహ్మణులు, సత్పురుషులైన వైశ్యులు కూడ దీనిని ఐదు పర్యాయాలు విని, బుద్ధిలో ధారణ చేసి, పరమసిద్ధిని పొందారు.

**శ్రోష్యత్యద్యాపి యశ్చేదం మానవో భక్తితత్పరః ।**
**విజ్ఞానం శివసంజ్ఞం వై భుక్తిం ముక్తిం లభేచ్చ సః ॥ 53 ॥**

ఈనాడైనను, ఏమానవుడైతే దీనిని భక్తితత్పరతతో వింటాడో, వానికి శివవిజ్ఞానం, భుక్తి, ముక్తి లభిస్తాయి.

**వ్యాస ఉవాచ –** వ్యాసుడు పలికాడు.

**ఇతి తద్వచనం శ్రుత్వా పరమానందమాగతాః ।**
**సమానర్చుశ్చ తే సూతం నానావస్తుభిరాదరాత్ ॥ 54 ॥**

వారు సూతుని ఈ వచనాలు విని పరమానందభరితులై ఆయనను వివిధద్రవ్యాలతో ఆదరపూర్వకంగా పూజించారు.

**నమస్కారైః స్తవైశ్చైవ స్వస్తివాచనపూర్వకమ్ ।**
**ఆశీర్భిర్వర్ధయామాసుః సంతుష్టాశ్ఛిన్నసంశయాః ॥ 55 ॥**

వారి సంశయాలన్నీ తొలగిపోయాయి. వారు సంతుష్టులై సూతమహర్షిని నమస్కారాలతో, స్తోత్రాలతో, స్వస్తివచనాలతో ఆశీర్వచనాలతో ఘనంగా గౌరవించారు.

**పరస్పరం చ సంతుష్టాః సూతస్తే చ సుబుద్ధయః ।**
**శంభుం దేవం పరం మత్వా నమంతి స్మ భజంతి చ ॥ 56 ॥**

పుణ్యాత్ములైన ఆ మహర్షులు, సూతమహర్షి పరస్పరం చాల ఆనందాన్ని పొంది, పరమాత్మయైన శంభుని స్మరించి, నమస్కరించి సేవించారు.

**ఏతచ్ఛివసువిజ్ఞానం శివస్యాతిప్రియం మహత్ ।**
**భుక్తిముక్తిప్రదం దివ్యం శివభక్తివివర్ధనమ్ ॥ 57 ॥**

శివునకు మిక్కిలి ప్రియమైన ఈ శివసువిజ్ఞానం, భుక్తిని ముక్తిని ఇచ్చి, శివభక్తిని పెంపొందింపజేస్తుంది. ఇది దివ్యమైనది.

**ఇయం హి సంహితా పుణ్యా కోటిరుద్రాహ్వయా పరా ।**
**చతుర్థీ శివపురాణస్య కథితా మే ముదావహా ॥ 58 ॥**

శివపురాణంలో నాల్గవదియైన ఈ కోటిరుద్రసంహిత పరమపుణ్యప్రదం. ఆనందదాయకమైన దీనిని నేను చెప్పాను.

**ఏతాం యః శృణుయాద్భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।**
**స భుక్త్వేహాఖిలాన్భోగానంతే పరగతిం లభేత్ ॥ 59 ॥**

ఎవడైతే దీనిని భక్తితో వింటాడో, ఏకాగ్రచిత్తంతో వినిపిస్తాడో, వాడు ఇహలోకంలో సకల భోగాలననుభవించి, మరణించిన పిదప మోక్షాన్ని (పరాంగతిని) పొందుతాడు.

**శ్రీశివమహాపురాణే చతుర్వింశతిసాహస్ర్యాం వైయాసిక్యాం సంహితాయాం తదంతర్గతాయాం చతుర్థ్యాం కోటిరుద్రసంహితాయాం జ్ఞాననిరూపణం నామ త్రిచత్వారింశోఽధ్యాయః ॥ 43 ॥**

వ్యాసమహర్షిచే ఇరవై నాలుగువేల శ్లోకాలలో ప్రణీతమైన శ్రీశివమహాపురాణసంహితంలో అంతర్గతమైన నాల్గవదైన కోటిరుద్రసంహితలో జ్ఞాననిరూపణం అనే పేరుగల నలభైమూడవ అధ్యాయం సమాప్తం.

**॥ సమాప్తేయం శివమహాపురాణాన్తర్గతకోటిరుద్రసంహితా చతుర్థీ ॥**

॥ శ్రీశివమహాపురాణాంతర్గతమైనదియు నాల్గవదియునగు కోటిరుద్రసంహిత సమాప్తం ॥

# పురాణప్రశస్తి

## (అష్టాదశపురాణాలు)

మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య

**వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।**
**నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥**
**నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।**
**దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥**

అతి ప్రాచీనకాలంలో గురుకులాలలో విద్యనభ్యసించే విద్యార్థులు పదునాలుగు విధాలైన విద్యల నభ్యసించేవారు. ఆ విద్యలనిలా పేర్కొనడం జరిగింది.

**అంగాని వేదాశ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః ।**
**పురాణం ధర్మశాస్త్రం చ విద్యా హ్యేతాశ్చతుర్దశ ॥**

శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం–అనే ఆరు వేదాంగాలు, ఋగ్యజుస్సామాథర్వణము లనే నాలుగు వేదాలు, మీమాంస, న్యాయం, పురాణం, ధర్మశాస్త్రం–అనేవే పదునాల్గు విద్యలు.

**'వేదోఽఖిలో ధర్మమూలం'** అన్నట్లు వేదమంతా ధర్మమూలమైనది. వేదోక్తమైన ధర్మాలను గ్రహించడం అందరికీ సాధ్యంకాని పని. అందుచేత వేదాలను విభజించిన వేదవ్యాసుడే వేదార్థాలను సామాన్యులు గూడా గ్రహించడాని కనువుగా పురాణాలను రచించాడు. **అష్టాదశపురాణానాం కర్తా సత్యవతీసుతః** –అను ప్రమాణవచనం కూడా పదునెనిమిది పురాణాల రచయిత సత్యవతీసుతుడైన వ్యాసుడే అని నిరూపిస్తున్నది.

**ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్ ।**
**బిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం ప్రహరిష్యతి ॥**

అల్పజ్ఞుడు తనకు హాని కల్గిస్తాడేమో అని వేదం భయపడుతుంది. అందువల్ల ఇతిహాసాలతోనూ, పురాణాలతోనూ వేదార్థాలను విస్తరింపజేయాలి. ఈ దృష్టితోనే, అనగా అల్పజ్ఞులను దృష్టిలో పెట్టుకొనే వ్యాసుడు వేదార్థాలను పురాణాలద్వారా విస్తరింపజేశాడు. అట్లని పురాణాలు అల్పజ్ఞులకు మాత్రమే పరిమితమైనవి కావు. అధికజ్ఞులు కూడా గ్రహించవలసిన విషయాలు పురాణాలలో ఎన్నో ఉన్నాయి.

వేదం ప్రభువుతో సమానమైనది. శబ్దప్రధానమైన వేదవాణి కర్తవ్యవిషయంలో రాజాజ్ఞను పోలి వుంటుంది. పురాణవచనం మిత్రతుల్యంగా వుంటుంది. అది అర్థప్రధానమై శ్రోతను కర్తవ్యానికి పురికొల్పుతుంది. కావ్యం కాంతాసమ్మితమై సరసంగా బోధించి పాఠకుణ్ణి కర్తవ్యోన్ముఖుణ్ణి చేస్తుంది అని ఆలంకారికులు వేదార్థాలను వివరించే పురాణాలకు మిత్రసాదృశ్యాన్ని ప్రతిపాదించారు.

**యద్వేదాత్ప్రభుసమ్మితాదధిగతం శబ్దప్రధానాచ్చిరం**
**యచ్చార్థప్రవణాత్పురాణవచనాదిష్టం సుహృత్సమ్మితాత్ ।**

**కాన్తాసమ్మితయా యయా సరసతామాపాద్య కావ్యశ్రియా**
**కర్తవ్యే కుతుకీ బుధో విరచితస్తస్యై స్పృహాం కుర్మహే ॥** (ప్రతాపరుద్రీయం)

పురాణాలలో గూడా కావ్యశైలిని పాటించి రసవత్తరంగా కర్తవ్యబోధ కావించిన ఘట్టాలెన్నో ఎడనెడా కానవస్తాయి.

పురాణాలలో పూర్వకాలానికి చెందిన అనేక కథలున్నాయి. కథాకథనం ద్వారా ధర్మస్వరూపం అందులో నిరూపింపబడింది. పురాణకథలు వాగ్వైభవాన్ని ప్రదర్శించడానికి చెప్పినవికావనీ, విజ్ఞానవైరాగ్యాలను విస్తరించి చెప్పడానికే ఆ కథలను వివరించడమయిందనీ భాగవతపురాణంలో వ్యాసభగవానుడే చెప్పాడు.

**కథా ఇమాస్తే కథితా మహీయసాం**
**వితాయ లోకేషు యశః పరేయుషామ్ ।**
**విజ్ఞానవైరాగ్యవివక్షయా విభో!**
**వచోవిభూతీర్న తు పారమార్థ్యమ్ ॥** (భాగవతం–12–3–14)

ఇక్కడ 'విజ్ఞాన' మంటే వేదవిజ్ఞానమనే గ్రహించాలి.

**'వేదాః ప్రతిష్ఠితాస్సర్వే పురాణే నాత్ర సంశయః'** పురాణాలలో వేదాలు ప్రతిష్ఠితాలై ఉన్నాయి. ఇందులో సందేహం లేదు. కథల ద్వారా అవి ఆవిష్కృతాలవుతాయి.

## పురాణప్రాముఖ్యం

**యన్నదృష్టం హి వేదేషు తత్సర్వం లక్ష్యతే స్మృతౌ ।**
**ఉభయోర్యన్న దృష్టం హి తత్పురాణే ప్రతీయతే ॥**

వేదాలలో గోచరం కానిదంతా స్మృతులలో కనిపిస్తుంది. శ్రుతి స్మృతులు రెండింటిలో కనిపించనిది పురాణం ద్వారా అవగతం అవుతుంది అన్న ప్రమాణాన్ని బట్టి శ్రుతులలోనూ, స్మృతులలోనూ లేని విషయాలను సైతం విస్తృతరచనావిధానం కల పురాణాల ద్వారా గ్రహించవచ్చునని తెలుస్తున్నది. **'పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్'** అన్నట్లు శాస్త్రాలన్నింటిలోను మొదటిదిగా పురాణాన్ని విధాత స్మరించాడని విదితమవుతున్నది. యాగానుష్ఠానసమయంలో పురాణాలు పఠించే సంప్రదాయం కద్దు. ఇంకా పురాణాలలో భగవన్మహిమ, భగవదవతారాలు, భక్తిప్రబోధం, నానావిధాలైన ఆచారాలు, ధర్మాధర్మాలు, సాంఘిక –చారిత్రకాంశాలు, కళలు, వేదాంతతత్త్వాలు, నీతి ఇత్యాదిగా ఎన్నో విషయాలు నిరూపితాలయ్యాయి.

పురాణం ఐహికాముష్మిక సుఖసాధనం. మన సంస్కృతీసంప్రదాయాలను గ్రహించడానికి పురాణజ్ఞానం అవసరం.

## పురాణ శబ్ద నిర్వచనం

**పురాణం అంటే –** పురా భవం ప్రాచీనకాలంలో రచించబడినది అని అర్థం.

**పురాఽపి నవం –** ప్రాచీనమైనా విషయవిశిష్టతను బట్టి క్రొత్తది అని మరొక అర్థం.

**పురా-అణతి-ఆగతానాగతే కథయతీతి పురాణం-**అంటే జరిగిన, జరుగనున్న కాలానికి చెందిన విషయాలను వివరించునది అని వేరొక అర్థం.

**పురా-పూర్వస్మిన్ జాతమితి పురాణమ్**-పూర్వం ఎప్పుడో జరిగిన వృత్తాంతం పురాణం అని భావం.

**పురా**-అంటే పరంపరను వ్యక్తం చేసేది పురాణం అని మరొక వివరణ.

**పురా-ప్రాచీన కాలోదంతం అనక్తీతి పురాణం** - పురాతనకాలానికి చెందిన చరిత్రను చెప్పునది పురాణం.

ఇలా పురాణశబ్దానికి పలు విధాల నిర్వచనం పెద్దలు చెప్పారు.

## పురాణోత్పత్తి

అథర్వవేదంలో పురాణ శబ్దం ప్రయుక్తమైంది. యజ్ఞోచ్ఛిష్టంనుండి పురాణం పుట్టినదని అందులో చెప్పబడింది.

**ఋచః సామాని ఛందాంసి పురాణం యజుషా సహ ।**
**ఉచ్ఛిష్టాజ్జజ్ఞిరే సర్వే దివి దేవా దివి శ్రితాః ॥** అథర్వసంహిత (11-7-24)

నాల్గువేదాల తరువాత ఇక్కడ పురాణోత్పత్తి నిర్దేశించబడింది. పురాణాల ఉనికి వేదసమకాలికమని తెలుస్తున్నది.

అందుచేత వేదసంహితల కాలంలోనే పురాణాలకు చెందిన మూలస్వరూపం రూపొందిందని భావించవచ్చు. బృహదారణ్యకోపనిషత్తులోని ఈ క్రింది వాక్యం గమనార్హం.

**"అస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతత్ యదృగ్వేదో, యజుర్వేదస్సామవేదోఽథర్వాఙ్గిరసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాః సూత్రాణి".**(2-4-10)

ఈ ఉపనిషద్ వాక్యం వేదాదులతోపాటు పురాణం కూడా పరమాత్మయొక్క నిఃశ్వాసరూపమైనదని వ్యక్తం చేస్తున్నది. దీనివల్ల వేదం ఎంత ప్రాచీనమో పురాణం కూడా అంతే ప్రాచీనమని గ్రహించవచ్చు. ఇక్కడ పురాణ శబ్దం ఏకవచనంలో ప్రయుక్తమైనది. అందుచేత పూర్వం సంక్షిప్తంగా ఉండిన పురాణం కాలక్రమంలో విస్తృతరూపం సంతరించుకొని వివిధ పురాణాలుగా విస్తరించిందని భావించవచ్చు.

భారతీయసంస్కృతిని ప్రతిబింబించే దర్పణాలు పురాణాలు. సామాన్య జనానీకంలో సనాతనధర్మతత్త్వాన్ని ప్రచారం చేయడంలో అవి ప్రముఖపాత్ర వహించాయి. ఆధునికకాలంలో ప్రాచ్య పండితులేకాక పాశ్చాత్య పండితులు కూడా పురాణాల విశిష్టతను గుర్తించారు. పురాణం అన్న వ్యవహారమే ఇది అతిప్రాచీన సాహిత్యమని తెలియజేస్తుంది.

పురాణాలకంటే భిన్నంగా ఇతిహాసాలను గూడా మన పెద్దలు పేర్కొన్నారు. గతకాలంలో జరిగిన సంఘటనలను తెలిపేవి ఇతిహాసాలు. ఇతి హ+ఆస = ఇతిహాసం అనగా ఇలా పూర్వం జరిగినది-అని అర్థం. పురాణంలోని విషయాలు ఇతిహాసంలోని అంశాలకంటె వ్యాపకంగానూ, విస్తృతంగానూ వుంటాయి.

సాధారణ పురాణాల నుద్దేశించి నిర్దేశించిన సర్గం, ప్రతిసర్గం మొదలైన లక్షణాల కంటె భిన్నమైన వివిధ విషయాలు పురాణాలలో గోచరిస్తాయి. ఉదా: అగ్నిపురాణాన్ని పరిశీలిస్తే వివిధ విద్యలు, పదార్థలక్షణాలు, స్వప్నాలు,

శకునఫలితాలు, కావ్యనాటకలక్షణాలు, ప్రళయస్వరూపం, నరకం తీరుతెన్నులు, అద్వైత బ్రహ్మతత్త్వం మున్నగు అంశాలు అందులో ఉండడం గమనార్హం. అందుకే అగ్నిపురాణాన్ని 'జ్ఞానకోశం' అన్నారు.

సృష్ట్యారంభంనుండి నేటివరకు సమాజంలోని స్థితిగతులను చెప్పే పురాణాలను శ్రద్ధతో పఠించి పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అంతేకాని అవేవో కల్పనాత్మకమైన కథలని ఉపేక్షించడం తగదు. పురాణాలను ఏ దృష్టితో వ్యాసభగవానుడు రచించాడు? అన్న ప్రశ్నకు ఈ క్రింది శ్లోకం సమాధానమిస్తున్నది.

**విష్ణోరంశో మునిర్జాతః సత్యవత్యాం పరాశరాత్ ।**
**పురాణసంహితాం దధ్యౌ తేషాం ధర్మవిధిత్సయా ॥**

విష్ణ్వంశంతో జనించిన సత్యవతీ పరాశరుల పుత్రుడగు వ్యాసుడు ధర్మస్వరూపనిరూపణకై పురాణసంహితను రూపొందించాడని భావం.

అంతేకాక శ్రీమన్నారాయణుడు స్వయంగా వ్యాసరూపుడై వేదార్థాల విస్తృతి నపేక్షించి భూతలములో పురాణాలు రచించాడని ఈ క్రింది శ్లోకం నిరూపిస్తున్నది.

**విస్తారాయ చ వేదానాం స్వయం నారాయణః ప్రభుః ।**
**వ్యాసరూపేణ కృతవాన్ పురాణాని మహీతలే ॥**

సూతుని ద్వారా ఈ పురాణవాఙ్మయం ప్రచారంలోకి వచ్చింది. నైమిశారణ్యనివాసులైన శౌనకాది మునులు సూతునినుండి ఈ పురాణాలను విన్నారు.

## విష్ణువుయొక్క అవయవాలే పురాణాలు

త్రిమూర్తులలో ఒక్కడుగా, స్థితికారకుడుగా, దుష్టశిక్షకుడుగా, శిష్టరక్షకుడుగా, ధర్మసంస్థాపకుడుగా ప్రసిద్ధుడైన శ్రీమహావిష్ణుదేవుని యొక్క అవయవాలుగా పదునెనిమిది పురాణాలను పేర్కొనడం కద్దు. దీన్నిబట్టి ధర్మప్రభువైన అచ్యుతునికీ, ధర్మస్వరూపనిరూపకాలైన పురాణాలకూ కల సామ్యాన్ని గ్రహించవచ్చు. పురాణాలు ఈ క్రిందివిధంగా విష్ణుదేవుని అవయవాలుగా పేర్కొనబడ్డాయి.

**బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ ।**
**వైష్ణవం దక్షిణో బాహుః వాయుర్వామో మహేశితుః ॥**

**ఊరూ భాగవతం ప్రోక్తం నాభిః స్యాన్నారదీయకమ్ ।**
**మార్కండేయం చ దక్షాంఘ్రిః వామో హ్యాగ్నేయముచ్యతే ॥**

**భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మనః ।**
**బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృతః ॥**

**లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ ।**
**స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥**

**కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేదః ప్రకీర్త్యతే ।**
**మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥**
**ఏవమేవాభవద్విష్ణుః పురాణావయవో హరిః ।**

దీని తాత్పర్యం ఇది-శ్రీమహావిష్ణువునకు బ్రహ్మపురాణం-శిరస్సు, పద్మపురాణం-హృదయం, విష్ణుపురాణం-దక్షిణహస్తం, వాయుపురాణం-వామహస్తం, భాగవతపురాణం-తొడలు, నారదపురాణం-నాభి, మార్కేండయపురాణం-దక్షిణపాదం, అగ్నిపురాణం-వామపాదం, భవిష్యపురాణం-కుడి మోకాలు, బ్రహ్మవైవర్త పురాణం-ఎడమ మోకాలు, లింగపురాణం-కుడి చీలమండ, వరాహపురాణం-ఎడమ చీలమండ, స్కాంద పురాణం-కేశాలు, వామనపురాణం-చర్మం, కూర్మపురాణం-వీపు, మత్స్యపురాణం-మెదడు, గరుడపురాణం-మజ్జ, బ్రహ్మాండపురాణం-ఎముకలు. ఇలా శ్రీహరి పురాణాలే అవయవాలుగా కల్గి వున్నాడు.

## పురాణసంఖ్య

పురాణాలు మొత్తం పదునెనిమిది. వీటిని ఆ యా పురాణాల పేర్లలో మొదటి అక్షరాన్ని మాత్రం పేర్కొనే ఒక శ్లోకంలో ఇలా చెప్పడమయింది.

**మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వ చతుష్టయమ్ ।**
**అనాపలింగ కూస్కాని పురాణాని విదుర్బుధాః ॥**

'మ' అనే అక్షరంతో ప్రారంభమయ్యే పురాణాలు రెండు-(1) మత్స్యపురాణం (2) మార్కండేయపురాణం. 'భ' అను అక్షరంతో ప్రారంభమయ్యేవి, రెండు -(1) భాగవతం (2) భవిష్యపురాణం -'బ్ర'తో ప్రారంభమయ్యేవి -మూడు (1) బ్రహ్మపురాణం (2) బ్రహ్మాండపురాణం (3) బ్రహ్మవైవర్త పురాణం -'వ' కారంతో ప్రారంభమయ్యేవి నాల్గు (1) విష్ణుపురాణం (2) వాయుపురాణం (3) వామనపురాణం (4) వరాహపురాణం -అ=అగ్నిపురాణం నా=నారదపురాణం-ప=పద్మపురాణం, లిం=లింగపురాణం, గ=గరుడపురాణం, కూ=కూర్మపురాణం, స్కా=స్కాందపురాణం ఇలా మొత్తం పురాణాల సంఖ్య పదునెనిమిది.

## పురాణవిభాగం

పురాణాలను మహాపురాణాలనీ, ఉప పురాణాలనీ రెండు విధాలుగా విభజించడం కద్దు. పైన ప్రథమాక్షర నిర్దేశంతో పేర్కొన్నవన్నీ మహాపురాణాలే. ఈ క్రిందివిధంగా కూడా ఈ పురాణాలను పెద్దలు నిర్దేశించారు.

**బ్రాహ్మం పాద్మం వైష్ణవం చ వాయవీయం తథైవ చ ।**
**భాగవతం నారదీయం మార్కండేయం చ కీర్తితమ్ ॥**
**ఆగ్నేయం చ భవిష్యం చ బ్రహ్మవైవర్తలింగకే ।**
**వారాహం చ తథా స్కాందం వామనం కూర్మసంజ్ఞకమ్ ।**
**మాత్స్యం చ గారుడం తద్వద్బ్రహ్మాండాఖ్యమితి త్రిషట్ ॥**

ఈ పదునెనిమిది పురాణాలనూ పద్మపురాణం సాత్త్వికాలు, రాజసాలు, తామసాలు అని మూడు వర్గాలుగా విభజించింది.

**సాత్త్వికాలు–**

**వైష్ణవం నారదీయం చ తథా భాగవతం శుభమ్ ।**
**గారుడం చ తథా పాద్మం వారాహం శుభదర్శనే ॥**

**రాజసాలు–**

**బ్రహ్మాండం బ్రహ్మవైవర్తం మార్కండేయం తథైవ చ ।**
**భవిష్యం వామనం బ్రాహ్మం రాజసాని నిబోధత ॥**

**తామసాలు–**

**మాత్స్యం కౌర్మం తథా లైంగం శైవం స్కాందం తథైవ చ ।**
**ఆగ్నేయం చ షడేతాని తామసాని నిబోధత ॥**

ఇందులో (1) వైష్ణవం (2) నారదీయం (3) భాగవతం (4) గారుడం (5) పాద్మం (6) వారాహం – అనునవి సాత్త్వికపురాణాలు. (1) బ్రహ్మాండం (2) బ్రహ్మవైవర్తం (3) మార్కండేయం, (4) భవిష్యం (5) వామనం (6) బ్రాహ్మం–అనేవి రాజసాలు. (1) మాత్స్యం (2) కౌర్మం (3) లైంగం (4) వాయవీయం (శైవం) (5) స్కాందం (6) ఆగ్నేయం అనేవి తామసాలు.

ఇలా ఒక్కొక్క వర్గంలో ఆరేసి పురాణాలు లెక్కకు వస్తాయి.

సాత్త్వికపురాణాలు శ్రీమహావిష్ణువు యొక్క ప్రాధాన్యాన్నీ, రాజసపురాణాలు చతుర్ముఖ బ్రహ్మ ప్రాముఖ్యాన్నీ, తామసపురాణాలు శివునియొక్క ఆధిక్యాన్నీ వర్ణిస్తున్నాయి. ఈ ముగ్గురు దేవతలు త్రిమూర్తులుగా ప్రసిద్ధులు.

అన్ని పురాణాలూ ఈ దేవతలందరికీ సమప్రాధాన్యాన్ని ప్రతిపాదించక కొన్ని పురాణాలు ఒక దేవతను ఇతర దేవతల కంటె అధికుడని చెప్పడం యుక్తమా? అనే సంశయం కలుగవచ్చు.

వేదం **'ఏకం సత్ విప్రా బహుధా వదంతి'** అని చెప్పింది. అంటే సద్రూపుడైన పరమాత్మ ఒక్కడే, తత్త్వజ్ఞులు ఆయనను నానా నామరూపాలతో వర్ణిస్తారని భావం. పరబ్రహ్మానికి మూర్తమని, అమూర్తమని రెండు రూపాలు కలవనీ; అందులో మూర్తం క్షరం–అంటే నశించే స్వభావం కలిగినదనీ, అమూర్తం నాశంలేనిదనీ గ్రహించాలి. క్షరాక్షరాలు సకలభూతాలలోనూ సమంగా ఉన్నాయి. అక్షరం పరబ్రహ్మం కాగా, ఈ చరాచరజగత్తు క్షరం అవుతున్నది. ఈ విషయాన్ని విష్ణుపురాణం ఇలా వివరించింది.–

**ద్వే రూపే బ్రహ్మణస్తస్య మూర్తం చామూర్తమేవ చ ।**
**క్షరాక్షరస్వరూపే తే సర్వభూతేష్వవస్థితే ।**
**అక్షరం తత్ పరంబ్రహ్మ క్షరం సర్వమిదం జగత్ ॥**

దీనినిబట్టి పురాణాలలో వర్ణింపబడిన త్రిమూర్తులలో ఒకరు పెద్ద, మరొకరు చిన్న అనే తేడాలు లేవు. ఒకే తత్త్వం మూడు రూపాలతో విరాజిల్లుతున్నది. ఆ దేవతలు నిర్వహించే క్రియలలోని భేదమే వారిని మూడు రూపాలతో నిర్దేశించడానికి హేతువైనది. ఈ సంగతినే విష్ణుపురాణం ఈ విధంగా వివరించింది.

**సృష్టిస్థిత్యంతకరణాత్ బ్రహ్మవిష్ణుశివాత్మికామ్ ।**
**స సంజ్ఞాం యాతి భగవాన్ ఏక ఏవ జనార్దనః ॥**

ఒక జనార్దనుడే సృష్టి, స్థితి, లయం – అనే మూడు కార్యాలు నిర్వహించడంవల్ల బ్రహ్మ, విష్ణువు, శివుడు అన్న మూడు సంజ్ఞలు పొందాడని భావం.

ఈ సత్యాన్ని గ్రహిస్తే ఆయా దేవతల పట్ల వైషమ్యం తొలగి సమత్వం నెలకొంటుంది. అందువల్ల త్రిమూర్తుల ప్రభావాలను సమయానుగుణంగా వర్ణించే పురాణాల పట్ల సమన్వయదృష్టినే కలిగివుండాలి.

మహాపురాణాల లాగానే ఉపపురాణాలు గూడా పదునెనిమిది ఉన్నాయని కూర్మపురాణం పేర్కొంటున్నది.

**ఆద్యం సనత్కుమారోక్తం నారసింహం తథాఽపరమ్ ।**
**తృతీయం స్కంద ముద్దిష్టం కుమారేణ తు భాషితమ్ ॥**

**చతుర్థం శివధర్మాఖ్యం సాక్షాన్నందీశభాషితమ్ ।**
**దుర్వాససోక్తమాశ్చర్యం నారదోక్తమతః పరమ్ ॥**

**కపిలం వామనం చైవ తథోశనససేవితమ్ ।**
**బ్రహ్మాండం వారుణం చాథ కాలికాహ్వాయమేవ చ ॥**

**మాహేశ్వరం తథా సాంబం సౌరం సర్వార్థసంచయమ్ ।**
**పరాశరోక్తమపరే మారీచం భాస్కరాహ్వాయమ్ ॥**

ఉపపురాణాలు–(1) సనత్కుమారోక్తం (2) నారసింహం (3) స్కాందం (4) శివధర్మం (5) దౌర్వాసం (6) నారదోక్తం (7) కాపిలం (8) వామనం (మానవం) (9) ఉశనసఃప్రోక్తం (10) బ్రహ్మాండం (11) వారుణం (12) కాలికా పురాణం (13) మాహేశ్వరం (14) సాంబం (15) సౌరం (16) పరాశరోక్తం (17) మారీచం (18) భాస్కరం (భార్గవం).

కొందరి మతం ప్రకారం ఉపపురాణాల సంఖ్య ముప్పదినాల్గుగా నిర్దిష్టమయింది. వీటికి తోడుగా ఔపపురాణాలు అన్న పేరుతో మరొక పదునెన్మిది పురాణాలను గూడ నిర్దేశించడం కద్దు.

## పురాణలక్షణం

**సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ ।**
**వంశానుచరితం చేతి పురాణం పంచలక్షణమ్ ॥**

సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరాలు, వంశానుచరితం–అని పురాణం ఐదు లక్షణాలు గల్గి యుంటుంది. వీటి సంగ్రహవివరణ ఇది.

1. సర్గం – అవ్యాకృతతత్త్వం నుండి మహత్తత్త్వం, దానినుండి అహంకారతత్త్వం, దానినుండి సూక్ష్మభూతాల సృష్టి.
2. ప్రతిసర్గం – మరీచ్యాదులవల్ల జరిగిన చరాచరసృష్టి.
3. వంశం – ఆ యా ఋషుల, రాజుల వంశాలు.

4. మన్వంతరాలు – మనువుల పరిపాలనకాలంలో జరిగిన విషయాలు మరియు ఆ యా మన్వంతరాలలో సప్త ఋషులు, మునులు మొదలగువారి వివరణ.

5. వంశానుచరితం–ఆ యా రాజవంశీయులైన రాజుల పరిపాలన మున్నగువాటికి చెందిన కథలను వివరించడం.

పక్షాంతరంలో పురాణాలకు పది లక్షణాలు గూడా నిర్దేశించడం కద్దు. పైన చెప్పిన ఐదు లక్షణాలు సాధారణ పురాణాల లక్షణం కాగా, క్రింద చెప్పబోయే పది లక్షణాలు మహాపురాణాలకు చెందినవని పెద్దల అభిప్రాయం.

**అత్ర సర్గో విసర్గశ్చ స్థానం పోషణమూతయః ।**
**మన్వంతరేశానకథా నిరోధో ముక్తిరాశ్రయః ॥**

సర్గం, విసర్గం, స్థానం, పోషణం, ఊతులు, మన్వంతరాలు, ఈశాన కథలు, నిరోధం, ముక్తి, ఆశ్రయం–అనేవే ఈ పది లక్షణాలు.

వీటి సంగ్రహ వివరణ ఇది–

1) సర్గం: –భగవత్ప్రేరణతో సత్త్వరజస్తమోగుణాలలో క్షోభ ఏర్పడి పంచ భూతాలు, పంచ తన్మాత్రలు, ఇంద్రియాలు, అహంకారం, మహత్తత్త్వం జనించడాన్ని సర్గమంటారు.

2) విసర్గం:–విరాట్పురుషునినుండి ఉదయించిన బ్రహ్మ వివిధ చరాచరాలను సృష్టిస్తాడు. ఈ సృష్టినే విసర్గమంటారు.

3) స్థానం:–వినాశోన్ముఖమైన సృష్టిని ఒక మర్యాదలో నిల్పడమే స్థానం.

4) పోషణం:–భగవానుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కావిస్తాడు. జగత్తుకు మేలు గల్గించే సందేశాన్ని అందిస్తాడు. నామరూపాలతో పుష్టిని కల్గిస్తాడు. దీనిని పోషణమంటారు.

5) ఊతులు:–కర్మవాసనలను ఊతులంటారు.

6) మన్వంతరాలు:–మనువులు మారినప్పుడు మన్వంతరకాలంలో తత్కాలానికి చెందిన అధిపతులు భక్తినీ,ధర్మాన్నీ ప్రబోధించే సంఘటనను మన్వంతరమంటారు.

7) ఈశానకథలు:– భగవదవతారాలు, భక్తులు–వీరికి సంబంధించిన చరిత్రలు.

8) నిరోధం:–జీవోపాధులను తనలో లీనం చేసుకొని భగవానుడు యోగనిద్రాముద్రితుడు కావడమే నిరోధం.

9) ముక్తి:–వేరే రూపాలు వదలి స్వస్వరూపంతో వుండడమే ముక్తి. ప్రకృతినుండి విముక్తి లభించే స్థితి ఇది.

10) ఆశ్రయం:– అధిష్ఠానమే ఆశ్రయం. దీని విశుద్ధికొరకే పై తొమ్మిది లక్షణాలనూ వివరించడం జరిగింది.

పై పది లక్షణాలూ మహాపురాణమైన శ్రీమద్భాగవతానికి చక్కగా అన్వయిస్తాయి. పెద్దలు వ్రాసిన గ్రంథాలలో వాటి సమన్వయాన్ని చూడవచ్చు.

## పురాణశ్లోక సంఖ్య

భాగవతంలోని ద్వాదశ స్కంధమందలి పదమూడవ అధ్యాయంలో ఆ యా పురాణాలలోని శ్లోకాల సంఖ్య ఈ క్రిందివిధంగా నిర్దేశించడమయింది.

బ్రాహ్మం దశ సహస్రాణి పాద్మం పఞ్చోనషష్టి చ ।
శ్రీవైష్ణవం త్రయోవింశచ్చతుర్వింశతి శైవకమ్ ॥
దశాష్టౌ శ్రీభాగవతం నారదం పఞ్చవింశతిః ।
మార్కండేయం నవాగ్నేయం దశ పఞ్చ చతుశ్శతమ్ ॥
చతుర్దశ భవిష్యం స్యాత్తథా పఞ్చ శతాని చ ।
దశాష్టౌ బ్రహ్మవైవర్తం లైఙ్గమేకాదశైవ తు ॥
చతుర్వింశతి వారాహమేకాశీతిసహస్రకమ్ ।
స్కాందం శతం తథా చైకం వామనం దశ కీర్తితమ్ ॥
కౌర్మం సప్తదశాఽఽఖ్యాతం మాత్స్యం తత్తు చతుర్దశ ।
ఏకోనవింశత్సౌపర్ణం బ్రహ్మాండం ద్వాదశైవ తు ॥
త్రయోదశే పురాణానాం సంఖ్యామాహ యథాక్రమమ్ । **(భాగవతం-12-13-2-9)**

| | | | |
|---|---|---|---|
| 1. బ్రహ్మపురాణం | - | 10,000 | శ్లోకాలు |
| 2. పద్మపురాణం | - | 55,000 | ,, |
| 3. విష్ణుపురాణం | - | 23,000 | ,, |
| 4. వాయుపురాణం | - | 24,000 | ,, |
| 5. భాగవతపురాణం | - | 18,000 | ,, |
| 6. నారదపురాణం | - | 25,000 | ,, |
| 7. మార్కండేయపురాణం | - | 9,000 | ,, |
| 8. అగ్నిపురాణం | - | 15,400 | ,, |
| 9. భవిష్యపురాణం | - | 14,500 | ,, |
| 10. బ్రహ్మవైవర్తపురాణం | - | 18,000 | ,, |
| 11. లింగపురాణం | - | 11,000 | ,, |
| 12. వరాహపురాణం | - | 24,000 | ,, |
| 13. స్కందపురాణం | - | 81,100 | ,, |
| 14. వామనపురాణం | - | 10,000 | ,, |
| 15. కూర్మపురాణం | - | 17,000 | ,, |
| 16. మత్స్యపురాణం | - | 14,000 | ,, |
| 17. గరుడపురాణం | - | 19,000 | ,, |
| 18. బ్రహ్మాండపురాణం | - | 12,000 | ,, |
| **మొత్తం శ్లోకాలు** | - | **4,00,000** | |

## పురాణాలలో ముఖ్యాంశాలు

పురాణాలు మానవకర్తవ్యాలను నిర్దేశిస్తూ కొన్ని ముఖ్యమైన సందేశాత్మక ప్రబోధాలు కావించాయి. ధర్మాన్ని రక్షించవలసిన ఆవశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనాలను వివిధ కథల ద్వారా అవి విశదీకరించాయి.

విశ్వమంతా భగవన్మయమనీ, మోక్షప్రాప్తికి భక్తి ముఖ్యసాధనమనీ, వివిధ వ్రతాలను వాటికి తగిన కాలాలలో అనుష్ఠించి పవిత్రులు కావాలనీ, పుణ్యక్షేత్రాలను సందర్శించాలనీ, ఆ యా క్షేత్రాలలో ప్రతిష్ఠితులైన దేవతలను ఆరాధిస్తే శుభాలు సిద్ధిస్తాయనీ, పితృదేవతలకు శ్రాద్ధవిధిని తప్పక అనుష్ఠించాలనీ, కర్మఫలం అనుభవించక తప్పదనీ ఇత్యాదిగా పురాణాలు ప్రబోధించే అంశాలు అందరికీ గమనింపదగినవై యున్నాయి.

## వర్ణనాశైలి

కవితారూపంలో గల రచనలను కవులు ఆలంకారికప్రక్రియలో కొనసాగిస్తారు. ఈ ప్రక్రియ పాఠకులను ఆకర్షిస్తుంది. యథాతథంగా సాగే కథాకథనంతోపాటు అవసరమైనచోట అలంకారప్రక్రియనాశ్రయించి కవులు వర్ణన నిర్వహిస్తారు. అతిశయోక్తులను గూడా మేళవిస్తారు. ఉన్నదున్నట్లు చెప్పడం యథాతథకథనం కాగా కథనంలో ఉపమా, రూపకాదులను ఆశ్రయించడం ఒక విశిష్టమైన పద్ధతి. వేదాలలో గూడ ఈ పద్ధతి కనిపిస్తుంది. ఉదాహరణకు కఠోపనిషత్తులో

**ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు ।**
**బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥**

ఇత్యాదిగా శరీరానికి రథరూపకల్పన చేసి ఆత్మను రథికునిగా పేర్కొనడం జరిగింది. సూర్యుని కిరణాలలోని ఏడు రంగులను ఏడు గుర్రాలుగా వర్ణించడం గూడా ఈ ప్రక్రియకు చెందిన విషయమే.

పురాణాలు గూడా ఈ శైలిని విస్తృతంగా అనుకరించాయి. అతిశయోక్తిని గూడా విపులంగా వినియోగించాయి. ఈ పద్ధతి పురాణవాఙ్మయానికి శోభావహమైందనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

## పురాణ ప్రయోజనం

**యథా పాపాని పూయన్తే గంగావారి విగాహనాత్ ।**
**తథా పురాణశ్రవణాద్దురితానాం వినాశనమ్ ॥**

గంగాజలంలో స్నానం చేయడంవల్ల పాపాలు నశించినట్లే పురాణశ్రవణంవల్ల దురితాలు నశిస్తాయి.

## సదాచారప్రబోధం

యజ్ఞాలు, దానాలు, తపస్సులు ఇత్యాదిగా ఎన్ని చేసినా – సదాచారం లేనివాడు ఆత్మోన్నతి పొందలేడు.

**దురాచారో హి పురుషో నేహ నాముత్ర నందతి ।**

అన్నట్లు దురాచారుడైన మనుజుడు ఇహపరలోకాలు రెండింటా సుఖానికి దూరమౌతాడు.

**ఆచారహీనం న పునన్తి వేదా యద్యప్యధీతాః సహ షడ్భిరంగైః ।**

సదాచారం లేనివాడిని వేదాలు గూడా పవిత్రుణ్ణి చేయజాలవు. దురాచారాలు, సదాచారాల స్వరూపాన్ని వివిధ కథల ద్వారా పురాణాలు చక్కగా నిరూపించాయి. రామాయణంలో రామాదివద్వర్తితవ్యం, న రావణాదివత్, -రామాదులవలె ప్రవర్తించాలి కాని, రావణాదులవలె ప్రవర్తించరాదు అన్న విధంగా నీతిప్రబోధం పురాణాలలో రమణీయంగా చేయబడింది.

అందువల్ల పురాణ పఠన శ్రవణాలు సమాజాభ్యున్నతి కల్గిస్తాయి. పూర్వం గ్రామసీమలలో గూడ రాత్రివేళల పౌరాణికులు పురాణపఠనం కావించి, అందలి విశేషాలను సామాన్య జనులకు బోధించేవారు. ఈ బోధ ప్రజానీకానికి సముచితసంస్కారం కల్గించేది. తద్వారా వారు ఆత్మోన్నతి కల్గించే మార్గంలో నడిచేవారు.

## కాలనిర్ణయం

పురాణాల కాలనిర్ణయం అంత సుకరం కాదు. శ్రీ శంకరభగవత్పాదులు మున్నగువారు తమ రచనల్లో పురాణాల నుదాహరించియున్నారు. బాణకవి (క్రీ.శ.625) తన హర్షచరిత్రలో **పురాణేషు వాయుప్రలపితం** అని చెప్పి వాయుపురాణాన్ని ప్రస్తావించాడు.

కలియుగరాజులను నిర్దేశించిన పురాణాలు గూడా ఉన్నాయి. విష్ణుపురాణంలో మౌర్యవంశం పేర్కొనబడింది. మాత్స్యపురాణం-దాక్షిణాత్యులైన ఆంధ్రరాజులను (క్రీ.శ.225) ప్రస్తావించింది. గుప్తరాజుల ప్రస్తావన వాయుపురాణంలో కనిపిస్తున్నది.

లక్ష శ్లోకాలుగల ఇప్పటి మహాభారతం రూపొందకముందే పురాణాల ఉనికిని పరిశోధకులు గుర్తించారు. మహాభారతవక్త అయిన రౌమహర్షణి పురాణాలలో పారంగతుడు. అతని తండ్రిగూడ పౌరాణికుడుగా ప్రసిద్ధుడే. మహాభారతంలో పెక్కు శ్లోకాలు పురాణాంతర్గత శ్లోకాలతో సామ్యం కల్గి వున్నాయి. మహాభారతంలోని కొన్ని ఆఖ్యానాల ప్రాచీన స్వరూపం పురాణాలలో గోచరిస్తున్నది. దీన్ని బట్టి మహాభారతం కంటె పురాణాలు ప్రాచీనమైనవని విశ్వసించవచ్చు.

కౌటిల్యుని అర్థశాస్త్రంలో పురాణప్రస్తావన ఉన్నది. అపమార్గగాములైన రాజకుమారులను పురాణోపదేశం ద్వారా సన్మార్గగాములను చేయాలని కౌటిల్యుడు వచించాడు. రాజుకు సంబంధించిన అధికారులలో పౌరాణికుడు గూడా ఒకడని కౌటిల్యుడు పేర్కొన్నాడు. అంచేత కౌటిల్యుని కంటె పురాణాలు ప్రాచీనాలని భావించడం సముచితం. కౌటిల్యుడు క్రీ.పూర్వం తృతీయ శతకం వాడని అనేకుల భావన. అందువల్ల ఆ కాలానికంటె ముందే పురాణాలుండేవని భావించాలి.

గౌతమ-ఆపస్తంబ సూత్రగ్రంథాలలో గూడ పురాణప్రస్తావన వస్తుంది. రాజు శాసనవ్యవస్థలో వేదంతోపాటు పురాణాన్ని గూడా ప్రముఖంగా గ్రహించాలని గౌతముడు చెప్పాడు. అతిప్రాచీన పురాణభాగాలనుండి మూడు శ్లోకాలను ఆపస్తంబ ధర్మసూత్రాలలో ఉదాహరించడం జరిగింది. ఆ శ్లోకాలతో సామ్యం కల శ్లోకాలు నేటి పురాణాలలో లభిస్తున్నాయి. కాబట్టి సూత్రకాలంలో గూడా పురాణ గ్రంథాలుండేవని బోధపడుతున్నది.

మరొక ముఖ్యాంశ మేమంటే అతిప్రాచీనములైన ఉపనిషత్తులలో గూడా పురాణప్రస్తావన కలదు, ఛాందోగ్యంలో నారద సనత్కుమారుల సంవాదంలో ఇతర శాస్త్రాలతోపాటు పురాణాలను పేర్కొన్నారు.

**“ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేదమాథర్వణం చతుర్థమితిహాస పురాణం పంచమం వేదానాం వేదం”** (ఛాందో 7-1-2).

అందుచేత క్రీ.పూ 600 సం॥ పూర్వం పురాణాల నిర్మాణం జరిగిందని పెద్దల భావన. వాటికి మూల భూతమైన పురాణా లిప్పుడు లభించవు.

పురాణాలు ఏ ఒక్క శతాబ్దానికో చెందిన రచనలు కావు. కాలక్రమములో వాటిలో క్రొత్తక్రొత్త అధ్యాయాలు చేర్చడం జరిగింది. గుప్తకాలానికి పురాణాలు నేటిరూపం సంతరించుకొన్నాయని చెప్పవచ్చు.

## పురాణ వైశిష్ట్యం

పురాణాలు సామాన్యులకు దుర్బోధమైన వేదార్థాలను వారికవగతమయ్యే రీతిలో కథలు జోడించి చెప్పాయి. ప్రాచీనకాలానికి చెందిన భారతీయ సమాజ స్వరూప స్వభావాలను అర్థం చేసుకోవడానికి పురాణాలే ప్రామాణికమైన ఆధారాలు. ఆనాటి ఋషుల చరిత్రలను మనం పురాణాలనుండే సమగ్రంగా గ్రహించడానికి వీలవుతుంది.

భారతభౌగోళికస్థితి, నదీనదపర్వతాల ఉనికి, వివిధ తీర్థాల స్థితిగతులు, పలువృక్షాలు, జంతువులు- వీటిని గూర్చిన విజ్ఞానం కూడా పురాణాలలో లభిస్తుంది.

పురాణాలను, శిలాశాసనాదులగు ఇతర ప్రామాణికాధారాలతో తులనాత్మకంగా పరిశీలిస్తే గత చరిత్రకు చెందిన అనేక విషయాలు తేటతెల్లమవుతాయి.

కాబట్టి భారతీయులే కాక పాశ్చాత్యులు గూడా పురాణాలను శ్రద్ధతో పరిశోధించి మానవజాతి గతచరిత్రను సమగ్రంగా అవగతం చేసుకోవచ్చు.

ధార్మికంగానూ, ఆధ్యాత్మికంగానూ సామాన్యప్రజలను చైతన్యవంతులను చేయడంలో పురాణాలు నిర్వహించిన పాత్ర ఎంతో గణనీయమైనది. మొత్తం పదునెనిమిది పురాణాలలోని శ్లోకాల సంఖ్య నాల్గు లక్షలని ముందే చెప్పుకొన్నాం. ఇంత విస్తృతమైన గ్రంథరాశి సంస్కృతభాషానిబద్ధమై లభిస్తున్నది.

వేదాలలోని నిగూఢమైన వేదాంతతత్త్వాన్ని సామాన్య జనులకు గూడా అర్థం కావాలనే దృష్టితో ఆఖ్యానాలతోనూ, ఉపాఖ్యానాలతోనూ పురాణాలు వివరించాయి.

ప్రాచీనకాలంలో యజ్ఞాలు నిర్వహించే ప్రదేశాలలో పురాణపఠనం విధిగా నిర్వహింపబడేది. పురాణపఠనం పాపనివారకమనీ, పుణ్యప్రదమనీ ప్రశంసింపబడింది. పౌరాణికులు పురాణాలను పఠిస్తూ ప్రవృత్తి నివృత్తి రూపాలైన రెండు విధాల ధర్మాలనూ ప్రజలకు వివరించేవారు.

పురాణాలను ఆధారంగా చేసుకొని కవులు కావ్యనాటకాదులు విస్తృతంగా రచించారు. భారతీయుల జీవితాలకూ, విశ్వాసాలకూ పురాణాలు శతాబ్దాల తరబడి మార్గనిర్దేశకాలయ్యాయి. వేదార్థాలను అతివిస్తృతస్థాయిలో జనానీకానికి అందజేయడానికి పురాణాలు ముఖ్యసాధనాలయ్యాయి.

వేదాంతతత్త్వాన్ని బోధించడాని కవతరించిన శ్రీశంకర రామానుజాద్యాచార్యులు గూడా అవసరమైన చోట పురాణవచనాలను ప్రమాణాలుగా పేర్కొనియున్నారు.

కర్మ–భక్తి–ధ్యాన–జ్ఞాన యోగాలు మోక్షసౌధాన్ని అధిష్ఠించడానికి సోపానాలు. ఇందులో కలియుగంలో భక్తియొక్కటే సులభమైన తరణోపాయమని పెద్దలు పేర్కొన్నారు.

**"కలౌ భక్తిః కలౌ భక్తిః భక్త్యా కృష్ణః పురః స్థితః"** అన్నట్లు కలియుగంలో అనన్యభక్తిచేతనే భగవదనుగ్రహం కలుగుతుందన్న సత్యాన్ని భాగవతాది పురాణాలు ప్రహ్లాదచరిత్రాది కథల ద్వారా మనోజ్ఞంగా నిరూపించాయి.

అట్లే గృహస్థులు పాటించవలసిన పలురకాలైన కర్మవిధానాలూ, వ్రతాలూ, వాటివల్ల కలిగే ఫలితాలూ పురాణాలలో ఎడనెడా విశదంగా నిరూపించబడ్డాయి. ఈ విధంగా కర్మయోగనిరూపణం గూడా పురాణాలలో కనిపిస్తుంది. వివిధ విషయాలతో కూడిన పురాణాలను విజ్ఞానసర్వస్వాలుగా, జ్ఞాననిలయాలుగా భావించవచ్చు.

పురాణాలలో వివిధ ప్రదేశాలలో గల నానాతీర్థాలు, ఆ తీర్థాల ప్రాముఖ్యం, తీర్థయాత్రలవల్ల కలిగే ప్రయోజనాలు మొదలైన విషయాలు పలుచోట్ల వివరింపబడివున్నాయి. తీర్థయాత్రలవల్ల ప్రజలలో ఏకజాతీయతాభావం పెంపొందుతుంది. గతచరిత్రకు సంబంధించిన విజ్ఞానం భావిపురోగతికి దోహదం చేస్తుంది. పురాణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే భారతదేశ గతచరిత్రకు చెందిన ఎన్నో విషయాలు గోచరిస్తాయి. "పురోభివృద్ధి గోరువారు పూర్వవృత్తాంతమును మరువరాదు" అని శ్రీమలయాళస్వామి సూక్తి. అందుచేత చారిత్రక పరిశోధకులు పురాణాలను పరిశీలనాత్మకమైన దృష్టితో అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. తమ పాలనలో ఎదురయ్యే సమస్యలను ఆనాటి పాలకులు పురాణ వృత్తాంతాలను ప్రమాణంగా పరిగ్రహించి పరిష్కరించేవారు. అందుచేత రాజధర్మపరిజ్ఞానానికి గూడా పురాణసారస్వతం ఉపకరిస్తుంది.

పురాణాలలో బోధింపబడిన నీతులను కేవలం హిందూజాతికి మాత్రమే పరిమితాలని భావించరాదు. ప్రపంచజనులందరికీ ఉపయోగపడే శాశ్వత నైతికబోధలందులో ఉన్నాయి.

ఆధునిక విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన పలు అంశాలు పురాణాలలో నిర్దిష్టములై యున్నాయని ఇప్పటి శాస్త్రజ్ఞులలో కొందరి భావన. అందుచేత వైజ్ఞానిక పరిశోధకులకు గూడా పురాణజ్ఞానం అవసరమే.

అతి ప్రాచీన కాలంనుండి నేటివరకూ అమూల్య సారస్వతరూపంలో మనకు ఉపలబ్ధమవుతున్న వాఙ్మయంలో పూర్వోక్తపద్ధతిలో పురాణాలకు గల ప్రాముఖ్యాన్ని గుర్తించి మానవజాతి పురోగతికి వాటిని వినియోగించుకొని సర్వతోముఖమైన శ్రేయస్సును పొందుదుము గాక!

**సముద్రాల లక్ష్మణయ్య**
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.

# అష్టాదశపురాణాల సంగ్రహపరిచయం

## 1. బ్రహ్మపురాణం

పురాణాలలో మొదటిది బ్రహ్మపురాణం. ఇది విష్ణుదేవుని మాహాత్మ్యాన్ని విశదీకరిస్తుంది. ఆ దేవుని శిరస్సుగా వర్ణింపబడిన ఈ పురాణం ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాల ప్రాప్తికి తగిన ఉపాయాలను వివరిస్తుంది.

10,000 వేల శ్లోకాలు గల ఈ పురాణంలో పలు ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు ఉన్నాయి. నైమిశారణ్య వర్ణనం, ప్రళయస్వరూపం, హరిశ్చంద్ర సగరాదుల చరిత్రలు, సప్తద్వీపాలు, పార్వతీ స్వయంవరం, సాగరస్నానవిధి, గోదావరీ పవిత్రత, క్షీరసాగరమథనం, దధీచి వృత్తాంతం, వరాహాద్యవతారాలు-ఇత్యాదిగా అనేక విషయాలు ఇందులో నిబంధింపబడి వున్నాయి.

భారతావని, దండకారణ్యం, గంగాదినదుల ప్రాశస్త్యం విస్తృతంగా ఈ పురాణంలో వివరించడ మయింది.

ప్రతిపురాణంలోనూ తత్త్వాన్నీ, నీతినీ, ధర్మాన్నీ బోధించే కథలు ఉంటాయి. ఈ పురాణంలోని కథలలో 'కందు' మహర్షి కథ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది. అతని తపస్సుకు భంగం కల్గించడానికి దేవతలు పంపిన అప్సరస ప్రమ్లోచ దాదాపు 900 సంవత్సరాలు అతనితో విహరించి అతని నియమానికి భంగం కల్గిస్తుంది.

చివరికి తన పొరబాటు గుర్తించిన మహర్షి పురుషోత్తమ క్షేత్రమనే పూరీ జగన్నాథక్షేత్రానికి వెళ్ళి శ్రీ జగన్నాథుని సేవించి ముక్తుడవుతాడు.

తరువాతి కథలలో కార్తవీర్యార్జునుని వృత్తాంతం ప్రముఖమైనది. ఇది మిక్కిలి విస్తృతమైన చరిత్ర. దత్తాత్రేయుని అనుగ్రహంతో సహస్రబాహువులు కల్గి శిష్టరక్షణ కావిస్తూ రావణాదులను జయించి ధర్మబద్ధంగా రాజ్యపాలన గావించిన ఈ రాజు చివరికి తనకంటె బలవంతుడైన పరశురామునిచే వీరమరణం పొందుతాడు. ఏడువందల యాగాలు నిర్వహించినవాడుగా ఈతడు ప్రసిద్ధుడయ్యాడు. విష్ణుతత్త్వం బోధించే పలు విషయాలు ఇంకా ఎన్నో ఈ పురాణంలో గోచరిస్తాయి.

**ఇదం యః శ్రద్ధయా నిత్యం పురాణం వేదసమ్మితమ్ ।**
**యః పఠేచ్ఛృణుయాన్మర్త్యః స యాతి భువనం హరేః ॥**

వేదతుల్యమైన ఈ పురాణాన్ని శ్రద్ధతో చదివినవాడు, లేక విన్నవాడు హరినిలయమైన వైకుంఠం చేరుకుంటాడని ఫలశ్రుతి.

## 2. పద్మపురాణం

మహావిష్ణువుయొక్క హృదయస్థానంతో పోల్చబడిన పురాణమిది. సృష్టి ప్రక్రియ ఆ దేవుని నాభికమలంనుండి జన్మించిన బ్రహ్మద్వారా మొదలయింది. ఆ ప్రక్రియయే ఈ పురాణాని కాధారం. కాన ఇది 'పద్మపురాణ' మనబడింది. ఇందులో 55,000 వేల శ్లోకాలున్నాయి.

సృష్టిఖండం, భూఖండం, స్వర్గఖండం, పాతాళఖండం, ఉత్తరఖండం – అని ఐదు ఖండాలుగా విభజింప బడిన ఇందులో మొత్తం 641 అధ్యాయాలున్నాయి.

కాలపరిమాణం, క్షీరసాగరమథనం, దక్షయాగధ్వంసం, చంద్రవంశం, వామనావతారం, తారకాసుర వృత్తాంతం, నృసింహావతారం, సదాచారం – ఇత్యాదిగా పలువిషయాలను ఈ పురాణం వివరిస్తున్నది.

శరీరవర్ణనం, ఆత్మస్వరూపం, విష్ణుభక్తి మహిమ, కార్తికమాస ప్రాశస్త్యం, దీపావళీమాహాత్మ్యం పూజావిధానాలు, యుగధర్మాలు మున్నగు విషయాలను విపులంగా ఇందులో చూడవచ్చు.

ప్రపంచమంతా శ్రీహరిమయమే అని ఈ పురాణం ఘోషిస్తున్నది. ఇందులో పేర్కొన్న సదాచారాలు అవశ్యం ఆచరింపదగి వున్నాయి.

తల్లిదండ్రుల విశిష్టతను ప్రశంసించి **"మాతరం పితరం తస్మాత్సర్వయత్నేన పూజయేత్"** –సకల ప్రయత్నాలతోనూ తల్లిదండ్రుల నర్చించాలి అని ఈ పురాణం బోధించింది. ఇది **'మాతృదేవో భవ, పితృదేవో భవ'** అన్న శ్రుతివచనానికి వివరణగా ఉన్నది.

ఇంకా ఉసిరికాయకు గల పవిత్రత, దాన్ని సేవించే విధానం విపులంగా ఇందులో పేర్కొనబడింది. అట్లే తులసికి గల ప్రాశస్త్యం కీర్తించబడింది.

పురాణపఠనావశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనం, కలియుగ ధర్మాలు, ఆ యుగంలో స్త్రీపురుషుల స్వభావాలు, జనుల విపరీతప్రవృత్తులు విశదంగా ఇందులో నిరూపింపబడి యుండడం గమనార్హం.

కలియుగంలో ధర్మాత్మకమైన కర్మను మనుజుడు భక్తితో భగవదర్పితంగా ఆచరిస్తే సర్వపాప నిర్ముక్తు డవుతాడని ఈ పురాణం ప్రతిపాదించింది. ఇలా ఏ పురాణాన్ని పరిశీలించినా నానావిధములైన, ఆత్మోన్నతి హేతువులైన, మానవ జీవితాని కవసరములైన పెక్కు విషయాలు విశదీకరింపబడి వున్నాయి.

ఈ పద్మపురాణాన్ని చదివేవారికి, వినేవారికి కోరిన కోర్కెలన్నీ శ్రియఃపతి అనుగ్రహంవల్ల సిద్ధిస్తాయని ఫలశ్రుతి.

**యద్యదిష్టం పఠంత్యేతత్ శృణ్వంతి చ ముముక్షవః ।**
**లభన్తే తత్తదేవాశు ప్రసాదాత్కమలాపతేః ॥**

## 3. విష్ణుపురాణం

శ్రీ మహావిష్ణువు యొక్క దక్షిణబాహువుగా విష్ణుపురాణం వర్ణించబడింది. ఆరు అంశాలుగా విభజింపబడిన ఈ పురాణంలో 126 అధ్యాయాలున్నాయి. విష్ణుధర్మోత్తరంతోగూడ కలుపుకొంటే ఇందలి మొత్తం 23,000 వేల శ్లోకాలు. పరాశరమహర్షి మైత్రేయునకు జెప్పిన పురాణ మిది.

ఇరవైనాలుగు తత్త్వాలు, జగదావిర్భావం, కాలస్వరూపం, వరాహావతారం, భూవిభజన, సనకాదుల జననం, స్వాయంభువమనువు పుట్టుక, దక్షపుత్రికల వివాహం, ధ్రువచరిత్ర, నృసింహావతారం, భరతవంశవర్ణన, జడభరతోపాఖ్యానం-ఇత్యాదిగా అనేకాంశాలు ఈ పురాణంలో విశదీకరింపబడ్డాయి.

మరియు బ్రహ్మజ్ఞాన ప్రాశస్త్యం, వేదవిభాగం, బ్రహ్మచర్యాద్యాశ్రమాలు, దేవాసురుల యుద్ధం, సగరవంశవర్ణన, శ్రీకృష్ణావతారం, కలి లక్షణాలు, నామసంకీర్తన ప్రభావం మొదలైన విషయాలు గూడ విపులంగా ఇందులో నిరూపించడమైనది.

వైష్ణవులకు మిక్కిలిగా ఆరాధనీయమైన పురాణమిది. వైష్ణవసిద్ధాంతాలకు మూలభూతమైన గ్రంథం గాన శ్రీభగవద్రామానుజాచార్యులు ఆ సిద్ధాంతప్రచారాన్ని ఈ పురాణాన్ని ఆధారంగా స్వీకరించి నిర్వర్తించారు.

శరణాగతి, భగవద్గుణ కర్మ నామాల గానం, విష్ణ్వర్పణంగా కర్మల ననుష్ఠించడం మొదలగు అంశాలకు ఈ పురాణంలో ప్రాముఖ్యం ఇవ్వడమయింది.

మరియు శ్రవణం, కీర్తనం మున్నగు నవవిధభక్తి మార్గాలు ఇందులో విస్తృతంగా ప్రతిపాదింపబడి వున్నాయి. భాగవతపురాణం లాగా ఈ పురాణం గూడా భక్తియోగానికి ప్రాధాన్యాన్ని ప్రతిపాదించింది.

దేవతలను ఆరాధించేవారిలో అనేకులు శివకేశవులలో భేదాన్ని చూస్తారు. అయితే ఈ పురాణంలో–

**అవిద్యామోహితాత్మానః పురుషా భిన్నదర్శినః ।**
**వదంతి భేదం పశ్యన్తి చావయోరన్తరం హర! ॥**

'అవిద్యామోహితులే నీకూ, నాకు భేదం పాటిస్తారు' అని కేశవుడు శివునితో చెప్పాడు. ఈ శివకేశవాభేద సిద్ధాంతం ఇక్కడ గమనార్హం.

ఈ పురాణంలో జడభరతుని వృత్తాంతం మిక్కిలి ఆసక్తిని రేకెత్తించేదిగా వర్ణితమై వున్నది. ఆతని మూడు జన్మలకు సంబంధించిన విశేషాలు గ్రహిస్తే మనలో జ్ఞానవిజ్ఞానాలు వికసిస్తాయి.

**యో నరః పఠతే భక్త్యా యః శృణోతి చ సాదరమ్ ।**
**తావుభౌ విష్ణులోకం హి వ్రజేతాం భుక్తభోగకౌ ॥**

అన్నట్లు – భక్తితో దీన్ని పఠించేవాడు, ఆదరంతో వినేవాడూ ఈ లోకంలో భోగాలనుభవించి తుదకు విష్ణుసాన్నిధ్యం చేరగలరని ఫలశ్రుతి.

## 4. వాయుపురాణం

వాయుదేవుడు శివలీలలను వివరించిన పురాణమిది. అందుచేత దీన్ని 'శివపురాణ' మని కూడా పేర్కొంటారు. **'చతుర్వింశతి సాహస్రం పురాణం'** –అనుటవల్ల ఇందులో 24,000 వేల శ్లోకాలున్నాయని గ్రహించాలి. కాని ఇపుడు మనకు లభించేవి 11,000 శ్లోకాలు మాత్రమే. శ్లోకసంఖ్యలలో ఇట్టి వ్యత్యాసాలు కొన్ని పురాణాలలో కనిపిస్తున్నాయి. ఈ పురాణం మహావిష్ణువుయొక్క వామభుజంగా పేర్కొనబడింది.

ఇందులో (1) ప్రక్రియాపాదం (2) అనుషంగ పాదం (3) ఉపోద్ఘాత పాదం (4) ఉపసంహార పాదం-అని నాలుగు పాదాలున్నాయి.

భూగోళ-ఖగోళాలు, బ్రహ్మాండసృష్టి, యుగధర్మాలు మున్నగు విషయాలతోపాటు కైలాసవర్ణన, గంగావతరణవర్ణన మొదలగు వర్ణనలు గూడా ఇందు గోచరిస్తాయి.

ఇది శైవపురాణం. అయినా సందర్భానుగుణంగా మహావిష్ణువు గూడా ఇందు వర్ణింపబడినాడు.

వివేకవిజ్ఞానాలు కావాలంటే తప్పకుండా పురాణాల అధ్యయనం చేయాలని ఈ పురాణం చెబుతున్నది.

**యో విద్యాచ్చతురో వేదాన్ సాంగోపనిషదో నరః ।**
**న చేత్పురాణం సంవిద్యాన్నైవ స స్యాద్విచక్షణః ॥**

నాల్గువేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు చదివినా పురాణం చదువనివాడు విచక్షణుడు కాలేడని భావం. కాబట్టి పురాణాధ్యయనం ఎంత ముఖ్యమైనదో గ్రహించాలి.

ఈనాడు మనం యోగాభ్యాసాని కెంతో ప్రాముఖ్యం ఇస్తున్నాము. వాయుపురాణంలో యోగాని కవసరమైన ప్రాణాయామాన్ని గూర్చి విపులమైన వివరణ ఉన్నది. బ్రహ్మప్రాప్తికది అవసరం. శాంతి, ప్రశాంతి, దీప్తి, ప్రసాదం-అనే నాల్గు ప్రయోజనాలు దానివల్ల కల్గుతాయని ఈ పురాణం చెబుతున్నది.

ఓంకారోపాసన గూడా ఇందులో చెప్పడమయింది. ఓంకారధ్యానపరులకు శివసాయుజ్యం కల్గుతుందని ఇందులో నిరూపించబడివున్నది.

'రమణకం' అనే దేశంలోని ప్రజలు పదివేల సంవత్సరాలు, 'హిరణ్యకం' లోనివారు పదకొండు వేల సంవత్సరాలు జీవిస్తారంటూ అక్కడి ప్రకృతివిశిష్టతను ఇక్కడ చెప్పడమయింది.

అక్కడి చెట్లు ఫలాలతోపాటు వస్త్రాలనూ, ఆభరణాలను గూడా ప్రసాదిస్తాయని చెప్పడం ఆశ్చర్యావహంగా ఉన్నది. కథాకథనంకంటే ఇట్టి వర్ణనలే ఈ గ్రంథంలో ఎక్కువగా గోచరిస్తాయి.

గయాక్షేత్రప్రాముఖ్యం గూడా ఇందు చెప్పడమయింది. గయను సందర్శించిన పుత్రుడు పితరులకు రక్షకుడనీ, అతణ్ణి చూచి పితరులు హర్షిస్తారనీ ఇక్కడ పేర్కొనబడింది.

ఈ పురాణకీర్తనం శ్రవణం,ధారణ-కీర్తినీ, పూర్ణాయువునూ, పాపనాశాన్నీ కల్గిస్తాయని ఫలశ్రుతి.

**ధన్యం యశస్యమాయుష్యం పుణ్యం పాపప్రణాశనమ్ ।**
**కీర్తనం శ్రవణం చాస్య ధారణం చ విశేషతః ॥**

## 5. శ్రీమద్భాగవతం

శ్రీమహావిష్ణుని ఊరువుగా వర్ణించబడిన శ్రీమద్భాగవతంలో పంద్రెండు స్కంధాలు, 18,000 వేల శ్లోకాలున్నాయి. ఇది భక్తియోగ ప్రాముఖ్యాన్ని కథలతో, ఉపకథలతో వివరించే పురాణం.

**'నిగమకల్పతరోర్గళితం ఫలం'**-అన్నట్లు వేదమనే కల్పవృక్షంనుండి జారిపడిన పండుగా దీన్ని కీర్తించడమయింది. భక్తితోపాటు జ్ఞానవైరాగ్యాలు గూడా ఇందు నిర్దేశించబడి వున్నాయి.

వేదాలను విభజించిన వ్యాసుడు ధర్మనిరూపకమైన ఒక లక్షశ్లోకాలతో గూడిన మహాభారతం రచించాడు. అయినా మనశ్శాంతి లేక, చింతాక్రాంతు డయ్యాడు. నారదుడాయన చెంతకు వచ్చి 'నీ చింతకు కారణ మేమి?' అని ప్రశ్నించాడు! 'అదేదో నీవే చెప్పు' అని వ్యాసుడన్నాడు.

అపుడు నారదమహర్షి ఊరక ధర్మాలు చెప్పితే చాలదు, విష్ణుకథాప్రధానమైన గ్రంథం రచిస్తే కానీ నీకు మనశ్శాంతి లభించదంటాడు. ఆయన చెప్పినట్లు వ్యాసభగవానుడు భగవంతుని గుణ కర్మ నామాలను కీర్తించే విష్ణుకథలను వర్ణిస్తూ భాగవతం రచించాడు, మనశ్శాంతి పొందాడు. భాగవత రచనకు చెందిన వృత్తాంతమిది.

దీని కథాప్రారంభమిది-పాండవవంశంలో జన్మించిన పరీక్షిత్తు వేటకు వెళ్ళి, అలసిపోయి, తపోనిమగ్నుడైన శమీక మహర్షిని నీళ్ళిమ్మంటాడు. నిర్వికల్పధ్యానంలో ఉన్న ఆ ముని కతని మాట వినిపించదు. కోపించిన రాజు అతని మెడలో సర్పశవాన్ని వేసి శృంగిశాపానికి గురి అవుతాడు. వారం దినాలలో మరణించవలసిన దుఃస్థితి పాలవుతాడు.

అంతట రాజకార్యాలు త్యజించి ప్రాయోపవిష్టుడై ఏడు దినాలలో ముక్తి పొందే ఉపాయమేమి? అని విచారిస్తాడు. అపుడు శుకుడు వచ్చి అందుకు ఉపాయం భాగవత శ్రవణమే అని చెప్పి భాగవత ప్రవచనం కావిస్తాడు.

ఇందులో ధ్రువుడు, జడభరతుడు, అజామిళుడు, దధీచి, ప్రహ్లాదుడు, గజేంద్రుడు, అంబరీషుడు, రంతిదేవుడు మున్నగు భాగవతుల కథలు మనోజ్ఞంగా వివరింపబడివున్నాయి. ఆ కథల ద్వారా విజ్ఞానవైరాగ్యభక్తివిశేషాలు నిరూపితాలయ్యాయి.

దశమస్కంధం ఇందులో అతిముఖ్యమైనది. శ్రీకృష్ణావతార ప్రతిపాదకమైన ఇందులో శ్రీకృష్ణుని లీలలు, ఆయన కావించిన కంసాదుల సంహారం, రుక్మిణీ కల్యాణం, కుచేలాదుల ఉద్ధరణ-ఇత్యాదిగా పలు అంశాలు రసవత్తరంగా చిత్రించబడినాయి.

ముఖ్యంగా గోపికలు కృష్ణుణ్ణి ప్రేమించిన ఘట్టం మనోహరంగా ఉన్నది. మధురభక్తితత్త్వం ఇందులో ప్రతిపాదితమయింది.

పదకొండవ స్కంధంలోని ఉద్ధవగీత ప్రశస్తం. శ్రీకృష్ణుడు అవసానదశలో గావించిన ఆధ్యాత్మిక ప్రబోధమిది. చివరి స్కంధంలో కలి స్వరూపం నిరూపించబడింది. మార్కండేయ చరిత్రను గూడా ఇందులో చూడవచ్చు.

**'విద్యావతాం భాగవతే పరీక్షా'** అన్నట్లు విద్యావంతుల జ్ఞానవిజ్ఞానాలను భాగవతం ద్వారా పరీక్షించవచ్చు. భగవన్నామసంకీర్తనం సర్వపాపప్రణాశకమని భాగవతం చెప్పింది. భారతావనిలో జన్మించి గూడా భాగవతం విననివారు ఆత్మఘాతకులని పేర్కొనబడ్డారు.

**భారతే మానవం జన్మ ప్రాప్య భాగవతం న యైః ।**
**శ్రుతం పాపపరాధీనైరాత్మఘాతస్తు తైః కృతః ॥**

భాగవత శ్రవణ ఫలం ఈ క్రిందిశ్లోకంలో ఇలా పేర్కొనబడింది.

**మత్కథావాచనే నిత్యం మత్కథాశ్రవణే రతమ్ ।**
**మత్కథాప్రీతమనసం నాహం త్యక్ష్యామి తం నరమ్ ॥**

'నా కథలు పఠించేవాడు, వినేవాడు, నా కథలచే సంతోషించేవాడు అయిన జనుణ్ణి నేను వదలను' అని శ్రీకృష్ణుడు చెప్పాడు.

## 6. నారదపురాణం

మహావిష్ణువుయొక్క నాభిస్థానంగా కీర్తింపబడిన పురాణమిది. నారదుడు ఉపదేశించినది కావడం వల్ల 'నారద పురాణం' అనే పేరు దీనికి స్థిరపడింది. ఇందులో 25,000 వేల శ్లోకాలున్నాయి.

పూర్వఖండం, ఉత్తరఖండం అని ఈ పురాణం రెండు ఖండాలుగా విభక్తమై యున్నది. పూర్వఖండంలో 125, ఉత్తరఖండంలో 82 అధ్యాయాలు ఉన్నాయి.

పురాణాల ప్రశస్తి. శివకేశవుల అభేదం, భక్తికి గల ప్రాముఖ్యం, సదాచార ప్రాశస్త్యం, పౌరాణికుల గురుత్వం-ఇత్యాదులు ఇందులో చక్కగా కీర్తితాలయ్యాయి.

సత్యహరిశ్చంద్రుని గాథ ఇందులో ఉన్నది. అట్లే శ్రీకృష్ణుని ప్రభావం చక్కగా పేర్కొనబడివున్నది. బ్రహ్మాండోత్పత్తి ఎలా జరిగిందో ఇందులో చూడవచ్చు.

విష్ణుభక్తికి గల ప్రాముఖ్యాన్ని వర్ణించే ఈ పురాణంలోని క్రిందిశ్లోకం గమనార్హమై యున్నది-

**లోకే స ధన్యః స శుచి స్స విద్వాన్ స ఏవ వక్తా స చ ధర్మశీలః ।**
**జ్ఞాతా స దాతా స చ సత్యవక్తా యస్యాస్తి భక్తిః పురుషోత్తమాఖ్యే ॥**

పురుషోత్తమునిపై భక్తి గలవాడే లోకంలో ధన్యుడు, శుచి, విద్వాంసుడు, ధర్మశీలుడు, జ్ఞాత, దాత, సత్యవక్త అని భావం. భక్తిలేనివాని గుణాలు విలువలేనివని తాత్పర్యం.

ఒక్క భక్తినే కాక తీర్థయాత్రలో సేవించవలసిన తీర్థాల ప్రాశస్త్యాన్ని గూడా ఈ పురాణం విశదీకరించింది. అయోధ్య, మధుర, మాయ, కాశి, కంచి, అవంతిక, ద్వారక-ఈ ఏడు నగరాలు మోక్షప్రదాలని ఈ పురాణం ఉద్ఘాటించింది.

రాజధర్మాలను గూడా ఈ పురాణం వివరించింది. ప్రజారక్షణ, శత్రుసంహారం, న్యాయబద్ధంగా పన్నులు వసూలు చేయడం, గోరక్షణ, అన్న-వస్త్ర గృహాలు అనే కనీసపు సౌకర్యాలను ప్రజలకు కల్గించడం, మద్యనిషేధం-మున్నగు రాజుల కర్తవ్యాలు గూడా ఇందులో నిర్దేశింపబడివున్నాయి.

పరులపై దౌర్జన్యం, వారిని హింసించడం మున్నగు పది పాపాలు పరిహరణీయాలు. వాటి వినాశానికే, 'దశహరా' అని పేరు. దానికి ప్రతీకగానే నేటికీ 'దశరా' పండుగ జరుపుకొంటున్నాము.

భర్తృహరి సుభాషితంవంటి గ్రంథాలలో మనం ఎన్నో సుభాషితాలు చదువుతుంటాం. వాటిని పోలిన పలు సుభాషితాలను మనం ఈ నారదపురాణంలో గూడా చూడవచ్చు.

**యః శృణోతి నరో భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।**
**స యాతి బ్రహ్మణో ధామ నాత్ర కార్యా విచారణా ॥**

అని ఫలశ్రుతి. ఎవడు భక్తితో ఈ పురాణాన్ని వింటాడో, లేదా వినిపిస్తాడో, అతడు బ్రహ్మలోకం చేరుతాడు. ఇందుకు సందేహం లేదు.

## 7. మార్కండేయపురాణం

మునులు తమ సందేహాలను మార్కండేయ మహర్షికి తెల్పగా ఆయన వారి సంశయాలు తొలగిస్తూ చెప్పిన పురాణమిది. విష్ణు భగవానుని దక్షిణపాదంగా ఇది కీర్తింపబడింది. ఇందులో 134 అధ్యాయాలు, 9,000 వేల శ్లోకాలు ఉన్నాయి.

బలరాముని తీర్థయాత్రలు, హరిశ్చంద్రుని వృత్తాంతం, పతివ్రతాస్త్రీల ప్రభావం, కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుని అనుగ్రహం పొందడం, రాజధర్మాలు, యోగశాస్త్రవిషయాలు, ఓంకారనిరూపణ, బ్రహ్మాండోత్పత్తి, దేవీమాహాత్మ్యం, సూర్యవంశవర్ణన ఇత్యాదిగా గల వివిధ విషయాలు ఈ పురాణంలో నిరూపించడమయింది.

దుర్గాదేవి జనుల ననుగ్రహించి వారి కోర్కెలు తీర్చే దేవత. ఆ దేవిని ఆరాధించడంలో సప్తశతీపారాయణం ముఖ్యకర్తవ్యం. ఆ సప్తశతి ఈ పురాణంలోని భాగమే. దేవీనవరాత్ర్యుత్సవాలలో సప్తశతిని పారాయణం చేస్తారు.

మహిళామణులలో కొందరు మహాయోగిను లున్నారు. వారిలో మదాలసాదేవి ఒకరు. ఈమెకు సంబంధించిన అద్భుతమైన చరిత్ర ఈ పురాణంలో అతి విపులంగానూ, రమణీయంగానూ నిరూపింపబడివున్నది.

ఋతధ్వజుడనే రాజుయొక్క ధర్మపత్ని మదాలస. ఈమెకు విక్రాంతుడు, సుబాహుడు, అరిమర్దనుడు, అలర్కుడు-అని నల్గురు కుమారులు. ఆమె ఉగ్గుబాలతోపాటు మొదటి ముగ్గురికీ బ్రహ్మవిద్యను గూడా బోధించింది. వారు అధ్యాత్మవిద్యలో ఆరితేరి సంసారవిరక్తులవుతారు. ఋతధ్వజుడు నాల్గవ కుమారుణ్ణి తల్లి వద్ద అధ్యాత్మవిద్యనభ్యసింపనీకుండా లౌకికవిద్యలు బోధించే ఏర్పాటు చేస్తాడు. అవసానదశలో ఆమె అతణ్ణి కూడా సత్సంగప్రభావముతో తత్త్వవేత్తగా రూపొందేటట్లు చేస్తుంది. ఇది ఆ కథా సంగ్రహ సారాంశం.

విష్ణువుయొక్క నాల్గు రూపాలు వాసుదేవ-శేష-ప్రద్యుమ్న-అనిరుద్ధములని ప్రసిద్ధాలు. వీటికి సంబంధించిన వివరణ కూడా ఈ పురాణంలో వస్తుంది.

ఇక ధర్మపక్షులుగా ప్రసిద్ధి వహించిన పక్షుల వృత్తాంతం గూడా మార్కండేయపురాణంలో పేర్కొనబడివున్నది. జైమినిమహర్షి తనకు గల్గిన సంశయాల నన్నింటినీ ఈ పక్షులద్వారానే తొలగించుకొంటాడు.

ఈ పురాణం పుత్రులను మూడురకాలుగా విభజించింది. తండ్రినుండి సంక్రమించిన కీర్తినీ, ధనాన్నీ పెంపొందించేవాడు ఉత్తముడు. పెంపొందించకున్నా పోగొట్టకుండా ఉండేవాడు మధ్యముడు. పోగొట్టుకొనేవాడు అధముడు. ఎంతో చక్కని ప్రబోధమిది.

తండ్రిపేరు చెప్పుకొని కాలం గడపువాడు వ్యర్థజన్ముడు. తండ్రికి కీర్తి తెచ్చేవాడు ఉత్తముడు. ఇలాంటి విషయాలు యుక్తియుక్తంగా ఆసక్తిజనకంగా ఇందులో వివరించబడి వున్నాయి.

**శ్రుత్వా తత్పూజయేద్యస్తు పురాణం సప్తమం పునః ।**
**సర్వపాపవినిర్ముక్తః పునాత్యేవ నిజం కులమ్ ॥**

అని ఫలశ్రుతి. ఇది విని దీనిని పూజించేవాడు సకలపాపవిముక్తుడై తన కులాన్ని పావనం చేస్తాడు.

## 8. అగ్నిపురాణం

అగ్నిదేవుడు వసిష్ఠమహర్షికి ఉపదేశించినదే అగ్నిపురాణం. ఇది విష్ణుదేవుని ఎడమపాదంగా వర్ణింపబడింది. ఇందులో 383 అధ్యాయాలు, 15,400 శ్లోకాలు ఉన్నాయి.

దశావతారాలు ఇందులో వర్ణింపబడ్డాయి. మరియు రామాయణ మహాభారతాలలోని కొన్ని ఘట్టాలు ఇందులో కనిపిస్తాయి.

దేవాలయ నిర్మాణం, సాలగ్రామలక్షణాలు, సూర్యపూజ, శివపూజ, వాస్తుపూజ, చతురాశ్రమధర్మాలు ఈ పురాణంలో పేర్కొనబడివున్నాయి. పలురకాల వ్రతాలు, రాజధర్మాలు, స్వప్న ఫలితాలు, స్త్రీ పురుష లక్షణాలు, ఆయుర్వేద విషయాలు, అద్వైతవేదాంతతత్త్వం ఇత్యాదిగా గల పలువిషయాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

కూర్మావతారవర్ణన సందర్భంలో విష్ణువు దేవతలకు ఎలా ఉపకరించాడో ఇక్కడ మనోజ్ఞంగా చెప్పడమయింది.

ఇక రామాయణ ఘట్టాలలో సుగ్రీవుడు సీతాన్వేషణ విషయంలో అశ్రద్ధ చూపినప్పుడు రాముడతనికి పంపిన తీక్ష్ణపదజాలంతో కూడిన సందేశం పాఠకులలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. రామాయణంలో సీతాపహరణకు రావణుడు మారీచుణ్ణి ప్రేరేపించినప్పుడు మారీచుడు చెప్పిన ఈ క్రిందిశ్లోకం గమనార్హం.

**రావణాదపి మర్తవ్యం మర్తవ్యం రాఘవాదపి ।**
**అవశ్యం యది మర్తవ్యం వరం రామాన్న రావణాత్ ॥**

"రావణుని ఆజ్ఞ పాటించకుంటే అతనినుండి చావు తప్పదు. పాటిస్తే రామునిచేత మరణం తప్పదు. రావణునికన్న రామునిచేత మరణించడమే మేలు" అని భావం. ఇలా రామాయణ భారతాదులలోని కొన్ని ఘట్టాలు ఈ పురాణాల్లో కనిపిస్తాయి.

భగవంతు డనే పదానికి ఈ క్రింది శ్లోకంలో ఇచ్చిన నిర్వచనం అర్థవంతంగా ఉంది.

**ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానామాగతిం గతిమ్ ।**
**వేత్తి విద్యామవిద్యాం చ స వాచ్యో భగవానితి ॥**

సృష్టిస్థితిలయాలు, జీవుల జననమరణాలు, విద్యా విద్యల స్వరూపం సమగ్రంగా ఎరిగినవాడే భగవంతుడు.

ఇక దేవాలయ నిర్మాణానికి చెందిన విశేషాలు కూడా ఈ పురాణంలో లభిస్తున్నాయి. ఆలయనిర్మాణం వల్ల బ్రహ్మహత్యాది దోషాలు కూడా తొలగిపోతాయని చెప్పడం విశేషం.

ఈ పురాణంలో కథలకు అంతగా ప్రాముఖ్యం లేదు కాని విద్యలు, పదార్థ లక్షణాలు, శుభాశుభస్వప్నాలు, శకునాలు, ఇవి మొదలుగాగల అనేక విషయాలు నిరూపింపబడి వున్నాయి. వివిధ శాస్త్రాలకు చెందిన విషయాలు ఇందులో ఉండడం వల్ల ఇదొక విశిష్టమైన పురాణంగా ప్రశంసింపబడుతున్నది. దీని ఫలశ్రుతి యిది–

**'ఆగ్నేయం పఠితం ధ్యాతం శుభం స్యాద్భుక్తిముక్తిదమ్'**

ఈ ఆగ్నేయ పురాణాన్ని చదివినా, ధ్యానించినా భుక్తిముక్తులు చేకూరుతాయని, శుభం కలుగుతుందని చెప్పడమయినది.

## 9. భవిష్యపురాణం

విష్ణుదేవుని కుడిమోకాలితో పోల్చబడిన ఈ పురాణంలో 14,500 శ్లోకాలున్నాయి. ఇందలి అధ్యాయాల సంఖ్య 585.

సృష్టివివరణ, పురాణాల ఉత్పత్తి, షోడశసంస్కారాలు. సావిత్రీమాహాత్మ్యం, స్త్రీలక్షణాలు, వివిధ వ్రతాలు ఇందులో వివరించడమయినది. రథసప్తమీ మాహాత్మ్యం, సూర్యుని ప్రభావం, ప్రతిమాలక్షణాలు, ధర్మస్వరూపం, జీమూతవాహనాదుల చరిత్రలు, అన్నదానప్రశస్తి మున్నగు విషయాలు అతివిస్తృతంగా ఇందులో వర్ణించడం జరిగింది.

భర్తపట్ల భార్య, భార్యపట్ల భర్త ప్రవర్తించవలసిన తీరుతెన్నులు చక్కగా ప్రతిపాదింపబడినాయి. సూర్యప్రభావవర్ణనా సందర్భంలో రాజు, దొంగలు, గ్రహాలు, పాములు, పేదరికం, దుఃఖాలు–ఇవేవీ సూర్యానుగ్రహం పొందిన వారిని బాధించవు అని చెప్పడం విశేషం.

ఇక జీవితంలో అతిముఖ్యమైన వివాహాన్ని గురించి వివరిస్తూ సమస్థాయిగలవారిలో జరిగే వివాహాలు శుభకరాలని, తదితరవివాహాలు దుఃఖదాయకాలని ఈ పురాణం చెప్పింది. స్మృతులలో పేర్కొనబడిన వివిధ వివాహభేదాలు ఇందులో ప్రతిపాదింపబడివున్నాయి. సామాజిక జీవితంలో అత్యావశ్యకాలైన వివాహాది విషయాలను ఈ పురాణంలో ప్రతిపాదించడంవల్ల సంఘశ్రేయస్సుపట్ల పురాణకర్తకు కల అభినివేశమెట్టిదో వ్యక్తమవుతున్నది.

అన్నదాన ప్రాశస్త్యాన్ని పేర్కొంటూ–

**"అన్నం వై ప్రాణినాం ప్రాణా అన్నమోజో బలం సుఖమ్ ।**
**ఏతస్మాత్కారణాత్సద్భిరన్నదః ప్రాణదః స్మృతః ॥**

ప్రాణులకు అన్నమే ప్రాణం. అన్నమే ఓజస్సు, బలం, సుఖం. అందుచేత అన్నదాత ప్రాణదాతగా పేర్కొనబడినాడు. ఈ పురాణంలో మరొక విశేషం విక్రమాదిత్యుడికీ, బేతాళునికీ సంబంధించిన కథలు. ఈ కథలు మిక్కిలి లోకప్రసిద్ధి వహించాయి. కథలలో జీవితంలో ఎదురయ్యే గడ్డు సమస్యలను పరిష్కరించే నైతికసూత్రాలు మనోజ్ఞంగా నిరూపింపబడివున్నాయి.

ఈ పురాణానికి ఫలశ్రుతిని వివరిస్తూ గ్రంథకర్త ఇలా అన్నాడు–

**యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే మానవో నృప! ।**
**అశ్వమేధఫలం ప్రాప్య గచ్ఛేద్భానుం న సంశయః ॥**

ఈ పురాణం వింటే సకలపాపవిముక్తి చేకూరుతుంది. అశ్వమేధయాగఫలం లభిస్తుంది. చివరికి సూర్య సాయుజ్యప్రాప్తి కలుగుతుంది.

## 10. బ్రహ్మవైవర్తపురాణం

సావర్ణిమనువు నారదమునీంద్రునికి చెప్పిన పురాణమిది. ఇందులో వరాహమూర్తికి, శ్రీకృష్ణునికి సంబంధించిన విషయాలు ప్రధానంగా ప్రతిపాదించబడివున్నాయి. ఈ పురాణం శ్రీమహావిష్ణువుయొక్క ఎడమ మోకాలుగా కీర్తింపబడింది.

బ్రహ్మఖండం, ప్రకృతిఖండం, గణేశఖండం, శ్రీకృష్ణఖండమని నాలుగు ఖండాలుగా ఇది విభజింపబడివున్నది. అన్ని ఖండాలలోను కలిపి మొత్తం 18,000 వేల శ్లోకాలున్నాయి. **'సారభూతం పురాణేషు బ్రహ్మవైవర్తముచ్యతే'** అన్నట్లు ఈ పురాణం పురాణా లన్నింటికీ సారభూతమైనదిగా ప్రశస్తి పొందింది.

బ్రహ్మఖండంలో పరబ్రహ్మవర్ణన చేయబడింది. ప్రకృతిఖండంలో దుర్గాదేవి మున్నగు స్వరూపాలతో ప్రకృతి ఆవిర్భవించడం నిర్దేశించబడింది. గణేశఖండంలో వినాయక చరిత్ర నిబద్ధమైనది. శ్రీకృష్ణఖండంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మస్థాపన మొదలగు అంశాలు పేర్కొనబడ్డాయి.

అతిథిని పూజించవలసిన అవశ్యకతను వివరిస్తూ ఈ పురాణం చెప్పిన విషయమిది–

**అపూజితోఽతిథిర్యస్య భవనాద్వినివర్తతే ।**
**పితృదేవాగ్నయః పశ్చాద్గురవో యాన్త్యపూజితాః ॥**

ఏ గృహస్థుని యింట అతిథి ఆదరింపబడడో ఆ యింటినుండి పితరులు, దేవతలు, అగ్నిదేవుడు, గురువులు పూజలను తిరస్కరించి వెళ్ళిపోతారని భావం.

ఇక జన్మకారణమైన తండ్రితోపాటు విద్యాదాత, అన్నదాత, భయమునుంచి కాపాడినవాడు, కన్యాదాత– ఈ నలుగురు కూడ తండ్రులుగానే పేర్కొనబడ్డారు. అట్లే సేవకుడు, శిష్యుడు, పోషితుడు, ఔరసుడు, శరణాగతుడు– ఈ ఐదుగురు పుత్రులుగానే పరిగణింపదగి ఉన్నారు.

ఈ గ్రంథంలో మొదటి పురుషార్థమైన ధర్మముయొక్క ప్రాశస్త్యం ఈ క్రిందివిధంగా ఉగ్గడింపబడింది–

**నాస్తి ధర్మాత్పరో బన్ధుర్నాస్తి ధర్మాత్పరం ధనమ్ ।**
**ధర్మాత్ప్రియతరః కో వా స్వధర్మం రక్ష యత్నతః ॥**

"ధర్మంకంటే శ్రేష్ఠుడైన బంధువు లేదు. మేలైన ధనం లేదు. ధర్మంకంటే ప్రియతరమైన దేదీ లేదు. కాన ప్రయత్నంతో ధర్మాన్ని రక్షించాలి." అని భావం. అట్లే మరొక చోట గురువులో సకలదేవతలూ ఉన్నారని గురుమహిమ ప్రశంసింప బడినది.

పై విషయాలతోపాటు భగవంతుని స్వరూపం, సరస్వతీపూజ, భూదానప్రాశస్త్యం, గంగావతరణం, సంక్షిప్త రామాయణం, తులసీమాహాత్మ్యం, దుర్గోపాఖ్యానం మొదలైన విషయాలు కూడా ఈ పురాణంలో వివరింపబడి వున్నాయి.

ఈ గ్రంథంలో పేర్కొన్న కథలలో ముఖ్యంగా పేర్కొనదగినది వేదవతీ చరిత్ర. కృతయుగంలో వేదవతిగా, త్రేతాయుగంలో సీతగా, ద్వాపరయుగంలో ద్రౌపదిగా వేదవతిని పురాణం వర్ణించింది. తదుపరి పురాణాల కథలలో ఈ వేదవతియే పద్మావతిగా అవతరించి విష్ణుని రూపాంతరమైన వేంకటేశ్వరుణ్ణి చేపట్టినట్లు చెప్పడమయినది.

కశ్యపమహర్షిమానసపుత్రిక జరత్కారువుయొక్క స్తుతి కూడా ఈ పురాణంలోనే లభిస్తున్నది.

**శుభదం పుణ్యదం చైవ విఘ్నవిఘ్నకరం పరమ్ ।**
**హరిదాస్యప్రదం చైవ పరలోకే ప్రహర్షదమ్ ॥**

ఇత్యాదిగా ఈ పురాణ పఠనం శుభాన్నీ, పుణ్యాన్నీ, విఘ్నవినాశాన్నీ, హరిదాస్యాన్నీ, పరలోకంలో సంతోషాన్నీ ప్రసాదిస్తుంది అని చెప్పడమైనది.

## 11. లింగపురాణం

అగ్నిలింగంలో అంతర్గతుడైవున్న శివుడు ఉపదేశించినదే లింగపురాణం. ఇది విష్ణుదేవుని కుడిచీల మండతో పోల్చబడింది. శివుని ప్రభావాన్ని వర్ణించే ఈ పురాణంలో 11,000 వేల శ్లోకాలున్నాయి. ఇది పూర్వార్ధమనీ, ఉత్తరార్ధమనీ రెండు భాగాలుగా ఉన్నది. పూర్వార్ధంలో 108, ఉత్తరార్ధంలో 55 కలిపి మొత్తం 163 అధ్యాయాలున్నాయి.

శివుని అవతారాలను ఈ పురాణం విరివిగా వర్ణిస్తున్నది. అందుచేత శైవులు ఈ పురాణాన్ని ప్రముఖంగా ఆదరిస్తారు. అష్టాంగయోగ సహితమైన శివారాధన, విష్ణువు కావించిన శివస్తోత్రం, బ్రహ్మజననం,

లింగార్చనావిధానం, శివునికి చెందిన మానసపూజ, యుగధర్మాలు, సప్తద్వీపాలు, సప్తసాగరాలు, దిక్పాలకుల నగరవర్ణన, చంద్రవంశరాజుల వృత్తాంతం, త్రిపురాసురసంహారం, కైలాసగిరివర్ణన, సదాచారం ఇత్యాదిగా పలు విషయాలు ఈ పురాణంలో అతివిస్తృతంగా ప్రతిపాదింపబడివున్నాయి.

ఇందలి ఉత్తరార్ధంలో పృథివి, జలం, అగ్ని, వాయువు మొదలగు అష్టవిధాలైన శివుని మూర్తుల వివరణ వున్నది. శివభక్తిని ప్రతిపాదించే కథలు కూడా ఈ పురాణంలో  చోటు చేసుకొనివున్నాయి.

మృత్యువు సమీపించిన శ్వేతుడు అనే శివభక్తుడు శివుని అనుగ్రహంచేత మరణంనుంచి తప్పించుకొనిన కథ శివారాధనవల్ల కలిగే ఫలితాన్ని వివరిస్తున్నది.

ఇక కాశీక్షేత్రమహిమ ఇందులో విస్తారంగా ప్రతిపాదితమయింది.

**కామం భుంజన్ స్వపన్ క్రీడన్ కుర్వన్హి వివిధాః క్రియాః ।**
**అవిముక్తే త్యజేత్ ప్రాణాన్ జంతుర్మోక్షాయ కల్పతే ॥**

భుజిస్తూ, నిద్రిస్తూ, క్రీడిస్తూ, యథేచ్ఛగా వివిధక్రియలాచరిస్తూ కూడ ఈ క్షేత్రంలో మరణిస్తే మోక్షం సిద్ధిస్తుందని ఇందులో చెప్పడమయినది.

అష్టదిక్పాలకులుగా ఇంద్రాదులు ప్రసిద్ధులు. వారు నివసించే నగరాలు క్రమంగా 1. అమరావతి 2.తేజస్విని 3.వైవస్వతి 4.కృష్ణవర్ణ 5. శుద్ధవతి, 6.గన్ధవతి 7.అలక 8.యశోవతి – అనేవి ఈ పురాణంలో పేర్కొనబడ్డాయి.

ఇది శైవపురాణం కాన శివపూజామాహాత్మ్యాన్ని ఘనంగా కీర్తిస్తున్నది. శివానుగ్రహంతోనే పరాశరుడు ఎన్నడో మరణించిన తన తండ్రిని, పినతండ్రులను చూస్తాడు. ఇట్టి విశిష్టమైన కథలతోను, వర్ణనలతోనూ సాగిపోయే లింగపురాణం చాలా ప్రభావోపేతమైనది.

మంచినీతులు చెప్పిన సందర్భాలు కూడా ఈ పురాణంలో లేకపోలేదు. భోగాశను నిరోధించాలనీ, విషయ విచారణచేత అది సాధ్యమనీ, మనోవాక్కాయాలతో వైరాగ్యాన్ని పాటించాలనీ చెప్పే ఈక్రింది శ్లోకం గమనార్హం–

**భోగేన తృప్తిర్నైవాస్తి విషయాణాం విచారతః ।**
**తస్మాద్విరాగః కర్తవ్యః మనసా కర్మణా గిరా ॥**

ఈ పురాణపఠన ప్రయోజనాన్ని ఈ క్రిందిశ్లోకం ఇలా చెప్పింది–

**యః పఠేచ్ఛృణుయాద్వాఽపి లైంగం పాపహరం నరః ।**
**స భుక్తభోగో లోకేఽస్మిన్నన్తే శివపురం వ్రజేత్ ॥**

పాపహరమైన ఈ పురాణాన్ని చదివేవారు, వినేవారు ఈ లోకంలో ఉన్నంతకాలం సకల భోగాల ననుభవించి కడపట కైలాసం చేరుకోగలరు.

## 12. వరాహపురాణం

వరాహావతారధారియైన విష్ణుదేవుడు భూదేవికి చెప్పిన పురాణమే వరాహపురాణం. ఇందులో 24,000 వేల శ్లోకాలున్నాయి. విష్ణువుయొక్క ఎడమ చీలమండతో ఈ పురాణాన్ని పోల్చడమయింది. ఇందలి అధ్యాయాల సంఖ్య 215.

నానావిధ సృష్టులు, నారదమునీంద్రుని పూర్వజన్మచరిత్ర, విష్ణుభగవానుని అష్టమూర్తులు, ధర్మవ్యాధుని చరిత్ర, దక్షయాగధ్వంసం, పార్వతీజననం, వినాయకుని పుట్టుక, వివిధవ్రతాలు, వాటి ఫలితాలు, నాలుగు యుగాలు, అన్నదానప్రాశస్త్యం, వరాహస్వామి భూదేవిని ఉద్ధరించడం, నాచికేతుని వృత్తాంతం ఇత్యాదిగా పలువిషయాలు ఈ పురాణంలోని అంశాలుగా ఉన్నాయి.

అష్టాదశపురాణాల క్రమమూ, వివరణ గూడా ఇందులో నిర్దేశింపబడివున్నది. మహావిష్ణువు తన భక్తులకు అంగరక్షకుడై ఉంటాడన్న విషయం ఈ గ్రంథంలో చెప్పడమయింది.

శ్రీకృష్ణుడు గీతలో **'మమ మాయా దురత్యయా'** అని అంటాడు. 'నా మాయ దాటరానిది' అని దీని అర్థం. భూదేవి 'మాయ' అంటే ఏమిటి? దాని స్వరూపం వివరించుమని విష్ణువును అడుగుతుంది. అందుకా దేవుడు తన మాయాస్వరూపాన్ని ఈ పురాణంలో అతి విస్తృతంగా వివరిస్తాడు.

లోకంలో తరచు సంభవించే అతివృష్టి, అనావృష్టి మున్నగు విపరీత సంఘటనలు, మాయవల్లనే కల్గుతున్నాయనీ, సృష్టిలో క్రమబద్ధంగా జరిగే సూర్యోదయాదులు, పంచభూతాల ప్రవర్తన, మాయాప్రభావం వల్లనే ఏర్పడుతున్నాయనీ ఇక్కడ చెప్పడమయింది.

దానాలన్నింటిలో అన్నదానం ప్రశస్తమయింది. అట్లే మనం వాడే వివిధములైన లోహాలతో నిర్మించబడిన పాత్రలలో రాగిపాత్రలు మేలైనవి అని ఈ పురాణం నిరూపించింది.

ఇంకా ఈ పురాణంలో వివిధతీర్థాల ప్రభావం గూడా వర్ణింపబడివున్నది. ఏ తీర్థాన్ని ఎప్పుడు సేవిస్తే మంచిదో ఇక్కడ వివరించబడివున్నది.

విష్ణుమందిరాలలో సేవలు చేసే వారికి గలిగే ఫలమేమి? అన్న భూదేవి ప్రశ్నకు విష్ణువు అట్టి వివిధ సేవాఫలాలను వివరంగా పేర్కొంటాడు. సకల జగత్తుకు సత్యమే ఆధారం కాన, సత్యాన్ని తప్పక పాటించాలన్న సంగతి ఇందులో చెప్పడమయింది.

ఇక కఠోపనిషత్తులో నాచికేతుని వృత్తాంతం ఇందులో రమ్యంగా ప్రతిపాదితమయింది. ఇంకా ఎన్నో కథాంశాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

**శ్రుత్వా తు పూజయేద్యస్తు శాస్త్రం వారాహసంజ్ఞితమ్ ।**
**సర్వపాపవినిర్ముక్తో విష్ణుసాయుజ్యమాప్రజేత్ ॥**

అన్నట్లు దీన్ని ఎవరు శ్రవణం చేసి భక్తితో పూజిస్తారో, వారు సర్వపాపనిర్ముక్తులై విష్ణుసాయుజ్యం పొందుతారని ఫలశ్రుతి.

## 13. స్కాందపురాణం

స్కందుడనగా శివుని కుమారుడైన కుమారస్వామి. ఆ దేవుని పేరుతో ఈ పురాణం ప్రసిద్ధమయింది. శివుడు స్కందుణ్ణి ఉద్దేశించి చెప్పిన విషయమే ఈ స్కాందపురాణం. తండ్రినుండి విన్న ఈ పురాణాన్ని తరువాత స్కందుడు మునుల కుపదేశిస్తాడు.

**'ఏకాశీతిసహస్రం తు స్కాందం సర్వాఘకృంతనం'** – అన్నట్లు సకల పాపవిచ్ఛేదకమైన ఈ పురాణంలో 81,100 శ్లోకాలున్నాయి. దీన్ని బట్టి ఇతర పురాణాలకంటె ఇది ఆకృతిలో చాలా పెద్ద పురాణమని తెలుస్తున్నది.

మహావిష్ణుని వెండ్రుకలతో పోల్చబడిన ఈ గ్రంథంలో మహేశ్వరఖండం, వైష్ణవఖండం, బ్రహ్మఖండం, కాశీఖండం, అవంతీఖండం, నాగరఖండం, ప్రభాసఖండం అని ఏడు ఖండాలున్నాయి.

మహేశ్వరఖండంలో కేదారఖండం, కౌమారీ ఖండం, అరుణాచలమాహాత్మ్యం మొదలైన అంశాలున్నాయి. వైష్ణవఖండంలో వేంకటాచల–జగన్నాథక్షేత్రాల మాహాత్మ్యం, బ్రహ్మఖండంలో సేతు మాహాత్మ్యం, ధర్మారణ్య, బ్రహ్మోత్తరఖండాలున్నాయి. కాశీఖండంలో కాశీక్షేత్రప్రభావం విస్తృతంగా వర్ణింపబడి వున్నది. నాగరఖండంలో వివిధ తీర్థాల వర్ణన ఉన్నది. విశ్వకర్మోపాఖ్యానాది కథలు గూడా ఉన్నాయి.

ప్రభాసఖండంలో ద్వారకానగర పరిసరాల ప్రభావం వివరించబడివున్నది. సంహితారూపంలో గూడా ఈ స్కాందపురాణం ప్రసిద్ధమైవున్నది.

సనత్కుమారసంహిత, సూతసంహిత, శంకరసంహిత, వైష్ణవసంహిత, బ్రహ్మసంహిత, సౌరసంహిత అనేవే ఈ సంహితలు.

సూతసంహితలో శివోపాసనాప్రాముఖ్యం కీర్తింపబడివున్నది. కాశీక్షేత్రప్రభావాన్ని వర్ణించే కాశీఖండంలో అయోధ్యాదిక్షేత్రాలలో మరణించినవారు స్వర్లోకసుఖం అనుభవించి తరువాత కాశిలో జన్మించి అక్కడ ముక్తు లవుతారని చెప్పడం విశేషం. **'కాశ్యాం తు మరణాన్ముక్తిః'** అన్న మాట గూడా ప్రసిద్ధం.

జీర్ణదేవాలయోద్ధరణ చేసేవారికి కలిగే ఫలాన్ని గూడా ఈ పురాణం వివరించింది. సత్యనారాయణ వ్రతస్వరూపం ఇందలి రేవాఖండంలో నిరూపితమయింది.

ఇంకను రామావతారం, క్షీరసాగరమథనం, గిరిజా కల్యాణం, కుమారోత్పత్తి, ఓంకారప్రభావం, 14 మంది మనువుల వర్ణన ఇత్యాద్యంశాలు ఇందులో గోచరిస్తాయి. అంతే కాక వనభోజనం, కార్తికవైభవం, ఉసిరిక విశిష్టత, ఇత్యాదివిషయాలు గూడా గమనింపదగి వున్నాయి.

**సర్వేషామేవ ధర్మాణాం గురుపూజా పరా మతా ।**
**గురుశుశ్రూషయా సర్వం ప్రాప్నోతి హి న సంశయః ॥**

అన్ని ధర్మాలలోనూ గురుపూజ మేలైన ధర్మం. గురుసేవచేత అన్ని ఫలితాలూ పొందవచ్చు అని గురుసేవా ప్రాశస్త్యం పేర్కొనబడింది. రుద్రాక్ష మహిమ కథాకథన పూర్వాంకంగా ఇందులో వివరించబడింది.

పురాణ శ్రవణ ఫలాన్ని ఈ పురాణం 136 శ్లోకాలలో వివరించింది. జ్ఞానదీపాలుగా, భవరోగౌషధాలుగా పురాణాలిందులో కీర్తింపబడివున్నాయి.

## 14. వామనపురాణం

బ్రహ్మదేవుడు వామనావతార ప్రభావాన్ని కీర్తిస్తూ చెప్పినదే వామనపురాణం. మహావిష్ణుని చర్మంతో దీన్ని పోల్చారు. ఇందలి 10,000 వేల శ్లోకాలు, అధ్యాయాలు 95.

వైష్ణవధర్మ ప్రతిపాదకమైన ఈ పురాణంలో విష్ణుమందిరాలు, విష్ణుభక్తుల వృత్తాంతాలు అధికంగా కనిపిస్తాయి. ఉత్పత్తి ప్రళయాలు, కామదహనం, ప్రహ్లాదవరదానం, దేవీమాహాత్మ్యం, నానావిధ తీర్థాలు, వినాయక విజయం ఇత్యాద్యంశాలు ఈ పురాణంలో వర్ణించబడివున్నాయి.

వివిధ దేవతలకు చెందిన 25 స్తోత్రాలు ఈ పురాణంలో లభిస్తాయి. దేవతలలో మహావిష్ణువు, ఆయుధాలలో సుదర్శనం, పక్షులలో గరుడుడు, సర్పాలలో వాసుకి, ఈ రీతిగా ఆయా వర్గాలలో మేలైనవారినీ, వస్తువులను కీర్తించే ఇందలి ఘట్టం ఆసక్తిజనకంగా ఉంటుంది.

లోకంలో ఎన్నో పాపాలున్నాయి, కాని అన్నింటినీ మించిన పాపం కృతఘ్నుత్వమని ఈ పురాణం చెబుతున్నది.

నిత్యమూ ఉదయం లేవగానే త్రిమూర్తులు, గ్రహాలూ, సప్తర్షులూ, సప్తలోకాలూ తనకు శుభావహాలు కావాలని ప్రార్థించాలని ఈ గ్రంథం బోధిస్తున్నది.

జీవితంలో ఎన్ని విపత్తు లెదురైనా, షండుడు, మార్జారుడు, ఆఖువు, కుక్కుటుడు, పతితుడు, అపవిద్ధుడు, నగ్నుడు, చండాలుడు, అధముడు–ఇట్టివారిని ఆశ్రయించరాదని ఇందులో చెప్పడమయింది.

మనుజుడు అవశ్యం ఆచరించవలసిన సదాచారాలను 122 శ్లోకాలలో ఈ పురాణం వివరించింది.

పుత్రుడు – శిష్యుడు–వీరిరువురిలో శ్రేష్ఠు డెవరు? అన్న ప్రశ్నకు ఇందులో బ్రహ్మ పుత్రునికంటె శిష్యుడే శ్రేష్ఠుడని సమాధానం చెబుతాడు.

**పున్నామ్నో నరకాత్త్రాతి పుత్రస్తేనేహ గీయతే ।**
**శిష్టపాపహరశ్శిష్య ఇతీయం వైదికీ శ్రుతిః ॥**

'పుత్' అనే నరకం నుండి మాత్రమే రక్షించువాడు పుత్రుడు కాగా తక్కిన సకల పాపాలనుండీ కాపాడేవాడు శిష్యుడని భావం.

పాపాలను దూరం చేసుకొనే విధానాన్ని ప్రతిపాదిస్తూ దానికి ఉదాహరణంగా ఇందులో కోశకారుని వృత్తాంతం చక్కగా వర్ణించబడింది. పూర్వజన్మకృతపాపాలు తరువాతి జన్మలో స్మరణకు వస్తాయని ఈ కథ ద్వారా తెలుస్తున్నది.

**యే పఠంతి చ శృణ్వంతి తేఽపి యాన్తి పరాం గతిమ్ ।**

అన్నట్లు ఈ వామనపురాణం చదివేవారు, వినేవారు ఉత్తమగతిని పొందుతారని ఫలశ్రుతి.

## 15. కూర్మపురాణం

17,000 వేల శ్లోకాలు గల కూర్మపురాణం విష్ణువు యొక్క పృష్ఠంగా వర్ణించబడింది. పూర్వార్ధం, ఉత్తరార్ధం అని రెండు విభాగాలుగా ఉన్న ఈ పురాణంలో 53+46=99 అధ్యాయాలున్నాయి.

కూర్మరూపంలో ఉన్న విష్ణుదేవుడు మహర్షుల నుద్దేశించి చెప్పిన పురాణమిది. లక్ష్మి-ఇంద్రద్యుమ్నుల సంవాదం, విష్ణువు-మహర్షులకు జరిగిన సంవాదం, సృష్టివిధానం, వర్ణాశ్రమాలు, భృగువంశవర్ణన, యుగధర్మాలు, కాశీప్రయాగక్షేత్రాల మాహాత్మ్యం, సదాచారాలు, ద్వాదశాదిత్యుల వర్ణన-ఇత్యాదిగా గల అనేకాంశాలు ఈ పురాణంలో ఉన్నాయి.

మరీచి, భృగువు, అంగిరసుడు, పులస్త్యుడు. పులహుడు, క్రతువు, దక్షుడు, అత్రి, వసిష్ఠుడు-అనే తొమ్మిదిమంది బ్రహ్మపుత్రులుగా ఇందు పేర్కొనబడినారు. మొదటికాలంలో ప్రజలు సుఖసంతోషాలతో వుండేవారనీ, క్రమంగా రాగద్వేషాలు కారణంగా ప్రజలకు దుఃస్థితి ఏర్పడిందనీ ఈ పురాణం చెబుతున్నది.

ధర్మం ఆచరణీయమనీ, ధర్మంవల్లనే తక్కిన పురుషార్థాలు సిద్ధిస్తాయనీ ఈ పురాణం పేర్కొంటున్నది.

**ధర్మాత్సంజాయతే హ్యర్థో ధర్మాత్కామోఽభిజాయతే ।**
**ధర్మ ఏవాపవర్గాయ తస్మాద్ధర్మం సమాశ్రయేత్ ॥**

అనగా ధర్మంనుంచే అర్థ,కామ,మోక్షాలు సిద్ధిస్తాయి. కాన ధర్మాన్ని ఆశ్రయించాలి అని భావం.

శివకేశవులకు భేదం లేదని, భక్తులు ఏఏరూపాలను ఆరాధిస్తారో భగవంతుడు ఆయా రూపాలతోనే వారిని అనుగ్రహిస్తాడని ఈ పురాణంలో చెప్పిన విషయం భగవద్గీతలోని

**'యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహం'** అనే వచనానికి అనుగుణంగా ఉన్నది.

స్వధర్మాన్ని త్యజించి చేసే తీర్థయాత్రలవల్ల ప్రయోజనం శూన్యమనీ, దేవాలయాదులను మిక్కిలి పరిశుభ్రంగా ఉంచాలనీ, మూత్రవిసర్జనాదులతో అపరిశుద్ధం చేయరాదనీ, అలాచేయడం పాపహేతువనీ ఈ పురాణం హెచ్చరిస్తున్నది. పుణ్యక్షేత్రాల ప్రాశస్త్యం ఇందులో చక్కగా వివరించబడింది.

వేదాన్ని విభజించేవారు వేదవ్యాసు లనబడతారు. అట్టివారు 26మంది ఉన్నారనీ పరాశరపుత్రుడైన కృష్ణద్వైపాయనుడు చివరివాడనీ ఈ పురాణం చెప్పిన విషయం గమనార్హమై ఉన్నది.

ఇంకను సమాజంలో వున్నవారి కర్తవ్యాలు, గురువులవద్ద ఉండవలసిన తీరుతెన్నులు, పాపాత్ములతో చేసే సాంగత్యంవల్ల కలిగే దోషాలు-ఇత్యాది విషయాలు మిక్కిలి ఆసక్తిదాయకంగా ఈ పురాణంలో చెప్పడమయినది.

ఇందులో వామనావతారానికి సంబంధించిన చరిత్ర చాలా చక్కగా నిరూపించబడివున్నది. భక్తిప్రధానమైన దుర్జయు డనేవాని కథవంటి కొన్ని కథలు పాఠకులకు చక్కని చైతన్యం కలిగిస్తాయి. అట్టివి ఇందులో పలుకథలు వున్నాయి.

**ఏతత్కూర్మపురాణం తు చతుర్వర్గఫలప్రదమ్ ।**
**పఠతాం శృణ్వతాం నృణాం సర్వోత్కృష్టగతిప్రదమ్ ॥**

ఈ పురాణం చదివేవారికి, వినేవారికి చతుర్వర్గ ఫలాలు సిద్ధిస్తాయి. సర్వోత్కృష్టగతి కూడా కలుగుతుంది.

## 16. మత్స్యపురాణం

మహావిష్ణువు మత్స్యరూపుడై వైవస్వతమనువు నుద్దేశించి చెప్పిన పురాణమిది. విష్ణువుయొక్క మెదడుతో దీన్ని పోల్చడమైనది. ఇందులో 14,000 వేల శ్లోకాలున్నాయి. మొత్తం అధ్యాయాల సంఖ్య 283.

ఇందలి ముఖ్య విషయాలివి–మత్స్యావతారవర్ణన, అజాండసృష్టి, సూర్యచంద్రవంశాలు, గయాక్షేత్రవర్ణన, పురూరవుని చరిత్ర, కచదేవయానుల కథ, కార్తవీర్యార్జునుని వృత్తాంతం, కలిధర్మాలు మరియు కృష్ణాష్టమి, అక్షయ తృతీయ, కల్యాణసప్తమి మున్నగు పలువ్రతాల వర్ణన, సప్తద్వీపాల వివరణ, త్రిపురాసురవృత్తాంతం, తారక వృత్తాంతం మున్నగు విషయాలే కాక రాజధర్మాలు, చతుర్విధ దండోపాయాలు, స్వప్నఫలాలు, వామన వరాహావతారాల వర్ణన ఇత్యాదిగా గల విషయాలు ప్రతిపాదితాంశాలై వున్నాయి.

పుట్టిన ప్రతివాడూ పురుషార్థసాధనకై ప్రయత్నించాలి. అలా చేయనివాని జన్మ వ్యర్థమని ఈ పురాణం నొక్కి వక్కాణిస్తున్నది.

**లబ్ధ్వా జన్మ న యః కశ్చిద్ఘటయేత్పౌరుషం నరః ।**
**జన్మ తస్య వృథా భూతమజన్మా తు విశిష్యతే ॥**

శ్రాద్ధకాలంలో పితృదేవతలకు అన్నపానాదులు సమర్పించడాన్ని గూర్చిన విశేషవివరణ యిందులో కనిపిస్తున్నది. శ్రాద్ధ కర్మలు అవశ్యాచరణీయాలని ఇక్కడ పేర్కొనడమైనది.

ఇక కాలమానం గురించి ప్రస్తావిస్తూ బ్రహ్మ, శివుడు, విష్ణువు అను త్రిమూర్తులకు చెందిన వివిధ కాలమానాల విశ్లేషణ ఇందులో చేయబడింది.

1.భృగువు 2.అత్రి 3. వసిష్ఠుడు 4. విశ్వకర్మ 5.మయుడు 6. నారదుడు 7. నగ్నజిత్తు 8. విశాలాక్షుడు 9. పురందరుడు 10. బ్రహ్మ 11. కుమారుడు 12.నందీశుడు 13.శౌనకుడు 14. గర్గుడు 15. వాసుదేవుడు 16. అనిరుద్ధుడు 17. శుకుడు 18. బృహస్పతి అనే ఈ పదునెనిమిది మంది వాస్తుశాస్త్రోపదేశకులుగా ఇందులో పేర్కొనబడినారు.

తల,లలాటం మున్నగు అవయవాల కదలికవల్ల కలిగే ఫలాన్ని కూడా భగవంతుడు ఈ పురాణంలో చెప్పియున్నాడు.

ఇక పితృశ్రాద్ధంవల్ల కలిగే ఫలాన్ని వివరించే కౌశికుడనే విద్యావంతుడు, అతని ఏడుగురు కుమారులకు చెందిన విస్తృతమైన కథ ఇందులో కనిపిస్తున్నది. భక్తిశ్రద్ధలతో ఆచరించిన పితృశ్రాద్ధం గోహత్యను కూడా

పోగొడుతుందని ఈ కథలో నిరూపితమయినది. బ్రహ్మదత్తుని కథలో ఆడు చీమ, మగ చీమల మధ్య జరిగే సంభాషణ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది.

పతివ్రతల ప్రభావం గురించి చెప్పే ఈ క్రింది శ్లోకం వారిపట్ల గౌరవంతో వుండాలని హెచ్చరిస్తున్నది.

**పతివ్రతానాం వచనం ప్రకృష్టం తాసాం తు వాక్యం భవతీహ మిథ్యా ।**
**న జాతు లోకేషు చరాచరేషు తస్మాత్సదా తాః పరిపూజనీయాః ॥**

పతివ్రతల మాట శ్రేష్ఠమైనది. ఎప్పుడును వారి మాట మిథ్య కాదు. అందువల్ల వారు సదా పూజింపదగినవారు.

ఇక ఫలశ్రుతి –

**అస్మాత్పురాణాదపి పాదమేకం పఠేత్తు యస్సోఽపి విముక్తపాపః ।**
**నారాయణాఖ్యం పదమేతి నూనమనంగవద్దివ్యసుఖాని భుంక్తే ॥**

ఈ పురాణంలో ఒక్క పాదం చదివినా పాపనివృత్తుడై వైకుంఠం పొందగలడని, సకల దివ్యసుఖాలు అనుభవింపగలడని ఫలశ్రుతి చెబుతున్నది.

## 17. గరుడపురాణం

విష్ణువాహనమైన గరుడుడు అడిగిన ప్రశ్నలకు విష్ణుదేవుడు చెప్పిన సమాధానాలే గరుడపురాణం. ఇందులో 19,000 వేల శ్లోకాలు గల పూర్వఖండం, ఉత్తరఖండం అనే రెండు ఖండాలున్నాయి.

పూర్వఖండంలో 229, ఉత్తరఖండంలో 35 కలిపి 264 అధ్యాయాలు గల పురాణమిది. విష్ణుదేవుని "మజ్జ" గా ఇది వర్ణించబడింది.

ఈ పురాణంలోని ఉత్తరఖండంలో ప్రేతకల్పం మిక్కిలి ప్రశస్తమైనది. మరణానంతరం జీవుని స్థితిగతులను విస్తృతంగా వివరించే ఘట్టమిది. అందువల్లనే మరణించిన వానియింట పదవ దినంలోగా ఈ పురాణాన్ని పఠించే సంప్రదాయమేర్పడింది.

గరుడపురాణం కేవలం యమలోకవృత్తాంతాన్ని మాత్రమే చెబుతుందని కొందరు భావించడం కద్దు. ఈ భావన తగదు. ఇందలి పూర్వఖండంలో ఈ క్రింద నిర్దేశించబడిన నానావిషయాలున్నాయి.

భగవదవతారాలు, సరస్వత్యుపాసన, విష్ణుదీక్ష, శివార్చనావిధి, సుదర్శనచక్ర పూజావిధానం, సూర్యార్చన, దేవతాప్రతిష్ఠ, నిత్యనైమిత్తిక కామ్యకర్మల వివరణ, పాపప్రాయశ్చిత్తవిధి, నవరత్నాల పరీక్ష, వివిధములైన వ్రతాలు, ఆయుర్వేద వైద్యవిధానాలు మున్నగు అనేక విషయాలు ఈ పురాణంలో గోచరిస్తాయి. పశువుల చికిత్సా విధానం కూడా ఇందులో నిర్దిష్టమైయున్నది.

మానవజీవితానికి అత్యవసరమైన పలు నీతులు గూడా ఈ గ్రంథంలో పేర్కొనబడివున్నాయి. యజమానులు నిష్కారణంగా సేవకులను నిందించరాదన్న ఉపదేశం ఇందులో ఉన్నది. ధనం, జ్ఞానం, రూపం, మిత్రులు–వీరి స్వభావా లెలా ఉండాలో ఇందులో సూచించబడింది.

**అర్థేన కిం కృపణహస్తగతేన పుంసాం జ్ఞానేన కిం బహుశఠాకుల సంకులేన ।**
**రూపేణ కిం గుణ పరాక్రమవర్జితేన మిత్రేణ కిం వ్యసనకాలపరాఙ్ముఖేన ॥**

కృపణుని చేతి ధనం, మొండి మనిషికి గల జ్ఞానం, గుణపరాక్రమాలులేని రూపం, వ్యసనకాలంలో కనిపించని మిత్రుడు ఉండీ ప్రయోజనం లేదని భావం. కష్టకాలంలో పరిచితవ్యక్తులు సైతం ఎలా తప్పించుకొంటారో సోదాహరణంగా ఈ పురాణం వివరించింది. గృహంలో వుంటూనే ముక్తిని సాధించే విధానం గూడా చెప్పడమయింది.

గరుడ పురాణంలో ఎన్నో కథలున్నాయి. కథలకంటె ఇందలి నీతివచనాలు మనోజ్ఞాలు. ఉదాహరణకు వేలకొలది గోవులలో దూడ తన తల్లిని గుర్తించి అనుసరించినట్లు మనమెంత దూరంగా ఉన్నా మనకర్మ మనల్ని విడువక వెంటాడుతూ వుంటుందని నీతిబోధ.

హయగ్రీవ పూజావిధి, పంచమహాయజ్ఞాలు, రాజలక్షణాలు, సేవకలక్షణాలు, రోగనివారణోపాయాలు మున్నగునవి కూడా ఈ పురాణంలో చూడవచ్చు.

**'కీర్తితం పాపశమనం పఠతాం శృణ్వతాం నృణామ్'** అనగా ఈ పురాణం చదివేవారు, వినేవారు సకల పాపాల నుండి విడుదల పొందుతారని దీనికి ఫలశ్రుతి చెప్పబడింది.

## 18. బ్రహ్మాండపురాణం

బ్రహ్మదేవుని సృష్టిని వివరించే పురాణమిది. **"బ్రహ్మాండం చాస్థి గీయతే"** అన్నట్లు విష్ణువుయొక్క ఎముకలుగా ఇది పేర్కొనబడింది. ఇందులో 12,000 వేల శ్లోకాలున్నాయి. బ్రహ్మాండపురాణం పూర్వభాగం, మధ్యభాగం, ఉత్తరభాగమని మూడు భాగాలుగా వున్నది. పూర్వభాగంలో 38, మధ్యభాగంలో 74, ఉత్తరభాగంలో 44, మొత్తం కలిపి 156 అధ్యాయాల గ్రంథమిది. రోమహర్షణుడనే ముని కురుక్షేత్రంలో ఋషులకు చెప్పిన పురాణమిది.

ప్రక్రియాపాదం, అనుషఙ్గపాదం, ఉపోద్ఘాతపాదం, ఉపసంహారపాదమని నాలుగు భాగాలుగా ఈ పురాణం విభజింపబడింది. నైమిశారణ్యవర్ణన, చతుర్ముఖబ్రహ్మ వర్ణనం, వరాహావతారం మున్నగు విషయాలు ప్రక్రియాపాదంలో కనిపిస్తాయి.

తరువాతి పాదంలో చతురాశ్రమ ధర్మాలు, మునుల జన్మవృత్తాంతం, దక్షుడు గావించిన శివనింద, సతీదేవి అగ్నిప్రవేశం, దక్షుడు, శంకరుడు పరస్పరం శపించుకొనడం, ప్రియవ్రతవర్ణన మున్నగు విషయాలతోపాటు సప్తద్వీపాల వర్ణన, సూర్యుని మహిమ, సూర్యుని అధీనంలో ఉండి ఇతర గ్రహాలు సంచరించడం, రాత్రింబవళ్ళు, మాసాలు, ఋతువులు, సంవత్సరాలు, యుగాలు అనబడే కాలానికి సూర్యుడే మూలకారణమని నిరూపించడం, లింగజననం, యుగధర్మాలు, మొదలగు విషయాలు ఇందులో కనిపిస్తాయి.

మూడవదైన ఉపోద్ఘాతపాదంలో సప్తర్షులజననం, నృసింహావతార వర్ణన, కుమారసంభవం, పుణ్యప్రదేశవర్ణన, శ్రాద్ధాలకు ప్రశస్తమైన నదులు, తీర్థాలు, అన్నదానం, గయలో శ్రాద్ధం, మొదలగు విషయాలు నిరూపింపబడి వున్నాయి. పరశురాముని తపస్సు, జమదగ్నిని కార్తవీర్యార్జునుడు హతమార్చడం, జమదగ్నిపునర్జననం, సగర యయాతుల చరిత్ర మున్నగు విషయాలు కనిపిస్తాయి.

చివరిపాదంలో లలితాదేవి వర్ణన, కామాక్షీ మాహాత్మ్యం, దేవీదీక్ష, మొదలైన విషయాలు ఉన్నాయి. ఈ పురాణపఠనఫలం క్రింది విధంగా పేర్కొనబడింది.

**య ఇదం కీర్తయేద్వత్స! శృణోతి చ సమాహితః ।**
**స విధూయేహ పాపాని యాతి లోకమనామయమ్ ॥**

బ్రహ్మాండపురాణం పఠించేవాడు, ఏకాగ్రతతో వినేవాడు పాపరహితుడై సర్వోత్తమలోకాలను చేరుకుంటాడు అని భావం.

**సముద్రాలక్ష్మణయ్య**
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.